రామాయణం

# రామ కథాసుధ – 1,2 భాగాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ద
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

**TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)**

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఋజువర్తనులు, జవసంపన్నులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ప్రథమ భాగము

# రామకథాసుధ

(బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ)



రచన : భావరాజు వరలక్ష్మి

# రామ కథాసుధ

(బాలకాండ, అయోధ్య కాండ, అరణ్యకాండ)

రచయిత్రి : శ్రీమతి భావరాజు వరలక్ష్మి



శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే
అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేక దంతం బక్తానామ్ ఏకదంత ముపాస్మహే

# రామకథాసుధ

భూసరాజ వరలక్ష్మి

ప్రథమ ముద్రణము :
నవంబరు 4, 2005
పార్థివ నామసంవత్సర, కార్తీక శుక్ల తదియ

ప్రతులు : 1000

మూల్యం : **300-00** (రెండు భాగములు కలిపి)

సర్వహక్కులు రచయిత్రివి

చిరునామా :
C/o. బి. మురళి
సెక్షన్ ఆఫీసర్
మినిస్ట్రీ ఆఫ్ పవర్
శ్రమశక్తి భవన్, రఫీక్‌మార్గ్
న్యూ ఢిల్లీ - 110 001

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ / ప్రతులకు :
గొల్లపూడి వీరాస్వామి సన్
కోటగుమ్మం, రాజమండ్రి, ఫోన్ : 2465253

ముద్రణ :
శ్రీలక్ష్మీగణపతి బైండింగ్ వర్క్స్
కొవ్వూరు. ఫోన్ : 08813 - 231575



కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలం

తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంతో...



వినా వేంకటేశం ననాథోననాథః
సదా వేంకటేశం స్మరామిస్మరామి
హరే వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ

# అంకితం



నా జన్మకు కారకులై, సన్మార్గము నాకు తెలిపి
రామభక్తి సామ్రాజ్యము - నాకు ఇచ్చి దీవించిన
సీతమ్మ మాయమ్మ - శ్రీరాముడు నాకు తండ్రి
వారికి నా ఈ దివ్య కృతిని అంకితముగ అర్పించెద.

నా తల్లిదండ్రులైన
**కీ॥శే॥ కేశాప్రగడ శ్రీరామమూర్తి**
**కీ॥శే॥ కేశాప్రగడ సీతామహాలక్ష్మి** దంపతులకు.
సద్గతులు కలగాలని ఆ సీతారాములను ప్రార్థిస్తు నా కృతిని
వారికి అంకితమిస్తున్నాను.

ఇట్లు
**భావరాజు వరలక్ష్మి**

"రామకథాసుధ" అనే ఈ అనువాద గ్రంథము
శ్రీ వాల్మీకి మహర్షి రచించిన శ్రీ మద్రామాయణమును
యధాతథముగా తెలుగులోకి వ్రాశాను.
దీనిమీద ఎటువంటి వ్యాఖ్యలైనా వచ్చినట్లయితే
అందుకు నేనే పూర్తి బాధ్యురాలనని ఇందుమూలముగా
నేను తెలియజేస్తున్నాను

ఇట్లు
**భావరాజు వరలక్ష్మి**

# ముందుమాట

☎ 0883 - 2432906

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు
డా॥ శలాక రఘునాథ శర్మ

"శ్రీనివాసాలయము" 78-10-5/2,
ఏ-3, రవిచంద్ర అపార్ట్‌మెంట్స్, శ్యామలానగర్,
రాజమండ్రి - 533 103, ఆం.ప్ర.

సాభినవ సంభావనము — తేది: 14.9.2005.

"రాఘవేశ్వరు చరిత్రము నెంత చెప్ప గలుగు వక్త్రసహస్రాలలో ఉన్నవాడైన మహానుభావుడు" అది అక్షర సత్యం. రామకథ వ్రాయటం ఒక ఆరాధనా విశేషం. రామాయణకథనంతా గుండె అంతరంగంలో పదిలంగా పట్టుకోగలిగితే కదా దానికి అక్షరాకృతి కల్పించగలగటం! ఆ పట్టుకోవటం అందరికీ సాధ్యమయ్యే సంగతి కాదు. పూర్వజన్మసుకృతం వలనా, ఈ జన్మలో చేసిన సాధనవలనా, మహాత్ముల ఆశీస్సుల వలనా అది సాధ్యం అవుతుంది.

శ్రీమతి భావరాజు వరలక్ష్మి గారు సంస్కృతాంధ్రాలలో తగిన ప్రాభవం లేకపోయినా శ్రీరామచంద్రుని మీద భారం వేసి నాలుగు సంవత్సరాలు తపస్సు చేసి శ్రీరామకథాసుధను అందుకున్నారు. అందరికీ అందించాలనే తపనతో దానికి రూపకల్పన చేశారు. అందిస్తున్నారు. తాము ఆనందం అనుభవిస్తూ, అనుభవించమని అందరికీ ఇస్తున్నారు. వారి ఈ వ్యవసాయం కోరిన ఫలసాయాన్ని పొందాలని నేను మనసారా కోరుకుంటున్నాను.

చదువరులకు ఒక మనవి. ఇందులో భాషా వైభవం, శాస్త్ర మర్యాదలూ, ఉదాత్త కల్పనలూ చూడాలనుకోకండి. సుఖంగా సుందరంగా, సులభంగా రామాయణం అంటూ ఏమిటో తెలుసుకోవాలనే తపనతో ఈ గ్రంథాన్ని పఠించండి. ఆమె కోరేది అదే. ఈ యాంత్రిక జీవన విధానంలో వాల్మీకి రామాయణాన్ని ఓపికగా, తీరికగా అధ్యయనం చేయటం సాధ్యం కాని వారందరూ ఇది చదివి, అది చదివినంత తృప్తి పొందవచ్చు. ఆ తరువాత శక్తియుక్తులను బట్టి అందులోనికి ప్రవేశించవచ్చు. ఆవిధంగా ఈ గ్రంథం ఒక చేయూతగా నిలుస్తుంది. అన్నప్రాశనగా దీనిని భావించి ఆదరించాలని మనవి చేస్తున్నాను.

శ్రీమతి భావరాజు వరలక్ష్మిగారికి శ్రీరామచంద్రప్రభువు సీతాసమేతుడై కోరిన వరాల నివ్వుగాక!

# పాఠకులకి మనవి

ఎంతో పూర్వజన్మ సుకృతం ఉంటేగాని రామాయణం చదవాలనే కోరిక కలగదు. ఎందుకంటే రామాయణం కేవలం రామకథ మాత్రమే కాదు. ఎన్నెన్నో ధర్మాలు, శాస్త్రాలు, పురాణాలు అన్నీ రామకథలో ఉన్నాయి. ముఖ్యంగా తారక మంత్రాలూ బీజాక్షరాలు ఎన్నో వాల్మీకి రామాయణంలో నిబిడీకృతమై ఉన్నాయని ప్రతీతి. కనుక శ్రీ మద్రామాయణం ఒక్కసారైనా చదివినవారి జన్మ ధన్యము.

అసలు మన తెలుగువారి జీవితాలు రామాయణంతో ముడిపడి ఉన్నాయి. రామకథ తెలియని ఆంధ్రులుకాని, రామమందిరం లేని గ్రామముగాని తెలుగునాట లేవు అంటే అతిశయోక్తి కాదేమో!

సుభిక్షంగా ఉండే రాజ్యాన్ని 'రామరాజ్యం' అంటారు. ఈ ఒక్కమాట చాలు రాముని గొప్పతనం గురించి చెప్పటానికి.

ఇంకా... వినయ విధేయతలు కళ్గిన మరిది లక్ష్మణుడనీ, ఇంకొకరు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేని వారిని మంథర అనీ, చెప్పుడు మాటలు వినేవారిని కైక అనీ, అహంభావంతో ఉండే స్త్రీని చుప్పనాతి శూర్పణఖ అనీ, తన శక్తి తనకి తెలియని వాడిని హనుమంతుడనీ, పరమ దుర్మార్గుడైన వానిని రావణాసురుడనీ, ఇలా నిజ జీవితంలో రామాయణంలోని పాత్రలతో పోల్చి చెప్పటం మనం వింటుంటాం.

కుంభకర్ణుడిలా నిద్రపోతాడనీ, చూసి రమ్మంటే కాల్చి వచ్చాడనీ, ఊర్మిళాదేవి నిద్ర, అనీ ఎన్నెన్నో సామెతలు కూడా ఉన్నాయి.

సామాన్యంగా ప్రతి తల్లీ రాముడిలాంటి కొడుకు కావాలని కోరు కుంటుంది. ప్రతి కన్య రాముడిలాంటి భర్త రావాలని మ్రొక్కుకుంటుంది.

ఇంకో మెట్టు పైకి వెళ్తే రామభక్తిని మహా సామ్రాజ్యంగా వర్ణించారు భక్తులు.

ఇంతటి మహోన్నతమైన కావ్యాన్ని చదవగల్గడం నిజంగా మన భాగ్యమేకదండీ!

అయితే చదవడం అనేది మూడు విధాలుగా ఉంటుంది. మొదటిది పారాయణ చెయ్యటం. అంటే నియమంగా, నిష్ఠగా ప్రతిరోజూ కొంత భాగం చదువుతు, పూర్తి చెయ్యటం. ఇది విశేష ఫలప్రదం.

రెండవది మామూలుగా ఏ నియమం లేకుండా కళ్ళతో అక్షరాలు చూస్తూ చదవడం. ఇలా చదవడం వల్ల కథావస్తువు తెలుస్తుంది. కాని నిగూఢంగా ఉండే అర్థాలు మాత్రం తెలియవు. ఈ పద్ధతిలో తొమ్మిది రోజులలో పుస్తకం పూర్తి చేస్తే అనుకున్న కోరిక తీరుతుందంటారు.

మూడవ పద్ధతి అధ్యయనం చెయ్యడం. ఇది చాలా విశిష్టమైన పద్ధతి. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ, అందులో ఉండే గూఢార్థాలు గ్రహిస్తూ అందులోని భావార్థాలు మననం చేసుకుంటూ, చదవగలిగితే, ఎన్నెన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి. దీన్నే అధ్యయనం చెయ్యడం అంటారు. కనుక నేను పాఠకుల్ని కోరేదేమిటంటే రామాయణ మహాకావ్యాన్ని కేవలం చదివి ఊరుకోకండి. బాగా అధ్యయనం చెయ్యండి. అది ఒక విజ్ఞాన ఖని. దానిలోని రహస్యాలు తెలుసుకోండి. మీరు తెలుసుకున్నది పదిమందికీ చెప్పండి. మన సమాజ వికాసానికి తోడ్పండి.

ఉదాహరణకి యుద్ధకాండలో ఆంజనేయస్వామి సంజీవినీ పర్వతం తెస్తాడు. హిమాలయ పర్వత శిఖరాలనించి తెస్తాడు. భారతదేశానికి దిగువ సముద్ర మధ్యంలో లంక వుంది. అక్కడి నుంచి కొన్నివేల మైళ్ళ దూరంలో ఉత్తరాన హిమాలయ పర్వతాలున్నాయి. అంతదూరం చాలా తక్కువ వ్యవధిలో ఆకాశమార్గంలో వెళ్ళి పర్వత శిఖరం పెకిలించి తెచ్చి, వైద్యం పూర్తికాగానే మళ్ళీ అక్కడ పెట్టేసి వస్తాడు.

ఇది చదవటానికి చాలా సామాన్య విషయంలా ఉంది. నమ్మినవాళ్ళు కామోసు అనుకుంటారు. నమ్మనివాళ్ళు పరిహాసం చేస్తూ హాస్యాస్పదంగా మాట్లాడతారు.

కాని దీనిని పరిశీలించి చూస్తే ఇందులో అంతరార్థం బోధపడ్తుంది. మాములుగా మనం భూమి మీద ప్రయాణం చేస్తే గమ్యం చేరటానికి చాలా రోజులు పడుతుంది. అదే ఆకాశంలో విమానంలో వెళ్తే కొన్ని గంటలలో వెళ్తాము. ఎందుకంటే ఆకాశమార్గంలో అవరోధాలుండవు కనుక. అలాగే ఆకాశమార్గంలో మారుతి చాలా తక్కువ సమయంలో హిమాలయాలకు చేరుకున్నాడు.

సంజీవిని పర్వతం అంటే విధాత మనకి ప్రసాదించిన "మెడికల్ కిట్" అన్నమాట. ఆ పర్వత శిఖరంలో పరమాద్భుతమైన ఔషధాలెన్నెన్నో ఉన్నాయి. కనుక దానిని పట్టుకుని యుద్ధభూమికి వచ్చాడు.

అయితే ఆ సంజీవినీ పర్వతం హిమాలయాల్లో ఎందుకుంది? అంటే సామాన్యంగా మనం మందులు పాడవకుండా వుండాలంటే ఫ్రిజ్‌లో నిలవచేస్తాము కదా. అలాగే సంజీవిని అనె "మెడికల్ కిట్టుని", హిమాలయాలు అనే ఫ్రిజ్‌లో పదిలపరిచాడు సృష్టికర్త.

యుద్ధభూమిలో వైద్యం పూర్తికాగానే మళ్ళీ జాగ్రత్తగా ఆ శిఖరం పట్టికెళ్ళి హిమాలయాల్లో పెట్టివచ్చాడు హనుమ. అంతేకాని ఏ సముద్రంలోనో పారెయ్యలేదు.

ఎందుకంటే ఆయన బుద్ధిమంతులలో వరిష్ఠుడు, జ్ఞానులలో అగ్రగణ్యుడు కనుక.

భావితరాలవారికి పనికి వస్తాయని, ఎక్కడ్నించి తీశాడో జాగ్రత్తగా అక్కడే ఉంచాడు.

అంతటి బలం, శక్తి, ఆయనకి ఎలా వచ్చాయో వాల్మీకి చాలా చక్కగా వివరించి చెప్పాడు. అంతేకాదు ఆ మందుల పర్వతం హిమాలయాల్లో ఎక్కడవుందో కూడా ఆయన వివరంగా వ్రాశాడు.

పరిశోధించి తెలుసుకోగల్గినవారుంటే, అంతటి దివ్యమైన ఔషధాలు మన భారతదేశంలో ఉన్నాయని తెలుస్తుంది. ఆయుర్వేదశాస్త్రం అధ్యయనం చేస్తే ఆ ఔషధాలెలావాడాలో చక్కగా తెలుస్తుంది.

ఇదంతా మన పూర్వులు మనకిచ్చిన అపారమైన విజ్ఞాన సంపద. అసలు రామాయణమంటేనె విజ్ఞానానికి గని. ఆ రహస్యాలన్నీ ఛేదించి, ఆ విజ్ఞానం బయటకి తియ్యగలిగితే యావత్ ప్రపంచం మన భారతావనికి పాదాభివందనం చేస్తుంది.

నా ఈ "రామకథాసుధ" వాల్మీకి రామాయణానికి యధార్ధరూపకల్పన. ఇందులో అసత్యంకాని, కల్పితం కాని ఇసుమంతైనా లేదు.

ఇట్లు

**భావరాజు వరలక్ష్మి**



# తొలిపలుకు

శ్రీ మద్రామాయణ మహాకావ్యము, ఆదికవి వాల్మీకి రచించిన మొట్టమొదటి కావ్యము. అంతకుముందు సంస్కృత వాఙ్మయంలో అసలు ఏ గ్రంథమూ, ఏ కావ్యమూ రచించబడలేదు అని చెప్పేటందుకు చారిత్రక ఆధారాలెన్నో వున్నాయి. శోకార్తుడైన వాల్మీకి అంతరంగము నుండి శ్లోకంగా వెలువడిన పదసముదాయముతో, ఆయన కావ్యరచనకి శ్రీకారం చుట్టాడు.

సాక్షాత్తూ సృష్టికర్తయైన బ్రహ్మ, తానేస్వయంగా వచ్చి, రామాయణ మహాకావ్యాన్ని రచింపవలసిందిగా వాల్మీకిని కోరాడు. అంతేకాదు. రామచంద్రుని కథ జరిగినది జరిగినట్లుగా, వాల్మీకి మనోనేత్రానికి కనిపించేటట్లు బ్రహ్మ ఆయనకి వరం ఇచ్చాడు.

ఆయన ఎలా చూడగలిగాడు? ఇది వట్టి అభూత కల్పన అని చాలామంది నమ్మకపోవచ్చు. కాని ఈనాడు మానవుడు తన మేధస్సునుపయోగించి, విజ్ఞాన శాస్త్రం ఆధారంగా ఎన్నెన్నో అద్భుతాలు సాధిస్తున్నట్లే ఆనాడు ప్రాచీనకాలంలో, మన భారతదేశంలో, యోగాభ్యాసము, తపస్సు అనే రెండు సాధనాలతో ఇంతకంటే పరమాద్భుతమైన విషయాలెన్నో సాధించగలిగాడు. మనం ఇంట్లో కూర్చుని, టెలివిజన్లో ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏం జరిగినా ప్రత్యక్షంగా చూడగల్గుతున్నట్లే ఆనాడు తపశ్శక్తితో ప్రపంచంలో జరిగే విషయాలన్నీ దివ్యదృష్టి వల్ల, మనో నేత్రంతో చూడగల్గిన శక్తి సంపన్నులుండేవారు.

ఈనాడు విమానంలో ఆకాశప్రయాణం చేస్తున్నాం. అవయవాల మార్పిడిలాంటి అద్భుతమైన శస్త్రచికిత్సలతో మానవుడికి ప్రాణం కూడా పొయ్యగల్గుతున్నారు. టెస్టుట్యూబుల్లో బేబీలని పుట్టిస్తున్నారు. అణుబాంబుల్లాంటి ఆయుధాలు సృష్టిస్తున్నారు. ఇంకా ఇంకా మన ఊహకందని విషయాలెన్నో పరమాద్భుతంగా సాధిస్తున్నారు. అయితే, ఇవన్నీ కూడా త్రేతాయుగంలోనే మనవాళ్ళు కేవలం తపశ్శక్తితో సాధించారని రామాయణం నిరూపిస్తోంది.

నాడైనా, నేడైనా, కృషి వుంటే మానవుడు సాధించలేనిది లేదు. అన్న విషయం వాల్మీకి రామాయణంలో స్పష్టంగా గోచరిస్తోంది.

రామాయణ మహాకావ్యాన్ని వాల్మీకి కళ్ళతో చూసివున్నది వున్నదున్నట్లుగా పూసగుచ్చినట్లు వివరంగా వ్రాశాడు. ఇందులో అతిశయోక్తిగాని, కల్పనగాని, అబద్ధంకాని అస్సలు లేదు.

బ్రహ్మ వాల్మీకిని రామాయణం వ్రాయమని అడిగేసరికి, రాముడు పుట్టడం, పెరిగి పెద్దవాడవటం పెళ్ళి చేసుకోవటం, పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేసి మళ్ళీ సీతమ్మతో కలసి అయోధ్యకి తిరిగి వచ్చి పట్టాభిషిక్తుడు కావటం అన్నీ జరిగిపోయాయి. రాముడు రాజ్యపాలన చేస్తున్న తరుణంలో వాల్మీకి, రామాయణం వ్రాయటం మొదలుపెట్టాడు.

అంతవరకు జరిగిన కథ, జరగబోయే కథ, అంతా వాల్మీకి దివ్యదృష్టికి, బ్రహ్మగారు టెలికాస్టు చేసి చూపించారన్నమాట. ఇది అక్షరసత్యం. అయితే ఇక్కడ మనం గమనించవలసిన అపూర్వమైన విషయం ఒకటి వుంది. శ్రీరాముడు దశరధ నందనుడుగా అవతరించే నేపధ్యంలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే శ్రీరామునిగా అవతరిస్తున్నట్లు, ఆయనకి సహాయం చెయ్యటానికి దేవతలంతా తమ తమ అంశలతో వానరులని సృష్టించి, వారికి అద్భుతమైన శక్తులనెన్నిటినో ఇచ్చినట్లు మాత్రం చెప్పబడింది. వాల్మీకి రామాయణంలో ఆ తర్వాత ఎక్కడా, ఏ సందర్భంలోనూ శ్రీరామునిలో దైవత్వం కనిపించదు. వాల్మీకి మహాముని ఆద్యంతం రాముణ్ణి ఒక సామాన్యమైన మానవుడిగానే చూపించాడు. ఆ తర్వాత కాలంలో చాలామంది చాలారకాలుగా రామాయణాన్ని వ్రాశారు. ఎన్నెన్నో అభూతకల్పనలు చూపించారు.

అయితే రామచరిత్రకి ప్రామాణికమైన గ్రంథం, శ్రీమద్రామాయణంగా వాల్మీకి రచించిన మహాకావ్యం మాత్రమే. వాల్మీకి, రామాయణాన్ని పరమాద్భుతంగా రచించాడు. అది చదువుతున్నపుడు మనకి సస్పెన్సు, థ్రిల్లింగు కలిగిన ఒక గొప్ప సినిమా చూస్తున్న అనుభూతి కల్గుతుంది. ఒళ్ళు గగుర్పొడిచే భయంకర సన్నివేశాలు, కన్నీరు కార్పించె కరుణామయదృశ్యాలు ఎన్నో రామాయణంలో వున్నాయి.

శ్రీమద్రామయణంలో వాల్మీకి ప్రస్తావించని శాస్త్రాలేమీ లేవు. హిమాలయాల దగ్గర్నుంచి, రామేశ్వరం సేతుమాధవతీర్థం వరకు వున్న భారతదేశపు నైసర్గికస్వరూపాన్ని కళ్ళకి కట్టినట్టు వ్రాశాడు వాల్మీకి.

త్రేతాయుగంలో ఆయన చూపించిన భౌగోళిక స్వరూపం స్వల్పమైన మార్పులతో ఈనాటికీ అలాగే వుంది. వాలి ప్రపంచయాత్ర చేసినపుడు, సుగ్రీవుడు వానరుల్ని సీతాన్వేషణకై ప్రపంచం నాల్గు దిక్కులకి పంపినపుడు ఎక్కడెక్కడ ఏ ఏ ప్రదేశాలున్నాయో వర్ణించి చెప్పినపుడు, మొత్తం ప్రపంచ పటం మన కళ్ళముందుంచాడాయన. కాస్త ఆసక్తిగా పరిశీలించి, పరిశోధించగల్గిన వాళ్ళుంటే, వాల్మీకి తెలియజేసిన వాటిలో కీలకమైన రహస్యాలెన్నో తెలుసుకోవచ్చు.

అలాగే రాముడు పర్ణశాల నిర్మింపచేసినపుడు వాస్తుశాస్త్రము, సముద్రం మీద వారధి నిర్మింపచేసినపుడు నలుడు, నీలుడు కనపరచిన ఇంజినీరింగు టెక్నాలజీ, యుద్ధరంగంలో వైద్యశాస్త్రము, యుద్ధానికి తగిన వ్యూహరచన, రావణుడి బలమెంతో, రాముని బలగమెంతో లెక్కగట్టి మరీ వివరించిన నేర్పు, అస్త్ర-శస్త్రపరిజ్ఞానము, మనం కనీవినీ ఎరుగని ఎన్నెన్నో వృక్షజాతులు, పక్షిజాతులు, తపశ్శక్తితో మనవారు సాధించిన అపూర్వమైన పరమాద్భుతాలు, ఎన్నో ఎన్నెన్నో చాలా ఆసక్తికరంగా కావ్యంలో రచించాడాయన. శ్రీలంక దాని నైసర్గిక స్వరూపం. రావణుని వైభవం, ఈ విషయాలన్నీ కూడా చదవటానికి చాలా అద్భుతంగా వుంటాయి. కాని వాల్మీకి రామాయణంలో లేని ఎన్నెన్నో అభూతకల్పనలు తర్వాతి కాలంలో సృష్టించబడి, మనమీద చెరగని ముద్రవేశాయి.

ఉదాహరణకి అహల్యని గౌతముడు రాయిగా మారిపొమ్మని శపించలేదు. ఆమె చేసిన అకృత్యానికి అది సరియైన శిక్షకాదు. అహల్య మహాపతివ్రత. తనని కామించి వచ్చినవాడు దేవేంద్రుడని ఆమె కనిపెట్టింది. ఆమె తల్చుకుంటె ఆ క్షణంలో ఆతడ్ని బూడిదగా చెయ్యగల శక్తి ఆమెకుంది. కాని సురరాజంతటివాడు తనపై మోజుపడ్డాడను గర్వంతో ఆమె తప్పటడుగు వేసింది. పైగా భర్త తిరిగిరాకుండా వెళ్ళిపొమ్మని హెచ్చరించింది.

అందుకుగాను గౌతముడు ఆవిడకి విధించిన శిక్ష చాలా భయంకరమైనది. అదృశ్యరూపంలో ఎవ్వరికీ కనపడకుండా పాడుపెట్టబడ్డ ఆ ఆశ్రమంలో, వేల సంవత్సరాలు మట్టిలో పడి వుండి, శ్రీరాముడు పవిత్రచరణాలతో ఆ ఆశ్రమంలో ఎపుడు అడుగుపెట్టాడో అపుడా మహనీయుని చరణధూళి సోకిపునీతురాలై తన నిజరూపం పొందమని శపించాడు. అన్ని వేల సంవత్సరాలూ ఆమె చేతనురాలై వుండి

శాపవిమోచనకై ఎదురుచూస్తూ పడివుండి దుర్భరమైన జీవితం గడిపింది. అంతేగాని శిలగా మారి జడత్వం పొంది, రాముని పాదం సోకగానే మళ్ళీ స్త్రీగా మారలేదు. అలా జరిగితే ఆవిడ అనుభవించిన శిక్ష ఏం వుంది కనక!

ఇలాంటి అనేకానేక కల్పనలు రామాయణంలో చోటుచేసుకున్నాయి.

శబరి రామునికి ఎంగిలి పండ్లు పెట్టలేదు. అసలు సీతా స్వయంవరానికి రాముడు వెళ్ళలేదు. ఇలా చాలా చాలా సంగతులున్నాయి.

అయితే నాప్రయత్నమేమిటంటే రాముని చరిత్ర ఉన్నది ఉన్నట్లుగా వ్రాసి ప్రతికాండ చివరా ఆ కథాభాగంలో జరిగిన విషయాలు కాక, కల్పనలు ఏమిటి, అనేది అందరికీ తెలిసేలా చెప్పాలని నా తాపత్రయం. ఎంతమందో మహానుభావులు వాల్మీకి రామాయణాన్ని తెలుగులో అనువదించారు. యథాతథంగా మన కందించారు. కాని ఈనాటి 'స్పీడు' ప్రపంచంలో అంతటి మహాకావ్యాలు చదివే తీరిక చాలామందికి వుండదు.

కనుక అసలు కథమాత్రం తీసుకుని, వర్ణనలు, చర్చలు పక్కకి పెట్టి అందరకీ అర్థమయ్యేలా తేలికైన పదాలతో ఉన్నది ఉన్నట్లుగా శ్రీమద్రామాయణాన్ని, నాదైన నా సొంతశైలిలో 'రామకథాసుధగా' మీముందుంచుతున్నాను. సహృదయతతో చదివి, అర్థం చేసు కోవలసిందిగా కోరుతున్నాను.

పండితులైనవారు నా ఈ సాహసాన్ని మన్నించి, తప్పులుంటే తెలియజెయ్య వలసిందిగా ప్రార్థిస్తున్నాను.

నా తల్లిదండ్రులైన కేసాప్రగడ సీతామహలక్ష్మి, శ్రీరామమూర్తి గారల పాదపద్మములకి భక్తితో ప్రణమిల్లి వారికి మోక్షము కలిగించవలసిందిగా సీతారాముల నర్థిస్తు నా కృతిని వారి కంకితమిస్తున్నాను.

మంగళం మహత్

ఇట్లు

**భావరాజు వరలక్ష్మి**

# కృతజ్ఞతలు

అసలు "నా రామకథాసుధ' అనే కావ్యరచన ఒక మహా యజ్ఞంలా సాగింది. నా భర్తగారి గురువుగారైన శ్రీ ప్రణవానంద భారతీకుమార్ స్వాముల వారు(తణుకు) తులసీదాసు రచించిన 'రామచరిత మానస్' గ్రంథాన్ని తేటగీతి పద్యాలతో తెలుగులోకి అనువదించారు.

ఆ గ్రంథం తాలూకు ప్రతి ఒకటి మాకు కానుకగా ఇచ్చారు. అది నేను చదివాను. అది చదివాక ఎందుకో వాల్మీకి రామాయణం చదవాలనిపించింది. తెలుగు టీకా తాత్పర్యాలతో వుండె వాల్మీకి రామాయణం కోసం ప్రయత్నించాను. మేము వుండేది ఢిల్లీలో అక్కడ తెలుగు పుస్తకాలు దొరకాలంటే అంత సులభం కాదు. ఎంత ప్రయత్నించినా నాకు అది దొరకలేదు.

అప్పుడు మా బంధువు ఒకాయన ఇంగ్లీషు కామెంటరీతో వున్న గోరక్‌పూర్‌వారి శ్రీ మద్రామాయణం వాల్మీకి కావ్యం తెచ్చి ఇచ్చాడు. అది చదివాను. ఇంగ్లీషు భాష నాకంతగా రాదు. కనుక చదివి అర్థం చేసుకోగల్గినా, చదివానన్న సంతృప్తి కలగలేదు. కొంతకాలం గడిచింది.

తర్వాత ఢిల్లీలో బుక్‌ఫేర్ జరిగినప్పుడు గోరక్‌పూర్ వారి హిందీ కామెంటరీతో వున్న వాల్మీకి రామాయణం కొనుక్కుని చదివాను. హిందీ కాస్త బాగా అర్థం చేసుకోగలను కనుక చాలామటుకి అర్థం అయింది.

ఆ తర్వాత రామచరిత మానస్, ఆధ్యాత్మ రామాయణం హిందీ కామెంటరీతో వున్నవి కొనుక్కుని చదివాను. అయితే ఒక గ్రంథానికీ మరో గ్రంథానికీ కొన్ని మార్పులు చేర్పులు కనిపించాయి. అసలు శ్రీమద్రామాయణాన్ని ఆదికావ్యంగా రచించినవాడు వాల్మీకే. అంతకుముందెవరూ రామాయణం వ్రాయలేదు. కనుక అదే యధార్థమైన కథ. తర్వాతికాలంలో రచించబడ్డ రామాయణాలన్నింటికీ ఆధారం ఆయన కావ్యమే.

కాని విచిత్రమైన సంగతి ఏమిటంటే అసలు రామాయణంలో లేని కల్పనలు ఎన్నెన్నో తర్వాత రచనలలో చోటు చేసుకున్నాయి.

ఆ సంగతి గుర్తించాక, వాల్మీకి రామాయణం తేట తెలుగులో అందరికీ అర్థమయ్యేలా వ్రాయాలనే సంకల్పం కల్గింది.

ఈవిధంగా రామాయణ రచనకి నన్ను ప్రేరేపించిన శ్రీశ్రీ ప్రణవానంద భారతీకుమార్ స్వాములవారి పాదపద్మాలకి తొలుతగా నా కృతజ్ఞతాభివందనాలు సమర్పించుకుంటున్నాను.

ఎప్పుడైతే నాకు రామాయణం వ్రాయాలనే సంకల్పం కల్గిందో వెంటనే అనుకోకుండా రెండుసార్లు కాశీ, ఒకసారి రామేశ్వరం వెళ్ళే అదృష్టం కల్గింది. కాశీ గంగ తీసుకుని రామేశ్వరంలో శ్రీరామలింగేశ్వరునికి అభిషేకించి, సేతుమాధవ తీర్థంలోని ఇసుక (రామేశ్వరం) పట్టికెళ్ళి కాశీ గంగలో కలపటం జరిగింది. కుంభమేలా సందర్భంగా ప్రయాగలోని త్రివేణీ సంగమంలో స్నానం చేసే మహాద్భాగ్యం కూడా కలిగింది.

ఇదంతా ఈశ్వరానుగ్రహంగా తలిచాను. రామాయణ మహాకావ్యం వ్రాయటానికి ఆశ్రీరామచంద్రుడు ఈవిధంగా నాకు తగిన అర్హత కల్పించాడనుకున్నాను. అప్పుడింక రామాయణం అనువాద కావ్యాల కోసం అన్వేషణ ప్రారంభించాను.

శ్రీ శ్రీనివాస శిరోమణిగారు వాల్మీకి రామాయణం యథాతథంగా అనువదించారని తెలిసింది. ఆ ప్రతుల కోసం ఆంధ్రదేశంలో ప్రయత్నిస్తే కొన్ని కాండలు మాత్రం దొరికాయి. శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారి అనువాద కావ్యం దొరికింది. అంతలో ఒకసారి విశాఖపట్నం వెళ్ళటం తటస్థించింది. మా అక్కగారబ్బాయి, ఇరగవరపు గణేష్ నన్ను శ్రీ భాష్యం అప్పలాచార్యులవారి దగ్గరకు తీసికెళ్ళి ఆయన రచించిన రామాయణ తత్వదీపిక మొత్తం ఆరు కాండలూ కొనిచ్చాడు. ఆయన నా ప్రయత్నం గురించి విని చాలా సంతోషించారు. నేను తప్పకుండా రామాయణం వ్రాస్తాననీ అది అచ్చవుతుందనీ అచ్చయ్యాక తనకి చూపించమనీ ఆశీర్వదించారు.

ఇదంతా ఆరు సంవత్సరాల క్రిందటి మాట.

అప్పుడు నేను మళ్ళీ ఢిల్లీ వెళ్ళాక, ఆ మహానుభావుల అనువాద కావ్యాలు క్షుణ్ణంగా చదివి, వాల్మీకి రామాయణం సంస్కృతంలో వున్నది దగ్గర పెట్టుకుని, రామకథాసుధ వ్రాయటం మొదలుపెట్టాను. మొత్తం రామాయణం వ్రాయటానికి నాకు సరిగ్గా మూడు సంవత్సరాలు పట్టింది. మొత్తానికి నేను అనుకున్నది సాధించగలిగాను. ఈ కావ్యంలో వాల్మీకి రామాయణం ఉన్నది ఉన్నట్లు వ్రాశాను. ఇది నిజం.

రామకథాసుధ రచన పూర్తయ్యాక గోదావరీ పుష్కరాలకి రాజమండ్రి వచ్చినపుడు అది ప్రచురణ నిమిత్తం శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి గార్ని అడిగాను. ఆయన లక్ష రూపాయలవుతుందన్నారు.

అంతటి ఆర్థికస్తోమత లేదు కనుక అది అలాగే కట్టకట్టి ఉంచేశాను. మూడు సంవత్సరాల తర్వాత శ్రీ తిరుమల తిరుపతివారి అనుగ్రహంతో అది అచ్చవుతోంది. నా ప్రయత్నం సఫలమైంది. కాని నా కావ్యాన్ని శ్రీశ్రీ భాష్యం అప్పలాచారిగారికి చూపించే అదృష్టానికి మాత్రం నేను నోచుకోలేదు. ఎందుకంటే ఆయన శ్రీరామ సాన్నిధ్యానికి చేరుకున్నారు. అది తీరని వెలితిగా వుంది. ఈ సందర్భంగా నాకు గురుతుల్యులైన శ్రీశ్రీ భాష్యం అప్పలాచార్యుల వారికి, శ్రీ శ్రీనివాస శిరోమణిగారికి, శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారికి నా కృతజ్ఞతాభివందనాలు సమర్పిస్తున్నాను.

అలాగే నాకు కావసలిన పుస్తకములు సమకూర్చి నా కావ్య రచనకి సహాయ సహకారాలందించిన నా బంధువులు శ్రీ పాద ప్రకాష్, నేదునూరి జగన్నాథరావు సుందరి దంపతులు, ఇరగవరపు గణేష్, వీరందరికీ నా కృతజ్ఞతలు సమర్పిస్తున్నాను.

నాకు ఏ పుస్తకం కావాలన్నా, అది ఎంత ఖరీదైనాసరే కొని ఇచ్చి నా కావ్య రచనకి తన సంపూర్ణ సహాయ సహకారాలందించిన, నా భర్త శ్రీ భావరాజు శ్రీనివాసరావుగారికి, నా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనలు సమర్పిస్తున్నాను.

ఇంతకీ మూలకారణం ఆ శ్రీనివాసుని అండదండలు కలలో కూడా ఊహించనిరీతిగా ఆర్థిక సహాయాన్ని అందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు సమర్పిస్తున్నాను.

నా కృతిని ప్రచురింపజేసే బాధ్యతని పూర్తిగా తన భుజస్కందాలమీద వేసుకుని ఎంతో శ్రమకోర్చి ఇంత సర్వాంగ సుందరంగా ప్రచురింపజేసిన నా తమ్ముడు చిరంజీవి కేసాప్రగడ రామకృష్ణప్రసాదుకి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఆ సీతారాములు వాని కుటుంబానికీ, ఆ దంపతులకి ఆయురారోగ్య ఐశ్వర్యాలిచ్చి కాపాడెదరుగాక.

ఇంకా ఎందరెందరో చేయూతనిచ్చినవారున్నారు. అందరి సమిష్టి కృషి ఫలితం ఈ మహాకావ్యం.

ముఖ్యంగా తి.తి. దేవస్థానంవారు నాకు సహాయం చేస్తారని ప్రోత్సహించిన నా చెల్లెలు చి॥ సత్తిరాజు నరసమాంబ (ఆ.ప్ర. సెక్రటేరియట్) దంపతులకి ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని ఆశీర్వదిస్తు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

నాకు చేయూత నిచ్చ నడిపించిన వారందరికీ నా కృతజ్ఞతలు. వారందరికీ ఆ సీతారాములు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించెదరుగాక.

అయితే ఈ సందర్భందా నాచిరకాల వాంఛ తీరటానికి తమ సహాయ సహకారాలందించిన విశిష్ట వ్యక్తులు కొందరున్నారు. నా చిన్న కుమారుడు చి॥ సూర్యనారాయణ, మా పెద్దల్లుడు చి॥ కామశాస్త్రి నన్ను తి.తి. దేవస్థానంవారి ప్రింటింగ్ ప్రెస్ ఎడిటర్ గారి దగ్గరకి తీసికెళ్ళి, తిరుమల తిరుపతివారి ఆర్థిక సహాయం పొందాలంటే ఎలా అప్లై చెయ్యాలో వివరంగా తెలుసుకుని, నాకు ఆర్థిక సహాయం లభించటానికి పరోక్షంగా సహాయం చేశారు.

ఆ తర్వాత కొంత సొమ్ము దేవస్థానం వారు సహాయం చెయ్యగా, మిగిలిన ఆర్థిక సహాయం అందించి, నాకు తమ పెద్ద చెయ్యి అందించి సహాయపడ్డారు శ్రీ గొల్లపూడివారు.

నా కావ్యాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించి, నా బంగారు కలలకి రూపకల్పన చేశారు శ్రీ లక్ష్మీగణపతి ప్రింటింగ్ ప్రెస్, కొవ్వూరువారు.

అడగ్గానే కాదనకుండా తన అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, నా కృతిని పరిశీలించి ముందుమాట వ్రాసి ఇచ్చారు సాక్షాత్తు సరస్వతీ స్వరూపులైన శ్రీ శలాక రఘునాథ శర్మగారు. వారందరికీ వారి కుటుంబాలకీ ఆ శ్రీనివాసుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించుగాక. సర్వదా వారికి శ్రీ సీతారామ కటాక్ష ప్రాప్తి కలుగుగాక.

నా రచనకి ఆర్థిక సహాయాన్నందించిన మరికొందరు నన్నెంతో అభిమానించి ప్రోత్సహించి రామకథాసుధ సజీవ వచన కావ్యాన్ని వెలుగులోకి తెచ్చిన వ్యక్తులు. కీ॥శే॥ ఇరగవరపు నరసమాంబ, ధుమంతరావు లక్ష్మీదేవి, పాలగుమ్మి కామశాస్త్రి, పద్మ, కేశాప్రగడ ప్రసాదు, లలిత, నత్తిరాజు సత్యనారాయణ, నరసమాంబ, నేదునూరి గణేష్, సూర్యకుమారి, శ్రీమతి చాగంటి అనూరాధ ప్రకాశరావు, కేశాప్రగడ లక్ష్మీమానస వీరందరికీ వీరి కుటుంబాలకి, సకలాయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆ సీతారాముల్ని మనసారా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

**భావరాజు వరలక్ష్మి**

# మంగళా శాసనము



తల్లిని మించిన దైవము లేదంటారు. కాని అటువంటి తల్లినే మరపింప చెయ్యగల మాతృమూర్తి మా అత్తగారు.

కీ॥శే॥ గం.భ.న. **భావరాజు గంగా భవాని**గారు
ఆవిడ ఆత్మకి శాంతి కలగాలనీ, ఆవిడ పుణ్యలోకాలు చేరాలనీ ఆకాంక్షిస్తూ అవి ప్రసాదించవలసినదిగా ఆ సీతారాములను ప్రార్థిస్తు రామకథాసుధ కావ్యానికీ శ్రీ సీతారాములకు, మంగళ నీరాజనాలు సమర్పిస్తున్నాను.

మంగళం కోసలౌన్ద్రాయమహనీయగుణాత్మనే
చక్రవర్తి తనూజాయసార్వభౌమాయ మంగళం
స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతం న్యాయేనమా
ర్గేణ మహీం మహీశాః గోబ్రాహ్మణేభ్యః శుభ
మస్తు నిత్యం లోకాస్సమస్తా సుఖినోభవంతు

శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం

# ప్రార్థనా శ్లోకములు

1. శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయమ్
సీతపతి రఘుకులాన్వయరత్నదీపమ్
ఆజానుబాహుమరవిన్దదళాయతాక్షమ్
రామం నిశాచర వినాశకరం నమామి

2. వైదేహీసహితం సురద్రుమతలేహైమేమహామణ్డపే
మద్ధ్యేపుష్పకమాసనే, మణిమయే, వీరాసనే సుస్థితమ్
అగ్రేవాచయతి, ప్రభంజనసుతే, తత్త్వం మునిభ్యః పరమ్
వ్యాఖ్యాంతం, భరతాదిభిః పరివృతం రామంభజేశ్యామలమ్

3. ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్

4. కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్యకవితాశాఖాం వన్దే వాల్మీకి కోకిలమ్

5. వాల్మీకేర్మ్ముని సింహస్య కవితావనచారిణః
శ్రుణ్వన్ రామకథానాదం కోనయాతి పరాంగతిమ్

6. యఃపిబన్ సతతం రామచరితామృత సాగరమ్
అతృప్తస్తం మునింవందే. ప్రాచేతషమకల్మాషమ్.

7. చరితం రఘునాధస్య శతకోటిప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపతకనాశనమ్
రామాయరామభద్రాయ రామచంద్రాయవేధసే.
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః

8. వాల్మీకి గిరిసంభూతా రామసాగరగామినీ
పునాతిభువనం పుణ్యా రామాయణ మహానదీ.

9. వేదవేద్యేపరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షాద్రామాయణాత్మనా.

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం

శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం

శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం శ్రీరాం జయరాం జయజయరాం

# గురు ప్రార్థన



1. జగత్కర్తలౌ హరిహరబ్రహ్మలు,
గురుదేవుమూర్తిగా, అవతరించిరి ఇలను
వారి పద పద్మముల భక్తితో ప్రణమిల్లి
రామచరితను నేడు రచియింప కోరెదను

2. ఆదికవి వాల్మీకి కోకిలారవముతో,
రామరామయంచు తియ్యగా పలుకుతు
పదము పదమునందు అమృతము చిందించి,
రామకథ రమ్యముగ రచియించినాడు.

3. అమృత వాహినియైన ఆ కావ్యగానమును,
తనివి తీరాత్రాగి తరియించుదాము
ఆదికవి పాదాల భక్తితో ప్రణమిల్లి,
రామచరితామృతము సేవించుదాము

4. మునుపెందరో మహనీయులు
మధురమధురమౌ భావములు చిందించి
రామచరితామృతము తెనిగించినారు
శ్రీరాము సేవించి తరయించినారు.

5. అట్టి మహనీయుల అడుగుజాడలలోన,
పయనించి రామకథ పఠియించినాను.
అవ్వారి దీవెనల ఫలితమ్ముగా నేడు,
రామకథ రచియింప తలపు చిగురించె

6. వ్యాకరణ శాస్త్రము - పఠియించలేదు.
ఛందస్సు - నియమములు తెలియగరావు.
ఇంతటి సాహసము తలపెట్టినాను
రామభద్రుని కరుణయాచించినాను

7. గౌరీ తనయుడౌ గణనాథుడీనాడు,
నిర్విఘ్నముగ కృతిని పూర్తి చేయంగ,
శక్తినిచ్చి నన్ను దీవించుగాక,
నా తోడు నీడయై నడిపించుగాక.

8. ప్రాచేతసుడు అయిన వాల్మీకిని నుతించి
రామకథ సుధలోని మర్మములు తెలియంగ,
ఆ మౌని పాదములు సేవించినాను,
నా కలము నడిపింప ప్రార్థించినాను.

9. గీర్వాణి శర్వాణి వనజభవునిరాణి,
శ్రీశారదాదేవి నన్ను కరుణించి,
నారచన సాగించు శక్తిని నాకిచ్చి,
నాకండగా నిలిచి నడిపించుగాక

10. లోకముల పాలించు ముగ్గురుమూర్తులూ,
దేవేరులను గూడి దివ్యశక్తులనిచ్చి,
నాకృతిని నడిపించి, నా కలలు పండించి,
నా జన్మతరియింప, దీవించెదరు గాక.

11. శ్రీసాయినాథడే, నను బ్రోచుదైవమై,
నాయీప్సితము దీర్చి, నన్నుదీవించగా,
శ్రీచక్రనిలయమై వెలుగొందునాతల్లి,
శ్రీలలిత శివజ్యోతిగా దారిచూపేను.



# రామకథాసుధ

# బాలకాండ



**తపస్స్వాధ్యాయనిరతం - తపస్వీవాగ్విదాంవరమ్**
**నారదం పరిపప్రచ్ఛ - వాల్మీకి ర్మునిపుంగవమ్.**

ఒకానొకనాడు వాల్మీకి మహాముని, నిరంతర వేదాధ్యయన, తపస్సంపన్నుడైన నారద మహామునీంద్రుని ఇలా అడిగాడు.

"మహాత్మా, సకలసద్గుణ సంపన్నుడూ, పరాక్రమవంతుడూ, ధర్మజ్ఞుడూ, సత్యవ్రతుడూ, దీక్షాసంపన్నుడూ, వంశపారంపర్యంగా వస్తున్న సదాచార సంపద గలవాడూ, సమస్త భూతములకు హితుడైనవాడూ, సకలశాస్త్రకోవిదుడు, సర్వకార్యధురంధరుడూ, అన్నికాలములందు ప్రియదర్శనుడూ, ధైర్యసాహసములు గలవాడూ, తేజోమయుడూ, క్రోధమును జయించినవాడూ, అసూయ అంటె ఏమిటో ఎరుగనివాడూ, ఎవని కోపమును చూచి యుద్ధములో దేవతలు గూడ భయభీతులగుదురో అటువంటి మానవోత్తముడు, ఇటువంటి పదహారు సద్గుణములతో ప్రకాశించే మానవోత్తముడెవరైనా వున్నాడా? మీకు తెలిసినవారెవరైనా ఇటువంటి మానవోత్తముడుంటే నాకు తెలుపవలసిందిగా ప్రార్థన" అని చేతులు జోడించి ప్రశ్నించాడు.

త్రిలోక సంచారియైన నారద మహాముని వాల్మీకి మనస్సులో ఉదయించిన ఈ సందేహాన్ని అర్థం చేసుకున్నాడు. శ్రీరామ తారక మంత్రాన్ని జపించి, తరించిన వాల్మీకి, అయోధ్యానగరాన్ని పరిపాలిస్తున్న దశరథ రాముని గురించి విని, తారకనామ మహిమాన్వితుడైన శ్రీరాముడు, ఒకరేనా అనె సందేహంతో నారదుని ఆ విధంగా ప్రశ్నించాడు.

అయితే ఇక్కడ మనం గమనించవలసిన సత్యం ఒకటి వుంది. వాల్మీకి తపస్సంపన్నుడు. ఆయన తన దివ్యదృష్టితో సర్వం గ్రహించగలడు. గాని రామచరిత్ర లోకానికి తెలియజెయ్యాలనే సత్సంకల్పంతో మాత్రమే నారదుని నోట ఆ విషయాన్ని చెప్పించాడు. షోడశకళలతో పరిపూర్ణ ప్రకాశవంతుడైన నిండు చంద్రుడు సమస్త జీవకోటినీ రంజింపచేస్తాడు. అలాగే ఈ పదహారు సద్గుణములు కల్గిన శ్రీరామచంద్రుడు తన చల్లని పరిపాలనలో ముల్లోకాలను రంజింపజేస్తున్నాడు అనేభావం ప్రకటిస్తూ అడిగాడు.

అపుడు నారదుడు చిరునవ్వుతో, వాల్మీకిని చూసి "నాయనా నువ్వు వివరించిన అన్ని సద్గుణాలు కలిగిన పురుషోత్తముడు ఈ లోకంలో వుండటం అసంభవం.

అయినా ఇక్ష్వాకువంశ సంభూతుడైన శ్రీరామునిలో, ఈ సద్గుణాలన్నీ వున్నాయి. దశరథతనయుడైన ఈరాముడు, అంతర్గుణాలలోనే గాక, బాహ్య స్వరూపంలో కూడా సకల శుభలక్షణములు కలిగినవాడు.

ఆయన ఆజానుబాహువు, నీలమేఘశ్యాముడు, శంఖము వంటి కంఠము, విశాల వక్షస్థలము, చక్కని నుదురు కలవాడు. విశాలాక్షుడు, తేజోమూర్తి, సముద్రములా గంభీరమైనవాడు. హిమాచలమంతటిధీరుడు.

శ్రీమన్నారాయణుడంతటి పరాక్రమము గలవాడు. చంద్రునిలా చల్లనివాడు. మన్మథుని కన్నా అందగాడు. భూదేవంతటి ఓర్పు గలవాడు. కోపం వచ్చిందంటే కాలాగ్ని లాంటివాడు. కుబేరుడంతటి త్యాగధనుడు. యమధర్మరాజుని మించిన సత్యవంతుడు' అంటూ శ్రీరాముడు సద్గుణసంపత్తిలోనే గాక, బాహ్యస్వరూపంలోనూ, స్వభావంలోనూ కూడా షోడశకళాప్రపూర్ణుడని వర్ణించి చెప్పాడు నారదుడు.

ఆపైన అయోధ్యానగరంలో దశరథుని ఇంట జన్మించినది మొదలు, ఆయన పట్టాభిషిక్తుడయ్యేవరకు జరిగిన సంగతులన్నీ వివరించి వాల్మీకికి చెప్పి నారద మునీంద్రుడు అంతర్ధానమయ్యాడు.

ఆ కథంతా విన్న వాల్మీకి చకితుడైపోయాడు. చాలాసేపటివరకు ఆ సంగతులే ఆలోచిస్తూ వుండిపోయాడు.

అంతలో మధ్యాహ్నవేళ అయింది. సమీపములోనే వున్న తమసానదికి, స్నానం చెయ్యటం కోసం బయల్దేరాడు వాల్మీకి.

ఆయన శిష్యుడైన భరద్వాజ మహాముని కూడా వల్కలము తీసుకుని ఆయన వెంట బయల్దేరాడు. దారిలో ఒక చెట్టు కొమ్మమీద క్రౌంచపక్షుల జంట ఒకటి అన్యోన్యానురాగంతో మైమరచి పరవశించిపోతూ ఒకదానిలో ఒకటి ఒదిగిపోయి వుండటం వాల్మీకి మహాముని కంటబడింది. అంతలో ఒక బోయవాడు నిర్దాక్షిణ్యంగా ఆ జంటలోని, పోతుపిట్టని బాణంతో కొట్టాడు. పదునైన ఆ బాణం, ఆ పిట్ట శరీరంలో లోతుగా గుచ్చుకుంది.

ఆ పిట్ట నెత్తురు కారుతూ నేలమీద పడి బాధతో విలవిలలాడుతూ పొర్లసాగింది. ఆదృశ్యం చూసిన వాల్మీకి హృదయం ద్రవించిపోయి చెప్పరాని దుఃఖం కలిగింది. శోకపూరితమైన ఆయన గొంతునుంచి అప్రయత్నంగా ఈ శ్లోకం వెలువడింది.

"మానిషాద ప్రతిష్ఠాం త్వ మగమశ్శాశ్వతీ స్సమాః;
యత్క్రౌంచమిథునా దేకం అవధీః కామమోహితమ్"

ఓ కిరాతుడా, మన్మథ పారవశ్యంలో మునిగివున్న క్రౌంచపక్షుల జంటలో ఒకదానిని, నిర్దాక్షిణ్యంగా పొట్టన బెట్టుకున్నావు కదా! నువ్వు మాత్రం ఎంతకాలం జీవిస్తావులే అని దానర్థం.

ఈ విధంగా శోకార్తుడైన వాల్మీకి అప్రయత్నంగా పలికి, తన నోట వచ్చిన ఆ మాటల్ని మళ్ళీ మననం చేసి చూసుకున్నాడు. ఆలోచించి చూడగా తన నోట వెలువడిన ఆ మాటలు, సమాక్షరాలతో పాదబద్ధమైన పద్యంగా తోచాయి ఆయనకి.

లయబద్ధంగా, తంత్రులమీద ఆలాపించి, గానం చెయ్యటానికి వీలుగా, ఛందోబద్ధమైన ఆ గీతాన్ని 'శ్లోకం' అనవచ్చునేమో అనుకున్నాడు.

'శోకార్తుణ్ణి అయిన నా నోటి నుంచి వెలువడింది కనుక దీనిని శ్లోకం అంటాను' అనుకున్నాడు.

అసంగతే తనవెంట వస్తున్న భారద్వాజుడితోఅన్నాడు. భారద్వాజుడు కూడా వాల్మీకి చెప్పింది విని చాలా బాగుంది, అన్నాడు.

ఆ తర్వాత వారిరువురూ తమసా నదికి వెళ్ళి స్నానం చేసి మాధ్యాహ్నిక కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఆశ్రమానికి తిరుగు ముఖంపట్టారు.

దారిపొడుగునా వాల్మీకి మనస్సులో జరిగిన సంఘటన తాలూకు ఆలోచనలు కలచివేస్తూనే వున్నాయి.

పర్ణశాల చేరి మాధ్యాహ్నిక కృత్యాలన్నీ చేస్తూనే జరిగిన దానిని గురించి పదేపదే ఆలోచించసాగాడు.

కొంతసేపటికి బ్రహ్మలోకం నుంచి బ్రహ్మభూలోకానికి వచ్చి వాల్మీకి కన్నుల ముందు సాక్షాత్కరించాడు. పితామహుని చూసి వాల్మీకి ఆశ్చర్యచకితుడై లేచి నమస్కరించి నిలబడ్డాడు.

బ్రహ్మదేవునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, ఉత్తమాసనం చూపించి కూర్చోమన్నాడు.

ఆయన కూర్చున్న తర్వాత స్తోత్రం చేసి, ప్రదక్షిణం చేసి సాష్టాంగ నమస్కారం చేశాడు.

బ్రహ్మ చాలా సంతోషించి, వాల్మీకిని కుశలప్రశ్నలడిగి కూర్చోమని అన్నాడు.

పితామహుడి పాదాల దగ్గర కూర్చున్న వాల్మీకికి మనసులో మాత్రం క్రౌంచపక్షుల వృత్తాంతమే మెదలసాగింది. మనస్సంతా ఆవేదనతో నిండిపోయి, అప్రయత్నంగా ఆ శ్లోకం మళ్లీ ఆయన నోటివెంట వచ్చింది.

ఆ స్థితిలో వున్న వాల్మీకిని చూసి బ్రహ్మ చిరునవ్వు నవ్వాడు.

'మహర్షీ ఈ శ్లోకం నా ఆదేశానుసారమే సరస్వతి నీ నోట పలికించింది. నువ్వన్నట్లుగా ఇది ముమ్మాటికీ శ్లోకమే సందేహం లేదు.

నీ చేత రామకథ యావత్తు ఇటువంటి శ్లోకాలతో చెప్పించాలనే నేను నీచేత అలా పలికించాను.

ఉదయం నారద మహాముని రామకథ అంతా నీకు వివరంగా చెప్పాడు కదా. శ్రీరాముని వంటి మానవోత్తముడు ఈ భూలోకంలో మరెక్కడా లేడు. కనుక ఆ రాముని చరిత్ర నువ్వు విన్నది విన్నట్లుగా కావ్యరూపంలో వ్రాయాలి.

నీకు రాముని గురించిన చరిత్ర అంతా యథాతథంగా నీ దివ్యదృష్టికి గోచరించేలా వరం ఇస్తున్నాను. జరిగినది జరిగినట్లుగా నీ కంటికి కనిపించటమే గాక, అవతారసమాప్తి అయ్యేవరకు జరగబోయే వృత్తాంతంకూడా నీకు కనిపిస్తుంది.

నువ్వు చెప్పబోయే కావ్యంలో ఒక్క అనృతం కూడా వుండదు. అంతే కాదు అది ఆదికావ్య మవుతుంది. మహాకావ్యమూ, పుణ్యకావ్యము కూడా అవుతుంది.

ఓ మహామునీ, ఈ ప్రపంచంలో సృష్టి అంతరించకుండా వున్నన్నాళ్ళు, మహానదులూ, మహాపర్వతాలు వున్నంతవరకు, నువ్వు చెప్పబోయే ఈ రామాయణ మహాకావ్యం ప్రచారంలో వుంటుంది. ఈ లోకంలోనూ, ఊర్ధ్వలోకంలోనూ కూడా ఈ కావ్యంతో బాటు నువ్వూ చిరంజీవిగా వుంటావు.

అని వాల్మీకిని ఆశీర్వదించి బ్రహ్మదేవుడు అంతర్ధానమయ్యాడు.

బ్రహ్మపలుకులను విన్న వాల్మీకి ఆయన శిష్యులూ పరమానందం పొందారు.

వెంటనే రామాయణ మహాకావ్యరచన మొదలు పెట్టాలని వాల్మీకి సంకల్పించాడు.

గంభీరమైన పదములతో, మనోహరమైన శబ్దాలతో, చక్కని వాక్యాలతో,

ఉత్తమమైన శ్లోకాలతో, నిర్మలమైన గంగాస్రవంతిలా వాల్మీకి చేతి గంటము నుండి, రామాయణ మహాకావ్యం అవతరించింది.

బ్రహ్మ ఇచ్చిన వరప్రభావం చేత, జరిగిపోయిన రామచరిత్ర అంతా వాల్మీకి మహాముని మనోనేత్రం ముందు సాక్షాత్కరించింది.

వాల్మీకి రామాయణ రచన మొదలు పెట్టేసరికి, శ్రీరాముడు పుట్టి పెరిగి, పెద్దవాడై వివాహము చేసుకుని, పన్నెండు సంవత్సరాలు సీతతో వైవాహిక జీవితము గడిపి, ఆతర్వాత పితృవాక్యపరిపాలనకై పదునాలుగు సంవత్సరాలు అరణ్యా వాసము చేసి తిరిగి అయోధ్యకి వచ్చి, పట్టాభిషక్తుడై రాజ్యపాలన చేస్తున్నాడు. ఆపైన జరగబోయేది ఉత్తరకాండగా అవతరించింది. ఈ రామాయణ మహాకావ్యం రచించటానికి ఆయనకి సుమారు పన్నెండు సంవత్సరాలు పట్టింది.

వేదార్థప్రతి పాదకము, ఇరవై నాలుగువేల శ్లోకాలతో, ఐదువందల సర్గలతో, ఆరు కాండములుగా, నవరస భరితమైన, మహాకావ్యంగా, 'శ్రీమద్రామాయణ' రచన జరిగింది. ఆపైన ఉత్తరకాండ రచన జరిగింది.

మృదంగ తాళయుక్తంగా తంత్రీస్వనములపై గానము చెయ్యటానికి వీలుగా సుమనోహరంగా ఉదయించింది. రామాయణ మహాకావ్యం.

ఇంతటి అద్భుత కావ్యాన్ని రచించి పూర్తిచేసిన తర్వాత దానిని ఎవరిచేత ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయించాలా అనే మీమాంసతో కనులు మూసుకుని ఆలోచనలో పడ్డాడు వాల్మీకి.

అలా ధ్యాననిమగ్నుడై యున్న వాల్మీకి పాదాలమీద చల్లని చేతి స్పర్శ తగిలింది. సాదరంగా కన్నులు తెరిచి చూశాడాయన.

ముని బాలకులైన "కుశలవులు"అతి వినమ్రులై గురువుగారి పాదాలపై ప్రణమిల్లి వున్నారు ఆ బాలురిద్దరూ సీతారాముల ప్రతిబింబాలు. వాల్మీకి మహాముని శుశ్రూషలో వేద, వేదాంగాలు అభ్యసించి, ఎన్నెన్నో విద్యలలో ప్రావీణ్యం సంపాదించారు వారు.

వారిని లేవదీసి హృదయానికి హత్తుకున్నాడాయన. ఈశ్వర సంకల్పంగా భావించి వారికి రామాయణ గానాన్ని నేర్పాడు.

అతి స్వల్ప కాలంలోనే వారు రామాయణమహాకావ్యాన్ని క్షుణ్ణంగా అభ్యసించారు.

రాగయుక్తంగా పాడుతూ గురువుగారి ముందర అభినయించి చూపించారు.

వాల్మీకి ఆనందంతో పొంగిపోయాడు. వారిద్దర్నీ అక్కున చేర్చుకుని చాలా మెచ్చుకున్నాడు.

క్రమంగా కుశలవులు ఆశ్రమాలన్నీ తిరిగి, సభాముఖంగా రామాయణాన్ని గానం చెయ్యసాగారు.

మనోహరములైన ఆ శ్లోకాలు విని, కళ్ళకి కట్టినట్లుగా వారు అభినయించి ఆలాపించే పద్ధతి చూసి ఆశ్రమాల్లోని మునీశ్వరులంతా, కుశలవుల్ని మెచ్చుకుని, తమ దగ్గరవుండే అమూల్యమైన వస్తువుల్ని వారికి కానుకలుగా ఇచ్చేవారు.

అలా ఆశ్రమపదాలన్నీ తిరిగి గానం చేశాక, ఆ మునిబాలురు గురువుగారి ఆజ్ఞపై దేశాటనము చేస్తూ, అయోధ్యానగరానికి చేరుకున్నారు.

రాజమార్గాలలోనూ, నాలుగు బాటల కూడలిలోనూ వారు రామాయణ కావ్యగానం చేస్తూండగా ఆ సంగతి శ్రీరామచంద్రునికి తెలిసింది.

వెంటనే రాముడు వారిని తన కొలువుకూటానికి పిలిపించి సత్కరించాడు.

తన తమ్ములతోటీ, మంత్రులతోటీ, మహాజనులతోటీ, కొలువుతీరి, ఆ కొలువులో 'కుశలవుల్ని' రామాయణగానం చెయ్యవలసిందిగా ఆదేశించాడు.

శ్రీరాముని కోరికమీద, కుశలవులు తమ అనుచరులతో కలసి, వీణా, వేణు, మృదంగ, తాళములు మ్రోగుతుండగా, రామాయణాన్ని అభినయిస్తూ ఆలపించటం మొదలుపెట్టారు. ఆ కథాగానం ఇలా సాగింది.

మనువు సంతతివారైన ఇక్ష్వాకువంశపు రాజులెందరో, ప్రజానురంజకంగా ఈ భూమిని పాలించి, ఎంతో కీర్తిప్రతిష్ఠలు సంపాదించారు. అంతటి మహత్తరమైన వంశంలో జన్మించినవాడే శ్రీరాముడు. ఆ పురుషోత్తముని కమనీయమైన చరిత్రని, మా గురుపుంగవులైన వాల్మీకి మహాముని రామాయణ మహాకావ్యంగా రచించి, ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయవలసిందిగా మమ్మ ఆజ్ఞాపించారు.

మేము గానం చెయ్యబోయే ఆ రామాయణగాథని శ్రద్ధగా ఆలకించ వలసిందిగా మిమ్ములనందర్ని కోరుచున్నాము.

సరయూనదీ తీరాన, ధనధాన్య సమృద్ధి కలిగిన కోసలదేశమనే రాజ్యం వుంది. పన్నెండు యోజనముల పొడవు, రెండు యోజనాల వెడల్పు, కలిగి అష్టదళాకారంగా వైవస్వతమనువుచే నిర్మించబడ్డ అయోధ్యానగరము ఆదేశానికి రాజధాని.

విశాలమైన వీధులతోటీ, రత్నఖచిత ప్రాసాదాలతోటీ, క్రీడా పర్వతాలతోటీ, ఉద్యానవనాలతోటీ, వీణా వేణు మృదంగ తాళధ్వనులతోటీ, నిత్య కల్యాణంగా దేవేంద్రుని అమరావతిని మరిపింపజేసే ఆ అయోధ్యానగరం రాజధానిగా దశరథ మహారాజు కోసల దేశాన్ని పరిపాలిస్తూ వుండేవాడు.

ఆయన అమిత పరాక్రమవంతుడు, అతిరథుడు, వేదకోవిదుడు. అనేకములైన యజ్ఞయాగాదులు చేసి ఎంతో కీర్తిప్రతిష్ఠలు పొందినవాడు.

ఆయన కొలువులో వశిష్ఠుడు, వామదేవుడు అనే ఇద్దరు మహాపురుషులు పురోహితులుగా వుండేవారు.

ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అని ఎనిమండుగురు మంత్రులు ఆయనకుండేవారు.

వారిలో సుమంత్రుడు మహారాజుకి అంతరంగికుడు. అంతఃపురంలో కూడా ప్రవేశించే చనువున్నవాడు. దశరథుని మంత్రులంతా సదాచారసంపన్నులు. రాజ్యతంత్రాన్ని బాగా తెలిసినవారు. వారి సాయంతో దశరథ మహారాజు తన రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలించెడివాడు.

ఆయన పాలనలో దేశం సస్యశ్యామలంగా వుండేది. ధర్మం నాలుగు పాదాలా నడిచేది. ప్రజలంతా సద్గుణ సంపన్నులై సుఖంగా జీవించేవారు.

అయితే సంతానం లేని బాధ దశరథునికి తీవ్రమైన వేదన కలిగిస్తూ వుండేది. కౌసల్య, సుమిత్ర, కైకేయి అని ముగ్గురు పట్టమహిషులున్నా ఆయనకి ఎంతకాలానికీ సంతానం మాత్రం కలగలేదు.

వంశాభివృద్ధికైనా ఒక్క మగశిశువు కలగలేదే, అని చాలా దిగులుపడి ఆలోచనలో పడ్డాడు. మంత్రుల్ని పురోహితుల్ని సమావేశపరచి, తన మనస్సులోని ఆవేదన వారికి చెప్పి 'అశ్వమేధయాగం' చేస్తే సంతానం కలుగుతుందేమో అనే ఆశ తనకి వున్నట్లు చెప్పి, వారి సలహాలు అడిగాడు.

వారంతా రాజుగారి ఆలోచనని సమర్థించారు. "మహారాజా మీరు అశ్వమేధయాగం చేస్తే తప్పకుండా మీకు పుత్ర సంతానం కలుగుతుంది. ముందుగా యజ్ఞోపకరణాలు సమకూర్చుకుంటే, ఆ తర్వాత గుఱ్ఱాన్ని వదలవచ్చు" అన్నారు ముక్తకంఠంతో.

వారి మాటలు విని దశరథుడు చాలా సంతోషించాడు. గురువులనడిగి

యజ్ఞోపకరణాలు ఏవేవి కావాలో అన్నీ తెప్పించవలసిందిగా మంత్రుల్ని ఆజ్ఞాపించాడు. మళ్ళీ ఇలా అన్నాడు.

'మంత్రివర్యులారా! ఋత్విజులతో సంస్కరింపబడిన గుఱ్ఱాన్ని దేశం మీదికి వదలాలి. సరయూనదీ తీరాన యజ్ఞవాటిక ఏర్పాటు చేయించండి. సామాన్యంగా యజ్ఞం నిర్విఘ్నంగా సమాప్తి చెయ్యటం చాలా కష్టం. ఏ మాత్రం అపచారం జరిగినా యజ్ఞకర్త తక్షణమే నాశనమైపోతాడు. కనుక శాస్త్రీయంగా శాంతులు జరిపించండి. మీరు అన్నీ తెలిసినవారు. కనుక ఈ బాధ్యత మీకు అప్పగిస్తున్నాను. ఈ క్రతువు యధావిధిగా జరిపించే పూచీ మీది' అన్నాడు.

వారంతా రాజుకి వందనం చేసి, 'మహారాజా! మీ ఆజ్ఞ శిరసావహిస్తాము. మీచేత శాస్త్రీయంగా, నిర్విఘ్నంగా అశ్వమేధయాగం చేయించే బాధ్యతమాది. కనుక మీరు నిశ్చింతంగా వుండండి' అని, మహారాజు దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయారు.

వెంటనే మహారాజు అంతఃపురంలోకి వెళ్ళి తన రాణుల్ని పిల్చి అశ్వమేధ యాగం చెయ్యబోతున్న సంగతి చెప్పి, వారిని అపుడే దీక్ష తీసుకోవలసిందిగా కోరాడు. ఆసంగతి విన్న రాణులు చాలా సంతోషించారు.

ఆ తర్వాత దశరథుని ఆంతరంగిక మంత్రియైన సుమంత్రుడు, ఆయనని ఏకాంతంలో కల్సుకుని, తన మనస్సులోని మాట ఇలాచెప్పాడు.

'మహారాజా మునుపొకసారి మునిసత్తములందరూ కొలువుతీరి వుండగా, త్రికాలజ్ఞుడైన సనత్కుమారుడు, ఇలా అన్నాడు. భవిష్యత్కాలంలో కాశ్యపమహర్షికి, విభండకుడు అనే కుమారుడు పుట్టాడు. ఆ విభండకునికి, ఋష్యశృంగుడనే కొడుకు కలుగుతాడు. ఆ ఋష్యశృంగుడు కేవలం తండ్రి తప్ప మరెవ్వరూ తెలియకుండా పెరుగుతాడు. బాహ్య ప్రపంచమంటే ఏమిటో తెలియకుండా నిరంతరం తండ్రిని సేవిస్తూ బ్రహ్మచర్యనిష్ఠాగరిష్ఠుడై పెరుగుతున్న అతడికి బయట ఇంకో ప్రపంచం అనేది వుంటుందని తెలియకపోవటమే కాక, అసలు స్త్రీలు అంటే ఎలావుంటారు అనే సంగతి కూడా తెలియదు.

అదే సమయంలో అంగదేశాన్ని రోమపాదుడనే మహారాజు పాలిస్తాడు. ఆతడి అనుచిత ప్రవృత్తి వల్ల ఆ దేశంలో వానలు కురవక మహా కాటకం సంభవిస్తుంది.

ఆ కాటకాన్ని ఎలా నివారించాలా అని రోమపాదుడు, మంత్రులందర్నీ సమావేశపరచి సమాలోచనలు చేస్తాడు అప్పుడు మంత్రులు 'మహారాజా! ఏదో ఒక ఉపాయంతో ఋష్యశృంగమహామునిని మన రాజ్యానికి పిలిపించి, మీ కుమార్తె

అయిన శాంతాదేవిని, ఆయనకిచ్చి వివాహం జరిపిస్తే తప్పకుండా మన రాజ్యంలో వానలు కురిసి కరవు కాటకాలు దూరమవుతాయని, వారు చెప్తారు.

వారి మాటపై రోమపాదుడు కొంతమంది వేశ్యాంగనలని, విభండకుని ఆశ్రమానికి పంపించి, ఋష్యశృంగుణ్ణి అంగరాజ్యానికి రప్పించి, శాంతాదేవినిచ్చి వివాహం జరిపిస్తాడు. తక్షణమే రాజ్యమంతటా వానలు కురిసి క్షామం అంతరిస్తుంది.

ఆ ఋష్యశృంగుడే కోసలాధీశుడైన దశరథ మహారాజు చేత, అశ్వమేథ యాగం చేయిస్తాడు. అపుడు దశరథ మహారాజుకి నలుగురు కుమారులు జన్మిస్తారు. అని సనత్కుమారుడు మునిసత్తములందరి మధ్యా కూర్చుని చెప్తుండగా తాను విన్నానని సుమంత్రుడు దశరథునితో చెప్పి,

'ప్రభూ, ఇపుడు మీరు ఋష్యశృంగుని మన రాజ్యానికి పిలిపించి, ఆయన చేత అశ్వమేథయాగం చేయించినట్లైతే తప్పకుండా మీకు పుత్రసంతానం కలుగుతుంది అని అన్నాడు.

ఆ మాటలు విన్న దశరథుడు చాలా సంతోషించాడు. సుమంత్రా, నీ ఆలోచన చాలా బాగుంది కాని, నాదో సందేహం. ఋష్యశృంగుణ్ణి వేశ్యలవలన అంగరాజ్యానికి ఎందుకు రప్పించవలసి వచ్చింది? అని అడిగాడు.

'మహారాజా - విభండకుని కుమారుడైన ఋష్యశృంగుడు, పరమ నిష్ఠాగరిష్ఠుడు. నిరంతరం వేదాధ్యయనం చేస్తూ తండ్రిని సేవిస్తూ వుంటాడు. తండ్రి తప్ప ప్రపంచమంటే ఏమిటో తెలియదాయనకి. స్త్రీలంటే ఎవరో అసలే తెలియదు. మామూలుగా దూతలను పంపి రాజ్యానికి రమ్మంటే, అతడు రాడు. కనుక తండ్రి ఆశ్రమంలో లేని సమయంలో వారకాంతలను పంపి, రప్పిస్తే ఆయన తప్పక వస్తాడని పురోహితులు రోమపాదునికి ఉపాయం చెప్పారు' అని సుమంత్రుడు జవాబిచ్చాడు.

అందుకు దశరథుడు ఆశ్చర్యంతో, మహామంత్రీ - ఋష్యశృంగునికి స్త్రీల గురించి తెలియకపోవటమేమిటి? ఇంతకీ ఆతడి తల్లి ఎవరు? అని అడిగాడు.

అందుకు సుమంత్రుడు సవినయంగా చేతులు జోడించి 'ప్రభూ, విభండకుడు బ్రహ్మచర్య నియమము గలవాడు. కాని ఒక విచిత్రమైన సంఘటన వల్ల ఆయన ఋష్యశృంగుడికి తండ్రి అయ్యాడు. ఒకనాడు ఆయన తటాకములో స్నానం చేస్తూ వుండగా, దేవదాసి అయిన ఊర్వశి, ఆ ప్రదేశానికి వచ్చిందట. ఆమె సౌందర్యం చూసి విభంకుడు సమ్మోహితుడు కాగా, ఆయన వీర్యం ఆ తటాకంలో స్ఖలనమైందట.

ఆ వీర్యంతో కూడిన జలాల్ని ఋష్యము అనే ఒక లేడి త్రాగిందట. ఆ నీటి ప్రభావం వల్ల దానికి గర్భం వచ్చి చక్కని బాలుడు పుట్టాడట. దివ్యదృష్టి చేత ఆ బాలుని తన కుమారునిగా గుర్తించి, విభండకుడు ఆ పిల్లవానిని తన ఆశ్రమంలో పెంచి పెద్ద చేశాడట.

పుట్టుకతోనే, కొమ్ములతో పుట్టటం వల్ల ఆ పిల్లవానికి 'ఋష్యశృంగుడు' అని నామకరణం చేశాడట. విభండకుని ఆశ్రమంలో స్త్రీలు లేకపోవటం చేత ఆయనకి ఆడవారంటే ఎలా వుంటారో తెలియదుట.

అటువంటి ఋష్యశృంగుడు పెరిగి యౌవనదశలో వుండగా రోమపాదుడు వారాంగనలను ఆతడి ఆశ్రమానికి పంపాడట. ఈ విషయాలన్నీ సనత్కుమారుడు చెప్పగా నేను విన్నాను అంటూ ఆయన ఇంకా ఇలా చెప్పాడు.

'రోమపాదుడు పంపిన వారాంగనలు, విభండకుని ఆశ్రమ సమీపానికి వెళ్ళి చక్కని పాటలు పాడసాగారు. తండ్రి ఆశ్రమంలో లేకపోవటంతో ఋష్యశృంగుడు ఆ పాటలు విని ముగ్ధుడై వారందర్నీ తన ఆశ్రమంలోకి ఆహ్వానించాడు. రుచికరములైన తియ్యని ఫలములతో వారికి విందు చేశాడు.

ఆ వారాంగనలు తాము తెచ్చిన మధురమైన భక్ష్యములు అతడిచేత తినిపించి, అతడ్ని కౌగలింతలలో ముంచి తేల్చారు. కొంతసేపైన తర్వాత సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

వారి సాహచర్యంలో వింత అనుభూతిని రుచిచూసిన ఋష్యశృంగుడు మర్నాడు మళ్ళీ అదే సమయానికి, వారువచ్చిన చోటుకి వెళ్ళాడు.

మోహపరవశుడైన ఋష్యశృంగుని ఆవారాంగనలు తమవెంట అంగరాజ్యానికి తీసికెళ్ళారు. ఆయన రాకతో అంగరాజ్యం సుభిక్షమైంది' అని చెప్పి, కృతయుగంలో సనత్కుమారుడు చెప్పిన విషయం త్రేతాయుగంలో అక్షరాలా నిజమైంది. అలాగే మీ విషయంలో కూడా సనత్కుమారుడు, ఋష్యశృంగుణ్ణి మీరు పిలిపించి అశ్వమేధయాగం చేయిస్తారనీ, మీకు నలుగురు కుమారులు కల్గుతారనీ చెప్పిన మాట కూడా తప్పకుండా జరిగి తీరుతుంది మహారాజా, కనుక మీరు చతురంగ బలాలతో రోమపాదుని రాజధానికి తరలివెళ్ళి ఋష్యశృంగుణ్ణి ఆహ్వానించి, వారిచేత అశ్వమేధయాగం చేయించుకుంటే మంచిది' అని దశరథ మహారాజుకి సలహా ఇచ్చాడు.

దశరథుడు సుమంత్రుని సలహాని మెచ్చుకుని ఆ విషయం వశిష్ఠ

మహామునితో సంప్రతించాడు. వశిష్ఠుడు ఇక్ష్వాకు వంశానికి కులగురువు, ఆస్థాన పురోహితుడు. ఆయనతో సంప్రదించనిదే మహారాజు ఏమీచెయ్యడు.

వశిష్ఠుడు కూడా సుమంత్రుడు చెప్పిన దానిని ఆమోదించాడు. వెంటనే దశరథ మహారాజు చతురంగ బలాలతో, మంత్రులతో, పురోహితులతో కలసి బయల్దేరి అంగదేశానికి వెళ్ళాడు. రోమపాదుడు దశరథ మహారాజుని సగౌరవంగా ఆహ్వానించి, ఘనంగా సత్కరించాడు. ఒక వారం రోజులు విందులతో విలాసాలతో గడిచిపోయాయి.

ఆ తర్వాత దశరథుడు రోమపాదునికి, తన మనస్సులోని కోరిక తెలియపరచి, ఆతడి కుమార్తె శాంతనీ, అల్లుడైన ఋష్యశృంగుణ్ణి తనతో పంపవలసినదిగా కోరాడు. రోమపాదుడు అంగీకరించి, సంతోషంగా వారివెంట తన కూతుర్ని, అల్లుణ్ని పంపాడు.

అయోధ్యలో సకల రాజలాంఛనాలతో వారికి స్వాగతం లభించింది. ఒక ప్రత్యేక భవనంలో వారికి విడిది ఏర్పాటు చేయించాడు దశరథుడు.

వసంతకాలం వచ్చింది. దశరథుడు ఋష్యశృంగుడికి ప్రణమిల్లి, 'మహాత్మా వంశాభివృద్ధికై నా చేత యాగము చేయించండి' అని ప్రార్థించాడు.

ఋష్యశృంగుడు 'సరే' అని 'మహారాజా! యజ్ఞోపకరణాలన్నీ సమకూర్చుకుంటే, గుఱ్ఱాన్ని వదలవచ్చు' అన్నాడు.

అప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం చాలావరకు పనులు జరిగిపోయాయి.

చైత్రశుద్ధ పౌర్ణమినాడు సాంగ్రహణ్యేష్టిని ఆరంభించి, మర్నాడు ఉత్తమాశ్వాన్ని బంధ విమోచన చేసి వదిలిపెట్టారు.

సరిగ్గా ఒక సంవత్సరం గడిచింది. మళ్ళీ వసంత కాలం వచ్చింది. యజ్ఞవాటిక నిర్మాణం ప్రారంభమైంది. ఋష్యశృంగుడి పర్యవేక్షణలో, బ్రాహ్మణవృద్ధులు, యజ్ఞసమీకరణాధికారులు, వడ్రంగులూ, చిత్రకారులూ, మొదలైన వారంతా పెద్ద సంఖ్యలో పిలిపించబడ్డారు.

చక్కని సౌధాలు నిర్మించారు. అన్నపానాది వసతులన్నీ యథాచారంగా, పుష్కలంగా ఏర్పాటు చేశారు. దేశదేశముల నుంచి చతుర్వర్ణముల వారూ ఆహ్వానించబడ్డారు.

దశరథ మహారాజుకి సన్నిహితులు, మిత్రులు, మహారాజులు మొదలైన వారిని ప్రత్యేకంగా మనుష్యులను పంపి ఆహ్వానించారు. ఎవరికి తగ్గస్థాయిలో

వారికి, షడ్రసోపేతమైన విందు భోజనాలు అమర్చారు. యజ్ఞం జరిగినన్నాళ్ళు ఎవ్వరికీ ఏలోటూ రాకుండా భోజన సత్కారాది సన్మానాలు జరిగేలా శ్రద్ధగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

శాస్త్రీయమైన పద్ధతిలో యజ్ఞవాటిక నిర్మాణం జరిగింది. ఒక శుభముహూర్తంలో ఋష్యశృంగుడి ఆధ్వర్యంలో, వశిష్ఠాది బ్రాహ్మణుల సమక్షంలో యథాశాస్త్రంగా యజ్ఞకర్మ ఆరంభమైంది. యజ్ఞం జరుగుతోండగా మరో ఏడాది నాటికి గుఱ్ఱం తిరిగి వచ్చింది.

దశరథ మహారాజు, ఆయన రాణులు ముగ్గురు ఆ గుఱ్ఱానికి ప్రదక్షిణం చేశారు. ఆ తర్వాత మహారాణులు ముగ్గురూ మంత్రోచ్చారణముల మధ్య ఆ గుఱ్ఱం శరీరం మీద బంగారపు కత్తితో నాట్లు పెట్టారు.

గుఱ్ఱం నేలకూలింది. ఆ గుఱ్ఱంతో ఆ రాత్రి అంతా పట్టపురాణి కౌసల్య ధర్మసిద్ధికోసం గడిపింది.

మర్నాడు అధ్వర్యుడు ఏకాగ్ర చిత్తముతో ఆ గుఱ్ఱం మెదడు తీసి శాస్త్రీయంగా పక్వం చేశాడు. తర్వాత ఆ గుఱ్ఱం అవయవాలు అన్నీ యథాశాస్త్రంగా హోమం చెయ్యబడ్డాయి.

దశరథుడు ఋత్విజాలకు, అతిథి అభ్యాగతులకు, బ్రాహ్మణోత్తములకు, కోటి బంగారునాణాలు దానం చేశాడు.

అసంఖ్యాకములైన గోవుల్ని, ధన కనక వస్తు వాహనాదుల్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. వచ్చిన వారంతా సంతృప్తులై - సంతోషించి దశరథ మహారాజునీ - ఆయన భార్యల్నీ ఆశీర్వదించారు. వేదోక్తములైన ఆశీర్వచనాల మధ్య అశ్వమేధ యాగం ముగిసింది.

ఆపైన దశరథుడు ఋష్యశృంగునికి నమస్కరించి, 'మునిశ్రేష్ఠా అశ్వమేధ యాగం నిర్విఘ్నంగా చేయించి నన్ను కృతార్థుడ్ని చేశారు. ఇంక వంశాభివృద్ధి కోసం ఇంకొక కర్మ ఏదైనా చేయించవలసిందిగా నా ప్రార్ధన' అన్నాడు.

ఋష్యశృంగుడు ఒక్క ముహూర్తకాలం ఆలోచించాడు. ఒక చక్కని ఆలోచన స్ఫురించింది. 'మహారాజా అథర్వశిరస్సులో పుత్ర సంతానం కలగటానికి ఒక ఇష్టి గురించి చెప్పబడింది అది ఆచరిస్తే నీకు తప్పక సంతానం కలుగుతుంది' అని చెప్పి వెంటనే దశరథుని చేత పుత్రకామేష్టి యాగం చేయించటం మొదలుపెట్టాడు.

దేవతలంతా తమ తమ హవిర్భాగాలు తీసుకుందుకు ఆ ప్రదేశానికి వచ్చారు. అందరికన్నా ముందు బ్రహ్మదేవుడు వచ్చి కూర్చున్నాడు. వారంతా అదృశ్యరూపంలో ఉండి పుత్రకామేష్టిని వీక్షిస్తున్నారు. అపుడు దేవతలకి ఒక ఆలోచన వచ్చింది. వారంతా బ్రహ్మదేవునితో ఇలా అన్నారు.

'సృష్టికర్తా తమ అనుగ్రహం వల్ల అమోఘమైన వరములు పొందిన రావణాసురుడు అనేవాడు భూలోకంలో వుండి, అజేయమైన పరాక్రమంతో మమ్మల్నందర్నీ ఎన్నో యాతనలు పెడ్తున్నాడు.

మీమీద వుండే గౌరవంతో మేము వాడు పెట్టే బాధలన్నీ పడవలసి వస్తోంది. కనుక వాణ్ణి సంహారం చేసే ఉపాయమేదైనా చెప్పి మమ్మి రక్షించండి'అన్నారు.

వారి మొరలనాలకించి పితామహుడు ఇలా అన్నాడు. 'దేవతలారా! మీరు చెప్పింది అక్షరాలా నిజం. దేవ, దానవ, రాక్షసుల చేత గాని యక్ష, గరుడ, గంధర్వుల చేతగాని, తనకి మరణం కలగకుండా నా చేత వరం పొందాడు దశకంఠుడు.

కాని, మానవులు అల్పప్రాణులని తలచి కాబోలు, నరులచేత, వానరుల చేత తనకి మరణం కలగకుండా కోరలేదు. కనుక ఆ రావణుని సంహరించే ఉపాయం ఇపుడే నాకు తోచింది. సకల శక్తి సంపన్నుడైన పురుషోత్తముని, సృష్టించి, ఆతడిచేత రావణుని సంహరింపజేయవచ్చు' అన్నాడు.

వీరంతా ఇలా సంభాషించుకుంటూడగానే, పీతాంబరము, శంఖ, చక్ర, గదాయుధాలు ధరించిన శ్రీమన్నారాయణుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే దేవతలంతా ఆ శ్రీమన్నారాయణునికి ప్రణమిల్లి, 'ఓ పరంతపా, లోక కళ్యాణం కోసం, మీరు పురుషోత్తములుగా అవతరించి, లోక కంటకుడైన, ఆ రావణుని బారి నుండి, మమ్మల్ని కాపాడండి. మీరే మాకు శరణు' అని ప్రార్థించారు.

శ్రీ మహావిష్ణువు మందహాసముతో ఏమీ తెలియని వానిలా 'ఆ రావణవధోపాయమేదో మీరే నాకు చెప్పండి' అన్నాడు.

వెంటనే దేవతలంతా ముక్తకంఠంతో 'దీనబాంధవా, ఆ రావణుడు నరుల వల్ల వానరుల వల్లా తప్ప మరెవ్వరి వల్లా మరణం కలగకుండా బ్రహ్మగారి దగ్గర వరం పొందాడు.

అంతేగాదు, మదోన్మత్తుడై సాధుజనాల్ని - అష్టదిక్పాలకుల్ని - పంచభూతాల్ని

- చివరికి అమరాధిపతియైన దేవేంద్రుని కూడ శాసించి, మమ్మల్ని అనేక కష్టాలు పెడ్తున్నాడు కనుక తమరు మాపై అనుగ్రహంతో, పురుషోత్తమునిగా మానవలోకంలో అవతరించి, ఆ దుర్మార్గుని అంతమొందించండి' అని ప్రార్థించారు.

వారి కోరిక నంగీకరించిన మహావిష్ణువు తాను ఎవరి ఇంట జన్మించాలా అని ఆలోచనలో పడ్డాడు. దేవతలు శ్రీమహావిష్ణువు వైఖరి గమనించారు. వెంటనే చేతులు జోడించి 'ప్రభూ సంతానం కోరి పుత్ర కామేష్టి చేస్తున్న ఈ దశరథుడు, ధర్మజ్ఞుడు. కనుక మీరు ఆయన సంతానంగా అవతరించటానికి ఏ మాత్రం సందేహించనక్కర్లేదు' అన్నారు.

వారి కోరిక మన్నించి శ్రీహరి ఒప్పుకున్నాడు. దేవతలకి అభయమిచ్చి అంతర్థానమయ్యాడు.

దేవగణాలంతా ఆనందంతో శ్రీహరిని స్తుతించారు.

దశరథుడు చేస్తున్న పుత్రకామేష్టి పూర్తయ్యింది. అపుడు అందరికీ ఆశ్చర్యం కలిగేలా ఆ హోమగుండం నుంచి, కన్నులు మిరుమిట్లు గొలిపే దివ్యకాంతులతో, సర్వాలంకార శోభితుడై, ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. ఆయన తన రెండు చేతులతోటీ ఒక బంగారు కలశమును పట్టుకుని, అగ్నివేదిక నుంచి బయటకు వచ్చి, పెద్ద పెద్ద అడుగులతో దశరథునివైపు నడిచి, గంభీరమైన స్వరంతో 'మహారాజా, నేను ప్రాజాపత్య పురుషుడను' నీ యజ్ఞానికి దేవతలు సంతుష్టి చెంది నన్ను పంపారు అన్నాడు.

దశరథ మహారాజు తొట్రుపాటుతో లేచి నిలబడి చేతులు జోడించి, నమస్కరించి, 'స్వామీ మీకు స్వాగతం నా కర్తవ్యం ప్రబోధించండి' అన్నాడు.

అప్పుడా దివ్యపురుషుడు ప్రసన్నుడై 'ఇదిగో - ఈ పాయసపాత్రను, వారు నీ కొరకు పంపారు. ఈ పాయసాన్ని దేవతలు స్వయంగా వండారు. నువ్వు ఈ పాయసాన్ని నీ రాణులకి ఇయ్యి. వారు గర్భవతులవుతారు. నీకు కులదీపకులైన కుమారులు పుడ్తారు. అని చెప్పగానే దశరథుడు పరమానందంతో ఆయనకి ప్రదక్షిణం, సాష్టాంగ దండ ప్రమాణం చేసి ఆపాయసపాత్రను తీసుకున్నాడు.

వెంటనే ఆ దివ్యపురుషుడు, అంతర్థానమయ్యాడు.

ఆ దివ్యమైన పాయసపాత్రతో దశరథుడు అంతఃపురంలోకి వెళ్ళాడు. పట్టపురాణి కౌసల్యని జేరి జరిగినదంతా వివరంగా చెప్పాడు. ఆ పాయస పాత్రలోంచి సగం పాయసం ఆమెకిచ్చాడు. మిగిలిని పాయసంలో సగం

సుమిత్రకిచ్చాడు. ఇంకా మిగిలినదానిలో సగం కైకేయికిచ్చాడు. పాత్రలో మిగిలిన 8వ వంతు భాగాన్ని మళ్ళీ సుమిత్రకిచ్చాడు.

ఈ విధంగా పాయసాన్ని భుజించిన, రాణులు ముగ్గురూ కొంత కాలానికి గర్భవతులయ్యారు. దశరథ మహారాజు ఆనందానికి అంతులేదు.

ఇదిలా వుండగా అక్కడ దేవలోకంలో హవిర్భాగాలను తీసుకుని సంతుష్టులైన దేవతల వంక చూస్తూ బ్రహ్మదేవుడిలా అన్నాడు.

'సురోత్తములారా! మనకి మేలు చెయ్యటానికి, మహా విష్ణువు భూలోకంలో అవతరించబోతూ వున్నాడు. కనుక ఆయన రావణునితో యుద్ధం చేసేటపుడు, అన్ని విధాలా ఆయనకి సహాయపడటానికి, కామరూపులు, బలవంతులు అయిన వానరుల నెందర్నో మనం ఇపుడు సృష్టించాలి. ఎందుకంటే ఆ రావణుడు, వాని సోదరులూ చాలా శక్తిసంపన్నులు. వారిని యుద్ధంలో ఎదురించి నిలవటం కష్టం. కనుక అప్సరస్త్రీలు, గంధర్వాంగనలు, వానర రూపులైన పుత్రులను కనేటట్టు చెయ్యాలి. అలాపుట్టిన వానరులు మాయావిదులూ, మహాశూరులు, వాయువేగ సంపన్నులు, నీతిమంతులూ, అజేయులు, అమృతపానము చేసిన వారిలా చావులేనివారూ కావాలి.

సింహాలవంటి శరీరాలతో, విష్ణుమూర్తితో సమానమైన పరాక్రమముతో ఈ భూమిమీద సంచరించగల వారై వుండాలి. అటువంటి వానర శ్రేష్ఠులను మీరిపుడు సృష్టించండి.

ఇంతకుముందే నేను సంకల్పించి ఆవలించగా జాంబవంతుడనే ఎలుగుబంటి పుట్టడం జరిగింది. అతడు చాలా బలవంతుడు అన్నాడు. సృష్టికర్త మాటలు దేవతలు శ్రద్ధగా విన్నారు. అపుడే వానరపుత్రుల్ని కనాలని నిశ్చయించుకున్నారు. అపుడు దేవేంద్రునికి వాలి పుట్టాడు. పర్వతాకారంతో మహాబలవంతుడుగా పుట్టాడు వాలి.

సూర్యునికి సుగ్రీవుడు, బృహస్పతికి తారుడు, కుబేరుడికి నీలుడు, అశ్వనీదేవతలకు మైంద, ద్వివిదులూ, వరుణుడికి సుషేణుడు, పర్జన్యుడికి శరభుడూ, వానరపుత్రులుగా పుట్టారు.

వాయుదేవుడికి అమితపరాక్రమశాలియైన హనుమంతుడు పుట్టాడు. వీరితోపాటు వేలసంఖ్యలో అమితపరాక్రవంతులైన వానరవీరులు పుట్టారు.

వారంతా ఆరితేరిన యోధులు. కేవలం గోళ్ళు, కోరలు మాత్రం ఆయుధాలుగా ఉపయోగించగలరు. పెద్ద పెద్ద కొండలను సైతం అవలీలగా

పెకిలించి ఆవలపారవేయగల సమర్థులు. ఆకాశవీధిలో ఎగిరి మేఘాలను సైతం పట్టుకోగలరు. వారు గుంపులు గుంపులుగా ఋక్షవంతము, మొదలైన పర్వతాల మీద కాపురం పెట్టారు.

అన్నదమ్ములైన వాలి సుగ్రీవులు వారందరికీ ఏలికలుగా నిలిచారు. వారు మయుని కుమారుడైన నలుణ్ణి, నీలుణ్ణి, హనుమంతుని సేనానాయకులుగా పెట్టుకున్నారు. వారందరికీ రాజు వాలి. ఈ విధంగా వానరరాజ్యం ఏర్పడింది. దశరథ తనయుడైన శ్రీరామునికి అండదండలుగా నిలిచేటందుకు కావలసిన వానరసేనను సృష్టించి, దేవతలు తమవంతు కార్యం పూర్తిచేశారు.

ఇక్కడ అయోధ్యలో యజ్ఞదీక్ష విరమించాక దశరథుడు, యజ్ఞవాటిక నుంచి నగరంలోకి వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు. తాను ఆహ్వానించిన రాజులందర్నీ ఉచితరీతిని సత్కారించాడు. వారంతా సంతృప్తులై దశరథునికి నమస్కరించి, తమ తమ దేశాలకి వెళ్ళిపోయారు.

దశరథుడు అయోధ్యానగరంలో చేరాక ఋష్యశృంగుణ్ణి శాంతాదేవిని సన్మానించి, అంగదేశానికి పంపేశాడు.

పుత్రకామేష్టి జరిగి సరిగ్గా ఒక సంవత్సరం గడిచింది. మళ్ళీ చైత్రమాసం వచ్చింది. శుక్లపక్ష నవమి తిథినాడు పునర్వసు నక్షత్రమందు, ఐదుగ్రహములు, ఉచ్ఛదశలో విహరిస్తుండగా, గురువు, చంద్రుడు కలసిన కర్కాటక లగ్నములో తూర్పు తెల్లవారబోతుండగా కౌసల్యాదేవి సూర్యునివలె తేజోమయమూర్తి అయిన మగకుమారుని ప్రసవించింది. ఆకాశం నుంచి దేవతలు పూలవాన కురిపించారు. దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలూ, గంధర్వులూ ఆనందంతో ఆడిపాడారు.

మర్నాడు దశమి తిథియందు పుష్యమీనక్షత్రయుక్త మీనరాశిలో కైకేయికి మగపిల్లవాడు పుట్టాడు. మరికొంతసేపటికి ఆశ్రేషానక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో సుమిత్ర ఇద్దరు మగపిల్లల్ని ప్రసవించింది.

పుత్రోదయంతో దశరథ మహారాజు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. రాజ్యమంతటా ఎన్నెన్నో వేడుకలు, సంబరాలు జరిగాయి. అయోధ్యలో ఆనందం వెల్లివిరిసింది. ప్రజలంతా కోలాహలంతో పండుగ జరుపుకున్నారు.

దశరథ మహారాజు బ్రాహ్మణులకు లక్షలసంఖ్యలో ఆవుల్నీ, వెండి బంగారాలనూ దానంగా ఇచ్చాడు. అడిగినవారికి లేదనకుండా కానుకలు సమర్పించాడు. పదకొండోరోజు జాతకకర్మ చేయించి, నామకరణ మహోత్సవం వైభవంగా జరిపించారు.

వశిష్ఠ మహాముని, జ్యేష్ఠుడైన కౌసల్యానందనుడికి రాముడు అనీ, రెండవ వాడైన కైకేయి కుమారునికి, భరతుడు అనీ, సుమిత్రా కుమారులిద్దరికీ లక్ష్మణుడు, శత్రుఘ్నుడుఅనీ పేర్లు పెట్టాడు. అందరూ చాలా సంతోషించారు. పౌరులకూ, బ్రాహ్మణులకూ మృష్టాన్న భోజనాలు పెట్టి సత్కరించాడు దశరథుడు.

రాజప్రాసాదంలో రాణులు ముగ్గురికీ, పిల్లలు నలుగురి తోటీ రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడూ దినదిన ప్రవర్ధమానాలు అవుతున్నారు. బాల్యక్రీడలతో అందర్నీ అలరిస్తున్నారు. దశరథుడు తన కుమారులకి చౌలోప నయన కర్మలు యథావిధిగా జరిపించాడు.

పెద్దవాడైన రాముడు నీలమేఘశ్యాముడు. చూపురులను ఇట్టే ఆకర్షించే అందగాడు. అందరి మనస్సులను దోచినవాడు సుమిత్ర కుమారులలో మొదటివాడైన లక్ష్మణునికి రాముడంటే పంచప్రాణాలు. ఎప్పుడూ రాముని వెంటే తిరిగేవాడు. రాముడికి కూడా లక్ష్మణుడు బహిఃప్రాణము. లక్ష్మణుడు తోడు లేనిదే రాముడు అన్నంకూడా తినేవాడు కాడు.

రెండవ వాడైన భరతుడు పరమధార్మికుడు. అన్నగారి అడుగుజాడలలో నడిచేవాడు. సుమిత్ర రెండవ పుత్రుడైన శత్రుఘ్నునికి భరతుడంటే ప్రాణము. భరతుడి వెంట తిరుగుతుండేవాడు.

ఆ విధంగా ఆ అన్నదమ్ములు నల్గురికీ రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు అనే పదప్రయోగము వాడుకలోనికి వచ్చింది. వారు నలుగురూ చాలా చక్కనివారు. అంత అందమైన వాళ్ళు ఇంక ఈ భూమి మీద లేరు అనిపించేలా వుండేవారు. వారు వేదాల్ని క్షుణ్ణంగా అభ్యసించారు. పురాణాలు చదివారు. అస్త్ర విద్యాపారంగతులై అస్త్రశస్త్ర విద్యల్లో నైపుణ్యం సంపాదించారు. దిన దిన ప్రవర్థమానులై వారు షోడశకళాప్రపూర్ణుడైన పూర్ణచంద్రునిలా పెరిగి పెద్దవారయ్యారు. యుక్తవయస్కులైన వారికి వివాహం చెయ్యాలని దశరథ మహారాజు సంకల్పించాడు.

అటువంటి తరుణంలో ఒకనాడు విశ్వామిత్ర మహాముని, దశరథుని చూడవచ్చాడు.

ఆ ముని రాక నెరిగి, దశరథుడు, పురోహితులతో కూడా ఎదురుగా వెళ్ళి, అర్ఘ్యపాద్యాదులిచ్చి సాదరంగా ఆహ్వానించాడు.

ఉత్తమాసనం మీద ఆసీనుడై విశ్వామిత్రుడు, మహారాజునీ, కులగురువుల్నీ పురోహితుల్నీ కుశలమడిగాడు. విశ్వామిత్రుని ఆదరణకి దశరథుడు

పులకరించిపోయాడు. 'మహర్షీ, తమరాక వల్ల మా రాజ్యము పావనమైంది. నా జన్మ ధన్యమైంది. బ్రహ్మర్షీ, తమ కోరిక ఏమిటో చెప్పండి. మీ కోరిక తీర్చటం కన్న నాకు మహాభాగ్యమేముంది'? అన్నాడు.

దశరథుని మాటలకి విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు. 'మహారాజా, నీవు ఉత్తమ వంశంలో పుట్టావు. ఆడి తప్పటం మీవంశంలో లేదు. కనుక నా మనస్సులో మాట చెప్తాను విని నీ మాట నిల్పుకో.

నేను ఒక ఆశయసిద్ధి కోసం యజ్ఞం మొదలు పెట్టాను. కాని ఇద్దరు రాక్షసులు వచ్చి నా యజ్ఞం విధ్వంసం చేస్తున్నారు. వారిద్దరిపేర్లు మారీచుడు, సుబాహువు. వారు నా యజ్ఞవేదిక మీద మాంసపుముద్దలతో కూడిన నెత్తురు వానగా కురిపిస్తున్నారు. అందుచేత నా యజ్ఞం నిర్విఘ్నంగా సాగటం లేదు. నేను యజ్ఞదీక్షలో వున్నాను కనుక వారిని శపించకూడదు. అందుకే యజ్ఞవాటికనలా వదిలి, నీ సహాయం కోసం వచ్చాను. రాజా, నీ పెద్దకుమారుడైన శ్రీరాముని నా యజ్ఞసంరక్షణ కోసం తీసుకెళ్ళాలని వచ్చాను. నీ కుమారునికి, దివ్యములైన అస్త్రశస్త్రములు ఉపదేశిస్తాను. మహాపరాక్రమవంతుడైన రాముడు ఆ రాక్షసుల్ని సంహరించి, నాయాగాన్ని సంరక్షించగలడు' అని వూరుకున్నాడు.

ఆ మాటలు విన్న దశరథుడు కొయ్యబారిపోయాడు. విశ్వామిత్రుడు దశరథుణ్ణి ఆదేసించి 'రాజా, రాముడు, బాలుడని సందేహించకు. నా వెంట రాముణ్ణి పంపిస్తే నీకెంతో మేలు కలుగుతుంది. నామాట మీద నమ్మకం లేకపోతే మీ కులగురువు వశిష్ఠుణ్ణి - నీ మంత్రుల్ని అడుగు. నా యజ్ఞం పది రాత్రులు జరుగుతుంది. ఆ తర్వాత నీ రాముడిని సురక్షితంగా తెచ్చి నీ కప్పగిస్తాను. దిగులుపడక రాముని నాతో పంపు అన్నాడు.

ఆ మాటలు విన్న దశరథుడు గజగజ వణికిపోయాడు. 'మహామునీ నా రాముడికింకా పదహారేళ్లైనా నిండలేదే. పదిహేను నిండాయంతే. రాక్షసుల్ని ఎదుర్కొనే శక్తి వానికెక్కడిది? నా దగ్గర వున్న అక్షౌహిణీ సైన్యము, నేనూ, నీ వెంట వచ్చి ఆ రాక్షసులతో యుద్ధము చేస్తాము. రాముడు పసివాడు. ఇంకా అస్త్రబలసంపన్నుడు కాలేదు. యుద్ధకుశలుడు కాడు. మీరెరుగని విషయం కాదుగదా, నేనా ముసలివాణ్ణి. పిల్లల కోసం పరితపించిపోతున్న సమయంలో నాకు పుత్రులు కలిగారు. వారి నల్గురిలో నాకు రాముడంటే పంచప్రాణాలు. వాణ్ణి వదిలి ఒక్క ముహూర్తమైనా వుండలేను. నన్ను మన్నించండి. రామునికి బదులుగా నన్ను మీ వెంట తీసుకెళ్ళండి. ఇంతకీ మదించిన ఆ రాక్షసులెవరు? వాళ్ళ నెదుర్కోవాలంటే మేము ఎలాంటి వ్యూహరచన చెయ్యాలి? అన్నాడు

ధైర్యం చిక్కబట్టుకుని. ఆ మాటలు విని విశ్వామిత్రుడు మండిపడ్డాడు. రుసరుసలాడుతూ క్రోధంతో..

'రాజా, పౌలస్త్య మహర్షి సంతతివాడైన రావణుడు అనే రాక్షసుడొకడున్నాడు. వాడు చాలా బలం గలవాడు. తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి అనేక వరాలు పొందాడు. వాడే ఈ మారీచ, సుబాహుల్ని నా పైకి పంపాడు' అన్నాడు.

పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు దశరథుడు. 'బ్రహ్మర్షీ మన్నించండి ఆ రావణుని దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షసులైన ఎదురించలేరని విన్నాను. నేను కూడా వాడితో పోరు సలపటానికి అసమర్థుణ్ణే. నేను గాని, రాముడు గాని మీ వెంట రాలేము' అన్నాడు.

ఆ మాటలు వింటూనే విశ్వామిత్రుడు తోక తొక్కిన త్రాచులా లేచాడు.

'రాజా, నీ అంతట నువ్వే నా కోరిక తీరుస్తానని మాట ఇచ్చావు. ఇపుడు ఆడినమాట తప్పుతున్నావు. రఘువంశీయులకిది ఉచితమేనా?' ఉచితమే అని ఒక్కమాట చెప్పు నా దారిని నేనుపోతాను. అబద్ధాలకోరువై సుఖంగా వుండు అంటూ తటాలున వెనుదిరిగాడు.

విశ్వామిత్రుని కోపాగ్నికి పుడమి యావత్తు కంపించింది. దేవతలు సైతం భయంతో వణికిపోయారు. విషమిస్తున్న పరిస్థితిని వశిష్ఠుడు గమనించాడు. దశరథుని అనునయిస్తూ ఇలా అన్నాడు.

'మహారాజా, మీరు ఇక్ష్వాకువంశంలో పుట్టారు. ధర్మవ్రతులని ముల్లోకాల్లోనూ పేరు పొందారు. ఇపుడు ధర్మహాని చెయ్యటం న్యాయమా? ఆడితప్పటం మీ వంశంలో లేదు. అసత్య దోషం వల్ల మీరుచేసిన యజ్ఞయాగాది క్రతువులన్నీ నిష్ఫలమై పోతాయి. కనుక సందేహించకుండా రామభద్రుని విశ్వామిత్రుని వెంట పంపండి. రాముడికి శస్త్రాస్త్ర జ్ఞానం లేకపోయినా, ఈ విశ్వామిత్రుని వెంట వుండగా ఏ రాక్షసులూ, ఏమీ చెయ్యలేరు.

మీకో రహస్యం చెప్తాను వినండి. దక్షప్రజాపతి కుమార్తెలైన జయ, సుప్రభ, భృశాశ్వుడి భార్యలు. వారికి ఒక్కొక్కరికీ ఏబదిమంది వంతున ఇద్దరికీ కలిపి వందమంది పుత్రులు కలిగారు. వారు కామరూపులు. అప్రమేయ తేజోబలసంపన్నులు. రాక్షసుల సంహారం కోసం వారు పుట్టారు. వారు నూరుమందీ అమోఘమైన శస్త్రాస్త్రాలుగా మారిపోయారు.

కాలక్రమాన ఈశ్వరానుగ్రహం వల్ల ఆ శస్త్రాస్త్రాలన్నీ విశ్వామిత్రుని వశమైపోయాయి. అంతేగాక ఇంకా ఎన్నో కొత్త కొత్త శస్త్రాస్త్రాలు సృష్టించగల

సమర్థుడాయన. ఈ ప్రపంచంలోని రాక్షసులందర్నీ ఆయనొక్కడే వధించగలడు. కాని మీ కుమారుడైన రామునికి మేలు చెయ్యదలచి, నీ దగ్గరకి వచ్చి రాముని పంపమని యాచిస్తున్నాడు. కనక ఏ మాత్రం సందేహించక పంపండి' అన్నాడు.

ఆ మాటలు విన్న దశరథునికి సంతృప్తి కలిగింది. వెంటనే రామలక్ష్మణుల్ని పిలిపించాడు. ప్రేమతో రాముడి నుదుట ముద్దుపెట్టుకున్నాడు. దశరథుడూ, ఆయన భార్యలు సంతోషంగా రామలక్ష్మణుల నాశీర్వదించారు. వశిష్ఠమహర్షి వారికి మంగళాచరణం చేశాడు. దశరథుడు రామలక్ష్మణుల్ని విశ్వామిత్రునికి అప్పగించాడు. సుందరాకారులైన రామలక్ష్మణులు, మణికట్లకూ, వ్రేళ్ళకూ ఉడుముతోలు కవచాలు ధరించి, చక్కగా ముస్తాబై భుజాల నుండి ధనస్సులూ నడుమున కత్తులూ వ్రేలాడుచుండగా, దివ్యకాంతులు విరజిమ్ముతూ, విశ్వామిత్రుని వెంట నడిచారు. కోమల నీల సరోజశ్యాముడైన రాముడూ, సింధూర పుష్పవర్ణము కలిగి గిరజాల జుట్టుతో లక్ష్మణుడూ ఠీవీగా కదిలారు. విశ్వామిత్రుని అడుగుల్ని అనుసరిస్తూ ఇద్దరూ లోక సంరక్షకులలా ఆయన వెంట నడిచి వెళ్ళారు. ఆ విధంగా ఒకటిన్నర యోజనాల దూరం నడిచి సరయూనదికి దక్షిణ తీరానికి చేరారు.

అక్కడ విశ్వామిత్ర మహాముని క్షణకాలం ఆగాడు. రాముని వంక ఆప్యాయంగా చూస్తూ ఇలా అన్నాడు.

'రామచంద్రా ఇపుడు నేను నీకు అన్ని మంత్రాలకి మూలాధారమైన 'బల-అతిబల' అనే రెండు మంత్రాలు ఉపదేశిస్తాను. వెంటనే వెళ్ళి సరయూజలాలలో ఆచమించి రా. నా తపోబలంతో బ్రహ్మదేవుని మెప్పించి, ఈ మంత్రాలు నేను సంపాదించాను. వీటి ప్రభావం వల్ల ఇకపై నీకు ఆకలిగాని, దాహంగాని, అలసటగాని వుండవు. బాహుబలంలో నిన్నోడించే వారెవ్వరూ వుండరు. ఈ మంత్రానుష్ఠానం వల్ల నువ్వు ముల్లోకాలలోనూ అజేయుడవవుతావు. కనుక వెంటనే రా. ఉపదేశిస్తాను' అని ఆయన అనగానే,

రాముడు సంతోషంతో సరయూ నదిలో ఆచమించి, శుచి అయి వచ్చాడు. విశ్వామిత్రుడు శ్రీరామునికి ఆ మంత్రాలు రెండూ ఉపదేశించాడు. ఆ మంత్రోపదేశం పొందిన రాముడు, ప్రచండభానుడిలా ప్రకాశించాడు. గురువందనాది కార్యక్రమాలు పూర్తి అయ్యాక, గడ్డితో ఒత్తుగా పక్కలు ఏర్పాటు చేసుకుని, ఆ రాత్రికి వారు ఆ నదీతీరంలో విశ్రమించారు. విశ్వామిత్రుడు వారికి ఎన్నెన్నో కథలు చెప్పాడు. మెల్లిగా వారు నిద్రలోకి జారుకున్నారు.

తెల్లారింది. విశ్వామిత్రుడు నిద్రలేచాడు. రామలక్ష్మణులింకా నిద్రలో వున్నారు.

విశ్వామిత్రుడు చిరునవ్వుతో వారి ముంగుర్లు సవరిస్తూ, "కౌసల్యా సుప్రజా రామా - పూర్వాసంధ్యా ప్రవర్తతే ఉత్తిష్ఠ నరశార్దూల - కర్తవ్యం దైవమాహ్నికమ్". కౌసల్యా నందనా, రామా తొలి సందె అయ్యింది. నిత్యానుష్ఠానానికి సమయం మించిపోతుంది. లే నాయనా. ఇంక నిద్ర చాలించి మేలుకోవయ్యా నరపుంగవా' అంటూ మృదుమధుర వాక్కులతో మేలుకొలిపాడు.

రామలక్ష్మణులు ఉలికిపడి లేచారు. కాలకృత్యాలు తీర్చుకున్నారు. సరయూనదీ పుణ్యజలాలలో స్నానం చేశారు. గాయత్రీ జపం చేశారు. ప్రాతః కాలాహ్నికాలు పూర్తిచేసుకుని, ప్రయాణానికి సిద్ధమయ్యారు. విశ్వామిత్రుని వెంట సాగిపోయారు. అలా నడచి నడచి సరయూనది, గంగాజలాలలో సంగమించే ప్రాంతానికి చేరారు. అక్కడ ఒక పురాతనమైన ఆశ్రమం వారి కంటబడింది. 'గురువర్యా ఈ ఆశ్రమం ఎవరిది?' అని రాముడు కుతూహలంగా అడిగాడు.

విశ్వామిత్రుడు మందహాసంతో 'రాకుమారా, పార్వతీదేవిని వివాహమాడక ముందు, పరమశివుడు, తన ప్రమథగణాలతో, ఈ ఆశ్రమంలోనే తపస్సు చేశాడు. అపుడు మన్మథుడు దేవప్రేరితుడై దుర్బుద్ధితో శివునికి తపోభంగం చెయ్యాలని చూశాడు.

రౌద్రమూర్తియైన శివుడు, తన మూడవ కన్ను తెరచి, మన్మథుణ్ణి భస్మం చేశాడు. మన్మథుడు సర్వాంగాలూ భస్మమై అనంగుడయ్యాడు కనుక, ఈ దేశాన్ని అంగదేశము అంటారు. తర్వాతి కాలంలో శివుని అనుయాయులు ఇక్కడ తపస్సు చేస్తున్నారు' అని చెప్పి 'రామా, మనం ముందుగా ఈ పావన గంగానదిలో స్నానం చేసి జపహోమాదులు పూర్తి చేసుకుందాము. ఈ రాత్రి కిక్కడ గడిపి రేపు ఉదయం గంగానదిని దాటుదాము' అన్నాడు.

ఆ ఆశ్రమవాసులకి వారి రాక గురించి తెలిసింది. వారికి యథావిధిగా అతిథి మర్యాదలు చేశారు. ఆ రాత్రంతా విశ్వామిత్రుడు వారికి ఎన్నో కథలు చెబుతూ వారి మనస్సులు ఉల్లాసంగా వుండేలా చేశాడు. తర్వాత సుఖంగా నిద్రపోయారు.

మూడవరోజు తెల్లవారగానే, ప్రాతఃకాలాహ్నికాలు పూర్తిచేసుకుని, మళ్ళీ ప్రయాణమయ్యారు. గంగానదీ తీరంలో స్థాణ్వాశ్రమవాసులు, వారికో చక్కని నావను ఏర్పాటు చేశారు. నావలో ఎక్కి ఆశ్రమవాసులకి వీడ్కోలు చెప్పి

బయల్దేరారు. నావ నదీ మధ్యకి వెళ్ళేసరికి, ఒక ప్రవాహము, మరొక ప్రవాహంలో ఒరుసుకుపోయి, ఉవ్వెత్తు అలలు, ఎగిసి పడుతున్నాయి. ఆ ఒరవడిలో చెవులు బ్రద్దలయ్యేలా ఒక మహాధ్వని వినిపించింది వారికి. ఆ ధ్వని ఏమిటని శ్రీరాముడు, విశ్వామిత్రుని అడిగాడు.

'రామా ప్రశాంతంగా ప్రవహించే, గంగానదిలోకి, సరయూనది, ఉరవడితో వచ్చి పడుతూంది. అందుచేత ఈ మహాధ్వని పుట్టింది' అన్నాడు విశ్వామిత్రుడు.

ఆ సంగతి, వివరంగా చెప్తాను విను పూర్వం బ్రహ్మదేవుడు, కైలాసగిరి మీద, మనస్సులోనే సంకల్పించి, ఒక సరస్సుని సృష్టించాడు. అదే మానససరోవరము. ఆ సరస్సులోని నీరు పొంగి, పొర్లిపోయి సరయూనదిగా ప్రవహించింది. ఆ సరయూనదే మీ అయోధ్యానగరాన్ని చుట్టి ప్రవహించి, ఇక్కడికి వచ్చి గంగానదిలో కలుస్తోంది. మానస సరోవరంలో పుట్టింది కనుక సరయూనది పుణ్యనది అయింది. ఈ రెండు పుణ్యనదులకూ నమస్కారం చెయ్యండి' అన్నాడు మళ్ళీ.

రామలక్ష్మణులు భక్తిప్రపత్తులతో ఆ రెండు పుణ్యనదులకూ నమస్కారం చేశారు.

గంగానది దాటాక దక్షిణతీరం చేరి వారు ఒక భయంకరారణ్యంలో ప్రవేశించారు.

రాముడు విశ్వామిత్రుని చూసి 'మహాత్మా, నరసంచారంలేని ఈ కీకారణ్యం చాలా భయంకరంగా వుంది దీని వృత్తాంతం చెప్పండి' అన్నాడు.

'రామభద్రా, నిజానికి పూర్వం ఈ ప్రాంతమంతా ధనధాన్యసమృద్ధి అయిన రెండు సామ్రాజ్యాలు. ఒకటి మలదము, రెండవది కరూశము. ఈ దేశాలు రెండూ దేవతలు నిర్మించారు. అప్పట్లో ఇవి జానపదులతో కలకలలాడుతూ వుండేవి.

పూర్వమొకప్పుడు దేవేంద్రుడు వృత్రాసురుణ్ణి సంహరించాడు. అపుడాయనకి ఘోరమైన బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. విపరీతమైన ఆకలిబాధ పట్టుకుంది. అపుడు దేవతలు, ఋషులూ దేవేంద్రుణ్ణి ఇక్కడికి తీసుకువచ్చి, ఈ గంగానదిలో స్నానం చేయించారు. కడవల కొద్దీ గంగాజలాన్ని మంత్రపూతం చేసి, ఆయన తలమీద గుమ్మరించారు. అంతటితో ఆయన బ్రహ్మహత్యాపాతకం ప్రక్షాళనమై పోయింది. ఆకలి మాయమైపోయింది.

'ఈ ప్రాంతంలో నా మలము పోయింది. కనుక, మలదము అనీ, కరూశము (=ఆకలి)నశించింది కనుక, కరూశము అనీ, రెండుదేశాలు ప్రసిద్ధిచెందాలి' అని దేవేంద్రుడు దేవతల చేత రెండు దేశాలు నిర్మింపజేశాడు.

దేవేంద్రుని అనుగ్రహం వల్ల ఆ రెండుదేశాలు సస్యశ్యామలంగా, ధనధాన్య సమృద్ధిగా సర్వసంపన్నంగా వుండేవి.

ఆ సమయంలో సుకేతువు అనే యక్షుడు, సదాచార సంపన్నుడై, సంతానం కోసం గొప్ప తపస్సు చేశాడు. ఆతడి తపస్సుకి మెచ్చి బ్రహ్మ, వేయి ఏనుగుల బలం కలిగిన ఒక కుమార్తెను వానికి ప్రసాదించాడు. కాని పుత్రసంతానం ఇయ్యలేదు. ఆ పుత్రిక పేరే తాటక. చాలా అందమైనది. యౌవనవంతురాలు కాగానే వానికి సుందుడు అనే వరునితో వివాహం జరిగింది. ఆ దంపతులకి మారీచుడు పుట్టాడు. తల్లిలాగే మారీచుడు చాలా బలవంతుడు. కొంతకాలానికి అగస్త్య మహాముని శాపానికి గురిఅయి సుందుడు మరణించాడు.

ఆ కోపంతో తాటక చెలరేగిపోయింది. అపుడు అగస్త్యుడు కోపోద్రిక్తుడై 'తాటకా, నువ్వికపై వికృతాకారంతో, వికృతమైన ముఖంతో నరమాంసభక్షణ చేస్తూ మహారాక్షసిగా తిరుగు'అని శపించాడు. తాటకకి చెప్పలేని రోషము కలిగింది. ఆ కోపంతో మలద, కరూశ దేశాల్ని సర్వనాశనం చేసింది. ఇలా ఘోరారణ్యంగా మార్చేసింది. దాని పాలబడి ఈ ప్రాంతమంతా నిర్జనారణ్యం అయిపోయింది.

రామా, ఆ యక్షిణి దుష్టురాలు. మహాభయంకరురాలు. దానిని నువ్వు చంపాలి. స్త్రీ వధ పాపం అని ఆలోచించకు. అధర్మపరురాలు కనుక చంపినా తప్పులేదు. లోక కళ్యాణార్ధం ఆ తాటకను చంపి పుణ్యవంతుడవవు అన్నాడు.

అపుడు రాముడు, విశ్వామిత్రునికి నమస్కరించి 'స్వామీ నా తండ్రిగారు మీరేం చెబితే అదిచెయ్యమని ఆజ్ఞాపించారు. నా తండ్రి వాక్కు నాకు శిరోధార్యం. కనక తాటకని తప్పక సంహరిస్తాను. అంటూ విల్లు చేపట్టి ధనుష్టంకారం చేశాడు.

దిక్కులు పిక్కటిల్లేటట్లు, దశదిశలా మారుమ్రోగిన ఆ ధనుష్టంకారానికి, ఆ మహారణ్యంలోని ప్రాణికోటి యావత్తు గజగజలాడింది. అదిచూసి తాటక దిగ్భ్రాంతి చెందింది. క్రోధంతో ఆ శబ్దం వచ్చినవైపు పరుగులు తీసింది.

భీకరాకారంతో వస్తున్న ఆ తాటకని చూసి, రాముడు తమ్మునివైపు తిరిగి 'లక్ష్మణా ఆ తాటక వికృతాకారం చూశావా? దీనిని చూసిన సామాన్యులెవరైనా గుండె పగిలి చస్తారు. దీని నెదిరించటం అసాధ్యమే అయినా, ఆడది కదా అని జాలివేస్తోంది. దీనికాళ్ళు చేతులు విరిచేసి, ముక్కులు చెవులూ కోసేస్తే మూలపడి వుంటుంది' అంటుండగానే అది చెలరేగి, గర్జిస్తూ రామునిమీదకి ఉరికింది. విశ్వామిత్రుడు ఒక్కసారి హుంకరించి దానిని ఆపాడు. తాటక రోషంతో

విపరీతంగా దుమ్మురేపి ఆ ప్రాంతమంతా చీకటిమయం చేసింది. రామలక్ష్మణుల మీద రాళ్ళవాన కురిపించింది.

రాముడికి కోపం వచ్చింది. బాణాలు వేసి రాళ్ళు పడకుండా ఆపాడు. వెంటనే తాటక మాయని ఉపసంహరించి రామునిపై దూకింది. రాముడు రెండు బాణాలతో దాని రెండు చేతులు నరికివేసాడు. అది రొప్పుతూ కింద పడింది. వెంటనే లక్ష్మణుడు దాని ముక్కులు చెవులూ, కోసి పారేశాడు. అయినా అది కామరూపిణి కనుక అనేక రూపాలు ధరిస్తూ మాయమవుతూ మళ్ళీ రాళ్ళవాన కురిపించింది.

ఆ రాళ్ళమధ్య రామలక్ష్మణులు కూరుకుపోయారు. అపుడు విశ్వామిత్రుడు రామునితో 'రామా, ఆడది అన్న దాక్షిణ్యం ఇంక చాలించు. ఈ పాతకిని వెంటనే చంపెయ్యి'అన్నాడు.

రాముడు వెంటనే, శబ్దవేధి జ్ఞానంతో దాని ఉనికిని తెలుసుకుని, బాణ ప్రయోగం చేశాడు. వెంటనే తాటకి రాముని కెదురుగా దూకి, పిడుగులా మీదకి రాబోయింది. రాముడు గురిచూసి సూటిగా దానిరొమ్ము మీదికి బాణం వేశాడు. పెద్దపెట్టున బొబ్బలు పెడ్తూ, మేరు పర్వతంలా నేలకూలింది తాటక.

చచ్చిపడి వున్న ఆ భీకరాకారాన్ని దేవతలు, దేవేంద్రుడు ఆకాశంలోంచి చూశారు. భళి భళీ అని రాముని మెచ్చుకున్నారు. రామలక్ష్మణులపై పూలవాన కురిపించారు.

దేవేంద్రుడు విశ్వామిత్రునితో రహస్యంగా 'బ్రహ్మర్షీ, తాటక చచ్చినందుకు మేమంతా చాలా సంతోషిస్తున్నాము. నీదగ్గర వున్న భృశాశ్వుడి సంతతి అయిన శస్త్రాస్త్రాలన్నిటినీ, ఈ రామునికి ఉపదేశించు. ఈ బాలుని వలన ఒక మహత్తరమైన దేవకార్యము నెరవేరవలసి వుంది' అని చెప్పాడు. విశ్వామిత్రుడు సరే అన్నాడు.

అంతలో సంధ్యచీకట్లు అలుముకున్నాయి. విశ్వామిత్రుడు రాముణ్ణి దగ్గరగా తీసుకుని, శిరస్సు నాఘ్రాణించాడు. 'రామా ఈ రాత్రికి మనం ఇక్కడ పడుకుందాము. రేపు తెల్లవారాక మన ఆశ్రమానికి పోవచ్చు' అన్నాడు.

తాటక మరణంతో ఆ అరణ్యంలోని ఉపద్రవాలన్నీ తొలిగిపోయాయి. ఆ ప్రాంతమంతా నందనోద్యానంలా మారిపోయింది.

ఆ రాత్రి విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు అక్కడే విశ్రమించారు. మర్నాడుదయమే లేచి ప్రాతఃకాలానుష్ఠాను ముగించుకున్నారు. ఆపైన

విశ్వామిత్రుడు శ్రీరాముని వాత్సల్యంతో చూస్తూ 'నాయనా - నీ పరాక్రమానికి నేనెంతో సంతృప్తిపొందాను. నాకు తెల్సిన సర్వశస్త్రాస్త్రాలు నీకు చెప్పాను వీటి ప్రభావం వల్ల ముల్లోకాలూ నీకు లోబడి వుంటాయి.

దండ చక్రము, ధర్మచక్రము, కాలచక్రము, విష్ణుచక్రము, ఈ నాలుగు చక్రాయుధాలు. ఇవిగో ఐంద్రాస్త్రము. వజ్రాస్త్రము; శివదేవతాకము అనబడే శూలము, బ్రహ్మాస్త్రము, ఐహికాస్త్రము, బ్రహ్మశిరోనామకాస్త్రము, ఈ ఆరూ అమోఘమైన అస్త్రాలు. వీటిలో బ్రహ్మాస్త్రము చాలా శక్తియుక్తమైనది. శుష్కాశని, ఆర్ద్రాశని, అనే పిడుగు మంత్రాలివిగో తెలుసుకో, ఈ రెండు అతి దారుణంగా శత్రునాశనం చేస్తాయి.

పైనకాస్త్రము, నారాయణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, వాయువ్యాస్త్రము, హయశిరాస్త్రము, క్రౌంచాస్త్రము అనబడే ఈ ఆరు అస్త్రాలు తిరుగులేనివి. వీటితోబాటు విష్ణుశక్తి, రుద్రశక్తి అనే ఈ రెండు దివ్యశక్తులు కూడా ఇస్తున్నాను. స్వీకరించు. ఈ ఇరవై రకాలైన శక్తులు నిరంతరం నీ ఆధీనంలో వుంటాయి.

అంతేగాక రాక్షసులు ధరించే, కంకాళము, కపాలము అనే రెండు ముసలాలున్నాయి ఇవి అభేద్యములైనవి. వైద్యాధర అస్త్రము, మానవాస్త్రము, ఇవి రెండూ దేవసంబంధమైన శక్తులు. ఇదిగో ఈ స్వపాస్త్రాన్ని చూడు. దీనిని ప్రయోగిస్తే శత్రువులకి నిద్రవస్తుంది. మైకం కమ్మి నిద్రలోకి జారుకుని శత్రుసైనికులు అచేతనులైపోతారు. ఇవిగో ప్రశమనాస్త్రము, సౌరాస్త్రము, దర్పణాస్త్రము, శోషణాస్త్రము, మోహనాస్త్రము, సంతాపాస్త్రము, విలాపాస్త్రము, మదనాస్త్రము, తామసాస్త్రము, సౌమనము, సంవర్ధనము, దుర్ధర్షము, మౌసలము సత్యము, మాయాధరము, తేజఃప్రభము, సౌమ్యము, శిశిరము, సుదామనము, దారుణము, శీతేషువు, అనబడే ఈ అస్త్రాలు చాలా విలక్షణమైనవి. మోదకి, శిఖరి అనే అమోఘమైన రెండు గదలివిగో, ధర్మపాశము, కాలపాశము, వారుణపాశము అనబడే పాశములు ఇవిగో. మరో విలక్షణమైన గంధర్వాస్త్రము ఇదిగో రామా, ఈ అస్త్రాలన్నీ కూడా, ఇచ్ఛాధీనరూపములు. చాలా శక్తిసంపన్నములు. వీటన్నిటినీ ఇపుడే నీకు ఉపదేశిస్తాను అని విశ్వామిత్రుడు శుచి అయి, తూర్పుదిక్కుగా నిలబడి, అస్త్రమంత్ర సమూహం యావత్తు శ్రీరామునికి ఉపదేశించాడు. ఆ తర్వాత అంజలిబద్ధుడై జపము చేసి, ఆయాదేవతల్ని ఆహ్వానించి, రామునికి స్వాధీనం చేశాడు.

వెంటనే ఆ దేవతాగణాలంతా వచ్చి రాముని ముందు నిలబడ్డారు. అతి వినయంగా రామునికి వందనం చేసి, 'శ్రీరామప్రభూ, ఇకనించీ మేమంతా నీ

కింకరులము'అన్నారు. రాముడు వారందర్నీ చేతితో తట్టి, 'మీరంతా నామనస్సు తెలుసుకుని మసులుకోండి అవసరమైనపుడు పిలుస్తాను. ప్రస్తుతం మీ స్థానానికి వెళ్ళండి' అని పంపేశాడు.

అపుడు విశ్వామిత్రుడు చేసిన సహాయానికి కృతజ్ఞతా సూచకంగా రాముడు ఆయన పాదాలకి నమస్కరించి, 'స్వామీ, తాము సాక్షాత్తు భగవత్స్వరూపులు. ఇంతటి మహిమ గల దివ్యాస్త్రాల్ని నాకనుగ్రహించారు. దయయుంచి, వీటికి ఉపసంహార మంత్రాలు కూడా ఉపదేశించండి' అని ప్రార్థించాడు.

విశ్వామిత్రుడు ప్రసన్నుడై, 'రామా! సత్యవంతమూ, సత్యకీర్తి దృష్టమూ, రభసము, ప్రతిహారిత, పరాఙ్ముఖమూ, లక్షాక్షము, విషయమూ, దృఢలాభము, సునాభమూ, దశాక్షమూ, శతవక్త్రమూ, దశవర్షము, శతోదరము, సునాభకమూ, జ్యోతిషమూ, కృశనమూ, నైరాశ్యమూ, విమలము, యౌగము, ధనమూ, హరిద్రమూ, యౌగంధరమూ, దైత్యమూ, ప్రశమనమూ, సార్చిర్మాలినీ, ధృతమాలినీ, వృత్తిమంతమూ, రుతరము, పిత్సౌమనము, విధూతము, సుకరమూ, కరవికరమూ, ధనమూ, ధాన్యమూ, కామరూపము, కామరుచీ, మోహము, ఆవరణమూ, జృంభకమూ, సర్వనాభమూ, సంతానమూ, వీరణమూ అనేవి భృశాశ్వుడి పుత్రులు. ఇవికూడా ఇచ్ఛాధీనరూపాలే వీటిని కూడా నీకు దానము చేస్తున్నాను. అంటూ ఆయా ఉపసంహారణ మంత్రాలు కూడా వుపదేశించాడు. రాముడు తూర్పువైపు తిరిగి శుచియై అశస్త్రాస్త్రాల్ని స్వీకరించి, వాటి ఉపసంహారకములు కూడా అభ్యసించాడు. శ్రద్ధాభక్తులతో ఆ మంత్రాల్ని మననం చేసి జపించాడు.

అపుడా మంత్రాధిదేవతలు దివ్యమైన తేజస్సుతో రామునిముందు సాక్షాత్కరించారు. వారిలో కొందరు ఎఱ్ఱని నిప్పుకణికలలా వున్నారు. కొందరు పొగచూరినట్లున్నారు. మరికొందరు సూర్యచంద్రుల లాంటి తేజస్సుతో వున్నారు. అందరూ నమ్రతాపూర్వకంగా నమస్కరించారు. 'రామా, మమ్మల్ని ఎందుకు స్మరించావు? మా కర్తవ్యం ఏమిటి?' అని అడిగారు.

అపుడు రాముడు ప్రసన్నవదనంతో ఇలా అన్నాడు. 'ఓ మంత్రాధి దేవతలారా, మంత్రోపదేశవేళ పునశ్చరణ చేశానిప్పుడు. ఇలాగే నేనెప్పుడు మిమ్మల్ని స్మరిస్తే అపుడు వచ్చి నాకు సాయం చెయ్యండి. ఇపుడు మీమీ స్థానాలకి వెళ్ళిపోండి' అని రాముడనగానే ఆ దేవతలు మాయమైపోయారు. ఆ తర్వాత విశ్వామిత్రుని వెంబడి, రామలక్ష్మణులు మళ్ళీ ప్రయాణం సాగించారు.

అలా చాలాదూరం సాగిపోయి, ఒక పర్వత ప్రదేశం చేరుకున్నారు. ఆ ప్రాంతంలో వారికి ఒక అందమైన ఉద్యానవనం కనిపించింది. దానినిచూసి రాముడు విశ్వామిత్రునితో 'స్వామీ, ఒళ్ళు జలదరించే ఘోరారణ్యము దాటి వచ్చాము. దానికి భిన్నంగా ఇక్కడ, మనస్సుకు ఆహ్లాదము కలిగించే ఈ ఉద్యానవనం కన్నుల పండుగుగా వుంది. చూడగా ఇది పుణ్యాశ్రమంలా వుంది. ఇది ఎవరిదో వివరించగలరా' అన్నాడు.

రాముని ప్రశ్న విన్న విశ్వామిత్రునికి ఆనందంతో పులకింత కలిగింది. 'రామా దేవదేవుడైన మహావిష్ణువు యోగసిద్ధికోసం ఇక్కడ ఎన్నోవేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ సమయంలో బలిచక్రవర్తి దేవేంద్రునిపై దండెత్తి జయించి, త్రిలోకాధిపతి అయ్యాడు. ఆ తర్వాత బలిచక్రవర్తి ఒక మహాయాగము ప్రారంభించాడు.

అపుడు దేవతలు దిగ్భ్రాంతులై అగ్నిదేవుణ్ణి వెంటబెట్టుకుని, తపస్సమాధిలో వున్న మహావిష్ణువు దగ్గరకి వచ్చారు. చేతులు జోడించి ముక్తకంఠంతో 'ప్రభూ, విరోచనుని కుమారుడైన బలిచక్రవర్తి ఒక ఉత్తమమైన యాగం చెయ్యబోతున్నాడు.

ఆ సందర్భంగా ఎవరు ఏం అడిగినా లేదనకుండా దానం చేస్తాడట. కనుక మీరు మాయందు దయయుంచి, వామనమూర్తిగా అవతరించి, వెళ్ళి మూడులోకాలు దానంగా ఇమ్మని, బలిచక్రవర్తిని యాచించి, మళ్ళీ దేవతలకి పట్టం కట్టవలసిందిగా ప్రార్థిస్తున్నాము' అని ప్రార్థించారు.

అదే సమయంలో మహాతేజశ్శాలియైన కశ్యపప్రజాపతి, అదితి, కలిసి విష్ణుమూర్తి గురించి ఘోరమైన తపస్సు చేయసాగారు.

వారి తపస్సుకు మెచ్చి విష్ణుమూర్తి వారిముందు ప్రత్యక్షమై 'ఏం వరం కావాలని' అడిగాడు. కశ్యపుడు బ్రహ్మానందభరితుడై 'పురుషోత్తమా, దేవతలంతా శోకార్తులై ఇపుడే మిమ్మల్ని శరణుకోరారు కదా. నువ్వు మాయందు అనుగ్రహంతో అదితిగర్భాన దేవేంద్రునికి తమ్ముడిగా జన్మించి, రాక్షస నిర్మూలనము చేసి దేవతల్ని రక్షించాలి' అని వరం కోరాడు.

కశ్యపుని కోరిక మేరకి శ్రీహరి వామనమూర్తిగా అదితి గర్భాన జన్మించి, వటువుగా బలి చక్రవర్తి దగ్గరకి వెళ్ళి, మూడు అడుగుల నేల దానమిమ్మని కోరి, తన మాయోపాయముతో, మూడు లోకాలమీదా మూడు పాదాలు మోపి, దానంగా పరిగ్రహించాడు. బలిచక్రవర్తిని బంధించి, ముల్లోకాలనీ మళ్ళీ ఇంద్రునికి పట్టం కట్టాడు. ఆ తర్వాత కూడా వామనమూర్తి ఇక్కడ నివసించాడు. కశ్యపుని తపస్సు సిద్ధించటం వల్ల ఇది సిద్ధాశ్రమంగా పిలవబడుతుంది.

నేను కూడా నా నివాసము ఇక్కడే ఏర్పాటు చేసుకున్నాను. కనుక ఇదే మన ఆశ్రమం. ఇక్కడే నువ్వు ఆ రాక్షసుల్ని సంహరించాలి అన్నాడు.

అంతలో సిద్ధాశ్రమంలో నివసించే తాపసులంతా పరుగు పరుగున వారిదగ్గరకి వచ్చారు. అర్ఘ్యపాద్యాదులిచ్చి వారిని సత్కరించారు.

రామలక్ష్మణులు అలసటతీర్చుకున్నారు. తర్వాత విశ్వామిత్రునితో బ్రహ్మర్షీ, తమరు ఈ రోజే యజ్ఞదీక్ష వహించండి అన్నారు. వారి మాటలు విన్న విశ్వామిత్రుడు చాలా సంతోషంగా యజ్ఞదీక్ష తీసుకున్నాడు. రాత్రంతా రామలక్ష్మణులు సావధాన చిత్తులై, జాగరణ చేశారు. తెల్లారింది. వారిద్దరూ ప్రాతః కాలావశిష్టాలు పూర్తిచేసుకుని, ప్రాతః సంధ్యవార్చి గాయత్రీ మంత్రం జపించి, యజ్ఞవాటికలో ప్రవేశించారు. విశ్వామిత్రుడు యజ్ఞదీక్షలో వున్నాడు.

అందుకని వారు ప్రక్కనే వున్న తాపసులను చూసి 'స్వామీ, రాక్షసులు ఎపుడు వస్తారు? మేము వారికోసం ఎక్కడ కనిపెట్టుకుని వుండాలి?' అని అడిగారు.

అపుడు వారు రామలక్ష్మణుల వినయసంపదకి ఆశ్చర్యపడి, 'రాకుమారులారా, వారెపుడైనా రావచ్చు ఈరోజునుంచి ఆరు రోజులు మీరు అప్రమత్తులై ప్రతిక్షణం కనిపెట్టి చూస్తూ వుండాలి అన్నారు'.

రామలక్ష్మణులు ధనుర్ధారులై ఐదురోజులు అహోరాత్రులు విశ్వామిత్రుని, తపోవనాన్నీ, యజ్ఞవాటికనీ, కాపలాకాశారు.

ఆరవరోజు వచ్చింది. హోమం శాస్త్రీయంగా జరుగుతోంది. రాముడు తన అలసటపైకి కనిపించనివ్వకుండా తమ్మునివైపు చూస్తూ 'లక్ష్మణా ఈ ఒక్కరోజూ కూడా, ఏకాగ్రచిత్తముతో వుంటే మన కర్తవ్యం పూర్తవుతుంది' అని చెప్తుండగానే, ఆకాశం బ్రద్దలైపోతుందా అన్నంత భయంకరమైన ధ్వని వినిపించింది యజ్ఞవాటిక అంతటా మంటలు చెలరేగాయి. ఆకాశమంతా మాయమబ్బులతో కప్పేసి మారీచ సుబాహువులు వచ్చారు. ఆశ్రమమంతా గాఢాంధకారమైపోయింది.

అపుడా మాయావులిద్దరూ, వెల్లువగా రక్తం అగ్నిహోత్రంలో పొయ్యసాగారు. అగ్నిహోత్రం వెలుగులో రాముడు ఆ రాక్షసుల్ని చూశాడు. క్రోధంతో మండిపడ్డాడు. తత్క్షణం అత్యంత ప్రభావము కలిగిన మానవాస్త్రాన్ని తీసి, మారీచుడి రొమ్ములమీద వదిలాడు. మరుక్షణం ఆగ్నేయాస్త్రం తీసి సుబాహువుపై ప్రయోగించాడు.

ఆ దెబ్బకి మారీచుడు ఎగిరి, నూరుయోజనాలవతల సముద్రంలో పడ్డాడు. సుబాహువు మాత్రం వెంటనే ప్రాణాలు వదిలాడు. ఇదిచూసి వారి అనుచరులు ప్రాణాలు దక్కించుకుని పారిపోయారు.

వారివంక చూస్తూ రాముడు లక్ష్మణునితో 'లక్ష్మణా, ఈ రాక్షసులు చాలా క్రూరులు. వాళ్ళని వదిలిపెడ్తే చాలా ప్రమాదం' అంటూ పారిపోతున్న వాళ్ళమీద దివ్యమైన, వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి, వారందర్నీ సంహరించాడు.

శ్రీరాముని పరాక్రమం చూసి అక్కడి తాపసులంతా, ఆశ్చర్యచకితులైపోయారు. భక్తిశ్రద్ధలతో రామలక్ష్మణుల్ని పూజించారు. ఆ తర్వాత ఆశ్రమమంతటా ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

విశ్వామిత్రుడి యాగం, నిర్విఘ్నంగా పూర్తయ్యింది. యజ్ఞదీక్ష విరమించి లేచిన విశ్వామిత్రుడు, బ్రహ్మానందంతో శ్రీరాముని గాఢంగా కౌగిలించుకున్నాడు.

'యశస్వీ, నీ తండ్రి, నిన్ను పంపినందుకు, నా పని నెరవేర్చావు. సిద్ధాశ్రమము, సార్థకనామధేయకమైంది' అని మెచ్చుకున్నాడు. కృతకృత్యులైన రామలక్ష్మణులు ఆ రాత్రి ఆశ్రమంలో ఉల్లాసంగా గడిపారు. తర్వాత నిశ్చింతగా నిద్రపోయారు. ఆరురోజులనుంచీ కర్తవ్య నిర్వహణలో అలసిపోయారేమో, సుఖంగా నిద్రపట్టింది.

తూర్పుతెల్లవారగానే అంతా నిద్రలేచారు. రామలక్ష్మణులు వారి కార్యక్రమాలు పూర్తిచేసుకుని విశ్వామిత్రమహర్షిని చూడబోయారు.

విశ్వామిత్రుడు చిరునవ్వుతో వారికి స్వాగతం చెప్పాడు రామలక్ష్మణులు ఆయనకి సాష్టాంగ నమస్కారం చేశారు. 'బ్రహ్మర్షీ, ఈ సేవకులు చెయ్యవలసిన పనులు, ఇంకేమైనా వుంటే చెప్పండి' అన్నారు వినయంగా. ఆ వినయ సంపత్తికి విశ్వామిత్రుడు ముగ్ధుడు అయ్యాడు. అంతలో ఒక వృద్ధుడైన మునీశ్వరుడు లేచి 'రామా, మిథిలానగరాన్ని ఏలుతున్న జనకమహారాజు, ధర్మనిష్ఠా గరిష్ఠుడు. ఒక గొప్ప యాగము చేస్తున్నాడు మేమంతా ఆ యాగం చూడటానికి వెళ్దామనుకుంటున్నాము. ఆయన దగ్గర అమోఘమైన శివధనుస్సు వుంది.

జనక మహారాజు పూర్వజుడైన, దేవరాతుడనే మహారాజు, దేవతల్ని మెప్పించి దానిని సంపాదించాడట. దేవ, దానవ, గరుడ, గంధర్వ, యక్షులలో ఎవ్వరైనా సరే దాన్ని ఎక్కుపెట్టలేరు సరికదా, కదపనైనా కదపలేరని చెప్పుకుంటారు. తరతరాలుగా వస్తున్న ఆ ధనూరత్నాన్ని రత్నపేటికలో వుంచి వారు ఆరాధిస్తున్నారట. మీరుకూడా మావెంట వస్తే ఆ అద్భుతమైన ధనుస్సుని చూడవచ్చు' అన్నాడు.

విశ్వామిత్రుడు కూడా ఆయన చెప్పింది బాగుందని అన్నాడు. వెంటనే వారంతా మిథిలానగరానికి ప్రయాణమయ్యారు. విశ్వామిత్రుడు వనదేవతల్ని ఆరాధించి, 'వనదేవతలారా, ఈ రామలక్ష్మణుల రక్షణవల్ల నా కార్యసిద్ధి

అయ్యింది. నేనింక ఈ సిద్ధాశ్రమాన్ని వదిలి హిమాలయ పర్వత ప్రాంతాలకి వెళ్ళిపోతున్నాను. మీరంతా నాకు అనుమతినివ్వండి' అని వీడ్కోలు చెప్పాడు.

సిద్ధాశ్రమానికి ప్రదక్షిణం చేసి బయల్దేరబోతూ వుండగా, వన్యమృగాలూ, పక్షులూ, ఆయన్ని అనుసరించాయి. విశ్వామిత్రుడు ఆప్యాయంగా వాటిని అనునయించి వెనక్కి పంపేశాడు. విశ్వామిత్రుని వెంట, రామలక్ష్మణులూ మిగిలిన ఆశ్రమవాసులు బయల్దేరారు. వారివెంట నూరుబండ్లమీద, అగ్నిహోత్ర సంభారాలు, ఆహార పదార్థాలు వేసుకుని, ముని సమూహం తరలిపోయింది.

అలా ప్రయాణం చేస్తూ వారు సూర్యాస్తమయ సమయానికి 'శోణాకులము' అనే ప్రదేశం చేరుకున్నారు. అక్కడ ప్రవహిస్తున్న శోణానదిలో వారంతా స్నానాలు చేసి, జప, హోమాదులు పూర్తిచేసుకుని, ఆ రాత్రి అక్కడ బసచేశారు.

పడకలు ఏర్పాటుచేసుకున్నాక, అందరూ విశ్వామిత్రుని చుట్టూ చేరి కూర్చున్నారు. ఆ ప్రదేశం శోభని చూసి ఆనందిస్తూ, రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఆ ప్రాంతాన్ని గురించిన, వృత్తాంతం చెప్పమని అడిగారు. అపుడా ప్రాంతం గురించి విశ్వామిత్రుడిలా వివరించాడు.

'రాకుమారులారా', పూర్వము బ్రహ్మమానసపుత్రుడైన కుశుడు, అనే తాపసి బ్రహ్మలోకం నుంచి భూలోకానికి వచ్చాడు. విదర్భరాజు కుమార్తెని వివాహమాడాడు. ఆ దంపతులకి, కుశాంబుడూ, కుశనాభుడూ ఆధూర్తరజసుడూ, వసువూ అని నల్గురు కుమారులు కలిగారు. వారు యుక్తవయస్కులు కాగానే, తన రాజ్యాన్ని నాలుగు భాగాలుగా చేసి నలుగురికీ పట్టం కట్టి, ధర్మం తప్పకుండా ఏలుకోండని ఉపదేశించాడు.

వారిలో కుశాంబుడు, కౌశాంబీ నగరాన్ని నిర్మించుకుని దానిని, రాజధానిగా చేసుకుని, తన భూభాగాన్ని పరిపాలించుకున్నాడు. అలాగే కుశనాభుడు 'మహోదయము' అధూర్తరజసుడు, 'ధర్మారణ్యము' వసువు 'గిరివ్రజము' అనే పట్టణాలను నిర్మించుకుని, రాజధానులుగా చేసుకుని, తమ తమ రాజ్యాల్ని పరిపాలించుకున్నారు.

మనమిప్పుడు వున్న ప్రదేశము వసువు అనేవానియొక్క రాజ్యములోనిది. ఈ దేశము చుట్టూ ఐదు కొండలున్నాయి. కనకనే ఈ ప్రాంతాన్ని 'గిరి వ్రజము' అంటారు. ఈ శోణానదికి సుమాగధి అనే ఇంకోపేరు కూడా వుంది. కనుక ఈ దేశాన్ని 'మగధ దేశం' అంటారు. ఇంకో విశేషమేమిటంటే, ఈ శోణానది తూర్పునుంచి పడమటికి ప్రవహిస్తుంది.

సరే అదలావుంచు. కుశుడి కుమారులైన నల్గురూ తమ తమ రాజ్యాలు పరిపాలించుకుంటూ వుండగా, ఆయన రెండో కుమారుడైన కుశనాభుడు, ఘృతాచి, అనే అప్సరస్త్రీని వివాహం చేసుకున్నాడు. వారికి నూరుమంది ఆడపిల్లలు పుట్టారు. వారంతా చాలా అందమైనవారు. పెరిగి పెద్దవారై యౌవనదశలో అడుగుపెట్టారు. ఒకనాడు వారంతా చక్కగా అలంకరించుకుని ఉద్యానవనంలో విహారానికి వెళ్ళారు. ఉల్లాసంగా ఆడిపాడుతున్న వారిని చూసి వాయుదేవుడు సమ్మోహితుడైనాడు.

మోహపారవశ్యంతో, వారిని సమీపించి 'కన్యారత్నాల్లారా, మీ మీద నాకు అనురాగం కలిగింది. నన్ను పెళ్ళి చేసుకోండి. మీకు దైవత్వం సిద్ధిస్తుంది' అన్నాడు.

వారంతా వాయుదేవుణ్ణి చూసి పరిహాసంగా నవ్వారు. 'వాయుదేవా, ఉచ్ఛనీచాలు లేకుండా చరించే నీకు, మా మీద అనురాగం కలిగిందా? మా జోలికి రాక, నీదారిన నువ్వు వెళ్ళు. మా తండ్రి కుశనాభుడి గురించి నీకు తెలియదు. ఆయన తల్చుకుంటే నీతోబాటు, ఆ దేవేంద్రుణ్ణి కూడా పదభ్రష్టుల్ని చెయ్యగలడు. మాకు మా తండ్రే దైవము. ఆయన ఎవర్ని మాకు వరులుగా నిర్ణయిస్తే వారినే మేము వివాహం చేసుకుంటాము' అన్నారు.

వాళ్ళమాటలు విన్న వాయుదేవునికి కోపం వచ్చింది. ఏ మాత్రం ఆలోచించకుండా వాళ్ళ అవయవాలన్నీ తాకి తృష్ట తీర్చుకున్నాడు. అపుడు వారు కురూపులు,కుబ్జలూ అయిపోయారు. ఏడుస్తూ వెళ్ళి తండ్రి పాదాలమీద పడ్డారు. వారి దుస్థితిని చూసి, కుశనాభుడు ఖిన్నుడైపోయాడు.

'ఏమిటీ దారుణం! మీకు కీడు తలపెట్టిన ఆ ధూర్తుడెవరు?' అని అడిగాడు.

వారు ఏడుస్తూ, కామాంధుడైన, వాయుదేవుడు మాకీ దుర్గతి కలిగించాడు అంటూ జరిగిన సంగతంతా వివరంగా వారు తండ్రికి చెప్పారు.

కుశనాభుడు, వారిని ఓదార్చి, బుజ్జగించాడు. 'చిన్నారులారా, క్షమాగుణాన్ని మించిన ధర్మం లేదు కనుక ఓరిమి వహించండి' అని పంపేశాడు.

మంత్రులందర్ని సంప్రదించి కూతుళ్ళకి పెళ్ళిప్రయత్నాలు మొదలుపెట్టాడు.

ఆ కాలములో, చూళి అనే సదాచార సంపన్నుడికి, సోమద అనే గంధర్వాంగనయందు బ్రహ్మదత్తుడు అనే ఒక కుమారుడు పుట్టాడు.

అతడు కాంపిల్య నగరానికి రాజు అయ్యాడు. కుశనాభుడు తన కుమార్తెలందర్నీ ఆ బ్రహ్మదత్తుడికి ఇచ్చి వివాహం చేశాడు. బ్రహ్మదత్తుని చెయ్యి

తగలగానే, ఆ కన్యలందరికీ కుబ్జరూపం పోయి, మామూలు రూపం వచ్చేసింది. కుశనాభుడు చాలా సంతోషించి పురోహితులతో కూడా, తన కూతుళ్ళని కాంపిల్యనగరానికి పంపాడు. అపురూప సౌందర్యవతులైన కోడళ్ళని చూసుకుని సోమద చాలా సంతోషించింది

కూతుళ్ళనందర్నీ అత్తవారింటికి పంపేశాక, తనకి కొడుకులు లేకపోయారే అన్న దిగులు పట్టుకుంది కుశనాభునికి. అపుడు పుత్ర సంతానం కోసం పుత్రకామేష్టి చేశాడు అతడు. స్వర్గలోకం నుంచి, ఆతడి తండ్రి వచ్చి పుత్ర సంతానం కలగాలని ఆశీర్వదించాడు. కొంతకాలానికి కుశనాభుడికి, గాధి అనే కుమారుడు కలిగాడు.

'రామా, ఆ గాధి మా తండ్రి. కుశుడి వంశంలో పుట్టాను, కనుక నన్ను కౌశికుడు అని కూడా అంటారు. నాకు సత్యవతి అని ఒక అక్క కూడా వుంది. ఆమె భర్త రుచీకుడు. ఆదంపతులిద్దరూ ధర్మవర్తనులై, బొందెతో కూడా స్వర్గానికి వెళ్ళారు. తదనంతర కాలంలో ఆమె కౌశికీ నదిగా ప్రవహించింది. నా సోదరిమీద అభిమానంతో నేను ఆ కౌశికీ నదీతీరాన నా ఆశ్రమం నిర్మించుకున్నాను. ఒక మహాయజ్ఞం తలపెట్టి మధ్యకాలంలో సిద్ధాశ్రమానికి వచ్చాను. యజ్ఞం పూర్తయింది కనక మళ్ళీ నా ఆశ్రమానికి వెళ్ళిపోతాను'.

అంటూ ఆ ప్రదేశం గురించి చెబుతూ ప్రసంగవశాత్తూ తన వంశచరిత్ర కూడా చెప్పాడు. అంతలో సందెచీకట్లు అలముకున్నాయి. ఆ రాత్రికి అక్కడ మజిలీచేశారు వారు.

మార్గాయాసం వల్ల, రామలక్ష్మణులు వేకువనే నిద్రలేవలేకపోయారు. విశ్వామిత్రుడు ఆ చిన్నారి రాకుమారులకి, మేలుకొలుపులు పాడాడు. రామలక్ష్మణులు దిగ్గున లేచారు. కార్యక్రమాలన్నీ తొందరగా పూర్తిచేసుకున్నారు. వారంతా మళ్ళీ ప్రయాణం సాగించారు.

శోణానదిలో నీళ్ళు అంత లోతుగా లేకపోవటం వల్ల వారంతా ఆ నదీ జలాలలో నడిచి ఆవలితీరం చేరారు. మిట్ట మధ్యాహ్నానికి జాహ్నవీ నదీతీరం చేరారు. చాలాదూరం నడవటంవల్ల ఆ నదీజలాల మీదనుంచి వచ్చె చల్లనిగాలికి వారి శరీరాలు సేదతీరినట్లు అనిపించాయి. అక్కడ మజిలీ చేసి, నదిలో స్నానాలు చేసి, పితృతర్పణాలు వదిలి, అగ్నిహోత్రాలు వ్రేల్చి, అమృతం లాంటి ఆహవిస్సు భుజించారు. బడలిక తీరేందుకు అక్కడే చెట్లనీడల్లో విశ్రమించారు.

విశ్వామిత్రుని చుట్టూ చేరి వారంతా ఇష్టాగోష్ఠిలో మునిగిపోయారు. రాముడు

విశ్వామిత్రుని దగ్గరగా జరిగి, "మహర్షి గంగానదిని 'త్రిపథగామిని' అంటారు కదా, ఆ పేరెలా వచ్చిందో తెలుసుకోవాలని వుంది" అన్నాడు. అపుడాయన ఇలా జవాబిచ్చాడు.

'కుమారా, హిమవంతుడు అని ఒక పర్వతరాజు వున్నాడు. వెండి, బంగారు మొదలైన ధాతువులన్నీ ఆయన సొంతం. ఆయన భార్య, మనోరమ చాలా చక్కనిది. వారి కత్యంత సౌందర్యవతులైన ఉమ, గంగ అని ఇద్దరు కుమార్తెలున్నారు. వారు పెరిగి పెద్దవారయ్యాక దేవతలు స్వయంగా వచ్చి, హిమవంతుని యాచించి, గంగని తమలోకానికి తీసుకెళ్ళారు.

రెండవ కుమార్తె 'ఉమ' పరమేశ్వరుని కోరి ఘోరమైన తపస్సు చేసింది. ఆమె తపస్సు ఫలించి, ఈశ్వరునితో ఆమె వివాహం జరిగింది. తర్వాత కాలంలో ఆ ఉమాదేవే పార్వతిగా మారి ముల్లోకాలకూ పూజ్యురాలైంది.

దేవలోకంలో చేరిన గంగ దివ్యవాహిని అయింది. అక్కడ అందరి పాపాలూ ప్రక్షాళనం చేసింది. ఆగంగానదియే ఇపుడు మనం చూస్తున్న ఈ జాహ్నవి' అని చెప్పి విశ్వామిత్రుడు ఊరుకున్నాడు.

అపుడు రాముడు ఆసక్తిగా, 'ఆర్యా, లోకపావని అయిన గంగ, మూడు పాయలుగా ఎలా చీలింది? ఏ సత్కార్యాలవల్ల గంగానది పరమపావనిగా ప్రసిద్ధి చెందింది? ఆ సంగతి కూడా చెప్పండి' అని అడిగాడు.

విశ్వామిత్రుడు, క్షణంసేపు ఊపిరి పీల్చుకుని, మళ్ళీ మొదలుపెట్టాడు.

'రామా పార్వతీ పరమేశ్వరులు, ఒకరికోసం ఒకరు తీవ్రమైన తపస్సు చేసి, వరించుకుని, వివాహం చేసుకున్నారు. వారిద్దరూ మోహపరవశులై రతికేళిలో నిమగ్నులయ్యారు. చాలాకాలం గడిచిపోయింది. వారికి పుత్రుణ్ణి కనాలనే బలవత్తరమైన కోరిక కలిగింది. కాని ఎంతకాలానికీ ఉమాదేవికి గర్భం రాలేదు.

అంతలో దేవతలంతా బ్రహ్మదేవుని దగ్గర చేరారు. ఉమామహేశ్వరులకి పుత్రుడు జన్మిస్తే అతడెంత బలమైనవాడుగా పుడతాడో, అంతటి తేజోమూర్తిని ముల్లోకాలూ భరించగలవో, లేదో, అని ఆయనతో తర్కించటం మొదలుపెట్టారు.

చివరికి పరుగుపరుగున వెళ్ళి ఈశ్వరునితో 'దేవా - దేవదేవా - దేవతలంతా ఏకమై వేడుకుంటున్నాము. మీరు లోకసంగ్రహకర్తలు. మీలోని అమోఘమైన తేజస్సు స్ఖలనం కానివ్వకండి. అది మీలోనే ఇముడ్చుకుని, ముల్లోకాలకూ మేలు చెయ్యండి'అని ప్రార్థించారు.

సరిగ్గా అదే సమయంలో ఉమాదేవి గర్భధారణ స్థితికి వచ్చింది. ఈశ్వర రేతస్సు పతనం కాబోతోంది. కాని ఈశ్వరుడు దేవతల మాటపై పార్వతి నించి పక్కకి తొలగి 'దేవతలారా, మీ శ్రేయస్సు కోసం మీరు చెప్పినట్లే వింటాను. కాని ఇపుడు పతనం కాబోతున్న ఈ నా తేజాన్ని ధరించగలవారెవ్వరు? అని అడిగాడు.

'మహాదేవా, ఆ తేజాన్ని భూదేవి వహిస్తుంది. కనక భూమిపై వదిలిపెట్టండి' అన్నారు.

శైలకుమారికి చెప్పరాని కోపం వచ్చింది. చింతనిప్పుల్లాంటి కళ్ళతో, దేవతలవైపు తీవ్రంగా చూస్తూ, ' మా పుత్రోత్సాహం చెడగొట్టి తీరని ద్రోహం చేశారు. ఇకమీదట మీ వలన, మీభార్యలకు పిల్లలు కలగకుండా శపిస్తున్నాను' అని దేవతల్ని ఘోరంగా శపించి, భూమాతవైపు తిరిగి, 'ధరణీ, ఎంత సిగ్గులేనిదానవై పోయావు? ఇవాల్టినుంచీ నువ్వు విపర్యస్త ప్రకృతిగా మారిపో అనేకమందికి భార్యవై, ఊషరరత్నాది నానావిధరూపిణివి అయిపో. ఎప్పటికీ పుత్రసౌఖ్యం లేకుండా, ఏడుస్తూ పడివుండు' అని శపించింది.

ఈలోపల భూమిమీద జారిపడ్డ ఈశ్వరరేతస్సు భూమినిండా వ్యాపించి, అన్నిదిక్కులా కప్పేయ్య సాగింది. దేవతలు భయంతో వణికిపోయారు. ఆ తేజాన్ని దహించవలసిందిగా అగ్నిదేవుణ్ణి ప్రార్థించారు.

అగ్నిదేవుడు వెంటనే ఆ తేజాన్ని దహింపజేశాడు. అలా కాలిన తేజస్సు, శ్వేత పర్వతంగా మారింది. కాలక్రమేణా ఆ పర్వతమంతా రెల్లుపొదలు పెరిగాయి.

తర్వాత కాలంలో ఆరెల్లు పొదలలోనే కార్తికేయుడు పుట్టాడు. దేవతలు సిగ్గుతో తలదించుకున్నారు.

పార్వతీపరమేశ్వరులు ఆ ప్రాంతం వదిలి, హిమాలయాలలోని పడమటి దిక్కుకు వెళ్ళి అక్కడ మళ్ళీ తపస్సు మొదలుపెట్టారు.

ఇపుడు గంగాప్రాభవాన్ని, కార్తికేయజన్మాన్ని చెప్తాను శ్రద్ధగా వినండి.

ఎపుడైతే పార్వతీపరమేశ్వరులు తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయారో అపుడు దేవతలకి సేనా నాయకుడు కావలసి వచ్చాడు. వారంతా బ్రహ్మదేవుని దగ్గరకి వెళ్ళారు.

'దేవా, మా సేనానాయకుడైన పరమేశ్వరుడు, పార్వతితో కలసి, తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయారు. మాకిప్పుడు సేనానాయకుడిగా ఎవరు వుంటారు? అని అడిగారు.

అపుడు బ్రహ్మ వారిని ఓదార్చి, పరమేశ్వరుని వల్ల జన్మించిన కుమారునికి మాత్రమే మీకు సైన్యాధిపతి కాగల అర్హత వుంది.

అదిగో పరమపావని గంగ. అగ్నిహోత్రుని ప్రార్థించి ఈశ్వరుని తేజస్సుని ఆమెలో ప్రవేశపెట్టమని ప్రార్థించండి. గంగ తప్పక ఒప్పుకుంటుంది. ఉమాదేవి కూడా తన అక్కగారే కదా అని సంతోషిస్తుంది' అని చెప్పాడు.

దేవతలు సంతోషంతో బ్రహ్మకి వందనం చేసి, శ్వేతగిరికి వెళ్ళారు. అక్కడ నిలబడి అగ్నిహోత్రుణ్ణి స్తోత్రం చెయ్యటం ప్రారంభించారు. అగ్నిహోత్రుడు ప్రసన్నుడై వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. 'దేవా నీలో దాగివున్న శివతేజాన్ని గంగలో వదిలిపెట్టవలసిందిగా మా ప్రార్థన' అన్నారు. వారి ప్రార్థన మన్నించి ఆయన గంగానది దగ్గరకి వెళ్ళాడు.

'దేవీ, దేవతల కార్యం సిద్ధించటానికి నువ్వు ఇపుడు గర్భం ధరించాలి' అని ప్రార్థించాడు.

అపుడు గంగ అపురూపమైన లావణ్యవతిగా మారి, చక్కగా ముస్తాబై వచ్చింది. ఆమె సౌందర్యానికి అగ్ని ముగ్ధుడైనాడు. ఆమె అన్ని అవయవాల్లోనూ వ్యాపించి ఈశ్వరతేజాన్ని ఆమెలో వదిలాడు. ఆమె గర్భవతి అయ్యింది.

అయితే ఆ తేజస్సు యొక్క తీవ్రత భరించలేక, ఆమె శరీరం దహించుకుపోసాగింది.

ఆ బాధ భరించలేక, ఆమె అగ్ని దగ్గరకి వెళ్ళి, 'మహోతేజా, ఈ గర్భం పెరిగే కొద్దీ, నాలో భరించలేని జ్వాలలు రేగుతున్నాయి' ఏం చెయ్యను అని అడిగింది అపుడు అగ్నికి కూడా ఏం చెయ్యాలో పాలుపోలేదు. వేరే దారిలేక, ఆ గర్భాన్ని హిమాలయాల మొదలులో దించుకోమని సలహా ఇచ్చాడు.

గంగ అలాగే చేసింది. ఆ గర్భస్రావంలోంచి మిలమిలా మెరిసే మేలిమి బంగారం పుట్టింది. తెల్లని వెండి పుట్టింది తర్వాత క్రమంగా రాగి, ఇనుము, తగరం, సీసము మొదలైన ఖనిజాలన్నీ పుట్టాయి. తర్వాత కొంతకాలానికి ఎన్నోరకాలైన ధాతువులు పుట్టాయి.

ఆధాతువుల మధ్య తేజోరూపుడైన చక్కని బాలుడు ఉదయించాడు. రెల్లుపొదల మధ్యపుట్టిన ఆ బాలుని పెంచటానికి దేవతలు, ఆరుగురు కృత్తికల్ని నియమించారు. ఆరుగురు తల్లులు పెంచటం వల్ల షణ్ముఖుడు అనే పేరుపొందాడు. కృత్తికల దగ్గర పెరగటం వల్ల కార్తికేయుడయ్యాడు. రెల్లుపొదలలో పుట్టటం వల్ల శరవణభవుడు అనిపేరు గాంచాడు. క్రమంగా పెరిగి పెద్దవాడై ఆ

బాలుడు దేవతలకి సేనాధిపతి అయ్యాడు. ఈశ్వరాంశసంభూతుడు కనక రాక్షసుల నెందర్నో సంహరించాడు.

గంగాదేవి గర్భం నుంచి స్కన్నుడై (జారినవాడై) పుట్టాడు కనుక దేవతలు ఆ బాలుని స్కందుడు అన్నారు.

రామా, పరమాద్భుతమైన కుమార సంభవాన్ని విన్నావు కదా, ఈ కార్తికేయుడి జన్మవృత్తాంతాన్ని పఠించినా, విన్నా, సంతానం లేనివారికి సంతానం కల్గుతుందని, దేవతలు వరమిచ్చారు' అని చెప్పి కుమారసంభవచరిత్ర ముగించాడు.

ఆ తర్వాత గంగాదేవి వృత్తాంతం చెప్పటం మొదలుపెట్టాడు. 'రామా హిమవంతుని కుమార్తెలలో పెద్దదైన గంగాదేవి, దేవలోకం చేరింది. చిన్నకుమార్తె ఉమాదేవి, పరమేశ్వరుని వివాహమాడి కైలాసగిరి చేరిందని ముందే చెప్పాను కదా ఆ సురగంగ భూలోకానికి వచ్చిన వైనం విను.

'పూర్వం మీ అయోధ్యానగరాన్ని సగరుడు అనే చక్రవర్తి పరిపాలించాడు. ఆయన మహాపరాక్రమవంతుడు. పరమధార్మికుడు, ఆయనకి కేశిని, సుమతి అని ఇద్దరు భార్యలుండేవారు. చిన్నభార్య అయిన సుమతి అసమానసౌందర్యవతి వారిద్దరికీ ఎంతకాలానికీ సంతానం కలుగలేదు.

అపుడు సగరుడు ఇద్దరి భార్యలతోటీ, హిమాలయాలకు వెళ్ళి భృగుమహర్షి ఆశ్రమ ప్రాంతంలో గొప్ప తపస్సు చేశాడు. కొంతకాలానికి భృగు మహర్షి ప్రసన్నుడై రాజుముందర ప్రత్యక్షమై 'మహారాజా, నీ కోరిక సిద్ధిస్తుంది. నీ పెద్ద భార్యకి అరవై వేలమంది పుత్రులు పుడతారు. వారివల్ల ఈ భూమిమీద అసమాన కీర్తిప్రతిష్టలు సంపాదిస్తావు అని దీవించాడు.

సగరుడు ఆనందంతో ఆ మహర్షికి నమస్కరించి, భార్యలతో తన నగరానికి వచ్చాడు.

కొంతకాలానికి కేశినికి అసమంజసుడు అనే కుమారుడు పుట్టాడు. కాని సుమతి గర్భంనుంచి సొరకాయ ఆకారంలో ఒక పిండం పుట్టింది. మంత్రసానులు ఆ పిండాన్ని నిలువుగా చీల్చారు.

అందులోనుండి అరవై వేలమంది శిశువులు పుట్టుకొచ్చారు. దాదులు ఆ శిశువుల్ని నేతి కుండలలో వుంచి పెంచారు. కాలక్రమేణా వారంతా పెరిగి పెద్దవారయ్యారు. కాని కేశిని కుమారుడైన అసమంజసుడు, చాలా దుర్మార్గుడిగా తయారయ్యాడు.

వాడు అయోధ్యలో నివసించే వారిళ్ళల్లో దొంగతనంగా ప్రవేశించి, వారిళ్ళలోని చిన్నపిల్లల్ని రహస్యంగా ఎత్తుకుపోయి, సరయూనదిలో విసిరేసి, వాళ్ళు మునిగిపోతూ వుంటే చూసి ఆనందించేవాడు. సాధుజనుల్ని హింసించి వినోదించేవాడు. అయోధ్యలోని పౌరులకి వాడు పెద్ద సమస్యగా తయారయ్యాడు. ఈ బాధభరించలేక జ్యేష్ఠుడు అని కూడా ఆలోచించకుండా సగరుడు వాణ్ణి అడవులలోకి వెళ్ళగొట్టాడు.

ఆ అసమంజసుడుకి అంశుమంతుడనే కొడుకున్నాడు. ఆ పిల్లవాడు మాత్రం సద్గుణసంపన్నుడు. కొంతకాలానికి సగరుడికి అశ్వమేధయాగం చెయ్యాలనే కోరిక పుట్టింది. వేదవిదులైన ఋత్విజుల్ని పిలిపించి, అశ్వమేధ యాగం మొదలుపెట్టాడు. వింధ్యపర్వతానికీ హిమవత్పర్వతానికీ మధ్య తన యజ్ఞవాటిక నిర్మింపజేశాడు. విధి విధానంగా అశ్వాన్ని వదిలిపెట్టి, దానివెంట తన మనుమడైన, అంశుమంతుణ్ణి పంపాడు. ఆ మహారథుడు ధనుర్ధారియై యజ్ఞాశ్వము వెంట తిరిగి దిగ్విజయ యాత్రచేసి తిరిగి వచ్చాడు. ఇదంతా ఇంద్రుడు చూశాడు.

సగరుడి యాగం సఫలమైతే తన ఇంద్రపదవికి ముప్పువస్తుందేమో అని అతి రహస్యంగా ఇంద్రుడు ఆ గుఱ్ఱాన్ని ఎత్తుకుపోయాడు. గుఱ్ఱం కనిపించకపోయేసరికి, ఋత్విజులు సగర మహారాజుతో 'రాజా యజ్ఞాశ్వము దొరకకపోతే యజ్ఞచ్ఛిద్రం వల్ల నీకూ, మాకూ కూడా అమంగళం జరుగుతుంది. కనక ఆ అశ్వాన్ని వెతికించి తెప్పించు' అని హెచ్చరించారు.

అపుడు సగరుడు సుమతి సంతానమైన అరవై వేలమంది కుమారుల్ని వెళ్ళి యజ్ఞాశ్వాన్ని వెతికి తెమ్మని ఆజ్ఞాపించాడు. ఒక వేళ భూమి మీద దొరక్కపోతే భూమిని బ్రద్దలు చేసి పాతాళంలో వెతకండి' అని హెచ్చరించి పంపాడు తండ్రి. తండ్రి ఆజ్ఞప్రకారం అరవై వేలమందీ నేలమీద అణువణువూ వెతకటం మొదలుపెట్టారు కాని వారికి భూమి మీదెక్కడా గుఱ్ఱం దొరకలేదు.

ఇంక పాతాళంలో వెతకాలని, ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనం చదరం గల భూమిని త్రవ్వటం ప్రారంభించారు. అలా భయంకరమైన హలాయుదాలంతో భూమిని తవ్వుతుంటే భరించశక్యం గాని ధ్వని పుట్టింది: అయినాసరే పట్టుదలతో జంబూద్వీపంలోని, అరవైవేల యోజనాల భూమినీ, పాతాళం వరకు బ్రద్దలు చేస్తూ తవ్వారు. ఆ దెబ్బలకి పాతాళంలోని, అసురులు, నాగులు, రాక్షసులు, హాహాకారాలు చేస్తూ హతమైపోయారు. లోకాలన్నీ భయభ్రాంతమైపోయాయి.

దేవతలు, గంధర్వులు, అసురులు, పన్నగులు, బ్రహ్మదేవునికి మొరపెట్టుకున్నారు.

అపుడు బ్రహ్మవారికి అభయమిచ్చి ఆ అరవైవేలమంది సగరపుత్రులూ అల్పాయుష్కులనీ, విష్ణుమూర్తి చేతిలో వారంతా హతమైపోతారనీ అన్నాడు.

సాగరులు అరవైమందీ పాతాళలోకం కూడా అంతా గాలించారు. కాని గుఱ్ఱంజాడ వారికి తెలియలేదు. నిరాశతో తండ్రి దగ్గరకి తిరిగివెళ్ళి సంగతి అంతా వివరించారు. సగరుడు కోపంతో ఉగ్రుడైపోయాడు. గుఱ్ఱం దొరికేవరకు వెతకమని వారిని కసిరికొట్టాడు. వాళ్ళు మళ్ళీ పాతాళంలో ప్రవేశించారు.

అక్కడ తూర్పుదిక్కులో కొండంత ఏనుగు కనిపించింది. దానిపేరు 'విరూపాక్షము' అది దిగ్గజం. ఈ భూమిని మోస్తున్న అష్ట దిగ్గజాలలోనూ అది ఒకటి. రామచంద్రా, భూభారం మోస్తూవుండగా అలసిపోయి అది ఎపుడైనా, తల ఆడిస్తే, అపుడక్కడ భూకంపం వస్తుంది సాగరులు ఆ విరూపాక్షానికి, ప్రదక్షిణం చేసి పూజించారు. అలాగే దక్షిణ దిక్కున 'మహాపద్మం' అనే దిగ్గజాన్ని, ఉత్తర దిక్కున 'భద్రము' అనే దిగ్గజాన్ని చూసి పూజించి, గుఱ్ఱం కోసం వెతికారు. కాని కనిపించలేదు. ఈశాన్య దిశగా వెళ్ళారు అక్కడ మహావిష్ణువు కపిలమహాముని వేషంలో తపస్సు చేసుకుంటున్నాడు.

ఆ సమీపంలోనే యాగాశ్వం పచ్చికమేస్తూ కనిపించింది. సాగరులు క్రోధావేశాలతో ఆ మునీశ్వరుడే దొంగ అనుకుని, ఆయనని దూషిస్తూ 'దుర్బుద్ధీ, మా యజ్ఞాశ్వాన్ని అపహరించి తెస్తావా?' అని పలుగులతో గొడ్డళ్ళతో ఆయనమీద పడ్డారు. కపిలమహర్షి కోపంతో హుంకారం చేశాడు. ఆ హుంకారానికి వారంతా భస్మమైపోయి బూడిదకుప్పలుగా మారిపోయారు.

'రామభద్రాదా ఎంతకాలానికీ సాగరులు రాకపోయేసరికి, సగరుడు తన మనుమడైన అంశుమంతుడితో ఇలా అన్నాడు.

'నాయనా నువ్వు అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరిన మహావీరుడివి. నీ పినతండ్రుల జాడ తెలియలేదు. నువ్వు వెంటనే బయల్దేరి వెళ్ళి వాళ్ళ జాడ తెలుసుకురా. యజ్ఞాశ్వాన్ని కూడా వెతుకు.

భూగర్భంలో మహాబలవంతమైన ప్రాణికోట్లు ఎన్నోవున్నాయి. ఖడ్గమూ, కార్ముకమూ లాంటి పదునైన ఆయుధాలతో వాటిని ఎదుర్కో. నా చేత ఎలాగైనా సరే యజ్ఞం నువ్వే పూర్తిచేయించాలి' అని చెప్పగా తాతగారి ఆజ్ఞ శిరసావహించి, అంశుమంతుడు బయల్దేరి వెళ్ళాడు.

తన పినతండ్రులు తవ్విన దారిగుండా బయల్దేరి పాతాళలోకానికి వెళ్ళాడు. మొదట విరూపాక్షము కనిపించింది. అంశుమంతుడు ఆ దిగ్గజాన్ని పూజించి

తన పినతండ్రుల జాడ అడిగాడు. ఇదే దారిలో వెళ్తే యజ్ఞాశ్వం దొరుకుతుందనీ, సాగరుల జాడ తెలుస్తుందనీ ఆ దిగ్గజం చెప్పింది. అలాగే వెళ్తూ క్రమంగా దిగ్గజాలన్నింటినీ కల్సుకుని తన పినతండ్రుల జాడ అడిగాడు.

అపుడా దిగ్గజాలు జరిగిన సంగతంతా మానవభాషలో అతడికి వివరించి చెప్పాయి. వాటి మాట ప్రకారం అతడు ఈశాన్యదిశగా వెళ్ళి కాలి బూడిదరాసులైన పినతండ్రుల్ని చూశాడు. గట్టిగా వారికోసం ఏడవటం మొదలెట్టాడు. అక్కడేవున్న యజ్ఞాశ్వం కనిపించింది.

ఎంత ఏడ్చినా ప్రయోజనం లేదు కనక పినతండ్రులకి జలతర్పణం వదిలి, గుఱ్ఱాన్ని తీసుకెళ్దాం అని నీళ్ళకోసం వెతికాడు. కాని ఆ ప్రాంతంలో ఎక్కడా నీళ్ళు దొరకలేదు. అల్లంత దూరంలో గరుత్మంతుడు కనిపించాడు. సాగరులకి మేనమామ అతడు. చాలా బలవంతుడు. దుఃఖిస్తున్న అంశుమంతుడి దగ్గరకి వచ్చి ఓదార్చాడు. 'నాయనా, లోక క్షేమం కోసం కపిలుడు నీ పినతండ్రుల్ని దగ్ధం చేశాడు. దుఃఖించకు. వీరికి సామాన్య జలాలతో తర్పణం వదలటం వల్ల ప్రయోజనం లేదు. హిమవంతుడి పెద్ద కూతురు, గంగ లోకపావని. నదీరూపంలో దేవలోకంలో సంచరిస్తోంది. ఆ గంగానదీ జలాలలో నీ పినతండ్రులకి తర్పణం వదలాలి.

ఈ భస్మరాసులమీదుగా ఆ గంగాజలాల్ని ప్రవహింపజెయ్య గలిగితే, నీ పిన తండ్రులకి ఊర్ధ్వలోకాలు లభిస్తాయి. కాని అది అంత సులభమైన పని కాదు కనక ప్రస్తుతానికి నువ్వు ఈ యజ్ఞాశ్వాన్ని తీసికెళ్ళు. నీ తాతగారి చేత క్రతువు పూర్తిచేయించు. తర్వాత వీలునుబట్టి వీరి సంగతి ఆలోచించు' అన్నాడు.

గరుత్మంతుడు చెప్పిన విషయం అంశుమంతుడు అర్థం చేసుకున్నాడు. వెంటనే యజ్ఞాశ్వాన్ని తీసుకుని తాతగారి దగ్గరకి వెళ్ళాడు. తాను తెలుసుకున్న విషయాలన్నీ ఆయనకి వివరించి చెప్పాడు. ఆ భయంకరమైన వృత్తాంతం విని సగరుడు చాలా దుఃఖించాడు. ధీమంతుడు కనక యథాశాస్త్రంగా అశ్వమేధ యాగం పూర్తిచేశాడు.

ఆ తర్వాత, గంగానదిని భూలోకానికి ఎలా రప్పించాలా అని ఆలోచించాడు. చాలా సంవత్సరాలు రాజ్యం చేశాడు. కాని ఆయనకి గంగానదిని భూమి మీదికి తేవటానికి ఉపాయమేమీ స్ఫురించలేదు. చివరికా విషయంలో కృతకృత్యుడు కాకుండానే దివంగతుడయ్యాడు. ఆయన తర్వాత ఆయన మనుమడైన అంశుమంతుడు, అతడి కుమారుడు దిలీపుడు కూడా గంగానదిని భూమ్మీదికి

తెచ్చే ఉపాయం తోచకుండానే ఆ దిగులుతో స్వర్గస్థులయ్యారు. వారు కూడా ఎన్నో వేల సంవత్సరాలు ప్రజానురంజకంగా పరిపాలించారు. దిలీపుని కుమారుడు భగీరథుడు మహాపరాక్రమవంతుడు.

భగీరథునికి, ఎంతకాలానికీ సంతానం కలుగలేదు. ఒకవంక సంతానం లేదన్న వేదన. మరోపక్క తన పూర్వీకులకు సద్గతులు కలిగించటానికి గంగని భూమికి తెప్పించాలనే తపన ఆయనకి చాలా మనస్తాపం కలిగించాయి.

రాజ్యాన్ని మంత్రులకప్పగించి, అడవులకి వెళ్ళి పంచాగ్నుల మధ్య ఒంటికాలిమీద నిలబడి ఘోరమైన తపస్సు చేశాడు.

అత్యుగ్రమైన ఆ తపస్సుకి మెచ్చుకుని బ్రహ్మదేవుడు ఆయనముందు ప్రత్యక్షమయ్యాడు. ఏం ఫలము నపేక్షించి ఈ తపస్సు చేస్తున్నావని అడిగాడు.

అపుడు భగీరథుడాయనకి భక్తితో ప్రణమిల్లి 'ప్రభూ, స్వర్గంలో వున్న గంగానది, ఈ భూమిమీద అవతరించేలా వరం ఇవ్వండి. ఆ గంగాజలంతో నా ముత్తాతలకి తర్పణాలిస్తాను. వారి భస్మరాసులమీదుగా గంగ ప్రవహించేలాచేసి వారికి సద్గతులు కలిగించండి నన్ను, వారినీ కృత కత్యులను చెయ్యండి. అంతేగాక ఈ ఇక్ష్వాకువంశం నాతో అంతరించిపోకుండా, నాకు పుత్రసంతానాన్ని అనుగ్రహించండి' అని ప్రార్థించాడు.

బ్రహ్మదేవుడు సంతుష్టుడయ్యాడు 'రాజా, నీకు పుత్రసంతానం అవశ్యం ఇస్తాను. కాని నీ మొదటి వరం చాలా దుర్లభమైనది. ఎందుకంటే హిమవంతుడి పెద్దకుమార్తె గంగ చాలా శక్తివంతమైనది. ఆమె సురలోకం నుంచి, భూమిమీదికి దూకితే, ఆ ధాటికి, భూమి తట్టుకోలేదు. గంగపాటును భరించగలవాడు పరమేశ్వరుడొక్కడే. కనక ఆయనని మెప్పించినట్లైతే, నీకోరిక సిద్ధిస్తుంది" అని దీవించి, గంగని పిల్చి, 'గంగా, నువ్వు భగీరథుని అభీష్టం నెరవేర్చు' అని ఆజ్ఞాపించాడు.

భగీరథుడు మళ్ళీ శివుని గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రసన్నుడై భగీరథుని కోరిక మన్నించి గంగని తన తలపై ధరించటానికి ఒప్పుకున్నాడు.

అపుడు గంగ దుస్సహమైన వేగంతో వచ్చి, శివుడి శిరస్సున దూకింది. తన ప్రవాహ వేగంతో శివుణ్ణి భూమిమీదకి లాక్కుపోవాలని చూసింది. అది గమనించి శివుడు రౌద్రమూర్తి అయ్యాడు. వెంటనే తన జటాజూటాన్ని హిమవత్పర్వతపు గుహ అంత పెద్దగా పెంచాడు. ఆ జటాగహ్వరాల మధ్య తిరుగుతూ, గంగ అక్కడే చిక్కుపడిపోయింది. గంగ కనిపించకుండా

మాయమైపోయేసరికి, భగీరథుడు మళ్ళీ శివుని గురించి తపస్సు చేశాడు. అపుడు శివుడు భగీరథుని అనుగ్రహించి బ్రహ్మనిర్మితమైన మానస సరోవరంలోకి గంగని వదిలిపెట్టాడు.

ఆ సరోవరంలో పడ్డ గంగ ఏడుపాయలుగా చీలిపోయింది. హ్రాదినీ, నలిని, పావని అనే మూడుపాయలు తూర్పువైపు, సుచక్షు, సీత, సింధు అనే మూడు పాయలూ పడమటి వైపు ప్రవహించాయి. మిగిలిన ఏడవపాయ ఒక్కటే భగీరథుని వెంట బయల్దేరింది.

దివ్యమైన రథం మీద ముందు భగీరథుడు ప్రయాణం చేస్తున్నాడు. ఆయన ఎటువెళ్తే అటు అనుసరిస్తూ గంగ ఆయన వెంట ప్రవహించింది.

సురలోకం నుంచి శివుని శిరస్సు మీదకి, అక్కడినుంచి భూమిమీదకి గంగ దూకినపుడు 'హోరు'మన్న పెద్ద శబ్దం పుట్టింది.

ఈ మహాద్భుతాన్ని చూడటానికి, దేవ, యక్ష, గంధర్వ, సిద్ధగణాలన్నీ ఆకాశంలో విమానాలమీద బారులు తీరి, గంగావతరణాన్ని చూసి తరించారు.

గంగా ప్రవాహం తెల్లటి నురుగులు చిమ్ముతూ, ఉరకలు వేస్తూ నేలమీద పడుతూ వుంటే, ఆ ప్రవాహం లోంచి తాబేళ్ళు, మొసళ్ళు, చేపలు మొదలైన జలచరాలు మెరుపుల్లా మెరుస్తూ నేలమీదకి జారాయి.

శివుడి శిరస్సు నుంచి దూకింది కనక అతి పవిత్రమైనది అని, దేవతలూ మానవులూ ఆ పావనజలాలలో స్నానాలు చేసి పునీతులయ్యారు.

ఆ తర్వాత భగీరథుని వెంట ప్రయాణం చేస్తున్న గంగానది, జహ్నుమహర్షి ఆశ్రమప్రాంతానికి చేరింది. అద్భుతమైన మహిమ కల్గిన ఆ మహర్షిని సేవించాలని భగీరథుడు రథం అక్కడ ఆపాడు. మహావేగంతో వస్తున్న గంగ, రథం వెనకాతల ఆగలేకపోయింది. ఆ నదీ ప్రవాహంలో జహ్నుమహర్షి ఆశ్రమము, యజ్ఞవాటికా, అన్నీ కొట్టుకుపోయాయి. జహ్నుమహర్షికి చెప్పరానంత కోపం వచ్చింది. తన అద్భుతమైన మహిమతో ఆ గంగా ప్రవాహ జలాన్నంతా తాగేశాడు.

అది చూసి దేవతలు మొదలైన వారంతా ఆశ్చర్యంతో చకితులైపోయారు. వారంతా జహ్నుమహర్షిని పూజించి, లోకహితవు కోసం గంగని వదిలి పెట్టవలసిందిగా ప్రార్థించారు. అపుడాయన వారిని అనుగ్రహించి, తన చెవులలోంచి గంగని వదిలిపెట్టాడు. అందుకని గంగ జహ్నుసుతగా, జాహ్నవిగా మారింది.

మళ్ళీ యథావిధిగా గంగ భగీరథుని వెంట ప్రయాణం సాగించింది. అలా వెళ్ళి వెళ్ళి ఆయన సాగరంలోకి వెళ్ళాడు. గంగ కూడా సాగరంలోకి వెళ్ళింది. అక్కడ్నుంచి భగీరథుని వెంట పాతాళానికి వెళ్ళింది. భగీరథుడు అక్కడ వున్న తన పితామహుల భస్మరాసులు, చూపించి, గంగని వాటిమీదుగా ప్రయాణం చెయ్యమన్నాడు. గంగానది అలాగే ప్రవహించింది. ఆ మహామహుడి ప్రయత్నం సఫలమైంది.

ఎప్పుడైతే భస్మరాసుల్ని గంగ ముంచెత్తిందో అపుడు వారిముందు బ్రహ్మ ప్రత్యక్షమై భగీరథుని మెచ్చుకుని 'నాయనా, నీ అరవైవేలమంది ముత్తాతలూ స్వర్గం చేరారు. ఈ లోకంలో ఎంతకాలం సాగరం ఇంకిపోకుండా వుంటుందో, అంతవరకు వారు దేవలోకంలో స్వర్గసుఖాలు అనుభవిస్తూ వుంటారు.

ఇప్పట్నుంచీ ఈ గంగని భాగీరథి అని పిలుస్తారు. స్వర్గ, మర్త్య, పాతాళలోకాలలో ప్రవహించింది కనుక, దీనిని త్రిపథగామిని అంటారు. ఇంక నువ్వు ఈగంగాజలాలతో నీ పితరులకి ధర్మోదకాలు వదిలిపెట్టు నీ అభీష్టం సిద్ధిస్తుంది' అని దీవించాడు.

భగరథుడు గంగలో స్నానం చేసి శుచియై, సాగరులందరికీ శాస్త్రోక్తంగా తర్పణాలు వదిలాడు. తర్వాత అయోధ్య చేరుకున్నాడు.

రామభద్రా, ఇదీ గంగ వృత్తాంతం. సంధ్యాకాలమైంది. సంధ్యావందన కార్యక్రమాలు చెయ్యాలి' అంటూ లేచాడు విశ్వామిత్రుడు. అందరూ ఆయన్ని అనుసరించారు. రామలక్ష్మణులకి ఆలోచించినకొద్దీ అంతులేని ఆశ్చర్యం కలిగింది. గంగావతరణాన్ని పదేపదే తల్చుకున్నారు. వారంతా ఆ రాత్రికి ఆ గంగానదీ తీరంలో గడిపారు.

తెల్లారగానే ఉదయం చెయ్యవలసిన కార్యక్రమాలన్నీ యథావిధిగా పూర్తిచేసుకుని, మళ్ళీ ప్రయాణానికి సిద్ధమైనారు. వారంతా ఒక నావలో గంగానది ఉత్తర తీరానికి చేరారు. అక్కడ నావ దిగి చాలా దూరం ప్రయాణం చేశాక, ఒక విశాలమైన పట్టణంలో ప్రవేశించారు. స్వర్గాన్ని తలపింపచేస్తున్న ఆ పట్టణమెవరిదో చెప్పమని రామలక్ష్మణులు విశ్వామిత్రుణ్ణి అడిగారు.

అపుడు విశ్వామిత్రుడిలా చెప్పాడు. 'రామా, త్రేతాయుగానికి పూర్వం కృతయుగంలో కశ్యపుడి భార్యలైన దితికి దైత్యులు. అదితికి దేవతలు పుట్టారు. దైత్యులు మహాబలవంతులు. అదితిపుత్రులు పరమధార్మికులు. కలిసిమెలిసి వుండేవారు.

ఒకసారి వారంతా ఒకచోట చేరి, వార్ధక్యమూ, మరణమూ, లేని ఉపాయం ఏదైనా వుందా? అని ఆలోచించారు. పాలకడలి మథిస్తే, అమృతం పుడ్తుందనీ, ఆ అమృతాన్ని తాగితే, జరామరణాలు, అనారోగ్యమూ లేకుండా పోతాయని వారికి తెలిసింది.

మంధరగిరిని కవ్వంగా పెట్టి, వాసుకి అనే మహాసర్పాన్ని కవ్వం తాడుగా వుంచి, వారు క్షీరసాగరాన్ని చిలకడం మొదలెట్టారు. అపుడు హాలాహలం పుట్టి మండుతూ పైకి లేచింది. వాసుకి కక్కిన విషమే ఆ హాలాహలం. ఆ విషం తీవ్రతకి ముల్లోకాలూ దగ్ధమైపోసాగాయి. వాళ్ళు భయంతో పరమేశ్వరుని శరణన్నారు. అక్కడే వున్న విష్ణుమూర్తి 'శంకరా, దేవతలందరికీ అగ్రజుడివి. ప్రథమ తాంబూలం నీదే. ఈ విషాన్ని నువ్వే ప్రసాదంగా స్వీకరించు' అన్నాడు.

వారి ప్రార్థన మన్నించి ఆ విషాన్ని శంకరుడు తాగేశాడు. ఆ తర్వాత మళ్ళీ దేవదానవులు క్షీరసాగర మథనం ప్రారంభించారు. కాని కొంతసేపటికి మందరగిరి, పాతాళలోకంలోకి దిగబడిపోయింది.

అపుడు వారంతా ఆమందరగిరిని లేవనెత్తమని శ్రీహరిని ప్రార్థించారు.

విష్ణుమూర్తి తాబేలు రూపం ధరించి, పాలసముద్రంలోకి వెళ్ళి మందరగిరిని తన వీపుమీద మోసి నిలబెట్టాడు. అది అలాగే నిలబడేటట్లు అక్కడే పడుకున్నాడు.

రెండవసారి పాలకడలిలోంచి ధన్వంతరి పుట్టాడు. మూడవసారి క్షీరసాగరంలోంచి ఒకరకమైన రసం పుట్టి, ఆ రసంలోంచి అరవై కోట్లమంది కన్నె పడుచులు పుట్టారు. రసంలోంచి పుట్టారు కనుక వారిని 'అప్సరసలు' అన్నారు. వారిని వివాహం చేస్కోటానికి ఇటు దైత్యులు గాని, అటు ఆదిత్యులు గాని ఒప్పుకోలేదు. అంచేత వారు వారకాంతలుగా మిగిలిపోయారు. తర్వాత 'వారుణి' అనే సురాదేవత పుట్టింది. ఆదిత్యులు ఆ సురని స్వీకరించారు. కాని దైత్యులు నిరాకరించారు. అందుకే వారిని అసురులన్నారు.

తర్వాత క్రమంగా ఉచ్చైశ్రవము అనే మేలుజాతి గుఱ్ఱము, శ్రేష్ఠమైన కౌస్తుభమణి, పుట్టి చివరకి అమృతం పుట్టింది. ఆ అమృతం కోసం దేవతలు దానవులు తీవ్రమైన యుద్ధం మొదలుపెట్టారు.

దైత్యులు బలవంతులు కనుక ఎందర్నో దేవతల్ని చంపేశారు. ఆయుద్ధానికి ముల్లోకాలు తల్లడిల్లిపోయాయి. అపుడు మహావిష్ణువు మోహినీ అవతారంలో వచ్చి, మాయతో అమృతాన్ని అపహరించుకుపోయాడు. అడ్డంవచ్చిన వారినందర్నీ పిండి పిండి చేశాడు.

ఆ ఘోర సంగ్రామంలో దైత్యులందర్నీ దేవతలు చంపేశారు.

అపుడు ఇంద్రునికి త్రిలోకాధిపత్యమూ, ఆ అమృతభాండము లభించాయి.

రామా, తన సంతానమంతా చనిపోయేసరికి దితి ఘోరంగా ఏడ్చింది. భర్తకి నమస్కరించి 'నాథా, మీ కుమారులు, నా సంతానం అందర్నీ చంపేశారు. ఇపుడు నేను పుత్రులు లేనిదానినైపోయాను. అందుచేత ఇంద్రుడి అంతటి శక్తివంతుడైన కుమారుని నాకు ప్రసాదించండి' అని వేడుకుంది అపుడు కశ్యపుడు భార్యనోదార్చి, 'దేవీ, నువ్వు వ్రతనిష్ఠతో శుచిగా తపస్సు చెయ్యి. నువ్వు నియమం తప్పకుండా ఉంటే, నీకు ఇంద్రుణ్ణి జయించగల అజేయుడైన కొడుకు పుట్టాడు' అని వరమిచ్చాడు. దితి పరమసంతోషంతో 'కుశప్లవము' అనే ప్రదేశానికి వెళ్ళి తపస్సు చెయ్యటం మొదలుపెట్టింది.

ఆ సంగతి ఇంద్రుడు కనిపెట్టాడు. చాలా తెలివైనవాడు కనక, ఆమెకి సేవచేసి, తపస్సు చేసేటందుకు కావలసిన సంభారములన్నీ సమకూర్చే నెపంతో ఆమెదగ్గరకి చేరాడు.

ఆమె అలసిపోయినపుడు, ఆమెకి సపర్యలు చేసి, ఆమె మెప్పు సంపాదించాడు. ఆవిధంగా నవమాసాలు నిండాయి. దితికి ప్రసవసమయం ఆసన్నమైంది. ఆనందంతో దితి, ఇంద్రుని పిల్చి 'నాయనా త్వరలోనే నీకు త్రిలోక విజయుడైన తమ్ముడు పుట్టబోతున్నాడు. నీ తమ్ముడు నీతో పోరు చెయ్యకుండా నీతో సఖ్యంగా వుండేలా నేను చేస్తాను. అపుడు నువ్వు నీతమ్ముడితో కలసి నిశ్చింతంగా ముల్లోకాలూ పాలించవచ్చు' అని చెప్పింది. ఇంద్రుడు సరే అన్నాడు.

మిట్ట మధ్యాహ్నమైంది. అలసిపోయిన దితి, జుట్టు విరబోసుకుని, తలవైపు కాళ్ళు, కాళ్ళవైపు తలపెట్టుకుని అపసవ్యంగా మంచంమీద పడుకుని నిద్రపోయింది. ఇంద్రుడా దృశ్యం చూసి బ్రహ్మానందపడ్డాడు.

ఆ విధంగా ఆమె నియమం తప్పటం మహద్భాగ్యంగా భావించాడు. యోగశక్తితో ఆమె గర్భంలో ప్రవేశించాడు.

తన వజ్రాయుధంతో ఆమె గర్భస్థశిశువుని, నరికెయ్యాలని చూశాడు. ఆ శిశువు పెద్దపెట్టున ఏడవసాగాడు. ఇంద్రుడు ఆ శిశువుని 'మారుద' 'మారుద' (ఏడవవద్దు) అని ఊరడించాడు. అంతలో దితికి మెలుకువ వచ్చింది. జరుగుతున్నది గ్రహించి, 'నా కొడుకుని చంపవద్దు' అని దీనంగా ఏడ్చింది. అప్పటికే ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధ ప్రభావం చేత ఆమె గర్భస్థపిండం ఏడు ముక్కలైంది.

పినతల్లి మాట మీద గౌరవంతో ఇంద్రుడు ఆ ముక్కల్నలాగే వదిలేసి బయటికి వచ్చాడు.

దితికి నమస్కరించి, 'నువ్వు వ్రతనిష్ఠ భంగం అవుతుందని కూడా ఆలోచించకుండా, తలవిరబోసుకుని, తలాపుదిక్కున కాళ్ళుంచి నిద్రపోయావు. కనక తండ్రిగారు నిన్ను హెచ్చరించిన ప్రకారం నాకు అవకాశం దొరికింది. సందు దొరికినపుడు శత్రువుని సంహరించటం ధర్మమే కదా. యుద్ధంలో నన్ను ఓడించగల శక్తి సంపన్నుడు, నీ కడుపులో వున్నాడు. కనుక నేను ఏడు తునకలు చేశాను. నన్ను మన్నించు' అన్నాడు. ఇంద్రుని మాటలు విన్న దితికి, తన తెలివితక్కువతనానికి చెప్పలేని దుఃఖం వచ్చింది. ఎలాగో దుఃఖాన్ని దిగమింగి, ఇంద్రుడితో ఇలా అంది.

'నాయనా, తప్పునాదే. నీ ధర్మం నువ్వు ఆచరించావు. నా ఆశ తీరే అవకాశం ఇంకెలాగా లేదు. కాని ఒక్క ఉపకారం చెయ్యి. ఏడుముక్కలైన నా గర్భాన్ని ఏడు గురు పుత్రులుగా మార్చి, ఏడు లోకాల్లోనూ వాయుసమూహాలకి అధిపతులు అయ్యే వరం ఇయ్యి' అని చేతులు జోడించి ప్రార్థించింది.

దేవేంద్రుడామెని, వారించి 'అమ్మా, నీ కోరిక తీరుస్తాను. నీ సంతానం ఏడుగురు దేవతల్లానే సంచరించి, మరుద్గణములుగా ప్రసిద్ధి పొందుతారు' అన్నాడు.

ఆపైన వారు ఆ తపోవనం వదిలి, స్వర్గలోకానికి వెళ్ళిపోయారు.

'రామా, ఆనాడు దితి తపస్సు చేసినదీ, ఇంద్రుడు సపర్యలు చేసినదీ అయిన తపోవనము ఇదే. ఈ ప్రదేశంలోనే, ఇక్ష్వాకునికీ, అలంబుసాదేవికీ, విశాలుడు అనేవాడు పుట్టాడు. ఆ విశాలుడే తర్వాతి కాలంలో ఈ పట్టణాన్ని నిర్మించాడు.

ఆ విశాలుని కుమారుడు హేమచంద్రుడు. ఆతడి కొడుకు సుచంద్రుడు. సుచంద్రుడి కొడుకు ధూమ్రాశ్వుడు. ధూమ్రాశ్వుడి పుత్రుడు సంజయుడు. ఆతడి కుమారుడు సహదేవుడు. సహదేవుడి కొడుకు కుశాశ్వుడు. కుశాశ్వుడి కొడుకు సోమదత్తుడు. సోమదత్తుని కొడుకు కాకుత్స్థుడు. కాకుత్స్థుడి పుత్రుడు సుమతి. ప్రస్తుతం ఈ విశాలనగరాన్ని ఆ సుమతే పాలిస్తున్నాడు. దీన్నే వైశాలి అంటారు. ఈ రాత్రికి మనం ఇక్కడ హాయిగా విశ్రాంతి తీసుకుందాం. రేపు ఉదయమే బయల్దేరి యజ్ఞానికి వెళ్దాం' అన్నాడు.

విశ్వామిత్రుడు, శిష్యులతో కూడా తన నగరానికి వచ్చినట్లు సుమతికి తెలిసింది. బంధుమిత్ర సమేతంగా ఆయన వచ్చి విశ్వామిత్రుడికి స్వాగతం

చెప్పాడు. అతిథి సత్కారాలు పూర్తయ్యాక రామలక్ష్మణులని చూసి, వారి గురించి విశ్వామిత్రుని అడిగాడు.

అపుడు విశ్వామిత్రుడు, తాను యజ్ఞసంరక్షణ కోసం దశరథ మహారాజుని యాచించి, వారిని తీసుకొచ్చింది మొదలు ఇప్పటివరకు జరిగిన వృత్తాంతమంతా వివరించి చెప్పి, మిథిలానగరానికి జనక మహారాజు చేస్తున్న యాగం చూడటానికి వెళ్తున్న సంగతి చెప్పాడు. ఆ రాత్రి వారు సుమతి ఆతిథ్యంలో హాయిగా నిద్రపోయారు.

మర్నాడు ఉదయాన్నే లేచి, సంధ్యావందనాదికాలు ముగించుకుని, మిథిలా నగరానికి ప్రయాణమయ్యారు. అల్లంతదూరంలో మిథిలానగరం కనిపించగానే వారందరి మనస్సులూ ఆనందంతో నిండిపోయాయి. ఆ సమీపంలో ఒక నిర్జన వనం, రామలక్ష్మణుల కంటపడింది. వారు విశ్వామిత్రుని చూసి, 'మహాత్మా, ఈ ఆశ్రమవృత్తాంతం తెలుసుకోవాలని వుంది. చూడగా ఇది పాడుబడిన మున్యాశ్రమంలా వుంది' అన్నారు.

వారి ప్రశ్నకి విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు. 'రాకుమారులారా మీ ఊహ యథార్థమే. ఇది పూర్వము గౌతమ మహర్షి ఆశ్రమం. ఆయన తన భార్య అయిన అహల్యతో ఇక్కడ చాలా సంవత్సరాలు నివసించాడు. అపుడిది దివ్యమైన ఆశ్రమం.

అహల్య అపురూపసౌందర్యవతి దేవేంద్రుడు ఆమెమీద కన్నువేశాడు. ఒకసారి, గౌతముడు ఆశ్రమంలో లేని సమయం కనిపెట్టి, గౌతమమహాముని వేషంలో ఆశ్రమానికి వెళ్ళాడు. వచ్చినవాడు తన భర్త కాదనీ, దేవేంద్రుడనీ అహల్య కనిపెట్టింది. కాని ఆక్షణంలో ఆమెలో విచక్షణాజ్ఞానం నశించింది. దేవేంద్రుడంతటివాడు తనని కోరి వచ్చాడని మురిసిపోయింది. తనకి తెలియకుండానే అతడికి లొంగిపోయింది.

దేవేంద్రుడు తన కోరిక తీర్చుకుని, అలసట తీర్చుకుంటుండగా, అహల్య భయంతో 'ప్రభూ, నేను కృతకృత్యురాలనయ్యాను. మీరు తత్క్షణం ఎవ్వరి కంటబడకుండా వెళ్ళిపోండి' అని ప్రాధాయపడింది.

సరిగ్గా అదే సమయానికి, నదిలో స్నానం చేసి, సమిధలూ, దర్భలూ తీసుకుని, అగ్నిహోత్రుడిలా వెలిగిపోతూ ఆశ్రమానికి తిరిగివస్తున్న గౌతముడు, ఆశ్రమంలోంచి వస్తున్న ఇంద్రుణ్ణి చూశాడు. తపోబల సంపన్నుడైన గౌతముని చూసి, ఇంద్రుడు భయపడ్డాడు. జరిగినదంతా దివ్యదృష్టితో గౌతముడు తెల్సుకున్నాడు.

క్రోధావేశాలతో మండిపడుతూ 'దుర్మార్గుడా, నేను ఇంటలేని సమయంలో,

నా వేషంతో వచ్చి నా భార్యని వంచిస్తావా! ఇక మీదట నువ్వు పురుషత్వం కోల్పోతావు' అని శపించాడు. వెంటనే దేవేంద్రుని అండాలు తెగి నేల మీదపడ్డాయి. గౌతముడు భార్యవంక నిరసనగా చూస్తూ ఆశ్రమంలోకి వెళ్ళాడు.

'పాపాత్మురాలా! ఇవాళనుంచీ తిండీ నీరు లేకుండా, నువ్వు బూడిదలో దొర్లుతూ అదృశ్యరూపంలో ఉండి, గాలిమాత్రం పీల్చి బతుకుతూ, తపస్సు చేస్తూ ఇక్కడే పడివుండు. ఈక్షణం నుంచీ ఈ ఆశ్రమం పాడుబెట్టబడుతుంది' అని శపించాడు. భర్త కోపాగ్నికి అహల్య గజగజ ఒణికిపోతూ, ఆయన పాదాలపైబడి దీనంగా ఏడ్చి, క్షమించమని ప్రాధేయపడింది. భార్యమీద వుండే అత్యంతానురాగం వల్ల ఆ మహర్షి శాంతించాడు.

'అహల్యా! నా శాపానికి తిరుగులేదు. నువ్వు శాపం అనుభవించి తీరాల్సిందే. కొంతకాలానికి, దశరథ కుమారుడైన రాముడు, ఈ ప్రాంతానికి వస్తాడు. అప్పటికే ఆశ్రమమంతా చాలా పాడై భీకరంగా వుంటుంది. ఆ మహానుభావుడు నిన్ను చూస్తాడు. ఆదయామయుని దర్శనభాగ్యం వల్ల నువ్వు పునీతవు అవుతావు. నీ శాపం తీరుతుంది. అపుడు నువ్వు ఆయనకి అతిథి సత్కారాలు చెయ్యి. నీ యథారూపం వస్తుంది. అపుడు నేను మళ్ళీ వచ్చి నిన్ను స్వీకరిస్తాను' అని ఆమెకి అభయం ఇచ్చి, శాపవిమోచన చెప్పి గౌతముడు హిమాలయ శిఖరాగ్రాలకి వెళ్ళిపోయాడు.

అండాలు తెగిపడిన ఇంద్రుడు దిగులుతో, దేవతలందర్నీ పిల్చి 'దేవతలారా, నేను మీకు హితవు చేద్దామని, అహల్యని కూడాను. ఎందుకంటే స్వర్గలోకాధిపత్యం కోరి ఇంద్రపదవి కోసం గౌతముడు తపస్సు చేస్తున్నాడు. మానవుడు స్వర్గాధిపత్యం చెయ్యటం చాలా అరిష్టము. ఆయనకి కోపం తెప్పించి, తపోభంగం చెయ్యటానికి, నాకంతకన్న దారి కనిపించలేదు. ఫలితంగా నాకీ దుస్థితి కలిగింది. మీరంతా ఏదైనా ఉపాయం ఆలోచించి నాకు సాయపడండి' అన్నాడు.

అది విని దేవతలు అగ్నిహోత్రుణ్ణి వెంటపెట్టుకుని, పితృదేవతల దగ్గరకి వెళ్ళారు. అపుడు పితృదేవతలు ఒక యాగం చేస్తున్నారు. ఆ యజ్ఞపశువుగా ఒక మేకని అక్కడ కట్టేశారు. ఆ మేకవృషణాలు కోసి దేవేంద్రునికి అతికించమని, అగ్నిహోత్రుడు పితృదేవతల్ని కోరాడు.

పితృదేవతలలాగే చేశారు. అప్పట్నించీ ఇంద్రుడు మేషాండుడు అయ్యాడు. ఆనాటినించీ పితృదేవతలకి యాగపశువైన మేకకి, వృషణాలు తొలగించి బలి అర్పించటం ఆచారమైంది.

'రామచంద్రా, ఆరోజునించి, ఇప్పటిదాకా, అహల్య అతి కఠినమైన నియమాలతో తపస్సు చేస్తూవుంది. దేవతా స్వరూపిణి అయిన, ఆ సౌభాగ్యవతిని, ఇపుడు నువ్వు చూడాలి. నీ దర్శనం వల్ల, ఆమె పూర్వపు స్థితిని పొందగల్గుతుంది' అని చెప్పి రామలక్ష్మణులతో, ఆ ఆశ్రమపదం ప్రవేశించాడు. అక్కడ అదృశ్యరూపంలో వుండి, తపోదీప్తులతో ప్రకాశిస్తున్న, అహల్యని రాముడు చూశాడు. రామదర్శనంతో, ఆమె పాపవిముక్తా, శాపవిముక్తా అయింది. రామలక్ష్మణులకి సాష్టాంగపడి, అహల్య, వారికి అర్ఘ్యపాద్యాదులిచ్చి వారిని సత్కరించింది.

దివ్యదృష్టి వల్ల అహల్యకి శాపవిముక్తి అయిందని తెలుసుకుని, గౌతముడు అక్కడికి వచ్చాడు.

ఆ తపస్సంపన్నురాలిని, రాముని సమక్షంలో స్వీకరించాడు. దేవదుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. గంధర్వులు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు.

ఆ ముని దంపతులు ఆనందంతో రామలక్ష్మణులనీ, విశ్వామిత్రునీ, వారి పరివారాన్ని సన్మానించారు.

వారిదగ్గర వీడ్కోలు తీసుకుని, విశ్వామిత్రుడు తన అనుచరులతో ఈశాన్యదిక్కుగా ప్రయాణం చేసి, మిథిలానగరం చేరి, జనక మహారాజు యొక్క యజ్ఞవాటికని ప్రవేశించాడు. యజ్ఞవాటిక చాలా చక్కగా వుంది. దేశదేశాల నుంచీ, వేద వేదాంగ పారంగతులైన, బ్రాహ్మణులు, వేల సంఖ్యలో వచ్చి విడిది చేసి వున్నారు.

జనసమ్మర్థము అంతగా లేని ఒక చెరువు గట్టున, విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో తన అనుచరులతో విడిది చేశాడు. ఆ బ్రహ్మర్షిరాక జనక మహారాజుకి తెలిసింది. వెంటనే ఆయన తన పురోహితుడైన శతానందునితో వచ్చి విశ్వామిత్రుని దర్శనం చేసుకున్నాడు. అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించాడు.

ఆయన చేసిన మర్యాదకి విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు. 'రాజా నీ యజ్ఞం నిర్విఘ్నంగా జరుగుతోందా? నీ రాజ్యంలో అంతా కుశలంగా వున్నారా? అని సాదరంగా ప్రశ్నించాడు. జనకుడు తన రాజ్యంలో అంతా కులాసా అనీ, తన యజ్ఞం నిర్విఘ్నంగా జరుగుతోందనీ చెప్పాడు. ఆ తర్వాత శతానందుణ్ణి మిగిలిన ఋత్విజుల్నీ కుశలప్రశ్నలు వేశాడు విశ్వామిత్రుడు.

అందరూ వారి వారి స్థానాలలో కూర్చున్నాక జనకమహారాజు

విశ్వామిత్రునితో 'మహాత్మా మీదర్శన భాగ్యం వల్ల నా యజ్ఞం సఫలమైంది. నేను ధన్యుణ్ణి అయ్యాను నా యజ్ఞం ఇంకొక్క పన్నెండు రోజులు జరుగుతుంది. అంతవరకు మీరు ఇక్కడే వుండి నా యజ్ఞం విజయవంతం చెయ్యవలసిందిగా నా ప్రార్థన' అన్నాడు.

విశ్వామిత్రుడు అంగీకరించాడు. అపుడు జనకుడు రామలక్ష్మణులని చూసి 'స్వామీ తేజోమూర్తులైన ఈ బాలకులెవరు? ఖడ్గతూణీరధనుర్ధారులై, వీరు సాక్షాత్తు విష్ణుమూర్తిలా వున్నారు. కాలినడకన మీ వెంట వచ్చారు. కారణమేమైనా వుందా?' అని ప్రశ్నించాడు.

విశ్వామిత్రుడు, వారిద్దర్నీ దశరథ కుమారులుగా చెప్పి తనవెంట రావటానికి వున్న కారణాలన్నీ వివరించి చెప్పాడు. 'మహారాజా, ఈ తేజోమూర్తులు, నా యాగం సంరక్షించి, అహల్యా శాపవిమోచనం చేసి, నీదగ్గర వున్న శివధనుస్సు చూశాక అయోధ్యకి వెళ్దామని, ఇలా వచ్చారు' అని చెప్పారు.

ఆ మాటలు విన్న శతానందుడు, ఆశ్చర్యంగా 'ఏమిటి? తల్లి శాపవిముక్త అయిందా? మహానుభావుడైన దశరథనందనుడితడేనా? నా తల్లిదండ్రుల గురించిన వృత్తాంతమంతా వీరికి వివరించారా? అని తొట్రుపాటుతో ప్రశ్నించాడు శతానందుడు, గౌతమమహర్షి పుత్రుడు.

'నీ తల్లి అహల్య శాపవిమోచన పొంది, నీ తండ్రిని కలుసుకుని సుఖంగా వుంది శతానందా. నీతల్లిదండ్రుల వృత్తాంతమంతా వీరికి వివరించి చెప్పాను' అన్నాడు విశ్వామిత్రుడు.

శతానందుడు ఆనందబాష్పాలతో రామునికి కృతజ్ఞతలు చెప్పాడు. 'రఘురామా, నీకు స్వాగతం. దైవకృపవల్ల, ఈ విశ్వామిత్రుడు నిన్ను చేరదీశాడు. ఈయన అపరాజితుడు. తన తపః ప్రభావంతో ఎన్నెన్నో మహత్కార్యాలు చేసి, చివరికి బ్రహ్మర్షి అయ్యాడు' అంటూ విశ్వామిత్రుని గురించిన చరిత్ర అంతా రాముడికి చెప్పాడు.

'రామచంద్రా, ఈ విశ్వామిత్రుడు పూర్వాశ్రమంలో పరమధార్మికుడైన మహారాజు. చాలాకాలం ప్రజాహితంగా రాజ్యపాలన చేశాడు. తర్వాత, ఒక అక్షౌహిణి సైన్యం వెంటబెట్టుకుని, దేశాటన చేశాడు.

అలా అనేక దేశాలూ, పుణ్యతీర్థాలూ తిరిగి మున్యాశ్రమాలు సేవిస్తూ వశిష్ఠముని ఆశ్రమానికి వెళ్ళాడు. కలకలలాడుతున్న ఆ ఆశ్రమంలో అనేకమంది బ్రహ్మర్షులూ, దేవర్షులూ, తపస్సిద్ధులూ, తపస్సు చేస్తున్నారు. వారందరితో కలసి

వశిష్ఠుడు, విశ్వామిత్రుని సాదరంగా ఆహ్వానించాడు. ఇష్టాగోష్ఠి అయ్యాక, వశిష్ఠుడు తనదగ్గర వున్న కామధేనువుని అర్చించి, ఆ మహారాజుకీ ఆతడి అక్షౌహిణీ సైన్యానికీ, షడ్రసోపేతమైన విందుభోజనం పెట్టాడు. వారంతా ఆ విందు నారగించి సంతుష్టులైనారు.

కామధేనువుని చూసిన విశ్వామిత్రుడు, ప్రలోభంతో ఒక లక్ష ఆవుల్నీ, బంగారు నాణాల్నీ తీసుకుని ఆ కామధేనువుని, తనకివ్వవలసిందిగా అడిగాడు వశిష్ఠుణ్ణి. పైగా అది రాజాధిరాజుల దగ్గర వుండవలసిన ఆవు అన్నాడు.

కానీ, వశిష్ఠుడు ఒప్పుకోలేదు. విశ్వామిత్రుడు వెలలేని సంపదలిస్తాననీ, ఆ ఆవుని, తన కివ్వమనీ చాలా ఒత్తిడి చేశాడు. వశిష్ఠుడు మాత్రం అస్సలు అంగీకరించక, 'నా సర్వస్వం ఈ కామధేనువే. నువ్వింక అడగవద్దు' అని ఖండించి చెప్పేశాడు. విశ్వామిత్రుడికి కోపం వచ్చింది. ఆయన తన భటుల్ని పిల్చి, ఆ కామధేనువుని, లాక్కురమ్మని, ఆదేశించాడు. వారు బలవంతంగా లాక్కుపోసాగారు.

ఆ కామధేనువు ఏడుస్తూ, వారందర్నీ విదిలించి, వాయువేగ మనోవేగాలతో వశిష్ఠుని దగ్గరకి పారిపోయివచ్చి 'బ్రాహ్మణోత్తమా, నేనేం తప్పుచేశానని, నన్నిలా తరిమేస్తున్నావు?' అని నిలదీసి అడిగింది.

వశిష్ఠుడు ఆప్యాయంగా దాన్ని చేరదీసి ఇలా అన్నాడు. 'శబలా, నువ్వు నాకు చెల్లెలు లాంటి దానివి. నిన్నెందుకు వదిలేస్తానమ్మా? నీ తప్పేం లేదు. కాని ఈ విశ్వామిత్రుడు క్షత్రియుడు. అక్షౌహిణీ సేనని వెంటబెట్టుకుని వచ్చాడు. చాలా బలవంతుడు. నేనా బ్రాహ్మణుణ్ణి. ఈతణ్ణి ఎదుర్కొనే శక్తి నాకు లేదు. ఆయన ఈ దేశాన్ని ఏలే చక్రవర్తి. కనక ఆయన్ని ప్రతిఘటించే శక్తి నాకు లేదు' అన్నాడు విచారంగా.

అపుడా శబల, 'బ్రహ్మర్షీ, బ్రాహ్మణుని బలం ముందు క్షత్రియబలం ఏపాటిది? అంతేగాదు మీరు అధిక బలసంపన్నులు కనుక నాకు అనుజ్ఞనివ్వండి. వీడి దర్పం అణచివేస్తాను' అంది రోషంతో

అది వినగానే వశిష్ఠుడు తన కర్తవ్యం గుర్తించి, 'శబలా శత్రువుల్ని సంహరించగల సేనలను సృష్టించు' అన్నాడు.

అపుడా కామధేనువు 'అంబా' అని రంకె వేసింది. అప్పటికపుడు, వందలకొద్దీ 'పహ్లవులు' అనే సైనికులు పుట్టుకొచ్చారు. యవనులు, శకసేనలు వందల కొద్దీ పుట్టుకొచ్చారు. వారంతా విశ్వామిత్రుడి సేనలపై పడి తరిమి కొడుతూంటే ఆధాటికి, విశ్వామిత్రుని సేనలు ఆగలేకపోయాయి.

విశ్వామిత్రుడి సేనలు పరుగులు తియ్యటం చూసి, వశిష్ఠుడు ఉత్సాహంతో మళ్ళీ ఆజ్ఞాపించాడు.

మళ్ళీ వేల కొద్దీ కాంభోజులు, పహ్లవులూ, యవనులూ, శకులూ, మ్లేచ్ఛులు, కిరాతులూ పుట్టుకొచ్చి, విశ్వామిత్రుడి రథ, గజ, తురగ, పదాతి సేనలను చిటికెలో నాశనం చేశారు.

ఆ సంగతి తెలిసిన విశ్వామిత్రుని పుత్రులు వందమందీ క్రోధావేశాలతో వశిష్ఠుని ఆశ్రమం మీద దాడిచేశారు.

వారిని చూసి వశిష్ఠుడు క్రోధంతో హుంకరించాడు. వెంటనే వారు భస్మమైపోయారు.

అదిచూసి విశ్వామిత్రుడు ఖిన్నుడైపోయాడు. పట్టరాని దుఃఖంతో, చావకుండా మిగిలిన ఒక్క కొడుక్కీ, తన రాజ్యం పట్టంకట్టి, తపస్సు చెయ్యటానికి, హిమాలయాలకి వెళ్ళాడు. చాలా సంవత్సరాలు తపస్సు చేశాక ఈశ్వరుడు ప్రత్యక్షమై, ధనుర్వేదాన్ని వరంగా ఇచ్చాడు. దాని ప్రభావం వల్ల ప్రపంచంలోని అస్త్రశస్త్రాలన్నీ ఆయనకి స్వాధీనం అయ్యాయి. సర్వశక్తి సంపన్నుడై, మళ్ళీ వశిష్ఠుని మీద దాడిచేశాడు. శక్తివంతమైన అస్త్రాలన్నీ ప్రయోగించాడు.

ఆ అస్త్రాల ప్రభావం వల్ల వశిష్ఠుని తపోవనమంతా అంటుకుని, భగ భగ మండసాగింది. అక్కడ తపస్సు చేసుకుంటున్న ఇతర తాపసులు, వన్యమృగాలూ, పశుపక్ష్యాదులూ, భయభ్రాంతులై ఇటు, అటు పరుగులు తీశారు. వశిష్ఠుడి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడ్డాయి.

విశ్వామిత్రుని చూసి 'మూర్ఖుడా, ఎంతోకాలం శ్రమించి నిర్మించుకున్న నా ఆశ్రమాన్ని నాశనం చేశావు ఇంక నువ్వు బతికి వుండటానికి వీలులేదు' అంటూ బ్రహ్మదండాన్ని విశ్వామిత్రునిపై ప్రయోగించాడు. అది కాలదండంలా పొగలు జిమ్ముతూ, బయల్దేరింది. అపుడు వెంటనే విశ్వామిత్రుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆగ్నేయాస్త్రం బ్రహ్మదండాన్ని నిరోధించింది. తనదగ్గరున్న అస్త్రాలన్నీ వెంటవెంటనే ప్రయోగించాడు విశ్వామిత్రుడు. ముల్లోకాలూ ఆశ్చర్యపోయేటట్లు తన మంత్రదండంతో వాటినన్నిటినీ రూపుమాపాడు వశిష్ఠుడు. ఆఖరికి విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు ఆ బ్రహ్మాస్త్రం వశిష్ఠుని బ్రహ్మదండాన్ని పక్కకి నెట్టి దూసుకుపోయింది.

ఏం జరుగుతుందో అని దేవతలు, గంధర్వులూ అందరూ చకితులై చూస్తున్నారు. ముల్లోకాలు తల్లడిల్లిపోయాయి. తన బ్రహ్మవిద్యాబలంతో దానిని

మింగేశాడు వశిష్ఠుడు. బ్రహ్మాస్త్రం ఆయన ఉదరంలో ప్రవేశించగానే, అతి భయంకరంగా మారిపోయాడాయన. ఆయన చెవుల్లోంచి, రోమకూపాల్లోంచి పొగలు రాసాగాయి. మంటలు మండి, రవ్వలు జిమ్ముతూ ఆయన శరీరం అగ్నిగోళంలా మండసాగింది.

మహామునులంతా, వశిష్ఠుని దర్శించి, 'ఓ బ్రాహ్మణోత్తమా తమ శక్తి అమోఘం. ఈ బ్రహ్మతేజాన్ని మీలోనే ఇముడ్చుకోండి. దానిని వదిలితే, ఈ లోకాలు భరించలేవు' అని ప్రార్థించారు. అపుడా తేజోమూర్తి కోపం ఉపశమించింది.

విశ్వామిత్రుడు పరాభవంతో ఉడికిపోయాడు. ఛీ - ఛీ, నాక్షత్రియబలం నిష్ప్రయోజనమయింది. బ్రాహ్మణబలమే గొప్పది. ఒక్క బ్రహ్మదండంతో, వశిష్ఠుడు నా అస్త్రాలన్నిటినీ హతమార్చాడు. అని పరిపరివిధాలా ఆలోచించాడు. ఎలాగైనా బ్రహ్మత్వం సిద్ధింపజేసుకుని, బ్రహ్మర్షి కావాలనే పట్టుదలతో, భార్యతో గూడా, దక్షిణదిక్కుకు వెళ్ళి అక్కడ అతి కఠిన నియమాలతో తపస్సు చేయటం ప్రారంభించాడు.

కొంతకాలానికి, విశ్వామిత్రునికి హవిష్యందుడు, మధుష్యందుడు, ధృడనేత్రుడూ, మహారథుడు అని నలుగరు కుమారులు కలిగారు.

చాలాకాలం తపస్సుచేశాక, విశ్వామిత్రుడికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై 'ఓ తపోధనా, నీ తపశ్శక్తితో రాజర్షులందర్నీ జయించావు. కనక ఈ నాటినించీ నువ్వుకూడా రాజర్షిగా పరిగణింపబడతావు అని చెప్పి అంతర్ధానమైపోయాడు. ఆ మాటలు విన్న విశ్వామిత్రుడు నీరసించిపోయాడు. ఇంతటి తపస్సుకీ ఇదా ఫలం అని భిన్నుడైనాడు.

బ్రహ్మర్షి స్థానం పొందటానికని, మళ్ళీ తపస్సు ప్రారంభించాడు ఆ కాలంలో ఇక్ష్వాకు వంశంలో త్రిశంకువు అనే రాజు వుండేవాడు. ఆయన పరమధార్మికుడు, బొందెతో కైలాసానికి వెళ్ళాలని, ఒక కోరిక కలిగిందాయనకి. కులగురువైన వశిష్ఠుని పిల్చి, బొందెతో స్వర్గానికి వెళ్ళటానికి ఒక యాగం చేయించమని కోరాడు.

అది అసాధ్యమని చెప్పి వశిష్ఠుడాయనని మందలించాడు. త్రిశంకువు పట్టుదలతో ఆయన కుమారులు వందమందినీ పిల్చి 'మీరైనా అలాంటి యజ్ఞం చేయించండి' అని అడిగాడు. వారి తండ్రి నిరాకరించిన కోరికని తీర్చటానికి వారు అంగీకరించలేదు. త్రిశంకువుకి చాలా కోపం వచ్చింది. వారినీ, వారి తండ్రినీ కూడా తన ఇంటి పురోహితులుగా వుండటానికి వీల్లేదని శాసించాడు. ఇంకెవరైనా సమర్థుడైన పెద్దమనిషిని గురువుగా చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఈ నిర్ణయం విన్న వశిష్ఠుని కుమారులు మండిపడి, మా తండ్రి అంతటి ప్రతిభాశాలిని తిరస్కరిస్తున్నావు కనక, ఛండాలుడివిగా మారిపో అని శపించారు. తెల్లారేసరికి ఛండాలుని రూపం వచ్చేసింది. త్రిశంకువుకి శరీరమంతా బిరుపెక్కి, నల్లబడి, తలవెంట్రుకలు కురచగా నిక్కబొడుచుకుని, ధరించిన దుస్తులు నీలంగా మారిపోయాయి. ఆభరణాలన్నీ ఇనపవి అయిపోయాయి. ఆ రూపంలో వున్న త్రిశంకువుని చూసి మంత్రులు, పరివారం తప్పించుకుని దూరం దూరంగా తిరగసాగారు.

అయినాసరే, ధైర్యం కోల్పోలేదాయన. విశ్వామిత్రుని శరణువేడాడు. త్రిశంకుని చరిత్ర అంతావిని, విశ్వామిత్రుడు చాలా జాలిపడ్డాడు. దైవోపహతుజనైన నన్ను మీరే ఉద్ధరించాలి. నా మనోరథము తీరుస్తారనే ఆశతో వచ్చాను' అన్నాడు, త్రిశంకువు దుఃఖంతో. విశ్వామిత్రుడికి వశిష్ఠుని మీద పగతీర్చుకునె అవకాశం కల్గిందని పొంగిపోయాడు.

త్రిశంకువుని ఊరడిస్తూ, 'నాయనా, నువ్వు పరమధార్మికుడివీ సత్య సంధుడివీ అని నాకు తెలుసు. నీ మనోరథం నేను తీరుస్తాను. మహామహులైన ఋత్విజులని పిలిపించి నీచేత యాగం చేయిస్తాను. ఈ ఛండాలుని రూపంతోనే, నిన్ను స్వర్గలోకానికి పంపిస్తాను' అని త్రిశంకువుకి అభయమిచ్చి తన నలుగురు కుమారుల్ని పిల్చి, యజ్ఞ సంరంభాలు సమకూర్చమని ఆదేశించాడు.

శిష్యులందర్నీ, చేరబిల్చి 'అన్ని దేశాలకీ వెళ్ళి బహుశ్రుతులూ, ఋత్విజులు అయిన మహర్షులందర్నీ శిష్యసమేతంగా ఆహ్వానించి తీసుకురమ్మని, ఒక వేళ ఎవరైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే విని తనకి చెప్పమనీ ఆదేశించాడు. విశ్వామిత్రుని ఆహ్వానాన్ని అందుకుని సమస్తదేశాల నుంచీ బ్రాహ్మణోత్తములంతా వచ్చారు.

కాని వశిష్ఠుని కుమారులు, మహోదయుడనే ముని మాత్రం రాలేదు. వారు కోపంతో మండిపడుతూ

'యజ్ఞకర్త ఛండాలుడా! యజ్ఞం చేయించేవాడు క్షత్రియుడా! ఈ యజ్ఞహవిస్సుని దేవతలెలా స్వీకరిస్తారు? ఆ ఛండాలుడు పెట్టిన అహారాన్ని ఆరగించిన బ్రాహ్మణులు మాత్రం స్వర్గానికి ఎలా వెళ్తారు? అని వారు నిష్ఠురోక్తులు పలికారని ఆయన శిష్యులు విశ్వామిత్రునితో చెప్పారు. విశ్వామిత్రునికి పట్టరాని ఆగ్రహం కలిగింది' మహోగ్రమైన తపస్సు చేసినవాణ్ణి. నన్నే దూషిస్తారా! ఆ దురాత్ములు భస్మమైపోవాలి. వారు మరణించాక మళ్ళీ ముష్టికులు అనే

హీనజాతిలో పుట్టి, శవభక్షకులై, కుక్క మాంసం తిని జీవించాలి. ఆ మహోదయుడు లోకమంతా దూషించే, కిరాతకునిగా పుట్టాలి' అని శపించాడు.

అప్పటికి కాస్త శాంతించి ఆహూతులైన మునుల్ని చూసి, మహర్షులారా, ఇక్ష్వాకువంశీయుడైన ఈ త్రిశంకు మహారాజు, బొందెతో స్వర్గానికి వెళ్ళాలనే కోరికతో ఒక మహాయాగం చేయ సంకల్పించాడు. కనక మనమంతా కలిసి ఆ మహాయాగం సఫలం అయ్యేటట్లు చేయించాలి. మీ ఉద్దేశ్యం చెప్పండి' అన్నాడు.

వారంతో తమలో తాము సంప్రతించుకున్నారు. ఈ విశ్వామిత్రునికి కోపం వస్తే మనక్కూడా ఆ వాశిష్ఠులకి పట్టిన గతే పడ్తుంది. కనక ఈయన చెప్పినట్లు వినటమే ఉత్తమం అనుకున్నారు. యజ్ఞం ఆరంభమైంది. ఆ మహాయజ్ఞానికి యాజకుడు విశ్వామిత్రుడు. మంత్రకోవిదులంతా ఋత్విజులు. అయా కర్మలన్నింటినీ, శాస్త్రవిహితంగా జరిపించారు. హవిర్భాగాలు స్వీకరించవలసిందిగా కౌశికుడు, దేవతల్ని ఆహ్వానించాడు. కాని దేవతలలో ఒక్కరూ కూడా రాలేదు.

విశ్వామిత్రుడు క్రోధంతో 'ఓ త్రిశంకూ, యజ్ఞం విఫలమైందని విచారించకు. నా తపఃశక్తినంతా నీకు ధారబోసి దేహంతో కూడా నిన్ను స్వర్గానికి పంపిస్తాను' అని, "నా స్వార్జిత తపస్సు చాలా ప్రభావం కలది అయినట్లైతే ఈ త్రిశంకువు ఇపుడే శరీరంతో స్వర్గానికి వెళ్ళాలి" అని తన తపశ్శక్తి అంతా అతడికి ధారపోశాడు.

అందరికీ ఆశ్చర్యం కలిగేలా అందరూ చూస్తుండగా త్రిశంకువు దేహంతో స్వర్గానికి చేరుకున్నాడు. కాని స్వర్గాధిపతి దేవేంద్రుడు 'త్రిశంకూ, నువ్వు గురుశాపహతుడవు. కనక ఈ దేవలోకంలో నీకు స్థానం లేదు. తల్లక్రిందులుగా మళ్ళీ నువ్వు భూలోకానికి పో' అని ఆజ్ఞాపించాడు.

త్రిశంకువు తల్లక్రిందులుగా పడిపోతూ 'విశ్వామిత్ర మహామునీ, రక్షించు' అని అరిచాడు.

ఆ కేకలు విశ్వామిత్రునికి వినిపించాయి. ఆయనకి చెప్పరాని ఆగ్రహం కలిగింది. 'అక్కడే నిలు' (తిష్ఠ - తిష్ఠ) అంటు తన తపోబలంతో, త్రిశంకువు భూమిమీద పడకుండా అంతరిక్షంలో ఆపాడు.

అప్పటికప్పుడు విశ్వామిత్రుడు తన యావత్తు తపోబలము వెచ్చించి, త్రిశంకువు నిల్చిన ప్రదేశంలో ఇంకో దేవలోకం సృష్టించటానికుద్యుక్తుడయ్యాడు. ఆ చర్యకి దేవతలంతా భయపడి, విశ్వామిత్రుని దగ్గరకి పరిగెత్తుకుని వచ్చి, 'మహానుభావా, తమరు సర్వం తెలిసినవారు. ఆ త్రిశంకువు గురుశాపోపహతుడు. కనక దేవలోకంలో ప్రవేశానికి అనర్హుడు' అన్నారు.

విశ్వామిత్రుడు శాంతించి 'దేవతలారా, నేను ఈ త్రిశంకువుని శరీరంతో స్వర్గానికి పంపిస్తానని వాగ్దానం చేశాను. నా వాక్కు అసత్యం కారాదు. మీలోకంలో ఇతడికి స్థానం లేకపోవచ్చు. ఇపుడీయన వున్న ప్రదేశమే ఇంకో స్వర్గం అవుతుంది. నేను సృష్టించిన ఈ స్వర్గం, ఈ నక్షత్రాలు, అన్నీ స్థిరంగా వుండాలి. దీనికి మీరు అభ్యంతరం చెప్పటానికి వీలులేదు' అన్నాడు.

దేవతలు అంగీకరించక తప్పలేదు. 'మహామునీ జ్యోతిశ్చక్రానికి వెలుపల మీరు సృష్టించిన నక్షత్రాలు ప్రకాశిస్తాయి. గురుశాపోపహతుడైన ఈ త్రిశంకువు, వాటి నడుమ తలక్రిందులుగా ఉంటాడు. ఈ ఇక్ష్వాకువు, స్వర్గంలో వున్నట్లే, ఈ నక్షత్రాల నడుమ కీర్తితో ప్రకాశిస్తూ వుంటాడు' అన్నారు. విశ్వామిత్రుడు అందుకు ఒప్పుకున్నాడు. యజ్ఞం సమాప్తమైంది. దేవతలూ మహర్షులూ ఎవరిదారిని వారు వెళ్ళిపోయారు.

ఆవిధంగా దక్షిణదిశలో తపస్సు చేసి తాను సంపాదించిన తపశ్శక్తి అంతా విశ్వామిత్రుడు త్రిశంకువుకి ధారపోసి, ఆ తర్వాత బ్రహ్మర్షి కావాలనుకున్న తన సంకల్పం గుర్తు తెచ్చుకున్నాడు. పశ్చాత్తాపంతో, పడమటి దిక్కున విశాలముగా వున్న పుష్కరతీర్థ తీరంలో మళ్ళీ తపస్సు మొదలుపెట్టాడు.

ఎలాగైనా సరే బ్రహ్మర్షిస్థానం పొందాలని పట్టుదలతో ఫలమూలాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటూ, మహోగ్రమైన తపస్సు చెయ్యసాగాడు.

అపుడు, అయోధ్యని అంబరీషుడు అనే మహారాజు పాలిస్తున్నాడు. ఆయన ఉత్కృష్టమైన ఒక యజ్ఞం ప్రారంభించాడు. తన ఇంద్రపదవికి ముప్పు వస్తుందన్న భయంతో ఇంద్రుడు ఆయన యాగ పశువుని ఎత్తుకుపోయాడు. యజ్ఞపశువు కనిపించకపోయేసరికి, పురోహితుడు కంగారుపడి, 'రాజా, ఈ దోషం నిన్ను.- మమ్మల్ని కూడా నాశనం చేస్తుంది కనక వెంటనే యజ్ఞ పశువుని వెతికించి తెప్పించు. ఒకవేళ యజ్ఞపశువు దొరకకపోతే నరపశువుని తెప్పించు' అన్నారు.

అంబరీషుడు వెంటనే వేలకొద్దీ ఆవుల్ని వెంటబెట్టుకుని స్వయంగా యాగపశువుని వెతకటానికి బయల్దేరాడు కాని ఎంత వెతికినా యజ్ఞ పశువు జాడ తెలియలేదు. చివరికి భృంగతుంగము అనే పర్వతప్రాంతంలో భార్యాపుత్రులతో నివసిస్తున్న, ఋచీక మహాముని ఆశ్రమానికి వెళ్ళాడు ఆయనని అర్చించి, మహర్షీ, నా యాగపశువు దొరకకుండా పోయింది. మీకు ముగ్గురు కుమారులున్నారు కదా ఒక లక్షగోవుల్ని తీసుకుని, ఒక కుమారుణ్ణి నాకు ఇవ్వండి' అని ప్రార్థించాడు.

ఋచీకుడూ, ఆయన భార్యా ఆలోచించారు పెద్ద కొడుకునివ్వటానికి ఆయన మనస్సొప్పలేదు. చిన్న కొడుకునివ్వటానికి తల్లి ఒప్పుకోలేదు. మధ్యవాడు శునశ్శేఫుడు. తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలిశాక, తననే యజ్ఞపశువుగా అర్పించమని కోరాడు.

అంబరీషుడు అమితానందంతో లక్షగోవులూ సమర్పించి, శునశ్శేఫుణ్ణి రథం మీద ఎక్కించుకుని బయల్దేరాడు. మిట్ట మధ్యాహ్నానికి పుష్కరతీర్థం చేరారు వారు. అంబరీషుడు తన పరివారంతో కొంతసేపు అక్కడ విశ్రమించాడు.

శునశ్శేఫుడు దాహం తీర్చుకుందుకు, పుష్కర తీర్థానికి వెళ్ళి, అక్కడ తపస్సు చేసుకుంటున్న విశ్వామిత్రుని చూశాడు. జరిగినదంతా ఆయనకి చెప్పి తనని కాపాడమని, ఆయన పాదాలపై బడి శరణువేడాడు. విశ్వామిత్రుడతనిని ఓదార్చి, తన కుమారులవైపు చూసి, నాయనలారా, మీలో ఎవరో ఒకరు ఈఅంబరీషుని యజ్ఞపశువుగా వెళ్ళండి. మీ తండ్రినైన నన్ను ఇతడు శరణువేడాడు. కనక మీకు తండ్రి ఋణం తీర్చుకునే సమయం వచ్చింది' అన్నారు.

కాని వారు పరిహాసంగా నవ్వి 'తండ్రీ, మధురమైన ఆహారపదార్థాలు వదిలి కుక్క మాంసం తిన్నట్లు మీరు మీ స్వంత పిల్లలను వదలి, పరాయి బాలుని కాపాడాలని చూస్తున్నారు ఇది ధర్మమేనా? అన్నారు

విశ్వామిత్రుడు కళ్ళుకోపంతో ఎఱ్ఱబడ్డాయి. 'ఔరా! తండ్రినైన నన్ను ఎదిరించి, ఇలా ధర్మరహితంగా, దారుణంగా మాట్లాడుతున్నారా! మీరు కూడా వాశిష్ఠుల్లాగే ముష్టికులై, కుక్క మాంసం తింటూ, ఈ భూమిమీద వేలకొద్దీ సంవత్సరాలు జీవించండి' అని శపించాడు. ఇదంతా చూస్తున్న శునశ్శేఫుడు చాలా దిగులు పడిపోయాడు. విశ్వామిత్రుడు ఆ బాలునికి ధైర్యం చెప్పి, విభూతి మంత్రించి, రక్షకట్టాడు. అతడికి, రెండు మంత్రాలు ఉపదేశించాడు. 'నాయనా, నిన్ను యూపస్తంభానికి కట్టినపుడు, ఈ రెండు మంత్రాలు పఠించి, జపించు. ధైర్యం విడువవద్దు. నీకు జీవిత సిద్ధి కల్గుతుంది నిశ్చింతగా వుండు' అని దీవించాడు.

శునశ్శేఫుడి మనస్సు కుదటబడింది. అంబరీషుని దగ్గరకి పరిగెత్తుకు వెళ్ళి 'రాజా, శీఘ్రంగా బయల్దేరండి యజ్ఞకర్మ తొందరగా ముగించండి' అన్నాడు.

అంబరీషుడు 'తథాస్తు' అంటూ ఉత్సాహంగా తన నగరానికి వెళ్ళి యజ్ఞం ప్రారంభించాడు.

శునశ్శేఫుడి ఒళ్ళంతా గంధంపూసి, ఎఱ్ఱవి వస్త్రాలు కట్టి, ఎఱ్ఱని పూలదండలు వేసి, యూపస్తంభానికి కట్టేశారు.

శునశ్శేపుడు అచంచలమైన విశ్వాసంతో, నిష్ఠగా విశ్వామిత్రుడు చెప్పిన మంత్రాలు జపించటం మొదలుపెట్టాడు. ఇంద్రోపేంద్రులు, అతని భక్తికి సంతుష్టులై దీర్ఘాయువును అనుగ్రహించారు. శునశ్శేపుడికి మృత్యుగండం గడిచి, పునర్జీవితుడైనాడు.

విశ్వామిత్రుడు పుష్కర తీర్థంలో, చాలా 'కాలం తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు సంతృప్తుడై, ప్రత్యక్షమయ్యాడు 'ఇపుడు నువ్వు నిజమైన ఋషివి' అని దీవించాడు.

అది విని విశ్వామిత్రుడు చాలా వ్యాకుల పడ్డాడు. పట్టుదలతో మళ్ళీ తపస్సు ప్రారంభించాడు. చాలాకాలం గడిచింది. ఒకనాడు ఆ పుష్కర తీర్థంలో జలకాలాడటానికి మేనక అనే అప్సరసవచ్చింది. ఆమె విశ్వామిత్రుని కంటబడింది. ఆమె సౌందర్యానికి ముగ్ధుడైన ఆ ముని ఆమెని కామించి అక్కడే కాపురం పెట్టాడు. పదిసంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి.

మేనక గర్భవతి అయ్యింది. ఇదంతా తన తపస్సు చెడగొట్టటానికి దేవతలు పన్నిన పన్నాగం అని విశ్వామిత్రుడు తెలుసుకున్నాడు.

మోహానికి లొంగిపోయినందుకు, విశ్వామిత్రుడు చాలా సిగ్గుపడ్డాడు. మళ్ళీ తన తపస్సు విఘ్నమైనందుకు చాలా కుమిలిపోతూ ఎలాగో మేనకని వదిలించుకుని, ఉత్తరదిశగా బయల్దేరాడు హిమాలయాల పక్కగా ప్రవహిస్తున్న, కౌశికీనదీ తీరానికి, వెళ్ళి మళ్ళీ దారుణమైన తపస్సు మొదలుపెట్టాడు.

చాలాకాలం అలా ఇంద్రియనిగ్రహంతో తపస్సు చేశాడు. మహోగ్రంగా సాగిన ఆ తపస్సుకి, దేవతలు భయభ్రాంతులై పోయారు. బ్రహ్మతో కూడా విశ్వామిత్రుడి దగ్గరకి వెళ్ళారు. బ్రహ్మ విశ్వామిత్రుని 'మహర్షి' అని సంబోధించాడు. అపుడు విశ్వామిత్రుడు బ్రహ్మకు నమస్కరించి 'పితామహా, నన్ను 'మహర్షి' అన్నారు. నేను జితేంద్రియుణ్ణి అయ్యానని ఒప్పుకున్నారా? అని అడిగాడు.

అపుడు బ్రహ్మ 'లేదు నాయనా, ఇంకా చాలా సాధన చెయ్యాలి' అని అంతర్ధానమయ్యాడు.

విశ్వామిత్రుడు పట్టుదలతో మళ్ళీ తపస్సు మొదలుపెట్టాడు నిరాధారంగా నేలమీద నిలబడి రెండుచేతులు పైకి ఎత్తి గాలి మాత్రం పీలుస్తూ - పూర్తిగా ఆహారం విసర్జించి పంచాగ్ని మధ్యలో నిలబడి ఉగ్రమైన తపస్సు చెయ్యసాగాడు.

ఈ దారుణమైన తపస్సుకి దేవలోకమంతా కలవరపడిపోయింది. ఇంద్రుడు రంభని పిల్చి విశ్వామిత్రుని తపస్సు విఘ్నం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

రంభ గజగజా ఒణుకుతూ, ఆయనకి కోపం వస్తే తీవ్రమైన శాపం ఇస్తాడు దేవేంద్రా. నాకు చాలా భయంగా వుంది మన్నించండి. నావల్ల కాదు' అంది.

ఇంద్రుడు రంభకి నచ్చజెప్పాడు. మన్మథుణ్ణి తోడిచ్చి పంపాడు. రంభ చక్కగా అలంకరించుకుని బయల్దేరింది. మన్మథుడు ఆ ప్రాంతాన్నంతా వసంత వనంగా మార్చేశాడు. మైమరిపించే ఆ నందనవనంలాంటి అడవిలో రంభ మధురాతి మధురంగా పాడుతూ, విశ్వామిత్రుని ఎదుట నిలిచింది. పారవశ్యంతో విశ్వామిత్రుడు కన్నులు తెరిచిచూశాడు. కన్నుల ముందర జగదేకసుందరి రంభ సాక్షాత్కరించింది. వెంటనే ఆయనలో వివేకం మేలుకుంది. ఇదంతా దేవేంద్రుని పన్నాగం అని గ్రహించాడు. కోపంతో 'దౌర్భాగ్యురాలా శిలవైపో' అని శపించాడు.

అయితే తాను కోపాన్ని జయించలేకపోయినందుకు సిగ్గుపడ్డాడు. రంభ ఏడుస్తూ ఆయన పాదాలపై బడింది. అపుడు విశ్వామిత్రుడు ఓదార్చి 'రంభా, మహా తేజోవంతుడు, తపోబలసంపన్నుడూ, అయిన ఒక బ్రాహ్మణుడు నిన్ను ఉద్ధరిస్తాడు. అపుడు నీకు శాపవిముక్తి అవుతుంది అని ఆశీర్వదించాడు. కోపావేశాలతో వున్న విశ్వామిత్రుని చూసి ఇంద్రుడూ, మన్మథుడూ పారిపోయారు.

కోపాన్ని జయించలేని తన అవివేకానికి విచారిస్తూ బ్రహ్మర్షి పదవి సంపాదించేవరకు ఆహారపానీయాలే కాకుండా గాలి కూడా పీల్చకుండా ఊపిరి బిగబట్టి తపస్సు చెయ్యాలని నిశ్చయించుకున్నాడాయన.

హిమాలయ ప్రాంతం వదలి, తూర్పుదిక్కుగా వెళ్ళి, మౌనవ్రతం అవలంబించి, మహోగ్రమైన తపస్సు మొదలుపెట్టాడు. తాను నియమించుకున్న కాలం పూర్తిగా నిష్ఠగా తపస్సు చేసి, ఆ కాలం పూర్తవగానే, దీక్ష విరమించి భోజనానికి ఉపక్రమించాడు.

అపుడు ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వెళ్ళి, అన్నం పెట్టమని యాచరించాడు. కిక్కురుమనకుండా, ప్రసన్న వదనంతో, ఆ సిద్ధాన్నం బ్రాహ్మణునికి దానం చేశాడు కౌశికుడు. మళ్ళీ తపస్సు మొదలుపెట్టి నిశ్చలంగా ఏళ్ళ తరబడి తపస్సు సాగించాడు. ఉగ్రమైన ఆ తపస్తేజానికి, ఆయన తలలోంచి పొగలు, మంటలు వచ్చాయి. ఆ పొగ, మంటలు క్రమంగా విశ్వమంతా వ్యాపించాయి. దేవతలంతా బ్రహ్మతో మొరపెట్టుకున్నారు.

అపుడు బ్రహ్మ విశ్వామిత్రుడి ముందు సాక్షాత్కరించి 'బ్రహ్మర్షీ, నీకు స్వాగతం నీ తపోబలంతో బ్రాహ్మణత్వాన్ని సంపాదించావు. ఇంక తపస్సు చాలించు. నీకు దీర్ఘాయువూ, సంకల్పసిద్ధీ అనుగ్రహిస్తున్నాను' అన్నాడు.

విశ్వామిత్రుడు అపరిమితమైన ఆనందంతో బ్రహ్మపాదాలకి నమస్కరించాడు.

ఓంకారము, వషట్కారమూ, వేదాలూ నాకు స్వాధీనం కావాలి. ఇతరులకి వాటిని ఉపదేశించే అధికారం కూడా నాకు అనుగ్రహించండి. అంతేకాదు. వశిష్ఠ మునీశ్వరుని చేత నన్ను బ్రహ్మర్షి అని పిలిపించండి. ఆయనక్షాత్రవిద్యలోనూ, బ్రహ్మవిద్యలోనూ కూడా ఆరితేరిన మహామహుడు. ఆయన నన్ను బ్రహ్మర్షి అన్న తర్వాతే నేను తపస్సు చాలిస్తాను' అన్నాడు.

బ్రహ్మ 'తథాస్తు' అన్నాడు. వెంటనే దేవతలు వెళ్ళి, వశిష్ఠ మహర్షిని తీసుకుని వచ్చారు. బ్రహ్మ ఆదేశానుసారం, వశిష్ఠుడు, విశ్వామిత్రుని కౌగిలించుకుని 'బ్రహ్మర్షీ, నీకు స్వాగతం. బ్రహ్మర్షికి వుండే అధికారాలన్నీ నీకున్నాయి' అన్నాడు. విశ్వామిత్రుడు వశిష్ఠుని పూజించి, సత్కరించి, వీడ్కోలు చెప్పాడు. బ్రహ్మ - దేవతలు వెళ్ళిపోయారు. ఆనాటినుంచీ, ఈ విశ్వామిత్రుడు భూలోకమంతా తిరిగి చూశాడు. ఈయన పరమధార్మికుడు. మహా పరాక్రమవంతుడు' అని శతానందుడు విశ్వామిత్రుని గురించి రామలక్ష్మణులకి వివరించి చెప్పాడు.

ఆ వృత్తాంతం అంతా జనక మహారాజు కూడా విన్నాడు. మహర్షికి సాష్టాంగ దండప్రమాణం చేశాడు. 'మహానుభావా, తమ దర్శనభాగ్యం వల్ల, ఈ రోజు మాకు మహత్తరమైన మీ చరిత్ర అంతా తెలిసింది. తమ తపస్సు అమోఘము. మీ చరిత్ర చాలా ఆశ్చర్యకరంగా వుంది. బ్రహ్మర్షులందరిలో ఉత్తములు మీరే. ఇప్పుడు సూర్యాస్తమయమైంది సాయంకాలవిధులు నెరవేర్చాలి. నాకు సెలవు ఇప్పించండి. రేపు ఉదయం వచ్చి, మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాను అని జనకుడు, పరివారసమేతంగా విశ్వామిత్రుడికి ప్రదక్షిణం, సాష్టాంగ దండ ప్రణామం చేసి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో విడిదికి వెళ్ళాడు. తెల్లారింది. జనక మహారాజు విశ్వామిత్రుణ్ణి, రామలక్ష్మణుల్ని తన కొలువు కూటానికి ఆహ్వానించాడు. మహర్షిని శాస్త్రోక్తంగా అర్చించి, రామలక్ష్మణులకి యథావిధిగా సత్కారం చేశాడు. అపుడు విశ్వామిత్రుడు సుఖంగా కూర్చున్నాక 'మహర్షీ, మీ ఆజ్ఞ సెలవియ్యండి' అన్నాడు.

అపుడు విశ్వామిత్రుడు చిరునవ్వుతో 'మహారాజా, ఈ రామలక్ష్మణులు దశరథ మహారాజు కుమారులని చెప్పాను కదా, మీ ఇంటవున్న శివధనుస్సు చూడాలనే అభిలాషతో వీరు నావెంట వచ్చారు కనక ఆ ధనుస్సు వీరికి చూపించు.

నీకు శుభం కల్గుతుంది. వీరి మనోభీష్టం తీరగానే వీరు అయోధ్యకి వెళ్ళిపోతారు' అన్నాడు.

అపుడు జనకమహారాజు, చిత్తం, మీ ఆజ్ఞప్రకారమే చేస్తాను కాని, ఆ శివధనుస్సు గురించిన వృత్తాంతం మీకు తెలియపరుస్తాను.

నా పూర్వీకుడు నిమిచక్రవర్తి, ఆయన కుమారుడైన దేవరాతుడు రాజ్యపాలన చేస్తుండగా దేవతలు ఈ శివధనుస్సును నిక్షేపంగా ఆయనకి ఇచ్చారు. అదెలా జరిగిందంగటే, దక్షయజ్ఞం అయ్యాక, ఆ యజ్ఞాన్ని విధ్వంసం చేసిన ఈశ్వరునికి దేవతలమీద చెప్పరాని ఆగ్రహం కలిగింది.

అపుడు ఈ ధనుస్సు నెక్కుపెట్టి 'దేవతలారా, నేను అడిగినా కూడా ఈ యజ్ఞంలో హవిర్భాగం ఇవ్వలేదు మీరు. అంచేత ఇపుడే మీ అందరి తలలు తెగవేస్తాను' అన్నాడు శివుడు తీవ్రంగా.

దేవతలు భయభ్రాంతులై శివుణ్ణి స్తోత్రం చేసి శరణుకోరారు. శివుడు కోపం తగ్గి ప్రసన్నుడైనాడు. ఆ ధనుస్సు దేవతలకిచ్చేశాడు. అపుడా ధనుస్సు తెచ్చి దేవతలు దేవరాతుడికి న్యాసంగా ఇచ్చారు. అప్పట్నుంచీ అది మా దగ్గరే వుంది.

నేను ఒకపుడు ఒక యజ్ఞం తలపెట్టి భూమిని దున్నుతుండగా నాగటిచాలుకి తగిలి ఒక ఆడశిశువు వున్న పెట్టె ఒకటి పైకి లేచింది. నాగటిచాలులో దొరికింది కనుక, ఆమెకి సీత అని పేరుపెట్టి పెంచుకున్నాను. ఆమె పెరిగి పెద్దదైంది. మహావీరుడైన రాజకుమారునికి ఆమెనిచ్చి వివాహం చెయ్యాలని సంకల్పించాను. చాలామంది రాజకుమారులు సీతని వరించటానికి వచ్చారు.

'వీర్యశుల్కంగా ఏమి సమర్పించాలి' అని అడిగారు. నేను వారికి శివధనుస్సు చూపెట్టి 'దానిని ఎక్కుపెట్టటమే నేను కోరిన వీర్యశుల్కం' అన్నాను.'

వారిలో ఏ ఒక్కరూ దానిని ఎత్తలేకపోయారు సరికదా? కనీసం అటు ఇటు కూడా కదల్చలేకపోయారు. అయోనిజ అయిన మా సీతని వివాహం చేసుకుందుకు వారికి అర్హత లేదని చెప్పాను.

వాళ్ళందరికీ పట్టరాని కోపం వచ్చింది. మిథిలానగరాన్ని చుట్టుముట్టి యుద్ధం ప్రకటించారు. ఒక సంవత్సరం పాటు ఆ ముట్టడి జరిగింది. నా సైన్యం, యుద్ధసామగ్రి అంతా నశించింది. నాకు దిగులు పట్టుకుంది. అపుడింక దారిలేక తపస్సు చేసి, దేవతల్ని సహాయం అర్థించాను. దేవతలు నాకు చతురంగ బలాల్ని అందించారు. వారి సహాయంతో శత్రువుల్ని పారద్రోలాను.

మహర్షీ, పరమభాస్వరమైన ఆ శివధనస్సుని, ఇపుడే తెప్పిస్తాను. ఈ రాముడు, ఆ శివధనుస్సు ఎక్కుపెట్టగలిగితే, నా కుమార్తె సీతని ఇతడికిచ్చి వివాహం చేస్తాను' అని ఆ శివధనుస్సు యొక్క ప్రాభవాన్ని గురించి చెప్పాడు జనకుడు.

తర్వాత మంత్రుల్ని పిల్చి శివధనుస్సుని, యజ్ఞవాటికకు తెప్పించవలసిందిగా ఆజ్ఞాపించాడు. వారు వెళ్ళి శివధనుస్సు వుంచిన రత్నపేటికని అతిప్రయాసమీద బయటకి లాగించారు. ఆ భోషాణానికి ఎనిమిది ఇనుపచక్రాలున్నాయి. చాలామంది దృఢకాయులు బలంగా దాన్ని బయటకీడ్చి, చాలా ప్రయాసపడి యజ్ఞవాటికకు తరలించారు.

అపుడు జనక మహారాజు ఆ మందసం మూత తీసి, ఆ ధనుస్సు విశ్వామిత్రుడికి చూపించాడు.

'బ్రహ్మర్షీ, మా వంశమంతా తరతరాలుగా దీన్ని చాలా నియమంతో పూజిస్తున్నాము. సురాసురులు గానీ, ఈ వింటికి నారిలాగి, బాణము సంధించిన వారెవ్వరూ ఈ నాటిదాకా లేరు. ఇదిగో దీనిని రామలక్ష్మణులకి చూపండి' అన్నాడు.

విశ్వామిత్రుడు శ్రీరాముని భుజంతట్టి 'కుమారా, అమోఘమైన ఈ శివధనుస్సు చూడు నాయనా' అన్నాడు. బ్రహ్మర్షి ఆజ్ఞ స్వీకరించి, గంధ మాల్యాదులతో అలంకరించిన ఆ శివధనుస్సును చూశాడు రాముడు.

'ఆర్యా, మీ అనుమతి అయితే ఈ ధనుస్సు చేపట్టి దీని భారమెంతో చూసి ఎక్కుపెట్టటానికి ప్రయత్నిస్తాను' అన్నాడు వినయంగా

విశ్వామిత్రుడు చిరునవ్వుతో తన అనుమతి తెలిపాడు. రాముడు ఆ వింటి నడుమ చేతితో పట్టి అవలీలగా దానిని లేపి పైకి ఎత్తాడు. అదిచూసి ఆ యజ్ఞానికి వచ్చిన మహర్షులూ, రాజరాజులూ, అంతా దిగ్భ్రాంతి చెందారు. వారలా తెల్లబోయి చూస్తుంటే రాముడు అనాయాసంగా, ఇట్టే అల్లెతాడు సంధించాడు. బాణముకూర్చి, విల్లు ఎక్కుపెట్టాడు. నారిని ఆ కర్ణాంతం లాగాడు.

అంతే..... ఒక్కసారి భూమి అంతా కంపిస్తున్నట్లు, పిడుగులు పడ్తున్నట్లు, బ్రహ్మాండమైన శబ్దం చేస్తూ ఆ విల్లు ఫెళ ఫెళా విరిగింది. ఆ శబ్దానికి విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప మిగిలిన వారంతా మూర్ఛపోయారు.

జనకమహారాజు అపరిమితానందంతో, విశ్వామిత్రుని కౌగలించుకుని, 'మహానుభావా, ఈ లోకంలో రాముడొక్కడే నిజమైన వీరుడు. ఈ పిన్నవాడు,

ఇంతటి విల్లు వంచగలడని నేనూహించనైనా లేదు. ఇదంతా చాలా అద్భుతంగా వుంది. నేను సీతని, రామునికిచ్చి కళ్యాణం చేస్తాను. సీత నా వంశప్రతిష్ఠని ఇనుమడింపచేస్తుంది' అన్నాడు.

బ్రాహ్మణోత్తమా, దశరథ మహారాజు అనుమతి కోసం ఇపుడు నా మంత్రుల్ని అయోధ్యకి పంపిస్తాను. నా మంత్రులు జరిగినదంతా వారికి వివరించి చెప్పి ఆయనని సపరివారంగా తోడ్కొని వస్తారు' అన్నాడు మళ్ళీ.

వెంటనే ఆ ఏర్పాట్లన్నీ పూర్తిచేశాడు. జనకుడి మంత్రులు, ఆఘమేఘాల మీద, మూడు పగళ్ళు, మూడు రాత్రులు, ప్రయాణం చేసి నాల్గవనాడు ఉదయానికి అయోధ్యకి చేరుకున్నారు.

రాజమందిరం చేరుకుని, దశరథ మహారాజుకి, వందనం చేసి, తాము జనక మహారాజు మంత్రులమని, విన్నవించుకున్నారు. పరస్పరం కుశల ప్రశ్నలు అయ్యాక, మిథిలానగరంలో జరిగిన సంగతి అంతా పూసగుచ్చినట్లు వర్ణించి చెప్పారు.

'మహారాజా, వీర్యశుల్క అయిన సీతని, మీ రాముడు తన పరాక్రమంతో గెల్చుకున్నాడు. కనక సీతారాములకి వివాహం చెయ్యాలని మా జనక మహారాజు నిశ్చయించారు. మీరు అనుమతించి, మీ పురోహితులతో పరివార సమేతంగా తరలివచ్చి, ఈ వివాహ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించవలసిందిగా మా రాజుగారు మిమ్ము ప్రార్థిస్తున్నారు' అని చెప్పారు.

ఆ సంగతి విన్న దశరథ మహారాజు ఆనందంతో పొంగిపోయాడు. తన మంత్రుల్ని, పురోహితుల్ని పిలిపించాడు. వశిష్ఠ వామదేవాది కులగురువుల్ని చూసి ఇలా అన్నాడు. 'విప్రవర్యులారా, మన రాముని బలపరాక్రమాలు విన్నారు కదా. శివధనుర్భంగము చేసి, సీతని వధువుగా గెల్చుకున్నాడట. మీరంతా సమ్మతిస్తే మనమంతా మిథిలకి తరలిపోదాము' అన్నాడు.

వారంతా హర్షం ప్రకటించి, 'చాలా బాగుంది' అన్నారు మర్నాడే వారందరితో దశరథుడు మిథిలా నగరానికి ప్రయాణమయ్యాడు.

ముందు పండితోత్తములు, వారి వెనుక దశరథ మహారాజు, ఆయన పరివారమూ, మేలుజాతి అశ్వములతో కూర్చిన రథములమీద ప్రయాణమై ఆ వెనక చతురంగ బలాలు వెళ్ళారు. నాల్గురోజుల తర్వాత వారు మిథిలా నగరం చేరారు. దశరథుని రాక ముందే తెలుసు కనక, జనక మహారాజు వారికి ఎదురుగా వచ్చి స్వాగతం చెప్పి ఉచితరీతిని సత్కరించాడు.

జనకుడు, దశరథుడు ఒకరినొకరు చూసుకొని అమితానందం పొందారు. జనకుడు వారందర్నీ వెంటబెట్టుకుని యజ్ఞవాటికకి వెళ్ళాడు.

అక్కడ ఒక ఉచితాసనం మీద దశరథుని కూర్చోబెట్టి, 'రాజా, పరాక్రమవంతులు పుట్టిన మీ రఘువంశం వారితో ఇపుడు వియ్యమంద బోతున్నాను. ఇదంతా నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను నా భాగ్యవశం వల్ల మీరు నా రాజ్యంలో అడుగుబెట్టి నన్ను ధన్యుణ్ణి చేశారు. వశిష్ఠాది మహర్షుల దర్శనభాగ్యం కలగటం, నా అదృష్టం. రేపటితో నా యజ్ఞం పూర్తవుతుంది' తర్వాత మహర్షుల అనుమతితో సీతారాముల వివాహం చెయ్యాలని సంకల్పించాము' అన్నాడు.

జనకుని మాటలు విన్న దశరథుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు. 'రాజా, మీరు దాతలు. దానము దాతృవశము అని పెద్దలు అన్నారు. కనక మీరెపుడు ఏం చేస్తామన్నా అపుడు అది పుచ్చుకోవటం మా విధి. ఆ మాటలు విన్న జనక మహారాజు పొంగిపోయాడు.

ఆ రాత్రి దశరథుడు తన కుమారులతో, ముచ్చటలాడుతూ, సుఖంగా గడిపాడు.

అనుకున్న ప్రకారం మర్నాడు, యజ్ఞకర్మ ముగిసింది. దీక్ష విరమించిన జనకుడు, శతానందునితో, తన తమ్ముడైన కుశధ్వజుని రమ్మని కబురు పంపమని చెప్పాడు. జనకుని తమ్ముడైన కుశధ్వజుడు, సాంకాశ్యపట్టణంలో వుంటాడు. వెంటనే అతణ్ణి పిలవటానికి దూతలు వెళ్ళాడు. కుశధ్వజుడు వెంటనే బయల్దేరాడు.

తమ్ముణ్ణి అతని కుటుంబాన్ని సాదరంగా ఆహ్వానించాడు జనకుడు. వెంటనే దశరథ మహారాజుని రమ్మని కబురు పంపాడు.

దశరథుడు తన పరివారంతో జనకుని సభాభవనానికి వెళ్ళాడు. రాజ లాంఛనాలతో వారికి, స్వాగతం చెప్పాడు జనకుడు. అంతా ఎవరిస్థానాలలో వారు ఆశీనులయ్యాక దశరథుడు జనకునితో 'రాజర్షీ, వశిష్ఠ మహర్షి మా కుల గురువు. మా ఇలవేల్పు. మహానుభావుడైన విశ్వామిత్రుడు అనుమతిస్తే మా వంశక్రమం గురించి ఆయన వివరిస్తారు' అన్నాడు. విశ్వామిత్రుడు 'తథాస్తు' అన్నాడు.

వశిష్ఠుడు లేచి సభాముఖంగా నిలబడి, సభాసదులారా! అవ్యయుడైన బ్రహ్మదేవునికి, మొట్టమొదట, మానసపుత్రుడుగా మరీచి ఈ భూలోకంలో అవతరించాడు. మరీచికి కశ్యపుడు, కశ్యపుడికి సూర్యుడు, సూర్యుడికి మనువు వరసగా జన్మించారు.

ఈ మనువు కుమారుడైన, వైవస్వత మనువు తొలిసారిగా ఈ పృథ్విని పాలించిన ప్రజాపతి.

వైవస్వత మనువు కుమారుడు ఇక్ష్వాకువు. ఇక్ష్వాకునికి, కుక్షి తర్వాత క్రమంగా వికుక్షి, బాణుడు, అనరణ్యుడు, పృథువు, త్రిశంకువు, దుందుమారుడు యవనాశ్వుడు, మాంధాత, సుసంధి, ధ్రువసంధి, ప్రసేనజిత్తు, భరతుడు, అసితుడు, వరకు, వంశానుక్రమంగా ఈ భూమిని పాలించారు.

అసితుడికి ఇద్దరు భార్యలు. ఆయన చనిపోయే నాటికి వారిద్దరూ గర్భవతులు. అయితే వారిలో చిన్నభార్య పెద్దభార్య గర్భం విచ్ఛిన్నం చెయ్యాలనే దురుద్దేశంతో ఆమెకి గరళం ఇచ్చింది. ఆహారపదార్థంతో కలిపి ఇచ్చిన ఆ గరళాన్ని తెలియక పెద్దభార్య తింది. తిన్న తర్వాత తెలిసింది. తను తిన్న ఆహారంలో గరళం వుందని ఆమె దిగులుతో చ్యవన మహర్షిని శరణు కోరింది. ఆయన అభయం ఇచ్చి, ఆమె గర్భం రక్షించాడు. నవమాసాలు మోసి చక్కని మగశిశువుకి జన్మనిచ్చిందావిడ.

ఆ కుమారుడే సగరుడు. అతడు చక్రవర్తి అయి తర్వాతి కాలంలో భూమిని పాలించాడు. సగరుడికి అస్వమంజుడు, అతనికి అంశుమంతుడు, అతని తరువాత దిలీపుడు, భగీరథుడు, కాకుత్సుడు, రఘువు, ప్రవృద్ధుడు, అంబరీషుడు, నహుషుడు, యయాతి, నాభాగుడు, అజుడు, దశరథుడు అనువారు ఆ వంశంలో వరుసగా జన్మించారు. ఆ దశరథునికి నలుగురు కుమారులు.

వారే రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు ఇది. వీరి వంశానుక్రమం. వీరంతా పరమధార్మికులు. సత్యవాదులు. మహావీరులు.

వీరిలో శివధనుస్సును సంధించిన వాడు ఈయన జ్యేష్ఠపుత్రుడు రాముడు కనుక జనక మహారాజా నీ కుమార్తెలిద్దరికీ, ఈ రామలక్ష్మణులు ఈడూ జోడుగా వున్నారు. కాబట్టి నీపుత్రికలకి వీరితో వివాహం జరిపించవలసిందిగా కోరుతున్నాను అన్నాడు.

అపుడు జనకమహారాజు తన వంశక్రమం ఇలా చెప్పాడు.

'బ్రహ్మర్షీ, మా వంశానికి మూలపురుషుడు నిమి చక్రవర్తి. పరమ ధార్మికుడు. ఆయన కుమారుడు మిథి. ఆయన ఈ మిథిలా నగరాన్ని నిర్మించాడు. ఆయన కుమారుడు జనకమహారాజు ఆయన పేరుమీదే మాది జనకవంశమైంది.

జనకునికి ఉదావసువు తర్వాత క్రమంగా నందివర్ధనుడు, సుకేతువు, దేవరాతుడు, బృహద్రధుడు, మహావీరుడు, సుధృతి, దృష్టకేతువు, హర్యశ్వుడు,

మరువు, ప్రతింధకుడు, కీర్తిరథుడు, దేవమీఢుడు, విబుధుడు, మహీధ్రకుడు, కీర్తిరాతుడు, మహారోముడు, స్వర్ణరోముడు, హ్రస్వరోముడు పాలించారు.

మా తండ్రిగారైన హ్రస్వరోముడికి, నేనూ, కుశధ్వజుడు జన్మించాము. నా తమ్ముడు చిన్నవాడుగా వుండగానే నా తండ్రి ఈ రాజ్యాన్ని, నా తమ్ముని బాధ్యతనీ నాకప్పగించి, వానప్రస్థాశ్రమానికి వెళ్ళిపోయారు. నేను నా తమ్ముని పెంచి పెద్దచేశాను.

తర్వాత కాలంలో సాంకాశ్యరాజు, సుధన్వుడు, మా సీతని కోరివచ్చి, నేను తిరస్కరించటం వల్ల నామీదికి దండెత్తి వచ్చాడు. నేను అతడ్ని ఓడించి, ఆ రాజ్యానికి, నా తమ్ముడైన కుశధ్వజుని, అభిషేకం చేశాను. ఇదీ మా వంశక్రమం. మీ ఆనతి ప్రకారం నా కుమార్తె లిద్దర్నీ రామలక్ష్మణుల కిచ్చి వివాహం చేస్తాను' అన్నాడు.

జనకుని మాటలు విన్న దశరథుడు చాలా సంతోషించాడు.

దశరథ మహారాజా, ఇవాళ మఘా నక్షత్రం. ఎల్లుండి ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో అన్నదమ్ములిద్దరికీ వివాహం చెయ్యటానికి, దివ్యమైన ముహూర్తం వుంది. కనుక మీరు ముందుగా రాముడి చేత గోదానం చేయించండి' అన్నాడు జనకుడు.

మధ్యలో విశ్వామిత్రుడు కల్పించుకుని, 'రాజా, ఇక్ష్వాకువంశం, విదేహ వంశం, రెండూ కూడా చాలా ఉన్నతమైనవి. రామలక్ష్మణులకి సీతని ఊర్మిళని ఇవ్వటానికి అంగీకరించిన నీ నిర్ణయం చాలా సముచితంగా వుంది. అలాగే మీ తమ్ముడైన కుశధ్వజుని కుమార్తెలు చక్కనివారని విన్నాను. వారిద్దర్నీ భరత శత్రుఘ్నులకిచ్చి వివాహం చేస్తే శుభప్రదంగా వుంటుందని నా ఆలోచన' అన్నాడు.

జనకుడు, కుశధ్వజుడు కూడా ఆ ఆలోచనకి చాలా ఆనందించారు బాగు బాగు అన్నారు.

నాల్గుపెళ్ళిళ్ళు ఒకేరోజు ఒకే ముహూర్తంలో జరగాలని, అందరూ ఏకగ్రీవంగా నిశ్చయించారు.

దశరథ మహారాజు తన విడిదికి వెళ్ళిపోయాడు. నాందీ కార్యాదులన్నీ శాస్త్రీయంగా జరిపించారు. నాలుగు లక్షల తరిపి ఆవుల్ని లేగదూడలతో సహా తెప్పించి, వాటి కొమ్ములకి బంగారు తొడుగులు వేయించి, పాలుపిండుకోటానికి చక్కని కంచు చెంబులు సమకూర్చి, సద్బ్రాహ్మణులకి కొడుకుల చేత దానం ఇప్పించాడు దశరథుడు. అదే సమయంలో కేకయ రాజకుమారుడూ, భరతుని మేనమామా అయిన యుధాజిత్తు అక్కడికి వచ్చాడు.

దశరథునికి నమస్కరించి 'మహారాజా మా తండ్రిగారికి, తన మనవణ్ణి చూడాలని వుందిట. వెంట తీసుకురమ్మని నన్ను పంపారు. నేను అయోధ్యకి వెళ్ళాను. మీరు కుమారుల వివాహం చెయ్యటానికి మిథిలకి వెళ్ళారని మా అక్కగారు చెప్పారు.

ఈ సంగతి మీకు చెప్పి, వివాహం కూడా చూసి వెళ్ళవచ్చు అని ఇక్కడికి వచ్చాను' అన్నాడు.

దశరథుడు చాలా సంతోషించి అతడికి అతిథి మర్యాదలు జరిపించి సన్మానించాడు.

మర్నాడు తెల్లవారగానే, తన కార్యక్రమాలన్నీ పూర్తిచేసుకుని, మహర్షులతో, కుమారులతో జనకుని యజ్ఞశాలకి ప్రయాణమయ్యాడు దశరథుడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులని తీసికెళ్ళి పన్నీరు కలిపిన జలాలతో మంగళస్నానాలు చేయించి చక్కగా అలంకరించి, చేతులకి దీక్షా కంకణాలు కట్టి పెండ్లికుమారులను చేశారు జనకుని పురోహితులు.

విజయము అనే ముహూర్తంలో వశిష్ఠాదులతో నడచివెళ్ళి కళ్యాణమంటపం సమీపంలో నిలబడి, జనక మహారాజుకి కబురుచేశాడు దశరథుడు. జనకుడు వారిని సాదరంగా ఆహ్వానించి, పెళ్ళి కుమారులని కళ్యాణవేదిక దగ్గరకి తీసికెళ్ళాడు. వశిష్ఠమహామునికి నమస్కారం చేసి, 'ఈ శుభకార్యం మీ చేతులమీదుగా జరిపించండి' అన్నాడు వినయంగా. వశిష్ఠ మహర్షి ఆనందభరితుడై విశ్వామిత్రుణ్ణీ, శతానందుణ్ణీ, తన ఎదురుగా కూర్చోపెట్టుకుని, పందిరి మధ్యలో శాస్త్రవిహితంగా, అగ్నివేదికని ఏర్పాటు చేశాడు. బంగారుపళ్ళెంలో గంధము, పూవులు, నవధాన్యాలూ మొలకలెత్తడానికి వీలైన అడుగులేని మూకుళ్ళు, ధూమపాత్రలూ, శంఖాకారంలో వున్న పాత్రలు, వగైరాలన్నీ సిద్ధం చేయించాడు.

హోమము చేసేందుకు కావలసిన స్రుక్కు, స్రువము, అనే సాధనాలు, అర్ఘ్యజలంతో నిండిన కలశాలూ, పేలాలూ, పచ్చటి అక్షింతలు, కుంకుమ, పసుపు అన్నీ నిండుగా వున్న బంగారు పాత్రలు, వేదిక చుట్టు చక్కగా అమర్చారు.

వేదిక మధ్య అగ్నిహోత్రం వెలిగించారు. సమానంగా వున్న దర్భలు, శాస్త్రప్రకారం పరిచారు. వైదిక మంత్రాలతో హోమం మొదలుపెట్టారు.

జనక మహారాజు సర్వాలంకార భూషితయైన సీతని తోడ్కొని వచ్చి రామునికెదురుగా కూర్చోపెట్టాడు. రామునితో ఇలా అన్నాడు.

'ఇయం సీతా, మమసుతా, సహధర్మచరీ, తవ.

ప్రతీచ్ఛ చైనాం భద్రంతే పాణిం గృహ్ణీష్వ, పాణినా
పతివ్రతా మహాభాగా, ఛాయేవానుగతా సదా.

రామా ఇదిగో సీత, నా కుమార్తె. ఇక మీదట నీకు సహధర్మచారిణిగా అంగీకరించు. నీకు శుభం కలుగుతుంది. ఈమె చెయ్యి నీ చేతిలో పట్టుకుని పాణిగ్రహణం చెయ్యి. పతివ్రతగా, మహాభాగ్యవంతురాలిగా, ఎల్లపుడూ నీ వెంట నీడలా వుంటుంది' అంటూ సీత చేతిని రాముని చేతిలో వుంచి మంత్రపూర్వకమైన జలం వదిలాడు. ఆ విధంగా సీతని రాముని కప్పగించి, ఆనందంతో పొంగిపోయాడు. తర్వాత వరసగా ఊర్మిళ, మాండవి, శృతకీర్తులచేతులను, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల చేతులలో వుంచి, మంత్రోదకాలతో అప్పగించాడు.

'సౌమ్యులారా, నా కుమార్తెలు మీకు ఇల్లాళ్ళు అవుతున్నారు. సుముహూర్తం సమీపించింది. అని జనకుడు అంటుండగానే, వశిష్ఠులవారు వారిచే తరువాత మాంగల్యధారణచేయించినాడు. జీలకఱ్ఱ బెల్లం తలలపై పెట్టించాడు.

వధూవరులు లేచి, అగ్నిహోత్రానికీ జనకమహారాజుకీ ప్రదక్షిణం చేశారు.

ఆ సుముహూర్తంలో ఆకాశంలోంచి పూలవాన కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలు నాట్యం చేశారు. గంధర్వులు పాడారు. నృత్య, గీత వాద్యాదులు చెలరేగుతుండగా, వధూవరులు నలుగురూ అగ్నిహోత్రానికి ముమ్మారు ప్రదక్షిణం చేశారు. వివాహం తంతు పూర్తయింది. రాజకుమారులు నల్గురూ వారి వధువులతో విడిదికి బయల్దేరారు. బంధుమిత్రులు దశరథుడూ, మహర్షులు వారివెంట నడిచారు.

ఆరాత్రి ఇట్టే గడిచిపోయింది. తెల్లారింది. విశ్వామిత్రుడు వధూవరులని ఆశీర్వదించి, అందరికీ వీడ్కోలు చెప్పి, హిమాలయ ప్రాంతానికి ప్రయాణమై వెళ్ళిపోయాడు.

దశరథ మహారాజు కూడా తన పరివారంతో అయోధ్యకి ప్రయాణమయ్యాడు.

జనకమహారాజు, వధూవరులకి పట్టుబట్టలు, శాలువాలు పెట్టి వారి వెంట లక్షలకొద్దీ ఆవుల్నీ, గుఱ్ఱాలనీ, రథాలనీ, ఏనుగుల్నీ, కాల్బలాల్నీ కానుకగా ఇచ్చి పంపాడు. దాసదాసీజనాల్నీ వెండి, బంగారు నగలూ, నాణ్యాలూ, వజ్రాలు, ముత్యాలు, పగడాలు మొదలైన సంపదలనెన్నో ఇచ్చాడు.

పెళ్ళివారితో పాటు కొంతదూరం వెంటవెళ్ళి, అందరికీ వీడ్కోలు చెప్పి, మిథిలకి మళ్ళీ పరివారంతో వెళ్ళిపోయాడు.

దశరథ మహారాజు కొడుకులతోటీ, కోడళ్ళతోటీ మహదానందంగా అయోధ్యవైపు సాగిపోయాడు.

ఆయనవెంట మంత్రులు, చతురంగబలాలు, పరివారమూ వశిష్ఠ మహాముని, ఇతర పండితులు అంతా వెళ్తున్నారు. అంతలో ఏవేవో దుశ్శకునాలు తోచాయి.

దశరథ మహారాజు గాబరాపడి, వశిష్ఠ మహామునిని చూసి 'మహాత్మా, ఏమిటీ వైపరీత్యం' అన్నాడు.

వశిష్ఠుడు, మహారాజుకి ధైర్యం చెబుతూ 'రాజా, ఏదో భయంకరమైన సంఘటన జరగబోతోంది అనిపిస్తోంది. అయితే దుశ్శకునాలే గాక శుభశకునాలు కూడా కనిపిస్తున్నాయి. కనక ఏమీ కీడు శంకించనక్కర్లేదు. ధైర్యంగా వుండండి' అన్నాడు.

అంతే. భూమి కంపించిపోయేలా పెద్ద గాలిదుమారం చెలరేగింది. పెద్ద పెద్ద మహావృక్షాలు కూకటివేళ్ళతో సహాకూలిపోసాగాయి. సైన్యమంతా సొమ్మసిల్లి కుప్పకూలిపోయింది.

దశరథ మహారాజు, ఆయన నల్గురు కుమారులు, వశిష్ఠుడు తప్ప అంతా అచేతనులై పడిపోయారు. ఆ కారుచీకట్లు చీలుస్తూ కాంతి పుంజాలతో వెలిగిపోతున్న ఒక భీకరాకారం గల వ్యక్తి పెద్దపెద్ద అడుగులు వేస్తూ వారివైపు దూసుకుని వస్తూ కనిపించాడు.

తలంతా జడలు కట్టి వుంది. సిందూరవర్ణంతో వెలిగిపోతున్న ఆ ఆజానుబాహుడి భుజాన గండ్రగొడ్డలి వ్రేలాడుతోంది. తళ తళా మెరుస్తున్న ధనుర్బాణములు ధరించి, త్రిపురాసుర సంహారానికి బయల్దేరిన పరమశివునిలా వున్నాడాయన. పర్వతాకారుడైన ఆ మహానుభావుడు పరశురాముడు.

తన తండ్రిని, అకారణంగా ఒక క్షత్రియుడు చంపాడన్న కక్షతో క్షత్రియజాతినంతా సంహారము చేసిన పరశురాముడు, ఇపుడిలా ఎందుకు వచ్చాడా అని దశరథ మహారాజు గజగజలాడిపోయాడు.

మహర్షి, భక్తిశ్రద్ధలతో ఆయనకి అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించాడు. ఆ సన్మానాన్ని స్వీకరించాడు పరశురాముడు.

మహోగ్రమైన చూపులతో శ్రీరాముడి వంక చూస్తూ 'దాశరథీ, నువ్వు చాలా పరాక్రమవంతుడివనీ, జనకుని ఇంట వున్న శివధనుస్సు విరిచావనీ విన్నాను నీ పరాక్రమం చూద్దామని వచ్చాను. శివధనుస్సులాంటిదే నా దగ్గర ఒక అపురూపమైన ధనుస్సు వుంది. దీనిని నా తండ్రిగారైన జమదగ్ని మహాముని నాకు ఇచ్చారు. దీనిని కూడా సంధించి, నీ బలం నిరూపించుకో. అపుడు నీతో ద్వంద్వయుద్ధం చేస్తాను' అని హుంకరించాడు పరశురాముడు.

ఆ మాటలు విన్న దశరథ మహారాజు గొంతు తడి ఆరిపోయింది. దీనంగా పరశురాముడివంక చూస్తూ,

'భార్గవరామా, నీకిదివరకే క్షత్రియుల మీద కక్ష తీరిపోయింది కదా, నువ్వు బ్రాహ్మణుడివి. యశస్విని. నా కుమారులు పసివాళ్ళు. వారిని మన్నించు రాముడు నీతో యుద్ధం చేసి జీవించగలడా? రాముడు లేకపోతే మేమెవ్వరం బ్రతకలేము. మన్నించు' అంటు ఆయన పాదాలమీద వాలిపోయాడు దశరథుడు.

కాని పరశురాముడు దశరథ మహారాజుని, నిర్లక్ష్యంగా చూస్తూ రామునివైపు దూసుకెళ్ళాడు.

'దశరథరామా ఈ విల్లు చూడు. దీనిని విష్ణు ధనస్సు అంటారు. శివధనస్సునీ, దీనినీ కూడా విశ్వకర్మ ప్రత్యేకంగా తయారు చేశాడు. ఒకదానిని త్రిపురాసుర సంహారం కోసం శివుడికిచ్చాడు. రెండవ దానిని విష్ణుమూర్తికి ఇచ్చాడు. వాటిల్లోంచి శివధనుస్సు జనకుని ఇంట చేరిన వైనం నీకు తెలుసుగా,

ఇంక దీని సంగతివిను. త్రిపురాసుర సంహారమైన తర్వాత, శివుడూ, విష్ణువూ తమలో అధికబలశాలి, ఎవరో తెలుసుకోవాలనుకున్నారు. పరస్పరం యుద్ధం చేశారు. యుద్ధం చాలా భయంకరంగా సాగింది. కాని ఎన్నాళ్ళైనా ముగింపు కనబడలేదు. అపుడు విష్ణుమూర్తి హుంకారం చేశాడు.

ఆ హుంకారానికి శివధనుస్సు కొయ్యబారిపోయింది. వంగకుండా బిగుసుకుపోయింది. శివుడు నిశ్చేష్టుడైపోయాడు. దేవతలంతా ఏకమై వారిద్దరినీ శాంతింపజేశారు.

శివధనుస్సుని దేవతలు శివునిచేత దేవరాతుడికిప్పించారు.

ఈ విష్ణుధనుస్సుని విష్ణుమూర్తి ఋచీక మహర్షికి న్యాసంగా ఇచ్చాడు. ఆయన కుమారుడైన జమదగ్ని మా తండ్రి. పరమనిష్ఠా గరిష్ఠుడు. గొప్ప తాపసి. ప్రతీకారేచ్ఛ లేనివాడు. అస్త్రసన్యాసము చేసి, తపస్సు చేసుకుంటున్నాడు. అటువంటి నా తండ్రిని కార్తవీర్యార్జునుడు, తామసబుద్ధితో చంపేశాడు. నాకు

పట్టరాని కోపం వచ్చింది. క్షత్రియ వంశాలన్నింటినీ నాశనం చెయ్యటానికి బయల్దేరాను. క్షత్రియులందర్నీ సంహరించాక, ఈ భూమి అంతా నా స్వాధీనం అయ్యింది.

తర్వాత ఒక మహాయజ్ఞం చేసి, ఈ భూభాగాన్నంతా, కాశ్యప మహామునికి దానంచేశాను. మహేంద్రగిరిమీద తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాను. నువ్వు శివధనుస్సు విరిచావని తెలిసి, నిన్ను, నీ ప్రతాపాన్ని చూడాలనే కోరికతో వచ్చాను' అన్నాడు చాలా దర్పంగా.

పరశురాముడు చెప్పినదంతా విన్నాడు శ్రీరాముడు. తండ్రి ఎదురుగా ఎక్కువ మాట్లాడటం మంచిది కాదనుకున్నాడు.

'భార్గవా, నీ గురించి ఇదివరకే విన్నాను. నీ తండ్రి ఋణం తీర్చుకుని, మా అందరికీ మార్గదర్శకుడి వయ్యావు కాని, నేను వీర్యహీనుణ్ణి, అశక్తుణ్ణి అని అవమానించావు. కనక ఇపుడే నాతేజఃపరాక్రమాలు చూపిస్తాను'అంటూ కోపావేశంతో పరశురాముడి చేతిలోని ధనుర్బాణాలు లాక్కున్నాడు. నారి సంధించి విల్లు ఎక్కుపెట్టాడు.

'పరశురామా, నువ్వు బ్రహ్మణుడవు. నా గురువైన విశ్వామిత్రుని బంధువువి. అందుచేత ఈ బాణం ప్రయోగించి నీ ప్రాణాలు తియ్యను. ఈ బాణం ఎక్కడ ప్రయోగించమంటావో చెప్పు. నీ తపోబలంతో సంపాదించుకున్న పుణ్యాలోకాలకెళ్ళే శక్తిని హరించనా, నీ పాదగతిని నిరోధించనా చెప్పు. అని కోపంతో హుంకరించాడు. పరశురాముడు నిర్వీర్యుడైపోయాడు ఖిన్నుడై ఇలా అన్నాడు

'రామా, ఈ భూమిని కాశ్యపుడికి దానంగా ఇచ్చినపుడు, నేను ఈ దేశంలో వుండరాదని శాసించాడాయన. కనక రాత్రిపూట ఇక్కడ వుండకూడదు. ఇపుడు చీకటిపడబోతోంది. నేను వాయువేగముతో మహేంద్రగిరికి వెళ్ళాలి. కాబట్టి నాపాదగతిని ఖండించవద్దు. నేను తపశ్శక్తితో ఆర్జించిన పుణ్యలోకాల కెళ్ళే శక్తి హరింపజెయ్యి. పరంతపా, నీకు శుభం కల్గుతుంది. నా దగ్గర్నుంచి విష్ణుధనుస్సు నువ్వు తీసుకున్నప్పుడే, నీవు మహావిష్ణువవు అని గ్రహించాను. కనక నీ కర్తవ్యం నిర్వర్తించి నేను వెళ్ళటానికి నాకు అనుమతినియ్యి' అని వేడుకున్నాడు.

రాముడు విడిచిన బాణం వల్ల పరశురాముడి, స్వార్జిత, పుణ్యలోకప్రాపణశక్తి నశించి పోయింది. అతడు దశరథరామునికి ప్రదక్షిణం చేసి మహేంద్రగిరికి వెళ్ళిపోయాడు.

దేవతలు శ్రీరాముని స్తుతించారు. అపుడు రాముడు శాంతించాడు. విష్ణు ధనుస్సునీ, అమ్ముల్నీ వరుణదేవునికి ఇచ్చేశాడు రాముడు.

అప్పటికీ భయభ్రాంతుడైన దశరథుడు చలనం లేకుండానే వున్నాడు. రాముడు తండ్రిని ఆశ్వాపించి, 'నాన్నగారూ, పరశురాముని పరిగెత్తించాను ఇంక స్వస్థులుకండి. అయోధ్యకి వెళ్ళిపోదాము' అన్నాడు.

దశరథుడు ఆనందంతో రాముని శిరసుని ఆఘ్రాణించి, కౌగలించుకున్నాడు. సేవకులందర్నీ బయల్దేరవలసిందిగా ఆజ్ఞాపించాడు.

దశరథ మహారాజు కొడుకులతో, కోడళ్ళతో అయోధ్యకి తరలివస్తున్నాడని ముందే వర్తమానం పంపారు. అయోధ్యలోని పౌరుల ఆనందం ఇంతా అంతా కాదు. రాజవీధులన్నీ పన్నీటితో కళ్ళాపిచల్లి రంగవల్లులు తీర్చిదిద్ది పూలతో అలంకరించారు. ప్రముఖులైన వారంతా మహారాజుకి ఎదురేగి స్వాగతం చెప్పారు.

మంగళవాద్యాలూ, భేరీనినాదాలూ మ్రోగుతుండగా దశరథుడు కొడుకులతో, కోడళ్ళతో నగరప్రవేశం చేశాడు. అంతఃపురం చేరగానే, అంతఃపురవాసులు ఆనందంతో ఎదురువచ్చి, గంధపుష్పాదులు ఇచ్చి గౌరవించారు.

కౌసల్యా - సుమిత్రా - కైకేయీ మిగిలిన రాజాంగనలు వచ్చి కోడళ్ళను చూసి అమితానందం పొందారు.

ఆదరంగా లోనికి తీసికెళ్ళారు. కోడళ్ళకి మంగళస్నానాలు చేయించి పట్టుచీరలు కట్టబెట్టారు. రత్నాభరణాలతో అలంకరించారు.

రాజలాంఛనాలతో దేవమందిరాలన్నింటికీ తీసికెళ్ళారు. బ్రాహ్మణుల్ని రావించి, గోదానము, భూదానము, సువర్ణదానము చేయించారు. పునస్సంధాన కార్యక్రమాలన్నీ యథావిధిగా నిర్వర్తించారు. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తమ భార్యలతో సుఖసంతోషాలు అనుభవిస్తూ హాయిగా సంసార జీవితం గడుపుతున్నారు.

ఈ విధంగా ఆనందంగా కొన్నాళ్ళు గడిచిపోయాయి. కొన్నాళ్ళ తర్వాత ఒకనాడు దశరథుడు, భరతుని పిలిచి,

'నాయనా, నీ మేనమామ యుధాజిత్తు నిన్ను తమ దేశం తీసికెళ్ళటానికి వచ్చి వున్నాడు కదా, మిథిలానగరంలోనె నిన్ను పంపమని అడిగాడు కనక ఆయన వెంట నీ తాతగారింటికి వెళ్ళిరా నాయనా' అన్నాడు. భరతుడు తండ్రి ఆజ్ఞ స్వీకరించి, తల్లులకీ, తండ్రికీ, రాముడికీ నమస్కారాలు చేసి, లక్ష్మణుని కౌగలించుకుని, వీడ్కోలు చెప్పి శత్రుఘ్నునితో కూడా మేనమామ వెంట గిరి వ్రజపురానికి ప్రయాణమై వెళ్ళాడు.

దశరథుడు రామలక్ష్మణుల్ని అక్కున జేర్చుకున్నాడు. భరత శత్రుఘ్నులు లేని లోటు తెలియరాకుండా, రామలక్ష్మణులు తల్లుల్ని సేవిస్తున్నారు. రాముడు తండ్రి సలహామీద, అయోధ్యాపురవాసుల మంచి చెడ్డలు విచారిస్తూ పౌరహిత కార్యక్రమాల్లో నిమగ్నుడయ్యాడు.

తల్లుల్ని, గురువుల్ని సేవిస్తూ అందరి మన్ననలూ పొందాడు. రాముడి, రాజ్యకార్య నిర్వహణ చాతుర్యానికి, అయోధ్యవాసులే గాక, దేశాంతర వర్తకులు కూడా చాలా మెచ్చుకునేవారు.

సీతారాములు, అన్యోన్యంగా, పరస్పర అనురాగంతో నిత్యనూతనంగా దాంపత్య జీవితం గడుపుతున్నారు. వారిద్దరూ లక్ష్మీనారాయణులలా విలసిల్లుతూ, అయోధ్యావాసుల్ని, తల్లితండ్రుల్ని ఆనందింపజేస్తున్నారు.

వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణ మహాకావ్యములో బాలకాండ సమాప్తము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**



# బాలకాండపై సమీక్ష

తపస్స్వాధ్యాయ నిరతం - తపస్వీ వాగ్విదాం వరమ్,
నారదం పరిపప్రచ్ఛ - వాల్మీకి ర్మునిపుంగవమ్.

.........అనే శ్లోకంతో ఆరంభమవుతుంది శ్రీమద్రామాయణం. శ్రీమద్రామయణం ఆదికావ్యం. కావ్యరచనకి శ్రీకారం చుట్టిన ఆదికవి వాల్మీకి మహాముని. బ్రహ్మదేవుని అనుగ్రహం వల్ల జ్ఞాన నేత్రంతో రామాయణాన్ని చూసి, ఉన్నది ఉన్నట్లు వ్రాశా డాయన. ఎంతమంది ఎన్ని రామాయణాలు వ్రాసినా అన్నింటికీ ఆధారభూతమైన మూలకథ మాత్రం వాల్మీకి వ్రాసినదే. అందులో ఒక్క అనృతం కాని, అతిశయోక్తిగాని, కల్పితం కాని లేదు.

వాల్మీకి రామాయణం సంస్కృతభాషలో వుంది. మన దురదృష్టం కొద్దీ మనం సంస్కృతభాషకి దూరమయ్యాము. వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా అనువదించారు మహాత్ములెందరో.

కాని కల్పితగాథలకి ప్రచారం లభించినంతగా వాల్మీకి రామాయణం ప్రజలనాకట్టుకోలేదు.విశ్లేషించి చూస్తే మహాద్భుతమైన విషయాలెన్నో వాల్మీకి రామాయణంలో గోచరిస్తాయి. నేటి విజ్ఞానశాస్త్రం మనకందిస్తున్న అద్భుతమైన విషయాలన్నో త్రేతాయుగంలోనే, మన భారతదేశంలో జరిగినట్లు నిరూపించింది వాల్మీకి రామాయణం.

నేను వాల్మీకి రామాయణం మూలగ్రంథం చదివినపుడు, దానిని ఉన్నది ఉన్నట్లుగా జనబాహుళ్యానికి అందించాలనే సంకల్పం కలిగింది. నేడు ప్రచారంలో వున్న కల్పనలేమిటో, విజ్ఞానపరంగా రామాయణంలో నిగూఢంగా దాగివున్న అద్భుతమైన విషయాలేమిటో అందరికీ తెలియపరచాలనే ఆరాటం కలిగింది.

అసలు వాల్మీకి రామాయణం చదువుతుంటే, ఒక రసవత్తరమైన సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. ప్రతి చిన్న విషయాన్నీ ఎంతో వివరంగా కళ్ళకి కట్టినట్లు వర్ణిస్తూ వ్రాశాడాయన.

అవన్నీ యథాతథంగా తెలుసుకోవాలనుకునేవారు - వాల్మీకి రామాయణం అనువాదగ్రంథాలెన్నో వున్నాయి - చదువవచ్చు. కాని నేటి

పరిస్థితుల్ని బట్టి అంత తీరికగా చదివి అర్థం చేసుకునే అవకాశాలు తక్కువ.

కనక, శ్రీమద్రామాయణంలోని మూలకథను మాత్రం తీసుకుని, వర్ణనలు, విశ్లేషణలు వదిలిపెట్టి, అసలు కథకి ఎంతమాత్రం తేడా రాకుండా ఉన్నది ఉన్నట్లుగా సాధ్యమైనంత సంక్షిప్తంగా వ్రాశాను.

పాఠకులు నా ఈ చిన్ని ప్రయత్నాన్ని ఆదరిస్తే, నా జన్మ ధన్యమైనట్లుగా భావిస్తాను.

ఇంక అసలు కథకివస్తే బ్రహ్మ వాల్మీకికి రామాయణం జరిగింది జరిగినట్లుగా చూసే శక్తి ఇచ్చాడు. వాల్మీకి, అలాచూసి, ఉన్నది ఉన్నట్లుగా రామాయణ రచన చేశాడు. ఇలా మొదలవుతుంది రామాయణకావ్యం.

ఈనాడు విజ్ఞానశాస్త్రం మనకి అందించిన 'టెలివిజన్' (దూరదర్శిని) ఆనాడే త్రేతాయుగంలో వుండేది అని మొట్టమొదట అంశంగా రామాయణం మొదట్లోనే నిరూపించింది.

రెండవ అంశం రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల జననం. పుత్రకామేష్టి చేసిన దశరథుడు చాలా వృద్ధుడు. అగ్నిహోత్రుడు అందించిన పాయసం తినటం వల్ల ఆయన భార్యలకి సంతానం కలిగింది. 'మంత్రాలకి చింతకాయలు రాల్తాయా'? అంటె తప్పకుండా రాల్తాయని నిరూపించింది, రామాయణం. రామాయణం ఆద్యంతం కూడా తపశ్శక్తివల్ల ఎన్నెన్ని అద్భుతాలు సాధించబడ్డాయో నిరూపించింది.

పదహారేళ్ళ వయస్సులో వున్న రాముణ్ణి, విశ్వామిత్రుడు వెంటబెట్టుకుని వెళ్ళి, వంద అస్త్రాలు, వాటి ఉపసంహారణ, అద్భుతమైన శస్త్రాస్త్రప్రయోగాలు బోధించాడు. ఇపుడు మనం వింటున్న రసాయన అస్త్రాలు, బాంబులు, ఇవన్నీ ఆశస్త్రాస్త్రాల ప్రతిరూపాలు అని మనం గుర్తించాలి. రామలక్ష్మణులు తమవెంట వస్తున్నప్పుడు విశ్వామిత్రుడు మార్గాయాసం తెలియరాకుండా మజిలీ చేసిన ప్రతి ప్రదేశంలోనూ, ఆ ప్రదేశానికి సంబంధించిన చరిత్ర గురించి కథలుగా చెబుతూ తీసికెళ్తాడు.

అయోధ్యలో బయల్దేరి సరయూనది వెంబడి వెళ్ళి, నడుచుకుంటు ఆనది గంగలో సంగమించే చోటుకి చేరతారు. అక్కణ్ణించి అంగదేశం,

స్థాణ్వాశ్రమం, మలదమూ, కారూశము, అనే నగరాలు, ఇవన్నీ చూస్తూ సిద్ధాశ్రమం వస్తారు. సిద్ధాశ్రమంలో విశ్వామిత్రుడి యాగ సంరక్షణ అయ్యాక అక్కడ్నించి మిథిలకి బయల్దేరుతారు. దారిలో శోణాకులం, మగధ, వైశాలీనగరం, చూసుకుంటూ, గౌతముని ఆశ్రమం దగ్గరకి వెళ్తారు. అక్కడ అహల్యా శాపవిమోచన అయ్యాక, మిథిలా నగరానికి చేరుకుంటారు. ఇదంతా త్రేతాయుగం నాటి మాట.

కాని ఈ రోజు మనం ఇండియా మేప్‌లో పరిశీలించి చూస్తే కొద్దిపాటి తేడాతో యథాతథంగా మనకి కనిపిస్తాయి. ఈ ప్రదేశాలన్నీ ఇంతమాత్రమే కాదు. రామాయణంలో వాల్మీకి, హిమాలయాల దగ్గర్నించీ కన్యాకుమారివరకు యావద్భారత దేశ సమగ్ర నైసర్గిక స్వరూపం కళ్ళకి కట్టినట్లు వర్ణించాడు. ఇది ఆయన అపూర్వమేధాసంపత్తికి గొప్ప నిదర్శనం. ఆయనకి తెలియని శాస్త్రం లేదు. చర్చించని విషయం లేదు.

ఇపుడు మానవ మేధస్సుకి అందని అపూర్వమైన విషయాలు బాలకాండలో ఏం వున్నాయో చూద్దాం.

వాల్మీకి మహామునికి బ్రహ్మగారు రామాయణ కథ 'టెలికాస్టు' చేసి చూపించారని ముందే తెలుసుకున్నాము. అలాగే పుత్రకామేష్టి గురించి చదివాము. తర్వాతది ఋష్యశృంగుని జననము ఇది ఒక పరమాద్భుతమైన విషయం.

ఋష్యశృంగుని తండ్రి విభండకుడు. బ్రహ్మచారి. గొప్ప తాపసి. ఆయన చెరువులో స్నానం చేస్తున్నపుడు, దేవనర్తకి ఊర్వశిని చూస్తాడు. ఆమెపట్ల సమ్మోహితుడవుతాడు. అపుడతడి వీర్యం ఆ తటాకంలో స్ఖలనం కాగా, వీర్యంతో గూడిన ఆజలాన్ని ఋష్యము అని పిలవబడే ఒక లేడి తాగింది. అది గర్భవతియై ఒక మానవ శిశువుకి జన్మనిస్తుంది. ఆ శిశువే, ఋష్యశృంగుడు. పుట్టుకతోనే కొమ్ములతో పుట్టాడు కనక, ఋష్యము అనే లేడికి పుట్టాడు. కనక, ఆ బాలుడు ఋష్యశృంగుడుగా పిలవబడ్డాడు.

ఋష్యశృంగుని జన్మ అనృతం కాదు. కల్పన అంతకన్నా కాదు. కాని నేటి మన విజ్ఞానశాస్త్రం గుర్తించలేని, రహస్యమైన సిద్ధాంతమేదో ఆప్రక్రియలో నిగూఢంగా వుంది.

ఇంకొక అద్భుతమైన విషయం కార్తికేయ జననం, కొంతవరకు నేటి టెస్ట్ ట్యూబ్ బేబీ ప్రొసీజరు మనకిందులో కనిపిస్తుంది.

ఉమాశంకరులు సంగమ కాలంలో వుండగా, దేవతలు, అత్యంత ఉగ్రమూర్తులైన ఆ దంపతుల సంతానాన్ని ఈ లోకాలు భరించలేవని, శివుని కుమారుని కనవద్దని ప్రార్థిస్తారు. అదే క్షణంలో ఈశ్వర రేతస్సు, పార్వతి అండంతో కలసి పతనమై భూమిమీద పడ్తుంది. ఆ రేతస్సుని అగ్ని దహిస్తాడు. కొంతకాలం తర్వాత అగ్నిద్వారా ఆ రేతస్సుని గంగ గర్భంలో ధరిస్తుంది. కాని ఆ దివ్య తేజాన్ని భరించలేక హిమాలయాల మొదట్లో వదుల్తుంది. అక్కడ ఎన్నెన్నో ధాతువులు పుడ్తాయి.

ఆ ధాతువుల మధ్య, గంగచే వదలబడ్డ పిండము, ఒక మగశిశువుగా రూపుదిద్దుకుంటుంది. ఆ బాలుడు కార్తికేయుడు. ఇది ఒక కథ. దీన్ని నిశితంగా పరిశీలిస్తే, శివుని తేజస్సు పార్వతిలో సంపర్కమై నేలమీద పడింది. ఆ తేజస్సును అగ్ని దహించాడు అంటే అది కొంత ఉష్ణోగ్రతలో భద్రపరచబడింది.

ఆ తర్వాత గంగ గర్భంలో ప్రవేశపెట్టబడింది. అక్కడ పిండోత్పత్తి జరిగి, హిమాలయం దగ్గర అంటే మంచులో భద్రపరచబడింది. ఆతర్వాత ధాతువుల మధ్య పొదగబడి, అక్కడ ఆ పిండం శిశువుగా జన్మించింది. బాగా అధ్యయనం చేస్తే ఇక్కడ నిగూఢమైన సైంటిఫిక్ ప్రొసీజర్ కనిపిస్తోంది.

సగరుడి భార్యకి ఒక పెద్ద పిండం ఆనపకాయ ఆకారంలో పుట్టి, అందులోంచి, అరవై వేలమంది పిల్లలు పుట్టారు. ఇదంతా ఏమిటి? అంటే పిండోత్పత్తి, శిశు జననం, ఇవన్నీ కూడా నాటి మానవుడు స్వాధీనం చేసుకున్నాడు. అంటే ఆనాడు విజ్ఞానశాస్త్రం మనదేశంలో ఎంతగా అభివృద్ధి పొందివుందో గ్రహించవచ్చు. బాగా పరిశీలించి చూస్తే ఇలాంటి అద్భుతమైన విషయాలనేకం రామాయణంలో కనిపిస్తాయి.

ఇంకొక పరమాద్భుతమైన విషయం త్రిశంకువు స్వర్గంలోకి వెళ్ళటం.

ఈనాడు మన వైజ్ఞానికులు ఎంతో ప్రయాసపడి, బోలెడు ధనం ఖర్చుపెట్టి, అంతరిక్ష నౌకలు సృష్టించి భూమికి, ఆకాశానికి, మధ్యలో ఆనౌకల్ని నిలబెట్టున్నారు. కాని కేవలం తన తపశ్శక్తితో విశ్వామిత్రుడు

త్రిశంకు స్వర్గం అనే అంతరిక్ష నౌకని భూమ్యాకాశాల మధ్యలో శాశ్వతంగా నిలబెట్టాడు. ఇదెలా సాధ్యం అన్నది ఆనాటి మన భారతీయులకి మాత్రమే తెలిసిన అతి రహస్యమైన సూత్రం.

ఇంక కల్పనల సంగతికి వస్తే బాలకాండలో అహల్యావృత్తాంతం మొదటిది.

అహల్య పాషాణంగా గాని రాయిగా గాని మారలేదు. చేతనత్వం కోల్పోకుండా, అదృశ్యరూపంలో అహల్యని మట్టిలో పడివుండమని గౌతముడు శపించాడు. శ్రీరాముని పాదం ఆపాడుపడ్డ ఆశ్రమంలో మోపగానే, రామలక్ష్మణుల దర్శనభాగ్యం అహల్యకు కలగగానె ఆమెకి తన నిజస్వరూపం వచ్చింది.

రెండవది సీతారామ కల్యాణం. సీతా స్వయంవర ఘట్టం వాల్మీకి రామాయణంలో ఎక్కడా చూపించలేదు. కేవలం సీతకి ఇదివరలో ఒకసారి స్వయంవరం ఏర్పాటు చేశానని మాత్రం జనకమహారాజు విశ్వామిత్రుడితో చెప్తాడు. అంతే ఆ ఘట్టం ఆయన వర్ణించలేదు.

జనకమహారాజు చెయ్యబోతున్న యజ్ఞం చూడటానికి మాత్రమే విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వెళ్తారు. ఆయనదగ్గర పరమాద్భుతమైన శివధనుస్సు వుందనీ, దానిని కూడా చూడవచ్చనీ విశ్వామిత్రుడు వారితో చెప్తాడు. అంతెకాని, సీతాస్వయంవరానికి రాముడు వెళ్ళలేదు. ఈనాడు సినిమాల్లో మనం చూస్తున్నదంతా అభూతకల్పన. రాముడు శివధనుస్సు సంధించటం, అది విరిగిపోవటం, తాను అనుకున్న ప్రకారం సీతని శివధనుస్సు ఎక్కుపెట్ట గల్గిన వానికి మాత్రమే ఇచ్చి వివాహం చేస్తానని చెప్పి, జనకుడు సీతని రామునికిచ్చి పెండ్లి చేస్తాననటం, ఇదంతా కాకతాళీయంగా జరుగుతుంది.

రామాయణ మహాకావ్యాన్ని క్షుణ్ణంగా పఠించగల్గినవారికి ఇంకా ఎన్నెన్నో రహస్యమైన విషయాలు బోధపడ్తాయి. ఇంక ఇపుడు మనం బాలకాండ ముగించి, అయోధ్యకాండలోకి అడుగుపెడ్దాం.



# అయోధ్యకాండ



తండ్రి ఆజ్ఞమేరకు తాతగారింటికి వెళ్ళిన భరత-శత్రుఘ్నులు అక్కడ ఆనందంగా రోజులు గడుపుతున్నారు.

వారిని పంపించిన కొన్నిరోజులకి దశరథుడు ఆలోచనలో పడ్డాడు. ఆయనకి తన నలుగురు కుమారులలోనూ రాముడంటే చాలా ఇష్టం. శ్రీరామునిలాంటి పుత్రుడు తనకి తప్ప వేరెవ్వరికీ పుట్టలేదని, ఆయన నమ్మకం. ఎందుకంటే దశరథ మహారాజులో ఎన్ని సుగుణాలున్నాయో, అన్ని సుగుణాలతోనూ రాముడు పుట్టాడు.

అంతేకాదు. రాముడు చాలా అందగాడు. పరాక్రమశాలి. అసూయాద్వేషాలు మచ్చుకైనా లేనివాడు. ప్రశాంతచిత్తుడు. ఒకవేళ అతడితో ఎవరైనా పరుషంగామాట్లాడినా, వారికి మృదువుగా జవాబు చెప్పి, వారి క్రోధాన్ని పోగొట్టేవాడు. ఎవరైనా తనకి మేలుచేస్తే దానిని ఎప్పటికీ గుర్తుంచుకునేవాడు.

అస్త్రశస్త్రాదివిద్యలు అభ్యసిస్తున్న రోజులలోనే, తీరిక చిక్కినప్పుడల్లా వయోవృద్ధులైన పండితోత్తముల దగ్గరకెళ్ళి వారితో వేదవేదాంతాల గురించి చర్చించి వాటిలోని కీలకాలన్నీ క్షుణ్ణంగా అభ్యసించేవాడు.

పెద్దలను గౌరవించడం, ప్రజలను రంజింపచెయ్యటం, రాముడికి ఉగ్గుపాలతో పెట్టినవిద్య.

రాముడు సరదాకైనా ఎపుడూ అసత్యం చెప్పేవాడు కాదు. అతి చిన్న వయసులోనే మూర్తీభవించిన ధర్మస్వరూపుడిలా ప్రకాశించేవాడు. అతడు చాలా ధృడచిత్తుడు. గొప్ప విద్వాంసుడు. దయాశీలి. శరణాగత త్రాణపరాయణుడు. క్షాత్రధర్మాచరణవల్ల యశస్సూ, స్వర్గమూ ప్రాప్తిస్తాయని నమ్మినవాడు.

అందుకే అయోధ్యావాసులందరికీ రాముడంటే అమితమైన ప్రేమ. వారందరికీ రాముడంటే పంచప్రాణాలూ. ఎప్పుడూ ఆరోగ్యంతో, ఆనందంగా, ఆహ్లాదకరంగా వుండే రాముడు, ఎంతటివారినైనా సరే ఇట్టే ఆకట్టుకునేవాడు. చూడగానే ఎవరి మనసులో ఏంవుందో ఇట్టే పసిగట్టేవాడు.

అనతికాలంలోనే తనంతటివాడు లేడని కీర్తిప్రతిష్టలు సంపాదించాడు. న్యాయ, వేదాంత, వ్యాకరణ, మీమాంసా, తర్కశాస్త్రాలన్నీ అభ్యసించి ప్రావీణ్యం పొందాడు. సంస్కృత, ప్రాకృత, భాషలు క్షుణ్ణంగా నేర్చుకున్నాడు.

లోకోత్తర పురుషునిగా, కీర్తించబడుతున్న శ్రీరాముని చూసి, దశరథ మహారాజు హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. రామునికి పట్టాభిషేకం చేసి, అతడు ప్రజానురంజకంగా పరిపాలన చేస్తూ వుంటే చూసి తరించాలనే కోరిక కలిగింది. ఆ విషయం గురించి దశరథుడు ఆలోచనలో పడ్డాడు. చాలాసేపు ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

మంత్రులందర్నీ సమావేశపరచి సమాలోచన జరిపాడు. వారంతా కూడా మహారాజుగారి ఆలోచనని ఆమోదించారు.

ఇంక ఆలస్యం ఎందుకని, రాజముఖ్యులనూ, జానపద ముఖ్యులనూ, నగర ముఖ్యులనూ ఆహ్వానించాడు. అయితే, ఎందుకోగాని కేకయమహారాజునీ, జనకమహారాజునీ మాత్రం పిలవలేదు. బహుశా వారు చాలాదూరం నుంచి రావలసివుందనీ, వారినాహ్వానిస్తే పట్టాభిషేకముహూర్తం ఆలస్యమౌతుందనీ కావచ్చు. ఎందుకో ఆవృద్ధమహారాజు హృదయం రామపట్టాభిషేకానికి చాలా తొందరపడసాగింది. అందుకే పిలవదల్చుకున్న వారిని తొందరగా రప్పించి, వారందరి సమక్షంలో సభాముఖంగా ఇలా అన్నాడు.

'మహాజనులారా! మా పూర్వీకుల దగ్గర్నుంచి, నావరకు, మీ అందర్నీ మా కన్నబిడ్డల్లా చూసుకున్నాము. మీ అభిలాష కనుగుణంగానే రాజ్యపాలన చేశాము. ఇపుడింక నేను వయోవృద్ధుణ్ణి అయిపోయాను. నా శరీరం విశ్రాంతి కోరుకుంటోంది.

అయితే, ఈ సువిశాల కోసలదేశ రాజ్యభారనిర్వహణ, సామాన్యమైన విషయం కాదు. రాజలక్షణ శోభితుడు, జితేంద్రియుడు, అయినవాడు మాత్రమే, అందుకు సమర్థుడని, మీకూ తెలుసు.

నా జ్యేష్ఠకుమారుడు, రాముడు, సర్వలక్షణసంపన్నుడు, సకల విద్యాపారంగతుడు. నా అంతటివాడు. కనుక, ఇపుడు రాముని యువరాజుని చేసి, ఈ రాజ్యభారం వానికి అప్పగించి, నేను విశ్రాంతి తీసుకుందా మనుకుంటున్నాను. అయితే, మీరంతా సమ్మతిస్తేనే, నేను నా ఆలోచన, అమలు పరుస్తాను. మీరు నిర్భయంగా మీ అభిప్రాయం చెప్పండి. మీకు సమ్మతం కాని పని ఏదీ నేను చెయ్యను.

అని దశరథ మహారాజు, ఇంకాపూర్తి చెయ్యకుండానే, సభాప్రాంగణమంతా, కరతాళధ్వనులతో మారుమ్రోగింది. 'మీ ఆలోచన చాలా బాగుంది' అని సభాసదులంతా దిక్కులు పిక్కటిల్లేలా అరిచారు.

'మహారాజా, రాముని, యువరాజుగా అవశ్యం చెయ్యండి. ఆ మహావీరుడు, శత్రుంజయ గజం మీద, శ్వేతచ్ఛత్రం నీడలో ఊరేగుతూంటే చూసి మురిసిపోవాలని, మా మనస్సులు ఉవ్విళ్ళూరుతున్నాయి' అన్నారు అందరూ, ముక్త కంఠంతో.

దశరథుడికి, చెప్పరాని సంతోషం కలిగింది. ఆ ఆనందం పైకి కనిపించనియ్యకుండా,

'సభాసదులారా, నేను చెప్పగానే మీ సమ్మతి తెలిపినందుకు కృతజ్ఞుడిని. కాని, మీ పాలకుణ్ణికదా, అనే భయంతో అలా అన్నారా? లేకపోతే బాగా ఆలోచించి చెప్పారా? మీరు ఏ కారణంగా రాముడికి పట్టాభిషేకం చెయ్యమంటున్నారో చెప్పండి' అన్నాడు.

అపుడు సభాసదులంతా ఏకకంఠంతో, 'రాజా, రాముడు అనంత కల్యాణ గుణసంపన్నుడు. అతడు ఈ ఒక్క కోసలదేశమేమిటి, ముల్లోకాలనైనా పాలించగల సమర్థుడు. ఆ ఇందీవరశ్యాముడు ఎపుడు యువరాజు అవుతాడా, అని, మేమంతా వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నాము. తమకి వృద్ధాప్యం వచ్చింది కనక, రాజ్యపాలన రామునికి అప్పగిస్తానని, మీరే సెలవిచ్చారు. కాని మేమూ అదే కోరిక మిమ్మల్ని అడగాలని ఎదురుచూస్తున్నాము. కనుక మీ మాటలు సంతోషంగా శిరసావహించాము. అంతేగాని, మీవల్ల భయంచేత మాత్రం కాదు' అన్నారు.

ఆ మాటలు విని, తనంతటి అదృష్టవంతుడు వేరొకడు వుండడని దశరథుడు మురిసిపోయాడు.

వశిష్ఠ, వామదేవుల వంకచూసి, ఆచార్యులారా, మంత్రివర్యులారా, ఇది చైత్రమానము, చాలా పవిత్రమైనది. కనుక వెంటనే రాముడి యువరాజ్యాభిషేకానికి, ఏర్పాట్లు చేయించండి. ఇంక ఆలస్యం వద్దు' అన్నాడు.

సభాసదులంతా జయజయధ్వనాలు చేశారు. ఆ కోలాహలం సద్దుమణిగాక, దశరథుడు,

'బ్రాహ్మణోత్తములారా, రామాభిషేకానికి ఏయే కర్మలు ఆచరించాలి? వాటికి కావలసిన ఉపకరణాలేమిటి? వివరంగా చెప్పండి' అని అడిగాడు.

అపుడు వశిష్ఠుడు 'రాజా, తెల్లారేసరికి, అగ్నిహోత్రగృహాలలో, పూజాద్రవ్యాలూ, తెల్లనిపూలదండలూ, ఓషధులు, నవరత్నాలూ, బంగారం, వెండి మొదలైన పంచలోహాలూ, కొత్త బట్టలూ, తళతళా మెరిసే నూరు కలశపాత్రలూ,

పులితోలూ, రెండు వింజామరలూ, తేనె, నెయ్యి, పాలూ, పెరుగు విడివిడిగా నింపిన పాత్రలూ, పేలాలూ, ఇవన్నీ తెప్పించండి.

ఇవిగాక చతురంగ బలాలూ, శుభలక్షణయుత్తమైన శత్రుంజయమనే ఏనుగు వెంట రావాలి. బంగారు తొడుగు కొమ్ములకు వేసిన అంబోతు కావాలి. శ్వేతచ్ఛత్రమూ, ధ్వజము, సర్వాయుధాలూ రాముని వెంటరావాలి. పరిమళద్రవ్యాలు కావాలి.

అంతఃపురద్వారమును, నగరబహిర్ద్వారాలను, పూలమాలలతోటీ, పరిమళగంధంతోటీ అలంకరించాలి. లక్షలకొద్దీ బ్రాహ్మణులకి, అన్నదానం చెయ్యాలి. సూర్యోదయానికి ముందే, స్వస్తివాచకాలు మొదలుపెట్టాలి. వేద పండితుల్ని ఘనంగా సత్కరించాలి. వారందర్నీ ఇపుడే పిలిపించి, ఉచిత ఆసనాలు వేయించండి.

రాజవీధులన్నీ పన్నీటితో కళ్ళాపిచల్లి, ముత్యాలతో రంగవల్లులు వేయించాలి' అన్నారు. అప్పటికపుడే, ఆ పనులు సక్రమంగా నిర్వహించగల సమర్థులైన, కార్యకర్తల్ని నియమించారు.

ఏర్పాట్లన్నీ చక చకా జరిగిపోయాయి. అపుడు, దశరథుడు, రాముని రమ్మని కబురు చేశాడు.

రాజమార్గంలో రథంమీద వస్తున్న రాముణ్ణి చూసి, దశరథుడు చర్చలు ఆపి, ఆవంక చూశాడు.

ఆ సుందర, సుకుమార, కమనీయమూర్తిని ఎంతచూసినా తనివితీర లేదాయనకి. రాజప్రాసాదం ముందర రథం ఆగింది. సుమంత్రుడు చెయ్యి అందించగా, రాజసం ఉట్టిపడుతూండగా రథం దిగాడు రాముడు.

మేడమెట్లు ఎక్కి దర్పంగా అడుగులు వేస్తూ సభాభవనంలోకి వచ్చి, తండ్రికి సాష్టాంగ ప్రమాణం చేసి, చేతులు జోడించి, ఆయన పక్క నిలబడ్డాడు రాముడు.

దశరథ మహారాజు లేచి నిలబడి రాముణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు. నవరత్నఖచితమైన ఆసనం చూపించి కూర్చోమన్నాడు. తనకి ప్రతిబింబంలా వున్న రాముణ్ణి చూసినకొద్దీ పుత్రవాత్సల్యంతో ఆయన శరీరం పులకరించిపోయింది. ఆప్యాయంగా రాముని తలనిమురుతూ ఇలా అన్నాడు.

'నాయనా, నీ సద్గుణ సంపత్తి, వినయశీలత నాకు బాగా తెలుసు. నీ తల్లి, కౌసల్య చాలా యోగ్యురాలు. అటువంటి సౌశీల్యవతి కడుపున పుట్టిన నువ్వు

నాకు చాలా ప్రియపుత్రుడివి. కోసల ప్రజలంతా కూడా నిన్నెంతగానో అభిమానిస్తున్నారు. వారంతా నిన్ను యువరాజుని చెయ్యమంటున్నారు.

రేపు పుష్యమీ నక్షత్రం చాలా బాగుంది. ఆముహూర్తానికి నిన్ను యువరాజుని చేద్దామనుకుంటున్నాను. నీకు వేరే నేను చెప్పాల్సిన నీతులేం లేవు. అయినా పుత్రవాత్సల్యం కొద్దీ నీకు కొన్ని హితవైన మాటలు చెప్తాను. ప్రజాక్షేమం కోసం ఆ మాటలు విని ఆచరణలో పెట్టు.

నేటివరకు నువ్వు రాజకుమారుడివి మాత్రమే. రేపట్నుంచి రాజ్యపాలకుడివి. కనక ప్రజల పట్ల, పెద్దలపట్ల ఇంకా వినయం, విధేయత కలిగి వుండాలి. చెడ్డ వ్యసనాలంటే నీకు తెలుసుకదా.

స్త్రీలోలత్వము, జూదము, వేట, పరుషప్రసంగము, క్రూర దండనము, ధనవ్యయము, మొదలైన వాటిని నువ్వు దరిదాపులకి కూడా చేరనివ్వవద్దు.

సేవకుల పట్ల అతి చనువు వద్దు. అధికారులని ఆజ్ఞాపించి, పనులు చేయించు. మంత్రులతో కలసిమెలసి వుంటూ, వారి సలహాలు పాటించు. ఎప్పటికప్పుడు వేగులద్వారా, పరరాజ్య వృత్తాంతాలు తెలుసుకుంటూండు. నీరాజ్యములో మాత్రం ప్రత్యక్షంగా సంచరించి, స్థితిగతులు గమనిస్తూ వుండు. ఎల్లప్పుడూ మంత్రులనూ, సేనానాయకులను, పురరక్షకులనూ, జానపద ముఖ్యులనూ గౌరవించి వారికి సంతోషం కలిగించు.

ప్రజాక్షేమమే, నీ క్షేమంగా భావించు. ప్రజలు సమ్మతించని, ఏ ఒక్క విషయమూ, నువ్వు ఆమోదించకు. కోశాగారము, ధాన్యాగారము, ఆయుధాగారమూ, ఎప్పుడూ సమృద్ధిగా వుండేలా చూసుకో. రామభద్రా, ఇపుడు నేను చెప్పిన విషయాలన్నీ బాగా మననం చేసుకుని, మనస్థైర్యముతో రాజ్యపాలన చెయ్యి నాయనా' అని రామునికి హితబోధ చేశాడాయన.

రాముని పట్టాభిషేక వార్త విన్న, ఆతడి మిత్రులు పరుగు పరుగున, కౌసల్యాదేవి దగ్గరకి వెళ్ళి ఆవార్త ఎరిగించారు. కౌసల్య పరమానందపడి, వారికి ఎన్నెన్నో అమూల్యమైన కానుకలిచ్చింది.

తండ్రి మాటలన్నీ శ్రద్ధగా విన్న రాముడు, తప్పకుండా అలాగే చేస్తానని వాగ్దానం చేశాడు. తర్వాత తండ్రి దగ్గర సెలవు తీసుకుని, రథం మీద తన భవనానికి బయల్దేరాడు. ప్రజలంతా జయజయధ్వనాలతో ఆతడి రథాన్ని చుట్టుముట్టారు. వారి అనురాగానికి ముగ్ధుడై రాముడు తన భవనానికి వెళ్ళిపోయాడు.

రాముడు వెళ్ళాక దశరథుడు కొలువు చాలించి, మరోమాటు మంత్రులతో సంప్రతించి, ఏర్పాట్లన్నీ పటిష్ఠంగా జరిగేలాచూడమని చెప్పి అంతఃపురానికి బయల్దేరి, అంతలో ఆగి సుమంత్రుణ్ణి పిల్చి రాముని మరొక్కసారి పిల్చుకురమ్మని పంపాడు.

రాముడు సుమంత్రుని వెంటవచ్చి, తండ్రికి సాష్టాంగ నమస్కారం చేశాడు. దశరథుడురాముని లేవనెత్తి గాఢంగా కౌగలించుకుని, 'రామా, నాకు వృద్ధాప్యం వచ్చింది. ఇంకోసారి నా మనసు విప్పిచెప్పాలని నిన్ను రమ్మన్నాను. నేను చాలా కాలం రాజ్యభోగాలనుభవిస్తూ ఈ దేశాన్ని పాలించాను. నా ప్రజల కోసమే నా జీవితమంతా ధారపోశాను.

నా భాగ్యంకొద్దీ నువ్వు, నీ తమ్ముళ్ళూ జన్మించి నా పితృఋణం (పితౄణం) తీర్చారు. నీ అంతటివాడు ఇంకొకడు లేడనిపించుకుని, నువ్వు నాపేరు నిలబెట్టావు. అందుకే నీకు రాజ్యాభిషేకం చెయ్యాలనుకున్నాను.

కాని..... తండ్రీ........ నాకెన్నో అపశకునాలు గోచరిస్తున్నాయి. నా జాతక ప్రకారం నాకుమరణకాల మాసన్నమైందనుకుంటాను. ఎన్నో పీడకలలు వస్తున్నాయి. అమంగళాలు - దుశ్శకునాలు, ఎదురై ఏదో గొప్ప ముప్పు రాబోంతుందని, నా మనస్సు హెచ్చరిస్తోంది.

అందుకని, రేపే నీకు రాజ్యాభిషేకం చెయ్యాలని నిశ్చయించాను. ఇవాళ పునర్వసు నక్షత్రం. రేపు పుష్యమి. చాలా మంచి సుముహూర్తం అని పండితులు చెప్పారు.

కనక, ఈ ఘడియనించీ నువ్వు నియమంగా వుండాలి, నువ్వు, నీ భార్యా ఈ రాత్రి ఉపవాసం వుండాలి. దర్భశయ్యపై పడుకోవాలి. ఎలాంటి అవాంతరాలు వచ్చినా ఎదుర్కొందుకు, నీ మిత్రుల్ని నీ దగ్గర కనిపెట్టుకుని వుండమను.

ఇంకో ముఖ్యమైన సంగతి. నీ తమ్ముడు భరతుడు దూరదేశం వెళ్ళాడు. వాడు వచ్చేలోపే రాజ్యాభిషేకం అయిపోవాలి. వాడు చాలా ఉత్తమోత్తముడని నాకు తెలుసనుకో. కాని మానవుల చిత్తాలు చాలా చంచలమైనవి. స్వతహాగా ఎంతమంచివారైనా చెప్పుడు మాటలు విని లొంగిపోతారు. కనక ఎట్టి పరిస్థితిలోనైనా నీ రాజ్యాభిషేకం జరిగితీరాలి. చెప్పింది బాగా అర్థంచేసుకో. ఇంకవెళ్ళిరా నాయనా,' అంటూ తన మనస్సులోని ఆరాటమంతా చెప్పేసి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు, దశరథుడు.

తండ్రి మాటలు విన్న రాముడు నివ్వెరపోయాడు. కాని తండ్రి ఎదురుగా

నిలబడి సంగతి ఏమిటి? అని ప్రశ్నించే ధైర్యం లేదు. పైగా ఎప్పుడూ తండ్రి ఆజ్ఞాపించటం తను అనుసరించటం, అంతేగాని ఎపుడూ ఎదురుచెప్పి ఎరుగడు. కనుక తలదించుకుని తన మందిరానికి వెళ్ళిపోయాడు. అక్కడ సీతలేదు. రామపట్టాభిషేకం జరగబోతోందన్న వార్త విని సీత, లక్ష్మణుడు, సుమిత్ర, కౌసల్యాదేవి మందిరానికి వెళ్ళారు.

అక్కడ అందరూ కలిసి పూజామందిరంలో ప్రార్ధన చేస్తున్నారు. రాముడు కూడా సరాసరి తల్లి దగ్గరకి వెళ్ళాడు. తల్లికి సాష్టాంగపడి,

'అమ్మా, నాన్నగారు ప్రజాపాలనభారం నాకప్పగించి, రేపు యువరాజ్యాభిషేకం చెయ్యమన్నారు. నేనూ, సీతా, ఈ రాత్రి ఉపవాసం వుండాలట. దానికి సంబంధించిన మంగళకార్యాలన్నీ మీరే దగ్గరుండి జరిపించాలి అన్నాడు.

రాముని మాటలు విన్న కౌసల్య కన్నులు ఆనందబాష్పాలతో నిండాయి. గద్గద స్వరంతో, 'నాయనా, నువ్వు మంచి ముహూర్తంలో పుట్టావు. కనకనే, నీ సద్గుణాలు నాన్నగారు మెచ్చుకున్నారు. నా వ్రతాలూ, పూజలూ ఫలించాయి. శ్రీమన్నారాయణుడు మనల్ని కరుణించాడు.

రామా, ఇక్ష్వాకువంశరాజ్యలక్ష్మిని చేపట్టబోతున్నావు. నువ్వు కలకాలం సుఖంగా జీవించాలి. నీకు పగవారుండకూడదు. నన్ను, నా వాళ్ళనీ, ఈ సుమిత్రనీ, ఈమె పరివారాన్ని కూడా కాపాడవలసిన బాధ్యత నీదే సుమా' అంటూ రాముని మనసారా ఆశీర్వదించింది.

తల్లిమాటలు విని రాముడు చాలా ఆనందించాడు. ప్రక్కనే వున్న లక్ష్మణుని చూసి, 'తమ్ముడూ, నాతోబాటు నిన్నూ రాజ్యలక్ష్మి వరిస్తుంది. నా జీవితము, నా రాజ్యము, నా భోగభాగ్యాలూ, అన్నీ నీవే. నువ్వు లేనిదే నేను లేను' అంటూ తమ్ముడి భుజం తట్టాడు.

తర్వాత, తల్లికి, పినతల్లికీ నమస్కరించి, సీతతో, తన మందిరానికి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి వశిష్ఠమహర్షి రాముని మందిరానికి వచ్చాడు.

వేళకాని వేళ ఈయన రావటంలో గల ఆంతర్యం ఏమై వుంటుందా అని రాముడు ఆశ్చర్యపోయాడు. ఎదురుగా వెళ్ళి వందనం చేసి లోపలికి ఆహ్వానించాడు. ఆసనంపై కూర్చున్నాక వశిష్ఠుడిలా అన్నాడు.

'రామభద్రా, రాజ్యరక్షణ కోసం, మీచేత ఉపవాస దీక్ష పట్టించమని, తండ్రిగారు నన్ను ఆదేశించారు.

అంటూ సీతారాములచేత, సమంత్రకంగా ఉపవాసవ్రతం పట్టించాడు. సీతారాములు శాస్త్రవిహితంగా రాజగురువుని సన్మానించారు.

వశిష్ఠుడు, రాజభవనం నుంచి బయటకి వచ్చేసరికి, రాజవీధులన్నీ పట్టాభిషేకం చూడటానికి వచ్చిన జనంతో క్రిక్కిరిసివున్నాయి.

రాజవీధులన్నీ ఊడ్చి పన్నీటితో కళ్ళాపి చల్లి రంగవల్లులు తీర్చిదిద్దారు.

బాటల కిరువైపులా అరటిచెట్లూ, పోకచెట్లు నిలబెట్టారు. ప్రతి ఇంటిమీదా జెండాలు ఎగరేశారు.

ఆ శోభనంతా కళ్ళారా తిలకిస్తూ వశిష్ఠుడు, దశరథమహారాజు దగ్గరకి వెళ్ళి, తాను సీతారాముల్ని ఉపవాస దీక్ష పట్టించానని చెప్పి సెలవు తీసుకున్నాడు.

ఆ రాత్రి సీతారాములు శుచిగా మంగళస్నానాలు చేసి, శ్రీమన్నారాయణ వ్రతం చేశారు. ఆజ్యహోమాలు యథావిధిగా చేశారు. ఆహవిస్సు తిన్నారు.

తర్వాత భవన ప్రాంగణంలో వున్న విష్ణుమూర్తి ఆలయంలో, దర్భశయ్యి అమర్చుకుని, మౌనవ్రతంతో అక్కడ నిద్రపోయారు.

తెల్లవారటానికి ఇంకొక్క ఝాము వుందనగానే, వారు నిద్రలేచారు. వందిమాగధుల, సుప్రభాతసేవలనడుమ, మంగళవాద్యాలు మ్రోగుతుండగా, మిగతా కార్యక్రమాలు పూర్తిచేశారు.

రాముడు తెల్లటి పట్టు ఉత్తరీయం కప్పుకుని, బ్రాహ్మణుల చేత, పుణ్యాహవాచనములు చెప్పించుకున్నాడు. పుణ్యాహవాచన మంత్రాలతోటీ మంగళ వాద్యాల ధ్వనులతోటీ ఆయోధ్యా నగరమంతా మారుమ్రోగిపోయింది. ఆ రోజు అయోధ్యలో ఏ ఒక్కరూ నిద్రపోలేదు. నగరమంతా రంగురంగుల దీపాలతో అలంకరించారు. రంగు రంగుల జెండాలెగురవేశారు. నటులూ, నర్తకులూ నేత్రపర్వంగా నాట్యాలు చేస్తున్నారు. పూలదండలతో గుమ్మాలన్నీ అలంకరించారు. ఎవరినోట విన్నా రామాభిషేకం ముచ్చటలే ఎన్నెన్నో దుకాణాలు, అంగళ్ళు, బాటల కిరుపక్కలా అమర్చుకుని, తెల్లారేఘడియ కోసం వర్తక ప్రముఖులు ఎదురుచూస్తున్నారు. ఎటు చూసినా హర్షధ్వానాలు మిన్నంటుతున్నాయి. జనసందోహం చేసే హర్షధ్వనాల కోలాహలంతో, అమరావతిలా ప్రకాశించింది అయోధ్య. ఆ కోలాహలం సముద్రఘోషలా వుంది.

పట్టాభిరాముని సందర్శనం కోసం, దేశం నలుమూలల నించీ, వచ్చిన జన సముదాయంతో బాటలన్నీ నిండిపోయి, కిటకిటలాడుతున్నాయి.

ఇక్కడి కోలాహలం ఇలా వుండగా........

ముందురోజు రాత్రి జరిగిన ఒక అపూర్వమైన సంఘటన గురించి మాత్రం ఎవ్వరికీ తెలియదు. అదేమిటంటే, ఈ సంబరమంతా ఒక కుబ్జ గమనించింది.

ఆ కుబ్జపేరు మంథర. దశరథుని ముద్దులభార్య కైకేయికి దాసి ఆమె. పుట్టింటివారు అరణంగా వెంటపంపగా కైకేయితో వచ్చింది.

ఈ కోలాహలానికి కారణమేమిటో ఆమెకి తెలియదు. ఎందుకంటే దశరథ మహారాజు భార్యలతో కూడా సంప్రదించకుండా తానే స్వయంగా తీసుకున్న నిర్ణయం అది. చాలా గోప్యంగా వుంచాడు, అంతఃపుర స్త్రీల దగ్గర.

తెల్లని పట్టుచీర కట్టుకున్న, మందర, సమీపంలోనే వున్న ఇంకోదాసి దగ్గరకెళ్ళి, ఈ సంబరానికి కారణమేమిటి?' అని అడిగింది.

ఆదాసి ప్రతిరోజూ పసిపిల్లలకి, పాలు పట్టిస్తుంది. ఆమె సంతోషం ఆపుకోలేక, రామాభిషేక వృత్తాంతమంతా, తు.చ. తప్పకుండా ఆమెతో చెప్పింది.

ఆ మాటలు విన్న మందరకి ఒళ్ళు కారం రాసుకున్నట్లు మండింది. గబగబా అడుగులూ వేస్తూ కైకేయి మందిరానికి వెళ్ళింది.

కైకేయి మంచంపై పడుకుని వుంది. మంధర గాబరాపడుతూ కైక దగ్గరకి వెళ్ళి కర్కశంగా ఇలా అంది. 'ఊరంతా పండుగు చేసుకుంటుంటే ఇంకా పడుకున్నావా? తెలివి తక్కువదానా, లే, నీకు కష్టకాలం దాపురించిందమ్మా, నీ అంతటి అదృష్టవంతురాలు లేదనుకుని, మురిసిపోయావుగా. ఇపుడు చూడు ఏమైందో. నీ భాగ్యమంతా అడుగంటిపోయింది.' అంటూ బుసలుకొడ్తున్న మంధరవైపు కోపం చూస్తూ కైక,

'చాల్లే. ఇక ఆపు. నా భాగ్యానికేమైందిపుడు? నీ, ఇంతటి దుఃఖానికి కారణ మేమిటసలు? అని, నిలదీసి అడిగింది కోపంగా.

కైకధోరణి కనిపెట్టింది మంధర. అది చాలా మాటకారి. 'మహారాణీ, నీకు అపకారం జరుగుతుంటే, నాకు దుఃఖం కాక, సంతోషమెలా కలుగుతుందమ్మా? దశరథ మహారాజు రామునికి యువరాజ్యాభిషేకం చెయ్యబోతున్నారు దేవీ. నీ అభ్యుదయమే, నా అభ్యుదయం. నీ పుట్టింటి వంశం, ఎంత ఉన్నతమైనది!

దశరథ మహారాజంతటి వాడికి భార్యగావచ్చావే! నిన్ను కాదని ఆ కౌసల్యకి రాజమాతగా పట్టంకట్టబోతున్నాడు. నీ భర్త ఎంతటి మోసగాడో చూశావా? పైకి మాత్రం నువ్వంటే తనకి పంచప్రాణాలు, అన్నట్లు నటిస్తాడు. నీకు కల్లా కపటం

తెలియదు కనక, అందర్నీ నమ్ముతావు. కైకా నువ్వెపుడూ సుఖంగా వుండాలనే, నేను కోరుకుంటాను.

రేపట్నుంచి నువ్వు కేవలం మహారాజుకి భార్యవి మాత్రమే. రాజమాతగా ఆ కౌసల్య అధికారం చెలాయిస్తూ వుంటే, నువ్వు ఆమెకి దాసోహం చెయ్యాల్సిన రోజులొస్తున్నాయి. అంతా సర్వనాశనం కాబోతోంది. ఇప్పటికైనా మేలుకుని, నిన్నూ నీ వాళ్ళనీ కాపాడుకో' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటూ ఏడుపు అభినయిస్తూ గడగడా చెప్పింది ఎక్కడా ఆగకుండా

మంథర చెప్పినదాంట్లో 'రాముడికి పట్టాభిషేకం' అన్నమాట తప్ప, ఇంకేమీ కైకేయి బుర్రలో కెక్కలేదు. సంతోషంతో ఆమె ముఖం వెలిగిపోయింది. దిగ్గున లేచి, ఒక అమూల్యమైన రత్నాలహారం ఆమెకి బహూకరించింది.

'మంథరా, ఎంతటి సంతోషకరమైన వార్త చెప్పావే, ఇంతటి శుభవార్త చెప్పినందుకు నీకీ బహుమతి చాలదు. నాకు, రాముడు, భరతుడు, అనే భేదం ఎంతమాత్రం లేదు. నాకు చెప్పరానంత ఆనందంగా వుంది. ఈ శుభసమయంలో ఇంకేదైనా కోరుకో. తప్పక తీరుస్తాను.' అంటు ఆనందంతో కైక మంథరని కౌగలించుకుంది. తోకతొక్కిన తాచులా మండిపడింది, మంథర, కైక ఇచ్చిన రత్నాలహారాన్ని నేలమీదకి విసిరి కొట్టింది.

'ఓసి వెర్రిబాగులరాణీ! నీకిది శుభవార్తలా తోచిందా? నువ్వు సంతోషపడటానికి, ఇదా సమయం? నీబుద్ధి బుగ్గి అయిపోయిందా?' అంది మంథర నిలువెల్ల కోపంతో ఊగిపోతూ...

కొంత తమాయించుకుని, కైక దగ్గరగా వెళ్ళి ఆమెని అనునయిస్తూ, మెల్లగా 'దేవీ, యథార్థం ఆలోచించు. రాముడు నీకు సవితి కొడుకు. అంటే మృత్యువులాంటివాడు. రాజ్యాధికారానికి, నీ కొడుకు భరతుడు తగడా? అదే రాముని భయం. ఆ భయంతో నీ కొడుక్కి అపకారం తలపెట్టవచ్చు. ఆ విషయం తలుచుకుంటే నాకు చాలా దిగులుగా వుంది. లక్ష్మణుడు, శత్రుఘ్నుడు కూడా రాజ్యాధికారానికి తగినవారే, అనుకో అయినా వాళ్ళిద్దరూ అంటే రాముడికి చాలా ప్రేమ. కనక రామునివల్ల వాళ్ళకి కాని, వాళ్ళ తరపువాళ్ళకి కాని, భయం వుండదు.

కాని, ఒక్క సంగతి బాగా ఆలోచించు. రేపు ఉదయం రాముడికి పట్టాభిషేకం అయిన దగ్గర్నుంచీ నీకు పాట్లు మొదలవుతాయి. కౌసల్య రాజమాత అవుతుంది. నువ్వు ఆమెకి దండం పెడుతూ ఊడిగం చెయ్యవలసి వస్తుంది. నీ కొడుకు భరతుడు కూడా సేవకుడిగానే వుండాలి తప్ప, అతడికింకే అధికారం వుండదు.

మీతో పాటు మేమంతా కూడా వారి వెంట దాసీలుగా తిరగాలి' అంది మంథర దుఃఖంతో భోరున ఏడుస్తూ...

అయినా సరే, కైక లొంగలేదు. పైపెచ్చు నవ్వుతూ, 'ఓసి గూనిదానా, నీకలాంటి భయం అక్కర్లేదు. మా రాముడు ధర్మజ్ఞుడు. గురువుల దగ్గర శిక్షణ పొందినవాడు. జితేంద్రియుడు, కృతజ్ఞుడు. నిర్మలుడు. సత్యవాది. పైగా నా భర్తకి జ్యేష్ఠపుత్రుడు. కనక అన్నివిధాలా యువరాజు కావటానికి అతడే అర్హుడు.

ఆ చిరంజీవి, మమ్మల్ని - తమ్ముళ్ళని కూడా వాళ్ళ నాన్నగారిలాగే ఆదరిస్తాడు. కంటికి రెప్పల్లా కాపాడుతాడు. అటువంటి రాముడికి అభిషేకం, అంటే సంతోషించాలి గాని, అలా బాధపడ్తావేం? భరతుడ్ని గురించి కూడా దిగులు పడక్కర్లేదు. రాముడు తనతో సమానంగా తమ్ముళ్ళకీ పాలనలో పాలుపంచుతాడు.

అయినా నాకు భరతుని మీద కన్నా రాముని మీదే చాలా మక్కువ. రాముడు కూడా తన తల్లి కన్నా నన్నే ఎక్కువగా చూస్తాడు. కనక నువ్వు నిశ్చింతగా వుండు.'

అని కైక అన్నమాటలు విని, మంథర అగ్గిమీద గుగ్గిలంలా మండిపడింది.

'మూర్ఖురాలా! ఎంతచెప్పినా అర్థం చేసుకోవేం? ఇపుడు నీ సవతి కొడుకు రాజవుతాడు. ఆ తర్వాత, పరిస్థితుల వలలో చిక్కి, నా కొడుకు రాజు కాలేదే, అని ఏడుస్తావు. ఎంత వెట్టిదానివి! రాముని తర్వాత రాజయ్యేది అతడికి పుట్టబోయే కొడుకు.

ఏరాజుకైనా, పుట్టిన పిల్లలంతా రాజులుకారు. జ్యేష్ఠపుత్రుడు రాజు. వాని జ్యేష్ఠుడు రాజు. ఇలా తరతరాలుగా జరుగుతుంది. అయోధ్యని పాలించేరాజుల్లో నీ కొడుకు పేరుగాని, అతడి సంతానం కాని, మచ్చుకైనా వుండవు. ఏ సుఖం అనుభవించకుండానే భరతుడు అనాథ అయిపోతాడు.

నీ సవతికి నువ్వు ఊడిగం చెయ్యవలసిన పరిస్థితి వస్తోందని నీకు నేను చెప్తుంటే, నాకు బహుమానమిస్తున్నావు. చాలా బాగుందమ్మా,

కైకా, జరబోయేదంతా నా కళ్ళకి కట్టినట్లు కనిపిస్తోంది. రాముడు రాజవుతాడు. ఆతర్వాత అవకాశాన్ని బట్టి నీ కొడుకు దేశాంతరమో లేక, లోకాంతరమో వెళ్ళగొట్టబడ్తాడు. ఎందుకో తెలుసా? నీ భర్తకి ముద్దుల భార్యనన్న గర్వంతో నువ్వు కౌసల్యని చాలా చిన్న చూపు చూశావు. కనక ఇపుడావిడ తప్పకుండా కసి తీర్చుకుంటుంది.

అదీగాక, నువ్వు మొదట్నుంచీ భరతుణ్ణి ఎక్కువగా తాతగారింటిలోనే వుంచావు. అందుకే భరతుడు, తండ్రికీ, అన్నగారికీ కూడా చేరిక కాలేదు. నీకు రాముడు, రాజు కావటం, సమ్మతమైతే, భరతుడ్ని అట్నించి అటే అడవులకి పంపించు. కనీసం ప్రాణాలైనా దక్కుతాయి. కైకా, నేనెందుకు చెప్తున్నానో అర్థం చేసుకో. చిన్నపుడు ప్రేమగా తిరగటం, కలసి మెలసి తిరగటం వేరు. ఆప్యాయంగా చూడటం కూడా చిన్నతనంలో పసితనం వల్ల మాత్రమే.

రాజరికం రాగానే మనస్సులు మారిపోతాయి. ఈ సువిశాల కోసలదేశానికి రాముడు రాజవుతాడు. నువ్వు, నీ కొడుకు మాత్రం దరిద్రులైపోతారు. ఇకమీదట నీకు అవమానాలూ, అమంగళాలూ మాత్రమే మిగుల్తాయి. కౌసల్య నీమీద తప్పక పగ తీర్చుకుంటుంది. నీ సుఖం, నీ సంతోషం భగవంతుడిమీద కాదు. కేవలం భరతుడి మీద ఆధారపడి వున్నాయి.

కనక నీ కొడుకు రాజయ్యేటట్లు, రాముడు ఎక్కడికైనా వెళ్ళిపోయేటట్లు చూడు. మంచి ఉపాయం ఆలోచించు' అంటూ ఉన్నవీ లేనివి, అన్నీ కల్పించి కైకకి బాగా నూరిపోసింది మంధర.

క్రమంగా మంధర ఉపదేశం వంటబట్టింది కైకకి. ఆమెలో క్రోధాగ్ని రగిలింది. 'మంధరా, నువ్వు చెప్పింది కూడా సబబుగానే వుంది, ఆలోచిస్తే' అంది.

మంధర ముఖం ఆనందంతో వికసించింది, 'గూనిదానా! దీనికి ఉపాయం కూడా నువ్వే చెప్పు' అంది కైక. మంధర మనస్సు శాంతించి, నవ్వు ముఖంతో కైక దగ్గరకి వచ్చింది. 'సుమంగళీ, నిజంగా చెప్పు, నీకు తెలియకనే అడుగుతున్నావా? అయినా నీ మేలు కోరేదాన్ని కనక నేనే చెబుతానులే. రాముడు రాజు కాకుండా, భరతుడు రాజవ్వాలి. అందుకు మనం పకడ్బందీగా ఒక పథకం వెయ్యాలి. అమ్మా, పూర్వం శంబరాసురుడికీ, దేవతలకీ జరిగిన యుద్ధంలో నీ భర్త ఇంద్రుడికి సాయంగా వెళ్ళాడు గుర్తుందా? అపుడు నిన్ను కూడా వెంట తీసికెళ్ళాడు కదూ? అపుడేగా నువ్వు యుక్తితో నీ భర్తప్రాణాలు కాపాడినందుకు, మహారాజు నీకు రెండు వరాలిచ్చారు? కాని అప్పట్లో అవి నువ్వు కోరలేదనీ, సమయం వచ్చినపుడు అడుగుతానన్నావనీ నువ్వు నాతో చెప్పినట్లు గుర్తు. ఔనా?' అని చాలా రహస్యంగా అడిగింది మంధర.

'ఔను. నిజమే. నా భర్త నాకు రెండు వరాలిచ్చారు. కాని అపుడు నాకేం అడగాలో తెలియక, అడగలేదు' అని తలవూపింది కైక.

'అదే ఇపుడు మనకి ఉపయోగపడ్తుంది కైకా, నీ మేలు కోరేదాన్ని కనక నేనా సంగతులన్నీ గుర్తుంచుకున్నాను. ఆ వరాలు రెండు ఇపుడు నీ భర్తని కోరు.

ముందుగా వరాలు ఇస్తానని, నీ భర్తచేత ప్రమాణం చేయించుకో. నీ భర్త గురించి నాకు బాగా తెలుసు. ఆయన నిన్ను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడు. ఈ సంతోష సమయంలో నువ్వేదడిగినా కాదనడు. ముందుగా ఆయనచేత ప్రమాణం చేయించుకుని, మొదటి వరంగా భరతునికి పట్టాభిషేకం చెయ్యమనీ, రెండవ వరంగా రాముణ్ణి పధ్నాలుగు సంవత్సరాలు అడవులకి పంపమనీ అడుగు. పధ్నాలుగేళ్ళు ప్రజలకి దూరమైన రాముడు అరాముడైపోతాడు. తిరిగివచ్చినా ఏమీ చెయ్యలేడు.

ఈ లోగా నీ కొడుకు భరతుడు, రాజ్యంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకుంటాడు. కనక ప్రేమ, అనురాగం పక్కకి పెట్టి గుండె రాయి చేసుకో. రాముడి అభిషేకం జరగనివ్వకు. ఎలాగైనా కార్యం సాధించుకో. రాజు ఏడ్చినా, కాళ్ళమీద పడ్డా జాలిపడకు.

ఈ క్షణం దాటితే, నీ గతి అధోగతే. కనక ఇపుడే కార్యం సాధించాలి' అని ఎన్నోవిధాల నచ్చజెప్పి, కైకకి, ధృఢ నిశ్చయం కలిగించింది.

కైక ఇదంతా సావధానంగా వింది. మంధర తెలివితేటలకి ఆశ్చర్యపోయింది. ఆమె మనస్సు దారి తప్పిన ఆడగుఱ్ఱంలా అయింది. మంధరని మెచ్చుకుంటూ ఇలా అంది. 'ఓసీ గూనివాళ్ళకి తెలివి తక్కువంటారు. కాని, నీ అంతటి తెలివైంది, ఈ లోకంలోనే లేదు. నువ్వు, నా మేలుకోరి ఆలోచించావు కనక సరిపోయింది. లేకపోతే నేను మహారాజు వలలో పడి దిక్కులేని దాన్ని అయిపోయేదాన్ని. నిజంగా నువ్వు చాలా మంచిదానివి. అంతేకాదు. అందంగా రాజహంసలా వున్నావు. కుబ్జా, రాముడు అడవికి వెళ్ళి, భరతుడు రాజు కాగానే, నీకు బంగారం పూలదండ, బంగారు రవిక చేయిస్తాను. నా సవతులందరి చేతా నీకు దాస్యం చేయిస్తాను. అంటు దాన్ని ఉబ్బేస్తూ, పాన్పుమీద వాలింది.

వెంటనే మందర ఆమెని లేవదీసి కూర్చోబెడుతూ 'కల్యాణీ, గత జల సేతుబంధనంలా, నువ్విపుడు ఉపేక్షిస్తే, రాముడికి అభిషేకమైపోతుంది. కనక వెంటనే లేచి, కోపగృహంలోకి వెళ్ళి, అనుకున్నప్రకారం ప్రణాళికని, అమలుచెయ్యి' అని తొందరచేసింది. మంధర మాటలు కైక మనసు విషపూరితం చేశాయి. చీకటి గదిలో ప్రవేశించింది.

లక్షల ఖరీదు చేసే రత్నాభరణాలన్నీ తీసి, నేలమీద విసిరికొట్టింది. మాసిన బట్టలు కట్టుకుని, జుట్టు విరబోసుకుంది. మూర్తీభవించిన శోకదేవతలా తయారైంది. నేలమీద కూర్చుంది.

గూనిదానివైపు చూసి, 'కుబ్జా, మహారాజు, నా కోరికల నంగీకరించకపోతే, నేను ఇక్కడే చచ్చిపోతాను. రాముడు అడవికి వెళ్ళాలి. భరతుడు రాజు కావాలి. అంతకన్నా ఏ నిధీ నాకు అక్కరలేదు. రామాభిషేకం జరిగితే, నేను బ్రతకను. కనక నువ్వు నా చావు వార్తగాని, భరతుని పట్టాభిషేకం వార్తగాని, లోకానికి తెలియజెయ్యటానికి, సిద్ధంగా వుండు' అంది.

ఆ మాటలు విని గూనిది మనస్సులో పొంగిపోతూ, పైకి మాత్రం, 'అమ్మా, రాముడు రాజైతే నీకూ నీ కొడుక్కి కష్టకాలం దాపురిస్తుంది. కనక నీ తెలివంతా ఉపయోగించి, నీ కొడుకు రాజయ్యేలా చూసుకో.' అని ఆమె నిశ్చయాన్ని మరింత గట్టి పరిచింది.

మంథర పదేపదే చెప్తున్న మాటలు విని కైకకి దుఃఖం పొంగి పొర్లింది. రెండు చేతులతోనూ గుండెలు బాదుకుంటూ, 'మందరా, నామాటలు నమ్మవే, భరతుడికి అభిషేకం జరగకపోతే, రాముడు అడవులకి వెళ్ళకపోతే, నేనీ నేలమీదినించి, లేవను గాక లేవను స్నానం చెయ్యను. పరిమళద్రవ్యాలు పూసుకోను. అలంకారం చేసుకోను. తిండి తినను. నీళ్ళు త్రాగను. ఈ ప్రాణాలిలాగే వదిలేస్తాను' అంటూ కైక, అతిదారుణంగా ప్రతిజ్ఞచేసింది. ఆశపథం విన్న మందర తృప్తి పడింది.

దశరథమహారాజు, రామునికి పట్టాభిషేకం ప్రకటించి, కొలువు చాలించి, ముందుగా కైకేయికి ఈ వార్త చెప్పాలని ఆమె భవనానికి బయల్దేరాడు. స్వర్గధామాన్ని మరిపిస్తున్న, ఆమె భవనంలో ప్రవేశించి, శయ్యాగృహంలోకి వెళ్ళాడు.

కాని, అక్కడ కైకేయి కనిపించలేదు. ఇక్కడ జరిగిన కుతంత్రం ఆయన కన్సలు తెలియదు. ఎప్పటిలాగే, ప్రేమానురాగాలతో, 'కైకా' అని పిలిచాడు. కాని జవాబులేదు. తన అడుగుల చప్పుడు వినగానే, చిరునవ్వుతో ఎదురొచ్చే కైకేయి ఇపుడేమైందా? అని ఆశ్చర్యపోయాడు. పరిచారికని పిలిచి అడిగాడు.

ఆమె, చాలా భయపడుతూ, 'ప్రభూ, దేవిగారెందుకో కినుక వహించి, కోపగృహంలోకి వెళ్ళారు' అని చెప్పింది. ఆ మాటలు విన్న దశరథ మహారాజు, చిన్నబోయిన ముఖంతో గాబరాపడుతూ, చీకటి గృహంలో ప్రవేశించి, కటిక నేలమీద పడివున్న, కైకేయిని చూశాడు.

ఆమె నా స్థితిలో చూసి, ఆయనకి దుఃఖం వచ్చింది. ఆమె శరీరమంతా ఆప్యాయంగా నిమిరాడు. తొట్రుపాటుతో ఇలా అన్నాడు.

'దేవీ ఎందుకిలా ధూళిలో పడుకున్నావు! నిన్నీ స్థితిలో నేను చూడగలనా? నీకేంలోటు జరిగింది? దయ్యం పట్టినదానిలా, ఈ కటిక నేలమీద ఎందుకు

పడుకున్నావు? నీ ఆరోగ్యం సరిగా లేదా? వైద్యుని పిలిపించనా? లేక, నీ మనస్సుకెవరైనా కష్టం కలిగించారా? చెప్పు వారిని వెంటనే శిక్షిస్తాను. అలా కాకపోతే ఎవరికైనా ఏదైనా ప్రియం చేస్తానని మాట ఇచ్చావా? చెప్పు నువ్వు కోరుకున్న దానికన్నా వెయ్యిరెట్లు ఎక్కువ చేస్తాను.

పోనీ ఎవరికైనా మరణదండన వెయ్యమంటావా? కైకా, నాకు ప్రాణాపాయ పరిస్థితి కల్గినా సరే, నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను. దేవీ నీమీద నాకెంత అనురాగం వుందో నీకు తెలియదా? నా ప్రేమనే శంకిస్తున్నావా? నా పుణ్యకర్మ సాక్షిగా చెప్తున్నాను. నీకింకేం కావాలన్నా ఇస్తాను. ఏం చెయ్యమన్నా చేస్తాను. అసలింతకీ, నీ భయమేమిటో చెప్పు.' అంటూ, మదోన్మత్తుడిలా, కైకని సముదాయించి, బుజ్జగించటం మొదలుపెట్టాడు.

కామోద్రేకంతో వున్న భర్తవైపు కైకేయి దీనంగా చూసింది. మందస్వరంతో, ఇలా అంది.

'ప్రభూ, మీరూహించిన వేం జరగలేదు. నన్నెవరూ అనుమానించలేదు. నిందించనూ లేదు. కాని నాకో కోరిక కలిగింది. అది, మీరు చెల్లించాలి. చెల్లిస్తానని, ప్రమాణం చేస్తే చెప్తాను' అంటూ పేలవంగా నవ్వింది.

దశరథుని మనస్సు కుదుటబడింది. మందహాసం చేస్తూ, ఇలా అన్నాడు. 'వెర్రిదానా, నీ కన్నా ప్రియమైన వారు నాకెవరున్నారు? నీకు తెలుసుగా, నువ్వంటే నాకు పంచప్రాణాలు. అలాగే నా పుత్రులు నలుగురిలో రాముడొక్కడి మీదే మళ్ళీ అంత ప్రేమ వుంది. రాముడ్ని చూడకుండా ఒక్క నిమిషమైనా బ్రతకలేను. అంతటి ప్రియమైన నా రాముడి మీద ఒట్టుపెట్టి చెప్తున్నాను. నీ కోరిక ఏదైనా సరే, తప్పక తీరుస్తాను' అంటూ ముంగురులు సవరించాడు.

భర్త అనురాగానికి, కైకేయికి, చెప్పలేని ఆనందం కలిగింది. తాను కోరబోయే కోరిక ఎంత దారుణమైనదో ఆమెకి తెలుసు. అయినా సరే ఆమె పట్టు సడలలేదు. లేచి కూర్చుంది. భర్త చెయ్యి పట్టుకుంది.

'మహారాజా, మీరు సత్య సంధులు. పరమధార్మికులు. సత్యపరాక్రమ వంతులు. నా కోరిక తీరుస్తానని, మాట ఇచ్చారు. మీ మాట ముప్ఫైమూడు కోట్ల దేవతలూ విన్నారు. సూర్యచంద్రుల సాక్షిగా, పంచభూతాల సాక్షిగా, నవగ్రహాల సాక్షిగా, నా కోరిక చెల్లించాలి' అంది.

వెర్రిరాజు! ఉబ్బితబ్బిబైపోయాడు. 'సందేహమెందుకు దేవీ, చెప్పు' అన్నాడు ప్రేమగా.

కైక ధృఢమైన స్వరంతో 'రాజా, దేవాసుర యుద్ధంలో జరిగిన సంఘటన, గుర్తు తెచ్చుకోండి. శంబరాసురుడు, రెచ్చిపోయి, యుద్ధం చేస్తుంటే, కొన ఊపిరితో వున్న మిమ్మల్ని ఎంతో చాకచక్యంగా కాపాడాను కదా, గుర్తుందా? అపుడు మీరు ప్రాణాలు కాపాడినందుకు నాకు రెండు వరాలు కానుకగా ఇచ్చారు. కాని అపుడు ఆ వరాలు తీసుకోకుండా, నేను నిక్షేపంలా మీ దగ్గరే దాచుకున్నాను. మీరు ఆడి తప్పని వారైతే' నాకు ఆ రెండు వరాలూ, ఇపుడు అనుగ్రహించండి. ఒకవేళ మీరు ఆ వరాలు ఇవ్వనంటే ఆ అవమానంతో నేను ప్రాణత్యాగం చేస్తాను. నేను ప్రాణాలతో వుండాలంటే, ఆ వరాలు మీరు ఇవ్వాలి. ఇపుడే చెల్లించాలి' అంటూ అతినైపుణ్యంగా భర్తని, ధర్మపాశంతో బంధించింది.

కామమోహితుడైన మహారాజు తనకితానే, ఆమె పన్నినవలలో చిక్కుకున్నాడు. ఆమె కోరిన వరాలేవైనా సరె ఇస్తానని వాగ్దానం చేశాడు.

కైకేయి ప్రసన్న వదనంతో, భర్తకి దగ్గరగా చేరింది. 'అయితే వినండి మహారాజా, ఇపుడు మీరు, రాముని పట్టాభిషేకానికి తెచ్చిన సంభారాలన్నింటితో, నా కొడుకైన భరతుడికి పట్టాభిషేకం జరిపించాలి. ఇది నా మొదటి వరం.

రాముడు జటాజూటాలు ధరించి, తాపసవృత్తితో, దండకారణ్యానికి వెళ్ళి, పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చెయ్యాలి. ఇది నా రెండవ వరం. రాజా, రాముడు, ఇప్పుడే, నేను చూస్తుండగానే అడవులకి వెళ్ళిపోవాలి. ప్రభూ, తాము సత్యవ్రతులు. మీ శపథం ప్రకారం కోరిక తీర్చి, మీ వంశ గౌరవం నిలబెట్టుకోండి' అంది.

కలలో కూడా ఊహించని, ఈ కర్ణకఠోరములైన మాటలు విని, దశరథ మహారాజు మొదలు నరికిన మహావృక్షంలా నేలమీద పడి మూర్ఛపోయాడు. కొంతసేపటికి తెలివి తెచ్చుకుని, తనలో తానే చిత్తభ్రమ కలిగిన వానిలా 'ఇది కలా? లేక నిజమా? కైకేయి నిజంగా ఇలా అందా?! అని ఆలోచిస్తూ దుఃఖంలో కొట్టు మిట్టు లాడాడు. మళ్ళీ మూర్ఛపోయాడు.

చాలాసేపటి దాకా తెలివిరాలేదు. ఆడపులి ఎదుటబడ్డ జింకలా భయంతో నిశ్చేష్టుడైపోయాడు. మంత్రానికి కట్టుబడ్డ పాములా బుసలు కొడుతూ ఛీ - ఛీ - ఛీ అనుకున్నాడు. చేష్టలుడిగి కొంతసేపుండి, తర్వాత తమాయించుకుని, క్రోధంతో, కళ్ళల్లో నిప్పులు రాలుస్తూ, 'ఛీ ఛీ దుష్టచారిణీ, ఎందుకీ పాడు బుద్ధి పుట్టింది? మా వంశం నిర్మూలనం చేద్దామని, కంకణం కట్టుకున్నావా? నీకు నేను గాని, నా రాముడు గాని, ఏమైనా ద్రోహం చేశామా? సొంత తల్లి కన్నా మిన్నగా నిన్ను చూసుకున్నాడే! వాడికెందుకీ అన్యాయం తలపెట్టావు?

నువ్వు రాజకుమార్తెవని భ్రమించి, నిన్ను పెళ్ళి చేసుకున్నాను. కాని కాలసర్పం లాటిదానివని ఊహించలేకపోయాను.

కైకా, నా ప్రియపుత్రుడైన రాముణ్ణి సకలప్రాణికోటీ కొనియాడుతున్నారు. వాడేం తప్పుచేశాడని, ఈ శిక్ష వెయ్యమంటావు?

కావాలంటే, నేనూ, సుమిత్రా, కౌసల్య, అందరం నీకు దాసోహం అంటాము. నా ఐశ్వర్యాన్ని, రాజ్యాన్ని, నా భార్యల్ని, చివరికి, నా ప్రాణాల్నైనా సరే వదిలేస్తాను కాని పితృవత్సలుడైన నా రాముడ్ని విడిచి, నేను జీవించలేను. కైకా, ఇలాంటి పాపిష్ఠికోరికలెందుకు కోరుతున్నావు? రాముని మన్నించు. నీ పాదాలు పట్టుకుని ప్రాథేయపడుతాన్నాను. ఇంతటి పరమదారుణమైన కోరిక కోరకు. నాకు భరతుడి మీద ప్రేమ వుందా లేదా అని పరీక్షిస్తున్నావా? కావాలంటే, ఇపుడే భరతుడికి రాజ్యాభిషేకం చేస్తాను. కాని, రాముణ్ణి వనవాసం పంపమన్న కోరిక మానుకో. ఇది నీకు పుట్టిన బుద్ధి కాదు. ఎవరో దుర్బోధ చేశారు. రాముడు జ్యేష్ఠుడనీ, వాడే నా రాజ్యానికి వారసుడనీ, నువ్వే ఇదివరకు ఎన్నోసార్లు అన్నావుకదా? గుర్తులేదా?

నీకేదో పిశాచం ఆవహించింది. ఇన్నాళ్ళు ఇంత మమతానురాగాలతో వుండి, ఒక్కసారిగా ఎందుకిలా మారిపోయావు? నేను నమ్మలేక పోతున్నాను. నా ఇంట అడుగుపెట్టిన నాటినించీ, నేటిదాకా, ఒక్క అనుచితమైన మాట కూడా మాట్లాడి ఎరుగవే! నిజం చెప్పు. నీకు రాముడు, భరతుడూ ఇద్దరూ సమానమేకదా, రాముణ్ణి పద్నాలుగేళ్ళు వనవాసం ఎందుకు పంపమంటున్నావు?

మృదులస్వభావుడు, ఎవ్వరినీ ఎప్పుడూ నొప్పించనివాడు అయిన, ఆ సుకుమారుడు, కోమలగాత్రుడు, సుందరాకారుడు, నా రాముడు, నీ పట్ల ఏం దోషం చేశాడు? అయోధ్యా వాసులలో, ఏ ఒక్కడైనా నా రాముణ్ణి తప్పు పట్టగలరా? సమస్త ప్రాణికోటినీ సంతోషపెడుతూ, సర్వజనులనూ వశపరచుకున్నాడే! సకల విద్యాపారంగతుడు. దేవతలు సైతం మెచ్చుకునే నా రాముడు, ఏం చేశాడని, నువ్వు అడవులకి వెళ్ళగొట్టమంటావు?

కైకా, నేను వృద్ధుణ్ణి అయిపోయాను. రేపో, మాపో దాటిపోతాను. ఈ అవసాన కాలంలో, నా జ్యేష్ఠకుమారుణ్ణి నాకు దూరం చెయ్యకు. నీకు నమస్కారం చేస్తాను నన్ను అనుగ్రహించు. నా రాజ్యమంతా నీకిచ్చేస్తాను. నీ కాళ్ళు పట్టుకుంటాను. రాముణ్ణి మన్నించు.

నిండు పేరోలగంలో, నా ప్రజలందరి సమక్షంలో, రాముడికి పట్టాభిషేకం

చేస్తానని వాగ్దానం చేశాను. నాకు ధర్మహాని కలగకుండా కాపాడు' అంటూ నేలమీద పొర్లుతూ, కైకవంక దీనంగా చూడసాగాడు.

ఆ మాటలు విన్న కైకేయి ప్రళయకాలరుద్రరూపిణిలా అయింది 'ధర్మాత్మా, నా రెండు వరాలు చెల్లిస్తానని, ఒట్టు పెట్టుకున్నారు. ఇప్పుడేమో దుఃఖపడ్తున్నారు. మీరు పరమధార్మికులని, లోకం ఎలా నమ్ముతుంది? ఇపుడే నా మాట తీరుస్తానని మాట ఇచ్చారు కదా! ప్రమాణం కూడా చేశారు. ఆడి తప్పుతారా? ఈ అపకీర్తి మీతోబాటు మీ వంశాని కంతా కళంకం ఆపాదిస్తుంది. ధర్మం తప్పి దుర్మార్గానికి ఒడిగట్టకండి.

ధర్మమైనా, అధర్మమైనా, ఇష్టమైనా, అనిష్టమైనా, నా కోరిక తీర్చవలిసిందే. అలా కాదంటారా, మీ కళ్ళెదుట విషం తాగి చస్తాను. కౌసల్య రాజమాత అయితే, అంతకన్నా అవమానం నాకింకొకటి వుందా?

మహారాజా, భరతుడి మీదా, నా ప్రాణాల మీదా ఒట్టుపెట్టుకుని చెప్తున్నాను. రాముణ్ణి అరణ్యవాసం పంపకుండా, ఇంక మీరేం చేసినా, నేను తృప్తి పడను' అని కచ్చితంగా చెప్పింది కైక.

ఆక్షణంలో కైక మనస్సు వికలమై వుంది. రాముడు రాజైతే, ఆమె జీవితానికి ఘోరమైన విపత్తు కలుగుతుందని, మంథర పెద్ద భయోత్పాతం సృష్టించింది. అందుకే కైక మంకుపట్టు పట్టి మూర్ఖురాలై ధృఢసంకల్పంతో పలికింది.

కాని కలలో కూడా ఊహించని ఈ విపరీత సంఘటనకి దశరథుడు కలవరపడ్డాడు. కైక తనచేత ప్రమాణం చేయించుకుని, మరీ తన మనస్సులోని విషం బయటకి కక్కింది. ఎటూ దారిలేకుండా, తనని అష్టదిగ్బంధం చేసింది. ఈ ఘాతుకానికి దశరథుడు నిలువునా కుప్పకూలిపోయాడు.

దశరథుడు, పిచ్చివానిలా వెఱ్ఱిచూపులు చూస్తూ, 'కైకా, ఇంతటి అనర్థం నీకు మేలు చేస్తుందని ఎవరు బోధించారు? నేడు పిశాచం ఆవహించిన దానిలా ఇలా సిగ్గుమాలిన మాటలు పలుకుతున్నావు. మునుపెప్పుడైనా నీకు ఇలాంటి చెడ్డతలంపు కలిగిందా? అసలు నీ భయం ఏమిటి?

నీకూ, నీ కుమారునికీ, మేలు కలగాలని, నువ్వు అనుకుంటే, రాముణ్ణి వనవాసం పంపాలనే కోరిక మాను. ఎందుకంటే, రాముణ్ణి అడవులకి పంపిస్తే భరతుడు రాజు కావటానికి ఎంతమాత్రం ఒప్పుకోడు. అదీగాక, దేవీ, రాముడు లేకుండా నేను మాత్రం బతకగలనా? కైకా - నా మాట సావధానంగా విను.

మంత్రులూ, పురోహితులూ, మిత్రులూ, మహాజనులూ, అందరితో సమాలోచన చేసి, రామునికి పట్టం కట్టాలని నిశ్చయించాను. 'రాముని రాజుని చేస్తాను అని సభామధ్యంలో ప్రకటించాను'. ఇపుడు, వారంతా రాముని పట్టాభిషేకం చూడాలని, అన్ని దిక్కులనించీ వచ్చారు. వారంతా రాముడు వనవాసానికి వెళ్ళటం చూసి నన్ను ఎగతాళి చెయ్యరా? వారంతా ఏకమై ప్రశ్నిస్తే నేనేమని జవాబు చెప్పగలను?

కైకేయికి ఇచ్చినమాటకోసం రాముణ్ణి అడవులకి పంపుతున్నానని చెప్తే, 'వశిష్ఠాది మునుల సమక్షంలో, మహాజన సభామధ్యంలో, రామాభిషేకం చేస్తానని ప్రకటించావే, అది మాత్రం ఆడి తప్పటం కాదా? అని నన్ను వారు అవహేళన చెయ్యరా?

కైకా, 'నా కుమారుడు ఏమి తప్పుచేశాడని మీరు అడవులకి పంపారు?' అని కౌసల్య నన్నునిలదీసి అడిగితే, నేనేం జవాబు చెప్పను?

నన్నెంతో అనురాగంతో చూసే ఆమెని, కేవలం నీమీద వ్యామోహంతో, ఇంతకాలం ఉపేక్షించాను. నిన్నింత ప్రాణాధికంగా ప్రేమించినందుకు, నాకు నువ్విచ్చే ప్రతిఫలం ఇదేనా? సుమిత్ర మాత్రం ఇంక నన్నెలా నమ్ముతుంది?

'దేవీ, రాముడు అడవికి వెళ్ళటం జరిగితే, నేను బ్రతకను. సీత బ్రతకదు. మిగిలిన రాణులు కూడా జీవించి వుండటం, అసంభవం. ఇందర్ని పొట్టబెట్టుకుని, ముండమోపిగా, నీ కొడుకుని పెట్టుకుని, రాజ్యం ఏలుతావా? నీ చక్కదనం చూసి, మురిసిపోయి, నిన్ను పెళ్ళిచేసుకున్నాను. కైకా, నాకెంత కష్టం తెచ్చిపెట్టావు! ఇదంతా నా పూర్వజన్మప్రారబ్ధకర్మ. కైకా, ఇంతకాలం ఎంతో పేరు ప్రతిష్ఠలతో పాలించిన నేను, ఈ నాటినుంచీ 'ఈ ధశరధుడు కేవలం స్త్రీ సుఖం కోసం కామమోహితుడై, సర్వగుణ సంపన్నుడైన, పెద్దకొడుకుని, ప్రియాతి ప్రియమైన రాముణ్ణి అడవులకి వెళ్ళగొట్టిన దుర్మార్గుడు. బుద్ధి తక్కువవాడూ అనే నింద మొయ్యనా!

రాముడికి, ఇప్పుడిప్పుడే గృహస్థాశ్రమభోగాలు అనుభవించవలసిన సమయం వచ్చింది. ఇపుడు నిర్దాక్షిణ్యంగా వానిని అడువులకెలా పంపను?

నేను అడవులకి వెళ్ళమంటే, నా రాముడు మారు పలక్కుండా వెళ్ళిపోతాడు. కాని, రాముడు లేకపోయాక, ఈ అయోధ్య శ్మశానవాటికగా మారిపోతుంది. ఇంతకాలం ఈ కోసల రాజ్యం చెక్కు చెదరకుండా సుఖంగా వుంది. కాని, ఇక మీదట చిన్నాభిన్నమై పోతుంది. ఈ అల్లకల్లోలమైన రాజ్యంలో రాచరికం వెలగబెడ్దామని నువ్వు ఆరాటపడుతున్నావు. ఒక్క సంగతి గుర్తుంచుకో. నీ ఈ

అభీష్టము నీ కుమారుడైన భరతుడికి కూడా ఇష్టమైతే వాడు నా ప్రేతకర్మ చెయ్యటానికి అర్హుడు కాడు.

దుర్మార్గురాలా, వైధవ్యంతో నువ్వు, నీ కొడుకు ఈ రాజ్యం ఏలుకోండి. నువ్వు నాకు భార్యరూపంలో వున్న శత్రువువని తెలుసుకోలేకపోయాను. నీవల్ల నాకు మహాపాపం, అపకీర్తి, ఘోరమైన పరాభవం కలుగుతున్నాయి. నీ కోరిక ఘోరాతిఘోరమైనది. నువ్వు ఏడ్చి నిప్పుల్లోదూకినా సరే, మేడపైనుంచి దూకి, ముక్కలు ముక్కలైపోయినా సరె చచ్చినా నీ కోరిక తీర్చను గాక, తీర్చను. నా వంశాన్ని నాశనం చెయ్యాలని చూస్తున్నావు. ఇంక నువ్వు బతికివుంటే, నేను సహించలేను.

కైకా, రాముడు లేకుండా నేను బ్రతకలేను. నీ కాళ్ళు పట్టుకుని ప్రాథేయపడతాను. నాకూ నా రామునికీ అపకారం చెయ్యకు.' అంటూ జబ్బు పడినవానిలా తూలుతూ, దశరథుడు నేలమీద పడిపోయాడు. అయినా కైక ఇసుమంత కూడా చలించలేదు. నిర్భయంగా రాయిలా కూర్చుంది.

భర్తవంక కొర కొరా చూస్తూ వ్యంగ్యంగా ఇలా అంది 'రాజా, సత్యమే మీ వంశానికి పట్టుకొమ్మ అనీ, సత్యవ్రతాన్ని ఎప్పుడూ విడువననీ చెప్పి మరి నాకు ఇవ్వలసిన వరాలు చెల్లించకుండా ఇలా పట్టు పట్టటం ధర్మమేనా' అని హేళన చేసింది.

ఆ మాటలు విన్న దశరథుడు, నిలువెల్లా కంపించిపోయాడు. 'దుర్మార్గులారా, నా మీద నీకెందుకింక శత్రుత్వం? అయ్యో, నేను స్వర్గానికి వెళ్ళినా, అక్కడ కూడా దేవతలు రాముని గురించి, అడుగక మానరు.

కైక కిచ్చిన వరాలు చెల్లించి, సత్యవాది నయ్యానని చెప్పాననుకో, 'మరి రామునికి రాజ్యాభిషేకం చేస్తానని, నిండు సభలో ప్రకటించి, అడవులకి పంపటం మాట తప్పటం కాదా?' అని వాళ్ళు నన్ను గేలిచెయ్యరా?

కైకా, పుత్రసంతానం కోసం ఎన్నెన్నో నోములు, వ్రతాలూ చేసి, తాపత్రయ పడి, మహాయజ్ఞము చేసి పుత్రుల్ని పొందాను.

వారిలో జ్యేష్ఠుడు, శూరుడు, సకలవిద్యాపారంగతుడు, సద్గుణాలరాశి, జితేంద్రియుడు, ఇందీవరశ్యాముడు, ఆజానుబాహువు, పద్మపత్రాయతాక్షుడు, అయిన రామునికి పట్టాభిషేకం చెయ్యకుండా, దండకారణ్యానికి పంపి ఇంతటి ఘోరపాపం నేనెలా మూట కట్టుకోను? అంతకన్నా నాకు మరణమే మేలు' అంటూ దశరథుడు భోరున ఏడ్వసాగాడు.

రాత్రి మూడుర్ఝాములు గడిచాయి. దశరథుడు వ్యాధిగ్రస్తుడిలా నిట్టూర్పులు విడుస్తు కుమిలిపోతూ, కన్నులు మిటకరించి, ఆకాశంవైపు చూస్తూ, 'నిశాదేవీ - తెల్లవారకుండా చేసి నన్ను కాపాడలేవా! నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. ఈ రాత్రి ఇలాగే వుండిపోనీ. అలా కాదంటావా, నా బ్రతుకు తెల్లార్చు. నా పీడ విరగడైపోతుంది. ఈ పాషాణహృదయురాల్ని - కటికదాన్ని - క్రూరురాల్ని చూస్తూ నేనుండలేను' అంటూ ఆకాశంలోకి దండాలు పెట్టాడు.

మళ్ళీ ఏదో ఆశ చిగురించిన వానిలా కైకని మంచి చేసుకోవాలని, ఆమెని ప్రసన్నురాలిని చేసుకోవాలనీ 'దివ్యమంగళ స్వరూపిణివైన నా దేవీ, నువ్వు నా ఇల్లాలివి కదా, ఇన్నాళ్ళు నేను సత్యవ్రతంతో జీవించాను. నా ఆయుష్షు అయిపోయింది. ఇంక నేనెంతో కాలం బతకను. ఇపుడు శరణాగతుణ్ణయ్యాను. రాముణ్ణి రాజుని చేస్తానని నిండు కొలువులో సభామధ్యంలో ప్రకటించాను.

నువ్వు ఆలోచించు. నన్ను అనుగ్రహించు. నీ చల్లని చూపులతో నన్ను కాపాడు. ఈ రాజ్యమంతా నీకు దానంగా ఇస్తాను. నువ్వే దీనిని రామునికి సమర్పించు. భరతుడు కూడా దీనిని కాదనడు. దేవీ. అంతా నిన్ను మెచ్చుకుంటారు. నీ కీర్తి శాశ్వతంగా వుంటుంది. అంటూ కన్నీళ్ళతో వేడుకున్నాడు. కాని కైక చలించలేదు. అంగీకరించనూ లేదు.

అంతలో రాత్రి గడించింది. వైతాళికులు మేలు కొలుపుల పాడటం ప్రారంభించారు. ఆ మేలుకొలుపులు ఆపవలసిందిగా దశరథుడు ఆజ్ఞాపించాడు.

దుఃఖంతో నేలమీదపడి పొర్లుతున్న దశరథుని చూసి కైక 'రాజా - వరాలు చెల్లిస్తానని రాముని మీద ఒట్టు పెట్టుకున్నారు. మీ మర్యాద మీరు పాటించండి. శిబి చక్రవర్తి వాగ్దానం నెరవేర్చేందుకు, శరీరంలో మాంసం కోసివ్వలేదా? అలర్క మహారాజు వేదపారంగతుడైన పండితునికి తన కళ్ళు పీకి దానం ఇచ్చాడు. ఎందుకని?

అడిగింది ఇస్తానని మాట ఇచ్చినందుకే గదా. కనక మీరు కూడా ధర్మసిద్ధి కోసం ఇచ్చిన మాట చెల్లించండి. కాదంటారా, నేను ప్రాణత్యాగం చేస్తాను అంది బింకంగా.

దశరథుని హృదయం దడదడా కొట్టుకోసాగింది. ఎలాగో గొంతు పెకిలించుకుని,

'ఓ పాపీ, ఏ అగ్ని సాక్షిగా నిన్ను పెళ్ళాడానో, ఆ అగ్నిసాక్షిగానే నిన్ను పరిత్యజిస్తాను. నువ్వు నా భార్యవి కావు. నీకొడుకు నా పుత్రుడు కాడు. నేను

వానికి తండ్రిని కాను. సూర్యోదయం అవుతోంది. గురుజనులు నా కోసం చూస్తూ వుంటారు. నేను రామాభిషేకం చెయ్యాలి. లేదా చావనైనా చావాలి. అశుభచారిణీ, నేను ప్రాణత్యాగం చేస్తే నీ కొడుకు నాకు ఉత్తర కర్మలు చెయ్యకూడదు' అన్నాడు.

కైకకి చెప్పరాని కోపం వచ్చింది. తమాయించుకుని, చాకచక్యంగా 'రాజా, ఎందుకీ విషపూరిత వచనాలు. అంత దుఃఖపడవలసిన అవసరం ఏం వుంది? రాముణ్ణి రమ్మని కబురు చెయ్యండి. సమస్య అదే పరిష్కారమైపోతుంది' అంది.

దశరథుడు, కొరడాదెబ్బ తిన్న వాడిలా లేచి 'నిజమే కైకా, రాముణ్ణి పిలిపించు. నేను వెంటనే వాడిని చూడాలి. వానితో మాట్లాడితే కాని నా మనస్సుకి శాంతి లేదు' అన్నాడు.

తూర్పు తెల్లవారబోతోంది. పుష్యమీ నక్షత్రంలో యౌవరాజ్యాభిషేకానికి సమయం సమీపిస్తోంది. రాజవీధులన్నీ శోభాయమానంగా వెలిగిపోతున్నాయి. బాటలకిరువైపులా అంగళ్ళు తెరిచారు.

వశిష్ఠ మహర్షి ఆయన శిష్యులూ, సరయూనదిలో స్నానం చేసి, అభిషేక ద్రవ్యాలతో రాజవీధిలోని, జనసముదాయమధ్యంలోంచి దారిచేసుకుని రాజప్రాసాదానికి వచ్చారు. కైకేయీ మందిరంలో జరిగిన కుట్ర గురించి ఎవ్వరికీ తెలియదు. అయోధ్య అంతా ఆనందసముద్రంలో మునిగితేలుతోంది. ఆ సందడి చూసితీరవలసిందే గాని చెప్పటానికి భాషచాలదు. జనసందోహమంతా ఆనందంతో ఎదురుచూస్తున్నారు. పట్టాభిరాముణ్ణి కళ్ళారా తిలకించాలని, ఉవ్విళ్ళూరుతున్నారు.

ఒక పక్క పండితోత్తముల వేదఘోష ప్రతిధ్వనిస్తోంది. బ్రాహ్మణశ్రేష్ఠులు అభిషేకానికి కావలసిన సన్నాహాలన్నీ పూర్తిచేసుకుని రాజాజ్ఞ కోసం ఇంకో పక్క ఎదురు చూస్తున్నారు. ఎంతకీ మహారాజుగారి జాడలేదు.

సమయం మించిపోతుందని వశిష్ఠులు వారు, సుమంత్రుణ్ణి ఒక పక్కగా పిలిచి, 'మంత్రివర్యా, మీరు వెంటనే వెళ్ళి మహారాజుగారితో అభిషేకానికి సర్వమూ సిద్ధమైందనీ, సుముహూర్తం ఆసన్నమైందనీ చెప్పిరండి. తొందరగా మహారాజుగార్ని వెంటబెట్టుకురండి' అన్నాడు.

సుమంత్రుడు మహారాజుగారి కుటుంబానికి, చాలా సన్నిహితుడు. కనక అంతఃపురంలోకి కూడా స్వేచ్ఛగా వెళ్ళగల చనువు ఆయనకుంది. సుమంత్రుడు దశరథుని కోసం కైకేయి దేవి అంతఃపురంలోకి వెళ్ళాడు. శయ్యామందిరం దగ్గర నిలబడి,

'మహారాజా, శుభముహూర్తం ఆసన్నమైంది. నిద్రలేవండి. ప్రభూ, రామాభిషేకానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. వశిష్ఠమహర్షీ, పండితులూ, బ్రాహ్మణులు, సామంతరాజులు, నగరప్రముఖులూ అంతా మీ రాకకై వేచివున్నారు. మీరు వెంటనే వచ్చి శుభకార్యం జరిపించండి' అన్నాడు.

సుమంత్రుడి మాటలు విన్న దశరథుడు దుఃఖం పొంగుకొచ్చింది. ఎలాగో గొంతు పెకిలించుకుని 'సుమంత్రా, నీ మేలుకొలుపు నా గుండెల్ని చీల్చేస్తోంది' అని జాలి పుట్టించే స్వరంతో అన్నాడు. ఆ మాటలు సుమంత్రునికి చాలా విచిత్రంగా అనిపించాయి.

లోపలికి వెళ్ళబోయి సందిగ్ధంగా ఆగాడు. ఇంతలో కైకేయిబయటకి వచ్చింది.

'మంత్రివర్యా, మహారాజుగారు రాత్రంతా రాముణ్ణి గురించి ఆలోచిస్తూ నిద్రపోయారు. మీరు సత్వరం రాముణ్ణి ఇక్కడికి తీసుకురండి. ఇది రాజాజ్ఞగా భావించండి' అంది.

ఆ మాటలు విని సుమంత్రుడు తృప్తి పడ్డాడు. వెంటనే భవనం నుంచి బయటకి నడిచాడు. దారిపొడుగునా, మహాధనవంతులూ, పౌరప్రముఖులూ, జానపదులు, కానుకలు తెచ్చి బారులు తీరివున్నారు. రాజమార్గమంతా కిటకిటలాడుతూ వుంది.

సూర్యోదయం కావటానికింక ఎంతో వ్యవధిలేదు. తెల్లారగానే పుష్యమీ నక్షత్రం. రాముడి జన్మతార. లగ్నం కూడా కర్కాటక లగ్నము. రాముడికి సరిగ్గా అదే ముహూర్తానికి యువరాజ్యాభిషేకం చెయ్యాలని, దైవజ్ఞులు నిశ్చయించారు. అందుకోసం ప్రత్యేకంగా మేడిచెట్టు మానుతో చేసిన, భద్రపీఠం తెప్పించారు. వైఢూర్యవిరాజితమైన రత్నసింహాసనాన్ని అందంగా అలంకరించారు. ధగధగా మెరుస్తున్న పులితోలు పరిచిన రథం, నాల్గు గుఱ్ఱాలు పూన్చబడి సిద్ధంగా వుంది. పల్లకీ బోయీలతో కూడా శ్రీరాముని రాకకై నిరీక్షిస్తోంది. త్రివేణీ సంగమం నించీ, గంగానది నించీ, ఇంకా ఎన్నెన్నో పుణ్యనదులనించీ, పావనోదకాలు బంగారు బిందెలతో తెప్పించారు. సమస్త సముద్రాలనించీ, బావులనించీ, సరస్సులనించీ, పుణ్యోదకాలు వెండి, బంగారు బిందెల నిండా తెప్పించారు. తామరాకులతో తామర, కలువ పూలతో వాటిని అలంకరించి కప్పివుంచారు.

తేనె, నెయ్యి, పేలాలు, పెరుగు, పాలూ, పువ్వులూ, దర్భలూ, నవధాన్యాలూ, నవరత్నాలూ, ఖడ్గము, గద, ఛత్రచామరాలూ, బంగారు పగ్గాలు, ఆవులూ, మృగాలూ, పక్షులూ, అన్నీ సిద్ధంగా వున్నాయి.

యజ్ఞవేదిక మీద అగ్ని ప్రజ్వరిల్లుతోంది. వేశ్యాంగనలు, తమ గానాలతో, నాట్యాలతో, అందర్నీ అలరిస్తున్నారు. మంగళవతులైన ఎనమండుగురు కన్యలు స్నానం చేసి, చక్కగా అలంకరించుకుని, రామాభిషేకం చెయ్యటానికి సిద్ధంగా వున్నారు. వీణా వేణు మృదంగ తాళాది వాద్యాలూ, వాద్యగాళ్ళు, వంది మాగధులు, సిద్ధంగా వున్నారు.

అందరూ దశరథ మహారాజు రాకకై వెయ్యి కన్నులతో ఎదురుచూస్తున్నారు.

సుమంత్రుడు బయటకి వచ్చాక రాముని మందిరానికి వెళ్తూ దారిలో వీరందర్నీ చూశాడు. అయితే రాజలాంఛనం ప్రకారం మహారాజు వీరందరికీ సన్మానం చెయ్యాలి. ఆ సంగతి దశరథునికి చెప్పటానికి మళ్ళీ కైకేయి మందిరానికి వెళ్ళాడు. ద్వారం బయట నిలబడి, వినమ్రతతో, 'ప్రభూ, తెల్లారిపోయింది. సామంతరాజులు, కానుకలు తెచ్చి నిలబడి వున్నారు వారిని గౌరవించటానికి మీరు వెంటనే లేచిరావాలి' అన్నాడు.

అపుడు దశరథుడు లోపల్నించి 'సుమంత్రా, నేనసలు నిద్దరపోలేదు. రాత్రంతా మెలకువగానే వున్నాను. రాముణ్ణి ఇక్కడికి తీసుకురమ్మని కైక చెప్పింది కదా. నా ఆజ్ఞకూడా అదే. నువ్వు నా ఆజ్ఞనెందుకు పాటించలేదు? వెంటనే వెళ్ళి రాముణ్ణి తీసుకునిరా' అన్నాడు.

సుమంత్రుడు వెంటనే రథం మీద బయల్దేరాడు. కుబేరమందిరంలా తెల్లగా మెరిసిపోతున్న రాముని మందిరం దగ్గర రథం ఆపి దిగాడు. నేరుగా లోపలకి వెళ్ళాడు. తనరాక రామునితో చెప్పమని ద్వారపాలకుల్ని పంపాడు. ఆయనని గౌరవించి లోపలికి తోడ్కొని రమ్మని రాముడన్నాడు.

పాలమీగడలాంటి తెల్లని పానుపుమీద, రాముడు విరాజమానుడై వున్నాడు. పరిసరాలన్నీ పరిమళద్రవ్యాలతో ఘుమఘుమలాడుతున్నాయి. సీత రాముని పక్కన నిలబడి వింజామరలు వీస్తోంది. ఆ దివ్యసుకుమార తేజోమూర్తుల్ని సుమంత్రుడు చూశాడు. రాముడికి నమస్కరించి కుశల ప్రశ్నలు వేశాడు. 'ప్రభూ మీ అంతటి ప్రతిభాశాలిని కన్న కౌసల్య ధన్యురాలు. ఇపుడు మీ పినతల్లి కైకేయి, మీ తండ్రిగారైన మహారాజు మిమ్మల్ని అక్కడికి వెంటబెట్టుకు రమ్మని, నన్ను ఇక్కడికి పంపారు కనక వెంటనే రండి' అన్నాడు.

రాముడు సుమంత్రుణ్ణి సన్మానించి, సీతవైపు తిరిగి 'దేవీ మా తండ్రిగారూ, మా పినతల్లి, కైకేయీ దేవీ, నా రాజ్యాభిషేకం గురించి, ఆలోచించే, నన్ను రమ్మని, కబురుచేసి వుంటారు. మా పిన్నమ్మ చాలా సమర్ధురాలు సుమా. ఈ విషయంలో

నాన్నగారికి తగిన సలహాలు ఇచ్చి వుంటుంది. ఆమెకి నేనంటే ఎనలేని ప్రేమ. నేను వెంటనే వెళ్ళి వారి సలహాలు తెలుసుకుని వస్తాను. నేను వచ్చేవరకు నువ్విక్కడే నీ చెలికత్తెలతో సరదాగా కాలక్షేపం చేస్తూ వుండు' అంటు సంతోషంగా ఒక పూలమాల ఆమె మెడలో వేశాడు.

సీతకూడా ఆనందంగా స్వస్తివచనాలతో రాముణ్ణి పంపించింది. రాముడు మంగళాలంకారాలన్నీ చేసుకుని, సుమంత్రుని వెంట నడిచాడు. వారి వెంట లక్ష్మణుడు కూడా వెళ్ళాడు.

భవనం దాటి రాగానే ప్రజావాహిని రాముణ్ణి చూసి జయజయధ్వనాలు చేసింది. రాముడు చిరునవ్వుతో వారిని అభినందించాడు.

కళ్ళు జిగేలుమనేలా కాంతులీనుతున్న రథం ఎక్కారు వారు. రాముడు మెత్తని ఆసనం మీద కూర్చున్నాడు. లక్ష్మణుడు ఛత్రం పట్టాడు.

సుమంత్రుడు సారథిగా రథం తోలుతూ గుఱ్ఱాల్ని అదిలించాడు. రథం రాజవీధిలోకి వచ్చింది. జయజయ ధ్వనాలతో జనం వెంబడించారు. కత్తులూ, గదలూ, ధరించిన యోధులూ, శూరులూ, వీరులూ రథం ముందు నడిచారు. దారిపొడుగునా రాముని మీద పూలవాన కురిపించారు. స్తోత్ర పాఠాలు చదివారు. రథం కైకేయీ దేవి మందిరం వైపు దూసుకుపోయింది.

పన్నీటి ఘుమఘుమలతో రాజవీధులన్నీ సుగంధ పరిమళాలు వెదజల్లుతున్నాయి. తెల్లటి మేడలు బాటల కిరుప్రక్కలా మేఘమాలికల్లా వున్నాయి. ముత్యాలూ, రత్నాలూ, స్ఫటికాలూ, పరిమళద్రవ్యాలూ, పట్టువస్త్రాలూ, అన్నీ రాసులు బోసి బాటలకి కిరుపక్కలా అంగళ్ళు తీర్చివున్నాయి.

పూలదండలతో నిండిన అంగళ్ళు, నేతిమిఠాయిల అంగళ్ళు, ఒకటేమిటి? సమస్తం అంగళ్ళలో నిండుగావున్నాయి. అవన్నీ చూస్తూ రాముడు సాగిపోతున్నాడు.

అలా సాగిపోతున్న ఆ సుకుమార సుందరమూర్తిని చూస్తూ నగరపౌరులు వేనోళ్ళ ఆతడి గుణగణాలు పొగుడుతున్నారు. అంతటి మహనీయమూర్తి తమకి ప్రభువు కాబోతున్నందుకు మురిసిపోతున్నారు.

'రామచంద్రా, మీ తాత ముత్తాతల కన్నా గొప్పగా మమ్మల్ని ఏలుకోవయ్యా' అంటు పరవశించిపోతున్నారు.

కన్నులపండుగగా సాగిపోతున్న ఆప్రజావాహినిని, చిరునవ్వుతో పలకరిస్తున్న వారిని వారి వారి యోగ్యతలని బట్టి సన్మానిస్తూ, అలా అలా ప్రజల మధ్యనించి

సాగిపోయాడు రాముడు. ఆతడి రథం కనుచూపుమేర దాటేవరకు, అందరూ తన్మయత్వంతో, ఆతడి కమనీయ సుందరమూర్తిని చూస్తూ పరవశించిపోయారు. అయోధ్యలోని ఆ బాలగోపాలం రాముణ్ణి ప్రాణాధికంగా ప్రేమిస్తారు. రాముడికి కూడా వారంటే అంతటి వాత్సల్యమూ వుంది.

అలాసాగిన ఆ రథం, కైలాసపర్వత శిఖరంలా వున్న, నవరత్న విరాజితమైన 'వర్ధమానము' అని పిలువబడే దశరథుని దివ్యభవనంలోకి వెళ్ళింది.

ధనుర్ధారులు కాపలాకాస్తున్న మూడు కక్ష్యలు దాటి లోపలికి ప్రవేశించాక, రాముడు రథం దిగి, తన వెంట వస్తున్న మిత్రులనూ, అనుచరులనూ అక్కడే ఆగిపొమ్మని చెప్పి, కాలినడకన ఒంటరిగా అంతఃపురంలోకి వెళ్ళాడు.

కైకేయి గుమ్మందగ్గర నిల్చునివుంది. దశరథ మహారాజు లోపల మంచంమీద పడుకుని వున్నాడు. ఆయన ముఖం కళావిహీనమై వుంది.

రాముడు తండ్రి పాదాలకి, పినతల్లి పాదాలకి వందనం చేసి నిలబడ్డాడు. దశరథుడు రాముణ్ణి చూసి ఆర్తిగా 'రామా' అన్నాడు. ఆ తర్వాత ఆయన గొంతు పెగలలేదు. కన్నీరు కాల్వలా కారింది. కళ్ళు తెరిచి చూడలేకపోయాడు. నోరువిప్పి పలుకలేకపోయాడు. అటువంటి పరిస్థితిలో తన తండ్రిని రాముడు ఏనాడూ చూడలేదు.

ఏనాడూ భయమంటే ఏమిటో ఎరుగని శ్రీరాముడు ఆక్షణంలో ఏదో విషసర్పం పడగమీద అడుగువేసిన వానిలా భయంతో వణికిపోయాడు. ఊహించటానికి కూడా వీలుకాని తండ్రి పరిస్థితిని చూసి రాముడు నిలువెల్లా కంపించిపోయాడు. ఆతడి మనసు పరిపరివిధాల పోయింది.

'ఏమిటి? నాన్నగారు నన్నభినందించటానికి బదులు ఏదో ఘోరం జరిగినట్లు కుంగిపోతున్నారేమిటి?' అనుకున్నాడు.

ఇంక మనస్సు నిగ్రహించుకోలేక, శోకార్తుడై కైకేయి వైపు తిరిగి,

'అమ్మా, తెలియక నావల్ల ఏమైనా అపరాధం జరిగిందా? నాన్నగారెందుకింత కోపంగా వున్నారు? తల్లీ, నువ్వే వారిని ప్రసన్నురాలిని చెయ్యాలి. నాన్నగారికి నేనంటే ఎంతో వాత్సల్యం కదా! మరిపుడిలా విషణ్ణవదనంతో దుఃఖపడుతున్నారెందుకు? నా తల్లి కౌసల్యా - సుమిత్రా కులాసాగానే వున్నారు. మరి తండ్రిగారి విషాదానికి కారణం ఏమిటి? అసలేం జరిగిందో యథార్థం చెప్పమ్మా' అన్నాడు.

ఆ మాటలు విన్న కైకేయి ఏమాత్రం జంకు గొంకూ లేకుండా,

'రామా, నీ తండ్రికి నీమీదెంత మాత్రం కోపం లేదయ్యా, కాని, తన మనోగతాన్ని నువ్వంగీకరిస్తావో, లేదో అని, నీతో స్వయంగా చెప్పలేక బాధపడ్తున్నారంతే. నువ్వు వారికి ప్రియపుత్రుడివి కదా. నీకు అప్రియం కలిగించే మాటలు చెప్పటానికి వారికి నోరు రావటం లేదు. కనక ఆ సంగతి నేనే చెప్తాను విను.

పూర్వం ఒకప్పుడు నేను మీ తండ్రిగారి ప్రాణాలు కాపాడిన సమయంలో వారు నన్ను మెచ్చుకుని రెండు వరాలిచ్చారు. కాని ఇపుడు ఆ వరాలు రెండు చెల్లించమని నేను కోరగానే, చెల్లిస్తానని మాట ఇచ్చి కూడా చెప్పలేక పామరుడిలా విచారపడ్తున్నారు.

రామా, సత్యమే ధర్మానికి మూలమని పెద్దలంటారు కదా. కాని ఇపుడు నీ మూలంగా వారికి ధర్మహాని కలగబోతోంది. వారు ధర్మహాని చెయ్యకుండా నువ్వే వారిని కాపాడాలి.

వారు చెయ్యవలసిన కార్యం నీకు మేలుకలిగేదైనా, కీడు కలిగించేదైనా, శిరసావహిస్తానని ముందుగా నాకు నువ్వు మాట ఇస్తే విషయమంతా నీకు వివరించి చెప్తాను. తానే స్వయంగా చెప్తే విఫలమైపోతుందేమో అన్న సందేహంతో, వారు ముఖాముఖి చెప్పలేకపోతున్నారు. వారి శపథం నెరవేరుస్తానని నువ్వు వాగ్దానం చేస్తే నేను అంతా చెప్తాను' అంది.

ఆ మాటలు విన్న రాముడు చాలా వ్యాకుల పడ్డాడు. 'అయ్యో.... ఎంత అన్యాయం తల్లీ! ఈ రోజు నువ్వు నన్నెందుకిలా శంకిస్తున్నావు? తండ్రిగారి అభిమతం తీర్చలేనినాడు, నేను బ్రతికి వుండీ ఏం ప్రయోజనం? ఆయన నాకు తండ్రి మాత్రమేనా? గురువు. దైవం. ఆయన కోసం నేను నిప్పుల్లో దూకమన్నా దూకుతాను. విషం త్రాగమన్నా త్రాగుతాను. సముద్రంలో పడమన్నా పడతాను. అమ్మా, నాకు రెండు విధాలుగా మాట్లాడటం తెలియదు. కనక వారి అభీష్టమేమిటో తొందరగా చెప్పు. తప్పక నెరవేరుస్తాను' అన్నాడు దుఃఖంతో.

అపుడు కైకేయి సంతృప్తిగా తలపంకించి ఇలా అంది.

'రామా, జరిగిన సంగతి విను. పూర్వం దేవాసుర సంగ్రామంలో, నీ తండ్రి బాణోపహతుడై ప్రమాద పరిస్థితిలో వుండగా, వారిని నేను రెండుసార్లు ప్రాణాపాయ పరిస్థితి నించి కాపాడాను. అపుడు వారు చాలా సంతోషపడి, నన్ను రెండు వరాలు కోరుకోమన్నారు. కాని అపుడు నేను ఆ వరాలు కోరలేదు. ఇపుడు కోరుకున్నాను.

మొదటిది భరతునికి పట్టం కట్టమనీ, రెండవది నిన్నువెంటనే దండకారణ్యానికి పంపించి, పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేయించమనీ,

ఇపుడు నీ పట్టాభిషేకానికి తెప్పించిన సంరంభాలతోటే, భరతునికి పట్టాభిషేకం జరగాలి. నువ్వా - నీ తండ్రి సత్యవ్రతులైతే, నువ్వు ఈ క్షణమే జటాజినాలు ధరించి, అడవులకి వెళ్ళాలి. నీ తండ్రి దయార్ద్రహృదయుడు. కనుక నువ్వేమంటావో అని దుఃఖపడ్తున్నారు' అంది చాలా తేలికగా.

కైకేయి మాటలు విన్న దశరథుడు శోకాగ్నితో, తాపమెత్తిన వానిలా, తల్లడిల్లి పోయాడు. కాని రాముడు మాత్రం రవ్వంత కూడా చలించలేదు. దుఃఖించనూ లేదు. ఒక పక్క రాజ్యాభిషేక మహోత్సవం జరుగుతున్న తరుణంలో ప్రాణాంతకాలైన అలాంటి మాటలు వినవలసి వచ్చిందే అన్న చింత రామునిలో ఈషణ్మాత్రం కూడా కలగలేదు.

నిశ్చలమైన చూపులతో, 'అమ్మా, నీ మాట ప్రకారమే తండ్రి గారి శపథం శిరసావహించి, పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తాను.

కాని అమ్మా, అరిందములైన మా నాన్నగారు ఇవాళ ఎందుకో నాతో ఒక్కమాట కూడా పలకటం లేదు. వారు నామేలు కోరే మహానుభావులు కదా, వారిని సంతోషపెట్టటం కన్నా నాకు ధర్మమేముంది? నా స్వభావము వారికి తెలుసు. భరతుడికి పట్టాభిషేకం చెయ్యదల్చుకుంటే వారే నాతో స్వయంగా చెప్పవచ్చు కదా. నా గురించి వారికి సందేహమెందుకు కలిగింది? ఈ ఒక్క విషయమే నా మనస్సుని దహించి వేస్తోంది.

అమ్మా, భరతుడు నా తమ్ముడు. ఒకరిచేత చెప్పించుకోకుండానే వానికేది కావాలంటే అది ఇస్తాను.

ధనము, రాజ్యము, ప్రాణము ఏది కావాలన్నా ఇస్తాను. వాడు, నేను అనే భేదము నాకు లేదు. నీ ఆజ్ఞ పాటిస్తానని, ప్రమాణం చేయించుకున్నావు. నీకింకా దిగులెందుకమ్మా! నేను తప్పక వనవాసానికి వెళ్తాను. భరతుణ్ణి వెంటనే తాతగారింటినించి పిలిపించండి. నువ్వు కోరినట్లే వాడికి పట్టాభిషేకం జరుగుతుంది. నేను పద్నాలుగు సంవత్సరాలు అడవులలో నివసిస్తాను. నా మాటనమ్ముతల్లీ, ఇకనైనా నాన్నగార్ని నాతో మాట్లాడమను' అన్నాడు.

రాముని మాటలు విన్న కైకకి చెప్పలేని సంతోషం కలిగింది. రాముణ్ణి వెంటనే అడవులకి పంపెయ్యాలని అనుకుంది.

'రామా, నువ్వు చెప్పినట్లే దూతలను పంపించి, భరతుణ్ణి పిలిపిస్తాను. కాని, భరతుడు వచ్చేవరకు నువ్విక్కడ వుండటం అనవసరం.

ఎలాగా వనవాసానికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నావు కదా. ఆలస్యం ఎందుకు? నీ తండ్రిగారు నీతో సరిగ్గా మాట్లాడలేక స్వయంగా చెప్పలేకపోతున్నారు. అందుకే ఆయన సిగ్గుతో మౌనంగా వున్నారు. నువ్వు ప్రయాణమై వెళ్ళగానే ఆయన దుఃఖం తీరిపోతుంది.

ఇంకొక సంగతి విను. నువ్వు అయోధ్య పొలిమేరలు దాటావని తెలిసేవరకు, ఆయన స్నానం చెయ్యరు. భోజనం చెయ్యరు. కనక త్వరగా బయల్దేరు' అంది.

దశరథ మహారాజు దుఃఖం పట్టలేక, ఛీ - ఛీ అంటూ బంగారు పాన్పు మీదనించి దొర్లిక్రిందపడిపోయాడు. వెంటనే రాముడు తండ్రికి ఉపచారాలు చేసి లేవదీసి మంచం మీద పడుకోబెట్టాడు. కైకేయి మాటలు రామునికి కొరడాదెబ్బల్లా తగిలాయి. ఆతడి మనస్సు వికలమైపోయింది. తండ్రి గురించిన ఆలోచన ఆతడిలో కలగనే లేదు. తండ్రిని పాన్పుమీద పరుండబెట్టి కైకతో, 'అమ్మా, నేను స్వార్థపరుణ్ణి అని నువ్వు అనుకుంటే చాలా పొరపాటు. లోకులందర్నీ కూడ గట్టుకుని, రాజ్యమేలుతానని, భ్రమపడుతున్నావా? ఆ కాంక్ష నాకు లేదు. నాకు నాధర్మమే ముఖ్యము. నా తండ్రికి సంతోషం కలిగించేదేదైనా సరే నేను చేసి తీరుతాను.

పితృవాక్య పరిపాలన కన్నా పరమధర్మమేం వుంది? వారి కుమారునిగా పుట్టినందుకు, వారి సేవ చేసి తరించటం కన్నా భాగ్యమేం వుంది? వారి ఆజ్ఞగా నువ్వు చెప్పిన మాటలు నేను జవదాటగలనా తల్లీ!

అమ్మా, నువ్వు నాకు దేవతలాంటిదానివి. నీ ఆజ్ఞ కూడా నాకు శిరోధార్యమే.

భరతుడికి పట్టం కట్టమనీ, నన్ను అడవులకి వెళ్ళమనీ నువ్వు ఆజ్ఞాపించినా నేను శిరసావహించెవాడినే. ఈ చిన్న విషయాన్ని మహారాజుని వరములుగా యాచించావా తల్లీ! అంటే నీకు నా మీద నమ్మకం లేనట్లేగా, అయ్యో! ఈ రామునికి ఎంతటి దుస్థితి వచ్చింది. నువ్వెంత మాత్రం దిగులుపడకమ్మా. నేనిపుడే వెళ్ళి నాతల్లి కౌసల్యాదేవికి వీడ్కోలు చెప్పి, నా భార్యని సమాధానపరచి, దండకారణ్యానికి వెళ్ళిపోతాను. ఈ మాత్రం వ్యవధి ఇయ్యి. అంతకన్నా ఆలస్యం చెయ్యను.

అయితే, భరతుడు రాజ్యపాలన చేస్తూ, తండ్రిగారికి కూడా సేవలు చేసేటట్లు చూసే బాధ్యత నీదే. ఎందుకంటే పితృసేవ కుమారునికి సనాతన ధర్మం' అన్నాడు.

ఆ మాటలు విన్న దశరథుడు బావురుమని ఏడ్చాడు. రాముడు కైకేయికీ, దశరథునికి పాదాభివందనం చేశాడు. అంతే తలవంచుకుని బయటకి నడిచాడు. ద్వారం దగ్గర లక్ష్మణుణ్ణి చూశాడు. తలదించుకుని అడుగులు వేస్తూ నడిచాడు. జరిగిన సంఘటన తాలూకు ప్రభావం రామునిలో ఎంతమాత్రం కనిపించటం లేదు. అతడి ముఖంలో కాంతి ఎంతమాత్రం తగ్గలేదు. మానావమానాలు లెఖ్ఖచెయ్యని పరమయోగీంద్రునిలా అడుగులు వేస్తున్నాడు. లక్ష్మణుడు శ్వేతచ్ఛత్రం పట్టబోతే, వద్దన్నాడు. వింజామరలు వీచవద్దన్నాడు. దుఃఖచ్ఛాయలు ఏమాత్రం ముఖంలో కనిపించ నీయకుండా, తన విపత్తికి పురజనులు దుఃఖిస్తారేమో అని, తన మనోభావాల్ని తన మనస్సులోనే ఇముడ్చుకుని, ఈ అప్రియమైన వార్తని, తానే స్వయంగా తల్లికి చెప్పాలని, కౌసల్యా మందిరం వైపు వెళ్ళాడు.

ఎప్పుడైతే కైకేయీ మందిరం దాటి రాముడు సాగిపోయాడో వెంటనే అంతఃపుర స్త్రీలంతా, ఎంత 'ఘోరం జరిగింది'! అంటూ పెద్ద పెట్టున ఏడవసాగారు. ఆ రోదన ధ్వనులు విని దశరథుడు మళ్ళీ మూర్ఛపోయాడు.

రామలక్ష్మణులు కౌసల్యాదేవి మందిరంలో అడుగు పెట్టగానే, ద్వారపాలకులు, 'జయీభవ' అని నినాదాలు చేశారు. ఎదురైన వృద్ధ బ్రాహ్మణులకు చిరునవ్వుతో నమస్కరించాడు రాముడు.

కౌసల్యాదేవి మందిరం బయట వున్న వృద్ధస్త్రీలు రాముని ఆశీర్వదించి, వారి రాకని మహారాణి గారి కెరిగించటానికి లోపలికి వెళ్ళారు.

కౌసల్య రాత్రంతా జాగరణ చేసి, తెల్లవారుతుండగా, కొడుక్కి మేలు జరగాలని, విష్ణుమూర్తిని పూజించింది. బ్రాహ్మణులచేత హోమం చేయిస్తోంది. తెల్లని పట్టుచీర ధరించి, మంగళకరమైన ఆభరణాలు పెట్టుకుని, సాక్షాత్తు దేవతామూర్తిలా వెలిగిపోతున్న తల్లిని రాముడు చూశాడు.

హోమగుండం దగ్గర పూజాద్రవ్యాలు అందిస్తున్న కౌసల్య రాముణ్ణి చూసి ఆనందంతో లేచి నిలబడింది. రాముడు తల్లి పాదాలకి వందనం చేశాడు. ఆమె రెండు చేతులతోనూ కుమారుణ్ణి లేవనెత్తి, నుదుట ముద్దుపెట్టుకుని ఇలా అంది.

'రామా, నీ పూర్వీకులంతా పరమ ధార్మికులు. యశోగుణసంపన్నులు. వారి అడుగు జాడలలో నడిచి, నువ్వు దీర్ఘాయుష్మంతుడివి కావాలి. ఇంక కొద్దిసేపట్లో నీ తండ్రి, నీకు యౌవరాజ్యాభిషేకం చేస్తాడు. రాత్రంతా నువ్వు ఉపవాసం వున్నావు. ఇపుడే తెల్లారింది. ఏమైనా కొంచెం తిను నాయనా.. అంటూ పీట వేసింది.

తల్లిమాటలకి రాముడు సిగ్గుపడ్డాడు. దుఃఖం పైకి కనిపించనీయకుండా, 'అమ్మా, అసలు జరిగిన సంగతి తెలియక అలా అంటున్నావు. జరిగింది నీకెలా చెప్పగలను? ఇక మీదట నువ్వు, ఈ లక్ష్మణుడూ నా కోసం ఘోరమైన దుఃఖం అనుభవించవలసి వస్తుంది. ఈ పీట నాకెందుకమ్మా. నేనిపుడు దండకారణ్యానికి వెళ్ళాలి. ఇక మీదట ఈ పీటలూ వుండవు, రుచికరమైన భోజనమూ వుండదు. తేనె, పండ్లు, దుంపలూ తింటూ ఇరవై అయిదు దర్భలతో అల్లిన విష్టరాసనం మీద కూర్చోవాలి. నేను పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చెయ్యాలమ్మా' అన్నాడు నిర్లిప్తంగా.

ఆ మాటలు విన్న కౌసల్య మొదలు నరికిన వృక్షంలా నేలమీద పడిపోయింది. వెంటనే రాముడు, ఆమెని లేవదీసి ఉపచారాలు చేసి, ఒంటికి అంటిన దుమ్ము, ధూళి దులిపాడు.

ఆమె దుఃఖం పట్టలేక పెద్దగా ఏడుస్తూ 'నాయనా, ఇలాంటి దుఃఖం అనుభవించటానికేనా నిన్ను నేను కన్నాను! నీ తండ్రిగారి వల్ల నేనెలాంటి సుఖమూ అనుభవించలేదు. నాకూ ఒక కొడుకు పుట్టాడు, ఇంక అన్ని ఐశ్వర్యాలు సుఖాలు అనుభవించవచ్చని ఆశపడ్డాను. కాని, నా దురదృష్టం నన్నొదిలి పెట్టలేదు. అసలు నువ్వు నాకు పుట్టకపోయినా బాగుండేది. గొడ్రాలిగా వుంటే సంతానం లేదన్న దుఃఖం ఒక్కటే వుంటుంది. కాని, ఇపుడు నావల్ల, నాకూ, నీకూ కూడా దుఃఖమే, ఈ పుత్ర వియోగం నేనెలా భరించగలను తండ్రీ.

ఈ నాటివరకు పట్టమహిషిని అన్న గౌరవమైనా వుండేది. ఇక మీదట నన్ను సవతులు ఎగతాళి చేసినా, వాళ్ళ సూటిపోటి మాటలు పడివూరుకోవటం తప్ప గత్యంతరం లేదు కదా. నువ్వు దూరమయ్యాక నన్ను దాసీదాని కన్నా హీనంగా చూస్తుంది కైక. నేనెలా ఓర్చుకోగలను నాయనా.

రామా, నీ కోసం నేనెన్నో నోములు నోచాను. వ్రతాలు చేశాను. ఉపవాసాలు వున్నాను. కాని, నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది.

అయ్యో!, ఇంతటి దుఃఖంలో కూడా నా గుండెలు పగిలిపోవటం లేదే, నాకు చావైనా రాలేదు, రామా, దూడవెంట వెళ్ళే ఆవులా, నేనూ నీ వెంట వస్తాను. చంద్రబింబంలాంటి, నీ ముఖం చూస్తూ బ్రతుకుతాను. అంటూ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. తండ్రి ఆజ్ఞ రాముడు మీరడని ఆమెకి తెలుసు. అందుకే దుఃఖావేశంతో కౌసల్య ఏవేవో మాట్లాడింది.

అపుడు లక్ష్మణుడు ఆమెని సముదాయిస్తూ, 'పూజ్యురాలవైన తల్లీ, యథార్థం

చెప్పు. కేవలం ఒక ఆడదాని మాటలకి కట్టుబడి రాముడు రాజ్యం వదులుకుని, అడవులకి వెళ్ళటం ఏమాత్రమైనా సబబుగా వుందా? తండ్రిగారు పెద్దవారయ్యారు. ఆయనకి మనస్థిమితం లేకపోవచ్చు. పైగా విషయలోలత్వం ఆయనలో విచక్షణా జ్ఞానాన్ని నశింపజేసింది.

కైకేయి పట్ల వ్యామోహంతో, ఆయన ఆమె మాటలు విని, వాటికి కట్టుబడిపోయారు. కాని, రాముడు ఏం తప్పుచేశాడని, అడవులకి వెళ్ళ గొట్టున్నారు? కనీసం రాముడి శత్రువులైనా ఆతడిపట్ల దోషారోపణ చెయ్యలేరే! అటువంటి రాముణ్ణి వనవాసానికి పంపిస్తారా?

అమ్మా! రాముడు ఋజువర్తనుడు, జితేంద్రియుడు. శత్రువులను సైతం సహృదయంతో ఆదరించగల విశాలమైన మనస్తత్వం గలవాడు. పరమ ధార్మికుడు. అంతటి మహనీయుని ఏ తండ్రి అయినా అడవులకి పంపిస్తాడా? ఒకవేళ కామమోహితుడైన మహారాజు అలా ఆజ్ఞాపించాడే అనుకో, రాజనీతి తెలిసిన ఏ కొడుకైనా అలాంటి పనికిమాలిన ఆజ్ఞని మన్నిస్తాడా? అంటూ రామునివంక తిరిగి 'రామా, కైకేయి అంతఃపురంలో జరిగిన విషయాలేవీ పైకి పొక్కనీయకుండా నువ్వు ఈ రాజ్యం వశం చేసుకో. నేను ధనుస్సు ధరించి నీ కండగా నీ పక్కన వుంటాను. మనల్ని ఎదిరించగల సాహసం ఈ అయోధ్యలో ఎవ్వరికీ లేదు. ఒకవేళ ఏమూర్ఖుడైనా ఎదిరిస్తే ఈ ధనుస్సుతో వాని తల బ్రద్దలు గొడతాను. ఈ అయోధ్య అంతా నిర్మానుష్యం అయిపోతుంది. ఒకవేళ కైకమ్మ చేత ప్రేరితుడై, దశరథుడు మనమీద కత్తిదూసినా, ఆయనని చంపికాని, బంధించికాని, ఈ రాజ్యం వశం చేసుకుందాము.

'కామాతురుడై దారితప్పిన తండ్రిని దండించవచ్చు' అని శాస్త్రం చెబుతూంది. ఇది ధర్మము. ప్రజలంతా ఏకగ్రీవంగా నిన్ను యువరాజుగా అంగీకరించారు కదా. ఈ రాజ్యం కైకకీ, ఆమె కుమారునికే కట్టబెట్టటానికి ఆయన ఎలా అంగీకరించాడు? మనల్ని ఎదిరించి, ఈ రాజ్యం భరతునికి పట్టం కట్టగల శక్తి దశరథునికి వుందా?'

అంటూ కౌసల్య వంకతిరిగి, 'తల్లీ, నేను నా అన్నగారైన రాముని ఎడల త్రికరణ శుద్ధిగా అనురాగం గలవాడ్ని, నా ధనుస్సుమీదా, నేను చేసిన దానాలమీదా, నేను ఆచరించిన యజ్ఞాలమీదా ఒట్టుపెట్టుకుని చెప్తున్నాను. రాముడు అడవులకి వెళితే, ఆ పధ్నాలుగేళ్ళు నేను కూడా రాముడి వెంట అడవులకి వెళ్ళితీర్తాను. అంతేకాదు, ఒకవేళ అన్నయ్య మండుతున్న మంటల్లో దూకినట్లైతే, ఆయన కంటే ముందు నేనే దూకుతాను. కాని నువ్వు దుఃఖిస్తూ వుంటే చూడలేక అలా

అన్నాను. నా పరాక్రమమేమిటో ఇపుడే చూపిస్తాను' అంటూ ఆవేశంగా అంటున్న లక్ష్మణున్ని వారిస్తూ కౌసల్య రామునితో ఇలా అంది. 'రామా, లక్ష్మణుడు చెప్పింది విన్నావుగా. నీ కర్తవ్యమేమిటో నువ్వే నిర్ణయించుకో. లక్ష్మణుడు చెప్పింది ధర్మము. నా సవతి చెప్పినది అధర్మము. కనుక ఆమె మాటలనుసరించి, నువ్వు అడవులకి వెళ్ళనక్కర్లేదు. నీకు తెలియని ధర్మమేం వుంది కనుక. నువ్వు ఇక్కడే వుండి నాకు సేవలు చెయ్యి. మాతృసేవకన్నా అధికమైన ధర్మం ఎక్కడవుంది? పూర్వం కశ్యపుడు నియమంగా తల్లిని సేవించటంవల్ల ప్రజాపతి అయ్యాడు. రామా, నీకు పితృవాక్యపాలన ఎంత ముఖ్యమో, తల్లి మాటని పాలించటం కూడా అంతే ముఖ్యం.

నా అనుమతి లేనిదే నువ్వు అడవికి వెళ్ళటానికి వీల్లేదు. నీ వియోగం నేను సహించలేను. నీతో వుంటే ఆకులలములు తిన్నా నాకు ఆనందమే. నువ్వు నన్ను విడిచివెళ్తే నేను ప్రాయోపవేశం చేస్తాను అంటూ ఏడవసాగింది.

రాముడు తల్లిని ఊరడిస్తూ 'అమ్మా, తండ్రి గారి ఆజ్ఞ నేను అతిక్రమించను. అది నాశక్తికి మించిన పని. తల్లీ నిన్ను తలవంచి ప్రార్థిస్తాను. నన్ను అడవులకి వెళ్ళనీ, సమస్త ధర్మములు తెలిసిన కండు మహర్షి, తండ్రి ఆజ్ఞపై గోవధ చేశాడు కదా. పరశురాముడు, తండ్రి ఆజ్ఞ మేరకి కన్నతల్లిని గొడ్డలితో నరికేశాడు కదా? అంతవరకు ఎందుకు మా పూర్వీకులు సాగరులు తండ్రి ఆజ్ఞానుసారం భూమిని అంతా మహాభయంకరంగా తవ్వి హతులైపోలేదా. పితౄజ్ఞ పరిపాలనకి నేనొక్కణ్ణే బయల్దేరలేదు. మునుపు ఎందరో మహానుభావులు తండ్రి ఆజ్ఞమేరకి ఎన్నెన్నో సాహసాలు చేశారు. పరమధార్మికులందరూ వెళ్ళినదారినే నేనూ వెళ్తున్నాను.

అది నీకు దుఃఖహేతువు కావచ్చు కాని తండ్రి ఆజ్ఞపాలన వల్ల నన్నే పాపము అంటదు. కనక దయయుంచి నన్నాశీర్వదించు'అంటు లక్ష్మణుడి వైపు తిరిగి, 'తమ్ముడూ, నీకు నా పట్ల వున్న ప్రేమానురాగాలు నాకు తెలుసు. నీ పరాక్రమం కూడా నేనెరుగుదును. అయితే సత్యమూ శమమూ ఎంతటి శక్తి గలవో తెలియక అమ్మ బాధపడుతోంది. మా అమ్మ దుఃఖం నీకూ బాధ కల్గించటం కూడా న్యాయసమ్మతమే కాని సమస్త పురుషార్థాలకూ మూలము ధర్మమే. ధర్మానికి ఆధారం సత్యం. ప్రస్తుతం పితృవాక్యపాలన వల్ల నాకు ధర్మమూ, సత్యమూ రెండూ సమకూడుతున్నాయి. తల్లికి గాని, తండ్రికి గాని, సద్బ్రాహ్మణునికి గాని, మాట ఇచ్చి తప్పటం మహా దోషము. కనుక నేను పితౄజ్ఞను అతిక్రమించలేను. మన తండ్రిగారి ఆజ్ఞనే కైకేయి నాకు చెప్పింది. కనక మహా భయకరమైన

క్షాత్రధర్మం జోలికి వెళ్ళను. క్రూరత్వము వినాశహేతువు కనుక నా పద్ధతినే అనుసరించు' అన్నాడు శాంతంగా.

అమ్మా నా ప్రాణాల మీద ఒట్టుపెట్టి చెప్తున్నా. నేనిపుడు అడవికి వెళ్ళవలసిందే. అడ్డుచెప్పకు. నన్ను అనుమతించి ఆశీర్వదించు. నాన్నగారి మాటలు నాకే కాదు. నీకు, సుమిత్రాదేవికి, సీతకి, లక్ష్మణుడికి, కూడా శిరోధార్యములే. పధ్నాలుగు సంవత్సరాలు ఇట్టే గడిపి తిరిగి వచ్చేస్తాను. అంతవరకు నీ దుఃఖాన్ని నీలోనే అణచుకో. ఈ రాజ్యాభిషేక సంభరాలన్నీ సంతోషంగా భరతుడికిచ్చెయి'. అంటూ ఎన్నోవిధాల తల్లికి నచ్చచెప్పాడు.

రాముని మాటలు విన్న కౌసల్య భరించలేని దుఃఖంతో మూర్ఛపోయింది. రామలక్ష్మణులు ఆమెకి ఉపచారాలు చేశారు.

ఆమె కాస్త కోలుకుని, రాముణ్ణి పైనించి కింది దాకా చూస్తూ, 'నాయనా, నేను తొమ్మిదినెలలూ మోసి, కని పెద్ద చేశానే, మీ నాన్నగారిలా నేనూ నీకు పూజ్యురాలను కానా? నువ్వు లేకుండా నేనెలా బ్రతికేదిరా? తండ్రీ, నువ్వు లేకపోయాక నాకు స్వర్గసుఖాలెందుకురా?' అని ఏడుస్తూ మళ్ళీ తెలివి తప్పి పడిపోయింది. అయినా సరే రాముడు చలించలేదు. ఆ ధర్మసంకట పరిస్థితిలో, ఏం చెయ్యాలో తోచక లక్ష్మణునివైపు చూస్తూ, 'తమ్ముడూ, మీ అందరి అనురాగం నాకు తెలియకనా, కాని నా అభిప్రాయం తెలుసుకోకుండా నువ్వూ నన్ను సంకట పరిస్థితిలో పడెయ్యకురా. ఒక్క సంగతి విను. ఒక్క ధర్మం వల్లనే ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలు కల్గుతాయి. భార్య అనుకూలవతి అయి ధర్మాన్నీ, అభిమత అయి అర్థాన్నీ, సుపుత్రుని కని కామాన్ని, నెరవేరుస్తుంది. కేవలం అర్థాన్ని కాంక్షిస్తే లోకం ద్వేషిస్తుంది. కామము మాత్రమే కోరుకున్న వారిని ఈ లోకం మెచ్చరు.

నాయనా! దశరథ మహారాజు మనకి తండ్రి, గురువు. ఆయన కోపంతోగాని, సంతోషంతో గాని, చివరికి కామాతురుడై గాని మనల్ని ఏది ఆజ్ఞాపించినా మనం ఆచరించి తీరాలి. పాపకర్ములైన పుత్రులు మాత్రమే తండ్రి ఆజ్ఞని ఉల్లంఘిస్తారు. కాని, నేనలా చెయ్యను. మనల్ని ఆజ్ఞాపించే హక్కు ప్రభువుగా ఆయనకుంది. కనక ఎట్టి పరిస్థితిలోనైనా ఆయన ఆజ్ఞ శిరసావహిస్తాను. తమ్ముడూ, ఈ కౌసల్య నా తల్లి. ఆయనకి ఇల్లాలు. కనక ఈమెకైనా ఆయనేదిక్కు. ఈమె కూడా ఆయన ఆజ్ఞపాటించాలి. మన తండ్రి ధర్మప్రవర్తకుడు.

ఆయన జీవించి వుండగా ఈవిడ వితంతువులా కొడుకుతో అడవులకి వెళ్ళటం ధర్మసమ్మతం కాదు' అని లక్ష్మణునికి నచ్చచెప్పాడు.

అంతలో చైతన్యవంతురాలై లేచి కూర్చున్న తల్లితో 'పట్టపురాణీ, నేను వనవాసం చెయ్యబోతున్నాను, ఈ అల్పమైన రాజ్యం కోసం శాశ్వతమైన యశస్సుని పాడుచేసుకోవటం నా కిష్టం లేదు. ఈ జీవితకాలము చాలా స్వల్పమైంది. కనక అధర్మం ఆచరించటం తగదు. తుచ్ఛమైన ఈ రాజ్యం నాకక్కరలేదు. నన్ను దీవించి పంపు. నువ్వు కూడా నీ భర్తని సేవిస్తూ, నీ ధర్మం ఆచరించు' అంటూ తల్లికి పాదాభివందనం చేసి, ఒంటరిగా అడవికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు.

ఆ మాటలు విన్న లక్ష్మణుడు కోపంతో బుసలు కొట్టాడు. రాముడు లక్ష్మణున్ని శాంతింపచేస్తూ భుజం తట్టి 'లక్ష్మణా, కోపం నిగ్రహించుకో. ధైర్యంగా వుండు. నా వనవాసానికి సహాయం చెయ్యి' అన్నాడు.

'తమ్ముడూ, పధ్నాలుగు సంవత్సరాలు దీర్ఘకాలం నేను వనవాసం చేసి, సురక్షితంగా తిరిగి వస్తానో, రానో అని అమ్మ భయపడ్తోంది. ఆమెని ఓదార్చి ధైర్యం చెప్పేపూచీ నీది. ఇంకా ఆలస్యమైతే, మనం ఏదో కుతంత్రం చేస్తున్నామని కైకేయి అపోహ పడ్తుంది. ఆమె సందేహాన్ని, దుఃఖాన్ని పోగొట్టాలి. ఇలా మన తల్లులు కౌసల్యా, సుమిత్ర దుఃఖ సాగరంలో మునిగి వుంటే నేను ఉపేక్షించి ఊరుకునేదెలా?

కాని, నేనింతవరకు తెలిసికాని, తెలియకగాని, నాన్నగార్ని గాని, మన తల్లుల్ని గాని ఎపుడూ కష్టపెట్టలేదు. నాన్నగారైనా తగినంత కారణం లేకుండా అలా ఊరుకోరు. ఆయన అస్సలు అసత్యమాడరు. వారు గొప్ప పరాక్రమవంతులు. దేనికీ భయపడరు. అయితే కైకేయికి చేసిన ప్రతిజ్ఞ భంగమవుతుందని, ఆయన దుఃఖిస్తున్నట్టున్నారు. వారి కలాంటి దుఃఖం కలగకుండా చూడాలి.

నేను జటా వల్కలాలు ధరించి కృష్ణాజినం ధరించి, కమండలం పట్టుకుని, అడవికి వెళ్తే కైకేయి తృప్తి పడుతుంది. నిరాటంకంగా భరతుడికి అభిషేకం చేయిస్తుంది. కనక ఆలస్యం చెయ్యకుండా బయల్దేరాలి.

లక్ష్మణా, బాగా ఆలోచించి చూస్తే ఇదంతా దైవికమని అనిపిస్తోంది. కైకేయి దోషం కూడా లేకపోవచ్చు. ఎందుకంటే ఆమె ఇదివరకెపుడూ నన్ను వేరుగా, భరతుణ్ణి వేరుగా చూడలేదు. నేనైనా కన్నతల్లి, సవతి తల్లి అనే తేడా ఎపుడూ ఎరగను. నేనంటే ఆవిడకి చాలా వాత్సల్యము. అలాంటిది ఇవాళ, నాకు యౌవరాజ్యాభిషేకం వద్దనీ, అడవులకి పంపమనీ, ఎలా అనగలిగిందంటావు? ఇదంతా కేవలం విధి సంకల్పం తప్ప వేరే కారణమేదీ కనబడటం లేదయ్యా.

లక్ష్మణా! కైకేయి ఉత్తమ వంశంలో పుట్టింది. నేటివరకు అందరికీ అనుకూలవతియై సద్గుణరాశి అనిపించుకుంది. కాని ఇపుడు మాత్రం దుర్మార్గురాలిలా, సిగ్గు, బిడియం వదిలేసి, భర్తదగ్గర అనుచితంగా ప్రవర్తిస్తూ, భర్తను అనుచితమైన కోరిక కోరటమే గాక, అది చెల్లించాలని వారిని నిర్బంధిస్తోంది. విధి బలీయమైనది కదా. దానికి సాధ్యాసాధ్యాలుండవు.

లేకపోతే దైవజ్ఞులు నిర్ణయించిన అభిషేక ముహూర్తం ఇలా ఎందుకవుతుంది? నన్నెంతో ప్రేమతో ఆధరించే కైకేయి ఇవాళ నన్ను అడవులకి పంపాలని కంకణమెందుకు కట్టుకుంటుంది?

ఈ విధిలీలలు ముందుగా ఎవ్వరూ తెలుసుకోలేరు. మనం ఎంతో శ్రద్ధగా చేసే పనులు కూడా ఒక్కోసారి వికటిస్తాయి. యధాలాపంగా చేసే పని ఒకొక్కసారి విశేషఫలితాన్నిస్తుంది. ఇదంతా దైవలీల. ముందు తెలుసుకోలేము కనుక ఎదుర్కోలేక బాధపడ్తాము. ఈయధార్థం నేనిపుడే గ్రహించాను. అభిషేకం ఆగిపోయిందనే విచారం నాకు లేదు. తమ్ముడూ, నా అభిషేకం కోసం తెప్పించిన ఈ కలశోదకాలతోనే నేనిపుడు తపోవ్రతస్నానం చేస్తాను' అని లక్ష్మణునితో అంటూ మళ్ళీ క్షణంసేపు ఆలోచించి, 'ఎంతపొరపాటుగా ఆలోచిస్తున్నాను! ఇది రాజ్యాభిషేకజలము కదా, ఇది నేను ఉపయోగించకూడదు. నేనే స్వయంగా నీళ్ళు తోడుకుని స్నానం చేస్తాను. నాయనా, రాజ్యలక్ష్మి నాకు దక్కలేదు కదా. ఈ రాజ్యపాలన కన్నా వనవాసమే నాకు సుఖంగా వుంటుంది. కనుక నువ్వు దుఃఖపడకు.

కైకేయి కేవలం దైవోపహత. నా రాజ్యాభిషేకం ఆగిపోవటానికి ఆమె కారణం కాదు. దైవ ప్రభావం అటువంటిది. జరిగిందంతా మర్చిపో' అని రాముడు లక్ష్మణుణ్ణి సముదాయించాడు.

రాముని ధర్మనిరతికి లక్ష్మణుడు చాలా ఆశ్చర్యపోయాడు కాని అన్నగారు వనవాసం వెళ్ళాలన్న మాట అతడి హృదయాన్ని కృంగదీసింది. కోపంతో కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. పాములా బుసలుకొట్టాడు.

'అన్నా, పితృవాక్యపాలన చెయ్యకపోతే ధర్మహాని చేసినవాణ్ణవుతానేమో అని, జరిగిందంతా దైవికమనీ భ్రమపడ్తున్నావు. ఇదంతా కేవలం నీ అపోహ మాత్రమే. దీనులు, అశక్తులు మాత్రం పలికే మాటలివి. నీలాంటి వీరులూ శూరులూ అనవలసిన మాటలు కావు. ఒక్క సంగతి ఆలోచించు.

కైకేయీ, దశరథుడూ అధర్మపరాయణులై తెలివిమాలిన నిర్ణయం తీసుకున్నారు. ఇదంతా చూస్తుంటే వాళ్ళు ఒక పథకం ప్రకారం చేశారేమో

అనిపిస్తోంది. దశరథమహారాజు లాంటి నీతిజ్ఞుడు ఏనాడో ఇచ్చిన వరాలు ఇంతకాలం దాకా చెల్లించకుండా ఉంటాడా? ఒక వేళ ఉపేక్షించినా, ఆ వరాలు కోరుకునే సమయం ఇదేనా. ఇదంతా కుట్ర కాదంటావా? అయినా ఇలాంటి అర్థం లేని కోరికలు తీర్చకపోవటం ఎంతమాత్రమూ అధర్మం కానే కాదు. అయినా జ్యేష్ఠపుత్రుడుండగా చిన్నవానికి రాజ్యాభిషేకం చెయ్యటం అధర్మం, లోక విరుద్ధం కాదా? పితృవాక్యపాలన నీ కర్తవ్యమనీ, నిన్న రాజ్యాభిషేకానికి ఒప్పుకుని, ఇవాళ మళ్ళీ అదే నోటితో అడవులకి వెళ్తానంటున్నావే, ఇలా క్షణక్షణం మారే ధర్మం కూడా ఒక ధర్మమేనా? మన తండ్రి కాముకుడై, స్త్రీలోలుడై కైకమ్మ మీది వ్యామోహంతో, నిన్నిలా ఆజ్ఞాపించటం అధర్మం కాదా? ధర్మవిరుద్ధమైన ఇలాంటి కోరిక నువ్వు శిరసావహించవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. దీనిని నువ్వు దైవఘటనగా భావించి తలవంచటం కూడా ధర్మం కాదు.

ఈ దైవికమైన కార్యం అధర్మమని తెలిసికూడా నువ్వు ఎందుకు ఎదిరించవు? తెలివైనవాడు దైవఘటనని కూడా తనకి అనుకూలంగా మార్చుకోవాలి. నాకు అనుమతి ఇయ్యి. దైవశక్తి ఏదో, పురుషశక్తి ఏదో ఇపుడే నిరూపిస్తాను.

మావటివాడు ఒక చిన్న అంకుశంతో మదపుటేనుగుని లొంగదీసినట్లు, నేనిపుడే ఆ దైవాన్ని దారి మళ్ళిస్తాను. అష్టదిక్పాలకులు, ముల్లోకాలూ ఏకమై వచ్చినాసరే, నీ రాజ్యాభిషేకాన్ని ఆపలేరు. ఇంక దశరథమహారాజొక లెక్కా!.

రామా, కాదు కాదు ప్రభూ, నిన్నెవరైతే వనవాసానికి పంపాలని సంకల్పించారో వారినే ఇపుడు పధ్నాలుగేళ్ళు అడవులకి పంపిస్తాను. నీ రాజ్యాభిషేకం చెడగొట్టి తన కొడుక్కి పట్టం కట్టాలనుకున్న ఆ కైకేయికి బుద్ధి చెప్తాను.

రామా, నువ్వు పట్టాభిషిక్తుడవై చాలా సంవత్సరాలు ఈ రాజ్యం పాలించి, ముసలివాడవయ్యాక, వానప్రస్థాశ్రమం తీసుకోవటానికి మాత్రమే అడవికెళ్ళాలి. కాని ఇపుడు కాదు. నీ తర్వాతైనా, నీ పుత్రులే ఈ రాజ్యం ఏలాలి. కాని భరతుడికా అర్హత లేదు. 'ధర్మాత్మా, తండ్రిగారు చపలచిత్తులై వుండగా, రాజ్యం స్వాధీనం చేసుకుంటే ఏదైనా గొడవలొస్తాయని భయపడుతున్నావా?

మహావీరుడైన నీకు అలాంటి ఆలోచనలు రావచ్చా? అయినా నేను నీకు తోడుగా వుండగా అలాంటి భయం అక్కర్లేదు. రాజ్యం అల్లకల్లోలం కాకుండా నేను కాపాడుతాను. వెంటనే వశిష్ఠాదుల్ని పిలిపించి అభిషేకం చేసుకో. రామచంద్రప్రభూ, నేను నీ కింకరుణ్ణి. ఆజ్ఞాపించు' అంటూ కన్నీళ్ళు కారుస్తూ

మహా ఆవేశంగా మాట్లాడుతున్న లక్ష్మణుడ్ని చేరదీసి, కన్నీరు తుడిచి రఘువంశవర్ధనుడైన రాముడు సౌమ్యంగా,

'తమ్ముడూ, నీ కెందుకింత కోపం? నేను తండ్రిగారి ఆజ్ఞ దాటను. అంతే. అదే సత్పథము. ఆవేశం అనర్థదాయకం నాయనా' అన్నాడు.

ఇంక రాముణ్ణి ఆపటం ఎవరితరం కాదని కౌసల్యకి తెలిసింది. ఆమె కన్నీరు కాలువలై పారింది. 'అయ్యో! దశరథ మహారాజు జ్యేష్ఠ పుత్రుడు, నా కన్నతండ్రి, సమస్త ప్రాణికోటినీ సంతోషపెట్టే ధర్మాత్ముడు, నా నోముల పంట, ఇంక అడవులలో ఆకులు, అలములు తింటు బతకాలా? అని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. రాముడి భృత్యులూ, దాసీలు సైతం మృష్టాన్న భోజనాలు చేస్తూ వుంటే, రాముడు మాత్రం మహారణ్యాలలో కందమూలాలు తింటు కాలం గడపాలా? అయ్యో! ఇంతటి సుగుణాల రాశి అయిన కొడుకుని అడవులకి పంపటానికి, దశరథ మహారాజు మనసెలా ఒప్పింది? రామా ఈ అనర్థాని కంతటికీ మూలకారణం దైవమే. దాని బలం చాలా గొప్పది. కాని ఈ కార్చిచ్చు నా మనస్సుని దహించి వేస్తోంది. నాయనా నేనూ నీ వెంట వస్తానురా నాతండ్రీ అంటూ బావురుమని ఏడవసాగింది కౌసల్య.

రాముడు తల్లిని ఓదార్చి, 'అమ్మా, కైకేయీ దేవి నా తండ్రిని వంచించింది. ఆ కారణంగానే నేను అడవులకి వెళ్ళవలసి వచ్చింది. నువ్వుకూడా ఆయనని వదిలిపెట్టి వచ్చేస్తే ఆయన జీవించి వుండగలరా? అమ్మా, ఆడది తన భర్తని వదిలి వెళ్ళటం కన్నా మహాపాతకం మరోటి వుండదు. నువ్వు పొరపాటునైనా ఆ ఆలోచన మనస్సులోకి రానివ్వకు. నాన్నగారు జీవించినంతకాలం నువ్వు ఆయనకి సపర్యలు చేస్తూండాలి. ఇదే సనాతన ధర్మం' అన్నాడు.

కాని కౌసల్య రాముడి మాటల్ని లెక్కచెయ్యకుండా, 'నాయనా, నువ్వెళ్ళిపోతే నా సవతుల మధ్య నేనుండలేను. నీ తండ్రి ఆజ్ఞని పాలించటానికి నువ్వు అడవులకి వెళ్ళదల్చుకుంటే నన్ను కూడా నీతో తీసుకెళ్ళు. నేను నిన్ను శ్రమపెట్టను. వన్యమృగాలతో కలసి అడవిలో తిరుగుతాను. కనుక వద్దు అనకురా' అంటూ మంకుపట్టు పట్టింది.

ఆమె మాటలు రామునికి చాలా దుఃఖం కలిగించాయి. 'అమ్మా, నీకు నేనెలా చెప్పేది? ఆడదానికి బ్రతికి వున్నంతవరకు భర్తే ప్రభువు. భర్త బ్రతికి వుండగా స్త్రీ కొడుకుతో వెళ్ళటం అధర్మమౌతుంది. నా తండ్రి పరమధార్మికుడు. ఆయన వుండగా నువ్వు అనాథవు కావు.

భరతుడు చాలా నీతిజ్ఞుడు. వాడు నిన్ను కన్నతల్లి కన్న మిన్నగా చూసుకుంటాడు. కనుక నేను వెళ్ళిపోయాక నువ్వు నాన్నగార్ని కనిపెట్టి వుండి సేవలు చెయ్యి. వారు పుత్రశోకంతో బాధపడకుండా ధైర్యం చెప్పాలి. అలా చెయ్యకపోతే ఆయన చనిపోతారు. కనుక తండ్రి గారి దుఃఖం మర్చిపోయేలా నువ్వే చూడాలి. ఏ ఆడది అయినా ఎన్ని వ్రతాలు, పూజలు చేసినా, భర్తని తిరస్కరిస్తే, ఆమెది అధోగతి అవుతుంది' భర్తనే దైవంగా నమ్మి సేవ చేసిన స్త్రీకి ఇహపరాలలో సౌఖ్యం లభిస్తుంది. ఈ సంగతి మనశ్రుతులూ, స్మృతులూ చెప్తున్నాయి. కనుక నేను తిరిగి వచ్చేవరకు నాకు ఎటువంటి ఆపదా కలగకుండా నాకు మేలు జరగాలని, నువ్వు జపతపాలూ, హోమాలు చేయిస్తూ వుండు. పధ్నాలుగు సంవత్సరాల వనవాసానంతరం ఇట్టే తిరిగి వస్తాను. అప్పటికి నాన్నగారు బ్రతికి వుంటే, నీ కలలన్నీ ఫలిస్తాయి' అన్నాడు.

రాముని మాటలు విన్న కౌసల్య కన్నీరు కారుస్తూ, 'నాయనా, నువ్వు మహాపరాక్రమశాలివి. నీకే భయమూ వుండదు. వనవాసం చెయ్యాలని నిర్ణయించుకున్నావు. నిన్ను ఆపేశక్తి నాకులేదు. కాల మహిమ అలా వుంది. రామా, నువ్వు ఏకాగ్ర చిత్తంతో వనవాసానికి వెళ్ళిరా. నీకు శుభం కలుగుతుంది. పితృఋణం తీర్చుకుని, చరితార్థుడవై తిరిగిరా. నా కష్టాలు గట్టెక్కుతాయి.' అంటూ దుఃఖం అణచుకుని, ఆచమనము చేసి, శుచి అయి, కొడుకుకి మంగళాశీర్వచనాలు చేసింది.

'రఘువంశశార్దూలా, నువ్వు నియమముతో, ధైర్యముతో శిరసావహిస్తున్న ధర్మమే నిన్ను కాపాడుతుంది. ముక్కోటి దేవతలూ నిన్ను రక్షిస్తారు. 'రామా, పూజ్యుడూ, ధీమంతుడూ, మహాత్ముడూ అయిన విశ్వామిత్ర మహర్షి నీకు అనుగ్రహించిన, శస్త్రాస్త్రాలన్నీ వనవాస కాలంలో నిన్ను రక్షిస్తాయి. నీ పితృభక్తీ, మాతృసేవా, నీ సత్యవ్రతమూ, నీకు దీర్ఘాయుష్షునిస్తాయ. ఇకమీదట, పర్వతాలూ, నదులూ, చెట్లూ, పుట్టలూ, పొదలూ, ఇవే నీకు రక్ష. బ్రహ్మరుద్రాది దేవతలంతా నిన్ను క్షణక్షణం కాపాడతారు.'

నాయనా, సూర్యచంద్రులూ, భూమ్యాకాశాలూ, నక్షత్రాలూ, గ్రహాలూ, సప్తర్షులూ, నారదాది దేవమునులూ, ఇకమీదట నీకు తోడునీడలుగా వుండి నీకు ఏ కష్టమూ రానివ్వకుండా కాపాడుతారు. మహారణ్యాలలో సంచరిస్తూ నువ్వు మునీశ్వరునిలా కాలం గడపాలి. రాక్షసులు, పిశాచులు, సైతం నిన్ను కన్నెత్తి చూడలేరు. పక్షులూ, పాములూ, తేళ్ళూ, ఈగలూ, దోమలు మొదలైన క్రిమికీటకాదులు, నిన్నెంత మాత్రమూ బాధించవు. క్రూరమృగాల వల్ల కూడా

నీకు హాని కలగదు. కోతులూ, కొండముచ్చులూ, కూడా నీతో స్నేహంగా మసులుకుంటాయి. నేను ఈ పద్నాలుగేళ్ళూ నీ కోసం దేవతాపూజలు చేస్తాను. కనుక అరణ్యంలో నీకు ఏ ఉపద్రవాలూ సంభవించవు. విశ్వామిత్రమహర్షి ఉపదేశించిన మంత్రాలు నిన్ను నిరంతరం కాపాడుతాయి. అగ్నిహోత్రుడూ, వాయుదేవుడు నిన్ను నీడలా వుండి కాపాడుతారు.

రామా, సృష్టికర్త అయిన బ్రహ్మ, సర్వభూత భర్త అయిన శ్రీమన్నారాయణుడు, సమస్త దేవతలూ, నిన్ను కాపాడుతారు' అంటూ ఆ విశాలాక్షి ఆయా దేవతల్ని పూలతో పూజించి, శ్రీరామునికి రక్షకట్టింది. రాముని శ్రేయస్సుకై హోమాలూ, జపాలూ, చేయించింది. పుణ్యాహవాచనం చేయించింది.

ఈ విధంగా కౌసల్య రామునికి మంగళాచరణాలు చెప్తూ, రాముని తలపై మంత్రపూతమైన అక్షింతలు వేసింది. ఒంటినిండా గంధం పూసి, మంత్రజపం చేస్తూ విశల్యకరణి ఓషధిని, రక్షాబంధంగా ముంజేతికి కట్టింది. పుట్టెడు దుఃఖాన్ని మనస్సులోనే అణచుకుని, పైకి నవ్వుతూ రాముడ్ని కౌగలించుకుని, శిరస్సు నాఘ్రాణించి, 'నాయనా, సుఖంగా అడవులకి వెళ్ళి, సిద్ధార్థుడవై తిరిగిరా, నువ్వు తిరిగి వచ్చేవరకు రోజులు లెక్కపెట్టుకుంటూ వుంటాను' అంటూ మాటలు తబబడుతూ వుండగా, లేగదూడని విడిచి వెళ్ళే ఆవులా, పదే పదే రాముని కౌగిలించుకుంటూ, కన్నీటితో ఆశీర్వదించింది.

రాముడు కూడా పదే పదే ఆమె పాదాలపై వాలి వందనం చేస్తూ వెళ్ళలేక వెళ్ళలేక కదిలి, సీతామందిరం వైపు వెళ్ళాడు. జనసముదాయాన్ని తప్పించుకుంటూ రాముడు కాలినడకన వెళ్తున్నాడు. సీతకి అప్పటిదాకా కైకేయి మందిరంలో జరిగిన సంగతి ఏమాత్రం తెలియదు. ఉపవాసవ్రతంతో అలాగే రాముని రాక కోసం ఎదురుచూస్తూ వుంది.

పట్టాభిషేకం కాగానే, భర్తకి పాదార్చన చెయ్యటానికి, గంధపుష్పాదులు సమకూర్చుకుని, మహానందంతో, భర్త రాక కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అపూర్వంగా అలంకరించబడ్డ ఆ మందిరంలోకి రాముడు తలదించుకుని నేలచూపులు చూస్తూ మెల్లిగా ప్రవేశించాడు. సీతని చూడగానే రాముడికి పట్టరాని దుఃఖం వచ్చింది. నిలువెల్లా కంపించిపోయాడు. భర్తకి ఎదురుగా వెళ్ళిన సీత ఆ స్థితిలో వున్న రాముణ్ణి చూసి గజగజ వణికింది. అప్పటిదాకా ధీరుడుగా వున్న రాముడు, సీతని చూడగానే దుఃఖం ఆపుకోలేకపోయాడు. అతడి ఒళ్ళంతా చెమటలు పోసాయి.

సీత అయోమయంగా రాముణ్ణి చూస్తూ 'ప్రభూ, ఏమిటిది? ఇవాళ దైవజ్ఞులు నిర్ణయించిన శుభముహూర్తం కదా! మీ ఈ పరిస్థితికి కారణమేమిటి? ఇలా కాలినడకన వచ్చారేమిటి? ఒంటరిగా వచ్చారే! శ్వేత చ్ఛత్రం, వింజామరలూ ఎవరూ పట్టలేదా? వందిమాగధుల స్తోత్రాలేవీ? అభిషేకలాంఛనాలేవీ లేక పోగా, మీ ముఖం అలా కళ తప్పి వుందేమిటి?' అంటూ గాబరాగా ఏడుస్తూ అడిగింది.

సీత సన్నిధిలో రాముడు పసిపిల్ల వాడిలా దుఃఖించాడు. 'దేవీ, నేనిపుడు వనవాసానికి వెళ్ళాలి. అందుకే అభిషేకం జరగదు.

నా పినతల్లి గారైన కైకేయి, దేవాసుర సంగ్రామంలో నా తండ్రిగారి ప్రాణాలు కాపాడినందుకు గాను, ఆయన నుంచి రెండు వరాలు కానుకగా పొందింది. ఇన్నాళ్ళూ ఆ వరాలు పదిలంగా దాచుకుని, ఇపుడు అడిగింది. సరిగ్గా నా రాజ్యాభిషేకం జరుగుతున్న వేళ ఆ వరాలు చెల్లించమని, ఆయనని నిర్బంధించింది. అందులో మొదటి వరంగా నాకు పట్టాభిషేకం చెయ్యటానికి తెప్పించిన సంభారాలతోనే భరతుడికి పట్టాభిషేకం జరగాలి. రెండోది నేను పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చెయ్యాలి. అంతేకాదు. నన్ను ఈ క్షణంలోనే అడవులకి వెళ్ళమని ఆదేశించింది.

నేను నీకు చెప్పి వెళ్దామని వచ్చాను అంటూ దుఃఖం దిగమింగుకుని, జరిగినదంతా సీతకి వివరంగా చెప్పాడు.

'సీతా, నా తండ్రి ధర్మాత్ముడు, సత్యవ్రతుడు. కనుక కైకేయి మాటలకి కట్టుబడి నన్ను అడవులకి వెళ్ళమని ఆదేశించారు. కనుక వెళ్ళక తప్పదు. అంటున్న భర్త మాటలు విని, సీత దిగ్భ్రాంతురాలై కొయ్యబొమ్మలా నుంచుంది. రాముడు ఆమెనూరడించి,

'కుసుమ కోమలీ, నువ్వు ఉన్నత వంశంలోంచి వచ్చావు. నీకు తెలియని ధర్మం లేదు కదా. నీ తండ్రి జనక మహారాజు పరమ ధార్మికుడు. ఇక్ష్వాకువంశ సంభూతుడనైన నాకు ధర్మపత్నివి నువ్వు. కనుక మనస్సుని గ్రహించుకో. నేను ఇపుడే అడవులకి వెళ్తున్నాను. పధ్నాలుగేళ్ళూ ఇట్టే గడిపి తిరిగివస్తాను. బాధపడకు.

వైదేహీ, పరంపరాగతమైన ఈ రాజ్యాన్ని నాన్నగారు భరతుడికిచ్చారు. ఇకమీదట ఈ దేశానికీ ఈ ఇంటికీ కూడా అతడే ప్రభువు.

పట్టాభిషిక్తుడయ్యాక, నీకు పాదాభివందనం చెయ్యటానికి వచ్చినపుడు పొరపాటున కూడా వాడ్ని తూలనాడకు సుమా. అతడి ఎదురుగా నన్ను పొగడకు.

ఎందుకంటే శ్రీమంతులైనవారు తమ ఎదురుగా, ఇంకెవర్నైనా పొగిడితే సహించలేరు. కనుక ఎపుడూ కూడా భరతుడికి అప్రియం కలిగించే మాటలు పలుకవద్దు. నిన్ను తన బంధువులతో సమానంగా తప్పక ఆదరిస్తాడు. అంతేకాని, నిన్నేదో ప్రత్యేకంగా చూస్తాడని అనుకోకు. భరతుడి మనస్సు ఎపుడూ నొప్పించకు. సాధ్యమైనంత వరకు దైవచింతనలో గడుపు. అంతేకాదు. నా తల్లిదండ్రుల్ని కనిపెట్టుకుని వుండి, దుఃఖం చేత వారి మనస్సులు వికలం కాకుండా చూసే బాధ్యత కూడా నీదే. వారిని నీ తల్లి తండ్రులుగా భావించి వారికి సేవలు చెయ్యి. నా ఇతర తల్లుల్ని కూడా నీ అత్తగారితో సమానంగా ఆదరించు.

సీతా, నాకు భరత శత్రుఘ్నులంటే పంచప్రాణాలూ అని నీకు తెలుసుగా, భరతుణ్ణి నీ అన్నగారిలాగా, శత్రుఘ్నుణ్ణి నీ కుమారునిలాగా చూసుకో. మైథిలీ, ఏనాడూ ధర్మం తప్పకు. సత్యం మాత్రమే ఆచరించు. ప్రేయసీ, ఇంకిపుడు నేను వెళ్ళక తప్పదు. కనక నన్ను సంతోషంగా సాగనంపు' అన్నాడు.

రాముని మాటలు విన్న సీతకి దుఃఖం ఆగలేదు. పైగా రామునిమీద చెప్పలేనంత కోపం వచ్చింది.

'ప్రభూ, దశరథ మహారాజు పెద్దకుమారులై వుండీ ఇంత పామరత్వంతో మాట్లాడుతారా? మీ ధోరణి చూస్తే ఆడదానినైన నాకే నవ్వు వస్తోంది.

సామాన్యంగా ప్రపంచంలో ఎవరికర్మ వారే అనుభవిస్తారు. కాని, భార్య మాత్రం భర్త కర్మఫలంలో సగం అనుభవిస్తుంది. అందుకే ఆమెని అర్ధాంగి అన్నారు. 'మీ తండ్రిగారు మిమ్మల్ని అడవికి పొమ్మంటే, నన్ను కూడా పొమ్మన్నట్లే కదా, ఆడది ఎపుడూ స్వతంత్రురాలు కాదు. 'ఇహ పరాల్లో కూడా ఆమెకి భర్తతోడిదే లోకము. భర్త తప్ప స్త్రీకి వేరే దిక్కులేదు. కనక మీతోబాటు నేనూ వనవాసానికి వస్తాను. మీముందు నడిచి దారిలో రాళ్ళూ ముళ్ళూ లేకుండా బాగుచేస్తాను. మీకు మెత్తటి దారి తయారుచేస్తాను.

వనవాసంలో మీ వెంట వుండి, మీ పుణ్యంలో పాలుపంచుకుంటాను. ఎంగిలి నీళ్ళు అవతల పారపోసినట్లు నన్నొదిలి వెళ్ళటం మీకు న్యాయమా? నేను మీకేం అపకారం చేశానని, నన్నొదిలి వెళ్తానంటున్నారు? నా మాట విని నన్నూ మీ వెంట తీసికెళ్ళండి. భార్య ఎప్పుడూ భర్తని అనుసరించే వుండాలి. భర్త సుఖాల్లో పాలుపంచుకున్నట్లే కష్టాల్లోనూ పాలు పంచుకోవాలి. నా తల్లి తండ్రులు నాకిదే బోధించారు. మీరు ఘోరారణ్యాలకి వెళ్ళినా సరే, క్రూరమృగాలు సంచరించే ప్రదేశం అయినాసరే, దుర్గమమైనా సరే, మీతో నేను రాక తప్పదు. మీకు సేవలు

చేస్తుంటేనే నాకు సంతోషంగా వుంటుంది. మీరు లేకుండా త్రిలోకాధిపత్యం ఇచ్చినా సరే, అది నాకు వద్దు.

వనవాస కాలంలో మీ నియమాలకు నేను అడ్డురాను. నేను బ్రహ్మచర్య నిష్ఠతో వుంటాను మీ వెంట వుండగా నాకే భయం వుండదు. మీతోబాటు కందమూలాలే తింటాను. భూమి మీదే పడుకుంటాను.

నాథా, ఇన్నాళ్ళూ నేను మీరు తప్ప మరొకర్ని తెలియకుండా జీవించాను. మీరే నాకు పంచప్రాణాలూ, మీరు నన్నొదిలి వెళ్తే నేను జీవించి వుండను. కనుక నా ప్రార్థన మన్నించి, నన్నూ మీ వెంట తీసికెళ్ళండి' అంటు సీత రాముణ్ణి అనేకవిధాల ప్రాధేయపడింది. కాని ఆ సుకుమారిని కడగండ్ల పాలు చేసి, అడవికి తీసికెళ్ళటానికి రామునికి మనస్సంగీకరించలేదు.

ఆమెని అక్కున జేర్చుకుని బుజ్జగిస్తూ, 'ప్రియురాలా, వనవాసము చాలా కష్టతరమైనది. కనుక నేను వచ్చేవరకు ధర్మాచరణ చేస్తూ ఇక్కడే వుండు. నీ మంచి కోరి చెప్తున్నాను' అంటూ వనవాసంలో వుండే కష్టాలన్నీ సీతకి విడమర్చి చెప్పాడు రాముడు.

'సీతా, అడవులు దట్టమైన చెట్లతోటీ, కొండగుహలతోటీ, ముళ్ళపొదలతోటీ మహాభయంకరంగా వుంటాయి. నదులు మొసళ్ళతో నిండి బురదమయంగా వుంటాయి. పాములూ, క్రూరమృగాలూ విచ్చలవిడిగా సంచరిస్తూ వుంటాయి. త్రాగటానికి మంచినీళ్ళూ కూడా దొరకవు. ఎక్కడైనా రాలిన పండ్లు దొరికితే అవే ఏరుకు తినాలి. దొరకనపుడు పస్తులుండాలి. అంతకన్న తినేందుకేం వుండవు. కుసుమకోమలీ, జటావల్కలాలు ధరించి తిరగటం చాలా కష్టం. స్వయంగా సమిధలు, పూలు, మొదలైనవన్నీ సమకూర్చుకుని మునులలా బ్రతకాలి.

ఆకలేసినా దొరికినవి మాత్రం తిని తృప్తిపడాలి. గాలి విపరీతంగా వీచినా, వానా ఎండ దారుణంగా బాధించినా, చలికి తట్టుకోలేక పోయినా, నిస్సహాయంగా చూస్తు వుండాలే తప్ప మనల్నెవరూ ఆదరించరు. చిమ్మ చీకట్లతో నిండి, పట్టపగలే భయంకరంగా వుండే అడవిలో దారి తెన్నూ కానరాదు. పాములూ, తేళ్ళు, తేనెటీగలు నేలమీద అడ్డం దిడ్డంగా తిరిగి, కాళ్ళకడ్డుపడ్తాయి.

దారులన్నీ రాళ్ళతోటీ, ముళ్ళతోటీ నిండి, పాదాలకి గాయాలైపోతాయి. దేనికీ బాధపడకూడదు. కోపం వదిలిపెట్టాలి. నిర్భయంగా తిరగాలి. చాలా ఆలోచించి చెప్తున్నాను. సుకుమారివైన నువ్వు ఆ బాధలు పడలేవు. కనుక నన్నొక్కణ్ణే వెళ్ళనీ' అని చాలా వివరించి చెప్పాడు.

భర్త మాటలు విన్న సీతకి చెప్పలేని దిగులు కలిగింది. కన్నీరు కాలువలు కట్టింది. 'నాథా - మీరు వెంట వుండగా క్రూరమృగాలు నన్ను కన్నెత్తి చూడగలవా? ఎంతటి కష్టాన్నైనా మీ నీడలో సంతోషంగా స్వీకరిస్తాను. భార్యా - భర్తా వేరువేరు కాదు. దశరథ మహారాజు గారు మీకు వనవాస శిక్షవిధిస్తే నాకూ విధించినట్లే, అలా కాదంటారా, మీరు లేనిదే నేను జీవించటం అసంభవం. మీ నీడలో వుండగా దేవేంద్రుడైనా నావంక చూడలేడు. కాని, భర్త వదిలిన ఆడది బతకకూడదని, మీరే ఎన్నోసార్లు నాతో అన్నారు.

అదీగాక, నా జాతకం ప్రకారం నాకు కొంతకాలం వనవాసయోగం వుందని, సాముద్రికులు, నా తండ్రిగారితో చెప్పటం నేను విన్నాను. అప్పట్నించీ ఆయోగం ఎపుడు వస్తుందా, అడవులలో ప్రకృతి సౌందర్యం ఎపుడు చూద్దామా, అని, చాలా ఉవ్విళ్ళూరుతున్నాను. దైవికంగా ఇప్పటికీ ఆ అవకాశం వచ్చింది. వనవాసం కష్టతరమైనదని, నాకు తెలియదా? అయినా మహాత్ములకి కష్టసుఖాలు రెండూ సమానమే. మీలాంటి పరాక్రమవంతుల నీడలో వుండగా నాకెలాంటి కష్టాలూ కలగవు.

నా చిన్నప్పటి సంగతి ఒకటి చెప్తాను. ఒకనాడు నేను మా అమ్మదగ్గర కూర్చుని వుండగా ఒక తాపస స్త్రీ వచ్చింది. ఆమె నన్ను చూసి 'ఈ అమ్మాయి భర్తతో కూడా కొంతకాలం వనవాసం చేస్తుందని' చెప్పింది. అందుకే మునుపొకసారి మీతో నేను 'గంగాతీరతపోవనాలు చూసివద్దాం' అన్నాను గుర్తుందా? కనుక ఇవాళ మీతో అడవులకి రావటమంటే ఎంతో సంతోషంగా వుంది. మీరు నా భర్త కనుక మీరే నా దైవం. నాకు వేరే దేవుడు లేడు.

మీ వెంట వచ్చి మీకు సేవలు చేసి తరిస్తాను. మీరు దూరమైతే నేనుండలేను. అంతే కాదు. మీరు అడవులలో తిరుగుతూ కష్టాలు పడుతూవుంటే, నేను అంతఃపురాలలో ఎలా సుఖపడగలను? మీరు నన్ను వెంట తీసికెళ్ళకపోతే, విషం త్రాగి అయినా, నిప్పులో దూకి అయినా, నీళ్ళలో దూకి అయినా ప్రాణం తీసుకుంటాను. ఆ తర్వాత మీ ఇష్టం' అని ఊరుకుంది సీత.

అయినా రాముడు ఒప్పుకోలేదు. 'నిర్జనమైన అడవులలో, అతిసుకుమారిగా పెరిగిన నువ్వు ఎంతమాత్రం వుండలేవు. కనుక ఈ పధ్నాలుగేళ్ళూ, నన్ను తల్చుకుంటూ కాలం గడుపు. కన్నుమూసి తెరిచేటంతలో వనవాసం పూర్తి చేసివస్తాను' అన్నాడు.

సీతకి ఇంక ఆగ్రహం ఆగలేదు. జగన్మోహనమూర్తి అయిన భర్త వంక

చూస్తూ 'ఆర్యపుత్రా, మీరు ఆకారంలో మాత్రం, మన్మధుని కన్నా అందమైనవారు. కాని ఒక పురుషుని కుండవలసిన పౌరుషం, పరాక్రమం, మీలో మచ్చుకైనా లేవు. నన్ను పోషించలేక, ఒక్కత్తినీ ఇక్కడవదిలి, వనవాసానికి వెళ్ళారని మా నాన్నగారికి తెలుస్తుంది. అపుడా కర్మిష్ఠి 'అయ్యో పురుష వేషంలో వున్న స్త్రీ అని తెలియక నా కూతుర్ని రామునికిచ్చి పెళ్ళి చేశానే' అని దుఃఖిస్తాడు.

స్వామీ, ప్రపంచమంతా మిమ్మల్ని జగదేక పరాక్రమశాలి అని కీర్తిస్తున్నది కదా, ఇపుడు నన్ను ఒంటరిగా వదిలి వెళ్తే అదంతా తమ భ్రమ అని లోకులు విలపించరా? అయినా మీ వెంట నేను వస్తానంటే ఎందుకంత భయపడ్తున్నారు? సతీసావిత్రి సత్యవంతుని అనుసరించినట్లు నేనూ మిమ్మల్ని అనుసరించి, తరిస్తాను. నేను కులకాంతని. ఎప్పుడూ మీ వెంట వుంటాను. మిమ్మల్ని విడిచి ఎక్కడా వుండలేను. భరతునికి హితవు చెయ్యమనీ, అత్తమామలకి సేవ చెయ్యమనీ, నన్ను ఇక్కడ వుంచటం మీకు న్యాయంగా వుందా? మీరే ఇక్కడ లేనపుడు, నాకు వారితో పనేముంది? మిమ్మల్ని సేవించటం మాత్రమే నా ధర్మం. ఇంకే ధర్మమైనా మీ తర్వాతే. ధర్మమూర్తులైన మీకేం చెప్పేది?

మీ వెంట వున్నపుడు, నాకు అరణ్యవాసం నందనవనంలో విహరిస్తున్నట్లు పరమ సుఖదాయకంగా వుంటుంది అంతేగాని, నా పుట్టిల్లు గాని, మీ ఇల్లు గాని అస్సలు గుర్తురావు. మీ వెంట వచ్చి, మీ కిబ్బంది కలిగిస్తానని అనుకుంటున్నారేమో. నావల్ల మీకెలాంటి ఇబ్బందీ కలగదు. పైగా ఆ తర్వాత మీరే చాలా సంతోషిస్తారు. నన్ను విడిచిమాత్రం వెళ్ళకండి' అంటు భర్తని కౌగలించుకుని, భోరున విలపించింది సీత. నేలమీద పడి పొర్లి పొర్లి ఏడ్వసాగింది. కన్నీరు, మున్నీరుగా ఏడుస్తున్న సీతని లేవనెత్తి, గుండెలకి హత్తుకుని, 'సీతా, నువ్విలా ఏడుస్తు వుంటే, స్వర్గానికైనా పరే నేను వెళ్ళలేను. నాకు భయం అనుకుంటున్నావా? మహారణ్యాలలోనే కాదు, ముల్లోకాలోనూ, ఎక్కడున్నా నిన్ను నేను కాపాడుకోగలను. అంతేగాని, పిరికివాడిలా నిన్ను వదిలి వెళ్ళిపోవటం లేదు. నీ మనస్సెంత ధృఢంగా వుందో చూద్దామని, నిన్ను రావద్దన్నానంతే, మైథిలీ, పూర్వము రాజర్షులు అందరూ తమ భార్యలతో, కలిసే వనవాసం చేశారు. నువ్వు నా వెంట రావాలని గట్టి పట్టుదలతో వున్నావు కనుక, నిన్నెంత మాత్రం విడిచివెళ్ళను. జనకనందినీ, నేను ఇపుడే బయల్దేరి వనవాసానికి వెళ్తానని, కైకేయికి మాట ఇచ్చాను.

అందుకని, మనం వెంటనే బయల్దేరాలి. తల్లి, తండ్రి, గురువు, ప్రత్యక్షదైవాలు. వారిని ముగ్గుర్నీ ఆరాధిస్తే ముల్లోకాలూ స్వాధీనమవుతాయి. నా తండ్రి ధర్మపథము తప్పనివాడు. ఆయన కుమారునిగా, ఆయన ఆజ్ఞ

పాలించటం, నా సనాతన ధర్మం. అయితే నువ్వు కూడా నాతో వనవాసానికి వస్తానని అనటంవల్ల నీ వంశగౌరవం, నా వంశగౌరవం, కూడా రెట్టింపవుతున్నాయి. ఇంక ఆలస్యం చెయ్యకుండా ఏర్పాట్లు చెయ్యాలి. మణి భూషణాలు, ఆభరణాలూ బ్రాహ్మణోత్తములకి, పేదవారికి అన్నదానము చెయ్యాలి.

సీతా ముందుగా బ్రాహ్మణులకి, సువర్ణదానము, అవీ చేశాక మిగిలిన వస్త్రాలూ, పానుపులూ, వాహనాలూ, విలాస వస్తువులూ, సేవకులకి దానం చెయ్యి' అన్నాడు.

ఆ మాటలు విన్న సీత, బ్రహ్మానందం పొంది, భర్తచెప్పిన విధంగా, దానధర్మాలు చెయ్యటానికి, ఏర్పాట్లు చెయ్యటంలో మునిగిపోయింది.

సీతారాముల సంభాషణ అంతా విన్న లక్ష్మణుడు చెప్పరాని దుఃఖంతో కన్నీరు చెంపలమీదుగా జారగా, రాముని పాదముల మీద వాలిపోయి 'అన్నా, నువ్విలా అడవులకి వెళ్ళటం నా కిష్టం లేదు. కాని నువ్వు వెళ్ళక తప్పదంటున్నావు కనుక, నీకంటే ముందు నేను బయల్దేరుతాను. ధనుర్ధారినై మీ ముందు నడిచి, మికు దారి చూపిస్తాను.

ఇంక అడవిలో ఘోరమైన క్రూరమృగాల అరుపులకీ, పక్షుల కూతలకీ,సీత ఎంతమాత్రం భయపడనక్కర్లేదు. నేను మిమ్మల్ని సేవించి, రక్షించుకుంటూ వుంటే, మీరిద్దరూ ఆనందంగా విహరించవచ్చు. నువ్వు లేకుండా నేను దేవలోకంలోనైనా వుండలేను. నిరంతరం నీవెంట వుండవలసినవాణ్ణి' అన్నాడు లక్ష్మణుడు.

కాని రాముడు ఒప్పుకోలేదు. ఎన్నివిధాలుగానో తమ్ముడికి నచ్చజెప్పాలని చూశాడు.

'లక్ష్మణా, నువ్వు పరమధార్మికుడివి. పరాక్రమశాలివి. నువ్వు నా వెంట వస్తే నాకు సంతోషమే. కాని, ఇక్కడి సంగతి ఆలోచించు. ఇన్నాళ్ళూ నాన్నగారు ధర్మానువర్తనులై, ప్రజల కోరికలు మన్నిస్తు పాలించారు. కాని ఇపుడు కామవశులై, కైకమ్మకి లొంగిపోయారు. భరతుడు రాజైనా, తల్లి చెప్పుచేతల్లోనే పాలిస్తాడు. ఇకమీదట కైకేయి సవతుల్ని ఎలాంటి కడగండ్లు పెట్టినా అడిగేవారుండరు.

నువ్వూ నేనూ కూడా లేకపోతే ఆమె అధికారానికి పగ్గాలుండవు. కనక నువ్వు ఇక్కడే వుండి, నీ తల్లినీ, మా అమ్మ కౌసల్యనీ, ఇతర అంతఃపుర స్త్రీలనూ, కాపాడుతూ వుండాలి. నా మీద నీకున్న భక్తిని ఇలా చూపించు. ఇంక నేను వెళ్ళివస్తాను' అన్నాడు.

కాని లక్ష్మణుడు రాముడి దారి నడ్డగించి 'అన్నా, భరతునికి నువ్వంటే చాలా గౌరవం. భయభక్తులు వున్నాయి. వాడు కౌసల్యనీ, సుమిత్రనీ కూడా భయభక్తులతో చూస్తాడు. కనుక వాళ్ళను గురించి, నువ్వు నిశ్చింతంగా వుండవచ్చు. అయినా కౌసల్యాదేవి వుండగా అంతఃపుర స్త్రీల గురించి దిగులు పడనక్కరలేదు. నేను మాత్రం నీకు కింకరుడుగా వుంటాను. ఇదెంత మాత్రం అధర్మం కానే కాదు. నేను కృతార్థుణ్ణి కావాలంటే ఇదొక్కటే మార్గం. ఇదిగో ధనుర్బాణాలూ, గడ్డపలుగూ, గంపా తీసుకుని మీ వెంట వస్తున్నాను. నిన్ను అనుసరిస్తు కందమూలాలు, పండ్లు మొదలైన ఆహార పదార్థాలన్నీ సమకూర్చి పెడ్తాను. మీకు కాపలావాడిగా వుండి, మిమ్మల్ని కనిపెట్టి, రక్షిస్తాను. నువ్వు, వదినా, హాయిగా పర్వత సానువులలోను, నదీనదముల తీరాలందు, విహరించ వచ్చు. రాత్రివేళయందు, నిర్భయంగా నిద్రపోవచ్చు' అన్నాడు.

తమ్ముడి మాటలకి, రాముడెంతో సంతోషించాడు. లక్ష్మణా, నీ అభిప్రాయం నాకు చాలా నచ్చింది. వెంటనే వెళ్ళి నీ మిత్రులందరికీ వీడ్కోలు చెప్పిరా. వచ్చేటపుడు మనం జనక మహారాజుయజ్ఞం చూడటానికి వెళ్ళినపుడు వరుణదేవుడు మనకిచ్చిన అభేద్యమైన కవచాలూ, అక్షయతూణీరాలూ, ధనుస్సులూ, తళతళా మెరిసే బంగారు పిడివున్న ఖడ్గాలు రెండూ వున్నాయి చూడు, అవి కూడా తీసుకురా' అని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు మిత్రులందరికీ వీడ్కోలు చెప్పి రాముడు చెప్పిన ధనుస్సు అమ్ములూ, కవచాలూ, ఖడ్గాలూ తీసుకుని వచ్చాడు. రెప్పపాటులో వచ్చిన లక్ష్మణుని చూసి రాముడు చాలా సంతోషించాడు.

'సౌమ్యుడా, ఇంకోపని కూడా చెయ్యాలి నువ్వు. నా స్వంత సొమ్ము అంతా బ్రాహ్మణులకీ, ఆశ్రితులకీ దానం చెయ్యదల్చుకున్నాను. కనుక నువ్వు వెంటనే వెళ్ళి వశిష్ఠులవారి కుమారుడైన, సుయజ్ఞుడ్ని వెంటబెట్టుకురా. ఆయననూ, ఇంకా కొంతమంది బ్రాహ్మణుల్ని సత్కరించి, వారి ఆశీర్వాదాలతో మనం వనవాసానికి బయల్దేరుదాం' అన్నాడు.

లక్ష్మణుడు వెంటనే వెళ్ళి యజ్ఞశాలలో వున్న సుయజ్ఞుని దర్శించి సంగతంతా వివరించాడు.

ఆయన సంధ్యావందనం తొందరగా పూర్తిచేసుకుని, లక్ష్మణునితో రాముని మందిరానికి వచ్చాడు.

సీతారాములు ఆ పండితోత్తమునికి ప్రదక్షిణం చేసి వందనం చేశారు.

మణికంకణాలూ, రత్నాభరణాలూ, బంగారు నగలూ అన్నీ శాస్త్రోక్తంగా ఆయనకి దానం చేశారు. అదిగాక, బంగారు పానుపు రత్నపర్యంకమూ, ఏనుగులు, గుఱ్ఱాలు, అన్నీ ఆయనకి దానం చేశారు. ఆ బ్రాహ్మణోత్తముడు, సీతారాముల్ని ఆశీర్వదించాడు. ఆపైన అగస్త్యపుత్రునీ, కౌశికతనయుని, తైత్తిరీయ గురువైన పండితోత్తమునీ, తన రథసారథి అయిన చిత్రరథునీ, అనేకమంది బ్రహ్మచారుల్నీ, వేదాధ్యాయతత్పరులనూ పిలిపించి, వారందర్ని ఉచితరీతిని సత్కరించి, సువర్ణదానము, గోదానము, భూదానమూ, సస్యదానమూ చేశాడు రాముడు.

అపుడు సేవకులందరూ వలవలా ఏడుస్తూ రాముని ఎదుట నిల్చున్నారు.

వారందర్నీ రాముడు ఓదార్చాడు. తాము పధ్నాలుగు సంవత్సరాలూ అరణ్యవాసం ముగించి, తిరిగి వచ్చేవరకు రాజభవనాన్ని కనిపెట్టి వుండమని ఆదేశించాడు. వారి జీవనోపాధికి తగినంత ధనం అందేటట్లు ఏర్పాట్లు చేశాడు. కోశాగారంలో మిగిలిన ధనాన్ని సీతారామలక్ష్మణులు పేదలకి పంచిపెట్టారు.

ఈ విధంగా ధానధర్మాలు కార్యక్రమం అనుకున్నట్లు పూర్తిచేసి బయల్దేరబోతున్న సమయంలో, త్రిజటుడు అనే ఒక బీద బ్రాహ్మణుడు, శ్రీరాముని దగ్గరకి వచ్చి నమస్కరించి నుంచున్నాడు. అతడు చాలా వృద్ధుడు. కాని అతడి భార్య మంచి వయస్సులో వున్న స్త్రీ. వారికి బోలెడుమంది సంతానం. రాముడు వనవాసానికి వెళ్తూ తన సంపదలన్నీ దానం చేస్తున్నాడని, ఆయన భార్యకి తెలిసింది. భర్తని, పిల్లల్ని వెంటబెట్టుకుని, ఆమె శ్రీరాముని సందర్శించి, తమ గోడువెళ్ళబోసుకుందామని వచ్చింది. భార్యాభర్తలిద్దరూ రాముని పాదాలపైబడి, తమకేదైనా సహాయం చెయ్యమని అర్థించారు. వృద్ధుడైన ఆ బ్రాహ్మణుని యౌవనవతి అయిన అతడి భార్యని చూసి రాముడు మందహాసం చేశాడు.

'పండితవర్యా, మీరు చాలా ఆలస్యంగా వచ్చారు. నా సంపదలన్నీ దానం చేసేశాను. ప్రస్తుతం గోసంపద తప్ప నా దగ్గరింకేం లేదు. అదిగో ఆ ఆవుల మందలు కనిపిస్తున్నాయే, అవన్నీ నావే. ఈ చేతి కఱ్ఱ తీసుకుని, మీరు ఇక్కడే నిలబడి, ఆ ఆవులమందవైపు విసరండి అది ఎంతదూరం వరకు వెళ్ళిపడ్తే అక్కడిదాకా వున్న ఆవులన్నీ మీవే. యథేచ్ఛగా తోలుకుపోవచ్చు అన్నాడు రాముడు చమత్కారంగా.

అపుడా వృద్ధబ్రాహ్మణుడు పైన కప్పుకున్న చిరుగుల ఉత్తరీయం తీసి నడుము చుట్టూ బిగించి కట్టుకుని, కఱ్ఱని గాలిలో గిరగిరా తిప్పి శక్తికొద్దీ విసిరాడు.

ఆ కఱ్ఱ రాజాంతఃపుర కక్ష్యలన్నీ దాటి సరయూనది దాటి ఆవలి ఒడ్డున మేస్తున్న ఆవులమందలన్నీ దాటి దూరంగా మేస్తున్న ఆబోతు దగ్గర పడింది. ఆ వృద్ధుని భుజబలానికి అక్కడున్న వారంతా ఆశ్చర్యచకితులైపోయారు. రాముడు పరమానందంతో ఆవృద్ధుణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు. తన గోసంపదంతా గొల్లవాళ్ళచేత ఆయన ఆశ్రమానికి తరలించవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఆపైన ఆ బ్రాహ్మణుని సన్మానించి,

'బ్రాహ్మణోత్తమా, దానము కోరితే, ఈ రాముడు పరీక్షపెట్టాడేమిటి? అని కినుకబూనకండి. మీ శక్తి సామర్థ్యాలు అందరికీ తెలియాలనీ అలా చేశాను ఎందుకంటే యుక్తవయస్కురాలైన భార్య, బోలెడు మంది పిల్లలూ, మీకు తగినవి అవునా కాదా అని పలువిధాలా లోకులు భావించవచ్చు. నన్ను మన్నించి, ఇంకా ఏమైనా కావలిస్తే అడగండి తప్పక ఇస్తాను' అన్నాడు.

మహారాజు కుమారుడైన రాముని వినయసౌశీల్యానికి ఆ వృద్ధ బ్రాహ్మణుడు అబ్బురపడ్డాడు. అపుడాయన సీతారాముల్ని లక్ష్మణుడ్ని ఆశీర్వదించి, అన్నివేల ఆవుల్ని ఇచ్చినందుకు తనకి చాలా సంతృప్తిగా వుందని చెప్పి త్రిజటుడు రాముని దగ్గర సెలవు తీసుకుని, భార్యాపిల్లలతో వెళ్ళిపోయాడు.

ఆ రోజు అయోధ్యలోని ప్రతి బ్రాహ్మణుడు, ప్రతి సేవకుడు, రాముడు చేసిన దానధర్మాలు స్వీకరించి, సంతృప్తిగా సీతారాముల్ని లక్ష్మణుని చిరాయువులుగా వుండమని ఆశీర్వదించారు.

అలా రాజభవనంలో తనదంటూ ఏమీలేకుండా, పంచిపెట్టాక, రాముడు సీతాలక్ష్మణులు వెంటరాగా, తండ్రిదగ్గర సెలవుతీసుకుందామని బయల్దేరాడు.

సీత, రామలక్ష్మణుల ఆయుధాల్ని మంచిగంధంతోనూ, పూలతోనూ అలంకరించింది. అన్నదమ్ములిద్దరూ ఆ ఆయుధాలు ధరించారు.

మూర్తీభవించిన తేజోమూర్తులలా వారు ముగ్గురూ రాజవీధిలో కాలినడకన వెళ్తువుంటే జనం తండోపతండాలుగా కదిలివచ్చి గుంపులుగుంపులుగా నిలబడి చూడసాగారు.

నిన్నటివరకు చతురంగ బలాలూ వెంటరాగా, శ్వేతాతపత్రం క్రింద సుఖాసీనుడై రథంలో తిరిగే రాముడు, ఇవాళ భార్యా సోదరులతో కాలినడకన వెళ్తున్నాడు.

మేలి ముసుగు ధరించి, కనీసం ఆకాశంలో ఎగిరే పక్షులకి కూడా దర్శనమియ్యని జానకి ఇపుడు అందరూ చూసేలా రాజవీధిలో నడిచివెళ్తోంది.

ఆదృశ్యం చూసేసరికి అయోధ్యలో పౌరుల హృదయాలన్నీ ఆవేదనతో నిండిపోయాయి.

వారంతా కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ 'రామా, కేవలం తండ్రికి అసత్యదోషం రాకూడదని, నీకున్నదంతా దానం చేసి, భార్యా, సోదరులతో అడవులకెళ్తున్నావా స్వామీ! అష్టైశ్వర్యాలతో తులతూగుతూ, సుఖాలకి మాత్రమే అలవాటుపడ్డ నువ్వు కీ కారణాల్యలలో ఎలా వుండగలవు?

నీ తండ్రి దశరథ మహారాజుకి గాని, పిచ్చిపట్టలేదు కదా. లేకపోతే సకల గుణాభిరాముడైన తనయుణ్ణి అడవులకి పంపిస్తాడా?' అంటూ తమలో తామే చర్చించుకుంటూ, దీనాతిదీనంగా విలపించసాగారు.

అయ్యో! గుణవంతుడు కాకపోయినా, కడుపున పుట్టిన కుమారుని ఏ తండ్రి అయినా అడవులపాలుచేస్తాడా? అటువంటిది సకల గుణాభిరాముడైన శ్రీరాముణ్ణి వనవాసానికి పంపటానికి ఆయన మనసెలా ఒప్పింది? మనం కూడా ఇళ్ళూ వాకిళ్ళు పాడుబెట్టి లక్ష్మణునిలాగే, రాముని వెంట అడవులకి వెళ్ళిపోదాము. ఆయన ఎక్కడుంటే అక్కడే మనం పూరిపాకలు వేసుకుని, ఆయనని సేవిస్తు బతుకుదాం. ఇళ్ళన్నీ పాడుబడ్డాక స్మశానవాటిక లాంటి ఈ అయోధ్యని కైకమ్మ ఏలుకుంటుంది' అని అంగలార్చారు.

మనం రాముని వెంట వెళ్తే ఆ కీకారణ్యాలన్నీ జనపదాలైపోతాయి. అక్కడే ఒక కొత్త 'అయోధ్య' వెలుస్తుంది. ఆ అడవులలోని క్రూరమృగాలూ, పాములూ, మనని చూసి భయపడి ఈ అయోధ్యలో వచ్చి చేరుతాయి. అపుడీ దండకారణ్యంలాంటి అయోధ్యని కైకేయి పాలిస్తుంది' అని సంబరపడ్డారు.

ఆ మాటలన్నీ రామునికి వినిపిస్తూనే వున్నాయి. కాని ఆ శ్రీమంతుడెంత మాత్రం చలించలేదు. ఎప్పటిలాగే చిరునవ్వులు చిందిస్తు ఠీవిగా నడిచివెళ్తున్నాడు. అలా నడిచివెళ్ళి కైలాసగిరి లాంటి దశరథ మహారాజు భవనానికి చేరుకున్నాడు.

గుమ్మం దగ్గర సుమంత్రుడు దుఃఖాతిశయంతో, ఒడిలిపోయిన ముఖంతో నుంచుని వున్నాడు. రాముణ్ణి అడవులకి వెళ్ళమన్న దగ్గర్నించీ సుమంత్రుడు కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ అక్కడవున్నాడు. రాముడు సుమంత్రుడి దగ్గరగా వెళ్ళి తను వచ్చిన సంగతి తండ్రికి చెప్పమన్నాడు. సుమంత్రుడికి మరింత దుఃఖం కలిగింది. చేసేదిలేక దశరథ మహారాజు దగ్గరకెళ్ళాడు. అక్కడ దశరథుడు వ్యాకుల చిత్తంతో రామా రామా అని ఏడుస్తున్నాడు. ఆయనకెలా చెప్పాలా అని సందిగ్ధంలో పడ్డ సుమంత్రుడు చివరికి గుండెరాయి చేసుకుని, 'మహారాజా,

పురుషశార్దూలుడైన శ్రీరాముడు, మీ జ్యేష్ఠపుత్రుడు, మీకు వందనం చెప్పి, మీ దర్శనార్థం వాకిట నిలబడి వున్నాడు. ఆ ధర్మమూర్తి తన సంపదనంతటినీ బ్రాహ్మణులకి దానమిచ్చి, మిత్రులందరికీ వీడ్కోలు చెప్పి, సీతాలక్ష్మణ సమేతుడై వనవాసానికి వెళ్ళబోతూ మీ ఆశీర్వాదం కోరి వచ్చాడు' అని చెప్పాడు.

ఆ మాటలు విన్న దశరథుడు గద్గద స్వరంతో 'సుమంత్రా, నా దేవేరులందర్నీ పిలిపించు. వారంతా వచ్చాకనే నేను రాముణ్ణి చూస్తాను' అన్నాడు. వెంటనే సుమంత్రుడు వర్తమానం పంపగా దశరథమహారాజు భార్యలు మొత్తం మూడువందల ఏభైమందీ, కౌసల్యాదేవి వెంట బయల్దేరి, రాముడు అడవులకి వెళ్తున్నాడనీ, గోలు గోలున ఏడుస్తూ వచ్చారు.

భార్యలందర్నీ తన దగ్గర కూర్చోబెట్టుకుని, అపుడు రాముణ్ణి లోపలకి రమ్మని కబురు చేశాడు దశరథుడు. సీతారాములూ, లక్ష్మణుడూ సుమంత్రుని వెనుక వచ్చి చేతులు జోడించి నించున్నారు.

రాముణ్ణి చూడగానే దశరథుడు భోరున ఏడుస్తూ లేచివచ్చి రాముని కౌగలించుకోబోయి బోర్లాపడిపోయాడు. రామలక్ష్మణులు పరుగున వెళ్ళి తండ్రిని లేవదీసి, మంచంమీద పడుకోబెట్టారు.

ఈ హఠాత్పరిణామానికి ఆయన భార్యలంతా 'రామా' అని ఏడుస్తు గుండెలు బాదుకున్నారు. వారిచేతి కంకణాల చప్పుడికి, ఆ భవనమంతా ప్రతిధ్వనించింది.

రామ లక్ష్మణులూ, సీతా, దశరథ మహారాజుని మంచంమీద పడుకోబెట్టి సపర్యలు చేశారు. కొంతసేపటికి మహారాజుకి తెలివి వచ్చింది. రాముడు తండ్రి పాదాలకి నమస్కరించి,

'ప్రభూ, మా కందరికీ నాథులు మీరే. మీ అనుమతి మీద దండకారణ్యాలకి బయల్దేరి వెళ్ళాలని వచ్చాను. సీతా లక్ష్మణుడు కూడా నాతో వస్తానంటున్నారు. కనుక వారికి కూడా అనుమతినివ్వండి' అన్నాడు.

ఆ మాటలు విన్న దశరథుడు సిగ్గుతో చితికిపోయాడు. ఎలాగో గొంతు పెకిలించుకుని 'రామా, ఏనాడో నేను ఇచ్చిన వరాలు ఆధారంగా ఈ కైకేయి నన్ను వంచించి, మోసగించింది. ఆ మాట నువ్వు పాటించవలసిన అవసరం లేదు. నాయనా నన్ను నిర్బంధించి, ఈ కోసల రాజ్యానికి మహారాజువై యథేచ్ఛగా పాలించుకో, నా కోరిక మన్నించు' అన్నాడు.

పరమధార్మికుడైన రాముడు, తండ్రి మాటలు విని, చేతులు జోడించి, 'ప్రభూ ఈ రాజ్యము మీది. మీరు మా ఏలిక. మీ శాసనాన్ని అతిక్రమించే శక్తి

నాకు లేదు. నా వల్ల మీకు గాని, మీవల్ల నాకు గాని అసత్యదోషము అంటకూడదు. కనక పధ్నాలుగు సంవత్సరాల స్వల్పకాలంలో నేను వనవాసం ముగించి, రెక్కలు కట్టుకుని వచ్చి మీ పాదాల చెంత వాలుతాను' అన్నాడు.

దశరథుడు కుమారుని మాటలు విని, ఖిన్నుడై దీనాతి దీనంగా దుఃఖిస్తుంటే, కైక ఆయన చెంత చేరి రాముణ్ణి వెంటనే అడవులకి పంపమని పోరసాగింది.

కింకర్తవ్యతామూఢుడై దశరథుడు తలదించుకున్నాడు.

ఎలాగో తమాయించుకుని చివరికి రాముడితో మెల్లిగా ఇలా అన్నాడు. 'రామా, నువ్వు రఘుకులదీపకుడివి. సత్యవ్రతుడివి. ధర్మమూర్తివి. అడవులకి వెళ్ళి తీరాలని నిశ్చయించుకుని వచ్చావు. ఇంక నిన్నెవ్వరూ ఆపలేరు. కనుక తప్పకుండా వెళ్ళు నాయనా - నాకు పరలోకంలో సద్గతులు కలగాలని, సమస్త రాజ్యభోగాలు వదులుకుని, కానలకు వెళ్తున్నావా, తండ్రీ. ఇంతటి దుష్కర కార్యము నువ్వు తప్ప ఇంకెవ్వరూ చెయ్యలేరు.

రామా, నిన్ను అడవులకు పంపటం నాకు ఇష్టమనుకుంటున్నావా? ఈ నయవంచకి కైక నివురు కప్పిన నిప్పులాంటిది. నేనేనాడో సంతోషంతో ఇచ్చిన వరాలు, నన్ను మోసం చేసి, ఈ విధంగా కోరుకుని, మన వంశ గౌరవాన్ని నేల పాలు చేసిందిరా.

ఆఖరికి ఈ దుర్మార్గురాలి స్వార్థానికి, నువ్వు బలి కావలసి వచ్చింది. నువ్వు నా జ్యేష్ఠపుత్రుడివి. నాకు అసత్యదోషము అంటకూడదని, ఇంతటి స్థిరమైన నిర్ణయం తీసుకుని, నన్నుద్ధరిస్తున్నావు.

నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. నీ ధార్మికతకి నేనూ కట్టుబడక తప్పటం లేదు. నీ నిర్ణయాన్ని మేమెవ్వరం మార్చలేము. కాని - రామా, ఇపుడే వెళ్ళొద్దు. ఈ రాత్రంతా ఇక్కడే వుండు. మీ అమ్మ కౌసల్యా - నేనూ రేపు తెల్లారిందాకా నిన్నూ సీతనీ తనివితీరా చూస్తూ, కొంత మనశ్శాంతి పొందుతాము. రేపు తెల్లారగానే తప్పకుండా వెళ్దువుగాని' అంటున్న ఆ ఆర్తాలాపాలు రాముని గుండెని పిండిచేశాయి.

ఒక్కసారి లక్ష్మణుని వైపు చూశాడు రాముడు. అతడి కళ్ళల్లో కూడా ధృడనిశ్చయం గోచరించింది. అపుడు తండ్రితో ఇలా అన్నాడు.

'మహారాజా, మన్నించండి. నేనింక ఒక్క క్షణమైనా ఇక్కడ వుండదల్చు కోలేదు. ఈ ఒక్కరోజు మిమ్మల్ని మేము, మమ్మల్ని మీరు సంతోష పెట్టటం

వల్ల, ఒరిగేదేం వుంది గనక? రేపైనా విరహవేదన తప్పదు కదా. ప్రస్తుతం నేను కోరికలన్నీ వదులుకున్నాను. మీరు సంతోషంగా మీ భార్యకిచ్చిన వరాలు చెల్లించటంలో న్యాయం వుంది. మీ ఆజ్ఞ శిరసావహించి, పధ్నాలుగు సంవత్సరాలూ దండకారణ్యంలో నివసించి, ఋషుల మధ్య తాపస జీవితం గడుపుతాను. మిమ్మల్ని నిర్బంధించి ఈ రాజ్యం హస్తగతం చేసుకోమన్నారే, అలాంటి ఆలోచన ఏనాడూ రానివ్వకండి. నాకు రాజ్యం పాలించాలనే కాంక్ష ఏనాడూ లేదు.

మీ ఆజ్ఞలు నెరవేర్చటం ఒక్కటే నా వాంఛ. మీరు దిగులుపడి దుఃఖించవద్దు. సముద్రునిలా గంభీరంగా వుండండి. నాన్నగారూ, దేవతలకి సైతం తండ్రే ప్రత్యక్షదైవం. కనక నా తండ్రే నాకుదైవం. ఆయన ఆజ్ఞ నెరవేర్చటమే నా కర్తవ్యం. నేను వనవాసం చేసి వచ్చాక, మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాను. తండ్రీ, నా తల్లులంతా నేను అడవులకి వెళ్తున్నానని, దుఃఖిస్తున్నారు వాళ్ళందర్నీ మీరే ఊరడించాలి.

మీరిలా దుఃఖిస్తూ వుంటే, వాళ్ళనెవరు ఓదారుస్తారు? ధైర్యం తెచ్చుకోండి. భరతుడికి పట్టాభిషేకం చెయ్యండి. నేను అడవులలో, ప్రకృతి దృశ్యాలు చూస్తూ, సెలయేళ్ళలోని తియ్యటి నీళ్ళు త్రాగుతూ, మధురఫలాలు తింటూ వన్యమృగాలతో ఆడుకుంటూ, సుఖంగా వుంటాను. మీరు కూడా ఇక్కడ సంతోషంగా వుండండి. ఇదిగో వీళ్ళిద్దరూ సీతా, లక్ష్మణుడూ వనవాసంలో నాకు తోడునీడగా వుండి, వన్యజీవిత సౌఖ్యం వాళ్ళు కూడా తనివితీరా అనుభవిస్తారు. ఇంక మాకు దయతో అనుమతి ఇవ్వండి' అని అర్థించారు.

రాముడి మాటలు విని దశరథ మహారాజు పెద్ద పెట్టున ఏడిచాడు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపడిపోయాడు. కైక తప్ప మిగిలిన రాజపత్నులంతా ఏడవసాగారు. వారి ఆర్తనాదాలు విని సుమంత్రుడు మూర్ఛపోయాడు.

కొంతసేపటికి తెప్పరిల్లి తల అటు ఇటు విదిలిస్తు నిటూర్పులు వదిలాడు. పళ్ళు పటపట కొరుకుతు ఒక చేతిలో ఇంకో చెయ్యి నొక్కుకున్నాడు. కోపంతో కళ్ళు చింతనిప్పుల్లా ఎఱ్ఱగా వున్నాయి. దుఃఖావేశం తో దశరథ మహారాజు రథసారథి వన్న సంగతి కూడా మర్చిపోయాడు. కోపంతో వణికిపోతు శూలాల్లాంటి మాటలతో కైకనిలా అన్నాడు.

'అమ్మా, చరాచర జగత్తునీ ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలిస్తున్న దశరథ మహారాజు మీ భర్త. అంతటి మహనీయుని అభీష్టాన్ని తిరస్కరిస్తున్నారు.

ఇంతకంటే దారుణం వుందా తల్లీ? మీ దుష్కార్యం చూసి భర్తకి తీరని ద్రోహం చేస్తున్న కులపాతకిగా మేమంతా మీగురించి అనుకుంటున్నాం.

మేరునగ సమధీరుడు, మహేంద్రునిలా అజేయుడు, మహాసాగరంలా గంభీరమైనవాడూ, మహాధీరుడు అయిన మన ప్రభువు, మీ మూలంగా నేడు కలత పడుతున్నారు. ఆ పూజనీయుణ్ణి ఇలా క్షోభపెట్టటం భావ్యం కాదమ్మా. కోటిమంది కొడుకుల్ని కనిపెంచటం కన్నా, భర్తని గౌరవించి, పూజించటమే స్త్రీలకి ముఖ్యం. కాని మీరు మహారాజుని త్రోసి రాజని, ఆయన లేని రాజ్యాన్ని పొందాలనుకుంటున్నారు. అది వంశ నాశనానికి కారణమవుతుంది. నీ కోరిక ప్రకారం భరతుడు రాజైతే, మేమందరం రాముడెక్కడుంటే అక్కడికి వెళ్ళిపోతాము. నీ రాజ్యంలో సత్పురుషులు కానీ, బ్రాహ్మణులు కానీ వుండరు. అంతటి అమర్యాదకరమైన పని ఎందుకు చెయ్యదలిచారు? మీ మనస్సు ఈ క్షణంలో ఎందుకిలా మారిందో అని చాలా ఆశ్చర్యంగా వుంది. ఈ అకృత్యం చూస్తూ కూడా ఈ భూమి ఎందుకు బ్రద్దలు కాలేదా అనిపిస్తోంది. రాముణ్ణి అరణ్య వాసానికి పంపాలనే, ఈ దుష్టసంకల్పం తెలియగానే, బ్రహ్మర్షులు కోపంతో దహించుపోతూ, యమదండంతో నిన్ను శిక్షించి వుండవలిసిందే అలా ఎందుకు చెయ్యలేదా అని బాధగా వుంది.

అమ్మా, తియ్యని మధుర ఫలములనిచ్చే మామిడి చెట్టుని తెగనరికి, దాని మొదట్లో వేపచెట్టు పాతి పాలుపోసి పెంచితే మాత్రం ఆ వేపచెట్టుకాయలు తియ్యగా వుంటాయా? అలాగే మన మహారాజు పట్టమహిషిని కాదని, మీకు ప్రాముఖ్యత నిచ్చినందుకు మీ బుద్ధి బయటపెట్టారు. ఈ విషయంలో మీ తల్లి కూడా ఇలాగే చేశారని విన్నాను.

పూర్వము, మీ తండ్రి కూడా ఇలాగే మీ అమ్మగారికి వరాలిచ్చారట. ఆయనకి జంతుజాలము, పశుపక్ష్యాదులు మొదలైన సమస్త జీవరాసులభాష తెలుసుకోగలిగే జ్ఞానం వుండేదట. ఒకనాడు ఆయన పానుపుపై వుండగా, రెండు చీమలు సంభాషించుకోవటం ఆయన విన్నారట. ఆ మాటలు విన్న ఆయనకి నవ్వు వచ్చి ఫక్కున నవ్వారట.

తన భర్త అలా నవ్వటం చూసిన మీ తల్లిగారు, ఆ నవ్వుకి కారణం చెప్పమని అడిగారట.

కాని, తాను విన్న అల్పజీవుల మాటలు వేరొకరికి చెప్పటం వల్ల తనకి మరణం కలుగుతుందనే శాపం కూడా వుండటం వల్ల మీ తండ్రి ఆమెతో ఆ సంగతి తెలుసుకోవటానికి ప్రయత్నించవద్దని అన్నారట.

కాని మీ తల్లి తనని అపహాస్యం చెయ్యటానికే రాజు నవ్వారనీ, చెప్పి తీరవలసిందే అని మంకు పట్టుపట్టారట. అపుడు మీ తండ్రిగారు 'సౌభాగ్యవతీ, ఒక మునీంద్రుడు నాకిచ్చిన వర ప్రభావం వల్ల పశుపక్ష్యాదులు, కీటకాలూ మాట్లాడుకునే భాష నేను తెలుసుకోగల శక్తి నాకుంది. ఆ శక్తి వల్లే ఇపుడు ఈ చీమలు మాట్లాడుకుంటున్న సంభాషణ విన్నాను. నవ్వు వచ్చింది. కాని అవి ఏమి మాట్లాడుకుంటున్నాయో నేనెవరికైనా చెప్తే తలపగిలి ఛస్తానని ఆముని శాపం కూడా పెట్టాడు. అందుకే చెప్పలేను. నన్ను నిర్భంధిచకు' అన్నాడట. కాని మీ తల్లి మాత్రం 'భర్త ప్రాణాలు పోయినా సరే, ఆ సంగతి చెప్పి తీరవలసిందే' అన్నారట. నీ తండ్రిగారికపుడేం చేయ్యాలో తోచక తనకి ఆ వరాలు ఇచ్చిన ఆ మునిని స్మరించి, కర్తవ్యం చెప్పమని ప్రార్థించారట.

అపుడా ఋషి మీ తండ్రి మనోనేత్రం ముందు కనిపించి, 'నీ భార్య ఎంత పట్టుపట్టినా సరే, నువ్వు మాత్రం ఆ చీమల సంభాషణ మాత్రం చెప్పకు' అని హెచ్చరించాడట. ఎంతకీ మంకుపట్టు విడవకుండా ప్రాణత్యాగం చేస్తానని బెదిరిస్తున్న మీ అమ్మగారిని వేరేదారిలేక మీ తండ్రిగారు పరిత్యజించారని నాకు తెలిసింది.

అటువంటి కుటిల మనస్కురాలైన తల్లికి పుట్టిన మీరూ అదే దారిలో నడచి, మోహపరవశుడైన మహారాజుని వంచించి, ధర్మభ్రష్టుడ్ని చెయ్యాలనే, సంకల్పంతో మహా పాపం చేస్తున్నారు.

అమ్మా, మీ మంకుపట్టు వీడి, మహారాజుగారి కోరిక మన్నించి, లోక కల్యాణం కలిగించు తల్లీ. ప్రజలంతా మిమ్మల్ని గౌరవిస్తారు. మహారాజు గార్ని మహాపాపం అంటకుండా రక్షించు. మీ భర్త లోకనాథుడు. దేవేంద్రుడితో సమానమైనవాడు. ఆయనని అధర్మవర్తనుడిగా చెయ్యకు. జ్యేష్ఠుడు, సదాచార సంపన్నుడు, ధర్మరక్షకుడు, లోకరక్షకుడు, మహా బలసంపన్నుడు అయిన రాముడే పట్టాభిషిక్తుడు కావటానికి అన్నివిధాలా యోగ్యుడు. మహారాజైన తండ్రిని వదిలి, వనవాసానికి వెళ్తే రాముడికి అపవాదు వస్తుంది. మీరు అన్నీ తెలిసినవారు. వివేకవంతులు. బాగా ఆలోచించండి. రాముడికి పట్టాభిషేకం చేసి నిశ్చింతంగా వానప్రస్థాశ్రమానికి వెళ్ళే అవకాశం మహారాజుకి కలిగించండి' అంటు చేతులు జోడించి సుమంత్రుడు కైకేయికి అనేక విధాల కర్తవ్యాన్ని బోధించాడు. అయినా కైకమ్మ ఏమాత్రం చలించలేదు. ఆమె ముఖంలో ప్రసన్నత లేదు. బిడియం కూడా లేకుండా నిశ్చలంగా అలాగే వుంది.

ఉలుకు పలుకు లేకుండా, మిడి మిడి చూపులు చూస్తూ నుంచున్న కైకని చూసి, దశరథ మహారాజు క్రుంగిపోయాడు. ఇంక తప్పదు. తను ఆమెకి బాస చేశాడు. చెల్లించి తీరవలసిందే. అయ్యో! ఆమెకిచ్చిన మాట ఇపుడు ప్రాణాంతకమైందే. అని కన్నీటితో కుమిలిపోతూ సుమంత్రునివైపు చూసి, 'సుమంత్రా చతురంగ బలాలు రత్నరాశులతో రాముని వెంట వెళ్ళేటట్లు ఏర్పాటు చేయించు. విడిది చేసిన చోటల్లా వినోదం కలిగించేందుకు మేజువాణీ, దారిపొడుగునా సరుకులు సమకూర్చేందుకు వర్తకులూ, వారందరికీ అవసరమైన ధనము నిచ్చి రామునివెంట పంపండి. తగినన్ని ఆయుధాలిచ్చి, ఎవరెవరు రాముని వెంట వెళ్ళటానికి కిష్టపడ్డారో, వారందర్నీ వెళ్ళమను. అరణ్యంలో సరైనదారి చూపే బోయల్ని వెళ్ళమను. నా ధనాగారం అంతా రాముడి వెంట తరలించండి.

ఇలా చెయ్యటం వల్ల క్రూరమృగాలు వల్ల భయం లేకుండా, అడవులలో ప్రవహించే నదీ తీరాల్లో విలాసంగా విహరిస్తూ, తియ్యని తేనెలు త్రాగుతూ, నారాముడు కోసల రాజ్యాన్ని మర్చిపోయి, పధ్నాలుగేళ్ళూ సుఖంగా వుంటాడు.

భరతుడు మహావీరుడై రాజ్యాన్ని పాలిస్తే, రాముడు, భోగభాగ్యాలతో వనవాసం చేస్తాడు. దశరథ మహారాజు ఆవేశంగా ఆజ్ఞలు జారీ చేశాడు.

అవన్నీ వింటున్న కైకేయి ముఖం వివర్ణమైంది. గొంతు తడారిపోయింది. విషణ్ణ వదనంతో, ఏడుపు దిగమింగుకుని, ఇలా అంది. 'ప్రభూ, సంపదలు పౌరులు, అంతా రాముడితో వెళ్తే శూన్యమైన ఈ రాజ్యాన్ని భరతుడేం చేసుకుంటాడు? అలాంటి శ్రీవిహీనమైన ఈ రాజ్యం భరతుడికి కక్కర్లేదు.' అని సిగ్గు బిడియం లేకుండా పలుకుతున్న కైక మాటలు మహారాజుకి అసహ్యం కలిగించాయి.

'పాపిష్టిదానా, మొయ్యలేని బరువు నామీద వేసిందే చాలక, ఇది కూడానా? ఈ విషయం నీ వరాల్లో ప్రస్తావించావా?' అంటూ నిప్పులు కురిపిస్తూ చూశాడు. కాని కైక తోక తొక్కిన తాచులా బుసలు కొడుతూ...

'రాజా, మీ వంశంలో, సగర మహారాజు జ్యేష్ఠపుత్రుడైన అసమంజుణ్ణి, అడవులకి వెళ్ళగొట్టలేదా? అలాగే మీరూ రాముడ్ని పంపండి' అంది.

దశరథుడు దుఃఖంతో మాటలు రాక 'ఛీ - ఛీ' అన్నాడు. అక్కడున్న జనమంతా కైకని ఏవగించుకున్నారు. కాని కైక ఎంతమాత్రం లక్ష్యపెట్టలేదు. కాని అదంతా గమనిస్తున్న సిద్ధార్థుడనే వృద్ధుడు ప్రధానామాత్యులతో ఒకడు. రాజుకి చాలా అంతరంగికుడు. ధర్మాత్ముడు అయిన సిద్ధార్థుడనె వృద్ధుడు లేచి ఇలా అన్నాడు.

'అమ్మా, ఎంతమాట తల్లీ. అశ్వమంజుడికీ, రాముడికీ పోలికా! అశ్వమంజుడు దుష్టుడు. అయోధ్యానగరపు వీధులలో హాయిగా ఆడుకునే పసిపిల్లల్ని, సరయూనదీ జలాలలోకి విసిరేసి ఆనందించేవాడు. ఆ అకృత్యాలు సహించలేని, పౌరుల అభ్యర్థనపై, సగర చక్రవర్తి అస్వమంజుణ్ణి, అతడి భార్యనీ కట్టుబట్టలతో, రథం ఎక్కించి అడవులకి పంపించేశాడు. క్షమించరాని పాపాలు చేశాడు కనక అస్వమంజుణ్ణి, పరమధార్మికుడైన సగరుడు, అడవులకి వెళ్ళగొట్టాడు. కాని, దేవీ - మన రాముడు ఏం అపరాధం చేశాడని శిక్షించాలి? వెతికి చూసినా మన రామునిలో ఒక్కదోషం కూడా లేదె! మీకేదైనా దోషం కనిపిస్తే చెప్పండి. మహారాజు తక్షణం నువ్వు కోరినట్టు పంపుతారు. ఏ పాపమూ ఎరుగనివాడ్ని, పరమ ధార్మికుడైన వానిని, అకారణంగా అడవులకి పంపటం, అధర్మము. అపరాధము. దేవీ - రాముడ్ని రాజ్యలక్ష్మికి దూరం చేసే ఆలోచన విరమించండి లేకపోతే లోకమంతా ఏకమై మిమ్ము నిందిస్తుంది.' అని వృద్ధమంత్రి చెప్పిన మాటలు విని, మహారాజు దుఃఖంతో గొంతుపూడుకుపోగా ఇలా అన్నాడు.

'పాపిష్ఠదానా, నాకూ, నీకూ కూడా మేలు చెయ్యాలని, పెద్దలంతా చెప్తున్న మాటలు పెడచెవిని పెడ్తున్నావు. నీది కుత్సిత బుద్ధి. నీ చేతలు కూడా కుచేష్టలే. మంచి మార్గం నీకు నచ్చదు. నేనిపుడూ, రాజ్యాన్ని, సుఖాన్ని వదిలి రాముడితో అడవులకి వెళ్ళిపోతాను. నువ్వు, నీ కుమారుడు యథేచ్ఛగా, చిరకాలం రాజ్యాన్ని అనుభవించండి' అన్నాడు.

ఆ సంభాషణలన్నీ వింటున్న రాముడు, వినయంగా తండ్రితో, 'మహారాజా, సర్వసంగ పరిత్యాగం చేసి, భోగభాగ్యాలు త్యజించి, అడవులలో కందమూలాలు తింటూ వనవాసం చెయ్యటానికి బయల్దేరిన నాకు, ఈ అనుచరులతోటి, వారు తెస్తున్న వస్తువులతోటీ ఏమి పని?

మత్తగజాన్ని దానం చేసి, కట్టే తాడుమీద మోజు పడి, ఎవడైనా ఆ తాడును భద్రంగా దాచుకుంటాడా? ఒక వేళ దాచుకున్నా ఆ తాడు వల్ల వాడికేం లాభం? పురుషోత్తములైన తండ్రీ, మీకు తెలియని సంగతి ఏమైనా వుందా? నాకు మీరు నారచీరలు మాత్రం తెప్పించి ఇవ్వండి. చాలు. మిగతావన్నీ అనవసరం. పధ్నాలుగు సంవత్సరాలు అడవులలో వుండాలి కనక, ఒక తవ్వుగోల, ఒక గంప మాత్రం ఇప్పించండి' అన్నాడు.

కైకేయి వెంటనే అక్కడున్న వాళ్లందరూ ఏమనుకుంటారో అని సిగ్గైనా లేకుండా నారబట్టలు తెప్పించి, రాముడికిచ్చి కట్టుకోమంది.

రాముడు ఒద్దికగా ఆ నారబట్టలు అందుకుని, తాను కట్టుకుని వున్న చీనీ చీనాంబరాలు విడిచి, పక్కనపెట్టి, ఆ ముతక బట్టలు కట్టుకున్నాడు. లక్ష్మణుడు కూడా తండ్రి చూస్తుండగానె నారచీరలు కట్టుకున్నాడు. కాని జానకి మాత్రం ఆముతక చీరలు చూసి ఒక్కసారి నిలువెల్ల వణికింది. ఎలాగో మనస్సు గట్టి చేసుకుని ఆనారచీర తీసుకుని కట్టుకోటానికి ప్రయత్నించింది. కాని ఆమెకి సాధ్యం కాలేదు. ఆమె కన్నులనిండా నీళ్ళునిండాయి. జాలిగొలిపే చూపులతో భర్తవంక చూస్తూ... 'ప్రభూ వనాలలో నివసించేమునులు, ఈ నార బట్టలెలా ధరిస్తారో కాని, నా వల్ల కావటం లేదు' అంటు తన చేతకానితనానికి చాలా సిగ్గుపడింది. ఒక చెంగు బుజాన వేసుకుని, రెండవకొన చేతితో పట్టుకుని, అసౌకర్యంగా నిలబడి, సిగ్గుతో ముఖం దించుకుంది.

అపుడు రాముడు ఆ చీర అందుకుని అదివరకు ఆమె కట్టుకున్న ఆ పట్టుచీరమీదె, ఈ నార చీర కట్టాడు. ఆ దృశ్యం చూస్తున్న అంతఃపుర స్త్రీలందరు, కంటతడిపెట్టారు. రాముడితో మెల్లిగా 'నాయనా, ఈ సుకుమారిని అడవులకి రమ్మని నిర్బంధించకు. నీ తండ్రిగారు నీకు మాత్రమే వనవాసం విధించారు. నువ్వు తిరిగివచ్చేవరకు, ఈమెని చూసుకుని జీవిస్తాము. ఇక్కడే వుండనీ' అన్నారు.

అంతలో సీతకి రాముడు నారచీర కట్టటం పూర్తయింది. ఇదంతా చూస్తున్న, వారి కులగురువైన వశిష్ఠుడు, దుఃఖంతో సీతని నారచీరలు కట్టుకోవద్దని వారిస్తు, కోపంగా కైకేయితో 'కైకేయీ, నువ్వు దుష్టప్రవృత్తితో, సదాచారాన్ని వదిలిపెట్టి, వంశనాశనానికి పూనుకున్నావు. మహారాజుని వంచించి, ముందుగా ప్రమాణం చేయించుకుని, ఆయనని కట్టిపడేశావు. దుశ్శీలురాలా, సీతాదేవి ఎందుకు అడివికి వెళ్ళాలి? అసలు రాముని స్థానంలో ఆమె సింహాసనం అధిరోహించి, రాజ్యాన్ని పాలించాలి. అంతే. సామాన్యంగా ఈ లోకంలో భార్య భర్తకి ఆత్మ స్వరూపము. భర్తని అనుసరించి జీవించటం, భార్య ధర్మం. కనుక రాముడు అడవికి వెళ్తే, సీత సింహాసనమధిష్ఠించాలి. అలాకాక, సీతమ్మ కూడా రామునివెంట అరణ్యానికి వెళ్తే మేమంతా నగరం వెళ్లి వారివెంట అడవులకి వెళ్ళిపోతాము. రాష్ట్ర సరిహద్దులలో కాపలాగా నిలబడ్డ రక్షకభటులు, దండనాయకులు కూడా సీతారాములెక్కడుంటే, అక్కడికే వెళ్తారు. ఆ తర్వాత భరత శత్రుఘ్నులు కూడా జటావల్కలాలు ధరించి, అన్నగారి వెంట అడువులకి వెళ్ళి, వారితో అక్కడే వుండిపోతారు. అపుడు ప్రజలందరూ ఏవగించుకుంటుంటే, నిర్జనారణ్యామైన ఈ పట్టణాన్ని, ఈ రాజ్యాన్ని మొక్కలు మోడులు మాత్రమే వుండగా, ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుకుందువుగాని. దుష్టురాలా, సదాచార సంపన్నుడైన

రాముడు, నివశించే అరణ్యమే, సజ్జనాత్మకమైన రాజ్యమౌతుంది. రాముడు లేని రాజ్యం రాజ్యమే కాదు. నువ్వు వరం కోరి పట్టంకట్టిన రాజ్యాన్ని భరతుడు ఏలుకోడు. ఎందుకంటే తండ్రి తనకి పట్టం కట్టలేదు కనక. నిజంగా భరతుడు దశరథునికి పుట్టిన కుమారుడే అయితే నిన్ను కూడా తల్లిగా అంగీకరించడు. నువ్వు భూమిని విడిచి, ఆకాశానికెగిరినా సరే, తండ్రి వంశగౌరవం ఎరిగినవాడు కనక, భరతుడింకోలా చెయ్యడు. కన్నకొడుకు మీద వ్యామోహంతో నువ్వు నీ కొడుక్కి కీడు తలపెట్టావు.

రాముడ్ని అనుసరించని వ్యక్తి ఒక్కడు కూడా, ఈ భూమండలంలో వుండడు. చూస్తూండు. పశుపక్ష్యాదులు కూడా రాముణ్ణే అనుసరించి వెళ్తాయి. చివరికి వృక్షాలు కూడా రాముడి ఆధిపత్యాన్ని కోరుకుంటాయి. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని, నీ ఇంటికోడలైన సీతకి ఆభరణాలు, పట్టువస్త్రాలు ఇయ్యి. ఈ సుకుమారికి, నారచీరలు ధరించాలనే శిక్షవెయ్యకు.' అంటూ వశిష్ఠుడు కైకని మందలించాడు.

కైకేయ రాజపుత్రీ, నువ్వు రాముడొక్కడికే కదా, వనవాస శిక్ష విధించావు? కనక రాముడొక్కడే నార చీరలు ధరించాలి. జానకి మాత్రం సర్వాభరణాలూ ధరించి, మెత్తటి పట్టుబట్టలు కట్టుకుని, భర్తని అనుసరించాలి. ఈమె వెంట పరిచారికలు, వాహనాలూ, వెళ్ళవచ్చు. ఆమె సకలాభరణాలూ వెంట తీసి కెళ్ళవచ్చు. నువ్వడిగిన వరాల్లో ఈమెకెలాంటి నిబంధనలు లేవు' అంటూ వశిష్ఠుడు తీవ్రంగా అంటుంటే అవన్నీ వింటు సీత మౌనంగా బొమ్మలా నిలబడింది.

వశిష్ఠుడు అప్రతిమానప్రతిభాసంపన్నుడు, ధర్మబద్ధంగా ఆయన చెప్తున్న మాటలు కైకేయి ఏ మాత్రం లెక్కచేయకుండా, నిర్లక్ష్యంగా చూస్తూ నిలబడింది. సీతకూడా నారచీరలు కట్టుకునే, భర్తవెంట వెళ్ళాలని నిశ్చయించుకుంది. సీత నారబట్టలు ధరించటం చూసి, అక్కడి వారందరూ, 'అయ్యో! ఇంతటి బలగం వుండి కూడా, సీతమ్మకి ఇలాంటి స్థితి కలిగిందే, అని ఆక్రోశిస్తు, దశరథుని చూసి, ఛీ - ఛీ అన్నారు.

వారి ఛీత్కారాలకి దశరథుడు క్రుంగిపోయాడు. ఆయనకి తన జీవితం మీదా, ధర్మం మీదా, కీర్తి మీదా, రోతకలిగింది. వేడి నిట్టూర్పులు విడుస్తు,

'కైకా, నారబట్టలు ధరించే అవసరం సీతకి లేదు. ఆమె చాలా చిన్నది. పైగా సుకుమారి. సుఖపడటం తప్ప, కష్టమంటే ఏమిటో ఆమెకి తెలియదు. ఈమె కఠోరమైన వనవాసం చెయ్యలేదు. గురువులు యధార్థం చెప్పారు. జనక

మహారాజు కూతురు సీత. ఇవాళ పరివారం మధ్యన నారచీరలు ధరించి, లేడికూనలా బెదురుతు నించుందే, ఆమె ఎవరికి ఏ అపకారం చేసింది? నీకిచ్చిన వరాలలో సీత నారబట్టలు ధరించాలని నువ్వు కోరలేదే, కనక జానకిని పట్టుబట్టలు కట్టుకోమని చెప్పు. ఆమె సర్వాభరణభూషితురాలై పట్టుబట్టలు ధరించి రాముడి వెంటవెళ్ళాలి. నాకు మరణకాల మాసన్నమైంది. అందుకే పాపిష్టివాడినై నీకు వరాలు చెల్లిస్తానని మాట ఇచ్చాను. వెదురుకట్టెకి పుట్టిన నిప్పు, వెదురునే దహించి వేస్తుందిట. అలాగే నీమీది వ్యామోహంతో, నేను నీకు చేసిన ప్రతిజ్ఞ నన్నిలా దహిస్తోంది.

నీచురాలా, రాముడ్ని అడవికి పంపటమే కాక, ఇంకా ఈ పాతకాలన్ని ఎందుకు చేస్తున్నావు?

పాపం రాముడు యౌవరాజ్యాభిషేకం జరుగుతోందన్న ఆనందంతో వస్తే నువ్వు వాని నేమన్నావో విన్నాను. ఏమీ మాట్లాడలేక పోయాను. ఇంకా విజృంభించి ఇపుడు సీతని నారచీరలు కట్టుకోమంటున్నావే, ఇది మాత్రం సహించలేను. అంటూ దశరథుడు అంతు దరిలేకుండా విలపిస్తూ దుఃఖావేశంతో నేలమీద పడిపోయాడు. తండ్రి మాటలు విన్న రాముడు, మృదువుగా తండ్రితో ఇలా అన్నాడు.

'ప్రభూ, దుఃఖించి ప్రయోజనం లేదు. నా తల్లి కౌసల్య, పరమధార్మికురాలు, మహా పతివ్రత. వృద్ధురాలైపోయింది. ఇకమీదట ఆమెని మీరే ఆదరించాలి. నేను వెళ్ళగానే శోకసాగరంలో మునిగిపోతుంది. ఈ దుఃఖం ఆమె ఓర్చుకోలేదు. మీరె ఆమెనూరడించాలి. మీ ఆదరణలో ఆమె నన్ను మర్చిపోకల్గుతుంది. కనక ఈ దుఃఖంతో నా తల్లిప్రాణాలు కోల్పోకుండా కాపాడండి. అని చెప్పి, సీతా లక్ష్మణులతో రాముడు వెళ్ళటానికి సిద్ధపడ్డాడు. ముని వేషం ధరించి, వనవాసానికి వెళ్తున్న రాముడ్ని చూసి, దశరథుడు, ఆయన భార్యలూ ఆక్రోశిస్తూ మూర్ఛ పోయారు. తెలివి వచ్చాక కూడా, కంటినీరు ధారపాతంగా కారటం వల్ల, దశరథుడు రాముడ్ని సరిగ్గా చూడలేకపోయాడు. దుఃఖంతో గొంతు పూడుకుపోవటం వల్ల మాట్లాడలేకపోయాడు. దుఃఖం పొంగిరాగా, భోరున ఏడుస్తూ 'నేను పూర్వజన్మలో ఏదో మహాపాపం చేసి వుంటాను. ఏ తల్లీ పిల్లల్నో విడదీసి వుంటాను. దుర్మదాంధుడనై ప్రాణుల్ని హింసించివుంటాను. అయ్యో, నాకు చావైనా రావటం లేదే. నా ఎదురుగానే రాముడు, సీత, లక్ష్మణుడు, నారబట్టలు కట్టుకుంటుంటే, నిస్సహాయంగా చూస్తుండటం తప్ప ఏం చెయ్యలేకపోతున్నానె.

ఈ కైకేయి స్వార్ధపరురాలై వంచన చెయ్యటం వల్ల కదా ఇంతమందికిన్నివిధాల క్లేశము కలిగింది. అంటు కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ రాముడ్ని చూసి, 'రామా' అన్నాడు. ఆపైన గొంతు పెగల్లేదు. కాస్త తమాయించుకుని, కన్నీరు తుడుచుకోవాలని, వ్యర్ధప్రయత్నం చేస్తూ సుమంత్రుడితో ఇలా అన్నాడు. సుమంత్రా మేలుజాతి గుఱ్ఱాలు పూన్చి, మెత్తటి పరుపులు పరచి రథాన్ని సిద్ధంచెయ్యి. వీళ్ళు ముగ్గుర్ని ఆ రథంలో అయోధ్య పొలిమేరల దాకా సాగనంపిరా. సద్గుణవంతుల ధర్మనిరతికిదే ఫలితం. తల్లిదండ్రులే స్వయంగా పిల్లల్ని అడవులకి పంపాల్సి వచ్చింది.' అన్న మహారాజు పలుకులు విని, సుమంత్రుడు వెంటనే వెళ్ళి చక్కగా అలంకరించిన రథాన్ని తెచ్చాడు. దశరథుడు కోశాధిపతిని పిల్చి, వనవాసకాలం పధ్నాలుగు సంవత్సరాలకి సరిపడా సీతకి చీనీ చీనాంబరాలు, రత్నాభరణాలు ఇచ్చి పంపమని ఆజ్ఞాపించాడు. మామగారి ఆజ్ఞపై సీత నారచీరలు విడిచి పట్టుబట్టలు ధరించింది. రత్నాభరణాలు అలంకరించుకుంది. కౌసల్య కోడల్ని గాఢంగా కౌగలించుకుంది.

శిరస్సు ముద్దాడి సీతతో ఇలా అంది.

'అమ్మా, సామాన్యంగా స్త్రీలు భర్తని ఉన్నతస్థితిలో వుంటు, మంచి పనులు చేసినన్నాళ్ళే ఆదరిస్తారు. పదవిచ్యుతుడైన భర్తను ఏ ఆడదీ గౌరవించదు. భర్త ఇదివరలో ఎంత సుఖపెట్టినా, ఒక్క చిన్న పొరపాటు చేసి, ఆపద కలిగినపుడు, మునుపు అనుభవించినవన్నీ మర్చిపోయి, భర్తల్ని దుయ్యబట్టటమే స్త్రీల స్వభావం. కాని సాధ్వీమణులైన స్త్రీలు మాత్రం భర్తనే దైవంగా భావిస్తారు. విజ్ఞానము, క్షమ కలిగి పతివ్రతలై భర్తని పూజిస్తారు. గౌరవిస్తారు. జానకీ, ఈనాడు నా కుమారుడు అడవులకి వెళ్ళవలసి వచ్చిందని, వానిని చిన్నచూపు చూడకు. ధనవంతుడైనా, నిర్ధనుడైనా, అతడే నీకు దైవం' అంటు సీతని అక్కున చేర్చుకుని ఉపదేశించింది. అత్తగారి మాటలు సీత అర్ధం చేసుకుంది.

చేతులు జోడించి 'దేవీ, మీ మాటలు శిరసావహిస్తాను. భర్త ఎడల ఎలా ప్రవర్తించాలో, నా తల్లిదండ్రులు కూడా నాకు చెప్పారు. సామాన్య స్త్రీలలా నేను ప్రవర్తిస్తానని, మీరు అనుకోవద్దు. ఎపుడూ ధర్మము నతిక్రమించను. చంద్రుని వెంట వెన్నెలలా ఉండి నేను నా భర్తని సేవిస్తాను. అమ్మా, తంత్రులు లేకుండా వీణమ్రోగుతుందా? చక్రం లేకుండా రథం నడుస్తుందా?

అలాగే భర్తలేని స్త్రీకి సుఖశాంతులుండవు. వందమంది కుమారులున్నా, భర్తవున్నపుడే కదా ఆడదానికి గౌరవం? అంతేకాదు, తల్లీ తండ్రీ పుత్రికకి మితంగా ఖర్చుపెట్టారు. కొడుకులైనా తల్లికి మితంగానే ఇస్తారు. కాని ఒక్క భర్త మాత్రమే

స్త్రీకి, భార్యగా పొందిన నాటినించీ అమితంగా, ఆమె కోరినంతా ఇస్తాడు.

అటువంటి భర్తని ఏ స్త్రీ గౌరవించదు? పతియే ప్రత్యక్షదైవమని, నాకు తెలుసు, నేను నా భర్తని సర్వకాలాలందు గౌరవిస్తూ అనుసరించి వుంటాను. మీరు నిశ్చింతగా వుండండి' అంది సీత.

కోడలి మాటలు విన్న కౌసల్య హృదయం ఆనందంతో నిండిపోయింది. ఆనందబాష్పాలూ, దుఃఖాశ్రువులూ, కళ్ళవెంబడి ధారగా కారాయి. సీతని ప్రేమగా హృదయానికి హత్తుకుంది.

రాముడు, తల్లికి ప్రదక్షిణం చేసి, చేతులు జోడించి, అమ్మా, అంతదుఃఖమెందుకు? పధ్నాలుగేళ్ళూ ఇట్టే పూర్తి చేసివస్తాను. నాన్నగార్ని జాగ్రత్తగా చూసుకో' అని తల్లిని ఊరడించి, మిగతామూడువందల ఏభైమంది తల్లులకీ కూడా పాదాభివందనం చేసి, 'తల్లులారా, తెలిసీ - తెలియక మీ పట్ల ఏదైనా తప్పుచేసి వుంటే, మన్నించండి. మాకు సెలవిప్పించండి. ఇంకిపుడు మిమ్మల్నందర్నీ వదిలి వెళ్ళక తప్పదు.' అన్నాడు. వారంతా పెద్ద పెట్టున ఏడ్చారు.

నిన్నటిదాకా భేరీమృదంగ నినాదాలతో తాళవాద్యధ్వనులతో ప్రతిధ్వనించిన ఆ అంతఃపురం, ఇవాళ అంతఃపుర కాంతల ఏడుపులతో మారుమ్రోగింది. సీతారామలక్ష్మణులు దీనమైన వదనాలతో దశరథునికి ప్రదక్షిణం చేసి నమస్కరించారు. లక్ష్మణుడు, తల్లికి నమస్కరించి, ఆమె వంక చూశాడు. ఆమె కొడుకుని కౌగలించుకుని, గట్టిగా ఏడ్చింది. అతడ్ని ఆశీర్వదిస్తు ఇలా అంది. 'నాయనా, నిన్ను వనవాసానికి పంపటానికే కన్నానురా. తండ్రీ, నీ అన్నగారైన 'రాముణ్ణి మీ వదిన సీతనీ, కంటికి రెప్పలా కనిపెట్టి వుండు. వాళ్ళకే ప్రమాదం కలగకుండా చూసుకో. భాగ్యవంతుడైనా, భాగ్యహీనుడైనా, రాముడే నీకు దిక్కు. తమకంటె పెద్దవార్ని సేవించటం, మనవంశాచారం. రాముడ్ని నీ తండ్రిగా, సీతని నీ తల్లిగా, అరణ్యమే అయోధ్య అన్నట్టుగా, భావించి, వారికి సపర్యలు చెయ్యి. నీ అన్నగారు నీ కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంక వెళ్ళు' అంది. రథచోదకుడైన సుమంత్రుడు రామునితో,

'రాకుమారా, నీకు సమస్త శుభాలు కలగాలి. రథం సిద్ధంగా వుంది. మీరు అధిరోహిస్తే, మీరెక్కడికి తీసికెళ్ళమంటే, అక్కడికి తీసికెళ్ళటానికి నేను సిద్ధంగా వున్నాను. మీ వనవాసానికి ఈ రోజే మొదటి రోజు అవుతుంది' అన్నాడు.

వెంటనే సీతారామలక్ష్మణులు రథం ఎక్కారు. పధ్నాలుగు సంవత్సరాలకి సరిపడా ఆభూషణాలూ, మేలైన వస్త్రాలు రథంలో పెట్టించాడు, దశరథుడు.

రామలక్ష్మణులు, ఆయుధాలు, కవచాలూ, చర్మము వేసి కుట్టిన గంపా, తవ్వుగోలలూ, రథంలో పెట్టించారు.

సీతా, రాముడు, లక్ష్మణుడు రథంలో సర్దుకుని కూర్చున్నారు. సుమంత్రుడు పగ్గాలు సళ్ళించి గుఱ్ఱాలను అదిలించాడు. రథం కదిలి అయోధ్యా నగరపు వీధులగుండా సాగింది. రాముడు వనవాసానికి బయల్దేరాడన్న వార్త ఒక్కసారిగా అయోధ్యలో గుప్పుమంది. ఆవార్త విన్న పౌరులంతా మూర్ఛపోయారు.

సైనికుల కలవరపాటు తోటీ, ఏనుగుల ఘీంకారాలతోటీ, గుఱ్ఱపుడెక్కల చప్పుళ్ళతోటీ నగరమంతా మారుమ్రోగిపోయింది. నగరంలోని ఆబాలగోపాలం శోకంలో మునిగిపోయి, ఎండాకాలంలో దప్పిక గొన్నవాళ్ళు మంచినీటి కోసం పరిగెత్తినట్లు ఆ రథం వెనకాతల పరిగెత్తారు. కన్నీరు కారుస్తు వారంతా రథాన్ని చుట్టుముట్టారు. 'సుమంత్రా, రథాన్ని మెల్లిగా పోనియ్యవయ్యా. మా రాముని ముద్దు ముఖం మళ్ళీ ఎన్నాళ్ళకి చూస్తామో. ఒక్కసారి తనివితీరా చూసుకోనీ' అంటూ కేకలు పెట్టారు.

కొంతమంది 'అయ్యో దేవతామూర్తిలాంటి రాకుమారుడు మా రాముడు. అడవుల పాలైపోతున్నాడు కదా' అని అంగలారుస్తూ, కౌసల్యాదేవి గుండెలు బ్రద్దలు కాలేదా? ఆమె గుండెని రాయి చేసుకుందా అని ఆశ్చర్యపోయారు. 'ఆహా సీతమ్మ ఎంత గొప్ప ఇల్లాలు! మేరు పర్వతాన్ని సూర్యకాంతిలా, భర్తని నీడలా వెన్నంటి వెళ్తోంది. ధర్మమార్గాన్ననుసరిస్తున్న జానకి ధన్యురాలు' అంటు మెచ్చుకున్నారు. ఇంకొంతమంది 'లక్ష్మణా, ఎంతభాగ్యశాలివయ్యా, దైవస్వరూపుడైన నీ అన్నగార్ని సేవిస్తూ వెళ్తున్నావు, ఎంతధన్యుడవోకదా' అని లక్ష్మణున్ని పొగిడారు. సౌమిత్రీ ఇదె నీకు గొప్ప సిద్ధార్థము. ఇదె నీకు మహా అభ్యుదయం. ఈ విధంగా నువ్వు అన్నావదినలను అనుసరించటమే, నీకు అభ్యుదయం. స్వర్గప్రాప్తికి మార్గం కూడా. అంటు వేనోళ్ళ మెచ్చుకున్నారు.

అలా అనుకుంటూ రథాన్ననుసరించి వెళ్తూ పెద్దపెట్టున ఏడవసాగారు.

రథం బయల్దేరి అంతఃపురం దాటి వెళ్ళగానే దశరథ మహారాజు ఖిన్నుడై తనచుట్టు వున్న అంతఃపుర కాంతల మధ్యనించి లేచి ఒక్కసారిగా నిలబడ్డాడు. 'నా ప్రియపుత్రుణ్ణి ఒక్కసారి చూడాలి' అంటూ భవనంలోంచి బయటకి వచ్చాడు.

దీనంగా చూస్తూ గొలుసులతో బంధించిన మదపుటేనుగును చూసి, ఆడ ఏనుగు ఘీంకరించినట్లు కైకేయీ వచనబద్ధుడైన మహారాజుని చూసి, అంతః పుర స్త్రీలు గొల్లుమన్నారు.

ఒకవైపు పుత్రవాత్సల్యము, ఇంకోవైపు తన ధర్మము, రెండింటి మధ్యనా నలిగిపోతున్న మహారాజు, రాహుగ్రస్తమైన చంద్రబింబంలా తేజోవిహీనుడయ్యాడు.

తండ్రి భవనం దాటి రావటం చూసి, రాముడు,సుమంత్రుణ్ణి 'త్వరగా పోనియ్యి' అని తొందరపెట్టాడు. కాని వారి వెంట వెళ్తున్న పౌరులు మాత్రం, మెల్లిగా పోనియ్యవయ్యా అని అర్థిస్తున్నారు. సుమంత్రుడికి ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు. కన్నీరు వరదలై కాలువలు కట్టినట్లు పెద్ద ప్రవాహంలా పౌరులు రథం వెంట నడుస్తున్నారు. ఈ విధంగా పురజనులంతా దుఃఖిస్తూ వుంటే, ఇంతమంది దుఃఖానికి కారణం తనేకదా అని, కృంగిపోయి మొదలు నరికిన మహావృక్షంలా దశరథ మహారాజు నేలమీద పడిపోయాడు. మహారాజు అలాపడిపోవటం చూసి ప్రజలంతా హాహాకారాలు చేశారు.

అంతఃపుర స్త్రీలు కొంతమంది 'అయ్యో రామా, అనీ, మరికొందరు అయ్యో కౌసల్యా అని ఆక్రోశించారు. ఆ ఆక్రోశాలు విని రాముడు రథం లోంచి తలతిప్పి వెనక్కి చూశాడు.

దశరథ మహారాజు, కౌసల్యా, రథం వెనక పడి పరిగెత్తి వస్తున్నారు. అదిచూసి సహించలేక రాముడు విషణ్ణ వదనంతో, బలవంతంగా తన చూపులు మరల్చుకున్నాడు. 'అయ్యో! హతవిధీ, ఏనాడూ నేలమీద కాలుమోపి ఎరగని తన తల్లి దండ్రులు, ఈ రోజు ఇలా రాచవీధిలో కాలినడకన వస్తున్నారు. దుఃఖమంటే ఏమిటో తెలియని 'వారు' ఇపుడు కంటికీ, మంటికీ ఏకధారగా శోకిస్తున్నారు. రాముని సున్నితమైన హృదయం ద్రవించిపోయింది. కౌసల్యాదేవి లేగదూడవెంట పరిగెత్తి వస్తున్న ఆవులా రామభద్రా - సీతా - లక్ష్మణా అని కేకలు వేస్తూ ఏడుస్తూ రథం వెనక పరిగెడ్తోంది. సుమంత్రా రథం ఆపు' అని దశరథ మహారాజు బిగ్గరగా అరుస్తున్నాడు. 'ఆగొద్దు - తొందరగా పోనీ' అని రాముడు తొందరపెట్టున్నాడు. సుమంత్రుడి పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా అయింది. సుమంత్రుని అవస్థ, రాముడు గమనించాడు.

'సుమంత్రా, నా తల్లిదండ్రుల బాధ చూసి, నేను సహించలేకపోతున్నాను. రథాన్ని తొందరగా పోనీ. ఒకవేళ తర్వాత నాన్నగారు, రథం ఆపకుండా ఎందుకు తీసికెళ్ళావని, నిలదీస్తే, మీ మాటలు నాకు వినిపించలేదని చెప్పు' అని రహస్యంగా అతడితో అన్నాడు.

సుమంత్రుడు సరే, అని రథాన్ని చుట్టుముట్టి వస్తున్న ప్రజావాహినిని చూసి, 'ఇంక మమ్మల్ని వెళ్ళనివ్వండి. దయచేసి అడ్డురాకండి' అన్నాడు. చేసేది లేక

పౌరులు, రాముడికి నమస్కరించి, రథానికి ప్రదక్షిణం చేసి, వెనక్కి మరలిపోయారు. సుమంత్రుడు గుఱ్ఱాన్ని గట్టిగా అదిలించాడు. దశరథ మహారాజు చేసేదిలేక, కలత చెందిన మనస్సుతో నిలబడిపోయాడు. అపుడు వెంటవస్తున్న మంత్రులు, 'మహారాజా, మనం ప్రయాణమై వెళ్ళే వారి మేలు కోరితే, ఇంతకన్నా దూరం వెళ్ళకూడదు. రాముడు క్షేమంగా తిరిగి రావాలంటె, మీరు వెనక్కి మళ్ళండి' అని చెప్పారు.,

దశరథునికి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. మనస్సంతా విషాదభరితమై పోయింది. రాముడు వెళ్ళిన వైపే అలా చూస్తూ ఉండిపోయాడు. రాముడు తన తల్లులందరికీ పాదాభివందనం చేస్తున్న దృశ్యం వారికి గుర్తువచ్చింది. దుఃఖం ఆగలేదు.

'అయ్యో! అనాథరక్షకుడైన నా రాముడు వెళ్ళిపోయాడా? ఎవరైనా తనమీద కోపించినా ఏమీ అనేవాడు కాదె, పైగా వారిని సముదాయించి, శాంతపరిచెవాడె, అందరి బాధలు తన బాధలుగా తలచెవాడె, అలాంటి మహనీయుడిప్పుడెక్కడికి వెళ్ళాడు? తన కన్నతల్లియైన కౌసల్యతో సమానంగా అందర్నీ చూసెవాడే, మహారాజుగారు అటువంటి రాముడ్ని కైకేయి చేత వంచించబడి, అడవులకి పంపివేసి, మా రక్షకుడ్ని మాకు దూరం చేశారు. ఆహా ఈ రాజెంతమతిలేనివాడో కదా. లోకానికంతటికీ ప్రియమైనవానిని, ధర్మమూర్తిని, సత్యవ్రతుణ్ణి, రాముడ్ని అడవులకి పంపేశారే. ఇంతకన్నా దారుణమింకోటి వుందా?' అంటు దశరథుని వెంట అతడి మూడువందల యాభైమంది భార్యలూ దూడని పోగొట్టుకున్న ఆవుల్లా విలపించసాగారు. ఎవరిమట్టుకువారే రాముడ్ని తల్చుకుని కన్నీరు కార్చారు. ఆ మాటలన్నీ దశరథుని చెవినిపడ్డాయి. అసలే పుత్రశోకంతో కుమిలిపోతున్న ఆయన, మరింత కృంగిపోయాడు. రథం చాలా దూరం వెళ్ళి కనుచూపుమేర దాటేవరకు వారంతా అలాగే నిలబడ్డారు. కన్నులు నులుముకుని మళ్ళీ మళ్ళీ అటే చూస్తున్నారు. దశరథుడు తేరబారి చూశాడు. ఒక్కసారి కన్నకొడుకుని కళ్ళారా చూడాలని, ఆ పితృహృదయం, తల్లడిల్లిపోయింది. రథం లేపిన ధూళి కూడా మటుమాయటం కావటంతో దశరథుడు ఆవేదన పట్టలేక, తీవ్రంగా దుఃఖిస్తూ, నేలమీద పడిపోయాడు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళిపోయాడన్న వార్త కార్చిచ్చులా నగరమంతా వ్యాపించింది.

ప్రజలంతా దుఃఖసాగరంలో మునిగిపోయారు. అగ్నిహోత్రాలు కాని, యజ్ఞకర్మలు కాని, ఎవ్వరూ చెయ్యలేదు. ఊళ్ళో ఏ ఇంటిలోనూ వంటలు చేసుకోలేదు. సూర్యుడు కూడా మసకబారిపోయాడు. పశువులు గడ్డిమేయలేదు.

గోవులు దూడలకి పాలు కుడపలేదు. తొలి చూలు కుమారుల్ని కూడా తల్లులు చేరనివ్వలేదు.

గ్రహరాసులు గతులు తప్పి సంచరించాయి. నక్షత్రాలు కాంతివిహీనమై పోయాయి. అయోధ్య అంతా అతలాకుతలమైపోయింది. దిక్కులన్నీ అంధకార బంధురమయ్యాయి. శోకసంతప్తులైన ప్రజలు దశరథమహారాజుని నిందించ సాగారు. కౌసల్యాదేవి, నేలమీద పడివున్న మహారాజుని చూస్తూ, దుఃఖసాగరంలో మునిగివున్న అయోధ్యని చూస్తు అయోమయావస్థలో పడి ఏం చెయ్యాలో తోచక నిస్సహాయురాలైపోయింది. ఎలాగో గుండె చిక్కబట్టుకుని, మహారాజు కుడి భుజం పట్టుకుని లేవనెత్తింది. ఎడమ పక్కన కైకేయి ఆయన రెండో భుజం పట్టుకోబోయింది. అంతలో దశరథునికి తెలివి వచ్చి కైకేయిని చూసి కంపరంతో, దూరంగా జరుగుతు ఛీ - ఛీ పాపాత్మురాలా, నన్ను ముట్టుకోకు. నేను నిన్ను చూడను. నువ్వు నా భార్యవి కాదు. నువ్వే కాదు నీ తాలూకు మనుష్యులెవ్వరితో నాకు సంబంధం లేదు. ఎప్పుడైతే నువ్వు ధర్మం తప్పి నన్ను వంచించావో, ఆ క్షణంలోనే, నేను నిన్ను వదిలేశాను. అంతేకాదు. నువ్వుకోరినట్లు భరతుడు, అభిషిక్తుడైతే మాత్రం, వాడు నాకు శ్రాద్ధకర్మ ఆచరించి, ఇచ్చే తర్పణాలు, నాకే మాత్రం చేరవు' అంటు ఛీత్కారం చేసి, ఆమెని కసిరికొట్టాడు.

కౌసల్య దుఃఖంతో కుమిలిపోతు భర్తని పొదివి పట్టుకుని, భర్తవంటికి అంటిన ధూళి దులిపింది. దశరథుడు తాపంతో ఒణికిపోతున్నాడు. బ్రహ్మహత్య చేసినవాడిలా, నిప్పులు ముట్టుకున్నవాడిలా, రాముణ్ణి తల్చుకున్నకొద్దీ తాపం ఎక్కువైపోతోంది. మళ్ళీ మళ్ళీ రథం వెళ్ళిన వైపు చూస్తు రాముడ్ని తల్చుకుని ఏడుస్తు గ్రహణం పట్టిన సూర్యుడిలా అయిపోయాడు. అంతలో రాముడు పొలిమేరలు దాటినట్లు కబురు వచ్చింది. దశరథునికావార్త శరఘాతంలా తగిలింది. కుళ్ళి కుళ్ళి ఏడిచాడు.

'అయ్యో నా రాముడ్ని తీసికెళ్ళిన రథంతాలూకు చక్రం గుర్తులూ, గుఱ్ఱాల డెక్కల గుర్తులూ కనిపిస్తున్నాయి. కాని నా రాముడు మాత్రం కనిపించటం లేదు. వాడెంతో సుకుమారంగా పెరిగాడు. మెత్తటి పరుపులమీద, అత్తరు చల్లి తెల్లని మల్లెపువ్వులాంటి పక్కపరచి, ఇరువైపులా సుందరాంగులు వ్యజనాలు వీస్తూండగా, నా కుమారుడు, సుఖంగా నిద్రపోయెవాడే, అటువంటి భోగి ఇప్పట్నించీ, ఏ చెట్టుకిందో, ఒక కొయ్యనో, బండనో తలకింద పెట్టుకుని, మట్టి నేలమీద పడుకోవలసిన దుస్థితి కలిగిందే. ఒళ్ళంతా దుమ్ము పులుముకుని, నిద్రలేచే నా తండ్రి, లోకనాథుడైన నా రాముడు, అనాథుడిలా, అలా లేచినపుడు,

ఆజానుబాహులైన ఆ పురుషోత్తముని, చూసి వనాలలో నివసించే జనులంతా తరిస్తారు. జనకుని ఇంట అల్లారు ముద్దుగా పెరిగిన సీత, సుకుమారమైన పాదాలలో ముళ్ళు గుచ్చుకుంటు వుంటే, నడవలేక నడవలేక అడవులలో ఎలా తిరుగుతుందో కదా!

అడవులలో క్రూరమృగముల గర్జనలకి ఎంతెలా బెదిరిపోతుందో పాపం. ఎంతటి దౌర్భాగ్యస్థితి కల్పించాను. ఇదంతా నా మూలగానే జరిగింది. కైకా నీ కోరిక తీరింది. ఆ పురుషోత్తముడు లేకుండా అయోధ్యని పాలించాలన ఉబలాటపడ్డావు. రాజ్యకాంక్షతో వైధవ్యాన్ని కొని తెచ్చుకుంటున్నావు. నేనింక బతకను. వైధవ్యంతో ఆనందంగా ఈ రాజ్యాని ఏలుకో' అంటూ అనేక విధాల దుఃఖిస్తు తన పరివారంతో మళ్ళీ వెనకి తిరిగాడు. నగరంలో బాటలన్నీ జనసంచారం లేకుండా నిర్మానుష్యంగా వున్నాయి. దుకాణాలన్నీ మూసివేసి వున్నాయి. దేవతామందిరాలు కూడా మూసే వున్నాయి. నగరంలో ఎటుచూసినా విషాదచ్ఛాయలే గోచరిస్తున్నాయి. అందరూ రాముణ్ణే స్మరిస్తు విచార సాగరంలో మునిగి వున్నారు. ఆ పరిస్థితిలో అయోధ్యని చూసి దశరథుడికి దుఃఖం పొంగిపొర్లింది. ప్రాణంలేని బొమ్మలా దశరథుడు అంతఃపురంలో ప్రవేశించాడు. సీతారామలక్ష్మణులు లేని ఆ అంతఃపురం శూన్యంగా వుంది. దశరథుడికొక్కసారి గుండె బ్రద్దలైనట్లనిపించింది. గద్గద స్వరంతో ఇలా అన్నాడు.

'నేను ఇక్కడ వుండలేను. నన్ను కౌసల్యాదేవి మందిరానికి తీసికెళ్ళండి. నా మనస్సు ఇంకెక్కడా ఊరట లభించదు' అని దశరథుడనగానే పరిచారులు ఆయనని కౌసల్యామందిరానికి తీసికెళ్ళారు. ఆయనని శయ్యపై పడుకోబెట్టారు. కాని అక్కడమాత్రం మనశ్శాంతి ఎలా వుంటుంది? రాజభవనమంతా బోసిపోయినట్లుంది. రాముడ్ని మరువలేని ఆ మహారాజు రెండు చేతులతో ముఖం మూసుకుని, 'రామా, నన్ను వదిలివెళ్ళిపోయావా తండ్రీ' అంటూ పెద్దపెట్టున ఏడ్చాడు.

'అయ్యో! పధ్నాలుగేళ్ళు. అపుడు కదా రాముడు వనవాసం నుంచి తిరిగి వస్తాడు. రాముడు వనవాసం పూర్తిచేసుకుని మళ్ళీ అయోధ్యలో అడుగుపెట్టేవరకు జీవించి వుండి, తిరిగి వచ్చిన రాముణ్ణి కౌగలించుకుని, చూసి, ఆనందించే వాళ్ళే ధన్యులు కదా' అని ఆక్రోశించాడు. అంతలో రాత్రి అయింది. అది దశరథుని పట్ల కాళరాత్రి.

జాగరణ చేసి ఏడుస్తూ అర్ధరాత్రివేళ కౌసల్యతో ఇలా అన్నాడు. 'కౌసల్యా, నా చూపు రాముని వెంట వెళ్ళిపోయింది' ఇపుడు నాకు కళ్ళు కనిపించటం

లేదు. నువ్వెక్కడున్నావు? ఒక్కసారి నా చెయ్యి పట్టుకో అంటు లేచి తడుముకుంటు వస్తున్న భర్త చెయ్యి పట్టుకుని, మెల్లిగా పక్కమీద పడుకోబెట్టి, కౌసల్య భోరుమని ఏడ్చింది.

పుత్రశోకంతో కుమిలిపోతున్న కౌసల్య మహారాజు పక్కన కూర్చుని 'ప్రభూ, పురుషోత్తముడైన నా కుమారుని మీద విషం కక్కి, కైకేయి కుబుసం విడిచిన పాములా ఆనందిస్తోంది. రాముడ్ని అడవులకి పంపి తన పంతం నెగ్గించుకుంది. కాని ఆ పాము అంతటితో ఆగదు. అసలు రాముణ్ణి అడవులకి పంపే ఆలోచన ఎలా వచ్చిందో రాముడ్ని అడవులకి వెళ్ళమని కాకుండా, అయోధ్యలో వుండి ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తుకుని బతకమని కోరుకున్నా నా రాముడు నా కళ్ళముందె వుండేవాడు కదా. అందరికీ అన్నీ ఇవ్వగల సామర్థ్యం గల నా బిడ్డకి దానమిచ్చే దాతలు ధన్యులై వుండేవారు.

స్వామీ, పర్వదినం నాడు మహాయజ్ఞం చేసి యజమాని హవిర్భాగాన్ని దేవతలకు కాకుండా రాక్షసులకిచ్చినట్లు, మీరు యౌవరాజ్యాభిషిక్తుడు కావటానికి అర్హతవున్న మీ జ్యేష్ఠపుత్రుడు రాముడికివ్వవలసిన ఈ రాజ్యాన్ని మీ ఇష్టప్రకారం కైకేయి కిచ్చారు. మహాబాహువు, వీరుడూ అయిన మన రాముడు ఈ పాటికి సీతా లక్ష్మణులతో అడవుల్లో ప్రవేశించివుంటాడు. మీరు కైకేయి ఆజ్ఞకి దాసులయి కష్టాలంటే ఏమిటో ఎరుగని వాళ్ళని అడవులకి వెళ్ళగొట్టారే వాళ్ళక్కడ ఏం అవస్థలు పడుతున్నారో కదా.

తరుణ వయస్కులైన ఆ చిన్నారులు, రత్నాభరణాలకి నోచుకోలేకపోయినా, కనీస అవసరాలు కూడా లేకుండా, రాళ్ళు రప్పల మధ్య తిరుగుతూ, దీనులై కందమూలాలు తింటూ, ఎలా బతుకుతారో ఏమో.

నాకీక్షణంలోనే వాళ్ళని ముగ్గురినీ చూడాలని వుంది. ఆ మంగళకరమైన శుభఘడియ ఎపుడు వస్తుందో ఈ అయోధ్య మళ్ళీ పూర్వవైభవం ఎపుడు సంతరించుకుంటుందో, మొలలో ఖడ్గమూ, చేతుల్లో ధనుర్బాణాలూ, ధరించి, చెవులకి ధగధగా మెరిసే కుండలాలతో పర్వతశిఖరాల్లా దర్పంగా అడుగులు వేస్తూ నా కుమారులు మళ్ళీ సీతతో కలసి అయోధ్యలో అడుగుపెట్టటం నేనెపుడు చూస్తానో, ధర్మజ్ఞుడైన నా రాముడు అసలు ఈ దేశాన్ని పాలిస్తాడా? ఇదంతా నా పూర్వజన్మ కర్మఫలంగాకమరేమిటి? కిందటి జన్మలో నేను తల్లిపాదుగులో పాలుత్రాగే లేగదూడను ఆవునుంచి బలంగా లాగేసివుంటాను. అందుకే ఈనాడు నా బిడ్డకి దూరమయ్యాను.

ఒక్కగానొక్క కొడుకు. సర్వశాస్త్రవిశారదుడు. సద్గుణ సంపన్నుడు. అలాంటివాణ్ని ఈ కైక, సింహంలా బలవంతంగా నా నుండి దూరం చేసింది. నాకు పుట్టినవాడే ఒక్క కొడుకు. వాడు లేకుండా నేనెలా బతకగలను? నాకంతటి సామర్థ్యం లేదు. పుత్రశోకం నన్ను దహించివేస్తోంది' అంటూ కౌసల్య పరిపరివిధాలుగా దుఃఖించసాగింది. అపుడు అక్కడే వున్న సుమిత్ర ఇలా అంది.

'దేవీ, నీ కుమారుడు సాక్షాత్తు పురుషోత్తముడు. సద్గుణసంపన్నుడు. నిజమే కాని, అటువంటి మహనీయుని గురించి, ఇలా దీనురాలిలా విలపించటం ఉచితమేనా?

భుజబలసంపన్నుడైన, రాముడు, ఇలా రాజ్యం వదిలి వెళ్ళాడంటే, అందుకు కారణం తన తండ్రిని సత్యవాదిగా నిరూపించటానికే గదా. శిష్టాచార సంపన్నుడైన నీ బిడ్డ కేవలం ధర్మాచరణ నిమిత్తమే అడవులకి వెళ్ళాడు. అటువంటి వాడ్ని గురించి ఎప్పుడూ దుఃఖించకూడదు. రాముడి మీది అనురాగంతోనె కదా లక్ష్మణుడు కూడా వెళ్ళాడు. అరణ్యవాసంలోని కష్టాల గురించి తెలిసి కూడా భర్తని అనుసరించి వెళ్ళింది, జానకి. ఇలా ముగ్గురు కలసి సుఖభోగాలన్నీ వదిలిపెట్టి కేవలం కులగౌరవం నిలబెట్టడానికే అలా వెళ్ళారు.

సత్యమార్గంలో వెళ్తున్న రాముడి యశస్సు ముల్లోకాలలోనూ కీర్తి పతాకాలెగరేస్తుంది. ఆధర్మమూర్తిని సూర్యుడు తన కిరణాలతో తాపము కలగకుండా రక్షిస్తాడు. వాయుదేవుడు కూడా సమశీతోష్ణస్థితి కలిగేలా చరిస్తాడు. చంద్రుడు తన చల్లని కిరణాలతో ఆహ్లాదం కలిగిస్తాడు. రాముడు అమిత బలవంతుడు. వాని దగ్గర బ్రహ్మ ఇచ్చిన దివ్యాస్త్రాలున్నాయి. అటువంటి వాడికి అడవులలో భయం ఏమిటమ్మా? హాయిగా స్వంత ఇంటిలో వున్నట్లుంటాడు. కనక రాముడి గురించి గాని, అతడివెంట వెళ్ళిన సీతా లక్ష్మణులగురించి గాని మనమేం భయపడక్కర్లేదు. దిగులు పడక్కర్లేదు.

రాముడు పరాక్రమవంతుడు. శ్రీకరుడు. కల్యాణ రూపసంపన్నుడు. సత్వగుణంతో ప్రకాశించేవాడు. ఈ భూమండలాన్నంతటినీ శాసించగల ధీరుడు. అరణ్యవాసం నుంచి తిరిగి వచ్చి తప్పక తన రాజ్యాన్ని ఏలుకుంటాడు. అతడు సూర్యునికన్నా తేజశ్శాలి. అగ్ని కన్నా తీక్షణమైనవాడు. ప్రభువులకి ప్రభువు. శ్రీదేవికి సంపత్కరుడు. కీర్తికె ప్రతిష్ఠ కలిగించేవాడు. దేవతలకి దేముడు. భూతగణాలకి అధిపతి. అతనిలో వంకపెట్టు గలవారెవ్వరూ లేరు. కనక నీకే దిగులూ వద్దు. సీతాసమేతుడై రాముడు సుఖంగా తిరగి వస్తాడు. పట్టాభిషిక్తుడై రాజ్యలక్ష్మిని చేపట్టాడు.

నారచీరలు కట్టి రాముడు వనవాసానికెళ్ళాడని అయోధ్యప్రజలు దుఃఖిస్తున్నారు కాని, నిజానికి సీతరూపంలో రాజ్యలక్ష్మి అతడ్ని వెన్నంటి వెళ్ళింది. ధనుర్బాణాలు ధరించి నా బిడ్డ అతడికి అంగరక్షకుడుగా వెళ్ళాడు. ఇంక రాముడు సాధించలేనిదేం వుంది?

దేవీ దుఃఖం ఓర్చుకో. నీ బిడ్డ శీఘ్రమే తిరిగివస్తాడు. నేను నిజం చెప్తున్నాను తల్లీ. వారు ముగ్గురూ సఫలమనోరథులై తిరిగివచ్చి నీకు పాదాభివందనం చేసి నీ మనస్సు కానందం కలిగిస్తారు.

నువ్విలా దుఃఖించటం రాముడికి మేలు కాదు. అందరికీ ధైర్యం చెప్పవలసిన దానివి, నువ్వే ఇలా మనస్తాపం పొందితే ఎలా?' అంటూ సుమిత్ర కౌసల్యకి ఎన్నోవిధాల ఓదార్పు మాటలు చెప్పింది. అప్పటికి కౌసల్యకి కాస్త ఊరట కలిగింది.

ఇక్కడ రాచనగరులో పరిస్థితి ఇలా వుండగా, అక్కడ సుమంత్రుడు రథాన్ని అయోధ్య పొలిమేరలు దాటి నడిపిస్తున్నాడు. కొంతమంది అయోధ్యావాసులు రాముడితో కూడా వనవాసం చెయ్యాలని నిశ్చయించుకుని రథం వెంట వెళ్ళసాగారు. 'రామా, ఆగవయ్యా వెళ్ళకు' అని అరుస్తు రథం వెంట పరుగులు తీస్తున్నారు. వారికి రాముడంటే వల్లమాలిన ప్రేమ. కాని రాముడు వారిని వారిస్తూ వారివంక ఆప్యాయంగా చూస్తూ 'అయోధ్యావాసులారా, మీకు నా మీద వున్న ప్రేమ, అభిమానం అవన్నీ నా తమ్ముడైన భరతుని మీద చూపించండి. అతడు కూడా చాలా సద్గుణ సంపన్నుడు. మిమ్మల్నెంతో ప్రేమగా ఆదరిస్తాడు. వయస్సులో చిన్నవాడైనా శౌర్యపరాక్రమాలు గలవాడు. వయస్సులో చిన్నవాడైనా విజ్ఞాన సంపన్నుడు. సున్నితమైన మనస్సు గలవాడైనా శౌర్యపరాక్రమాలు గలవాడు. మీకందరికీ భయంపోగొట్టి మీ అభిమానం పొందగల ఏలిక అవుతాడు. నిజంగా మీకు నా మీద అభిమానముంటే, వెంటనే వెనక్కివెళ్ళి నేను వనవాసానికి వెళ్ళాననే బాధ మహారాజుకి కలగకుండా చూడండి' అంటూ పౌరుల్ని అర్థించాడు దీనంగా.

కాని రాముడలా అన్నకొద్దీ వారు రామునిమీద మమకారం చంపుకోలేక, తల్లడిల్లిపోతూ, దీనదృష్టులతో కన్నీరు కారుస్తూ 'రాముడే మా ప్రభువు కావాలి' అంటు వెన్నంటి వెళ్ళసాగారు. వారిలో వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు, తాపసులు వున్నారు. వారంతా వేదపండితులైన బ్రాహ్మణులు వృద్ధాప్యం చేత తలలు పండి, చేతులు ఒణుకుతుండగా దూరాన్నించే, ఆయాసపడుతూ ఇలా అన్నారు.

ఓ రథాశ్వములారా, ఆగండి, వెళ్ళకండి, ప్రభువులకి మేలు చెయ్యండి. గుఱ్ఱాలకి వినికిడి శక్తి ఎక్కువంటారు కదా. మా ప్రార్థన విని రథాన్ని వెనక్కి తీసుకురండి.

రాముడు ధర్మాత్ముడు. పవిత్రమైన మనస్సు గలవాడు. వీరుడు ధృఢమైన ఆలోచన గలవాడు. అటువంటివాడు అయోధ్యలో వుండాలి కాని వనాలకి వెళ్ళటం సబబు కాదు' అంటు వారు రథం వెనుక ఆయాసపడుతూ పరిగెత్తటం చూసి, పెద్దలయందు గౌరవం గలవాడవటం చేత రాముడు సహించలేక సీతా లక్ష్మణులతో కలసి రథం దిగి, కాలినడకన మెల్లగా నడిచి వెళ్ళసాగాడు. ఎందుకంటే తాను వెనక్కి తిరిగి వెళ్ళి వారిని కలిస్తే తనకి వ్రతభంగమవుతుంది. తను మెల్లిగా నడిస్తే వారే వచ్చి తనని కలుస్తారనే భావంతో నడిచి వెళ్తున్నాడు.

రాముడలా పాదచారియై వెళ్ళటం చూసి వారికి మనస్తాపం కలగింది. అపుడా వృద్ధులు రామునితో 'రామా, అయోధ్యలోని బ్రాహ్మణులమంతా నీ వెంట వస్తున్నాము. అగ్నిహోత్రం కోసం సమిధలు, కట్టెలు, భుజాన వేసుకుని వస్తున్నాం. ఈ శ్వేతఛత్రాలు మాకు వాజపేయ యాగాలలో లభించాయి. మేము నీ వెంట వచ్చి నువ్వు అడవులలో సంచరించేటపుడు, నీకు ఎండ తగలకుండా ఈ గొడుగులు నీకు పట్టి నీ వెంట నడుస్తాము.

కుమారా, మాకు ఉన్న ధనమల్లా వేదాలు. వనవాసానికి వెళ్తున్న నీ మేలు కోరి వేదమంత్రపఠనం చేస్తాము. మా భార్యల్ని ఇంటి దగ్గరే వుంచి నీ వెంట వస్తున్నాము. యజ్ఞయాగాది అనుష్ఠానాలు వదిలి నీ వెంట వస్తున్నాము. నువ్వు వెనక్కి తిరిగి వచ్చినపుడే మా అనుష్ఠానాలు జరుగుతాయి. చరాచర జగత్తు సాక్షిగా తలలు వంచి నిన్ను అర్థిస్తున్నాము. మమ్మల్ని అనుగ్రహించి వెనక్కి తిరిగిరా. అని ప్రాథేయపడ్తూ వారు రాముని వెంట నడవసాగారు.

వారి మాటలు రామునికి వినిపించాయి. కాని వారికి జవాబు చెప్పగలిగే స్థితిలో రాముడు లేడు. ఇటువంటి విషమ పరిస్థితిలో రాముడుండగా వారిదారికడ్డంగా తమసానది వచ్చింది. రాముడి ప్రయాణాన్ని అడ్డగిస్తుందా అన్నట్లున్న ఆ నదీ తీరంలో సుమంత్రుడు రథాన్ని ఆపాడు. గుఱ్ఱాలను విప్పాడు. తమసానదిలో వాటికి నీళ్ళు త్రాగించాడు.

చాలా దూరం ప్రయాణం చెయ్యటం వల్ల అలసిపోయిన ఆ గుఱ్ఱాలు నేలమీద పడి అటూ ఇటూ పార్లి సేదతీర్చుకుని చల్లని నీరు త్రాగి నెమ్మదిపొందాయి. అపుడు సుమంత్రుడు వాటికి ఆ నదీ జలాలతో స్నానం చేయించాడు. ఆ తర్వాత నదీతీరంలో వాటిని స్వేచ్ఛగా తిరగటానికి వదిలేశాడు.

ఆ నదీతీరం చాలా అందంగా వుంది. రాముడు, సీత, లక్ష్మణుడు రథం దిగి నదీతీరం వెంబడి పచార్లు చేస్తూ ఆ చల్లని గాలులకి మైమరచిపోయి సేదదీరారు.

రాముడు సీత వంక ఓరకంట చూస్తూ లక్ష్మణుడితో భావగర్భితంగా ఇలా అన్నాడు.

'సౌమిత్రీ, ఈ సంధ్యా సమయానికి మనం వన ప్రాంతం చేరుకున్నాం. ఇప్పట్నించీ వనవాసం గురించిన భయాలేవీ మనస్సులోకి రానీయకూడదు. ఇపుడు రాత్రి కాబోతోంది. కనక ఈ అడవి శూన్యంగా వుంది. వన్య మృగాలూ, పక్షులూ, వాటి వాటి స్థావరాలకి వెళ్ళిపోయాయి. అవి అక్కడ చేస్తున్న రొదలవల్ల ఈ అడవి కూడా ఏడుస్తున్నట్లుంది. అయోధ్యలో నాన్నగారూ, అక్కడి ప్రజలు మన గురించే ఆలోచిస్తూ దుఃఖిస్తూ వుంటారు.

మన అయోధ్య పౌరులకు నాన్నగారన్నా మన నల్గురు అన్నదమ్ములం అన్నా, చెప్పలేనంత అభిమానం. మా అమ్మనీ, మన తండ్రినీ తల్చుకుంటే నాకు దుఃఖం ఆగటంలేదు. వాళ్ళిద్దరూ మన కోసం ఏడ్చి ఏడ్చి గుడ్డివాళ్ళైపోయారేమో అనిపిస్తోంది. కాని ధర్మాత్ముడైన భరతుడు వారి కలాంటి పరిస్థితి కలగకుండా కాపాడతాడన్న నమ్మకమూ వుంది. లక్ష్మణా, భరతుడి ఔదార్యం తల్చుకుంటుంటే మనం మన అమ్మ నాన్నల గురించి దిగులు పడనవసరం లేదేమో అనిపిస్తోంది. నువ్వు నా వెంట వచ్చి నాకు చాలా మేలుచేశావు. లేకపోతే నేను సీతని ఒంటరిగా వదిలి ఆహారం కోసం అడవులలో వెతుక్కుంటుంటే సీతకి రక్షణ కోసం వేరెవర్నైనా వెతుక్కోవలసి వచ్చేది. ఇక్కడ క్రూరమృగాలు, రాక్షసుల బెడద ఎక్కువ. నువ్వున్నావు కనక ఆ చింత ఇంకలేదు. లక్ష్మణా, ఈ రాత్రికి మనం ఈ తమసానదీ తీరాన విశ్రమించి ఉపవాసం చేద్దాం. ఇక్కడ అడవులలో ప్రయత్నిస్తే ఆహారం దొరక్కపోదు. కాని నాకెందుకో మనం ఉపవాసం చేస్తేనే మంచిదనిపిస్తోంది' అని లక్ష్మణునితో అన్నాక, సుమంత్రునితో

'ఆర్యా, మీరు మాత్రం గుఱ్ఱాలని కనిపెట్టి వుండండి' అన్నాడు.

సూర్యాస్తమయం కాగానే సుమంత్రుడు గుఱ్ఱాల్ని కట్టేసి వాటికి మేత వేశాడు. తర్వాత సంధ్యానుష్ఠానం ముగించి, రామలక్ష్మణుల దగ్గరకొచ్చాడు. లక్ష్మణుడు చుట్టుప్రక్కల చెట్ల క్రింద రాలిన ఆకులు పోగుచేసి పరిచి, వాటిమీద మెత్తటి గడ్డి కప్పి చక్కటి శయ్య తయారుచేశాడు.

ఆ పక్కని చూసి రాముడు తమ్ముణ్ణి చాలా మెచ్చుకున్నాడు. సీతతో కలసి ఆ శయ్యమీద పడుకుని నిద్రపోయాడు. సీతారాములు హాయిగా నిద్రపోవటం లక్ష్మణుడు చూశాడు. తాను మాత్రం నిద్రపోకుండా సుమంత్రుడి దగ్గర కూర్చున్నాడు. వాళ్ళిద్దరు రాముడి సద్గుణాలు గురించి చర్చించుకున్నారు.

కబుర్లు చెప్పుకుంటూ జాగరణ చేశారు. అంతలో తెల్లారింది. సుమంత్రుడు లక్ష్మణుడు సూర్యోదయం కాబోతున్న సంగతి గమనించలేదు. కాని తమసానదీ తీరాన ఆవులు సంచరిస్తున్న చప్పుళ్ళు వినవచ్చాయి. ఆ చప్పుడికి రాముడికి మెలకువ వచ్చింది. రాముడు లేచిరావటం వారు చూశారు.

రాముడు నదీతీరంలో అస్తవ్యస్తంగా పడుకుని గాఢనిద్రలో వున్న పౌరుల్ని చూపిస్తూ లక్ష్మణుడితో 'తమ్ముడూ, మనమీద మమకారంతో వీరు ఇల్లూ వాకిళ్ళు వదిలి వచ్చి ఎలా పడుకున్నారో చూశావా! వీరంతా మనల్ని ఎలాగైనా అయోధ్యకి మళ్ళించాలని పట్టుదలతో వున్నారు. కనక వీళ్ళిలా నిద్రలో వుండగానే మనం గుట్టు చప్పుడు కాకుండా వెళ్ళిపోవటం మంచిది. వీళ్ళు లేచారంటే మనల్ని వదిలిపెట్టరు. రాజకుమారులు ప్రజలకి ఆనందం కలిగించాలి కాని దుఃఖం కలిగించకూడదు. మన మూలంగా వారికి దుఃఖం కలగకూడదు' అన్నాడు. ఆ మాటలు లక్ష్మణుడికి నచ్చాయి. సరే అన్నాడు. రాముడు సుమంత్రుణ్ణి పిలిచి రథం సిద్ధం చెయ్యమన్నాడు.

'సుమంత్రా, మనం తక్షణం అడవులలోకి వెళ్ళిపోవాలి. బయల్దేరు' అన్నాడు. వెంటనే సుమంత్రడు రథం సిద్ధం చేశాడు. సీతారామలక్ష్మణులు రథం ఎక్కారు. తమసానదిని అడ్డదారిన దాటించి అవతల ఒడ్డుకి రథం చేర్చాడు సుమంత్రుడు.

రాముడు సుమంత్రుడితో 'సారథీ ఇక్కడ మేము నిలబడి వుంటాము. నువ్వు ప్రజల్ని మభ్యపెట్టటానికి, ఈ రథాన్ని వచ్చిన దారినే వెనక్కితీసుకెళ్ళి, అక్కడ్నుంచి ఇంకోదారిలో వచ్చి మమ్మల్ని కల్సుకో. జాగ్రత్త. మన జాడ ఎంత మాత్రం పౌరులకి తెలియకూడదు. గుఱ్ఱపుడెక్కలజాడలు వాళ్ళు పోల్చుకోలేకుండా తగిన జాగ్రత్తలు తీసుకో' అని చెప్పాడు.

సుమంత్రుడలాగే చేసి వేరొకదారిలో వచ్చి వాళ్ళని కలుసుకున్నాడు. అక్కడ రథం కోసం సీతారామలక్ష్మణులు వేచివున్నారు. రథం రాగానే మళ్ళీ వారు ఎక్కారు. సుమంత్రుడు వారికి శుభం కలగాలని, ఉత్తరదిక్కుగా రథంతోలి తపోవనాల వైపు పోనిచ్చాడు.

మెల్లగా తెల్లారింది. తమసానదీ తీరంలో నిద్రపోతున్న పౌరులు నిద్రలేచారు. అక్కడ వారికి రథం కాని, రామలక్ష్మణులు, సీత కాని కనిపించలేదు. శోకార్తులై కన్నీటితో పరికించి చూశారు. రాముని జాడ తెలియలేదు. వారి ముఖాలలో విషాదం అలముకుంది. దీనంగా దుఃఖిస్తూ ఇలా అనుకున్నారు. 'ఛీ - ఛీ' పాడు నిద్ర మైమరచి నిద్రపోయాం. శ్రీరాముడెటు వెళ్ళాడో తెలుసుకోలేకపోయాం.

ఆశ్రితవత్సలుడైన ఆ పురుషోత్తముడు, మనల్ని వదిలిపెట్టి ఎలా వెళ్ళిపోయాడు? కన్నతండ్రిలా, కడుపున పుట్టిన బిడ్డల్లా తన ప్రజల్ని ఆదరించే ఆ మహనీయుడు, ఇపుడు మనల్ని వదిలి అడవులలోకి ఎలా వెళ్ళగలిగాడు? మనం ఇక్కడే ప్రాయోపవేశం చేద్దాం. రాముడు లేని మన జీవితాలెందుకు? ఇక్కడున్న ఎండు కట్టెలు రగల్చి ఆ అగ్నిలో పడి ఆహుతి అయిపోదాం. లేకపోతే మనం వెనక్కివెళ్ళి మన ప్రియదర్శనుడైన రాముడు రాలేదని ఎలా చెప్పగలం? ఎలాగైనా రాముడికి నచ్చజెప్పి అయోధ్యకి తీసుకొస్తామని, మన వాళ్ళతో నమ్మబలికి వచ్చాం.

ఇపుడు మనం మాత్రం వెళ్ళి మన ముఖం వారికెలా చూపగలం? అని అనేకవిధాల విలపించారు. రథం చక్రాల గుర్తులు గుఱ్ఱపుడెక్కల జాడలూ చూస్తూ కొంతదూరం వెళ్ళారు. కాని అవి కూడా సరిగ్గా దారి తెలిసేటట్లు లేక వెనక్కి, ముందుకి, పక్కకి అస్తవ్యస్తంగా వున్నాయి. దైవోపహతుల మయ్యామని రోదించారు. అలా చాలాసేపు ఏడ్చి చేసేదిలేక తిరిగి అయోధ్యకి వెళ్ళిపోయారు.

కళావిహీనమైన అయోధ్యని చూడగానే వాళ్ళ కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. గుండెలనిండా బరువు నిండి బాధా సంతప్త హృదయాలతో ఇళ్ళకి చేరారు. కాని ఇంటిలోని వారు కూడా అదే అవస్థలో వుండటం వల్ల వారి రాకనెవ్వరూ గమనించలేదు.

గమనించాక వారి భార్యలు రాముడ్ని వెనక్కి తీసుకొస్తామని దంభాలు పలికి వెళ్ళారు. సిగ్గులేక ఒక్కళ్ళే వెనక్కి వచ్చారా అని నిందించారు. రాముడి గుణగణాలు తల్చుకుని తల్చుకుని ఏడ్చారు. కైకనీ ఆమె వలలో చిక్కిన మహారాజునీ నిందించారు. తమ దౌర్భాగ్యాన్ని నిందించుకున్నారు. ఆత్మీయుని కోల్పోయిన వాళ్ళల్లా అంతుదరీ లేని దుఃఖంలో మునిగిపోయారు. కనీసం వంటచేసి భర్తకీ, పిల్లలకీ పెట్టాలనే ఆలోచన కూడా లేకుండా రాత్రి అయిందాకా, అలా తల్చుకుని తల్చుకుని ఏడుస్తూనే వున్నారు.

అయోధ్యలో స్థితి ఇలా వుండగా, ఆరోజంతా ప్రయాణం చేసి రామలక్ష్మణులు సీత సుమంత్రుని రథంలో చాలా దూరం వెళ్ళిపోయారు. దారిపొడుగునా రమణీయమైన దృశ్యాలూ, వికసించిన పూలగుత్తులతో నిండిన వృక్షాలు, దుక్కిదున్నిన పంటచేలూ చూస్తూ గ్రామసీమల సరిహద్దుల వెంట ప్రయాణం సాగించారు. గ్రామాలలోని ప్రజలు వారిని చూసి 'ఛీ-ఛీ' మహారాజెంత తెలివితక్కువవాడు, స్త్రీ వ్యామోహంలో పడి ఎంతో ఘోరం చేశాడు. ఆ కైకేయి ఎంత దుర్మార్గురాలు, పాపిష్ఠి ఆడది. మర్యాదహీనురాలు, ఇంతటి మహనీయుడైన కుమారుని, ధర్మాత్ముని, అడవులకి వెళ్ళగొట్టిందే. జితేంద్రియుడు, పరమధార్మికుడు

అయిన రాముడు ఖిన్నుడై అడవులకి వెళ్తుంటే అతి సుకుమారి, సుందరి, సీత అతడి ననుసరించి తనూ వచ్చింది. రాజభోగాలలో సుఖ సంతోషాలలో తేలియాడిన ఆ పుణ్యాత్మురాలు ఈ వనవాస కష్టాలు సహించగలదా? దశరథ మహారాజెంత దయమాలినవాడు! ప్రియమైన జ్యేష్ఠపుత్రుని, ప్రజలంతా ఇష్టపడేవాడ్ని ఏ తప్పులేకుండానే ఇలా పరిత్యజించి, అడవులకి పంపటానికి సిద్ధపడ్డాడె, ఇంత ప్రేమలేని తండ్రులు కూడా వుంటారా?' అని, పలురకాలుగా గ్రామప్రజలు వారిలో వారు మాట్లాడుకోవటం రాముడు విన్నాడు కాని అవేం పట్టించుకోకుండా నిర్వికారంగా సాగిపోయాడు. కొంతదూరం వెళ్ళాక నిర్మల జలాలతో కూడిన 'వేదశ్రుతి' అనే నది వచ్చింది. ఆ నది దాటి దక్షిణదిశగా వెళ్ళారు. అలా వెళ్ళగా వెళ్ళగా 'గోమతీ నది' వచ్చింది. అది కూడా దాటి వెళ్ళాక 'స్యందిక' అనే నది వచ్చింది. అక్కడ నెమళ్ళు పురివిప్పి ఆడుతున్నాయి.

ఆ నదిలో హంసలు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. అది కోసల దేశానికి సరిహద్దు. మనువు ఇక్ష్వాకుమహారాజుకి పట్టం కట్టిన భూభాగమిది. ఎన్నెన్నో రాష్ట్రాలతో కూడిన ఆ భూభాగాన్ని సీతకి చూపిస్తు, దాని వృత్తాంతమంతా వివరించి చెప్పాడు రాముడు. కోసలరాజ్యపు సరిహద్దు దాటగానే రాముని మనస్సు వికలమైపోయింది. మెల్లని స్వరంతో సుమంత్రునితో ఇలా అన్నాడు.

'సూతా, మళ్ళీ ఎన్నాళ్ళకి నేను తిరిగి వచ్చి సరయూ తీరపు అడవుల్లో వేటాడుతానో కదా. మళ్ళీ ఎన్నాళ్ళకి నా తల్లిదండ్రులతో కలసి ఆనందంగా వుంటానో కదా. అమ్మా నాన్నలతో కలసి సరయూ తీరపు అడవులలో విహరించటంలో ఎంత ఆనందం వుంది' అంటూ తన ఆవేదన అతడికి వ్యక్తం చేశాడు. ఆ తర్వాత అయోధ్యవైపు తిరిగి, చేతులు జోడించి, ప్రార్థించి నమస్కారం చేశాడు. 'కాకుత్స్థ రాజుల రాజధానియైన నగరరాజమా, మేము కోసల దాటి ముందుకు సాగిబోతున్నాము. దయతో అనుమతించవలసిందిగా కోరుతున్నాను. మహారాజుకి అసత్యదోషం అంటకుండా వుండటానికి, నేనూ, నా భార్యా, నా తమ్ముడూ వనవాసానికి బయల్దేరాము. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం ముగించిన తర్వాత నా తల్లితండ్రులతో కలిసే శుభతరుణంలో మళ్ళీ నిన్ను దర్శిస్తాను. అనుగ్రహించు తల్లీ' అని ప్రార్థిస్తూ, దుఃఖం ఆపుకోలేక, కళ్ళు ఎఱ్ఱబడి, నీళ్ళు ధారాపాతగా కారుతుండగా, కుడిచెయ్యి ఎత్తి, జానపదుల్ని దగ్గరగా పిల్చి, దీనాతిదీనమైన స్వరంతో ఇలా అన్నాడు.

'ప్రియమైన ప్రజలారా, మీరంతా నామీద చూపుతున్న ప్రేమకి కృతజ్ఞుడ్ని. కాని ఎవరికీ కూడా చాలా కాలం దుఃఖించటం శ్రేయస్సు కాదు. కనుక మీరింక

వెళ్ళి మీ పనులు చూసుకోండి. నాదారిని నన్ను వెళ్ళనివ్వండి. అని అనునయించి చెప్పాడు.

రాముడి రథాన్ని వెన్నంటి వస్తున్న ఆ జానపదులు సిగ్గుపడి, రామలక్ష్మణులకి, సీతమ్మకి ప్రదక్షిణాలు చేసి, కన్నీటితో వీడ్కోలు చెప్పారు. అంతలో రాత్రి అయింది.

కోసలదేశం ధనధాన్యాలతో సుభిక్షమైంది. అక్కడి ప్రజలు దయాశీలురు. యజ్ఞయాగాది క్రతువులు నియమంతో చేస్తారు. వారు వినయశీలురు ఆ రాజ్యమంతా చక్కని ఉద్యానవనాలతోటీ తియ్యటి మామిడితోటలతోటీ నిండి వుంటుంది. పాడి, పశు సంపద సమృద్ధిగా వున్న దేశం. నిరంతరం అక్కడ, వేదఘోష వినిపిస్తుంటుంది. సద్గుణసంపన్నులైన రాజులెందరో అక్కడ పాలకులుగా వున్నారు. అటువంటి మాతృభూమియైన కోసలదేశాన్ని విడిచి వెళ్తుంటే రాముడికి చెప్పరాని బాధ కలిగింది.

ఆ బాధనంతా తనలోనే ఇముడ్చుకుని కోసలదేశం దాటి సాగిపోయాడు. దక్షిణదిశగా రథం సాగిపోయింది. కొంతదూరం వెళ్ళేసరికి గంగానది వచ్చింది. త్రిపథగామిని అయిన గంగానది చాలా పవిత్రమైనది. ఆ నదీతీరాన ఎన్నో ఋషిఆశ్రమాలూ, తపోవనాలూ వున్నాయి. ఆ నదీ జాలాలు నిర్మలంగా, తియ్యగా వుంటాయి. అంతటి పరమపావని అయిన గంగా తీరానికి వారు వచ్చారు.

దేవతలు, మానవులు, ఎంతమంది జలకాలాడినా ఆ నదీజలాలు ఏమాత్రం పాపపంకిలం కాకుండా నిర్మలంగా, పవిత్రంగా వుంటాయి. దేవ, దానవ, గంధర్వ, కిన్నరులు ఆ నదీ తీరంలో విహరిస్తూ వుంటారు.

హిమాలయాలలో పుట్టిన పావనగంగ దేవతల కోరికపై స్వర్గానికి వెళ్ళి మళ్ళీ భూలోకానికి వచ్చింది. వందలకొద్దీ దేవతలానదిలో క్రీడిస్తారని చెప్తారు. దేవతలు ఆ నదీతీరంలో తమకోసం ఉద్యానవనాలు నిర్మించుకున్నారని అంటారు. అటువంటి ప్రశస్తమైన గంగానది, కెరటాలు ఎగిసి పడుతూ అట్టహాసంగా ప్రవహిస్తోంది. సముద్రుడికి పట్టపురాణియైన ఆ గంగానదీతీరాన వున్న శృంగబేరపురం చేరారు వారు ఆ రథంలో.

అంతవరకు వారు ఎక్కడా ఆగలేదు. విశ్రాంతి తీసుకోలేదు. ఆహారం తినలేదు. అక్కడ శృంగబేరపురంలో రథం ఆపి వారు ముగ్గురు రథం దిగారు. కెరటాలతో సుళ్ళు తిరుగుతు నురుగులు గ్రక్కుతున్న ఆ గంగానది వంక చూస్తూ రాముడు సుమంత్రుడితో ఇలా అన్నాడు.

'ఆర్యా రథం ఇక్కడే ఆపండి. ఈ రాత్రికిక్కడే మజిలీ చేద్దాం. అదిగో పూలతోటీ, ఫలములతోటీ నిండిన ఆ ఇంగుదీవృక్షం చూడండి, ఆ చెట్టు నీడలో విశ్రమిద్దాం. దేవదానవ యక్ష గంధర్వులు సేవించే ఈ గంగని మనం కూడా ఇక్కడ దిగి సేవిద్దాం' అన్నాడు. సుమంత్రుడు, లక్ష్మణుడు సరే అన్నారు. అంతా ఇంగుదీవృక్షం దగ్గరకి చేరారు. సుమంత్రుడు గుఱ్ఱాల్ని విప్పి సేదదీర్చి, మేతవేసి రాముడి దగ్గరకి వచ్చి, చేతులు జోడించి, నిలబడ్డాడు.

ఆ శృంగబేరపురాన్ని పాలిస్తున్న నిషాదరాజు గుహుడు రామునికి ఆప్తమిత్రుడు. రాముడు సీతాలక్ష్మణులతో అక్కడికి వచ్చిన సంగతి అతడికి తెలిసింది. అతడు వెంటనే తన మంత్రులతోటీ, పరివారంతోటీ బయల్దేరి అక్కడకొచ్చాడు. వారిని రాముడు దూరాన్నించే చూశాడు వెంటనే లక్ష్మణునితో కలిసి గుహుడికెదురుగా వెళ్ళాడు. గుహుడు రాముడ్ని గాఢంగా కౌగిలించుకున్నాడు.

'రామా, నీకు అయోధ్య ఎంతో మా రాజ్యం కూడా అంతే. నేనూ, నా వాళ్ళందరూ నీ సేవకులం. ఇది నీ రాజ్యాంగానే భావించు. నీ అంతటి మహనీయుడైన అతిథి ఎవరికి లభిస్తాడు?' అంటూ రాముడికి అర్ఘ్యపాద్యాదులిచ్చి, అనేక విధాలయిన రుచికరములైన భోజన పదార్థాలు తెప్పించాడు.

'మహావీరా, నీకు స్వాగతం. ఈ మహీ మండలానికంతటికీ నువ్వే ప్రభువువి. మేమంతా నీ భృత్యులం. ఈ రాజ్యం నీదే. ఏలుకో' అన్నాడు. ఇవిగో ఈ భోజన పదార్థాలు స్వీకరించి ఆరగించండి. ఈలోగా మేము మీకు పక్కతేర్పాటుచేసి, గుఱ్ఱాలకి దాణాలు పెట్టిస్తాం అంటూ భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములతోగూడిన విందు భోజనం సమర్పించాడు.

రాముడు చిరునవ్వు నవ్వి, గుహుడ్ని దగ్గరగా తీసుకుని 'మిత్రమా, నీ తియ్యని మాటలకన్నా మాకు వేరే ఆతిథ్యం ఏం వుంది? నీ అప్యాయతకి మేమంతా చాలా తృప్తి పడ్డాము. నా భాగ్యవశాత్తు ఈ రోజు నేను నీ బంధువుల్ని, నిన్ను చూడగలిగాను' అంటు ఆప్యాయంగా కౌగలించుకున్నాడు.

'నిషాదరాజా, నీ రాజ్యం - నీ మిత్రులు, నీ కోశాగారం, అంతా కుశలమే కదా. నీ ఆప్యాయత నాకు తెలుసు కాని, నీ ఆతిథ్యం స్వీకరించే భాగ్యం నాకు లేదు. నేనీ విషయంలో అశక్తుణ్ణి. ఎందుకంటే, ప్రస్తుతం వనవాసదీక్షలో వున్నానయ్యా. జటావల్కలాలు, నారచీరలు ధరించి, కందమూలాలు, ఫలాలు తింటూ, తాపస మార్గంలో ధర్మవర్తనుడనై వుండాలి. ఈ సంగతి నీకూ తెలుసనుకుంటాను. కనక బాధపడకు. మా గుఱ్ఱాలకి మంచి మేత పెట్టించు.

ఇంకేం వద్దు. వాటికి చేసే సత్కారం నాకు చేసినట్టే అవుతుంది. ఈ అశ్వాలు నా తండ్రిగారైన దశరథ మహారాజువి' అన్నాడు రాముడు. గుహుడు వెంటనే తన అనుచరులకి చెప్పి, గుఱ్ఱాలకి మంచి దాణా పెట్టించి, మంచినీరు త్రాగించాడు.

అపుడు రాముడు వల్కలాన్ని ఉత్తరీయంగా వేసుకుని, పశ్చిమ, సంధ్యాకార్యక్రమం పూర్తిచేశాడు. లక్ష్మణుడు స్వయంగా గంగాజలాలు తెచ్చాడు. వాటిని ముగ్గురూ పానం చేశారు. లక్ష్మణుడు ఆ ఇంగుదీవృక్షపు మొదట్లో ఆకులు, మెత్తటి గడ్డి పరచి, చక్కటి పక్క ఏర్పాటు చేశాడు. సీతారాములిద్దరూ ఆ చెట్టుమొదట్లోనే లక్ష్మణుడు ఏర్పాటుచేసిన శయ్యమీద హాయిగా నిద్రపోయారు.

లక్ష్మణుడు ధనుర్బాణాలు ధరించి అప్రమత్తుడై గుహుడితోటి, సుమంత్రుడితోటి కబుర్లు చెబుతూ కూర్చున్నాడు. అలా ఏకాగ్రతతో అన్నగారికి, వదినగారికీ కాపలాకాస్తూ జాగరణ చేస్తున్న లక్ష్మణుని చూసి, గుహుడు విచారంగా, సంతప్తహృదయంతో ఇలా అన్నాడు.

'లక్ష్మణా, నీ కోసం పక్క ఏర్పాటు చేశాను. రాకుమారా, నువ్వు కూడా హాయిగా నిద్రపో. చాలా అలసిపోయావు. సుకుమారుడివి. కష్టపడలేవు. మేము అన్నిరకాల కష్టాలకి అలవాడు పడ్డవాళ్ళం. ఈ అడవులలో ఎలా వుండాలో తెలిసినవాళ్ళం. రామచంద్రుడికి మేము మెలుకువగా వుండికాపలాకాస్తాం. నాకు రాముడి కన్నా ప్రియమైన వారెవ్వరూ లేరు. వీరికి నేను భద్రత కలిగిస్తాను. తెల్లారిందాకా నాల్గుదిక్కులా కాపలా ఏర్పాటు చేస్తాను. నువ్వు నిశ్చింతగా నిద్రపో' అన్నాడు.

లక్ష్మణుడు అతడి భక్తికి సంతోషించి, 'నిషాదరాజా, నువ్వు నిజంగా పరమధార్మికుడివని నాకు తెలుసు. నీ శక్తి సామర్థ్యాలు నేనెరుగుదును. నువ్వుండగా మాకేం భయంలేదు. కాని, దశరథ మహారాజు జ్యేష్ఠపుత్రుడు, రాముడు సీతతో కలసి ఇలా నేలమ్మీద పడుకున్నాడే. అలాంటపుడు నాకు నిద్ర ఎలావస్తుందయ్యా. నాకింక సుఖమెక్కడిది? ఈ దారుణం చూస్తూ జీవించటమే కష్టం. ఇంక ఎలా నిదురించగలను? దేవదానవులనైనా ఎదిరించగల మహాపరాక్రమవంతుడు మా అన్నగారు. అంతటి తేజోమూర్తి ఈనాడు సీతమ్మతో కలిసి ఇలా గడ్డిపోచలపై నిదురించాడే. మా తండ్రి దశరథ మహారాజు ఎన్నో పూజలు, వ్రతాలూ చేసి, ఎన్నో కష్టాలనోర్చి, ఈ మహనీయుని కుమారునిగా పొందాడు. అటువంటి సకల సద్గుణ సంపన్నుడైన ధర్మమూర్తి మా అన్నయ్య. అందుకే మా నాన్నగారికి మా అన్నయ్యంటే చాలా ఇష్టం. రాముడు దూరమయ్యాక ఆయనెంతో కాలం జీవించి వుండరు.

అచిరకాలంలోనే రాజ్యలక్ష్మికి వైధవ్యం సంప్రాప్తం కాబోతుంది. భర్తని కోల్పోయిన అంతఃపురకాంతలు చేసే రోదనలతో అంతఃపురమంతా గగ్గోలెత్తి పోతుంది. తండ్రిగారు లేకపోయాక కౌసల్యాదేవి, నా తల్లి సుమిత్ర కూడా అట్టేకాలం బతకరు. ఒకవేళ నా తమ్ముడు శత్రుఘ్నుణ్ణి చూసి ఊరటపొంది నా తల్లి బ్రతికినా, ఒక్క కుమారుణ్ణి కన్న కౌసల్యాదేవి మాత్రం ఈ దుఃఖం అస్సలు సహించలేదు.

మా అయోధ్య వాసులందరికీ కూడా మా రాముడంటే చెప్పలేని ప్రేమ. ఈ లోకంలోనే కల్యాణ సంపన్నమైన అయోధ్యతో సాటి నగరం లేదు.

అటువంటి మహదానంద సందోహానికి పుట్టినిల్లయిన అయోధ్య ఇకమీదట విషాదసాగరంలో మునిగిపోక తప్పదు. 'ఓస్థపతీ నా ఊహ అబద్ధం కాదు. రాముడికి పట్టాభిషేకం చెయ్యాలన్న తన మనోరథం తీరకుండానే, నా తండ్రి స్వర్గస్థుడైపోతాడు. జరిగిందేదో జరిగిపోయింది. ఇంకిపుడెవరు మాత్రం ఏం చెయ్యగలరు? తండ్రి మరణించినపుడు, దగ్గరుండి ప్రేతకర్మలు చెయ్యగలిగిన పుత్రులే ధన్యులు. వారే పితృఋణం తీర్చుకోగల సిద్ధార్థులు. కాని మాకు ఆ భాగ్యం లేదు. మహాభాగా, మా వనవాసం పూర్తి అయ్యేవరకు మా నాన్నగారు జీవించి వుంటారా? మా అయోధ్యలో మళ్ళీ పూర్వపు వైభవం కళ్ళ చూస్తామా? మా రాముడు, తన ప్రతిజ్ఞ నెరవేర్చి, కుశలంగా వనవాసం పూర్తిచేసి, మేము మళ్ళీ అయోధ్యకి చేరుకోగలమా?' అంటూ ఆ రాత్రి అంతా లక్ష్మణుడు గుహునితో తన మనస్సులోని ఆవేదన అంతా చెప్పుకున్నాడు. అంతలో తెల్లారిపోయింది. లక్ష్మణుడి ఆవేదన విన్న గుహుడు కూడా చాలా బాధపడ్డాడు.

తెల్లారిన సంగతి గుర్తించి రాముడు నిద్రలేచాడు. లక్ష్మణుని పిల్చి 'తమ్ముడూ మనం తొందరగా గంగానది దాటి వెళ్ళాలి' అన్నాడు.

అన్నగారి మాటలలో భావం లక్ష్మణుడు గ్రహించాడు. గుహుడికి ఆ సంగతి చెప్పాడు. రాముడి దగ్గరకి వెళ్ళి గుహుడు ఆయన ఉద్దేశం తెలుసుకున్నాడు. తన మంత్రులను పిల్చి, రామలక్ష్మణులు సీతమ్మతో సుఖంగా గంగానదిని దాటాటానికి వీలుగా ధృఢమైన నావని, చక్కగా అలంకరించిన నావని తెప్పించారు. దానిని చక్కగా నడిపేందుకు అనుభవమున్న నావికుడు వచ్చి సిద్ధంగా నుంచున్నాడు.

గుహుడు రాముని ఇంకా ఏమైనా కావాలా? అని అడిగాడు. రాముడింకేమీ వద్దన్నాడు.

అపుడు గుహుడు 'ప్రభూ, నావ సిద్ధంగా వుంది. సముద్రం వైపు ఉరవడితో ప్రవహించే గంగని దాటటానికి ధృడమైన నౌక, నేర్పరి అయిన నావికుడు కావాలి. మా మంత్రులు అవన్నీ ఏర్పాటులూ చేశారు. మీరింక నిశ్చింతగా అధిరోహించవచ్చు.' అన్నాడు. ఆ మాటలు విని రాముడు చాలా సంతోషించాడు 'మిత్రమా, మా కోరిక తీర్చావు కదయ్యా ఇంక బయల్దేరుతాము' అన్నాడు.

దశరథుడు సీతమ్మకిచ్చిన వస్త్రాభరణాలూ, తమకిచ్చిన తవ్వుగోలలూ, బుట్టలూ, అన్నీ నావలోకి చేర్చి, ఖడ్గములు, బాణములు, అమ్ముల పొదులూ, అన్నీతీసుకుని, రాముడు సీతాలక్ష్మణులతో నావనెక్కటానికి బయల్దేరాడు. అపుడు సుమంత్రుడు చేతులు జోడించి, 'నా కర్తవ్యమేమిటో సెలవియ్యండి' అన్నాడు.

అతనిని చూసి రాముని కన్నులు చెమ్మగిల్లాయి. కుడిచేతితో అతడి భుజం తట్టి 'నువ్వు మళ్ళీ రాజధానికి వెళ్ళిపో. నాన్నగార్ని జాగ్రత్తగా కనిపెట్టి వుండు' అన్నాడు. సుమంత్రుడికి దుఃఖం ఆగలేదు. చేతులు జోడించి,

'ప్రభూ, మీ స్థిర సంకల్పం నించి మరల్చి, మిమ్మల్ని వనవాసం వెళ్ళకుండా ఆపటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు. మీరు సీతమ్మతో, లక్ష్మయ్యతో ఇలా ఆటవికుల్లా వనవాసానికి బయల్దేరారు. మీ ధర్మవర్తనకి ఫలితం ఇదేనా అనిపిస్తోంది. విధి ఎంత బలీయమైనది! మీ తండ్రి మాట నిలపటానికి మీరిలా వనవాసానికి రావటం చాలా అపూర్వమైన సంగతి. అయితే ఒక్క సంగతి. మీ పినతల్లి గారు మీ నాన్నగారిని వంచించినందుకు ఫలితంగా మేమంతా నీచేత వంచించబడ్డాము. నీ వెంట వుందామని వచ్చిన నన్ను వెనక్కి వెళ్ళిపొమ్మంటున్నావు. మేమెంత పాపాత్ములము. కైకేయి పాలబడి దుఃఖభాగులమయ్యాము.' అంటూ సుమంత్రుడు శోకంలో మునిగి వుండగానే నావ బయల్దేరింది. రాముడు మృదుమధుర గంభీరంగా సుమంత్రుడితో ఇలా అన్నాడు.

'సుమంత్రా, ఇక్ష్వాకువంశానికి మిమ్మల్ని మించిన మిత్రులు లేరు. తండ్రిగారికి దుఃఖం కలగకుండా చూడటం మీ కర్తవ్యం. అందుకే మిమ్మల్ని వెనక్కి పంపుతున్నాను. నా తండ్రిగారు వృద్ధులయ్యారు. ఆయనకి దుఃఖం అంటే ఏమిటో ఇప్పటిదాకా తెలియదు. వారికి నా మాటలుగా ఇలా చెప్పండి. 'మహారాజా, అయోధ్య వదిలి అడవులలో వుండవలసిన వచ్చినందుకు మేము ముగ్గురం దుఃఖించటం లేదు. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం పూర్తిచేసుకుని, తొందరలోనే మీముందుంటాము.' అని చెప్పి ఆ తర్వాత మా తల్లితో ఇలా చెప్పండి. 'నేను, సీతా, లక్ష్మణుడు నా తల్లికి పాదాభివందనం చేశామని చెప్పి, ఆ పైన ఆమె ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి. మిగిలిన తల్లులందరినీ

కుశలమడిగామని చెప్పండి. భరతునికి తొందరగా పట్టాభిషేకం చెయ్యవలసిందిగా నాన్నగారికి చెప్పండి. భరతుడ్ని మేము కౌగలించుకుని, మా కోసం దుఃఖించవద్దని చెప్పండి. తండ్రిగారికి ప్రియం కలిగిస్తూ యౌవరాజ్యాన్ని పాలించమని చెప్పండి. తన తల్లి కైకేయితో సమానంగా మా తల్లుల్ని కూడా చూసుకోమని చెప్పండి' అని రాముడు వెళ్ళిపోతూ చెప్పిన సందేశం విని సుమంత్రుడు మరింత దుఃఖించాడు. రాముడ్ని సాగనంపుతూ,

'కుమారా, చిన్నప్పట్నించీ మిమ్మల్ని పెంచిన వాత్సల్యం చేత సంకోచం లేకుండా నా మనస్సులో మాట చెప్తాను విను. మిమ్మల్ని వదిలి నేనొక్కడ్ని అయోధ్యకెలా వెళ్ళగలను? అయోధ్యలోని ప్రజలకేం జవాబు చెప్పగలను? వారంతా నీమీద బెంగతో ఉపవాసాలు చేస్తున్నారు. ఇపుడు నేను ఒంటరిగా వెళ్తే వాళ్ళు మరింత ఆక్రోశిస్తారు. నువ్వు అడవిలో వుండిపోయావనే వార్త తెలిసి నీ తల్లి గుండె బ్రద్దలౌతుంది. ఆ దుఃఖం నేను భరించలేను. అందుకని నేనొంటరిగా అయోధ్యకి వెళ్ళలేను. నేను మీతో వనవాసానికి వస్తాను. అలా కాదంటావా, ఇక్కడే అగ్ని ప్రవేశం చేస్తాను. మీతో రావటానికనుమతిస్తే ఈ పధ్నాలుగేళ్ళు మీతో వుండి, గడువుపూర్తయ్యాక ఈ రథంలోనే అయోధ్యకి తీసికెళ్తాను. కనక నన్ను అనుమతించు. అని దీనాతిదీనంగా వేడుకున్నాడు.

సుమంత్రుడి ఆవేదన అర్థం చేసుకున్న రాముడు, వాత్సల్యంతో ఇలా అన్నాడు.

'ఆర్యా, మాపై మీకుండే ప్రేమ నేనెరుగుదును. కాని మిమ్మల్ని అయోధ్యకెందుకు వెళ్ళమంటున్నానో వివరంగా చెప్తాను వినండి. నన్ను అడవులలో వదిలి మీరు వెనక్కి వెళ్తే మహారాజు మిథ్యాది కాదనీ, మేము నిజంగానే వనవాసానికి వెళ్ళామనీ ప్రజలు తెలుసుకుంటారు. కైకమ్మకి నమ్మకం కల్గుతుంది. భరతుడికి పట్టాభిషేకం జరుగుతుంది. ఆమె కోరిక నెరవేరుతుంది. ఆమె రాజమాత అవుతుంది. నాకు ప్రియం చెయ్యాలని మీకున్నా, మహారాజుకి మేలు చెయ్యాలని వున్నా మీరు వెనక్కి వెళ్ళండి. అంటూ ఎన్నోవిధాల సుమంత్రుడికి నచ్చచెప్పి, తర్వాత గుహుడితో 'ప్రియనేస్తమా, నేను నిర్జనారణ్యంలో వుండి ఆశ్రమం నిర్మించుకుని నివసిద్దామనుకుంటున్నాను. అందుకు తాపసవృత్తి స్వీకరించాలి. ఇది మా తండ్రిగారి ఆజ్ఞ. కనక మఱ్ఱిపాలు తెప్పించు' అన్నాడు. గుహుడు మఱ్ఱిపాలు తెప్పించాడు. రాముడు, సీత, లక్ష్మణుడు ఆ పాలు శిరోజాలకి పట్టించుకుని, జుట్టు జడలుగా చేసుకున్నారు. జటాజూటాలు ధరించాక రాముడు, గుహుడితో 'నిషాదపతీ నువ్వు నీ జనపదాన్ని అప్రమత్తుడవై పాలించుకో. మేమింక

బయల్దేరుతాము' అని చెప్పి సీతాలక్ష్మణులతో గంగానదిలోకి కదిలిపోయాడు. నావదగ్గరకి చేరాక, లక్ష్మణుడితో, 'లక్ష్మణా, నిదానంగా నువ్వు ముందు నావలోకి ఎక్కు. తర్వాత నీ వదినకి చెయ్యందించు. మెల్లిగా ఆమెని నావలో కెక్కించు' అన్నాడు. లక్ష్మణుడలాగే చేశాడు. వారిద్దరూ ఎక్కాక రాముడు నావనెక్కాడు. నావ బయల్దేరింది. రాముడు శాస్త్రవిహితమైన శాంతిమంత్రాలు చదివాడు. సీతారామలక్ష్మణులు ఆచమనాది కార్యక్రమాలు నిర్వర్తించారు. తర్వాతవారు సుఖంగా నావలో కూర్చుని అందరికీ వీడ్కోలు చెప్పారు.

నావికుల్ని నావ తొందరగా నడపమని రాముడు చెప్పాడు. గంగానదీ పావన జలాల మీద నావ సుఖంగా సాగిపోయింది. గంగానది మధ్యలోకి నావ వెళ్ళగానే, జానకి రెండు చేతులు జోడించి, 'అమ్మా, లోకపావనీ, దశరథ మహారాజు ప్రియపుత్రుడైన నా భర్తా, నేనూ, నా మరిదీ, వనవాసానికి బయల్దేరాము. సురక్షితంగా మమ్మల్ని ఆవలిఒడ్డుకి చేర్చు. పధ్నాలుగు సంవత్సరాలూ పూర్తికాగానే, తిరిగి వచ్చేటప్పుడు మళ్ళీ నీ దర్శనం చేసుకుంటాము. మా వనవాసం సుఖంగా పూర్తిచేసుకుని మళ్ళీ క్షేమంగా వచ్చేలా మమ్మల్ని ఆశీర్వదించు. సర్వమంగళా, నీకిదే నా వందనం. వనవాసానంతరం నా భర్త శ్రీరాముడు పట్టాభిషిక్తుయ్యాక, నీ ప్రీతి కోసం లక్షగోవుల్ని, వస్త్రాల్ని, షడ్రసోపేతమైన భోజనాన్ని బ్రాహ్మణులకి పెట్టిస్తాను. వెయ్యికుండలతో మధువు, మాంసభోజనం నీకు అర్పించి అర్చనలు చేయిస్తాను. నీ ప్రవాహతీరం వెంట వున్న దేవాలయాలూ, తీర్థాలూ, అన్నీ దర్శించి పూజలు చేయిస్తాను. పరమపావనీ, మమ్మల్ని అనుగ్రహించు. పధ్నాలుగేళ్ళ తర్వాత సుఖంగా అయోధ్య చేరేలా ఆశీర్వదించు' అంటూ అనేక విధాల గంగకి మొక్కులు మొక్కుకుంది.

అంతలోనే గంగానది దక్షిణతీరానికి చేరింది నావ. వారు ముగ్గురు నావ దిగారు.

రాముడు సీతాలక్ష్మణ సమేతంగా కాలినడకన ముందుకి సాగాడు. వెళ్తూ లక్ష్మణునితో ఇలా అన్నాడు. 'తమ్ముడూ, జనసంచారం వున్నచోట, లేనిచోట కూడా అప్రమత్తుడవై జాగ్రత్తగా వుండు. ఎందుకంటే ఈ అడవులలో వృక్షాల వెనక క్రూరమృగాలు దాగి వుంటాయి. సంరక్షణ విషయంలో చాలా జాగర్తగా వుండాలి. నువ్వు ముందు నడు. నీ వెనక సీత నడుస్తుంది. ఆమె వెనక నేను నడుస్తాను. ఇక్కడ మనం ఒకళ్ళనొకళ్ళం రక్షించుకొంటు జాగ్రత్తగా మసులు కోవాలి. వనవాసంలో వుండే కష్టాలేమిటో సీతకి ఇపుడే తెలియవు. ముందు ముందు తెలుస్తుంది.

ఏ పరిస్థితిలోనూ ఆమెను విడిచి వెళ్ళకూడదు. ఇక్కడ జనసంచారం వుండదు. ఉద్యానవనాలు గాని, పంటపొలాలు గాని వుండవు.

మిట్టపల్లాలుగా వుండే దారి, కంకర రాళ్ళతో, ముళ్ళతో నిండివుంటుంది. అవన్నీ సీత ఇపుడు ప్రత్యక్షంగా చూస్తుంది' అన్నాడు.

అన్నగారి ఆజ్ఞప్రకారం లక్ష్మణుడు ముందు నడిచాడు. అతడి వెనక సీత, ఆమె వెనక రాముడు బయల్దేరారు.

గంగకి ఆవలితీరంలో సుమంత్రుడు నిలబడి, నావ కనుచూపుమేర దాటిపోయేదాక చూస్తూ వుండి, పడవ కనపడకుండా పోయాక పెద్దగా ఏడ్చేశాడు.

గంగని దాటిన రాముడు అలా సాగిపోతూ, వత్సదేశానికి చేరాడు. దారిలో నాలుగు మృగాల్ని, ఒక పందిని, ఇంకో మహామృగాన్ని, రురువు అనే మృగాన్ని చంపి, చితుకులు పేర్చి, ఆ మాంసం బాగా కాల్చి, వారు ముగ్గురు కడుపునిండా తిన్నారు. అప్పటికి సాయం కాలమైంది. ఒక విశాలమైన చెట్టు మొదట్లో పక్కఏర్పాటు చేసుకున్నారు.

రామలక్ష్మణులు సాయం సంధ్య యధావిధిగా ముగించి, పక్కమీదికి చేరారు. అప్పటికే బాగా అలసిన సీత పక్కమీద ఒరిగి పడుకుంది.

రాముడు తమ్ముడితో 'లక్ష్మణా, మన దేశం వదిలి అడవులలో ప్రవేశించిన మొదటి రాత్రి ఇది. సుమంత్రుడు కూడా ఇపుడు మనకి తోడు లేడు. అయినా నువ్వేం బాధపడకు. ఇంక ఇప్పట్నించీ రాత్రిపూట మనం జాగరం చెయ్యాలి. సీతని కంటికి రెప్పలా కాపాడవలసిన బాధ్యత మనమీద వుంది' అంటూ హంసతూలికా తల్పాలమీద నిదురించిన ఆ పురుషోత్తముడు, ఆ ఆకులశయ్యపై నడుంవాల్చి, లక్ష్మణునితో కబుర్లలో పడ్డాడు.

'లక్ష్మణా, నాన్నగారెంత దుఃఖంలో మునిగివున్నారో కైకేయి తన కోరిక తీరినందుకు పొంగిపోతూ వుంటుంది. కాని నాన్నగారి కంటికి మాత్రం కునుకురాదు. భరతుడు వచ్చాక ఆవిడ రాజ్యాన్ని, సర్వాధికారాల్ని పొందటానికి నాన్నగారి ప్రాణాలు తీసినా తియ్యవచ్చు. మనం కూడా వచ్చేశాం. ఆయన అనాథుడిలా అయిపోయి వుంటారు. వృద్ధులైన ఆ మహారాజును కనిపెట్టి చూసుకుందు కెవరున్నారు? కైకేయి ఏం చేసినా ఆమె మీద వ్యామోహంతో నిస్సహాయంగా చూస్తు ఊరుకుంటారే తప్ప ఏమీ చెయ్యలేరు.

తమ్ముడూ, నాన్నగారి మనస్సు తెలుసుకుని మసలుకునే కుమారుడ్ని నన్ను త్యజించారే, ఇలా ఒక ఆడదాని ప్రీతి కోసం, ఏ అనాగరకుడైనా త్యజిస్తాడంటావా?

కైకేయీ పుత్రుడైన భరతుడు భార్యతో కూడా ఆనందంగా మహారాజై కోసలదేశాన్ని ఏలుతూ సుఖంగా వుండాలన్నమాట. నేనేమో ఇలా అడవుల పాలు కావాలి. ఆలోచించి చూస్తే మన పాలిట ఈ దుస్థితికి, నాన్నగారి వినాశనమునకు, భరతుడి రాజ్యప్రాప్తికి, ఈ కైకేయి మన ఇంటికి దాపురించిందేమో అనిపిస్తోంది. ఇకమీదట ఆవిడ అధికారమదంతో మన తల్లుల్ని కూడా కష్టాలు పాలు చేస్తుందేమోనని అనుకుంటున్నాను. అది మాత్రం నేను సహించలేను. కనక తెల్లారగానే నువ్వు అయోధ్యకి తిరిగివెళ్ళిపో. నేనొక్కణ్ణే సీతతో దండకారణ్యానికి వెళ్తాను. నువ్వు వెళ్తే మన తల్లులతో కష్టసుఖాలు పంచుకుంటూ, కొండంత అండగా వుంటావు. వారికి కష్టాలు తప్పుతాయి. మా అమ్మ చిన్నప్పట్నించీ నన్నెన్నో కష్టాలు పడి పెంచింది. కిందటి జన్మలో ఏతల్లీబిడ్డల్నీ వేరు చేసిందో. ఇపుడిలా ఎడబాటు కలిగింది. నేను పెద్దవాడిని అయ్యాక కూడా ఆవిడని సుఖపెట్టలేకపోతున్నాను. ఛీ - ఛీ ఏం జన్మనాది. లక్ష్మణా, నా మూలంగా నా తల్లికి తీరని దుఃఖం కలిగింది కదా. నాలాంటి కొడుకు ఏ తల్లికీ పుట్టకూడదు.

లక్ష్మణా, నేను తల్చుకుంటే నా భుజబలంతో అయోధ్యని జయించగలను. ఒక్క అయోధ్యనే ఏమిటి? ఈ భూమండలాన్నంతా జయించగలను. కాని అకారణంగా పరాక్రమం చూపించటం ధర్మవిరుద్ధం. తండ్రి నెదిరించి, రాజ్యాన్ని పొందటం వల్ల, లోకనింద మాత్రమే దక్కుతుంది. కాని ఉత్తమ లోకప్రాప్తి కలగదు. ఆ భయంచేతనే ఊరుకున్నాను' అంటూ జాలిగొలిపేలా దుఃఖిస్తూ, ఆ నిర్జనారణ్యంలో కన్నీరు మున్నీరుగా విలపిస్తూ దీనంగా కూర్చున్నాడు రాముడు. లక్ష్మణుడు ఆ స్థితిలో వున్న రాముణ్ణి చూసి, చల్లారిపోయిన అగ్నిహోత్రంలా, అలలు లేని సముద్రంలా వున్న అన్నగార్ని ఓదారుస్తూ,

'అన్నయ్యా, నిన్ను కోల్పోయిన అయోధ్య కాంతిహీనమై, చంద్రుడు లేని రాత్రిలా కటిక చీకటిలో మునిగి వుంటుంది. నిజమే కాని నీ అంతటి ధీరుడు ఇలా పరితపించకూడదు. నువ్వే ఇలా దిగులుపడ్తే ఇంక నన్ను సీతని, ఎవరు ఓదారుస్తారు? నువ్వు లేనిదే మేమిద్దరం లేము. నిన్నెడబాసిన మరుక్షణం చెరువులోపల్నించి బయటపడ్డ చేపల్లా ప్రాణాలు విడుస్తాము.

నన్ను అయోధ్యకి వెళ్లమంటావా? నాకు నాన్నగార్ని గాని, మా అమ్మని గాని, శత్రుఘ్నుడ్ని కాని చూడాలని లేదు. నువ్వు లేకుండా నేను స్వర్గానికి వెళ్ళమన్నా వెళ్ళలేను. ఇంకెపుడూ నన్ను వెళ్ళమని అనకు' అన్నాడు.

అలా కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళు కొద్దిసేపు మేను వాల్చారు. లక్ష్మణుడన్న మాటలు మళ్ళీ ఒకసారి మననం చేసుకున్నాడు. రాముడు బాగా ఆలోచించాడు.

ఇంకెపుడూ సీతాలక్ష్మణులకి బాధకలిగించేలా మాట్లాడకూడదనుకున్నాడు. కొదమసింహాల్లాంటి ఆ రఘువంశవీరులకి ఆ నిర్జనారణ్యంలో ఏ మాత్రం భయం కలగలేదు.

ఆ రాత్రి అక్కడ గడిపేశాక తెల్లారగానే మళ్ళీ బయలుదేరి ప్రయాణం సాగించారు. గంగా యమునా సరస్వతీ నదులు సంగమించే త్రివేణీ సంగమ స్థలం చేరాలని సంకల్పం కలిగింది. వేగంగా అడుగులు వేస్తూ నడవసాగారు. కొంతదూరం ప్రయాణం చేశాక వారికి గంగా యమునల సంగమస్థలం కనిపించింది. అక్కడ కొంతదూరంలో ఆకాశంలోకి లేస్తున్న పొగలు కనిపించాయి. దానినిబట్టి అక్కడ ఏదో ముని ఆశ్రమం వుండి వుండవచ్చని అనుకున్నారు. అది భరద్వాజముని ఆశ్రమం కావచ్చు అని రాముడన్నాడు. అంతలో సాయంసంధ్య అయింది. తొందరతొందరగా నడిచి వారు ముగ్గురు భరద్వాజముని ఆశ్రమం చేరుకున్నారు. లక్ష్మణుడ్ని, సీతని దూరంలో వుండమని రాముడొక్కడే ఆశ్రమంలోకి వెళ్ళాడు. భరద్వాజ మహాముని శిష్యులందరితో కలసి కూర్చుని వున్నాడు.

రాముడు సీతా లక్ష్మణులని కూడా రమ్మని సౌంజ్ఞ చేసి పిలిచాడు. ముగ్గురు కలిసి ఆశ్రమంలోకి వెళ్ళి మహర్షికి నమస్కారం చేశారు. అపుడు రాముడు భరద్వాజ మహర్షితో 'మహాత్మా, మేమిద్దరం అన్నదమ్ములం. దశరథ మహారాజు కుమారులం. ఈమె నా భార్య జానకి' అని తమని పరిచయం చేసుకున్నాడు. త్రికాలజ్ఞుడైన భరద్వాజ మహర్షి, దివ్యదృష్టితో జరిగినదంతా గ్రహించి, సీతారామలక్ష్మణులకు అర్ఘ్యపాద్యాదులిచ్చి, ఉచిత రీతిని సత్కరించాడు. అడవిలో దొరికే పండ్లు, కందమూలములు ఇచ్చి విందు చేశాడు. వారు మహర్షి ఇచ్చిన ఆతిధ్యం స్వీకరించి, సేదదీరి స్థిమితంగా కూర్చున్నారు.

అపుడు భరద్వాజుడు రాముడితో ఇలా అన్నాడు. 'రామా, అయోధ్యలో అంతా క్షేమమా? అకారణంగా మీ తండ్రిగారు నీకు వనవాసం విధించారని అందరూ అనుకుంటున్నారు. నువ్వు ఇక్కడికి రావటం నాకు చాలా ఆనందంగా వుంది. ఈ ప్రదేశం చాలా పవిత్రమైనది. ఇక్కడ మీరు సుఖంగా వుండవచ్చు.

అని సాదరంగా ఆ మహాముని చెప్పిన మాటలు విని, రాముడు వినయంగా చేతులు జోడించి, 'ఆర్యా, మీరు సాదరంగా అన్నమాటలకి నాకు చాలా ఆనందంగా వుంది. కాని, మా రాజ్యము ఇక్కడికి దగ్గరగా వుంది. మా ప్రజలందరికీ మేమంటే చాలా ఇష్టం. కనక తరచు వారు ఇక్కడికి రాకపోకలు సాగించి తాపసుల ధ్యానానికి అంతరాయం కలిగిస్తారు. నాకు కూడా ఏకాంతవాసంలో ఆశ్రమం

నిర్మించుకోవాలని వుంది. కనక ఎవ్వరూ గుర్తించటానికి వీలులేని ప్రదేశమేదైనా వుంటే చెప్పండి' అన్నాడు.

అపుడా మహర్షి కొంతసేపు ఆలోచించి 'రామా - ఇక్కడికి పదిక్రోసుల దూరంలో చిత్రకూట పర్వతం వుంది. అక్కడ మునుపు చాలా మంది మహర్షులు ఆశ్రమాలు నిర్మించుకుని తపస్సు చేశారు. ఇపుడంత మంది లేరు. కాని అది చాలా పవిత్రమైన చోటు. మంగళప్రదమైనది. ప్రశాంతంగా వుటుంది. అక్కడ ఆశ్రమం నిర్మించుకుని మీరు వుంటే బాగానే వుంటుంది. ఇక్కడ నా ఆశ్రమంలో వున్నా నాకేం అభ్యంతరం లేదు' అన్నాడు.

ఆ మాటలకి రాముడు చాలా ప్రసన్నుడయ్యాడు. ఆ రాత్రంతా ఎన్నెన్నో అద్భుత విషయాలు భరద్వాజుడు చెప్తుంటే, వింటూ వారు అక్కడే గడిపేశారు. తెల్లారగానే రాముడు భరద్వాజునికి పాదాభివందనం చేసి, చిత్రకూటగిరికి వెళ్ళటానికి అనుమతినివ్వమన్నాడు.

మహాముని వాళ్ళ నాశీర్వదించి, వారివెంట కొంచెం దూరం నడిచి, చిత్రకూటాద్రికి దారి చెబుతూ 'రామా, కొంచెం ముందరకి వెళ్తే గంగా యమునలు సంగమించే చోటు వస్తుంది. ఇంకాస్త దూరం వెళ్తే యమునా నది పడమటి దిక్కుగా ప్రవహిస్తు కనబడ్తుంది. ఆ యమునని దాటి వెళ్ళండి. ఆనది ఆవలితీరాన నల్లని ఆకులున్న 'శ్యామము' అనే పెద్ద మఱ్ఱిచెట్టు కనిపిస్తుంది. ఆ చెట్టుకి నమస్కరించి దీవెనలు పొందండి. అది చాలా మహిమ గల వటవృక్షము. అక్కడ కాస్సేపు విశ్రాంతి తీసుకోండి. అక్కడ్నుంచి క్రోసుదూరంలో నీలము అనబడే అరణ్యం వుంది. ఆ దారిపొడగునా చాలా రమ్యమైన ప్రదేశాలున్నాయి. నడవటానికి సౌకర్యంగా మెత్తటి ఇసకతో నిండివుంటుంది' అంటూ చిత్రకూటాద్రి వెళ్ళటానికి సరియైన దారి చూపించి, ఆ మహర్షి వెనక్కి వెళ్ళిపోయాడు.

ఆ దారిగుండా వాళ్ళు ప్రయాణం సాగించారు. వేగంగా ప్రవహిస్తున్న యమునా నది వచ్చింది. దానిని ఎలా దాటాలా అని ఆలోచనలో పడ్డారు. కొన్ని ధృఢమైన కఱ్ఱలు తెచ్చారు. రెండు కఱ్ఱలతో ఒక తెప్ప తయారుచేసి దానిమీద ఒక బట్ట పరిచారు. దానిమీద ప్రబ్బలి కొమ్మలు, నేరేడు కొమ్మలు వేశారు. అలా చక్కటి తెప్ప తయారుచేసి, దానిమీద సీత కూర్చుందుకు మెత్తటి పక్క పరిచారు. రాముడు సీత చెయ్యిపట్టుకుని అతి జాగ్రత్తగా దానిమీద ఎక్కించాడు. తమవెంట వున్న సామానంతా నేర్పుగా దానిమీద ఎక్కించారు. అపుడు రామలక్ష్మణులు ఎక్కి తెప్పనడిపించారు. వడిగా ప్రవహిస్తున్న యమునా నది మధ్యకి తెప్ప చేరింది. సీత యమునమ్మకి చేతులు జోడించి 'తల్లీ, మమ్మల్ని క్షేమంగా ఆవలి ఒడ్డు

చేర్చు. నా భర్త నిర్విఘ్నంగా తన నియమం పూర్తిచేసేటట్టు చూడు. మేము తిరిగి వచ్చేటప్పుడు వెయ్యి కల్లుకుండలతో నీకు నివేదన చేయిస్తాను' అని వెయ్యివిధాల ప్రార్థించింది. అంతలో తెప్ప దక్షిణతీరం చేరింది. వారు తెప్ప దిగారు.

తీరం వెంబడి నడక సాగించారు. భారద్వాజ మహర్షి చెప్పిన మర్రిచెట్టు వచ్చింది. సీత ఆ వృక్షానికి ప్రణమిల్లి, 'మహావృక్షమా, నీకు మా నమస్కారాలు. నా భర్త తీసుకున్న వ్రతం ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తయ్యేలా ఆశీర్వదించు' అని ఆ చెట్టుకి ప్రదక్షిణం చేసి మ్రొక్కింది. ఆ తర్వాత ముందు లక్ష్మణుడు మధ్య సీత - వెనక రాముడు వుండేలా నడకసాగించారు. దారిలో ఆకలైనపుడు మృగాల్ని చంపి ఆ మాంసం కాల్చి తిని కడుపునింపుకున్నారు. రాత్రి అయ్యేసరికి ఒక అనువైన ప్రదేశం చూసుకుని పక్క ఏర్పాటుచేసి సీతని నిద్రపొమ్మని, అన్నదమ్ములిద్దరూ కాపలాగా కూర్చున్నారు.

రాత్రి గడిచింది. ముగ్గురు లేచి, నదిలో స్నానాది ప్రాతఃకాల కార్యక్రమాలు తీర్చుకుని, మళ్ళీ బయల్దేరారు. సీత మార్గాయాసం పొందకుండా వుండాలని రాముడు దారిలో సుందరదృశ్యాలు, అందమైన పూలగుత్తులు చూపిస్తూ సీతకి ఎన్నెన్నో కబుర్లు చెప్తు ఆమె ఉల్లాసంగా వుండేలా చేస్తూ నడక సాగించాడు. అలా చాలా దూరం నడిచాక చిత్రకూట పర్వతం వచ్చింది. ఆ పర్వతమంతా మహావృక్షాలతో, లతలతో నిండి ఎంతో మనోహరంగా వుంది. దారిలో వారికి వాల్మీకి మహాముని ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమంలోకి వెళ్ళారు.

వాల్మీకి మహామునికి నమస్కరించి తమని తామే పరిచయం చేసుకున్నారు. వాల్మీకి సంతోషంగా వారికి స్వాగతం చెప్పాడు. వారికి అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించాడు. ఆయన ఆశీస్సులు తీసుకుని మళ్ళీ బయల్దేరారు.

కొంతదూరం వెళ్ళాక, అక్కడ ఆశ్రమం నిర్మించుకుందుకు అనువైన ప్రదేశం చూసుకున్నారు. అక్కడ పర్ణశాల నిర్మించమని రాముడు లక్ష్మణునితో చెప్పాడు. లక్ష్మణుడు సరే అని ధృఢమైన మానులు తెచ్చి, గుంజలుగా పాతి, వెదురు బొంగులతో పైన కప్పు అమర్చి, దానిమీద తాటి ఆకులు, రెల్లుగడ్డి కప్పి చక్కని పర్ణశాల తయారుచేశాడు. దానిచుట్టూ వెదురుబద్దలతో ఆవరణ నిర్మించి, లోపల చక్కగా చదును చేసి నీళ్ళు చల్లి అందమైన కుటీరం నిర్మించాడు. లక్ష్మణుడి నేర్పుకి రాముడు చాలా అబ్బురపడి చాలా మెచ్చుకున్నాడు. ఆ తర్వాత శాస్త్రోక్తంగా లేడి మాంసంతో అన్నిదిక్కులా అధిష్ఠాన దేవతల్ని అర్చించారు.

రుద్రదేవతాకము, విష్ణుదేవతాకము, అనే యాగాల్ని చేశారు. వాస్తుపూజ చేసి బలి అర్పించారు. శాస్త్రకోవిదుడైన రాముడు స్వయంగా ఈ కార్యక్రమాలన్నీ చేసి లక్ష్మణుడి చేత కూడా చేయించాడు. పుణ్యాహవాచనము, శాంతి వాచనము చేశాడు. ఈ తంతు అంతా అయ్యాక ముగ్గురు మళ్ళీ స్నానం చేసి వచ్చారు. అపుడు భూతబలి ఇచ్చారు. చక్కని ఆశ్రమం, దేవతాస్థానము. అగ్నిహోత్రశాల, అన్నీ చక్కగా నిర్మించుకుని, ఆయా దేవతల్ని స్థాపించి పూజించారు.

ఆ పర్ణశాల చాలా అందంగా వుంది. చుట్టు ఆవరణ కట్టటం వల్ల ఈదురుగాలులు, ఎండ, వానా లోపలికి రాకుండా పటిష్ఠంగా వుంది. పర్ణశాల చుట్టూ అందమైన పూలతో నిండిన వృక్షాలెన్నో వున్నాయి. దగ్గరలో చక్కని నది ప్రవహిస్తోంది. అన్ని సౌకర్యాలు నిండిన ఆ ఆశ్రమంలో ఆ రాత్రి వారు సుఖంగా నిద్రించారు. మహారాజు కుమారుడు, ముల్లోకాలకి సార్వభౌముడు, పురుషోత్తముడు, లోక కల్యాణార్థం మానవుడిగా జన్మించిన లీలా నాటకసూత్రధారి, ఆ విధంగా చిత్రకూట పర్వతం మీద ఆశ్రమం నిర్మించుకుని, సీతా సౌమిత్రీ సమేతుడై అక్కడ నివసిస్తుండగా

గంగానదికి ఇవతలి తీరాన రాముడు, లక్ష్మణుడు, సీత నావమీద గంగానదిని దాటటం కళ్ళారా చూస్తూ గుహుడు, సుమంత్రుడు, కలత బారిన మనస్సులతో అక్కడ చాలా రోజులు వుండిపోయారు. మనస్సు కాస్త కుదుటబడ్డాక గుహుడు వెనక్కి మరలి తన నివాసానికి వెళ్ళాడు. సుమంత్రుడు మాత్రం మరి కొన్నాళ్ళక్కడే వుండి, రాముడు భరద్వాజాశ్రమానికి వెళ్ళిన సంగతి తెలుసుకున్నాడు. రాముడింక వెనక్కిరాడు అని నిశ్చయంగా తెలుసుకున్నాక, నిరాశతో అయోధ్యకి ప్రయాణమయ్యాడు.

గుహుని దగ్గర అనుమతి తీసుకుని రథంలో ప్రయాణమయ్యాడు. బరువెక్కిన మనస్సుతో ప్రయాణం చేస్తూ మూడవనాడు సాయంకాలానికి అయోధ్య చేరాడు. అయోధ్యానగరమంతా దుఃఖంలో మునిగివుండటం కళ్ళారా చూశాడు. సుమంత్రుడికి చెప్పరాని ఆవేదన కలిగింది. చింతాక్రాంతుడై రాజాంతఃపురం దాటి లోపల ప్రవేశించాడు. సుమంత్రుణ్ణి చూడగానె లోపలి జనమంతా రథాన్ని చుట్టుముట్టి 'ఏడీ మా రాముడు? ఎక్కడున్నాడు' అని ప్రశ్నల వర్షం కురిపించారు. వారికి జవాబుచెప్పలేక ముఖం దించుకుని, ముందుకి నడిచాడు. కాని వారంతా జవాబు చెప్పమని నిర్బంధించారు. అపుడు సుమంత్రుడు తలదించుకుని,

'అయ్యలారా నేను రామభద్రుని గంగాతీరం వరకు మాత్రమే తీసుకెళ్ళాను. కాని పరమధార్మికుడైన మన రాముడు, నన్ను వెనక్కి మరలి పొమ్మని చెప్పి,

తాను మాత్రం సీతాలక్ష్మణులతో కలసి గంగని దాటి, అవతలి తీరానికి వెళ్ళిపోయాడు. ఆయన ఆజ్ఞపై ఒక్కణ్ణే తిరిగివచ్చాను' అన్నాడు. అందరూ కళ్ళునిండా నీరు నిండగా భోరున విలపించారు. అంతఃపుర కాంతలందరూ ఒంటరిగా వస్తున్న సుమంత్రుణ్ణి చూసి కన్నీరు కారుస్తుండగా, సుమంత్రుడు తప్పు చేసినవాడిలా తలవంచుకు నడుస్తు ఏడు అంతఃపురాలు దాటి, ఎనిమిదో అంతఃపురంలో వున్న కౌసల్యాదేవి మందిరం చేరి, కౌసల్యనీ, దశరథుణ్ణి దర్శించాడు.

దశరథ మహారాజు పుత్రశోకంతో కృశించి, దీనావస్థలో వున్నాడు. సుమంత్రుడాయనకి అభివందనం చేసి జరిగిన సంగతంతా చెప్పి రాముడు చెప్పమన్న సందేశం వినిపించాడు. ఆ మాటలు విన్న దశరథుడొక్కసారి నేలమీదపడి మూర్ఛపోయాడు. అంతఃపుర స్త్రీలంతా గొల్లుమన్నారు. కౌసల్య, సుమిత్ర ఆయనని లేవదీసి మంచంమీద పడుకోబెట్టారు.

కౌసల్యమాత్రం దుఃఖం ఆపుకోలేక 'మహారాజా మన రాముడు పంపిన సందేశం విని కూడా మాట్లాడరేమిటి? నీతిమాలిన పని చేశానని సిగ్గుపడ్తున్నారా? లేవండి. మీకంతా శుభమే ఇకపైన కూర్చోండి. మాట్లాడండి. ఇక్కడ కైకేయి లేదు లెండి. మీరు భయపడక్కర్లేదు.' అంటు ఎత్తిపొడుపుగా మాట్లాడుతుంటే దశరథుడు కుమిలిపోతూ వెఱ్ఱివాడిలా చూడసాగాడు.

కొంతసేపటికి దశరథుడు తనని తాను సంబాళించుకుని సుమంత్రుణ్ణి దగ్గరకి రమ్మని పిల్చాడు. 'సుమంత్రా, మా రాముడిపుడెక్కడున్నాడు? ఏ చెట్టుకిందో కూర్చున్నాడా? రాజ్యభోగాలు మాత్రమే అనుభవించటానికి కలవాటు పడ్డ నా బంగారుతండ్రి అడవిలో ఎలాంటి కష్టాలు పడ్తున్నాడు? అతి సుకుమారి మా సీత ఆ కష్టాలన్నీ ఎలా పడగల్గుతోంది? వారు అడవులలో కెళ్ళేవరకు చూడగలిగిన నువ్వే భాగ్యశాలివయ్యా. వారు నాతో ఇంకా ఏం చెప్పమన్నారో చెప్పు. నీ మాటలే నా జీవితానికి ఆధారం' అన్నాడు.

ఆ మాటలువిన్న సుమంత్రుడికి దుఃఖం ఆగలేదు. 'మహారాజా, రామభద్రుడు మీకు, తన తల్లులకి పాదాభివందనాలు చెప్పమన్నాడు. ధర్మాచరణలో మీ పట్ల పరాకుగా వుండవద్దని కౌసల్యాదేవికి చెప్పమన్నాడు. ముఖ్యంగా కైకేయిని చాలా గౌరవంగా చూడమని చెప్పమన్నాడు.

ఇప్పట్నించీ భరతుడు మహారాజు. వయసులో చిన్నవాడైనా అధికారంలో గొప్పవాడు. కనక రాజుగా అతనిని గౌరవించమని చెప్పమన్నాడు. అలాగే

భరతుడితో తండ్రిగా మిమ్మల్ని గౌరవించమనీ, తల్లులందరియందు సమానమైన ఆదరం చూపమనీ చెప్పమన్నాడు. మహారాజా! కళ్ళనించి ఆగకుండా కారుతున్న కన్నీరు తుడుచుకుంటు రాముడు భరతునితో తన మాటలుగా ఇలా చెప్పమన్నాడు. నా తల్లియైన కౌసల్యకి నామీద పుత్రవ్యామోహమెక్కువ. కనక నేను లేని లోటు తెలియకుండా, మా అమ్మని, తన తల్లితో సమానంగా చూసుకోమని చెప్పమన్నాడు. ఆపైన ఇంక మాటలు రాక మౌనంగా వున్న రాముణ్ణి చూసి లక్ష్మణుడు ఆవేశంతో, ఇలా అన్నాడు ప్రభూ, 'అసలు మా నాన్నగారు రాజ్యానికి వారసుడైన రాముణ్ణి అడవులకి పంపటానికి కారణం ఏమిటి? కైకేయికి దాసుడై రాజుగా ఆజ్ఞాపించాడా? అది చేయకూడని పనికాదా? సుగుణవంతుడైన జ్యేష్ఠపుత్రుని అడవులకి పంపటం ఎంత తప్పు! అనాలోచితంగా ధర్మవిరుద్ధమైన, లోక విరుద్ధమైన నిర్ణయిం తీసుకోవటం ఉచితమేనా? ప్రజాభిమతానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకున్న ఆయన రాజెలా అవుతాడు? ఇక మీదట నేను ఆయనని తండ్రిగా అంగీకరించలేనని చెప్పండి. నాకు అన్న - తండ్రి , ప్రభువు, బంధువు, అందరూ రాముడే అని నాన్నగారితో చెప్పు' అని లక్ష్మణుడు మీతో చెప్పమన్నాడు ప్రభూ.

జానకమ్మ మాత్రం, నిశ్చేష్టురాలై నిలబడి, కన్నీటితో దీనంగా చూస్తూ నిలబడింది. అపుడు నేను 'అమ్మా, మీరు చెప్పేదేమైనా వుందా?' అని అడిగాను. కాని ఆ మహాతల్లి దుఃఖంతో మాటరాక, భర్తవైపు చూస్తూ కన్నీరు కారుస్తూ నిలబడింది. తన మీదికి ఒరిగిపోతున్న జానకిని రాముడు రెండు చేతులతో పొదివి పట్టుకుని, కన్నీరు కారుస్తు వుండిపోయాడు' అంటు సుమంత్రుడు చెప్పిన మాటలు వింటుంటే దశరథుడికి ఒక్కొక్క మాట గుండెల్లో శూలాల్లా గుచ్చుకోగా, ఎలాగో దుఃఖం దిగమింగి 'ఆ తర్వాత ఏం జరిగింది?' అని అడిగాడు.

సుమంత్రుడు కూడా గద్గద స్వరంతో, ఇలా చెప్పాడు. 'మహారాజా, నారబట్టలు ధరించి, రామలక్ష్మణులు మట్టిపాలలో తమకేశాలను జటాజూటాలుగా కట్టుకున్నారు. ఆపైన నావలో గంగానది దాటి ప్రయాగవైపు సాగిపోయారు. వారి నా స్థితిలో చూసి నా మనస్సు నా వశం తప్పిపోయింది. కొంతసేపు చూసి, గుఱ్ఱాలను మళ్ళించి కూడా ఒక వేళ రాముడు మళ్ళీ తిరిగి వస్తాడేమో అనే ఆశతో కొన్ని రోజులు గుహుడు, నేనూ అక్కడే రాముడి గురించి చర్చించుకుంటూ వుండిపోయాము. ఇంక రాడు అని నా మనస్సులో నిర్ధారణ చేసుకున్నాకనే తిరిగి వచ్చాను ప్రభూ' అని జరిగినదంతా వివరించాడు.

సుమంత్రుడు చెప్పినదంతా విన్నాక డగ్గుత్తికతో దశరథుడు, 'సుమంత్రా,

నేనెంత అవివేకిని! కైకేయి ముందుగా తన వరాలు చెల్లిస్తానని ప్రమాణం చెయ్యమన్నప్పుడు, ఆమె అనురాగాన్ని గుడ్డిగా నమ్మి ముందుగా అసలు సంగతి తెలుసుకోకుండా 'అలాగే' అని నా రాముని సాక్షిగా ప్రమాణం చేశాను. కాని ఇంతటి ఘోరమైన కోరిక కోరుతుందనీ కలలో కూడా అనుకోలేదు. అంతటి అనుచితమైన కోరిక ఆమె కోరికనపుడైనా, అనుభవజ్ఞులైన పెద్దలతో ఆలోచిస్తే ఎంత బాగుండేది! తొందరపడి ఆ నీచురాలి మాటలకి కట్టుబడిపోయాను. ఇంతకీ దైవలీల ఇలా వుంది. నేను నిమిత్త మాత్రంగా చూస్తు వుండవలసి వచ్చింది. విధి వైపరీత్యం అంటే ఇదే కదా. సూతా, నాకో ఉపకారం చేస్తావా? నా మనస్సు రాముణ్ణి చూడాలని తహ తహలాడుతోంది. ఒక్కసారి ఎలాగైనా రామునిదగ్గరకి తీసికెళ్ళు. మహారాజుగా నిన్నాజ్ఞాపిస్తున్నాను. వెళ్ళు రథం సిద్ధం చెయ్యి. లేదా, రామలక్ష్మణుల్ని మా సీతని వెనక్కి తీసుకురా. ఏదో ఒకటి చేసి నా ప్రాణం నిలబెట్టు. ఆహా! నా రాముడెంతటి చక్కనివాడు. వాడ్ని చూడకుండా నేనెలా బతగ్గలను? అయ్యో రామా, లక్ష్మణా, మా బంగారు తల్లీ సీతా, మిమ్మల్నెడబాసి దిక్కుమాలిన చావు చావమని నా నుదుట వ్రాసిఉందేమో' అని మనసు చెడి, దీనాతిదీనంగా ఏడుస్తు, ఏదేదో మాట్లాడుతున్న భర్తని చూసి ఆ ఆవేదనలో పరిస్థితి ఎలా విషమిస్తుందో అని కౌసల్య మనస్సు చలించిపోయింది.

ఆమె కూడా గజగజ ఒణుకుతు నేల మీద కొంతసేపు అచేతనంగా నేలపై పడి వుండి, కొంతసేపటికి తెప్పరిల్లి సుమంత్రుని చూసి ఇలా అంది.

'సుమంత్రా నన్ను కూడా నా రాముడున్న చోటుకే తీసికెళ్ళు' అంటూ వెఱ్ఱిచూపులు చూస్తు కన్నీరు కారుస్తున్న కౌసల్యని ఓదారుస్తూ సుమంత్రుడు,

'అమ్మా, బాధపడకండి. దుఃఖావేశంలో వివేకం కోల్పోటం తెలివిగలవారి లక్షణం కాదు. మన రాముడెపుడూ కష్టపడడమ్మా. లక్ష్మణుడు సేవలు చేస్తుండగా సీతారాములు అడవులలో ఆనందంగా విహరిస్తారు. రాముడు ధర్మజ్ఞుడు. ఆతడి నీడలో సీత కూడా సుఖంగా వుంది. రాజ్యంలో లేవన్న చింతకాని, పరిజనము లేరన్న బాధగాని, ఆమెకెంత మాత్రం లేవు. అయోధ్యలోని ఉద్యానవనాల్లో ఎలా విహరించిందో, అడవులలో కూడా అంత ఉత్సాహంగా, ఆనందంగా వుంది.

వాళ్ళిద్దర్ని చూసినపుడు, రాముడు లేకుండా సీత అయోధ్యలో వుండి వుంటే ఎలా వుండేదో కదా అనిపిస్తోంది. కాని ప్రభూ, నేను వీడ్కోలు చెప్తున్న సమయంలో మాత్రం సీత కైక గురించి ఏమో అంది గుర్తు రావటం లేదు' అన్నాడు.

ఆ మాటలు విన్న కౌసల్య దుఃఖంతో 'రామా, నా కుమారా' అంటూ దీనంగా విలపించింది.

తర్వాత మహారాజుని చూస్తూ, 'ఆర్యా, మీరు చాలా దయాశీలురు, ఉదార స్వభావులు. అని లోకంలో గొప్ప కీర్తి నొందారు. కాని అటువంటి మీరే ఈ వృద్ధాప్యంలో, లేక లేక కల్గిన ధర్మాత్ముడైన కుమారుని అడవిపాలు చేశారే. సత్యవాక్పరిపాలకునిగా ధర్మబద్ధులై కన్నకొడుకునే అడవులకి పంపారనే కీర్తి వస్తుందనా? నిజం ఆలోచించండి, రామ లక్ష్మణులు సీత అతి సుకుమారులే. చలి, ఎండ, వాన తట్టుకుని, వారు అడవిలోని క్లేశాలనెలా అనుభవించగలరు? అతి రుచికరమైన భోజనం మాత్రమే తినటానికి అలవాటుపడ్డ ఆ చిన్నారులు, అడవులలో తిరుగుతూ కాయకసరులు, కందమూలాలు, ఎలా తినగలరు? అంతః పురంలో శ్రావ్యమైన గీతాలు మాత్రమే వినటానికి అలవాటుపడ్డ సుకుమారమైన చెవులు, అడవులలో క్రూరమృగాలు చేసే భీకరమైన గర్జనలు విని ఎంతగా భయం పొందుతాయో కదా. హంస తూలికా తల్పాలపై నిదురించేవారు, కటిక నేలమీద చెయ్యిమాత్రం తలకింద పెంచుకుని, ఎలా నిద్రిస్తున్నారో కదా. దయమాలిన మీరు, నా బిడ్డలు ముగ్గుర్నీ అడవులకి పంపి తీరని ద్రోహం చేశారు.

పద్నాలుగేళ్ళ తర్వాత రాముడు తిరిగి వచ్చినా, భరతుడు, రాముడికి రాజ్యాన్ని ఇస్తాడన్న నమ్మకమేమిటి? ఒకవేళ భరతుడు ఇచ్చినా ఎంతో పౌరుషం గల రాచబిడ్డ రాఘవుడు, మళ్ళీ తీసుకునేందుకు ఒప్పుకుంటాడా? పెద్దపులి ఎంగిలి కూడా తినదు. అలాగే తమ్ముడు అనుభవించి వదిలిన రాజ్యాన్ని కూడా, మన రాముడు స్వీకరించడు. అంతే కాదు. జరిగిన అవమానాన్ని మానధనుడైన రామభద్రుడెలా సహిస్తాడు? కోపం వస్తే మందరగిరినైనా రెండు ముక్కలుగా చీల్చగల పరాక్రమశాలి., కేవలం తండ్రి అనే గౌరవం చేత మీమాట మీరలేక శిరసావహించాడంతే. ధర్మనిరతుడైన కుమారుని అడవులకి పంపి, ధర్మవర్తనులన్న మీ కీర్తి అసత్యమని ఋజువు చేశారు.

సాధారణంగా లోకంలో ప్రతి స్త్రీకి భర్తమాత్రమే ప్రధాన రక్షకుడు. కాని నాకు రక్షకులుగా వుండవలసిన మీరు మాత్రం రక్షకులు కాలేదు. మీ తర్వాత రక్షకుడైన నా కుమారుని అడవులకి పంపారు. నాకు బంధువులు కూడా ఎవ్వరూ లేరు. అయ్యో, అందరూ వుండి నేను అనాథనైపోయానే. నేనే కాదు. ఈ కోసల రాజ్యమే అనాథ అయిపోయింది. మీ ముద్దుల భార్యకైక మీ కత్యంత ప్రేమపాత్రుడైన భరతుడు తప్ప వేరెవ్వరూ సంతోషంగా లేరు' అంటూ కౌసల్య దుఃఖం పట్టలేక ఆవేశంతో దశరథుని అనేకవిధాల నిందించింది.

శూలాల్లాంటి ఆ మాటలు విని దశరథుడెంతో కుమిలిపోయాడు. 'ఇంతటి

నా శోకానికి కారణమేమిటి? నేను చేసిన తప్పేమిటి?' అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. అంతలో ఆయన కేదో స్ఫురించింది.

చిన్నతనంలో యౌవ్వనవయస్సులో వుండగా, శబ్దవేధి అనే ఒక శక్తివంతమైన విద్య నేర్చుకున్నపుడు, తనకి తెలియకుండా ఒక పొరపాటు జరిగిపోయింది. జంతువు ఎక్కడుందో తెలియకపోయినా కేవలం అదిచేస్తున్న శబ్దాన్ని బట్టి బాణప్రయోగం చెయ్యగల శబ్దవేధి నభ్యసించినపుడు, అది తనకి ఎంతవరకు పట్టుబడిందో తెల్సుకుందుకు బాణం ప్రయోగించటం వల్ల ఒక ఘోరమైన ప్రమాదం జరిగి ఒక ముని బాలకుడు ఆ బాణం వల్ల చనిపోయాడు. ఆ సంఘటన ఆయనకి గుర్తు వచ్చింది. దుఃఖం రెట్టింపు కాగా భయంతో నిలువెల్లా వణికిపోయాడు.

నోటికి వచ్చినట్టల్లా నిందిస్తున్న కౌసల్యకి రెండు చేతులూ జోడించి, నమస్కారం పెట్టి, ఊరుకోమని ప్రార్థించాడు. క్షమించమని వేడుకున్నాడు.

'కౌసల్యా శత్రువుల పట్ల కూడా ఎపుడూ ఇంత క్రూరంగా ప్రవర్తించావా, ఎపుడైనా? నేను సాక్షాత్తు నీ భర్తని కదా. స్త్రీకి పతియే ప్రత్యక్షదైవము కదా. అన్ని ధర్మములు తెలిసినదానివి. నీకు దుఃఖం కలిగిన మాట నిజమే. సున్నితమైన మనస్సు కల్గిన నువ్వు ఇంత పరుషంగా నన్ను దూషించటం న్యాయమేనా? నన్ను క్షమించు' అంటు రెండు చేతులూ పట్టుకుని వేడుకున్నాడు. కౌసల్య పెద్దగా ఏడుస్తూ తలబాదుకుంటూ, 'ప్రభూ, అనుగ్రహించండి. మీకు సాష్టాంగ నమస్కారం పెట్తాను. మీరు నన్ను క్షమించమని ప్రార్థించటమేమిటి? ఇది ఉచితమేనా? అంతశక్తి నాకెక్కడిది? నన్ను చంపి పుణ్యం కట్టుకోండి.

ధర్మవర్తనుడు, యశశ్శాలి అయిన భర్తచేత క్షమాపణ అడిగించుకోవటం కన్నా పాపం వుందా? నాకు పుట్టగతులున్నాయా! పుత్రశోకం భరించలేక అనరాని మాటలన్నాను. అంతేకాని ధర్మం తెలియని మూర్ఖురాలను కాదు. శోకము వివేకాన్ని, ధైర్యాన్ని నశింపజేస్తుంది. శోకాన్ని మించిన శత్రువు లేదు. రాముడు అడవులకి వెళ్ళి ఇవాల్టికి ఐదురోజులైంది. ఇది ఐదవరాత్రి. ఈ ఐదురోజులు ఐదు యుగాల్లా గడిచాయి. రాముడ్ని మర్చిపోలేక నామనస్సులో దుఃఖం అంతకంతకీ పెరిగిపోతోంది. నన్ను మన్నించండి' అంటు భర్తని అనునయించింది కౌసల్య.

నలుదిశలా చీకట్లు ముసురుకున్నాయి. దశరథుడు కౌసల్యఒడిలో మెల్లిగా నిద్రలోకి జారుకున్నాడు. మర్నాడు కూడా అలాగే గడిచింది. గడిచిపోయిన

సంఘటనల్ని నెమరు వేసుకుందుకు ప్రయత్నించసాగాడాయన. కౌసల్యని దగ్గరగా రమ్మని, ఆమెతో ఏదో చెప్పాలని ఆరాట పడ్తూ గొంతు పెగలక కొంతసేపు తాపత్రయపడ్డాడు. ఆ తర్వాత గుండె చిక్కబట్టుకుని భార్యనోదారుస్తూ 'కల్యాణి, మంచి చెడులు రెండూ కూడా మన స్వయంకృతాలవల్లే సంభవిస్తాయి. ఎవరో ఏదో చేశారనుకోవటం చాలా పొరపాటు. పసివాళ్ళు అనాలోచితంగా తమకిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తారు. అది పసితనం కనక. కాని నేను పసివాడ్ని కాను. మూర్ఖుడ్ని.

మధురమైన ఫలాలు ఇచ్చే మామిడిచెట్టు నరికి, ఆకర్షణీయమైన పూలగుత్తులుంటాయని ఎవరైనా మోదుగ చెట్టుపెంచుకుంటారా? ఏడాదికోసారి పూసి కాయలు కాసినా మామిడిచెట్టువల్ల ఎంతో లాభం వుంది. ఏడాదంతా అందమైన పూలు గుత్తులుగా పూసినా అవి నిష్ప్రయోజనం. మూర్ఖులు మాత్రమే మామిడిచెట్టు నరికి మోదుగ చెట్టు పెంచుతారు. నేనూ అలాంటి మూర్ఖుడ్ని. ప్రజలంతా ఆరాధించే రాముడ్ని అడవికి పంపి నా తెలివితక్కువతనానికి కుమిలి కుమిలి ఏడుస్తున్నాను. కాని, దేవీ, ఇలా నాకు శోకం కలగటానికి కారణం, నేను వయస్సులో వున్నపుడు చేసిన దారుణమే. అదిపుడిపుడే నాకు గుర్తువస్తోంది.

ఆ సంగతంతా నీకు చెప్తే కాని నాకు మనశ్శాంతి లేదు. విను. నేను చిన్నపుడు శబ్దవేధి అనే ధనుర్విద్య నేర్చుకున్నాను. అప్పటికింకా మన వివాహం కాలేదు. నేను యువరాజుని. ఒకనాడు ఆకాశమంతా నల్లని మబ్బులు కమ్మి విపరీతంగా వాన కురుస్తోంది. అపుడు నేను సరయూనదీ తీరాన వేటలో వున్నాను. చెట్లచాటున పొంచివున్నాను. వాన వెలిసింది. అన్నివేపులా చీకట్లు ముసురుకుని వున్నాయి. ఎక్కడ్నించో ఏనుగు నీరుపీలుస్తున్న శబ్దం వినిపించింది. వెంటనే శబ్దవేధినుపయోగించాను. అంతే ఆ చీకటిలో ఒక తపశ్శాలి వేసిన చావుకేక వినిపించింది.

అతడు బాధతో 'అయ్యో, నావంటి తపశ్శాలిపై బాణంవేసిన ఆ ధూర్తుడెవరు? చీకటిలో నీటికోసం నదికి వచ్చానే, నాకు శత్రువులున్నారా? నేనెవరికీ ఎపుడూ అపకారం చెయ్యలేదే! నన్ను చంపటం వల్ల ఎవరికి లాభం? నేను చనిపోతున్నానన్న బెంగలేదు. కాని వయోవృద్ధులైన నా తల్లిదండ్రులకింక దిక్కెవరున్నారు? నేను లేనిదే వారెలా జీవించగలరు?' అంటు దీనాతిదీనంగా విలపిస్తున్న ముని బాలకుని మాటలు వినిపించాయి.

భయంతో గజగజ ఒణుకుతూ ఆ మాటలు వినిపించిన దిక్కుకెళ్ళాను. బాణం గుచ్చుకుని సరయూనది ఒడ్డున పడివున్న ముని కుమారుడు కనిపించాడు.

జరిగిన పొరపాటు అర్థమైంది. అతడు సన్నమూతి వున్న కడవ నీటిలో ముంచినపుడు వచ్చిన శబ్దం నాకు ఏనుగు నీళ్ళు త్రాగుతున్న ధ్వనిలా వినిపించి, ఇంత దారుణం జరిగింది. అతడు మరణావస్థలో రక్తంలో పడి కొట్టుకుంటున్నాడు. ఒళ్ళంతా రక్తం, బురద, కలిసి అంటుకుని వున్నాయి.

అతడు నా వైపు కోపంగా చూశాడు. 'అయ్యో, అడవులలో నివసించే నేను నీకేం అపకారం చేశాను? వృద్ధులు, గుడ్డివాళ్ళు అయిన, నా తల్లిదండ్రుల దాహం తీర్చటానికి నేను తెల్లారగానే నిద్రలేచి నీటికోసం నదికి వచ్చాను. ఇపుడీ బాణం వేసి నన్నేగాక, వారిని కూడా వధించావే. నా తల్లిదండ్రులు దాహంతో బాధపడ్తూ మంచి నీళ్ళు తెస్తానని ఎదురుచూస్తూ వుంటారు. నేనిక్కడిలా మరణావస్థలో వున్నానని, వారికెలా తెలుస్తుంది? తెలిస్తే మాత్రం వారెలా రాగలరు? నువ్వు వెంటనే వారి దగ్గరకి వెళ్ళి, వారి దాహం తీర్చి, ఈ సంగతి వారికి చెప్పు. అదిగో ఆ కనబడే కాలిబాటవెంట తిన్నగా వెళ్తే మా ఆశ్రమం వస్తుంది. అక్కడికెళ్ళి వారిని అనుగ్రహించమని వేడుకో. అయ్యో, ఈ బాణము బాధ నాకు ప్రాణాంతకంగా వుంది. ఈ బాధ భరించశక్యం గాకుండా వుంది. అయ్యో, వెంటనే ఈ బాణం లాగి నా బాధ తగ్గించు'అని వేడుకున్నాడు.

నా పరిస్థితి అడకత్తెరలో పోకలా అయింది. బాణం లాగేస్తే అతడు చచ్చి పోతాడు. తియ్యకపోతే, మరణవేదన పడుతున్నాడు. ఏం చెయ్యాలో తోచలేదు.

నాకు కళ్ళనీరు ధారాపాతంగా కారుతోంది. తప్పుచేసినందుకు తలదించు కున్నాను. పశ్చాత్తాపంతో క్రుంగిపోతున్నాను. నా అవస్థ ఆ ముని గ్రహించాడు. తన బాధ దిగమింగుతూ ఇలా అన్నాడు.

'రాజా, అకారణంగా నన్ను చంపానని బాధపడకు. ఈ బాణం ఎలాగైనా నా ప్రాణం తీసి తీర్తుంది. బ్రహ్మహత్య చేశానని బాధపడుతున్నావేమో. ఆ భయం నీకు లేదు. నా తండ్రి వైశ్యుడు. నా తల్లి శూద్రస్త్రీ. వారిద్దరికీ కలిగిన పుత్రుణ్ణి నేను కనక నీకు బ్రహ్మహత్యాపాతకం తగలదు' అంటు బాధకి ఓర్వలేక, రొప్పుతూ, నేలమీద పొర్లుతూ, బాధతో గిల గిల లాడసాగాడు. ఆ బాధచూడలేక, నేను బాణం లాగేశాను. నావైపు దీనంగా చూస్తు అతడు ప్రాణాలు వదిలాడు. నా మనస్సంతా విషాదంతో నిండిపోయింది. నా అజ్ఞానం వల్ల మహాపాపం జరిగిపోయింది. నా తప్పుదిద్దుకోవాలనే తలంపుతో, ఆముని శరీరాన్నక్కడే వదిలేసి, కడవ నిండా నీరు నింపి, కాలిబాట వెంబడి ఆశ్రమం చేరాను.

ఆ ఆశ్రమంలో రెక్కలు తెగిన పక్షుల్లా కూర్చున్న అతడి ముసలి

తల్లితండ్రులు కనిపించారు. ఇద్దరూ అంధులు. ఒద్దికగా కూర్చుని కొడుకు కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళని చూడగానే నా మనస్సు శోకంతో, భయంతో నిండిపోయింది. మెల్లిగా వారిని సమీపించాను. ఆ సవ్వడికి వారు నా వైపు తిరిగి, 'నాయనా, ఇంతాలస్యమైందేం? చాలా దాహంగా వుంది. తొందరగా నీళ్ళియ్యి తండ్రీ' అంటు తడుముకుంటూ నన్ను తాకబోయారు. నేను క్రుంగిపోయాను. ఎలాగో గుండె చిక్కబట్టుకుని 'అయ్యా, నేను మీ అబ్బాయిని కాదు. నా పేరు దశరధుడు. ముందీ మంచినీళ్ళు త్రాగండి, అని వారి దాహం తీర్చి, జరిగిన సంగతంతా వారికి వివరించాను.

అంతే మొదలు నరికిన వృక్షాల్లా, వాళ్ళిద్దరూ నేలమీద పడిపోయారు. గుండెలు పగిలేలా ఏడుస్తు 'రాజా, మీరు స్వయంగా వచ్చి, ఈ సంగతి మాకు చెప్పకపోయినట్లైతే నీ తల వెయ్యిముక్కలై వుండేది. వానప్రస్థములో వుండే వారిని క్షత్రియులు తెలిసి చంపితే, మహాపాపం కల్గుతుంది. కాని నువ్వు తెలియక చంపావు. పైగా పశ్చాత్తాపంతో, నీ అంతట నువ్వే వచ్చి, మాకు చెప్పావు. నీదారిని నువ్వు పోయి వుంటే నీ తల పగిలి నువ్వు చావటమే గాక, నీ ఇక్ష్వాకువంశమే అంతమైపోయి వుండేది. మా అబ్బాయి సరయూనది ఒడ్డున పడివున్నాడన్నావు కదూ, మమ్మల్ని అక్కడికి చేర్చునాయనా. కడసారిగా వాడ్ని తడిమి చూసుకుంటాము. ఇదే నువ్వు మాకు చేసే ఉపకారం అని వారు ప్రాధేయపడ్డారు.

వెంటనే వారిద్దర్నీ ఒక కావిడిలో కూర్చోబెట్టి వారి కుమారుడున్న చోటుకి తీసికెళ్ళాను. వాళ్ళిద్దరు హృదయ విదారకంగా ఏడుస్తూ కొడుకు శరీరంపై వాలిపోయారు. కొడుక్కి సద్గతులు కలగాలని దైవాన్ని ప్రార్థిస్తు జలతర్పణాలు విడిచారు.

తల్లిదండ్రులను పూజించిన ఫలితంగా వారి కుమారుడు దివ్యమైన విమానంలో స్వర్గానికి వెళ్ళాడు. వారు మళ్ళీ కొడుక్కి తర్పణాలు వదిలారు. నేను వారికి నమస్కరించి ఖిన్నుడనై నుంచున్నాను. అపుడాతడి తండ్రి నా వంక తిరిగి, 'దశరథా, నా ఒక్కగానొక్క కుమారుణ్ణి చంపి నాకు చాలా దుఃఖం కలిగించావు. ఇపుడు మేమిద్దరం దిక్కులేని వాళ్ళమయ్యాము. నా కింక బతకాలని లేదు. ఏ బాణంతో నా కుమారుని ప్రాణం తీశావో, ఆ బాణంతోటే నన్ను చంపు. అంతే కాదు. నేనిపుడెలాంటి పుత్రశోకం అనుభవిస్తున్నానో, నువ్వు కూడా అవసానదశలో అలాంటి పుత్రశోకంతోనే మరణిస్తావు' అంటూ మనస్తాపం భరించలేక నన్ను శపించాడు. ఆ దంపతులిద్దరూ చాలాసేపు రోదించి, ఆ తర్వాత తమ కుమారునికి చితిని పేర్చి, ఆ మంటల్లోనే వారిద్దరూ కూడా సజీవదహనమై స్వర్గానికి వెళ్ళారు.

కౌసల్యా, నేను చిన్నపుడు చేసిన పాపానికి ఫలితమే ఇపుడనుభవిస్తున్నాను. ఆ ముని ఔదార్యంతో పుత్రశోకంతో చనిపోతానని నాకు శాపాన్నే వరంగా ఇచ్చాడు. ఆ మహానుభావుని దీవన వల్ల నాకు నల్గురు కుమారులు కలిగినా, నా అవసానదశలో ఒక్క కొడుకు కూడా నా దగ్గర లేడు' అంటూ దశరథుడు గతాన్ని నెమరేసుకుని, తన తప్పిదం గురించి కౌసల్యకి చెప్పాడు.

'దేవీ, నాకు కన్నులు కనిపించటం లేదు. నా రాముని చేతిస్పర్శకై నా హృదయం పరితపించిపోతుంది. కాని అదిపుడు లభించదు. కనీసం నువ్వైనా, నీ చల్లని చేతితో నన్ను స్పృశించు. నీ చేతి స్పర్శ కూడా రాముని చేతి స్పర్శలాగే వుంటుంది. కౌసల్యా ఇంక నేను బ్రతకను. అదిగో యమదూతలు తొందరపెడ్తున్నారు. హా రామా, నా చక్కనయ్యా - ఎక్కడున్నావు తండ్రీ. కడసారి నిన్ను చూసే భాగ్యం లేకపోయింది. కౌసల్యా - సుమిత్రా నేనింక వెళ్ళిపోతాను. నా కులాన్ని నాశనం చేసిన పాతకీ, కైకా, నా శత్రువువైన నీ మూలంగా ప్రాణాలు విడుస్తున్నాను' అంటూ దశరథుడు కౌసల్యా సుమిత్రల సన్నిధిలో దీనంగా ఏడుస్తూ, మంచం మీద ఒరిగిపోయాడు. కౌసల్యా - సుమిత్రా కూడా ఏడుస్తూ ఆ మంచంమీద తలలు వుంచి కింద కూర్చుని అలాగే నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి సమయాన ఏడ్చి ఏడ్చి దశరథుడు ప్రాణాలు వదిలాడు. నిద్రలో వున్న వారిద్దరు ఆ సంగతి తెలుసుకోలేక పోయారు. ఆ రాత్రి గడిచి తెల్లారింది. వంది మాగధులు వచ్చారు.

వారు చేస్తున్న సుప్రభాతాలు, గానాలు, ఆశీర్వచనాలూ, స్తోత్రాలు, మంగళవాద్యాలఘోషలతో రాజభవనమంతా కోలాహలంగా వుంది.

పరిచారికలు మహారాజుకి మంగళస్నానాలు చేయించటానికి, మంచిగంధం, సుగంధ లేపనాలు, బంగారు చెంబులు తెచ్చారు. అలంకరణ సామాగ్రి సిద్ధపరిచారు. కాని ఎంతసేపటికీ మహారాజు బయటకి రాలేదు. వారు కౌసల్య మందిరం దగ్గరకి వెళ్ళి మేలుకొలుపులు పాడారు కాని దశదరథుడు, కౌసల్య, సుమిత్ర చలనం లేకుండా పడివున్నారు.

పరిశీలించి చూశాక, మహారాజుగారు మరణించారని తెలిసింది. అంతా ఒక్కసారి గొల్లుమన్నారు. ఆ రోదనధ్వనికి కౌసల్యా - సుమిత్రా నిద్రలేచారు. జరిగినది తెలుసుకుని 'హా నాథా అంటూ వారిద్దరూ తెలివితప్పి కిందపడ్డారు. నేలమీద దుమ్ములో పడి పొర్లి పొర్లి ఏడ్చారు. కైకేయి కూడా ఏడుస్తూ అక్కడికి వచ్చింది. అంతఃపురమంతా ఏడుపులతో దద్దరిల్లిపోయింది. కౌసల్య భర్త తల ఒడిలో వుంచుకుని, దారుణంగా ఏడుస్తూ కైకేయిని చూసి, 'కైకా నీ కోరిక తీరింది

కదా. ఇంక నిరాటంకంగా ఈ రాజ్యాన్ని ఏలుకో. నీ దుష్టప్రవృత్తితో మహారాజుని బలితీసుకున్నావు. నా రాముడు, అడవుల పాలైయ్యాడు. భర్త స్వర్గస్థుడయ్యాడు. ఇంక నేను జీవించను. ఆ మంథర మాటలు నమ్మి నువ్వు రఘువంశాన్ని నాశనం చేశావు. నీ అధర్మమైన కోరిక వల్ల ధర్మజ్ఞుడైన నా కొడుకు భార్యతో కూడా అడవులకి వెళ్ళాడు కదా. అయ్యో! ఈ సంగతి తెలిసి జనక మహారాజెంత కృంగిపోతాడో. తండ్రి మరణవార్త తెలిస్తే సీతారామలక్ష్మణులెంత దుఃఖిస్తారో కదా. ఈ ఆవేదన నేను భరించలేను. నా భర్తతో పాటు నేనూ సహగమనం చేస్తాను' అంటూ కన్నీరు మున్నీరుగా రోదించింది.

రాజ్యకార్యనిర్వాహకులు, ఆమెని ఓదార్చి పక్కగా కూర్చోబెట్టి, దశరథుని భౌతిక కాయాన్ని చెడిపోకుండా, నూనె నింపిన తొట్టిలో పడుకోబెట్టారు. కొడుకులెవరూ దగ్గర లేరు కనక, అంతిమ సంస్కారం చేసేవారు లేరు. వారు వచ్చేవరకు పదిలంగా తైలద్రోణిలో ఆ శరీరం పదిలపరచటం చూసి, అంతఃపుర కాంతలు పెద్దపెట్టున ఏడ్చారు.

'మహారాజా, మీరు కూడా మాకు దూరమైపోయారా, ప్రియపుత్రుడు రాముడు అడవులకి వెళ్ళిపోయాడు. పరమ పాతకి ఈ కైక మమ్మల్ని భర్తకి, రామునికీ కూడా దూరం చేసింది. ఇంక మాకు రక్షకులెవరు? ఇకమీదట కైక మమ్మల్ని కూడా హింసించక ఊరుకుంటుందా. అయ్యో, మేమిపుడు విధవలమే గాక, అనాథలము కూడా అయిపోయామే' అంటూ వారనేక విధాల రోధించారు. అలా ఆ రోజంతా ఏడుపులతో గడిచిపోయింది. రాత్రి అయింది. రాజబంధువులు, మంత్రులు మొదలైన ప్రముఖులంతా వచ్చారు. అయోధ్యలో అన్నివైపులా విషాదం అలముకుంది.

దశరథుడు లేని రాజధాని దీనంగా, నిస్తేజంగా వుంది. స్త్రీలంతా కైకేయిని దూషిస్తూ కుమిలిపోతున్నారు. ఆ రాత్రి దీర్ఘంగా గడిచింది.

తెల్లారింది. పెద్దలంతా ఆలోచించి, ఎవర్నో ఒకర్ని రాజుగా అభిషేకం చెయ్యాలని సంకల్పించారు. మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, జాబాలి మొదలైన బ్రాహ్మణోత్తములంతా సభతీరారు. వారంతా వశిష్ఠునితో ఇలా అన్నారు.

'ఆర్యా మహారాజుగారు అస్తమించిన ఒక్కరాత్రి, నూరు సంవత్సరాల్లా గడిచింది. రాజకుమారులెవరూ చెంతలేరు. రాజులేని రాష్ట్రము వినాశనము పొందుతుంది.

కనక మీరు ఆలోచించి ఇక్ష్వాకు వంశానికి చెందిన వారినెవర్నైనా రాజుగా అభిషేకించండి. దేశం అరాచకమైతే వానలు కురవవు. కరవు కాటకాలు విలయతాండవం చేస్తాయి. తండ్రిమాట పిల్లలు వినరు. భార్యలు భర్తల్ని నిర్లక్ష్యం చేస్తారు. కన్యలకు వివాహాలు జరగవు. ప్రజలంతా నిరుత్సాహంగా చైతన్య రహితంగా వుంటారు. దేవాలయాలలో అర్చనలు నియమంగా సాగవు. యజ్ఞాలు, క్రతువులు జరగవు. అవినీతి, లంచగొండితనం పెరిగిపోతాయి. దొంగతనాలు ఎక్కువవుతాయి. సామంతులు ఎదురు తిరుగుతారు. శత్రువులు దండెత్తి విప్లవం సృష్టిస్తారు. దేశానికి ఏలిక లేనపుడీ ఉపద్రవాలన్నీ జరిగి తీరుతాయి. సమర్ధుడైన రాజు వున్నప్పుడే దేశం సుభిక్షంగా వుంటుంది. కనక మహర్షీ, ప్రజలందరికీ మీమీద గౌరవం వుంది. మీ నిర్ణయం వారు కాదనరు. కనక వెంటనే ఇక్ష్వాకు వంశపు రాజకుమారుని కెవరికైనా ఈ కోసల దేశానికి రాజ్యాభిషేకం చెయ్యండి. దేశాన్ని ఆపదనించి కాపాడండి' అన్నారు.

అపుడు వశిష్ఠుడిలా అన్నాడు. 'పెద్దలారా! రాజుగా అభిషేకం పొందవలసిన భరతుడు, మేనమామ గారింట వున్నాడు. వెంటనే శీఘ్రంగా పరిగెత్తగల వాయువేగం కలిగిన ఉత్తమ జాతి గుఱ్ఱాలమీద దూతల్ని పంపించి అతడ్ని పిలిపిద్దాము అంతవరకు ఓపికపట్టక తప్పదు. అని చెప్పి సిద్ధార్థుడు, విజయుడు, జయంతుడు అశోకుడు, నందనుడు, అనే ఐదుగురు దూతల్ని పిల్చి 'మీరు తొందరగా బయల్దేరి వెళ్ళి నామాటగా భరతునితో ఇలా చెప్పండి.

'కుమారా, తమ పురోహితులైన వశిష్ఠులవారు మిమ్ము కుశలం అడిగారు. మీతో ఒక అత్యవసరమైన పని వుందనీ, వెంటనే మిమ్మల్ని మాతో బయల్దేరి రమ్మనీ అన్నారు' అని మాత్రం చెప్పండి. రాముడు అడవులకి వెళ్ళిన సంగతి గాని, దశరథ మహారాజు మరణించిన సంగతిగాని, అక్కడ ఎవ్వరికీ చెప్పకండి. అటువంటి దుఃఖం మీ ముఖాల్లో కనిపించనివ్వకుండా గంభీరంగా వుండండి. భరతుని మేనమామకి, తాతగారైన కైకేయ రాజుకి, పట్టుబట్టలు, వజ్రాభరణాలు తీసికెళ్ళండి. భరతుడికీ శత్రుఘ్నుడికి కూడా కానుకలివ్వండి. మీరు వెంటనే బయల్దేరి వెళ్ళి, ఇక్కడున్నట్లుగా భరతుణ్ణీ, శత్రుఘ్నుణ్ణీ వెంటబెట్టుకురండి' అని చెప్పాడు.

వారు తగిన సామాగ్రితో వెంటనే బయల్దేరి, అపరతాలము అనే పర్వతం చివరకి వెళ్ళి, ప్రలంబనము, అనే పర్వతం ఉత్తరం వైపుగా ప్రయాణమై వెళ్ళారు. హస్తినాపురికి దగ్గరగా వున్న గంగానదిని దాటి, పశ్చిమంగా ప్రయాణం చేశారు. అక్కడ్నించి పాంచాల దేశం చేరారు. అక్కడ్నించి కళింగ పట్టణం చేరారు.

అక్కడ ఇక్షుమతీ నదిని దాటి, సుదామము అనే వూరు చేరారు. ఎక్కడా ఆగకుండా, ఎన్నో శ్రమలకోర్చి, ముందుకు సాగి, కేకయ రాజ్యం చేరి, గిరివ్రజము అనే పట్టణంలోకి ప్రవేశించారు. అప్పటికి రాత్రి అయింది.

ఏ రాత్రి అయితే, దూతలు, గిరి వ్రజపురంలో ప్రవేశించారో, అదేరోజు రాత్రి మేనమామ గారింట వున్న భరతునికి ఘోరమైన దుస్వప్నం ఒకటి వచ్చింది. ఆ స్వప్నం తలుచుకుని, ఎంతటి అశుభవార్త వినవలసి వస్తుందో, అని భరతుడు, చాలా కలవరపడ్డాడు.

చింతాక్రాంతుడై ఒంటరిగా కూర్చున్న భరతుడ్ని చూసి, అతడికి వినోదం కలిగించటానికతని మిత్రులెన్ని ప్రయత్నాలో చేశారు. కాని భరతుడు అవేం పట్టించుకోకుండా ఖిన్నుడై దిగులుగా కూర్చున్నాడు. అది చూసి దంబకుడనే అతడి ప్రియమిత్రుడు 'నేస్తమా? ఇంత దిగులుగా వుండటానికి కారణమేమిటి?' అని అడిగాడు.

భరతుడతడివంక దీనంగా చూస్తు, 'చెలికాడా నా మనస్సులో బాధ నీతో చెప్పుకుంటేనైనా తగ్గుతుందేమో. నిన్నరాత్రి నాకు ఒక చెడ్డ కల వచ్చింది. అదేమిటంటే, మా నాన్నగారు జుట్టు విరబోసుకుని, ఒక పర్వతం మీదినించి పేడమడుగులో పడిపోయారట. అందులో కప్పలా ఈదుతూ, అంతలో ఇంకొక నూనెమడుగులో పడిపోయి, దోసిలితో ఆ నూనె తాగుతున్నారట. ఆపైన తలవంచుకుని కూర్చుని నువ్వులు అన్నం కలుపుకుని, మళ్ళీ మళ్ళీ తింటున్నారట. ఒళ్ళంతా నూనె పూసుకొని, నూనెలో పడివున్నారట. ఇలా మా తండ్రిగారి గురించి చాలా అశుభమైన కల వచ్చింది. ఇంకా ఆ కలలో నీరులేని సముద్రం కనిపించింది. ఆకాశం నుంచి చంద్రుడు నేలమీద పడిపోయినట్లు కనిపించింది. లోకమంతా చీకటిగా అయిపోయిందిట. రాజుగారి పట్టపుటేనుగు దంతం విరిగిపోయిందిట. అగ్నిహోత్రం చల్లారినట్లు భూమి క్రుంగినట్లు చెట్లు మోడులైనట్లు, పర్వతాలు పొగలు చిమ్ముతున్నట్లు మానాన్నగారొక ఇనప పీటమీద కూర్చుని, నల్లని బట్టలు కట్టుకుని, వుండగా నలుగురు గౌరవర్ణం కలిగివున్న స్త్రీలు ఆయనని చూసి నవ్వారట. మహారాజు ఎఱ్ఱని పూలమాల ధరించి, ఎఱ్ఱ చందనం పూసుకుని, గాడిదలు కట్టిన రథం మీద, దక్షిణదిశగా వేగంగా వెళ్ళిపోతున్నట్లు కనిపించారు. ఎఱ్ఱని బట్టలు కట్టుకున్న ఒక రాక్షసి వార్ని బలంగా లాగిందట. ఇంతటి భయంకరమైన కలవచ్చింది. గాడిదలు కట్టిన రథం మీద ఎవరైనా ప్రయాణం చేసినట్లు కలవస్తే అలాంటి వ్యక్తి చితిపైకెక్కి అగ్ని సంస్కారం చూస్తాడని శాస్త్రాలు చెప్తున్నాయి. అందుకే, ఎంతటి దారుణమైన పరిస్థితిని చూడవలసి వస్తుందో

అని, దిగులుగా వుంది. నా మనస్సేదో కీడు శంకిస్తోంది. తెల్లవారుఝామున వచ్చిన కలలు నిజమవుతాయని అంటారు. మా నాన్నగారి కేదో ఆపద కలిగిందని నా మనస్సు గట్టిగా చెప్తోంది' అంటూ భరతుడు గద్గద స్వరంతో చెప్పాడు. అంతలో దూతలు కేకయరాజ్యం వచ్చి రాజగృహం చేరి, యుధాజిత్తుని దర్శించారు. తాము తెచ్చిన కానుకలు సమర్పించి సత్కరించారు.

ఆయన అనుమతిపై భరతుని దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, కానుకలు ఇచ్చి వశిష్ఠులవారు చెప్పమన్నమాటలు చెప్పారు. అసలే వ్యాకులచిత్తంతో వున్న భరతుడు వారిని చూడగానే 'నాన్నగారు కుశలమేనా, రామలక్ష్మణులు ఆరోగ్యంగా వున్నారా? ధర్మజ్ఞురాండ్రైన కౌసల్య - సుమిత్ర, మా తల్లి, అంతా క్షేమమేనా?' అని అడిగాడు ఆత్రుతగా. అపుడా దూతలు

'రాకుమారా, మీరెవరెవరు కుశలంగా వుండాలని కోరుకుంటున్నారో, వారంతా కుశలమే. మిమ్ము తొందరలో లక్ష్మి వరించబోతోంది. మీకు మంగళం కల్గుతుంది. తొందరగా రథం ఎక్కి ప్రయాణమవ్వండి' అన్నారు.

భరతుడి మనస్సులో అనుమానం ఎక్కువైంది. తాతగారి దగ్గరా, మేనమామ దగ్గర సెలవు తీసుకుని, శత్రుఘ్నునితో కూడా రథం ఎక్కి ప్రయాణమయ్యాడు. మేనమామ, తాతగారు వాళ్ళకి వెలలేని కానుకలిచ్చి పంపారు. అన్నదమ్ములిద్దరూ దూతలవెంట ప్రయాణమై వెళ్ళారు. అయోధ్యవైపు వారు సాగిపోయారు.

అయోధ్యనించి, గిరివ్రజపురానికి వచ్చేటపుడు వారు పర్వతాలూ, కొండలు ఎక్కి దిగి వడివడిగా ప్రయాణం చేసి తొందరగా వెళ్ళారు. కాని ఆ ప్రయాణం కష్టమని తెలిసింది. గుఱ్ఱాలు చాలా అలసి వున్నాయి. కనక సుగమమైన దారి గుండా బయల్దేరారు. కేకయ రాజ్యం నుంచి, సుధామా, హ్లాదినీ అనే నదులు దాటి, చాలా దూరం ప్రయాణం చేసి, ఏలాధనము అనే నగరం గుండా శతద్రువు అనే నదిని దాటారు. ఆ తర్వాత శిలావహ అనే నదిని దాటి, శల్యకర్తనము అనే ఊరు చేరారు. అక్కడ్నించి చైత్రరథము అనే వనము దాటి గంగానదిని కూడా దాటి వీరమత్స్యము అనె నగరం చేరారు.

అక్కడ్నించి ఉత్తరంగా వెళ్ళి, కుళింగ నదిని దాటారు. సమీపంలోనే వున్న యమునా నదిని చేరి అక్కడ నదీ తీరంలో రథాలు ఆపి, గుఱ్ఱాల్ని సేదతీర్చి, కొంతసేపు విశ్రమించారు. ఆ తర్వాత మళ్ళీ ప్రయాణం చేసి భాగీరథీ నదిని చేరారు. అక్కడ్నించి ధర్మవర్ధనమనే నగరం చేరారు. దానికి దక్షిణంగా ప్రయాణం చేసి జంబూప్రస్థం చేరి, అక్కడి వనంలో ఆ రాత్రి విశ్రమించారు. తెల్లారగానే

తూర్పు దిక్కుగా ప్రయాణం సాగించి, ఉజ్జిహానగరం బయటవున్న ఉద్యానవనం చేరారు. కొంచెంసేపు విశ్రాంతిగా వున్నాక, భరతుడు తనకూడా మేనమామ పంపిన చతురంగ బలాల్ని మెల్లిగా రమ్మని చెప్పి తానొక్కడూ రథంలో వడివడిగా అయోధ్యవైపు బయల్దేరాడు. రాత్రికాగానే సరస్వతీ తీర్థమనే నగరంలో విశ్రమించి, తెల్లారగానే బయల్దేరి, వేగంగా నదులూ కొండలూ దాటుకుంటూ, గోమతీ నది దాటి తూర్పుతెల్లారే సమయానికి అయోధ్యా నగరం చేరుకున్నాడు.

అలా నిర్విరామంగా ఏడురాత్రులు, ఏడు పగళ్ళు ప్రయాణం చేసి, ఎనిమిదోనాటికి అయోధ్యలో కాలుపెట్టాడు.

ఎపుడూ సభలూ, సమావేశాలతో సందడిగా వుండి, కలకలలాడుతూ రంగవల్లులు తీర్చిదిద్దిన ప్రాంగాణాలతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుండే అయోధ్య ఇపుడు నిస్తేజంగా వుంది. ఎటుచూసినా గుబులు గుబులుగా దిగులు కలిగేలా వుంది. నగరమంతా నిశ్శబ్దంగా, శూన్యంగా వుంది. ఎక్కడా వేదఘోష వినిపించటం లేదు. భేరీ మృదంగ వీణానాదాల కోలాహలం లేదు. ఆ వాతావరణం చూస్తున్న కొద్దీ భరతుడికి బెంగ ఎక్కువైంది. సారథిని చూస్తూ

ఏమిటి? మన అయోధ్య ఇంత అశుభకరంగా వుందేమిటి? ఇవన్నీ చూస్తుంటే నా వాళ్ళంతా కుశలంగా వున్నారా? అని అనుమానం కలుగుతోంది' అంటూ గుండెలు చిక్కబట్టుకుని అడిగాడు. కాని సారథి బదులు చెప్పకుండా మౌనంగా రథం నడపసాగాడు.

వైజయంతము అనే పశ్చిమద్వారం గుండా నగరంలో ప్రవేశించారు. అపుడు భరతుడు సారథితో 'ఏకారణం లేకుండా వశిష్ఠుల వారు నన్ను తొందరగా రమ్మని కబురు చెయ్యరు. నా మనస్సు కీడు శంకిస్తోంది. ఏదో అశుభం జరిగి వుంటుంది. అంటు, బరువెక్కిన మనస్సుతో రాజభవనంలో ప్రవేశించాడు.

గబగబా అడుగులేస్తూ తండ్రిగారి భవనంలోకి వెళ్ళాడు. కాని అక్కడ దశరథ మహారాజు కనిపించలేదు. ఒకవేళ తన తల్లి భవనంలో వున్నారేమో అని అక్కడకి వెళ్ళాడు. కొడుకుని చూడగానే కైకేయి ఆనందంగా సంబరపడుతూ లేచి వచ్చింది.

భరతుడు తల్లి పాదాలకి నమస్కారం చేశాడు. ఆమె భరతుడ్ని దగ్గరగా తీసుకుని, కౌగలించుకుని నుదుట ముద్దుపెట్టుకుని ఒడిలో కూర్చోబెట్టుకుంటూ తాతగారు మావయ్య కులాసాగా వున్నారా? అని అడిగింది. అప్పుడు భరతుడు,

అమ్మా, అక్కడంతా కులాసాగానే వున్నారు. నీకు బోలెడు కానుకలు పంపారు. వెనుక సైనికులు తెస్తున్నారు. ఇంతకీ వశిష్ఠుల వారింత తొందరగా

రమ్మని వర్తమానమెందుకు పంపారు? నాన్నగారెక్కడ వున్నారు? వారి మందిరంలోనూ లేరు. నీ మందిరంలోనూ లేరు. నాకేమిటో చాలా దిగులుగా వుంది. ఆయన కౌసల్యాదేవి మందిరంలోవున్నారా? నేను వెంటనే వారిని చూసి నమస్కారం చెయ్యాలి' అని గాబరాగా ప్రశ్నించాడు.

కైకమాత్రం ఇసుమంత కూడా చలించకుండా, అదేదో సర్వసాధారణమైన విషయం చెప్తున్నట్లు 'మహాత్ముడైన మీతండ్రిగారు, లోకంలో ప్రాణులంతా చివరికి ఎక్కడికి చేరుకుంటారో, అక్కడికే వెళ్ళారు' అని చాలా తాపీగా చెప్పింది.

పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు భరతుడు. తండ్రి మరణవార్త విని కుప్పకూలిపోయాడు. అయ్యో, చచ్చాను కదా! అనుకుంటూ రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని పెద్దగా రోదించాడు. పెద్ద పెట్టున ఏడుస్తూ ముఖం మీద బట్టకప్పుకుని, మొదలు నరికిన మహావృక్షంలా నేలమీద పడిపోయాడు. కొడుకు దుఃఖం చూసి కూడా కైక చలించలేదు. మంథర ఉపదేశం వల్ల ఆమె మనస్సంతా విషపూరితమైపోయింది. ఆమెలో విచక్షణాజ్ఞానం నశించింది.

క్రిందపడిన కొడుకుని లేవదీసి బుజ్జగిస్తూ 'రాజా, నువ్వు చాలా యశశ్శాలివి. వయోవృద్ధులైన నాన్నగారి మరణానికి ఇంతగా విలపించాలా? నీలాంటి ధీమంతుడు ఇలా ఏడవకూడదు. లే. లేచి ముఖం కడుక్కో. ధైర్యంగా వుండు' అంది. తల్లి గుణాలు తెలిసినవాడు కనక భరతుడు అంతగా బాధపడలేదు. ఆమెని పట్టించుకోలేదు. నిర్లక్ష్యంగా చూస్తూ 'అమ్మా, నాన్నగారు రాముడికి పట్టాభిషేకం చేస్తున్నారేమో, అందుకే నన్నింత తొందరగా రమ్మన్నారనుకున్నాను. కాని రాగానే ఆయన మరణవార్త వినవలసి వచ్చింది. ఇంతకీ ఆయనకంత హఠాత్తుగా మరణమెలా సంభవించింది? ఏం జబ్బుచేసింది? అని చాలా ఆతృతగా అడిగాడు. కైక జవాబు చెప్పలేకపోయింది. భరతుడు తల్లిమౌనానికి కుమిలిపోతూ,

'అయ్యో, నేనెంత దురదృష్టవంతుణ్ణి. తండ్రి గారి అంతిమసందేశం వినే భాగ్యానికి కూడా నోచుకోలేదే. మా అన్నయ్య రాముడెక్కడ? పెద్దన్నగారు తండ్రితో సమానం కదా. ఆయనకి నమస్కారం చేసి నాన్నగార్ని చూసినట్లు తృప్తిపడతాను.

అమ్మా, నువ్వేం బదులు చెప్పవేంటి? నీ మౌనం నాకు చాలా బాధాకరంగా వుంది. పోనీ సత్యవాదియైన నాన్నగారు చనిపోయే ముందు ఏమన్నారు? అదైనా చెప్పుతల్లీ' అంటూ గోల్లు గొల్లున ఏడిచాడు.

అప్పుడు కైక భరతునితో 'హా రామా, హా లక్ష్మణా, హా సీతా' అని ఆక్రోశిస్తూ

నీ తండ్రి ప్రాణాలు వదిలారు. ఇదే వారు చివరిసారిగా పలికిన పలుకులు. మృత్యువువాత పడటం చేత ఆయనసలు కదలలేకపోయారు అంది. చివరిసారిగా మాత్రం ఆరోజు ఉదయం, ఆహా! నా రాముడు ప్రతిజ్ఞ పూర్తిచేసుకుని, మళ్ళీ నగరానికెపుడు వస్తారో కదా, అలా వచ్చినపుడు వారిని చూడగలిగిన వారే ధన్యులు. సీతారామలక్ష్మణులు అయోధ్యకి తిరిగి రావటం కన్నులారా చూడగల్గిన వారి జన్మ ఎంత ధన్యమో కదా' అన్నారు. అని తల్లి చెప్పిన మాటలు విని భరతుడు చాలా ఆశ్చర్యపడ్డాడు.

'అమ్మా నా అన్నగారు, వదినగారు, లక్ష్మణుడు ఎక్కడికి వెళ్ళారు? వాళ్ళిపుడెక్కడున్నారు?' అని విస్మయంగా అడిగాడు భరతుడు.

భరతుడి దుఃఖం గమనించే స్థితలో లేని కైక, పరమానందంగా భరతుడి తల నిమిరి, 'కుమారా, నీ అన్న వదిన లక్ష్మణుడు నారబట్టలు కట్టుకుని, అడవులకి వెళ్ళారు. అని ఇంకా ఏదో చెప్పబోతుండగా భరతుడు దిగ్భ్రాంతిలో 'అమ్మా నీ మాటలు చాలా విచిత్రంగా వున్నాయి. రాముడెవరిదైనా బ్రాహ్మణుని ధనం దొంగిలించాడా? ఎవరినైనా హింసించాడా? పర స్త్రీ పొందుకోరాడా? భ్రూణహత్య చేశాడా? ఏకారణంగా వారు అడవులకి వెళ్ళారు? అని కన్నీటితో ప్రశ్నించాడు.

కైక మాత్రం జంకులేకుండా చెప్పదల్చుకున్నది చెప్పింది.

'నాయనా, రాముడెలాంటి తప్పుపనీ చెయ్యలేదు. నువ్వనుకున్నట్లే రాముడికి పట్టాభిషేకం చెయ్యాలని మహారాజు గారు సంకల్పించారు. కాని ఆ రాజ్యాభిషేకం నీకు జరగాలని నేనన్నాను. మునుపెప్పుడో చాలా కాలం క్రితం నీ తండ్రి ప్రాణాలు కాపాడిన సందర్భములో వారు నాకు రెండు వరాలిచ్చారు. అప్పట్లో ఆ వరాలు నేను కోరలేదు. అవి రెండూ ఇప్పుడు కోరాను. మొదటిది నీకు రాజ్యాభిషేకం చెయ్యాలనీ, రెండవది రాముడు పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చెయ్యాలనీ, సత్యవ్రతుడు కనుక నీ తండ్రి అందుకు అంగీకరించారు. తండ్రి ఆజ్ఞపై రాముడు అడవులకి వెళ్తుంటే, సీతా, లక్ష్మణుడు కూడా వాని వెంటవెళ్ళారు. కాని మీ నాన్నగారికి రాముడంటే చాలా ప్రేమ కదా. అందుకే రాముడు అడవికి వెళ్ళగానే, ఆయన చాలా దిగులు పడ్డారు. ఆ దిగులు భరించలేక పుత్రశోకంతో ఆయన మరణించటం జరిగింది. నాయనా, నువ్వు ధర్మజ్ఞుడివి. ఈ రాజ్యం ఇపుడు నువ్వు స్వీకరించాలి.

చనిపోయిన నీ తండ్రి కోసం గాని, అడవులకి వెళ్ళిన నీ సోదరులుకోసం, నీ వదిన కోసం గాని ఇపుడు నువ్వు శోకించగూడదు. ధైర్యంగా వుండాలి. ఇపుడీ

రాజ్యమంతా నీ మీదే ఆధారపడి వుంది. నేను కూడా నీ కోసమే కదా ఇదంతా చేశాను? నువ్వు వెంటనే శాస్త్రోక్తంగా నీ తండ్రికి అంత్యక్రియలు పూర్తిచేసి, ఈ సువిశాల కోసలరాజ్యానికి పట్టాభిషిక్తుడివి కావాలి. ఇదే నీ తక్షణ కర్తవ్యం' అంది గర్వంగా. తల్లి మాటలకి భరతుడు నిప్పుతొక్కిన వాడిలా అదిరిపడ్డాడు. తండ్రి మరణవార్త, సీతా, రామ, లక్ష్మణులు అడవులకి వెళ్ళారన్న వార్త, విని, క్రుంగిపోయాడు.

'అయ్యో! అమ్మా ఎంతటి ఘాతుకం చేశావమ్మా! ఇంతటి శోకార్తుడనైన నాకు, తండ్రి సోదరులు లేని నాకు ఈ రాజ్యమెందుకమ్మా! ఇంతటి హృదయవిదారకములైన దారుణమైన వార్తలు రెండు ఎంత సామాన్య విషయాల్లా చెప్పావమ్మా. ఇంతటి ఘోరానికి కారకురాలవై కూడా ఇంకా నన్నీ రాజ్యానికి రాజుని చెయ్యాలనుకుంటున్నావా ? నంగనాచిలా.

ఛీ ఛీ పాపాత్మురాలా, మా వంశం నాశనం చెయ్యటానికి, ప్రళయకాల రాత్రిలా దాపురించావు. నా తండ్రి నిన్ను కొంగున ముడివేసుకున్న నిప్పువని గుర్తించలేకపోయారు. నా తండ్రి మరణానికి కారణమై వుండి కూడా ఇదంతా నా కోసమే చేశానంటున్నావు.

ఆడి తప్పని ధర్మాత్ముడు. ఆ సత్యవాక్పాలనమే తన మరణానికి కారణమవుతుందని నా తండ్రి తెలుసుకోలేకపోయాడు.

రాముడ్ని ఎందుకని అడవులకి పంపావు? తమ కుమారులకి దూరమై నా పెత్తల్లులు ఎంత దుఃఖిస్తున్నారో కదా.

పూజనీయుడైన నా అన్న రాముడు నిన్ను కూడా తన తల్లితో సమానంగా ప్రేమించాడే, నా పెత్తల్లి కౌసల్య కూడా నిన్ను సొంత సోదరిలా చూసుకుందే, వారికంతటి కష్టం కల్గించటానికి నీ మనస్సెలా ఒప్పింది? లోభత్వంతో నువ్వు ఈ రాజ్యం నాకు కట్టబెట్టాలని, ఇంతటి దారుణానికి ఒడిగట్టావా? ఈ అనర్థాలన్నింటికీ నువ్వే కారణమని నాకిపుడు తెలిసింది.

అంతేకాదు, నీలాంటి పాపాత్మురాల్ని తల్లిగా భావించి గౌరవించటం మహాపాపం. కాని నా పెద్దన్నయ్య శ్రీరాముడు నిన్ను తల్లిగా గౌరవించి పూజించాడే, అందుకే నిన్ను త్యజించలేకపోతున్నాను. మా వంశాచారం ప్రకారం జ్యేష్ఠుడే రాజ్యానికి వారసుడు. ఇంకా ఎంతమంది సోదరులున్నా, వారంతా అతడ్ని అనుసరించటమే ధర్మం' ఇది లోక సహజం.

మా ఇక్ష్వాకువంశం ధర్మానికి పట్టుగొమ్మ. ధర్మం రక్షించటమే మా కర్తవ్యం.

అటువంటి వంశాచారం ఈవేళ నీ అహంకారం వల్ల కాలి బూడిదై పోయింది. నీకిలాంటి పాడుబుద్ధి ఎలా పుట్టిందమ్మా.

ఏది ఏమైనాసరే. నీ కోరిక చాలా అనుచితమైనది. దానిని నేను తీర్చలేను. నీ గుండె పగిలి చచ్చేలా నేనిపుడే అడవులకి వెళ్ళి సీతా, రామ, లక్ష్మణులను ముగ్గుర్ని వెనక్కి తీసుకొచ్చి, ధర్మజ్ఞుడైన రామునికి పట్టం కట్టి, నేను రాముడికి దాసానుదాసుడనౌతాను. లేదా నేను అడవులలో తిరుగుతాను. ఛీ - ఛీ నీ ముఖం చూడ్డం కూడా మహా పాపం' అంటు సింహంలా గర్జించాడు. ఆవేశంతో ఊగిపోతూ

'దుష్టురాలైన కైకేయీ - ఇంతచేసినా, ధర్మజ్ఞుడైన రాముడు గాని, నా తండ్రి దశరథ మహారాజుగాని, నిన్నేమైనా అన్నారా? నాకులాన్ని నాశనం చెయ్యటానికి సంకల్పించినది నువ్వే కదా. ఇదెంతటి దారుణ కృత్యమో తెలిసి చేశావా? నువ్వు చేసిన ఘాతుకం భ్రూణహత్యతో సమానం.

కన్నతల్లివైయుండి ఒక్కసారిగా నాకు మూడు దుఃఖాలు కలిగించావు. నీ మూలంగా తండ్రిని పోగొట్టుకున్నాను. సోదరుల్ని దూరం చేసుకున్నాను. సోదరులు అడవులకి వెళ్ళటానికి కారణమయ్యానన్న శాశ్వతమైన అపకీర్తి పాలయ్యాను. నీ మూలంగా ఈ మహాపాతకాలు నాకు సంక్రమించాయి. రాజ్యకాముకురాలైన నువ్వు తల్లిరూపంలో వున్న శత్రువువి. నా వంశానికి చీడపురుగువి. ఇంకెపుడు నాతో మాట్లాడకు. నీతో మాటలు నాకనవసరం. కౌసల్య అంతటి మహాసాధ్వికి పుత్రశోకాన్ని కల్గించిన నీకు, నరకంలో తప్ప మరెక్కడా స్థానం లేదు. క్రూరాత్మురాలా, పుత్రవియోగం కన్నా కన్నతల్లికి పెద్ద శోకం వుంటుందా? సృష్టిలో ప్రతిజీవికి తమ సంతానం మీద, నీ అంతటి ప్రేమా వుంటుంది.

సురభి అనేది కామధేనువు. ఈ భూలోకంలో వుండే ఆవులు, ఎద్దులు అన్నీ దాని సంతానమే. ఆ సురభి సంతానంలోని రెండు ఎద్దులు భూలోకంలో మొయ్యలేని బరువులు మోసి తెలివితప్పి నేలమీద పడివుండడం ఒకసారి సురభి చూసింది. అది చూడగానే పుత్రవాత్సల్యంతో దానికి చెప్పరాని దుఃఖం కలిగింది. దాని కన్నీటి బిందువులు దిగువుగా ప్రయాణం చేస్తున్న ఇంద్రుడి మీద పడ్డాయి.

అపుడు ఇంద్రుడు రెండు చేతులూ జోడించి 'అమ్మా, ఎందుకంతగా దుఃఖిస్తున్నావు నావల్ల ఏమైనా అపచారం కల్గిందా?' అని అడిగాడు. అపుడు సురభి 'లేదు దేవేంద్రా. నీవల్ల ఏ పొరపాటూ జరగలేదు. భూలోకంలో నా సంతానం పడరాని కష్టాలు పడటం చూసి దుఃఖం ఆపుకోలేకపోయాను' అంది. కొన్నికోట్ల సంతానానికి తల్లి అయిన ఆ సురభి కేవలం వారిలో ఇద్దరు సంతానం కష్టపడ్డందుకే అంతలా దుఃఖించిందే. ఇంక మానవమాత్రుల సంగతి చెప్పాలా.

అయ్యో! తల్లులారా, కౌసల్యా - సుమిత్రా, మీ సంతానం కోసం మీరెంతగా దుఃఖిస్తున్నారమ్మా. నేను వెంటనే నాన్నగారికి అంతిమసంస్కారం చేసి, వారికి ఊర్ధ్వగతులు కలిగించి, వెంటనే అడవులకి వెళ్ళి నా సోదరులను తీసుకొస్తాను. ఇదే నాకు ప్రాయశ్చిత్తము. కాని బుద్ధిపూర్వకంగా మహాపాపం చేశావు. నీకు మాత్రం మరణమే ప్రాయశ్చిత్తము. నిప్పుల్లో దూకుతావో, అడవులకెళ్ళి క్రూరమృగాల నోట పడతావో, ఉరిపోసుకు ఛస్తావో, నీ ఇష్టం.

రాముడు వెనక్కి తిరిగి వచ్చి ఈ సామ్రాజ్యాన్ని స్వీకరించిన నాడె నేను కృతకృత్యుడనవుతాను. లేకపోతే నేనూ అన్నయ్యతోపాటు అడవులలో వుండిపోతాను. అంటూ భరతుడు దెబ్బతిన్న పాములా బుసలు కొడుతూ బాధతో నేలమీదపడిపోయాడు. అలా చాలాసేపు తెలివితప్పి పడివుండి, తర్వాత మెల్లిగా కళ్ళుతెరచి, కంటినిండా నీరు నిండగా మసకబారిన దృష్టితో తల్లిని చూశాడు. కైక దీనంగా చూస్తూ నుంచుంది. అంతలో తనతోపాటు గిరివ్రజపురం నించి బయల్దేరిన వారంతా వచ్చేశారు.

మంత్రులందరూ చుట్టూ నిలబడ్డారు. వారందర్నీ చూడగానే భరతుడికి ఆవేశం కట్టలు తెంచుకుంది.

'అయ్యలారా, పెద్దలారా, అందరూ వినండి. నాకీ రాజ్యం మీద కోరిక లేదు. నాకు రాజ్యం కావాలని, నేనెపుడూ మా అమ్మకి చెప్పలేదు. తండ్రిగారు నాకు పట్టాభిషేకం చెయ్యాలన్నారన్న సంగతీ నాకు తెలియదు. నేను నా తమ్ముడు శత్రుఘ్నుడూ దూరదేశంలో వున్నాము. అందుచేత ఇక్కడ జరిగిన సంగతులేవీ నాకు తెలియవు. మహాత్ముడైన రాముడు అడవులకి వెళ్ళాడని కానీ, నా తండ్రిగారు పరమపదించిన సంగతిగాని, నాకు తెలియదు. మా సీతారాములు ఎలా దేశం విడిచి వెళ్ళారో ఎరుగను' అంటూ భరతుడు పెద్దపెట్టున వారితో మొరపెట్టుకున్నాడు. ఈ ఘోష కౌసల్యామందిరం దాకా ప్రతిధ్వనించింది.

ఆ మాటలు విన్న కౌసల్య సుమిత్రతో ఇలా అంది. 'సుమిత్రా, ఇంతటి వినాశానికి కారణమైన కైకేయి కొడుకు భరతుడు వచ్చినట్లున్నాడు. భరతుడు తల్లిలా సంకుచిత మనస్తత్వం గలవాడు కాడు. వాడికి చాలా దూరదృష్టి వుంది. చాలా ఉదారస్వభావుడు. ఒకసారి భరతుణ్ణి చూడాలని వుంది' అంటూ కైక మందిరానికి బయల్దేరింది. ఆమె వెంట సుమిత్ర కూడా బయల్దేరింది. కౌసల్య శరీరం కృశించి, కళావిహీనంగా వుంది. మనసు కలత చెందివుంది. ఒళ్ళంతా ఒణుకుతూ వుండగా మెల్లిగా అడుగులో అడుగువేస్తూ నడుస్తూ వెళ్తోంది. అంతలో భరతుడు, అతడి వెంట శత్రుఘ్నుడు కౌసల్యకి ఎదురుగా వచ్చారు. దారిలోనే ఒకరినొకరు చూసుకున్నారు. దుఃఖంతోఆక్రోశిస్తు ఒకరినొకరు కౌగలించుకున్నారు.

కౌసల్య దుఃఖం దిగమింగి భరతుణ్ణి నిశితంగా చూస్తూ, 'భరతా, రాజ్యం కావాలనుకున్నావు. నీ కోరిక నీతల్లి క్రూరమైన పద్ధతిలో నెరవేర్చుకుంది. కాని నారబట్టలు ధరించి, నా కుమారుడు అడవులకి వెళ్తే మీ కొరిగిందేముంది? నువ్విపుడు రాజువి కదా. నన్ను కూడా అదే అడవికి పంపించి పుణ్యం కట్టుకో. అపుడింక ఈ రాజ్యాన్ని సకలభోగాలతో నువ్వు, నీ తల్లి అనుభవించవచ్చు' అంది. ఆ మాటలకి భరతుడికి పుండుమీద కారం చల్లినట్లైంది. భోరున ఏడుస్తూ ఆవిడ పాదాలమీద వాలిపోయాడు. అలా చాలాసేపు ఏడ్చి, లేచి నిలబడి, చేతులు జోడించి 'అమ్మా, మీరు కూడా ఇలా అనటం న్యాయమేనా? నేనే పాపమూ ఎరుగనమ్మా. నేను సత్యప్రమాణంగా చెప్తున్నాను. నిజంగా ఇక్కడ జరిగినవేవీ నాకు తెలియవు. రాముడు అడవులకి వెళ్ళటం నా కిష్టమే అయితే, నేనెంతటి ఘోరనరకాలకి పడిపోతానో విను.

నిజంగా రాముడు అడవులకి వెళ్ళటం నేను కోరుకుంటే శాస్త్రజ్ఞానము లేనివాడినౌతాను. ధర్మబద్ధమైన బుద్ధి నాకు నశిస్తుంది. సంస్కారహీనులకు, పాపాత్ములకు, దాస్యము చేసే ఘోరమైన గతి నాకు కలుగుగాక. సూర్యభగవానునికెదురుగా మలమూత్రవిసర్జన చేసేవారు ఏగతినిపడిపోతారో, అంతటి ఘోరమైన పాపం మూటకట్టుకుంటాను. గోమాతని కాలితో తన్నిన పాతకం చుట్టుకుంటుంది. సేవకులచేత అడ్డమైన చాకిరీ చేయించుకుని, వారికి తగిన కూలి ఇవ్వనివాడు ఎంతటి మూర్ఖుడో, అలాంటివాడికెంత మహాపాతకం చుట్టుకుందో అంతటి ఘోరమైన నరకాన పడిపోతాను. పన్నులు వసూలు చేస్తూ కూడా ప్రజలకి ఏ విధమైన రక్షణా కల్పించని ప్రభువుకి ఎంతటి నీచమైన గతి కల్గుతుందో, అదేగతి నాకూ కల్గుతుంది. యాగము చేయించుకుని, ఋత్విక్కులకి దక్షిణ ఇవ్వకుండా ఎగ్గొట్టేవాడూ, యుద్ధభూమిలో వెన్నుచూపిన క్షత్రియుడు, గురూపదేశాలనతిక్రమించి, కామభోగాలు అనుభవించే మూర్ఖుడూ ఎంతటి రౌరవాది నరకాలకి పోతారో అటువంటి గతి నాకు కలుగుగాక, మహానుభావుడు, తేజోవంతుడు అయిన నా అన్న శ్రీరాముడు, వనవాసం ముగించువచ్చి, సకల రాజలాంఛనాలతో, సింహాసనం అధిష్టించుతూ వుండగా చూసే భాగ్యం నాకు కలగకుండు గాక, గారెలు, పాయసము, తిలాన్నము, పితృదేవతలకు అతిథులకు పెట్టకుండా, తినవాడెంతటి మహాపాతకాన పడిపోతాడో అంతటి పాపం నాకు కల్గుగాక.

పెద్దలను, గురువులను గౌరవించనివాడు, ఉపకారం చేసిన వారిపట్ల కృతజ్ఞత లేనివాడూ, దుష్కృత్యములు చేసి, పెద్దలచేత వెలివేయబడి, ప్రాయశ్చిత్తం

చేసుకోకుండా గౌరవనీయమయిన సమాజంలో తిరిగేవాడూ ఏ గతిన పడిపోతారో ఆ పాతకం నాకు చుట్టుకోవాలి. తనని నమ్మి ఎవరైనా ఒక రహస్యం చెప్పి ఎవ్వరికీ చెప్పవద్దని మాట తీసుకోగా, వారివిశ్వాసం వమ్ముచేసి, ఆ సంగతి బహిరంగంగా చెప్పేవాని గతి నాకు కలుగుగాక. ఇంట్లో భార్యా, పిల్లలు, సేవకులు అందరూ వుండగా వారెవ్వరికీ పెట్టకుండా రుచికరమైన పిండివంటలు తెచ్చుకుని తానొక్కడే రహస్యంగా తినేవాడికి కలిగే మహాపాతకం నాకు కలుగుగాక. ధర్మపత్నిని నిర్లక్ష్యం చేసి, పర స్త్రీతో భోగించేవాడూ, మానవజన్మ ఎత్తి కూడా వివాహం చేసుకుని సంతానాన్ని కనకుండా, భార్యతో కలసి చెయ్యవలసిన ధర్మకార్యములు చెయ్యకుండా, అవివాహితుడిలా జీవించేవాడి కెలాంటి రౌరవాది నరకాలు కల్గుతాయో, ఆ గతి నాకు కలుగుగాక. బ్రహ్మచారిగా వుండి, బ్రహ్మచర్యవ్రతం పాటించకుండా కేవలం శరీరం పోషించుకుంటూ పశుపక్ష్యాదులలా చరించేవాడిగతి కలుగుగాక. సంతానం లేకుండా మరణించే వారికి కలిగే నరకాలు నాకు కల్గుగాక.

నిష్కారణంగా ఎవర్నైనా చంపితే వారికి కలిగే గతీ, సేవకులకి జీతం ఇవ్వకుండా వెళ్ళగొట్టేవాడి గతీ, తాను మాత్రమే కామము తీర్చుకుంటూ, అర్ధాంగి కోరినపుడు తిరస్కరించే వాడిగతీ, త్రాగుడు, వ్యభిచారమూ, జూదము మొదలైన వ్యసనాలకి బానిసయై చరించేవాడికి కలిగే గతీ, అపాత్రదానం చేసినవానికి కలిగే గతీ, ఉభయ సంధ్యలయందు నిదురించే వానికి కలిగే గతీ, ఎవరింటికైనా నిప్పు పెట్టే దహించే వాని గతీ, గురుపత్నిని కూడినవానికి కలిగే దుర్గతీ, మిత్రద్రోహికీ, తల్లిదండ్రులను అనాదరణ చేసిన వానికి కలిగే గతీ, నాకు సంభవించు గాక.

అమ్మా, నా అన్న అడవులకి వెళ్ళటం నా అభిమతమైతే, అధిక సంతానవంతుడనై, దరిద్రుడనై వ్యాధిగ్రస్తుడనై, క్లేశముల పాలై పిచ్చివాడినై భ్రష్టుడనై పోవుదును గాక. మంచినీటిలో విషం కలిపిన వాడికి కలిగే ఘోరమైన అవస్థ నాకు కల్గుగాక. యాచకులను కసిరికొట్టే ధనవంతుడిలా, అనుకూలవతియైన భార్యని హింసించే మూర్ఖుడిలా ఘోరపాతకా లనుభవిస్తాను. బ్రాహ్మణులను తాను పూజించక, వేరొకర్ని పూజించనివ్వకుండా, చేసేవాడి గతి నాకు కలుగుగాక. లేగదూడకి పాలు మిగల్చకుండా ఆవు దగ్గర మొత్తం పాలు పిండుకునే వానికి కలిగే గతి కలుగు గాక. తనదగ్గర మంచి తీర్థముండి కూడా అడిగిన వారి దాహము తీర్చని నికృష్టుడు, ఇద్దరు మిత్రులమధ్య తంపులు పెట్టేవాడూ, పొందే నరకాలు నేను పొందుదును గాక' అంటూ భరతుడు, పెత్తల్లి దగ్గర అనేక రకాల ఒట్లు పెట్టుకుంటు, కౌసల్యని ఓదారుస్తూ తన నిర్దోషిత్వాన్ని నమ్మమని ప్రాధేయపడ్డాడు.

అపుడు కౌసల్య తన పాదాలపై పడి ఏడుస్తున్న భరతుడ్ని లేవదీసి, గుండెలకి హత్తుకుని, కన్నీరు తుడిచి ఓదారుస్తు, 'నాయనా, రాముడు అడవులకి వెళ్ళాడన్న బాధకన్నా, నువ్విలా ఒట్లు పెట్టుకుంటూ తీవ్రంగా శోకించటం నాకు రెట్టింపు బాధ కలిగిస్తోందిరా, లక్ష్మణుడిలాగే నువ్వు కూడా చాలా ధర్మవర్తనుడివి తండ్రీ. నిజంగా నాకిపుడు చాలా సంతోషంగా వుంది. నీకెలాంటి పాపము కలగదు. నీ మాటలు నేను నమ్ముతున్నాను. సత్పురుషులు పొందే స్వర్గసుఖాలు నువ్వు పొందుతావు.' అంటూ భరతుడ్ని ఒడిలోకి తీసుకుని, కౌగిలించుకుని, ఎంతోసేపో రోదించింది. వారిద్దరూ ఆ దుఃఖం భరించలేక ఎన్నివిధాలో విలపించారు. ఎలాగో ఆ రాత్రి గడిచింది.

తెల్లారింది. వశిష్ఠుల వారువచ్చి, దుఃఖంలో మునిగివున్న భరతుడ్ని చూశారు. దగ్గరగా వచ్చి భుజం తట్టి 'రాకుమారా, శోకించటానికిపుడు సమయం లేదు. నీ తండ్రిగారికి, అంతిమ సంస్కారం చేసి, స్వర్గానికి పంపించే సంగతి ఆలోచించు' అన్నారు. భరతుడు ధైర్యం తెచ్చుకుని లేచాడు. తగిన సన్నాహాలు చెయ్యమని ఆజ్ఞాపించాడు.

చాలారోజులుగా నూనె తొట్టిలో వున్న దశరధుని శరీరం బయటికి తీశారు. భూమి మీద పడుకోబెట్టారు. శరీరం చెక్కుచెదరకుండా నిద్రపోతున్న వారిలా వుంది. రత్నాలతో అలంకరించిన పాన్పుమీద ఆ శరీరాన్ని పడుకోబెట్టారు.

తండ్రిని ఆ అవస్థలో చూసేసరికి భరతుడికి పట్టరానంత దుఃఖం కల్గింది.

'మహారాజా నేను ఊళ్ళో లేనప్పుడు, ధర్మజ్ఞుడైన రాముడ్ని, మహావీరుడైన లక్ష్మణుడ్ని అడవులకి పంపి, మమ్మల్ని అనాధల్ని చేసి మీరిలా వెళ్ళిపోవటం తగునా? దేశ ప్రజలంతా మీకోసం దుఃఖిస్తున్నారు. 'మీరులేని మన రాజ్యం విధవ అయింది. ఇంక మాకు రక్షకులెవరు' అంటు పెద్ద పెట్టున ఏడ్చాడు.

వశిష్ఠుడు భరతుడ్ని ఓదారుస్తూ 'భరతా ధైర్యం తెచ్చుకోనాయనా. ముందు నాన్నగారికి ప్రేత సంస్కారం చెయ్యాలి. కనక గుండె రాయి చేసుకో. మిగిలిన విషయాలు ఆలోచించకుండా ప్రేతకర్మ శ్రద్ధగా చెయ్యి' అన్నాడు.

భరతుడు కన్నులు తుడుచుకుని లేచాడు. అగ్నిహోత్రశాల నించి దహన సంస్కారానికి అగ్ని తెప్పించాడు. దశరధ మహారాజు శవాన్ని ఒక శిబికపై పెట్టారు. శవయాత్ర బయల్దేరింది. దారిపొడుగునా పరిచారికలు వెండి, బంగారు, నాణాలు, పట్టువస్త్రాలు, ఇంకా రకరకాల పదార్ధాలు చల్లుకుంటూ నడిచారు. కాష్ఠానికి చందనం, అగరుద్రవ్యాలూ, గుగ్గిలం సిద్ధం చేశారు.

దేవదారు, చందనము, సరళ, పద్మకి, అగరు, కాష్ఠాలు పేర్చి చితిని తయారుచేశారు. ఋత్విక్కులు మంత్రోచ్చారణతో సామవేదం గానం చేశారు. రాజుగారి భార్యలంతా వారివారి హోదాకి తగ్గట్టు వాహనాలపై వచ్చారు. శాస్త్రవిహితంగా ప్రేతాన్ని చితిపై వుంచారు. అందరూ చూస్తుండగా చితిపై అగ్నిహోత్రం వుంచారు. స్త్రీలు, భరతుడు, ఋత్విక్కులు చితికి ప్రదక్షిణం చేశారు. రాజుగారి భార్యలంతా పెద్దపెట్టున ఏడుస్తూ ప్రదక్షిణాలు పూర్తి చేశారు. దహన సంస్కారం పూర్తయింది. అందరూ కలిసి సరయూనదికి వెళ్ళి స్నానాలు చేశారు. పదిరోజులపాటు అందరూ నియమంగా వుండి, నేలపై పడుకున్నారు.

పదిరోజులు పూర్తయ్యాక మళ్ళీ అందరూ సరయూనదికి వెళ్ళి స్నానాలు చేసి జలతర్పణాలు వదిలారు. కన్నీటితో అందరూ నగరంలోకి ప్రవేశించారు. పదకొండో రోజుకి అశౌచము తీరింది. పుణ్యాహవాచనము, శ్రాద్ధకర్మ అన్ని యధావిధిగా జరిపారు. బ్రాహ్మణులకు ధనము, రత్నములు పుష్కలంగా దానం చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. భూదానం, గోదానం వగైరాలన్నీ చేశారు. శరీర వియోగం తర్వాత ప్రేతత్వ విముక్తికి, చెయ్యవలసిన కార్యాలన్నీ నెరవేర్చారు. పదమూడో రోజు వచ్చింది. కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక, అందరూ యథాప్రకారంగా నిత్యానుష్ఠానాలు ప్రారంభించారు. ఆ సుప్రభాత సమయంలో, భరతుడు శోకసంతప్తుడై అచేతనంగా పడివున్నాడు.

కొంతసేపటికి లేచి, కన్నీరు కాల్వలు కట్టుండగా గద్గదస్వరంతో ఇలా అన్నాడు. 'తండ్రీ - నన్ను సోదరుల కప్పగించి, మీరు సుఖంగా వెళ్ళిపోయారు. కాని మాకు పెద్ద దిక్కుగా వుండవలసిన రాముడు అడవులకి వెళ్ళిపోయాడు. మీరు పై లోకాలకి వెళ్ళిపోయారు. ఇంక మాకు దిక్కు ఎవరు? ఒక్కగానొక్క కుమారుణ్ణి దూరం చేసుకుని కౌసల్య అనాధ అయింది. ఆవిడ మీదైనా మీకు జాలిలేకపోయిందా?' అని భోరున ఏడ్చాడు.

భరతుడలా ఏడుస్తుంటే పక్కనే వున్న శత్రుఘ్నుడు కూడా దుఃఖం పట్టలేక కిందపడి పొర్లిపొర్లి ఏడ్వసాగాడు.

'అన్నయ్యా, మన దుఃఖం ఎవ్వరూ తీర్చలేనిది. దీనికి మూలకారణం మంధర. ఆమెచే ప్రేరితురాలై విచక్షణా జ్ఞానం మరచి కైకేయి వరముల రూపంలో ఇంతటి ఘాతుకానికి ఒడికట్టింది. ఇపుడీ శోకసముద్రంలో మనమంతా మునిగిపోయాము' అంటూ భరతుడ్ని కౌగలించుకుని భోరుమంటూ ఏడ్చాడు.

'నాన్నగారూ, భరతుని మనస్సు చాలా సున్నితమైనదనీ, అతడు

సుకుమారుడనీ, ఎక్కడికైనా వెళ్ళిరాగానే ముందుగా భరతుడి గురించి అడిగేవారు. నగలు, బట్టలు, మిఠాయిలు, పిండివంటలు, పండ్లు అన్నీ తెచ్చి మాకెదురుగా పెట్టి ఎవరికి ఏం కావాలో తీసుకోమనేవారే, మమ్మల్ని లాలించి, బుజ్జగించి, కొట్టుకోకుండా చేసి పంచి ఇచ్చేవారే, అలాంటి భాగ్యం మాకింక ఎలా దొరుకుతుంది? అంటూ శత్రుఘ్నుడు చిన్నపిల్లాడిలా ఏడిచాడు. అలా ఆ సోదరులిద్దరూ ఎంతసేపో ఏడుస్తూ వుండిపోయారు.

దశరథ మహారాజుని కోల్పోయిన అయోధ్య నేడు శూన్యమైపోయింది. అలాంటి అయోధ్యలో మేమింక ప్రవేశించలేము. మేము కూడా అడవులకి వెళ్ళిపోతాం' అంటు వాళ్ళు ఏడుస్తుంటే చూస్తున్న వాళ్ళంతా కూడా ఏడ్వసాగారు.

అపుడు ధర్మమూర్తి అయిన వశిష్ఠుడు వాళ్ళనిద్దర్నీ లేవదీసి, 'నాయనలారా, మీ తండ్రిగారి కర్మ చేస్తున్న పదమూడోరోజు ఇవాళ. మీరిలా ఏడవకూడదు. ఆలస్యం జరగటం మేలుకాదు. ఆకలి, దప్పిక, శోకము, మోహము, జరామరణములు, జన్మించిన ప్రతిప్రాణికి సహజములే. వాటినెవ్వరూ తొలగించుకోలేరు. కనక చనిపోయిన వారి కోసం బాధపడి ప్రయోజనం లేదు' అంటూ భరతుణ్ణి సముదాయించాడు. సుమంత్రుడు శత్రుఘ్నుని చేరదీసి, 'నాయనా సర్వభూతములకు చావుపుట్టుకలు సహజము. జరిగిన ప్రతీదీ చూసి ఓర్చుకోవలసిందే తప్ప, దుఃఖించకూడదు. కర్తవ్యం నెరవేర్చటమే మీ బాధ్యత' అంటూ ఊరడించాడు. భరతుడు శత్రుఘ్నుడూ ఎఱ్ఱబారిన కన్నులు తుడుచుకుని, లేచి, వారాదేశించిన ప్రకారం కార్యక్రమం పూర్తిచేశారు.

ఈ విధంగా అపరకర్మ పూర్తి అయింది. ఆ అన్నదమ్ములిద్దరూ వెంటనే అడవులకి వెళ్ళి సీతారామలక్ష్మణుల్ని చూడాలనుకున్నారు. భరతునితో శత్రుఘ్నుడు ఇలా అన్నాడు. 'అన్నా లోకానికి ఆధారభూతమైన వాడు రాముడు. మనందరికి గతి అతడే. అడువులకి వెళ్ళిపోయాడు. మరి ఆ రామునికి గతి ఎవరు? అంతటి బలశాలికి ధృఢమనస్కుడికి, కేవలం ఒక ఆడదాని మూలంగా ఈగతి పట్టింది. మరి పక్కనే వున్న మహావీరుడు లక్ష్మణుడు ఈ సంగతులేం పట్టించుకోకుండా చూస్తూ ఊరుకున్నాడా? తండ్రిగారిని బంధించి, రాముడ్ని అఢవులకి వెళ్ళకుండా ఆపలేకపోయాడా? మహారాజు దారితప్పి, ఆడదాని వలలో చిక్కినపుడు శిక్షించటం పాపం కాదు' అన్నాడు. అంతలో వంటినిండా బంగారు ఆభరణాలు ధరించి, కులుకుతూ మంధర అటువేపుగా వచ్చింది. ఒళ్ళంతా గంధం పూసుకుని, పట్టుబట్టలు ధరించి, అలంకరించబడ్డ కోతిలా అటువేపు వస్తోంది. ద్వారపాలకులు ఆమెని బంధించి భరత శత్రుఘ్నుల దగ్గరకి తీసుకొచ్చారు.

'ఇదిగో - రాముడు అడవులకి వెళ్ళటానికి కారణం ఈవిడే. మీ తండ్రిగారి మరణానికి కూడా ఈమే కారకురాలు. పాపాత్మురాలు. క్రూరురాలు. ఈమెని తగినవిధంగా శిక్షించండి'అన్నారు.

ఆమెని చూడగానే శత్రుఘ్నుని కళ్ళు కోపంతో అగ్నిగోళాల్లా అయ్యాయి. ఆవేశంతో 'ఇపుడే దీనికి ప్రాయశ్చిత్తం చేస్తాను' అంటు గట్టిగా పట్టుకున్నాడు. ప్రాణభయంతో అది కెవ్వుమని అరచింది. ఆ కేకకి అంతా భయపడి పరుగులు తీశారు. శత్రుఘ్నుని చేతిలోంచి గుంజుకుంటూ మంధర నేలమీద పడింది. శత్రుఘ్నుడు ఆమెని బరబర ఈడ్చుకుంటూ, కైకేయినీ, ఆమెనీ నోటికొచ్చినట్లు నిందించసాగాడు. ఆమె పెనుగులాడసాగింది. ఆ ఘర్షణలో ఆమెవంటిమీద నగలన్నీ చిందరవందరగా పడ్డాయి. ఆ గొడవ తెలిసి కైకేయి ఒక్కపరుగున వచ్చింది. ఆదృశ్యం చూసి భయభ్రాంతురాలై పోయింది. భరతుడి దగ్గరకి వెళ్ళి మంధరని విడిపించమని ప్రాధేయపడింది.

భరతుడు తల్లివంక ఈసడింపుగా చూస్తూ, 'తమ్ముడూ, స్త్రీలమీద చెయ్యిచేసుకోవటం మహాపాపం. దాన్నిచూస్తే నాకూ అసహ్యంగానే వుంది. కాని ఏం చెయ్యకు వదిలెయ్యి' 'శత్రుఘ్నా నన్ను మరోలా భావించకు. అసలు దుర్మార్గురాలైన ఈ కైకేయినే నేను చంపుదామనుకున్నాను. కాని ఆమెని చంపటం అధర్మమని, ధర్మపరుడైన రాముడు నన్ను అసహ్యించుకుంటాడేమోనని భయపడి ఊరుకున్నాను. ఆమెనే కాదు ఈ కుబ్జని చంపినా రాముడు నీతోనూ నాతోనూ కూడా మాట్లాడడు. కనక ఈమెని వదిలెయ్యి' అని వివరించి చెప్పాడు.

భరతుడి మాటలు విన్న శత్రుఘ్నుడు కోపంతో బుసలుకొడ్తూ దాన్ని వదిలేశాడు. అది ఏడుస్తూ వెళ్ళి కైక పాదాలమీద పడింది.

మర్నాడు మంత్రులంతా ఒకచోట సమావేశమయ్యారు. రాజుని ఏర్పాటు చేసే విషయం సమాలోచన చేశారు.

వారంతా భరతుని దగ్గరకివెళ్ళి, 'కుమారా, మహారాజుగారు స్వర్గస్థులయ్యారు. వారి ఆజ్ఞపై రాముడూ, అతనివెంట సీతా, లక్ష్మణుడూ కూడా అడవులకి వెళ్ళారు. ఇపుడింక ఈ సువిశాల సామ్రాజ్యానికి, నువ్వే రాజువి. ఇన్నాళ్ళనుంచీ పాలకుడు లేకపోయినా దైవానుగ్రహం చేత ప్రజలు సామరస్యంగానే వున్నారు. రాజు లేని రాజ్యం అరాచకమవుతుంది. కనుక ఇపుడు నువ్వు పట్టాభిషిక్తుడివై ఈ రాజ్యాన్ని కాపాడాలి' అంటూ పట్టాభిషేకానికి అవసరమైన సామాగ్రిని సమకూర్చసాగారు.

భరతుడు నిశ్శబ్దంగా లేచి, ఆ సామాగ్రి చుట్టు ప్రదక్షిణం చేసి, ధృడమైన మనస్సుతో ఇలా అన్నాడు.

'పెద్దలారా! మీకు తెలియని న్యాయం వుందా? మా వంశంలో ఇంతవరకు పెద్దవాడే రాజు కావటం ఆచారం. జ్యేష్ఠుడైన రాముడుండగా నాకు పట్టాభిషేకం చేస్తాననటం న్యాయమేనా? మా నలుగురన్నదమ్ములలో రాముడే పెద్దవాడు. కనక అతడే రాజు కావాలి. ఇంకెవ్వరికీ ఆ అర్హత లేదు. ఇంక వరముల సంగతంటారా, రాముడికి బదులుగా నేను పధ్నాలుగేళ్ళు వనవాసం చేస్తాను. మీరిపుడే చతురంగబలాలు సమాయత్తం చేయ్యండి. ఈ అభిషేక సామాగ్రితో మనమందరం అడవులకి వెళ్దాం. అక్కడే పట్టాభిషేకం చేద్దాం. మనమందరం కలిసి ప్రార్థిస్తే రాముడు తప్పక ఒప్పుకుంటాడు. రాముణ్ని అయోధ్యకి తీసుకొచ్చి మనకి సంరక్షకుడిగా నియమించుకుందాం.

కేవలం గర్భవాసాన మొయ్యటం చేత మాత్రమే కైకేయి నాకు తల్లి అయింది. అంతేకాని, ఆమెని నేను తల్లిగా ఎపుడూ గౌరవించలేను. ఆమె కోరిక తీర్చడం నాకు సమ్మతం కాదు. మీరు తక్షణం ప్రయత్నాలు మొదలుపెట్టండి.

ముందుగా అడవులకి వెళ్ళేదారి హెచ్చుతగ్గులు లేకుండా చదునుగా చేయించండి. దుర్గప్రదేశాల్లో ఉపద్రవాలు జరగకుండా రక్షణ కట్టుదిట్టంగా ఏర్పాటు చేయించండి. ఎందుకంటే నా అన్నగారైన రాముడు మహారాజుగా ఆదారివెంట అయోధ్యకి తిరిగి రావాలి'. అన్నాడు నిశ్చలమైన మనస్సుతో. అనన్య సామాన్యమైన భరతుని ధర్మనిరతికి ప్రజలంతా జేజేలు కొట్టారు. వారంతా చాలా సంతృప్తి చెందారు.

వెంటనే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అన్ని పనులకు సమర్థులైన పనివాళ్ళని నియమించారు. కొండలు పగులగొట్టి చక్కటి రాజమార్గం వేశారు. పొదలు, తుప్పలు, అడ్డదిడ్డంగా వున్న వృక్షాలు నరికి దారికడ్డంగా వున్న నదులమీద వంతెనలు నిర్మించారు. దారిపొడుగునా నీటివసతికై బావులు, సరస్సులు ఏర్పాటు చేశారు. వడ్రంగులు, మేదరులు, మేస్త్రీలు ఒకరేమిటి అన్ని తెగలవారు శక్తి వంచన లేకుండా పనులు చెయ్యటం మొదలుపెట్టారు. అందరి ధ్యేయం ఒక్కటే. ఎలాగైనా రాముణ్ని వెనక్కి తీసుకురావాలి. అడవి వరకు పొడుగునా చక్కని రాచ బాట వేశారు. ఎండ తగలకుండా పెద్దపెద్ద వృక్షాలు మాత్రం ఉంచి నీడ కల్పించారు. అడ్డం వచ్చిన జలప్రవాహాల మీద వంతెనలు వేశారు. నీటి మడుగులు ఏర్పాటు చేసి చుట్టుగట్లు మెట్లు కట్టి వేదికలు కూడా నిర్మించారు. మనుష్యులు, గుఱ్ఱాలు, ఏనుగులు నీళ్ళు త్రాగటానికి విడివిడిగా జలవనరులు ఏర్పాటు చేశారు. అక్కడక్కడ విశ్రాంతి కోసం విశ్రాంతి మందిరాలు, వసారాలు, అరుగులు నిర్మించారు. దారిపొడుగునా మంచి గంధం కలిపిన పన్నీరు చల్లి దారంతా

తడిపారు. పరిమళ భరితములైన పూలు చల్లారు. ఈ విధంగా అయోధ్యనించి అడవి వరకు గలదారి రాజమార్గంలా తయారైంది.

రాజపరివారం కోసం విడిగా శిబిరాలు, భవనాలు నిర్మించారు. భరతుని అభిరుచికి తగ్గట్టు అవన్నీ అందమైన శిల్పాలతో, ఆభరణాలతో అలంకరించారు. బంగారు కలశాలు, జండాలు, ఆ భవనాలపై అలంకరించారు. తెల్లని మేడలు, ఇసుకమైదానలు, అగడ్తలూ ఏర్పరిచారు. ఈ ఏర్పాట్లన్నీ ఇలా జరుగుతూనే వున్నాయి. కాని వశిష్ఠువారు మాత్రం, ఎలాగైనా భరతునికి పట్టాభిషేకం చెయ్యాలని స్థిరసంకల్పంతో ప్రయత్నాలు చెయ్యటం మొదలెట్టారు. ఎందుకంటే మానధనుడైన రాముడు ఎంతమంది ఎన్నివిధాల పిల్చినా రాడని ఆయనకి తెలుసు. ఇక్ష్వాకువంశానికి పురోహితుడాయన. వారి శ్రేయోభిలాషి కూడా. అప్పటివరకు కలిగిన అమంగళాలన్నీ శమించాలని, తెల్లవారుఝామున నాందీముఖం ఏర్పాటుచేశారు. మంగళవాద్యాలూ, దుందుభీనాదాలు, శంఖారావాలు, మిన్నంటుతున్నాయి. అవన్నీ వింటున్న భరతుడు శోకంతో క్రుంగిపోయాడు.

'ఈ కోలాహలమంతా ఏమిటి? అనుకుంటూ రాజభవనం నించి బయటికి వచ్చి, ఆ వాద్యఘోష ఆపవలసిందిగా ఆదేశించాడు.' ఆపండి. నేను రాజును కాను. నాకీ మంగళవాద్యాలు అఖ్కర్లేదు' అంటు ఉన్మత్తునిలా అరిచాడు. ఆ అరుపులు విన్న శత్రుఘ్నుడు పరుగు పరుగున వచ్చాడు. భరతుడు చిన్నబోయిన ముఖంతో తమ్ముని చూసి, 'తమ్ముడూ, కైకేయి నాకెంతటి ఉపకారం ఏసిందో చూడు. మనందర్ని దుఃఖ సముద్రంలో ముంచి నాన్నగారెళ్ళిపోయాక, ఈ మంగళవాద్యాలు ఎవరికోసం? న్యాయంగా పెద్దకుమారునికి గదా రాజ్యార్హత వుంటుంది? కాని ఇపుడన్నయ్య లేడే. మహారాజు లేకపోయాక ఈ రాజ్యలక్ష్మి చుక్కాని లేని నావలావుంది. ఇపుడింక మనకి దిక్కెవరు?' అంటు పెద్ద పెట్టున ఏడ్చాడు. అంతలో వశిష్ఠుల వారు వచ్చారు. దూతలను పిల్చి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, ప్రముఖుల్నీ, మంత్రుల్నీ శీఘ్రంగా తీసుకురమ్మని ఆదేశించారు. భరతుడ్ని కూడా సభామంటపానికి రమ్మన్నారు.

భరతుడు రాగానే సభికుల్లో తమకి మళ్ళీ రాజు దొరికాడన్న సంబరం కలిగింది. వశిష్ఠుడు భరతుడికి నచ్చచెప్పు, 'కుమారా, ఈ కోసలరాజ్యాన్ని మీ తండ్రిగారు నీకిచ్చారు. నీ అన్నగారైన రాముడు కూడా ఈ రాజ్యాన్ని వదిలి సత్యమార్గంలో అడవులకి వెళ్ళారు. కనక నువ్వు రాజ్యాన్ని స్వీకరించటంలో తప్పులేదు. వెంటనే రాజ్యాభిషిక్తుడివై మాకు ఆనందం కలిగించు. తల్లిదండ్రులు మరణించాక వారికి తర్పణం ఇచ్చేవాడు, గయలో పిండప్రదానం చేసినవాడూ

వాడే పుత్రుడౌతాడు. నీ సామంతులంతా కోట్లకొలది రత్నాలు తెచ్చి నీకు కానుకగా ఇవ్వటానికి సిద్ధంగా వున్నారు. లే అభిషేకానికి సంసిద్ధుడివి అవు' అన్నారు.

'ఆర్యా, అన్నివిధాల అర్హుడైన రాముడుండగా, ఈ రాజ్యం నేను స్వీకరించటం అన్యాయం కాదా. అలా స్వీకరిస్తే నేనీ రాజ్యాన్ని అపహరించినట్లవుతుంది. వేదాధ్యయనము చేసి వేదశాస్త్రములందు, అయినవాడు, ధర్మజ్ఞుడు, రాముడే రాజ్యార్హుడు. జ్యేష్ఠపుత్రుడైన రామునిదీ రాజ్యం. నాదికాదు. రాముని ఎడబాటు సహించలేక తండ్రిగారు మరణించారు. అటువంటి తండ్రికి తనయుడనైన నేను, ఆయన దూరం కాగానే మరణించలేదు సరికదా, ఈ రాజ్యాన్ని కూడా అపహరించనా? ఇది న్యాయమేనా? మీరు సర్వజ్ఞులు. ఇలా ఆజ్ఞాపించటం ఉచితం కాదు. నా తల్లి మహాపాతకం చేసి నన్నపకీర్తిపాలు చేసింది. మీరు కూడా అనార్యమైన పనికి నన్ను ప్రోత్సహించకండి అని భరతుడు చేతులు జోడించి ప్రార్థించాడు. సభికులంతా కరతాళధ్వనులు చేశారు.

అపుడు భరతుడు సభికులతో, 'పెద్దలారా, నేను అడవికి వెళ్తున్నాను. రాముణ్ని ప్రార్థించి, అయోధ్యకి తీసుకురావటానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఒకవేళ రాముడు రావటానికి ఒప్పుకోకపోతే లక్ష్మణుడిలాగే నేనూ అడవిలోనే వుండిపోతాను. లక్ష్మణుడితో పాటు నేనూ వారిని సేవించి తరిస్తాను. మీరంతా కూడా రండి. కలిసివెళ్దాం. అంటూ సుమంత్రుని పిల్చి,

'సుమంత్రా వేగంగా వెళ్ళి సైన్యాన్ని సిద్ధం చెయ్యమని, సేనానాయకుల్ని ఆజ్ఞాపించండి. మనమంతా తొందరగా బయల్దేరాలి' అన్నాడు.

ఆ మాటలకి సమంత్రుడూ సదస్యులూ కూడా చాలా ఆనందించారు. వెంటనే సర్వసన్నాహాలూ జరిగాయి. ఉత్తమాశ్వాలు పూన్చిన రథం తెచ్చి, భరతుని ముందు ఆపాడు సుమంత్రుడు. సన్నాహాలన్నీ పూర్తయ్యేసరికి, పొద్దువాలింది. ఆ రాత్రి అంతా ప్రయాణానికి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేశారు. మర్నాడు తెల్లారింది. అందరూ త్వరత్వరగా ప్రాతఃకాల కార్యక్రమాలు పూర్తిచేశారు.

తర్వాత భరతుడు ముందుగా రథం ఎక్కాడు. ఆతడి వెనక మంత్రులూ, పురోహితులూ బయల్దేరారు. తొమ్మిదివేల ఏనుగులమీద పరివారమంతా బయల్దేరింది. అరవైవేల మంది సైన్యం ధనుర్ధారులై వారిని వెంబడించారు. ఆ వెనుక సాయుధులైన సైన్యం నడవగా పెద్దప్రవాహంలా సాగిపోయారు. సుమిత్ర, కౌసల్య, కైకేయి మొదలైన రాణి పరివారమంతా, తమతమ వాహనాలపై

బయల్దేరారు. ఎవరిమటుకు వారే, ఎంత తొందరగా వెళ్ళి సీతారామలక్ష్మణులను చూద్దామా అని ఆతృతగా వున్నారు.

ప్రతి ఒక్కరూ రాముని సుగుణ సంపత్తి గురించి చర్చిస్తున్నారు. రాముణ్ణి కలుసుకోబోతున్నామని ఆనందిస్తున్నారు. అలా ప్రయాణం చేసి, చేసి, ఆ రాత్రికి వారు గంగాతీరాన వున్న శృంగబేరపురం చేరారు. ఆ రాత్రికి అక్కడ విడిది చేద్దామని ఆగారు. గంగాతీరం పొడుగునా భరతుని సైన్యం ఆవరించి వుంది.

గంగానదీ పవిత్ర జలాల్ని తన చేతితో తాకుతూ భరతుడిలా అన్నాడు.

'ఆర్యులారా! అందరూ ఈ రాత్రి ఇక్కడ విశ్రాంతిగా వుండండి. రేపు తెల్లారగానే నదిని దాటి ఆవలి తీరానికి వెళ్దాం. నేను మా నాన్నగారికి ఉత్తమగతులు కలగటం కోసం, ఈ గంగానదిలో తర్పణాలు వదుల్తాను' అంటు నదీ జలాల్లో ప్రవేశించాడు. ఆ కార్యక్రమం శాస్త్రోక్తంగా పూర్తిచేశాడు. ఆ తర్వాత అందరూ తమకోసం ప్రత్యేకంగా నిర్మించిన డేరాల్లో పడుకున్నారు.

అయితే గంగానది పొడువునా ఒడ్డుమీద ఆవరించి వున్న అపారమైన సేనని నిషాదరాజైన గుహుడు చూశాడు. తన పరివారాన్నంతా పిల్చి ఇలా అన్నాడు.

గంగాతీరంలో పెద్ద సముద్రంలా ఆవరించి వున్న ఆ సేనని చూశారా? చూడగా అది అయోధ్యప్రభువులదేమో అనిపిస్తుంది. బహుశా కైకేయీ నందనుడైన భరతుడు, రామునికి ద్రోహం చెయ్యటానికి కదిలి వచ్చాడేమొ. రాముడు మనకి మిత్రుడు కనక మనకి కూడా అపకారం కలిగించవచ్చు. రాముడు పధ్నాలుగు సంవత్సరాలు తర్వాత మళ్ళీ అయోధ్యకి వెళ్ళి రాజ్యాన్ని సొంతం చేసుకుంటాడేమో అనే భయంతో రాముణ్ణి చంపటానికి బయల్దేరి వచ్చాడేమో. ఆ కైకకి తనయుడే కదా. మనమెలాగైనా రాముణ్ణి రక్షించాలి. మన బలాన్ని అప్రమత్తం చెయ్యండి. అని ఆజ్ఞాపించాడు.

తర్వాత భరతుడి ఉద్దేశ్యం తెలుసుకుందుకని, ఆతడికి ఆతిధ్యం ఇవ్వాలని, చేపలు, మాంసము, మధ్యము, రుచికరమైన ఆహారము తీసుకుని బయల్దేరాడు. గుహుడు రావటం సుమంత్రుడు దూరాన్నించే చేసి భరతునితో 'రాకుమారా, ఆ వస్తున్నవాడు నిషాదరాజైన గుహుడు. వయస్సులో పెద్దవాడే, కాని రామునికి ఆప్తమిత్రుడు. దండకారణ్యం గురించి అతడికి బాగా తెలుసు. ఇతడ్ని అడిగితే మన రామలక్ష్మణులు, సీతమ్మ ఎక్కడున్నారో తెలుస్తుందేమో. అతడి గురించి నువ్వేం సందేహించనక్కర్లేదు. వెంటనే నిన్ను కల్సుకుందుకు అనుమతించు' అన్నాడు.

గుహుడు పరివారసమేతంగా వచ్చి భరతుని ముందు మోకరిల్లి నమస్కరించాడు. తాను తెచ్చినవన్నీ సమర్పించి, తనవల్ల ఏమైనా సాయం కావాలా అని అడిగాడు.

భరతుడు, అతడి ప్రేమకి పులకించిపోతూ, 'నిషాదరాజా, నా అన్నగారైన రాముడికి ఆప్తమిత్రులు మీరు. భారద్వాజాశ్రమానికి దారి చెప్పగలరా? ఈ దుర్గమమైన అడవుల్లో దారీ తెన్నూ తెలుసుకోవటం కష్టం' అన్నాడు. గుహుడికి సందేహం మరింత బలపడింది. విషణ్ణ వదనంతో ఇలా అన్నాడు. 'రాకుమారా, దారిచూపటానికి, నీ వెంట నా అనుచరుల్ని పంపటానికి, నాకభ్యంతరం లేదు. కాని, రాముని కోసం వెతుక్కుంటూ ఇలా రావటంలో నీ ఆంతర్యం ఏమిటి? నీ వుద్దేశం మంచిదైతే సరే. అలాకాకపోతే మాత్రం నీదారిన నువ్వు వెళ్ళిపో. ఇలా సందేహిస్తున్నానని ఇంకోలా భావించకు. నాకెందుకు అనుమానం కలిగిందంటే, కేవలం నీ అన్నగార్ని కల్సుకోవటానికి అయితే ఇంత సైన్యంతో రానవసరం లేదు కదా'

అంటున్న గుహుని మాటలు వింటుంటే భరతునికి, చెప్పలేనంత దుఃఖం కలిగింది.

'నేస్తమా నా తల్లి ప్రవర్తనని బట్టి నువ్వలా అనుకోటంలో తప్పులేదు. కాని అటువంటి దురవస్థ నాకు రాకూడదని, ఆ దైవాన్ని వేడుకుంటున్నాను. నా పెద్దన్నగారు, తండ్రిలాంటి వాడు. ధర్మాత్ముడు, రాముని వంటి పురుషోత్తమునికి, ద్రోహం తలపెట్టేవారుంటారా? నేను అడవులపాలైన నా సోదరుల్ని - మా వదిన సీతమ్మనీ మళ్ళీ అయోధ్యకి తీసికెళ్ళామని వచ్చాను. ఆయన పట్టాభిషిక్తుడై వుండగా చూసి ఆనందించాలని నా అభిమతం. నేను నిజం చెప్తున్నాను. నమ్ము' అన్నాడు గద్గద స్వరంతో.

ఆ మాటలు విన్న గుహుడు పరమానందం చెందాడు. 'భరతా, నీ జన్మధన్యమైంది. నీ అంతటి మహనీయుణ్ణి నేనెక్కడా చూడలేదు. అయాచితంగా వచ్చిన రాజ్యలక్ష్మిని తృణప్రాయంగా విడిచి, అడవులలో కష్టాలు పడుతున్న రాముడ్ని తీసికెళ్ళి పట్టం కట్టాలనుకుంటున్నావు. నీ కీర్తి ముల్లోకాల్లోనూ శాశ్వతంగా నిలిచివుంటుంది' అన్నాడు.

అంతలో రాత్రి అయింది. భరతుడు శత్రుఘ్నుడు అలసి వుండటం చేత విశ్రాంతి మందిరానికి వెళ్ళారు. శయ్యపై వాలి ఆలోచించసాగారు.

గుహుడి మాటలు భరతుడ్ని శల్యాల్లా బాధిస్తున్నాయి. నిద్రరావటం లేదు.

దుఃఖంతో కృంగిపోతున్నాడు. చెంతనేవున్న గుహుడు భరతుడి అవస్థ గమనించి, అతడ్ని ఓదార్చాడు.

భరతుడికి ధైర్యం చెప్తు 'రాజకుమారా,' మీ సోదరులకి పరస్పరం వున్న అన్యోన్యత అప్రమేయమైనది. ఆ రోజు రాముడీ సీతాలక్ష్మణులతో ఇక్కడికి వచ్చినపుడు, రాముడు, సీత శయ్యపై నిద్రపోతూవుంటే, లక్ష్మణుడు మాత్రం విల్లు, బాణం ధరించి, తెల్లవార్లూ వారికి కాపలాకాశాడు. ఒక్క కునుకు కూడా తియ్యలేదు.

నేను లక్ష్మణుడ్ని విశ్రాంతి తీసుకోమనీ, తనకి బదులు నేను వారికి కాపలాకాస్తాను అనీ, ఎంతచెప్పినా వినలేదు. పైగా 'నిషాదరాజా! నా తండ్రికి ప్రాణసమానమైనవాడు రాముడు, సీతమ్మతో కలసి ఇలా నేలమీద పడుకుని వుండగా నాకు నిద్రెలా వస్తుందయ్యా?' అంటు ఎంతగానో దుఃఖించాడు. ఇంకొక సంగతి కూడా చెప్పాడు.

'నిషాదరాజా యుద్ధభూమిలో దేవదానవులనైనా మట్టి కరిపించగల మహాపరాక్రమవంతుడు మా రాముడు, పట్టాభిషిక్తుడు కావలసిన సమయంలో, మా తండ్రి అడవులకి వెళ్లమనగానే, మారు పలక్కుండా అడవికి వచ్చేశాడు. అందుకు కారణమైన కైకపై గాని, మంథరపై గాని, భరతునిపై గాని, కోపం తెచ్చుకోలేదు. తండ్రిమాట నిలబెట్టటమే పుత్రునిగా తన కర్తవ్యం అని భావించాడు. కనక నిజంగా అతడె దశరథ పుత్రుడు. అంతటి ధీరోదాత్తుడు, అతి సుకుమారియైన సీతతో ఎలా నేలపై పడుకున్నాడో చూడు. ఇంతటి ఘోరమైన దృశ్యాన్ని చూస్తూ నేను విశ్రాంతి ఎలా పొందగలను? అంటూ లక్ష్మణుడు ఎంతగానో ఆక్రోశించాడు. ఆభ్రాతృప్రేమ అనితర సాధ్యమైనది.' అంటు గుహుడు చెప్పుకుపోతుంటే, ప్రతిమాటా భరతుడు ఎంతో శ్రద్ధగా విన్నాడు. ఇంకా ఇంకా లక్ష్మణుని గురించి చెప్పమని అడిగాడు అపుడు గుహుడు,

'భరతకుమారా, సీతారాము లిలా కటికనేలపై విశ్రమించటం చూసి లక్ష్మణుడెంతగానో చలించిపోయి, పెద్దవయస్సులో అశ్వమేధ యాగం చేసి, పుత్రకామేష్టి చేసి, దేవతల అనుగ్రహం వల్ల మా నలుగుర్ని కుమారులుగా పొందారు. మా నలుగురిలో తండ్రి ఋణం తీర్చుకున్న తనయుడు రాముడు. అతడే అసలైన పుత్రుడు. దశరథ మహారాజుకి రాముడంటే చాలా మక్కువ. అతడు లేకుండా ఆయన ఎంతోకాలం బతకడు. రాజుని పోగొట్టుకుని మా రాజ్యము అనాథ అవుతుంది. అంతఃపురస్త్రీలంతా ఏడ్చి ఏడ్చి సోలిపోయి వుంటారు. కౌసల్య, సుమిత్ర కూడా ఎంతో కాలం జీవిస్తారన్న ఆశలేదు. నా తల్లి

సుమిత్రకి శత్రుఘ్నుడు, కూడా వున్నాడు కనక ఆమె ఊరట పొందినా, ఒక్కడే కుమారుడు వున్న కౌసల్య మాత్రం ఈ దుఃఖం భరించలేదు. చివరికి నేనూ మా రాముడు, కన్న తండ్రికి ప్రేతకర్మ చేసే భాగ్యానికి నోచుకోలేదు. ఎపుడూ కలకల లాడుతుండె మా అయోధ్య నిస్తేజమైంది.

ఎప్పటికి పధ్నాలుగేళ్ళు పూర్తవుతాయి? ఎప్పటికి మేము మళ్ళీ అయోధ్యలో ప్రవేశించగలము? ఇదంతా అయ్యే పనేనా? అంటు లక్ష్మణుడు ఎంతగానో బాధపడ్డాడు' అని గుహుడు జరిగిన సంగతులన్నీ చెప్తుండగానే, ఆ రాత్రి గడిచింది.

ఇంక కొద్దిసేపు మాత్రం రాత్రి మిగిలివుంది. ఆ తర్వాత జరిగిన సంగతి చెప్పమని భరతుడు అడిగాడు. అపుడు గుహుడు ఇలా చెప్పాడు. 'మర్నాడు సూర్యోదయం కాగానే, రామలక్ష్మణులు మఱ్ఱిపాలతో జటాజూటాలు ధరించారు. తర్వాత నారచీరలతో, ధనుర్బాణాలు ధరించి, తాపసుల్లా తయారయి, సీతతో కలసి వారు గంగానది దాటి అవతలి తీరానికి వెళ్ళిపోయారు. నేనే దగ్గరుండి వారిని నావ ఎక్కించాను' అని గుహుడు చెప్పిన మాటలు విని భరతుడు స్తబ్ధుడైపోయాడు. నేలకిఒరిగి భరతుడు, శత్రుఘ్నుడు పొర్లి పొర్లి ఏడ్చారు.

వారి అవస్థలు చూసి రాణులు ముగ్గురు కూడా ఏడవసాగారు. నేలపై పడివున్న భరతుని దగ్గర కెళ్ళి కౌసల్య - 'కుమారా, నీకేమీ అనారోగ్యం కలగలేదు కదా. ఇపుడింక మా అందరికీ నువ్వే రక్షకుడివి. నీకేమైనా జరిగితే మా గతేం కాను' అంటు ఆందోళన పడింది.

భరతుడు తేరుకుని, 'నాకేమీ జరగలేదమ్మా. రాముని చూడాలనే తొందరలో దుఃఖం ఆగటం లేదు' అన్నాడు. పెత్తల్లి కళ్ళు తుడిచి ఓదార్చాడు. మళ్ళీ గుహునివైపు తిరిగి,

'మిత్రమా, మా రాముడు సీత ఆరోజు ఎక్కడు పడుకున్నారు? వారెలాంటి ఆహారం తిన్నారు? వివరంగా చెప్పు' అన్నాడు.

ఆనాటి సంఘటన గుర్తు తెచ్చుకుంటు గుహుడు, 'భరతా, రాముడు వచ్చాడనే మహానందంతో నేను ఎన్నోరకాల వంటలు, పిండివంటలు చేయించి, ఆతిధ్యము స్వీకరించవలసిందిగా అడిగాను. కాని రాముడు ఒప్పుకోకుండా 'గుహా! మేము క్షత్రియులం. ఒకరికి ఇవ్వవలసిన వారిమే కాని ఒకరిదగ్గర్నుంచి తీసుకోటం తగదు. నువ్వు మరోలా అనుకోకు. అని సున్నితంగా తిరస్కరించి, ఆ పూట కేవలం లక్ష్మణుడు తెచ్చిన గంగాజలం మాత్రం త్రాగారు. అపుడు లక్ష్మణుడు, ఈ ఇంగుదీవృక్షం కింద మెత్తటి గడ్డి పరచి పక్క ఏర్పాటు చేశాడు. ఆ పక్కమీదే

సీతారాములు విశ్రమించారని, ఆ ప్రదేశం చూపెట్టాడు. ఆ పక్క చూసి భరతుని గుండె బ్రద్దలైంది. 'అయ్యో! హంసతూలికా తల్పాల మీద తెల్లనిమీగడలాంటి పక్కమీద, పరిచారికలు వింజామరలు వీస్తుండగా మంగళవాద్యాలు వింటు ఆదమరచి నిదురించటం మాత్రమే తెలిసిన మా రాముడు, అతి సుకుమారి మా వదిన ఈ గడ్డి పక్కమీద ఎలా పడుకున్నారో గదా, ఆహా, ఇదంతా విధివైపరీత్యం కాక మరేమిటి? ఇది నేను నమ్మలేకపోతున్నాను. కాని ఇది పచ్చినిజం.

మన సీత ధరించిన ఆభరణాల తాలూకు బంగారు తీగలు, ఆమె ధరించిన జలతారు పట్టుచీర తాలూకు పోగులు, ఆ గడ్డిలో చిక్కుకుని మెరుస్తున్నాయి. మహాబాహువైన రాముడు నిద్రరాక దొర్లినపుడు ఒక పక్క కుప్పగా ఇంకోపక్క చదునుగాను పడివున్న గడ్డి చూస్తే తెలుస్తుంది. అయ్యో, నా మూలంగానే కదా వారికీదుస్థితి కలిగింది. మేమెంత భాగ్యహీనులం కాకబోతే తండ్రిలేకపోగా తండ్రిలాంటి పెద్దన్నయ్య అడవులకెళ్ళి కష్టాలపాలయ్యేదుస్థితిలో వున్నాడు. ఇవాళ అడవులకి వెళ్తే మాత్రం, మా అన్నయ్య మహారాజు కాకపోతాడా? ఆయన రాజ్యం అపహరించాలని ఎవరు కోరుకుంటారు.

నేడు మా అయోధ్య దీనావస్థలో వుంది. సైనికులంతా మతి చెడివున్నారు. అయిన నా శత్రువులెవ్వరూ మా వైపు కన్నెత్తైనా చూడటం లేదు. ఎందుకంటే మా రాముడు బాహుపరాక్రమాలే మాకు రక్ష. నేనిపుడు ప్రతిజ్ఞ పూని చెప్తున్నాను. నా కోసమే గదా రాముడు జటాజూటాలు ధరించి, నారచీరలు ధరించి కందమూలలు తింటు, నేలమీద విశ్రమిస్తున్నాడు. కనక ఇకమీదట నేనూ అడవులలోనే వుంటాను. రాముడు, సీతమ్మనీ, లక్ష్మణుడ్ని తీసుకుని అయోధ్యకి వెళ్ళి హాయిగా అయోధ్యని పాలిస్తాడు. వానికి బదులుగా నేనూ లక్ష్మణునికి బదులుగా శత్రుఘ్నుడూ పదునాలుగేండ్లు అరణ్యావాసం చేస్తాము.

ఇపుడే వెళ్ళి రాముడ్ని కలుసుకుని శిరసువంచి నమస్కరించి, అయోధ్యకి తిరిగి రావలసిందిగా ప్రార్థిస్తాను. రాముడు ఒప్పుకోకపోతే నేనూ ఆతడి వెంట వుండి వనవాసం చేస్తాను' అని ప్రతిజ్ఞచేశాడు భరతుడు. అంతలో తెల్లగా తెల్లారిపోయింది. గుహుడు భరతుడ్ని, పరివారాన్ని గంగదాటించటానికి ఐదువందల, ధృడమైన నావలు తెప్పించాడు. అవిగాక రాజకుటుంబం కోసం, రెండు నావల్ని కలిపికట్టి అందంగా అలంకరించి, 'నస్తికము' అని పేరుపెట్టి పెద్ద నౌకగా సిద్ధం చేయించాడు.

కౌసల్య, సుమిత్ర, కైకేయి, వశిష్ఠుడు పురోహితులు, గురువులు, ఇంకావున్న

రాజపత్నులు అందరూ ఆ నౌకలలో ఎక్కారు. మిగిలిన పరివారమంతా ఐదువందల నౌకలలో ఎక్కారు. ఆ నౌకని గుహుడు స్వయంగా నడిపాడు. వారి వెనక మిగిలిన నౌకలన్నీ బయల్దేరాయి. నావికులు కొంత కొంత మందినిగా పరివారాన్ని - సామాగ్రిని జాగ్రత్తగా ఐదారు తడవలు నదిలో నావల్ని నడిపి గంగ అవతలి గట్టుకి భరతుడ్ని, రాచకుటుంబాన్ని, పరివారాన్ని, రథగజతురంగాల్ని, వారు తెచ్చుకున్న సామాగ్రిని సురక్షితంగా చేర్చారు. సరిగ్గా మైత్రీయ ముహూర్తంలో భరతుడు ప్రయాగ చేరాడు.

సేనలన్నింటినీ నదీతీరాన్ని విశ్రమించవలసిందని చెప్పి కొద్దిపాటి పరివారంతో భారద్వాజముని ఆశ్రమానికి బయల్దేరి వెళ్ళాడు భరతుడు.

ఒక క్రోసు దూరం ఆశ్రమం వుందనగా భరతుడు తన అంగరక్షకుల్ని అక్కడే వుండమని చెప్పి, తన దగ్గర శస్త్రములు, అస్త్రములు తలపాగా అన్నీతీసి పక్కనపెట్టి, కేవలం ఒక ఉత్తరీయం, పంచ ధరించి, భారద్వాజ ముని దర్శనానికి బయల్దేరాడు భరతుడు. ఆశ్రమప్రాంతం రాగానే పరివారాన్ని అక్కడే వుండమని, పురోహితుల్ని మాత్రం ముందుంచుకుని, ఆ మహాముని దర్శనం కోసం ఆశ్రమంలో ప్రవేశించాడు.

భారద్వాజుడు వారికి ఎదురొచ్చి వశిష్ఠ మహామునికి అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించి ఆహ్వానించాడు. భరతుడు సవినయంగా, భారద్వాజ మహర్షికి సాష్టాంగ దండప్రణామం చేశాడు.

ఆయన భరతుణ్ణి కూడా అర్ఘ్యపాద్యాదులతో సత్కరించి, కుశలమడిగాడు.

ఆ తర్వాత నెమ్మదిగా 'రాజకుమారా, రాజ్యపాలనా భారం వహించవలసిన నువ్వు ఇలా అడవులలో రావటానికి కారణమేమిటి? అభ్యంతరం లేకపోతే చెప్పు'అన్నాడు. అమాయకుడైన రాముడికి, అతడి తమ్మునికీ ద్రోహం చెయ్యాలనే దురుద్దేశం కాని కలగలేదు కదా. ఒకవేళ కోసలరాజ్యాన్ని శాశ్వతంగా సొంతం చేసుకుందామనే దురాలోచనగాని వచ్చిందా? అని తన మనస్సులో సందేహం బయటపెట్టాడు. ఆ ప్రశ్న విన్న భరతుని మనస్సు తీవ్రంగా గాయపడింది. దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది.

అయ్యో త్రికాలజ్ఞులైన ఈ మహర్షే నన్నిలా ప్రశ్నిస్తున్నాడంటే, ఛీ - ఛీ తన జన్మ ఇంక నిరర్ధకం అనుకున్నాడు. ఎలాగోలా మనస్సు కుదుటబరచుకుని,

'మహాత్మా, నాకలాంటి దురాలోచన ఏ కోశాన లేదు. మీరు నన్ను అనుమానించకండి. నేను చెంతలేనపుడు నా తల్లి కుట్రపన్ని చేసిన పాపిష్ఠి

ఆలోచనకి నేను బాధ్యుడ్ని కాను. ఆమె మాటలు నేను పాటించటం లేదు. ఆమె తలపెట్టిన ఘాతుకానికి నేనెంతో దుఃఖిస్తున్నాను.

ఇపుడు ఎలాగైనా రాముడ్ని ప్రసన్నం చేసుకుని, అయోధ్యకి తీసికెళ్ళి, ఆయన రాజ్యానికి ఆయననే పట్టాభిషిక్తుణ్ణి చేద్దామని వచ్చాను. మా అన్నయ్య పాదాలు పట్టి ప్రార్థిస్తాను. ఇపుడు సీత, రాముడు, లక్ష్మణుడు ఎక్కడున్నారో మీరు చెప్తారనే గంపెడాశతో వచ్చాను. దయచేసి చెప్పండి అని గద్గదస్వరంతో అడిగాడు. వశిష్ఠుడు మొదలైన పెద్దలంతా ఆతని మాటలు నిజమేనని ధృవపరిచారు.

ఆ సంగతివిన్న భరద్వాజునికి పరమానందం చెందాడు.

'భరతా, రఘువంశానికి తగిన నిర్ణయం తీసుకున్నావు. నీ మనస్సులో వుద్దేశం నేను గ్రహించాను. కాని నీ ధృడమైన సంకల్పం నీ నోట వినాలని, అడిగానంతే. నాయనా నీ కీర్తి శాశ్వతంగా నిలుస్తుంది. రాముడు ధర్మజ్ఞుడు, సీతాలక్ష్మణులతో కలసి చిత్రకూట పర్వతం మీద ఆశ్రమమేర్పరచుకుని వున్నాడు. మీరంతా రేపు అక్కడికి వెళ్ళండి. ఈరోజు మాత్రం నా ఆశ్రమంలో వుండి, నా ఆతిథ్యం తీసుకోండి' అన్నాడు. భరతుడు సరే అని అంగీకరించాడు. భారద్వాజుని కోరికపై భరతుడు తన పరివారాన్నీ సైన్యాన్ని ఆశ్రమానికి రమ్మని కబురుపంపాడు. భారద్వాజులవారు అగ్నిహోత్రశాలలోకి వెళ్ళి భరతుని పరివారానికి ఆతిథ్యం ఇవ్వటానికి విశ్వకర్మని ఆహ్వానించారు.

మంత్రోచ్చారణతో దేవశిల్పి విశ్వకర్మనీ, వఢ్రంగి త్వష్టను రప్పించి, భరతుడి పరివారం కోసం చక్కటి మందిరాలు నిర్మించి ఇవ్వమని ప్రార్థించాడు. అలాగే అష్టదిక్పాలకుల్ని ఆహ్వానించి వారి వారి విభాగాల్లో వుండే సౌకర్యాలు కల్పించమని అర్థించాడు. తర్వాత భూమిమీద నదుల్ని ప్రార్థించి, భరతుడి పరివారం కోసం చక్కటి జలవనరులు, శీతల పానీయాలు ఏర్పాటు చెయ్యమని కోరాడు.

తర్వాత దేవతల్ని, గంధర్వుల్ని, విశ్వావసువును, హాహా హూహూ అనే గాన విద్యాకోవిదుల్ని ఆహ్వానించి, గానకచేరి చెయ్యవలసిందిగా కోరాడు. అప్సరః కాంతల్ని ఆహ్వానించి, నాట్యప్రదర్శన ఇవ్వవలసిందిగా కోరాడు. కుబేరుని చైత్రరథము అనే ఉద్యానవనాన్ని తన ఆశ్రమం ముందు దించమని ప్రార్థించాడు. ఈ విధంగా వినోద కార్యక్రమాలు ఏర్పాటయ్యాక భోజనపు ఏర్పాట్లు మొదలుపెట్టాడు.

చంద్రుని ఆహ్వానించి, తెల్లని సన్నబియ్యంతో తయారైన అన్నం వండించవలసిందిగా అడిగాడు. దానితో బాటు భక్ష్య, భోజ్య, చోష్యలేహ్యములను

కూడా సమకూర్చమని అన్నాధిపతియైన చంద్రుణ్ణి ప్రార్థించాడు. భరద్వాజుడు యాగము, తపస్సు చేసి కృతకృత్యుడైనవాడు. కనక ఏదేవతల వల్ల ఏది లభిస్తుందో సమాధిలో దర్శించి, వారిని ప్రార్థించి ప్రసన్నుల్ని చేసుకుని పొందగలిగాడు. ఆతడి మంత్రశక్తికి కట్టుబడి, ఆయన ప్రార్థించిన దేవతలంతా వచ్చి ఆయన కోరికమేరకు అన్ని ఏర్పాట్లు చేసి వెళ్ళారు.

వాయుదేవుడు చల్లనిగాలి, మలయమారుతంగా ప్రసరింపజెయ్యవుగా, అలసివున్న భరతుడి సేనలన్ని ఆ చల్లదనానికి సేదతీరాయి. మేఘుడు సువాసనలు వెదజిల్లే పూలు వానగా కురిపించాడు. దేవదుంధుభులు మ్రోగాయి. అప్సరసలు నాట్యం చేశారు. గాయకులు వీణమీటుతూ శ్రావ్యమైన పాటలు పాడారు.

విశ్వకర్మ ఆశ్రమం చుట్టు ప్రాంతం చదును చేయించి, వైఢూర్యాలు పచ్చలు పరిపించాడు. ఆ ఆవరణ చుట్టూ నానారకాలైన ఫలవృక్షాలు, పూలవృక్షాలు వుండేటట్లు చేసి వాటినిండా తియ్యని పండ్లు, సుగంధములు వెదజల్లె పూలు వుండేలా నెలకొల్పాడు. ఆవృక్షాల వెనక మేలైన తటాకాలు, నిర్మలమైన నీటి ప్రవాహాలు ఏర్పాటు చేయించాడు. పెద్దపెద్ద చతుశ్శాలలు, హర్మ్యాలు, భవనాలు, ప్రాసాదాలు, అందంగా తీర్చిదిద్ది తోరణాలతో పూలమాలలతో అలంకరించాడు. వాటిలో ఉచితమైన ఆసనాలు, శయ్యలు ఏర్పాటు చేయించాడు. చక్కని బల్లలమీద తెల్ల వస్త్రాలు పరచి భోజన పదార్థాలన్ని వెండి, బంగారు పాత్రలలో అమర్చిపెట్టించాడు.

భరతుడికి ప్రత్యేకంగా రాజోచితమైన ఆసనము, రాజోచితమైన భోజనము ఏర్పాటు చేయబడ్డాయి. కాని భరతుడు మాత్రం ఆ అర్హత ఒక్క రాముడికి తప్ప మరెవ్వరికి లేదని, మంత్రుల సరసనే కూర్చుని భోజనం చేశాడు. భరతుడి సౌశీల్యాని కంతా ఆశ్చర్యపోయారు. పురోహితులు, రాజమాతలు, సైనికులు వారి వారి హోదాల్ని బట్టి ఉచితాసనాలమీద భోజనాలకి బారులు తీరి కూర్చున్నారు. అప్సరసలు వారందరికీ వడ్డనలు చేశారు. నారదుడు, తుంబురుడు, ఇంకా ఎంతమందో గాయకులు వారిముందు గానకచేరి చేశారు. అప్సరసలు నాట్యంచేశారు. వనదేవతలు పాయసం వడ్డించారు.

స్నానం చెయ్యాలనుకున్నవారికి అప్సరసలు కొందరు నూనెరాసి, నలుగుబెట్టి స్నానాలు చేయించారు. మెత్తని తువ్వాళ్ళతో ఒళ్ళు తుడిచి వారికి పానపాత్రలు అందించారు. ఇక్కడిలా విందుభోజనాలు జరగుతుండగా ఆశ్రమం ఆవల వున్న గుఱ్ఱాలు, ఏనుగులు మొదలైన జంతువులకు ఇంకొందరు మంచి దాణా పెట్టున్నారు.

ఎవరైనా కావాలంటారేమో అని వేడినీళ్ళు పెద్దపెద్ద పాత్రలలో నింపి వున్నాయి. దంతధావన సామగ్రి, చందనగంధం, దుస్తులు పాదరక్షలు, కుంకుమ, కాటుక, దువ్వెనలు, ధనుర్బాణాలు ఇలా చిత్రవిచిత్రములైన సామాగ్రి అంతా అందుబాటులో వుంచారు. ఈ అద్భుతమైన ఏర్పాట్లు చూసి, భరతుడు, పరివారం చాలా ఆశ్చర్యపోయారు. ఆ రాత్రి భరద్వాజుడి ఆశ్రమంలో అందరూ సుఖంగా గడిపారు. తెల్లవారి లేచి చూసేసరికి అన్నీ మాయమైపోయి వున్నాయి. భారద్వాజుడి తపోమహిమకి అంతా అబ్బురపడి, ఆయననెంతో మెచ్చుకుని, వందనాలు తెలిపారు.

భరతుడు భరద్వాజునికి చేతులు జోడించి నిలబడ్డాడు. అపుడు భారద్వాజుడు 'భరతా రాత్రి నీ పరివారమంతా తృప్తిగా విందునారగించారా? సుఖంగా నిద్రపోయారా?' అని సాదరంగా అడిగాడు.

భరతుడు తలవంచి నమస్కరించి, 'ఆర్యా, మీ అనుగ్రహం వల్ల నా పరివారమంతా మనసు తీరా మీ ఆతిథ్యాన్ని అనుభవించారు. మీయానతి నేను మన్నించాను. కనక నా సోదరుడైన రాముణ్ణి కలుసుకుందుకు అనుమతి ప్రసాదించండి. వారి జాడ చెప్పి మమ్మ అనుగ్రహించండి' అన్నాడు.

భరద్వాజుడు చిరునవ్వుతో 'తప్పక చెప్తాను నాయనా. ఇక్కడికి మూడున్నర యోజనాల దూరంలో నరసంచారం లేని అడవిలో చిత్రకూటగిరి వుంది. ఆ పర్వతం ఉత్తరం వైపున మందాకినీ నది ప్రవహిస్తోంది. ఆ నదికీ - చిత్రకూటాద్రికీ మధ్య పర్ణశాల నిర్మించుకుని, వాళ్ళు అక్కడ సుఖంగా వున్నారు' అంటూ ఆ ఆశ్రమానికి వెళ్ళేందుకు దారి వివరంగా చెప్పాడు. అంతలో దశరథుని రాణులు ముగ్గురు వచ్చి భరద్వాజ మహామునికి వందనం చేశారు. భరద్వాజుడు వారినాశీర్వదించి భరతుణ్ణి వారెవరెవరో చెప్పమని అడిగాడు.

భరతుడు కౌసల్యని చూపించి మునీంద్ర, ఉపవాసాలతో శరీరాన్ని శుష్కింపచేసిన ఈ పరమసాధ్వి నా తండ్రికి పట్టమహిషి, పరమధార్మికుడైన రాముని కన్న దేవతామూర్తి కౌసల్య.

ఆమె నడవలేకపోతుందేమో అని ఆమె భుజం పట్టుకుని, నడిపించుకొస్తున్న ఈ సౌశీల్యవతి నా రెండవతల్లి, సకల సద్గుణ సంపన్నుడైన లక్ష్మణుని కన్నతల్లి సుమిత్ర. లక్ష్మణ శత్రుఘ్నులిద్దరూ ఈవిడ పుత్రులు.

ఇదిగో, నష్టజాతకుడనైన నా కన్నతల్లి కైకేయి. ఈ అనర్ధాలన్నిటికీ కారకురాలు. స్వార్ధపరురాలు. అందర్నీ హింసించి ఆనందించే ప్రకృతి ఆమెది. అని చెప్పి కళ్ళనిండా నీళ్ళు నిండగా, తలవంచుకున్నాడు.

భరద్వాజుడు భరతుడ్ని దగ్గరకి తీసుకుని, కళ్ళుతుడిచి, ఓదారుస్తూ, 'కుమారా, నీ తల్లిని తప్పుపట్టకు. కేవలం భగవత్ప్రేరణవల్ల మాత్రమే ఆమె అలా ప్రవర్తించింది కాని, ఆమె దోషమేమీ లేదు. రాముడు అడవులకి వెళ్ళటం వలన, దేవతలకి, రాక్షసులకి, తాపసులకి, ఋషులకి మేలు జరుగుతుంది' అన్నాడు.

అందరు భరద్వాజునికి నమస్కారం చేసి, తమ తమ రథాల మీద ప్రయాణమయ్యారు. అలా వెళ్ళి వెళ్ళి మందాకినీ నదీ ప్రాంతం చేరారు. అక్కడ్నించి చిత్రకూట పర్వతం చక్కగా కనిపించింది. ఆ ప్రదేశం రకరకాల పూలచెట్లు, పండ్లచెట్లతోటీ చిత్రవిచిత్రాలైన పక్షులతోటీ గుంపులు గుంపులుగా తిరుగుతున్న లేళ్ళ సముదాయాలతోటీ కన్నుల పండుగగా వుంది. భరతుడి సేన అంతా నేల ఈనినట్లు ఆ ప్రాంతమంతా నిండివుంది. పరిశీలించి చూడగా దూరంగా ఎక్కడో పొగలు వస్తున్న జాడ కనిపించింది. బహుశా అక్కడ ముని ఆశ్రమాలేవో వుండి వుండవచ్చనీ, వారినడిగితే రాముడెక్కడుంటున్నాడో తెలుసుకోవచ్చనీ వారనుకున్నారు. అపుడు భరతుడు తన సైన్యమునంతా అక్కడే ఆగిపొమ్మని, సుమంత్రుణ్ణి, వశిష్ఠుడ్ని మాత్రం తన వెంట రమ్మని ఆ పొగవస్తున్నవైపు కదిలివెళ్ళారు.

భరతుడు పొదలు, లతలు తప్పించుకుంటు రాముడి కోసం వెతుకుతూ వెళ్తూవుంటే...

అక్కడ సీతారామలక్ష్మణులుల, తాము నిర్మించుకున్న ఆశ్రమంలో సుఖంగా వుంటూ అడవిలో వుండే అద్భుతదృశ్యాలు చూస్తూ ఆనందిస్తున్నారు. రాముడు సీతతో చిత్రకూట పర్వతం మీద విహరిస్తు సీతకి వినోదం కలిగించాలని,

'సీతా, ఈ ప్రాంతాల్లో ఇలా హాయిగా తిరుగుతూ వుంటే, అయోధ్య వదిలివచ్చామన్న బాధ మర్చిపోతున్నాం కదూ. అయోధ్యలోని భోగభాగ్యాలకన్నా ఇక్కడి దేవేంద్రభోగాలే, నా మనసు కుల్లాసంగా వున్నాయి. ఇక్కడ చిత్రవిచిత్రములైన పక్షులు, ఈ పర్వతశిఖరాలూ మైమరిపిస్తున్నాయి. ఈ వింత చూడు, ఈ చిత్రకూటగిరి ఒకచోట వెండిలాంటి తెల్లనిరాళ్ళతో ఇంకోపక్క కెంపుల్లాంటి ఎర్రనిరాళ్ళతో, మరికొన్నిచోట్ల పుష్యరాగాల్లాంటి స్ఫటిక శిలలతో, ఇలా చిత్ర విచిత్రాలైన శిఖరాలతో చాలా గమ్మత్తుగా వుంది కదూ. ఇక్కడ

ఎన్నెన్నో క్రూరమృగాలు సంచరిస్తుంటాయి. అయినా అవి పరస్పరం ప్రేమగా వుంటాయి. ఎన్నెన్నో తియ్యని అమృతఫలాలకి, అందమైన పూలకి, ఆలవాలమైన ఈ చిత్రకూటాద్రిమీద కిన్నెరలు, విద్యాధరులు క్రీడా విలాసాలతో మైమరచి విహరిస్తుంటారు.

ఇంతటి ఆహ్లాదకరమైన ఈ ప్రదేశంలో మనం పధ్నాలుగేమిటి? ఎన్ని వందల సంవత్సరాలైన వుండవచ్చు. ఈ అరణ్యావాసం వల్ల నాకు రెండు లాభాలున్నాయి. ఒకటి పితృవాక్యపాలన చేసి ధర్మబద్దుడనై తండ్రిగారి ఋణం తీర్చుకున్నాను. రెండవది భరతుడికి రాజ్యం ఇచ్చి, వానికి ప్రియం చేశాను' అంటు సంబరంగా చెప్పాడు. సీతజవాబు చెప్పకపోవటంతో ఆమెవైపు పరిశీలనగా చూస్తు 'వైదేహీ, నీకు కూడా ఆనందంగా వుందా? అలా మౌనంగా వున్నావేం? మైమరపా? ఔనులే నువ్వు వైదేహివికదా. శారీరకమైన ఆనందానికి అతీతురాలివి. చాలా ఉల్లాసం కలిగి వుంటుంది. పక్కనున్న నన్ను సైతం పట్టించుకోకుండా ఆమైమరపేమిటి? సీతా, మనం ప్రశాంతంగా వనవాసం పూర్తిచేసి, తర్వాత హాయిగా అయోధ్యకి వెళ్ళి రాజ్యభోగాలు అనుభవిద్దాం' అంటూ సరససల్లాపాలతో సీతని సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. సీత కూడా రాముడి సన్నిధిలో అన్నీ మర్చిపోయి ఆతడితోటిదే లోకం అన్నట్లుంటోంది.

వారిలా విలాసంగా విహరిస్తూ అలసిపోయి ఒక కొండచరియమీద కూర్చున్నారు. లక్ష్మణుడు ఆహారం కోసం వెళ్ళి, పచనము చేసిన మాంసం తెచ్చిఇచ్చాడు. రాముడు ఆ మాంసాన్ని తాను రుచిచూసి సీతకిచ్చాడు. అంతలో....... భరతుడు సైన్యం చేస్తున్న కోలాహలంతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. మృగాలు ప్రాణభయంతో పరుగులు తీస్తున్నాయి.

రాముడు లక్ష్మణుని పిలిచి 'తమ్ముడూ, ఆ కోలాహలమేమిటో చూడు. బహుశా సింహం కాని వచ్చిందేమొ. లేళ్ళు భయంతో పరుగులు తీస్తున్నాయి. చూడు' అన్నాడు. అన్నగారి మాటలు పూర్తికాకుండానే, లక్ష్మణుడు ఒక ఎత్తైన చెట్టు ఎక్కి, గుబురుగా పెరిగి వున్న కొమ్మల వెనకనక్కి, అన్నివైపులా పరిశీలించి చూశాడు. ఉత్తరం వైపున పెద్దసేన కనబడింది. యుద్ధానికి సన్నద్ధమైన పెద్దసేన కనబడింది. వారంతా యుద్ధానికి సన్నద్ధమై వస్తున్నట్లుంది. వెంటనే రాముడితో ఇలా అన్నాడు.

'అన్నా వెంటనే అగ్నిని చల్లార్చు. సీతమ్మని కొండగుహలో దాక్కోమని, తొందరగా కవచము, ధనుర్బాణాలు ధరించిరా' అని అరిచాడు.

రాముడా సేనవైపు తేరబారి చూసి, చిరునవ్వుతో ఇలా అన్నాడు. 'సౌమిత్రీ, ఎందుకంత కంగారు? ఆ సైన్యం ఎవరిదో సరిగ్గా చూడు' అన్నాడు.

లక్ష్మణుడు రోషంతో 'నేను సరిగ్గానే చూశాను. భరతుడు రాజ్యాభిషేకంతో తృప్తిపడక, తన అధికారం శాశ్వతం చేసుకునేందుకు మనిద్దర్నీ చంపటానికి వస్తున్నాడు. ఎంతైనా కైకేయి కుమారుడు కదా' అన్నాడు పళ్ళు కొరుకుతూ.

రాముడు మాత్రం కొంచెమైనా తొణకకుండా, నిశ్చలంగా చూస్తూ నుంచున్నాడు. లక్ష్మణుడికి ఆవేశంతో ఒళ్ళు తెలియటం లేదు. 'రామభద్రా ఉపేక్షించి లాభం లేదు. ఆ సేన మధ్యలో మనవంశ చిహ్నమైన కోవిదారవృక్షంతో వున్న జండా కనిపిస్తోంది. గుహుడు దారి చూపిస్తుంటే ఆ ఆశ్వికులు తొందతొందరగా ఇటే వస్తున్నారు. ఆ సేన మనముందర నిల్చిన మరుక్షణం ఆ జెండా మన వశమౌతుంది.

ఏ భరతుడి మూలంగా మనం అడవులకి రావలసి వచ్చిందో ఆ భరతుడ్ని చంపకుండా వదలటం అవివేకం కాదా. జ్యేష్ఠుడైన నువ్వు వుండగానే, రాజ్యాన్ని స్వీకరించిన అధర్మపరుడు, అతడు. ఆ దుర్మార్గురాలు కైకేయి కొడుకు చావు కళ్ళారా చూసి క్రుంగిపోవాలి. నేనిపుడే ఆ భరతుణ్ణి చంపి నీ ఋణం తీర్చుకుంటాను' అంటున్న లక్ష్మణుడి మాటలు విని చాలా బాధపడ్డాడు. 'లక్ష్మణా ఎందుకలా ఆలోచిస్తున్నావు? భరతుడు మాత్రం మన సోదరుడు కాదా. మహాప్రాజ్ఞుడైన భరతుడు స్వయంగా మన దగ్గరకి వస్తున్నాడు. ఆనందించటానికి బదులు ఆ ఆగ్రహమేమిటి? నాన్నగారు కైకేయికి ఇచ్చిన వరాల మూలంగా మనం అడవికి వచ్చాం. ఇందులో అతడి ప్రమేయం ఏం వుంది? ఇపుడు తనంతటతానే మనదగ్గరకి వచ్చాడని, అతడ్ని చంపి రాజ్యం పొందాలనుకోవటం, ఎంత అవివేకం? లోకులు మనల్ని నిందించరా? నిందతో కూడిన ఆ రాజ్యం మనకెందుకు? లక్ష్మణా బంధుమిత్రుల్ని చంపి, పరిగ్రహించిన రాజ్యం, విషం కలిపిన విందుభోజనం లాంటిది. నాకు ధర్మార్థ కామమోక్షాలన్ని నాతమ్ముళ్ళైన మీ కోసమే. నేనొకవేళ రాజ్యం పాలించినా అదికూడా మీ సుఖం కోసమే. కాని నా కోసం కాదు. నా మాట నమ్ము. ఈ ఆయుధాలమీద ఒట్టు' అన్నాడు.

'అయినా లక్ష్మణా, భరతుడు, నన్ను చంపటానికి వస్తున్నాడని, నేననుకోను. భరతుడికి నేనంటే చాలా ప్రేమ. తాతగారింటినించి అయోధ్యకి వచ్చి, జరిగిన సంగతంతా తెలుసుకుని, జ్యేష్ఠుడైన నేనుండగా తాను రాజ్యాభిషేకం చేసుకోవటం ధర్మపమ్మతమైనది కాదు అని ఎరిగినవాడు కనక, నన్ను చూడ్డానికి వచ్చాడనిపిస్తోంది. మంచి మాటలతో నాన్నగారికి నచ్చజెప్పి వుండవచ్చు. భరతుడు

పరమధార్మికుడు. తన తల్లి కోరిన వరాల గురించి విని, ఆమెపై ఆగ్రహించి వచ్చి వుండవచ్చు. భరతుడెపుడూ చెడ్డ తలపు దగ్గరకి రానివ్వడు. ఇది నా నమ్మకం' అన్నాడు. మళ్ళీ. అన్నగారి మాటలు విని లక్ష్మణుడు చాలా సిగ్గుపడ్డాడు. రాముడు లక్ష్మణుడు ఏం జవాబు చెప్పకపోవటం చూసి,

'లక్ష్మణా, నాకు తెలియకుండా భరతుడు ఎప్పుడైనా నీ మనస్సు నొప్పించాడా? ఎందుకతని పట్ల అలా పరుషంగా మాట్లాడుతున్నావు? నువ్వు భరతుణ్ణి అలా అంటుంటే నాకెంత బాధగా వుందో తెలుసా? రాజ్యం కోసం కొడుకులు తండ్రినీ, సోదరులు సోదరుల్నీ చంపటం తగనిపని. నీకు రాజ్యమే కావాలంటే చెప్పు. నేను భరతుడు రాగానే, నిన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చెయ్యమని చెప్తాను. అతడు వెంటనే ఒప్పుకుంటాడు. అంతేకాని, రక్తపాతం అక్కరలేదు.' అంటు రాముడు లక్ష్మణునికి ఎన్నివిధాలో నచ్చచెప్పాడు. లక్ష్మణుడు మరింత సిగ్గుతో, ఆవేశం తగ్గించుకుని ఇలా అన్నాడు.

'అన్నయ్యా, అలా అయితే, నాన్నగారు కూడా వచ్చి వుంటారు. అదిగో నాన్నగారి రథం కూడా కనిపిస్తోంది. అదిగో మన శత్రుంజయమనే ఏనుగు. కాని ఆ ఏనుగు మీద శ్వేతచ్ఛత్రం కనిపించదేం? నాన్నగారొస్తే శ్వేతచ్ఛత్రం వుండాలి కదా' అన్నాడు సంశయంగా.

లక్ష్మణుడి ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడి వుండటం చూసి రాముడు బాధపడ్డాడు. 'లక్ష్మణా, చెట్టు దిగిరా' అన్నాడు.

భరతుడు, శత్రుఘ్నుడు, గుహుడు, మరికొంత పరివారం కాలినడకన వచ్చి, తలోవైపు రాముని ఆశ్రమం కోసం వెతుకుతున్నారు.

అలా వెతుకుతుంటే ఒకచోట భరతుడికి, పూలచెట్ల మధ్యనించి ఆకాశంలోకి వెళ్తున్న పొగలు కనిపించాయి. అదే రాముడి ఆశ్రమమై వుంటుందని భరతుడికి తోచింది. శత్రుఘ్నుడ్ని పిల్చాడు. ఆ పొగ చూపించాడు. భరతశత్రుఘ్నులిద్దరూ ముందుకు నడిచారు. ఎదురుగా పర్ణశాల. పక్కనే యజ్ఞవాటికలో ప్రజ్వరిల్లుతున్న అగ్నిశిఖలు కనిపించాయి. ఒకపక్క విరిచి గుట్టలుగా వేసిన ఎండుకట్టెలు వున్నాయి. దారిలో అక్కడక్కడ చెట్లకు ఆరవేసిన నారబట్టలు, ధర్భలు కనిపించాయి. కొన్ని పిడకలు గుట్టగా వేసి వున్నాయి. అ గుర్తులన్నీ సరిగ్గా భరద్వాజ మహాముని చెప్పినట్లే వున్నాయి. భరతుడు పరమానంద భరితుడయ్యాడు. అన్నదమ్ములిద్దరూ సుమంత్రుడితో పర్ణశాల దగ్గరకి చేరారు.

పర్ణశాలలో బంగారుకాంతులీనుతున్న రామలక్ష్మణుల ధనస్సులు

కనిపించాయి. ఆపక్కనే అమ్ముల పొదులు, బంగారు పిడివున్న ఖడ్గాలు, తోలుతో చేసిన వేలి తొడుగులు, డాళ్ళు మొదలైన రక్షణ సామాగ్రి వుంది. పర్ణశాల మధ్యలో విశాలమైన అగ్నివేదిక వుంది. ఆ అగ్నిహోత్రం దగ్గర రాముడు పద్మాసనం వేసుకుని కూర్చుని వున్నాడు. భరతుడు కూడా నారబట్టలు ధరించి, జటాజూటము, కృష్ణాజినము ధరించి వున్నాడు. అందుకని చూడగానే భరతుణ్ణి రాముడు గుర్తుపట్టలేకపోయాడు. భరతుడు అపరబ్రహ్మలాగ దర్భాసనం మీద కూర్చున్న తేజోమూర్తి, జటావల్కలధారియైన రాముడ్ని చూశాడు. సీత, లక్ష్మణుడు పక్కనే కూర్చుని వున్నారు. భరతుడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. మనస్సంతా ఆవేదనతో నిండిపోయింది.

నిండు పేరోలగములో మంత్రులందరిచేత సేవలందుకోవలసిన రాముడు, ఇలా అడవిలో మృగాలచేత సేవించబడ్తూ పర్ణశాలలో నివసిస్తున్నాడే, వెలలేని చీనీ చీనాంబరాలు ధరించవలసిన చక్రవర్తి ఇలా నారబట్టలు, కృష్ణాజినము ధరించి కృష్ణాజినం మీద కూర్చున్నాడు. రంగురంగుల పరిమళపుష్పములు ధరించ వలసినవాడు, జటాజూటం ధరించాడే. చందన గంధం పూసుకోవలసిన వంటిమీద బురద దుమ్ము పేరుకుని వున్నాయే. ఛీ - ఛీ ఈదురవస్థ అంతా నావల్లనే కదా. నా బ్రతుకు చెడ. నేను బ్రతికేం - చచ్చేం. ఇంతటి పాపిష్టి జీవితం నాకెందుకు?' అని దీనంగా ఏడుస్తు పరిగెత్తుకి వెళ్ళి రాముని పాదాలమీద పడిపోయాడు. ఆర్యా, అంటు పాకుతూ వెళ్ళి పాదాలకు చుట్టుకున్నాడు. ఆపైన మాటలు రాలేదు. ఆ వెనుకనె శత్రుఘ్నుడు కూడా అన్నగారి పాదాలకి ప్రణమిల్లాడు.

రాముడు, వారిద్దర్ని లేవదీసి గుండెలకి హత్తుకున్నాడు. రాముడికి కూడా కన్నీరు ఆగలేదు. అంతలో సుమంత్రుడు, గుహుడు వచ్చారు. తాపస వేషంలో, ఛిన్నవదనంతో, బక్కచిక్కి వున్న తమ్ముడ్ని చూసి, నా తమ్ముడు భరతుడు వీడేనా? అని రాముడు చాలా ఆశ్చర్యపోయాడు.

తమ్ముని నుదిటిపై ముద్దుపెట్టుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని సాదరంగా పలకరించాడు. 'భరతా, ఇలా అడవులకి వచ్చావు కదా. నాన్నగారెక్కడ? ఆయన సుఖంగా వున్నారా? లేక నామీద బెంగతో దేహత్యాగం చేశారా? ఆయన లేకపోవటం వల్ల వేరే రాజులెవరైనా మన రాజ్యాన్ని ఆక్రమించలేదు కదా? నువ్వసలెందుకు వచ్చావు? అలా మౌనంగా వున్నావేం?

నాన్నగారు కుశలమే కదా. మన కులగురువైన వశిష్ఠుని పూజిస్తున్నావా? మన తల్లులు ముగ్గురు క్షేమమేనా? అని రాము డడుగుతూ వుంటే జవాబు

చెప్పటానికి భరతునికి నోరు పెగిలి మాట రావటం లేదు. దుఃఖంతో అతడి గొండు పూడిపోయింది.

భరతుడు మౌనంగా వుండటంతో అతడు రాజ్యాభిషిక్తుడై సిగ్గుచేత బదులు చెప్పటం లేదనుకుని, రాముడు 'నాయనా ఇప్పటికీ మన పురోహితులు వశిష్ఠుల వారే కదా. దేవతల్ని, తల్లి తండ్రుల్నీ, పెద్దల్ని ఆరాధిస్తున్నావా? విద్యావంతుల్ని, వైద్యుల్ని, బ్రాహ్మణుల్ని పండితుల్ని గౌరవిస్తున్నావా? నీ మంత్రులు సమర్థులు, నమ్మకస్థులు అయినవారే కదా. సేవకులపట్ల అప్రమత్తుడవై వుంటున్నావా? సేనాపతి కార్యకుశలుడే గాక, తనకి నువ్వు చేసే సన్మానము వల్ల సంతృప్తుడైనవాడై వుండాలి. అపుడే నీకు మేలుచేస్తాడు. ధైర్యసాహసాలు కలవాడూ శస్త్రాస్త్ర ప్రయోగము తెలిసినవాడు, వ్యూహరచన తెలిసినవాడూ, ఉత్తమ కులములో పుట్టినవాడూ, అయిన సేనాపతి వుంటే రాజ్యం సురక్షితంగా వుంటుంది. రాజవంశంలో పుట్టిన జ్ఞాతులెవరైనా వుంటే, వారిని మిత్రులుగా స్వీకరించాలి. అపుడు వారివల్ల ప్రమాదం వుండదు. దూతలు సమర్థులేనా? గూఢచారులను నమ్మకమైన వాళ్ళని పెట్టుకున్నావా? నాస్తికుల్ని దగ్గరకి రానివ్వటం లేదు కదా. అంతఃపుర స్త్రీలకి గట్టి రక్షణ ఏర్పాటు చేశావా? నేరస్థుల్ని శిక్షించే ముందు నాయా న్యాయాలు సరిగ్గా విచారిస్తున్నావా?' అంటూ రాజనీతి గురించి, అనేక విధాలుగా భరతుడికి తెలియచెప్పేలా ప్రశ్నించాడు. రాముడి మాటలు వింటున్న భరతుడికి దుఃఖం ఆగలేదు.

'అన్నయ్యా!, ధర్మమే తెలియని నాకు, రాజ్యధర్మాలు భోధిస్తున్నావా? నేను ధర్మభ్రష్టుడ్ని, పెద్ద కుమారుడివి నువ్వుండగా రాజ్యభారము వహించవలసిన దౌర్భాగ్యం నాకు పట్టకూడదని, శతకోటి దేవతలకి మ్రొక్కుతున్నాను. నేనెప్పటికీ రాజుని కాలేను. కనక ఆ రాజధర్మాలు నాకు తెలియవలసిన అవసరం లేదు. నాన్నగారి సంతానంలో నువ్వే జ్యేష్ఠుడివి. కనక ఆ ధర్మాలు నీకు తెలిస్తే చాలు.

'రామభద్రా, రామచంద్రప్రభూ, రాజ్యానికి మరలివచ్చి రాజ్యాన్ని పరిగ్రహించు. ప్రస్తుతం మన అయోధ్య అనాథ అయింది. నేను తాతగారింట వుండగా మీరు అడవులకి వచ్చేయగానే మీ మీద బెంగతో నాన్నగారు స్వర్గస్థులైనారు. పురుషోత్తమా, తండ్రిగారికి ఇవ్వవలసిన తర్పణాదులిచ్చెయ్యి.

నేనూ శత్రుఘ్నుడూ నాన్నగారికంత్యక్రియలు చేసి తర్పణాలిచ్చాము. కాని పెద్ద కొడుకువి. నువ్వు ఇస్తేనే ఆయనకి ముట్టుతుంది. నాన్నగారికి నువ్వంటే చాలా ఇష్టము. ఆయన నిన్నే స్మరిస్తూ తపించిపోయి నిన్ను వదిలి వుండలేక, నీ

కోసం శోకిస్తూ ప్రాణాలు వదిలారు. కనక పరలోకంలో నువ్విచ్చే తర్పణాల కోసం ఎదురుచూస్తూ వుంటారు'. అన్నాడు.

భరతుని మాటలు విన్న రాముడు పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాడు. తండ్రి మరణించి వుండవచ్చు అన్న అనుమానం కలిగినా, ధీరోదాత్తుడు కనుక ఇప్పటిదాకా ఎలాగో ఓర్చుకున్నాడు. కాని వాస్తవంగా తండ్రి మరణించాడన్న వార్త తెలియగానే, అంతటి ధైర్యశాలి వజ్రాఘాతం తగిలిన ఏనుగులా మూర్ఛపోయి నేలకొరిగాడు. వెంటనే లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడూ ఆ మహావీరుని లేవనెత్తి పట్టుకున్నారు. సీత చల్లటి నీళ్ళు తెచ్చి ముఖంమీద చల్లింది. రాముడికి తెలివి వచ్చింది. శోకం పొంగిరాగా తమ్ముళ్ళనీ, సీతనీ చూస్తూ, దీనవదనంతో

'దైవ నిర్ణయం అలా వుందన్న మాట. ఆయన లేని అయోధ్యకి నేను మాత్రం ఎలా రాగలను? అయోధ్యలో ఎటుచూసినా వారు మనని లాలించి, బుజ్జగించి, చెప్పిన మాటలే గుర్తువస్తాయి' అంటూ ఎన్నివిధాలో దుఃఖించి, సీతవైపు చూసి 'సీతా, నీ మామగారు చనిపోయారు. లక్ష్మణా, నువ్వు తండ్రి లేనివాడివయ్యావు' అంటూ వాళ్ళిద్దర్ని పట్టుకుని భోరున ఏడ్చాడు. సీతక్కూడా కళ్ళనీళ్ళు నిండాయి. అపుడు లక్ష్మణ భరత శత్రుఘ్నులు 'అన్నయ్యా, నాన్నగారికి తర్పణాలివ్వాలి. బయల్దేరు. ధైర్యం తెచ్చుకో' అన్నారు. రాముడు కన్నులు తుడుచుకుని, సీతని ఓదార్చి ఖిన్నవదనంతో, లక్ష్మణుని చూసి,

'లక్ష్మణా, గార పండ్లు దంచి, ముద్దచేసి తీసుకురా, తండ్రిగారికి తర్పణాలివ్వాలి' అన్నాడు. ముందు సీత - వెనక రాముడు, మధ్యన లక్ష్మణుడు నడిచివెళ్ళారు. వారి వెంట సుమంత్రుడు వెళ్ళాడు. భరత శత్రుఘ్నులు వారిని అనుసరించారు.

మందాకినీ తీరంలో, నిర్మలమైన నీళ్ళల్లో దిగి, దక్షిణాభిముఖంగా నుంచుని, రాముడు దోసిలి నిండా నీళ్ళు తీసుకుని పితృతర్పణం వదిలాడు. తర్వాత గారపిండి, రేగుపిండి కలిపి, పిండాలుగా చేసి, దర్భలపై వుంచి, దుఃఖంతో ఇలా అన్నాడు.

'మహారాజా, ఈ అడవిలో మాకు ఇంతకన్నా ఏమీ దొరకవు. మేమివే తింటున్నాము. మీరుకూడా ఇవే తినండి. చక్రవర్తులైన మీరు ఇలాంటి ఆహారం తినలేరు. అయినా మనమేది తింటే, అదే పితృదేవతలకి పెట్టాలని శాస్త్రం చెప్తోంది. కనక మీకు ఇవే సమర్పిస్తున్నాము' అని దుఃఖిస్తూ పితృకార్యం నెరవేర్చాడు. తర్వాత వారంతా వచ్చినదారినే పర్ణశాలకు వెళ్ళారు పర్ణశాలలో అడుగుపెట్టగానే

అందరూ పెద్ద పెట్టున ఏడ్చారు. ఆ ఏడుపులు విన్న భరతుడి పరివారమంతా దుఃఖంతో అక్కడికి పరిగెత్తుకువచ్చారు. వారంతా పెద్దపెట్టున ఏడుస్తూ రామునికి నమస్కరించారు. రాముడు వాళ్ళందర్ని కౌగలించుకుని ఓదార్చాడు. ఏ ఒక్కరూ దుఃఖం ఆపుకోలేకపోతున్నారు.

అంతలో కౌసల్యా - సుమిత్ర - కేకేయిలను వెంటబెట్టుకుని వశిష్ఠుడు వచ్చాడు. దారిలో మందాకినితీరాన రాముడు తండ్రికి పిండప్రదానం చేసిన చోటుకి వచ్చారు. కౌసల్య ముఖం వాడి, కన్నులనిండా నీరు నిండింది. దుః ఖంతో మాట పెగలక గద్గద స్వరంతో సవతుల్ని చూస్తూ,

'ఇన్నాళ్ళు కష్టమంటే ఏమిటో ఎరగకుండా పెరిగిన రాకుమారులు ఇవాళ అడవులపాలై పడరాని పాట్లు పడుతున్నారు. సుమిత్రా ఇటు చూడు మన లక్ష్మణుడు, ఇక్కడ్నుంచే నీరుతీసుకెళ్ళి సీతారాముల కిస్తున్నాడు. ఇద్దరూ రాజకుమారులే. సేవాధర్మం ఆచరించటం తప్పే. కాని పెద్దన్నగారు తండ్రిలాంటి వాడు. కనక సేవించటంలో తప్పులేదు. దేవుని దయవల్ల భరతుడి ప్రార్ధన నాలకించి, రాముడు అయోధ్యకి మరలివస్తే నీ కొడుక్కి ఈ కష్టాలు తప్పుతాయి అని కౌసల్య విలపిస్తుండగా మందాకినీ తీరంలో రాముడు దర్భలపై వుంచిన పిండాలు కనిపించగా వాటిని చూసిన ఆమె హృదయం ద్రవించిపోయింది.

'ఆహా, విధివైపరీత్యమెంత గొప్పది! ఇక్ష్వాకువంశపు మహారాజు, రఘువంశ సంభూతుడైన మహామహుడు, దశరథ మహారాజుకి, ఆయన పెద్దకుమారుడు, రాముడు ఇచ్చిన ఆహారమా ఇది! ఆయన చక్రవర్తిగా ఎన్నో భోగాలనుభవించారు. అటువంటి ప్రభువు, ఈగారపిండి ఎలా తిన్నారో కదా. ఇది చూస్తూ కూడా నా గుండె ముక్కముక్కలవ్వటం లేదంటే, నాది ఎంత రాతి గుండో కదా' అంటూ భోరున ఏడ్చింది. సవతులంతా ఆమెని ఓదార్చారు. అరణ్యంలో వుంటూ ఇలాంటి తిండి తింటూ పడరాని కష్టాలు పడుతున్న సీతారాముల్ని, లక్ష్మణున్ని తల్చుకుని దుఃఖిస్తూ ముందుకు నడిచి, రాముని ఆశ్రమం చేరుకున్నారు.

తల్లుల్ని చూడగానే, దుఃఖం పట్టలేక ఏడుస్తూ రాముడు వారి పాదాలమీద వాలిపోయాడు. ఆ వెనక లక్ష్మణుడు వచ్చి వారికి పాదాభివందనం చేశాడు. ఆ తర్వాత సీతవచ్చి అత్తలందరికి పాదాభివందనం చేసింది. కౌసల్య సీతని అక్కున చేర్చుకుని కన్నీరు కార్చింది.

'అమ్మా, విదేహరాజు గారాలబిడ్డవి. దశరథ మహారాజు గారి పెద్ద కోడలివి. రఘురాముని ఇల్లాలివి. అటువంటి నీకు, ఎంత కష్టం వచ్చింది తల్లీ. ఈ ఘోరం

చూడ్డానికేనా ఇంకా బ్రతికివున్నాను' అంటు ఎన్నోవిధాలా ఏడ్చింది. అంతలో వశిష్ఠుల వారు ఆశ్రమంలో ప్రవేశించారు. రాముడు లేచి, ఆయనకి ప్రణమిల్లి ఆసనంపై కూర్చుండజేసి, ఆయన పాదాలకి ప్రణమిల్లాడు. అందరూ కూర్చున్నాక రాముడు భరతుని చేరబిలిచి,

'తమ్ముడూ, ఇలా తాపస వేషంలో ఇక్కకెందుకొచ్చావు? వివరంగా చెప్పు? అని అడిగాడు. భరతుడు చేతులు జోడించి, 'రామచంద్రా మన తండ్రి, కేవలం ఒక ఆడదానికిచ్చిన మాట కోసం జ్యేష్ఠుడివైన, నీకు చెందవలసిన రాజ్యాన్ని, చిన్నవాడినైన నాకుకట్టబెడతానని, చాలా అన్యాయం చేశారు. మీ మీద బెంగతోనె దేహత్యాగం చేశారు. అందుచేత మన తల్లులకి వైధవ్యం ప్రాప్తించింది. ఇన్ని అనర్థాలకి కారకురాలు నా తల్లి. ఘోరమైన నరకానికి పోతుంది. ఈ అన్యాయాన్ని నేనే కాదు, మన పెద్దలెవ్వరూ కూడా సహించలేకపోతున్నారు. అందుకని నువ్వు నా ప్రార్థన నాలకించి, వదినతోటీ, లక్ష్మణునితోటీ అయోధ్యకి తిరిగివచ్చి పట్టాభిషిక్తుడివి కావాలి. అందుకే మన తల్లుల్ని, పెద్దల్ని, వెంటబెట్టుకుని వచ్చాను. వారందరి అభీష్టము కూడా ఇదే. కనక అనుగ్రహించు. మన అపారమైన సేన అంతా మిమ్మల్ని కన్నీటితో వేడుకుంటూంది. నా ఒక్కడి కన్నీరు చూసి సహించలేని మీరు ఇందరికన్నీరు చూసి ఓర్చుకోగలవా? మన మంత్రులంతా ఇదే యాచిస్తున్నారు. కాదనకు' అని అనేకవిధాల రాముని ప్రార్థించాడు.

రాముడు వెంటనే లేచి భరతుడ్ని గుండెలకి హత్తుకుని 'తమ్ముడూ, నువ్వు ఉత్తమ వంశంలో జన్మించావు. కనక జ్యేష్ఠుడినైన నాకు రాజ్యాభిషేకం చెయ్యాలనుకోవటం ఉచితమే. నీలో స్వార్థం కాని, దోషం కాని లేదని నేను నమ్ముతున్నాను. కాని దైవనిర్ణయం ఇలా వుందే తప్ప ఇందులో నీ తల్లి తప్పు ఎంతమాత్రం లేదు. ఆమెని నిందించకు.

అయితే కుమారుణ్ణి నిర్దేశించే హక్కు తండ్రికెపుడూ వుంటుంది. ధర్మశాస్త్రం తెల్సినవారు తల్లిదండ్రుల్ని గౌరవించాలే తప్ప దూషించకూడదు. నాన్నగారి నిర్దేశం ప్రకారం, అడవులలో నివసించటం నా కర్తవ్యం. నిన్ను అయోధ్యని పాలించమని నిర్దేశించారు. దానినాచరించటం నీ కర్తవ్యం.

ప్రస్తుతం ఆయన జీవించిలేకపోయినా వారిమాటలే మనకి ప్రమాణం అని రాముడు తమ్ముణ్ణి బుజ్జగించి చెప్పాడు. ఆ విషయం మీద ఆ రాత్రంతా వాదోపవాదాలు జరిగాయి. తెల్లారింది. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురూ మందాకినీ నదికివెళ్ళి స్నానాలు చేసి ప్రాతఃకాల కార్యక్రమాలు నెరవేర్చారు. తర్వాత

ఆశ్రమానికి వచ్చి పరివారంతో సహా కొలువు తీరికూర్చున్నారు. అపుడు భరతుడు లేచి చేతులు జోడించి,

'రామా, ఇందరి సమక్షంలో నాన్నగారు నాకిచ్చిన రాజ్యాన్ని నేనే స్వయంగా మళ్ళీ నీకు సమర్పిస్తున్నాను. నేను నీ దాసుడ్ని. ఈ దాసుడి కోరిక కాదనకు. ఈ రాజ్యపాలనా భారాన్ని మోసే శక్తి నాకు లేదు. ఈ రాజ్యానికి నీవు రాజువి కాలేకపోయావని, పరలోకంలో వున్న మన నాన్నగారు, ఈ లోకంలోని ప్రజలు, తల్లులు, భృత్యులు, అందరూ ఎంతో దుఃఖిస్తున్నారు. నీవు పట్టాభిషిక్తుడైతే కళ్ళారా చూడాలని వారంతా తహ తహలాడుతున్నారు' అని భరతుడు ప్రాధేయపడగా....

ఆ మాటలు విని అందరూ భరతుడ్ని మెచ్చుకున్నారు. కాని రాముడు చలించలేదు. భరతుణ్ణి అనునయిస్తూ

'భరతా, ప్రశాంతంగా నా మాటవిను. మానవుడు స్వతంత్రుడు కాడు. దైవం ఎలా నడిపిస్తే అలా నడవాలి. దైవనిర్ణయం మార్చటం ఎవరి తరమూ కాదు. మరణం అనేది ప్రతిప్రాణికీ సహజం. కనక నాన్నగారి మరణానికీ దుః ఖించకూడదు. కాలచక్రం తనమట్టుకు తాను తిరుగుతూనే వుంటుంది. గడిచిపోయిన కాలం మళ్ళీ తిరిగిరాదు. వేసవి తాపానికి సరస్సులలో నీరు ఇంకిపోయినట్లే కాలగమనంలో మన ఆయుష్షు తరిగిపోతూ వుంటుంది. కనక ఇంకొకర్ని గురించి శోకించటం మాని మన కోసమే మనం ఏడవాలి.

ప్రతినిమిషం గడిచే కొద్దీ మన ఆయుర్దాయం తరిగిపోతూ వుంటుంది. మనం మరణానికి చేరువవుతాము. కనక మన శరీరం వుండగానే మన ధర్మం మనం నెరవేర్చాలి. మృత్యువు మనల్ని వెన్నంటి వుంటుంది. మనం కూర్చున్నా నుంచున్నా ప్రయాణం చేసినా అది మనతోటే వుంటుంది. దాని నుంచి తప్పించుకోవటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

వయసు గడిచే కొద్దీ శరీరం ముడతలు పడ్తుంది. జుట్టు నెరిసిపోతుంది. శరీరంలో అవయవాలన్నీ ఒక్కొక్కటీ పనిచెయ్యటం మానేస్తాయి. చివరికి శరీరం శిథిలమై పోతుంది. దీనిని ఆపేశక్తి ఎవ్వరికీ లేదు. ఇలా జరగకుండా ఆపగల వారెవ్వరూ వుండరు. ఇదే కాలము యొక్క ప్రభావము.

సూర్యోదయమైందని ఆనందిస్తాం. సూర్యాస్తమయమైందనీ ఆనందిస్తాం. కాని ఆరెండింటి నడుమ మధ్యకాలంలో మనం సాధించవలసినవి సాధించకుండానే, జీవితంలో ఒకరోజు గడిచిపోయిందని గుర్తించలేము. కాలం

ఒక ప్రవాహం లాంటిది. వసంతంలో చెట్లు చిగురించాయనీ, శీతాకాలంలో పంటలు పండాయనీ, వర్షాకాలంలో వర్షాలు కురిశాయనీ, సంతోషిస్తాము. కాలచక్రంలో ఋతువులు రేకులలాంటివి. అవెపుడూ స్థిరంగా వుండవు. ప్రకృతిని చూసి ఆనందించటం సహజమే అయినా, అవి మన ఆయుర్దాయాన్ని మ్రింగేస్తున్నాయని, మరచిపోకూడదు. ప్రవాహ వేగంలో కొన్ని కట్టెలు కొట్టుకునివచ్చి ఒక దానితో ఒకటి కలుస్తాయి. మళ్ళీ ఆ ప్రవాహవేగంలోనే అవి విడిపోతాయి.

అలాగే జీవిత ప్రవాహంలో భార్యా, పిల్లలు, జ్ఞాతులు, ధనము అన్నీ వచ్చి మనని చేరినా, కొంతదూరం మాత్రమే మనతో కలసి వుండి, తర్వాత విడిపోక తప్పదు. జరిగినదానికీ జరగబోయేదానికీ మన బాధ్యత ఎంతమాత్రం వుండదు. అంతా దైవనిర్ణయం ప్రకారమే జరుగుతుంది.

కనక చనిపోయిన వారి గురించి శోకించటం తగదు. మన తాతలు, తండ్రులు ఒకరి వెనక ఒకరు వెళ్ళినట్లే మనమూ ఆ దారినే వెళ్తున్నాం. కనక నాన్నగారి గురించిన దుఃఖం ఇంకచాలు. ధైర్యం తెచ్చుకుని, అయోధ్యకి వెళ్ళి, రాజ్యలక్ష్మిని స్వీకరించు. వారు మనిద్దర్నీ ఏయే కార్యాలలో నియోగించారో, ఆ శాసనం నెరవేరుద్దాం. అంతేకాని, నేను అడవులలో వున్నానని, నువ్వు రాజ్యత్యాగం చెయ్యటం అవివేకం' అని రాముడు భరతుడికి కర్తవ్యం బోధించాడు. భరతుడు సావధానంగా విన్నాడు. కాని తన మనస్సులోని భావం రాముడికి సరిగ్గా తెలియలేదని గ్రహించాడు. అప్పుడు భరతుడు రాముడుతో

'రామభద్రా, మీ అంతటి స్థితప్రజ్ఞులు లోకంలో ఎవ్వరూ వుండరు. మీరు సుఖదుఃఖాలకి అతీతులు. కాని రాగద్వేషాలు అవివేకులకే గాని, వివేకులకి కలగవు. మీరు చెప్పిన విషయాలు నాకూ తెలుసు. కాని నా మాట కూడా వినండి. నాన్నగారు చనిపోయారని నేను దుఃఖించడం లేదు. మీ అంతటి మహాత్ముడికి ఆపద కలిగిందే, అని మాత్రం దుఃఖిస్తున్నాను. అదీ నీచప్రవృత్తి గల నా తల్లివల్ల కలిగిందే అని ఆక్రోశిస్తున్నాను. నా మనస్సు చల్లబడాలంటే, దయచేసి నా ప్రార్ధన మన్నించి నా వెంట రమ్మని ప్రాధేయపడ్తున్నాను.

ఇంతటి పాపిష్టి వరాలు కోరినందుకు నా తల్లిని వెంటనే చంపేద్దామనుకున్నాను. కాని అది ధర్మ విరుద్ధము. ధర్మవిరుద్ధమైన పని చేస్తే నీకు క్లేశం కలిగి ఆగ్రహిస్తావని, ఆ పని చెయ్యలేకపోయాను. మహోన్నతమైన వంశంలో పుట్టిన నాన్నగారు ఏనాడూ ధర్మం తప్పలేదు. అటువంటి తండ్రికి

జన్మించిన నేను మాత్రం లోక నింద్యమైన పని ఎలా చెయ్యగలను? సభామధ్యంలో చనిపోయిన తండ్రిని దూషించకూడదు. కాని, అంతటి ధర్మజ్ఞుడైన మహారాజు, కేవలం ఒక స్త్రీకి ప్రియం చెయ్యటం కోసం, ఇంతటి పాపకార్యానికి ఒడిగట్టారే, చనిపోయేముందు ప్రతి మనిషికీ మతి చెడుతుందని ఒక నానుడి వుంది. అదే నిజమనుకోవాలా? మోహవశుడైన తండ్రి ధర్మాన్ని అతిక్రమించినపుడు, నువ్వు బాగా ఆలోచించి, ఆ తప్పిదాన్ని సవరించవచ్చు కదా.

తండ్రి ధర్మచ్యుతుడు కాకుండా కాపాడేవాడే తనయుడు. కనక తండ్రి గారి వలన జరిగిన పొరపాటును సరిదిద్ది, ఆయనకి అధర్మదోషం అంటకుండా నువ్వు కాపాడాలి. నువ్వలా చేస్తే నాన్నగారే గాక నేనూ, మిత్రులు, బంధువులు, పౌరులు, జానపదులు, కైకేయీ, అందరం రక్షించబడ్తాము. క్షత్రియుడైనవాడు పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలి. అంతేగాని ఇలా జటాజూటాలు ధరించి, అడవులలో తిరగకూడదు. క్షత్రియులకి వృద్ధాప్యంలో మాత్రమే వానప్రస్థాశ్రమం ఉచితము. ధర్మాచరణ కష్టమని నువ్వనుకున్నా ప్రజలందర్నీ కంటికి రెప్పలా కాపాడుతూ రాజ్యపాలన చెయ్యటం అంతకన్నా కష్టమైన పని కదా. నాలుగు ఆశ్రమాల్లోనూ గృహస్థాశ్రమము ఉత్తమమైనదని, శాస్త్రాలు చెప్తున్నాయి. అలాంటి గృహస్థాశ్రమం విడిచి, తాపసధర్మం స్వీకరించటం నీలాంటి ధర్మమూర్తికి తగునా?

నీకన్నా వయస్సులో చిన్నవాడిని. నువ్వుండగా నేను రాజ్యభారమెలా స్వీకరించగలను? కనక నా అభ్యర్థన మన్నించు. వశిష్ఠాది మంత్రవేత్తలు, ఋత్విజులు, పండితులు, నీకు రాజ్యాభిషేకము చెయ్యాలని, సంరంభములన్నీ సమకూర్చుకుని, ఇక్కడికి వచ్చి, నీ అనుమతి కోసం నిరీక్షిస్తున్నారు.

నువ్వు రాజ్యాభిషిక్తుడవై అయోధ్యని పాలించటానికి, మాతో వచ్చెయ్యి. నా తల్లికి లోకనింద పోగొట్టి, మన తండ్రికి అధర్మపాపం కలగకుండా కాపాడు. అలాకాదని, నువ్వు మాతో రావటానికి ఒప్పుకోకపోతే నేనూ మీతోపాటే వనవాసం చేస్తాను' అని మొండిగా మంకుపట్టు పట్టుక్కూర్చున్నాడు.

కాని రాముడు ఒప్పుకోలేదు. పితృవాక్యపాలన కోసం అడవులలోనే వుండటానికి నిశ్చయించుకున్నాడు. రాముని స్థిరచిత్తానికి అందరూ ఆశ్చర్యపడ్డారు. అందరూ కంటతడిపెట్టి చూస్తున్నారు. రాణులు ముగ్గురూ పెద్దపెట్టున ఏడ్చారు. మంత్రులందరూ రాముణ్ణి మరొక్కసారి ఆలోచించమని కోరారు.

రాముడు వారి కోరికని తిరస్కరిస్తూ, 'ఆర్యులారా, మిమ్మల్నందర్నీ అగౌరవపరచాలనే తలంపు నాకులేదు. కాని మీకెవ్వరికీ తెలియని రహస్యం ఒకటి ఇపుడు చెప్తున్నాను వినండి. మా నాన్నగారు పెద్దభార్యలైన కౌసల్యాదేవికి, సుమిత్రాదేవికీ సంతానం కలగకపోవటం వల్ల మూడో భార్యగా కైకేయిని చేసుకున్నారు. అపుడు ఆయన కైకేయికి పుట్టిన కుమారునికే రాజ్యం ఇస్తానని ఆమె తండ్రికి వాగ్దానం చేశారు. కనక న్యాయంగా ఈ రాజ్యం భరతుడిదే. నీ తల్లి మొదటి వరంగా నీకు రాజ్యాభిషేకం జరగాలని కోరింది. అలా చూసినా ఈ రాజ్యం నీదే.

కనక భరతా, మన నాన్నగారు నీ తల్లికి ఇచ్చిన రెండోవరం ప్రకారం నేను పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చేయ్యటమే న్యాయం. మనిద్దరం నాన్నగారు నీ తల్లికిచ్చి వరాలు గౌరవించి, ఆచరిద్దాం. లేకపోతే మహారాజు మీ తల్లికి ఋణపడి వుంటారు. కనక నాన్నగారి సత్యవ్రతం కాపాడి, వారికి స్వర్గప్రాప్తి కలిగించు. నువ్వు శత్రుఘ్నుని తీసుకుని అయోధ్యకి వెళ్ళి పట్టాభిషిక్తుడవై రాజ్యపాలన చెయ్యి. నేను లక్ష్మణుడు పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసి అయోధ్యకి తిరిగివచ్చి మిమ్మల్ని కల్సుకుంటాము' అన్నాడు. అపుడు అక్కడే వున్న జాబాలి, దశరధుని ఆస్థాన పండితుల్లో ఒకడు వారిద్దర్ని సమాధాన పరచాలని ఇలా అన్నాడు.

'రామభద్రా, నువ్వు సకలశాస్త్రాలు చదివిన ధర్మజ్ఞుడివి. పామరునిలా ఇలా అనటం ఉచితమేనా? బాగా ఆలోచించి చూడు. ఈ లోకంలో ఎవరు ఎవరికి బంధువు? పుట్టిన బిడ్డలు ఒంటరిగానే పుట్తారు. ఒంటరిగానే పోతారు. తల్లి తండ్రి అనే పాకులాట అవివేకం వల్లనే. ప్రయాణీకుడు ప్రయాణం చేసేటప్పుడు దారిలో మజిలీ చేసినపుడు తనకోసం సంభరాలు తెచ్చుకుంటాడు. తోటి ప్రయాణీకుల్ని మిత్రుల్ని చేసుకుని కష్టసుఖాలు చెప్పుకుంటాడు. వెళ్ళిపోయేటపుడు ఎక్కడివక్కడ వదిలేసిపోతాడు. అలాగే మనం కూడా జీవితమనే ప్రయాణంలో తోడు తెచ్చుకున్నవారే తల్లి, తండ్రి, బంధువులు, ఇల్లు వాకిలీ, ఇవన్నీ తాత్కాలికాలే. ఈ బంధాలన్నీ అశాశ్వతం. కనుక నువ్వు రాజ్యం వదలి వనవాసం చెయ్యటంలో అర్థం లేదు. కంటకప్రాయమైన అడవి నువ్వుండదగ్గ చోటు కాదు. అక్కడ రాజ్యలక్ష్మి నీ కోసం ఎదురుచూస్తోంది. అయోధ్యకి వెళ్ళి సుఖంగా సకల సంపదలు అనుభవించు. దశరధుడు తండ్రి నువ్వు కొడుకువి అనే పామరత్వం విడిచిపెట్టు. తల్లిదండ్రుల శుక్లశోణితాలు కలసి మానవశరీరం పుట్టుంది. ఆ శుక్లశోణితాలే జన్మకారణం గాని, తల్లి తండ్రి కాదు.

నీ తండ్రి ఎక్కడికి వెళ్ళాలో అక్కడికే వెళ్ళాడు. మరణం మానవ సహజమైనది. ఈ మిధ్యాప్రపంచంలో ఒకరికోసం ఇంకొకరు దుఃఖించటం అనవసరం. కష్టాలైనా, సుఖాలైనా ఈ శరీరం వున్నంతవరకే. చనిపోయిన వారికి శ్రాద్ధకర్మ ఆచరించటం కూడా అనవసరమే కాక, అవివేకం కూడా. ఆహారాన్ని వ్యర్ధం చెయ్యటం చనిపోయిన వారెక్కడికి వెళ్తారో ఎవరెరుగుదురు? ఇక్కడ ఇంకొకరికి మనం అన్నం పెడ్తే ఎక్కడో చనిపోయిన వారికెలా చేరుతుంది? అదే నిజమైతే వేరే ఊరువెళ్ళిన వారికోసం ఇక్కడ మనం అన్నం తింటే, వారి కడుపు నిండుతుందా? ఎక్కడున్నాడో తెలియని తండ్రి కోసం నీ సుఖాలన్నీ త్యాగం చెయ్యడం తెలివితక్కువతనం. సుఖంగా నీ రాజ్యభోగాలు నువ్వనుభవించు. క్షత్రియుడవైన నువ్వు రాజ్యపరిత్యాగం చెయ్యటం తగదు. ఇప్పటికైనా భరతుని ప్రార్ధన మన్నించి, రాజ్యాన్ని స్వీకరించు' అన్నాడు.

ధర్మజ్ఞుడైన రాముడు, జాబాలి పలుకులు విని, ఆశ్చర్యపోయాడు.

'ఆర్యా! - మీరుగాని నన్ను మభ్యపెట్టడానికిలా పలకటం లేదుకదా? ఇంతటి అసంబద్ధమైన మాటలు మీరెందుకు చెప్తున్నారు? నాకు ప్రియం చెయ్యటం కోసం, అపథ్యమైనది పథ్యంగా, చెయ్యకూడనిది చెయ్యదగినదిగా చెప్తున్నారు. హద్దులు మీరి, వ్యక్తావ్యక్తములు మరచి, పాపపుదారిలో సంచరించేవారిని, సత్పురుషులు గౌరవించరు. మానవుడి నడవడిని బట్టి వారి స్వభావములు గుర్తించవచ్చు. అధర్మప్రవృత్తి గలవారు ధర్మవేషపు ముసుగులో లోకాన్ని మోసం చేస్తూంటారు. అందుకని ధార్మికులెవరో కాని వారెవరో, వేషభాషల్ని బట్టి గుర్తించటం కష్టం. అటువంటి వారు నాస్తికులై లోకాన్ని పాడుచేస్తూ వుంటారు.

ఒకవేళ నాస్తికుల వాదనే ధర్మబద్ధమైనది అయితే, నేను రాజ్యపాలన చేసి స్వర్గమునందగలను. కాని అది ధర్మ విరుద్ధమైనది. అయితే, నేను ధర్మ భ్రష్టుడనై స్వర్గం కోల్పోతాను.

నేను నా తండ్రికి చేసిన వాగ్దానం మరచి, రాజ్యం పరిగ్రహిస్తే నాకు గౌరవం లేకపోగా పైలోకంలో సౌఖ్యం వుండదు. రాజు నడచిన దారిలోనే ప్రజలూ నడుస్తారు. కనుక, లోకంలో సత్యం, ధర్మం నశించిపోతాయి. అసత్యం పలికే వారిని చూసి ప్రజలు తాచుపామును చూసినట్లు భయపడ్తారు అసత్యములైన పల్కులు విషతుల్యములై హాని కలిగిస్తాయి. సత్యమే పరమేశ్వరుడు. సత్యమే లక్ష్మిప్రదము. అన్ని సుఖములకు, సత్యమే మూలము. కనక మానవుడు సత్యాన్నే ప్రధానధర్మంగా ఆచరించాలి.

అటువంటి ఉత్తమమైన సత్యమార్గాన్ని వదిలి, రాజ్యలోభముతో, అధర్మంగా తండ్రికిచ్చిన మాట నతిక్రమించి, రాజ్యము పరిగ్రహించటం అనుచితం.

ఆడిన మాట తప్పి, చంచల స్వభావముతో ప్రవర్తించే పురుషుడు ఇచ్చేతర్పణాలుగాని, పూజలుగాని, పితృదేవతలు, దేవతలు స్వీకరించరు. క్షత్రియధర్మము రాజ్యపాలన అన్నమాట నిజమే. కాని ఇపుడు నేను ఆ ధర్మం గురించి ఆలోచిస్తే నా ప్రతిజ్ఞకు భంగమవుతుంది. కనక సత్యపాలనకి భంగం కలిగించె క్షాత్రధర్మం నేనిపుడు వదిలి పెట్టున్నాను. త్రికరణశుద్ధిగా సత్యం పాలించిన వానికి రాజ్యము, కీర్తి, యశస్సు, లక్ష్మి లభిస్తాయి.

కాని మీరు తెలివిగా, అనార్యమైన పనిని ఉత్తమమైనదిగా నాకు చెప్తున్నారు. జాబాలీ, నేను తండ్రిగారి ఎదురుగా వనవాసం చేస్తానని ప్రతిజ్ఞచేశాను. కాని ఇపుడు భరతుడు వచ్చి రాజ్యాన్ని పాలించమని వేడుకుంటున్నాడు. అదే ధర్మమని మీరు చెప్తున్నారు. అంతమాత్రంచేత, నేను మీ మాటలకి విలువనిస్తే నేను ధర్మచ్యుతుడనవుతాను. కనుక నేను భరతుని ప్రార్ధనని మన్నింపలేను. నా తండ్రి ఎదురుగా, నేను స్థిరమైన మనస్సుతో ప్రతిజ్ఞచేస్తూంటే చూసి కైకేయి చాలా ఆనందించింది. కనుక నేను పవిత్రమైన మనస్సుతో, ఇక్కడ దొరికే కందమూలాదులతో పండ్లతో, పూలతో, దేవతల నారాధిస్తూ అవే భోజనంగా తింటూ, నియమంగా వనవాసం చేస్తాను. అదే నాకు సంతృప్తి. మోసం చెయ్యటం నాకు తెలియదు. నా ధర్మం నాకు తెలుసు. మనది కర్మభూమి. ఇక్కడ నివసించేవారు, పవిత్రమైన కర్మల నాచరించాలి. అలా ఆచరించటం వల్ల అగ్ని - వాయువు, సోముడు, ఆయా కర్మఫలములు గ్రహించి లోకుల్ని సుఖింపచేస్తారు. వందక్రతువులు చేసి ఇంద్రుడు స్వర్గాధిపతి అయ్యాడు. ఎందరో మహర్షులు నియమంతో తపస్సులాచరించి, ఊర్ధ్వలోకాలు పొందారు. కనుక, జాబాలీ, మానవుడు కర్మభూమిలో పుట్టటం ధర్మము నాచరించి స్వర్గం పొందటానికే.

అటువంటి ఫలం కలగాలంటే సత్యము, ధర్మము, పరాక్రమము, భూతదయ, ఇతరులకి ప్రియం కలిగేటట్లు ప్రవర్తించటం, ఇవన్నీ ఎన్నో మార్గాలను మన పెద్దలు ఉపదేశించారు. వేదవేత్తలైన గురువులు, ఈ విషయాలన్నీ బోధించి, వర్ణాశ్రమ ధర్మాలు తెలియపరచి, మానవజాతిని ఉద్ధరిస్తున్నారు. మీరు కూడా పెద్దలు. మాకు పురోహితులు. మిమ్మల్ని నేను దూషించలేను. కాని ఇంతటి నాస్తికులైన మిమ్మల్ని పురోహితులుగా నియమించుకుని, అనాలోచితమైన పనిచేసిన మా నాన్నగారిని మాత్రం తప్పుపట్టువలసిందే అనిపిస్తోంది.

ధర్మము వేదవిహితమైనది. దానిని విశ్వసించనివారు నాస్తికులు. అటువంటి వారు తమ మాటలతో లోకుల బుద్ధులు కొల్లగొట్టున్నారు. మహర్షీ, మీకంటే ముందువారు, మీకన్నా ఉత్తములు. ఎందరో శుభకర్మలు ఆచరించి, స్వర్గంలో సుఖంగా వున్నారు. కనుక అటువంటి కర్మలనాచరించి, ఈ లోకంలో సుఖం పొంది, శరీరం వదిలాక గ్రహము రూపంలోనో, నక్షత్రం రూపంలోనో, తాము ప్రకాశిస్తూ, ఇతరులకు కాంతిని పంచి యిస్తున్నారు. 'యజ్ఞయాగాదులు చెయ్యటం వలన ఆయాదేవతల అనుగ్రహం సంపాదించి, సుఖించవచ్చు'. అని వేదాలు చెప్తున్నాయి. ఇది ప్రత్యక్షానుభవం కలిగిస్తుంది. ఒకరు భోజనం చేస్తే వేరొకరికి కడుపు నిండుతుందా? అని ప్రశ్నించారు కదూ.

భోక్తలు తృప్తిగా భోజనం చేస్తే పితృదేవతలు తృప్తిపొందుతారని, వేదాలు చెప్తున్నాయని మీరెరుగరా? అంటూ రాముడు రోషంగా జాబాలికి జవాబు చెప్పాడు.

అపుడు జాబాలి రాముని ధర్మజ్ఞానానికి చాలా సంతోషించి, 'నాయనా, ప్రస్తుతం మన రాజ్యం ధర్మసంకటంలో పడింది కనక, అరాచకం కాకుండా వుండాలని మాత్రమే అలా చెప్పాను. నువ్వు అయోధ్యకి తిరిగివచ్చి రాజ్యపాలన చెయ్యాలనే తలంపుతో అలా చెప్పానే కాని నేను నాస్తికుడను కాను' అన్నాడు.

జాబాలి మాటలు, రామునికి కోపం తెప్పించాయని, వశిష్ఠుడు గ్రహించాడు.

'రామా, నువ్వనుకున్నట్లు జాబాలి నాస్తికుడు కాదయ్యా. లోకప్రవృత్తి నెరిగి, దైవమును నమ్మినవాడే. కాని నిన్ను వనవాసం నించి మరలించాలని అలా పలికాడంతే. పురుషోత్తమా, దైవము గురించిన ప్రస్తావన వచ్చింది కనుక, ఈ లోకోత్పత్తి గురించి చెప్తాను విను.

ఆదిలో ఈ జగత్తంతా జలమయంగా వుండేది. ఆ జలమధ్యం నుంచే ఈ భూమి ఉత్పత్తి అయ్యింది. ఆ భూమినుంచే బ్రహ్మ పుట్టాడు. ఆయన స్వయంభువుడు. ఆయననుంచి దేవతలు పుట్టారు.

నీటిలో మునిగివున్న ఈ భూమిని, ఆ పురుషోత్తముడైన మహా విష్ణువు, వరాహ రూపము ధరించి, నీటిపైకి తెచ్చి నిలబెట్టాడు. ఆ తర్వాత ఈ చరాచర జగత్తునంతా బ్రహ్మ తన పుత్రులద్వారా సృష్టించాడు. కనుక ఈ చరాచర జగత్తుకి మూలకారణము పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మ స్వరూపం నించి చతుర్ముఖ బ్రహ్మ పుట్టాడు. సృష్టి ఆదినించి, అంత్యం వరకు ఆయన వుంటాడు.

చతుర్ముఖ బ్రహ్మకి మానసపుత్రుడుగా మరీచి పుట్టాడు. మరీచిపుత్రుడు కాశ్యపుడు.

కాశ్యపుని కుమారుడు వివస్వంతుడు. ఆయన కొడుకు మనువు. ఆ మనువునే వైవస్వత మనువు అని అంటారు. మీ ఇక్ష్వాకువంశానికి మూలపురుషుడు ఆయనే. వైవస్వతమనువు కుమారుడే ఇక్ష్వాకువు. మొట్టమొదటిసారిగా ఈ భూమండలాన్ని పాలించిన మొదటిరాజు ఇక్ష్వాకువే. ఆయన అయోధ్యా నగరాన్ని నిర్మించాడు. కనక మొదటి పాలకుడు ఇక్ష్వాకువు అయినట్లే, మొదటి రాజధాని కూడా అయోధ్యే.

ఆ అయోధ్యని రాజధానిగా చేసుకుని, ఇక్ష్వాకుపతి సంతతి వారైన రాజులు క్రమంగా, కుక్షి, వికుక్షి, భాసుడు, అనరణ్యుడు, పృథువు, త్రిశంకువు అనేవారు పాలించారు. సత్యవాక్యనిష్ఠాగరిష్ఠుడైన ఆ త్రిశంకువు, సశరీరంగా స్వర్గానికి వెళ్ళాడు. అయితే కారణాంతరాలవల్ల ఒక స్వర్గం ప్రత్యేకం ఆయన కోసం విశ్వామిత్రుడు సృష్టించాడు.

త్రిశంకువు తర్వాత వరసగా దుందుమారుడు, యువనాశ్వుడు, మాంధాత, సుసంధి, ధ్రువసంధి పాలించారు. సుసంధికి, ధ్రువసంధి, ప్రసేనజిత్తు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. పెద్దవాడైన ధ్రువసంధి పాలకుడు కాగా, అతడికి, భరతుడనే కొడుకు పుట్టాడు. భరతుని పుత్రుడు అశితుడు. ఐతే, శత్రువుల ధాటికి ఆగలేక అతడు హిమాలయాలకి వెళ్ళి తపస్సు చేస్తూ వుండిపోయాడు. అశితునికి ఇద్దరు భార్యలు. వారిలో పెద్దావిడ గర్భవతి కాగా, అదిచూసి ఓర్వలేని ఆమె సవితి ఆహారంలో విషంకల్పి ఆమెచేత తినిపించింది. ఆసంగతి తెల్సుకుని ఆవిడ చ్యవనమహర్షి దగ్గరకెళ్ళి రక్షించమని వేడుకుంది. ఆయన ఆశీర్వాదం వల్ల ఆమెకి సగరుడనే కుమారుడు కలిగాడు. సగరుని కుమారుడు అసమంజసుడు. వాని కుమారుడు అంశుమంతుడు.

ఆ తర్వాత క్రమంగా దిలీపుడు, భగీరథుడు, కకుత్స్థుడు, రఘువు, పురుషాదకుడు, శంఖణుడు, సుదర్శనుడు, అగ్నివర్ణుడు, శీఘ్రగుడు, మరువు, ప్రశుశ్రుకుడు, అంబరీషుడు, నహుషుడు, నాభాగుడు, అజుడు, అయోధ్యని పాలించారు.

ఆ అజమహారాజు కుమారుడే ధర్మాత్ముడైన దశరథ మహారాజు, మీ తండ్రి ఇలా ఇక్ష్వాకుకాలం నించీ వరసగా పెద్దకుమారుడే రాజు కావటం వంశాచారంగా వస్తోంది. మీ తండ్రికి నువ్వు జ్యేష్ఠపుత్రుడివి. కనక ఈ రాజ్యానికి నువ్వే వారసుడివి. ఇది సనాతనమైన ధర్మం. దీనినతిక్రమించటం ధర్మవిరుద్ధం. అందుకని నువ్వు ఈ భూమండలాన్ని పాలించి, మహాయశోవంతుడివి కావాలని మా అందరి అభిలాష' అని రాముడ్ని అనునయిస్తూ చెప్పాడు.

కాని ఆ మాటలకి కూడా రాముడు చలించలేదు. మౌనంగా ఊరుకున్నాడు.

వశిష్ఠుడు మాత్రం తన ప్రయత్నం మానకుండా, 'రామభద్రా, ప్రతి పురుషునికి, గౌరవింపదగిన వ్యక్తులు ముగ్గురు. తల్లి, తండ్రి, గురువు. తల్లితండ్రులు భౌతికమైన శరీరాన్నిచ్చి మనకి జన్మనిస్తారు. గురువు విజ్ఞానమనే అభౌతికకాయాన్నిస్తాడు. భౌతిక శరీరము అశాశ్వతమైనది. విజ్ఞానము శాశ్వతమైనది కనక విజ్ఞానాన్నిచ్చే గురువే పూజనీయుడు. ఆ తర్వాత స్థానం తల్లిదండ్రులది. రామా, నీకు, నీ తండ్రికీ కూడా గురువుని నేనే. కనక నా మాట వినటం అధర్మం కాదు. నువ్వింకేమీ ఆలోచించకుండా, సీతా లక్ష్మణులతో అయోధ్యకి మరలివచ్చి నీ రాజ్యాన్ని స్వీకరించు. ఈ విప్రులందరి కోరికా కూడా ఇదే. నీ తల్లి వృద్ధురాలు. ఆమె మాటనతిక్రమించటం అనుచితం. నీ తమ్ముడు భరతుడు నీకు ఆత్మతుల్యుడు. అతని మాటలు మన్నించటం వల్ల ధర్మహాని కలుగదు. అంచేత నువ్వు రాజ్యాభిషిక్తుడివి కావటం అన్నివిధాలా సముచితమని, నా అభిప్రాయం' అంటు వశిష్ఠుడు రాముని కెన్నివిధాలో నచ్చచెప్పాడు.

కాని రాముడు మాత్రం వశిష్ఠుడు చెప్పినదాంట్లో పూర్తిగా న్యాయం లేదన్నాడు.

'ఆర్యా, మీరన్నట్లు తల్లిదండ్రుల కన్నా గురువే అన్నివిధాలా పూజనీయుడు. కాని తల్లిగర్భంలో పిండోత్పత్తి జరిగేది తండ్రి వలన. కనక జన్మకారకుడైన తండ్రి ప్రథమపూజనీయుడు. నవమాసాలు మోసి, ప్రసవవేదన పడి, కని, పాలిచ్చి పెంచే తల్లి కూడా తండ్రి తర్వాతే పూజనీయురాలు. ఆమెది ద్వితీయస్థానం.

తల్లితండ్రులు శరీరాన్నిచ్చి పెంచి పెద్దచేసిన తర్వాత కదా గురువు జ్ఞానోపదేశం చేసేది. కనక గురువుది మూడోస్థానం. ఎన్నెన్నో కష్టనష్టాల కోర్చి పెంచి పెద్దచేసిన తల్లితండ్రుల ఋణం ఎవ్వరూ తీర్చుకోలేరు. అటువంటి తండ్రికి నేను పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేస్తానని వాగ్దానం చేశాను. కనక అది నెరవేర్చటమే నా ప్రథమకర్తవ్యం అని రాముడు వినయంగా వివరించి చెప్పాడు.

ఆ మాటలు విని భరతుడు కలతపడ్డాడు. సుమంత్రుని వైపు చూసి, 'సుమంత్రా, ఇక్కడ నేలమీద దర్భలు పరిపించు. నేను ఆ దర్భలమీద పడుకుని, నిరశన వ్రతం చేస్తాను. రాముడు అంగీకరించేవరకు లేవను. నిరాహారవ్రతం బూని, ప్రాయోపవేశం చేస్తాను అంతకన్నా మార్గం లేదు' అన్నాడు.

వెంటనే సుమంత్రుడు ధర్భాసనం ఏర్పాటు చేశాడు. అపుడు రాముడు

భరతుడ్ని చేరదీసి 'భరతా, నేను నీకేం అపకారం చేశాను? ప్రాయోపవేశమంటే ఏమిటో తెలుసా? తమకి అన్యాయం జరిగినపుడు, వృద్ధులైన బ్రాహ్మణులు మాత్రమే తమ రాజు ఎదుట నిరాహారదీక్ష బూని ప్రాయోపవేశం చెయ్యటం ధర్మం. కాని క్షత్రియవంశంలో పుట్టిన నీకు ఇది తగదు. లే ఈ దారుణమైన నిర్ణయాన్ని వదిలిపెట్టు. అయోధ్యకి వెళ్ళి రాజ్యాభిషిక్తుడివికా' అంటూ చాలాసేపు నచ్చచెప్పాడు.

భరతుడికి ఉక్రోషం వచ్చింది. తన వెంట వచ్చిన పౌరుల్ని చూస్తూ 'మీరంతా అలా చూస్తూ ఊరుకున్నారేం? రాముడు లేని అయోధ్యలో వుండలేమని బీరాలు పలికారే, ఆయన్ని వెనక్కి రమ్మని శాసించండి' అన్నాడు.

అపుడు వాళ్ళందరూ కూడబలక్కుని 'రాకుమారా, మీ అన్నగారు చెప్పింది నబబుగానే వుంది కదా. ఆ మహనీయుడు తండ్రిగారి ఆజ్ఞని పాలించదల్చుకున్నాడు. కనక ఆయన్ని వెనక్కిరమ్మనే అధికారం మాకు లేదు' అన్నారు. ఆ మాటలు రాముడు విన్నాడు. 'భరతా ప్రజావాక్యం విన్నావు కదా. కనక నా మాటా, వారి మాటా కూడా మన్నించి అయోధ్యకి వెళ్ళు. క్షత్రియుడవై వుండి కూడా ప్రాయోపవేశం చేస్తానన్నందుకు ప్రాయశ్చిత్తంగా నన్ను ముట్టుకో. ఇంకెపుడూ ఇలాంటి ధర్మవిరుద్ధమైన పని చెయ్యనని నాకు మాట ఇయ్యి. ఇదిగో ఈ నీటిని తాకి ప్రమాణం చెయ్యి' అన్నాడు.

భరతుడు లేచివచ్చి, జలాన్ని చేతితో తాకి, 'ఓ సభాసదులారా, మంత్రులారా, వినండి. నాకు రాజ్యం కావాలని, మా తండ్రిగారిని నేను అడగలేదు. ఇలా చెయ్యాలి అని నా తల్లి కూడా ముందుగా నాకు చెప్పలేదు. కాని నాకు తెలియకుండా, నా పరోక్షంలో, ఇదంతా జరిగిపోయింది. కనుక దీనిని నేను అంగీకరించను. తండ్రి మాట తప్పనని రాముడు అంటున్నాడు కనక ఆయనకి బదులుగా నేను తాపసవృత్తితో వనవాసం చేస్తాను' అని నీరు తాకి ప్రమాణం చేశాడు.

భరతుడి పట్టుదలకి రాముడు చాలా ఆశ్చర్యపోయాడు. అపుడు సభాముఖంగా రాముడిలా అన్నాడు.

'పౌరులారా! నా మాటలు కూడా వినండి. తండ్రి జీవించివున్నపుడు ఆయనదేనినైనా అమ్మినా, ఎవరికైనా దానమిచ్చినా, ఏదైనా కొన్నా, అందుకు మా సోదరులందరం కట్టుపడి వుండాలే తప్ప, దాన్ని మార్చే అధికారం మా కెవ్వరికి లేదు. ఆ ప్రకారమే మా నాన్నగారు తన రాజ్యాన్ని భరతునికిచ్చి, నన్ను అడవులకి వెళ్ళమన్నారు. ఆయన బ్రతికుండగానే ఆయన ఎదురుగా దీనికి

నేనంగీకరించాను. ఇపుడాయన మరణించారు. కనక ఆ వనవాసం నేనే చెయ్యాలి. కాని భరతుడెలా చేస్తాడు? నేనతన్ని అర్థిస్తే అతడు చెయ్యవచ్చు. మా తండ్రి కైకేయికి ఇచ్చిన వరాలు చెల్లించి, ఆయన సత్యవాది కావాలని ఆమె కోరింది. ఇపుడిలా మార్పు చేస్తే అసత్యదోషం రాదా?

నేనలాంటి ధర్మవిరుద్ధమైన పని చెయ్యలేను కాని భరతుడు ఇన్నివిధాల అడుగుతున్నాడు కనుక, పధ్నాలుగేళ్ళూ వనవాసం పూర్తి కాగానే, నేను మళ్ళీ అయోధ్యకి వచ్చి, రాజ్యం తప్పక స్వీకరిస్తాను. నా సోదరులతో కలసి భూమండలాన్ని పాలిస్తాను. ఇది సత్యము' అన్నాడు.

అనితర సాధ్యమైన ఆ ధర్మమూర్తుల సంవాదం విన్న మహర్షులు ఆనందంతో పులకరించి పోయారు. ఋషులు, సిద్ధులు, యోగులు, అదృశ్యంగా వుండి వారిని ప్రశంసించారు. వారంతా భరతునిముందు ప్రత్యక్షమై పరమానందంతో,

'భరతకుమారా, నీ సద్గుణములు శ్లాఘించదగ్గవి. నీ ప్రవర్తన అద్భుతము, అనితరసాధ్యము. మీ అన్నదమ్ములిద్దరి పుట్టుకవలన, మీ తండ్రి ధన్యుడయ్యాడు. రాముని పితృవాక్యపాలన మాకు సమ్మతమే. కైకేయికిచ్చిన వాగ్దానం చెల్లించటం వల్ల నీ తండ్రి స్వర్గానికి వెళ్ళాడు. కనక నువ్వు రాముడు చెప్పినట్లు చెయ్యి'అని చెప్పి అదృశ్యమయ్యారు.

భరతుడు భయంతో కృంగిపోతూ, చేతులు జోడించి, రాముడితో ఇలా అన్నాడు.

'రామభద్రా, నా బాధ అర్థంచేసుకో. క్షాత్రధర్మం ప్రకారం, ఇక్ష్వాకుల గౌరవం ప్రకారం, జ్యేష్ఠుడివైన నువ్వే, అన్నివిధాల రాజుకాదగ్గవాడివి. నా తల్లికూడా నిన్ను యాచిస్తోంది. చిన్నవాడినైన నేను ఈ రాజ్యభారం మొయ్యలేను. కనక నువ్వే నీ రాజ్యాన్ని పాలించుకో' అని కాళ్ళమీద పడ్డాడు.

రాముడు భరతుని లేవదీసి దగ్గరకూర్చోపెట్టుకుని లాలించాడు. రాముని దివ్యస్పర్శ వల్ల, భరతుని శోకం ఉపశమించింది.

'భరతా, సహజంగానే నువ్వు ధీమంతుడివి. ఈ భూమండలాన్నంతటినీ శాసించేశక్తి నీకు వుంది. కనక మంత్రులతోనూ, హితులతోనూ సంప్రతిస్తూ ప్రస్తుతానికి పాలనాయంత్రాంగం నడిపించు. అంతేకాని నన్ను తిరిగిరమ్మని మాత్రం నిర్బంధించకు. నీ తల్లి నీమీది వాత్సల్యంతో నీకు రాజ్యం కావాలని కోరింది. కనక ఆమెని దూషించక, గౌరవించు' అని మళ్ళీ బోధించాడు. ఇంక

రాముడు అయోధ్యకిరాడని, భరతుడు నిశ్చయంగా తెలుసుకున్నాడు. రాముని కోసం తెచ్చిన బంగారు పాదుకలు తెచ్చి రాముని ముందుంచాడు.

'రామచంద్రా, ఇవిగో ఈ బంగారు పాదుకలు ధరించి నువ్వు అయోధ్యకి రావాలని ఇవి నీ కోసం తెచ్చాను. ఇపుడు నువ్వు ఈ పాదుకల మీద నీ పాదాలుంచి నిలబడు. ఇకమీదట ఈ పాదుకలే రాజ్యపాలనా భారం వహిస్తాయి' అని ప్రార్థించాడు. తమ్ముడి భక్తికి పరవశించిపోతూ రాముడు ఆ పాదుకలు ధరించి, మళ్ళీ తీసి భరతునికిచ్చాడు.

ఆ పాదుకలు కళ్ళకద్దుకుని, స్వీకరించి, భరతుడిలా అన్నాడు.

'అన్నయ్యా! పధ్నాలుగు సంవత్సరాలు నువ్వు అరణ్యావాసం చెయ్యి. నేను కూడా జటాజూటాలూ, నారబట్టలు ధరించి, తాపసులు తినే ఆహారం తింటూ, నగరం వెలుపలే నివసిస్తాను.

రాజ్యతంత్రం నీ పాదుకలు నిర్వహిస్తాయి. నేను వాటికి దాసుడనై పరిపాలన సాగిస్తాను. పధ్నాలుగేళ్ళూ నిండిన మర్నాడు మాత్రం నువ్వు నాకు దర్శనమివ్వకపోతే, అగ్నిలో ప్రవేశించి, ప్రాణత్యాగం చేస్తాను.' అని చెప్తూ కన్నీరు కారుస్తున్న భరతుని రాముడు గాఢంగా కౌగలించుకుని, వారినింక బయల్దేరమని చెప్పాడు. 'భరతా, కైకేయిని కాపాడు. ఆమెపై కోపం తెచ్చుకోకు. నువ్వు కనక ఆమెని ద్వేషిస్తే నా సీతమీద ఒట్టు. ఇది నా శాసనముగా భావించు' అని చెప్తూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. మళ్ళీ అందరూ శోకసాగరంలో మునిగిపోయారు. భరతుడు, అన్నగారి పాదుకలు పువ్వులతో అలంకరించాడు. రామునికి ప్రదక్షిణం చేసి, ఆ పాదుకలు పట్టపుటేనుగుపై వుంచాడు.

ఆ తర్వాత అందరూ రామునికి వీడ్కోలు చెప్పారు. వారినందర్నీ కన్నీటితో సాగనంపారు సీతారామలక్ష్మణులు.

తల్లుల కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. దీనంగా వారిని చూస్తూ సాగిపోయారు. రాముడు పర్ణకుటీరం వాకిట నిలబడి, తల్లులందరి వైపు చూస్తూ, నమస్కరించి, కన్నీటితో మాటరాక కుటీరం లోపలికి వెళ్ళిపోయాడు.

తర్వాత భరతుడు పాదుకలను శిరస్సున ధరించి, ఆనందపరవశుడై శత్రుఘ్నునితో కూడా రథము నెక్కాడు. మంత్రులంతా ముందు నడిచారు. చిత్రకూటాద్రికి ప్రదక్షిణం చేసి, భరద్వాజ ముని ఆశ్రమం వైపు కదిలిపోయారు వారంతా. భరతుడు రథం దిగి భరద్వాజ మునికి నమస్కరించాడు. భరతుడ్ని

సంతోషంతో కౌగలించుకుని 'కుమారా, నువ్వెళ్ళిన పని పూర్తయిందా? రాముణ్ణి కలిశావా?' అని అడిగాడు.

భరతుడు జరిగినదంతా వివరించి చెప్పి 'మహర్షీ రాముడు ఎంతమంది ఎన్నివిధాల చెప్పినా, అయోధ్యకి మరలి రావటానికి ఒప్పుకోలేదు. నేనూ మా ఆచార్యులూ అభ్యర్థించిన మీదట, ఈ బంగారు పాదుకలు ధరించి, తన ప్రతినిధులుగా వాటిని నాకిచ్చాడు. అన్నగారి ఆజ్ఞపై ఈ పాదుకలు తీసుకుని, నేను అయోధ్యకి బయల్దేరాను. రాముని వనవాసం పూర్తయ్యేవరకు ఈ పాదుకలకి ప్రతినిధిగా, రాముని బదులు నేను పాలనాయంత్రాంగం నడిపిస్తాను. నేను రాముని సేవకుడ్ని మాత్రమే. పాలకుణ్ణి మాత్రం కాదు' అని చెప్పాడు.

ఆ మాటలు విన్న భరద్వాజుడు చాలా సంతోషించాడు. 'పురుషోత్తమా - నీరు పల్లమునకే ప్రవహించునట్లు ఇక్ష్వాకువంశ దీపకులైన మీ సోదరులిద్దరూ ధర్మకోవిదులు కనుకనే, మీ నిర్ణయాలు చాలా సముచితంగా వున్నాయి. మీవంటి కుమారులకి జన్మనిచ్చి మీ తండ్రి ధన్యుడయ్యాడు. మీ కీర్తి లోకంలో శాశ్వతంగా వుంటుంది' అని అభినందించాడు.

భరతుడు మూడుసార్లు భరద్వాజునికి ప్రదక్షిణం చేసి, మంత్రులతో కలిసి, అయోధ్యవైపు సాగిపోయాడు. వారు యమునా నది దాటి, అతిపవిత్రమైన గంగాతీరం చేరారు. గంగని దాటి శృంగబేరపురం వెళ్ళారు. అక్కడ్నించి మళ్ళీ ప్రయాణం చేసి అయోధ్యని సమీపించారు. తండ్రి, సోదరులు లేని అయోధ్యని చూడగానే భరతునికి దుఃఖం పొంగుకొచ్చింది. నగరమంతా పిల్లులూ, గుడ్లగూబలు తిరుగుతున్నాయి. ఎక్కడా మానవ సంచారం లేదు. కళావిహీనంగా వున్న నగరాన్ని చూసి, భరతుడు చాలా బాధపడ్డాడు. మళ్ళీ మా అయోధ్య పూర్వపువైభవం సంతరించుకుని, ఎపుడు కలకలలాడుతూ వుంటుందో కదా' అనుకుంటూ, కలత చెందిన మనస్సుతో దశరథుని భవనంలోకి ప్రవేశించాడు. వెల వెలబోతున్న అంతఃపురం చూసి కన్నీరు కార్చాడు.

తర్వాత గుండెని రాయిచేసుకుని, తల్లులందర్నీ వారి వారి భవనాలకి పంపించాడు. శోకం ఆపుకోలేక, గట్టిగా ఏడుస్తూ గురువుల్ని చూసి, 'ఆర్యులారా, నేను నందిగ్రామం వెళ్తాను. నాకు సెలవివ్వండి. రాముడు లేని శోకం నాకు అక్కడ ఉపశమిస్తుంది. మహారాజైన రాముని రాక కోసం నిరీక్షిస్తూ అక్కడే వుంటాను' అన్నాడు.

మంత్రులు, గురువులు అందరూ భరతుణ్ణి మెచ్చుకున్నారు. 'నాయనా,

ధర్మమార్గం అనుసరిస్తూ, నీ అన్నగారిపై ప్రేమతో నువ్వు ఈ నిర్ణయం తీసుకున్నావు. నీ అభిప్రాయం మేమూ ఆమోదిస్తున్నాం. నీ మనస్సుకి ఎలా చేస్తే ఉల్లాసం లభిస్తుందో అలాగే చెయ్యి' అన్నారు.

అపుడు భరతుడు సారధితో 'సూతా నా రథం సిద్ధం చెయ్యి నంది గ్రామం వెళ్ళాలి' అన్నాడు. తల్లులకి, పెద్దలకి నమస్కరించి, శత్రుఘ్నునితో కలసి రథం ఎక్కాడు. రాముని పాదుకలు తలమీద పెట్టుకుని రథంలో కూర్చున్నాడు. వెనక మంత్రులు, పురోహితులు వారి వారి రథాల్లో బయల్దేరారు. వారంతా వేగంగా ప్రయాణం చేసి నందిగ్రామం చేరుకున్నారు. భరతుడు రథం దిగి పురోహితులతో ఇలా అన్నాడు.

'మా అన్నయ్య రాముడు తన రాజ్యాన్ని మా దగ్గర కుదువబెట్టి తాత్కాలికంగా పరిపాలనా బాధ్యత అప్పగించాడు. ఇకమీదట ఈ రాజ్యం యొక్క మంచి చెడ్డలన్నీ ఈ పాదుకలే చేస్తాయి.' అంటు ఆ పాదుకలలాగే తలమీద వుంచుకుని, 'మంత్రులారా, రాజాధిరాజైన శ్రీరాముడు, మనకి ఆదరముతో ఇచ్చిన ఈ పాదుకలకి ఛత్రం పట్టండి. రాముడు తిరిగి వచ్చేవరకు న్యాసముగా ఇచ్చిన ఈ పాదుకలు కాపాడాలి. రామచంద్రుడు తిరిగి వచ్చాక, ఈ పాదుకలను రామచంద్రుని పాదాలకి చేర్చి, ఆనందిస్తాను. అప్పటికి నా బరువు దిగుతుంది. ఆయన రాజ్యం ఆయన కప్పగించి, ఆయన దగ్గర సేవకునిగా సేవచేస్తాను' అన్నాడు.

నందిగ్రామములో సింహాసనం మీద శ్రీరాముని, పాదుకలకి పట్టాభిషేకం జరిపించి, ఆ పాదుకల్నే పాలకులుగా ప్రకటించాడు. తాను మాత్రం ప్రతినిధిగా వ్యవహరించాడు. జటాజినములు, నారబట్టలు ధరించి, సైన్యసమేతంగా నందిగ్రామములోని నివాసము ఏర్పాటు చేసుకున్నాడు.

రాజకార్యాలన్నీ పాదుకలకి నివేదిస్తూ, ఆ పాదుకలకే ఆధీనుడై, కార్యకలాపాలు సాగించేవాడు. ఎవరైనా కానుకలు తెస్తే, వాటిని పాదుకలకి సమర్పించేవాడు. ఈ విధంగా రాజ్యపాలన చేస్తూ రాముని రాకకై నిరీక్షిస్తూ కాలం గడుపుతున్నాడు.

అయోధ్యలో పరిస్థితి అలా వుండగా, రాముడు భరతుణ్ణి తల్లుల్ని పరివారాన్ని సాగనంపాక యథాప్రకారంగా తపోవనంలో కాలం గడుపుతున్నాడు, సీతా లక్ష్మణులతో కొన్నిదినాలు గడిచాక, ఒకనాడు ఆ చుట్టుపక్కల వుండే తాపసులు భయాందోళనలతో, ఎక్కడికైనా వెళ్ళిపోవాలని, ఆతృతపడుతున్నట్లు

తెలుసుకున్నాడు. వారంతా తనని చూసి, గుసగుసలుగా, ఏదో చెప్పుకుంటుండటం గమనించాడు. వారి ఆందోళన చూసి రాముడు చాలా బాధపడ్డాడు. వారందరికీ పెద్ద అయిన ఒక వృద్ధ మునీంద్రుని దగ్గరకి వెళ్ళి నమస్కరించి, 'ఆర్యా, నావలన గాని, మా తమ్ముని వల్లగాని, మా సీతవల్లగాని, మీకేదైనా అపచారం కలిగిందా? మా వల్ల దోషం ఏమిటి? మీ అందరిలో ఏదో మార్పు కనిపిస్తోంది. నన్ను మన్నించి కారణం వివరించండి' అని అడిగాడు.

రాముడలా అడగగానే, ఆ వృద్ధ తాపసి భయంతో వణికిపోయాడు.

'రామభద్రా, మా అందరియందు దయగలవారు మీరు. సీతమ్మ మా అందరికీ మంగళం కలగాలనే కోరుకుంటుంది. అటువంటి మీవలన అపచారమా!'

కాని, మునుపు నువ్వు విశ్వామిత్రుని యాగ సంరక్షణార్థం, రాక్షసుల్ని వధించావు కదా. అందుకని, నీ ఉనికిని కనిపెట్టి, పాతపగతో, రాక్షసులు ఈ తపోవనంలో ప్రవేశిస్తున్నారు. వారి వలన మాకు చాలా భయం కలుగుతోంది. ఇక్కడికి దగ్గరలోనే రావణుని తమ్ముడైన ఖరుడు అనే రాక్షసుడున్నాడు. వాడు చాలా దుర్మార్గుడు. దయలేనివాడు. మహాపాపి. వాడు నరమాంస భక్షకుడు. మీరీ ప్రాంతానికి వచ్చినప్పట్నించీ వాడు తాపసుల మీద విరుచుకుపడ్తున్నాడు. వాడు, వాడి అనుచరులు, జనస్థానంలోని మునులందర్నీ విరుచుకుతింటున్నారు.

ఇపుడు మమ్మల్ని భీకరమైన రూపాలతో, వికృతమైన వేషాలతో, భయంకర శబ్దాలతో భయపెట్టున్నారు. మా హోమాల్ని ధ్వంసం చేస్తున్నారు. వారి బాధపడలేక, మేమంతా ఈ ప్రదేశం వదిలి, వేరొకచోటుకి వెళ్ళి పోదామనుకుంటున్నాము. రామా, ఈ నీచులు మిమ్మల్ని కూడా బాధలు పెట్టారు. ఇక్కడికి దగ్గరలో పురాణాశ్రమం వుంది. అక్కడ పండ్లు దుంపలు విరివిగా దొరుకుతాయి. కనక అందరం అక్కడికి వెళ్తున్నాము. మీరు కూడా మాతో వస్తే బాగుంటుంది. జానకితో మీరిక్కడ వుండటం చాలా ప్రమాదం' అని చెప్పాడు.

ఆ మాటలు విన్న రాముడు చాలా బాధపడ్డాడు. వారిని ఆపటం అసాధ్యం. ఎలాగా అని ఆలోచిస్తూండగానే, వారంతా తట్టా బుట్టా సర్దుకుని వెళ్ళిపోయారు. రాముడు వృద్ధతాపసికి నమస్కరించి, వారందర్నీ సాగనంపి, తాము కూడా వెళ్ళిపోవటమే మంచిదేమో, అనుకుంటూ ఆశ్రమంలోకి వెళ్ళాడు. మునులందరూ వెళ్ళిపోవటం వల్ల జనసంచారం లేదు. అందుకని ఇంక అక్కడ వుండటం క్షేమం కాదనుకున్నాడు.

అదీగాక, జానకికి అక్కడుంటే ప్రమాదం అనుకుని, లక్ష్మణుని, సీతని

పిల్చి, 'మన ఆశ్రమానికి, భరతుడు, శత్రుఘ్నుడు, మన గురువులు, తల్లులు అంతా వచ్చారు కదా. నేను ఆజ్ఞాపకాల్ని మర్చిపోలేకపోతున్నాను. వాళ్ళు లెక్కలేనన్ని గుఱ్ఱాలు, ఏనుగులు, పరివారంతో రావటం వల్ల ఈ ప్రదేశమంతా మలమూత్రాలతో, అన్నివేపులా దుర్గంధం వ్యాపించింది. కనక మనం కూడా వేరే ప్రదేశానికి వెళ్ళిపోదాం' అన్నాడు.

సరే అనుకుని వాళ్ళు ముగ్గురు కలిసి అత్రిమహాముని ఆశ్రమం చేరుకున్నారు. అత్రి మహాముని వారిని సాదరంగా ఆహ్వానించాడు. ప్రేమతో ఆతిధ్యం ఇచ్చాడు. సీతని ఓదార్చాడు.

అత్రి మహాముని భార్య అనసూయ సీతని అక్కున చేర్చుకుని, ఆదరించింది. ఓదార్పు మాటలతో ఆమెని అనునయిస్తుండగా అత్రి మహాముని సీతతో, 'అమ్మా, ఈమె నా భార్య అనసూయ. ఉత్తమురాలు. తాపసి, ఈమెని సేవించి, ఆమె. దీవనలందుకో. అంటూ రామలక్ష్మణుల వంక చూసి, కుమారులారా, ఈవిడ చాలా మహిమ కలది. గొప్ప తపశ్శక్తి సంపన్నురాలు. పూర్వమొకసారి, పదిసంవత్సరాలు, వానలు లేక, లోకాలన్నీ కరవుకాటకాలతో అల్లాడిపోయాయి. అటువంటి సమయంలో ఈవిడ తన తపశ్శక్తితో గంగానదిని ఇక్కడ పారేటట్లు చేసి, మా కందరికీ కందమూలాలు, ఫలములు, సమృద్ధిగా దొరికేటట్లు చేసింది. పుణ్యతీర్థాలలో స్నానాలూ, వ్రతాలూ, లెక్కలేనన్ని చేసింది. ఒకసారి దేవతలు ప్రార్థించగా, వారికోసం పదిరాత్రులు ఒక్క రాత్రిగా చేసింది. ఈమె మీకు తల్లివంటిది. ఈమెని పూజించండి. సమస్త భూతములకూ వందనీయురాలైన ఈమెకి, ఎపుడూ కోపం రాదు. ఎవరిలోనైనా సరే మంచినే చూస్తుంది. కాని, చెడుగుణములు తలపెట్టదు. అందుకే, అనసూయ అనే సార్థక నామధేయురాలైంది' అన్నాడు.

రాముడు, సీతని ఆ పరమపావనికి నమస్కారం చెయ్యమన్నాడు. సీత వృద్ధురాలైన ఆ అనసూయాదేవిని, పరిశీలనగా చూసింది. ఆవిడ ఒళ్ళంతా ముడతలు పడి వుంది. తల వెంట్రుకలు తెల్లగా నెరిసి వెండిని మరిపిస్తున్నాయి. నిలబడేశక్తి కూడా లేక వణికిపోతూ వుంది.

సీత తనపేరు చెప్పి, ఆవిడపాదాలకి వందనం చేసింది. కుశలప్రశ్నలు అడిగింది.

ఆమె తియ్యని పలుకులు వినగానే అనసూయ మనసు, ఆనందంతో పొంగిపోయింది.

'ఎంత అదృష్టవంతురాలివి తల్లీ, ధర్మపరురాలివై, రాజ్యభోగాలనూ, జ్ఞాతులను వదిలి, వనవాసదీక్షబూని, రాముని వెంట వచ్చావు. ధన్యురాలివమ్మా.

భర్త నగరమందున్నా, అడవులలో వున్నా, మంచివాడైనా, దుర్మార్గుడైనా, అతనిని ఆరాధించి సేవించే స్త్రీకి, ఉత్తమ లోకాలు కలుగుతాయి. భర్త ఎటువంటి వాడైనా, భార్యకి అతడే దైవము. భర్తకన్నా స్త్రీకి ఆదరించే బంధువులు వుండరు. భర్తని ఆరాధించటమే గొప్ప తపస్సు. కాని అజ్ఞానవశులైన స్త్రీలు, ఈ వాస్తవాన్ని గుర్తించలేక, వారి కోరికలు తీర్చుకోవటమే ప్రధాన లక్ష్యంగా వుంటారు. వారు ధర్మభ్రష్టులై, అపకీర్తి పాలవుతారు. అనుచితమైన ప్రవృత్తి గల స్త్రీలు వినాశము పొందుతారు. సద్గుణవతులైన స్త్రీలు ధర్మాచరణ చేసి, స్వర్గాన్ని పొందుతారు.

కనుక జానకీ, నీ నిర్ణయం సరియైనదే. భర్తకి సహధర్మచారిణివి అయి కీర్తిని పొందుతావు. పతివ్రతవై ఉత్తమురాలిగా కీర్తించబడుతావు' అని సీతని దీవించిందావిడ.

ఆవిడ మాటలకి సీత ముగ్ధురాలైంది. చాలా మెల్లిగా ఇలా జవాబు చెప్పింది.

'పూజ్యులైన మీ ఉపదేశాలు మాకు ఎప్పటికీ ఆచరించ తగ్గవే. నాకు కూడా భర్తయే ప్రత్యక్షదైవమని తెలుసు. అమ్మా..... భర్తఎటువంటి వాడైనా సేవించటమే కర్తవ్యమని చెప్పారు కాని, నా భర్త గుణవంతుడు. ప్రశంసనీయుడు, దయామూర్తి, జితేంద్రియుడు. స్థితప్రజ్ఞుడు. ధర్మాత్ముడు. తల్లితండ్రులకన్నా మిన్నగా నన్ను ప్రేమించేవాడు. అటువంటి వారిని, సేవించకుండా వుంటానా? నా భర్త స్త్రీలనందర్నీ తన తల్లి కౌసల్యలాగే చూస్తాడు.

నేను, నా భర్త వెంబడి అడవులకి వచ్చే సమయంలో మా అత్తగారైన కౌసల్యాదేవి కూడా మీరు చెప్పినట్లే చెప్పింది. అంతే కాదు. తొందరపడి ఈయన వెంటవచ్చి తర్వాత ఈయనని నిందిస్తానేమో అని, నిర్జనారణ్యంలో నీ మనస్సు అన్యథా భావించకుండా నిగ్రహించుకో.' అని ఉపదేశించారు. నాకు వివాహం జరిగినపుడు, అగ్నిదేవుని సన్నిధిలో నా తల్లి కూడా నాకు కర్తవ్యం బోధించింది. ఆ మాటలు నా మనస్సులో ధృడంగా నాటుకున్నాయి. మీ పలుకులు యథార్థములని, సత్యవంతుని సేవించిన సావిత్రి నిరూపించి, పతివ్రతా శిరోమణి అయింది. ఆమె భర్తని వదిలి క్షణకాలమైనా వుండదు. కనక పతివ్రతా ధర్మము నాచరించిన స్త్రీలు, చరిత్రలో ఇప్పటికీ పూజింపబడుతున్నారు' అంది.

మృదుమధుర గంభీరములైన ఆ మాటలు విని అనసూయ సీతని చాలా మెచ్చుకుంది. ఆనందంతో, సీతని దగ్గరకి తీసుకుని, నుదుటి మీద ముద్దు

పెట్టుకుని, వాత్సల్యంతో 'అమ్మాయీ, నేను ఎన్నో నియమాలతో మహత్తరమైన తపస్సు చేసి, కొంతశక్తి సంపాదించాను. నీ మాటలు విన్నాక, నా తపోబలంతో నీకేదైనా వరం ఇవ్వాలని వుంది. నీ కిష్టమైన కోరిక కోరుకో' అంది.

అపుడు సీత తొణకకుండా, 'అమ్మా, మీ ఆదరణే మాకు ప్రసాదము. మీ ఆశీర్వాదం కన్న కోరదగింది ఏముంది?' అంది.

ఆమె వినయసంపద చూసి, అనసూయకి చాలా ఆశ్చర్యం కలిగింది. 'జానకీ, - నీలాంటి సుగుణాలరాశిని, నేనెక్కడా చూడలేదు. అందుకే నువ్వు కోరకపోయినా నాకు తోచినవి ఇస్తున్నాను. ఇవిగో ఇవి దివ్యమైన పుష్పములు. ఇవి ఎప్పటికీ వాడకుండా వుండి, సుగంధపరిమళాలు వెదజల్లుతూ వుంటాయి. ఎప్పటికీ వాడిపోవు. ఇది అంగరాగము. శరీరానికి పూతగా వుపయోగపడ్తుంది. అడవులలో తిరిగేటపుడు, ఎండకీ, వానకీ, చలికీ, నీ శరీరము మార్పు చెందకుండా ప్రకాశించేలా చేస్తుంది. ఈ అంగలేపనం కూడా అలాంటిదే. ఇవిగో ఇవి రత్నాభరణాలు, దివ్యవస్త్రాలు. నువ్వు ఇవన్నీ ధరించి, మా రాముడ్ని రంజింప చేస్తూ వుండు' అని చిరునవ్వుతో సీతకి అవన్నీ సమర్పించింది.

సీత వాటినన్నిటినీ తీసుకుని, చేతులు జోడించి, నిలబడింది. అపుడు అనసూయ సీతని దగ్గర కూర్చోబెట్టుకుని, ఆమె స్వయంవర వృత్తాంతం చెప్పమని, అడిగింది. సీత సంక్షిప్తంగా ఇలా చెప్పింది.

'అమ్మా నా తండ్రి మిథిలాధిపతి జనకుడు. ఒకరోజు యజ్ఞము నిమిత్తము, యజ్ఞక్షేత్రము దున్ని, ఓషధులు చల్లుతుండగా, నాగటి చాలుకి చిక్కి నేను బయటపడ్డానట. ఒళ్ళంతా ధూళి నిండిన నన్ను లేవదీసి, తనకి సంతానం లేకపోవటం వల్ల, నన్నే తన బిడ్డగా భావించి, ఒళ్ళో చేర్చి, నన్ను లాలించాడు. అంతలో అశరీరవాణి 'రాజా, ఈమె నీ బిడ్డే. అని చెప్పింది. ఆయన సంతోషంతో, తన పెద్ద భార్యకి నన్ను ఇచ్చి పెంచమని చెప్పాడు. ఆయన రాజర్షి. నిరంతర యజ్ఞాలు, యాగాలు చేస్తుండేవాడు. ఆ దంపతులు నన్ను అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేశారు. నాకు పెళ్ళీడు వచ్చింది. అందరు ఆడపిల్లల తండ్రుల్లాగే, నా తండ్రి కూడా నా పెళ్ళి విషయంలో చాలా బెంగపడ్డాడు. అయోనిజనైన నాకు, తగిన వరుని, నిర్ణయించటం ఎలాగా అని, నా తండ్రి బాగా ఆలోచించి చివరికి నాకు స్వయంవరం ప్రకటించాడు. మా పూర్వీకుడైన దేవరాతునికి, వరుణుడు ప్రసాదించిన, అమోఘమైన శివధనుస్సు ఒకటి మా ఇంట్లో వుంది. దానిని సామాన్యులెవ్వరూ ఎక్కుపెట్టలేరు, సరికదా - కదల్చనైనా కదల్చలేరు.

అటువంటి ఆ దివ్యమైన ధనుస్సు నెవరు సంధించగలరో, అట్టి మహావీరునికి మాత్రమే నన్ను ఇచ్చి వివాహం చేస్తానని, సభాముఖంగా ఆయన ప్రకటించాడు. ఆ స్వయంవరానికి ఎందరో మహావీరులు వచ్చారు కాని, వారెవ్వరూ ఆ ధనుస్సుని కదల్చనైనా కదల్చలేక, నిరాశతో వెళ్ళిపోయారు. అప్పట్నించి, ఆ ధనుస్సు నెక్కుపెట్టగల వీరుడెవరైనా వస్తాడా అని, మా నాన్నగారు ఎదురుచూడసాగారు.

చాలా కాలము తర్వాత, విశ్వామిత్ర మహర్షితో కలసి, దశరథ మహారాజు కుమారులిద్దరూ మా తండ్రిగారు చేస్తున్న యాగము చూడటానికి వచ్చారు.

విశ్వామిత్ర మహాముని, మా తండ్రి గారితో, 'మీ ఇంట్లో వున్న అమోఘమైన ధనుస్సు చూడాలని, ఈ చిరంజీవులిద్దరూ ఉబలాట పడుతున్నారు. వీరు అయోధ్యని పాలిస్తున్న దశరథ మహారాజు పుత్రులు' అని చెప్పారు. నాన్నగారు ఆ ధనుస్సుని, యజ్ఞవాటికకు తెప్పించారు.

దశరథ పుత్రుడైన శ్రీరాముడు మహాపరాక్రమవంతుడు కనుక, ఆ ధనుస్సుని అవలీలగా ఎత్తి సంధించటానికి వంచారు. అంతే, పిడుగుపడ్డట్టు బ్రహ్మాండమైన శబ్దం చేస్తూ ఆ విల్లు మధ్యకి విరిగి రెండు ముక్కలైంది.

అపుడు నా తండ్రి ఈయనని దైవాంశ సంభూతునిగా గుర్తించి, అపరిమితమైన సంతోషముతో, నన్ను హిరణ్య జలధారా పూర్వకంగా, ఆ మహానుభావునికి సమర్పించారు. ఆ తర్వాత దశరథ మహారాజుని పిలిపించి, యధావిధిగా, నన్ను శ్రీరామునికీ, నాచెల్లెలైన ఊర్మిళని లక్ష్మణునికి ఇచ్చి వివాహం జరిపించారు. అప్పట్నించీ ధర్మజ్ఞుడైన నా భర్తని, నేను ప్రాణపదంగా ప్రేమిస్తూ, ఇల్లాలిగా ఆయనని సేవించుకుంటున్నాను' అంటూ తన స్వయంవర వృత్తాంతం అనసూయకి వినిపించింది సీత.

అపురూపమైన ఆ సంగతి విని, ఆనందంతో ఆమెని కౌగలించుకుంది అనసూయ.

'చిన్నారీ, చాలా పొందికగా నీకళ్యాణ వృత్తాంతం వినిపించావు. నీ మధురమైన మాటలు వింటుంటే, మళ్ళీ మళ్ళీ వినాలని వుంది. చాలా ప్రొద్దుపోయింది. ఇంకనువ్వు రాముని దగ్గరకి వెళ్ళు. నా ముచ్చట కాదనక, నేనిచ్చిన వస్త్రములు, ఆభరణాలు ధరించి ఒకసారి నాకు చూపించు. ఆనందిస్తాను' అంది.

సీత ఆమె కోరిక మన్నించి, ఆవస్త్రాలు, ఆభరణాలూ ధరించి, వచ్చి, అనసూయ పాదాలకి నమస్కరించింది. దేవకాంతలా మెరిసిపోతున్న సీతని చూసి

పరవశించిపోయాడు రాముడు. ఆ రాత్రి వారు అత్రిమహాముని ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. సమీపంలో వుండే ఆశ్రమాలలోని మునులంతా వచ్చి వారి చుట్టూ చేరి సేవించారు.

తెల్లారగానే వారంతా ప్రాతఃకాల కార్యక్రమాలు తీర్చుకుందుకు వెళ్ళారు. రామలక్ష్మణులు కూడా ప్రాతః సంధ్యలు పూర్తిచేసుకుని, అగ్నిహోత్రం మొదలైన కార్యక్రమాలయ్యాక ఇంక సెలవిమ్మని అత్రి మహామునిని అడిగారు. అపుడక్కడున్న మునలంతా, 'రామా, ఈ అడవిలో రాక్షసులు ఎన్నో ఉపద్రవాలు సృష్టిస్తున్నారు. వారెన్నో రకాల వేషాలతో సంచరిస్తూ వుంటారు. అదీగాక, క్రూరమృగాల వల్ల కూడా ఇక్కడ చాలా ప్రమాదం వుంది. కనక జాగ్రత్తగా వాటిని నిర్మూలిస్తూ ముందడుగు వెయ్యాలి. అప్రమత్తంగా వుంటే, రాక్షసులు, క్రూరమృగాలూ కూడా మీదపడి చీల్చుకుతింటాయి. ఇదిగో ఇటు మునులు, పండ్లు, పూలు తెచ్చుకునే, చక్కని మార్గం వుంది. జాగ్రత్తగా ముందుకి చూసుకుంటు, మీరు ముగ్గురు, ఆ దారిని వెళ్ళండి' అని చెప్పి దీవించారు.

వారందరికీ వందనాలు చేసి కృతజ్ఞతలు చెప్పాడు రాముడు.

అత్రి మహామునీ, అనసూయా కూడా వారికి ఎన్నెన్నో రక్షలు చెప్పి, ఆశీర్వదించారు. వారికి పాదాభివందనం చేసి, వీడ్కోలు పొంది, రాముడు సీతాలక్ష్మణులతో సాగిపోయాడు. మునులు చెప్పిన కాలిబాటగుండా అడవుల్లోకి వెళ్ళిపోయారు.

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అయోధ్యాకాండ సమాప్తం.**

# అయోధ్యకాండపై సమీక్ష

భరతుడు తండ్రి ఆజ్ఞపై తాతగారింటికి వెళ్ళటంతో అయోధ్యకాండ ప్రారంభమవుతుంది. రాముడు చిత్రకూటాశ్రమం వదిలి దండకారణ్యానికి బయల్దేరుతూ, దారిలో అత్రిమహాముని ఆశ్రమం సందర్శించి, అనసూయా అత్రిమహర్షుల ఆతిధ్యం స్వీకరించి, అక్కడ్నించి బయల్దేరటంతో పూర్తవుతుంది.

రామకథకి ఆయువుపట్టు లాంటిది అయోధ్యాకాండ. అయోధ్యాకాండలో వాల్మీకి అయోధ్యగురించి వర్ణించాడనుకోటం పొరపాటు. అసలు రామాయణాన్ని ఉత్తరకాండ కాక ఆరుకాండలుగా రచించిన వాల్మీకి ప్రతి కాండకి కూడా చాలా ఆలోచించి, చాలా రసవత్తరమైన పేర్లుపెట్టాడు.

బాలకాండతో రామాయణం మొదలవుతుంది. కాని అందులో రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల శైశవక్రీడల గురించిగాని, వారి బాల్యం గురించి గాని, ఎక్కువగా ప్రస్తావించలేదాయన. కేవలం రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించటం, ఆజన్మలో వున్న పరమార్థం చెప్పి, వెంటనే వారిని పదహారేళ్ళ బాలకుమారులుగా చూపించి, విశ్వామిత్ర మహర్షి వెంట రామలక్ష్మణులు యాగసంరక్షణార్థం వెళ్ళటం, ఆ తర్వాత నల్గురు అన్నదమ్ముల వివాహం, కొడుకులతో, కోడళ్ళతో దశరథుడు అయోధ్యకి రావటం, అక్కడ వారు కొన్నేళ్ళు సుఖంగా వుండటం, ఇంతవరకు కథ చాలా సామాన్యంగా నడుస్తుంది. అయితే ఎన్నెన్నో అద్భుతమైన విషయాలు చాలా ఆసక్తి కలిగించే విధంగా చెప్పాడాయన.

మరి దీనికి బాలకాండ అనే పేరు పెట్టటంలో పరమార్థం ఏమిటి? అంటే రామాయణ మహాకావ్యానికి బాల్యదశ అది. మహా దుర్మార్గుడు, అమిత బలసంపన్నుడు అయిన రావణుని సంహరించటానికి, శ్రీమన్నారాయణుడు దశరథుని వంశంలో జన్మించటానికి జరిగిన ప్రణాళికాబద్ధమైన రహస్యాన్ని అందులో ప్రస్తావించి, ఆ తర్వాత మానవ మాత్రుడుగా జన్మించిన శ్రీహరి రాక్షసులతో తలపడటానికి తగిన శక్తి

సామర్థ్యాలు ఎలా సంపాదించగలిగాడో చక్కగా వివరించి చెప్పాడాయన. వాల్మీకి రచించిన రామాయణంలో శ్రీరాముడు కేవలం మానవమాత్రునిగా మాత్రమే గోచరిస్తాడు. అలాగే వ్యవహరిస్తాడు కూడా. బాలకాండలో ప్రశాంతమైన ప్రవాహంలా సాగిన కథ తర్వాతికాండలో అనూహ్యమైన మలుపులెన్నో తిరుగుతుంది.

ఒకవిధంగా చెప్పాలంటే అయోధ్యాకాండ గొప్ప సస్పెన్స్ థ్రిల్లర్. మొట్టమొదటిసారిగా మనం రామాయణం చతువుతున్నపుడు, అప్పుడే చదువుతున్నాము అనుకుని చదవటం మొదలుపెడ్తే అసలు పుస్తకం పక్కన పెట్టి తర్వాత చదువుదాంలే, అనే ఆలోచనే రాదు. అడుగడుగునా ఉత్కంఠ కలిగించే సన్నివేశాలు, ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఆందోళన, పాఠకుల్ని ఆద్యంతం సస్పెన్స్‌లో ముంచి తేల్చుతుంది అయోధ్యాకాండ.

దశరథుడు ముందుగా ప్లాను ప్రకారమే భరతుణ్ణి మేనమామ గారింటికి పంపుతాడు. ఆ తర్వాత ఏమాత్రం ఆలస్యం లేకుండా రాముడికి పట్టాభిషేకం చెయ్యాలని ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేస్తాడు. ఒకపక్క నగరమంతా పట్టాభిషేక మహోత్సవానికి కోలాహలంగా ముస్తాబవుతుంటుంది. పురోహితులు, పండితులు చకచకా ఏర్పాట్లన్నీ చేసేస్తుంటారు. రాముడు, సీత, ఉపవాసదీక్షతో మహారాజుగారి పిలుపు కోసం ఎదురుచూస్తుంటారు. తెల్లారితే, రామ పట్టాభిషేకం. ఈ వార్త ముందుగా ముద్దులభార్య అయిన కైకకి చెప్పాలని సంబరంతో దశరథుడు అంతఃపురంలో ప్రవేశిస్తాడు. అయితే అప్పటికే జరగవలసిన ఘోరం జరిగిపోయింది. మంథర కైక మనస్సులో నాటిన విషబీజం వేళ్ళూని మహావృక్షమై కూర్చుంది.

తండ్రి పిలిచాడని సుమంత్రుడు చెప్పగానే, పినతల్లితో కలసి తనని ఆశీర్వదిస్తాడనుకుని రాముడు వెళ్తాడు.

కాని అక్కడ తానూహించిన దానికి భిన్నంగా శోకదేవత ఒడిలో తండ్రి వుండగా రాముడ్ని వనవాసానికి వెళ్ళమని మహారాజు ఆజ్ఞాపించినట్లు చెప్తుంది కైక. అంతేకాదు శూలాల్లాంటి మాటలతో రాముడి అహంమీద దెబ్బతీస్తుంది. కైక ఎంత పరుషంగా మాట్లాడినా

రాముడి మీద ఆనపెట్టాడు కనక దశరథుడు ఏం మాట్లాడలేక నిస్సహాయంగా చూస్తూంటాడు. రాముడు అభిమానధనుడైన మానవుడు. అందులోనూ, క్షత్రియవంశంలో పుట్టినవాడు.

సవతి తల్లి నోటివెంట కర్ణకఠోరములైన మాటలు విని కూడా మౌనంగా వూరుకున్న తండ్రిని చూసి రాముడిలో రోషం కలుగుతుంది. మారు చెప్పకుండా పట్టాభిషేకం జరగవలసిన ముహూర్తంలో సమస్తమానవకోటిచేతా జేజేలు అందుకోవలసిన తరుణంలో, పాదచారియై, నారబట్టలతో వెళ్ళిపోతాడు. వద్దు వద్దు అని తల్లిప్రాధేయపడుతుంది. ప్రముఖులంతా వారిస్తారు. పౌరులంతా ప్రాథేయపడ్తు, ఏడుస్తూ వెంటపడి వెళ్తారు. అయినా రాముడు స్థిరమైన మనస్సుతో వెళ్ళిపోతాడు తప్ప వెనుతిరిగిరాడు.

ఎంతటి ధృడమైన సంకల్పంతో వెళ్తాడంటే, రాముడు .అడవులకి వెళ్ళి పోయాడని తెలిసి, దుఃఖంతో కుమిలిపోతూ భరతుడు 'మంత్రుల్ని - పురోహితుల్ని - తల్లుల్ని - పౌరుల్ని వెంటపెట్టుకుని వెళ్ళి రాముడ్ని అయోధ్యకి తిరిగివచ్చి రాజ్యాన్ని స్వీకరించమనీ, తనని శాశ్వతంగా అపఖ్యాతి పాలు చెయ్యవద్దనీ భరతుడు అనేకవిధాల ప్రాధేయపడ్డాడు. పెద్దలందరి చేతా చెప్పిస్తాడు. అయినాసరే రాముడెంత మాత్రం ఒప్పుకోడు. పితృవాక్యపరిపాలన తనధర్మం అంటాడు కాని, అక్కడ రాముని మనస్సు కైక మూలంగా ఎంతగా గాయపడిందో చాలా స్పష్టంగా గోచరమవుతుంది. రామాయణం మొత్తంమీద రెండు సందర్భాలలో రాముని మనస్సు చాలా తీవ్రంగా గాయపడ్తుంది. మొదటిది కైక ప్రవర్తన వల్ల అయితే, రెండోసారి అరణ్యకాండలో సీత లక్ష్మణుడ్ని అనరాని మాటలు అంది అని తెలిసినపుడు చెప్పలేనంత సంక్షోభం కలుగుతుంది రాముడికి. ఇక్కడ రాముడిలో మానవసహజమైన ప్రవృత్తి చక్కగా కనిపిస్తుంది. ఇలా రాముడి పట్టాభిషేకం ఆగిపోవటం దగ్గర్నించి, కథ అనేకమైన మలుపులు తిరుగుతుంది. అయోధ్యాకాండ ఆద్యంతం ఎన్నెన్నో ఊహించని మలుపులు తిరుగుతూ నడుస్తుంది. ఇది నిజంగా జరిగిన కథ. బ్రహ్మగారు టెలికాస్టు చెయ్యగా మనోనేత్రంతో చూసి వ్రాశాడు వాల్మీకి అని అనుకున్నా, ఆయా సన్నివేశాలను వాల్మీకి మలచిన తీరు, రచించిన పద్ధతి చదువరులకి ఎంతో ఆసక్తి కలిగిస్తాయి.

బాలకాండలో వాల్మీకి దశరథుని రాణుల గురించి, వారి స్వభావాల గురించి అస్సలు చెప్పలేదు. కాని అయోధ్యకాండలో అక్కడక్కడ ఆయన ప్రయోగించిన మాటల్ని బట్టి వారి స్వభావాలు మనం తేలికగా అంచనా వెయ్యవచ్చు. అంతేకాదు, దశరథుడు తన కుమారుల పెళ్ళికి అంతఃపుర కాంతల్ని తీసికెళ్ళినట్లు కాని, సీతాదేవి తాలూకు తల్లి వగైరా ఆడవారు పెళ్ళిలో పాలుపంచుకున్నట్లుగాని ఆయన ప్రస్తావించలేదు. సీతని మంచిమాటలు చెప్పి జనకుడే సాగనంపుతాడు. అయోధ్య వెళ్ళాక హారతి ఇచ్చి లోపలికి తీసికెళ్ళినపుడు మొదటిసారిగా రాణులు కోడళ్ళని చూస్తారు. ఇక్కడ మన కేమనిపిస్తుందంటే ఆ కాలంలో స్త్రీలకి ఇంటి గుమ్మం దాటి బయట అడుగుపెట్టే హక్కులేదేమో అని. కాని అయోధ్యకాండలో దశరథుడు కైకకి ఇచ్చిన విలువ, అడవులకి తను కూడా వస్తానన్నపుడు సీతకి రాముడు ఇచ్చే విలువ చదివినపుడు నిజంగా ఆనాడు ఆడవారికి ఎంత ఆదరణ వుండేదో అర్థం అవుతుంది.

అంతేకాదు. రాముడు అడవులకి వెళ్ళిపోయాక, కౌసల్య దుఃఖావేశంతో దశరథుని నిందించినపుడు దశరథుడు, 'దేవీ, ఇప్పటిదాకా ఎంతమంది, ఎన్నివిధాల దూషించినా, సహించి, వుండగలిగాను. కాని ఏనాడూ పల్లెత్తుమాట అనని నువ్వు కూడా నన్ను దూషిస్తే, ఇంక నేను బతకలేను అంటాడు. ఇక్కడ కూడా మహారాజు తన భార్యలని ఎంత గౌరవించేవాడో తెలుస్తుంది.

ఇంక, అయోధ్యాకాండలో అపూర్వమైన ఘట్టాలు కొన్ని వున్నాయి. భరతుడు రాముడ్ని వెతుక్కుంటూ, భరద్వాజ ముని ఆశ్రమానికి వచ్చినపుడు, రాముడు చిత్రకూటాశ్రమంలో వున్నాడని ఆయన చెప్తాడు. అపుడు భరతుడు వెళ్ళి రాముడ్ని కల్సుకుంటాడు.

ఈ ఘట్టం చదివించుకుని, మనకి దూరమైన బంధువులు గాని, మనం పోగొట్టుకున్న వస్తువుకాని, దొరకాలని అనుకుంటే తప్పకుండా అలా జరుగుతుందని ఒక నమ్మకం. అలాగే అత్రి మహర్షి ఆశ్రమంలో అనసూయాదేవి సీతని, ఆమె స్వయంవర ఘట్టం వర్ణించి చెప్పమని అడుగుతుంది. అపుడు సీత, తన స్వయంవరఘట్టం, తన కళ్యాణ వృత్తాంతం, ఇవన్నీ సంక్షిప్తంగా వర్ణించి చెప్తుంది. ఈ ఘట్టం చదువుకుంటే

అవివాహితులైన వారికి సరియైన జంట లభించి వివాహం జరుగుతుందని చెప్తారు. ఇవన్నీ శుష్కప్రియాలు ఎంతమాత్రం కావు. చాలామంది అనుభవంలో చెప్పిన విషయాలు. దేనికైనా నమ్మకం ముఖ్యం. అవహేళన చేసేవారికి మాత్రం చెప్పటం అనవసరం.

ఇంకొక పరమాద్భుతమైన సంగతి ఏమిటంటే, భరద్వాజ మహర్షి తన చిన్ని ఆశ్రమంలో పెద్ద ప్రవాహంలా సాగివచ్చిన భరతుడి పరివారానికి ఆ రాత్రి విందు చేస్తాడు.

ఈ రోజుల్లో మనం కూడా ఏదైనా ఫంక్షన్ చెయ్యాలనుకుంటూ, బహిరంగ ప్రదేశాల్లో చక్కటి సెట్టింగులతో టెంటులు వేయిస్తాం. కరెంటు దీపాలు, పంకాలు, మంచినీటి సౌకర్యాలు, షడ్రసోపేతమైన భోజనాలు, ఒకటేమిటి? పిండికొద్దీ రొట్టె అన్నట్లు డబ్బు వెచ్చించి పరమాద్భుతాలు చేయిస్తాం.

ఆ ప్రాంతంలో అంతకు ముందు ఏమీ వుండదు. ఆ తర్వాతా ఏమీ వుండదు. అన్ని అట్టహాసాలు కొంతసేపు మాత్రమే. ఇదంతా నేటి నాగరిక ప్రపంచంలో మన తెలివితో మనం చేస్తున్నాం అనుకుంటాం. కాని కొన్ని లక్షల సంవత్సరాల పూర్వం, యుగాల ముందు, త్రేతాయుగంలో భరద్వాజుడు కేవలం తన తపశ్శక్తితో ఇంతకన్నా గొప్పగా విందు చేశాడు. ఆయన మంత్రబలంతో ఆయా దేవతల్ని ఆహ్వానించి, విశ్వకర్మ చేత ప్రాసాదాలు, సరోవరాలు, ఉద్యానవనాలు నిర్మింపచేశాడు. వాయుదేవుడ్ని ఆహ్వానించి మలయమారుతాలు వీయించాడు. అమృతోపమములైన వంటలు, పాట కచ్చేరీలు, నాట్యాలు, మెత్తని పాన్పులు, ఒకటేమిటి ఆ ఘట్టం చదివితీరాలి గాని, నేటి నాగరిక ప్రపంచం, ముక్కుమీద వేలుంచుని ఆశ్చర్యపోయేలా విందు చేశాడాయన. ఆయనకున్న సంపద కేవలం తపశ్శక్తి. అంతే. ఈనాడు ప్రపంచంలో ఎక్కడా కనిపించని నాగరికత త్రేతాయుగంలో మన భారతీయుల సొత్తు అని చాటి చెప్తుంది వాల్మీకి రామాయణం. భార్యాభర్తల అనుబంధం, తల్లిదండ్రులపట్ల తనయులు ప్రవర్తించవలసిన తీరు, అన్నాదమ్ముల అనురాగం, అన్నీ చాలా చక్కగా చర్చించబడ్డాయి రామాయణంలోని అయోధ్యాకాండలో. తెలిసీ తెలియకా మనం చేసే తప్పులు, వాని

పరిణామాలు భరతుడు కౌసల్యకి చెప్పినట్లు మనకి తెలియబరిచాడా మహనీయుడు. రాజు అయినవాడు ఎలా వుండాలి అనే విషయం రాముడు, భరతుడికి వివరించి చెప్తాడు. ఇలా మనకి తెలియని ఎన్నెన్నో విషయాలు అయోధ్యాకాండలో చాలా వివరంగా తెలియబరిచాడు, వాల్మీకి. ఈ కాండతో రామాయణంలో అయోధ్యకి సంబంధించిన కథ ముగుస్తుంది. కనుకనే ఇది అయోధ్యకాండ అయింది.

బాలకాండలో శ్రీమన్నారాయణుడు రాముడిగా పుట్టటం, అయోధ్యాకాండలో దుష్టసంహారం నిమిత్తం అడవులకి వెళ్ళటం వరకు చదివాము. ఇంక అరణ్యకాండలో ఏం జరుగుతుందో, చదువుదాము. రామాయణకథ మనకి తెలుసు అనే భావంతో కాకుండా, ప్రతీ ఘట్టం విశ్లేషించి, చదివి, అందులోని అంతరార్థాలు గుర్తించటానికి ప్రయత్నించాలి. అపుడే ఎన్నెన్నో కొత్త విషయాలు తెలుస్తాయి.





# అరణ్యకాండము

అత్రి మహాముని ఆశీస్సులు పొంది సీతారాములు, లక్ష్మణుడు అరణ్యమార్గం గుండా ప్రయాణం చేసి, దట్టమైన దండకారణ్యంలో ప్రవేశించారు.

ఆ ప్రదేశమంతా తాపసుల ఆశ్రమాలతో నిండి వుంది. ఎటుచూసిన పరిచిన దర్భలు, ఆరవేసిన నార వస్త్రములు, కనిపిస్తున్నాయి. అక్కడ నివసించే మునులంతా వేదాధ్యయనసంపన్నులు. బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్నారు. అరణ్యములో సంచరించే క్రూరమృగముల బారినుండి, రాక్షసుల బారినుండి, వారి తపస్సే వారిని రక్షిస్తోంది. ఎన్నోరకాలైన పక్షులు, నానాజాతులకు చెందిన జంతువులు, చేసే రణగుణధ్వనులతో దండకారణ్యం చాలా బీభత్సంగా వుంది.

అంతటి భయానకమైన ప్రదేశంలో నివశిస్తూ, నిశ్చలమైన మనస్సులతో నియమబద్ధంగా తపస్సు చేసుకుంటున్న తాపసుల్ని సేవించటానికి దేవలోకం నించి అప్సరోగణాలు వస్తుంటాయి.

యజ్ఞవాటికల దగ్గర హోమం చెయ్యటానికి అవసరమైన సామగ్రి, అగ్నిని ప్రజ్వలింపచేసే సమిధలు, జలపూర్ణములైన కలశాలూ, మధురములైన పండ్లు, రుచికరమైన కందమూలాలూ, పుష్కలంగా అమర్చివున్నాయి.

అక్కడి మహావృక్షాలన్నీ తియ్యని ఫలములతో నిండి వున్నాయి. ఎటుచూసినా శ్రావ్యమైన వేదఘోష వినిపిస్తోంది. విరగబూసిన పూలు నిండిన చెట్లతో ఆ ఆశ్రమపదాలన్నీ కన్నుల పండుగగా వున్నాయి. వృద్ధులైన మునులు, ఋషులు, ధ్యానవిమగ్నులై కన్నులు మూసుకుని తపస్సు చేస్తూండగా చూసేవారికి కన్నులకి అది బ్రహ్మలోకంలా కనిపించింది.

అటువంటి ఆశ్రమవాసులుండే దండకారణ్యంలోకి, శ్రీరాముడు, సీతతోటీ, లక్ష్మణుడితోటి నడచివస్తుంటే, వారంతా తన్మయులై చూడసాగారు.

వారియందుండే గౌరవంతో, రాముడు వింటినారిని విప్పి, ధనస్సుని దింపి, అతి వినయంగా ఆశ్రమంలో ప్రవేశించాడు. కుసుమకోమలలావణ్యములైన, వారి దివ్య సుందర విగ్రహాల్ని చూసి, పరవశించిపోతూ, రెప్ప వాల్చకుండా వారివంక చూస్తూ, మునులు వారికి మంగళాశాసనం పలికారు. స్వాగత సత్కారాలతో ఆహ్వానించి, మంచి ఆసనాలపై కూర్చుండ చేసి, చల్లని మంచినీరు ఇచ్చి, దాహం తీర్చారు. రుచికరములైన పండ్లు, కందమూలాలతో వారికి ఆతిధ్యం ఇచ్చారు.

పరిమళభరితములైన పూలతో వారిని సత్కరించారు. ఆ తర్వాత అందరూ వచ్చి వారి చుట్టు నేలమీద కూర్చుని, తమ కష్టసుఖాలన్నీ వారికి చెప్పుకున్నారు.

'రామచంద్రా, నువ్వు ధర్మపాలుడివి. వర్ణాశ్రమ ధర్మాలను కాపాడేవాడివి. ఈ అడవిలో రాక్షసులు మాకు ధర్మాచరణములలో విఘ్నాలు కలిగిస్తున్నారు. మమ్మలనందరిని నువ్వే కాపాడి రక్షించవలెను. మేమంతా ఆర్తులమై నిన్ను శరణువేడుతున్నాము.

నీవు మాకు రాజువి. తప్పుచేయువారిని దండించు అధికారం నీకుయున్నది. నీవు రాజధానిలో ఉండి సింహాసనము అధిరోహించినా, నారబట్టలు ధరించినా, అడవులలో ఉన్నా, నీవే మాకు రక్షకుడివి. సర్వశక్తి సంపన్నుడివి. నీవే మాకు రక్ష. మమ్మలను రక్షించుకునే శక్తి మాకులేదు. కనక తల్లి తన బిడ్డలను సంరక్షించుకున్నయట్లు నీవే మమ్మలను రక్షించి, కాపాడవలయును' అంటు అనేక విధముల శ్రీరాముని శరణాగతి వేడినారు. ఆ రాత్రి వారి ఆతిధ్యాన్ని స్వీకరించి, రాముడు, సీత, లక్ష్మణుడు, అక్కడే విశ్రమించినారు. తెల్లారగనే వారి వద్ద శలవు తీసుకుని, ప్రాతఃకాల కార్యక్రమములు పూర్తయ్యాక మళ్ళీ బయల్దేరారు. రాక్షసులు సంచరించుచున్నందుకు గురుతుగా, అడవులలో అన్నిచోట్లా ముళ్ళపొదలు, తీగలు, విరిగిపడి వున్నాయి. క్రూరమృగములు స్వేచ్ఛగా విహరించడం వల్ల, జలాశయములన్నీ కలుషితములై, బురదనీటితో నిండివున్నాయి. కీచురాళ్ళ ధ్వనులతో, ఆ పరిసరములన్నీ భయంకరముగా వున్నాయి. అలాంటి ప్రదేశములలో భయంగా అడుగులు వేస్తూ ముందుకి సాగిపోతున్నారు. అంతలో పర్వతాకారుడైన భయంకరమైన రాక్షసుడొకడు వారి ముందు నిలిచాడు.

లోతైన కళ్ళు, పెద్దనోరు, బానంతపొట్ట వుండి, వికృతమైన ఆకారముతో బీభత్సముగా ఉన్నాడు. ఒళ్ళంతా మాంసం, రక్తం పూసుకుని ఉన్నాడు. మాంసంతో వున్న పెద్దపులి చర్మం ధరించి ఉన్నాడు. పెద్ద ఇనువ శూలం భుజం మీద పెట్టుకుని, దానికి మూడు సింహపు కళేబరాలు, నాలుగు చచ్చిన పెద్దపులులు, రెండు తోడేలు శరీరాలు, పది దుప్పులూ, పెద్ద ఏనుగు తల గుచ్చి వేలాడుతున్నాయి. భయంకరంగా బొబ్బలుపెడుతూ, వాడు వాళ్ళకెదురుగా వచ్చి నిలుచున్నాడు. వారి ముగ్గురిని చూసి కోపముతో రంకెలు వేశాడు. భూమి అదిరిపోయేలా అడుగులు వేస్తూ, తటాలున వారిపైకి దూకి, సీతని ఒడిసిపట్టుకుని, దూరముగా పారిపోయి ఇలా అరిచాడు.

'ఈ దండకారణ్యంలో నిర్భయముగా అడుగుపెట్టిన మానవాధములారా,

మీరెవరు? తాపసవేషములో వున్నారు. కాని అందుకు విరుద్ధముగా విల్లు, అమ్ములు ధరించి, తిరుగుతున్నారేమిటి? జటాఝూటములు ధరించారు, మరి భార్యతో సహా ఇంతటి కీకారణ్యంలోనికి ఎందుకు వచ్చారు? ఈ వనములో నరమానవులు ప్రవేశించకూడదన్న సంగతి మీకు తెలియదా? నాపేరు విరాదుడు. నేను రాక్షసుడునన్న సంగతి నన్ను చూస్తేనే తెలుస్తోంది కదా! పాపాత్ములారా మిమ్మల్నిప్పుడే చంపి మీ రక్తం త్రాగుతాను. మీ భార్య ఇకమీదట నా భార్య అవుతుంది' అంటు వికటాట్టహాసం చేస్తూ, సీతని ఒడిలో కూర్చోపెట్టుకున్నాడు. వాడి భీకరాకారం చూసి సీత భయంతో గజగజా వణకసాగింది. ఆ స్థితిలో యున్న సీతని చూడలేక రాముడి గొంతు తడి ఆరిపోయినది. దుఃఖం పట్టలేక లక్ష్మణునితో ఇలా అన్నాడు.

'లక్ష్మణా జానకి అవస్థచూడుము. చిన్నప్పటి నుంచీ ఎంతో సుఖముగా బ్రతికిన రాజకుమారి ఇవాళ విధివశాత్తు, ఈ విరాదుడి పాలబడినది. ఎంతటి దురయవస్థ కలిగినది మనకి. మనకిలాంటి దుర్గతి కలగవలననె మన పిన్నమ్మ మనలని అడవికి పంపినది.

ఇందుకే తన కుమారుడికి రాజ్యాభిషేకం కోరటముతో తృప్తిపడక, మనకు వనవాసం కూడా అడిగినది. ఆమె చాలా సూక్ష్మదృష్టివున్నది కనక నాతోబాటు సీత కూడా అడవులకి వస్తుందనీ, అడవిలో రాక్షసులు సీతని ఎత్తుకుపోతారనీ, సీతని ఎడబాసి నేను జీవించి వుండలేననీ, ఆవిడ ముందే ఊహించింది కాబోలు. భరతునికి అయోధ్య సింహాసనం సుస్థిరముగా వుండాలని, ఈ వ్యూహం పన్ని వుంటుంది. ఆహా ఈ నాటికి, కైకమ్మ సఫల మనోరధురాలైనది కదా! వైదేహిని, పరపురుషుని ఒడిలో చూశాక నేనింక బ్రతకటమెందులకు? రాజ్యంపోయినా, నాన్నగారు మరణించినా, నా కింతటి క్లేశము కలగలేదు' అంటూ ఎన్నోవిధముల దుఃఖించసాగాడు.

రాముని కన్నీరు చూడగానే లక్ష్మణునికి, ఆ రాక్షసుని మీద చెప్పలేని ఆగ్రహం కలిగింది. ఆవేశంతో బుసలుకొడుతూ ఇలా అన్నాడు.

'ప్రభూ, సమస్త భూతలాలనాధుడవైన నువ్వే అనాధుడిలా ఇలా దుఃఖించటం భావ్యమేనా? నేనుండగా నీకెలాంటి చింతా అక్కరలేదు. ఇపుడే భాణం సంధించి, ఆ దుర్మార్గుణ్ణి హతమారుస్తాను' అంటు అన్నదమ్ములిద్దరూ ఇలా మాట్లాడుకుంటుండగా, విరాధుడు ఒక్క రంకె వేశాడు. ఆ అరుపుకి, అడివంతా గజగజలాడింది. 'మీరిద్దరూ ఎవరు? ఎక్కడికి బయల్దేరారు?' అని గద్దించి అడిగాడు.

అపుడు రాముడిలా అన్నాడు. 'మాది ఇక్ష్వాకువంశము. మేమిద్దరం అన్నదమ్ములం. సుక్షత్రియులం. ఈ అడవులలో తిరగటానికి వచ్చాము. ఇంతకీ నువ్వెవరివి? ఈ దండకారణ్యంలో ఎందుకున్నావు?'

అపుడా రాక్షసుడు సౌమ్యంగానే, 'నేను జయుడు అనె గంధర్వుని కుమారుడను. మా తల్లి పేరు శతహ్రద. నాపేరు విరాదుడు. నేను గంధర్వుడుగా వుండగా, గొప్ప తపస్సు చేసి, బ్రహ్మను మెప్పించి, శస్త్రములు వల్ల నాకు చావులేకుండా వరం పొందాను, కనుక ఏ ఆయుధం వల్ల నాకు చావులేదు. మీరు వృథాప్రయాస పడకండి. ఈ స్త్రీని నాకు వదిలేసి, మీ దారిన మీరు వెళ్ళండి. నేను మిమ్మల్ని చంపను. వెంటనే పారిపోండి' అని అరిచాడు.

ఆ మాటలు వినగానే రాముడి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడ్డాయి.

'ఛీ... నీచుడా! మృత్యువు దాపరించి ఇలా పేలుతున్నావు. నా ఎదుటబడ్డాక, నువ్వు బ్రతికి వుండడం కల్ల' అంటు వాడిమీద భాణవర్షం కురిపించాడు. వాడికి ఒంటినిండా గాయాలై శరీరమంతా రక్తసిక్తమైంది. వాడికి ఆవేశం వచ్చి సీతమ్మని ఒకచోట కూర్చోపెట్టి, పెనుభూతంలా రామలక్ష్మణుల మీద పడ్డాడు. రామలక్ష్మణులు జంకకుండా వాడిమీద బాణాలు గుప్పించారు.

వాడు ఎగతాళిగా నవ్వుతూ, తనభుజం మీద యున్న శూలం తీసి వారిపైకి విసిరాడు. రాముడు తన అమోఘమైన భాణంతో ఆశూలాన్ని రెండుముక్కలు చేశాడు. వాడు తాచుపాములా బుసలు కొడుతూ, రెండు చేతులూ చాచి, వారిమీదకు వచ్చాడు. వెంటనే రామలక్ష్మణులు త్రుటిలో చెరో చెయ్యి నరికేశారు. కాని అవి నరకబడి కూడా మళ్ళీ వచ్చాయి. వాడు రామలక్ష్మణుల్ని రెండు చంకల్లోనూ ఇరికించుకుని, అడవిలోకి పరుగుతీశాడు.

రాముడు లక్ష్మణునికి ధైర్యం చెప్తూ 'లక్ష్మణా అధైర్యపడకు. ఎంతదూరం తీసుకునివెళ్తాడో చూద్దాం. మనం వెళ్ళవలసిన దారి ఇదే కదా. మనం అలసిపోకుండా మోసుకుపోతున్నాడనుకుందాం' అన్నాడు.

వాడలా అడవిలోకి పరుగులు తీస్తుంటే బెదిరిన పక్షులు చెల్లాచెదిరి భయంతో వికృతంగా అరుస్తూ ఎగిరిపోతున్నాయి. నక్కలూ, క్రూరమృగాలూ భయంకరముగా అరుస్తు పారిపోతున్నాయి. వాతావరణం చాలా భీతావహంగా వుంది.

వాడలా రామలక్ష్మణుల్ని పట్టుకుని పారిపోగానే సీత భయంతో కంపించి పోయింది. రెండు చేతులతో గుండెల్ని అదిమిపట్టి ఎలుగెత్తి ఏడ్చింది. 'భగవంతుడా

ఎంతటి దయలేనివాడివి, సదాచార సంపన్నులైన రాకుమారుల్ని ఆరక్కసుడు ఎత్తుకుపోతూ ఉంటే, చూస్తూ ఊరుకున్నావా! ఓవిరాదుడా! నన్నిలా ఒంటరిగావదిలేసి, నావాళ్ళని ఎత్తుకుపోయావా? నన్నిక్కడ తోడేళ్ళు తినేస్తే, నాక్కిక్కడ దిక్కెవరు? నీకు దండం పెడతాను. దయచేసి నన్ను కూడా ఎత్తుకునిపో అని దయనీయంగా ఏడ్వసాగింది. రామలక్ష్మణులు పట్టువిడవకుండా అదేపనిగా వాడి చేతులు ఖండిస్తు పిడికిళ్ళతో వాడి గుండెలమీద పొడవసాగారు. కాళ్ళతో వాడిని కుమ్మెయ్యసాగారు. కత్తులతో ఒంటినిండా పొడవసాగారు. కాని ఎన్నిచేసినా వాడు చావలేదు. అన్నదమ్ములిద్దరూ బాగా అలిసిపోయారు.

'లక్ష్మణా శస్త్రముల వల్ల చావులేకుండా వీడు వరం పొందాడు కదా! కనుక వీణ్ణి భూమిలో పాతేద్దాం' అన్నాడు రాముడు.

ఆ మాటలు వినగానే విరాదుడు, ఆ అన్నదమ్ములిద్దరూ అప్రమేయ పరాక్రమవంతులైన రామలక్ష్మణులు అని గ్రహించాడు.

వాడు తలవంచుకుని, 'పురుషోత్తమా, మీ వల్ల నేను చంపబడ్డాను. కాని వరప్రభావం వల్ల ప్రాణం మాత్రం పోలేదు. అజ్ఞానం వల్ల నువ్వు శ్రీరాముడివని గుర్తించలేకపోయాను. నీ మాటలు విన్నాక నాకు శాపము తొలిగిపోయే సమయం వచ్చినదని తెలుసుకున్నాను.

నువ్వు సాధ్వీమతల్లి కౌసల్య కుమారుడైన, జగద్రక్షకుడవైన శ్రీరాముడివనీ, ఇతడు నీ తమ్ముడు లక్ష్మణుడనీ, ఆసాధ్వి వైదేహి అనీ ఇప్పుడే గ్రహించాను.

'నా పేరు తుంబురుడు. గంధర్వుణ్ణి. కుబేరుని శాపం వల్ల రాక్షసుడిగా మారిపోయాను. ఒకనాడు నేను రంభతో కేళీవిలాసాలలో మునిగి, కుబేరుడి ఆస్థానములో గానం చెయ్యవలసిన సంగతి మర్చిపోయి, చాలా ఆలస్యంగా కొలువుకి వెళ్ళాను. అపుడు కుబేరుడు ఆగ్రహించి, నన్ను రాక్షసునిగా మారిపొమ్మని శపించాడు. ఆయనపాదాలపైబడి, శాపవిమోచన కోసం ప్రార్థింపగా, దశరథ కుమారుడైన రాముని వల్ల చంపబడి, శాపవిముక్తుడవై స్వర్గానికి చేరుకుంటావు అని శాపవిమోచన చెప్పాడు.

రామచంద్రా, నీ అనుగ్రహం వలన నేటికి నాకు శాపవిమోచనము కలిగినది. నేను నా లోకాలకు వెళ్తాను. ఇక్కడికి ఒకటిన్నర యోజనాల దూరంలో శరభంగుడనె మునీశ్వరుడు ఉన్నాడు. ఆయనని కలుసుకుంటే నీకు శుభం కల్గుతుంది. మీ అన్నదమ్ములిద్దరూ కలిసి గొయ్యి తీసి, నా శరీరాన్నందులో కప్పెట్టండి. అప్పటికి నాకు పూర్తి శాపవిమోచన కలుగుతుంది' అన్నాడు. రాముడు సరే అని, వాడి

కంఠాన్ని కాలితో తొక్కిపెట్టి వుంచాడు. లక్ష్మణుడు పెద్ద గొయ్యి తవ్వాడు. అన్నదమ్ములిద్దరూ వాడి శరీరాన్ని అతికష్టముతో వంచి, ఉండలా చేసి ఆ గోతిలోకి త్రోసేశారు. వాడు ఆ బాధ భరించలేక హృదయవికారంగా అరిచాడు.

ఆ అరుపులకి అడివంతా దద్దరిల్లిపోయింది. కంకర్రాళ్ళతో గోతిని పూడ్చి వాడి శరీరం సమాధి చేశారు. ఆ తర్వాత అన్నదమ్ములిద్దరూ విజయోత్సాహముతో సీత వున్న చోటుకి వచ్చారు. రాముడు సీతని గుండెలకు హత్తుకుని ఓదార్చాడు.

'లక్ష్మణా, ఈ అడవి చాలా దుర్భేధ్యంగా వుంది. ఇక్కడికి దగ్గరలో శరభంగుడి ఆశ్రమం వుందని విరాదుడు చెప్పాడు కదా 'మనం తొందరగా అక్కడకి వెళ్దాం' అన్నాడు తమ్ముడితో. లక్ష్మణుడు సరే' అన్నాడు.

వాళ్ళు ముగ్గురూ మళ్ళీ ప్రయాణం సాగించారు. కొంతదూరం వెళ్ళేసరికి కనుచూపుమేరలో ఆశ్రమం కనిపించింది. అక్కడ వారికొక అద్భుతమైన సన్నివేశం గోచరించింది. శరభంగుడి ఆశ్రమసమీపంలో, పచ్చని గుఱ్ఱములు పూన్చిన ఒక రథం వ్రేలాడుతూ కనిపించింది. ఆకాశంలో, ఆ రథం రంగురంగుల పూలతో అలంకరించబడి వుంది. గంధర్వులు, దేవతలు, ఋషులు ఆ రథం చుట్టూ నిలబడి స్తోత్రాలు చేస్తున్నారు. ఇద్దరు స్త్రీలు, వెండి పిడివున్న వీవనలతో విసురుతుండగా విమానం నించి ఇంద్రుడు దిగి గాలిలో తేలుతూ శరభంగుని ఆశ్రమం వైపు వెళ్తున్నాడు. శరభంగుడు ఆశ్రమం బయటకి వచ్చి నిలబడి, గాలిలో తేలుతున్న దేవేంద్రునికి నమస్కరించాడు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. ఇదంతా రాముడు మాత్రమే గమనించగలిగాడు. లక్ష్మణునికి, సీతకి అమితప్రకాశవంతమైన వెలుగు మాత్రం కనిపించింది.

'లక్ష్మణా ఆ రథం చూశావా? ఇంద్రుని రథంలా వుంది. ఆతడి రథానికి గుఱ్ఱాలు ఆకుపచ్చగా వుంటాయంటారు కదా' అటుచూడు ఆ రథం తప్పకుండా దేవేంద్రుడిదే అయివుంటుంది. అందుకే వాళ్ళు గాలిలో నిలబడి వున్నారు చూశావా? ఆయన శరభంగునితో ఏదో చెప్తున్నట్లున్నాడు. నువ్వు, సీత ఇక్కడే వుండండి. నేను వెళ్ళి ఆ సంగతి తెలుసుకుని ఇపుడే వస్తాను' అని చెప్పి సీతని లక్ష్మణునికి అప్పగించి బయల్దేరుతాడు.

రాముడు తనవైపు రావడం దేవేంద్రుడు చూశాడు. శరభంగునితో ఇలా అన్నాడు, 'మహర్షీ, రాముడిటువైపు వస్తున్నాడు. నేనిపుడాయన్ని చూస్తే నమస్కారం చేసి తీరాలి. నేను దేవేంద్రుడినని గుర్తించి రాముడు నాతో మాట్లాడితే ఆయనకి దైవత్వం సిద్ధిస్తుంది. అపుడింక రావణవధకి అంతరాయం కలుగుతుంది.

మేమంతా కష్టపడి తయారుచేసుకున్న ప్రణాళిక నిష్ప్రయోజనమైపోతుంది. కనుక రావణ వధానంతరమే నేను ఆ పురుషోత్తముని సందర్శిస్తాను' అంటూ వడివడిగా వెళ్ళి రథం ఎక్కి మాయమైపోయాడు.

ఇంద్రుడు వెళ్ళిపోవడం రాముడు చూశాడు. వెనక్కి వెళ్ళిపోయి, సీతని, లక్ష్మణుని వెంటబెట్టుకుని శరభంగుని ఆశ్రమానికి వచ్చాడు.

వారు ముగ్గురూ శరభంగునికి నమస్కరించారు. శరభంగుడు సాదరంగా వారిని ఆహ్వానించి, కూర్చోమన్నాడు. 'ఇంద్రుడు వచ్చి వెళ్ళాడా' అని రాముడు ఆయనని అడిగాడు.

అప్పుడు శరభంగుడు, 'రామా నా తపస్సుని మెచ్చి, నన్ను బ్రహ్మలోకానికి తీసుకెళ్ళాలని ఇంద్రుడు వచ్చాడు. కాని నేను దివ్యదృష్టితో, పురుషోత్తముడివైన నువ్వు నా ఆశ్రమానికి వస్తున్నట్లు తెలుసుకున్నాను. నిన్ను దర్శించిన తర్వాత, వస్తానని దేవేంద్రునితో చెప్పిపంపాను. బ్రహ్మలోకము, సత్యలోకము అనుభవించగలిగిన పుణ్యకర్మలు ఎన్నో నేను చేశాను. కాని వాటన్నిటికన్నా మిన్నయైనది నీ సందర్శన భాగ్యం. కనుక నేను ఇంద్రుని వెంట బ్రహ్మలోకానికి వెళ్ళలేదు. నా ప్రియమైన అతిథివి నువ్వు. నా తపఃఫలమంతా నువ్వు స్వీకరించి, నన్ను ధన్యుణ్ణి చెయ్యి' అన్నాడు.

ఆ మాటలు విని రాముడు సంతృప్తి పొందాడు. 'మహామునీ, నేను అటువంటి ఫలాన్ని నా స్వయంశక్తిచేత సంపాదించుకోగలను, కాని ప్రస్తుతం ఈ అరణ్యంలో మేము నివశించడానికి అనుకూలమైన ప్రదేశము చూపించండి' అన్నాడు.

'రామా! ఇక్కడకు సమీపములో సుతీక్ష్ణుడి ఆశ్రమం వుంది. ఆయన గొప్ప తపోసంపన్నుడు. ఆయన దగ్గరకి వెళ్ళు. మీరుండడానికి అనువైన ప్రదేశం ఆయన చూపిస్తాడు. కాని నాదొక్క విన్నపం. నా ఈ శరీరం శిథిలమైంది. నాకింక ఈ శరీరం మీద వ్యామోహం లేదు. ఒక్క క్షణం నువ్వు అలా నుంచో. నీ ఎదురుకుండా, ఈ శరీరాన్ని అగ్నిలో పరిత్యజిస్తాను' అంటు సుతీక్ష్ణుడి ఆశ్రమానికి ఎలావెళ్ళాలో దారి వివరంగా చెప్పి, శిష్యుల చేత అగ్నిహోత్రం తయారుచేయించి, యధావిధిగా హోమం చేసి, ఆ పవిత్రమైన అగ్నిగుండంలోకి శరీరంతో ప్రవేశించాడు. అందరూ చూస్తూండగానే ఆయన శరీరం అగ్నిలో ఆహుతి అయిపోయింది. రాముడు దిగ్భ్రాంతి చెందాడు. సీతకి, లక్ష్మణునికి ఒళ్ళు గగుర్పొడిచే ఆ సన్నివేశం చూపించాడు.

అంతలోనే అగ్నిలా ప్రకాశిస్తూ నవయౌవనంతో శరభంగుడు ఆ

అగ్నిహోత్రంలోంచి బయటకి వచ్చాడు. రామునికి నమస్కరించి తిన్నగా అంతరిక్షంలోకి వెళ్ళిపోయి పరబ్రహ్మసాక్షాత్కారం పొందాడు.

శరభంగ మహర్షి పరమపదానికి వెళ్ళగానే, అక్కడవుండే ఋషిగణాలు, మునిగణాలు, అందరూ వచ్చి, రాముణ్ణి చుట్టుముట్టారు. తండోపతండాలుగా వాళ్ళు రాముణ్ణి చూడడానికి వచ్చారు.

శ్రీరాముని దివ్యమంగళ విగ్రహాన్ని చూసి, ముగ్ధులైపోయి, రాముని పాదాలకి ప్రణమిల్లి ఇలా అన్నారు.

'రామా ఇక్ష్వాకువంశంలో జన్మించిన నువ్వు, మాకందరికీ పూజ్యుడివి. విరాధుణ్ణి సంహరించిన నువ్వు అజేయుడివి. శరభంగుడికి మోక్షాన్ని ప్రసాదించిన నువ్వు సాక్షాత్తు ధర్మస్వరూపుడివి. నీ పితృభక్తినీ, సత్యవ్రతాన్నీ, అనన్య సామాన్యమైన నీయశశ్శునీ, ముల్లోకాలు కీర్తిస్తున్నాయి. అంతటి ధర్మమూర్తివి కనుక మా కష్టాలు నీకు చెప్పుకుంటాము. మమ్మలను మన్నించి అనుగ్రహించు. మమ్మలను రక్షించడానికి నువ్వు ఈ దండకారణ్యానికి వచ్చావని మాకు తెలుసు. ఈ అడవులలో రాక్షసుల బాధ చాలా ఎక్కువగా ఉంది. నిశ్చలమైన మనస్సులతో పరమాత్మని ధ్యానిస్తూ తపస్సు చేసుకుంటున్న మా తాపసుల్ని రాక్షసులు, నిర్దాక్షిణ్యంగా చంపి తినేస్తున్నారు. ఇక్కడ మందాకినీ నదీతీరాన, పంపానది ఒడ్డునా, చిత్రకూటము మీదా, అన్నిచోట్లా మునులు ఆశ్రమాలు నిర్మించుకుని, తపస్సు చేస్తున్నారు. ఈ ప్రదేశాలన్నింటిలోనూ రాక్షసులు నిర్దాక్షిణ్యంగా విహారం చేస్తున్నారు. మమ్మల్ని చిత్రహింసలు పెడ్తున్నారు. కనుక దయయుంచి నువ్వు ఈ రాక్షసిమూకల్ని చీల్చి చెండాడి మమ్మల్ని కాపాడాలి. మేమంతానిన్నే శరణుకోరుతున్నాము. నువ్వు తప్ప, మమ్మల్ని కాపాడగలిగినవాళ్ళు ఈ భూమిమీద ఎవ్వరూ లేరు' అంటు ప్రార్థించారు.

వారి మాటలు విని రాముడు వారిని చేరదీసి, 'అయ్యలారా, మీరీ విధముగా అర్థించటం ఉచితం కాదు. మీరు నన్ను ఆజ్ఞాపించాలి. ఆ అధికారం మీకుంది. రాకుమారుడిగా ఈ అడవులలో వుండే తాపసులను సంరక్షించడం నా ధర్మం. నా అదృష్టం వల్ల, దైవానుగ్రహం వల్ల, నా తండ్రి నన్ను వనవాసానికి పంపడం వల్ల నాకా సదవకాశం కలిగింది. మీరిక నిశ్చింతగా వుండండి. నేనూ, నా తమ్ముడూ కలసి రాక్షస సంహారం చేస్తాము' అని వారికి అభయం ఇచ్చాడు. వారందరి దీవెనల్ని అందుకుని, సుతీక్ష్ణుడి ఆశ్రమానికి బయల్దేరాడు. మందాకినీ నదీతీరం వెంట వారు ముగ్గురు నడుస్తున్నారు. కొంతదూరం ప్రయాణం చేసి సుతీక్ష్ణుడి ఆశ్రమం చేరుకున్నారు.

ఆ ఆశ్రమం సమీపంలో ఒక ఎత్తైన పర్వతం వుంది. చుట్టు ఎన్నెన్నో మహావృక్షాలు, పండ్లతోటి, పూలతోటి నిండివున్నాయి. ఎటుచూసినా ప్రకృతి శోభలతో ఆ ఆశ్రమప్రాంతం కన్నులపండుగగా వుంది. ఆ ఆశ్రమంలో సంస్కార రహితమైన శరీరంతో, జడలు కట్టిన తలకట్టుతో, వడిలిపోయి ముడతలు పడ్డ శరీరంతో, తపోనిష్ఠలో మునిగి వున్న సుతీక్ష్ణ మహాముని, బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్నాడు.

రాముడు ఆయనని సమీపించి నమస్కరించి 'భగవాన్! నేను దశరథరాజ కుమారుణ్ణైన రాముడను. మీదర్శనం కొరకు వచ్చాను. దయతో నన్ను అనుగ్రహించండి' అన్నాడు.

సుతీక్ష్ణుడు కన్నులు తెరచి, రాముడ్ని ఆతడి వెనుక వున్న పరివారాన్ని చూశాడు. వెంటనే లేచి రాముణ్ణి కౌగలించుకున్నాడు.

'రామా! మహావీరా! ధర్మరక్షకా, స్వాగతము. నీ రాకతో మా ఆశ్రమము పావనమైనది. చిరకాలంనుంచీ నీ రాకకోసం ఎదురుచూస్తూ నిరీక్షిస్తున్నాను. నువ్విక్కడకు వస్తావన్న సంగతి యోగదృష్టితో తెల్సుకున్నాను. దేవేంద్రుడు స్వయంగా వచ్చి, నా తపోశక్తి వల్ల ఊర్ధ్వలోకాలన్నింటికి వెళ్ళగల శక్తి కలిగినదనీ, దేవలోకానికి రమ్మనీ నన్ను ఆహ్వానించాడు. కాని నీ సందర్శనం కోసమే నేను ఆయన కోరిక నిరాకరించినాను. నువ్వు చిత్రకూటాశ్రమానికి చేరిన దగ్గరనుంచీ, నీ సంగతులు ఎప్పటికప్పుడు నాకు తెలుస్తున్నాయి. పురుషోత్తమా! నా తపశ్శక్తినంతా నీకు కానుకగా సమర్పిస్తాను. స్వీకరించి నన్ను తరింపచెయ్యి' అంటు ఎంతో ఆపేక్షగా రాముణ్ణి పొదవి పట్టుకున్నాడు.

ఆ మాటలు విన్న రాముడు చాలా సంతోషించాడు. 'మునివర్యా, మీ తపోబలంతో మీరు సంపాదించుకున్న లోకాలన్నీ చేరి మీరు సుఖంగా వుండండి. ఆ శక్తి నేను స్వయంకృషితో సంపాదించుకోగలను. కాని, ప్రస్తుతము ఈ అడవిలో మేము సురక్షితముగా వుండగల ప్రదేశం చూపించండి. మహర్షి గౌతమవంశజ్ఞుడైన శరభంగ మహాముని, మీ గురించి చెప్పాడు. వనవాసకాలం పూర్తయ్యేవరకు మేము నివసించుటకు తగిన చోటు మీరు చూపిస్తారని, ఆయన చెప్పారు' అన్నాడు. ఆ మాటలు విని సుతీక్ష్ణుడు పొంగిపోయాడు.

'రామభద్రా ఎక్కడో ఎందుకు? మీరు నివసించడానికి మా ఆశ్రమమే చాలా అనుకూలమైనది. సురక్షితమైనది. ఇక్కడ అన్ని సమయాల్లోనూ ఋషులు సంచరిస్తూ వుంటారు. తియ్యని పండ్లు, రుచియైన కందమూలాలూ అన్ని

కాలాల్లోనూ ఇక్కడ దొరుకుతాయి. అన్ని దిక్కులా లేళ్ళు స్వేచ్ఛగా సంచరిస్తాయి. కాని అప్పుడప్పుడు అవి యజ్ఞయాగాదుల కోసం తెచ్చుకున్న సామాగ్రి పాడుచేస్తుంటాయి. అదొక్కటే బాధ' అంటూచెప్పి, భవిష్యత్తులో జరగబోయే ఆపదకి హెచ్చరిక ఇస్తున్నట్లు అని ఊరుకున్నాడు.

ఆ మాటలకి మహావీరుడైన రాముడు నవ్వి 'ఆర్యా, వాటివల్ల భయపడవలసిన అవసరం లేదు. పిడుగుల్లాంటి నా భాణాలతో వాటిని నేను చంపగలను. కాని పరమపవిత్రమైన ఆశ్రమపదంలో, మీలాంటి మహాత్ముల చల్లని నీడలో సంచరించే ఆ అమాయక ప్రాణులను చంపి, అంతటి మహాపరాధము నేను చెయ్యలేను. కనుక నేను కొంతకాలం మాత్రమే ఇక్కడవుంటాను' అన్నాడు.

అంతలో సంధ్యాసమయం అయినది. రాముడు సంధ్యావందనం చేసుకుందుకు సరోవరంలోకి వెళ్ళాడు. ఆరాత్రికి వారు సుతీక్ష్ణునికి అతిధులుగా వున్నారు.

తెల్లవారాక, సీతాలక్ష్మణ సమేతుడై రాముడు సుగంధభరితములైన సరోవరంలో స్నానం చేసి, ప్రాతఃకాల కార్యక్రమాలు పూర్తిచేసుకుని, సుతీక్ష్ణ మహామునిని దర్శించి, 'మహర్షీ రాత్రి మీ ఆశ్రమంలో సుఖంగా గడిపాము. మీరు మాకందించిన ఆదర సత్కారములు మరుపురానివి. ఇపుడింక అనుమతి ఇస్తే మేము వెళ్తాము. నావెంట వచ్చిన మునిపుంగవులు, ఎండ ఎక్కకుండా వెళ్దామని తొందరచేస్తున్నారు. ఈ చుట్టుపక్కల వున్న ఆశ్రమపదాలన్నీ సందర్శించి, వారి వారి యోగక్షేమాలను తెలుసుకోవాలని, మా సంకల్పం. ఇంకా పొద్దుపోతే ఎండవేడిమి భరించడం చాలాకష్టం. కనుక మేము వెళ్ళటానికి అనుజ్ఞ ఇయ్యవలసినదిగా మా ప్రార్ధన' అన్నాడు. సుతీక్ష్ణుడు రామలక్ష్మణులను గుండెలకి హత్తుకుని, 'రామా, మీరంతా సుఖంగా వెళ్ళిరండి. ఈ దండకారణ్యంలో ఉన్న తాపసులందరిని దర్శించండి. వీరంతా నిరంతరం పరమాత్ముని ధ్యానించటం తప్ప వేరొకటి ఎరుగనివారు. ఈ అరణ్యం, ఫలములతోటీ, పూలతోటీ నిండిన వృక్షాలతో, కొండచరియల నుంచి ప్రవహించే సెలయేళ్ళతో, రకరకాలైన పక్షులతో, చాలా రమణీయంగా ఉంటుంది. మీ మనస్సులు ప్రశాంతముగా, ఆహ్లాదంగా వుంటాయి. నిశ్చింతంగా వెళ్ళిరండి' అని ఆశీర్వదించాడు. రాముడు లక్ష్మణుడు, సీత, ఆ మహామునికి ప్రదక్షిణం చేసి సాష్టాంగ నమస్కారములు చేశారు. ఆ తర్వాత వారు మునులతో కలిసి ముందుకు సాగిపోయారు.

ముందుగా ధనుర్ధారియైన రాముడు, వెనక సీత, నడుస్తుండగా కొంత దూరంలో లక్ష్మణుడు, మునులు నడుస్తున్నారు. అప్పుడు సీత మనస్సులో ఒక ఆలోచన వచ్చింది.

సుతీక్ష్ణుడు ఆశీర్వదించినపుడు అరిష్టములు, ఉపద్రవాలు లేకుండా వెళ్ళిరండి అని అన్నాడు కదా, ముందు ముందు ఏదైనా అమంగళం కల్గుతుందని హెచ్చరించటానికే ఆయన అలా అన్నాడా? అనుకుంటూ, భయంభయంగా రామునివంక చూస్తు ఇలా అంది.

'ప్రభూ, మీరిప్పుడు తాపసవృత్తిలో అనుసరిస్తున్న ధర్మం చాలా అమోఘమైనది. దుస్సాధ్యమైనది. సామాన్యముగా ప్రతి పురుషుడు తప్పించుకోలేని వ్యసనాలు మూడు ఉన్నాయని పెద్దలు చెప్తారు.

మొదటిది అసత్యం చెప్పడం, రెండవది పరదారని కాంక్షించడం, మూడవది వైరము లేకపోయినా నిష్కారణముగా ఇతరుల్ని హింసించడం. అకారణంగా ఇతరులపై క్రోధం తెచ్చుకోవడం.

మీ విషయంలో అసత్యం చెప్పడం, పరస్త్రీలను అభిలషించడం జరగనివని నాకు తెలుసు. ఎందుకంటే సత్యవాక్పాలన కోసమే మీరు వనవాసానికి వచ్చారు. మీరు ఏకపత్నీవ్రతులు. కనుక మొదటి రెండు వ్యసనాల గురించీ నాకు బాధలేదు. కాని మూడవ వ్యసనం మీ విషయంలో హాని కలిగిస్తుందేమో అని నా భయం.

ఎందుకంటే మునులు మిమ్మల్ని ప్రార్ధించినప్పుడు, దండకారణ్యంలో వుండే రాక్షసులందరినీ చంపి, వారికి రక్షణ కలిగిస్తానని, మీరు వారికి అభయమిచ్చారు. అది నెరవేర్చడానికే ఇలా దండకారణ్యమంతా తిరగడానికి బయల్దేరారు.

మీరు, మీ తమ్ముడు ధనుర్ధారులై అడవులలో తిరుగుతూ, ఎప్పుడు ఎవరి మీద అస్త్రప్రయోగం చేస్తారో అని నాకు భయంగా వుంది. మండుతున్న నిప్పుదగ్గర ఎండు కట్టెలు వుంచినప్పుడు, క్షత్రియుని చేతిలో ఆయుధం వున్నప్పుడు, ఎపుడే ప్రమాదం ముంచుకొస్తుందో చెప్పలేము.

పూర్వము ఒక తాపసి చాలా నియమంగా తపస్సు చేసుకుంటుండగా, ఇంద్రుడు ఆతడి తపస్సు భంగం చెయ్యడానికి, ఒక భటుడి రూపంలో ఆయన దగ్గరకువెళ్ళి, తన దగ్గర వున్న కత్తిని ఆయన దగ్గర వుంచి, తను మళ్ళీ వచ్చి అడిగేవరకు దానిని కాపాడమని ప్రార్థించాడట.

ఆ తర్వాత ముని అహర్నిశము ఆ కత్తిని కాపాడాలనే తాపత్రయంతో ఎక్కడికెళ్ళినా కూడాతీసుకునివెళ్ళి ఆఖరికి ఫలములు, దర్భలూ, సమిధలూ తెచ్చుకుందుకు ఆ కత్తిని వాడడం మొదలుపెట్టాడట. అప్పట్నించీ క్రమముగా, అతని ప్రవృత్తి మారిపోయి, ఆ కత్తితో హింస కలిగించే పనులు కూడా చేస్తూ క్రమక్రమంగా పతనమై ధర్మభ్రష్టుడై నరకానికి వెళ్ళాడట.

ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునీశ్వరులే అలా పతనమైనప్పుడు, క్షత్రియుల సంగతి వేరే చెప్పాలా? శస్త్రప్రయోగం అగ్నితో సమానమైనది. మీ మీద వుండే ప్రేమతో చెప్తున్నాను. అంతేకాని మీకు తెలియదని మాత్రం కాదు.

అకారణంగా రాక్షసుల్ని చంపడం మీకు ఉచితం కాదు. మీ చేతిలో విల్లు ఎల్లప్పుడూ ఆర్తుల్ని రక్షించడానికే కాని, నిరపరాధుల్ని చంపడానికి కాదు. అందులోనూ, రాక్షసులతో వైరం చాలా ప్రమాదకరం. మనం కొన్నాళ్ళు అడవులలో వుండడానికి వచ్చాము. మీరు తాపస ధర్మం స్వీకరించారు. అలాంటప్పుడు మీకు ఆ ధనస్సుతో పని ఏమి? మనం అయోధ్యకి వెళ్ళాక మీ క్షాత్రధర్మం మళ్ళీ మీరు స్వీకరించవచ్చును. ధర్మాచరణమే అన్ని సుఖములకు మూలం. మీరు తాపసధర్మం ఆచరిస్తే మీ అమ్మగారు కూడా చాలా సంతోషిస్తారు. అయినా ధర్మాచరణ గురించి మీకు నేను చెప్పాలా? మీరు, మీ తమ్ముడు బాగా ఆలోచించి మీకెలా తోస్తే అలా చెయ్యండి' అంది.

అమాయకమైన ఆమె ఆలోచనలకి రామునికి నవ్వు వచ్చింది.

'జానకీ, ఉత్తమ కులంలో పుట్టావు కనక ధర్మసూక్ష్మాల గురించి చక్కగా చెప్పావు. ఆర్తులను రక్షించడానికే క్షత్రియులు ధనస్సు ధరించాలని నువ్వే చెప్పావు కదా! ఇంక నేను వేరే చెప్పేదేం వుంది? దండకారణ్యంలోని మునులు వారి ధర్మాచరణలో విఘ్నం కలుగుతోందని, స్వయంగా నన్ను శరణుకోరారు. అడవులలో వుంటూ, కందమూలములు, ఫలములు తింటూ, నిరంతరం తపస్సులో మునిగివుండే వారికి, రాక్షసుల వలన, వారి క్రూరకర్మల వలన, శాంతి లేకుండా పోయింది. ఆ రక్కసులు, వారిని చంపి, వారి రక్తమాంసములు తింటూ, వారిని భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ఆ మునులంతా తమని రక్షించవలసినదిగా, నన్ను ప్రాధేయపడ్డారు. తమని తాము రక్షించుకోగల శక్తి వుండి కూడా, ఆర్తులై వారు నన్ను శరణన్నారు. వారు, అనుగ్రహించమని నన్ను ప్రాధేయపడగానే నోటమాటరాక నా శరీరం ఒణికింది.

వారి నోటితో నన్ను యాచించడమా! ఎంతటి అపచారము. అందుకే వారి పాదాలపై పడ్డాను.

'పూజ్యులారా! నా అపచారం మన్నించండి. మీరిలా కోరుకోవడం నాకు చాలా సిగ్గుగా వుంది. నేను క్షత్రియ కుమారుణ్ణి. నా అంతట నేను వచ్చి మీ యోగక్షేమములు తెలుసుకుని, మీకు రక్షణ కల్పించాలి. అటువంటిది, మీరు నన్ను శరణువేడుటయా? బ్రహ్మవేత్తలైన మునులు, క్షత్రియులను శరణుకోరుట

మాకు మహాపచారం. క్షమించండి. మీ కోసం నేనేం చెయ్యాలో చెప్పండి' అని వారిని వేడుకున్నాను.'

అపుడు వారంతా ముక్తకంఠంతో, 'రామా, దండకారణ్యంలో కామరూపులైన రాక్షసులెందరో మమ్మల్ని బాధిస్తున్నారు వారు అజేయులు. మేము యజ్ఞాలు చేస్తున్నప్పుడు, పర్వదినాలలో ధ్యానతత్పరులమై తపస్సు చేసుకుంటున్నపుడు, మమ్మల్ని చాలా పీడిస్తున్నారు. ఇన్నాళ్ళనించీ మమ్మల్నెవరు రక్షిస్తారా అని దేముణ్ణి ప్రార్థిస్తు ఎదురుచూస్తున్నాం. ఇన్నాళ్ళకి మా తపస్సు ఫలించి, నీ అండ దొరికినది. మా తపోబలముతో వారిని శిక్షించగల శక్తి మాకున్నా ఎంతో కష్టపడి సంపాదించుకున్న తపస్సంపద ఇలా నాశనం చేసుకోవడం మాకు ఇష్టం లేదు. కనుక ఈ రాక్షసుల్ని సంహరించి, మమ్మ కాపాడగలవాడివి నువ్వే' అని వారు ప్రార్థించారు. అప్పుడు వాళ్ళనందర్నీ రక్షిస్తానని నేను ప్రతిజ్ఞ చేశాను.'

'ఒకసారి ప్రతిజ్ఞ చేశాక, ఆ ప్రతిజ్ఞని ఉల్లంఘించటం జీవించివుండగా నా వల్లకాదు.

కనుక వైదేహీ, నా మాట నమ్ము. బ్రహ్మవేత్తలైన మునులకు ఇచ్చిన మాట నేను మీరలేను. అవసరమైతే ఆ మాటకోసం ప్రాణాలైనా ఇస్తాను. అంతేకాదు నాకు ప్రాణాలకన్న మిన్న అయిన, నిన్ను లక్ష్మణుడ్ని కూడా వదిలేస్తాను. కాని ఋషులకి ఇచ్చిన మాటమాత్రం తప్పలేను. నామీద ప్రేమతో నువ్వు నాకు హితవు చెప్పావు. చాలా సంతోషము. ప్రేమించిన వారు మాత్రమే ఆప్తులకు హితవు చెప్పగలరు. జనకుని వంశంలో పుట్టిన నీకు, ధర్మములు వేరొకరు చెప్పాలా? కాని నువ్వు నా సహధర్మచారిణివి. శరణాగత రక్షణ విషయంలో కూడా నువ్వు నాకు భాగస్వామినివై తోడుగా వుండాలి' అంటూ అనేకవిధాల ఆమెకు నచ్చచెప్పాడు.

ఆ తర్వాత వారు యథాప్రకారం సాగిపోయి, దండకారణ్యం అంతా తిరుగుతూ, ఎన్నెన్నో సుందరదృశ్యాలు చూశారు. చిత్ర విచిత్రములైన పూవులతో, ఆహ్లాదకరంగా ఉన్న పూలమొక్కలు, చక్కని కొండచరియలు, దట్టమైన అడవులు, గలగల పారే సెలయేళ్ళు, చల్లని గాలులు వీస్తున్న నదీ తీరాలు, నదులు, తీర్థాలు, ఆ నదీ జలాలతో ఆడుకుంటున్న చక్కని జలపక్షులను చూస్తూ పులకించి పోయారు. తామరకొలనులు, గుంపులుగుంపులుగా పరుగులుతీస్తున్న లేళ్ళ గుంపులు, దుప్పులు మదించిన ఏనుబోతులు, ఏనుగులు, ఇలా ముచ్చటగొలిపే దృశ్యాలెన్నో కనువిందు చేస్తున్నాయి. ఏనుగులు క్రీడాకలాపాలతో చెట్లను

విరిచిపారేస్తున్నాయి. అలా ప్రతిదృశ్యం ఆసక్తికరంగా చూస్తూ సాయంకాలానికి ఒక తటాకం దగ్గరకు చేరారు. ఆ తటాకం తామరపూలతో నిండి నలుచదరంగా వుంది. హంసలు, కాదంబములు, సారసములు, ఆ సరస్సులో విహరిస్తున్నాయి. ఆ తటాకంలో నీళ్ళు చాలా నిర్మలంగా వున్నాయి. వారంతా ఆ సరస్సు తీరాన చేరి అలసట తీర్చుకున్నారు. సీతా, రాముడు, లక్ష్మణుడు ఒడ్డున కూర్చున్నారు.

అంతలో ఆ సరస్సులోనుంచి చిత్రవిచిత్రములైన వాయిద్యముల ధ్వని, గానములు, వినిపించాయి. చుట్టు చూశారు. ఎక్కడా ఎవ్వరూ కనబడలేదు. సరస్సులోపలినించే ఆ ధ్వనులు వస్తున్నట్లుగా గ్రహించి, ఆసక్తికరంగా తొంగిచూశారు.

అపుడు రాముడు ధర్మభృతుడు అనే మునీశ్వరుని చూసి 'ఆర్యా, చాలా ఆశ్చర్యంగా వుందే! ఈ సంగీతధ్వనులు ఎక్కడ్నించి వినవస్తున్నాయి? చెప్పకూడని విషయం కాకపోతే మాకు చెప్పండి అని వినయంగా అడిగాడు. అపుడాముని,

'రామచంద్రా ఈ సరస్సు పేరు పంచాపురము. మాంద్రకర్ణి అనే ముని నిర్మించాడు. మీరు వింటున్న సంగీతఘోష ఈ సరస్సులోపలినించే వస్తోంది. ఒకప్పుడు, మాంద్రకర్ణి మోక్షమును కోరి తపస్సు చేశాడు. ఈ సరస్సు నిర్మించి, ఇందులో మునిగి పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. అతడలా ఘోరమైన తపస్సుచేస్తుంటే, దేవతలు కంగారుపడి, తమ పదవులకి ముప్పువస్తుందేమో యని, భయపడి ఆ తపస్సు భంగం చెయ్యడానికి మెరుపు తీగల్లాంటి, ఐదుగురు అప్సరసల్ని పంపారు. వారి గానకౌశలానికీ, నాట్యానికీ ముగ్ధుడై ఆ ముని వారిపట్ల ఆకర్షితుడయ్యాడు. వెంటనే వారినైదుగుర్నీ తన భార్యలుగా స్వీకరించాడు. ఈ తటాకములోపల ఒక ఇల్లు కట్టుకుని అందులో వారితో సహా నివసిస్తున్నాడు. తన తపోబలంతో నిత్యయవ్వనుడై ఆటపాటలతో మునిగి తేలుతున్నాడు. ఇప్పుడు మనం వింటున్న పాటలు, వాద్యగోష్టి, మువ్వల సవ్వడి, అంతా ఆయన ఇంటిలోనుంచి వస్తున్నదే' అని చెప్పాడు.

ఆ విషయాలు విన్న, వారందరూ చాలా ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ప్రయాణం కొనసాగించి, అక్కడికి దగ్గరగా వున్న ఒక ఆశ్రమంలో ఆ రాత్రికి విశ్రమించారు. అలా అలా ఆ అడవులలో తిరుగుతూ ఎన్నెన్నో ఆశ్రమాలు చూశారు. వెళ్ళిన చోటల్లా మునుల కష్టసుఖాలు విచారిస్తూ, వారి సౌకర్యాలు, వసతులు, పరిశీలిస్తూ వారి కవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, కొన్నిచోట్ల సంవత్సరం, కొన్నిచోట్ల తొమ్మిదినెలలు, ఇంకొన్నిచోట్ల మూడు లేక నాలుగు నెలలు, మరికొన్నిచోట్ల ఎనిమిది నెలలు, ఇలా ఆయా ఆశ్రమాల్లో నివశిస్తూ,

వారి యాగాలు సంరక్షణ చేస్తూ, వారితోపాటే, తిని, తాగి, కాలక్షేపం చేస్తూ, సీతారామలక్ష్మణులు, వారివెంట వచ్చిన మునులు పదిసంవత్సరాలు ఆనందంగా గడిపేశారు. ఇలా దండకారణ్యమంతా తిరిగాక మళ్ళీ వెనక్కి తిరిగి సుతీక్ష్ణుడి ఆశ్రమానికి వచ్చేశారు.

రాముడు సుతీక్ష్ణ మహామునికి ప్రణమిల్లి, ముని పుంగవా, తమరి అనుగ్రహం వల్ల, నిరాటంకంగా, ఈ వనప్రాంతాలన్నీ తిరిగి, సురక్షితంగా మళ్ళీ మీ ఆశ్రమానికి వచ్చాము. ఇపుడు నేను, సీతతోటీ లక్ష్మణుడితోటీ అగస్త్యముని ఆశ్రమం చూడాలనుకుంటున్నాను. కనుక, ఆ ఆశ్రమానికి దారి చూపవలసినదిగా కోరుతున్నాను' అని అడిగాడు.

సుతీక్ష్ణుడు సంతోషించి, 'రామా నేను కూడా నీకు ఆ సంగతే చెబుదామనుకుంటున్నాను. నువ్వు తప్పకుండా ఆయనను సందర్శించి, ఆయన దీవెనలు తీసుకో' అంటు అగస్త్యముని ఆశ్రమానికెలావెళ్ళాలో వివరించి చెప్పాడు.

ఆయన చెప్పిన గుర్తుల ప్రకారం వెళ్ళి, వారు, ముందుగా అగస్త్యుని సోదరుని ఆశ్రమం చేరుకున్నారు. ఎంతో మనోహరమైన ఆ ఆశ్రమం తమ్ముడికి చూపిస్తూ, 'చూశావా లక్ష్మణా! అగస్త్యభ్రాత ఆశ్రమం ఎంత రమణీయంగా వుందో, దీనికి ఒక విశిష్ఠమైన కథ వుంది, చెప్తాను విను.

పూర్వము, వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు వుండేవారు. వాళ్ళిద్దరూ అన్నదమ్ములు, చాలా దుష్టులు. ప్రతిరోజూ ఇల్వలుడు ఒక బ్రాహ్మణుని రూపం ధరించి, సంస్కృతం మాట్లాడుతూ, ఆ దారినపోయే బ్రాహ్మణులను శ్రాద్ధానికి రమ్మని ఆహ్వానించేవాడు. (ఆ రోజులలో బ్రాహ్మణులకి శ్రాద్ధ సమయంలో మేక మాంసం వండిపెట్టడం ఆచారంగా వుండేది) ఇల్వలుడు ఆ బ్రాహ్మణులను భోజనానికి కూర్చోబెట్టి, మేకగా మారిన వాతాపిని ముక్కలుగా కోసి వండి వారికి వడ్డించేవాడు. వారు సుష్టుగా భోజనం చేశాక, 'వాతాపీ బయటకి రా' అని పిలిచేవాడు. వెంటనే వాతాపి మేకలా అరుస్తూ ఆ బ్రాహ్మణుని పొట్ట చీల్చుకుని బయటకు వచ్చేవాడు. ఆ తర్వాత చచ్చిపోయిన ఆబ్రాహ్మణులను ఆ అన్నదమ్ములిద్దరూ తాపీగా ఆరగించేవారు. ఆ దురాగతం చూడలేక వారిని శిక్షించవలసినదిగా దేవతలు అగస్త్యుని ప్రార్థించారు. అగస్త్యుడు కావాలనే ఒకరోజు ఆ రాక్షసులుండే ప్రదేశములో సంచరిస్తూ వారి కంటబడ్డాడు. ఎప్పటిలాగే ఇల్వలుడు, బ్రాహ్మణరూపం ధరించి, అగస్త్యుని శ్రాద్ధ భోజనానికి పిలిచాడు. మేకరూపంలో వున్న తమ్ముణ్ణి చంపి కూరగా వండిపెట్టాడు. అగస్త్యుడు భోజనం చేసి వాతాపి జీర్ణం - వాతాపి జీర్ణం అని వాతాపిని పొట్టలో జీర్ణం చేసేసుకున్నాడు.

ఆ సంగతి తెలియని ఇల్వలుడు తమ్ముణ్ణి రమ్మని పిలిచాడు. అగస్త్యుడు నవ్వి, నీ తమ్ముడు తిరిగిరాడు. వాడు జీర్ణమైపోయాడు' అన్నాడు.

ఇల్వలుడు ఆగ్రహం పట్టలేక, అగస్త్య మహర్షిమీద పడ్డాడు. అగస్త్యుడు తన తపశ్శక్తితో వాడ్ని భస్మం చేసేశాడు. ఈ విధంగా ఆ మహానుభావుని దయవల్ల వాతాపి ఇల్వలుల పీడ ఈ లోకానికి విరగడైంది. ఆనాడు వారు హతులైన ప్రాంతమే ఈ అగస్త్యభ్రాత ఆశ్రమం' అని చెప్పాడు.

ఇలావారు మాట్లాడుకుంటుండగా, సాయంకాలమైనది. వారు సాయంసంధ్యా కార్యక్రమాలు పూర్తిచేసుకుని, సీతతో కూడా ఆశ్రమంలోకి వెళ్ళి అగస్త్యభ్రాతని దర్శించారు. ఆ మహాముని వారిని సాదరంగా ఆహ్వానించి, సత్కరించాడు. ఆరాత్రి వారక్కడ విశ్రమించారు. మర్నాడు ఉదయం అగస్త్యముని ఆశ్రమానికి దారి తెలుసుకుని, బయల్దేరారు. దారిపొడుగునా పూలతో నిండిన లతలు, చెట్లు చూస్తూ నడిచివెళ్ళారు. దారిలో ఏనుగులు, ఉల్లాసంగా చెట్లు విరిచేస్తూ విహరించటం, చెట్లమీద కోతులు గెంతుతూ, ఊగుతూ ఆడుకోవడం చూసి నవ్వుకున్నారు. అన్నివైపులనించీ హోమధూపములు ఆకాశంలోకి ఎగుస్తూ కనిపించాయి.

అపుడు రాముడు లక్ష్మణునితో 'తమ్ముడూ, మనం అగస్త్యముని ఆశ్రమం దగ్గరగా వచ్చేసాం. అదిగో అటు చూడు. ఆకాశం అంతా వ్యాపిస్తున్న యాగధూమం చూశావా? అగస్త్యుడు చాలా మహానుభావుడు. ఒకప్పుడు వింధ్యపర్వతము, సూర్యకిరణాల్ని నిరోధిస్తూ పైకి లేస్తూండేది. ఆ సంగతి కనిపెట్టి, అగస్త్యుడు, తాను ఉత్తరదిశనించి, దక్షిణానికి వస్తూ, తాను మళ్ళీ ఉత్తరదిశగా వెళ్ళేవరకూ, ఆ పర్వతాన్ని ఎదగవద్దని, ఆజ్ఞాపించి, తాను దక్షిణదిశలోనే ఉండిపోయాడు. ఆ విధముగా పర్వతం బాధనించి ప్రజల్ని కాపాడాడు. అగము అంటే పర్వతం. దానిని ఎదగకుండా నిరోధించాడు కనుక అగస్త్యుడు అని ప్రసిద్ధి చెందాడు. ఆ కారణంగానే దక్షిణదిశకి అగస్త్యదిశ అని పేరు వచ్చింది. ఆయన గొప్పశక్తి సంపన్నుడు. అందుకే రాక్షసులు ఈ ప్రాంతంలో సంచరించడానికి భయపడతారు. పుణ్యాత్ముడైన ఈ ముని రాక చేత, ఇక్కడ శాంతి భద్రతలు నెలకొన్నాయి. ఇక్కడ చెట్లకి మునులు ధరించే బట్టలు కట్టబడి వున్నాయి చూశావా.

దైవారాధన అయ్యాక తీసిపారేసిన పువ్వులు అక్కడక్కడ పడివున్నాయి. ఇది తప్పక అగస్త్యముని ఆశ్రమమే అయి వుంటుంది. నువ్వు ముందుగా వెళ్ళి మనం వచ్చామని, ఆయనతో నివేదించిరా' అన్నాడు.

అన్నగారి ఆజ్ఞని అనుసరించి, లక్ష్మణుడు, ఆశ్రమంలోకి వెళ్ళాడు. ఒక శిష్యుణ్ణి పిలిచి 'దశరథ పుత్రుడైన శ్రీరాముడు, సీతమ్మతో కలసి, మీ దర్శనార్థం వచ్చి బయట వేచియున్నాడని, అగస్త్య మహామునితో చెప్పమని కబురు చేశాడు. ఆ శిష్యుడు లోపలికి వెళ్ళి శ్రీరాముని రాకను ఆ మహామునికి నివేదించి, తిరిగి వచ్చి, ద్వారం దగ్గర వున్న సీతారాముల్ని, లక్ష్మణుణ్ణి సాదరంగాలోనికి ఆహ్వానించాడు. రాముడు, సీత, లక్ష్మణుడు ఆశ్రమంలో ప్రవేశించారు.

ఆ ఆశ్రమంలో బ్రహ్మ, అగ్ని, కుబేరుడు, ధాతవిధాత, సోముడు, భృగుడు, వాయువు, విష్ణువు, మహేంద్రుడు, సూర్యుడు, నాగరాజు, అనంతుడు, గాయత్రి, వసువు, వరుణుడు, కార్తికేయుడు, ధర్మరాజు మొదలుగా గల, పదిహేడుగురు దేవతలు, వివిధ స్థానాలలో ప్రతిష్ఠించబడి, ఆరాధించబడడం వారు గమనించారు.

అగస్త్యుడు, శిష్యులతో కలిసి రాముడికి ఎదురుగా వచ్చి, సాదరంగా ఆహ్వానించాడు. రామలక్ష్మణులు, సీత, ఆయన పాదాలకి నమస్కరించారు.

అగస్త్య మహర్షి వారిని యథోచితంగా సత్కరించి, అర్ఘ్యము, పాద్యము సమర్పించాడు. కుశల ప్రశ్నలు వేశాడు. ఆసనాలు చూపించి, కూర్చోమన్నాడు. మధురములైన పండ్లు, రుచికరములైన కందమూలములు పెట్టి విందు చేశాడు. వారు సేదదీరి విశ్రమించాక, రామునితో ఇలా అన్నాడు.

'రామా అతిథులు వచ్చినప్పుడు, అగ్నిలో హోమము చేసి, అర్ఘ్యము నిచ్చి గౌరవించాలి. అలా చెయ్యకపోతే, పరలోకానికి వెళ్ళాక, దొంగ సాక్ష్యం చెప్పేవాడిగతిని పొందవలసి వస్తుంది. నువ్వు సామాన్యుడివి కావు. మహారాజువి. సర్వలోకాలకి పూజ్యుడివి. ధర్మమూర్తివి. మా ప్రియ అతిథివి' అని అంటూ, రామా, నా దగ్గర పూర్వము విశ్వకర్మ విష్ణువు కోసం నిర్మించిన ధనస్సు వుంది. ఇది వైష్ణవ ధనువు. బంగారంతో రత్నాలు పొదిగి చెయ్యబడినది. అమోఘమైన ఈ ధనుస్సు, రెండు అక్షయతూణీరపొదులు నీకు ఇవ్వమని దేవేంద్రుడు నా దగ్గర వుంచివెళ్ళాడు. ఈ రెండు అమ్ములపొదులూ ఎపుడూ అక్షయతూణీరాలతో నిండివుంటాయి. ఇదిగో ఈ బంగారు పిడి కలిగిన కత్తి కూడా ఇచ్చాడు.

రాక్షసుల్ని సంహరిస్తానని తాపసులకి వాగ్దానం చేశావు కదా. అందుకని వీటిని తీసుకో. జయము కలుగుతుంది. నీ అభీష్టం సిద్ధిస్తుంది' అని చెప్పి ఆశీర్వదించి, వాటిని శ్రీరామునికి సమర్పించాడు. రాముడు పరమానందంతో వాటిని స్వీకరించాడు.

అగస్త్యుడు రాముణ్ణి ఆశీర్వదించి, 'రామా నీ ధర్మపత్నితో, లక్ష్మణునితో

నన్ను పూజించడానికి వచ్చావు. నాకు చాలా సంతోషంగా వుంది. మీరు ముగ్గురూ మార్గాయాసంతో చాలా అలసివున్నారు. అతి సుకుమారియైన సీత విశ్రాంతి కోరుకుంటోంది. రాకుమారా, సామాన్యంగా లోకంలో స్త్రీలు చంచలమైన మనస్సు కలిగివుంటారు. శస్త్రములా పదునుగానూ, వాయువులా చంచలంగానూ, గరుడునిలా వేగంగా, వారి మనస్సులు క్షణ క్షణం మారుతూ వుంటాయి. కాని నీ భార్య జానకి మాత్రం, నీ మీద ప్రేమతో ప్రతిక్షణం నిన్నంటిపెట్టుకుని, నీ తోడిదెలోకంగా వుంది. అరుంధతిలా ఈమె మహా పతివ్రత. ధర్మవర్తనులైన మీ రాకతో, నా ఆశ్రమం మంగళప్రదమైనది' అని అగస్త్యుడు ప్రశంసించాడు.

'ఆర్యా, మీ అనుగ్రహము వల్ల నేను ధన్యుడనైనాను. మీ ఉన్నతమైన సంస్కారము చేత మాత్రమే మీరు మా గుణాల్ని ప్రశంసిస్తున్నారు. అంతే కాని, అది మా గొప్పతనం కాదు. కాని నా విన్నపం ఒకటి ఆలకించండి. మేము ఈ వనములోనే, అనుకూలమైనచోట, నీరు పుష్కలంగా లభించే అందమైన ప్రదేశంలో ఒక ఆశ్రమం నిర్మించుకుందామనుకుంటున్నాము. దయవుంచి అలాంటి ప్రదేశం మాకు చూపించండి' అని చేతులు జోడించి ప్రార్థించాడు రాముడు. అగస్త్యుడు ఒక్క క్షణం ఆలోచించాడు.

ఆ తర్వాత ఇలా అన్నాడు. 'ఈ ప్రదేశం అంతా రాక్షసుల బాధ చాలా ఎక్కువగా వుంది. కాని, రామా, ఇక్కడికి రెండు యోజనాల దూరంలో పంచవటి అని ఒక ప్రదేశం వుంది. అది చాలా చక్కనిచోటు. పండ్లు, మంచినీరు, సమృద్ధిగా దొరకుతాయి. అక్కడ లేళ్ళు కూడా చాలా ఎక్కువ. వాటితో మీకు చక్కని కాలక్షేపం కలుగుతుంది. అక్కడికి వెళ్ళి ఆశ్రమం నిర్మించుకుని సుఖంగా వుండండి. ఇప్పటికే మీ తండ్రిగారు నిర్దేశించిన వనవాసంలో చాలాభాగం గడచిపోయింది. నీలాంటి జ్యేష్ఠకుమారుణ్ణి కన్న దశరథ మహారాజు ధన్యుడు. నా తపోశక్తి చేత, అయోధ్యలో జరిగిన వృత్తాంతం యావత్తు తెలుసుకున్నాను. వనవాసంలో మిగిలిన సమయాన్ని గడిపేందుకు, పంచవటి చాలా అనువైన ప్రదేశం. అక్కడ దగ్గరలోనే పావనమైన గోదావరీనది ప్రవహిస్తోంది. అక్కడ మీరుంటే తాపసులకి రక్షణగా కూడా వుంటుంది' అని ఆయన చెప్పగానే రామలక్ష్మణులు ఆయనకి పాదాభివందనం చేసి బయల్దేరారు. సీత కూడా వారి వెంట నడిచినది.

అగస్త్యుడు వారి వెంట కొంతదూరం వచ్చి 'రామా ఆ కనబడే విప్పచెట్లు చూశావా, అటునుంచి ఉత్తరదిశగా వెళ్తే ఒక పెద్ద మఱ్ఱిచెట్టు కనబడుతుంది. దాని తర్వాత ఎత్తైన సమతలప్రదేశం కనిపిస్తుంది. అక్కడ చెట్లు వుండవు. ఆ

పర్వతం దాటివెళ్తే పంచవటి కనిపిస్తుంది. అక్కడి చెట్లన్నీ పూలతో నిండి అందంగా వుంటాయి' అని గుర్తులు చెప్పి సాగనంపాడు.

అమ్ములపొదులు కట్టుకుని, చేతిలో విల్లు ధరించి, సీతతో కలసి మహర్షి చెప్పిన దారిలో నడిచివెళ్ళారు రామలక్ష్మణులు. అలా వారు నడిచివెళ్తుంటే దారిలో వారికి బలిష్ఠమైన ఒక గ్రద్ద కనిపించింది. అది ఒక పెద్ద మఱ్ఱిచెట్టు కొమ్మమీద కూర్చుని వుంది. అంత పెద్ద గ్రద్దని చూసి వారు మారువేషములో వున్న రాక్షసుడేమోనని అనుకున్నారు.

ఎవరునువ్వు? అని గద్దించి అడిగారు. అది వినయంగా, తియ్యని స్వరంతో, 'రాకుమారులారా నేను మీ తండ్రిగారైన దశరథ మహారాజు మిత్రుడ్ని' అంది.

తండ్రి మిత్రుడ్ని అని చెప్పగానే, వారు చాలా ఆనందించారు. 'ఆర్యా మీ వంశమేది? మీ పేరేమిటి?' అని అడిగారు అపుడాపక్షి తన వంశవృత్తాంతం వివరంగా చెప్పింది.

'ఈ సృష్టి మొదట్లో ప్రజాపతుల ద్వారా జరిగింది. అట్టి ప్రజాపతులలో మొట్టమొదటి వాడు కర్దముడు. రెండవ వాడు విక్రేతుడు. ఆ తర్వాత క్రమంగా శేషువు, సంశ్రయుడు, స్థాణువు, మరీచి, అత్రి, క్రతువు, పులస్త్యుడు, అంగీరసుడు, ప్రచేతసుడు, పులహుడు, దక్షుడు, వివస్వంతుడు, అరిష్టనేమి, అనే పేర్లతో మరికొందరు ప్రజాపతులు ఉద్భవించారు. దక్షప్రజాపతికి అరవైమంది కుమార్తెలు జన్మించారు. వారిలో నుండి ఎనిమిది మంది కన్యలని ఆఖరి ప్రజాపతియైన కాశ్యపుడు వివాహం చేసుకున్నాడు.

కాశ్యపుని వలన అదితియందు దేవతలు, దితి యందు రాక్షసులు పుట్టారు.

ఇపుడు మనం చూస్తున్న చరాచర జగత్తు అంతా దక్షప్రజాపతి కూతురుల సంతానమే. మనవుయందు మనుష్యులు పుట్టారు. వినత అనే ఆమెకి గరుడుడు, అరుణుడు అని ఇద్దరు పక్షులు కలిగారు. గరుడుడు ఆది మహావిష్ణువుకి వాహనమయ్యాడు. ఆగరుడుడే నా తండ్రి. అరుణుడికి సంపాతి అనే కొడుకు పుట్టాడు. మేమిద్దరం పక్షిజాతివారము. సంపాతి నా అన్నయ్య. నా పేరు జటాయువు. నీ తండ్రి నాకు మిత్రుడు కనుక ఈ వనవాసకాలంలో మీకు నేను తోడుగా వుంటాను.

ఈ అడవి చాలా దుష్కరమైనది. ఇక్కడ మృగాలు, రాక్షసులు విచ్చలవిడిగా సంచరిస్తూ వుంటారు. కనుక మీ అన్నదమ్ములిద్దరూ బయటకు వెళ్ళినప్పుడు, నేను సీతని సంరక్షిస్తూ వుంటాను' అని చెప్పింది.

ఆ మాటలకి సంతోషించి, రామలక్ష్మణులు సీతకి తోడుగా జటాయువుని తీసికెళ్ళారు. అందరూ కలిసి పంచవటిని ప్రవేశించారు. అపుడు రాముడు లక్ష్మణునితో 'సౌమిత్రీ అగస్త్యులవారు చెప్పిన పంచవటి ఇదే. ఈ ప్రదేశం ప్రకృతి అందాలతో చాలా రమణీయంగావుంది. నువ్వు ఈ ప్రదేశమంతా పరిశీలించి చూసి, ఆశ్రమం ఎక్కడ నిర్మించుకుంటే బాగుంటుందో చూడు. పండ్లు, పూలు, దర్భలూ సమృద్ధిగా దొరికేచోట, గోదావరితీరంలో అన్నివిధాలా అనుకూలమైన చోట నిర్మించుకుందాం' అని అన్నాడు. లక్ష్మణుడు వినయంగా చేతులు జోడించి

'అన్నయ్యా, ఇప్పటిదాకా ప్రతీపనీ నీ ఆదేశానుసారమే చేస్తున్నాను. కనుక స్వతంత్ర్యంగా ఆలోచించే శక్తి నాకు లేదు. నువ్వే పరిశీలించి, నివాసయోగ్యమైన చోటు చూసి నాకు చెప్పు' అన్నాడు.

చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్న తమ్ముని మాటలు విని, రాముడు చాలా ముచ్చట పడ్డాడు. లక్ష్మణున్ని వెంటబెట్టుకుని వెళ్ళి ఆ ప్రదేశమంతా పరిశీలించాడు. ఒకచోట, గోదావరి తీరంలో తామర కొలను ఒకటి కనిపించింది. ఆ కొలనుమీదుగా చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. ఆ పరిసరాల ప్రదేశమంతా సమతలంగా వుంది. అక్కడ నెమళ్ళు పురివిప్పి ఆడుతున్నాయి. లేళ్ళు ఛెంగు ఛెంగున గెంతుతున్నాయి. ఆ దృశ్యం చూడముచ్చటగా వుంది. దాపునే కొండలు, గుహలు వున్నాయి. ఆ కొండల మీద రంగురంగుల ధాతువులు, బంగారు, వెండి, రాగి రంగులలో మెరుస్తున్నాయి. ఆ ప్రదేశం రాముడికి చాలా నచ్చింది. అక్కడే ఆశ్రమం నిర్మించుకుని జటాయువుతో సహా నివసిద్దాం' అన్నాడు.

అన్నగారి ఆదేశానుసారం లక్ష్మణుడు మట్టి తవ్వి నీళ్ళుపోసి కలిపి ముద్దలుగా చేసి, గోడలు, స్థంభాలు ఏర్పరచి, పైకప్పుగా వెదుర్లు కట్టి వాటిమీద జమ్మి మొదలైన కొమ్మలు తెచ్చి చక్కగా పరిచాడు. వాటిమీద రెల్లుగడ్డి, దర్భలు, దట్టంగా పరిచాడు. అవి ఎగిరిపోకుండా మళ్ళీ పైన కొమ్మలు పరచి బలంగా లాగి కట్టాడు. లోపల నేల అంతా శుభ్రం చేసి నీరుచల్లి, తడిపి, చదునుచేసి, ఎత్తుపల్లాలు లేకుండా నున్నగా చేశాడు. ఇదంతా చాలా సునాయాసంగా చాలా కొద్దిపాటి సమయంలో చేశాడు. ముచ్చట గొలిపే పర్ణశాల తయారైంది.

తర్వాత వాళ్ళు ముగ్గురు గోదావరీ నదికి వెళ్ళి, కాళ్ళు చేతులు కడుక్కుని శుచిగా స్నానాలు చేసి, తయారైయ్యారు. లక్ష్మణుడు తామరకొలనులో కొన్నిపూలు, వృక్షాల నించి కొన్నిపళ్ళు తెచ్చాడు. ఆశ్రమంలో పంచభూతాల్ని, అష్టదిక్పాలకుల్ని, వాస్తు దేవతల్ని ఆ పూలతో అర్చించారు. శాంతి కార్యక్రమం అయ్యాక లక్ష్మణుడు సీతారాముల్ని ఆ కుటీరం లోపలికి తీసికెళ్ళి చూపించాడు. ఎంతో నైపుణ్యంతో

నిర్మించిన, ఆ పర్ణశాలని చూసి రాముడు చాలా సంతోషించాడు. ఆనందంతో గట్టిగా కౌగిలించుకుని, 'లక్ష్మణా ఎంత చక్కగా నిర్మించావు. నిన్ను మెచ్చుకుని ఇవ్వటానికి నా దగ్గరేమీ లేదు కదా. ప్రస్తుతం మనిద్దరికీ ప్రియమైన ఈ కౌగిలింత మాత్రం ఇస్తున్నాను. తమ్ముడూ, నాన్నగారు మనని విడిచి పోయారన్న దిగులు నాకు లేదు. నన్నింత ప్రాణప్రదంగా చూస్తున్న నీలోనె నాకు నాన్నగారు కనిపిస్తున్నారు. ఈ ఆశ్రమ నిర్మాణంలో నీలో వున్న ధర్మజ్ఞత, భావజ్ఞత, కృతజ్ఞత ప్రతిబింబిస్తున్నాయి. అని ఎన్నివిధాలో మెచ్చుకున్నాడు.

సీతారామలక్ష్మణులు యధావిధిగా, ఆ పర్ణశాలలో గృహప్రవేశం చేశారు. ఆ తర్వాత చాలా కాలం అక్కడే సుఖంగా వున్నారు.

కొంతకాలం గడిచింది. శరత్కాలము గడిచి హేమంత ఋతువు ప్రవేశించింది. ఒకనాడు తెల్లవారుఝామున లేచి సీతా, రాముడు, లక్ష్మణుడు, గోదావరినదిలో స్నానానికి బయల్దేరారు. దారిలో లక్ష్మణుడు రామునితో ఇలా అన్నాడు.

'అన్నయ్యా నీకెంతో ఇష్టమైన హేమంత ఋతువు వచ్చింది. చూడు, అక్కడ గడ్డిపరకల మీద మంచు కురిసి, మంచి ముత్యాల్లా మెరుస్తోంది. చూశావా? ఈ చలికి, నీళ్ళు ముట్టుకోవాలంటే భయంగా వుంది. ఎంతసేపైనా, నిప్పుసెగని కూర్చోవాలనిపిస్తోంది. రైతులు, కొత్తపంట చేతికి వచ్చి, ఆ కొత్తధాన్యం వండి అగ్నిదేమునికి ఆహుతులనిచ్చి, ఆనందంతో పొంగిపోతూ వుంటారు. పాడిపంటలతో గ్రామసీమలు కలకలలాడుతూ వుంటాయి. రాజులు దండ యాత్రలకి బయల్దేరే కాలమిదే. హిమాలయాలు మంచుతో కప్పబడి వున్నాయి. ఈ చల్లగాలులకి తాళలేక వెచ్చటి ఎండలో తిరగాలని వుంది. ఈ చలికి అడవిలో మృగసంచారం కూడా అట్టే కనిపించడం లేదు. పుష్యమాసం దగ్గర పడింది కదా. ఇంకిప్పుడు మేడలమీదా, మిద్దెలమీదా ఎవ్వరూ పడుకోరు. అందరూ వెచ్చగా కప్పుకుని ఇళ్ళల్లో పడుకుంటారు. ఈ చలికాలం రాత్రి సమయం కూడా ఎక్కువ. మంచుతెరల వెనుక చంద్రుడు వెలవెల బోతున్నాడు. మనం అడవులలో వుండి చలిబాధపడడం సహజమే. కాని ధర్మాత్ముడైన భరతుడు, పట్టణంలో వుండి కూడా, నీ ఎడబాటు వల్ల కలిగే దుఃఖంతో, నీ మీది భక్తితో తాపసవృత్తిలో జీవిస్తున్నాడు. రాజ్యభోగాలు త్యజించి, నేలమీద పడుకుంటున్నాడు. తెల్లవారు ఝామున మంత్రులతో కలసి సరయూనదికి వెళ్ళి, చల్లని నదీజాలాలతో, స్నానం చేస్తున్నాడు. ఎంతో సుఖంగా పెరిగినవాడు. ఈ బాధలన్నీ ఎలా సహిస్తున్నాడో కదా. సామాన్యంగా పశువులు తండ్రిని పోలివుంటాయనీ, మనుష్యులు తల్లిని

పోలి వుంటారనీ, ఒక నానుడి వుంది. కాని అందుకు భిన్నంగా భరతుడు తల్లిపోలిక ఇసుమంత కూడా లేకుండా పుట్టాడు. ధర్మమూర్తి అయిన దశరథ మహారాజుకి భార్యయై, సాధువర్తనుడైన భరతుని లాంటి కుమారుని తల్లియై కూడా కైకేయి, అంతటి క్రూరస్వభావురాలు ఎల అయిందో కదా' అంటు లక్ష్మణుడు కైకేయిని నిందించసాగాడు. ఈ మాటలు విని రాముడు సహించలేక,

'లక్ష్మణా కైకేయిని నిందించి ఏం లాభం? నిజానికి ఆమె దోషమేమీ లేదు. అయినా భరతుడి గురించి ప్రస్తావిస్తూ మధ్యలో ఆమెనెందుకు దూషిస్తావు? నిజంగా నీకు భరతుడంటే ప్రేమవుంటే అతడి తల్లిగా ఆమెని నువ్వు గౌరవించాలి. ఇంతకీ భరతుడు అయోధ్యకి తిరిగి వచ్చి రాజ్యం స్వీకరించమంటే నేనే కదా నిరాకరించాను. కనుక ఇదంతా మన స్వయంకృతమే కాని ఎవ్వరినీ నిందించవలసిన పనిలేదు. తమ్ముడూ, భరతుడికి నేనంటే ఎంతప్రేమ. అది తల్చుకుంటుంటే ఇప్పుడే వెళ్ళి భరతుణ్ణి చూడాలని వుంది సుమా.

ఆనాడు చిత్రకూటములో భరతుడు పలికిన పలుకులు నాకు మాటిమాటికీ గుర్తు వస్తున్నాయి. మనం మళ్ళీ ఎన్నాళ్ళకి భరతుణ్ణి, శతృఘ్నుణ్ణి చూస్తామో కదా. నువ్వూ సీతా నా వెంట వున్నా వాళ్ళిద్దరూ లేని లోటు నాకు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది' అని రాముడు పరిపరివిధాల బాధపడ్డాడు.

ఇంతలో వారు గోదావరీ నదిని సమీపించారు. వారు ముగ్గురూ పవిత్ర గోదావరీ జలాలలో స్నానం చేశారు. ఆ తర్వాత రామలక్ష్మణులు యధావిధిగా పితృతర్పణం చేశారు. దేవతలందర్నీ స్తోత్రం చేశారు. ఆ తర్వాత ఆశ్రమానికి తిరిగి వెళ్ళారు. అంతలో చుట్టుప్రక్కల మునులందరూ వచ్చి అక్కడ సమావేశమయ్యారు. రామలక్ష్మణులు బ్రహ్మయజ్ఞము మొదలైనవి పూర్తిచేసి వారిదగ్గర కూర్చున్నారు. వారంతా కలసి వివిధములైన పురాణములు, ఇతిహాసాలు గురించి చర్చించుకున్నారు.

ఈ విధంగా పంచవటిలో వున్న మునులు, ఋషులు, అందరూ రాముని సేవిస్తూ ఎటువంటి భయాలు లేకుండా సుఖంగా వున్నారు. రాముడు, లక్ష్మణుడు, సీత, తాము నిర్మించుకున్న పర్ణశాలలో సుఖంగా వుంటూ, నిరంతరం ఏవో ప్రసంగాలతో కాలక్షేపం చేస్తూ అక్కడ దొరికిన మధురమైన ఫలములు తింటూ హాయిగా వుంటున్నారు. మరికొంతకాలం సునాయాసంగా గడిచిపోయింది.

ఒకనాడు వారు ముగ్గురు అలాగే ఆశ్రమంలో సరస సల్లాపాలతో, వుండగా, అకస్మాత్తుగా ఒక రాక్షసి అక్కడికి వచ్చింది. ఆమె రావణుని సోదరియైన శూర్పణఖ.

దూరంనించే నవమన్మధాకారుడైన శ్రీరాముని చూసి మోహపరవశురాలైంది. బానంత కడుపుతో, బిరుసైన దుబ్బులాంటి తలకట్టుతో, దారుణమైన ప్రవృత్తిగల ముసలిది. కర్ణ కఠోరమైన కంఠస్వరము గలది. దాన్ని చూడగానే అసహ్యం కలుగుతుంది. అందుకు పూర్తి భిన్న ప్రవృత్తి గల రామునితో అది ఇలా అంది.

'అందగాడా మీరెవరు? తాపస వేషములో వుండి కూడా విల్లు బాణాలు ధరించివున్నారు? భార్యతో కూడా ఈ దుర్భేద్యమైన అడవిలో ఎందుకు నివసిస్తున్నారు? ఇక్కడంతా రాక్షసులు సంచరిస్తారని తెలియదా? మీలాంటి మహా పురుషులుండ దగ్గ చోటుకాదిది. అయినా మీరు ఇక్కడ నివాస మేర్పరచుకుని వుంటున్నారనుకుంటాను. ఆ కారణమేమిటో కొంచం చెప్తారా? అంది.

రాముడు ఆ రాక్షసితో మాటలేమిటిలే అని ఉదాసీనంగా వుండకుండా నిష్కల్మషమైన మనస్సుతో ఉన్నదున్నట్లు చెప్పాడు. 'అమ్మా నేను దశరధ మహారాజు కుమారుడిని. నా పేరు రాముడు. ఇతడు నా తమ్ముడు లక్ష్మణుడు. ఈమె నా భార్య సీత. మేము సుక్షత్రియులం. నా తండ్రి ఆజ్ఞపై, ధర్మాచరణ నిమిత్తం, నా భార్యాతమ్ములతో ఈ అడవికి వచ్చాను. చూడగా నువ్వు రాక్షస స్త్రీలా వున్నావు. నువ్వెవరు? ఇక్కడికెందుకు వచ్చావు? అని అడిగాడు. రాముడు తియ్యగా మాట్లాడడం చూసి శూర్పణఖ చాలా సంతోషించింది.

'అయ్యా నాపేరు శూర్పణఖ. నేను కామరూపం గల రాక్షస స్త్రీని. ఏ వేషం కావాలనుకుంటే, ఆ రూపం ధరించగలను. విశ్రవసుని కుమారుడైన రావణుడు మా అన్నయ్య మహావీరుడు. నాకింకా కుంభకర్ణుడు, విభీషణుడు అని సోదరులున్నారు. వారిద్దరూ కూడా మహాబలము గలవారు. నా చిన్న సోదరుడు విభీషుణుడు మాత్రం ధర్మాత్ముడు. ఖరధూషణులు అనె ఇంకో ఇద్దరు సోదరులు కూడా వున్నారు వారు కూడా మహావీరులు. ప్రస్తుతం ఈ అరణ్యంలోనే వున్నారు. వారెంత చెప్పినా వినకుండా, నీ అందం చూసి సమ్మోహితురాలనై, నీ భార్యగా వుందామని వచ్చాను. నాకు చాలా దివ్యశక్తులున్నాయి. ఎంతో ఆశతో వచ్చిన నన్ను కాదనకు. నీ భార్యగా స్వీకరించు. ఎన్నో భోగాలు అనుభవిద్దాము. ఈ అనాకారి అయిన సీత, నీకు తగిన భార్య కాదు. లోతైన కడుపు, కృశించిన అవయవాలతో చాలా వికృతంగా వుంది. నేనిపుడే ఈ సీతని, లక్ష్మణుని విరుచుకు తినేస్తాను. తర్వాత మనిద్దరం హాయిగా, ఈ కొండచరియలమీదా, పర్వతశిఖరాల మీదా, అందమైన ఈ అడవిలోనూ సుఖంగా విహరిద్దాం' అంటు ఉన్మత్తురాలిలా పలికింది. దాని మాటలు విని రాముడు నవ్వి, చాలా చమత్కారంగా ఇలా అన్నాడు.

'అమ్మా నేను పెండ్లిఅయినవాడను. నా భార్య నా దగ్గరే వుంది. అంతే కాదు. నా భార్య అంటే నాకు చాలా ప్రేమ. ఆమె లేకుండా నేను బ్రతుకలేను. నీలాంటి ఉత్తమరాలుకి సవితి పోరుండకూడదు. అదిగో నా తమ్ముడు లక్ష్మణుడు. చాలా సౌశీల్యం గలవాడు. నాకన్నా అందగాడు. చాలా కాలం నించీ భార్యకి దూరంగా వున్నాడు. నీ కన్నివిధాలా తగినవాడు. ప్రస్తుతం స్త్రీ పొందుకోసం తపిస్తున్నాడు. మంచి వయసులో వున్నాడు. నీకు భర్త కాదగినవాడు. వాణ్ణి పెళ్ళి చేసుకున్నావంటే నీకు సవతి పోరుండదు. కనుక వాడిదగ్గరకి వెళ్ళు' అని.

ఆ మాటలు శూర్పణఖకి సబబుగా తోచాయి. వెంటనే లక్ష్మణుని దగ్గరకు వెళ్ళింది.

'నీ అన్నగారి మాటలు విన్నావుగా. నన్ను పెళ్ళాడు. నీ అందానికి తగిన సుందరిని నేనే. హాయిగా ఈ దండకారణ్యంలో విహరిద్దాం' అంది. లక్ష్మణుడు కూడా దాని మాటలకి నవ్వి చాకచక్యంగా ఇలా అన్నాడు.

'కోమలాంగీ, నువ్వు పొరబడ్డావు. నేను మా అన్నగారికి దాసుడను. సీతా రాములకు సేవచెయ్యటం నా కర్తవ్యం. నన్ను పెళ్ళి చేసుకుంటే, నువ్వు కూడా వారికి దాస్యం చెయ్యాలి. నీలాంటి స్వేచ్ఛాజీవులు దాస్యం చెయ్యలేరు. నీ సుకుమారమైన శరీరం సుఖాలనుభవించాడానికే గాని, ఇలా సేవలు చెయ్యడానికి పనికిరాదు. కనుక నీకన్నివిధములా తగినవాడు మా అన్నయ్యే' అన్నాడు.

ఆ మాటలతో పరిహాసం బోధపడలేదు. వెంటనే మళ్ళీ రాముని దగ్గరకు వెళ్ళింది. 'నీ తమ్ముడు చెప్పినట్లు నీకు నేనే తగిన జోడి. ఈ కురూపి భార్యతో నువ్వేం సుఖపడతావు? కాని ఈమె బ్రతికుండగా నువ్వు నన్ను ఆదరించవు. కనుక ఇప్పుడే ఈ స్త్రీని నేను తినేస్తాను. సవతి పోరులేకుండా నీతో సుఖంగా వుంటాను' అంటు కొరకొరా సీత వంకచూస్తు ఆమె మీదికి ఒక్కసారిగా దూకింది. సీత అసలేసుకుమారి. ఈ హఠాత్పరిణామానికి గజగజ ఒణికింది. రామునికి పట్టరాని కోపం వచ్చింది. ఒక్కసారిగా హూంకరించి ఆ రాక్షసిని ఒడిసి పట్టుకున్నాడు.

'లక్ష్మణా ధూర్తులతో పరిహాసమాడకూడదని తెలియదా? ఈ ధూర్తురాలు సీతని చంపబోయింది. తల వెంట్రుక వాసిలో గండం తప్పింది. ఇది చాలా మదించి వుంది. స్త్రీలను చంపటం అధర్మం. కనుక దీనిని వికృతంగా చేసి, తగిన బుద్ధి చెప్పు' అని గర్జించాడు.

లక్ష్మణుడు వెంటనే ఆవేశంతో రాముని దగ్గరున్న పదునైన కత్తి తీసుకుని,

ఆ రాక్షసి చెవులు, ముక్కులు కోసి పారేశాడు. ఒళ్ళంతా రక్తం కారుతూ అది అడవిలోకి పారిపోయింది.

హృదయవిదారకంగా అరుస్తూ, గుండెలు బాదుకుంటూ, జనస్థానంలో ఉంటున్న అన్నగారైన ఖరుడి ముందర పిడుగు పడ్డట్టు పడింది. ఉన్నవీలేనివీ కల్పించి, జరిగినదంతా చిలువలు పలవలుగా వర్ణించి చెప్పి తెలివితప్పి పడిపోయింది.

ఒళ్ళంతా నెత్తురుకారుతూ, వికారరూపంతో నేలమీదపడి పొర్లుతున్న శూర్పణఖని చూసి, ఖరుడు చాలా బాధపడ్డాడు.

'సోదరీ.... లే..... తెలివితెచ్చుకో. నిన్నిలా కురూపిగా తయారుచేసిన, ఆ దుర్మార్గుడెవరో చెప్పు. తనదారిన తానుపోతున్న కోడెత్రాచుని వేలితో నొక్కి ముప్పు కొనితెచ్చుకున్న ఆ మూర్ఖుడెవరు? నీ ఈ దుస్థితికి కారకుడెవరో, వివరంగా చెప్పు. వీరాధివీరుడైన నీ ఈ సోదరుడు, ఇపుడే వాణ్ణి చీల్చి చెండాడుతాడు' అంటూ ఆవేశంగా ఊగిపోతూ అడిగాడు ఖరుడు.

అప్పుడు శూర్పణఖ కన్నీటితో, 'సోదరా.... రామలక్ష్మణులు అనే ఇద్దరు రాకుమారులు ఒక స్త్రీతో ఈ అరణ్యంలోనే నివసిస్తున్నారు. వారి అపురూప సౌందర్యం ఎలా వర్ణించగలను? చాలా అందమైన వాళ్ళు. నవ యౌవనులు. సుకుమారులు. మహాబలశాలురు. కలువరేకుల వంటి కనులున్నవారు. నారబట్టలు, కృష్ణాజినాలు ధరించి, తాపసవృత్తిలో వున్నారు. వారిద్దరూ దశరథమహారాజు కుమారులట. దేవతలలో కూడా అంతటి సుందరులుండరు. వారి దగ్గర వున్న యువతి కూడా అందమైనదే. ఆమె పేరు సీతయట. ఆమె అందం చూడ్డానికి రెండుకళ్ళూ చాలవు. ఆమె మూలంగానే వారు నన్ను వికృతంగా చేశారు. అన్నా..... నువ్వు ఇప్పుడే ఆ అన్నదమ్ములిద్దర్ని చంపాలి. వారి రక్తం నేను త్రాగాలి. ఇదే నేను నిన్ను కోరే ఒక్కగానొక్క కోరిక' అని కసిగా చెప్పింది' (ఇక్కడ వాల్మీకి ఈ సన్నివేశాన్ని చాలా చమత్కారంగా చిత్రీకరించాడు

రాముని ఆజ్ఞపై లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులు కోసి అనాకారిగా చేశాడు. అయినప్పటికీ, ఆమె హృదయంలో చెరగని ముద్రవేసిన, ఆ రాకుమారుల సౌందర్యం, ఆమెకి మైమరపే కలిగిస్తోంది తప్ప, వారిపట్ల ఆమెకి ద్వేషం కలుగలేదు. వారిద్దరిని వర్ణిస్తూ ఆమె అన్నగారితో చెప్పిన సంగతి, వాల్మీకి అద్భుతమైన శ్లోకాలతో వర్ణించి చెప్పిన విధానం.

తరుణౌ, రూపసంపన్నౌ, సుకుమారౌ, బహోబలౌ,
పుండరీక విశాలాక్షౌ, చీరకృష్ణాజినాంబరౌ,
గంధర్వ రాజప్రతిమౌ, పార్థివవ్యఙ్జనాన్వితౌ
దేవౌవా, మానుషౌవా, తానతర్క్యయితుముత్సహే
ద్రష్టా తత్ర మయా నారీ, తయోర్మధ్యే సుమధ్యమా

ఇక్కడ, శూర్పణఖ ఔదార్యం కాదు. రామలక్ష్మణుల గొప్పతనం గోచరిస్తుంది మనకి. ఒకసారి వారి వంక చూసినవారు సమ్మోహితులై తీరవలసినదే. అంతే కాదు, వారిపట్ల ద్వేషం ఎవ్వరికీ కలుగదు. రాముడు చంద్రునిలాంటివాడు. ఆయన దర్శనం ఆహ్లాదమే కలిగిస్తుందికాని, ఆగ్రహం కలిగించదు. ఎంతటి వారినైనా సమ్మోహితుల్ని చెయ్యగల శక్తి ఆ అన్నదమ్ములకుంది. అది వారి గొప్పతనం) అని.

చెల్లెలి మాటలు విని, ఖరుడు అగ్గిలా భగ్గుమన్నాడు. వాడి దగ్గర పధ్నాలుగు వేలమంది సైన్యం, పధ్నాల్గుమంది వీరాధివీరులైన సేనాపతులు వున్నారు.

వెంటనే సేనాపతులనందరిని పిలిపించాడు. వెంటనే వెళ్ళి ఆ రాకుమారులను బంధించి తెమ్మని ఆజ్ఞాపించాడు. శూర్పణఖ దారి చూపిస్తూ ఆ పధ్నాలుగుమంది సేనాపతుల్ని రామలక్ష్మణులుండే చోటుకు తీసికెళ్ళింది. దూరం నించే వాళ్ళరాకని పసిగట్టిన రాముడు విల్లు, అమ్ములు తీసుకుని వాళ్ళకెదురుగా వెళ్ళాడు.

'లక్ష్మణా, నువ్విక్కడే వుండి మీ వదినని కనిపెట్టుకుని వుండు. నేను వెళ్ళి వాళ్ళని పరిమార్చి వస్తాను' అని చెప్పి హెచ్చరించి వెళ్ళాడు.

తిన్నగా వారిదాకా వెళ్ళి 'రాక్షసాధములారా - మేమిద్దరం అన్నదమ్ములం. దశరథ మహారాజు కుమారులం. కేవలం కందమూలాలు, ఫలములు తింటూ, నా భార్య సీతతోకలసి తాపసవృత్తిలో వున్నాము' మేమెవరినీ బాధింపదల్చుకోలేదు. అయినా మీరిలా మమ్మల్నెందుకు హింసిస్తున్నారు? మీరుపెట్టే హింసలు సహింపలేక, ఈ అరణ్యంలో మునులంతా, మిమ్మల్ని సంహరించమని, నన్ను కోరారు వారి ఆజ్ఞ పాలించడానికే ఇలా ఆయుధాలు ధరించి అడవిలో తిరుగుతున్నాము. ప్రాణాలమీద ఆశవుంటే పారిపోండి లేదా, రండి, యుద్ధం చేసి, మీ చావు కొని తెచ్చుకోండి' అన్నాడు.

ఆ మాటలు విన్న రాక్షసులు మండిపడ్డారు. శూలాలు పట్టుకుని మీదికి వచ్చారు.

'మా ప్రభువు ఖరుడు, మిమ్మల్ని చంపమని పంపాడు. అంతే కాని, నీ చేతిలో చావడానికి మేము రాలేదు. మేమింతమందిమి వున్నాము. నువ్వు ఒక్కడివి. ఒక సామాన్య మానవుడవు. మా ఎదుట నిలిచే శక్తి కూడా నీకు లేదు. ప్రగల్భాలు చాలించి కాచుకో. ఈ శూలాలు, పరిఘలు, నీ ప్రాణం తీస్తాయి' అని గర్జిస్తూ, పధ్నాలుగు మంది, పధ్నాలుగు శూలాలు రాముడి మీదకు విసిరేరు. రాముడు వెంటనే తన విల్లులో పధ్నాలుగు భాణాలు ఒక్కసారిగా సంధించి ఆ శూలాల్ని ముక్క ముక్కలు చేశాడు.

వెంటనే, క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా పధ్నాలుగు తీవ్రమైన భాణాలు వారిమీద ప్రయోగించాడు. ఆ భాణాలు ఆ రాక్షసుల గుండెలు చీల్చి చెండాడాయి. వారు తెగిన వృక్షాల్లా ఆక్రందనలు చేస్తూ నేలకూలారు. అది చూసి, శూర్పణఖ భయంతో చావుకేక వేసింది. పెద్దగా ఏడుస్తు మళ్ళీ ఖరుడి దగ్గరకు పరిగెత్తింది. జరిగినదంతా ఖరుడికి చెప్పింది.

'అన్నా నువ్వు పంపిన పధ్నాలుగు మంది వీరులనీ రాముడు ఒకేసారి పధ్నాలుగు భాణాలు వేసి చంపాడు. ఆశ్చర్యకరమూ, భయంకరమూ అయిన ఆయుద్ధం చూసి నాకు చెప్పలేని భయం వేసింది. బెదిరిపోయాను. చాలా దిగులుగా వుంది. నువ్వు తప్ప నాకెవరు దిక్కు? నీకు నిజంగా పరాక్రమం, పౌరుషం ఉంటే వెంటనే వెళ్ళి, ఆ రాముడితో తలబడి చంపు. లేదా నేను ఇప్పుడే ఇక్కడే నీ ఎదురుగా నా ప్రాణం తీసుకుంటాను. శూరుడనని బీరాలు పలకడం కాదు. మానవమాత్రులైన, వారిని చంపలేని, నీ పరాక్రమం ఎందుకు? సిగ్గుచేటు. ఈ జనస్థానంలో వున్న మన వాళ్ళందర్ని రక్షించమని, మన అన్నయ్య నిన్ను నియమించాడు. కాని దద్దమ్మలా నువ్విలా చూస్తూ వూరుకుంటే ఇక్కడుండడం అనవసరం. వెనక్కి అన్నయ్య దగ్గరకి వెళ్ళిపో. ఎందుకంటే, అత్యంత బల సంపన్నుడు, పరాక్రమవంతుడు, అయిన ఆ రాముని నువ్వు ఎదురించలేవు. ఎదిరిస్తే నీ చావుఖాయం. అయ్యో.... దశరధ నందనులైన ఆ రామలక్ష్మణులు నన్నిలా కురూపిని చేశారే. వారిని శిక్షించేవారే లేరా? అంటూ కడుపు బాదుకుంటు హోరుహోరున ఏడ్వసాగింది. నిండు సభలో శూర్పణఖ అలా మాట్లాడడంతో ఖరుడికి తల తీసేసినట్లైంది.

పౌరుషంతో లేచి నిలబడి 'సోదరీ.... రాముడు నిన్నిలా అవమానం చెయ్యడం నాకు మాత్రం బాధకాదా? ఈ అవమానం నేనూ ఓర్వలేక పోతున్నాను. సామాన్య మానవుడు. ఆ రాముని చంపడం ఎంతపని? తన తెలివి తక్కువ పనికి శిక్ష ఇప్పుడే అనుభవిస్తాడు. ముందు నువ్వు కళ్ళుతుడుచుకో. నేనిప్పుడే వెళ్ళి ఆ

రాముణ్ణి గొడ్డలితో నరుకుతాను. ఆపైన వాడి శరీరం నించి కారుతున్న నెత్తురు దోసలితో త్రాగుదువుగాని' అని చెల్లెల్ని ఊరడించాడు.

శూర్పణఖ ఆనందంతో పొంగిపోయి 'భళిభళీ' అని మెచ్చుకుంది. ఖరుడు తృప్తిపడి తన సేనాధిపతియైన దూషణుణ్ణి పిలిచాడు.

'దూషణా వెంటనే మన పధ్నాలుగు వేలమంది సైనికుల్ని ఆయత్తపరచు. నా రథము, ధనుర్బాణములు, ఆయుధాలూ అన్నీ సిద్ధం చేయించు. నేను ముందుగా బయల్దేరి ఆ రాముణ్ణి హతమారుస్తాను. మీరంతా నా వెనకాలే రండి' అన్నాడు. దూషణుడు వెంటనే ఆ ఏర్పాట్లన్నీ చేశాడు. అంతాకలసి పెద్ద ప్రవాహంలా బయల్దేరారు.

వాళ్ళందరు రక్షణ కవచాలు, ఆయుధాలు ధరించి, ముద్గరములు, పట్టిసములు, శూలములు, గొడ్డళ్ళు, కత్తులు, చక్రములు, తోమరములు, శక్తులు, పరిఘలు, గదలు, రోకళ్ళు, వజ్రములు మొదలైన తీవ్రతరములైన ఆయుధాలెన్నో వెంట తీసికెళ్ళారు. భయంకరంగా కేకలు వేస్తూ వాళ్ళలా వెళ్తుంటే ఎన్నెన్నో దుశ్శకునాలు కనిపించాయి. ఎఱ్ఱని రక్తం లాంటి నీరుతో వాన కురిసినది. ఖరుడి రథ ధ్వజంమీద గద్ద వాలింది. అన్నివేపులా చీకట్లు ఆవరించాయి. తోకచుక్కలు, పిడుగులు పడ్డాయి. ఇన్ని అమంగళమైన శకునాలు కనిపిస్తున్నా, ఖరుడు ప్రయాణం ఆపలేదు. సరికదా పరిహాసంగా నవ్వుతూ తోటి రాక్షసుల వంక చూస్తూ

'ఈ మహోత్పాతాలు చూసి ఏం భయపడకండి. నేను బలశాలిని. నా భాణాలతో ఆకాశంలోని చుక్కల్ని సైతం కొట్టగలను. ఇలాంటివేం లెఖ్ఖచేయను. ఏదెలావున్నా మదించిన ఆ రామలక్ష్మణులను మట్టుబెట్టకుండా వెనక్కి వెళ్ళను. నా సోదరి వారి రక్తం తాగుతానని కోరింది. ఆ కోరిక తీర్చాలి. నేనుండగా మీకేం భయంలేదు' అని వారికి ధైర్యం చెప్పాడు.

ఆకాశవీధిలో ఋషులు, దేవతలు, గంధర్వులు, రాముడు పధ్నాలుగు వేలమంది రాక్షసుల్ని ఎలా ముట్టుబెడతాడా అని, బారులు తీరి నిలబడి చూస్తున్నారు. వారిలో వారిలా అనుకుంటున్నారు.

'గోవులకు,బ్రాహ్మణులకు క్షేమం కలుగుగాక, పౌలస్త్యపుత్రులయిన రాక్షసులందరినీ రాముడు యుద్ధములో జయించుగాక' అని దేముని ప్రార్థిస్తూ విమానాల్లో కూర్చుని ఆతృతగా చూస్తున్నారు.

ఖరుడి మంత్రులు శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, రుధిరాశుడు, పరగుడు, కాలకార్ముకుడు, మేఘమాలి,

మహామాలి, సురసుడు, అనే పన్నెండు మంది మహాశూరులైన మంత్రులతో అతడి వెంటవున్నారు. వీరుగాక, మహాకపాలుడు, స్థూలాక్షుడు, ప్రమాథి, త్రిశరుడు, అనే వీరాధివీరులైన సేనానాయకులున్నారు. ఇలా భయంకరమైన సేనతో బయల్దేరివెళ్ళి రామలక్ష్మణులపై యుద్ధం ప్రకటించారు.

దూసుకువస్తున్న రాక్షససేన, భయంకరమైన ఉత్పాతములు చూసి రాముడు లక్ష్మణునితో

'తమ్ముడూ, వినాశాన్ని సూచించే ఆ ఉత్పాతాలు చూడు. అయినా భయపడవలసిన పనిలేదు. నాకుడి భుజం అదురుతోంది. కనక జయం మనదే. రాక్షసులు యుద్ధభేరీలు మ్రోగిస్తు భయంకరంగా అరుస్తున్నారు. నువ్వు వెంటనే ధనుర్బాణాలు ధరించి, మీ వదినని, మన రహస్య స్థావరమైన కొండగుహలోకి తీసుకువెళ్లి కాపలాకాస్తూండు. నా మాటకి ఎదురుచెప్పావంటే నామీద ఒట్టే. నా గురించి నువ్వేం దిగులుపడకు. ఆ రాక్షసమూకని చీల్చిచెండాడుతాను. కనుక నా మాటకెదురు చెప్పక వెంటనే సీతని తీసుకుని, కొండగుహలోకి వెళ్ళిపో' అన్నాడు.

అన్నగారి మాటలు విన్న లక్ష్మణుడు, ఎదురు చెప్పలేక, ఇష్టం లేకపోయినా సరే, సీతని వెంటబెట్టుకుని, గుహలోకి వెళ్ళిపోయాడు. రాముడు సంతృప్తిగా వారు వెళ్ళి వేపు చూసి, కవచము, ధనుర్బాణాలు ధరించి, ధనుష్టంకారం చేస్తూ ఆశ్రమద్వారంలో నిలబడ్డాడు.

ఆకాశంలో దేవతాగణాలు రాముడొక్కడే పధ్నాలుగు వేలమంది రాక్షసులతో ఎలా యుద్ధం చేస్తాడా అని కుతూహలంగా చూస్తున్నారు. ఇంతలో భయంకరంగా సింహనాదాలు చేస్తూ రాక్షసులు రామునిపై ఫెళ్ళున విరుచుకుపడ్డారు. ఆ రంకెలు విన్న క్రూరమృగాలు భయంతో చెల్లా చెదురైపోయాయి. రాముడు ఎంతమాత్రం జంకకుండా రాక్షససేనల్ని పరిశీలించి చూశాడు. ధనస్సు ఎక్కుపెట్టి నిప్పులు కురిపిస్తు చూస్తున్న రాముణ్ణి ఖరుడు చూశాడు. సారథితో రథాన్ని రామునివైపు పోనిమ్మాడు. రాక్షసులంతా రాముణ్ణి చుట్టుముట్టారు. ఖరుడు, రాక్షస సేనలు, తమ దగ్గర వున్న ఆయుధాలన్నీ రామునిపై గుప్పించి విసిరారు. రాముడు చాకచక్యంగా అన్నివేపులా బాణాలు వేస్తు ఆ ఆయుధాలన్ని తిప్పికొట్టాడు. వందలు, వేలు, బాణాలు ఒక్కసారిగా సంధించి, రాక్షసులపై ప్రయోగిస్తున్నాడు. అమోఘమైన ఆ అస్త్రప్రభావంతో రాక్షసులంతా నేలకూలిపోసాగారు. రత్నాభరణాలు ధరించిన రాక్షసుల అవయవాలు తెగి కుప్పలుకుప్పలుగా పడుతున్నాయి. మూడువంతుల రాక్షససైన్యం చచ్చి గుట్టలుగాపడగానే మిగిలినవారు భయంతో

పారిపోసాగారు. ఖరుడు, దూషణుడు, రాముడి అమోఘమైన అస్త్రపరిజ్ఞానానికి ఆశ్చర్యపోతూ రాముని మీదికి బయల్దేరారు. వారివెంట రాక్షస సేన ధైర్యం పుంజుకుని మళ్ళీ వచ్చి, పెద్దపెద్ద వృక్షాలు, కొండశిఖరాలు విరిచి రాముడి పైకి విసిరెయ్యసాగారు. ఒక్కుమ్మడిగా విరుచుకుపడుతున్న వారిని చూసి, రాముడు కోపం పట్టలేకపోయాడు.

రాముడు భయంకరంగా గర్జిస్తు, గాంధర్వాస్త్రాన్ని మంత్రించి రాక్షసులమీద ప్రయోగించాడు. దాని ప్రభావం చేత వేలకొద్దీ బాణాలు రాక్షసుల గుండెల్లో సూటిగా దిగబడ్డాయి. ఒక్క క్షణమైనా విరామం లేకుండా అలాగే రాముడు భాణాలు సంధించి, అన్నివేపులకు వదలసాగాడు. ఎపుడు భాణం పొదిలోంచి తీస్తున్నాడో, ఎప్పుడు సంధిస్తున్నాడో, ఎప్పుడు వదులుతున్నాడో, ఎవ్వరూ గుర్తించలేకపోతున్నారు. ఆకాశంలోనుంచి చూస్తున్న మహాత్ములకు, రాముడు చక్రధారియై సుదర్శన చక్రం ప్రయోగిస్తున్న మహావిష్ణువులా కనిపించాడు. బాణాలు తగలడం, రాక్షసులు నేలకూలడం కనురెప్పపాటులో జరిగిపోతోంది. అరణ్యప్రాంతమంతా, రాక్షసుల శరీరాలతో నిండిపోయి వారి రక్తమాంసాలతో బురదబురదగా అయింది.

తన సైన్యమంతా అలా సర్వనాశనమైపోతూ వుంటే ఖరుడు చూసి గాబరా పడిపోయాడు. ఇంకో అతి పరాక్రమవంతులైన ఐదువేలమంది రాక్షసుల్ని రాముని మీదికి పంపాడు. వాళ్ళు చాలా వేగంగా రథాల్ని రాముడివైపు దూకించి, శూలాలు, ఖడ్గాలు, రాళ్ళు - బాణాలు, ఎడతెరిపిలేకుండా రాముడి మీద వానలా కురిపించారు. రాముడు చాకచక్యంగా తన అస్త్రాలతో వాటినన్నింటిని ఛేదించి పడేశాడు. మరుక్షణంలో లెఖ్కలేనన్ని భాణాలు వారిమీదికి ప్రయోగించాడు. క్షరము అనే అస్త్రం ఖరుడి మీద ప్రయోగించాడు. దాని ప్రభావంతో ఖరుడు చేతిలో ఉన్న ధనస్సు విరిగి రెండు ముక్కలైంది. వెంటనే అర్థచిటికలో మరినాల్గు బాణాలు వేసి రథానికి కట్టిన నాలుగు గుఱ్ఱాలనూ నేలకూల్చాడు. ఇంకో బాణంతో సారధి తల తెగనరికాడు. మూడు వాడియైన భాణాలు ఖరుడి గుండెలో గుచ్చుకునేలా వేశాడు. దూషణుడు పౌరుషంతో కొండలాంటి పరిఘని రాముని మీదికి విసిరాడు. వెంటనే రాముడు రెండు పదునైన బాణాలతో వాడి బాహుమూలాలు ఖండించాడు. వాడు ఎత్తిపట్టిన పరిఘంతో అలాగే నేలకూలాడు. అతి ప్రశంసనీయమైన ఆ యుద్ధాన్ని చూసి దేవతలంతా శ్లాఘించారు. వెంటనే ముగ్గురు సేనా నాయకులు కోపంతో రాముని మీదికి దూకారు. రాముడు ఒక బాణంతో మహాకపాలుని శిరస్సు ఖండించాడు. బాణపరంపరతో ప్రమాధిని నేలకూల్చాడు.

స్థూలాక్షుని రెండు కళ్ళనిండా బాణాలు వేసి, వాణ్ణి హతమార్చి, ఐదువేల బాణాలు ఒక్కసారిగా ప్రయోగించి, ఐదువేలమంది సైనికుల్ని ముట్టబెట్టాడు. ఇదంతా చూసి ఖరుడు కోపంతో ఊగిపోయాడు. మిగిలిన బలగంతో రామునిపైకి దూకాడు. రాముడు పొగలు చిమ్ముతున్న అగ్నిహోత్రం లాంటి భాణాలతో రాక్షససేనని తుదముట్టించి, ఖరుడి మీదికి బయల్దేరాడు. ఖరుడు దుఃఖం పొంగుకొస్తుండగా, అవమానంతో కృంగిపోతూ రాముణ్ణి ఎదుర్కొన్నాడు.

అంతలో చచ్చిన వారిలోంచి త్రిశిరుడనే వాడు లేచి వచ్చాడు. రాముడికి త్రిశిరుడికి హోరాహోరీ పోరు జరిగింది. త్రిశరుడు మూడు బాణాలతో రాముని నుదుటి మీద కొట్టాడు.

రాముడు కోపంతో గర్జిస్తు కోడెత్రాచు విషం లాంటి విషపూరితమైన పధ్నాలుగు బాణాలు వాడిమీద ప్రయోగించాడు. వాడు ఆకాశంలోకి ఎగిరాడు. ఎగురుతున్న వాణ్ణి గురిచూసి గుండెలో భాణాలతో కొట్టాడు రాముడు. త్రిశరుడు మూర్ఛబోయి క్రిందపడ్డాడు. వెంటనే మూడు బాణాలతో వాడి మూడు తలలు ఖండించాడు రాముడు. వాడు ప్రాణాలు వదిలాడు. ఖరుడు రోషముతో రామునితో తలబడ్డాడు. కాని రాముడి బలపరాక్రమాలు చూసిన కొద్దీ వాడి గుండెలలో దడ పుట్టింది. అయినా చివరిక్షణం దాకా పోరాడటం తప్ప చెయ్యగలిగిందేదీ లేదు అనుకున్నాడు. ధైర్యం కూడగట్టుకుని రాముణ్ణి ఎదిరించాడు. క్రోధంతో బలంగాలాగిపట్టి రాముని మీద భాణాలు వదిలాడు. రకరకాల విన్యాసాలు చేస్తూ అస్త్రప్రయోగాలు చేస్తున్నాడు. రాముడు కూడా వందలకొద్దీ భాణాలు వాడిమీద ప్రయోగించాడు. నిప్పుకణాల్లాంటి రామభాణాలతో ఆకాశమంతా నిండిపోయింది. ఖరుడు కూడా రామునితో సమానంగా వానచినుకుల్లాంటి భాణాలు వదలసాగాడు. ఇద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా యుద్ధం చెయ్యసాగారు.

ఖరుడు రథం మీద కూర్చున్నాడు. తన వారినందరినీ చంపిన రాముని మీద పగ, వాడిలో బుసలు కొడ్తోంది. రాముడు పాదచారియై నేలమీద నుంచున్నాడు. వేలమంది రాక్షసులతో నిర్విరామంగా యుద్ధం చేసిన అలసట రాముని ముఖంలో ఖరుడికి కనిపించింది. వాడికెక్కడలేని ఉత్సాహం కలిగింది. రాముడి మీదికి బెబ్బులిలా ఉరకసాగాడు. రాముడు పిడికిలి బిగించి బాణం పట్టుకోగానే ఆ పిడికిలిపై బాణం వేసి గాయపరిచాడు. ఇంకో ఏడుబాణాలతో రాముని కవచం బద్దలు కొట్టాడు. తన గొప్పతనానికి మురిసిపోతూ గట్టిగా గర్జించాడు. అపుడు రాముడు అగస్త్య మహర్షి ఇచ్చిన వైష్ణవ ధనస్సు తీసుకున్నాడు.

ముందుగా రథం మీద ఎగిరే జండా పడగొట్టాడు. ఖరుడు రోషంతో నాలుగు బాణాలు వేసి రాముని శరీరం లోతుగా గాయం చేశాడు. రాముడు శరీరమంతా నెత్తుటితో తడిసిపోయింది.

రాముడు మండిపడి ఖరుడి తలమీద ఒక బాణం చేతులమీద రెండు బాణాలు, గుండెలమీద మూడు మొత్తం ఆరుబాణాలు ఒక్కసారి వదిలాడు. గుఱ్ఱాలు కట్టిన కాడి ఛేదించి, నాల్గుబాణాలతో నాల్గు గుఱ్ఱాల్ని పడగొట్టాడు. సారధిని కూడా ఒక బాణంతో చంపేశాడు. వెంకటే రథం కుప్పకూలింది అప్పుడు ఖరుడి చేతిలో బాణం విరగ్గొట్టి పదమూడో బాణం ఖరుడి మీద ప్రయోగించాడు. ఖరుడు నేలమీదకు దూకి గదను పట్టుకున్నాడు.

గదను పట్టుకుని మీదికి వస్తున్న ఖరుడిని చూసి, రాముడు మందలిస్తున్నట్లుగా మృదువుగా

'ఓ ఖరుడా, ఇంతకాలంనించీ మదోన్మత్తుడవై లోకులందరూ ఏవగించుకునేలా ప్రవర్తించావు. ప్రాణికోటిని నానాహింసలు పెట్టావు. పాపిష్టి పనులు చేస్తూ బ్రతుకుతున్నావు. ఇపుడు లోకాలన్నీ నీ చావుని కోరుకుంటున్నాయి. ఈ అరణ్యాలలోని అమాయకులైన తాపసులను హింసించి ఆనందించావే! దానికి ఫలితమిప్పుడనుభవించు. నా ఈ అమోఘమైన బాణం నీ ప్రాణాలు తీసి మళ్ళీ తిరిగి వచ్చి నా అమ్ముల పొదిలో చేరుతుంది. నువ్వు నన్నేమీ చెయ్యలేవు. ఇపుడే నీ తలని తాటికాయలా నరికి పారేస్తాను' అని హెచ్చరించాడు. ఖరుడి కళ్ళు కోపంతో జేగురించాయి.

వాడు వికటాట్టహాసం చేస్తూ దశరథనందనా, చాలా గొప్పగా మాట్లాడావు. సామాన్యమైన రాక్షసుల్ని చంపటం పరాక్రమమేం కాదు. ధంభాలు పలకటం, నీచుల లక్షణం. ఉత్తములు తమ పరాక్రమానికి విఱ్ఱవీగరు. నాకు కాదు. నీకే చావు మూడింది. దర్భలకు నిప్పు అంటుకున్నప్పుడు, క్షణకాలం బంగారు రంగులో మండి ఆపైన మసైపోతాయి. అలా వుంది నీ పరాక్రమం. గదపట్టుకుని వున్న నేను పర్వతమంత బలం వున్నవాడిని. ముల్లోకాలను చిటికెలో జయించగలను. అనవసరంగా మాటలతో ప్రొద్దుపుచ్చకు. సూర్యాస్తమయం కాబోతోంది. నువ్వో నేనో తేల్చుకుందాం రా' అంటు గదని గిరగిరా తిప్పి రాముని మీదికి విసిరాడు.

ఆగద భగభగ మండుతూ, అడవిలోని చెట్లన్నింటినీ దహిస్తూ రాముని మీదికి దూసుకురాసాగింది. రాముడు వెంటనే ఒకదివ్యమైన బాణంతో ఆ గదని ముక్క ముక్కలుగా చేశాడు. అది తుత్తునియలై నేలమీద పడింది. నిస్సహాయుడై

నిలబడ్డ ఖరుడితో రాముడు, 'రాక్షసాధమా - చూపించావుగా నీ బలం. ఇపుడింక ని దగ్గర ఏ శక్తీ లేదు. డంభాలు పలికింది నువ్వా? నేనా? ఇంకిప్పుడు నీ ఆయుధానికి తోడుగా రక్తంతో ఈ నేలమీద పడుకుందువుగాని రా! నువ్వు చచ్చావని తెలియగానే ఈ అరణ్యంలో మునులంతా తేలికగా ఊపిరి పీల్చుకుంటారు. ఇంతకాలం నీ భార్యలంతా ఈ తాపసుల్ని ఏడిపించారు. ఇపుడు వాళ్ళంతా నీకోసం కుళ్ళి కుళ్ళి ఏడుస్తారు' అన్నాడు.

అపుడు ఖరుడు 'రామా అంత గర్వం తగదు. ఈ జనస్థానం నాది. ఇక్కడ నువ్విలా నిర్భయంగా మాట్లాడటం చాలా తెలివితక్కువ. ఇదిగో కాచుకో' అంటు బ్రహ్మాండమైన వృక్షం పెళ్ళగించి రామునిపైకి విసిరాడు. రాముడు తన దివ్యాస్త్రముతో ఆ వృక్షాన్ని కూడా అవలీలగా ఖండించాడు.

రాముడి ఒళ్ళంతాచెమటలు పట్టాయి. రోషంతో కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. ఇంక ఉపేక్షించి లాభం లేదని, ఖరుని మీద ఒక్కసారిగా వెయ్యిబాణాలు ప్రయోగించాడు. ఒళ్ళంతా రక్తం కారుతూ ఖరుడు సింహంలా గర్జిస్తూ రాముని మీద పడబోయాడు.

అపుడు రాముడు ఒక్కడుగు వెనక్కి వేసి, అగ్నిహోత్రం లాంటి బాణం ఒకటీ, బ్రహ్మదండం లాంటి బాణం మరొకటి, ఖరుని మీద ప్రయోగించాడు. ఆ బాణ ప్రభావానికి ఖరుడు నేలకూలాడు. ఖరుడు నేలకూలగానే, ఆకాశంలోని దేవగణాలు, ఋషిగణాలు నేలమీదకు వచ్చి నిలిచారు. వారంతా రాముణ్ణి గౌరవించి ఇలా అన్నారు. 'రామా, ఆనాడు ఇంద్రుడు, శరభంగుడి ఆశ్రమానికి వచ్చినప్పుడు, ఈ మహత్కార్యం నీచేత చేయించాలని మమ్మి ఆదేశించాడు. అతడి ప్రార్ధన మేరకే మేమంతా నిన్ను ఈ దండకారణ్యానికి తోడ్కొని వచ్చాము. నీ పరాక్రమంతో అజేయులైన ఖరదూషనులను, త్రిశిరుడు లాంటి మహారాక్షసులను, పధ్నాలుగు వేలమంది రాక్షసులను మట్టుబెట్టావు. లోకానికి మహోపకారం చేశావు. ఇక మీదట ఈ దండకారణ్యంలో మునులు రాక్షసబాధ లేకుండా నిర్భయంగా యజ్ఞయాగాలు చేసుకుంటారు' అని అనేకవిధాల రాముణ్ణి ప్రశంసించారు. దేవదుంధుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. దేవతలంతా ఆనందంతో రాముని మీద పూలు చల్లారు.

రామునికి, రాక్షసులకు మధ్య యుద్ధం పూర్తయ్యేవరకు లక్ష్మణుడు, సీతని గుహలో వుంచి రక్షించాడు. యుద్ధం ముగిసిందని తెలియగానే వాళ్ళు బయటకివచ్చారు. అంతవరకు రాముడొక్కడే అంతమంది రాక్షసులతో ఒంటరిగా ఎలా పోరాడతాడా అని లక్ష్మణుడు, సీత దిగులు పడ్డారు. ఇపుడా బెంగతీరింది. మహర్షులు రాముని పొగడడం కళ్ళారాచూసింది సీత. మహావీరుడైన భర్తని

గాఢంగాకౌగలించుకుంది. కళ్ళనీరు ధారాపాతంగా కారుతుండగా, ఒళ్ళంతా గాయాలతో రక్తసిక్తమైన రాముని మళ్ళీ మళ్ళీ కౌగలించుకుంది. ఆనందంతో నోటమాటరాక, సంతృప్తిగా రాముణ్ణి తనివితీరా చూసుకుంది. లక్ష్మణుడు కూడా రాముని అసమాన పరాక్రమానికి ఆశ్చర్యపోతూ చాలా మెచ్చుకున్నాడు. వారు ముగ్గురు ఆశ్రమంలోనికి వెళ్ళి విశ్రమించారు. సీతా, లక్ష్మణుడు రామునికి సపర్యలు చేసి కొలుకునేలా చేశారు.

అయితే ఖర, దూషణ, త్రిశిరులు, పధ్నాలుగు వేలమంది రాక్షసులు చనిపోయినా అకంపనుడు అనే ఒక రాక్షసుడు మాత్రం ఈ భీకరమైన యుద్ధానికి సాక్షుడిగా మిగిలివున్నాడు. వాడు జరుగుతున్నదంతా పొంచిపొంచి చూసి, వాయువేగంతో లంకాపట్టణానికి వెళ్ళి, జరిగినదంతా రావణునికి వివరించి చెప్పాడు.

'రాజా జనస్థానంలో వున్నరాక్షసులంతా ఇంచుమించు చచ్చిపోయారు. ఖరుడు కూడా చచ్చిపోగానే, ఎలాగోలా ప్రాణాలు దక్కించుకుని, నేను పారిపోయి వచ్చాను' అనివాడు చెప్పగానే రావణుడి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడ్డాయి. 'ప్రాణాలమీద ఆశలేని వెఱ్ఱివాడెవడో ఈ ఘాతుకం చేశాడన్నమాట. ఆ మూర్ఖుడెవరు? ముల్లోకాలలోనూ ఎక్కడున్నా వాడు ప్రాణాలతో వుండడు. నేను మృత్యువుకే మృత్యువు లాంటివాడిని. పంచభూతాలూ, అష్టదిక్పాలకులు, నా కనుసన్నలలో మెలుగుతారని ఆ మూర్ఖుడికి తెలియదా?' అంటు రోషంతో రావణుడు నిప్పులు కురిపించాడు. రావణుడి కోపం చూసి అకంపనుడు హడిలిపోయాడు.

రెండు చేతులు జోడించి, గడగడ వణుకుతూ, ప్రభూ, అభయమిస్తే అంతా వివరిస్తాను అన్నాడు. 'నిర్భయంగా చెప్పు' అని రావణుడు అభయం ఇచ్చాక చెప్పడం మొదలుపెట్టాడు.

'రాజా దశరథ కుమారుడైన రాముడు చాలా పరాక్రమవంతుడు. సింహం లాంటివాడు. అతడే జనస్థానంలో వున్న ఖరదూషణులను, పధ్నాలుగువేలమంది రాక్షసులను సంహరించాడు' అని వాడు చెప్పిన మాటలు విని రావణుడు త్రాచుపాములా బుసలు కొట్టాడు. 'అకంపనా - రాముడొక్కడే వాళ్ళందరిని చంపాడా? లేకపోతే సర్వదేవతలతోటీ ఇంద్రుడు వారికి సాయంగా వచ్చాడా?' అని అడిగాడు. అంకపనుడికి కాస్త ధైర్యం వచ్చింది.

'ప్రభూ రాముడు జగత్ప్రసిద్ధుడైన వీరుడు, మహాతేజోవంతుడు. చాలా

మహిమాన్వితమైన ఎన్నెన్నో దివ్యాస్త్రాలు అతడి దగ్గర వున్నాయి. దేవేంద్రుని కన్నా వీరుడు. బలవంతుడు. సాహసి. అతడి తమ్ముడు లక్ష్మణుడు కూడా అతనితో అడవిలోనే నివశిస్తున్నాడట కాని రాముడొక్కడే మన రాక్షసులందరితో యుద్ధం చేసి వారందర్నీ చంపేశాడు. విచిత్రమేమిటంటే యుద్ధం చేసింది రాముడొక్కడే అయినా, మనవారందరికీ ఎటు చూసినా రాముడే కనిపించి, దిక్కు తోచకుండా చేశాడు. వారంతా కలవరముతో రామబాణానికి బలైపోయారు' అని వివరించి చెప్పాడు.

రావణుడు ఆవేశం పట్టలేక, 'నేనిపుడే జనస్థానానికి వెళ్ళి ఆ రామ లక్ష్మణులిద్దరినీ హతమారుస్తాను' అని బయల్దేరబోయాడు.

అకంపనుడతడిని వారిస్తూ, 'మహారాజా, రాముడు సామాన్యుడని భావించకండి. హద్దుమీరితే ఏ మాత్రం సహించడు. బ్రహ్మరుద్రాదులు కూడా అతడి ముందు నిలిచి యుద్ధం చెయ్యలేరు. నువ్వేకాదు, సృష్టిలోని రాక్షసులు, దేవతలు, అందరూ ఏకమైనా ఆ మహాత్ముని సంహరించలేరు. కనుక కాస్త నెమ్మదించి, ఏదైనా ఉపాయముతో వారిని జయించే మార్గం ఆలోచించు.

ఆ రాముని భార్య సీత జగదేకసుందరి. మంచి యౌవనంలో వుంది. అతి సుకుమారి. రత్నాభరణాలు ధరించి, మైమరపు కలిగించె అందంతో మెరిసిపోతూ వుంటుంది. ఆమె అందంతో పోల్చదగిన స్త్రీ దేవతలలో గాని, గంధర్వులలో గాని, అప్సరసలలో గాని, ఎక్కడా కనిపించదు. రామునికి భార్య అంటే పంచప్రాణాలు. నువ్వెలాగోలా ఉపాయంతో సీతని అపహరించావంటే, ఆమె మీద దిగులుతో రాముడు తప్పక చనిపోతాడు. ఎందుకంటే, సీతని విడచి రాముడు బ్రతకలేడు' అని చెప్పాడు.

రావణునికి ఆ మాటలు చాలా నచ్చాయి. అకంపనుడి తెలివికి మెచ్చుకుని, 'సరే చాలా బాగుంది, నీ ఆలోచన. రేపు తెల్లవారగానే రథం మీద జనస్థానానికి వెళ్తాను. సీతని లంకాపట్టణానికి తెస్తాను' అన్నాడు.

కాని రావణునికి సీతని చూడాలనే ఆతృత ఎక్కువైంది. వెంటనే తన రథంమీద సముద్రపు ఒడ్డున ఆశ్రమం కట్టుకుని నివశిస్తున్న మారీచుని ఆశ్రమానికి వెళ్ళాడు. మారీచుడు తాటకి కొడుకు. మునుపు విశ్వామిత్రుడి ఆశ్రమంలో రామునిచేత దెబ్బతిని, బుద్ధిగా సముద్రం ఒడ్డున ఆశ్రమం నిర్మించుకుని వున్నాడు. ఆ మారీచుడు దగ్గరకి రావణుడు వెళ్ళాడు. మారీచుడు రావణునికి గొప్ప విందుభోజనం పెట్టి సత్కరించాడు.

'ప్రభూ లంకలో అంతా కుశలమే కదా. ఇలా ఆకస్మికంగా వచ్చారేమిటి? తమరే స్వయంగా వచ్చారంటే, ఏదో బలవత్తరమైన కారణం వుండాలి' అని వినయంగా అడిగాడు.

రావణుడు ఆరాటం తీర్చుకునే ధోరణిలో 'మారీచా, జనస్థానంలో వున్న మన రాక్షసుల్ని సంరక్షించడానికి ఖరుణ్ణి నియమించాను. ఆ సంగతి నీకు తెలుసు కదా. కాని ఖరుడిని - అజేయులైన రాక్షసుల్ని, అందర్నీ రాముడనే మానవుడొక్కడే చంపేశాడట. అంతటి మహత్కార్యం చేసిన ఆ రాముణ్ణి ఎదిరించి, ఆపదగొని తెచ్చుకోవడం ఎందుకని, అతడి భార్యయైన సీతని అపహరించాలని సంకల్పించాను. అందుకు నీ సాయం కావాలి' అని తన మనస్సులో మాట సూటిగా చెప్పాడు. రావణుని తెలివి తక్కువ ఆలోచనకి, మారీచుడు చాలా జాలిపడ్డాడు.

'ప్రభూ, ఇలాంటి పనికిమాలిన ఆలోచన మీకెవడు చెప్పాడు? వాడు తప్పక నీకు ప్రబలవిరోధి అయి వుంటాడు. మిత్రుడిలా నటించి, ఊబిలోకి లాగాలనుకుని వుంటాడు. తాచుపాము నోటిలో కోరలు పీకటం ఎంతప్రమాదకరమో, సీతని ఎత్తుకు రావటం కూడా, అంత ప్రమాదమే. రాముణ్ణి గురించి అసలు నీకేమైనా తెలుసా? తెలిస్తే ఈ సాహసం చెయ్యవు. నా అనుభవం చెప్తాను విను.

రాముడు మత్తగజములాంటివాడు. ఉన్నతమైన ఇక్ష్వాకువంశంలో పుట్టాడు. మత్తగజము యొక్క గంధం గాలిలో వ్యాపించగానే, ఏనుగు మందలెలా పరుగులు తీస్తాయో, రాముని పేరు విని శత్రువులలా ఉలిక్కిపడతారు. రాముడు తన బాహుబలంతో శత్రువులను చీల్చి చెండాడతాడు. యుద్ధంలో రాముణ్ణి ఎదిరించి పోరి, జయించగల్గేవారు లేరు. అంతటి పురుషసింహాన్ని ఎదిరించి, ఆతడి భార్యనెలా ఎత్తుకువస్తావు? రాముడి కంటబడితే ప్రాణాలతో ఉంటావా? ప్రాణాల మీది తీపి ఉంటే, ఆ ఆలోచన మానుకో. లంకేశ్వరా! నామీద దయవుంచి, ఆ ఆలోచన మానుకో. అని మారీచుడు రావణుని ఎన్నివిధాలో హితబోధ చేశాడు. రావణుడు మనస్సు మార్చుకుని లంకకి వెళ్ళిపోయాడు. అయితే జరగవలసిన కథ ఇంకోలా వుంది. రామలక్ష్మణుల మీద పగబట్టిన శూర్పణఖ, రాముడొక్కడే ఖరదూషణుల్ని, త్రిశిరుడినీ, పద్నాలుగు వేలమంది రాక్షసుల్ని చంపటం కళ్ళారా చూసింది. ఆమెకి కసి పెరిగిపోయింది. మేఘంలా గర్జిస్తూ లంకాపట్టణానికి చేరింది.

ఆ సమయంలో రావణుడు పుష్పకవిమానంపై భవనం మీద కూర్చుని వున్నాడు. ఆ భవనం బంగారు ఇటుకులతో నిర్మించబడినది. రావణుడు కూర్చున్న ఆసనం రత్నాలతో పొదిగి చెయ్యబడింది. ఆ ఆసనం మీద కూర్చున్న రావణుడు

సూర్యభగవానుడిలా వెలిగిపోతూ వున్నాడు. దేవ, దానవ, గంధర్వ, భూతగణముల చేత మరణము లేని మహావీరుడతడు. చూడ్డానికి నల్లగా కాలయముడిలా వున్నాడు. దేవాసుర సంగ్రామంలో వజ్రాయుధం చేత గాయం చెయ్యబడి కాయలు కాసిన గుర్తులు శరీరం మీద కనిపిస్తున్నాయి. పది తలలు, ఇరవై చేతులు, వున్నాయి. ఛత్రచామరాదులైన రాజలాంఛనాలన్ని వున్నాయి.

రావణుడు ధర్మరహితుడు, పరస్త్రీ లంటే వ్యామోహమెక్కువ అతడికి. దివ్యాస్త్రములు ప్రయోగించగల నేర్పు గలవాడు. తక్షకుని ఓడించి, అతడి భార్యని చెరబెట్టి తెచ్చాడు. కుబేరుని జయించాడు. పదివేల సంవత్సరాలు మహావనములో బ్రహ్మగురించి తపస్సు చేసి, తన తలలను ఖండించి, ఆహుతిగా ఇచ్చి దేవ, దానవ, పిశాచ, యక్ష, గంధర్వ, ఉరగముల చేత, చావులేకుండా బ్రహ్మనుండి వరము పొందాడు. కర్కశమైన హృదయం గలవాడు. లవలేశమైనా దయాగుణం లేనివాడు. మహాశక్తి సంపన్నుడు. అటువంటి రావణుని పుష్పక సౌధానికి పై భాగాన కూర్చున్న వానిని అతడి సోదరి శూర్పణఖ చూసింది. భయంతో ఒణికిపోతూ అతడి పాదాలమీద వాలింది. భోరు భోరున ఏడుస్తూ ఇలా అంది. 'సోదరా - కామభోగలాలసుడవై ముంచుకుని వస్తున్న ముప్పు తెలుసుకోలేక, ఘోరమైన ప్రమాదంలో పడబోతున్నావు. ప్రజల యోగక్షేమాలను కాపాడలేని వాడివి. నువ్వేం ప్రభువువి? రాజనేవాడు గూఢచారులను నియమించి, తన రాజ్యంలో జరుగుతున్న పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. నువ్వు అమోఘమైన వరాలు సంపాదించాననే గర్వంతో నిశ్చింతగా విలాసాల్లో మునిగితేలుతున్నావు. కాని నీకు ప్రతీకారం చెయ్యాలని దేవతలు, గంధర్వులు సమయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సంగతి చారుల ద్వారా తెలుసుకోలేని నువ్వేం రాజువి? నీకు సరైన చారులు గాని, మంత్రులు గాని లేరు. అందుకే జనస్థానంలో పధ్నాలుగు వేలమంది నీ సైనికులు, ఖరదూషణులు, త్రిశరుడు, మొత్తం అందరూ చనిపోయిన సంగతి నీకు తెలియదు. రాముడొక్కడే నీ వారందర్నీ అవలీలగా చంపేశాడు. రాముడు జనస్థానంలోని రాక్షసులందర్నీ నిర్మూలిస్తానని, ఋషులకి మాట ఇచ్చాడు. వాగ్దానం చేసి వారి కభయం ఇచ్చాడు.

అన్నమాట ప్రకారం అక్కడి రాక్షసులందర్నీ మట్టుబెట్టాడు. ఇంతజరిగినా, స్త్రీ లోలుడివై, భోగలాలసుడివై నువ్వు గుర్తించలేకపోయావు. తనని తానే గొప్పవానిగా భావించేవాడై, పెద్దల నాదరించకుండా జరుగుతున్న సంగతులేమీ తెలుసుకోకుండా, తన పరిపాలన చాలా చక్కగా వుందని భ్రమించే ప్రభువుని, ఆప్తులు కూడా ఎదురుతిరిగి రాజ్యభ్రష్టుణ్ణి చేస్తారు. ఎండు కట్టెలు కూడా

పొయ్యిలోకి యజ్ఞయాగాదులకి పనికొస్తాయి. మట్టి బెడ్డలు, ఇసుక కూడా ఇళ్లు కట్టుకుందుకు పనికొస్తాయి. కాని రాజ్యభ్రష్టుడైన రాజు, ఎందుకు కొరగాడు. అందరూ వాణ్ణి తేలికగా చూసి నిరసిస్తారు. కట్టికట్టి శిథిలమైన పాతవస్త్రంలా, వాడిపోయిన పూలదండలా రాజ్యభ్రష్టుడైన రాజు నిరుపయోగునిలా, పనికిమాలిన వానిలా చూడబడ్తారు. రావణా నువ్వు దుర్బుద్ధివి. నీకు ఒక్క మంచి లక్షణం కూడా లేదు. జనస్థానంలో జరిగిన సంగతులేవీ నీకు తెలియవు. శత్రువులను పేక్షిస్తున్నావు. నువ్వనతికాలంలోనే రాజ్యభష్టుడు కావడం తథ్యం' అంటూ రావణుడ్ని నోటికొచ్చినట్టల్లా తిట్టిపొయ్యసాగింది. శూర్పణఖ మాటలన్నీ సావధానంగా విన్నాడు రావణుడు. ఆతడి మంత్రులు కూడా శూర్పణఖ మాటలు విన్నారు. దాని మాటలందరికీ సమంజసంగా తోచాయి. రావణుడు పట్టరాని కోపంతో ఒక్కసారి హుంకరించాడు.

'ఎవడా రాముడు? అతడి బలమెలాంటిది? ఎలా వుంటాడు? అసలు దండకారణ్యాని కెందుకొచ్చాడు? ఎలాంటి ఆయుధాలతో యుద్ధం చేశాడు? మన రాక్షసుల్ని చంపటాని కెలాంటి మారణాయుధాలు ఉపయోగించాడు? ఆ వివరాలన్నీ చెప్పు' అని గద్దించి అడిగాడు.

శూర్పణఖ కోపంతో ఊగిపోతూ 'అన్నా రాముడు ఆజానుబాహువు. పద్మపత్రాయతాక్షుడు. మన్మధుని కన్నా అందగాడు. నారబట్టలు ధరించి, కృష్ణాజినము కట్టుకుని వున్నాడు. దశరధ మహారాజు కుమారుడట. ఆతడి ధనస్సు ఇంద్ర ధనస్సులా వుంటుంది. ఆకర్ణాంతం వింటిని లాగి నాగుపాముల్లాంటి బాణాలు సంధించి, వదులుతాడు. ఎపుడు బాణం తీస్తాడో, ఎపుడు సంధిస్తాడో, ఎపుడు వదులుతాడో కూడా తెలుసుకోలేనంత నేర్పుగా యుద్ధం చేస్తాడు. ఒక్కడే ఒంటరిగా నేలపై నిలబడి, పధ్నాలుగు వేలమంది సైనికుల్నీ మూడు ఘడియలలో చంపేశాడు. మహావీరులైన ఖరదూషణుల్ని కూడా ఒక్కడే చంపేశాడు. రాక్షసులనందర్నీ నిర్మూలించి, దండకారణ్యంలోని ఋషులందరికీ అభయం కల్పించాడు. ఆడదానిని చంపడం మహాపాపమని తెలిసున్న మహాత్ముడు కనుక నన్ను మాత్రం చంపకుండా వదిలేశాడు. రాముని కన్నింటిలోనూ అతడితో దీటైన తమ్ముడొకడున్నాడు. అతని పేరు లక్ష్మణుడు. అతడికి అన్నగారంటే చెప్పలేని ప్రేమ, భక్తి. నిరంతరం అన్నగారిని సేవిస్తు వుంటాడు. మహావీరుడు. అజేయుడు. అంతేకాదు. రాముని కొక ప్రియురాలు కూడా వుంది ఆమె పేరు సీత. చంద్రబింబంలాంటి ముఖం, విశాలమైన కన్నులు, ఛక్కని కేశసంపద, కలిగివుంది. అందమైన ముక్కు, చెవులు, మెడ, తొడలు, ఒకటేమిటి? ఆమె అవయవాలన్నీ

చాలా చక్కగా వుంటాయి. రూపవతి, గుణవతి, వనదేవతలా ఉంటుంది. మేలిమి బంగారు దేహచ్ఛాయ. ఎఱ్ఱని గోళ్ళు. విశాలమైన జఘనము. పోగుపోసిన అందాలరాశిలా వుంటుంది. జనక మహారాజు కూతురు. దేవతలలో గాని, గంధర్వులలో గాని, యక్షులలో గాని, కిన్నెరలలో గాని, అంతటి అందమైన స్త్రీ ఎక్కడా ఉండదు. ఆ సీత ఎవరి దగ్గర వుందో వాడు ఇంద్రుడి కన్నా గొప్పవాడు. ఆమె కౌగిలి లభించినవాడు ధన్యుడు.

నా దృష్టిలో నీకన్నివిధాలా తగిన భార్య ఆమే. అందుకే ఆ సుందరిని తెచ్చి, నీకు కానుకగా ఇద్దామని, వారి దగ్గరికెళ్ళాను. కాని క్రూరుడైన లక్ష్మణుడు నా ముక్కు, చెవులు కోసి నన్ను కురూపిగా చేశాడు. అన్నా...... నువ్వొక్కసారి ఆమెని చూశావంటే చాలు. మన్మధ తాపంతో ఆమె పాదాలమీద పడిపోతావు. నా మాటలు నమ్మి, ఆమెని భార్యగా పొందాలనుకుంటే వెంటనే బయల్దేరు. రాముడి మీద ప్రతీకారం తీర్చుకుని, చనిపోయిన రాక్షసుల ఆత్మకి శాంతి కలిగించు. నీ వారినందరినీ ఆ రాముడు చంపాడన్న సంగతి స్మరించి, నీ కర్తవ్యం నిర్ణయించుకో.' అంటూ రావణుని రెచ్చగొట్టింది. శూర్పణఖ చెబుతున్న మాటలలో సీత గురించిన వృత్తాంతం విన్న రావణుని గుండె పులకరించింది.

తియ్యని ఊహలలో తేలిపోతూ, మంత్రిమండలిని వెళ్ళిపొమ్మని పంపిం చేశాడు. 'ఏం చేస్తే బాగుంటుంది?' అని ఆలోచించాడు. సీతని ఎత్తుకురావడం మంచిదా కాదా అనితర్కించుకున్నాడు. మహావీరులైన ఖరదూషణుల్ని, త్రిశిరుడిని, పద్నాలుగు వేలమంది రాక్షసులిని, సునాయాసంగా సంహరించిన రాముడియొక్క బలాన్ని అంచనా వెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. ఒంటరిగా ధైర్యసాహసాల్ని ప్రదర్శించిన రాముణ్ణి ఓడించటం, తన వల్ల కాదేమో అనుకున్నాడు. అందుకే ఎలాగైనా రామలక్ష్మణులను వంచించి, సీతని అపహరించుకురావటమే మంచిదని నిశ్చయించుకున్నాడు. ఎన్నివిధముల ఆలోచించినా అదే సరైన మార్గం అనిపించింది. వెంటనే ఎవ్వరికీ తెలియకుండా, గాడిదలు పూన్చిన రథం మీద బయల్దేరి, రాజసం ఉట్టిపడుతూ బయల్దేరాడు. తిన్నగా మారీచుని ఆశ్రమానికి వెళ్ళాడు. రావణుడు మళ్ళీ వచ్చినందుకు ఆశ్చర్యపోతూ మారీచుడు అతడికి, విందుభోజనం పెట్టి సత్కరించాడు. రాచమర్యాదలన్నీ పూర్తయ్యాక, చేతులు జోడించి, 'రాజా.... లంకలో అంతా కుశలమే కదా? నిన్ననే కదా వచ్చి వెళ్ళావు? మళ్ళీ ఇంతలో రావడానికి, కారణమేమిటి?' అని వినయంగా అడిగాడు. రావణుడు దర్పంగా ఇలా అన్నాడు.

'మారీచా, నాకు చాలా సంకట పరిస్థితి కలిగినదయ్యా. జనస్థానంలో జరిగిన

సంగతులన్నీ చెప్పాను కదా. అసలు నా ఆజ్ఞ ప్రకారమే, నా చెల్లెలు, శూర్పణఖ, ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు, పధ్నాలుగు వేలమంది రాక్షసులు, వీరందరూ జనస్థానంలో, నివాసమేర్పరచుకుని, మన ప్రబల శత్రువులైన మునులను, ఋషులను హింసిస్తూ యధేచ్ఛగా, దండకారణ్యములో సంచరిస్తున్నారు. అటువంటి మహావీరుల్ని రాముడనే మానవుడొకడు, పాదచారియై అందర్నీ సమూలంగా ముట్టబెట్టాడు. విచారించగా తెలిసినదేమిటంటే, ఆ రాముడు, తండ్రిచేత భార్యతోసహా ఇంటి నుంచి వెళ్ళగొట్టబడి, అడవులలో తిరుగుతున్నాడట. బ్రతికే దారిలేక, ఆ నీచ క్షత్రియుడు, మూర్ఖుడు, భుజబలం వుంది కదా అని ఏ కారణము లేకుండా, నా చెల్లెలైన శూర్పణఖ ముక్కు, చెవులు కోసి పారేశాడు. అవమానంతో నా గుండె దహించుకుపోతోంది. అందుకు ప్రతీకారంగా ఆరాముని భార్యయైన సీతని లంకకి తేవాలని అనుకుంటున్నాను. నువ్వు నా పక్కన ఉండగా, మహావీరులైన నా సోదరులు. కుంభకర్ణాదులు ఉండగా, నేనెవ్వరికీ భయపడను. నువ్వు అసమాన పరాక్రమశాలివి. నీతో సరిసమైన ఏదురీ లోకంలో లేరు. ఇప్పుడు నీ సాయం నాకు కావాలి. అందుకే నీ దగ్గరకి వచ్చాను' అని ఒక్క నిమిషం ఆగాడు.

తర్వాత బ్రతిమాలుతున్న ధోరణిలో 'మారీచా. నువ్వు చెయ్యవలసిన సాయం చెప్తాను విను. నువ్వు వెండిలా మెరిసే బంగారం రంగు వున్న లేడిగా మారి,సీతకి కనిపించేలా వారి ఆశ్రమం దరిదాపుల్లో తిరుగుతూ వుండు. అప్పుడు బంగారులేడి రూపములో ఉన్న నిన్నుచూసి, సీత మోజుపడి, నిన్ను పట్టి తెమ్మని, రామలక్ష్మణుల్ని పంపుతుంది. వారిద్దరూ ధనుర్ధారులై నీ వెంటపడతారు. ఆమె ఒంటరిగా ఆశ్రమంలో ఉండగా, నేనామెని అపహరించి, లంకకి తీసుకెళ్ళిదను. సీత లంకలో వుందని ఎవ్వరూ కనిపెట్టలేరు. సీతని పోగొట్టుకున్న రాముడు దుఃఖంతో కృశించి, చనిపోతాడు. ఈ విధంగా నా పగ తీరుతుంది. ఒకవేళ రాముడు ప్రాణాలు వున్నా కృశించి దీనావస్థలో వున్న రాముణ్ణి చంపడం అంత కష్టం కాదు' అంటూ తన పధకం వివరించి చెప్పాడు. రావణుడి మాటలు వింటుంటే మారీచుడికి భయంతో గొంతెండిపోయింది. భయంతో గుడ్లు తేలేసి రెప్పవాల్చకుండా వుండిపోయాడు. పై ప్రాణాలు పైనే పోయాయి. రాముని పరాక్రమం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నవాడు కనుక, చేతులు జోడించి, రావణునితో ఇలా అన్నాడు.

'రాజా, లోకంలో అందరూ సామాన్యంగా ఎదుటివారికి నచ్చేవిధంగానే మాట్లాడతారు. కాని, మనకి నచ్చకపోయినా, మనలో వుండే దోషాలు

తెలియజేస్తూ, మనకి మేలు కలిగించేలా చెప్పేవారు చాలా తక్కువ. ఒకవేళ ఎవరైనా అలా చెప్పినా విని, ఆచరించేవారు కూడా ఎక్కడో గాని వుండరు. నువ్వు చారులను నియమించుకోకపోవడం చేత, నీకు రాముని గురించి, అస్సలు తెలియదు. రాముడు మహావీరుడు. దేవేంద్రుడు, వరుణుడు కూడా అతడికి సాటిరారు.

చాపల్యంతో రామునితో వైరం కొనితెచ్చుకోకు. నిజంగా రాముడికి కోపం వస్తే, ఈ భూమండలం మీద, ఒక్క రాక్షసుడు కూడా మిగలకుండా సర్వనాశనం చేస్తాడు. సీతని అపహరించాలనుకోవడం నీ నాశనం నువ్వు కొని తెచ్చుకోవడమే. నిన్నంతమొందించడానికి బహుశా సీత జన్మించి వుంటుంది. కామప్రవృత్తితో శీలం కోల్పోయి, నిరంకుశముగా పాలన సాగిస్తున్నావు. నీ మూలంగా లంక సర్వనాశనం కాబోతోంది. రాముని సంగతెంతమాత్రం తెలియక ఇలా మాట్లాడుతున్నావు.

తండ్రి వెళ్ళగొట్టడంవల్ల రాముడు అడవులకి రాలేదు. మర్యాదలేనివాడు, లోభి, శీలవంతుడు, నీచక్షత్రియుడు అంటూ అసంబద్ధంగా నీ ఇష్టమొచ్చినట్లు వాగుతున్నావు. కాని నిజం తెలుసుకో. అతడు ధర్మమూర్తి. తన కోరిక తీరుస్తానని భర్తచేత ఒట్టుపెట్టించుకుని, వంచించి, దశరథుని ముద్దల భార్య రాముని అడవులకి పంపించమని కోరింది. దశరథ మహారాజు ధర్మసంకటంలో వుండగా, తండ్రివాగ్దానం నెరవేర్చాలనే సంకల్పంతో, రాజ్యభోగాల్ని తృణప్రాయంగా వదిలేసి, భార్యతమ్ముడు వెంటరాగా రాముడు దండకారణ్యానికి వచ్చాడు.

రామలక్ష్మణులు లేని సమయంలో సీతని దొంగలించి లంకకి తేవాలనే నీ ఆలోచన చాలా తెలివి తక్కువది. సీత తనని తానే రక్షించుకోగలదు. అంతేకాదు రాముడు, రగులుతున్న నిప్పులాంటివాడు. ఆయనతో వైరం కోరుకోకు. ఏ క్షణంలో నువ్వు రాముని కంటబడతావో ఆక్షణంలో నీ నాశనం ఖాయం. మరొక్కసారి నీ మంత్రులతో, విభీషణుడితో ఆలోచించు అంటూ అనేకవిధాల బోధించాడు.

తన అనుభవాలన్నీ వివరించి చెప్పాడు. 'రావణా, చిన్నపుడు, నేను చేతిలో పరిఘ ధరించి భూమండలమంతా తిరిగేవాడిని. అపుడు నాకు వెయ్యి ఏనుగుల బలం వుండేది. అప్పట్లో విశ్వామిత్ర మహాముని సిద్ధాశ్రమములో మహాయజ్ఞం ఒకటి తలపెట్టాడు. నేనూ, సుబాహువు అనేవాడు కలిసి ఆ యాగానికి విఘ్నం కలిగించి సంతోషిస్తూ వుండేవాళ్ళం. అపుడు విశ్వామిత్రుడు దశరథ మహారాజు దగ్గరకి వెళ్ళి యాగసంరక్షణ కోసం రాముని పంపమని, అడిగాడు. బాలుడైన రాముడిని పంపటానికి దశరథ మహారాజు ఒప్పుకోలేదు. అపుడు విశ్వామిత్రుడు

రాముడొక్కడే అందుకు సమర్థుడని నచ్చచెప్పి రామలక్ష్మణులను తనవెంట సిద్ధాశ్రమానికి తీసుకువచ్చాడు.

విశ్వామిత్రుడు దీక్షబూని యజ్ఞశాలలో యజ్ఞం చేస్తుండగా, రామలక్ష్మణులు ఆశ్రమం చుట్టు తిరుగుతు యాగరక్షణ చేస్తున్నారు. అతి సుకుమారమైన కుసుమ కోమలగాత్రుడు, పద్మపత్రాయతాక్షుడు అయిన రాముడు బంగారు ఆభరణాలు ధరించి సూర్యునిలా ప్రకాశిస్తూ యాగశాల దగ్గర వుండగా, బలము గలవాడనన్న మదముతో, నేను ఆ ప్రాంతానికి వెళ్ళాను. వెంటనే రాముడు నా పై బాణం ప్రయోగించాడు. ఆ దెబ్బకి నేను నూరుయోజనముల దూరం ఎగిరి సముద్రంలో పడ్డాను. రాముడు దయామయుడు కనుక నన్ను చంపకుండా సముద్రంలో పడేశాడు. నేను చాలాసేపు అలా సముద్రంలో తెలివి తప్పి వుండి, తర్వాత మెల్లిగా లంక చేరాను. అస్త్రవిద్య అంతగా అభ్యసించని అంత చిన్నవయస్సులోనే, అంతటి అసమాన ప్రతిభ కనపరచిన రాముడు, నా వెంట వచ్చిన పరివారాన్ని అక్కడికక్కడే చంపేశాడు. ఆ మహనీయుడు సంగతి పూర్తిగా తెలిసిన వానిని కనక అంతగా చెప్తున్నాను. నా మాట విని వెనక్కి వెళ్ళిపో. అలా కాదని రాముడితో తలపడ్డావో, ఆపద తప్పదు. నీ ఒక్కడి మూలంగా లంకావాసులంతా ఆపదలో పడిపోతారు.

రాజా పరులభార్యని బలవంతంగా అనుభవించడం మహాపాపం. నీకు వేలకొద్దీ అందమైన భార్యలున్నారు. లోటేమిటి? నీ భార్యలతో నువ్వు సుఖించి నీకులాన్ని రక్షించుకో. నా మాట విను. సీతనపహరించావో సమూలంగా నాశనమైపోతావు.

"రావణా, రాక్షస చక్రవర్తీ ఎప్పుడో చిన్నప్పటి నా అనుభవం అలా వుండనీ, ఈ మధ్యనే జరిగిన ఒక సంగతి చెప్తాను విను. రాముడు వన వాసానికి దండకారణ్యానికి వచ్చాడని తెలిసి పాత పగ తీర్చుకుందామని, ఇంకో ఇద్దరు రాక్షసులతో కలిసి భయంకరమైన మృగరూపం ధరించి, వాడియైన కొమ్ములతో రాముని మీద పడ్డాను. రాముడు వెంటనే మూడు బాణాలు విల్లులో సంధించి, ఆకర్ణాంతం లాగి మాముగ్గురిపై ప్రయోగించాడు. రెప్పపాటులో తప్పించుకుని నేను పారిపోయాను. మిగిలిన వాళ్ళిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశారు. నేను మాత్రం మళ్ళీ సముద్రంలో పడ్డాను. ఇది నా రెండవ అనుభవం. జన స్థానంలో జరిగిన ఆ సంఘటన తల్చుకుంటుంటే ఇప్పటికీ నా గుండె ఝల్లుమంటోంది.

ఆరోజునించి "ర" అనే అక్షరం వింటే చాలు. నా ప్రాణం స్థంభించిపోతోంది. ఎలాగో ధైర్యం చిక్కబట్టుకుని, ఈ ఆశ్రమంలో తాపసవృత్తితో జీవితం

గడుపుతున్నాను. రాముని ప్రభావం నాకు తెలుసు. నీకు ధైర్యం వుంటే రాముణ్ణి ఎదురించి యుద్ధం చెయ్యి. అంతే గాని సీతమ్మనపహరించడం తగదు. ఈ విషయంలో నన్ను ఇరికించకు. రాముడు మహాతేజశ్శాలి. నిజానికి ఖరదూషణులను తానంత తాను చంపలేదు. కేవలం శూర్పణఖ కారణంగానే చంపవలసి వచ్చింది. ఇందులో రాముని తప్పులేదు. నీ మేలు కోరి చెప్తున్నాను" అని ఎన్నో విధాలుగా నచ్చచెప్పాలని ప్రయత్నించాడు. కాని రావణుడికి మాత్రం మారీచుడి మాటలు వింటున్న కొద్దీ ఒళ్ళు మండిపోయింది. "మారీచా- ఇలాంటి వ్యర్థాలాపాల వల్ల లాభం లేదు. నీ మాటలకి భయపడి నేను రామునితో పోరు మానుతాననుకున్నావా? ఒక ఆడదాని మాటలకిలొంగి, బంధువుల్నీ, రాజ్యసుఖాలను వదిలివచ్చిన ఆ అప్రయోజకుడు, తెలివితక్కువాడని వేరే చెప్పాలా? ఖరుణ్ణి, దూషణుణ్ణి, త్రిశరుడ్ని చంపిన ఆ నీచమానవుడిపై ప్రతీకారం తీర్చుకోడానికి నేను సీతని అపహరించి తీరుతాను. దానికి నీ సాయం కావాలి. ఇది నా ఆజ్ఞ. దీనికి తిరుగులేదు. నీ సలహాలు నా కనవసరం. మంత్రి అయినా సరే. రాజుకోరినప్పుడు మాత్రమే సలహా చెప్పాలి. రాజు గౌరవింపదగ్గవాడు. నువ్వు మూర్ఖుడివి కనుక నీకా సంగతి తెలియదు. తెలివితక్కువ మాటలతో నా మనస్సు కష్టపెట్టావు. కేవలం నీ సాయం అడిగాను కదా అని, తగుదునమ్మా అంటూ నీతిపాఠాలెందుకు చెప్తావు?

నీమీద అభిమానంతో సాయం చెయ్యమని చెయ్యిచాచి అడిగాను. కాని ఇపుడు శాసిస్తున్నాను. విను. నువ్వు బంగారు లేడిగా మారి రాముని ఆశ్రమం దగ్గరగా సీత నిన్ను చూసేలా, పచ్చికమేస్తున్నట్లు నటించాలి. ఆమెని మురిపించాలి. అప్పుడు సీత రాముడ్ని బంగారు లేడిని పట్టి తెమ్మని అడుగుతుంది. రాముడు ధనస్సు పట్టుకుని నీ వెంట పడతాడు. అలా అలా పరిగెత్తి వెళ్ళి రాముణ్ణి చాలా దూరం తీసుకొనిపోవాలి. అలా వెళ్ళి వెళ్ళి 'హా లక్ష్మణా హా సీతా' అంటూ ప్రాణం పోతున్నట్లు గట్టిగా అరవాలి నువ్వు. అప్పుడు సీత భయపడి లక్ష్మణుడిని పంపిస్తుంది. లక్ష్మణుడు కూడా సీత దగ్గర్నించి వెళ్ళిపోగానే, నేను చటుక్కున వెళ్ళి సీతని దొంగలించి తెస్తాను. ఈ మాత్రం సాయం నాకు చేశావంటే నా రాజ్యంలో సగభాగం నీకిస్తాను. హాయిగా సుఖంగా వెళ్ళు. నీ కార్యం శుభప్రదం కావాలని ఆశీర్వదిస్తున్నాను. నేను కూడా నీ వెనకాలే రథంలో వస్తాను. నా మాట విని చెప్పినట్లు చేశావా సరే, లేకపోతే నిన్నుప్పుడే చంపేస్తాను. నువ్వీపని చేసితీరాలి. నన్నెదిరించి ఎవ్వరూ సుఖంగా వుండలేరు. నువ్వు మృగరూపం ధరించినపుడు రామబాణానికి చావకుండా ప్రాణాలు దక్కించుకునే అవకాశం వుంది. కాని

నామాట వినకపోతే నీకు ప్రాణాలు దక్కే అవకాశం అస్సలు లేదు. కనుక బాగా ఆలోచించుకుని నిర్ణయించుకో' అన్నాడు.

అహంకారంతో రావణుడలా అంటుంటే వాడి మూర్ఖత్వానికి సహించలేక మారీచుడిలా అన్నాడు. 'రాజా.... నువ్వు సుఖంగా నీ భార్యలతోటీ, కుమారులతోటీ రాజభోగాలనుభవిస్తూ రాజ్యపాలన చేస్తూ వుంటే చూసి ఓర్వలేక, నీ నాశనం కోరినవాడెవడో నీకిలాంటి సలహా చెప్పే, నువ్వు యుక్తాయుక్త విచక్షణం లేకుండా, ఇలా అజ్ఞానంలో ప్రవర్తిస్తుంటే నిన్ను చూసి జాలేస్తోంది. ఇదంతా నీ శత్రువుల పన్నాగంలా తోస్తోంది. నీ నాశనం నువ్వే కొని తెచ్చుకుంటున్నావు. రాజు పెడదారి పట్టినప్పుడు మంత్రులు వానిని వారించి, సరైన దారిలో నడిపించాలి. కాని నీ మంత్రులు నిన్ను హెచ్చరించలేదంటే, వారు కూడా విచక్షణారహితులై వుండాలి. రావణా, నీ స్వభావం క్రూరమైనది. ఇంద్రియ నిగ్రహం లేక, నీతిమాలి, విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నావు. నీ పనికిమాలిన ఆలోచనకి నన్ను బలిచెయ్యాలని చూస్తున్నావు. నేను మృగరూపంలో రాముని కంటబడ్డ మరుక్షణం నా చావు తథ్యం. ఆ వెంటనే నీకు కూడా చావు మూడుతుంది. నీ హితవు కోరి ఎన్నివిధాల చెప్పినా పెడచెవిని పెడుతున్నావు. రాముని ఆశ్రమం నించి సీతమ్మని తెచ్చావా, నువ్వుండవు. నేనుండను. రాక్షసులుండరు. చివరికి లంక కూడా వుండదు' అంటు చాలా దీనాతిదీనంగా ముఖం పెట్టి 'మరింక తప్పనిసరి అయితే వెళ్తాను' అన్నాడు

ఆ మాటలు విన్న రావణుడు చాలా ఆనందించాడు. మారీచుడ్ని గట్టిగా కౌగలించుకుని, వెన్నుతట్టి 'సెభాష్' అన్నాడు. ఇప్పటికి పౌరుషవంతుడి వనిపించుకున్నావు మారీచా, ఇప్పటిదాకా నీ మాటలు విని నువ్వు మా మారీచుడివేనా అని అనుకున్నాను. భీరువులా మాట్లాడావు. ఇప్పటికి నీ శక్తి నువ్వు గ్రహించావు. రా. రత్నవిభూషితమైన నా రథం ఎక్కు. నేను చెప్పిన మాటలు గుర్తుపెట్టుకో. సీతని ప్రలోభ పెట్టి, రామలక్ష్మణుల్ని దూరంగా తీసుకునివెళ్ళి ఆ తర్వాత నీ ఇష్టం వచ్చిన చోటుకి వెళ్ళిపో. ఒంటరిగా వున్న సీతని నేను లంకకి తీసికొనివెళ్ళిపోతాను' అంటు ఉల్లాసంగా మారీచుడి చెయ్యి పట్టుకుని రథం ఎక్కించాడు. ఇద్దరూ కలిసి ఆకాశమార్గంలో బయల్దేరారు. దారిలో నగరాలు, గ్రామాలు, పట్టణాలూ చూస్తూ దండకారణ్యం చేరి రాముని ఆశ్రమం దగ్గరకి వచ్చారు. ఇద్దరూ రథం ఆపి కిందికి దిగారు.

శూర్పణఖ చెప్పిన గుర్తులు ప్రకారం రాముని ఆశ్రమం మారీచుడికి చూపించి, ఇంక తెలివితేటలు ప్రదర్శించమని చెప్పాడు. వెంటనే మారీచుడు అందమైన బంగారు జింకగా మారి, రాముని ఆశ్రమానికి పరిసర ప్రదేశాలలో

తిరగసాగాడు. ఆ బంగారు లేడి పరమాద్భుతముగా వుంది. దాని కొమ్ములు ఇంద్ర నీలమణి కాంతితో మెరిసిపోతున్నాయి. ముఖం మీద తెల్లని, ఎఱ్ఱని రేఖలు చూడముచ్చటగా వున్నాయి. ముక్కులో ముక్కుపుటాలు ఎఱ్ఱ కలువ రేకుల్లా మెరుస్తున్నాయి. అడుగు పెదవి ఇంద్రనీలమణిలా వుంది. దాని కడుపుభాగం తెల్లగా మల్లెపువ్వులా మెరుస్తోంది. డెక్కలు విప్పపూల రంగులో వున్నాయి. మూపుభాగం పద్మకేశరంలా మెరుస్తోంది. దేహమంతా రత్నాలు కుప్పబోసినట్లు కాంతిమయంగా వుంది. తోక ఇంద్రధనస్సులా వంచి ఎత్తి తిప్పుతోంది. ఇంతటి అద్భుతమైన లేడి రూపాన్ని కామరూపధారణ శక్తి కలిగిన మారీచుడు చిటికెలో ధరించాడు. రంగు రంగుల ధాతువుల్లాంటి వింతవర్ణంతో మెరుస్తు, జానకిని ప్రలోభపెడుతూ ఆ ప్రాంతంలో తిరుగుతున్నాడు. బంగారం వర్ణం కలిగిన ఆ లేడి శరీరం మీద వేలకొద్దీ వెండిచుక్కలు మెరుస్తున్నాయి. చిగురుటాకులు కొరుకుతున్నట్లు నటిస్తూ, ఆ ప్రాంతంలో తచ్చాడుతూ తిరుగుతోందది.

ఆశ్రమం దగ్గర తిరుగుతున్న లేళ్ళ గుంపులో కలిసిపోవాలని చూసింది. కాని ఆశ్రమం చుట్టు వున్న లేళ్ళు దాని దగ్గరగా వచ్చి, వాసనని బట్టి అది మృగం కాదని గ్రహించి, దూరంగా పారిపోయాయి. మారీచుడు రాక్షసుడు కనుక ఆ లేళ్ళని చూడగానే వాడి నోరూరింది. కాని ఎలాగోలా నిగ్రహించుకుని, ఆశ్రమ ద్వారం దగ్గరకి వచ్చి బెదురుచూపులు చూస్తూ, ఛెంగుఛెంగున గెంతుతూ, సీతాదేవి దర్శనం కోసం వేచి చూడసాగాడు.

అంతలో వైదేహి పూలు కోయడానికి, మొక్కలదగ్గరకు వచ్చింది. ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఆ అద్భుతమైన లేడిని ఆశ్చర్యంగా చూసింది.

అదికూడా అమాయకత్వం నటిస్తూ, సీతవంక చూస్తూ, వింతనడకలు నడవసాగింది. సీతాదేవి పూలు కోస్తూ దాని వంకే చూస్తోంది. అది ఒక పక్క బంగారు కాంతితో, ఇంకోపక్క వెండిరంగుతో చాలా చిత్రంగా మిలమిలా మెరుస్తోంది. దానిని చూస్తున్న కొద్దీ సీతకి మైమరుపు కలిగింది. వెంటనే భర్తనీ, లక్ష్మణుడ్ని పిలిచింది. ఆయుధాలు తీసుకుని రమ్మంది. వారిద్దరూ వచ్చి సీత చూపించిన వైపు చూశారు. ఆ వింతమృగం వారికంటబడింది. దాన్ని చూడగానే లక్ష్మణునికి అనుమానం వచ్చింది. 'అన్నయ్యా ఇది లేడిలా కనిపించటం లేదు. మాయావేషంతో వచ్చిన మారీచుడేమో యని నాకనుమానంగా వుంది. లోకంలో ఎక్కడైనా ఇలాంటి వింతమృగం వుంటుందా? నిస్సందేహంగా ఇది మాయా మృగమే' అన్నాడు. మారీచుడే అని ఎందుకంటున్నానంటే, ఇదివరకు ఈ అరణ్యంలో వేటాడడానికి వచ్చిన రాజుల్ని మారీచుడనే రాక్షసుడు, కామరూపంలో

మాయచేసి, చంపేవాడని, మునులు చెప్పగా విన్నాను. కనుక ఇపుడిది కనిపించినట్లే కనిపించి మాయమైనా ఆశ్చర్యపడక్కర్లేదు' అని మళ్ళీ వివరించి చెప్పాడు.

కాని సీత లక్ష్మణుని మాటలు తోసిపుచ్చి, నవ్వుతూ, ఆ మృగం మీది మోహం వదలలేక, రామునితో ఇలా అంది. 'ఆర్యపుత్రా, ఈ మృగం నా మనస్సుని ఆకర్షిస్తోంది. మహావీరా - మీరెలాగైనా దాన్ని నాకు తెచ్చివ్వాలి. ఇంతవరకు ఈ అరణ్యంలో ఇంతటి అందమైన మృగం నాకు కనిపించలేదు. ఇందాకటినుంచి నన్ను చూసి కూడా బెదిరి పారిపోకుండా అక్కడే నిలబడి నన్ను మురిపిస్తోంది. ఎంతందంగా వుందో చూశారా? దానివింత కాంతి ఏమిటో ఈ అడివంతా వ్యాపిస్తోంది. దీని కంఠస్వరం ఎంత మధురంగా వుందో. ఎంత వద్దనుకున్నా నా దృష్టి దానివైపే వెళ్తోంది.

దీనిని ప్రాణాలతో పట్టుకోగలిగితే అందరికీ గర్వంగా చూపించవచ్చు. ఒకవేళ ప్రాణాలతో దొరక్కపోతే, చంపైనా తీసుకురండి. దాని చర్మం ఆసనంగా వేసుకుని ధ్యానం చేస్తాను. ఇది ప్రాణాలతో దొరికితే, ఇంతటి అద్భుతమైన మృగాన్ని చూసి అయోధ్యలో అత్తగార్లు, భరతుడు, ఎంత ఆశ్చర్యపోతారో కదా. ఇది మన అంతఃపురానికే అలంకారమవుతుంది. కనీసం దాని చర్మాన్ని చూపించినా అయోధ్యలో అంతా వింతగా చూస్తారు. కోరిన కోరిక తీర్చమని, నిర్బంధించడం ఆడవారికి తగదని నాకు తెలుసు. కాని దానిమీద కుతూహలముతో, మిమ్మలనింతగా అడుగుతున్నాను' అంటూ తన గాఢమైన కోరిక వెలిబుచ్చింది.

సీత మాటలన్నీ విన్నాక రాముడు ఆ లేడివైపు తేరబారి చూశాడు. బంగారు వెంట్రుకలు, నీలరత్నం లాంటి కొమ్ములు, నక్షత్రముల్లా మెరుస్తున్న చుక్కలు, అవన్నీ చూస్తుంటే రాముని కూడా ఆశ్చర్యం కలిగింది. చూడగా చూడగా దాన్ని పట్టుకోవాలన్న కోరిక రామునిక్కూడా కలిగింది.

అపుడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. 'తమ్ముడూ, ఈ మృగం చాలా అద్భుతంగా వుంది. మీ వదిన దానిని కావాలని అడుగుతోంది. ఇది మనకి లొంగడమో, చనిపోవడమో ఇప్పుడే జరగాలి. రాజులు అడవుల్లో తిరిగి వేటాడడం అన్నది మన సాంప్రదాయమే కదా. అలాకాక రాక్షస మాయే అయితే మరీ మంచిది. రాక్షసుల్ని చంపి తాపసులకి రక్షణ కలిపిస్తానని మాట ఇచ్చాను కదా. కనుక ఎలా చూసినా దీన్ని చంపడములో తప్పులేదు. పూర్వం వాతాపి అనే రాక్షసుడిని అగస్త్యుడు ఎలాచంపాడో చెప్పానుకదా. కనుక దుష్టుల్ని చంపటం ధర్మసమ్మతమే.

నువ్వు అప్రమత్తుడవై ధనస్సు చేత పట్టుకుని, ఆశ్రమంలో వుండి మీ

వదినని కాపాడుతూ ఉండు. ఇక్కడ ఎటుచూసిన మాయతో నిండి ఉంది. కనుక ఎవర్నీ నమ్మకూడదు. చాలా జాగ్రత్తగా ఉండు. ఏ ప్రక్కనుంచైనా ప్రమాదం రావచ్చును. ఆ జటాయువు మీకు తోడుగా ఉంటుంది. నేనిప్పుడే వెళ్ళి తృటిలో ఆ మృగాన్ని వధించి, దాని చర్మం తీసుకొస్తాను. జాగ్రత్త' అని అనేకవిధముల లక్ష్మణునికి జాగ్రత్తలు చెప్పి, బంగారుపిడి ఉన్న ఖడ్గము మొలలో ధరించి, బాణములు, ధనుస్సు తీసుకుని, వడివడిగా బయల్దేరాడు.

ముందుగా ఆలోచించి ఉంచుకున్న పథకము ప్రకారం, రాముణ్ణి వంచించాలని, మారీచేడు రాముని వైపు చూస్తు చాలా వేగంగా పరిగెత్తి అంతర్ధానమయ్యాడు. మళ్ళీ చాలా దూరంగా లేళ్ళగుంపుల మధ్యన ప్రత్యక్షమయ్యాడు. ఎక్కుపెట్టిన విల్లుతో రాముడు దానివెనుక పరిగెత్తసాగాడు. రాముడివేగం చూస్తుంటే మారీచునికి చెప్పరాని భయం కలిగింది. వాయువేగ మనోవేగాలతో మబ్బులలో తేలుతున్నట్లు కనపడుతూ చెట్లమధ్య గుంపులలో మాయమవుతూ, ఆశ్రమానికి చాలా చాలా దూరంగా రాముణ్ణి లాక్కుపోయాడు. ఆ లేడి వేగం చూస్తుంటే రాముడికి మతిపోయి చెప్పలేనంత ఆగ్రహం కలిగింది.

అప్పటిదాకా సీతముచ్చటకోసం ఎలాగైనా ప్రాణాలతో పట్టుకోవాలని దాన్ని చంపకుండా వెంబడిస్తున్నాడు. కాని ఇపుడింక దానిని ప్రాణాలతో పట్టుకోవడం అసాధ్యమని తేలిపోయింది. వెంటనే బ్రహ్మనిర్మించిన దివ్యాస్త్రాన్ని ధనస్సులో సంధించి, చెవిదాకా లాగి వదిలాడు. ఆ బాణం తగలగానే మారీచుడు తాటిప్రమాణాన ఎగిరి, నేలమీద పడ్డాడు. కొన ఊపిరితో వుండగా రావణుని మాటలు గుర్తుకువచ్చాయి లక్ష్మణుణ్ణి ఆశ్రమం దగ్గరనుంచి తొలగించాలని, రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ 'హా సీతా!', 'హా లక్ష్మణా!' అని గట్టిగా అరిచాడు. వెంటనే మృగరూపంవదిలి రాక్షస ఆకారంతో, మహాకాయంతో నేలమీదపడి పొర్లుతూ ప్రాణాలు ఒదిలాడు. భయంకరమైన ఆకారంతో, ఒంటినిండా బంగారునగలతో పెద్దపెద్ద కోరలతో రక్తసిక్తమైన వాడి శరీరం చాలా భయంకరంగా వుంది.

మారీచుడు రాక్షస ఆకారంతో నేలమీదపడి చావగానే, రామునికి లక్ష్మణుని మాటలు గుర్తుకు వచ్చాయి. 'ఆహా లక్ష్మణుడెంత చక్కగా ఊహించాడు! ఇదంతా ఈ మారీచుడి మాయ అన్నమాట'అనుకున్నాడు. 'అయ్యో! వీడు చస్తూ హా లక్ష్మణా, హా సీతా! అంటూ చచ్చాడే. ఈ కేకలు సీత వినే వుంటుంది. సీతకెలాంటి ఆపద కలగబోతోందో, లక్ష్మణుడే మనుకున్నాడో, వాళ్ళిద్దరూ ఏం చెయ్యబోతున్నారో అని ఆలోచించే కొద్దీ, రామునికి ముచ్చెమటలు పట్టాయి.

సీతని ఒంటరిగా వదిలి లక్ష్మణుడొస్తాడేమో, సీత ఎలాగైనా పంపుతుంది. ఒంటరిగా ఉన్న సీతకేం ఆపద కలగబోతోందో అని కలతబారిన మనస్సుతో, వెంటనే మరో లేడిని చంపి, దాని మాంసం తీసుకుని, గబగబా ఆశ్రమం వైపు నడిచి వెళ్ళసాగాడు.

కాని అప్పటికే సీత ఆ ఆర్తనాదం వింది. రాముడు భయపడ్డంతా జరిగింది. తన భర్త యైన రాముడే అలా అరిచాడనుకుని, సీత దుఃఖం పట్టలేక లక్ష్మణునితో "లక్ష్మణా వెంటనే బయల్దేరి వెళ్ళు నామనుస్సు గతి తప్పిపోతోంది. నా ప్రాణం కొడంటి పోతోంది. నీ అన్నగారేదో అపదలో చిక్కుకున్నారు. రక్షణ కోసం ఆర్తితో ఆక్రోశిస్తున్న నీ అన్నగారి స్వరం వినిపిస్తోంది. నువ్వు వెంటనే వెళ్ళి నీ అన్నయ్యని రక్షించుకో, ఆలస్యం చెయ్యకు, విల్లు అమ్ములు తీసుకుని వెంటనే వెళ్ళు" అని తొందర పెట్టింది.

కాని రాముని ఆజ్ఞ గుర్తుపెట్టుకుని లక్ష్మణుడు కదలకుండా ఆమె దగ్గర నుంచున్నాడు. తనమాటని నిర్లక్ష్యం చేస్తున్నందుకు సీతకి చాలా కోపం వచ్చింది.

"సౌమిత్రీ - నీ అన్నగారు ఆపదలో ఉన్నారని తెలిసికూడా, నువ్వు కదలకుండా నుంచున్నావంటే నాకేదో అనుమానంగా ఉంది. నువ్వు గాని నామీద వ్యామోహంతో, నీ అన్నగారి నాశనం కోరుతున్నావా? నీకు నీ అన్నగారి కన్నా నీ చపలచిత్తమే ముఖ్యమా? అయ్యో! రాముని ప్రాణాలు సంకట పరిస్థితిలో ఉండగా, ఆయనని వదిలి నేనెలా ఉండగలను? రాముడు లేకపోయాక, నన్ను రక్షించి ప్రయోజనమేమిటి?" అని కన్నీళ్ళతో ఏడుస్తున్న జానకిని ఓదారుస్తూ లక్ష్మణుడు, "వైదేహీ దేవ, గంధర్వ, మానవ, రాక్షసులంతా ఏకమైవచ్చినా, నీభర్తని ఎవ్వరూ జయించలేరు. ఇందులో ఎంత మాత్రం అనుమానం లేదు. రాముని ఎదుట నిలబడి యుద్ధం చెయ్యగల మొనగాడే లేనప్పుడు, రాముడు మరణించడం ఎలా జరుగుతుంది? నువ్విలా అనడం చాలా అనుచితంగా ఉంది. రాముడు లేనప్పుడు నిన్ను ఒంటరిగా ఆశ్రమంలో వదిలివెళ్ళడం నాకిష్టంలేదు. దేవీ, మళ్ళీ చెప్తున్నాను విను రాముడు అజేయుడు ఆయన నెదిరించి పోరగలవాళ్ళు ముల్లోకములలోనూ లేరు. కనుక నువ్వు దుఃఖించడం మానేసి ధైర్యం చిక్కబట్టుకో, ఇంకొంచెం సేపట్లో రాముడు ఆ మృగాన్ని చంపి వస్తాడు. రాక్షసుడెవడో మనల్ని వంచించడానికి అలా అన్నగారి కంఠస్వరంతో అరచి ఉంటాడు.

రాముడు నిన్ను పదిలంగా కాపాడమని నా కప్పగించి వెళ్ళాడు. జనస్థానంలో రాక్షసులు ఖరదూషణుదుల్ని చంపేశాక మన మీద పగబట్టి ఉన్నారు. వాళ్ళు రకరకాల కంఠస్వరములతో అరవగలరు. కనుక నామాట నమ్మి ధైర్యంగా ఉండు"

అని లక్ష్మణుడు వినయంగా చెప్పాడు. కాని జానకి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడ్డాయి. క్రోధావేశంలో ఒళ్ళుతెలియలేదు. లక్షణుణ్ణి ఎన్నివిధాలో తూలనాడింది.

"ఛీ - ఛీ - అనార్యుడా, దయాహీనుడా నృశంసుడా, కులాంతకుడా, రాముని కన్నా నేనే నీకు ప్రియమైన దానినయ్యానా? ఔనులే, నీలాంటి ధూర్తులు పయోముఖవిషకుంభాల్లా, అవకాశం కోసం కనిపెట్టుకుని ఉంటారు. ఇంతకాలం నించి మమ్మల్ని వెన్నంటి తిరుగుతున్నది, నాకోసమేనన్నమాట. ఇది నీకు పుట్టిన బుద్ధేనా? లేక ఇందులో భరతుని ప్రోత్సాహం కూడా ఉందా? ఏది ఏమైనా లక్షణా, మీ కోరిక ఎంతమాత్రం తీరదు. పద్మపత్రాయతాక్షుడు, ఇందీవరశ్యాముడు అయిన రాముని భర్తగా పొందిన నేను, పరపురుషుల్నెలా కోరగలను. రాముడు లేనిదే క్షణమైనా జీవించి ఉండలేను. ఇపుడే, నీ ముందు నా ప్రాణాలు తీసుకుంటాను." అంటు సీత నోటికొచ్చినట్లల్లా మాట్లాడుతుంటే విని ఖిన్న మనస్కుడై లక్ష్మణుడు చేతులు జోడించి ఇలా అన్నాడు "అమ్మా... నువ్విలా మాట్లాడితే నేనేం చెప్పగలను? మైథిలీ ఒక పామర స్త్రీ లా విచక్షణారహితంగా మాట్లాడుతున్నావు.

జానకీ, ఆపదలో ఉన్న స్త్రీలు ధర్మం వదిలి చపలచిత్తులై, క్రూరమైన ఆలోచనలతో, పరస్పరస్నేహాన్ని కూడా మర్చిపోయి, ప్రవర్తిస్తారు. నీ మాటలు నాకు కాల్చిన బాణాలతో చెవులలో గుచ్చినంత భాధకల్గిస్తున్నాయి.

ఓ వనదేవతలారా, న్యాయబద్ధంగా నేను చెప్తున్న హితవు వినిపించుకోకుండా, అతి దారుణంగా, పరుషంగా మాట్లాడుతున్న ఈవిడ మాటలు విన్నారా? మీరే సాక్షీభూతులు. అమ్మా నీ మేలుకోరి నేను చెప్తుంటే, స్త్రీ సహజమైన దుష్టశీలంతో ఇలా నిందిస్తున్నావే, ఛీ. ఛీ... నాకెంతటి దుస్థితి కలిగింది! నీకు శుభం కలగాలి తల్లీ. నీకింక దేవుడే దిక్కు, నేనిప్పుడె అన్నగారి దగ్గరకి వెళ్ళున్నాను. ఏవేవో దుశ్శకునాలు కన్పిస్తున్నాయి. నిన్నింక ఈ వనదేవతలే రక్షించాలి. రాముడెక్కడున్నా వెతికి మళ్ళీ ఆ మహనీయునితోటే నిన్ను చూస్తాను. ఆ అదృష్టం ఉందో లేదో" అంటు విషాదంగా, దుఃఖిస్తున్న లక్ష్మణుణ్ణి చూసి సీత ఏడుస్తు "లక్ష్మణా రాముడు లేకపోతే ఈ గోదావరిలో దూకి మరణిస్తాను. ఉరిపోసుకుంటాను. విషమైనా తాగుతాను. లేదా నిప్పుల్లో దూకి నా ప్రాణం తీసుకుంటాను. అంతేగాని రాముడు తప్ప మరో పురుషుని స్పర్శ కూడా నేను సహించలేను. కనుక నువ్వెళ్ళిపోతే ఎవ్వరైనా దుష్టుడు నన్నులొంగదీసుకుంటాడని నువ్వు భయపడకు' అంటు రెండు చేతులతో తల బాదుకుంటూ పెద్దగా ఏడ్వసాగింది.

జానకి ఆవేదన చూసి లక్ష్మణుడు చలించిపోయాడు. జాలితో ఆమెని

ఓదార్చాడు. కాని సీత మాత్రం లక్ష్మణుని వంక చాలా అసహనంగా చూసింది. అపుడింక లక్ష్మణుడు లేచి ఆమెకి నమస్కరించి, మళ్ళీ మళ్ళీ వెనక్కి తిరిగి చూస్తూ 'అయ్యో, ఈ అమాయకురాలను వదిలి వెళ్ళిపోతున్నానే, ఏమవుతుందో అనే బెంగతో వెళ్ళలేక రాముణ్ణి వెతుక్కుంటూ బయల్దేరి వెళ్ళాడు. ఆశ్రమానికి అలా లక్ష్మణుడు వెళ్ళగానే, అక్కడే పొంచి, అవకాశం కోసం చూస్తున్న రావణుడు, క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా, మాయా సన్యాసి రూపంలో, తలపై కొప్పు, ఒకచేతిలో గొడుగు, ఎడమభుజాన జోలె, కమండలం, యజ్ఞోపవీతం, చేతిలో త్రిదండం, వగైరా హంగులన్నీ ధరించి, కాషాయబట్టలు, కాళ్లకి పాదుకలు దాల్చి, ఒంటరిగా యున్న సీతముందు ప్రత్యక్షమయ్యాడు.

ఆ నీచుడు అక్కడ అడుగుపెట్టిన మరుక్షణం, చెట్లుఆకులు కూడా కదలకుండా, గాలి స్థంభించిపోయింది. గోదావరి కూడా మెల్లిగా ప్రవహించింది. వాడు మహాసంబరంతో ఆ ఆశ్రమంలో ప్రవేశించాడు. సీత ఆశ్రమంలో ఒకవారగా కన్నీరు మున్నీరుగా ఏడుస్తు కూర్చుని వుంది. వేదం గట్టిగా వల్లెవేస్తూ ఆ దుర్మార్గుడు సీతదగ్గరకి వెళ్ళాడు.

తామ రేకుల్లాంటి కళ్ళు మాటిమాటికీ తుడుచుకుంటు, పసుపుపచ్చని పట్టుచీరలో వనదేవతలా మెరిసిపోతున్న సీతని చూస్తూ, రావణుడు,

ఓ సుందరీ, ఈ పచ్చని పట్టుచీరలో సాక్షాత్తు లక్ష్మీదేవిలా వున్నావు. పద్మమాలను ధరించిన నువ్వు శ్రీహరి భార్యవా? గంధర్వ కన్యవా? అప్సరసవా లేక రతీదేవివా? తెల్లగా మెరుస్తున్న మల్లెమొగ్గల్లాంటి పలువరుస, విశాలమైన నీ కన్నులు, విపులమైన నీ జఘనభాగము, ఏనుగు తొండం లాంటి నీ తొడలు, తాళ ఫలములవంటి నీ వక్షోజాలు, అబ్బ చూడ్డానికింత మనోహరంగా వున్నావు? ఎవరమ్మా నువ్వు? నువ్వు ధరించిన ఈ రత్నాభరణాలు నీ అందానికి మరింత మెరుగుపెడుతున్నాయి. పిడికిలి మాత్రమైన నడుము, చక్కని నీ తలకట్టు, ఆహా నీ అందం నా మనస్సుని అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. గంధర్వులలో గాని, యక్ష కిన్నెర మానవులలో గాని, నీ అంత సౌందర్యం గల స్త్రీని, నేనింతవరకు ఎక్కడా చూడలేదు. నీ వయస్సు, నీ సౌకుమార్యం చాలా అద్భుతంగా వున్నాయి. ఈ అడవిలో ఇలా ఒంటరిగా వున్నావేం? ఇది రాక్షసులు తిరిగే ప్రదేశం. ఇక్కడ స్త్రీలు ఒంటరిగా వుంటే చాలా ప్రమాదం. నీలాంటి సుకుమారి అందమైన మేడల్లోగాని, రమ్యమైన ఉద్యానవనాల్లో గాని విహరించాలి.

వెలలేని చీనీచీనాంబరాలు, పూలహారాలూ, రత్నాభరణాలు ధరించాలి. ఉత్తముడైన భర్తని కలిగి వుండాలి. అసలు నువ్వెవరిదానవు? చూడగా

దేవతామూర్తిలా వున్నావు. కాని ఇది రాక్షసులు తిరిగే చోటు. ఇక్కడికి దేవతలు రారు. ఇక్కడ ఘోరమైన క్రూరమృగాలు సంచరిస్తుంటాయి. ఇటువంటి ప్రదేశంలో ఒంటరిగా ఎందుకున్నావు?' అంటూ చూపులతోనే ఆమె సౌందర్యాన్నంతా తాగేస్తూ ఏమీ తెలియనివాడిలా ఆమెనడిగాడు.

సీత రావణుని చూసి చటుక్కున లేచి నిలబడింది. ఆమె చాలా ఆవేదనతో నిండిన మనస్సుతో వుండడం వల్ల వాడిమాటల్లో అంతరార్థాన్ని గ్రహించే స్థితిలో లేడు. నిజంగానే వాడు బ్రాహ్మణుడని అనుకుంది. ఆసనం తెచ్చి వేసి అతిథి సత్కారం చేసింది. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు ఇచ్చింది.

నిజంగానే బ్రాహ్మణుడు అనుకుని పూజించింది కాని వాడు తనకి అపాయం కలిగించడానికి వచ్చిన రాక్షసుడని గుర్తించలేకపోయింది. కాని ఆ దుష్టుడు సీతనెలా ఎత్తుకుపోవాలా అని మనస్సులో ఆలోచిస్తున్నాడు. సీతమాత్రం వాని దుష్టపూరితమైన చూపులు గమనించేస్థితిలో లేదు. ఇటు రావణుడికి అతిథి సత్కారాలు చేస్తూనే, అటు రామలక్ష్మణులు వస్తారేమో అనుకుని, దృష్టిసారించి తదేకంగా వనంలోకి చూస్తోంది. కాని ఎటు చూసినా పచ్చిక తప్ప వారి జాడలేదు. సీత మనస్సులో చాలా ఆందోళనగా వుంది. అలాగే అన్యమనస్కంగా రావణుడడిగిన మాటలకి ఏవో పొడిపొడిగా సమాధానం చెప్తోంది.

బ్రాహ్మణోత్తమా, నేను జనకమహారాజు కుమార్తె సీతాదేవిని. నా భర్త శ్రీరాముడు. అయోధ్యానగరానికి ప్రభువైన దశరథ మహారాజుగారి పెద్దకుమారుడు. మా వివాహమయ్యాక పన్నెండేళ్ళు అయోధ్యలో మేము రాజ్యభోగాలన్నీ అనుభవించాము. పదమూడవ ఏట మా మామగారు నా భర్తకి పట్టాభిషేకం చెయ్యాలనుకున్నారు. కాని మహారాజుగారి మూడవభార్య కైకేయి మహారాజుని వంచించి, మునుపెప్పుడో తనకివ్వాల్సిన రెండు వరాలు తప్పక చెల్లిస్తానని వాగ్దానం చేయించుకుని, నా భర్తని పధ్నాలుగేళ్లు వనవాసానికి పంపాలనీ, అదే ముహుర్తానికి తన కుమారుడైన భరతునికి పట్టాభిషేకం చెయ్యాలనీ వరాలుగా కోరింది. ఆ వరాలు తీర్చేవరకు తాను భోజనం చెయ్యననీ, పచ్చిమంచి నీళ్ళైనా ముట్టుకోననీ, ప్రాణాలు తీసుకుంటానని రాజుని నిర్బంధించింది. అప్పటికి నా భర్తకి ఇరువది ఐదు సంవత్సరాలు. నాకు పదునెనిమిది సంవత్సరాలు నిండాయి. రాముడు సుగుణశీలి. ధర్మం తప్పనివాడు. సత్యమును పాలించేవాడు. ఆజానుబాహువు. అందరి మనసులు రంజింపచేసేవాడు. దశరథ మహారాజు కూడా ధర్మమూర్తి. అయినా కైకేయి మాటలకు కట్టుబడిపోయాడు. తండ్రిని కలుసుకుని రాజ్యాభిషేకానికి దీవెనలు పొందాలని రాముడు తండ్రి దగ్గరకి వెళ్ళాడు. అపుడు

కైకేయి కఠినమైన సంకల్పంతో 'రాఘవా నీ తండ్రి తన ఆజ్ఞగా చెప్పమన్న మాటలు విను. ఈ సామ్రాజ్యం నిరాటంకంగా భరతుడికిచ్చేసి నువ్వు వెంటనే వనవాసానికి బయల్దేరి నీ తండ్రిని అసత్యదోషం నించి రక్షించు' అని తీవ్రంగా చెప్పింది. ధర్మాత్ముడైన నా భర్త వెంటనే రాజ్యాన్ని పరిత్యజించి వనవాసానికి బయల్దేరాడు.

విప్రవర్యా, నా భర్త నమ్మిన ధర్మాలు రెండు. తన చేతిమీదిగా ఎవరికైనా ఇవ్వాలి గాని, తాను మాత్రం ఎవ్వరి దగ్గరా ఏమీ పుచ్చుకోడు. ఎట్టి పరిస్థితిలోనూ సత్యమే గాని, అసత్యం చెప్పడు. అందుకే తండ్రి మాటలు నిజం చెయ్యడానికి తను వనవాసం వచ్చేశాడు. ఆయన వెంట వచ్చిన నేనూ, లక్ష్మణుడు, రాముడు ఈ అడవులలో తిరుగుతున్నాము.

బ్రాహ్మణోత్తమా, మీరు కొంచెంసేపు విశ్రమించండి. నా భర్త అడవుల నించి ఆహారం తెస్తారు. అంతవరకు మీరు విశ్రాంతిగా కూర్చుని మీ గురించిన వివరాలు చెప్పండి. మీరీ అడవిలోకి ఎందుకొచ్చారు? అని అడిగింది.

అపుడు రావణుడు గర్వంగా 'సీతా నేను రాక్షసరాజైన రావణాసురుడిని. దేవ, అసుర, పన్నగులంతా నన్ను చూసి గడగడ వణుకుతారు. నీ సుందరమూర్తిని కన్నులారా చూశాక నా భార్యల మీద నామనస్సు నిలవడం లేదు. సముద్ర మధ్యంలో వున్న లంకానగరం నా రాజధాని. చుట్టూ సముద్రం. మధ్యలో ఎత్తైన పర్వతం. దానిమీద వుంది నా లంకా నగరం. నేను ఎంత మందినో ఉన్నత వంశానికి చెందిన స్త్రీలని తెచ్చి లంకలో వుంచాను. వారందరికీ అగ్రమహిషిగా నువ్వుందువుగానివి. నాతోపాటు ఉద్యానవనాలలో విహరిద్దువుగానివి. సర్వాభరణ భూషితులైన ఐదువేలమంది దాసదాసీలు నీకు సపర్యలు చేస్తారు. నిన్ను నా భార్యగా స్వీకరిస్తాను' అంటు మోహవశుడై ఏవేవో చెప్పసాగాడు.

ఆ మాటలు విన్న సీతకి కోపం వచ్చింది. 'దుర్మార్గుడా - నా భర్త గురించి నీకు తెలియదు. మహాపర్వతంలా అజేయుడు. మహేంద్రుని కన్నా గొప్పవాడు. మహా సముద్రంలా గంభీరమైనవాడు. అటువంటి పురుషోత్తముడు నా భర్త. ఆయనంటే నాకు ప్రాణం. ఆశ్రయించినవారికి చల్లని నీడనిచ్చే వటవృక్షంలా, తనని నమ్ముకున్న వారిని కాపాడుతాడు. నువ్వు టక్కరి నక్కవి. నేను ఆడసింహాన్ని. అసాధ్యమైన దానిని పొందాలని ఆరాటపడుతున్నావు. నువ్వు నన్నేవిధంగానూ తాకలేవు. నీకు ఆయువు చెల్లింది. కనుక రాముని భార్యని నీ భార్యగా చేసుకోవాలని చూస్తున్నావు. సింహం నోటిలోనుంచి కోరలు లాగాలని చూస్తున్నావు. నల్లతాచు కోరలు పీకాలని ప్రయత్నించకు. రామపత్నినైన నన్ను అపహరించటం ఎంత ప్రమాదమో తెలుసుకోలేకపోతున్నావు. నన్ను కోరడమంటే

మండుతున్న నిప్పుని బట్టలో మూటకట్టడమే. రాముడు జీవించి వుండగా ఆయన ధనస్సు కెదురుగా నిలబడి నన్నపహరించడం అసంభవం అని రావణుడ్ని అనేకవిధాల దూషిస్తు సీత ఆవేశంతో నిలువెల్లా ఊగిపోయింది.

సీతమాటలు వింటుంటే రావణునికి పట్టరాని కోపం వచ్చింది. 'సీతా చాలించు నీ ప్రగల్భాలు. నేను కుబేరుడి సవతి తమ్ముణ్ణి. పదితలలు గలిగిన రావణాసురుడ్ని. మృత్యువుని చూసి ఎలా భయపడతారో, జీవకోటి యావత్తు నా పేరు చెప్తే చాలు అలా భయంతో పారిపోతారు. నా అన్నగారైన కుబేరుడే నన్నెదిరించలేక, తన పట్టణం విడిచి పారిపోయి శివుడ్ని శరణు కోరి కైలాసములో నివసిస్తున్నాడు. అతడి పుష్పక విమానం నా సొంతమైంది. హాయిగా ఆకాశంలో తిరుగుతున్నాను. దేవేంద్రునకు కూడా నేనంటే హడలు. వాయువు కూడా నన్ను చూసి స్థంభించిపోతుంది. నా రాజధానియైన లంకంతా బలమైన రాక్షసులతో నిండి వుంది. బంగారపు కక్ష్యలు, వైఢూర్యాలు, తోరణాలూ కట్టుబడి వుంటుంది. ఏనుగులు, గుఱ్ఱాలు లెఖ్ఖలేనన్ని వున్నాయి. నిరంతరం మంగళ వాయిద్యాలు మ్రోగుతూ వుంటాయి. ఉద్యానవనాలు సుగంధ పరిమళాలు గల పూలతో ముచ్చటగొల్పుతూ జనాలతో నిండి సందడిగా వుంటాయి. కనుక నన్ను గురించి తక్కువగా అనుకోకు. రాజపుత్రీ నువ్వా ఉద్యానవనాలలో నాతో విహరించడానికి అంగీకరిస్తే, ఈ మానవ ప్రపంచం గురించిన ఆలోచనే నీకు రాదు. దేవేంద్ర భోగాలన్నీ నా లంకలో వున్నాయి. ఆ అనుభవం చూశావంటే అసలు రాముడు నీకు స్ఫురణకేరాడు. అయినా నీ దశరధ రాముణ్ణి చేతకానివాడనే అడవులకి పంపేసి, సమర్ధుడైన భరతుడికి రాజ్యం అప్పగించాడు ఆతని తండ్రి. ఆసంగతి నీకు తెలియదు. రాజ్యభ్రష్టుడు, తాపసవృత్తితో బతుకుతున్నవాడు, జాలిపడదగిన దుస్థితిలో వున్నవాడు, అయిన అటువంటి వానిమీద నీకు మక్కువ ఎందుకు? రాక్షసరాజునైన నేను నిన్నుకోరి, నీ మీద వ్యామోహముతో స్వయంగా వచ్చాను. అటువంటి నన్ను తిరస్కరించడం న్యాయమేనా?

పిరికిదానా..... ఇపుడు తిరస్కరిస్తే తర్వాత బాధపడవలసి వస్తుంది. రాముడు మానవుడు. నా కాలి వేలికి సరిపోలడు. నీ భాగ్యవశాత్తు నా అంతటివాడు నిన్ను కోరివచ్చాడు. కాదనకు' అన్నాడు.

ఆ మాటలు విన్న సీత కళ్ళు చింతనిప్పుల్లా అయ్యాయి. 'అయ్యో పరమశివుని మిత్రుడు, కుబేరుడు సాక్షాత్తు నీ సోదరుడని చెప్పుకుంటున్నావే. ఇలాంటి పాపిష్టిబుద్ధి నీకెలాపుట్టింది. నీలాంటి దుర్బుద్ధి, ఇంద్రియలోలుడు, అయిన రాజుపాలనలో నీ రాక్షసులంతా నశించి తీరుతారు. దేవేంద్రుని భార్య శచీదేవిని

అపహరించి అయినా బతకగలవేమో గాని, రాముని భార్యనైన నన్ను అపహరించి, బతికిబట్ట కట్టలేవు. నీకు మరణం తప్పదు' అంటు తీక్ష్ణ స్వరంతో మందలించింది.

రావణుడింక సహించలేకపోయాడు. ఒక అరచేతితో ఇంకో అరచేతిని నొక్కి శరీరం పెంచాడు. కొండలా పెరిగి వికటాట్టహాసం చేస్తూ... 'సీతా, నువ్వెంత పిచ్చిదానివి! నా శౌర్యపరాక్రమాల గురించి బహుశా విని వుండవు. ఆకాశంలో నిలబడి భూమినంతటిని చేతితో పట్టుకోగలను. సముద్రజలమంతా చుక్క మిగలకుండా తాగగలను. మృత్యువును కూడా జయించగల సమర్థుడిని. ఒక్కబాణంతో సూర్యకాంతి నిరోధించే శక్తి గలవాడిని. నువ్వెంతటి కష్టసాధ్యమైన కోరిక కోరినా, చిటికెలో తీర్చగలను. నా మాట విను. నన్ను భర్తగా స్వీకరించు. అని క్రోధావేశంతో అంటూ, కళ్ళు రెండు ఎఱ్ఱబారగా, సన్యాసి రూపం త్యజించి, తన సహజమైన స్వరూపంతో రావణుడు పెద్ద పర్వతంలా ప్రత్యక్షమయ్యాడు. కోపంతో ఊగిపోతున్నాడు. చెవులకి ధరించిన బంగారు కుండలాలు అటు ఇటు ఊగుతుండగా, నల్లగా మబ్బుల్లాంటి రంగుతో, పదితలలతో చేతిలో బాణంతో మృత్యుదేవతలా భయంకరంగా నిలబడ్డాడు. ఎఱ్ఱని బట్టలు ధరించి వున్నాడు. సీతని చూసి వికటాట్టహాసం చేసి,

'మైథిలీ.... ముల్లోకాలలోనూ పేరెన్నిక గన్న భర్త కావాలనుకుంటే నన్ను చేరుకో. నీకు తగిన భర్తని నేనే. నీఅంతట నువ్వు నన్నువరిస్తే ఎప్పటికీ నీకు అప్రియం చెయ్యనని మాట ఇస్తున్నాను. నేను చిరంజీవిని. అల్పాయుష్కుడైన, రాముని మర్చిపో. నీ మానవ స్వభావం వదిలి, నన్ను ప్రేమించు. ఒక ఆడదాని మాట మీద రాజ్యభ్రష్టుడై అడవులలో తిరుగుతున్న రాముణ్ణి ప్రేమిస్తు చాలా తెలివైనదానివనుకుని మురిసిపోతున్నావు. అతడిలో ఏం చూసి మోహిస్తున్నావు? మూర్ఖురాలా'అని ఆమెని దూషిస్తు, కామమోహితుడై, ఆమెమీద పడి, సీతని ఒడిసిపట్టుకున్నాడు. జుట్టుపట్టుకుని వెనక్కిలాగి, ఎడమచేతితో తలవైపు, కుడిచేత్తో తొడల క్రిందిభాగం పట్టుకుని ఆమెని లేవనెత్తాడు.

తీక్షణమైన కోరలు, బలమైన భుజములు కల్గిన రావణుడు, ఆమెనలాగే పట్టుకుని, మహాపర్వతంలా అడుగులు వేస్తూ వెళ్తుంటే, వనదేవతలు భయంతో పారిపోయాయి. ఆశ్రమం వెలుపలకి వచ్చి రావణుడు తలచుకోగానే, అతడి బంగారు రథం అతడి ముందు ప్రత్యక్షమైంది. సీత భయంతో గుంజుకుంటూ, నోటికొచ్చినట్లు పరుషవాక్యాలు పలుకుతున్నా లెక్కచేయకుండా ఆమెని ఒళ్ళో కూర్చోబెట్టుకుని, రథంలో కూర్చున్నాడు. మహాపతివ్రత అయిన సీత, రామా!, రామా! అంటూ, దీనాతిదీనంగా విలపిస్తోంది. రాముడు అడవిలో ఎక్కడో

వున్నాడు. రాముణ్ణి తలుచుకుని ఏడుస్తోంది. కామార్తుడైన రావణుడు, సీత తనని అసహ్యించుకుంటున్నా, ఆడత్రాచులా గుంజుకుంటున్నా పట్టించుకోకుండా, ఆమె ఎక్కడ పడిపోతుందో, అని గట్టిగా ఆమెని ఒడిసి పట్టుకుని, ఆకాశంలోకి రథంతో సహా ఎగిరిపోయాడు. అలా ఆకాశంలో వెళ్తున్న సీత, దుఃఖంతో ఆక్రోసిస్తూ 'మహాబాహూ లక్ష్మణా, రావణుడు పగబట్టి నన్ను దొంగిలించుకుపోతున్నాడు, కాని నీకీ సంగతి తెలియదు. దుర్మార్గుల్ని శిక్షించటమే నీ ధర్మమని చెప్తావే? ఈ క్రూరుని ఎందుకు శిక్షించవు?

ధర్మము తప్పి చరించేవాడు, దాని ఫలితాననుభవించాలి కదా! కాని వీడి ఖర్మ ఇంకా పరిపక్వంకాలేదేమో. ఇంతటి ఘోరకృత్యము చేసి కూడా, వీడు నాశనం కాలేదు. రావణా నువ్వీ ఘాతుకానికి తగిన శిక్ష అనుభవించి తీరుతావు. ఆహా కైకేయీ - నీ మనోరథం ఇప్పటికి నెరవేరింది. ఓ ప్రస్రవణ పర్వతమా, నీకు నమస్కారము. తొందరగా నా రామునితో రావణుడు నన్నెత్తుకుపోతున్నాడని చెప్పగలవా? గోదావరీమాతా, వనదేవతలారా, వన్యమృగములారా, పక్షిగణములారా, మీరంతా రామునితో, దుర్మార్గుడైన రావణుడు, నీ సీతని అపహరించి తీసుకుపోయాడని చెప్పండి. నా రాముడు మహా బలశాలి. ముల్లోకాలల్లోనూ ఎక్కడ దాచినా, ఈ రావణుణ్ణి వధించి, నన్ను కాపాడుకోగలడు' అంటూ సీత దీనాతిదీనంగా ఏడ్వసాగింది. రావణుని రథం ఆకాశంలో ఎగిరిపోతూ ఉండగా తనని కాపాడగలవారెవరైనా కనిపిస్తారేమోనని తన విశాలమైన కళ్ళతో నాల్గుదిక్కులా పరికించి చూస్తోంది. అలా చూస్తూ ఉండగా ఒక పెద్ద వృక్షంపై నిద్రపోతున్న జటాయువు కనబడింది.

వెంటనే ఆ వృక్షంవైపు చూస్తూ గట్టిగా 'ఆర్యా - జటాయువూ దుర్మార్గుడైన, రాక్షసరాజు రావణుడు నన్ను దిక్కులేని దానినిగా భావించి, ఎత్తుకుపోతున్నాడు. వీడు తన బలంతో ఎందర్నో జయించాడు. ఇపుడు వీడిచేతిలో ఆయుధం వుంది. కనుక వీణ్ణి ఎదుర్కోవద్దు. ఈ సంగతి మాత్రం రామలక్ష్మణులకు తెలియజెయ్యి? అంటు బిగ్గరగా అరచింది.

ఆ ఆక్రందన విని జటాయువు నిద్రలేచింది. ఆకాశంలో రథంలో వెళ్తున్న రావణాసురుణ్ణి, అతడి ఒడిలో వున్న సీతమ్మని చూసింది. జటాయువు పర్వత శిఖరమంత శరీరంతో, వాడియైన ముక్కుతో వున్న పక్షి. చెట్టుపై నించి రథంలో వున్న రావణాసురుడితో ఇలా అంది. 'దశగ్రీవా..... నేను జటాయువు అనే గృధ్రరాజాన్ని. నాకు సనాతన ధర్మం తెలుసు. సకల లోకానికి హితవు కలిగించే పురుషోత్తముడు దశరథ రాముడు. ఆ మహనీయుని ఇల్లాలు సీత. అటువంటి మహా ఇల్లాలినా నువ్వపహరించుకుపోతున్నావు? నువ్వు కూడా పాలకుడవైన

రాజువే కదా. రాజు అయినవాడు ధర్మవర్తనుడై వుండాలి. పరస్త్రీలను స్పృశించకూడదు. ఇటువంటి నీచపు బుద్ధి నీకెలా కలిగింది? నీ భార్యని పరపురుషుడు తాకితే నీకెంతటి క్లేశము కల్గునో, ఆలోచించు. నువ్వు పులస్త్యుని వంశంలో పుట్టావు. శాస్త్రవిహితముగాని, అర్థము, కామము, కోరగూడదని నీకు తెలియదా? చపలచిత్తుడవు. దుర్మార్గుడవు. పాపాత్ముడవు. నీకంతటి ఐశ్వర్యం ఎలా లభించిందో కదా! కాని పరదారాభిగమనం వల్ల నీ ఐశ్వర్యం నశించిపోతుంది. సీతని వదిలిపెట్టు. మంచివారి మాటలు నీచులు పెడచెవిని పెడతారు. నీకు చెప్పడం నిరర్థకం. అయినా నీకు రామునికీ శతృత్వం లేదు కదా. అతడు నీకేం ద్రోహం చెయ్యలేదు కదా! మరి అటువంటి వాని భార్యని ఎందుకు దొంగలించుకు పోతున్నావు? జనస్థానంలో రాక్షసుల్ని చంపాడంటావా?

శూర్పణఖ రాముని మోహించి, ఆయన భార్యఅయిన సీతని చంపబోయింది. అందుకే ఆమె ముక్కు, చెవులు కోసి పంపాడు. అసలు సంగతి తెలియక ఖరుడు సపరివారంగా రామునిమీదికి యుద్ధానికి వెళ్ళాడు. అందుకే రాముడు వారినందర్నీ చంపాడు. అందులో రాముని తప్పు ఏముంది. ఇప్పుడు నువ్వు అకారణంగా సీతని ఎత్తుకెళ్ళడం తగదు. వెంటనే ఆమెని వదిలెయ్యి. ఈ సంగతి రామునికి తెలిస్తే రాముడు నిన్ను దహించివేస్తాడు. నేను చెప్పే సంగతి అర్థం చేసుకో. నాయనా, ఎవరైనాసరే తలకి మించిన బరువు ఎత్తుకోకూడదు. ఎత్తుకుంటే నేలకొరిగిపోకతప్పదు.

నేను ముసలివాడ్ని అనుకుంటున్నావేమో. నా వయస్సు అరవై వేల సంవత్సరాలు. వేదము ప్రమాణంగా వున్నవాడిని. నేను బ్రతికివుండగా సీత నెత్తుకుపోవడం జరుగదు. నువ్వు యువకుడివి, కవచం ఆయుధం కల్గివున్నావు. అయినా పర్వాలేదు. నువ్వు నిజంగా వీరుడివైతే అక్కడే ఆగు. రాముని తండ్రి దశరథుడు నా ప్రాణమిత్రుడు. వారికోసం నా జీవితమైనా అర్పిస్తాను. ఆగరా... ఆగు. నిన్ను ముక్కుతో పొడిచి చంపేస్తాను' అంటు చెట్టుమీదినించి ఆకాశంలోకెగిరి రావణుడి రథాన్ని అడ్డగించింది జటాయువు. రావణాసురుడికి చాలా కోపం వచ్చింది. వెంటనే ఒక్క గెంతు గెంతి జటాయువుపై ఉరికాడు. వారిద్దరికీ తీవ్రమైన యుద్ధం జరిగింది. రావణుడు వాడియైన బాణాలతో జటాయువుని ముంచెత్తాడు. రావణుని మీదపడి జటాయువు తన వాడియైన గోళ్ళతో ముక్కుతో వాడి ముఖమంతా ఒళ్ళంతా గాయపరిచింది. ఒక పక్క బాణపరంపరకి జటాయువు ఒళ్ళంతా రక్తంముద్దలా అయిపోతోంది. సీత రథంలోంచి నిస్సహాయంగా కన్నీరు కార్చసాగింది.

జటాయువు అదిచూసి ఓర్వలేక ఒక్క ఎగురు ఎగిరి రావణుని చేతిలోని ధనస్సుని ముక్కలుముక్కలుగా చేసింది. తన పాదాలతో రావణుని కవచం చీల్చి పడేసింది. రావణుడి రథాన్ని కూడా కూల్చేసింది. రథం కట్టిన గాడిదలను, సారథిని కూల్చేసింది. ఛత్రం, చామరం విరిచిపడేసి అవి పట్టుకున్నవాళ్ళని ముక్కుతో పొడిచి చంపేసింది.

ఈ విధంగా వృద్ధుడైన జటాయువు, సాహసోపేతంగా రావణుడితో యుద్ధం చేసింది. అప్పుడిక చేసేదిలేక రావణుడు కూర్చున్నచోటునుంచి లేచి సీతని చేతితో పట్టుకుని యుద్ధం చేయసాగాడు. జటాయువు శక్తి కూడదీసుకుని రావణునితో పోరాడసాగాడు. కొంతసేపు రావణుని అడ్డగించి 'రావణా రామబాణములు వజ్రముల వంటివి. వాటిశక్తి నీకు తెలియదు. నువ్వు అల్పబుద్ధివి. అందుకే సీతమ్మని అపహరించి, పరివార సమేతంగా నీ నాశనం కొని తెచ్చుకుంటున్నావు. దాహము వేసినవాళ్ళు మంచినీళ్ళు త్రాగాలి. కాని విషం త్రాగకూడదు. అనాలోచితమైన పనిచేసి మృత్యుపాశంలో చిక్కుకున్నావు. ఇపుడు పారిపోతున్నానని సంబరపడకు. నువ్వెక్కడికెళ్ళినా రాముని బారి నించి తప్పించుకోలేవు. నిజంగా నువ్వు వీరుడివైతే రాముని ముందు నిలబడి యుద్ధం చెయ్యి. ఖరుడిలాగే నువ్వూ నేలకూలి ఛస్తావు. నీకు భూమిమీద నూకలు చెల్లాయి. కనుకనే ఇలా ధర్మవిరుద్ధమైన పని చేస్తున్నావు. నీకు వినాశము తప్పదు' అంది.

కాని రావణుడు దానిని ప్రక్కకి తోసి ముందుకు పోసాగాడు. అప్పుడు జటాయువు రావణుడి వీపుమీద కూర్చుని ముక్కుతో, గోళ్ళతో గీరసాగింది. కేవలం ముక్కు, గోళ్ళు ఆయుధాలుగా దొరికినచోటల్లా రక్కుతూ జుట్టుపీకుతూ నానాహింసలు పెట్టసాగింది. అపుడు రావణుడు ఎడమచేతితో సీతని గట్టిగా అదిమి పట్టుకుని కుడిచేతితో జటాయువుని బలంగా కొట్టాడు. సీతని అదిమిపట్టాడన్న కోపంతో ఆ పక్షిరాజు రావణుని పదిచేతులు కొరికిపడేసింది. కాని రావణుడి వరప్రభావం చేత మళ్ళీ పదిచేతులు పుట్టుకొనివచ్చాయి. అప్పుడు రావణుడు సీతని పక్కన కూర్చోబెట్టి జటాయువుని పిడికిళ్ళతో గుద్ది కాళ్ళతో త్రొక్కి కసి తీర్చుకున్నాడు. అయినా జటాయువు మళ్ళీ రావణుని ఎదుర్కొంది.

రాముడికోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్న ఆ జటాయువుని రావణుడు పదునైన కత్తితో దాని రెండు రెక్కలు నరికి పడేశాడు.

రెక్కలు తెగిన జటాయువు, కొన ఊపిరితో నేలమీద పడిపోయింది. నేలమీద పడి, రక్తపుమడుగులో కొట్టుకుంటున్న జటాయువును చూసి పరుగుపరుగున వచ్చి గట్టిగా కౌగలించుకుని భోరున విలపించసాగింది సీత. 'రామలక్ష్మణులారా,

రావణుని వలన నేను ఆపదలో చిక్కుకున్నాను. నన్ను రక్షించబోయి ఈ జటాయువు నేల కూలిపోయాడు. తొందరగా వచ్చి నన్ను కాపాడండి' అంటు ఉన్మత్తురాలిలా సీత పెద్దగా ఏడ్చింది.

రావణుడు జటాయువు రెక్కలు కండించాక సీతని పట్టుకోవాలని ఒక్క ఉదుటన వెళ్ళాడు. సీత గాబరపడుతు పరిగెత్తుకుని వెళ్ళి ఒక పెద్ద వృక్షాన్ని గట్టిగా కౌగలించుకుంది. రామా రామా అని అరుస్తు వాడికి దొరక్కుండా తప్పించుకుపారిపోసాగింది. అపుడు రావణుడు కసిగా ఆమె పొడవైన జట్టు పట్టుకుని గట్టిగా లాగాడు. వాడి వికృతచేష్టకి సృష్టంతా స్థంబించిపోయింది.

సీత, 'రామా!, లక్ష్మణా! అని ఏడుస్తూ పెనుగులాడసాగింది. రావణుడు తన బలమైన చేతులతో సీతని భుజాలమీద వేసుకుని ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

నల్లని మేఘంలాంటివాడి భుజాలమీద, బంగారు నగలతో, పచ్చని పట్టుచీరతో పసిమిరంగు మేనిఛాయతో, మెరుపుతీగలా మెరుస్తోంది. అప్పటికీ విడిపించుకోవాలనీ, ఆమె పెనుగులాడుతూనే వుంది. ఆమె తలలోని పూవులన్నీ రేకులు రేకులుగా నేలమీదపడ్తున్నాయి. ఆమె పాదాలకి ధరించిన మణిమంజీరాలు ఘల్లు ఘల్లుమని చప్పుడుచేస్తూ, నేలమీదకి జారాయి. ఆమె మెడలోని ముత్యాల సరాలు తెగి ఆ ముత్యాలు దారిపొడుగునా పడ్డాయి. సర్వభూతాలూ, ఆవిషాదదృశ్యంచూసి, 'ఆహా, ఇంక లోకంలో ధర్మము, సత్యము, దయ, న్యాయము అన్నీ అడుగంటిపోయాయి కదా! అని దుఃఖించాయి. జుట్టు చెదిరి, బొట్టు చెరిగి, సీత దీనాతిదీనంగా 'రామా, రామా' అని గుండెలవిసేలా ఏడుస్తోంది' ఎవరైనా తనని రక్షించడానికి రాకపోతారా అని, కుళ్ళి కుళ్ళి ఏడుస్తు దిక్కులన్నీ పరీక్షించి చూస్తోంది.

ఎక్కడా ఎవ్వరూ కనబడటం లేదు. దుఃఖంతో మనసు చెదరి, భయ విహ్వలయై, కోపంతో కన్నులు ఎఱ్ఱబారగా, రావణునితో ఇలా అంది.

'నీచుడా, ఇలాంటి పాపిష్టి పనిచెయ్యడానికి నీకు సిగ్గులేదా? నా భర్త లేని సమయాన, నన్ను ఒంటరిదానిని చేసి ఎత్తుకుపోతున్నావే! ఎదురించే ధైర్యం లేక మాయామృగాన్ని పంపి, నా భర్తను ఆశ్రమంలో లేకుండా చేసి, సిగ్గుమాలిన పనిచేసి పొంగిపోతున్నావు. నా మామగారి మిత్రుడైన జటాయువు ఎదిరిస్తే నిష్కారణంగా, వృద్ధుడని కూడా గౌరవించకుండా, వానిని చంపేశావు. గొప్ప ప్రతాపవంతుడ ననుకుని మురిసిపోతున్నావు. నిజంగా వీరుడవైతే, రామునితో యుద్ధం చేసి జయించి, నన్ను గెల్చుకోవాలని ప్రయత్నించు. దుర్మార్గుడా, నువ్వు చేసిన పని

ఎంత హీనమైనదో తెలుసా? ఇతరుల భార్యని పరోక్షంగా అపహరించడం కన్నా పాపం మరోటి లేదు.

నీ నడవడి నీ వంశానికి మచ్చ తెచ్చింది. పౌలస్త్యుడనని చెప్పుకుని విఱ్ఱవీగుతున్నావు. నీకు నిజంగా పౌరుషం వుంటే రామలక్ష్మణులు వచ్చినదాకా ఆగు, వారు వచ్చారా ఇక నువ్వు బ్రతకవు. నీ సర్వసైన్యాన్ని సమకూర్చుకుని వచ్చినా, వారిముందు ఆగలేవు. కనుక నన్ను విడిచి వెళ్ళిపో. నన్నొదలకపోయావో, నేడు కాకపోతే రేపైనా నా రాముడు నిన్ను అంతమొందించకమానడు. రక్త ప్రవాహంతో నిండిన వైతరణీనది, నీకు తొందరలోనే దర్శనమిస్తుంది. పరదారను కోరినవాడు, యమలోకంలో బాగా కాలిన బంగారు పువ్వులు, వైఢూర్యాలు, ఆకులు కలిగి నిండా ముళ్ళతో నిండిన బంగారు వృక్షాన్ని కౌగలించుకోవలసి వస్తుంది. ఒంటరిగా పధ్నాలుగు వేలమంది రాక్షసుల్ని సంహరించిన మహావీరుడు నా రాముడు. ఆయన ప్రాణసమానమైన నన్ను అపహరించిన నిన్ను తన వాడియైన బాణాలతో చీల్చిచండాడక మానడు.'

అంటు కొంతసేపు ధైర్యంగా, మరికొంతసేపు దీనాతిదీనంగా రావణునికెన్నో హితవాక్యాలు చెప్పింది. అయినా రావణుడెంత మాత్రం పట్టించుకోకుండా ఆమెనలాగే భుజంమీద అదిమిపట్టి సాగిపోయాడు.

మార్గమధ్యంలో రాముడు కనిపిస్తాడేమో యని సీత చాలా ఆశగా చూసింది. కాని ఎక్కడా రాముడు కనపడలేదు. ఆమె ఆశలన్నీ అడియాసలయ్యాయి.

అంతలో ఒక కొండపై భాగముమీద ఐదుగురు ధృడమైన వానరులు ఆమెకు కనిపించారు. అప్పుడామెకో ఉపాయం తోచింది. తన నగలలో తీయగలిగినవన్ని తీసి, తన పచ్చని చీర చెరగు చింపి, అందులో మూటగట్టి జాగ్రత్తగా వానరుల ముందు పడేలా వాటిని జారవిడచింది. ఒకవేళ రాముడు తనని వెతుక్కుంటూ ఆదారిన వస్తే వారు ఆ నగలను రామునికి చూపకపోతారా అని ఆమె ఆశ! అయితే సీతని లంకకి చేర్చాలనే తొందరలో రావణుడు ఆ సంగతి గమనించలేదు.

ఆమె మొర వానరులకి వినబడింది. ఆకాశమార్గంలో రావణుడెత్తుకుపోతున్న విశాలాక్షి అయిన సీతని, ఆమె ఏడుస్తూ వుండడాన్ని ఆ వానరులు చూశారు.

రావణుడు రివ్వుమాటు వేగంగా పంపానది దాటి దక్షిణదిశగా లంకవైపు సాగిపోయాడు. అడవులను, చెరువులను, కొండలను, సరసులను దాటి, బాణంలా దూసుకుపోతున్నాడు. అలాగ వెళ్ళివెళ్ళి అగాధమైన సముద్రంమీదుగా ఆకాశంలో ప్రయాణం చేస్తూ సీతని గట్టిగా పట్టుకుని, చివరకి లంకకి చేరుకున్నాడు. చేతులు

కాళ్ళు కొట్టుకుంటూ, ఏడుస్తున్న సీతని లంకా నగరానికి చేర్చి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

లంకానగరం విశాలమైన బాటలతో, అందమైన భవనాలతో చాలా సుందరంగా వుంది. ఆ పట్టణ మధ్యభాగంలో చుట్టూ ఉద్యానవనాలతో ఇంకా రమణీయంగా వుంది, రావణుని భవనం. అంతఃపురానికి సీతని చేర్చాడు వాడు.

సీత శోకంతో కృంగిపోతూ కూడా వాని అవివేకానికి జాలిపడింది. రావణుడు సీతని తన అంతఃపురంలో దాచి, ఆ భవనానికి భయంకరమైన పిశాచస్త్రీలను కాపలాగా వుంచాడు.

'నా అనుమతి లేకుండా ఏ స్త్రీ గాని, ఏ పురుషుడు గాని ఆమె దగ్గరకి వెళ్ళకుండా గట్టి కాపలాకాయండి. ఆమె కోరినన్ని బంగారు నగలు, పట్టు వస్త్రాలు ఆమెకి కానుకగా ఇవ్వండి. ఆమె ఏం కోరినా సరే, వెంటనే ఇవ్వండి. ఎవ్వరూ, ఏ విధంగానూ ఆమె మనస్సుకి కష్టం కలిగించకండి. ఆమెకి అప్రియం కలిగేలా పలికినా, అలా ప్రవర్తించినా, వారి జీవితాలంతటితో సరి' అని కఠినంగా ఆజ్ఞాపించి అంతఃపురంలోంచి బయటికి వచ్చి, ఇకమీదట కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తున్నాడు.

అంతలో అత్యంత బలాఢ్యులైన ఎనిమిది మంది రాక్షసవీరులు వాడికి కనిపించారు. వెంటనే వారిని పిల్చి, 'రాక్షసయోధులారా, మీరు పదునైన ఆయుధాలతో, జనస్థానానికి వెళ్ళండి. ఇపుడక్కడి రాక్షసులంతా నిర్మూలమై పోయారు. రాముడు ఖరదూషణాది మహావీరులను సేనాసమేతంగా నాశనం చేశాడు. అప్పటినుంచీ రాముని మీద పగ తీర్చుకోవాలని, ప్రతీకారవాంఛతో, నా మనసు ఉడికిపోతోంది. ఆ రాముణ్ణి చంపేవరకు నాకు నిద్రపట్టదు. అందుకే ఆతడి ప్రాణసమానమైన భార్యని అపహరించుకుని వచ్చాను. మీరిప్పుడు ఆ జనస్థానంలో రాముని ఆశ్రమానికి దూరంగా వుండి, రాముడు చేసే ప్రతి పనీ పరిశీలిస్తూ వుండండి. ఎప్పటికప్పుడు నాకు సమాచారంగా తెలియజెయ్యండి. మీ బలపరాక్రమాలమీద విశ్వాసంతో మీకీ బాధ్యత అప్పగిస్తున్నాను' అని ఆజ్ఞాపించాడు.

ఆ ఎనమండుగురూ 'చిత్తం' అని రావణునికి నమస్కరించి వెళ్ళిపోయారు. రావణుడు తన తెలివికి తానే మురిసిపోయాడు. అప్పుడింక సీత గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు. వెంటనే సీతని ఉంచిన సుందరమైన గృహంలోకి వెళ్ళాడు. అక్కడ సీత రాక్షస స్త్రీలమధ్య దీనాతిదీనంగా ఏడుస్తోంది. ఆ

రాక్షసాధముడు దర్పంగా సీతదగ్గరకు వెళ్ళాడు. బలవంతంగా ఆమెని తనవెంట బెట్టుకుని, భవనమంతా చూపించాలని తీసికెళ్ళాడు. రావణుడి అంతఃపురం దేవేంద్రభవనాన్ని తలదన్నేట్లు వుంది. ఎన్నెన్నో ప్రాసాదాలతో నిండివుంది. వేలకొద్దీ స్త్రీలు అక్కడ దాసీలుగా వున్నారు. రకరకాల పక్షుల కిలకిలారావాలతో, ఆ ప్రాసాదాలు ఆహ్లాదకరంగా వున్నాయి. ఆ భవనాల స్తంభాలు మేలిమి బంగారంతో తాపడం చేసివున్నాయి. ఆ ప్రాసాదాలకమర్చిన మెట్లు అడుగుపెడితే చాలు. దివ్యదింధుభినినాదాలు పలుకుతాయి. అలాంటి మెట్లు, సీతని వెంటబెట్టుకుని ఎక్కాడు. అన్ని ద్వారాలకూ బంగారుతోరణాలు, చిత్ర విచిత్ర కాంతులీనుతున్నాయి. ఆ మేడపై భాగాన్నంతా సీతకి చూపించాడు. ముఖద్వారాలు దంతము, వెండి నగిషీలతో వున్నాయి. కిటికీలకి బంగారు తీగలతో చేసిన జాలీలు అమర్చబడి వున్నాయి. గదులలో నేలమీద తెల్లనిమణులు తాపడం, చేసి వున్నాయి. ఈ వింతలన్నీ స్వయంగా వర్ణిస్తూ సీతకి చూపించాడా రావణుడు.

ఒకపక్క దుఃఖంతో కుళ్ళికుళ్ళి ఏడుస్తుంటే ఆమెకి బలవంతంగా దిగుడుబావులు, పుష్కరిణులు వున్న ఉద్యానవనం చూపించాడు. తన వైభవాన్నంతా ఆమెకి చూపి, ఆమెని ప్రలోభపెడుతూ ఇలా అన్నాడు. 'సీతా - ముప్పదికోట్ల రాక్షసులకి అధిపతిని నేను. వాళ్ళందరూ కూడా చాలా భయంకరమైన వాళ్ళు. వెయ్యిమంది బలాఢ్యులైన సేవకులున్నారు నాకు. ఈ సామ్రాజ్యం, ఈ వైభవం, అంతా నీకు సమర్పిస్తున్నాను. నిన్ను ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటాను. విశాలాక్షీ, నా జీవిత సర్వస్వం నువ్వే. నాకు కొన్నివేలమంది భార్యలున్నారు. నువ్వు నన్ను పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకుంటే వారందరకు యజమానురాలినిగా నా పట్టమహిషిని చేసుకుంటాను. నా మాట మన్నించు. నీ కోసం తపించిపోతున్న నన్ను అనుగ్రహించు. ఈ లంకాపట్టణం నూరుయోజనాల విస్తీర్ణం వుంది. కొన్నివేలమంది రాక్షసులతో నిండివుంది. దేవేంద్రుడు కూడా ఇక్కడ అడుగుపెట్టలేడు. నన్నెదిరించగల వీరులు ముల్లోకాలలో లేరు.

తేజోహీనుడు, రాజ్యభ్రష్టుడు, అల్పాయుష్కుడు, తాపసవేషంతో తిరుగుతున్నవాడు, అయిన ఆ మానవమాత్రుడు నన్నేం చెయ్యగలడు?

నేనే నీకు తగిన భర్తని. నన్ను పూజించు. యౌవనం ఎప్పటికీ శాశ్వతం కాదు. వెఱ్ఱిదానా, చింతవదిలి నాతో స్వర్గసుఖాలు అనుభవించు.

రాముడు వచ్చి నిన్ను తీసుకెళ్తాడని భ్రమపడుతున్నావేమో. అతడి ఊపిరి కూడా ఇక్కడికి చేరలేదు. నా బాహుబలంతో రక్షించుకుంటున్న నిన్ను రాముడు చేరడం చాలా అసాధ్యం.

కనుక జానకీ - ఈ సువిశాలమైన లంకా రాజ్యాన్ని నువ్వు పాలించు. నా పట్టమహిషిగా వుండి ఇక్కడవున్న అందమైన దేవతాస్త్రీలనందర్నీ శాసించు. నువ్వు పూర్వజన్మలో చేసుకున్న స్వల్పమైన పాపం వల్ల ఇన్నాళ్ళూ వనవాసం చేశావు. ఇక మీదట పుణ్యాఫలంగా నన్ను పూజించుకో! సుగంధ పరిమళాలు వెదజల్లే, పుష్పమాలికలెన్నో వున్నాయి. రత్నాభరణాలెన్నో వున్నాయి. అవన్నీ ధరించు. నా సోదరుడైన కుబేరుడిని ఓడించి, రమణీయమైన పుష్పకవిమానాన్ని గెల్చుకున్నాను. అది చాలా అద్భుతమైనది. మనిద్దరం అందులో హాయిగా విహరిద్దాము. ఎంతో అందమైన నీ ముఖం ఇలా శోకంతో దైన్యంగా చేసుకోకు' అంటు రావణుడు, సీతని ఎన్నోవిధాల, తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నించాడు. కాని సీత ఆ నీచునివైపు కన్నెత్తైనా చూడలేదు. పమిటిచెంగుతో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. ఆమె మనస్సులో రాముడినే ధ్యానిస్తోంది. రావణుడు చేసిన పరాభవం తల్చుకుని తల్చుకుని కుమిలిపోతోంది. కాని రావణుడు మాత్రం సీత పమిటచెంగుతో ముఖం కప్పుకోవడం చూసి ఆమె సిగ్గుపడుతోందేమోనని భ్రమపడ్డాడు.

గర్వంగా ఇలా అన్నాడు. 'వైదేహీ సిగ్గుపడకు. ధర్మం అతిక్రమిస్తున్నానేమో యని విచారించకు. దైవనిర్ణయం వల్లే నువ్వు నా దగ్గరకు చేరావు. ఇదెంత మాత్రం అధర్మం కాదు. నా పదితలలు వంచి నీకు పాదాభివందనం చేస్తాను. నన్ననుగ్రహించు. నేను నీ దాసుణ్ణి. కామమోహితుడనైన నాకు మాటలు కూడా తడబడుతున్నాయి. ఈ రావణుడు ఇప్పటిదాకా ఏ స్త్రీకి తలవంచలేదు. ఆ భాగ్యం మొదటిసారిగా నీకు కలిగింది' అంటు ఆమె మనస్సున కుల్లాసం కలిగించి, ఎలాగైనా ఆమెని పొందాలని, ప్రయత్నిస్తున్నాడు.

రావణుడి అహంకారపూరితములైన ఆ మాటలు విని, అంతశోకంలోనూ ధైర్యం తెచ్చుకుని, నిర్భయంగా ఒక గడ్డిపరకను చేత్తో పట్టుకుని దానివంక చూస్తూ ఇలా అంది.

'సత్యసంధుడు, ధర్మమూర్తి అయిన దశరథ మహారాజు కుమారుడైన శ్రీరాముడు, ముల్లోకాలలోనూ ధర్మజ్ఞుడు. ఆ పురుషోత్తముని భార్యను నేను. నా భర్త ఆజానుబాహువు. విశాలాక్షుడు. దేవతాస్వరూపుడు. ఇక్ష్వాకువంశోద్భవుడైన తేజోమూర్తి. తమ్ముడైన లక్ష్మణునితో కలసి నిన్ను సునాయాసంగా చంపగలడు. నీకున్న రాక్షసవీరుల బలగం చూసుకుని నువ్వు మురిసిపోతున్నావు. కాని, అసలు నువ్వు నన్నపహరించడం ఆ పరాక్రమశాలి కనుక చూసివుంటే, వారినందర్నీ నా

రాముడు గరుత్మంతుడు పాములను చంపినట్లు ముక్కలు ముక్కలు చేసి చీల్చి చెండాడగలడు.

నీకు దేవదానవయక్షకుబేర గణాలవల్ల చావులేకుండా వరం వుందని విఱ్ఱవీగకు. నా రామునితో వైరము తెచ్చుకున్న నువ్వు బ్రతికి బట్టకట్టడం కల్ల. నా రాముని క్రోధాగ్నిలో నువ్వు కాలి బూడిద అయిపోతావు.

రాముడు ఆకాశంలోని చంద్రుణ్ణి నేలమీద పడగొట్టగలడు. సముద్రమును ఇంకింప చెయ్యగలడు. అంతటి మహావీరునికి, నీ నుండి నన్ను రక్షించుకోవడం అంతకష్టమైన పనికాదు. నీ ఆయుర్దాయం తీరింది. నీ ఐశ్వర్యం సర్వనాశనం కాబోతోంది. నీ లంక విధవ కాబోతోంది. అందుకే ఇంతటి పాపకృత్యం చేశావు. రామునితో అడవులలో సుఖంగా వున్న నన్ను ఇలా తీసుకొచ్చి, మాకు ఎడబాటు కలిగించావు. ఇంక నువ్వు సుఖంగా వుండవు. ఓ రాక్షసాధమా! నువ్వు మహాపాపివి. నన్ను తాకే అర్హత నీకు లేదు. నువ్వు నా శరీరాన్ని మాత్రమే బంధించావు. ధర్మమూర్తి అయిన రాముని ఇల్లాలిని నేను. మహాపతివ్రతని. ఈ దేహాన్ని మాంసాన్ని తనివితీరా ఆరగించు. కాని నా భర్తని కాదని పర పురుషుని నేను వరించను. నాకు నా శీలమే ముఖ్యం. కళంకినిగా నేను బ్రతకలేను అని అనేకవిధాల వాడిని నిందిస్తూ, కసితీరా తిట్టి సీత భోరుభోరున ఏడవసాగింది.

ఆ పరుషవాక్యాలకి రావణునిలో పౌరుషం రగిలింది. పళ్ళు పటపట కొరకుతూ ఉరుముతున్న స్వరంతో ఇలా అన్నాడు.

'మైథిలీ, నీ నిర్ణయం అదే అయితే నా మాట కూడా విను. ఇవాళ నుంచీ నీకు పన్నెండు నెలలు గడువు ఇస్తున్నాను. నీ మనస్సు మార్చుకుని, నా వశమయ్యావా సరే, లేకపోతే నిన్ను ముక్కముక్కలుగా నరికి, నా వంటవాళ్ళని నాకు ఫలహారంగా వడ్డించమంటాను' అని సీతకు భయం కలిగేలా చెప్పి, చుట్టూ కాపలాగా వున్న రాక్షసస్త్రీలను పిలిచి ఇలా చెప్పాడు.

'మీరంతా మీ వికృతమైన వేషాలతో వికృతమైన చేష్టలతో ఈమెని లొంగదీయండి. ఈమె గర్వం, పొగరు అణగద్రొక్కండి' అని ఆజ్ఞాపించాడు. సరే అని వారంతా రావణునికి నమస్కరించి, సీతని చుట్టుముట్టారు. రావణుడు క్రోధంతో హుంకరిస్తు, బలమైన పాదాలతో, భూమిని బ్రద్దలయ్యేలా గట్టిగా తన్నాడు. కసిగా పళ్ళు పటపట కొరుకుతూ రాక్షస స్త్రీలతో ఇలా అన్నాడు.

'అంతఃపురం నుంచి, ఈమెని అశోకవనానికి తీసికెళ్ళండి. ఎవ్వరికీ కనపడకుండా రహస్యంగా చెట్లమధ్యలో దాచి వుంచండి. నయానా భయానా,

ఎలాగైనా సరే, నా మాట వినేలా ఒప్పించండి. అడవి ఏనుగునెలా లొంగదీస్తారో ఈమెనలా లొంగదియ్యండి తెలిసిందా?' అని రావణుడు ఆజ్ఞాపించగానే ఆ రాక్షస స్త్రీలు తమ వెంట సీతని అశోకవనానికి తీసికెళ్ళారు. ఆ వనంలో రకరకాల పండ్ల చెట్లు, పూలచెట్లు, మహావృక్షాలింకా ఎన్నోవున్నాయి. ఆ వృక్షాలమీద పక్షులు ఆ తియ్యని పండ్లు ఆరగించి, ఎల్లప్పుడూ మదంతో కూస్తుంటాయి. పెద్దపులుల మధ్య లేడిపిల్లలా, సీత ఆ రాక్షస స్త్రీల వెంట నడుస్తూ, అశోకవనం చేరింది. తన దౌర్భాగ్యానికి వెక్కివెక్కి ఏడవసాగింది. ఆ రాక్షస స్త్రీలంతా, ఆమెచుట్టు చేరి నానారకాల బీభత్సమైన చేష్టలతో హింసించటం మొదలుపెట్టారు. సీత భర్తని తల్చుకుని, కుమిలిపోతూ తెలివితప్పి పడిపోయింది.

ఇక్కడ సీత స్థితి ఇలా వుండగా, అక్కడ జనస్థానములో, రాముడు మాయామృగాన్ని వెంటబడి తరిమి, చాలాదూరం వెళ్ళిపోయి, ఇంక ప్రాణాలతో దాన్ని పట్టుకోవటం సాధ్యంకాదని తెలుసుకుని, తీక్షణమైన బాణాలతో, లేడిరూపంలో వున్న ఆ మారీచుడ్ని సంహరించాక, తన ఆశ్రమానికి తిరిగిబయల్దేరాడు.

తిరిగి ఆశ్రమానికి వెళ్తుండగా దారిలో ఎన్నెన్నో అపశకునాలు కనిపించాయి. రాముడికి చాలా ఆందోళన కలిగింది. మారీచుడు చస్తూ, తన కంఠస్వరాన్ని అనుకరిస్తు అరిచాడు. ఆ అరుపులువిన్న సీత భయపడి, లక్ష్మణుణ్ణి కాని పంపలేదు కదా. రాక్షసులంతా కుట్రపన్ని సీతని చంపాలని, ఈ మారీచుడ్ని మాయామృగం వేషంలో పంపి వుంటారు. లక్ష్మణుడు సీతని ఆశ్రమంలో ఒంటరిగా వదిలి, తనని రక్షించడానికి వచ్చాడంటే చాలు. రాక్షసులంతా కలసి మూకగా సీతపై పడి చంపివుండరు కదా' అని పరిపరివిధాల ఆలోచిస్తూ, రాముడు జనస్థానం వైపు వడివడిగా అడుగులు వేస్తూ వెళ్తున్నాడు.

అంతలో చిన్నబోయిన ముఖంతో, లక్ష్మణుడు తనవైపు రావటం కనిపించింది. అసలే చెదరిన మనస్సుతో, దుఃఖంలో మునిగివున్న రాముడు, విషణ్ణవదనంతో వస్తున్న లక్ష్మణుణ్ణి చూసి దిగ్భ్రాంతి చెందాడు. 'లక్ష్మణా, సీతని ఒంటరిగా వదిలి వచ్చావా. అసలే ఈ అడవంతా రాక్షసమాయతో నిండివుంది. ఎందుకలా వచ్చావు? అయ్యో ఎంత అనాలోచితమైన పనిచేశావు? సీతకేం ఆపద వాటిల్లదుకదా. అన్నీ దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. రాక్షసులు సీతని చంపుకు తినేస్తారేమో. తినకపోయినా ఎత్తుకుపోతారేమో తమ్ముడూ, మనం వెళ్ళేసరికి సీత ప్రాణాలతో వుంటుందా? ఆ మాయా మృగం వెంటబడి అనవసరంగా ఇంతదూరం వచ్చాను అది చస్తూ మారీచుడిగా మారి, నా కంఠస్వరంతో

అరిచింది. ఎంత వంచన జరిగింది?' అంటు లక్ష్మణుణ్ణి మృదువుగా మందలిస్తూ భోరున ఏడ్చేశాడు. లక్ష్మణుణ్ణి కౌగలించుకుని.

'లక్ష్మణా, భయంకరమైన ఈ దండకారణ్యానికి, జానకి నన్ను వెన్నంటి వచ్చింది. ఈ వనవాసంలో, దుఃఖం కలగకుండా నాకు తోడుగా నిలిచింది. రాజ్యంపోయినా ఆ సుకుమారి సన్నిధిలో నేను సుఖంగా వున్నాను. ఆమె లేకుండా నేనెలా బ్రతికేది? ఆమె కనిపించకపోతే నేను ప్రాణాలతో వుండను. మేమిద్దరం లేకుండా నువ్వు అయోధ్యకి తిరిగివెళ్తే కైకేయి తన మనోరథం తీరింది కదా అని, చాలా సంతోషిస్తుంది. నా తల్లి కౌసల్య జీవితమంతా ఆమెకి దాస్యం చేస్తూ బతకాలి. తొందరగా నడు ఆశ్రమంలో సీత వుందో లేదో, అయినా లక్ష్మణా, నీ విషాదవదనం చూస్తే నాకు అనుమానంగా వుంది. నువ్వు పరాకుగా వుంటే రాక్షసులామెని చంపెయ్యలేదు కదా. మారీచుడి కేకలు విని భయపడి నిన్ను పంపిందా? అయినా నువ్వు సీతని వదిలి రాకుండా వుండవలసింది. అయ్యో! ఎంతటి ఆపద వచ్చింది! ఇపుడింక ఏమనుకుని ఏం లాభం' అంటు వడివడిగా నడవసాగాడు. అన్నగారి మాటలు విన్న లక్ష్మణుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వెనకాలే నడవసాగాడు.

లక్ష్మణుడి కన్నీరు చూసి రాముడికి గాబరా కలిగింది. 'లక్ష్మణా - నీ మీద నమ్మకంతో సీతని నీ కప్పగించాను. అసలు ఆమెని వదిలి నువ్వెందుకు వచ్చావు? నాకు నీ కన్నీరు చూస్తుంటే గుండెలు జారిపోతున్నాయి. అసలేం జరిగిందో చెప్పు' అని అడిగాడు.

అప్పటిదాకా నోటమాటరాక ఖిన్నుడై వున్న లక్ష్మణుడు, చాలా కష్టంమీద, గొంతు పెకిలించుకుని, 'అన్నయ్యా.... నా అంతట నేను సీతమ్మని వదిలి రాలేదు. ఆ క్రూర రాక్షసుడి అరుపులు విని, ఆమె చాలా అభ్యంతరకరంగా, తీవ్రంగా నన్ను నిందించి నీదగ్గరకి పంపింది. నువ్వే ఆ ఆర్తనాదం చేశావనుకుని, ఆవిడ గట్టిగా ఏడుస్తు, వెళ్ళువెళ్ళు అని నన్ను తొందరచేసింది.

కాని నేను మీ బలపరాక్రమాలు గురించి చెప్పి, 'అమ్మా, రామునికి ఆపద కలిగించ గల రాక్షసులెక్కడా వుండరు. ధైర్యంగా వుండు. రాముడు దీనంగా 'నన్ను రక్షించండి' అని ఎపుడూ పలుకడు. ఇదంతా రాక్షసమాయ. నువ్వు వీరపత్నివి. ధైర్యంగా వుండు' అని అనేకవిధాల నచ్చచెప్పాను.

కాని మనసు చెదిరిన ఆమె, నా మాటలు నమ్మలేదు. కన్నీటితో నన్ననేకవిధాల నిందించింది లక్ష్మణా నీ మనస్సులో ఏదో చెడుతలంపు వుంది.

నీ అన్నగారు చనిపోతే నన్ను పొందాలని తాపత్రయపడుతున్నావేమో. భరతుడు నువ్వు లాలూచీపడి, ఇలాంటి ఆలోచన చేశారేమో. ఆ ఆశతోనే భరతుడు నిన్ను మా వెంట పంపివుంటాడు. ఒంటరిగా నన్ను వెంటపెట్టుకుని వచ్చిన రాముణ్ణి వెన్నంటి వచ్చిన గూఢచారివి నువ్వు. రాముడు ఎప్పుడు లేకుండాపోతాడా అని అవకాశం కోసం చూస్తున్నావు. అందుకే రాముడంత దీనంగా ఆర్తనాదం చేస్తున్నా నన్నొదిలి వెళ్ళడం లేదు నువ్వు' అంటూ చాలా నిష్ఠూరంగా నన్ను తూలనాడింది. ఆ పరుష వాక్యాలు విని సహించలేక ఇలా వచ్చాను' అని చాలా సిగ్గుపడుతూ చెప్పాడు.

కాని రాముని మనస్సంతా సీతమీద బెంగతో ఆందోళనగా వుంది. అందుకే లక్ష్మణుడి మనస్థితిని అర్థం చేసుకోలేకపోయాడు. 'లక్ష్మణా, ఏది ఏమైనా నువ్వు చాలా తప్పుచేశావు. సీత ఆదుర్దాకొద్దీ ఏమైనా అందే అనుకో. నా సామర్థ్యం తెలుసుండీ నువ్వెలా వచ్చేశావు? నా మాటనతిక్రమించి ఎలా రాగలిగావు? నువ్వు చెప్పినట్లు ఆ మాయామృగం రాక్షసుడే, నన్ను ఆశ్రమం నుంచి దూరంగా తీసికెళ్ళిపోయింది. నా బాణం దెబ్బ తగలగానే, నా కంఠస్వరాన్ని అనుకరిస్తూ కేకలుపెట్టి అసలు రూపంతో చచ్చిపడింది. అది విని సీత స్త్రీ సహజమైన భయంతో ఏదో అనివుంటుంది. అయినా ఆమెని వదిలిరావడం నీ తప్పే. ఇది నాకు నచ్చలేదు' అన్నాడు దుఃఖంతో.

అలా వాళ్ళిద్దరూ ఆలోచిస్తూ ఏదో కీడు జరిగివుంటుందని శంకిస్తూ, వెళ్తుండగా, రాముని ఎడమ కన్ను అదిరింది. అడుగులు తడబడ్డాయి. శరీరం వణకసాగింది. ఈ అశుభసూచకాలైన శకునాలు చూసి రాముడు, 'లక్ష్మణా నా మనస్సు కీడు శంకిస్తోంది. నా సీత క్షేమంగా వుందంటావా?' అని ఆరాటపడుతూ ఆశ్రమంలోకి ప్రవేశించాడు. ఆశ్రమం శూన్యంగా వుంది. రాముడు ఆందోళనగా ఆశ్రమం మూలమూలలా వెతకసాగాడు. ఎక్కడా సీత జాడలేదు. ఆశ్రమంలోని దర్భలూ, అజినమూ అన్నీ చిందరవందరగా పడివున్నాయి. ఆ దృశ్యం చూసేసరికి రాముడికి గుండెలు జారినట్టయ్యింది. 'అయ్యో అనుకున్నంతా అయిందే. ఈ నీచులైన రాక్షసులు నా సీతని చంపితినేశారా? లేక ఎత్తుకుపోయారా?' అని వాపోయాడు మళ్ళీ మనస్సు చిక్కబట్టుకుని, ఒకవేళ పూలు, పండ్లు తెచ్చుకుందుకు అడవిలోకి వెళ్ళిందేమో అనుకున్నాడు.

మంచినీటి కోసం తామరకొలను దగ్గరకి వెళ్ళిందేమో అని మళ్ళీ అనుకున్నాడు. ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తూ, పిచ్చివానిలా చెట్ల మధ్య తిరుగుతూ, ప్రతిచెట్టునీ, ప్రతి పుట్టనీ సీతగురించి అడిగాడు. కొండలెక్కి దిగుతు

అణువణువు గాలించాడు. నదీ తీరం వెంబడి పరుగులు తీస్తూ సీత జాడ చెప్పమని ప్రాధేయపడ్డాడు. కనిపించిన అడవి జంతువునల్లా సీత గురించి చెప్పమని అడిగాడు.

'సీతా నాకు కనపడకుండా దాక్కుని, నన్ను ఆటపట్టిస్తున్నావా?' అంటూ ఉన్మత్తుడిలా చెట్లమధ్య వెతుకుతూ, దీనాతి దీనంగా ఏడవసాగాడు. అయ్యో అతి సున్నితములైన నా సీత అవయవాలు ఆ రాక్షసిమూకలు నిర్దాక్షిణ్యంగా విరిచి ముక్కలు చేసుకు తిన్నారేమో అని ఆలోచిస్తూ ఒణికిపోయాడు. 'లక్ష్మణా సీత జాడ తెలిసిందా? 'సీతా ఎక్కడున్నావు?' అంటూ ఎలుగెత్తి అరవసాగాడు.

ఈ విధంగా రాముడు అడవుల్లో నదీతీరాల్లో, పర్వతాలమీదా, తొందరతొందరగా తిరుగుతూ, వెతకసాగాడు. ఎక్కడైనా సీత కనిపిస్తుందేమో, అనే ఆశతో వెతికినచోట వెతకసాగాడు. ఎంతవెతికినా సీతజాడ తెలియలేదు. మళ్లీ శూన్యంగా వున్న ఆశ్రమంలోకి వెళ్ళాడు. ఎటుచూసినా చెల్లాచెదరుగా పడివున్న వస్తువుల్ని చూసి బెంబేలెత్తిపోయాడు.

రాముడు దుఃఖాన్ని ఆపుకోలేక, లక్ష్మణుని రెండు భుజాలు పట్టుకుని కుదిపేస్తూ, 'లక్ష్మణా సీత ఎక్కడికెళ్ళింది? ఎవరెత్తుకుపోయారు? ఇక్కడికసలు ఎవరు వచ్చివుంటారు? సీతని చంపుకుని తినేశారంటావా?' అంటు ఆవేశంగా అడిగాడు. 'సౌమిత్రీ ఒకవేళ మనల్ని ఆటపట్టించడానికి ఎక్కడైనా దాక్కోలేదు కదా! అని మళ్ళీ అటు ఇటు చూస్తు 'ప్రేయసీ' నీ ఆటలింక చాలు. నేను దుఃఖం పట్టలేకపోతున్నాను. తొందరగా రా. నీ కోసం ఈ లేడి కూనలు ఎదురు చేస్తున్నాయి. వీటితో ఆడుకో.' అని లక్ష్మణుని వైపు తిరిగి, 'లక్ష్మణా సీత లేకుండా నేనెలా బ్రతుకగలను? ఈ శోకంతో నేను మరణించడం ఖాయం. నేను పరలోకానికి వెళ్ళాక, అక్కడ నాన్నగారు, పధ్నాలుగు సంవత్సరాలూ అరణ్యవాసం పూర్తి చెయ్యకుండా వచ్చిన మిధ్యావాదినని, నా మొహం చూడ్డానికి కూడా అసహ్యించుకుంటారు. సీతా , భగ్నమనోరథుడినైన నన్ను చూస్తే జాలి కలగడం లేదా? నన్నిలా వదిలి ఎక్కడికెళ్ళావు?' అని ఏడుస్తూ వెతికిని చోటే వెతుకుతూ వెఱ్ఱివాడిలా ప్రవర్తించసాగాడు. అన్నగారి దుఃఖం చూసి లక్ష్మణుడి గుండె ద్రవించిపోయింది మెల్లిగా రాముని వెన్నుతట్టి

'అన్నయ్యా - బాధపడకు. ధైర్యం తెచ్చుకో. ఇంకా బాగా వెతుకుదాం రా. వదినకి అడవిలో తిరగడం ఇష్టం కదా. ఒకవేళ తామర కొలనులో స్నానానికి వెళ్ళిందేమో. ఈ అడవిలో రహస్యమైన గుహలెన్నో వున్నాయి కదా. తమాషా చెయ్యడానికి ఎక్కడైనా దాక్కుందేమో. లోపలిదాకా వెతికి చూద్దాంరా. దుఃఖించి

ప్రయోజనమేమిటి! ఊరుకో. సీత తప్పకుండా దొరుకుతుందున్న ఆశ నాకుంది' అంటూ రాముణ్ణి ఆశ్రమంలో నుంచి బయటకి తీసుకువచ్చాడు.

ఇద్దరూకలిసి పర్వత చరియలలోనూ, కొండ గుహలలోనూ, శిఖరాలపైనా అంతా వెతికారు ఎక్కడా సీత కనపడలేదు.

రాముడు నిరాశతో 'లక్ష్మణా, ఇంకెక్కడని వెతకగలము? సీత ఎక్కడా కనిపించలేదు' అంటు చెదిరిన మనస్సుతో దీర్ఘంగా నిట్టూర్చాడు. దీనంగా కన్నీరు కారుస్తూ 'ప్రియురాలా మళ్ళీ నిన్ను చూస్తానా?' అంటు నిర్జీవమైన చూపులతో చతికిలబడ్డాడు.

లక్ష్మణుడెన్నివిధాలో ఓదార్చాడు. కాని రాముడు మాత్రం మనస్సు కుదుట బరచుకోలేకపోయాడు' సీతా అంటు ఎలుగెత్తి ఏడవసాగాడు. తన పరాక్రమాన్ని కూడా మరచి పసివానిలా దుఃఖించసాగాడు.

బెంగగా తమ్ముడివంక చూస్తూ, 'లక్ష్మణా నిజంగా సీత బతికివుంటే నేనిన్నివిధాల విలపిస్తుంటే చూస్తు ఊరుకుంటుందా? లేదు తమ్ముడూ, సీత జీవించిలేదు. ఈ రాక్షసమూకలు నా సీతని బక్షించివుంటారు లేదా ఎత్తుకుపోయి వుంటారు. అయ్యో సీతా ఎక్కడున్నావు. ఈ నాటికి కైక కోరిక తీరింది కదా. నీతో కలసి వనవాసానికి వచ్చిన నేను, నువ్వు లేకుండా ఒంటరిగా అయోధ్యకెలా వెళ్ళగలను? ప్రజలు పిరికిపంద అనీ, నిర్వీర్యుడనీ నన్ను పరిహసించరా. నీ తండ్రికి నేనేం జవాబు చెప్పగలను? నువ్వు లేనిదే అసలు నేను బతికి వుండగలనా? లక్ష్మణా నువ్వు వెంటనే అయోధ్యకి వెళ్ళి రాజ్యాన్నంతా భరతుణ్ణి ఏలుకొమ్మని నా మాటగా చెప్పు. మన తల్లులకి నా ప్రణామములు చెప్పు. కాని పొరపాటునైనా సీత కనిపించలేదని గాని, నేను ప్రాణత్యాగం చేశానని కాని చెప్పకు' అంటు లక్ష్మణుణ్ణి గట్టిగా కౌగలించుకుని, దీనంగా విలపించాడు. లక్ష్మణుడు కూడా రాముడి అవస్థ చూసి మరింతగా దుఃఖించాడు.

రాముడు ఆవేదనతో, దుఃఖిస్తున్న లక్ష్మణుడ్ని చేరదీసి, 'తమ్ముడూ నాకంటే నష్టజాతకుడీలోకంలో వేరొకడుండడు కదా. బాధలన్నీ ఒక దాని తర్వాత ఒకటి పైబడి రంపంతో కోస్తున్నట్లుంది. వెనక జన్మలో ఏదో ఘోరమైన పాపం చేసి వుంటాను. దాని ఫలితమే ఇపుడిలా అనుభవిస్తున్నాను. రాజ్యాన్ని పోగొట్టుకుని అడవులకి వచ్చాను. తండ్రిని కూడా పోగొట్టుకున్నాను. తల్లికి దూరమయ్యాను. ఇన్నికష్టాలు పడుతున్నా సీత సన్నిధిలో ఊరటపొందేవాడిని. ఈ వేళ నా సీత కూడా దూరమైపోయింది. మంటల్లోకి కట్టెలు ఎగదోసినట్లు ఈ దుఃఖం

భరించటం నావల్ల కావడం లేదు. రాక్షసుడెవడో సీతనెత్తుకుపోతుంటే భయంతో సీత ఎంతగా విలపించిందో కదా. రక్షించమని గొంతెత్తి ఆక్రోసించి వుంటుంది. తియ్యని కంఠంతో మధురంగా మాట్లాడే నా సీత కీచుగొంతుకుతో అరచివుంటుంది. ఇదిగో ఈరాతిఫలకం మీద కూర్చుని సీతా నేను ఎన్నెన్నో ఊసులు చెప్పుకున్నాం. ఈ పరమపవిత్రమైన గోదావరి అంటే సీతకెంతో ఇష్టం. ఒకవేళ ఈ నదీ తీరంలో వుందంటావా? కాని సీత చాలా పిరికిది. నేను లేకుండా ఒక్కర్తీ వెళ్ళదే. ఈ సూర్యుణ్ణి అడుగుదాముండు.

ఓ ఆదిత్యా, ఈ జగత్తులో జరిగే సర్వకర్మలకీ సాక్షీభూతుడివి కదా. నా ప్రియురాలెక్కడుందో చెప్పి పుణ్యం కట్టుకో. వాయుదేవా సమస్తభూమండలాన్ని చుట్టి వస్తావే. నా సీతనెవరైనా ఎత్తుకుపోయారా? లేక చంపేశారా? నువ్వు చూసే వుంటావు. కాస్త చెప్పవా' అంటు పిచ్చెక్కిన వాడిలా ఏడవసాగాడు.

లక్ష్మణుడు గుండెరాయి చేసుకుని రాముణ్ణి చేరదీసి,

'ఆర్యా, శోకం దిగమింగి, ధైర్యం తెచ్చుకో. అంతగా అధైర్యపడకు. ఉత్సాహం తెచ్చుకుని వెదికితే, సీతజాడ తెలుసుకోవడం పెద్ద అసాధ్యం కాదు. నిరాశపడి దిగులుపడకు' అని అన్నగారికి ధైర్యం చెప్పాడు. కాని తమ్ముడి మాటలు రాముడికి మరింత బాధకలిగించాయి? లక్ష్మణా తొందరగా గోదావరి దగ్గరకు వెళ్ళి మీ వదిన తామరకొలను దగ్గరవుందేమో చూసిరా' అన్నాడు.

వెంటనే లక్ష్మణుడు వెళ్ళి గోదావరీ తీరం వెంబడీ అంతా వెదికి వచ్చాడు. కాని సీత ఎక్కడా కనిపించలేదు. ఆ తర్వాత రాముడు కూడా స్వయంగా వెదికాడు.

గోదావరి నదిలో దిగి సీతజాడ చెప్పమని జాలిగా ప్రాధేయపడ్డాడు. విషణ్ణ వదనంతో 'లక్ష్మణా ఈ గోదావరి కూడా బదులు పలకడం లేదు చూడు. జనకమహారాజు తన కూతురేది? అని అడిగితే ఏం బదులు చెప్పను? సీత ఎక్కడ? అని అమ్మ నిలదీసి అడిగితే ఏం జవాబు చెప్పను? పాపం అమాయకురాలు నావెంట అడవులలో తిరుగుతూ దొరికిన కాయ కసరు తింటూ, నాకు తోడు నీడగా నడిచిన సీతని ఈ రోజు పోగొట్టుకున్నాను కదా. ఆవిడ సాహచర్యంలో కష్టాలు కూడా సుఖాల్లాగే అనుభవించాను. ఇప్పుడా సాధ్వి ఎక్కడుందో కదా. నాకు తోడుగా జ్ఞాతులు లేరు. నువ్వు తప్ప వేరెవ్వరూ సాయంలేరు. దిగులుతో నిద్ర కూడారాదు. రాత్రి గడవటం చాలా బాధాకరంగా వుంది. ఆఖరిసారిగా ప్రస్రవణగిరి, మందాకినీ తీరం అంతా ఇంకోసారి వెదికివద్దాం రా. ఇదిగో ఈ జింకలు కన్నీరు కారుస్తూ నావంక జాలిగా చూస్తున్నాయి. పాపం

ఏదో చెప్పాలని ఆరాటపడ్తున్నాయి' అంటూ వాటి తలమీద ప్రేమగా నిమురుతూ 'సీత ఎక్కడుందో' మీకు తెలుసా? అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

రాముడి ఆవేదన అర్థం చేసుకున్నట్లు అవి, మోరలు జాపి, రావణుడు సీతని ఎత్తుకుపోయిన దిశగా పరిగెత్తిచూపాయి.

అవి దక్షిణదిశగా పరిగెత్తివెళ్ళి మళ్ళీ వెనక్కి రాముడి దగ్గరకొచ్చి, మళ్ళీ ఆ వైపే వెళ్ళి, ఇలా ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాయి. ఆవేదనతో కుమిలిపోతున్న రాముడు వాటి చేష్టలు గమనించలేదు. కాని సూక్ష్మబుద్ధి అయిన లక్ష్మణుడు మాత్రం కొంతవరకు వాటి చేష్టలు అర్థం చేసుకున్నాడు రాముడితో ఇలా అన్నాడు.

'అన్నయ్యా, సీత ఎక్కడికెళ్ళిందో చూశారా అని నువ్వు అడగ్గానే, ఇవన్నీ దక్షిణదిశగా వెళ్ళి మళ్ళీ వెనక్కి వస్తున్నాయి. బహుశా సీత ఇటువైపు వెళ్ళిందని వాటి భావనకావచ్చును. ఒక్కసారి అటువెళ్ళి చూసివద్దాం రా'

అని లక్ష్మణుడనగానే రాముడు సరే అని బయల్దేరాడు. ఇద్దరూ కలిసి దక్షిణదిశగా వెళ్ళారు. అక్కడ దారిపొడుగునా రాలిన పువ్వులు చెదురుమదురుగా పడివున్నాయి. ఆ పూలను చూడగానే, రాముడి మనస్సులో దుఃఖం పెల్లుబికింది.

'లక్ష్మణా ఈ పువ్వులు నేను స్వయంగా అడవిలోంచి తెచ్చి సీతకిచ్చాను. ఆమె ఎంతో ఆప్యాయంగా వీటిని తలలో పెట్టుకుంది. చూశావా నేలమీద రాలిన పూలు వాడిపోకుండా సూర్యుడు, అటు ఇటు చెదిరిపోకుండా వాయుదేవుడు కాపాడారు. ఇక్కడ వెతుకుదాం రా' అన్నాడు. ఆ పూలవెంబడి నడిచివెళ్ళగానే ప్రస్రవణగిరి కనిపించింది. రాముడు ఆ పర్వతం దగ్గరగా వెళ్ళి 'పర్వతరాజా సీత జాడ నీకుతెలుసా? నువ్వు సీతని చూశావా?' అని బిగ్గరగా అడిగాడు.

రాముడి మాటలు ఆ పర్వత శిఖరాలలో ప్రతిధ్వనించి, 'చూశాను' అన్నట్లు వినిపించాయి.

'చూశాను అంటావు గాని ఎక్కడుందో చెప్పవేం? వెంటనే చెప్పు. లేకపోతే ఒక్కబాణంతో నిన్ను దగ్ధం చేస్తాను' అని కోపంగా గద్దించి అడిగాడు. కోపంతో విల్లు ఎక్కుపెట్టి గురికోసం నేలమీదికి చూశాడు.

అక్కడ పెద్దపెద్ద పాదాల గుర్తులు కనిపించాయి. ఆ అడుగుల మధ్యలో చిన్ని చిన్ని పాదాల గుర్తులు కూడా వున్నాయి. ఎవడో రాక్షసుడు, బలవంతంగా సీతని వెంబడించినట్లు, ఆమె భయంతో పరుగెత్తినట్లు ఊహించి ఆ అడుగుజాడల వెంబడివెళ్ళారు. కొంతదూరం వెళ్ళాక ఒక ధనస్సు విరిగి పడి వుండడం చూశారు. అది చూడగానే రాముడి గుండె దడదడ కొట్టుకుంది. అమ్ములపొదిలోంచి

బాణాలు జారి చెల్లా చెదురుగా పడివున్నాయి. ఆ వెనక ఒక రథం ముక్కలు ముక్కలుగా విరగ్గొట్టబడి వుంది. వణుకుతున్న గొంతుతో రాముడు

'లక్ష్మణా, ఇక్కడ చూడు అన్నీ జరీ పోగులు పడివున్నాయి. బంగారు ఆభరణాలు కూడా ముక్కలు ముక్కలై పడివున్నాయి. అక్కడక్కడ రక్తపుబొట్లు కనపడుతున్నాయి. ఇంక ఎంతమాత్రం సందేహం లేదు. కామరూపులైన రాక్షసులు నా సీతని తినేశారు. పరిశీలించి చూడు, ఇద్దరు మహాబలవంతులైన రాక్షసులు, సీతకోసం పోరాడినట్లు కనిపిస్తోంది. వాళ్ళిద్దరిమధ్య భయంకరమైన యుద్ధం జరిగివుంటుంది. ముత్యాలు, రత్నాలు, పొదిగిన ధనస్సు ఇక్కడ ముక్కలై పడివుంది. అక్కడ వజ్రాలు, వైఢూర్యాలు పొదిగిన బంగారు కవచం పడివుంది అవన్నీ ఎవరివో మరి.

ఇటుపక్క నూరు ఊచలున్న పెద్ద ఛత్రముపడివుంది చూడు. ఇది దివ్యమాలికలతో అలంకరించబడి వుంది. పిశాచముఖాలు, గాడిదముఖాలు తెగిపడివున్నాయి. విరిగిపడిన జండా ఇదిగో. చామరములు ధరించిన ఇద్దరు తలపాగాలు, మణికుండలాలు ధరించి, దారుణంగా చంపబడివున్నారు. కళ్ళెం చేత్తో పట్టుకుని ఇంకొక్కసారథి చచ్చి పడివున్నాడు. చూడగా ఈ అడుగుజాడులున్న రాక్షసుడు చాలా వైభవం గలవాడిలా కనిపిస్తున్నాడు.

రాక్షసులు కామరూపులు. కఠినమైన మనస్సు గలవాళ్ళు. వాళ్ళు సీతనెత్తుకుపోయారో, చంపి తినేశారో, ఈ ఘోరారణ్యంలో ఆ మహాసాధ్విని ఆమె ధర్మం కూడా కాపాడలేదు. కనీసం దేవతలైనా జరిగిన సంగతేమిటో నాకు చెప్పడం లేదు. నేను సర్వభూతాలయందు దయతో ప్రవర్తిస్తుంటే అది నాచేతగానితనంగా భావిస్తున్నారందరూ. ఇకమీదట రాక్షసజాతి అనేది లేకుండా నిర్మూలించి, నా సత్తా చూపిస్తాను.

'లక్ష్మణా ఇప్పుడే బ్రహ్మాస్త్రం ప్రయోగించి, లోకాలన్నీ స్థంభింపచేస్తాను. పిశాచాలు రాక్షసులు ఎక్కడివారక్కడే నాశనమైపోతారు. ఈ బాణం అంతరిక్షంలోకి కూడా దూసుకెళ్ళి దేవతల్ని కూడా సర్వనాశనం చేస్తుంది' అంటు రోషంతో రాముడు బాణప్రయోగానికి సిద్ధపడ్డాడు.

'నా సీతని యధాతథంగా నాకెవరైనా అప్పగించారా సరి. లేకపోతే ఇప్పుడే ఈ భూమిని తల్లక్రిందులు చేస్తాను' అని హూంకరిస్తున్న రాముణ్ణి చూసేసరికి లక్ష్మణుడికి భయంతో గొంతు ఎండిపోయింది. లక్ష్మణుడు అన్నగార్నింతవరకు ప్రసన్నంగా, శాంతమూర్తిగా చూశాడేతప్ప, ఇలా రౌద్రమూర్తిలా ఎన్నడూ చూడలేదు

లక్ష్మణుడు. రాముడి భీకరరూపం చూసిన సౌమిత్రి భయంతో ఒణికిపోతూ, రెండు చేతులు జోడించి, తలపై వుంచుకుని, 'రామభద్రా, ఎపుడూ మృదుమధురంగా మాట్లాడే నువ్వు, సర్వభూతములందూ మమత, అనురాగం, పంచిఇచ్చే స్నేహశీలివైన నువ్వు ఇలా క్రోధావేశాలతో పలకడం ఉచితమేనా? ఏ ఒక్కడో చేసిన అపరాధానికి శిక్షగా, ఈ లోకాన్నంతా నాశనం చెయ్యాలనుకోవడం, ఏమి న్యాయం? ఈ విరిగిన రథం, ధనస్సు ఎవరివో మనకు తెలియదు. ఇక్కడ జరిగిన ఘోరమైన సంగ్రామానికి గుర్తుగా ఇవన్నీ కనిపిస్తున్నాయి. రక్తపు బొట్లు కూడా కనబడుతున్నాయి. కాని ఇక్కడ ఒక్కడి అడుగుజాడలు మాత్రమే కనిపిస్తున్నాయి. యుద్ధం జరిగితే ఇద్దరిమధ్య జరిగివుండాలి కదా. ఆ రెండో వ్యక్తి ఎలా యుద్ధం చేశాడో అర్థం కావటం లేదు.

అన్నయ్యా, ఒక్కడు చేసిన తప్పుకి లోకాన్నంతా దండించటం తగదు. ఆవేశమంటే ఏమిటో తెలియని మెత్తని స్వభావం నీది. నీకు అన్యాయం చేసినవాడు నిజంగా మూర్ఖుడే. మనం నిదానంగా ఎవడు సీతని ఎత్తుకుపోయాడో తెలుసుకుందాం. ఈ అడవులన్నీ గాలించి, కొండలు, గుహలు, అన్నిచోట్లా వెతుకుదాం. మంచి మాటలతో సీతని తిరిగి అప్పగించమని అడుగుదాం. అలా వాడు దారికి రాకపోతే దండోపాయం ఉండనే ఉంది. ఇపుడు తొందరపడి బాణప్రయోగం చెయ్యవద్దు' అని రాముణ్ణి అనునయిస్తు ప్రార్థించాడు. మెల్లిగా రాముణ్ణి ఊరడించాడు అయినా రాముడు దుఃఖాన్ని ఓదార్చుకోలేక అలాగే నుంచున్నాడు. అపుడు లక్ష్మణుడు మళ్ళీ.

'అన్నయ్యా నాన్నగారు ఎన్నో పూజలు చేసి, తపస్సు చేసి, యజ్ఞ యాగాదులు చేసి, పురుషోత్తముడివైన నీలాంటి కుమారుని పొందారు. నీ వియోగం సహించలేక ప్రాణాలు త్యజించారని భరతుడు చెప్పాడు. అంతటి మహాత్ముడివి నువ్వే ఈ శోకం ఓర్చుకోలేకపోతే ఎలా? ప్రజానురంజకుడివైన నువ్వే ఈ లోకాన్ని దహింపచేస్తే ఇంక ప్రజలకి రక్షణ ఎవరు? సుఖ దుఃఖాలు ఒకదానివెంట ఒకటి ఎపుడూ వుంటాయి. లోకరక్షకులైన సూర్యచంద్రులు కూడా రాహువు కేతువుల బారిపడి బాధపడుతుంటారు కదా. మహామహులకే విధికి తలవంచక తప్పదు. ఇంక సామాన్యులైన మనమెంత? నువ్వింతగా శోకించటం తగదు. పూర్వజన్మ కర్మఫలంవల్లనే ఇవాళ మనం సీతని కోల్పోయాం. ఇటువంటి క్లిష్టపరిస్థితిలో, బాగా ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలి. ఇదివరకు చాలాసార్లు నేను తొందరపడ్డప్పుడు, నువ్వే ఎన్ని విధాలో నాకు హితబోధ చేసి నచ్చచెప్పావు. అలాంటి నీకు నేను చెప్పాలా? కేవలం సీతమ్మ ఎడబాటు వల్ల కలిగిన దుః

ఖంతో నువ్వు ఆలోచనాశక్తి కోల్పోయావు. నీకు తెలియదని కాదు. ఊరికే నీ కర్తవ్యం గుర్తు చేస్తున్నానంతే. ఈ లోకంలో సాత్వికులైన మహానుభావులెందరో వున్నారు. ఈ బాణప్రయోగం వల్ల వారందరికీ కూడా చేటు జరుగుతుంది. ఇక్ష్వాకువంశంలో జన్మించిన ఉత్తముడివైన నువ్వు చంపదగని వారిని చంపటం అనుచితం కాదా. అందుకని ప్రస్తుతం ఈ బ్రహ్మాస్త్ర ప్రయోగం వద్దు. అపకారం చేసినవాడెవరో తెలుసుకుని, వాణ్ణి శిక్షించు' అంటు అనేకవిధాల నచ్చజెప్పాడు.

రాముడు, లక్ష్మణుని మాటలు సావధానంగా విన్నాడు. యధార్థాన్ని గ్రహించి, ఎక్కుపెట్టిన విల్లు కిందపెట్టి 'తమ్ముడూ మరిపుడేం చేద్దాం? అన్నాడు'

అన్నయ్యా గుబురుగా వున్న లతలు, పొదలు, తొర్రలు, అన్నీ వెతుకుదాం. ఇక్కడున్నవాళ్ళనందర్నీ సీతజాడ గురించి అడుగుదాం. వీలైతే గంధర్వుల్ని, కిన్నెరుల్నీ కూడా అడుగుదాం. ఇక్కడ పర్వతసానువుల్లో వారపుడప్పుడు విహారం చేస్తుంటారు కదా. వారినడిగి ఆచూకీ తీద్దాం' అని లక్ష్మణుడు చెప్పిన మాటలు విని రాముడు తమ్ముడివెంట బయల్దేరాడు.

అలా వారిద్దరూ చేతుల్లో ఎక్కుపెట్టిన ధనస్సులతో ముందుకు నడిచిపోతుంటే, దారిలో అడ్డంగా పర్వతాకారంలో ఒకపక్షి పడివుండడం కనిపించింది. రావణునితో ప్రాణాలకి తెగించి పోరాడి, రెక్కలు నరకబడి, నేలమీదపడి, కొనవూపిరితో రాముని రాక కోసం ఎదురుచూస్తున్న జటాయువు, అది. కాని రక్తసిక్తమై వున్న ఆ జటాయువుని, రాముడు గుర్తించలేదు. పైపెచ్చు

'లక్ష్మణా, ఎవడో రాక్షసుడు మాయా పక్షిరూపంలో దారికడ్డంగా పడివున్నాడు. వీడే మన జానకిని బక్షించివుంటాడు. కడుపునిండా తిని కదలలేకుండా పడివున్నాడు. నేనిప్పుడే ఈ నీచుడ్ని హతమారుస్తాను' అన్నాడు.

అప్పుడు రక్తంకక్కుతున్న ఆ పక్షి దీనంగా 'చిరంజీవీ - నీ ప్రాణసఖి అయిన సీతని రావణుడు అపహరించుకువెళ్ళాడు. నువ్వు, నీ తమ్ముడు ఆశ్రమంలో లేని సమయంలో మాయావియైన ఆ రాక్షసుడు, బలవంతంగా సీతనెత్తుకుపోవడం నేను కళ్ళారా చూశాను. సీత కేకలు విని, నేను వాడిని ఆకాశంలోనే ఎదుర్కొని, రథం విరక్కొట్టి నేల కూల్చాను. ఈ శిధిలమైన రథం, కవచం, అన్నీ నేను విరక్కొట్టినవే. వాడి సారధిని పరివారాన్ని చంపి కొంత అలసి వున్నప్పుడు, ఆ దుష్టుడు నా రెక్కలు రెండు తెగనరికి, సీతని పట్టుకుని ఆకాశంలోకి ఎగిరిపోయాడు. నేను ఇదివరకే వాడిచేత చంపబడి కొనఊపిరితో వున్నాను. నన్ను చంపొద్దు' అంటు ఆయాసపడుతూ మాటలు కూడబలుక్కుని చెప్తున్న

జటాయువుని, చూసేసరికి రాముడి హృదయం ద్రవించిపోయింది. కంట నీరు కారుస్తు ఆ పక్షీంద్రుని పక్కన చతికిలబడి, ఆ పక్షిని గట్టిగా కౌగలించుకుని, పక్కనే కూర్చున్న లక్ష్మణునితో,

'లక్ష్మణా చేతికందిన రాజ్యంపోయింది. వనవాసం సంప్రాప్తమైంది. సీతని పోగొట్టుకున్నాను. నాకు సాయం చెయ్యబోయిన ఈ పక్షీంద్రుడు కూడా మరణించబోతున్నాడు. నా దురదృష్టమెంత గొప్పదో చూశావా! నిప్పుని కూడా దహించగల నష్టజాతకుణ్ణి. నా కాలుపెడితే సముద్రమైనా ఇంకిపోతుంది. ఈ లోకంలో నాకన్నా దౌర్భాగ్యుడింకొకడున్నాడంటావా? మన తండ్రిగారి మిత్రుడైన ఈ జటాయువు ఎన్నోవేల సంవత్సరాలు జీవించి వుండి నా దౌర్భాగ్యం వల్లనే రెక్కలు తెగి మరణానికి చేరువయ్యాడు' అంటు రక్తపుముద్దలా పడివున్న ఆ పక్షిని అసహ్యించుకోకుండా ఆప్యాయంగాకౌగలించుకుని దుఃఖిస్తూ

'ఆర్యా...... నా సీత ఎక్కడవుంది? అని మాటలు తడబడగా గద్గదస్వరంతో అడిగాడు.

కాని ఆ పక్షి మాటలు రాక ఆయాసపడుతూ ఏమీ చెప్పలేక అవస్థపడటం గమనించాడు.

'లక్ష్మణా, ఈ పక్షిరాజు నా మేలుకోరి, నా భార్యని రక్షించాలని, ప్రాణాలకు తెగించి పోరాడింది. పాపం నాతో ఏదో చెప్పాలని తాపత్రయపడుతోంది. కాని చెప్పలేకపోతోంది' అని తమ్ముడితో చెప్పి, జటాయువుని ప్రేమగా నిమురుతూ...

'జటాయువూ సీతగురించిన సమాచారం చెప్పగలిగితే నాకు తెలిసేలా చెప్పు. రావణుడికి, నేనేం అపకారం చేశానని, సీత నెత్తుకుని వెళ్ళాడు? నిన్నెలా చంపాడు? వాడెత్తుకుపోయినప్పుడు నా సీత ఎలా వుంది? నీతో సీత ఏమైనా చెప్పిందా? ఆ రావణుడెలా వుంటాడు? వాడెలాంటి వీరుడు? వాడెక్కడ వుంటాడు? ఆ వివరాలన్నీ నీకు తెలిసినంతవరకు వివరంగా చెప్పు' అని దీనంగా అడిగాడు. అప్పటికే జటాయువు ప్రాణాలు కడంటిపోతున్నాయి. లేని శక్తి తెచ్చుకుని హీనస్వరంతో...

'రామా, రావణుడు రాక్షసరాజు. వాడు చాలా మాయావి. సీతని ఎత్తుకుని ఆకాశంలోకి ఎగిరి పారిపోయాడు. ఆకాశమంతా మబ్బులతో నిండి చీకటిగా వుంది. ఆ సమయంలో వాణ్ణి దారిలో అడ్డగించి చాలాసేపు వాడితో పోరాడాను. యుద్ధం చేసి చాలా అలసిపోయాను. అప్పుడు నా రెండు రెక్కలూ నరికేసి, సీతని పట్టుకుని దక్షిణదిశగా పారిపోయాడు' అని చెప్పి, ఇంక మాటలురాక,

అతి కష్టమ్మీద, 'రామా, నా గొంతు ఆరిపోతోంది. ప్రాణాలు కడంటిపోతున్నాయి. దృష్టి తిరిగిపోతోంది. ఇక ఒక్కమాట కూడా పలుకలేను. కాని ఒకటి నిజం. రావణుడు సీతనెత్తుకుపోయినది, 'విందము' అనే ముహూర్తంలో ఆ ముహూర్తంలో పోగొట్టుకున్న సొమ్ముగాని, వ్యక్తిగాని తప్పక దొరికితీరుతారు. కనుక నువ్వు సీత గురించి బెంగపెట్టుకోనవసరం లేదు' అని జటాయువు చెప్తూనే వుంది. దానినోటిలోనుంచి రక్తం, మాంసం, బయటికి వచ్చాయి. అప్పటికీ అతి కష్టంమీద, విశ్రవసుని కుమారుడు, వైశ్రవణుని సోదరుడు, అనే మాటలు దాని నోటినుంచి వచ్చాయి. ఆపైన దానిప్రాణాలు అనంతవాయువులో లీనమైపోయాయి.

దాని తల నేలకొరిగి, కాళ్ళు బిగుసుకుపోయాయి. పర్వతంలా పడివున్న జటాయువుని చూసి రాముడు చాలా దుఃఖించాడు.

'లక్ష్మణా ఈ పక్షీంద్రుడు, ఎన్నోవేల సంవత్సరాలు ఈ రాక్షసులతో బాటు ఈ అడవిలో నివశించినా దానికి రాక్షసులవల్ల ఎలాంటి బాధా కలగలేదు. సుఖంగానే వుంది. ఈవేళకి నా కోసం ప్రాణాలర్పించింది. ఎంతటివాళ్ళకయినా కాలము దుస్తరమైనది. తమ్ముడూ, ఈ జటాయువు మనకెంతో ఉపకారం చేసింది. రావణుడు సీతనెత్తుకుపోయాడన్న బాధకన్నా, ఈ పక్షిరాజు నా కోసం ప్రాణాలర్పించిందన్న బాధ నన్ను కలచివేస్తోంది. ఇతడు మనకి మన నాన్నగారిలాగే పూజనీయుడు. కనుక శాస్త్రవిహితంగా దహన సంస్కారం చెయ్యాలి. నువ్వెళ్ళి ఎండుకట్టెలు పట్టుకురా. దీనికి అంత్యక్రియలు చేద్దాం. ఇతడికి ఉత్తమలోకాలు కల్గుతాయి' అని లక్ష్మణుడితో అన్నాడు.

లక్ష్మణుడు వెంటనే అన్నగారు చెప్పినట్లు చేశాడు. రాముడు జటాయువుని చితిమీద వుంచి, ఆత్మబంధువు కోసం విలపించినట్లు విలపించాడు. ఆ తర్వాత అడవిలోకి వెళ్ళి ఒక మృగాన్ని చంపి, దాని మాంసంతో జటాయువుకి పిండప్రదానం చేశాడు. ఆపైన రామలక్ష్మణులిద్దరూ గోదావరిలో స్నానం చేసి దానికి తిలోదకాలు సమర్పించారు.

జటాయువు జన్మధన్యమైంది. ఎవ్వరూ చెయ్యలేని మహత్కార్యం చేసి, సాక్షాత్తు రామావతారుడైన శ్రీమన్నారాయణుడిచే సంస్కరించబడి, పుణ్యలోకాలకి పోవడమే కాకుండా, శాశ్వతమైన కీర్తినిపొందాడు. ఆ పక్షీంద్రునికి సంస్కారం, ఉదకప్రదానం అయ్యాక, రామలక్ష్మణులు మళ్ళీ సీతాన్వేషణకై బయల్దేరారు. పశ్చిమదిశగా కొంతదూరం వెళ్ళాక, దక్షిణ దిశగా సాగిపోయారు. ఆ మహారణ్యంలో అణువణువుగాలించసాగారు. అలా వెతుకుతూ, వెతుకుతూ, జనస్థానానికి, మూడు క్రోసుల దూరంలో వున్న క్రౌంచారణ్యం అనే దట్టమైన

అడవిలో ప్రవేశించారు. ఆ అడవి చాలా భయంకరంగా వుంది. క్రూరాతి క్రూరమైన అడవిజంతువులతో, పక్షులతో, భీకరమైన వృక్షాలతో, లతలతో, ముళ్ళపొదలతో అడుగుపెట్టేందుకు వీల్లేకుండా చిమ్మచీకటిగా వుంది. అల్లుకుని వున్న ఆ వృక్షాలు, లతల మధ్య పాతాళానికి దారాఅన్నట్లు పెద్ద గుహ ఒకటి వుంది. హఠాత్తుగా ఎవరైనా చూశారా, గుండె పగిలి చచ్చేటంత భయంకరంగా వుంది. ఆ గుహ దగ్గర ఒక భయంకరమైన రాక్షసి, దానిముఖం చాలా వికృతంగా వుంది. పొట్టబానలా వ్రేలాడుతోంది. నిక్కబొడుచుకున్న తల వెంట్రుకలు, చూడ్డానికే పరమ అసహ్యకరంగా ఉంది దాని అవతరాం.

రామలక్ష్మణులను చూడగానే, అది పరుగు పరుగున వచ్చి వారిని గట్టిగా కౌగలించుకుంది. మీదికి లాక్కుని, 'సుందరులారా నా పేరు అయొముఖిని అంటూ, లక్ష్మణుని గట్టిగా కౌగలించుకుని, రాముని వదిలేసి, ఇన్నాళ్ళకు నీ అదృష్టం వల్ల నా కంటబడ్డావు సుందరా, రా హాయిగా బ్రతికినంతకాలం నాకు జంటగా వుండు' అంటు కామమోహితురాలై లక్ష్మణుని వెంటపడింది. లక్ష్మణుడు తెలివిగా దానిని తప్పించుకుని, దాని స్థనాలు, చెవులు, ముక్కు నరికి పడేశాడు. అది చావుకేకలు పెడుతూ పారిపోయింది.

లక్ష్మణుడు విషణ్ణవదనంతో 'అన్నయ్యా, ఎందుకో నా ఎడమభుజం అదురుతోంది. ఏదో ప్రమాదం ముంచుకొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కనుక మనం అప్రమత్తులమై వుండాలి' అని అతడు చెప్తుండగానే, గుండెలవిసిపోయేలా పెద్దపెద్ద కేకలు వినిపించాయి. తుఫాను గాలిలా దుమారం లేచింది. ఆ గాలిదుమారంలో చిక్కుకున్న రామలక్ష్మణులు కళ్ళునులుముకుని చూశారు. దూరంగా ముళ్ళపొదల దగ్గర కేవలం ఒక మొండెం మాత్రం కలిగి వున్న ఒక వింత ఆకారం గల రాక్షసుడు కనిపించాడు. చాలా పెద్దశరీరం, విశాలమైన వక్షస్థలం, కలిగి వుండి పెద్ద కొండలా వాడు నేలమీద పడివున్నాడు. ఆ ఆకారానికి తలలేదు. కడుపు వుండే చోట కడుపుమీద తలవుంది. ఒళ్ళంతా వెంట్రుకలతో ఎలుగుబంటిలా వున్నాడు. నల్లగా నల్లమబ్బులా వున్నాడు. గుండెమీద మధ్యలో ఎఱ్ఱగా నిప్పుకణికలా మెరుస్తున్న ఒకే ఒక కన్నువుంది. పొట్టమీద వున్న నోటిలో పెద్ద పెద్ద కోరలున్నాయి. ఆ కోరల మధ్యలోంచి వ్రేలాడుతున్న నాలిక ముందుకి వెనక్కి లాక్కుంటు, నోటిపెదాలు నాక్కుంటున్నాడు. ఆ మొండానికటుఇటు రెండు యోజనాల పొడుగున్న రెండు చేతులున్నాయి. ఆ రెండు చేతులతో దూరంగా వున్న అడవి జంతువుల్ని లాక్కుని నోటిలో పడేసుకుంటున్నాడు. చూడ్డానికి మహాభయంకరంగా వున్న వాడిపేరు కబంధుడు.'

వాడు మేఘంలా గర్జిస్తూ రెండు చేతులు చాపి రామలక్ష్మణుల్ని తన దగ్గరగా లాక్కున్నాడు. రాముడు మహాశూరుడు. ధైర్యశాలి. కనుక వాణ్ణి చూసి బెదరలేదు. లక్ష్మణుడు మాత్రం వాణ్ణి చూసి చాలా బెదిరిపోయాడు. రామా వీణ్ణి చూస్తేచాలా భయంగా వుంది. నువ్వెలాగో తప్పించుకుని పారిపో. వీడు నన్ను తినేలోగా నువ్వెళ్ళిపోయి సీతమ్మని కల్పుకుని, అయోధ్యకి పోయి సుఖంగా రాజ్యపాలన చేసుకో. నన్నుమాత్రం అప్పుడప్పుడు తల్చుకో చాలు' అని భయంతో ఒణకసాగాడు. రాముడు తమ్ముణ్ణి ఓదారుస్తూ, 'సౌమిత్రీ దిగులుపడకు. నీలాంటి వీరులిలా పిరికిమాటలు పలుకకూడదు. ఆపదలు కల్గినపుడే ధైర్యంగా వుండాలి' అని ధైర్యం చెప్పాడు. వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటు వుండగా, ఆ కబంధుడు ఉరిమి ఉరిమిట్లు, 'మానవులారా, మీరెవరు? బలిసిన వృషభాల్లా చాలా బలంగా వున్నారు. ఖడ్గములు, ధనస్సులు పట్టుకుని, ఈ అడవిలో ఎందుకు తిరుగుతున్నారు? నాకు చాలా ఆకలిగా వుంది.

నాకు ఆహారంగా ఆ దేవుడే మిమ్మల్ని నా కోసం పంపివుంటాడు. ఇంక మీరు మీ బతుకులమీద ఆశవదులుకోండి'అన్నాడు.

ఆ మాటలువిన్న రాముడు లక్ష్మణునితో, 'తమ్ముడూ ఘోరమైన ఆపదలో ఇరుక్కున్నాం. ఇవాళతో మన జీవితాలు సరి. ఇంక సీతని కలుసుకునే ప్రసక్తే లేదు. విధి ఎంతబలీయమైనదో కదా. కాలాన్ని ఎదిరించే వారెవరుంటారు? ఎంతటివారైనా ఆ దైవము చేతిలో ఆటబొమ్మలే కదా. కాలం కలసిరానపుడు మన ప్రయత్నం పరాక్రమం ఏవీ ఫలించవు' అన్నాడు. వాళ్ళిద్దరూ కూడబలుక్కుని ఆలోచించారు.

కబందుడు ఎంతమాత్రం పట్టు సడలనివ్వకుండా 'నాకు చాలా ఆకలిగా వుంది' అంటు వాళ్ళని నోటిదగ్గరకి లాక్కోసాగాడు. చాలా చాకచక్యంగా రామలక్ష్మణులిద్దరూ వాడి చెరో చెయ్యినరికిపడేశారు. వాడు బాధతో పెట్టిన బొబ్బలతో ఆ అడవంతా ప్రతిధ్వనించింది. వాడి జబ్బల్లోంచి రక్తం కాలవలలా ప్రవహించింది. వాడు దీనాతిదీనంగా ఏడుస్తు 'ఆర్యా - మీరెవరు?' అని అడిగాడు. అపుడు లక్ష్మణుడు వాడితో, 'ఈయన ఇక్ష్వాకువంశజుడైన రాముడు. నేను ఈయన తమ్ముడు లక్ష్మణుడిని. మేము వనవాస దీక్షలో వుండగా ఎవడో రాక్షసుడు మా వదినగారి నెత్తుకుపోయాడు. ఆమెని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాము. ఇంతకీ నువ్వెవరు? ఈ వింత ఆకారం ఏమిటి?' అని అడిగాడు.

'పురుషోత్తములారా, మీకు స్వాగతం నా భాగ్యవశాత్తు ఇవాళ మీ దర్శనభాగ్యం కలిగింది. నా చేతులు మొదలంటూ నరికి నాకు చాలా ఉపకారం

చేశారు. నా మూర్ఖత్వం వల్లనే నాకీ వింతరూపం వచ్చింది. ఆ సంగతి వివరంగా చెప్తాను వినండి.

'రామచంద్రా, ఒకప్పుడు నేను గొప్ప అందగాడిని. చాలా బలపరాక్రమములు గల్గిన వాణ్ణి. కాని నా బుద్ధి మాత్రం అల్పమైనది. చెయ్యకూడని పనులు చేస్తూ అడవులలో ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునుల్ని హింసించి ఆనందించేవాణ్ణి. ఒకరోజు స్థూలశిరుడు అనే ఒక మహర్షి ఆహారం కోసం అడవిలో తిరుగుతూ వుంటే మదోన్మత్తుణ్ణై ఆయనను చాలా బాధపెట్టాను. అందుకాయన ఆగ్రహించి, 'నీ బుద్ధికి తగినట్లు వికృతరూపం పొంది, అందరిచేత అసహ్యించు కోబడుతూ, బ్రతకమని' శపించాడు.

నేను భయకంపితుడనై పశ్చాత్తాపంతో శాపవిమోచన చెప్పమని ప్రాధేయపడ్డాను. కరుణామూర్తియైన ఆ మహానుభావుడు, 'ఈ ఘోరారణ్యంలో సంచరించడానికి వచ్చిన రఘురాముడు, నీ భుజాలు రెండూ ఖండిస్తాడు. అపుడు నీకు శాపవిమోచనం కలిగి నీ యథారూపం వస్తుందని' చెప్పాడు. నేను దనువు యొక్క కుమారుణ్ణి. గొప్పశక్తి సంపన్నుణ్ణి. గొప్ప తపస్సు చేసి, బ్రహ్మదేముణ్ణి మెప్పించి, దీర్ఘాయుష్షుకలిగేలా వరం పొందాను. అప్పట్నించీ చెప్పరాని గర్వంతో, దేవేంద్రుడుతో యుద్ధానికి తలబడ్డాను. ఆయన తన వజ్రాయుధంతో నా తలమీద బాదాడు. ఆ దెబ్బకి నా తల కాళ్ళు మొండెంలోకి దిగబడి పోయాయి. ఇలా మొండెంగా మిగిలి కూడా చంపవద్దని ఆయన పాదాలమీద వాలాను. అయినా బ్రహ్మదేముడు దీర్ఘాయువు అనుగ్రహించాక నేనెలా చస్తాను? ఆ సంగతే ఇంద్రుడు చెప్పాడు. మరి, తల చేతులు లేకుండా ఆహారం ఎలా తినగలను? అని అడిగాను.

అపుడాయన దయతలచి ఇలా పొడుగైన చేతులు, పొట్టలోనే ఒక నోరు, రెండు కోరలు ఉండేలా అనుగ్రహించాడు. అప్పటినుంచీ మీ రాక కోసం నిరీక్షిస్తూ ఇలా దుర్భరమైన జీవితం గడుపుతున్నాను. ఇన్నాళ్ళకి మీదర్శనంవల్ల ఆ అదృష్టం కలిగింది ఇపుడు మీరు ఈ శరీరాన్ని దహనం చెయ్యండి. అపుడు నా అసలు రూపం వస్తుంది' అని ఎంతో ప్రాధేయపడ్డాడు.

'నా అసలు రూపం వచ్చాక నాకు పూర్వజ్ఞానం కలుగుతుంది. అప్పుడు మీకు సహాయం చెయ్యగల మంచి మిత్రుడిగురించి చెప్తాను' అన్నాడు మళ్ళీ.

అపుడు రాముడు 'నా భార్య సీతని రావణుడు ఎత్తుకుపోయాడు. జనస్థానంలో మా అన్నదమ్ములిద్దరం, నా భార్యతో హాయిగా వుంటుండగా ఆ

మాయావి ఇలా చేశాడు. వాడెక్కడుంటాడో, ఎలా వుంటాడో, ఎంతటి శక్తిమంతుడో, మాత్రం మాకు తెలియదు. మేము దుఃఖంలో మునిగివున్నాము. ఆ వివరాలు మాకు చెప్పి ఉపకారం చెయ్యి. ఇపుడే మేము నిప్పురగిల్చి కట్టెలు సేకరించి నిన్ను దగ్ధం చేస్తాము. ఆ రావణుడెక్కడుంటాడో, మా సీతని ఎక్కడ దాచాడో చెప్పి మాకు మేలు చెయ్యి' అని అడిగాడు.

అపుడు కబంధుడు 'ఆర్యా, నాకా వివరాలు తెల్సుకునే శక్తి లేదు. నా నిజరూపం వచ్చాక, ఆ వివరాలన్ని చెప్పి మీకు ఉపకారం చెయ్యగల వ్యక్తి గురించి మాత్రం చెప్పగలను. రామా సూర్యుడు అస్తమించబోతున్నాడు. సూర్యాస్తమయం కాకముందే నువ్వు దహన సంస్కారం చెయ్యాలి. ఆ తర్వాత చేసినా ప్రయోజనం వుండదు. నన్ను గోతిలోకి తోసి ఆ గొయ్యి కట్టెలతో కప్పి శాస్త్రోక్తంగా దహనం చేస్తేనే నా అసలురూపు వస్తుంది' అన్నాడు.

అపుడు రామలక్ష్మణులు ఒకపెద్ద గొయ్యి తవ్వి అందులో వాడి శరీరం పడేసి, పైన ఎండు కట్టెలతో కప్పి దహన సంస్కారం చేశారు.

కొవ్వుతో పేరుకుపోయిన వాడి శరీరం ఓ పట్టాన కాలలేదు. చాలా ప్రయాసపడ్డాక వాడి శరీరం అంటుకుని కాలిబూడిద అయింది. ఆ నిప్పుల్లోంచి, తెల్లని వస్త్రములు ధరించి దివ్యమైన మాలికలు వేసుకుని, ఒక దివ్యపురుషుడు, హంసలతో మోయబడుతున్న ఒక దివ్యమైన విమానంలో బయటకి వచ్చాడు.

ధగద్ధగాయమానంగా వెలుగుతున్న ఆ విమానం అంతరిక్షంవైపు ఎగరసాగింది. అందులోంచి ఆ దివ్యపురుషుడు చేతులు జోడించి

'రామా నీకు ప్రస్తుత పరిస్థితిలో ఒక మంచి మిత్రుడు అవసరం. సుగ్రీవుడు అనే ఒక వానరరాజు వున్నాడు. అతణ్ణి, అన్నగారైన వాలి రాజ్యం నుంచి బహిష్కరించాడు. రాజ్యభ్రష్టుడైన సుగ్రీవుడు నలుగురు మిత్రులతో కలిసి ఋష్యమూకపర్వతం మీద నివసిస్తున్నాడు. నీలాగే అతడూ భార్యనీ, రాజ్యాన్నీ కోల్పోయాడు. తన అన్నగారిని చంపి రాజ్యాన్ని, భార్యనీ ఇప్పించమని నిన్నర్థిస్తాడు. నువ్వతనికి ఆ సహాయం చేశావంటే అతను నీకు సీతని వెతకడంలో సాయం చేస్తాడు. కనుక వెంటనే వెళ్ళి అతడితో అగ్నిసాక్షిగా మైత్రి చేసుకో. ఋష్యమూకము పంపానదీ తీరంలో వుంది. అతడు వానరుడు కదా అని చిన్నచూపు చూడకు. అతడు కామరూపుడు. తప్పక నీ కోరిక తీరుస్తాడు. సూర్యుని అంశతో ఋక్షరజుడు అనే వానరరాజుకి పుట్టిన మహాపరాక్రమశాలి ఆ సుగ్రీవుడు. వాలికి భయపడి ఋష్యమూక పర్వతం మీద నివసిస్తున్నాడు. అతడికి రాక్షసులుండే ప్రదేశాలన్నీ

తెలుసు. చెప్పలేనంతమంది వానర వీరులు అతడి సేనలో వున్నారు. వారందరిని పంపి కొండలు, కోనలు, లోయలు అన్నీ వెతికిస్తాడు. నీ సీతని నీకప్పగిస్తాడు. రామా ఋష్యమూకాద్రికి దారి చెప్తావిను. ఆ మార్గమంతా పూలతోటలతో జలపాతాలతో చాలా అందంగా వుంటుంది. అటువెళ్ళి పడమరగా తిరగండి. అక్కడ మహావృక్షాలే తప్ప దారి తెన్నూ వుండదు. కనుక మీరు ఆ చెట్లు ఎక్కి అవతలివైపుకి వెళ్ళాలి. మరోదారిలేదు. అవతలివైపుకి వెళ్ళగానే తియ్యని పండ్లతో నిండిన మహావృక్షాలెన్నో వుంటాయి. మీరు కడుపునిండా వాటిని తింటూ ముందుకు సాగిపోవచ్చు. దారిపొడుగునా పూలగుత్తులతో నిండిన వృక్షాలు, లతలు, చూడముచ్చటగా వుంటాయి. అలాగే తిన్నగా వెళ్ళగా వెళ్ళగా 'పంప' అనే పుష్కరిణి కనిపిస్తుంది. అందులో నీళ్ళు నిర్మలంగా వుంటాయి. పాచి, పాకుడు లేకుండా స్వచ్ఛమైన ఇసుక కనిపిస్తుంటుంది. తామరపూలు, కలువపూలు అందులో సువాసనలు వెదజల్లుతూ వుంటాయి. రాజహంసలు, క్రౌంచపక్షులు అక్కడ కనిపిస్తుంటాయి. అక్కడ వాతావరణం చల్లగా వుంటుంది.

ఆ పంపా తీరంలో మతంగ మహర్షి ఆశ్రమం వుంది. ఒకప్పుడు అందులో మతంగమహర్షి వుండేవారు. ఆయన శిష్యులు గురువుగారికి మంచినీరు తేవడానికి సరస్సుకు వెళ్ళినపుడు, వారి శరీరం నుంచి కారి నేలమీదపడ్డ చెమటబిందువులు, పూలదండల్లా మారేవట. ఆ మాలికలు చెట్లమీద తగుల్కొని ఇప్పటికీ నవనవలాడుతూ తాజాగా కనిపిస్తాయి. ఇప్పుడు ఆ మహర్షి లేరు.

ఆయన శిష్యులు, ఒక శబరిజాతి స్త్రీ మాత్రం ప్రస్తుతం ఆ ప్రదేశంలో తపస్సు చేసుకుంటు వున్నారు. ఆ స్త్రీ సన్యాసిని. ఆమె పేరు శబరి. చాలా సంవత్సరాలనించీ ఆవిడ అక్కడ తపస్సు చేసుకుంటూ వుంది. అలా ఏళ్ళ తరబడి తపస్సు చేస్తూ నీ రాక కోసం ఎదురుచూస్తూ వుంది. ఆమె గురువుగారైన మతంగ మహర్షి భవిష్యత్తులో నువ్వు ఆమె ఆశ్రమానికి వస్తావనీ, నిన్ను సేవించిన తర్వాత స్వర్గలోకానికి వెళ్ళమనీ ఆమెని ఆదేశించారు. గురువుపట్ల భక్తిప్రపత్తులు గల ఆమె ఆయన ఆజ్ఞమేరకి నీ రాకకోసం ఎదురుచూస్తు నిరీక్షిస్తోంది. ఆ శబరీమాత ఆశ్రమం సరోవరానికి పశ్చిమదిశగా వుంది. అక్కడ చాలా ఏనుగులు వున్నాయి. ఆ ఆశ్రమానికి తూర్పుదిక్కుగా ఋష్యమూక పర్వతం వుంది. అది చాలా మహిమ కలది. సాక్షాత్తు బ్రహ్మదేముడు దాన్ని సృష్టించాడు. ఆ పర్వతం మీద నిద్రపోయినపుడు ఎవరికైనా ఏదైనా కలవస్తే, ఆ వ్యక్తి నిద్రలేవగానే ఆ కల నిజమవుతుందట. పాపాత్ములెవరైనా ఆ కొండ ఎక్కితే వారిని రాక్షసులు తీసుకుపోయి చంపేస్తారట. ఆ ఋష్యమూక పర్వతం మీద ఒక పెద్ద కొండగుహ

వుంది. ఆ గుహ ఒక పెద్దశిలతో మూసి వుంటుంది. ఆ గుహని నివాసంగా చేసుకుని సుగ్రీవుడు నల్గురుమిత్రులతో కలిసి నివశిస్తున్నాడు. అప్పుడప్పుడు ఆ శిలని పక్కకి జరిపి బయటకి వచ్చి కొండశిఖరం మీద వుంటాడు. మీరిద్దరూ ముందుగా మతంగ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి, శబరీమాతని చూసి ఆ తర్వాత సుగ్రీవుడి దగ్గరకి వెళ్ళండి. అని, కబంధుడు వివరంగా చెప్పాడు. అతడు చెప్పినదంతా విన్నాక, అతనికి వెళ్ళడానికి సెలవిచ్చారు రామలక్ష్మణులు.

కబంధుడు చెప్పిన గుర్తులు ప్రకారం నడుచుకుంటు వెళ్ళి, పంపాతీరం చేరారు. పుష్కరిణికి నమస్కరించి, దాని పడమటి తీరంగుండా ప్రయాణం చేసి శబరి ఆశ్రమం చేరుకున్నారు.

ఆ ఆశ్రమం చాలా ప్రశాంతంగా ఎంతో రమణీయంగా వుంది. ఆశ్రమంలోకి వస్తున్న రామలక్ష్మణుల్ని శబరి దూరం నుంచే చూసింది. ఆనందంతో వారికి ఎదురొచ్చి వారికి పాదాభివందనం చేసింది. ఆశ్రమంలోనికి ఆహ్వానించి, అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, యథోచితంగా సత్కారం చేసింది.

తపోదీక్షలో వున్న ఆమెని రాముడు పరిశీలనగా చూసి

'శబరీ.... నీ తపస్సు నిర్విఘ్నంగా జరుగుతోందా? నియమబద్ధమైన నీ జీవితం వల్ల నీకు సుఖంగా వుందా? నువ్వు నీ గురువుకి చేసిన శ్రశ్రూష సఫలమైందా?' అని అడిగాడు.

రాముని ఆదరాభిమానాలకి వృద్ధురాలైన శబరి పులకించిపోయింది.

'ప్రభూ, నీ దర్శనభాగ్యం వల్ల ఈ నాటికి నాకు తపస్సిద్ధి కలిగింది. నేను గురు శుశ్రూష చేసినదానికి కూడా ఫలం ఇపుడే లభించింది. నా జన్మనేటికి చరితార్థమైంది. సాక్షాత్తు దైవస్వరూపుడవైన నిన్ను సేవించడం వల్ల స్వర్గలోకం చేరినంత ఆనందంగా వుంది. నీ దృష్టి సోకడం వల్ల నేను పునీతురాలిని అయ్యాను. అరిందమా, నీ ప్రసాదం వల్ల నేను అక్షయ లోకాలకి చేరగలను. నువ్వు చిత్రకూటాశ్రమంలో ప్రవేశించినప్పట్నించీ ఈ నాటివరకు వెయ్యికళ్ళతో నీకోసం నిరీక్షిస్తున్నాను.

ధర్మజ్ఞులైన మా గురువులు, నువ్వు తప్పక ఈ ఆశ్రమానికి వస్తావని విశ్వసనీయంగా చెప్పారు.

'లక్ష్మణ సమేతుడై రాముడు నీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తాడు, ఆ మహనీయుని దర్శనభాగ్యం కలగ్గానే నువ్వు అక్షయలోకాలను పొందగలవు' అని ఆయన నొక్కి వక్కాణించారు.

మహానుభావా, నేను నీ కోసం ఎన్నో రకములైన ఆహారపదార్థాలు, రుచికరములైన వన్యభోజ్యాలను సేకరించివుంచాను. అని ఎంతో భక్తిప్రపత్తులతో చెప్పింది శబరి.

అపుడు రాముడు 'జ్ఞాన సంపన్నురాలా, కబంధుడు నీ గురించి, తేజోసంపన్నురాలవనీ, మహిమాన్వితురాలవనీ, ఇంకా చాలా చెప్పాడు. నీ కంగీకారమైతే, నీ ఆశ్రమం గొప్పతనం కళ్ళారా చూడాలని వుంది' అన్నాడు.

రామచంద్రుని మాటలు విన్న శబరి పరమానందభరితురాలైంది.

రాముని వెంటబెట్టుకుని తీసుకునివెళ్ళి ఆశ్రమమంతా చూపించింది.

'రాఘవా ఇది మతంగవనము. ఈ దట్టమైన అడవిలో ఎన్నెన్నో మృగాలూ, పక్షులు వున్నాయి. మా గురుదేవులైన మతంగ మహర్షి నిన్నే ధ్యానిస్తూ చాలాకాలం ఇక్కడ తపస్సు చేశారు. ఆయన తపోబలం ఈనాటికీ ఈ అడవిలో ప్రతి కోణంలో కనిపిస్తుంది. వారి ప్రభావం వల్లనే ఇది పవిత్రమైన తీర్థంగా మారింది. ఆయన శరీరం ఉపవాస దీక్షతో, వ్రతాలతో శుష్కించి వుండేది. ఒకసారి ఆయనకి సముద్రస్నానం చెయ్యాలనే సంకల్పం కలిగింది. కాని వెళ్ళే ఓపిక లేకపోయింది. అపుడు వారి మహిమవల్ల సప్తసముద్రాలలో జలము ఏకమై వచ్చి ఇక్కడ పంపాసరస్సుగా సాక్షాత్కరించింది. ఆనాడు వారు ఆ జలాలలో, స్నానం చేసి, చెట్లకు ఆరవేసిన నారవస్త్రములు, వారి మహిమ వల్ల ఇప్పటికీ తడిగానే వుండి, ఆ చెట్లకు కట్టబడివున్నాయి చూడండి.

ఆనాడు ఆయన పూజచేసిన కలువపువ్వులు ఈనాటికీ వాడకుండా దేముని విగ్రహాల మీద అలాగే తాజాగా వున్నాయి చూడండి. ఇదంతా మా గురువుగారి తపఃప్రభావము. అరుదైన ఈ అడవిని చూసి, దీని వృత్తాంతం నేను చెప్పగా తెలుసుకున్నావు. ప్రభూ ఈ జన్మ ధన్యమైనది. ఇంక అనుమతినిస్తే, ఈ శరీరాన్ని త్యజిస్తాను' అని చేతులు జోడించి వినయంగా కోరింది శబరి.

అద్భుతమైన ఆమతంగ ఆశ్రమాన్ని చూస్తూ ఆమె చెప్పినది శ్రద్ధగా విన్నాడు రాముడు. ఆ అద్భుత దృశ్యములన్నీ చూసి రామలక్ష్మణులు చాలా ఆశ్చర్య పోయారు. శబరి భక్తికి పరవశుడైన రాముడు, ఆమె నభినందించి సౌశీల్యవతీ, నీ భక్తిశ్రద్ధలకి చాలా సంతోషించాను. నీ ఆతిథ్యానికి తృప్తిపొందాను. కనుక ఇంక నీ ఇష్టం వచ్చిన చోటుకి నువ్వెళ్ళవచ్చును అని రాముడు చెప్పగానే ఆ వృద్ధతాపసి యజ్ఞకుండంలో అగ్నిని ప్రజ్వలింపచేసి, ఆ అగ్నిలో దేహాన్ని త్యజించి, దివ్యమైన రూపంతో మెరుపుతీగలా ప్రకాశిస్తూ పుణ్యాలోకాలకి తరలిపోయింది.

ఆ దృశ్యం చూస్తున్న రాముడికి కొంతసేపు ఆవేదన కలిగింది. తర్వాత తమ్ముడితో 'లక్ష్మణా ఈ ఆశ్రమం చాలా అద్భుతంగా వుంది కదూ. మనం కూడా సప్తసముద్రజలాలు కలిగిన ఈ పంపావరంలో స్నానం చేసి నాన్నగారికి తర్పణాలు సమర్పిద్దాము. ఇకపైన మనకి మంగళప్రదమైన కాలం రాబోతోంది. సీతా వియోగంతో తపించిపోతున్న నాకు ఇకపై శుభము కలుగుతుందని నమ్మకంగా వుంది. పద, పంపా సరోవరానికి వెళ్దాము. ఆపైన ఋష్యమూకాద్రికి వెళ్ళి సుగ్రీవుణ్ణి చూద్దాం'అన్నాడు. లక్ష్మణుడు 'సరే' అన్నాడు.

వారిద్దరూ పంపాసరోవరానికి వెళ్ళారు. ఆ పుష్కరిణి చల్లని స్వచ్ఛమైన జలాలతో నిండి వుంది. చిత్రవిచిత్రములైన కలువపూలతో నిండిన ఆ పంపాసరోవరం సమీపంలో మతంగ సరస్సు వుంది. సప్తసముద్ర జలాలతో నిండినది ఆ మతంగ సరస్సు. రామలక్ష్మణులు ఆ సరస్సులో స్నానాలు చేసి తండ్రికి తర్పణాలు సమర్పించారు. ఆ తర్వాత పంపాతీరం వెంట నడుస్తూ ఋష్యమూక పర్వతం వెతుక్కుంటూ బయల్దేరారు.

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## అరణ్యకాండ సమాప్తం



# అరణ్యకాండపై సమీక్ష

వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణంలో మూడవది అరణ్యకాండ. మొదటి రెండు కాండల్లోనూ ఉత్సాహపూర్వకంగా, ఉత్కంఠ భరితంగా నడిచిన కథా గమనం, అరణ్యకాండకి వచ్చేసరికి కాస్త ఉదాసీనంగా సాగుతుంది, మొదట్లో. ఆ తర్వాత శూర్పణఖ ప్రవేశంతో కథలో ఊపు అందుకుంటుంది. పది సంవత్సరాలు సీతారాములు లక్ష్మణుడు అరణ్యంలో వుండే మున్యాశ్రమాలు సందర్శిస్తూ, వారి సమస్యలు తీరుస్తూ, వారితో కలిసి కలోగంజో తాగుతూ కాలక్షేపం చేస్తారు. ఆ తర్వాత, అగస్త్యమహాముని సలహాపై పంచవటిలో ఆశ్రమం నిర్మించుకుని అక్కడ హాయిగా కాలక్షేపం చేస్తున్న తరుణంలో శూర్పణఖ వచ్చి రామలక్ష్మణుల వల్ల పరాభవించబడి జనస్థానంలో వున్న ఖరదూషణులతో తనకి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చమని అడుగుతుంది. అప్పుడు ఆ మహావీరులైన రాక్షసులు పధ్నాలుగువేలమంది సైన్యంతో రాముని మీదికి యుద్ధానికి వెళ్తారు. రాముడు ఒంటరిగా ఆ పధ్నాలుగువేలమంది రాక్షసులను, వారి నాయకులైన ఖరదూషణులను ఎదుర్కొని యుద్ధం చేసిన వైనం వాల్మీకి చాలా అద్భుతంగా కళ్ళకి కట్టినట్లు వర్ణించాడు. ఆ సన్నివేశం చదువుతున్నపుడు ఒళ్ళు గగుర్పొడిచి, చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఇలాంటి సన్నివేశాలు అరణ్యకాండలో రెండు మూడు చోట్ల కనిపిస్తాయి. అవి చదివినప్పుడు రాముడు సామాన్యమానవుడు కాదనీ, సాక్షాత్తు దైవాంశసంభూతుడని తెలుస్తుంది. అంతేకాని వాల్మీకి రామాయణంలో ఎక్కడా రాముడిలో దైవత్వం కనిపించదు. కేవలం ఒక సామాన్యమానవుడిగానే ఆయన మనకు కనిపిస్తాడు.ఇంక ఇక్కడ్నించి కథ చాలా మలుపులు తిరుగుతుంది.

రావణుడు మాయాసన్యాసి వేషంలో రాముడి ఆశ్రమంలో ప్రవేశించినపుడు సీత అతడ్ని సన్యాసిగానే భావించి లోపలికి ఆహ్వానించి అతిథి సత్కారాలు చేస్తుంది. రావణుడితో తనగోడు అంతా వెళ్ళబోసు

కుంటుంది. ఈ సన్నివేశంలో వాల్మీకి, సీతని ఇంకో అపురూపమైన కోణంలో చూపిస్తాడు. అసలు రాముడు మాయా జింకని వేటాడి తేవడానికి వెళ్తూ లక్ష్మణుడితో సీతని జాగ్రత్తగా కనిపెట్టి చూస్తుండమని వెళ్తాడు.

కాని మారీచుడు చనిపోతూ రాముడి కంఠాన్ని అనుకరిస్తూ వేసిన కేకలు విన్న సీత రాముడేదో ఆపదలో చిక్కుకున్నాడనుకుని రక్షించడానికి వెళ్ళమంటుంది. కాని సీతకేదైనా ఆపద కలుగుతుందేమో యని లక్ష్మణుడు భయపడి వెళ్ళడానికి ఒప్పుకోడు. అప్పుడు సీత లక్ష్మణుణ్ణి అనరాని మాటలని, చాలా నీచమైన పదజాలంతో లక్ష్మణుణ్ణి నిందిస్తుంది. అపుడే సీతలో దాగివున్న ఇంకో స్త్రీ మనకి గోచరిస్తుంది. రావణుడికి ఉపచారాలు చేస్తూ సీతచెప్పిన మాటలు విన్నప్పుడు మనకి చాలా ఆశ్చర్యం కల్గుతుంది. ఇంతకాలం భర్త - మరిది కాపాడుతుండగా వారిచాటున అమాయకంగా కనిపిస్తున్న సీత, రావణుడితో మాట్లాడిన పద్ధతి చూస్తే తన మనస్సులోని ఆవేదన తనంతతానే ఎవరికైనా చెప్పుకోవాలని ఆరాటపడ్తున్నట్లు అర్థమవుతుంది. అయితే అప్పటి ఆమె మానసిక పరిస్థితి కూడా అద్దంపట్టినట్లు కనిపిస్తుంది.

తనకు వివాహమై అత్తవారింటికి వెళ్ళేసరికి తనకి ఆరు సంవత్సరాలనీ, రాముడికి పన్నెండేళ్ళని ఆ తర్వాత పన్నెండు సంవత్సరాలకి తాము అరణ్య వాసానికి వచ్చామనీ, తనకి పద్దెనిమిదేళ్ళు. రాముడికి ఇరవైఐదు సంవత్సరాలు వయసులో వుండగా తాము అడవులకి వచ్చామంటుంది. ఎందుకంటే అప్పుడు ఆమె మనస్సంతా ఆందోళనతో నిండి తానేం చెబుతుందో తనకే తెలియకుండా చెప్పింది.

కాని విశ్వామిత్రుడు రాముణ్ణి యాగసంరక్షణ కోసం తనతో పంపమని దశరథుణ్ణి అడిగినపుడు, దశరథుడు రాముని గురించి 'ఊనషోడసవర్షః' అంటాడు. అంటే రాముడికి 15 నిండి 16వ సంవత్సరంలో అడుగుపెట్టాడన్నమాట. అంటే రాముడికి పెళ్ళినాటికి పదహారేళ్ళు అన్నమాట. అలాగే 'అష్టవర్షా భవేత్ కన్యా' అన్నారు కనుక సీతకి ఎనిమిదేళ్ళు

అనుకోవచ్చు. అయితే వికలిత మనస్సుతో సీత ఏదో నోటికి వచ్చింది చెప్పేసింది అని మనం అర్థం చేసుకోవచ్చు. అలా అస్తవ్యస్తమైన మనస్సుతోనే తమ చరిత్ర అంతా పూసగుచ్చినట్లు చెప్పింది సీత. ఇక్కడ లక్ష్మణుడు ఏదో గీత గీసి దానిని దాటవద్దన్నాడనీ, రావణుడు మాయోపాయంతో ఆమె గీతదాటేలా చేసి భూమితో సహా పెల్లగించుకుపోయాడనీ చాలారకాల కథలు ప్రచారంలో వున్నాయి. అవన్నీ కల్పిత కథలు.

సీత రావణుణ్ణి ఆశ్రమంలోకి ఆహ్వానించింది, అతిథి మర్యాదలు చేసింది. ఆ తర్వాత నయానా భయానా ఆమెని వశపరచుకోటానికి ప్రయత్నించి రావణుడు ఆమెని ఎత్తుకుపోయాడు. అంతేకాదు ఆమెని గుండెలకానించుకుని భుజంమీద వేసుకుని ఆకాశంలోకి ఎగిరిపోయాడని జటాయువు, రాముడికి చెప్పింది. ఇది వాల్మీకి రామాయణంలో వున్న మూలకథ. ఆ తర్వాత రాముడు ఒక సామాన్య మానవునిలాగే భోరుభోరున ఏడుస్తూ అడవంతా గాలించడం, కబంధుడి వధ, ఆ తర్వాత శబరి ఆశ్రమం దర్శించడం ఇదంతా రాముడు మానవమాత్రుడే సుమా అనే భావనను కలిగిస్తాయి.

ఇక్కడ రాముడు శబరిని మతంగ ఆశ్రమంలో కల్సుకున్నప్పుడు, ఆమె రాముడికి తాను కొరికి చూసిన ఎంగిలి ఫలములు రాముడికి పెట్టిందని ఒక కథ బహుళ ప్రజాదరణ పొందింది. కాని అదంతా కల్పితం. వాల్మీకి ఆ సంగతి సూచనప్రాయంగా కూడా వ్రాయలేదు. అహల్య మహాభక్తురాలు. ఆమె వృద్ధ తాపసి. మహాప్రాజ్ఞురాలు. శ్రీమన్నారాయణుడి అవతారమైన రాముడు ఆ ఆశ్రమం సందర్శించటానికి వస్తాడని ఆమె గురువుగారైన మతంగమహర్షి చెప్పటం వల్ల రాముని రాకకై నిరీక్షిస్తూ ఆమె ఆశ్రమంలో వుంటుంది. అంతటి పండితురాలు రామునికి ఎంగిలి పండ్లు పెట్టిందంటే అంతకన్నా అపచారం మరోటి లేదు. అసలు రామాయణంలో లేని కల్పిత గాథలెన్నో ప్రచారంలో వున్నాయి. మనం

జాగ్రత్తగా రామాయణం వాల్మీకి రచించినది చదివితే ఆ సంగతి మనకి అర్థమవుతుంది. ఆ తపనతోనే వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణ కథని ఉన్నదున్నట్లు ప్రజలముందుంచాలనే ఈ 'రామకథాసుధ' రచన చేపట్టడం జరిగింది.

ఇందులో నేను చెప్తున్నది కేవలం రామకథ మాత్రమే. కాని వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణంలోని అరణ్యకాండలో ఎన్నెన్నో జాతులకు చెందిన వృక్షాలు అన్నింటినీ పేర్లతో సహా ఆయన వర్ణించాడు. దండకారణ్యం - జనస్థానం - మతంగవనం. ఈ ప్రదేశాలన్నీ భౌగోళికంగా వాటి సమగ్ర స్వరూపం మన ముందుంచాడాయన. ఆ జలపాతాలు, సెలయేళ్ళు, కొండలు, కోనలు, ప్రకృతి రమణీయతతో నిండిన దృశ్యాలు చదివితీరవలసిందే. అదొక అద్భుతమైన అనుభవంగా మిగిలిపోతుంది మన స్మృతిపథంలో.....



# నా గురించి.....

భర్త శ్రీ భావరాజు శ్రీనివాసరావుగారితో
రచయిత్రి **భావరాజు వరలక్ష్మి**

| | | |
|---|---|---|
| నాపేరు | : | భావరాజు వరలక్ష్మి |
| జన్మస్థలం | : | ఆదికవి నన్నయ్య అవతరించిన నేల. పావన గోదావరీ తీరాన వున్న రాజమహేంద్రవరం |
| పుట్టిన తేదీ | : | పంతొమ్మిది వందల నలభై రెండవ సంవత్సరం అక్టోబరు నెల పధ్నాలుగో తారీఖు చిత్రభాను సంవత్సర ఆశ్వయుజ శుక్ల పంచమి |
| తల్లిదండ్రులు | : | తల్లి : కీ॥శే॥ కేసాప్రగడ సీతామహలక్ష్మి<br>తండ్రి కీ॥శే॥ కేసాప్రగడ శ్రీరామమూర్తి |
| చదువుసంధ్యలు | : | ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యాను<br>సంస్కృత హిందీ భాషలలో ప్రవేశం ఉంది. |
| భర్తపేరు | : | నా విజయమే తన విజయంగా భావించి, అన్ని విషయాలలో నాకండదండలుగా నిల్చి నన్ను ప్రాణప్రదంగా ప్రేమించే శ్రీ భావరాజు శ్రీనివాసరావుగారు. |
| ఆస్తిపాస్తులు | : | వంశపారంపర్యంగా వస్తున్న రామభక్తి సామ్రాజ్యం |
| సంతానం | : | మమ్మల్ని దైవ సమానంగా ఆరాధించే ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు చి॥ పద్మ, చి॥ లలిత, చి॥ మురళి, చి॥ సూర్యనారాయణ |
| జీవితంలో మరపురాని మధుర సంఘటన | : | తిరుమల తిరుపతివారి అనుగ్రహం కలగడం |
| చాలా ఆనందం కల్గించిన సంఘటన | : | పంతొమ్మిది వందల తొంభై మూడవ సంవత్సరంలో భారత ప్రభుత్వము వారు నిర్వహించిన పర్యావరణ సంరక్షణ నిమిత్తం నిర్వహించిన రచనల పోటీలో జాతీయ స్థాయిలో బహుమతి రావడం (నేను రచించిన బుజ్జికథకి) |
| నిజమైన నా బంగారు కల | : | "రామకథాసుధ" కావ్యం ప్రచురితము కావడం |
| జీవితాశయం | : | ఎప్పటికైనా ఒక చిన్న రామమందిరం కట్టించాలన్నది |

# మీకు తెలుసా....



- ✓ శ్రీరాముడు, రావణుడు, సీతాస్వయంవరమునకు వెళ్ళలేదు.
- ✓ మహాసాధ్వి అహల్య రాయిగా మారలేదు.
- ✓ మహాభక్తురాలు శబరి రామునికి ఎంగిలిపండ్లు పెట్టలేదు.
- ✓ సీతని రావణుడు భూమితో సహా పెకలించి తీసుకుని వెళ్ళలేదు.
- ✓ లక్ష్మణుడు సీతని దాటవద్దని గీత గియ్యలేదు.
- ✓ రావణుని ఉదరములో అమృత కలశం లేదు.
- ✓ కేవలం చాకలివాని మాటతో రాముడు సీతను పరిత్యజించలేదు.
- ✓ శ్రీరాముని యాగాశ్వాన్ని లవకుశులు బంధించలేదు.
- ✓ ఇవన్నీ సత్యములు. శ్రీ వాల్మీకి మహర్షి సంస్కృతము నందు రచించిన శ్రీ మద్రామాయణంలో ఏవేవి ఉన్నాయి, ఏమేమి లేవు అన్న విషయాలు విశదీకరించబడ్డాయి. సంస్కృత మూల రామాయణానికి యథాతథ తెలుగు సేత ఈ "రామకథాసుధ" సరళమైను ఈ రామకథాసుధను ఆస్వాదించండి. అసలు రామకధ తెలుసుకోండి.

- రచయిత్రి

తృతీయ భాగము

# రామకథాసుధ

(ప్రక్షిప్తాలూ కల్పనలూ లేని మహర్షి వాల్మీకి విరచిత యథాతథ ఘట్టాలతో)

(కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధ కాండ, ఉత్తరకాండ)



రచన : భావరాజు వరలక్ష్మి

# రామ కథాసుధ

(కిష్కిందకాండ, సుందరకాండ, యుద్ధకాండ, ఉత్తరకాండ)

రచయిత్రి : శ్రీమతి భావరాజు వరలక్ష్మి



శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే
అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేక దంతం బక్తానామ్ ఏకదంత ముపాస్మహే

# రామకథాసుధ

భూపరాజు పరంక్షి

ప్రథమ ముద్రణము :
నవంబరు 4, 2005
పార్థివ నామసంవత్సర, కార్తీక శుక్ల తదియ

ప్రతులు : 1000

మూల్యం : **300-00** (రెండు భాగములు కలిపి)



సర్వహక్కులు రచయిత్రివి



చిరునామా :
C/o. బి. మురళి
సెక్షన్ ఆఫీసర్
మినిస్ట్రీ ఆఫ్ పవర్
శ్రమశక్తి భవన్, రఫీక్‌మార్గ్
న్యూ ఢిల్లీ - 110 001



సోల్ డిస్ట్రిబ్యూటర్స్ / ప్రతులకు :
గొల్లపూడి వీరాస్వామి సన్
కోటగుమ్మం, రాజమండ్రి, ఫోన్ : 2465253

ముద్రణ :
శ్రీలక్ష్మీగణపతి బైండింగ్ వర్క్స్
కొవ్వూరు. ఫోన్ : 08813 - 231575

తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంతో...



వినా వేంకటేశం ననాథోననాథః
సదా వేంకటేశం స్మరామిస్మరామి
హరీ వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ



# కిష్కింధకాండ

వారలా నడుచుకుంటూ దారిపొడుగునా వసంతాగమనం వల్ల విరబూసిన పూలతో నిండిన రమణీయమైన లతల్నీ, తరువుల్నీ, చిగురులు తొడిగిన కొమ్మల్నీ రెమ్మల్నీ చూస్తూ గడచిన సంగతులన్నీ చర్చించుకుంటూ నడుస్తున్నారు. సీత ఎడబాటు వల్ల రాముడు ఆ వసంతశోభల్ని చూస్తూ మరింత దుఃఖంతో తన హృదయంలోని ఆవేదనంతా లక్ష్మణునితో చెప్పుకుని బాధపడ్డాడు. అపుడు లక్ష్మణుడు రాముణ్ణి ఓదారుస్తూ,

'అన్నయ్యా - ధీశాలివైన నువ్వే ఇలా కృంగిపోతే ఎలా? వదినను మీరెంతగా ప్రేమించేవారో నేనెరగనా? ఆమె వియోగం వల్ల నీకు బాధ కలగడం సహజమే. కాని ఒక్క సంగతి ఆలోచించు. దీపం కాంతివంతగా వెలగాలంటే నూనె అవసరమే. కాని ఆ నూనె ఎక్కువైతే, వత్తి మునిగిపోయి దీపం ఆరిపోయే ప్రమాదం వుంది. అలాగే ప్రేమ కూడా పొంగి పొర్లితే ప్రమాదం సంభవించే అవకాశం వుంది.

ప్రస్తుతం జానకిపట్ల కాస్త వ్యామోహం తగ్గించి ఆలోచిస్తే నీకు కర్తవ్యం బోధపడ్తుంది. ఆ రావణుడు సీతని ఎత్తుకుపోయి పాతాళంలో దాచినా సరే వాడిని వదిలేది లేదు. వాడు ప్రాణాలతో వుండడం కల్ల. అయితే ముందుగా వాడు సీతమ్మనెక్కడ దాచాడో తెలుసుకోవాలిగదా! అన్నయ్యా ఉత్సాహాన్ని మించిన బలం లేదు. ప్రయత్నిస్తే అసాధ్యమైనది ఏమీ వుండదు. అధైర్యం మనిషిని కృంగదీస్తుంది. ఉత్సాహం మనిషికి బలం ఇస్తుంది. కనుక నువ్వు దుఃఖాన్ని దిగమింగి ముందుగా ఉత్సాహం తెచ్చుకో' అంటు అనేకవిధాల ఊరడించాడు.

తమ్ముడి మాటలు విన్న రాముడు కొంత ఊరటపొందాడు. వారిద్దరూ ఇలా అలా ఋష్యమూకం వెతక్కుంటు వెళ్తున్నారు. మత్తగజాల్లా సాగివస్తున్న రామలక్ష్మణుల్ని సుగ్రీవుడు చూశాడు. ఋష్యమూక పర్వతం మీద నలుగురు మంత్రులతో ఇష్టాగోష్టి సలుపుతున్న సుగ్రీవుడు దూరంనించి, వస్తున్న ఆ అగ్రేసరులిద్దర్నీ చూసి, ఒక్కసారిగా కంగారుపడ్డాడు. మనస్సులో పరిపరివిధాలుగా ఆలోచిస్తూ తన మంత్రులతో సమాలోచించి, ఆ వస్తున్న వీరులిద్దరిని, వాలి తన మీదికి పంపివుంటాడని అనుకున్నాడు. ఇలా నారచీరలు ధరించి తాపసుల వేషంలో రావడం కేవలం తమని మోసం చెయ్యడానికే అనుకున్నాడు.

వెంటనే మంత్రులతో సహా ఇంకొక కొండశిఖరం చాటున కూర్చుని ఏం చెయ్యాలా అని సమాలోచన చేశాడు. వాలి తనకి అపకారం చెయ్యడానికి వారిని

పంపాడని సుగ్రీవుడన్నాడు. భయంతో వణికిపోతున్న సుగ్రీవునికి ధైర్యం చెప్తూ ఆతనికత్యంత ఆప్తుడైన ఆంజనేయుడిలా అన్నాడు. 'సుగ్రీవా నువ్వు అనవసరంగా భయపడకు. మనమున్నది మలయపర్వతం మీద కదా. మనం వాలిబారి నించి రక్షించుకోవడానికి ఇక్కడికి పారిపోయి వచ్చిన దగ్గరనుంచి, ఇవాళదాకా వాలికాని, అతడి అనుచరులుగాని, ఎవ్వరూ ఇక్కడికి రాలేదు. అంతేకాదు, నీ భార్యనపహరించి నీకు ద్రోహం చేసిన నీ అన్న వాలి ఎప్పటికీ ఇక్కడికి రాడు' అన్నాడు.

కాని సుగ్రీవుడు మాత్రం ఆంజనేయుని మాటలకి ఒప్పుకోలేదు.

'హనుమా, ఆ మానవోత్తముల్ని సరిగ్గా చూడు. ఆజానుబాహువులు, ధనుర్బాణాలు ధరించి ఆ దేవేంద్రుడు దిగి వచ్చాడా అనినట్లున్నారు. వారిని నిశ్చయంగా, వాలే పంపి ఉంటాడు. ప్రచ్ఛన్నంగా తిరుగుతున్న శత్రువులను గుర్తించినవాడే సరియైన రాజు. వాలి చాలా తెలివైనవాడు. మనల్ని మట్టుబెట్టడానికి చాలా రకాలైన ఉపాయాలు ఆలోచిస్తాడు.

కనుక నువ్విప్పుడో పనిచెయ్యాలి. నువ్వొక సామాన్యుడి వేషములో వారి దగ్గరకి వెళ్ళు. వారి మాటలు స్వభావం ఎలా వున్నాయో పరిశీలించి చూడు. అసలు వాళ్ళు ఈ అడవిలోకి ఎందుకు వచ్చారో తెలుసుకో. పదే పదే బాగా ప్రశ్నించి, వారి మంచి చెడ్డలు తెలుసుకో' అని సుగ్రీవుడు హనుమంతుణ్ణి ఆజ్ఞాపించాడు.

'సరే' అంటు హనుమంతుడు లేచాడు. ఋష్యమూక పర్వతం పై నించి ఒకదూకు దూకాడు. తిన్నగా రామలక్ష్మణులు వున్న ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ వానరరూపం మార్చుకుని, ఒక సామాన్యమానవునిగా భిక్షువురూపం ధరించి కాలినడకని వాళ్ళదగ్గరకి వెళ్ళాడు. వారికెదురుగా నిలబడి వారి పాదాలకి అభివందనం చేశాడు. మృదుమధుర గంభీరస్వరంతో వారినిలా అడిగాడు.

'ఆర్యులారా చూడగా మీరు అమిత పరాక్రమవంతులుగా కనిపిస్తున్నారు. రాజ ఋషులా లేక దేవతలా? తాపస వేషంలో దీక్షాపరులై వున్నట్లు కనిపిస్తున్నారు. ఇంతటి తేజోమూర్తులు ఇలా ఈ అడవీ ప్రాంతానికి రావడానికి కారణమేమిటి? మీ రాకవలన ఈ పంపానదీ తీరానికి మరింత శోభ కలిగింది. మిమ్మల్నిలా చూస్తుంటే రాచవంశానికి చెందిన వారిలా వున్నారు. సూర్యచంద్రుల్లా వున్న మీరు, రాజ్యపాలన చెయ్యగల సమర్థులై వుండీ ఇలా తాపసవృత్తిలో నారచీరలు ధరించి ఈ అడవికెందుకు వచ్చారు? రత్నభూషణములు ధరించవలసిన అర్హత కలిగి

వుండీ ఇలా నిరాడంబరంగా వున్నారెందుకు? మీరు ధరించిన ధనస్సులు చాలా అపూర్వంగా వుండి, వజ్రాయుధాల్లా వున్నాయి. మీ అమ్ములపొదులు కూడా చాలా అద్భుతంగా వున్నాయి. వాటిలో వున్న అమ్ములు విషసర్పాల్లా వున్నాయి. మీరు ధరించిన ఖడ్గాలు కూడా మేలిమి బంగారంతో చెయ్యబడి వున్నాయి. పురుషోత్తములారా, దయయుంచి నా విన్నపములాలకించండి. సుగ్రీవుడు అని ఒక పేరుపొందిన వానరరాజు వున్నాడు. అతడు చాలా ధర్మాత్ముడు. తన అన్నగారైన వాలిచే అవమానించబడి, దుఃఖంతో మతిలేకుండా తిరుగుతున్నాడు. ఆయన పంపగా నేను మీ దగ్గరకి వచ్చాను. నేనూ వానరుడినే. నా పేరు హనుమంతుడు. మా రాజైన సుగ్రీవుడు మీతో మైత్రి చేసుకోవాలని అనుకుంటున్నాడు. నేను ఆయన మంత్రిని వాయుపుత్రుణ్ణి. సుగ్రీవుని విషయం మీతో రహస్యంగా చెప్పాలని, ఇలా భిక్షువురూపంలో వచ్చాను.

మా వానరజాతికి, కామగమనము, కామరూపము కూడా తెలుసు. కనుక నేను మానవరూపంతో మీ సన్నిధికి వచ్చాను. మేము నలుగురం మిత్రులం. మా రాజైన సుగ్రీవుడితో ప్రస్తుతం ఋష్యమూక పర్వతం మీద రహస్యంగా నివసిస్తున్నాము' అని వివరంగా తమ సంగతి చెప్పి వినయంగా నమస్కరించాడు. ఆ మాటలు విన్నాక రాముడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. వెతకబోయిన తీగ కాలికి చుట్టుకుంది అనుకున్నాడు. సంతోషంగా లక్ష్మణునివైపు చూసి,

'తమ్ముడూ మనం ఎవర్ని వెతుక్కుంటూ బయల్దేరామో, ఆ సుగ్రీవుని మంత్రి, ఈ వానరోత్తముడు మన దగ్గరకు వచ్చాడు. ఎంత ఆశ్చర్యంగా వుంది! సౌమిత్రీ, ఇతడితో మనం ప్రేమగా, మధురంగా మాట్లాడాలి. ఎందుకంటే ఇతడు వేదాధ్యయనం చేసిన మహనీయునిలా ఉన్నాడు. ఋగ్వేదము క్షుణ్ణముగా అభ్యసించినవాడూ, యజుర్వేదధారణ చేసినవాడూ, సామవేదము గానము చెయ్యగలవాడూ, మాత్రమే ఇంత పొందికగా మాట్లాడగలడు. నిజముగా ఈ వానరోత్తముడు వ్యాకరణ శాస్త్రం క్షుణ్ణంగా అభ్యసించి వుంటాడు. ఒక్క అపశబ్దము కూడా లేకుండా చాలా చక్కగా మాట్లాడాడు. నువ్వు గమనించావో లేదో గాని, ఇతడు మాట్లాడినప్పుడు కన్నులలో గాని, నుదుటిపై గాని, ఇతర అవయవాల్లో కాని, ఎక్కడా ఏ రకమైన వికారము లేదు. ఆద్యంతం మధ్యమంలో మాట్లాడాడు. ఏ అర్థం తెలుపటానికి ఏ పదం వాడాలో, చక్కగా తెలుసుకుని చక్కగా ప్రయోగించాడు.

హీనస్వరంతో గాని, ఉచ్చస్వరంతోగాని, మాట్లాడలేదు. అతిగాకాని,

అసందిగ్ధంగాగాని, అవిలమ్బితంగా గాని, అద్రుతంగా గాని, పలుకలేదు. మార్దవంగా ప్రసన్నంగా, స్పష్టంగా చెప్పదల్చుకున్నది స్పష్టంగా చెప్పాడు. చాలా సూటిగా, సంస్కారవంతమైన ఈతడి మాటలు మంగళప్రదంగా వున్నాయి.

ఇతడుచ్చరించే పద్ధతి, మధురమైన వాక్కు, ఎదుటివారి హృదయాన్నయినా దోచుకునేవిగా వున్నాయి. శత్రువులను సైతం ప్రసన్నం చేసుకోగల శక్తి ఈతడిమాటలకుంది. ఇంతటి ఉత్తముడు దూతగా వున్నపుడు, ఆ ఏలిక కార్యం తప్పక సిద్ధిస్తుంది' అంటు సుగ్రీవుడు, అదృష్టవంతుడని, హనుమంతుణ్ణి ఎన్నివిధాలో ప్రశంసించాడు రాముడు. ప్రధమ సందర్శనలోనే అన్నగార్ని అంతగా ఆకట్టుకున్న ఆంజనేయుని అదృష్టాన్నికి లక్ష్మణుడు చాలా సంతోషించాడు. రాముడు ఆనందించటం లక్ష్మణునికి చాలా సంతృప్తి కలిగించింది.

'హనుమా మహాత్ముడైన సుగ్రీవుని గురించి మేమిదవరకే విన్నాము. ఆయనని వెతుక్కుంటునే మేమిక్కడికి వచ్చాము. మీ రాజైన సుగ్రీవుడు మాతో మైత్రి చేసుకోవాలనుకుంటున్నారని, మీ మాటలు వలన మాకు తెలిసింది. తప్పకుండా వారిష్టప్రకారమే చేద్దాము' అన్నాడు ఆ మాటలకి హనుమంతుడు చాలా సంతోషించాడు. సుగ్రీవుని కోరిక తీరే సమయం వచ్చిందని చాలా సంతోషించాడు. చేతులు, జోడించి వినయంగా ఇలా అన్నాడు.

'పూజ్యులారా, ఈ పంపాతీర అరణ్యం చాలా ఘోరమైనది. ఇక్కడికి మానవమాత్రులెవ్వరూ రాలేరు. ఇక్కడ ఎన్నెన్నో క్రూరమృగాలు స్వేచ్ఛగా సంచరిస్తు వుంటాయి. ఈ దుర్గమమైన ప్రాంతానికి మీరెలా రాగలిగారు?' అని అడిగాడు.

రాముడు లక్ష్మణునితో తమ సంగతి వివరంగా ఆంజనేయునికి చెప్పమని అన్నాడు. అపుడు లక్ష్మణుడిలా చెప్పాడు.

'మహాత్మా ధర్మవత్సలుడైన దశరథ మహారాజు గారి జ్యేష్ఠపుత్రుడు మా అన్నగారైన రాముడు. ఒక దురదృష్ట సంఘటన వల్ల మా అన్నయ్య రాజ్యభ్రష్టుడై తన తమ్ముడినైన లక్ష్మణుడనైన నాతోనూ, తన ధర్మపత్నియైన సీతతోటీ, రాజ్యం వదిలి ఇలా అరణ్యాలకి వచ్చాడు. మా అన్నయ్య ధర్మవర్తనుడు. ఎవరైనా తనకి స్వల్పమైన ఉపకారము చేసినా, సరే ఆయన చాలా ఎక్కువగా భావిస్తాడు. నేను దాస్యవృత్తికై ఆయనవెంట వచ్చాను. మహాపరాక్రమవంతుడైన ఈయన భార్యని, మేము ఆశ్రమంలో లేని సమయంలో రావణుడనే రాక్షసుడు కామరూపము ధరించి, అపహరించుకుపోయాడు.

వాడెవడో కూడా మాకు తెలియదు. మేము మా వదినగారి కోసమని, అడవులన్నీ వెతుకుతు వుండగా, కబంధుడనే రాక్షసుడు మాకంటబడ్డాడు. దనువు వంశమున జన్మించిన, అతడు శాపము వల్ల కబందుడనే రాక్షసుడుగా మారి, అడవులలో తిరుగుతున్నాడు. అతడే మాకు సుగ్రీవుని గురించి చెప్పి అతడు చాలా సమర్ధుడనీ, సీత జాడ తెలుసుకోగలడనీ చెప్పాడు. అందుకే మేము మా వదినగారి జాడ తెలుసుకోవడానికి సుగ్రీవుణ్ణి కలవాలని బయల్దేరాము. మా విషయమంతా నీకు వివరంగా చెప్పాను. హనుమా, నేనూ, మా అన్నయ్య రాముడు, సుగ్రీవుని శరణుపొందవలసిన వానిగా విశ్వసించాము. మా అన్నయ్య ఎందరికో శరణుఇచ్చి, గొప్ప కీర్తి సంపాదించాడు. లోకనాథుడైన ఈ మహాపురుషుడు ఇప్పుడు సుగ్రీవుని శరణుకోరనున్నాడు. మా తండ్రిగారు కూడా ఎందరికో దానధర్మాలు చేసి గొప్పదాత అని పేరుపొందారు. తండ్రిని మించిన దాత అయిన రాముడు, నేడు సుగ్రీవుని శరణంటున్నాడు.

నా గురువు, ప్రభువు, నా సర్వసం తానే అయిన రాముడు, సర్వలోకములకు శరణు నొసగగల మహనీయుడు. దైవవశాన ఈనాడు సుగ్రీవుని శరణుకోరనున్నాడు. ఎవని అనుగ్రహం వల్ల సర్వకాలములయందు ప్రజలంతా ప్రశాంతత పొందగలరో, అంతటి మహాత్ముడు, శరణన్న వారిని ఆదరించే ధర్మమూర్తి ఇవాళ ఒక వానరేంద్రుని ప్రసాదం కోసం, ఆశ్రయిస్తున్నాడు.

ఈ భూమండలంలో సద్గుణసంపన్నులైన రాజులందరూ, దశరథమహారాజుని గౌరవించేవారు. అంతటి మహనీయుని జ్యేష్టకుమారుడు, రాముడు ముల్లోకాలలోనూ ప్రసిద్ధి చెందినవాడు, ఇప్పుడు ఒక వానరరాజుని, శరణు కోరనున్నాడు. కనుక ఆ సుగ్రీవుడు తప్పక మా రాముని కోరిక తీర్చాలి' అంటు దీనాతిదీనంగా, కన్నీటితో తన మనస్సులోని ఆవేదనంతా ఆంజనేయునికి నివేదించాడు లక్ష్మణుడు.

హనుమంతుడు లక్ష్మణుని మాటన్నీ చాలాశ్రద్ధగా ఆలకించి, 'ఆర్యా, మీలాంటి జితేంద్రియులు, బుద్ధిమంతులు, మా సుగ్రీవుని చేత తప్పక సేవింపతగ్గవారు. అతడి భాగ్యవశాత్తు ఈనాడు అప్రయత్నంగా మీ అంతటి వారు అతనిని దర్శించడానికి వచ్చారు. ఇది అతడి మహాభాగ్యం. మా ప్రభువైన సుగ్రీవుడు కూడా తన అన్నగారైన వాలిచేత రాజ్యం నించి వెళ్ళగొట్టబడ్డాడు. ఇతని భార్యని కూడా అపహరించి, రాజ్యభ్రష్టుణ్ణి చేసి, ఇలా అడవులలో, కొండలమీద తిరిగేలా చేశాడు. సూర్యనందనుడైన సుగ్రీవుడు సీతని వెతకడంలో

మీకు తప్పక సాయం చేస్తాడు. సీతమ్మ జాడతప్పక తెలుస్తుంది. రండి వెళ్దాం సుగ్రీవుని దగ్గరకు' అన్నాడు.

లక్ష్మణుడు రామునితో, 'అన్నయ్యా ఈ వాయుపుత్రుడు, హనుమంతుడు, వీరుడు, అసత్యం చెప్పడము లేదని అతని ముఖం చూస్తే తెలుస్తోంది. మనం సుగ్రీవుని సాయం కోరుతున్నట్లే, అతడూ మన సాయం కోరుతున్నాడు. కనుక మనం ఇతనిని నమ్మి ఇతనివెంట వెళ్ళవచ్చును'అన్నాడు. రాముడు కూడా ఆ మాటలకు ప్రసన్నుడయ్యాడు.

అప్పుడు హనుమంతుడా బిక్షు రూపము వదలి, తన సహజ వానరరూపము ధరించి, తన రెండు భుజాలపైనా రామలక్ష్మణులను ఎక్కించుకుని, బయల్దేరాడు.

తిన్నగా ఋష్యమూక పర్వతం పైకి వెళ్ళి రామలక్ష్మణులను అక్కడ దింపాడు. వారినక్కడే వుండమని, తనుమాత్రం మలయపర్వతానికి, సుగ్రీవుడుండే చోటుకు వెళ్ళాడు. సుగ్రీవునితో ఇలా అన్నాడు.

'ప్రభూ మహాప్రాజ్ఞుడైన శ్రీరాముడు, ఋష్యమూక పర్వతానికి వచ్చాడు. ఆయన సత్యపరాక్రముడు. ఆయనవెంట ఆయన తమ్ముడైన లక్ష్మణుడు కూడా వచ్చాడు. ధర్మబద్ధుడైనరాముడు, తండ్రి ఆజ్ఞ పరిపాలించడానికి, అడవులకు వచ్చాడు. ఇక్ష్వాకువంశప్రభువైన దశరథ మహారాజు కుమారులీ రామలక్ష్మణులు. తండ్రి ఆజ్ఞపాలించడానికై భార్యతో కూడా అడవులలో నివసిస్తుండగా, రాముని భార్య అయిన సీతమ్మని, రావణుడనే రాక్షసుడు ఎత్తుకునిపోయాడట. ఇప్పుడా మహనీయుడు నీ సాయంకోరి వచ్చాడు. ఎన్నెన్నో యజ్ఞయాగాదులు చేసిన దశరథ మహారాజు కుమారులు, ఎన్నెన్నో దానధర్మాలుచేసిన మహాప్రభువు, ఇప్పుడు నిన్ను శరణుకోరి వచ్చాడు. మహాపరాక్రమశాలియైన రాముడు ఇప్పుడు నీతో సఖ్యం చేసుకోవాలని కోరుతున్నాడు. కనుక నువ్వు వారి దగ్గరకు వచ్చి, వారిని పూజించు. అంతకన్నా ఆరాధించతగ్గవారు ఈలోకంలోనేలేరు' అని ఆంజనేయుడు చెప్పగానే, సుగ్రీవుడు ఆనందంతో పరవశించి, మనుష్యరూపం ధరించి, రాముడున్న చోటుకి వచ్చాడు. రామునికి స్వాగతం చెప్పి ఇలా అన్నాడు.

'రామా - ధర్మములో సుశిక్షితుడివైన నువ్వు, చాలా పరాక్రమశాలివనీ, ఎన్నో దోషములున్న వారినైనా ప్రేమించేవాడివనీ, నాకు వాయుపుత్రుడు చెప్పాడు. వానరమాత్రుడనైన నాతో స్నేహం చెయ్యాలని మీరనుకోవడం నిజంగా మీరు నాకు సన్మానం చేసినట్లే. ఇదిగో నా చెయ్యి చాస్తున్నాను. ఈ చేతిని పట్టుకో' అంటు తన కుడిచెయ్యి ముందుకి చాపాడు. రామా, నిజంగా నీకు నాతో స్నేహం

చెయ్యాలనే అభిలాష వుంటే ఈ చెయ్యిపట్టుకో' అన్నాడు.

రాముడు ఆప్యాయంగా ఆ చేతిని అందుకుని, సుగ్రీవుని దగ్గరకి చేర్చుకున్నాడు. అంతలో హనుమంతుడు, జమ్మిచెట్టు కొమ్మలు విరిచి అగ్నిహోత్రం తయారుచేశాడు. ప్రజ్వరిల్లుతున్న ఆ అగ్నిని పూవులతో పూజించి, ఉపచారాలు చేశాడు. రామలక్ష్మణులు ఆ అగ్నికి ప్రదక్షిణాలు చేశారు. ఆ తర్వాత సుగ్రీవునితో కూడా ప్రదక్షిణం చేయించారు. వారు ముగ్గురు పరస్పరం మిత్రులుగా ఆ అగ్నిసాక్షిగా ప్రమాణాలు చేసుకున్నారు అప్పుడు ఎంత చూసినా తనివితీరని రాముని దివ్యమంగళరూపాన్ని చూసిన సుగ్రీవుడు 'రామా నా మనస్సుకి ఆనందం కలిగించే మిత్రుడివి నువ్వు. ఇవాల్టినుంచీ మనద్దరికీ సుఖదుఃఖాలు ఒక్కటే. అంటూ సుగ్రీవుడు, నిండాపూలతో నిండిన సాలవృక్షపు కొమ్మనొకటి విరిచి రామునికి ఆసనంగా వేశాడు. రాముడు, సుగ్రీవుడు ఆ కొమ్మమీద పక్కపక్కనే కూర్చున్నారు. అప్పుడు హనుమంతుడు, బలమైన చందనవృక్షపు కొమ్మఒకటి విరిచి తెచ్చి, లక్ష్మణునికి ఆసనంగా వేశాడు. లక్ష్మణుడు, ఆంజనేయుడు, ఆ కొమ్మమీద కూర్చున్నారు.

సుగ్రీవుడు కళ్ళు ఆనందబాష్పాలతో నిండాయి. గద్గదస్వరంతో ఇలా అన్నాడు.

'రామా నాకు వాలి తీరని అపకారం చేశాడు. ఏ క్షణంలో ఏం చేస్తాడో అనే భయంతో గుండెలు చిక్కబెట్టుకుని బతుకుతున్నాను. మా అన్నగారైన వాలి నామీద పగబట్టి వున్నాడు. నువ్వు నాకు అభయం ఇవ్వాలి. కాకుత్స్థా, నువ్వే నా భయం పోగొట్టాలి' అని సుగ్రీవుడు పదే పదే కళ్ళు తుడుచుకుంటుంటే రాముడు చిరునవ్వుతో,

'కపీశ్వరా ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చెయ్యాలనే ధర్మం నాకు తెలుసు. నీ భార్యని నీనించి దూరం చేసిన వాలిని నేను సంహరిస్తాను. ఇదిగో చూడు. నా బాణాలు దివ్యమైనవి, అమోఘమైనవి. పదునైనవి. సూర్యకాంతితో సమానంగా వేగంగా వెళ్ళి వాలిని నేలకూలుస్తాయి' అని రాముడు సుగ్రీవునికి వాగ్దానం చేశాడు.

సుగ్రీవుడు సంతృప్తి పొంది, ఆనందంతో 'ప్రభూ, నీ అనుగ్రహం వల్ల నా భార్యనీ, రాజ్యాన్నీ మళ్ళీ పొందగలన్న ధైర్యం వచ్చింది. ఆనాడు హిరణ్యకశపుని చంపి ప్రహ్లాదుని రక్షించిన నరసింహస్వామి అంతటివాడివు నువ్వు' అంటూ రాముణ్ణి ఎంతగానో ప్రశంసించాడు. తేలికగా ఊపిరి పిల్చుకుంటూ మళ్ళీ ఇలా

అన్నాడు.

'మిత్రమా, నా మంత్రులలో ముఖ్యమైనవాడు హనుమ. నువ్వు ఈ అడవికి ఎందుకొచ్చావో తెలుసుకుని చెప్పినవాడతడే. నువ్వు నీ తమ్ముడూ, ఆశ్రమంలో లేని సమయంలో ఒంటరిగా వున్న సీతమ్మని రావణుడు ఎత్తుకుపోయాడని, సీతమ్మని రక్షించడానికి ప్రయత్నించిన జటాయువుని చంపేశాడనీ చెప్పాడు.

కాని నువ్వు ఇంక విచారించాల్సిన పనిలేదు. తొందరలోనే నువ్వు నీ భార్యని చేరుకుంటావు. ఆమె పాతాళంలో వున్నా, అంతరిక్షంలో వున్నా వెతికి తెప్పించి నీకప్పగిస్తాను. నా మాటనమ్ము. ఒకనాడు ఒక క్రూరుడైన రాక్షసుడు, 'రామా, రామా', 'లక్ష్మణా, లక్ష్మణా' అని ఆక్రోశిస్తున్న ఒక స్త్రీని, ఆకాశంలో ఎత్తుకు పోతుండడం మేము చూశాము. నీ మాటల్ని బట్టి ఆనాడు మేము చూసిన స్త్రీ నీ భార్య అయిన మైథిలియే అయివుంటుందని అనుకుంటున్నాము. ఆమె ఆ రావణుని చేతిలో ఆడత్రాచులా గుంజుకోవటం, ఈ కొండపై నుంచున్న మేము చూశాము. ఆమె తన ఆభరణాలు కొన్ని తీసి, తను కట్టుకున్న చీరచెంగు చింపి, అందులో మూటకట్టి, మా ముందుకి జారవిడిచింది. మేము ఆ మూటతీసి దాచివుంచాము. అవి తెప్పిస్తాను గుర్తుపట్టు' అన్నాడు.

సుగ్రీవుడు వెంటనే పట్టుగుడ్డలో మూటకట్టిన ఆ నగలు తెప్పించి, రాముని ముందుంచాడు. వాటిని చూడగానే రాముని కళ్ళు నీళ్ళతో నిండాయి. మనస్సు నిగ్రహించుకోలేక, 'హా ప్రియా' అని ఏడుస్తూ నేలమీద పడిపోయాడు. ఆ నగలమూట గుండెలమీద వుంచుకుని, గట్టిగా నిట్టూర్పులు వదిలాడు. కన్నీరు ధారపాతంగా కారసాగింది. 'లక్ష్మణా బాగా చూడు. ఈ నగలన్నీ మీ వదినవే కదూ, ఈ పట్టుబట్టకూడా సీతచీరలోనిదే, ఔనా? అంటూ లక్ష్మణుని వైపు చూశాడు.

లక్ష్మణుడు జాలిగా అన్నగారి వంక చూస్తు 'అన్నయ్యా, ఆమె ధరించిన నగలు అన్నీ నేను చూడలేదు. కాని రోజూ ఆమెకి పాదాభివందనం చేసేవాడిని కనక, ఆమె కాలి అందెలు మాత్రం గుర్తుపట్టగలను. ఇవి నిశ్చయంగా సీతమ్మవే' అన్నాడు.

రాముడు దీనంగా సుగ్రీవుని చూస్తు, 'సుగ్రీవా చెప్పు. రాక్షసుడామెను ఏ ప్రదేశానికి ఎత్తుకుపోతుండగా చూశావు? సీత నాకు ప్రాణప్రదమైనది. నా ప్రాణసఖిని అపహరించి, నాకింతటి క్లేశము కలిగించిన ఆ ధూర్తుడెక్కడ వున్నాడు? వాడి మూలంగా నేను మొత్తం రాక్షసవంశాన్నంతా నిర్మూలిస్తాను. ఆ

క్రూరుడెవరో చెప్పు' అంటు ఆవేశంతో ఊగిపోయాడు. రాముని దుఃఖం చూస్తుంటే సుగ్రీవుడిక్కూడా దుఃఖం కలిగింది. రాముడి చేతులు పట్టుకుని ఇలా అన్నాడు.

'రామా, ఆ రాక్షసుడెక్కడ వుంటాడో నాకు తెలియదు. వాడెంత సామర్థ్యం గలవాడో కూడా నేనెరుగను. ఇలాంటి పాడుపనిచేశాడు కనక వాడు తప్పకుండా, హీనకులంలో పట్టివుంటాడు. నేను ప్రతిజ్ఞ చేసి చెప్తున్నాను. నువ్వు మళ్ళీ సీతని పొందేటట్లు నేను చెయ్యగలను. నా మాట నమ్ము.

రామా నేను నా పరివారంతో వెళ్ళి నా పరాక్రమంతో ఆ రావణుని చంపితీర్తాను. ధైర్యంగా వుండు. నీలాంటి వీరులు ఇలా కృంగిపోకూడదు. నేను కూడా భార్యావియోగం వల్ల కలిగే దుఃఖం అనుభవిస్తున్నాను. కాని ఇంతటి శోకం నాకు కలగలేదు. వానరమాత్రుడనైన నేనీ భార్యా వియోగానికి శోకం పొందలేదంటే, నీలాంటి మహాత్ముడు, చెక్కు చెదరక ధైర్యంగా వుండాలి. నువ్వే ఇలా అయిపోతే ఎలా? చేతులు జోడించి ప్రార్థిస్తాను. దయవుంచి శోకానికి అవకాశమివ్వకు. నీ మిత్రునిగా నీ మేలుకోరి చెప్తున్నా. మన మైత్రిని గౌరవించి, నా మాట మన్నించు' అంటు మృదుమధురంగా సుగ్రీవుడు రాముణ్ణి ఓదార్చాడు. పై ఉత్తరీయంతో రాముడి ముఖం తుడిచాడు. రాముడికి కాస్త ఊరట కలిగింది. సుగ్రీవుణ్ణి గట్టిగా కౌగలించుకున్నాడు.

'సుగ్రీవా మంచి మిత్రుడవనిపించుకున్నావు. నీ మాటలతో నా మనసు కుదటబడినది. నీలాంటి మిత్రుడు దొరకడం నా అదృష్టం. నువ్వు సీతాన్వేషణ ప్రయత్నం చెయ్యి. నేను కూడా వాలిని సంహరించి నీ శోకం దూరం చేస్తాను. నా మాటనమ్ము' అని సుగ్రీవుని రాముడు మెచ్చుకున్నాడు.

వారిద్దరూ పరస్పరం ఇలా ప్రమాణాలు చేసుకుంటుంటే, వారి మాటలు విన్న సుగ్రీవుని మంత్రులు నల్గురు ఆనందంతో పొంగిపోయారు.

రాముడు, సుగ్రీవుడు, స్థిమితంగా కూర్చుని వారి కష్టాలు, సుఖాలు, ఎన్నెన్నో చెప్పుకున్నారు.

సుగ్రీవుడు, రాముడితో ఇలా అన్నాడు.

'దేవా, దేవతలు నన్ను అనుగ్రహించారు. దైవానుగ్రహం వల్ల నీ దర్శనభాగ్యం కలిగింది. రామా నీ తోడు వుంటే దేవసామ్రాజ్యాన్నైనా సునాయాసంగా పొందగలను. అలాంటిది నా రాజ్యం నేను పొందడంలో ఆశ్చర్యం ఏముంది? మన స్నేహబంధం సఫలమవుతుందని నమ్మకం నాకుంది' అని సుగ్రీవుడన్న

మాటలకి రాముడు, 'నిజమే యదార్థం చెప్పావు' అన్నాడు. వారంతా బలమైన చెట్టుకొమ్మలమీద కూర్చున్నారు. సుగ్రీవుడు సంతోషంగా తన సంగతంతా రామునికిలా వివరించి చెప్పాడు.

'రామా, నా సోదరుడు నాకు అపకారం చేశాడు. అందుకు భయపడి నేనీ పర్వతం మీద తలదాచుకున్నాను. నా భార్యని దొంగలించి, నాకింతటి దుఃఖం కలిగిన నా సోదరుని పేరు వాలి. నువ్వు సర్వలోకాలకి అభయప్రదాతవి. కనుక నా అన్నచేత వెళ్ళగొట్టబడి, అనాథుడనైన నన్ను అనుగ్రహించవలసినదిగా కోరుతున్నాను' అంటూ వేడుకుంటున్న సుగ్రీవుణ్ణి చూసి మందహాసంతో రాముడిలా అన్నాడు.

'సుగ్రీవా మిత్రుడైనవాడెపుడూ ఉపకారమే చేస్తాడు. అపకారం చేసేవాడు శత్రువు అవుతాడు. వారి వారి ప్రవర్తనలని బట్టి మిత్రులెవరో, శత్రువులెవరో గుర్తుపట్టవచ్చు. నీతో మైత్రి చేసుకున్నాను. కాబట్టి నేను తప్పక నీ అన్న వాలిని వధించి, నీ భార్య నీకు లభించేలా చేస్తాను. నీకు ద్రోహము చేసిన నీ అన్నని తిరుగులేని నా బాణముతో, అంతమొదిస్తాను' అన్న రాముని మాటలు విని సుగ్రీవుడు పొంగిపోయాడు. తన వృత్తాంతమంతా రామునికి చెప్పాలని అనుకున్నాడు.

'రామా నా అదృష్టవశాత్తు మనమధ్య అగ్నిసాక్షి స్నేహం కుదిరింది. నా ప్రాణసఖుడైన నువ్వు ఒట్టుపెట్టి చెప్తున్నావు. శోకసంతప్తుడనైన నేను, నా మనస్సులో ఏమీ దాచుకోకుండా, నా సంగతి అంతా నీతో చెప్తాను' అంటు దుఃఖం పట్టలేక కన్నీరు కారుస్తు కన్నీళ్ళు తుడుచుకుంటూ మాటలు తడబడగా గద్గద స్వరంతో,

'రామా, నా సోదరుడు వాలి నన్ను రాజ్యం నించి తరిమెయ్యటమే కాకుండా, పరుషంగా నిందించి, బలగర్వంతో నన్ను బలంగా తోసేశాడు. నా ప్రాణప్రదమైన రుమని అపహరించాడు. నా మిత్రులందరినీ బందీలుగా చేశాడు. నన్నెలాగైనా అంతమొందించాలని ప్రయత్నించాడు. ఎన్నిసార్లో వానరుల్ని నా మీదికి యుద్ధానికి పంపాడు. నేను వాళ్ళందరినీ అంతం చేశాను. నాకు నరనరాల్లోనూ వాలి అంటే భయం పాకిపోయింది. అందుకే నిన్ను మొదటిసారిగా చూసినప్పుడు వాలే నిన్ను నా మీదికి పంపాడని అనుకున్నాను.

నాకు కష్టం కల్గినప్పటినుంచీ ఈ హనుమ, ఈ నలుగురు మంత్రులు, నాకు అండగా నిలిచారు. నేను దిక్కుతోచక ఎలాగో ప్రాణాలు చిక్కబట్టుకుని బతుకుతున్నాను. ఇదిగో ఈ మిత్రులే నన్ను కాపాడుతున్నారు. ఇదీ నా చరిత్ర.

ఒకప్పుడు వాలి నా సోదరుడు. నన్ను ప్రేమగానే చూసేవాడు. కాని ఇప్పుడు ప్రబల శత్రువు. పౌరుషంలో ఈ భూమిమీద వాలిని మించిన వారులేరు. అతడు అంతమొందితే గాని నా దుఃఖం ఉపశమించదు. ఇపుడింక నువ్వేదిక్కని నమ్మాను' అని సుగ్రీవుడు చెప్పిన మాటలు విని, రాముడిలా అన్నాడు.

'సుగ్రీవా అసలు నీకు, నీఅన్నగారికి మధ్యవైరమెలా వచ్చినదో తెలుసుకోవాలని వుంది. నీ వైరానికి కారణం తెలిస్తే గాని, నీ శత్రువుని తొలగించలేను.

ఈ శత్రుత్వానికి కారణం నీ తప్పేనా? లేక నీ అహంకారమా? తప్పు నీదే అయితే అది స్వల్పమైనదా లేక తీవ్రమైనదా? నీ అపరాధం స్వల్పమైనదైతే, అతడు నిష్కారణంగానిన్ను వేధిస్తే, వెంటనే వానిని చంపి నీకు సుఖం కలిగిస్తాను. ఒకవేళ నీ తప్పు తీవ్రతరమైనదైతే, నీ తరుపున నేను వాలితో మాట్లాడి, నిన్ను క్షమించమని ప్రార్థించి, నువ్వు మళ్ళీ నీ అన్నతో కలిసేలా చేస్తాను. కనుక నీ వైరానికి మూలకారణం తెలిస్తే గాని నా కర్తవ్యం నిర్ధారించుకోలేను. నిన్ను వాలి అవమానించాడని విన్నప్పటినుంచీ, నా మనస్సు కలచివేస్తోంది. నువ్వు జంకు లేకుండా ఉన్నదున్నట్లు చెప్పు. నేను ధనస్సు ఎక్కుపెట్టి బాణం వదిలానా శత్రువు బతకడం కల్ల' అని అంటున్న రాముడిమాటలు విని సుగ్రీవుడు, అతడి అనుచరులు బ్రహ్మానందం పొందారు. అప్పుడు సుగ్రీవుడు ఆ వైనం ఇలా చెప్పాడు.

'రామా, మా అన్నగారైన వాలి గొప్ప బలపరాక్రమాలు గలవాడు. మా తండ్రిగారికీ, నాకూ కూడా అతడంటే చాలా ప్రేమ, గౌరవం. మా తండ్రి గారి తర్వాత న్యాయసమ్మతంగా పెద్దకొడుకైన వాలి ఈ కిష్కింధా రాజ్యానికి రాజయ్యాడు. నేను ఆయనకి దాసుడనై ఎంతో వినయంగా సేవిస్తుండేవాడిని. మా తండ్రిగారైన ఋక్షరజస్సుని సాక్షాత్తు బ్రహ్మదేముడే వానరరాజ్యానికి రాజుగా అభిషేకించాడు. ఈ విధంగా మేము సుఖంగా కిష్కింధలో వుండగా....

మాయావి అనే రాక్షసునితో మా అన్న వాలి ఒక స్త్రీ కారణంగా తగువుపడ్డాడు. వలయుడు అనే రాక్షసునికి ఇద్దరు కుమారులు. వారిలో పెద్దవాడీ మాయావి. రెండో వాడు దుందుభి. ఒక అర్ధరాత్రి మాయావి కిష్కింధానగర ద్వారందగ్గరకి వచ్చి, యుద్ధానికి రమ్మని తొడకొట్టి పిల్చాడు. మా అన్నయ్య మంచి నిద్రలో వుండగా, వాడలా గట్టిగాఅరచి బొబ్బలుపెడుతుంటే, సహించలేక, క్రోధంతో బయటకి వచ్చాడు. ఆయన అంతఃపుర స్త్రీలంతా వాడితో తగవుపడవద్దని వారించారు. అయినా వాలి వినలేదు. బెబ్బులిలా వస్తున్న వాలిని చూసి మాయావి పారిపోసాగాడు. మా అన్నయ్య వాడి వెనకాలే యుద్ధానికి బయల్దేరాడు. అతనికి

సాయంగా నేనూ వెళ్ళాను. మాయావి అలా పరిగెత్తి వెళ్ళి ఒక కొండబిలంలో దూరిపోయాడు. ఆ బిలమంతా గడ్డితో కప్పబడి దుర్గమంగా వుంది. వాలి ఆవేశం పట్టలేక, నాతో,

'సుగ్రీవా నువ్వు ఇక్కడే బిలం బయట నిలబడి వుండు. నేను లోపలికి వెళ్ళి ఆ నీచుని చంపి వస్తాను' అన్నాడు. సాహసం చెయ్యవద్దని నేమ ప్రార్థించాను.

కాని వాలి వినకుండా నన్ను లోపలికి రావద్దని ఒట్టుపెట్టి తను బిలంలోకి వెళ్ళిపోయాడు. ఒక సంవత్సరం గడిచింది. నేనలాగే ఆ బిలం దగ్గర నిలబడి వున్నాను. వాలి రాలేదు. ఒకవేళ లోపలే చనిపోయాడేమో అనుకున్నాను. నా మనస్సు తల్లడిల్లిపోయింది.

మరికొన్నాళ్ళకి ఆ బిలంలోంచి రక్తం పొంగుతూ బయటకి ప్రవహించింది. లోపలనుంచి ఆ రాక్షసుని అరుపులు మాత్రం వినిపించాయి. ఈ లక్షణాలన్నీ చూసి వాలి చనిపోయి వుంటాడని అనుకున్నాను. ఒక పెద్ద కొండశిల తెచ్చి, ఆ రాక్షసుడు బయటకి రాకుండా, బిలానికి అడ్డుగా పెట్టి, శోకంతో విలపిస్తు మా అన్నగారికి తర్పణం వదిలి, కిష్కింధకి తిరిగివెళ్ళాను. మంత్రులందరికీ విషయం చెప్పాను.

వారంతా బలవంతంగా నన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేసి, రాజ్యాన్ని పాలించవలసిందిగా నిర్బంధించారు. నేను ఒప్పుకోలేక తప్పలేదు. న్యాయబద్ధంగా పాలన సాగించాను. కాని అనుకోని విధంగా కొన్నాళ్ళకి ఆ మాయావిని చంపిన వాలి కిష్కింధకి తిరిగి వచ్చాడు. నేను రాజునై వుండటం చూసి మండిపడ్డాడు. మంత్రుల్ని బంధించి, నన్ను పరుషంగా తూలనాడి, నామీద క్రోధం వెళ్ళగ్రక్కాడు.

అపుడు నేనున్న స్థితిలో నేను తల్చుకుంటే చాలా తేలికగా వాలిని బంధించగలను. కాని పెద్దవాడనే గౌరవంతో, ఆ పనిచెయ్యలేకపోయాను. గౌరవంతో ఆయన పాదాలకి నమస్కరించాను. అయినా వాలి నన్ను క్షమించలేదు. క్రోధావేశాలతో మండిపడ్డాడు. నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, దీనంగా ప్రార్థించి, జరిగినదంతా చెప్పాలని ప్రయత్నించాను.

'అన్నా మా అదృష్టం వల్ల నువ్వు ఆ రాక్షసుని చంపి సురక్షితంగా తిరిగి వచ్చావు. నీ రాజ్యాన్ని నీకు తిరిగి ఇచ్చేస్తాను. స్వీకరించు. నువ్వు బిలంలోకి వెళ్ళాక నేను ఒక సంవత్సరంపాటు అక్కడే నీ కోసం ఎదురుచూశాను. ఆ తర్వాత ఒకనాడు ఆ బిలంలోంచి రక్తం ప్రవహించి బయటకి వచ్చింది. భయంతో నా

మనస్సు చెదిరి, ఒక పర్వతం పెకిలించి తెచ్చి బిలద్వారానికి అడ్డంగా పెట్టి కిష్కింధకి తిరిగివచ్చాను. విషాదంతో మతి చెడి వున్న నన్ను మంత్రులంతా బలవంతంగా రాజ్యాభిషిక్తుణ్ణి చేశారు. నేనెంత వద్దన్నా వారు వినలేదు. నన్ను క్షమించు. నువ్వు లేకపోవడం వల్ల రాజ్యం అరాచకమవుతుందని మాత్రమే నేనీ రాజ్యాభిషేకానికి అంగీకరించాను. ఇది నీ రాజ్యం. పదిలంగా కాపాడి నీకిస్తున్నాను. కోపం తెచ్చుకోకు. శిరస్సువంచి నమస్కరిస్తున్నాను' అని కాళ్ళా వేళ్ళా పడ్డాను. అయినా వాలి వినిపించుకోకకుండా ఎంతో అశ్లీల పదములతో, పరుషంగా నన్ను నిందించాడు. బిలంలో జరిగిన సంగతి ఇలా వివరించి చెప్పాడు.

'ఆ రాత్రి మాయావి తొడకొట్టగా వాడివెంట నేను వెళ్ళటం మీకు తెలుసుగా, నాతోపాటు క్రూరపుటాలోచనలతో ఈ సుగ్రీవుడు నా వెంట వచ్చాడు. మమ్మల్ని చూసి, ఆ రాక్షసుడు బెదిరి పారిపోయాడు. అలా పరిగెత్తి వెళ్ళి ఒక బిలంలో దూరాడు. అప్పుడు నేను నా తమ్ముడనే ప్రేమతో 'సుగ్రీవా, శత్రువుని చంపనిదే తిరిగిరాను. నగరంలో ప్రవేశించను. నేను వచ్చేవరకు ఇక్కడే వేచివుండు. అనిచెప్పి బిలంలోకి వెళ్ళాను అయితే ఆ బిలం అంతా చీకటిమయంగా వుండి లోపల ఆ రాక్షసుడెక్కడా కనిపించలేదు.

అలా వెతికి వెతికి, చివరికి, వాణ్ణి పట్టుకుని, వాణ్ణి, వాడి బంధువులను చంపి పారేశాను. వారి నోట్లోంచి వచ్చిన రక్తంతో ఆ బిలమంతా నిండిపోయింది. నాకు కాలు కదపటానికి వీల్లేకుండా అయిపోయింది. అలాగే తడుముకుంటూ ఎలాగో కష్టపడి వస్తే బిలం ద్వారం దగ్గర మూసి వుండడం వల్ల దారి కనపడలేదు. సుగ్రీవా - సుగ్రీవా, అని గట్టిగా పిలిచాను. సమాధానం లేదు. నాకు చాలా దుఃఖం వచ్చింది. పాదాలతో గుహద్వారాని కడ్డంగా వున్న శిలని తన్ని బ్రద్దలు చేసి బయటకి వచ్చాను.

ఇదిగో - ఈ దుర్మార్గుడు, సోదరుడినన్న ప్రేమకూడా మరచి, నాకింతటి ద్రోహం చేశాడు. వీడీ రాజ్యంలో వుండతగడు' అంటు కట్టుబట్టలతో నన్ను బయటకి తరిమేశాడు. నా మీద పగబట్టి నా భార్యని అపహరించి, నన్ను రాజ్యం నించి బహిష్కరించాడు. ఆ భయంతో నేను ఈ భూమండలమంతా తిరిగి తిరిగి చివరికి, ఋష్యమూకానికి చేరాను.

ఒకానొక కారణంవల్ల, వాలి ఈ ఋష్యమూక పర్వతం మీద కాలుమోపలేడు. ఆ కారణం తర్వాత వివరిస్తాను. వాలితో నాకు వైరం కలగటానికి కారణం వివరించాను. నా మనస్సులో ఏ దోషం లేదు. నాలో ఏ తప్పులేదు. అయినప్పటికీ

నాకింతటి ఆపద సంప్రాప్తించింది. రామా - నువ్వే ఈ ఆపదనించి నన్ను గట్టెక్కించాలి. వాలి అంటే నాకు చెప్పలేనంత భయం. అందరికీ అభయప్రదాతవైన నువ్వే నాకు శరణు. వాలి బారి నించి నువ్వే నన్ను రక్షించాలి. అని ప్రాధేయపడ్డాడు.

ధర్మమూర్తియైన రాముడు చిరునవ్వుతో 'సుగ్రీవా భయపడకు. వాలి తప్పుదారిలో ప్రవర్తించాడు. నిర్దోషివైన నిన్ను శిక్షించాడు. ఆ వాలి కంటబడ్డాడా, ఇంక బ్రతకడు. భార్యా వియోగం వల్ల కలిగే క్లేశము నాకు తెలుసు. నీ క్లేశము తీర్చే బాధ్యత నాది. భయపడకు' అని రాముడు సుగ్రీవుని ఓదార్చాడు.

కాని సుగ్రీవుడు అంతగా సంతృప్తిపడక, 'రామా నీ మాటలలో నమ్మకం లేక కాదు. ప్రళయకాలంలోసూర్యునిలా, నీకు కోపం వస్తే ఈ లోకాలన్నీ దహింపచెయ్యగలవని నాకు తెలుసు. కాని వాలియొక్క పౌరుషము, ధైర్యము, శౌర్యము ఎరిగిన నేను, అంతటి పరాక్రమశాలిని ఇంత తేలిగ్గా జయించగలవా అని కాస్త సందేహిస్తున్నాను. వాలి పరాక్రమం గురించి చెప్తావిను. వాలి ఉదయం, సాయంత్రం, నాలుగు సముద్రాలు చేరి, సంధ్యావందనం చేస్తాడు. ప్రతిరోజూ, పశ్చిమ సముద్రం నించి, తూర్పు సముద్రానికి, అక్కడ్నించి దక్షిణ సముద్రానికీ, దక్షిణ సముద్రం నించి, ఉత్తరసముద్రానికీ సూర్యోదయానికి ముందే వెళ్ళి రాగలడు. పర్వత శిఖరాలనధిరోహించి, పెద్దపెద్ద శిఖరాలని పెల్లగించి, చేత్తోపట్టుకుని, బంతులాడినట్లు పైకి ఎగరేసి ఆడుకుంటాడు.

దుందుభి అనే రాక్షసుడు దున్నపోతు ఆకారంలో వుండేవాడు. మహాబలశాలి. వెయ్యి ఏనుగులు బలం కలవాడు. ఒకసారి సముద్రుడి దగ్గరకువెళ్ళి తనతో యుద్ధం చెయ్యమని అడిగాడు. సముద్రుడు, వాడి పొగరణచాలని, 'అయ్యా నీ అంతటిశక్తిమంతునితో యుద్ధం చేసే అర్హత నాకు లేదు. ఉత్తరదేశాన, శంకరుని మామగారైన హిమవంతుడనే పర్వతరాజున్నాడు. ఆయన మాత్రమే నీతో యుద్ధం చెయ్యగల సమర్థుడు' అని చెప్పాడు. వెంటనేవాడు మహా వేగంతో పర్వతరాజు దగ్గరకి వెళ్ళాడు. అక్కడకువెళ్ళి పెద్ద పెద్ద కొండశిఖరాలు దొర్లించసాగాడు. హిమవంతుడా ఆగడం చూసి దుందుభి ముందు నిల్చి 'దుందుభీ ధర్మవత్సలుడివైన నువ్వు, ఇలా చెయ్యడం తగునా? నా శిఖరాలపై ఎంతోమంది తాపసులు నివసిస్తున్నారు. కనుక నీతో నేను యుద్ధం చెయ్యడం ధర్మం కాదు' అన్నాడు.

దుందుభికి కోపం వచ్చింది. 'నాతో యుద్ధం చెయ్యడానికి జంకి ఇలా అంటున్నావు. నీకంటే బలవంతుడెవరైనా వుంటే చెప్పు. వానితో యుద్ధం చేస్తాను'

అన్నాడు హిమవంతుడు వాడి పోరుచూసి అసహ్యపడి, 'దుందుభీ దేవేంద్రునితో సమానమైన పరాక్రమవంతుడు, వాలి అనే వానరరాజు కిష్కింధని పాలిస్తున్నాడు. నీతో ద్వంద్వ యుద్ధం చెయ్యగల సమర్థుడతడే. అతడిదగ్గరకెళ్ళి నీ కోరిక తీర్చుకో' అన్నాడు.

దుందుభి శరవేగంతో కిష్కింధకి వెళ్ళి, నగరద్వారం దగ్గర నిలబడి, దిక్కులు పిక్కటిల్లేటట్లు గర్జిస్తూ, పెద్దవృక్షాలు విరిచి పడేసి, గిట్టలతో నేలగీరుతూ, ఆ పురద్వారాన్ని కొమ్ములతో కొట్టసాగాడు.

వాలి, నగరం బయటకు వచ్చాడు. వాణ్ణి మందలిస్తూ, 'దుందుభీ నిన్ను నేనెరుగుదును. మా నగరద్వారం దగ్గర ఇలా ఆర్భాటం చేస్తున్నావెందుకు? ఫో - పోయి ప్రాణాలు కాపాడుకో' అన్నాడు.

వాలి మాటలు విన్న దుందుభి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడ్డాయి. రోషంతో ఇలా అన్నాడు. 'ఓ వానరవీరా ఆడవారి దగ్గర నిలబడి ప్రగల్భాలు పలుకవద్దు. నాతో యుద్ధానికి రా. నీ బలమెంతోచూస్తాను' అన్నాడు.

వాలికి ఒళ్ళు మండింది. తన కూడా వచ్చిన అంతఃపుర స్త్రీలను దూరంగా వెళ్ళమన్నాడు. తండ్రిగారిచ్చిన మహేంద్రమాల భుజాలమీద సరిగ్గా సర్దుకుని, యుద్ధానికి బయల్దేరాడు. ఆ సువర్ణమాల వాలికి ఇంద్రుడు స్వయంగా ఇచ్చాడు. ఆ మాల ధరించి యుద్ధం చేస్తే శత్రుబలం కూడా అతడికే వచ్చేలా దీవించి ఇచ్చాడు. దాన్ని ధరించి యుద్ధానికి వెళ్తే విజయం తప్పదు. వాలి మహిషాకారంలో వున్న ఆ దుందుభిని, కొమ్ములు పట్టుకుని గిరగిరా తిప్పి పెద్దగా గర్జించాడు. ఆ దెబ్బకి దుందుభి నోటినుండి రక్తం కారింది. ఇద్దరికీ ఘోరమైన పోరు జరిగింది. వాలి ఆ రాక్షసుణ్ణి గుద్ది నుగ్గు నుగ్గు చేశాడు. దుందుభి రక్తం ముద్దలా అయిప్రాణం విడిచాడు.

వాలి వాడి శరీరాన్ని ఒక యోజనం దూరం పడేలా విసిరేశాడు. అలా విసిరినప్పుడు ఆ రాక్షసుని నోటినించి కారిన రక్తపు చుక్కలు మతంగ మహర్షి ఆశ్రమంలో పడ్డాయి. ఆ మహర్షి మండిపడి, వీడెవడో దురాత్ముడు, దుర్బుద్ధి, అహంకారి, మూర్ఖుడు, నామీద రక్తపు బిందువులు పడేలా చేశాడు' అంటూ బయటకు వచ్చి, పర్వతంలా చనిపోయి పడివున్న ఆ మహిషాన్ని చూశాడు. తపోబలంతో ఈ పనిచేసినది వాలి అని తెలుసుకున్నాడు. 'వాడు నా ఆశ్రమాన్ని రక్తపుబిందువులతో అపవిత్రం చేశాడు కనక, వాడెప్పటికీ ఇక్కడ ప్రవేశించ కూడదు. ప్రవేశించిన వెంటనే ప్రాణాలు కోల్పోతాడు. ఈ ఆశ్రమంలో ఎక్కడైనా

సరే ఒక యోజనం విస్తీర్ణం దూరంవరకు తెలిసి ప్రవేశించినా, తెలియక ప్రవేశించినా, వాడు ప్రాణాలతో వుండడు. వాడికి సంబంధించిన వాని పరివారంలో వాళ్ళెవ్వరైనా సరే ఈ ప్రాంతంలో అడుగుపెడితే బండరాళ్ళలా మారిపోతారు' అని ఆ మహర్షి శాపం ఇవ్వడం వానరులు విన్నారు. వెంటనే వాళ్ళంతా వెళ్ళి వాలితో ఈ సంగతంతా వివరించి చెప్పారు. వాలి ఆ వార్తవినగానే భయంతో పరుగుపరుగున వచ్చి ఆ మహర్షి కాళ్ళమీదపడి క్షమించమని వేడుకున్నాడు. కాని మహర్షి అతడి మాటలు వినిపించుకోలేదు. అప్పటినుంచీ వాలి భయంతో ఈ ఋష్యమూక పర్వతం ఛాయలకి కూడా రావడం లేదు. వాలి రాడు కదా అని నేను, నా మిత్రులు నల్గురం కలిసి ఇక్కడ నిర్భయంగా తిరుగుతున్నాము.

రామా అదిగో చూడు, మహాపర్వతంలా పడివున్న ఎముకులగూడులాంటి అస్థిపంజరం. అది దుందుభిది. ఆరోజు వాలిచే చంపబడిన దుందుభి అస్థిపంజరం. ఇటు చూడు. ఇక్కడ వరసగా వున్న ఏడు వృక్షాలు. వాటినించి కొమ్మలు కిందకి వ్రేలాడుతున్నాయి. వాటి మొదళ్ళెక్కడ వున్నాయో గ్రహించటం కష్టం. వాలి బాణాన్ని విల్లులో సంధించకుండానే, ఆ చెట్లు మొదట్లో సంధించగలడు. వాలి చేతితో బాణం విసిరితే చాలు. ఆ చెట్లు తునకలై కిందపడతాయి. అంతటి మహాబలశాలి వాలి. నేటిదాకా అతడితో సమానమైన బలవంతుణ్ణి నేను చూడలేదు. వాలి గురించి మీకు పూర్తిగా తెలియజెయ్యాలని మాత్రమే, ఈ సంగతులన్నీ మీకు చెప్పాను. మరోలా భావించవద్దు' అంటు సందిగ్ధంగా ఆగాడు సుగ్రీవుడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి చూసి నవ్వుతూ, 'సుగ్రీవా, ఇంతకీ ఏమంటావు? మా అన్నయ్య ఏం చేస్తే వాలి చంపగలడని, నీకు నమ్మకం కుదురుతుందో చెప్పు'అని అడిగాడు.

సుగ్రీవుడు కొంతసిగ్గుపడి 'లక్ష్మణా వాలి, ఆ కనపడుతున్న ఏడు చెట్లని, కొమ్మలతో నిండుగా వున్న ఆ వృక్షాల్ని, ఒక్కోసారి, ఒక చెట్టుకి కన్నంపడేలా కొట్టేవాడు. కనక రాముడు తన బాణంతో వాటిలో ఒక్క చెట్టుని కొట్టినా చాలు. నాకు నమ్మకం కుదురుతుంది. లేదా ఎదురుగా పడివున్న ఆ దుందుభి అస్థిపంజరాన్ని, ఒక్క కాలితో తన్ని రెండువందల ధనుస్సులదూరంలో పడేటట్లు తన్నగలిగితే, వాలిని చంపగల సామర్థ్యం వుందని, తెలుసుకుంటాను' అన్నాడు వినయంగా. సుగ్రీవుని మాటలు వినగానే రాముని కన్నులలో ఎఱ్ఱని జీరలు వచ్చాయి.

ఒక్కరెప్పపాటు సుగ్రీవుడు రాముని గౌరవంగా చూసి, 'రామా, వాలి మహాశూరుడు. ఎందరెందరో వీరుల్ని చంపాడు. ఏనాడూ ఎవ్వరివల్లా ఓటమి ఎరుగడు. అతడి చేష్టలు, దేవతలకు కూడా అసాధ్యమనిపించేలా వుండేవి. అందుకే నేనింతగా భయపడ్తున్నాను. ఆ భయంతోనే, అతడు అడుగైనా పెట్టలేని ఈ ఋష్యమూక పర్వతం మీద నివశిస్తున్నాను. ఈ సంకట పరిస్థితిలో నీలాంటి ఉత్తముడైన మహనీయుడు నాకు మిత్రునిగా లభించాడు. కాని, దుర్మార్గుడైన ఆ వాలిపరాక్రమం తెలిసినవాడిని కనుక, నీ పరాక్రమం గురించి అంతగా తెలియనవాడిని కనుక, ఇంతగా చెప్తున్నాను. అంతేగాని నిన్ను కించపరచాలని మాత్రం కాదు. ఆ వాలి మూలంగా నీకెక్కడ ఆపద సంభవిస్తుందో! అని నా భయం. నీ పరాక్రమం ఒకసారి కళ్ళారా చూడాలని నా కోరిక.' అన్నాడు. రాముడా మాటలు విని మందహాసం చేస్తూ,

'వానరోత్తమా, నీ ఆలోచనల్లో చపలత్వం వుండడం సహజమే. మా పరాక్రమం మీద, సామర్థ్యం మీదా, నీకు నమ్మకం లేకపోతే, నువ్వు చెప్పినట్లే చేసి, నీకు నమ్మకం కలిగిస్తాను.' అని మృదువుగా చెప్పి విలాసంగా తన కాలిబొటనవ్రేలితో దుందుభి అస్థిపంజరాన్ని కదిల్చి పైకి తన్నాడు. అది పదియోజనాల దూరంలో పడింది. అదిచూసి సుగ్రీవుడు అసంతృప్తిగా, 'మిత్రమా ఆనాడు వాలి, మాంసరక్తాలతో పచ్చిగా వున్న బరువైన శరీరాన్ని తన్నాడు. కాని ఇప్పుడది ఎండిపోయి తేలికైన అస్థిపంజరం. కనుక ఇంకో నిదర్శనం చూపు. నీవింటిని ఎక్కుపెట్టి బాణం సంధించి, ఆసాలవృక్షాన్ని ఛేదించు. నువ్వు ఛేదించగలవని నమ్మకం నాకుంది. నాకు ధైర్యం కలిగించటానికి ఒకసారి బాణం ప్రయోగించు' అన్నాడు.

రాముడు మారు పలుకకుండా, వింటిలో బాణాన్ని సంధించాడు. సాల వృక్షాలకి ఎక్కుపెట్టి బాణం వదిలాడు. ఆ బాణం ఏడు సాలవృక్షాల్ని దూసుకుపోయింది. వాటిగుండా బయటకి వెళ్ళి ఒక కొండచరియలోకి దూరి, తృటిలో నేలని బ్రద్దలు చేసి, రయ్యిమంటూ వెనక్కివచ్చి, రాముని అమ్ముల పొదిలో దూరింది. ఆ దృశ్యం చూసిన సుగ్రీవుడు ఆనందంతో తలవంచి రామునిపాదాలమీద వుంచాడు. ఆనందంతో పులకరించిపోతూ,

'రామా, ధన్యుణ్ణి అయ్యాను. నీ పరాక్రమం కళ్ళారా చూశాను. నీకు వాలిని చంపడం ఎంతపని? మహాసాలములు ఏడింటినీ, ఆ పెద్దకొండనీ, నీ బాణం ఛేదించుకుపోయింది. నీకు ఎవ్వరూ ఎదుటబడి యుద్ధం చెయ్యలేరు. ఇప్పుడు

నా అనుమానం, శోకం, రెండూ తీరిపోయాయి. నీ అంతటి మిత్రుడు దొరకడం నా భాగ్యం. రామా, నీకు వందనము. నా శత్రువైన వాలిని శీఘ్రంగా సంహరించు' అన్నాడు.

రాముడు పరమానందభరితుడై, సుగ్రీవుణ్ణి గాఢంగా కౌగలించుకున్నాడు. ఆ తర్వాత రామలక్ష్మణులు, సుగ్రీవుని వెంట కిష్కింధకి ప్రయాణమయ్యారు. సుగ్రీవుని అనుచరులు పైకి కనిపించకుండా చెట్ల చాటున నక్కి నడిచారు. రాముడు సుగ్రీవునితో 'సుగ్రీవా నువ్వు ముందుగా వెళ్ళి వాలిని యుద్ధానికి ఆహ్వానించు' అన్నాడు.

సుగ్రీవుడు సరే అని వాలి నివసించే గృహద్వారం దగ్గరకు వెళ్ళి, భయంకరంగా గర్జించి, నడుం బిగించి, ధైర్యం తెచ్చుకుని, గట్టిగా కేకవేశాడు.

ఆ ధ్వనికి ఆకాశం బ్రద్దలవుతుందేమో అనిపించింది. భీకరమైన ఆ గర్జన విని వాలికి కోపం వచ్చింది. గుహలో నిద్రిస్తున్నవాడు లేచి, బయటకి వచ్చాడు. వాలి సుగ్రీవులిద్దరికీ ఘోరమైన యుద్ధం జరిగింది. పిడుగుల్లాంటి పిడిగుద్దులతో, ఒకళ్ళనొకళ్ళు కొట్టుకున్నారు. రాముడు బాణమును గురిపట్టి విల్లులో సంధించి పట్టుకున్నాడు. కాని వాలి సుగ్రీవులిద్దరూ ఆకారంలో ఒకేవిధంగా వుండడం వల్ల వారిలో ఎవరు ఎవరో గుర్తించలేకపోయాడు. పొరపాటున సుగ్రీవుణ్ణి సంహరిస్తానేమోననే భయంతో బాణం విడవకుండా పట్టుకున్నాడు. సుగ్రీవుడు వాలి నెదిరించి, యుద్ధం చెయ్యలేకపోతున్నాడు. ఎంతసేపు తెగించి పోరాడినా, రాముడు రక్షించడానికి రావడం లేదు.

సుగ్రీవుడింక వాలిదెబ్బలకి తట్టుకోలేక మళ్ళీ ఋష్యమూకం వైపు పరిగెత్తి పారిపోయాడు. ఒళ్ళంతా రక్తం కారుతోంది. అవయవాలన్నీ శిథిలమయ్యాయి. వాలి తరుముకొస్తుండగా, చేసేది లేక ఋష్యమూక పర్వతంపైకి పరిగెత్తాడు. మతంగమహర్షి శాపం వల్ల వాలి అక్కడికి వెళ్ళలేక వెనుదిరిగి వెళ్ళిపోయాడు. 'పిరికిపందా శాపభయం వల్ల అక్కడికి రాలేకపోయాను కనుక బతికిపోయావు' అని హుంకరించి మళ్ళీ వెళ్ళాడు.

అంతలో లక్ష్మణుడు, హనుమంతుడు, రాముడు మిగిలిన వానరవీరులు, సుగ్రీవుని దగ్గరకి వెళ్ళారు. సుగ్రీవుడు సిగ్గుపడుతూ, దీనంగా నేలచూపులు చూస్తూ, 'రామా, ఏంపని చేశావయ్యా! వాలిని పోరుకి పిలవమని, సంహరిస్తాననీ, నాకు నమ్మకం కలిగించావు. నీ మాటలు నమ్మి నేను వెళ్ళాను. వాలి నన్ను చావగొట్టాడు. నువ్వు మాత్రం చూస్తూ ఊరుకున్నావు. నీకిది తగునా? ముందే నీకు వాలిని

చంపడం ఇష్టం లేదని తెలిస్తే నేను వెళ్ళనుకదా' అని పరుషంగా నిష్ఠూరోక్తులు పలుకుతున్న సుగ్రీవుణ్ణి ఓదారుస్తూ, రాముడు,

'నాయనా, సుగ్రీవా కోపం తెచ్చుకోకు. నేనెందుకు బాణం సంధించలేదో కారణం చెప్తాను విను. చూడ్డానికి నువ్వు వాలి ఒక్కలాగే వున్నారు. అలంకారంలో గాని, కంఠస్వరంలోగాని, పరాక్రమంలోగాని, వేషంలోగాని, ఎత్తులోగాని, నడకలోగాని, ఏమాత్రం బేధం లేదు. అంతటి సాదృశ్యం మీలో వుండడం వల్ల ఎవరెవరో గుర్తించలేకపోయాను. తొందరపడి బాణం వేస్తే, పొరపాటున నువ్వు బలైపోతే నా తెలివితక్కువతనం లోకానికంతా తెలుస్తుంది. అందరూ నన్ను చూసి నవ్వుతారు. అభయమిచ్చిన నిన్ను చంపుకున్నందుకు నాకూ పాపం వస్తుంది. నాకు, లక్ష్మణుడికి, సీతకి ఇపుడు నువ్వే ప్రాణాధారమైనవాడివి. అధైర్యపడకు. సుగ్రీవా మళ్ళీ వాలితో యుద్ధానికి వెళ్ళు. నిన్ను గుర్తించటానికి వీలుగా ఏదో ఒక గుర్తు ధరించి వెళ్ళు' అని సుగ్రీవునికి నచ్చజెప్పి, లక్ష్మణుని పిల్చి 'లక్ష్మణా అదిగో ఆ గజపుష్పలతని తెచ్చి, సుగ్రీవుని మెడలో హారంగా వెయ్యి' అని చెప్పాడు.

లక్ష్మణుడు వెంటనే వెళ్ళి కొండవారగా వున్న గజపుష్పలతని తెచ్చి సుగ్రీవుని మెడలో దండగా వేశాడు. సుగ్రీవుడికి కాస్త ధైర్యం కలిగింది. రామునితో కలిసి మళ్ళీ కిష్కింధవైపు బయల్దేరాడు. వారితో హనుమంతుడు, నీలుడు, తారుడు కూడా నడిచారు. దారిపొడుగునా ప్రకృతిశోభలు చూస్తూ వెళ్తుండగా ఒకచోట అక్కడక్కడ గుబురులుగా దట్టంగా పెద్ద పెద్ద వృక్షాలు, అరణ్యంలా అలుముకుని వుండడం వారికి కనిపించింది. ఆదృశ్యం చూసి రాముడికి చాలా ఆశ్చర్యం కలిగింది. సుగ్రీవుణ్ణి ఆపి, ఇలా అడిగాడు.

'సుగ్రీవా ఇక్కడ గుంపులు గుంపులుగా ఇలా మహావృక్షాలు పెరిగి వున్నాయేమిటి? చూడగా ఇందులో ఏదో విశేషమున్నట్లుందే, నీకు తెలిస్తే చెప్పు' అని రాముడడగగా అందుకు సుగ్రీవుడు, 'రామా, పూర్వం ఇది ఒక ఆశ్రమం. ఇక్కడ చక్కని ఉద్యానవనాలున్నాయి. ఈ ఆశ్రమంచుట్టూ తియ్యని ఫలవృక్షాలు, కందమూలములు, నిర్మలమలైన జలాలు సమృద్ధిగా లభిస్తాయి. సప్తజనులు అనే ఏడుగురు మునులు తలక్రిందులుగా నియమబద్ధంగా వ్రతము పూని కేవలం నీటిని మాత్రమే ఆహారంగా సేవిస్తూ, ఇక్కడ తపస్సు చేస్తుండేవారు. ఏడురోజులకోసారి గాలిని మాత్రం ఆహారంగా తీసుకునేవారు.

అలావారు ఏడువందలరోజులు, ఏడువందల సంవత్సరాలు, తపస్సుచేసి శరీరంతో సహా వారు స్వర్గానికి వెళ్ళారు. వారంతటి ప్రభావం కలవారు కనుకనే,

ఆ ఆశ్రమం చుట్టూ ప్రాకారంలా ఈ వృక్షాలు పెరిగాయి. ఈ వనము దేవతలుగాని, రాక్షసులుగాని, చివరికి ఇంద్రుడైనా సరే చెడగొట్టలేరు. ఈ ఆశ్రమంలో ఈ ప్రాకారంలోంచి పక్షులు కూడా ప్రవేశించలేవు. ఎవరికైనా అజ్ఞానంతో ప్రవేశిస్తే వారింక తిరిగిరారు. ఈ ఆశ్రమంలోంచి, మధురాతి మధురమైన గానములు, వినిపిస్తుంటాయి. ముప్పొద్దులా అగ్నిహోత్రం ప్రజ్వలిస్తూంటుంది. రామా ఆ మునులను ధ్యానించి నమస్కారం చెయ్యి. అలాచేస్తే శుభం కల్గుతుందంటారు' అని చెప్పాడు.

అపుడు అక్కడున్నవారంతా ఆ మునుల్ని స్మరించి నమస్కారం చేశారు. తర్వాత తృప్తిగా ముందుకుసాగారు. కిష్కింధకి చేరాక, రాముడు లక్ష్మణుడు, వానరులు చెట్లవెనక కనిపించకుండా దాక్కున్నారు.

సుగ్రీవుడు అన్నివైపులా దృష్టిసారించి చూస్తూ మేఘంలా గర్జిస్తూ, వాలిని యుద్ధానికి రమ్మని ఆహ్వానించాడు. వాలి రాజమందిరానికి బంగారుతోరణాలు వ్రేలాడుతున్నాయి. యంత్రాలు, ధ్వజాలు అన్నిచోట్లా అమర్చబడి చాలా పటిష్టంగా వుంది. ఆ పట్టణానికి చేరి నిలబడ్డ సుగ్రీవుడు, 'రామా, వాలిని చంపుతానని ప్రతిజ్ఞచేశావు గుర్తుందా? నీ వాగ్దానం నెరవేర్చే సమయం ఆసన్నమయ్యింది. నెరవేర్చు తొందరగా' అన్నాడు. రాముడా మాటలు విని 'సుగ్రీవా ధైర్యంగా వుండు. లక్ష్మణుడు నీ మెడలో గజపుష్పమాల వేశాడు కదా. నేనిప్పుడు నిశ్చింతంగా బాణం వేసి వాలిని చంపుతాను. నువ్వు గట్టిగా అరచి వాలిని యుద్ధానికి పిలు' అని ధైర్యం చెప్పాడు.

రాముడు అభయం ఇచ్చాక, వాలిని రెచ్చగొట్టేలా, భూమ్యాకాశాలు దద్దరిల్లేలా రంకెవేశాడు సుగ్రీవుడు. ఆ కేకలకి ఆవులు బెదిరి పరుగులు తీశాయి. అడవిలో జంతువులన్నీ బెదిరి పరుగులు తీశాయి. పక్షులు నేలబడ్డాయి.

అంతఃపురంలో స్త్రీలమధ్య విలాసంగా వున్న వాలి ఆ కేక విన్నాడు. వినగానే అతడికి ఒళ్ళుమండిపోయింది. వెఱ్ఱి ఆవేశంతో బయటకి వచ్చాడు. భూమి కంపించేలా అడుగులువేస్తూ నడిచాడు. నడుస్తున్న భర్తని సూక్ష్మబుద్ధి గల తార అడ్డుకుని, గట్టిగా కౌగలించుకుని, 'వీరాగ్రేసరా... కాస్త ఆవేశం తగ్గించి, తొందరపడక నిదానంగా ఆలోచించు. ఇంతరాత్రి నువ్వు వెళ్ళనవసరం లేదు. తెల్లారాక యుద్ధం చెయ్యవచ్చు. కాస్త కోపం నిగ్రహించి నా మాటలు శ్రద్ధగా విను. నిన్నెదిరించి నిలవగల వీరుడు భూమిమీదలేడు. అందుకని ఇంతవేగంగా వెళ్ళక్కరలేదు.

ఇంతకుముందే సుగ్రీవుడు నీ చేతిలో ఓడిపోయాడు. ఇప్పుడు మళ్ళీవచ్చి యుద్ధానికి పిలుస్తున్నాడు. ఇతడికింతటి ధైర్యం కలగడానికి వెనుక పెద్దకారణమేదో వుండి వుంటుంది. ఇది అంతతేలికగా కొట్టిపారేసే విషయం కాదు. ఆలోచించి చూస్తే ఆ సుగ్రీవుడికి పెద్ద అండదొరికిందని అనిపిస్తోంది. సుగ్రీవుడు సహజంగానే చాలా తెలివైనవాడు. బుద్ధిమంతుడు. తనకి సహాయం చెయ్యగల బలవంతుడు, సమర్థుడు, తోడువుంటేగాని మళ్ళీరాడు.

ఇంతకిముందే మన కుమారుడైన అంగదుడు నాకోవిషయం చెప్పాడు. మనచారులవలన వానికీ సంగతి తెలిసిందట.

అయోధ్యని ఏలిన దశరథ మహారాజు కుమారులిద్దరు, మహాపరాక్రమ వంతులు, ఈ వనంలో సంచరిస్తున్నారట. వారి పేర్లు రామలక్ష్మణులట. వారిలో అజేయుడు, అత్యంతసాహసి అయిన రాముడు నీ తమ్ముడికి అండగా వున్నాడట. రాముడు గొప్ప ధర్మాత్ముడనీ, ఆర్తినొందినవారికాశ్రయమైనవాడనీ, గొప్ప పరాక్రమవంతుడనీ చారులద్వారా అంగదుడు తెలిసికొన్నాడట.

'ఆర్యపుత్రా, నా మాటవిను. ఆ సుగ్రీవుని పిల్చి ఈ రాజ్యం పట్టంకట్టి, ఆ రాముని శరణంటే ఇప్పుడు యుద్ధం చేసే అవసరముండదు. నువ్వు బలవంతుడివే అయినా, ఆ రాముని ఆశ్రయించివున్న సుగ్రీవునితో వైరం మంచిదికాదు.

సుగ్రీవుడు నీకంటే చిన్నవాడు. బుజ్జగించి, లాలించి, చేరదియ్యాలి. సోదరునికన్నా ముఖ్యమైన బంధువుండడు. నీకు నామీద ప్రేమవుంటే నా ప్రార్థన మన్నించు' అంటూ అనేకవిధాల బోధించింది.

కాని, వాలి తారమాటలు తోసిపుచ్చుతూ 'నా తమ్ముడు నాకన్నా బలహీనుడు. నాకు విధేయుడిగా వుండవలసినవాడు. నాకు శత్రువై యుద్ధానికి రమ్మంటే నేనెలా సహించగలను? పిరికిదానా, యుద్ధంలో వెనుదిరగటం ఎరుగని పౌరుషవంతులకి, శత్రువుల తిరస్కారం ఓర్చుకోవడం మరణం కంటే కూడా బాధ కలిగిస్తుంది. వాడు యుద్ధం చెయ్యాలని కోరివచ్చాడు. చేతులు ముడుచుక్కూర్చోవడం నావల్లగాదు. రాముడు నాకు అపకారం చేస్తాడని, నువ్వు బాధపడకు. ఆయన ధర్మజ్ఞుడనీ, కృతజ్ఞుడనీ లోకాలన్నీ ప్రశంసిస్తున్నాయి.

కనుక అతడు పాపము చెయ్యడు. నువ్వు దిగులు మాని ఈ అంతఃపుర స్త్రీలతో లోపలికి వెళ్ళు. నామీద వుండే అనురాగంతో నీ భయం వెల్లడించావు. చాలా సంతోషం. నాకు కూడా నీ మాటలమీద భక్తి విశ్వాసాలున్నాయి. అయినా

సరే నేనిప్పుడు సుగ్రీవుడితో యుద్ధం చేసి తీరాలి. కాని వాని ప్రాణాలు తియ్యనులే. వాడి మదమణచివస్తాను. నువ్వు గాబరపడకు. నువ్వు లోపలకి వెళ్ళకపోతే నామీద ఒట్టే. నేను తొందరగా వాణ్ణి జయించివస్తాను'.

అని వాలి చెప్తుంటే, తార ఆతనిని గట్టిగా కౌగలించుకుని ఏడుస్తు వదలలేక వదలలేక భర్తకి ప్రదక్షిణం చేసి, మంగళవాక్యాలు చెప్పి, ఏడుస్తూ అంతఃపురంలోకి వెళ్ళిపోయింది. వాలి కోడెత్రాచులా బుసలుకొడ్తూ ముందుకి వెళ్ళాడు. దూరంగా సుగ్రీవుడు కనిపించాడు. వాలి రోషంతో నడుం బిగించి ముందుకి సాగాడు. చింతనిప్పుల్లాంటి కళ్ళతో, సుగ్రీవుని సమీపించి ఇలా అన్నాడు.

'ఓరీ ఒక్కగుద్దుతో నీ ప్రాణాలు తీస్తాను అనగానే సుగ్రీవుడు పిడికిలి బిగించి, రోషంతో వాలితలపై ఒక్కగుద్దుగుద్దాడు. వాలి కోపం పట్టలేక సుగ్రీవుని బలంగా కొట్టాడు. ఆ దెబ్బకి సుగ్రీవుని శరీరంనించి రక్తం సెలయేరులా ప్రవహించింది. అయినా లెక్కచెయ్యకుండా సుగ్రీవుడు పెద్దపెద్ద చెట్లు పెకిలించి తెచ్చి వాలిని మోదసాగాడు. ఇద్దరి శరీరాలు రక్తాలు కారుతున్నాయి. సుగ్రీవుడు లేని శక్తి తెచ్చుకుని పోరాడుతు నలుదిక్కులా రాముడికోసం వెతకసాగాడు కళ్ళతో. పరిస్థితి విషమిస్తోందని రాముడు గ్రహించాడు. వెంటనే తన ధనస్సులో బాణం సంధించాడు. వాలిపైకి వదిలాడు. మండుతున్న మెరుపులా ఆ బాణం వాలిగుండెలలో నాటింది.

మదోన్మత్తుడు, మహాపరాక్రమశాలి వీరుడు, అయిన వాలి, రామబాణంతో నేలకూలాడు. ఇంద్రధ్వజం లాంటి వాలి, చైతన్యరహితుడై, నేలమీద మొదలు నరికిన మహావృక్షంలా పడిపోయాడు. ఒంటినిండా మేలిమి బంగారునగలతో ప్రకాశిస్తూ, ఇంతకాలమూ కిష్కింధారాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించిన వాలి, నేలకూలగానే, ఆకాశమంతా వెలుగు కోల్పోయి వెలవెలబోయింది. నేలకూలినా వాలి శరీరం ఇసుమంత కాంతి తగ్గలేదు. తేజస్సుగాని, పరాక్రమంగాని, తగ్గలేదు. ఇంద్రుడతనికి బహూకరించిన వజ్రాలమాల ప్రభావం వల్ల అతడి ప్రాణాలు శరీరాన్ని వదిలి పోలేదు.

వాలి శరీరంమీద రాముడు ప్రయోగించిన బాణం అలాగే వుంది. కాంతిపుంజములమధ్య వాలి శరీరం అచేతనంగా పడివుంది. అలా పడివున్న వాలిని రాముడు దూరం నించి చూశాడు. అతడిపరాక్రమాన్ని మెచ్చుకున్నాడు. తనపై బాణం వేసిన రామునికోసం వాలి కన్నులు వెతకసాగాయి.

రాముడు లక్ష్మణునితో వాలి దగ్గరకి నడిచివచ్చాడు. వాలి రామలక్ష్మణులను

చూశాడు. వాలి నిష్ఠూరంగా రామునితో,

'రామా, నువ్వు రాజకుమారుడివి. శాస్త్రజ్ఞుడివి. ఉత్తమ క్షత్రియవంశంలో పుట్టినవాడివి. నేను సుగ్రీవునితో యుద్ధం చేస్తుంటే, అధర్మంగా నన్ను చంపావు. అయితే అందువల్ల నువ్వు పొందిన ప్రయోజనమేమిటి? రాముడు కరుణామూర్తి అనీ, దయగలవాడనీ, ప్రజలకి మేలు మాత్రమే చేస్తావనీ, లోకమంతా కీర్తిస్తారే, నీకు ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, ఓరిమి, ధైర్యం, ధర్మం, పరాక్రమం, తప్పుచేసిన వారిని మాత్రమే దండించడం మొదలైన రాజలక్షణాలన్నీ వున్నాయంటారే, అవన్నీ విని నువ్వు చాలా గొప్పవాడివనుకున్నాను. నీ సంగతి ముందే నాకు చెప్పి, మా తార నన్ను యుద్ధానికి వెళ్ళవద్దని బ్రతిమాలింది. ఎందుకంటే నీకు రాజధర్మం తెలుసుకదా అని. మరియొకరితో యుద్ధం చేసేవారినీ, మత్తెక్కివున్నవారినీ, వీరులైనవారు కొట్టకూడదని రాజనీతి కదా. నువ్వు యుద్ధనీతి నెరిగినవాడివని భావించాను. కాని నువ్వందుకు విరుద్ధంగా ప్రవర్తించావు.

నీకు బుద్ధి చెడిపోయిందా? ధర్మమూర్తిలా నటిస్తున్న అధర్మమూర్తివి నువ్వు? నీకు ధర్మం లేదు. నువ్వు పాపపు కర్మలు చేసేవాడివి. సత్పురుషునిలా వేషం వేసుకుని లోకాన్ని మోసం చేస్తున్నావు. బూడిద కప్పిన నిప్పులాంటివాడివి.

'రామా నీకు ప్రత్యక్షంగా నేనేం ద్రోహం చెయ్యలేదు. నిన్నెపుడూ అవమానించలేదు. ధర్మపాలన చెయ్యవలసిన తాపసవేషంలో వుండి, ఇటువంటి క్రూరకర్మ చెయ్యడం న్యాయమేనా? నేను అడవిలో తిరిగే వానరుణ్ణి. పండ్లు, దుంపలు తినేవాడిని. అకారణంగా నన్నెందుకు చంపావు? రాజవంశంలో జన్మించినవాడివి. ధర్మమును రక్షించవలసిన వాడివి. ఎందుకిలాంటి తప్పుపని చేశావు. రాజులు సామము, దానము, ఓరిమి, ధర్మము, సత్యము, ధైర్యము, పరాక్రమము, తప్పుచేసిన వారిని దండించటం, అనే గుణాలు కలవారై వుంటారు. నీకలాంటి గుణాలేం లేవు. మనిద్దరిమధ్య ఎలాంటి వైరం లేదు. మరినన్నెందుకు చంపావు?

నువ్వు రాజువి, నేను వన్యమృగాన్ని. నువ్వు పురుషుడివి. ప్రజాపాలకుడివి. లోకంలో సామాన్యంగా ఇద్దరిమధ్య భూమి విషయంలో కాని, ధనం, వెండి బంగారు విషయంలో కాని, వైరం తగాదా సంభవిస్తాయి. కాని నీకు నాతోవిరోధం కలగడానికి కారణమేంవుంది? అడవిలో నేను తింటున్న పండ్లకోసం నన్ను చంపావా? రాజుల స్వభావం, అనుగ్రహం, నిగ్రహం కలిగివుండడం అనుకూలురపై అనుగ్రహం,

శత్రుశులపై నిగ్రహం కలిగివుండాలి. అంతేగాని ఇష్టమొచ్చిన వారిని దండించడం రాజు ధర్మంకాదు. ఏ అపరాధం చెయ్యని నన్ను బాణంతో చంపడం అధర్మం కాదా? పోనీ వేటాడడం రాజధర్మం కనుక వన్యమృగంగా తలచి నన్ను సంహరించానంటావా, వానరుల మాంసంకాని, చర్మంకాని, ఎముకలుగాని, మీబోటి ధార్మికులు తాకరుకదా, అటువంటి నన్ను చంపడంలో నీ నీతి, ధర్మం ఏమిటి? నాకు తార చాలా స్పష్టంగా చెప్పింది. ఆమె సర్వజ్ఞురాలు. నా మేలు కోరి చెప్పింది.

కాని మృత్యువు ఆసన్నమైన నేను, ఆమె మాటలు చెవిన పెట్టలేదు. నువ్వు ఈ భూమికి, రాజుగా వుండడానికి, ఎంతమాత్రం తగవు. పాపాత్ముడు, నీచుడు, మోసముతో నటించేవాడు అయిన నీలాంటి కుమారుడు ఉత్తముడైన దశరథునికెలా జన్మించాడో కదా. నువ్వు చేసినపని ఉత్తమమైనది కాదు. ఒకవేళ నువ్వు నాకెదురుపడి యుద్ధము చేసివుంటే, నిన్ను వెంటనే నేను యమపురికి పంపివుండేవాడిని. ఎవ్వరిచేతా జయించడానికి శక్యంకాని నన్ను కంటికి కనపడకుండా నిలబడి చంపావు. నువ్వు ముందు వచ్చి నన్ను అర్థించి ఉంటే రావణుడు అపహరించుకుపోయిన సీతమ్మని ఒక్కరోజులో వెతికి, నీకు తెచ్చి ఇచ్చుండేవాడ్ని.

సుగ్రీవుడు నాతో యుద్ధంచేసి నన్ను చంపితే అదిన్యాయమే. కాని పక్కనించి నన్ను నువ్వు చంపడం చాలా అధర్మం. పుట్టిన ప్రతివానికీ మరణం తప్పదు. నాచావు ఇలా రాసి వుంది. లోకంలో అందరూ కాలానికి కట్టుబడి వుండవలసిందే. అయితే నేను చనిపోయాక సుగ్రీవుడు రాజ్యాన్ని పొందటం ఉచితమేనా? నేనిలా అధర్మంగా చంపబడినపుడు, నా రాజ్యం సుగ్రీవునిదెలా అవుతుంది? తను యుద్ధంలో నన్ను జయించలేదు కదా. ఇపుడు సుగ్రీవుడు రాజు కావడం న్యాయసమ్మతమేనా? నువ్వు ధర్మమూర్తివైతే జవాబు చెప్పు'అంటూ చాలా పరుషంగా మాట్లాడి, నోటి తడి ఎండిపోయి, బాణపుదెబ్బతో బాధపడుతూ, సూర్యునిలా ప్రకాశిస్తున్న రామునివైపు చూస్తూ వాలి వుండిపోయాడు. మాటలు విన్న రాముడు ఏమాత్రం కోపం తెచ్చుకోకుండా, శాంతంగా ఇలా జవాబుచెప్పాడు.

'వాలీ, నువ్వు పసిపిల్లవాడిలా మాట్లాడుతున్నావు. నీకు ధర్మం తెలియదు. ధనము సంపాదించే మార్గం తెలియదు. పెద్దలపట్ల ఎలా ప్రవర్తించాలో తెలియదు. అందుకే నన్నిలా నిందిస్తున్నావు. నువ్వు వానరుడవు. కనక మీ జాతి సహజమైన చపలత్వం నీలో వుంది.' నాకు నీకు విరోధమేమిటి? అయితే, నీ రాజ్యంలో

నేనేమైనా తప్పుచేశానా? అని అడిగావు కదూ. విను.

ఈ భూమి యావత్తు ఇక్ష్వాకువంశీయులదే. ఈ భూమిమీద వున్న పర్వతములు, నదులు, అడవులు, అన్నీ మావే. కనక మా రాజ్యంలో ఎవరైనా అధర్మంగా ప్రవర్తిస్తే, వారిని శిక్షించే హక్కు మాకు వుంది. ఇక్కడ మృగాలు కాని, పక్షుల కాని, మనుష్యులు గాని, అందరి నిగ్రహానిగ్రహాలూ గుర్తించవలసినది మేమే. భూమండల సామ్రాజ్యాన్ని ధర్మాత్ముడైన భరతుడు పాలిస్తున్నాడు. అతడి శాసనం ప్రకారం, అరణ్యప్రాంతాలూ, మృగముల ధర్మరక్షణ మావంతు. నువ్వు కూడా మా రాజ్యంలోని అరణ్యంలో నివశిస్తున్న వాడివే. ధర్మం తప్పి ప్రవర్తిస్తున్నావు. ధర్మవిరుద్ధమైన కామము నాచరిస్తున్నావు' వానర సామ్రాజ్యానికి రాజువై యుండి కూడా ధర్మము నాచరించడం లేదు. సుగ్రీవునికి స్వయానా అన్నవై యుండీ అతణ్ణి శత్రువులా చూశావు. ధర్మాచరణ చాలా సూక్ష్మమైనది.

వానరోత్తమా, సర్వభూతాలకి హృదయమునందుండి, ఆత్మవలన తెలుసుకోబడి, శుభాశుభములు నెరిగించేదే ధర్మము. వాలీ. ఆ ధర్మంగురించి తెలియని నువ్వు నన్ను, చంపడానికి కారణమేమిటి? అని అడుగుతున్నావు. నువ్వు నీ అధికారమదముతో గుడ్డివాడిలా ప్రవర్తించావు. స్వయంగా తమ్ముని భార్యని గూడి, సుఖిస్తున్నావు. తమ్ముడంటే నీకన్నకొడుకులాంటివాడు. కోడలి పొందుకోరటం ఎంతపాపమో, తమ్ముడు బ్రతికివుండగా, అతడి భార్యని పొందడం అంతే పాపం. కనుక అధర్మవర్తనుడివైన నిన్ను నేను చంపవలసివచ్చింది.

కన్నకూతుర్ని, తోబుట్టువుని, తమ్ముని భార్యనీ, కామవశుడై ఎవడనుభవిస్తాడో, వారిని వధించటమొక్కటే దండన అని శాస్త్రం చెప్పింది. కనక భరతుని ప్రతినిధిగా నీకు నేను ఆ దండన విధించాను.

ఇంకా విను. నేను సుగ్రీవునితో అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నాను. కనక నా తమ్ముడు లక్ష్మణుడు ఎంతప్రీతిపాత్రుడో సుగ్రీవుడు కూడా అంతే. అతడు ఈ రాజ్యాన్ని., తన భార్యనీ తనకిప్పించమని అర్థించాడు. నేనతని కోరిక తీరుస్తానని, వాగ్దానం చేశాను. ఆ వాగ్దానం చెల్లించడానికి, నిన్ను చంపవలసి వచ్చింది. ఇది పాపం కాదు. శాస్త్రవిహితము, ధర్మసమ్మతము.

అంతేకాదు. నువ్వు పశుజాతికి చెందినవాడివి. కనుక నిన్ను ఎదుటనించి కాక, పక్కనించి చంపినా దోషము లేదు. రాజులు వేటాడేటప్పుడు, ఎక్కడో పొంచివుండి, జంతువులను చంపుతారు. ఇది అధర్మం కాదు. కనుక నిన్ను చాటునించి చంపానని, నన్ను నిందించకు. రాజుగా నా ధర్మం నేను నిర్వర్తించాను"

అని రాముడు వాలికి జవాబుచెప్పాడు.

వాలికి ఆ మాటలు విన్నాక, రోషంతగ్గి ప్రశాంతత కలిగింది. రెండు చేతులు జోడించి, రామునికి నమస్కరించి ఇలా అన్నాడు. 'పురుషోత్తమా, యదార్థం చెప్పావు అజ్ఞానం చేత, ధర్మం తెలియక, నీ మనస్సుకి క్లేశము కలిగించాను. నా అపరాధం మన్నించు. నువ్వు నాకు మరణదండన విధించడం ధర్మసమ్మతమే. చేయరాని పనులు చేసిన నన్ను క్షమించావు' అని ఒక్కమాట వింటే కాని నాకు పరితాపం చల్లారదు. ఆ ఒక్కమాట చెప్పు చాలు నీ చేతిలో చనిపోయిన నాకు సద్గతులు కలుగుతాయి. నేను చాలా అదృష్టవంతుడిని.

కాని, రామా, నా బెంగ అంతా, నా కుమారుడైన అంగదుడి గురించే. వాడు చాలా బుద్ధిమంతుడు. ఉత్తముడు. కాని చిన్నతనం వల్ల ఆభరణాలు ధరించడమంటే చాలా ప్రీతి. అందుకే వానిక్కావలసినన్ని బంగారు నగలు చేయించి, ధరింపజేశాను. చిన్నప్పట్నించీ చాలా గారాబంగాపెంచాను. ఇప్పుడు నేను చనిపోతే వానిగతిఏమిటి? రామా, ఇకమీదట వాణ్ణి నువ్వే కాపాడాలి. సుగ్రీవుని మీద, నీ తమ్ముని మీద ఎంత ప్రేమవుందో, అంతప్రేమా వానిమీద నువ్వు చూపించు. అంగదుణ్ణి కాని, తారని కాని, సుగ్రీవుడు చిన్నచూపుచూడకుండా చూసే బాధ్యత నీది. సుగ్రీవుడు నీ అనుగ్రహం పొందాడు. నీ పర్యవేక్షణలో రాజ్యాన్ని చక్కగా పాలించగలడు. నీ గొప్పతనం తెలియకపోవడం వల్ల నేను తార చెప్పినా వినకుండా, అహంభావం వల్ల యుద్ధానికి వచ్చి నీ చేతిలో మరణించాను. అయినా అది నా మహద్భాగ్యంగా భావిస్తున్నాను.' అని అనేకవిధాల పరితపించాడు వాలి. రాముడు వాలిని ఓదారుస్తూ 'వానర వీరా - నీ కుమారుని గురించి గాని, తారగురించి కాని నువ్వేం బెంగపెట్టుకోకు. అంతేకాదు నీ పాపానికి ప్రాయశ్చిత్తం కలిగించడానికి నిన్ను నేను దండించాను. నీ మనస్సులోని భయము, వ్యామోహము వదిలిపెట్టు. ప్రారబ్ధకర్మ తప్పించుకునేవారెవ్వరూ లేరు. వానరోత్తమా, నీకుమారుడైన అంగదుడికెలాంటి కష్టమూ కలగకుండా చూసే పూచీనాది' అని రాముడెన్నివిధాలో వాలిని ఊరడించాడు. వాలి దుఃఖంతో కుమిలిపోతూ,

'ప్రభూ నీ బాణం చేసిన గాయంవల్ల కలిగిన బాధ ఓర్చుకోలేక, నిన్ను దూషించాను. నువ్వు మహేంద్రునికన్నా గొప్పవాడివి. నన్ను అనుగ్రహించు. నా ప్రార్థనను మన్నించి నన్ను క్షమించు' అని చెప్తూ ఇంక నోటమాట రాక, అవసానదశ రావడంవల్ల మైకం కమ్మి పడిపోయాడు. ఆ సంగతి తారకి తెలిసింది. ఆమె

భయంతో కంపించిపోతూ, అంగదుడిని వెంటతీసుకుని వడివడిగా వచ్చింది. వాలి బలగమంతా కూడా వారివెంట నడచివచ్చింది. కాని, ధనుర్ధారియైన రాముణ్ణి చూసి భయంతో దూరంగా వుండిపోయారు.

అపుడు తార వారిని చూసి, 'వానరవీరులారా, అలా భయపడి ఆగిపోయారేం? ఇక్కడ రాజ్యం కోసం అన్నదమ్ములమధ్య యుద్ధం జరిగింది. సుగ్రీవుడికండగా రాముడు నిలబడి వాలిని చంపాడు. ఇదంతా వారిముగ్గిరిమధ్య జరిగిన వ్యవహారం. మధ్యలో మీరు భయపడవలసిన అవసరం ఏముంది?' అని వారిని మందలించింది.

దానికి వానరులు భయంతో రొప్పుతూ, 'అమ్మా, నీకు రాజకీయాలు తెలియవు. ముందు జీవించి వున్న నీ కుమారుని కాపాడుకో. మృత్యువు రామునిరూపంలో వచ్చి, వాలిని చంపి తీసుకుపోతున్నాడు. వాలిని కోల్పోయిన వానరసైన్యం దిక్కులేనిదైంది. ముందుగా అంగదునికి పట్టాభిషేకం చేసి మన పట్టణాన్ని కాపాడుకోవాలి. వానరులంతా అంగదుని రాజుగా అంగీకరిస్తారు. కిష్కింధలో వుండడం, ప్రమాదమనుకుంటే వేరెక్కడికైనా వెళ్దాం. సుగ్రీవునిలాగే చాలామంది వానరుల భార్యల్ని వాలి చెరబట్టడం వల్ల వాళ్ళంతా కూడా వాలిమీద పగబట్టి వున్నారు. వీళ్ళవల్ల కూడా మనకి ప్రమాదం పొంచివుంది' అని చెప్తూ ఆయాసంతో రొప్పుతూ కాస్సేపుఆగారు.

అపుడు తార మందహాసంతో ఇలా అంది. 'నాయనలారా - కొండంత అండ, నా భర్త చనిపోయాక, ఇంక నాకీ కుమారుడెందుకు? రాజ్యమెందుకు? నాకసలు ప్రాణాలమీద ఆశలేదు. రామబాణంతో నేలకూలిన నా భర్త వాలిపాదాలదగ్గరే నా స్థానం' అని చెప్తూ శోకం ఆపుకోలేక తలమీద, గుండెలమీద బాదుకుని ఏడుస్తూ, నేలమీద పడివున్న వాలిదగ్గరకి పరిగెత్తింది. యుద్ధంలో పరాజయమెరగని మహావీరుడు, ఎందర్నో రాక్షసుల్ని సునాయాసంగా చంపిన మహాశూరుడు, మహాపర్వతాల్ని సైతం కూకటి వేళ్ళతో పెల్లగించగల సమర్థుడు, దేవేంద్రుడంతటి పరాక్రమశాలియైన, తన భర్త ఈనాడిలా నిర్జీవంగా నేలమీద పడివున్నాడు.

ఆప్రక్క శ్రీరాముడు, లక్ష్మణునితో కూడా, ధృడమైన ధనస్సు చేతిలో పట్టుకుని, దానికి ఆనుకుని, నిలబడివున్నాడు. ఆపక్కనే తనభర్త చావుకి కారణమైన సుగ్రీవుడు నిలబడి వున్నాడు.

వారందర్నీ పరిశీలనగా చూసి ఆపై ఆర్యపుత్రా' అని బిగ్గరగా ఏడుస్తు తన భర్త శరీరంపై పడిపోయింది. భోరు భోరున ఏడుస్తున్న తారని చూసి సుగ్రీవుడు

చాలా బాధపడ్డాడు. వదినగార్ని, అంగదుడ్ని చూసేసరికి, సుగ్రీవుడి మనస్సు క్లేశంతో నిండిపోయింది.

నేలమీదపడి మరణవేదన పడుతున్న భర్తని చూసి దుఃఖం పట్టలేక తార భర్త శరీరాన్ని గట్టిగా కౌగలించుకుని ఏడ్చింది.

'మహావీరా.... యుద్ధంలో సాటిలేని మేటి పరాక్రమం చూపే వీరుడివే, ఈ రోజిలా అచేతనంగా పడివున్నావేమి? నేనేం తప్పుచేశానని నాతో మాట్లాడడం లేదు? వానరరాజా.... లే..... లేచి మంచి పాన్పుపై పడుకోకూడదూ. అయ్యో, నాదెంతరాతిగుండె! భర్తనేలమీద కూలివుండడం చూసి కూడా అది పగిలిముక్కలు కావడం లేదు. అయినా సుగ్రీవుని భార్యని అపహరించి, అతనిని రాజ్యంనించి వెళ్ళగొట్టావే, ఆ పాపం ఊరికేపోతుందా? నీ మేలుకోరి యుద్ధం చెయ్యవద్దని నీకెంతో హితవుచెప్పానే, వినకుండా మోహవశుడవై నన్ను నిందించి వచ్చావు. ఏమైందిప్పుడు. ఇంక నాకెవరు గతి. ఇప్పటిదాకా దుఃఖం అంటే ఏమిటో తెలియదు. ఇపుడింక అనాథనై దీనురాలనై శోకంతో తపించిపోతున్నాను.

మన అంగదుడు సుకుమారుడు. లాలించి ఎంతో ముద్దుగా పెంచుకున్నాము. సుగ్రీవుడు క్రోధావేశంతో ఒళ్ళు తెలియకవున్నాడు. అతడిదగ్గర మన అంగదుడెలా మసలగలడు?' అని ఘోరంగా విలపిస్తూ అంగదుని పిల్చి 'కుమారా ఇటు చూడు నాయనా ధర్మవత్సలుడైన నీ తండ్రి ఇకమీదట నీకు కనిపించడు. దగ్గరగా వచ్చి ఒకసారి బాగా చూడు' అని అంగదుడ్ని దగ్గరగా తీసుకుని, భర్తని చూపిస్తూ, వాలివైపు తిరిగి, 'ప్రభూ మీ కుమారుణ్ణి ఓదార్చండి. మీ అంతిమ సందేశం వినిపించండి' అని గుండెలవిసేలా ఏడ్చింది. మిగిలిన అంతఃపుర స్త్రీలు అంగదుడు, ఆమెని పట్టుకుని గట్టిగా ఏడ్చారు. అలా దీనాతిదీనంగా ఏడుస్తున్న తారని చూసి, ఆంజనేయుడు,

'అమ్మా, నీకు తెలియనిదేం వుంది? పుట్టిన ప్రతిప్రాణీ పూర్వజన్మసంచిత కర్మఫలములు అనుభవించకతప్పదు. తెలిసిచేసినా, తెలియకచేసినా ఆ కర్మఫలము జీవినంటిపెట్టుకునే వుంటుంది. ఈ జన్మలో సుఖదుఃఖాలు ఆ కర్మలఫలం వలననే కలుగుతాయి.

అయితే ఆ కర్మఫలాలు మనం మరణించిన తర్వాత మనవెంటవుండి, ఆత్మతో కూడా జీవి ఎక్కడికెళ్తే అక్కడకివెళ్ళి, ఫలితాన్ని అనుభవింపచేస్తాయి కొన్ని. మరికొన్ని తర్వాతిజన్మలో అనుభవానికి వస్తాయి. కనుక వాలిని సుగ్రీవుడు చంపించాడనుకోవడం చాలా పొరపాటు. అతడి కర్మఫలమే అతడి మరణానికి

కారణం. నువ్వు వాలిని గురించి దుఃఖించే ముందు నీ పరిస్థితి అవగాహన చేసుకో. ఈ జీవితం నీటిబుడగలాంటిది. ఇపుడు నువ్వు ఎవరికోసం దుఃఖిస్తున్నావు? అసలు ఎవరికోసం ఎవరు దుఃఖించాలి? ఎందుకు దుఃఖించాలి? గతించిన దాని గురించి ప్రయోజనం లేదు.

ప్రస్తుతం నువ్వు అంగదుడి గురించి ఆలోచించు. అతడి కోసం ఏం చెయ్యాలో తెలుసుకో. సామాన్యంగా ఈ లోకంలో ప్రాణుల పుట్టుక మరణం గురించి తెలుసుకోవడం అసాధ్యం. అది నీకూ తెలుసు. అందుకని చనిపోయిన వారికి, ఆత్మశాంతి కలిగించేలా విజ్ఞానులు శుభకార్యాలు చెయ్యాలి. ఈ నాడిలా మరణించిన వాలి చాలా గొప్పవాడు. అతడు లక్షలకొద్దీ కోట్లకొద్దీ వానరులకి ఎన్నెన్నో ఉపాధులు కలిగించాడు. ఇప్పుడితడి ఆయుర్దాయం సమాప్తమైనది. కనుక మరణించాడు. అందుకు దుఃఖించి ప్రయోజనం లేదు. ధర్మాధర్మములు నాచరించిన వాలి చరితార్థుడు. ఇటు చూడు. వానరశ్రేష్ఠులంతా నీ చుట్టు వున్నారు. నీ కుమారుడైన అంగదుడు నీ మీద ఆధారపడివున్నాడు. కనుక నువ్వు దుఃఖాన్ని నీలోనే ఇమడ్చుకో. నీ రక్షణలో అంగదుడు రాజ్యభారాన్ని వహిస్తాడు. ప్రస్తుతం అంగదుడు తండ్రికి అంతిమ సంసారం చేసి సద్గతులు కలిగించాలి. అది తక్షణ కర్తవ్యం' అని హనుమంతుడు చెప్పిన ఓదార్పుమాటలు విని తార విరక్తిగా,

'హనుమా అంగదునిలాంటి పుత్రులు నూరుమంది వుంటే మాత్రం, నా భర్తలేని లోటు తీరుతుందా? తండ్రికి అంగదుడు అంతిమసంస్కారం చెయ్యాలి. నిజమే. కాని అది చేయించడానికి సుగ్రీవుడు వున్నాడు. ఇకపైన అన్ని వ్యవహారాలు. సుగ్రీవుడే చేస్తాడు. నేనుమాత్రం నా భర్తవెంట ప్రాయోపవేశం చేస్తాను' అంది నిశ్చలంగా.

అప్పటికే వాలి ప్రాణాలు కడంటిపోతున్నాయి. భారంగా వున్న కనురెప్పలొకసారి మెల్లగా పైకి ఎత్తిచూశాడు. ఎదురుగా అంగదుడు కనిపించాడు. పక్కనే సుగ్రీవుడున్నాడు. వాలి ప్రేమగా సుగ్రీవుని చేరబిల్చి, ఎలాగోమాటలు కూడదీసుకుని,

'సుగ్రీవా నేను నీకు అపకారం చేశాను. రాజ్యం నించి వెళ్ళగొట్టాను. నీ భార్యనపహరించాను. నన్ను మన్నించు. సోదరప్రేమననుభవించే అదృష్టం మనకి లేదు. నేనిప్పుడు యమలోకానికి వెళ్తున్నాను. ఈ వానర రాజ్యాన్ని నువ్వే స్వీకరించు. కాని నా కుమారుడైన అంగదుణ్ణి ఆదరించు. నాకు వాడు

ప్రాణాలకన్నా మిన్న. నువ్వు వీణ్ణి నీకన్న కొడుకులాగే చూసుకో. ఇకమీదట వీడి సంరక్షణా భారం నీదే. ఇంక తార, చాలా తెలివైనది. సమగ్రురాలు. ఆమె సలహాలు పాటించు. రాముని కార్యం సాహసంతో పూర్తిచెయ్యి. అలా చెయ్యకపోతే అధర్మం ప్రాప్తిస్తుంది. అంతేకాదు. ఆయన చేతిలోనే మరణిస్తావు. ఇదిగో ఈ బంగారు మాల తీసుకుని ధరించు. ఇది ధరించినవారిని విజయలక్ష్మి వరిస్తుంది. ఇది నా మెడలో వుండగా నేను చనిపోతే దీని మహిమపోతుంది. కనక నా శరీరంలో ప్రాణాలుండగానే దీన్ని తీసుకుని ధరించు' అని లాలిస్తు చెప్పాడు. ఆ మాటలు విన్న సుగ్రీవునికి ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది. సోదరుని చంపించానే అనే దీనమైన భావంతో భిన్నుడైపోయాడు.

ఏడుస్తూనే వాలి ఆజ్ఞమీరలేక ఆయన మెడలోని సువర్ణమాల తీసుకుని తనమెడలో వేసుకున్నాడు. ఆ తర్వాత అంగదునిచేరబిల్చి, వాలి వాత్సల్యంతో, 'నాయనా, పరిస్థితులు తెలుసుకుని మసులుకో. మంచి మాటలకి ఆనందించినట్లే, చెడుని కూడా ఓర్పుతో భరించు. సుఖదుఃఖాలు ఒకదానివెంట ఒకటి వుంటాయి. అన్నింటినీ సమానంగా స్వీకరించడం నేర్చుకో. అన్నింటికీ ఇంక నీకు ఈ సుగ్రీవుడే వున్నాడు. నేనెంత గారాబంగా నిన్ను చూసుకున్నానో, నీ చిన్నాయన కూడా అలాగే చూసుకుంటాడు. ఆయన ప్రేమ పొందడానికి ప్రయత్నించు' అని కొడుక్కి హితబోధ చేస్తుండగా, కళ్ళు గిరగిరా తిరిగి, వాలి అంతిమశ్వాస విడిచాడు. వానరసేన అంతా ఒక్కసారి గొల్లున ఏడ్చింది. వాలి స్వర్గస్థుడైనాడు. కిష్కింధ శూన్యమైపోయింది. ఉద్యానవనాలన్నీ వెలవెలబోయాయి. వారంతా ఏడుస్తుంటే తార వాలిదగ్గరగా వెళ్ళి ముఖంలోకి చూసి దుఃఖంలో మునిగిపోయింది. భర్తశరీరాన్ని కౌగలించుకుని భోరున ఏడ్చింది.

వాలిగుండెలలో దిగబడిన రామబాణాన్ని నీలుడు అనబడే సుగ్రీవుని సేనాధిపతి బయటకి లాగాడు. అది అలా బైటకి లాగగానే వాలితేజస్సు కోల్పోయాడు. అతడి శరీరమంతా రక్తధారలతో నిండిపోయింది. గాయపడిన భర్త శరీరాన్ని తారచేతితో తడిమింది. అంగదుడు వచ్చి తండ్రిపాదాలకు నమస్కరించాడు. అంగదుడు, తార కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే చూసి సుగ్రీవుడు కూడా దుఃఖం ఆపుకోలేకపోయాడు. అలా ఏడుస్తూనే రాముని దగ్గరకి వెళ్ళి చేతులు జోడించి,

'రాజకుమారా నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నావు కాని, నా సోదరుని మరణం చూశాక, నాకు రాజ్యం పొందాలనే కోరిక నశించింది. మహారాణి తార,

వానరపరివారం, అంతా గొల్లున ఏడుస్తున్నారు. తండ్రిని పోగొట్టుకున్న అంగదుడు దీనంగా విలపిస్తున్నాడు. వీరందర్నీ చూస్తుంటే నాకు రాజ్యం చెయ్యాలనే కోరిక చచ్చిపోయింది. నా అన్నయ్య నన్ను పట్టణం నించి వెళ్ళగొట్టి అనరాని మాటలని, నాకు బ్రతుకే అవకాశం లేకుండా చేశాడని, ఓర్వలేక, నా సోదరుని నువ్వు చంపుతానంటే సరే అన్నాను. కాని ఇప్పుడు వీరందరి దుఃఖం చూస్తుంటే, ఇదివరకటిలాగే, ఋష్యమూకపర్వతం మీదే వుంటూ ఆ చెట్లమీదే వానరుడిగా బ్రతికితేనే బాగుండేది కదా అనిపిస్తోంది.

వాలి చనిపోయాక స్వర్గాధిపత్యమిచ్చినా నాకువద్దు. అతడి గొప్పతనమేమిటో ఇపుడు నాకుతెలిసింది. ఇంతటి మహావీరుడై వుండీ, నా మీద పగతో నన్ను చంపకుండా వదిలిపెట్టి నీ ఇష్టం వచ్చినచోటుకి పో, అని నన్ను వదిలేశాడు. అలా చెయ్యగల ఔదర్యం అతడికి మాత్రమే వుంది. ఆనాడే ఈయన నన్ను చంపివుంటే ఈనాడు ఈ దుస్థితి కలిగేది కాదు కదా. సోదరుడినన్న వాత్సల్యంతో వాలి నన్ను చంపలేదు. కాని, నేను అతడి ప్రాణాలు తీసే మర్యాద హీనమైన పనికి పాల్పడ్డాను. నాకసలు ఈ రాజ్యం వద్దు. రామా నేను చేసిన పాపం నన్ను దహించివేస్తోంది. నేను వాలికి తీరని ద్రోహం చేశాను. నేనిప్పుడే అగ్నిలో ప్రవేశించి ప్రాణత్యాగం చేస్తాను. ఇక్కడున్న మా వానరవీరులంతా సీతమ్మ కోసం అన్వేషిస్తారు. నేను చనిపోయినా, నీ కోరిక నెరవేర్తుంది. నాకు చనిపోవడానికి ఆజ్ఞ ఇయ్యి' అంటూ ఆర్తిగా విలపించాడు, సుగ్రీవుడు. ఆ మాటలు విన్న రాముని మనస్సు కలత చెందింది. కన్నీరుధారగా కారింది.

మెల్లిగా, ఏడుస్తున్న తారవైపు వెళ్ళాడు రాముడు. ఆమె గుండెలు బాదుకుని ఏడుస్తూ వుంది. తనదగ్గరకి వచ్చిన రాముని చూసింది. పద్మపత్రాయతాక్షుడైన, ఆ మహాత్ముని పురుషోత్తమునిగా గుర్తించింది. భరించలేని దుఃఖంతో ఒణికిపోతూ రోషంతో ఇలా అంది. 'రామా నువ్వు అప్రమేయుడివి. జితేంద్రియుడివి. గొప్ప కీర్తి గలవాడివి. విచక్షణాజ్ఞానం గలవాడివి. వివేకవంతుడివి. భూదేవి అంత ఓర్పు గలవాడివి. రాజీవలోచనుడివి. సాక్షాత్తు నారాయణుడివి. విల్లుచేతబట్టి సామాన్యునిలా నుంచున్నావు. రామా, నా ప్రార్థన ఒకటి ఆలకించు. నువ్వు ఏ బాణంతో అయితే మహావీరుడైన వాలిని చంపావో ఆదే బాణంతో నన్ను కూడా చంపు. వాలిలేనిదే నేను బ్రతకలేను. సీతని ఎడబాసి నువ్వెలాగైతే దుఃఖిస్తున్నావో, అలాగే వాలి స్వర్గంలో నా కోసం బాధపడ్తువుంటాడు. నువ్వు మహాత్ముడివి. ఆడదానిని చంపితే పాపం వస్తుందని జంకుతావేమొ. నీకా జంకు అక్కర్లేదు. స్త్రీ పురుషునికి ఆత్మవంటిది. భార్య అంటే భర్తయొక్క ఆత్మ. కనుక నన్ను చంపడం

స్త్రీ వధ అవదు. వాలి తోడు లేక కుమిలిపోతున్న అనాధను. ఆర్తురాలిని. నన్ను నా భర్తకి దూరం చేసి బాధపెట్టడం నీకు తగదు' అని తార దీనంగా విలపిస్తుంటే ఆమె ననునయిస్తూ రాముడిలా అన్నాడు. 'తారా నువ్వు వీరపత్నివి. యుద్ధంలో భర్త వీరమరణం పొందడం ఎంతభాగ్యమో నీకు తెలుసు. కనుక నేను బ్రతకలేను అనే మాట నువ్వు పలకకూడదు. బ్రహ్మ జీవులందర్నీ ఎవరికి తగ్గట్టు వారిని సృష్టిస్తాడు. సృష్టికర్త లిఖితం ప్రకారమే జీవులకి సుఖదుఃఖాలు కలుగుతాయి. విధాత నిర్ణయాన్ని మార్చగలిగే వారెవ్వరూ లేరు. కనుక విధివిధానం అనుసరించడం తప్ప, అతిక్రమించడం జరగదని గ్రహించి నీ మనస్సుని ఊరడించుకో. నీకు ఆనందం కలిగించేలా నీ కొడుకు యౌవరాజ్యాన్ని పొందగలడు. వీరులైన భర్తలు యుద్ధంలో మరణిస్తే వీరపత్నులు దుఃఖించకూడదు. కనుక నువ్వు శోకించవద్దు' అని రాముడు తారని ఓదార్చగానే, రాముని ప్రభావం వల్ల ఆమె మనస్సులో శోకం ఉపశమించింది.

ఆమె శోకాన్ని దిగమింగి లేచి నిలబడింది. తర్వాత రాముడు సుగ్రీవుణ్ణి, అంగదుణ్ణి కూడా ఓదార్చాడు. సుగ్రీవుడు ఏడ్చి ఏడ్చి తెలివితప్పి పడివుండగా లక్ష్మణుడతన్ని లేవదీసి కూర్చోపెట్టి 'సుగ్రీవా, ఇంకప్రేతకర్మ చేసే ప్రయత్నాలు చెయ్యి. ఇప్పుడు వాలికి దహన సంస్కారం జరగాలి. ఎండుకట్టెలు, మంచిగంధం కట్టెలు తెప్పించు. అంగదుణ్ణి ఓదార్చి ధైర్యం చెప్పు. నువ్విలా స్తబ్దుడివై వుంటే ఎలా, ఇపుడీ పట్టణమంతా నీ ఆధీనంలో వుంది. సంస్కారానికి కావలసిన పూలు, పూలమాలలు, బట్టలు, నెయ్యి, నూని పరిమళద్రవ్యాలు, అన్నీ తెప్పించడానికి, అంగదుణ్ణి పంపించు. శిబికని తెప్పించు. ఆ శిబికని మొయ్యడానికి బలమైన వానరవీరుల్ని నల్గురిని రమ్మనిచెప్పు' అంటు తొందరచేశాడు. సుగ్రీవుని ఆజ్ఞపై తారుడు శిబికని తెచ్చాడు. పల్లకి మోయడానికి బోయీలు వచ్చారు. ఆ శిబికలో మెత్తని పరుపు పరిచారు. దాన్ని అందంగా అలంకరించారు. సుగ్రీవుడు, అంగదుడు ఏడుస్తూ వాలి శరీరాన్ని పల్లకిలో వుంచారు. ఎన్నెన్నో రత్నాలు, నగలూ దానం చేశారు. ముందు సుగ్రీవుడు, వానరులు నడువగా, అంగదుడు, తారుడు మొదలైనవారు అనుసరించారు. తారమొదలైన అంతఃపుర స్త్రీలు ఏడుస్తూ వెంట వెళ్ళారు. అలాసాగి ఒక నదీతీరానికి చేరారు. ఆ నీటి ఒడ్డున, ఇసుక తిన్నెలమీద పల్లకి ఆపి పర్యంకాన్ని దింపారు. తార భర్త తలని ఒళ్ళోపెట్టుకుని ఏడ్చింది. వానర స్త్రీలు ఆమెని బలవంతంగా దూరంగా తీసికెళ్ళారు. అంగదుడు సుగ్రీవుడు ఏడుస్తు వాలి శరీరాన్ని చితిమీద వుంచారు.

అంగదుడు చితిచుట్టూ అపసవ్యంగా ప్రదక్షిణం చేశాడు. తండ్రికి అగ్ని

సంస్కారం చేసి, కొండవాగు దగ్గరకు వెళ్ళి తర్పణం వదిలాడు. కార్యక్రమమంతా సవ్యంగా జరిపించి, సుగ్రీవుడు, రాముని దగ్గరకి వెళ్ళి నిలబడ్డాడు. అతడి మిత్రులైన వానర వీరులు కూడా వచ్చి అతడి దగ్గరనిలబడ్డారు. అపుడు రామునితో, హనుమంతుడు ఇలా అన్నాడు.

'ప్రభూ సుగ్రీవుడు మీ అనుగ్రహం వల్ల తన రాజ్యాన్ని పొందాడు. మీరనుమతిస్తే పట్టణంలోకి వెళ్ళి చెయ్యవలసిన పనులు చేస్తాడు. ఇతడు స్నానం చేసి వచ్చి మిమ్మల్ని సుగంధద్రవ్యాలతోటీ, ఓషధులతోటీ, పూలమాలలతోటీ, రత్నాలతోటీ యధావిధిగా అర్చించాలని అభిలాషపడ్తున్నాడు. మా కందరికీ మీరే ప్రభువులు మీరు అనుగ్రహంతో పట్టణంలోకి వచ్చి, సుగ్రీవుని వానరరాజుగా అభిషేకం చెయ్యవలసిందిగా మా ప్రార్ధన' అని హనుమంతుడు చెప్పినమాటలు విని రాముడు, చాలా మృదువుగా 'హనుమా మా తండ్రిగారి ఆజ్ఞప్రకారం పధ్నాలుగు సంవత్సరాలు వనవాసదీక్షలో వున్న మేము, ఈ నియమిత కాలంలో గ్రామాల్లో ప్రవేశించకూడదు. కనుక మీరంతా కలిసి మీ మిత్రుణ్ణి వానరరాజుగా అభిషేకించండి', అని సుగ్రీవుని వైపు తిరిగి, 'సుగ్రీవా నీ అన్నగారి కుమారుడైన అంగదుణ్ణి యువరాజుగా అభిషేకం చెయ్యి. తండ్రి మరణం వల్ల చాలా దైన్యంగా వున్నాడు. ఇతడే యువరాజు కాదగ్గవాడు. ఇపుడు శ్రావణమాసము. ఇప్పట్నించీ నాలుగునెలలు వర్షాకాలము. ఇది యుద్ధము చెయ్యడానికి సరియైన సమయం కాదు. కనుక నువ్విప్పుడు పట్టణంలోనికి వెళ్ళు. రాజ్యాభిషేకం చేసుకుని, సుఖంగా వుండు. నేను నా తమ్ముడైన లక్ష్మణునితో కలిసి ఊరిబయట పర్వతగుహలో వుంటాను. ఈ గుహ చాలా విశాలంగా వుంది. లోపలికి గాలి బాగా వస్తోంది. ఇక్కడ మంచినీరు కూడా సమృద్ధిగా దొరుకుతోంది. ఇక్కడ మేము సుఖంగానే వుంటాము. కార్తీకమాసం వచ్చాక రావణునితో యుద్ధం చెయ్యడం గురించి ఆలోచిద్దాము' అన్నాడు.

రాముని ఆజ్ఞప్రకారం సుగ్రీవుడు కిష్కింధకి వెళ్ళాడు. వానరవీరులు వేలసంఖ్యలో వచ్చి ఆయనకి నమస్కరించి నిలబడ్డారు. వారందరితో కలిసి హనుమంతుడితో కూడా సుగ్రీవుడు అంతఃపురంలో నిలబడ్డాడు. వారంతా సుగ్రీవునికి తెల్లని బంగారు ఛత్రం పట్టారు. బంగారు వ్యజనంతో వీచారు.

రత్నాలు, పండ్లు, ఓషధులు, పాలు కారే చెట్టుకొమ్మలు, పూలమాలలు, అక్షింతలు, బంగారము, కుంకుమపువ్వు, తేనె, నెయ్యి, పులిచర్మము, సిద్ధపరిచారు. పందిచర్మంతో చేసిన పాదుకలు తెచ్చారు. గోరోచనము, మనశ్శిల,

మొదలైన పై పూతద్రవ్యాలు తెచ్చారు. పదహారుమంది కన్యల్ని అభిషేకం చెయ్యడానికి తెచ్చారు. బ్రాహ్మణులను పిలిచారు. వారికి రత్నములు, వస్త్రములు, బక్ష్యములు ఇచ్చి సత్కరించారు. తర్వాత ఆ బ్రాహ్మలు దర్భలు చుట్టూపరచి, అగ్నిహోత్రం వేదికలో వుంచి, మంత్రాలతో ప్రజ్వలింపజేసి, హవిస్సు అర్పించారు. బంగారు ఆసనం మీద సుగ్రీవుని కూర్చోబెట్టారు. పూలమాలలతో ఆ ఆసనం అలంకరించారు. నదీనదములనించి పవిత్రజలాలు బంగారు కలశాలతో తెప్పించారు.

గయుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు, నీలుడు, అనే వానర వీరులు, ఆ పరిమళ జలాలతో, దేవేంద్రవైభవంతో సుగ్రీవుని, వానరరాజుగా అభిషేకించారు. అభిషేకం పూర్తికాగానే వానరవీరులు ఆనందంతో కేకలుపెట్టారు.

తర్వాత సుగ్రీవుడు అంగదుని యువరాజుగా అభిషేకం చేశాడు. వానరవీరులంతా సుగ్రీవుని చాలా మెచ్చుకున్నారు. రామలక్ష్మణుల్ని ప్రశంసించారు. పట్టాభిషిక్తుడైన సుగ్రీవుడు రాముని దగ్గరకి వెళ్లి పట్టాభిషేక వృత్తాంతమంతా వర్ణించి చెప్పాడు. ఆ తర్వాత రాముని ఆశీర్వాదం పొంది, రుమనీ, రాజ్యాన్నీ స్వీకరించాడు. వారలా పట్టణంలోకి వెళ్ళగానే రామలక్ష్మణుల ప్రస్రవణ పర్వతం మీదికి వెళ్ళారు.

ఆ పర్వతం దట్టమైన అరణ్యాలతోటీ, సింహాలగర్జనలతోటీ, లేళ్ళ అరుపులతో, భయంకరంగా వుంది. దట్టంగా అల్లుకున్న తీగలు, పొదలు, అన్నివేపులా నిండి వున్నాయి. అలాంటి ప్రస్రవణగిరి మీద విశాలంగా వున్న ఒక గుహలో రామలక్ష్మణులు తమ నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

అపుడు రాముడు లక్ష్మణునితో, 'లక్ష్మణా ఈ పర్వతగుహ చాలా విశాలంగా వుంది. చక్కని గాలి గుహలోపలిదాకా వస్తోంది. మనం వర్షాకాలమంతా ఇందులోనే వుందాము. సుగ్రీవుని నగరమైన కిష్కింధ కూడా దగ్గరలోనే వుంది. అదిగో కిష్కింధలో మద్దెలమోతలు, గీతధ్వనులు, వాద్యఘోషలు వినిపిస్తున్నాయి విన్నావా? సుగ్రీవుడు రాజై భార్యతో కూడి అష్టైశ్వర్యాలతో, బంధువులతో గూడి ఆనంద పరవశుడైవున్నాడు' అని లక్ష్మణునికి చెప్తూ అంతలో సీత గుర్తురాగా ఆమె తలపులలో మునిగిపోయాడు. రాముడు సీతని తల్చుకుంటూ అంతులేని వేదన అనుభవిస్తుంటే రాముణ్ణి లక్ష్మణుడు అనునయిస్తూ ఊరడిస్తూ ధైర్యం చెప్తూ అన్నివిధాలా రామునికి అండగావున్నాడు. అలా అలా చాలా భారంగా వర్షాకాలం

నెల్లాళ్ళు గడిచిపోయాయి. గ్రీష్మతాపంతో వేడెక్కిన భూదేవి చల్లబడింది. కాని సీతా వియోగం వల్ల రాముని మనస్సులో చెలరేగిన శోకాగ్ని మాత్రం రోజురోజుకీ పెరిగిపోసాగింది. రోజుకొకయుగంలా గడుపుతూ, రాముడు వానాకాలం ఎప్పుడు పూర్తవుతుందా, సుగ్రీవుడు తనకి సహాయం చెయ్యడానికెప్పుడు వస్తాడా అని దిగులుగా ఎదురుచూడసాగాడు.

అలా నిరంతరం రాముడు ఆక్రోశిస్తుండగానే మిగిలిన మూడునెలలు కూడా భారంగా గడిచిపోయాయి. క్రమక్రమంగా వానలు వెనకట్టాయి.

కాని సుగ్రీవుడు తన భార్యరుమతో బాటు వాలి భార్య తారతో కూడా అంతులేని సుఖాలు పొందుతూ, రాత్రింబవళ్ళు కేళీ విలాసాల్లో మునిగితేలి స్వర్గసుఖాలు అనుభవిస్తూ రాముని గురించి పూర్తిగా మర్చిపోయాడు. అలా కామలాలసుడైన సుగ్రీవుని దగ్గరకి ఒకనాడు హనుమంతుడు వచ్చాడు. చనువుగా సుగ్రీవుణ్ణి పలకరించి, సుగ్రీవా, రాజ్యం లభించింది. కీర్తి, సంపద సంపాదించావు. సుఖంగా వున్నావు. కాని, మిత్రునికిచ్చినమాట నిలబెట్టుకోవాలి కదా. నువ్వు రామునికిచ్చిన మాట ప్రకారం సీతాన్వేషణ ప్రారంభించు. మిత్రునికి తగిన సమయంలో ఉపకారం చేసిన వారికి మాత్రమే కీర్తి సంపద నిలుస్తాయి. అలా చెయ్యకపోతే అనర్థం కలుగుతుంది. రాముడు నీమీది విశ్వాసంతో ఎంతో కాలం మించిపోతున్నా నిన్ను హెచ్చరించకుండా నీ రాకకోసం నిరీక్షిస్తున్నాడు. నువ్వు ఆజ్ఞాపిస్తే మన వానరవీరులు ముల్లోకాలలోనూ సీత ఎక్కడున్నా సరే జాడ తెలుసుకుని రాగలరు. కనుక రామునికి ప్రత్యుపకారం చెయ్యడానికి ఏర్పాట్లు చెయ్యి' అని సున్నితంగా మందలించాడు.

సుగ్రీవుడు కూడా తన కర్తవ్యాన్ని గుర్తుతెచ్చుకున్నాడు. వెంటనే తన కత్యంత సన్నిహితుడైన నీలుణ్ణి పిలిపించి, ఇలా చెప్పాడు.

'నీలుడా అన్నిదిక్కులనించీ మనవానరసైన్యం యావత్తు పిలిపించు వాళ్ళందర్నీ వెంటపెట్టుకుని, ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఉన్నవాళ్ళని ఉన్నట్టుగా రావలసిందిగా మన సైన్యాధిపతులందరికీ కబురు చెయ్యి. పొలిమేరలో రక్షణకోసం వుంచిన సైన్యాన్ని కూడా వెంటనే రమ్మని, నా ఆజ్ఞగా చెప్పు. నువ్వు స్వయంగా వెళ్ళి సైన్యం అంతా వచ్చిందో లేదో, పరిశీలించి చూడు. నేటి నించి పదిహేనురోజులలోగా వీరంతా మనముందు హాజరుకావాలి. ఒకవేళ ఎవరైనా ఈ గడువులోపల రాకపోతే, పదహారోరోజున, వారికి మరణదండన విధిస్తానని చెప్పు? మన అంగదుడు, వృద్ధుడైన జాంబవంతుడు, వారిద్దరికీ కూడా నా నిర్ణయం

గురించి చెప్పు' అని తీవ్రంగా ఆజ్ఞాపించి, ఏర్పాట్లన్నీ కట్టుదిట్టంగా చేసి, మళ్ళీ తన అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు సుగ్రీవుడు.

ఇక్కడ కిష్కింధలో సంగతి ఇలా వుండగా, అక్కడ ప్రస్రవణగిరిపై గుహలో నివశిస్తున్న రామలక్ష్మణుల వర్షాకాలమంతా పడరాని బాధలు పడి, దుఃఖంతో ఎలాగోలాగ గడిపేశాక, ఆకాశంలో మేఘాలన్నీ పోయి నిర్మలంగా చంద్రుడు ప్రకాశించటం చూసి శరత్కాలం వచ్చిందని గ్రహించాడు. రాముడికి చాలా ఆనందం కలిగింది. సుగ్రీవుడు వచ్చి తనకి సాయం చెయ్యటానికి ప్రయత్నం చేస్తాడని ఎంతో ఆశగా ఎదురుచూశాడు. కాని శరత్కాలం కూడా గడిచిపోతోంది కాని సుగ్రీవుని జాడలేదు. రాముడికి సీతని చూడాలనే తపన ఎక్కువైంది. గుహలోపల్నించి బయటికి వచ్చి పిచ్చివాడిలా అటుఇటు తిరుగుతూ అనేక విధాలుగా పరితపించసాగాడు.

అపుడు లక్ష్మణుడు అడవిలోనికి వెళ్ళి చెట్టుచెట్టు తిరిగి ఆహారం కోసం పండ్లు కోసుకుని తిరిగివస్తున్నాడు. గుహముందర పిచ్చివాడిలా అటు ఇటు పచార్లు చేస్తున్న రాముణ్ణి చూశాడు.

రాముణ్ణి ఆ స్థితిలో చూసి, ఆవేదనతో 'అన్నయ్యా ఏమిటీ పిచ్చితనం? కామవశుడవై ఇలా కుమిలిపోతూ, నీ పౌరుషాన్ని నువ్వే కించపరచుకుంటున్నావా? ఎందుకిలా దుఃఖంలో మునిగివుంటావు? సుగ్రీవుని అండదండ మనకి వుండనే వుంది కదా. మీ ధర్మపత్ని అయిన సీతని పరపురుషుడెవరూ తాకలేడు. ఆమె నిప్పులాంటిది. కనుక వదిన విషయంలో నువ్వు నిశ్చింతంగా వుండవచ్చు' అని ధైర్యం చెప్పాడు. కాని రాముడి విరాగిలా నవ్వి, 'లక్ష్మణా చూశావా శరదృతువు వచ్చి కూడా చాలా రోజులైంది. కాని సుగ్రీవుడొక్కసారైనా ఇటు వచ్చాడా? వర్షాకాలం నాలుగు నెలలూ నూరు సంవత్సరాల్లా గడిచాయి. ఒక వంక రాజ్యం పోయింది. నా ప్రాణసఖి దూరమైంది. నేనింతటి దుఃఖంలో వుంటే సుగ్రీవుడు మాత్రం స్వర్గసుఖాలనుభవిస్తున్నాడు. సీతని వెతికించి తెప్పిస్తానని నాకు వాగ్దానం చేశాడు కదా. ఇపుడు దుర్బుద్ధి అయి ఆ మాట తలపెట్టడం లేదు. వానరుడు కదా మూర్ఖుడు. తుచ్ఛమైన కామభోగాల్లో మునిగిపోయాడు. సౌమిత్రీ, ఇంక ఉపేక్షించి లాభం లేదు. నువ్వు వెంటనే కిష్కింధకి వెళ్ళి నా మాటలుగా సుగ్రీవునితో ఇలా చెప్పు.

'సుగ్రీవా నేను నీ సహాయం కోరివచ్చి, అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నాను. నువ్వు నన్నుకోరిన ఉపకారం నీకు చేశాను. దానికి ప్రత్యుపకారంగా నాకు నా

భార్యని వెతికించి ఆమె జాడతెలుసుకుని చెప్తానని, ఆమెని తెచ్చి నా కప్పగిస్తాననీ వాగ్దానం చేశావు. కాని అలా వాగ్దానం చేసి మర్చిపోయినవాడు నీచుడనిపించు కుంటాడు. అటువంటి అధమాధముడి మాంసం క్రూరమృగాలు కూడా ముట్టవు. నేను ధనస్సులో బాణం ఎక్కుపెట్టి నీపైకి గురిపెట్టడము చూడాలని నీకు సరదాగా వుందా? నా బాణం రుచి తెలిస్తే నీకా ముచ్చట కలగదు. వాలిని చంపిన దారి ఇంకా మూతపడలేదు.

సుగ్రీవా నువ్వు నీ మాట నిలబెట్టుకోకపోతే, నిన్ను కూడా ఆ మార్గంలోనే పంపిస్తాను. ఒకే ఒక్క బాణంతో నిన్ను బంధుసమేతంగా హతమారుస్తాను. సత్యధర్మాలను కాపాడటమే నా విధి. వాలిని నీ మాటమీద చంపాననుకుంటున్నావా? ధర్మాన్ని అతిక్రమించాడని వాలిని సంహరించాను. ఇపుడు ఆడినమాట తప్పితే నీకూ అదేగతి పడ్తుంది' అని నామాటగా సుగ్రీవునికి చెప్పు. నీకింకా ఏమైనా చెప్పాలనిపిస్తే చెప్పు. చివరిసారిగా ఇంకోమాట చెప్పు.

'వానరరాజా నాకిచ్చినమాట నిలబెట్టుకో. ధర్మము నాచరించు. ఈ విషయంలో ఎలా చేస్తే సబబుగా వుంటుందో ఆలోచించు' అని చెప్పు అంటూ ఆవేశంగా రాముడు మాట్లాడటం విని, లక్ష్మణుడికి సుగ్రీవునిపై చెప్పరాని కోపం వచ్చింది.

'అన్నయ్యా, సుగ్రీవుడు వానరుడు. అందుకే మిత్రధర్మం పాటించటం లేదు. ఆరోజు తనకి కలిగిన కష్టం తొలిగించుకోడానికి అగ్నిసాక్షిగా మనతో మైత్రి చేసుకున్నాడు. తాను కోరుకున్నది సాధించాడు. రాజ్యమదంతో అంతా మర్చిపోయాడు. నేనింక ఓర్చుకోలేను. ఆడినమాట నిలబెట్టుకోలేని ఆధూర్తుణ్ణి ఇప్పుడే వధిస్తాను' అంటు ఆవేశంగా లేచి, ధనస్సు ధరించి, కిష్కింధకి బయల్దేరాడు, లక్ష్మణుడు.

కాని రాముడు జరగబోయే అనర్ధం గ్రహించి, లక్ష్మణున్ని శాంతపరుస్తూ మృదువుగా,

'లక్ష్మణా నీలాంటి బుద్ధిమంతులు, మిత్రద్రోహిని వధించి, పాపం కట్టుకోరు. సుగ్రీవుడు మన మిత్రుడు. కనక ముందుగా హెచ్చరించి, కర్తవ్యం బోధించాలి. నువ్వు సుగ్రీవునితో ముందుగా సౌమ్యంగా వ్యవహరించు. వివేకం గలవాడు కనుక నీ మాటల్లో అర్ధం తెలుసుకుంటాడు' అని బుజ్జగించాడు. లక్ష్మణుడు సరే అని కిష్కింధకి బయల్దేరాడు. ఇంద్రధనస్సు లాంటి తన ధనస్సు ధరించి, ప్రళయకాల మృత్యువులా వెళ్తున్నాడు. అక్కడ సుగ్రీవునితో ఎలా మాట్లాడాలా

అని ఆలోచిస్తున్నాడు. మత్తగజంలా కదిలి వస్తున్న లక్ష్మణుడ్ని కిష్కింధ చుట్టు కాపలాకాస్తున్న రక్షకులైన వానరులు చూశారు. ఎవరో శత్రువుతమ రాజ్యం మీదికి వస్తున్నాడని అనుకున్నారు. పెద్దపెద్ద కొండరాళ్ళు, వృక్షాలు పట్టుకుని లక్ష్మణునిమీదికి దాడిచేశారు. లక్ష్మణుని కోపం రెట్టింపైంది. ప్రజ్వరిల్లుతున్న అగ్నిలా వారిని తరిమికొట్టాడు. వారంతా భయంతో పారిపోయారు అలా పారిపోయి సుగ్రీవుని భవనానికి వెళ్ళి పరిస్థితి అంతా వివరించారు. ఆ సమయంలో సుగ్రీవుడు తారతో ఏకాంతంగా భోగలాలసుడై వున్నాడు. వానరులు చెప్పినమాటలు వినిపించుకోలేదు. అప్పుడు ముఖ్యమంత్రులు కొందరు బలమైన వానర వీరుల్ని లక్ష్మణునిపైకి పంపారు. ఆ వానరవీరులంతా లక్ష్మణుణ్ణి ముందుకు రానివ్వకుండా అడ్డగించారు. లక్ష్మణుడి కోపం కట్టలు త్రెంచుకుంది. అన్నగారి మాటలు గుర్తుకువచ్చి తనని తాను నిగ్రహించుకున్నాడు. కోపంతో బుసలు కొడుతూనిలబడ్డాడు. ఈ వ్యవహారమంతా యువరాజైన అంగదుడు చూశాడు. పరిగెత్తుకుంటూ వెళ్ళి లక్ష్మణునికి ఎదురువెళ్ళాడు. లక్ష్మణుడు అంగదుడ్ని చూసి కళ్ళలో నిప్పులు కురిపించాడు. దగ్గరగా వచ్చిన అంగదుడ్ని చూసి మండిపడ్తూ,

'నాయనా - అంగదా, నువ్వు వెంటనే వెళ్ళి నేను వచ్చానని మీ చిన్నాయనతో చెప్పు. శత్రుశాసనుడు, మహావీరుడు అయిన రామానుజుడు, లక్ష్మణుడు, శ్రీరాముని కోపము చూసి ఓర్వలేక, వచ్చి నగరద్వారము దగ్గర నిల్చివున్నాడని చెప్పు. నా మాటలు యథాతథంగా చెప్పి అతడు ఒంట బట్టించుకున్నాడో లేదో వచ్చి నాకు చెప్పు. నీ సమాధానం కోసం ఎదురుచూస్తూ వుంటాను. తొందరగా రా' అన్నాడు.

లక్ష్మణుడు చెప్పిన మాటలు విని అంగదుడు చాలా దిగులుపడ్డాడు. తొట్రుపాటుతో పరుగు పరుగున సుగ్రీవుని దగ్గరకి వెళ్ళాడు. పాదాలమీదపడి సాష్టాంగ నమస్కారం చేశాడు. సుగ్రీవుడు బాగా త్రాగి, ఒళ్ళు తెలియనిస్థితిలో వున్నాడు.

అక్కడ లక్ష్మణుడు ఒళ్ళుతెలియని ఆవేశంతో ఊగిపోతున్నాడు. కొంత మంది వానరులు కిలకిలారావాల్తో అతడ్ని ప్రసన్నుణ్ణి చేస్కోవాలని చూస్తున్నారు. కాని లక్ష్మణుడు అగ్గిమీద గుగ్గిలంలా వున్నాడు. దాంతో ఆ వానరులంతా పెద్దపెట్టున సింహనాదం చేశారు. ఆ శబ్దం కిష్కింధలో వున్న సుగ్రీవుని చెవులలో పడింది. ఒక్కసారి మత్తుదిగిపోయి తెలివివచ్చింది.

అదనుచూసి అంగదుడు సుగ్రీవునికి లక్ష్మణుని సందేశం వినిపించాడు.

సుగ్రీవుడు గాబరాపడి లేచి కూర్చున్నాడు. అంగదునివెంట ప్లక్షుడు, ప్రభావుడు అనే ఇద్దరు మంత్రులు కూడా వచ్చారు. వారు సుగ్రీవునికి జరిగినది వివరించి చెప్పారు. 'మహారాజా నువ్వు లక్ష్మణుని గౌరవించి, రాముని సందేశం విను. లక్ష్మణుడు కోపంతో మండిపోతున్నాడు. మనందర్నీ దహించేలా వున్నాడు. నువ్వతనిని శాంతపరచు. రామునికిచ్చిన వాగ్దానం నెరవేర్చు' అని మంత్రులు సుగ్రీవునికి నివేదించారు.

లక్ష్మణుడుకోపంతో వున్నాడని తెలియగానే సుగ్రీవుడు తృళ్ళిపడి లేచాడు. మంత్రుల్ని గౌరవించి, 'మీరు సర్వం తెలిసినవారు. నేనెపుడైనా రామలక్ష్మణుల విషయంలో పొరపాటుగా మాట్లాడానా? తప్పుగా ప్రవర్తించానా? లక్ష్మణునికి నా మీద కోపం ఎందుకు వచ్చింది? నామీద శత్రువులెవరో ఉన్నవి లేనివి కల్పించి చెప్పివుంటారు. మీరు అసలు కారణం తెలుసుకోండి. అకారణంగా నామిత్రుడు నాపై ఆగ్రహించాడని, నాకు తత్తరబాటు కల్గుతోంది. నాకు రామునితో ఏర్పడ్డ మైత్రి ఎక్కడ చెడిపోతుందోనని చాలాభయంగా వుంది. ఇంక రాముడు నన్నెప్పటికీ నమ్మడు. నాకింకా ఆ మహాత్మునికి ప్రత్యుపకారం చెయ్యగల అవకాశమే వుండదు' అంటూ అనేకవిధాల పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు అప్పుడు కుశాగ్ర బుద్ధియైన హనుమంతుడు, తన పరిజ్ఞానంతో పరిస్థితి నర్థంచేసుకుని, సుగ్రీవునితో ఇలా అన్నాడు.

'వానరరాజా, రాముడు నీమీద ప్రేమతో నీకుచేసిన మహోపకారం నువ్వు మర్చిపోవడంలో, ఆశ్చర్యంలేదు. ఎందుకంటే రాముడు మహావీరుడైన వాలిని చంపింది నీ మీద ప్రేమతోనే కదా. అంతటి ప్రేమే నీకీ మరుపు కలిగించింది. నీ కర్తవ్యం గుర్తుచెయ్యడానికి రాముడు తన తమ్ముణ్ణి పంపివుంటాడు.

నువ్వు భోగలాలసుడివై ఒళ్ళుమరచివున్నావు. ఎంతకాలం గడిచిందో నీకు తెలియడం లేదు. నీకు తెలియకుండానే నాలుగు నెలలు గడిచాయి. శరత్కాలం వచ్చింది. నువ్వు రాముని కిచ్చిన వాగ్దానం ప్రకారం, మనం ప్రయత్నం ప్రారంభించే సమయం వచ్చింది. అయినా నువ్వా సంగతి గుర్తుంచుకోలేదని తెలియ జెయ్యడానికే లక్ష్మణుని పంపించి వుంటాడు. సుగ్రీవా, రాముడు మహాత్ముడు. భార్యని ఎడబాసి దుఃఖంలో వున్నాడు. అందుకని కాస్త పరుషంగా మాట్లాడి వుంటాడు.

దానిని నువ్వు అర్థంచేసుకుని కాస్త ఓరిమిగా వ్యవహరించాలి. నీవల్ల తప్పు జరిగింది. మహాత్ముని ప్రసన్నం చేసుకోవాలంటే అంజలి ఘటించి ప్రార్థించడం

తప్ప వేరేమార్గం లేదు.

రాముని విషయంలో నీ తప్పు సరిదిద్దుకోవాలంటే, లక్ష్మణునికి దోసిలి ఒగ్గి అనుగ్రహించమని ప్రార్థించు. అతడు నిన్ను క్షమిస్తే రాముడు కూడా నిన్ను క్షమిస్తాడు. నేనిలా చొరవతీసుకుని చెప్తున్నానని ఇంకోలా అనుకోకు.

రాముడు విల్లు ఎక్కుపెడితే ఆ కోపానికి దేవతలు, అసురులు, గంధర్వులు మాత్రమేగాక లోకాలన్నీ కూడా పాదాక్రాంతమవుతాయి. కనుక రామునికి కోపం తెప్పించడం నీకు మంచిది కాదు. ఆయనకు కృతజ్ఞుడవై వుండడమే మేలు' అంటూ, ఎన్నివిధాలో నచ్చచెప్పాడు. ఇలా సుగ్రీవుని అంతఃపురంలో చర్చలు కొనసాగుతుండగానే, లక్ష్మణుడు పొలిమేరలు దాటి కిష్కింధానగరంలో సుగ్రీవుడు నివాసముంటున్న గుహలో ప్రవేశించాడు. దారిపొడుగునా మహాకాయులైన వానరులు నిలబడివున్నారు. వాళ్ళంతా లక్ష్మణుడ్ని చూసి చేతులు జోడించారు. లక్ష్మణుడు కోపంతో ఊగిపోతూ నడుస్తున్నాడు. ఆ భీకరరూపం చూసి వానరులంతా దూరంగా తొలగిపోతున్నారు.

ఆ గుహలోపల కూడా అంతటా పూలతోటలున్నాయి. ఎటుచూసినా అంగళ్ళు పరచి రత్నాలు అమ్ముతున్నారు. పెద్ద పెద్ద ప్రాసాదాలు, దేవేంద్రనగరాన్ని తలదన్ని వున్నాయి. కామరూపధారులైన వానరులు దివ్యమాలికలు, దివ్యవస్త్రాలు ధరించి వున్నారు. వారంతా దేవతల అంశలతో జన్మించినవారే. చందనము, అగరు మొదలైన సుగంధద్రవ్యాలు అన్నివేపులా పరిమళాలు వెదజల్లుతున్నాయి. లక్ష్మణుడా పరిసరాలన్ని పరిశీలిస్తూ, నడుస్తున్నాడు.అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, గవయుడు, గవాక్షుడు, శరభుడు, విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్షుడు, హనుమంతుడు, వీరబాహువు, సుబాహువు, నళిని, కుముదుడు, సుషేణుడు, తారుడు, జాంబవంతుడు, దధివక్త్రుడు, నీలుడు, సుపాటలుడు, సునేత్రుడు, మొదలైన వానరముఖ్యుల నివాసగృహాలన్నీ చూశాడు లక్ష్మణుడు. అవన్నీ అత్యద్భుతంగా నిర్మించిబడివున్నాయి. అలా వెళ్ళగా వెళ్ళగా సుగ్రీవుని భవంతికనిపించింది. దానికన్నివైపులా బలవంతులైన వానరవీరులు ఖడ్గములు, గదలు ధరించి, రక్షకభటులుగా నిలబడివున్నారు. వారంతా లక్ష్మణునిచూసి వినయంగా నిలబడ్డారు. అది అంగదుని ఆజ్ఞ. నిరాటంకంగా లక్ష్మణుడు భవనంలో ప్రవేశించాడు. అది ఏడు కక్షలు దాటాక, లోపల బలమైన వానరవీరుల రక్షణలో వున్న అంతఃపురం. ఆ అంతఃపురంలో బంగారం, వెండి పాన్పులు అమర్చబడి వున్నాయి. మెత్తటి ఆసనాలెన్నో వున్నాయి. లోపలనుంచి వీణావేణు

మృదంగవాద్యాల మధురధ్వనులు వినవస్తున్నాయి. వాటితోబాటు కమ్మని గానాలు వినిపిస్తున్నాయి. కొంచెం ముందుకి వెళ్ళేసరికి కాలి అందెల సవ్వడి, మొలనూలు గజ్జలచప్పుడు వినిపించాయి.

'లోపల అంతఃపుర స్త్రీలు వుండి వుండవచ్చు. ఇంకలోపలికి వెళ్తే బాగుండదేమో' అని సిగ్గుపడి అక్కడే ఆగాడు. సుగ్రీవుడు మైమరచి అంతఃపురస్త్రీలతో కులుకుతున్నాడని గ్రహించాడు. చెప్పరాని రోషం వచ్చింది. భీకరంగా నారీ నినాదం చేశాడు. ఆ వింటి నారి ధ్వనితో దిక్కులు పిక్కటిల్లాయి. ఆ ధ్వని సుగ్రీవునికి వినవచ్చింది. ఒక్కసారి వులిక్కిపడి, లక్ష్మణుడు వచ్చాడని గ్రహించాడు. నాలుక తడియారిపోయింది. భయంతో తొట్రుపాటు పడుతూ, తారని పిల్చి ఇలా అన్నాడు.

'సుందరీ, లక్ష్మణుడు చాలా సున్నితమైన మనస్సు గలవాడు. కాని ఆ వింటినారి ధ్వని వింటుంటే చాలా కోపంగా వున్నాడనిపిస్తోంది. అయితే అంత కోపం రావటానికి గల కారణమేమిటో తెలియటం లేదు. ఉత్తమోత్తముడైన ఆ రాజకుమారునికి అనవసరంగా కోపం రాదు. కాని వారిపట్ల నేనుచేసిన అపరాధమేమిటో నాకు తెలియటం లేదు. నువ్వే బాగా ఆలోచించి, ఆ కారణమేమిటో తెలుసుకో. నువ్విపుడు లక్ష్మణునికి ఎదురెళ్ళి అతణ్ని సాదరంగా ఆహ్వానించు. మంచిమాటలతో అతణ్ని ప్రసన్నం చేసుకో. ఆతడికి కోపం చల్లారాక నేను వచ్చి మాట్లాడతాను. ఎందుకంటే మహాత్ములైనవారు స్త్రీలపట్ల కోపం ప్రదర్శించరు' అంటూ ఆమెని బ్రతిమాలి లక్ష్మణుడితో మాట్లాడటానికి పంపించాడు.

అపుడు తార బాగా మద్యం సేవించి సుగ్రీవుడితో భోగిస్తూ, మత్తెక్కి కనురెప్పలు వాలిపోతూ, ఒళ్ళు తెలియని పరిస్థితిలో వుంది. అయినా సుగ్రీవుని ఆజ్ఞ మన్నించి బయల్దేరింది.

తార చాలా అందమైనది. మత్తువల్ల అడుగులు తడబడుతూ వయ్యారంగా నడిచివెళ్ళింది. తొందర తొందరగా నడవటం వల్ల ఆమె మొలనూలు పట్టువస్త్రము కిందికి జారాయి. అలాగే లక్ష్మణుని దగ్గరకి వెళ్ళింది. ఆ పరిస్థితిలో వున్న తారని లక్ష్మణుడు చూశాడు. అయినా అవేం పట్టించుకునే స్థితిలో లేడు. స్త్రీ అనే గౌరవభావంతో నారీధ్వని ఆపేశాడు. కోపం నిగ్రహించుకున్నాడు. ధర్మాత్ముడు కనుక ఆమెని చూసి తలదించుకున్నాడు.

ఆమె మద్యం తాగిన మత్తులో సిగ్గుమర్చిపోయి, చనువుగా లక్ష్మణునితో

ఇలా అంది. 'రాకుమారా, మీ కోపానికి కారణం ఏమిటి? మీ శాసనము నెవరైనా ఉల్లంఘించారా? నిస్సంకోచంగా చెప్పు' అని మృదువుగా అడిగింది.

ఆమె మాటలు విన్న లక్ష్మణుడు తడబడ్డాడు. కొద్దిగా గొంతు సవరించుకుని, 'అమ్మా, సుగ్రీవుడు భోగలాలసుడై కామార్థాలు మర్చిపోయాడు. తన ప్రభువైన శ్రీరామునికి సహాయం చెయ్యాలని తెలిసికూడా ఇలా కామభోగాలలో మునిగి తేలటం తగదని మీకు తెలియదా?

తారా అతడు రాజ్యకార్యాలు కూడా విస్మరించాడు. శోకాకుల చిత్తులమైన మా అన్నదమ్ముల్ని మర్చిపోయాడు. నాలుగు నెలల వ్యవధి తర్వాత మా కార్యం చక్కబెట్టుతానని వాగ్దానం చేసి కూడా మర్చిపోయి, ఆ నాలుగునెలలూ అయ్యాక కూడా ఇలా సుఖాలలో మునిగివుండటం ఉచితమేనా? ఈ అవినీతిపరుడైన సుగ్రీవుని విషయంలో మమ్మల్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు' అన్నాడు లక్ష్మణుడు కోపంగా.

లక్ష్మణుని మాటలు విన్నాక తారకి సుగ్రీవుని తప్పేమిటో తెలిసింది. అప్పుడు లక్ష్మణుడ్ని శాంతపరచాలని, 'రాజకుమారా, కోపగించుకోవడానికిది సమయం కాదు. సుగ్రీవుడు కామార్తుడు. అందుకే ఒళ్ళు తెలియక తప్పుచేశాడు. అంతేకాని మీపట్ల అవిధేయుడై మాత్రంకాదు. అతడు మీవాడు. అతనిపై కోపం తెచ్చుకోవడం మీలాంటి ఉత్తములకి తగునా? కొద్దిగా పరాకుపడ్డాడు. కాని ఓర్చుకోవాలి. మీవంటి ధీరులు, బలహీనులపై కోపం తెచ్చుకోకూడదు. మీరు సుగ్రీవునికి చేసిన ఉపకారం నాకు తెలుసు.

కాని ఇన్నాళ్ళూ సుఖాలకి దూరంగా వున్న సుగ్రీవుడు, ఇప్పుడు రాజ్యభోగాలు లభించేసరికి, ఉద్రేకంతో కామాసక్తుడై వున్నాడు. ఇది అతడి బలహీనత మాత్రమే. ఎంతో శాంతచిత్తుడవైన నువ్వు కోపానికి లొంగావు. అలాగే సుగ్రీవుడు కామానికి లొంగాడు. కనుక నువ్వు సుగ్రీవుని అపచారం మన్నించు' అంటూ ఎంతో నేర్పుగా మాట్లాడింది తార. అక్కడితో లక్ష్మణుడి కోపం పూర్తిగా తగ్గింది. లక్ష్మణుడు ప్రసన్నుడు కావడం చూసి తార మళ్ళీ ఇలా అంది.

'లక్ష్మణా మీ పట్ల సుగ్రీవుడు పరాకుగా వున్నాడనుకుంటున్నావు కదూ. కాని ఇప్పటికే సుగ్రీవుడు సీతాన్వేషణ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. మహాపరాక్రమము కలిగిన కామరూపులైన వానరులను రప్పించటానికి, సుగ్రీవుడు ఏర్పాట్లు చేశాడు. ఇప్పటికే అనేక పర్వత ప్రాంతాలనించి, వేలకొలది వానరవీరులు వచ్చారు. మహాబాహూ, ఏకాంత సమయంలో అంతఃపురంలోకి రాకూడదనే

ధర్మాన్ని పాటించావు. ఇపుడు నేను రమ్మంటున్నాను. లోపలకిరా. మిత్రుని మందిరంలోకి రావడంలో తప్పులేదు రా' అంటు, సాదరంగా లోనికి ఆహ్వానించింది. లక్ష్మణుడు తార వెంట లోపలికి వెళ్ళాడు.

లోపల సుగ్రీవుడు రత్నకంబళిపరచిన ఆసనంపై కూర్చుని వున్నాడు. ఖరీదైన పట్టుబట్టలు ధరించాడు. ఖరీదైన పట్టుబట్టలు, రత్నాభరణాలు ధరించిన స్త్రీలు కొంతమంది, అతనిచుట్టూవున్నారు. సుగ్రీవుని కళ్ళు ఎఱ్ఱగా వున్నాయి. రుమని గట్టిగా కౌగలించుకుని దగ్గర కూర్చోబెట్టుకుని వున్నాడు. ఆ స్థితిలో వుండగా లక్ష్మణుడు లోపలికి రావడం చూసి, సుగ్రీవుడు అదిరిపడ్డాడు.

లక్ష్మణుడు కోపంతో మండిపడ్తున్నాడు. ఆవేశంతో ఊగిపోతున్నాడు. ఆ స్థితిలో లక్ష్మణుణ్ణి చూసి సుగ్రీవుడు కోపంతో ఏం చేస్తాడో అని ఒణికిపోయాడు. తృళ్ళిపడి ఆసనం నించి దిగి కింద నిలబడ్డాడు. అతడి స్త్రీలు కూడా దూరంగా జరిగారు. చేతులు జోడించి నిలబడ్డాడు సుగ్రీవుడు.

లక్ష్మణుడు ఈసడింపుగా సుగ్రీవుని చూస్తూ 'సుగ్రీవా, నువ్వు అధర్మవర్తనుడివై, శ్రీరామునివల్ల ఉపకారం పొంది కూడా మళ్ళీ అతడికి సహాయం చేస్తానన్న వాగ్దానం మర్చిపోయి కృతఘ్నుడవై నీ స్త్రీలతో కులుకుతున్నావు. మిత్రునికిచ్చిన మాట తప్పినవాడు, తనవారిని చంపుకున్న పాపానికిపోతారు. పూర్వం బ్రహ్మస్వయంగా చెప్పిన శ్లోకం ఒకటి చెప్తాను విను.

'బ్రహ్మఘ్నేచ, సురాపేచ, చోరే, భగ్నవ్రతే, తథా,
నిష్కృతిర్విహితా సద్భిః, కృతఘ్నే నాస్తి నిష్కృతిః'

అంటే అర్థం బ్రహ్మహత్యచేసిన వానికి, సురాపానము చేసినవానికి, దొంగతనము చేసినవానికి, ఏదైనా వ్రతం ఆరంభించి, మధ్యలో మానేసినవానికి, ప్రాయశ్చిత్తకర్మ వుంది. కాని చేసిన మేలు మరచినవానికి, కృతఘ్నునికి ప్రాయశ్చిత్తం లేదు అని. వానరా, నువ్వు ధర్మము తప్పిన అనార్యుడివి. కృతఘ్నుడివి. అసత్యవాదివి. రామునిచేత నీపనిచేయించుకుని, ప్రత్యుపకారం చెయ్యకుండా ద్రోహము చేస్తున్నావు. ఆడినమాట తప్పి, తుచ్ఛమైన భోగాలతో కాలయాపన చేస్తున్నావు. దుష్టసర్పము కప్పలా అరుస్తుంటే, నిజంగా కప్పేనేమో, అని మోసపోయినట్లు రాముడు నిన్ను చూసి మోసపోయాడు. రాముడు మహాత్ముడు. నువ్వు దుర్మార్గుడివి. కరుణామూర్తియైన రాఘవుడు, నీకు వానరరాజ్యం ఇచ్చాడు.

కాని నువ్వాయన చేసిన మేలు మర్చిపోయావు. నీ కృతఘ్నతకి, శిక్షగా రాముడు, తనవాడియైన బాణంతో, నిన్నిప్పుడే వాలి దగ్గరకి పంపగలడు. రాముడు తన మాటగా నీతో ఇలా చెప్పమన్నాడు. 'సుగ్రీవా, అధర్మవర్తనుడైన వాలి, ఏ మార్గాన పయనించాడో, ఆ మార్గం ఇంకా మూతపడలేదు. నువ్వు ఆడినమాటకి కట్టుబడి న్యాయంగా ప్రవర్తించు. లేకపోతే నువ్వూ ఆ దారిలోనే ప్రయాణం చెయ్యవలసి వుంటుంది' అని మా అన్నయ్య చెప్పమన్నాడు. మా అన్నయ్య ప్రయోగించిన బాణాలు రుచి నువ్వెరుగవు. అవి వజ్రములతో సమానమైనవి. రామకార్యం పూర్తిగా విస్మరించి భోగాలు అనుభవిస్తున్నావు. జాగర్త. ఆడినమాటకి కట్టుబడి రాముని అనుగ్రహం పొందు' అంటూ సూటిగా చెప్పాడు లక్ష్మణుడు. కోపంతో జ్వలించిపోతున్న లక్ష్మణుని మాటలు వింది తార. లక్ష్మణున్ని శాంతింపచేస్తూ చల్లనిమాటలతో ఇలా అంది.

'నాయనా సౌమిత్రీ, సుగ్రీవుని గురించి నువ్వింత పరుషంగా మాట్లాడడం ఉచితం కాదు. సుగ్రీవుడు వానరరాజు. నువ్వు పురుషోత్తముడివి. సుగ్రీవుడు తన సహజస్వభావం చేత చపలచిత్తుడైతే కావచ్చును కాని కృతఘ్నుడు మాత్రం కాదు. రాముచే చేసిన ఉపకారాన్నతడు మరవలేదు. రామునిపట్ల ద్రోహచింతన కూడా అతడికి లేదు. ధర్మజ్ఞా సుగ్రీవుని తరపున మన్నించవలసినదిగా నేను ప్రార్థిస్తున్నాను.

సుగ్రీవునికి రామునిపట్ల వున్న భక్తి చాలా గొప్పది. అవసరమైతే రాముని కోసం రుమనీ చివరికి వానరరాజ్యాన్ని కూడా వదిలేందుకు సిద్ధంగా వున్నాడు. అతడు తప్పక రావణుని సంహరించి, సీతని రాముని వద్దకు చేర్చగలడు. లంకలో పదివేలకోట్ల రాక్షసులున్నారనీ, వారంతా అమిత బలవంతులనీ విన్నాను. రావణుని సైన్యం ముప్పైఆరుకోట్లు. వారంతా అసహాయశూరులు. కామరూపులు. వారందర్నీ చంపిన తర్వాతగాని, రావణుని చంపటం సాధ్యంకాదు.

ఏ సహాయం లేకుండా తొందరపడి లంకకి వెళ్తే, క్రూరాత్ముడైన రావణుడేం చేస్తాడో చెప్పలేం. అందుకే తగిన ఏర్పాట్లు చేసుకుని వెళ్ళాలి. ఈ సంగతులన్నీ నాకు వాలి చెప్పాడు. అందుకు తగిన సేనని సమీకరించటం కోసం ఈ భూమిమీద వుండే వానరులందర్నీ రమ్మని సుగ్రీవుడు కబురుచేశాడు. వారంతా వచ్చాక ప్రయత్నాలు మొదలుపెట్టాలని నిరీక్షిస్తున్నాడు. లక్ష్మణా, మహాబలుశాలురైన వానరులు లేనిదే కార్యం సిద్ధించదు. అందుకే ఇంతకిముందే సుగ్రీవుడు పదిహేను దినాలలోపుల, భూమిమీద వానరులంతా, పరివార

సమేతంగా తరలి తనదగ్గరకి రావాలని, అలా రాకపోతే శిరచ్ఛేధము తప్పదనీ, వానరులందరికీ వర్తమానం పంపాడు.

ఒక వ్యూహం ప్రకారం రామకార్యం మొదలుపెట్టాలని సుగ్రీవుడు యోచిస్తున్నాడు.

ఇప్పటికే వేలకివేలు, కోట్లసంఖ్యలో గోలాంగూలములు, ఎలుగుబంట్లు, మొదలైన వానరజాతులన్నీ మీ సేవకి కదలిగుంపులు గుంపులుగా తరలివచ్చారు. కనక లక్ష్మణా కోపంవీడు. శాంతించు' అంటు అనేకవిధాల అనునయించింది మహా విదుషీమణి తార. ఆమాటలు విన్నాక లక్ష్మణుడు ప్రసన్నుడయ్యాడు. సుగ్రీవుడి మనసు కుదుటపడింది. సంతోషం పట్టలేక మెడలోని ముత్యాలహారం తెంపిపడేశాడు. మత్తంతా దిగిపోయింది. మెల్లిగా లేచి నడుస్తు లక్ష్మణుడి దగ్గరకి వచ్చాడు. వినయంగా మోకరిల్లి 'లక్ష్మణా వాలివల్ల నేను పోగొట్టుకున్న ఐశ్వర్యము, కీర్తి, రాజ్యము అన్నీ నాకు రామునివల్లే లభించాయి. రాముడు గొప్పవీరుడు. అంతటటి మహానుభావునికి నేను సాయం చెయ్యటం హాస్యాస్పదం. ఆ మహావీరునికి తోడుగా మాత్రం వుండగలవాడిని.

ఆయన తన పరాక్రమంతో రావణుడ్ని చంపుతాడు. ఆయనకసాధ్యమైనది వుందా? రాముడు ధనస్సు నెక్కుపెట్టి ఒక్కసారి ధనుష్టంకారం చేస్తే ఆ శబ్దానికి పర్వతాలతో సహా భూమి అంతా, గడ గడ ఒణుకుతుంది. అంతటి అసహాయశూరునికి సాయం చెయ్యగల శక్తినాకులేదు. ఆయనకి ఆశ్రిత వాత్సల్యం మీద వున్న నమ్మకం వలన, చనువుకొద్దీ, నేను కాలాన్నతిక్రమించి, తప్పుచేశాను. దాసుడ్ని నన్ను క్షమించండి' అంటూ లక్ష్మణుని పాదాలమీద వాలిపోయాడు. సుగ్రీవుని వినయానికి లక్ష్మణుడు పొంగిపోయాడు.

పట్టరాని సంతోషంతో ఇలా అన్నాడు. 'వానరరాజా సుగ్రీవా, నా సోదరుడైన రాముడు, నీతో చెలిమిచేసి కృతర్ధుడైయ్యాడు. సమర్ధుడవు, వినయసంపన్నుడవు అయిన, నువ్వు తోడుండంవల్ల రాముడు సనాధుడైయ్యాడు. నిష్కల్మషమైన నీ నిజాయితీ చాలా గొప్పది. ఈ రాజ్యలక్ష్మిని సంపూర్ణంగా అనుభవించగల యోగ్యుడివి నువ్వే. నీ అంతటివాడు తోడువుంటే, మహావీరుడైన మా రాముడు తొందరలోనే శత్రువుని జయించగలడు. అందులో సందేహం లేదు. నువ్వు ధర్మజ్ఞుడివి, కృతజ్ఞుడివి. కనుకనే నీ తప్పులన్నీ ఒప్పుకున్నావు. దైవానుగ్రహం వల్ల మా రామునికి నీ తోడు దొరికింది. నువ్వు వెంటనే బయల్దేరి నాతో రా. వచ్చి శోకార్తుడైన రాముణ్ణి ఓదార్చు. సీతమ్మతోటి ఎడబాటువల్ల కృశించివున్నాడు.

రాముడు సహజంగా ఎప్పుడూ పరుషంగా మాట్లాడడు. అటువంటి రాముడే ఆగ్రహంతో నీ దగ్గరకి వెళ్ళమనేసరికి, విని సహించలేక నిన్ను దూషించాను. నీ మనస్సు నొప్పిస్తే క్షమించు' అన్నాడు.

లక్ష్మణుని మాటలు విన్న సుగ్రీవుడు సంతోషించాడు. పక్కనేవున్న హనుమంతునితో ఇలా అన్నాడు.

'హనుమా, మహేంద్రగిరి, వింధ్యాచలము, హిమవత్పర్వతము, కైలాసము, మందరగిరి, మొదలైన పర్వతాలమీద నివసిస్తున్న వానరులందర్నీ కూడా రప్పించండి. సముద్రానికావల వున్న పశ్చిమదిక్కులో వున్న వానరుల్ని కూడా తొందరగా రమ్మని కబురు చెయ్యండి. ఉదయాద్రి, అస్తాద్రిపై వుండే వానరుల్ని కూడా పిలిపించండి. వాళ్ళొకవేళ రావడానికి నిరాకరిస్తే దండించి మరీ తీసుకురండి. రాజాజ్ఞ ధిక్కరిస్తే మరణదండన తప్పదని చెప్పండి. ఇంకో పదిరోజులు గడువిస్తున్నాను. ఆలోగా అందర్నీ రప్పించండని' ఆజ్ఞాపించాడు.

హనుమంతుడు వెంటనే వెళ్ళి అన్నివైపులా వానరుల్ని పంపాడు. వారంతా ఆకాశమార్గం గుండా ఎగిరివెళ్ళారు. ఆ వానరులాయా ప్రాంతాలకి వెళ్ళి, వానరులను తొందరపెట్టి, కాటుకరంగులో నల్లగావున్న మూడుకోట్లమంది వానరుల్ని వెంటబెట్టుకువచ్చారు. అస్తాద్రి నించి బంగారం రంగులో వున్న పదికోట్ల వానరులు వచ్చారు. హిమవత్పర్వత ప్రాంతం నించి వెయ్యికోట్లమంది వచ్చారు. అంజనాద్రి నించీ ఇంకా క్షీరసాగర ప్రాంతంలోని తమాలవనం నించీ, లెక్కలేనంతమంది వానరులు వచ్చారు. వారంతా కేవలం నారికేళాలు మాత్రమే ఆహారంగా తింటారు.

ఎక్కడెక్కడి అడవులలోనించి, కొండలమీదనించి, పర్వతాలమీదినించీ, వానరులు తండోపతండాలుగా వచ్చారు. కైలాసగిరి నించి, సింహకేసర వర్ణం కలిగిన వానరులు వెయ్యికోట్లమంది వచ్చారు. ఇక్కడ ఒక వింత సంగతి జరిగింది.

హిమవత్పర్వత ప్రాంతానికి వానరులను వెంటబెట్టుకురావటానికి సుగ్రీవుడెవర్నైతే పంపాడో వారక్కడ ఒక అద్భుతమైన సంగతి తెలుసుకున్నారు. ఆ పర్వతం మీద పూర్వం మహేంద్రుని ప్రీతికోసం, ఒక యజ్ఞం జరిగింది. ఆ నాడు యజ్ఞంలో అందరూ తిన్న అన్నం, అక్కడ కొన్ని మెతుకులు జారిపడి, ఆ మెతుకులే మహావృక్షాల్లాగా, కందమూలాల్లాగ పెరిగాయి. ఆ వృక్షాలకి కాసిన పండ్లు చాలా తియ్యగానూ, దుంపమూలాలు చాలా రుచిగానూ వున్నాయి. అంతేకాదు వాటిని ఒకసారి ఎవరైనా తింటే, వారికి ఒక నెలరోజులవరకు

ఆకలివుండదు. ఆ సంగతి తెలుసుకున్న వానరులు, మొయ్యగలిగినన్ని ఆ దివ్యఫలములు, దుంపలు, ఓషధులు తవ్వితెచ్చారు. వాటితోపాటు సుగంధ పరిమళాలు వెదజల్లే మంచిపువ్వులు కూడా సుగ్రీవునికి కానుకగా ఇచ్చారు.

ఆవిధంగా తండోపతండాలుగా వచ్చిన వానరులంతా కిష్కింధ కిటకిటలాడిపోయింది. సుగ్రీవుని మంత్రులు ఆయనని దర్శించి, మొత్తం భూగోళంపై వుండే వానరులంతా వచ్చారని ఆయనతో చెప్పారు. ఆ మాటలకి సుగ్రీవుడు ఆనందించి, సంతృప్తిపొందాడు. వారంతా తెచ్చిన కానుకలు ఆనందంగా స్వీకరించాడు. వారికోసం ప్రత్యేకంగా నిర్మించిన స్థావరాలకి పంపాడు. మహావీరులు, అతిబలవంతులు అయిన ఆ వానరవీరుల్ని చూసి సీతాన్వేషణకి అవసరమైన సేన సమాయత్తమైనదని, రాముడు కృతార్థుడయ్యాడనీ, సుగ్రీవుడు భావించాడు. లక్ష్మణుడు కూడా అతిపెద్ద ప్రవాహంలా వున్న సేనని చూసి మహదానందం పొందాడు.

సుగ్రీవుడు అత్యంత వినయంతో లక్ష్మణుని ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అతడితో లక్ష్మణుడిలా అన్నాడు.

'సౌమ్యా - సుగ్రీవా నీకభ్యంతరం లేకపోతే మనం ఒకసారి రాముని దగ్గరకెళ్దాం'అని లక్ష్మణునేసరికి 'సరే పద' అని సుగ్రీవుడుఅతనివెంట బయల్దేరాడు. ఒకమంచి పల్లకి తెప్పించాడు. వారిద్దరూ అందులో ఎక్కారు. బలమైన వానరులా పల్లకీని భుజాలమీదికి ఎత్తుకున్నారు. కొందరు ఛత్రంపట్టగా మరికొందరు చామరులు వీచారు. శంఖాలు పూరించి, భేరీలు మ్రోగించారు. జయజయ ధ్వనాలు మారుమ్రోగాయి. వందలకొద్దీ వానరులు శస్త్రాలతో వెంటనడిచారు. అంతాకలిసి పెద్ద ఊరేగింపులా సాగి శ్రీరాముని దగ్గరకి నడిచారు. సుగ్రీవుడు లక్ష్మణుడు పల్లకిదిగారు. సుగ్రీవుడు రాముని దగ్గరకి వెళ్ళి చేతులు జోడించి నిలబడ్డాడు. వారందరివంకా రాముడు సాదరంగా చూశాడు. ఎదురుగా పెద్ద ప్రవాహంలా ఉన్న వానరసేన చేతులు జోడించి నిలబడివుంది. వారిపక్కనున్న లక్ష్మణుని వంక ప్రేమగాచూశాడు రాముడు.

సుగ్రీవుడు రాముని పాదాలమీద వ్రాలి సాష్టాంగ నమస్కారం చేశాడు. రాముడు సుగ్రీవుణ్ణి రెండుభుజాలు పట్టుకుని లేవదీసి ఆప్యాయంగా గుండెల కద్దుకుని ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. అతని కర్తవ్యాన్ని బోధిస్తూ ఇలా అన్నాడు.

'సుగ్రీవా రాజైనవాడు ధర్మార్థకామాల్ని ఏ సమయంలో ఏది అనుభవించాలో గుర్తెరిగి ప్రవర్తించాలి. అప్పుడే అతడు ఉత్తమమైన ఏలిక అవుతాడు.

ఉదయకాలంలో ధర్మం, మధ్యాహ్నకాలంలో అర్ధం, రాత్రి మాత్రం కామం అనుభవించాలి. శత్రువులపై ఏ సమయంలో దండెత్తి వెళ్ళాలో అప్పుడే వెళ్ళాలి. ఎదురించవలసిన సమయంలో ఎదిరించాలి. అంతేకాని అన్ని సమయాల్లోనూ కామాన్నే అనుభవిస్తూ, భోగాలకు పరవశుడై వుండే రాజు పాలకుడిగా స్థిరంగా నిలబడలేడు. ధర్మార్థాలను మర్చిపోయి, కామప్రవృత్తితో మాత్రం చరించేవాడు, చెట్టుచివరికొమ్మమీద నిదురించేవానితో సమానం. ఏక్షణంలోనైనా క్రిందపడవచ్చు. కనుక ఏలిక అయినవాడు శత్రువులను అంతమొందించాలి. ఇప్పుడు శత్రువులపై దండెత్తే సమయం వచ్చింది. కనుక నువ్వు నీ మంత్రులతో సమాలోచన చెయ్యి' అని రాముడు చెప్పగానే, సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు.

'రామా మహావీరా నీ అనుగ్రహం వల్లనే కదా నేను నా ఐశ్వర్యాన్ని, రాజ్యాన్ని, కీర్తిని శాశ్వతంగా పొందగలిగాను? నీకు ప్రత్యుపకారం చెయ్యకపోతే, నేను నిందలపాలైపోతాను. కోట్లకొద్దీ మహావీరులైన వానరులు నావెంటవచ్చారు. వీరంతా ప్రశస్తమైన వంశంలో పుట్టిన ఋక్షజాతివారూ, గోలాంగూల జాతివారు. అంతేకాదు. వీరంతా దేవతల, గంధర్వుల అంశలతో పుట్టినవారు. కామరూపులు. ఇంకా కోట్లకొద్దీ వానరవీరులు కిష్కింధకు వచ్చివున్నారు. వీరంతా నీ వెంట వుంటారు. మనమంతా కలసి లంకకు వెళ్ళి బంధుపరివార సమేతంగా రావణుని ముట్టుబెట్టి సీతమ్మని తెచ్చుకుందాము' అని సుగ్రీవుడు చెప్తుంటే విని రాముడు పరమానందభరితుడయ్యాడు.

రెండుచేతులతో సుగ్రీవుని గట్టిగా కౌగలించుకుని, హృదయానికి హత్తుకుని,

'సుగ్రీవా ఇంద్రుడు, మేఘాలకి అధిపతి కనుక వర్షం కురిపిస్తున్నాడు. సూర్యుడు తేజోమూర్తి కనక మనకి వెలుగు ప్రసాదిస్తున్నాడు. కాని నీలాంటి సహృదయుడైన మిత్రుడు, నాకు సహాయం చెయ్యడానికి ముందుకు రావడం మాత్రం చాలా గొప్పవిషయం. రావణుడు పరమనీచుడు. వాడిని నా పదునైన బాణాలతో వధించి, నా సీతని నేను తెచ్చుకుంటాను'అని సుగ్రీవుని రాముడనేకవిధాల కొనియాడుతుండగా, ఆకాశమంతా ధూళి ఆవరించి, దిక్కులన్నీ చీకటిగా అయిపోయాయి. భూమంతా కంపించిపోతుందా అనిపించింది.

పెద్దపెద్ద కోరలు కలిగిన మహాబలుశాలులైన వానరవీరులతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. చిత్రవిచిత్రములైన రంగులు కలిగిన కోట్లకొద్దీ వానరులు మహాసాగరంలా కదిలివచ్చారు. తార తండ్రి సుషేణుడు, బంగారు కొండలాంటి ఆకారం కల్గివున్నాడు. అతడివెంట పదివేలకోట్ల వానరసేన

తరలివచ్చింది. రుమతండ్రియైన తారుడు వెయ్యికోట్ల వానరులతో వచ్చాడు.

తామరపువ్వులో వుండే కింజల్కములు ఏ రంగులో వుంటాయో, అటువంటి బాలభానుని వర్ణంలో ప్రకాశిస్తున్న కేసరి, (హనుమంతుని తండ్రి) లెక్కించడానికి వీల్లేనంతమంది, వానరులతో వచ్చాడు. పొడుగైన తోకలు కలిగిన గోలాంగూలములు అనే వానరులకి మహారాజైన గవాక్షుడు, వేయికోట్ల వానరులతో వచ్చాడు. నల్లగా కాటుకరంగులో వుండే నలుడు పదికోట్ల సైన్యంతో వచ్చాడు. అతిబలవంతుడైన రధిముఖుడు, వేయికోట్ల సైన్యంతో వచ్చాడు. అశ్వనీ దేవతల కుమారులైన మైందుడు, ద్వివిదుడు ఒక్కొక్కరు వెయ్యికోట్లసైన్యంతో వచ్చారు. గందమాదనుడనేవాడు, వేయికోట్ల వానరులతో వచ్చాడు. యువరాజైన అంగదుడు, వందశంఖములు, వెయ్యిపద్మములు, సుమారు కోటికోట్ల వానరులతో వచ్చాడు. తారుడు ఐదుకోట్ల సైన్యంతో వచ్చాడు.

ఇంద్రజానువు పదకొండుకోట్లు, శరభుడు వేయి ఆయుతములు, దుర్ముఖుడు రెండుకోట్ల సైన్యంతో వచ్చారు. హనుమంతుడు, మహావీరులైన వెయ్యికోట్ల వానరులతో వచ్చాడు. ఇంకో దధిముఖుడు పదికోట్లసైన్యంతో, శరభుడు, కుముదుడు, వహ్ని, రంభుడు, మొదలైన భీమబలు లెంతమందో వచ్చివారి సైన్యంలో చేరారు.

ఆవిధంగా ఇసకేస్తేరాలదన్నట్లు సూదిమొన మోపేంత స్థలం కూడా లేకుండా పర్వతాలతో సహా ఆ అడవి అంతా వానరవీరులతో నిండిపోయింది. అందరూ గెంతులేస్తూ, గర్జిస్తూ, ఈతలు కొట్టూ, మేఘాల్లా వచ్చి సుగ్రీవుని చుట్టూ చేరి ఆనందంతో కేరింతలు కొట్టసాగారు. సేనానాయకులంతా వచ్చి సుగ్రీవునికి నమస్కరించి, తమతమ సేనలగురించి చెప్పారు. వారి బలపరాక్రమాలు సుగ్రీవునికి బాగా తెలుసు. ఇపుడింక చెయ్యబోయే సీతాన్వేషణ కార్యక్రమానికి పథకం తయారుచేసే ఆలోచనలోపడ్డాడు. చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తన ఆలోచన రామునితో చెప్పాలని,

'రామా నా పాలనలో వుండే కోటానుకోట్ల వానరవీరులంతా వచ్చారు. చూశావుగా. వీరు అప్రమేయపరాక్రమవంతులు. వీరి స్వభావం కూడా రాక్షసులతో సరిసమానమైనదే. ఇప్పటినుంచీ వీరంతా నీ సేవకులు. నీ ఆజ్ఞప్రకారం నడుస్తారు. ఇపుడు మేము ఏం చెయ్యాలో ఆజ్ఞాపించు' అన్నాడు వినయంగా.

ఆ మాటలు విన్న రాముడు పరమానందభరితుడయ్యాడు. సుగ్రీవుని గట్టిగా కౌగలించుకుని, మిత్రమా, ముందుగా సీత జీవించి వున్నదో లేదో తెలుసుకోవాలి.

ఆమెనపహరించిన రావణుడెక్కడవుంటాడో, ఆమెనెక్కడ దాచివుంచాడో, తెలుసుకుంటే, అప్పుడు తర్వాత కార్యక్రమం నిర్ణయించుకోవచ్చు. వానరరాజా ఇపుడీ కార్యక్రమం ఎలా మొదలుపెట్టాలో నువ్వే ఆలోచించి చెప్పు. మేమంతా నువ్వెలా చెప్తే అలా చేస్తాము' అంటూ రాముడు సుగ్రీవునికే ఆభారం అప్పగించాడు. అపుడు సుగ్రీవుడు వినతుడు అనే సేనానాయకుని పిల్చి, 'వినతా ఏ దేశంలో, ఏ కాలంలో, ఏం చెయ్యాలో నీకు బాగా తెలుసు. కనుక ముందుగా నీకే ఆనతి ఇస్తున్నాను. నువ్వు చంద్రఅంశతో, సూర్యఅంశతో జన్మించిన లక్షమంది సేనని సమీకరించు.

వారిని వెంటబెట్టుకుని, తూర్పుదిశగా వెళ్ళు. ఆ ప్రాంతంలో సీతమ్మ ఎక్కడైనా కనిపిస్తుందేమో, మీరంతా వెతకండి. రావణుడు అనే రాక్షసుడక్కడ వున్నాడేమొ తెలుసుకో. పర్వతశిఖరాలు, అడవులు, నదులు, అన్నిచోట్లా వెతకండి. తూర్పున అందమైన భాగీరథి, సరయు, కౌశికి, కాళింది, యమున, అనే నదులున్నాయి. యమున యనే పెద్ద పర్వతం వుంది. సరస్వతీ, శోణము, మహి, కాలమహి మొదలైన నదులు కూడా అక్కడ ఎన్నోవున్నాయి.

బ్రహ్మ, మాల, విదేహ, మాళవ, కాశికోసల, మగధ, మహాగ్రామ, పుండ్రము, వంగ మొదలైన దేశాలెన్నో వున్నాయి. ఆ దేశాలన్నీ అణువణువూ శోధించి వెతకండి. ఈ ప్రదేశమంతా, హిమవత్పర్వతము, వింధ్యపర్వతము ఆ రెండింటి నడుమ వలయాకారంలో వుండి, ప్రవహిస్తున్న నదికి తూర్పునవున్న దేశము. ఆ ప్రదేశంలో ఎక్కడైనా సీతమ్మని రావణుడు దాచివుంచాడేవమో చూడండి. కొన్ని పర్వతాలు నదుల్లో మునిగివున్నాయి. సముద్రగర్భంలో కొన్ని నగరాలున్నాయి. అక్కడ కూడా వెతకండి.

మంధరపర్వతం మీద విశాలమైన శిఖరాల్లో కూడా చూడండి. అక్కడ మీకు చెవులులేని వాళ్ళు, పెదవులపై చెవులున్నవారు, చెవులమీద జుత్తుమొలచినవారు, ఒకే పాదం వున్నవాళ్ళు, నరమాంస భక్షకులు, కిరాతులు, బంగారు రంగులో వున్న శరీరం వున్నవాళ్ళు, ఇలాంటి వింత వింత మానవులెందరో కనిపిస్తారు. వారి స్థావరాలన్నీ వెతకండి. అక్కడ నీటిలో చరించే పెద్దపులులుంటాయి. జాగర్త. కొండలమీదనించి కొండలమీదికి దూకగలవారిని, అక్కడే కొండలతో నిండివున్న ద్వీపంలో వెతకమను. ఈత బాగావచ్చిన వారిని, యవద్వీపమంతా వెతికించు. ఆపై శిఖరము అనే పర్వతం వుంది. ఆ పర్వతశిఖరాలు ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నట్లుంటాయి. అక్కడంతా పూర్తిగా వెతకండి. సముద్రంలో వున్న

ద్వీపాలన్నీ వెదికాక శోణము అనే నదీతీరానికి వెళ్ళండి. ఆ నదిలో నీరు ఎఱ్ఱగా వుంటుంది. అది చాలా లోతైనది. చాలా వడిగా ప్రవహిస్తుంది. అదిదాటి, సముద్రం కూడా దాటి, అవతలివైపుకి వెళ్ళండి.

అక్కడ ప్లక్షద్వీపం వుంది. అందులో ఎన్నో రేవులున్నాయి. ఆ రేవుల్లోనూ, అడవులలోనూ వెతకండి. అన్నివేపులా వెతికి, రావణుడు కనిపిస్తే చంపి, సీతమ్మని తీసుకురండి. ఆ తర్వాత ఇక్షుసముద్రం, ద్వీపాలు వెతకండి. అక్కడ పెద్ద పెద్ద శరీరాలు వున్న రాక్షసులున్నారు. వాళ్ళు నీడని పట్టుకుని వాళ్ళక్కావల్సిన వాళ్ళని వాళ్ళదగ్గరకి లాక్కుంటారు. ఆ సముద్రం నల్లగా వుంటుంది. అందులో పెద్దపెద్ద పాములుంటాయి. ఆ సముద్రం దాటేటప్పుడు చాలా మెలకువతో వ్యవహరించాలి. ముఖ్యంగా ఛాయాగ్రాహులైన రాక్షసులకి దొరకకుండా వెళ్ళాలి. అక్కడ సముద్రజలాలు ఎఱ్ఱగా వుంటాయి. ఆపైన కూటశాల్మలి ద్వీపం వుంది. అది చాలా పెద్దది. అక్కడ గరుత్మంతుడి భవనం వుంది. అక్కడ కూడా వెతకండి. ఇక్షుసముద్రం - సర్పి సముద్రం - దధిసముద్రం అయ్యాక కుశ, క్రౌంచ ద్వీపాలు వెతకండి. ఆ తర్వాత కపాల సముద్రం వస్తుంది.

ఈ సముద్రజలాలు తెల్లగా మబ్బు పరచుకున్నట్లుంటాయి. అది పాల సముద్రం. ఆ పాలకడలిలో ఋషభ పర్వతం వుంది. ఆ పర్వతం మీద సుగంధభరితాలైన వృక్షాలున్నాయి. ఆ వృక్షాలకి రజితపద్మాలు వుంటాయి. అక్కడ రాజహంసలుంటాయి. క్షీరసముద్రం దాటాక మంచినీటి సముద్రం వుంది. దానికి ఉత్తరాన, పదమూడు యోజనాల దూరంలో జాతరూపశైలమనే పర్వతం వుంది. అదిబంగారు కొండ. ఆ పర్వతం మీద సహస్రశిరసులు కలిగిన అనంతుడు వుంటాడు. ఆయన నల్లని వస్త్రములు ధరించివుంటాడు. ఆయన పతాకము తాటిచెట్టు. అదీ బంగారందే. చివర మూడుగా చీలివుంటుంది. అది దాటాక బంగారు రంగులో వుండే ఉదయపర్వతం కనిపిస్తుంది. ఆ పర్వత శిఖరం నూరుయోజనముల విస్తీర్ణం కలిగివుంటుంది. ఆకాశాన్నంటుతూ వుంటుంది.

ఆ శిఖరంపై సాలములు, తాలములు, తమాలములు, కర్ణికారములు, అనబడే వృక్షాలున్నాయి. ఆ వృక్షాలనిండా బంగారు రంగుపూలు, సూర్యకాంతితో మెరుస్తు వుంటాయి. అలాపైకి వెళ్తే ఒక యోజనము వెడల్పు, పదియోజనములు ఎత్తుగల సౌమనసము అనె పేరు వున్న బంగారు శిఖరం ఒకటి వుంది. పూర్వము వామనావతారుడైన విష్ణుమూర్తి త్రివిక్రముడై మొదటి పాదము ఆ శిఖరం మీదే మోపి, రెండవపాదం మేరుశిఖరం మీద వుంచాడట. ఆ మేరుపర్వత శిఖరానికి

ఉత్తరంగా సూర్యుడు, జంబూ ద్వీపము యొక్క ఉత్తరభాగాన వున్న సౌమనస శిఖరానికి జారి, మేరువునకు దక్షిణపార్శ్వము నందున్నవారికి కనిపిస్తాడు.

అక్కడ వైఖానసులు, వాలఖ్యలులు అనే ఋషులు తపస్సు చేస్తూ సూర్యతేజస్సుతో వెలిగిపోతూ వుంటారు. ఉదయపర్వతం పక్కన సుదర్శనమనే ద్వీపం వుంది. సూర్యకాంతితో అది చక్కగా కనిపిస్తుంది. అక్కడంతా సీతమ్మకోసం వెతకండి. ఇది సూర్యుడు ఉదయించే చోటు. అందుకే దాన్ని ఉదయపర్వతం అంటారు. ఇదే తూర్పుదిక్కు. ఆ ఉదయాద్రిదాటి ముందుకు ఎవ్వరూ వెళ్ళలేరు. ఆపైన అంతా చీకటిమయం. ఇపుడు నేను చెప్పిన చోట మాత్రమే గాక, ఇంకా నేను చెప్పటం మర్చిపోయిన చోటులుంటే అక్కడ కూడా వెతకండి. ఇలా ఉదయపర్వతం దాకా వెళ్ళి సీత జాడ తెల్సుకుని, రావణుని నివాసం కూడా తెలుసుకుని, ఒక్కనెలరోజులులోగా తిరిగిరండి. గడువులోపల తిరిగి రాకపోతే, వారిని వధించవలసివుంటుంది' అని హెచ్చరించి వారిని తూర్పుదిక్కుగా పంపాడు.

ఆ తర్వాత దక్షిణదిశగా, అగ్ని కుమారుడైన నీలుని, వాయుపుత్రుడైన హనుమంతుని, బ్రహ్మపుత్రుడైన జాంబవంతుని, ఇంకా సుహోత్రుడు, శరారి, శరగుల్మడు, గజుడు, గవాక్షుడు, శవయుడు, సుషేణుడు, వృషభుడు, మైందుడు, ద్వివిదుడు, విజయుడు, గంధమాదనుడు, మొదలైన మహావీరుల్ని అంగదుని సారథ్యంలో వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించాడు. వారికి ఆ దిశగా వున్న దుర్గమప్రదేశాలన్నీ వివరించి చెప్పాడు ఇలా....

ముందుగా వెయ్యిశిఖరాలు గల వింధ్యపర్వతం కనిపిస్తుంది. అక్కడ అడ్డంగా నర్మదానది ప్రవహిస్తుంటుంది. అది దాటడం చాలా కష్టం. అందులో పెద్దపెద్ద పాములు నివశిస్తుంటాయి. ఆ తర్వాత గోదావరి, కృష్ణవేణి, వరద నదులు కనిపిస్తాయి. ఆ తర్వాత మేఖల, ఉత్కల నదులు, దశార్ణ నగరాలు కనిపిస్తాయి. వీటిలో కొన్ని వింధ్యపర్వతానికి పశ్చిమభాగాన, మరికొన్ని దక్షిణభాగాన వుంటాయి. ఈ ప్రదేశాలన్నీ వెతకండి.

వింధ్యకి తూర్పున విదర్భ, ఋషికము, మహిషము, వంగము, కళింగము, కౌశికము, అనే దేశాలుంటాయి. అక్కడే దండకారణ్యం వుంది. అందులో పర్వతాలు, నదులు, గుహలు వుంటాయి. గోదావరీ నదీపాయ ఒకటి దండకారణ్యంలో వుంది. అలాగే వెళితే ఆంధ్రదేశము, చోళదేశము, పాండ్యదేశము, కేరళదేశము, మొదలైన దేశాలు వస్తాయి. అక్కడ అయొముఖము

అనే పర్వతం వుంది. దానినే సహ్యాద్రి అంటారు. కావేరినది అక్కడే పుట్టింది.

ఆ ప్రాంతంలో మంచిగంధం చెట్లు విరివిగా వుంటాయి. అక్కడికి కొంతదూరంలో మలయపర్వతం వుంది. దానిమీద అగస్త్య మహాముని ఆశ్రమం వుంది. ఆ మహర్షికి నమస్కరించి, ఆయన ఆజ్ఞతీసుకుని వెళ్ళండి. దారిలో తామ్రపర్ణినది వస్తుంది. దానిలో మొసళ్ళు చాలా ఎక్కువ. కనుక దానిని జాగ్రత్తగా దాటండి. అక్కడంతా వెతకండి. ఆ తర్వాత పాండ్యదేశం వస్తుంది. ఆ సముద్రంలో అగస్త్యమహాముని మహేంద్రపర్వతాన్ని నిలిపాడు. ఆ పర్వతమంతా చిత్రవిచిత్ర శిఖరాలతో నిండివుంది. ఎన్నెన్నో మహావృక్షాలు దానిమీద వున్నాయి. దానిమీద వేదఋషులు, గంధర్వులు, యక్షులు, అప్సరసలు, సిద్ధులు చారణులు అంతావుంటారు. పర్వదినాలలో అక్కడికి ఇంద్రుడు వస్తువుంటాడు.

ఆ సముద్రమధ్యంలో నూరుయోజనములు విస్తీర్ణం కల లంకాద్వీపం వుంది. మీరెలాగైనా సరే, ఆ ద్వీపంలో ప్రవేశించి వెతకండి. మహాపరాక్రమవంతుడైన రావణుని నివాసము ఆ లంకానగరమే. అయితే దక్షిణ సముద్రమధ్యంలో అంగారక అనేపేరుగల రాక్షసివుంటుంది. ఆకాశంలో ప్రయాణం చేసే జీవుల నీడనిబట్టి ఆరాక్షషి వారిని తనవైపు లాక్కుని తినేస్తూ వుంటుంది. అక్కడ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆ సముద్రం దాటాక పుష్పితము అనే పర్వతం వుంటుంది. దాని శిఖరాలలో ఒకటిమాత్రం బంగారంది. అక్కడ కూడా సిద్ధులు చారణులు వుంటారు. ఇంకొకటి వెండి శిఖరం. దానిమీద ఇంద్రుడు వుంటాడు. ఆ పర్వతం కృతఘ్నులకు, క్రూరులకు, నాస్తికులకు కనిపించదు. దానికి నమస్కరించి అక్కడంతా వెతకండి. దానిని దాటాక సూర్యవంతమనే పర్వతం వస్తుంది. పుష్పితము నుండి పద్నాలుగు యోజనాల దూరంలో వుంది ఈ సూర్యవంతము. దాని తర్వాత వైద్యుతమనే పర్వతం వుంటుంది. ఆ పర్వతం మీది వృక్షాలకు కాసిన ఫలములు తిన్నవారికి, ఏ కోరిక కోరుకుంటే అది సిద్ధిస్తుందని అంటారు. దాని తర్వాత కుంజరము అనే పర్వతము వుంటుంది. దానిమీద విశ్వకర్మ అగస్త్యభవనం నిర్మించాడు. అక్కడే ఒకయోజనము వైశాల్యము, పదియోజనాల ఎత్తుకలిగిన కాంచన శరణం వుంది. అదిఎంతో విలువైన రత్నాలతో పొదగబడి వుంటుంది. అక్కడ సర్పాలకి నిలయమైన భోగవతీ నగరం వుంది. సర్పరాజైన వాసుకి ఆ నగరంలో వుంటాడు.

దానిని దాటాక వృషభము అనే పర్వతం వుంది. దానిమీద ఎఱ్ఱచందనం తోటలుంటాయి. భయంకరాకారులైన రోహితులనే గంధర్వులు ఆ

చందనవృక్షాల్ని రక్షిస్తువుంటారు. కనుక మీరు వాటిని తాకవద్దు. భూమియొక్క ఆఖరి అంచు చివరిభాగం అది. దానితర్వాత పితృలోకము, యమధర్మరాజు రాజధాని వుంటాయి. అక్కడంతా గాఢాంధకారం వ్యాపించి వుంటుంది. అది దాటి మీరువెళ్ళలేరు. భూమి అంచు చివరభాగం వరకే వెళ్ళగలరు. ఆయాప్రాంతాలన్నీ గాలించి, శోధించి, బాగా వెతకండి. సీతమ్మజాడ ఎవరైతే తెలుసుకుని వస్తారో వారు నాతో సమానంగా రాజ్యభోగాలనుభవించగలరు. వారు నాకు చాలా ప్రీతిపాత్రులవుతారు. కనుక వెళ్ళండి. మీశాయశక్తులా ప్రయత్నించి వెతకండి' అని పంపాడు.

ఆ తర్వాత తార తండ్రియైన సుషేణుడనే సేనాపతిని పిల్చి, వినయంగా ఇలా చెప్పాడు.

'ఆర్యా, మీరు మరీచి కుమారుని, అతని సోదరుల్ని, వారి వారి పరివారాల్ని, ఋషిపుత్రుల్ని వెంటబెట్టుకుని పశ్చిమదిశగా వెళ్ళండి. మీ నాయకత్వంలో మొత్తం రెండు లక్షలమంది వానరుల్ని తీసికెళ్ళండి. పశ్చిమదిక్కులో సురాష్ట్రదేశము, బాహ్లీకదేశము, శూరదేశము, అణువణువూ గాలించండి. అక్కడ అందమైన జనపదాలు, పట్టణాలు ఎన్నో వున్నాయి. అవన్నీ వెతకండి. పున్నాగవనమనే కీకారణ్యం అక్కడవుంది. అదీవెతకండి. పశ్చిమదిక్కుగా ప్రవహించే నదులు, తాపసులుండే ఆశ్రమాలు, పర్వతాలు అక్కడ చాలా వున్నాయి. అవన్నీ వెతకండి. ఆపైన మెట్టప్రదేశాలున్నాయి. అదంతా ఎడారిప్రాంతము. పశ్చిమదిక్కువెంబడి కొండలు, పర్వతాలు వున్నాయి. ఆ ప్రాంతాలన్నీ బాగావెతకండి.

అలా వెళ్ళగా వెళ్ళగా సముద్రం వస్తుంది. ఆ సముద్రంలో మొసళ్ళు, తిమింగలాలు వున్నాయి. మొగలిపొదలు, నీడలనిచ్చే తమాలవృక్షాలు, కొబ్బరితోటలు, చాలా ఎక్కువగావుంటాయి. ఆచోట్లన్నీ నిశితంగా వెతకండి. అవంతి, అంగ, లోపానగరి మొదలైన దేశాలన్నీ వెతకండి. సాగరసంగమ ప్రాంతాలు, వెతికాక, ఆ ప్రాంతంలో హేమగిరి, అనేపెద్ద కొండవుంది. ఆ కొండకి నూరుశిఖరాలున్నాయి. ఆ శిఖరాల నిండా పెద్దపెద్దవృక్షాలున్నాయి. ఆపర్వతచరియలలో రెక్కలుండి ఎగిరే సింహాలున్నాయని చెప్పుకుంటారు. సముద్రంలోని తిమింగలాల్ని అడివిలోని ఏనుగుల్ని చంపి లాక్కుపోయి, ఆ రెక్కల సింహాలు కొండచరియల్లోని తమతమ స్థావరాలలో దాచుకుంటాయి. ఆ ప్రదేశాలు కూడావెతకండి. ఆ సముద్రంలో నూరుయోజనాల వైశాల్యం కల్గిన పారియాత్రము అనే పర్వతం వుంది. ఆ పర్వత శిఖరం మీద నాలుకోట్ల గంధర్వులుంటారు. ఆ

ప్రాంతంలోని పండ్లుగాని దుంపలు గాని ఎవ్వరూ ముట్టుకోకండి. ఎందుకంటే ఆ గంధర్వులు మహావీరులు. బలవంతులు. ఆ ప్రదేశంలో అన్నీ వారి రక్షణలో వుంటాయి. కనుక అక్కడ అతి జాగ్రత్తగా వ్యవహరించాలి. అక్కడంతా సీతమ్మకోసం వెతకండి. ఆ తర్వాత వజ్రము అనే పర్వతం వుంటుంది. అది వైఢూర్యం రంగులో వుంటుంది. వందయోజనాల ఎత్తు వుంటుంది. ఆ పర్వత గుహల్లో వెతకండి. లవణ సముద్రం యొక్క నాల్గవ భాగంలో చక్రవంతమనే పర్వతం వుంది. అక్కడ విశ్వకర్మ సహస్రార చక్రం వుంచాడు. విష్ణువు శంఖ చక్రములు ధరించిన చోటు అదే. ఆ పర్వత చరియలలో, శిఖరాలలో, సీతమ్మ కోసం వెతకండి. అక్కడనుంచి అరవై యోజనాల దూరంలో వరాహమనె పర్వతం వుంటుంది. అది కూడా బంగారు శిఖరాలతో నిండి వుంటుంది. ఆ పర్వతం మీద నరకుడనే రాక్షసుడు పాలించిన ప్రాగ్జ్యోతిషపురం వుంది. అక్కడ కూడా వెతకండి. దాని పక్కన మేఘవంతమనే పర్వతం ఉంది. అక్కడే దేవేంద్రుడు దేవతలకి రాజుగా అభిషిక్తుడయ్యాడు. అక్కడ అరవైవేల కొండలున్నాయి.

అవన్నీ బంగారు కొండలు అక్కడి వృక్షాలు కూడా బంగారు కాంతితోనే వుంటాయి. వాటి మధ్య ఉత్తర దిక్కుగా మేరు పర్వతం వుంది. అది బంగారు పర్వతం. అక్కడ నివశించే దేవతలు, దానవులు, గంధర్వులు, కూడా బంగారు రంగులో వుంటారు. విశ్వదేముడు, మరుతులు, వసువులు, ప్రతి రోజు సంధ్యా సమయాన అక్కడికి వచ్చి సూర్యుని ఆరాధిస్తారు. ఆ పర్వతం యొక్క పది వేల యోజనముల దూరం సూర్యుడు అర్ధముహుర్తంలో దాటి పోతాడు. సూర్యకాంతితో మెరిసిపోయే భవనం అక్కడ విశ్వకర్మ నిర్మించాడు. ఆ పర్వతం మధ్యలో వరుణ దేముని నివాసం వుంది. ఆ ప్రదేశమంతా వెతకండి. అక్కడ మేరు సావర్ణి అనే మహాఋషి వుంటాడు. ఆ మహాత్మునికి నమస్కరించి, సీతని గురించి అడగండి. అంతవరకు మాత్రమే ప్రాణికోటికి తెలిసిన ప్రదేశం వుంది. ఆపైన సూర్యుడస్తమిస్తాడు. ఆపైన అంతా అంధకారమయం. అక్కడి వరకు మాత్రమే మీరు వెళ్ళగలుగుతారు. నేనిప్పుడు చెప్పిన ప్రదేశాలన్ని వెతికి నెలలోపుగా మీరు తిరిగి రావాలి. నెల దాటిన తర్వాత వస్తే మీకు చావు తప్పదు. మా మామగారైన సుషేణుడు మీకు మార్గదర్శిగా వస్తారు. ఆయన ఆజ్ఞకి కట్టుబడి వుండండి" అని సుగ్రీవుడు చెప్పగానే వారంతా శ్రద్ధగా విని సెలవుతీసుకుని బయల్దేరారు.

ఆ తర్వాత ఉత్తర దిశగా శతవలి అనే వానర శ్రేష్ఠుని పురమాయించి అటు వెళ్ళే దారి తెన్నులా ఇలా వివరించి చెప్పాడు.

"శతవలీ రామకార్యం నెరవేర్చడానికి నీసాయం ఇప్పుడు కావాలి. అది సిద్ధిస్తే మీకూ నాకు కూడా మేలు కలుగుతుంది. ఒక లక్ష మంది వానర వీరుల్ని వెంట బెట్టుకుని, నువ్వు ఉత్తర దిశగా హిమాలయ ప్రాంతం వరకు వుండే ప్రదేశానికి వెళ్ళు. సీతమ్మ జాడ తెలిసే వరకు అణువణువు వెతకండి. మీ బుద్ధి పరాక్రమం వుపయోగించి, దుర్గమమైన అడవులు, నదులు పర్వతాల మధ్య భాగాలు, అన్ని చోట్లా వెతకండి.

అక్కడ మ్లేచ్ఛదేశము, పులిందదేశము, శూరసేన దేశము, ప్రస్థము, భరత, కురుదేశాలు, వుంటాయి. మద్ర, కాంభోజ, యవన, శక, బాహ్లీక, ఋషిక,పౌరవ, కొకణ, దేశాలుంటాయి.

అంతేగాక చీన, పరమ చీన దేశాలుంటాయి. దుర్ధరదేశముంది. హిమాలయ పర్వతం వుంది. అక్కడంతా క్షుణ్ణంగా వెతకండి. ఆపైన సోమాశ్రమము, దాని దగ్గరే కాళము అనే పర్వతం వున్నాయి. దేవదారు తోటలుంటాయి. అక్కడంతా వెతకండి. ఇంకా ముందరకి వెళ్తే హేమ గర్భము, సుదర్శనము అనే పర్వతాలుంటాయి. ఆ తర్వాత దేవ సఖపర్వతముంది. ఆ పర్వత గుహలలో సీతమ్మకై వెతకండి. ఆపైన నూరుయోజనములు బంజరు ప్రదేశం వుంది. ఆ తర్వాత కైలాస పర్వతం వుంది. ఆ పర్వతం మీదె విశ్వకర్మ నిర్మించిన కుబేర భవనం వుంది. ఆ కుబేరుడు యక్షుల రాజు. అక్కడంతా వెతికాక ముందుకి వెళ్తే క్రౌంచ పర్వతం వస్తుంది. ఆ పర్వతం మీద ఒక బిలం వుంది. అది దాటాక వృక్షము అనే పర్వతం వస్తుంది. కాని ఆ బిలం దాటడం చాలా కష్టం.జాగ్రత్తగా అందులోదూరి వెళ్ళండి. అక్కడ తేజోమూర్తులైన మహర్షులెందరో వున్నారు. దాని తర్వాత కామశైలము, మానసము అనే పర్వతాలున్నాయి. మైనాక పర్వతం వాటికంటేముందే వస్తుంది. ఆ పర్వతం మీద మయుడనేరాక్షసుడు తన కోసం ఒక భవనం నిర్మించుకున్నాడు. ఆ ప్రదేశాలన్ని వెతకండి. ఆ మైనాక పర్వతం మీద గుర్రపు ముఖము కల్గిన కింపురుష స్త్రీలు వుంటారు. సిద్ధులు, వైఖానసులు వాలకిల్యులు, మొదలైన తాపసులుంటారక్కడ.

ఆ ప్రదేశాలన్నీ గాలించి సీతమ్మ జాడ తెలుసుకోండి. అక్కడ వైఖానసమనే సరస్సు కూడా వుంది. ఆ సరస్సు నిండా బంగారు తామర పూలుంటాయి. ఆ పైన అంతా మేఘాలలో ఆవరించిన ప్రదేశం వుంటుంది. ఆపైన శిలోద అనే నది వస్తుంది. ఆపైన నీల వైఢూర్య వర్ణము గలనీరు కలిగిన నదులుంటాయి. అక్కడ వృక్షాలు అన్ని కాలాలో పూలతో, పండ్లతో నిండి వుంటాయి. మరికొన్ని వృక్షాలకి రక రకాల వస్త్రాలుంటాయి. కొన్నిచెట్లకి శయనములు, పరుపులు

వ్రేలాడుతు వుంటాయి. అక్కడ అందము, యౌవనము కలిగిన గంధర్వులు, కిన్నెరలు, సిద్ధులు, సాధ్యులు, విధ్యాధరులు భార్యలతో నివశిస్తారు. వారు చేసే గానములు, వాద్యముల ధ్వని వినిపిస్తు వుంటుంది. అక్కడ్నించి కొంతదూరం వెళ్ళాక, ఉత్తర సముద్రం వస్తుంది. దాని మధ్యలో బంగారు సోమగిరి అనే పర్వతం వుంటుంది. అది సూర్యమండలాన్ని దాటి వుంటుంది. కనుక ఆ పర్వతంపై సూర్యకాంతి వుండదు. ఆ పర్వతం యొక్క ప్రకాశమే సూర్యకాంతిలా వెలిగిపోతూ వుంటుంది. అక్కడ వాసుదేవుడుంటాడు. ఆపైన పదకొండురూపాలు కల్గిన రుద్రుడుంటాడు. ఆ తర్వాత బ్రహ్మ వుంటాడు. ఆయన చుట్టు బ్రహ్మర్షులు వుంటారు.

కురుదేశము దాటాక ఉత్తర తీరానికి మీరు వెళ్ళకండి. అటు వెళ్ళడం అసాధ్యం సోమగిరి దేవతలకి కూడా చొరలేని ప్రదేశం. కనుక మీరు దూరం నించే నమస్కారం పెట్టుకుని, వెనక్కి మరలి రండి. ఈ లోపలి ప్రదేశం అంతా సీతమ్మ కోసం వెతకండి. సీతమ్మ జాడ తెలుసుకోగలిగారా మిమ్మల్ని బంధుమిత్ర సమేతంగా గౌరవిస్తాను. లేకపోతే నెలరోజులు గడువు దాటిన తర్వాత వచ్చిన వారికి మరణ దండన తప్పదు" అని వారిని సాగనంపాడు సుగ్రీవుడు.

సుగ్రీవునిచే ఆజ్ఞాపించబడిన వానరులంతా ప్రయాణ సన్నాహాలు చేసుకుందుకు వెళ్ళారు. వారంతా బయల్దేరుతుండగా సుగ్రీవుడు హనుమంతుణ్ణి వెనక్కి పిలిచాడు. మహావీరుడైన హనుమంతుడు కార్యసాధకుడని అతడి నమ్మకం. అందుకే హనుమంతుడితో ప్రత్యేకం ఇలా చెప్పాడు. "వానర శ్రేష్టా నీకు తెలియని చోటు గాని, నువ్వు వెళ్ళలేని చోటు గాని అంతరిక్షంలో కూడా ఎక్కడా లేదు. అసుర, నాగ, దేవ, నర, గంధర్వలోకాలన్నీ, నీకు తెలుసు. సాగరులు పర్వతాలు అన్నీ నీకు తెలుసు. నీ తండ్రితో సమానమైన గమన శక్తి గల వాయుపుత్రుడివి నువ్వు. కనుక ఎలాగైనా సీతమ్మని వెతికి తెచ్చే ప్రయత్నం నువ్వే చేయాలి" అని చెప్పాడు. ఆ మాటలు రాముడు విన్నాడు. సుగ్రీవుని మాటల్ని బట్టి హనుమంతుని సామర్ధ్యం రామునికి తెలిసింది. అప్పటి దాకా హనుమంతుని ప్రవర్తనని కూడా గమనించి చూశాడు కనక రామునికి హనుమంతుని వలనే తన కార్యం సాఫల్యం అవుతుందని నమ్మకం కలిగింది. హనుమంతుని రాముడు తన దగ్గరకి పిల్చి, తన పేరు గుర్తు గల ఉంగరం ఒకటి హనుమంతునికిచ్చి

"హనుమా, ఈ అంగుళీయకము చూసి, సీత నిన్ను గుర్తిస్తుంది. నా వాడివిగా తెలుసుకుంటుంది. నిర్భయంగా నీతో మాట్లాడుతుంది. నువ్వు పట్టుదల గలవాడివి. పరాక్రమవంతుడివి. కార్యసిద్ధి నీమీదే ఆధారపడి వుంటుంది" అని

తన గుర్తుగా ఆంజనేయునికి తన వుంగరం ఇచ్చాడు. హనుమంతుడు దోసిలి ఒగ్గి, ఆ ఉంగరం గ్రహించి, కళ్ళ కద్దుకుని, రామపాదాలకి శిరసా నమస్కరించి, బయల్దేరాడు. అతడి వెంట దక్షిణ దిశగా వెళ్ళవలసిన వానరులంతా బయల్దేరారు. చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతున్న హనుమంతుని చూసి తన కార్యం సిద్ధించబోతోందని ఆనందించి రాముడు మళ్ళీ ఇలా అన్నాడు.

"వీరాగ్రేసరా, సింహబలుడవైన నీ పరాక్రమం మీదా, బలము మీదా, ఆధారపడి వున్నాను నేను. వాయుపుత్రా జానకి జాడ తెలుసుకుని, విజయుడవై తిరిగిరా" అని ఆశీర్వదించాడు. సుగ్రీవుడు మరోసారి వానరులందర్నీ హెచ్చరిస్తూ "మీరంతా నేను చెప్పిన ప్రకారం మీ మీ దిక్కులకి వెళ్ళి ఎక్కడెక్కడ వెతకాలో పరిశీలించి, మీమీ ప్రయత్నాలు చెయ్యండి. ఈ సుగ్రీవుని శాసనము తీవ్రమైనదని గుర్తించి, జాగ్రత్తగా అన్వేషించండి" అని చివరిసారిగా హెచ్చరించాడు.

వెంటనే ఆ వానర వీరులంతా అమితోత్సాహంగా ఎగిరి, మిడతల దండులా, భూమి అంతటా వ్యాపించి, ఎగురుతూ, బయల్దేరడానికి సిద్ధమయ్యారు. రాముడు, లక్ష్మణుడు ప్రస్రవణ గిరి మీదే వుండి, వానరులు వెళ్లాళ్ళలోగా ఎలాంటి వార్త తెస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఉత్తర దిశగా, శతవలి తన పరివారంతో సాగిపోగా వినతుడు వానర దండుతో తూర్పుదిశగా బయల్దేరాడు. పశ్చిమదిశగా సుషేణుడు తన సేనతో ప్రయాణం సాగించాడు. వాయుపుత్రుడైన హనుమంతుడు, తారుడు, అంగదుడు, మొదలైన వీరాధివీరులు దక్షిణదిశగా వెళ్ళారు. ఈ విధంగా తమకి అనుమతించిన వానర సైన్యంతో భూగోళం నాలుగు దిక్కులూ సీతాన్వేషణ చెయ్యటానికి వీరాధి వీరులైన వానరులు, లక్షల సంఖ్యలో బయల్దేరి వెళ్ళారు.

అందర్నీ పంపించాక సుగ్రీవుడు పెద్ద భారం దించుకున్నట్లు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇంక బయల్దేరిన వానరుల కోలాహలం ఇంతా అంతా కాదు. ఎవరిమట్టుకు వారే ప్రతి వానరుడు సీతమ్మని నేనే తెస్తాను. రావణుని చంపేస్తాను. మేమంతా ఉమ్మడిగా ఆ రావణుని చంపి ఆనవాలు లేకుండా చేస్తాము. వాడిని మట్టుబెట్టి సీతమ్మని తెస్తాము. పాతాళ లోకంలో వున్నా సరే వాణ్ణి చంపి తీర్తాము. కొండలైనా కూలద్రోస్తాము. భూమిని బ్రద్దలు చేస్తాము. సముద్రాలన్నీ గాలిస్తాం. రావణుని భరతం పడ్తాము." అంటూ కేరింతలు కొడ్తూ, సుగ్రీవునికి వినిపించేలా బొబ్బలు పెడ్తూ తమ తమ సామర్థ్యం ఉగ్గడిస్తూ, ఆకాశ మార్గంలో ప్రయాణం సాగించారు. అందరూ వెళ్ళిపోయాక అక్కడ సుగ్రీవుడు, రాముడు, లక్ష్మణుడు

మిగిలారు. సుగ్రీవుడు ఆయా ప్రదేశాలగురించి వర్ణించి చెప్పడం, రాముడు విన్నాడు. అతడి పరిజ్ఞానానికి, రాముడికి చాలా ఆశ్చర్యం కలిగింది. కుతూహలం అణచుకోలేక, సుగ్రీవుని ఇలా అడిగాడు.

"సుగ్రీవా భూ మండలంలో ఎక్కడ ఏ ప్రదేశంలో ఏముందో, సవిస్తరంగా వానరులకి చెప్పావు కదా, ఆయా దేశాల గురించి, అంతవివరంగా నీకెలా తెలుసు?" అని రాముడడగ్గా, సుగ్రీవుడు, అతి వినయంతో, " పురుషోత్తమా, ఆ సంగతి వివరంగా చెప్తాను విను. మాయావి గురించి మునుపు చెప్పాను కదా. ఎనుబోతు ఆకారంలో వాడు మా అన్నయ్యని ఎదిరించి వచ్చినప్పుడు, వాణ్ణి, తరిమికొట్టగా, మలయ పర్వతం వరకు వెళ్ళి ఆ రాక్షసాధముడు, ఒక కొండగుహలో ప్రవేశించాడు. ఒక సంవత్సరం గడచినా వాలిగాని, మాయావి గాని బయటకు రాలేదు కాని, ఒకనాడు రక్తప్రవాహం ఆ గుహ లోంచి వచ్చింది. నేనది చూసి, ఆశ్చర్యపోయి, నా సోదరుడే చనిపోయాడనుకుని, బాధతో ఏడ్చి పర్వతంలాంటి శిలతో ఆ గుహని మూసేసి, కిష్కింధకి మరలివెళ్ళాను. మంత్రుల బలవంతంమ్మీద రాజ్యపాలనా భారం వహించాను. అనుకోకుండా ఒకనాడు వాలి ఆ రాక్షసుణ్ణి చంపి కిష్కింధకి తిరిగి వచ్చాడు. నేను సగౌరవంగా వానర రాజ్యాన్ని వాలికి అప్పగించాను. కాని వాలి ఆగ్రహంతో నన్ను చంపడానికి వచ్చాడు.

నేను అతనికి దొరక్కుండా పరిగెత్తాను. వాలినన్ను తరుముతూ వచ్చాడు. నేను వెనక్కి తిర్గైనా చూడకుండా భూమండలమంతా పరిగెత్తసాగాను. అప్పుడు రకరకాల పర్వతాలు, నదులు, సరస్సులు పట్టణాలు అన్నీ చూశాను. ఆకాశ మార్గాన ఎగురుతూ తిరిగి అన్నీ చూశాను. కనుక భూమి అంతా స్పష్టంగా కనిపించింది. తూర్పు దిక్కుగా నదులు, సరస్సులు, అన్నీ దాటాక ఉదయ పర్వతం కనిపించింది. ఆ పైన వెళ్ళే దారిలేక వెనక్కి మరలాను. అయితే వాలి అలా నా వెంటే విడవకుండా రావడం కనిపించింది. అప్పుడు దక్షిణదిశగా పరిగెత్తాను. వింధ్య పర్వతం, దాని దాపున మరికొన్ని పర్వతాలు కనిపించాయి. చందన వృక్షాలతో ఆ ప్రాంతమంతా నిండివుంది. దక్షిణ దిశగా వున్న ప్రదేశాలన్నీ చూస్తు భూమి అంచుదాకా వెళ్ళాక మళ్ళీ వాలి వస్తాడన్న భయముతో పశ్చిమదిశగా వెళ్ళాను.

అనేక ప్రదేశాలు చూసి అస్తాద్రివెళ్ళాను. అప్పటికీ వాలినన్ను వెంటాడుతూనే వున్నాడు. అప్పుడు ఉత్తర దిశగా పరిగెత్తాను. అక్కడ హిమవత్పర్వతం, మేరు పర్వతం, ఉత్తర సముద్రం చూశాను. నా వెంట హనుమ మొదలైన మంత్రులు

కూడా వున్నారు. అలా ఎంత దూరం వెళ్ళినా వాలి వెంటాడడం మానలేదు. ఇంక ఎక్కడికి వెళ్ళాలా అని ఆలోచనలో వుండగా, బుద్ధిమంతుడైన హనుమంతుడు ఇలా సలహా ఇచ్చాడు.

"ప్రభూ నాకో సంగతి గుర్తుకు వస్తోంది. మతంగ మహర్షి వాలిని శపించాడు. ఆయన ఆశ్రమ ప్రాంతంలో అడుగు పెడితే వాలి తలవెయ్యి వ్రక్కలవుతుంది. కనుక వాలి అక్కడికి రాలేడు. మనం అక్కడ నివాసము ఏర్పరచుకుందాము" అని హనుమంతుడు అన్నమాటలు విన్నాక, నాకు ధైర్యం వచ్చింది. గుండెలు చిక్కబట్టుకుని ఋష్యమూక పర్వతం చేరుకున్నాము. చేసేది లేక వాలి నిరాశతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఆనాడు నేనీ భూమండలమంతా ప్రత్యక్షంగా చూశాను. ఆనాటి నుంచీ మీతో మైత్రి ఏర్పడినదాకా ఋష్యమూకం మీదే వున్నాను" అని తన అనుభవాలన్నీ చెప్పాడు.

సుగ్రీవుని ఆజ్ఞ మేరకి, బయల్దేరిన వానరులు, సురస్సులు, నదులు, నగరాలు, మార్గాలు, పర్వతాలు, అడవులు, మొదలైన ప్రదేశాలన్నీ నిశితంగా పరిశీలిస్తూ, ఆ కొండల మీద విశ్రాంతి తీసుకుంటూ, ఎక్కడ ఏ పండ్లు దుంపలు దొరికితే అవి తింటూ, పగలంతా వెతుకుతూ మొత్తం తమకి కేటాయించిన ప్రదేశాలు నెలలోపల పూర్తిగా వెతికారు. నెల రోజులు గడువు పూర్తికావచ్చే సరికి, తూర్పు దిశగా వెళ్ళిన వినతుడు, ఉత్తర దిక్కుగా వెళ్ళిన శతవలీ, పశ్చిమ దిక్కుగా వెళ్ళిన సుషేణుడు, తమ తమ పరివారాలతో వెనక్కి తిరిగి ప్రస్రవణ గిరికి చేరుకున్నారు.

సుగ్రీవునికి, రామునికి, నమస్కరించి, "ఆర్యా మీరాదేశించిన ప్రాంతాలన్నీ క్షుణ్ణంగా వెతికాము. కాని రావణుని జాడకాని, సీతమ్మ జాడ కాని తెలియలేదు" అని విన్నవించారు.

దక్షిణ దిశగా వెళ్ళిన హనుమంతుడు మాత్రం రాలేదు. అతడు వాయు పుత్రుడు. కార్య సాధకుడు. రావణుడు సీతమ్మని ఎత్తుకుపోయిన దిశగానే వెళ్ళాడు. అతడు తప్పక సీతమ్మ గురించిన సమాచారం తీసుకువస్తాడని, అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

అక్కడ హనుమంతాదులు కూడా దక్షిణ దిశగా సుగ్రీవుడు చెప్పిన ప్రదేశాలన్నీ దుర్గమ ప్రదేశాలు, పర్వత శిఖరాలు, నదీదుర్గాలు, సరస్సులు, పెద్ద పెద్ద వృక్షాల తొర్రలు, పొదలు, అన్ని చోట్లా శ్రద్ధగా అణువణువు గాలిస్తూ వెతుకసాగారు. ఎక్కడా సీతమ్మ జాడ తెలియలేదు. ఒక ప్రదేశం దగ్గరకు వచ్చేసరికి, వారి అన్వేషణ ఆగిపోయింది. అక్కడ గుహలు చాలాదుర్గమంగా

అంధకార బంధురంగా వున్నాయి. అక్కడెక్కడా నీరు లేదు. జన సంచారం లేదు. ఆ ప్రదేశమంతా శూన్యంగా, భీకరంగా వుంది. అది చూసి అందరికీ ఒళ్ళు గగుర్పొడిచింది. తినడానికి తిండి దొరక్క, తాగేందుకు నీరు దొరక్క, చాలా అలసట చెందారు. అయినా సరే పట్టుదల వదలకుండా అలాగే ముందుకి సాగి, సీతాన్వేషణ కార్యక్రమం కొనసాగించారు. అక్కడ మహావృక్షాలున్నాయి. కాని, వాటికి ఆకులు మాత్రమే వున్నాయి. అవి కూడా నామమాత్రంగా వున్నాయి.

పండ్లుకాని, పూలు కాని ఎక్కడైనా మచ్చుకైనా లేవు. కనీసం కందమూలాలు, తేనె కూడా అక్కడ లేవు. అక్కడక్కడ తామర కొలనులు వున్నాయి. వాటిలో నీళ్ళు తామరాకులు, పరిమళం వెదజల్లె తామర పూలు వున్నాయి. కాని విచిత్రంగా ఒక్క తుమ్మెద అయినా వాటి దగ్గరకి వెళ్ళడం లేదు. అది చూసి వారంతా ఆశ్చర్యచకితులయ్యారు. అందుకు బలీయమైన కారణమేదో వుండి వుంటుందనుకున్నారు.

కాని వారికి తెలియని రహస్యమొకటి వుంది. పూర్వం కండవు అనే మహర్షి ఆవనంలో తపస్సు చేసుకుంటుండేవాడు. అప్పట్లో అన్ని అరణ్యాలలాగే అది కూడా జన సంచారంతో, వన్య మృగాలతో ఆశ్రమ పందాలతో అలరారుతుండేవి. ఒక రోజు ఆ మహర్షి కుమారుడు, పదహారేళ్ళ వయస్సు గలవాడు. అకాల మరణం చెందాడు.

పుత్రశోకంతో దహించుకుపోయిన ఆ మహర్షికి ఆ వనం మీద పట్టరాని కోపం వచ్చింది. ఆ కోపంతో " ఈ వనంలో ఏ ప్రాణీ నివశించకుండుగాక" అని ఘోరమైన శాపం ఇచ్చాడు. అప్పట్నుంచీ ఆ అడవి అలా ఏ ప్రాణి లేకుండా అయిపోయింది. ఆ సంగతి పాపం వారికి తెలియదు. ఆ ప్రదేశమంతా కూడా శ్రద్ధగా సీత కోసం వెతికారు. కాని, సీత జాడ గాని, రావణుని జాడగాని అక్కడ తెలియలేదు. ఇంకా ముందుకి నడిచి వెళ్ళారు. ఆ కీకారణ్యం మధ్యలో ఒక రాక్షసుడు వారికి కనిపించాడు. వాడ్ని చూసి వారంతా భయంతో కంపించి పోయారు. ప్రాణాలమీద ఆశ వదులుకున్నారు. ఆ రాక్షసుడు భయంకరంగా గర్జిస్తూ వారి మీదికి దూకాడు. అంగదుడు వాడే రావణుడు అనుకున్నాడు. అలా అనుకోగానే లేని తెగింపు వచ్చింది. తన అరచేతితో వాడి ముఖం మీద బలంగా కొట్టాడు.

అంతే ఆ రాక్షసుడు రక్తం కక్కుకుని చచ్చాడు. వాడు సీతనక్కడెక్కడో దాచాడనుకుని, ఆ వానర వీరులంతా ఆనందంగా వెతకసాగారు. అలా వెతుకుతూ

పోగా ఒక పెద్ద పర్వతం, దానిలో ఒక పెద్ద గుహ కనిపించాయి. వారంతా ఉత్సాహంగా ఆ గుహలో దూరి వెతికి అక్కడేమీ కనిపించకపోవడంతో బయటకి వచ్చి ఖిన్నమైన వదనాలతో చతికిలబడ్డారు. చాలా అలసిపోయి నీరసంతో వారలా కూలబడగా, అందరిలోనూ బలవంతుడు, మహాప్రాజ్ఞుడు అయిన అంగదుడు, కొంతసేదదీరి

"మిత్రులారా మనం అడవులూ, పర్వతాలూ, గుహలూ ఎన్నో వెతికాం. కాని సీతమ్మ జాడ తెలియలేదు. దేవతలాంటి ఆ మహాసాధ్విని దుష్టుడైన ఆ రాక్షసుడెక్కడ దాచాడో తెలియదు. మనం బయల్దేరి చాలా రోజులైంది. ఇలా కూలబడితే లాభం లేదు. దిగులు మాని సామర్ధ్యంతో వెతికితే తప్పక కార్య సిద్ధి కలుగుతుంది. కనుక లేవండి. ఉత్సాహం తెచ్చుకోండి. మళ్ళీ ప్రయత్నిద్దాం. సుగ్రీవుడు, అసలే చాలా కోపిష్టి. మనం కార్యం సాధించలేదని తెలిస్తే తీవ్రంగా దండిస్తాడు. గడువు పూర్తయ్యాక వెళ్ళినా సీతమ్మ జాడ తెలుసుకుని వెళితే మనల్ని తప్పక క్షమిస్తాడు.

రాముడు మహానుభావుడు. ఆయనకి హితవుకలిగె పనిచెయ్యడం మన కర్తవ్యం. బాగా ఆలోచించి ఓపిక తెచ్చుకుని లేవండి. నేను యువరాజుగా మిమ్మల్ని ఆజ్ఞాపించడం లేదు. మీ మిత్రుడిగా మనందరి మేలు కోరి చెప్తున్నాను. నామాటలు మీకు నచ్చాయా సరే. లేకపోతే మీకు తోచిన సలహా చెప్పండి" అన్నాడు.

అప్పుడు గందమాదనుడనే వానరవీరుడు లేచి, "యువరాజా దాహంతో మానాలుక పిడచకట్టుకుపోతోంది. అందుకే ఇలా లేవలేక పడివున్నాము. నువ్వు చెప్పిన సలహా చాలా బాగుంది. అదే మనకి మేలు. ఇంకోసారి పర్వతాలు, గుహలూ వెతుకుదాం. సుగ్రీవుడు చెప్పిన ప్రదేశాలింకా చాలా వున్నాయి. అవన్నీ వెతుకుదాం" అన్నాడు. సరే అంటే సరే అంటూ వానరులంతా మళ్ళీ బయల్దేరారు. తెల్లని రజతపర్వతము, శృంగమంతము, దరీమంతము, మొదలైన పర్వత శిఖరాలన్నీ వెతికారు. సప్తవర్ణవనములన్నీ గాలించారు.

మెల్లిగా లేచి అంతా ఒక పెద్ద చెట్టు నీడకి చేరారు. క్షణకాలం ఊపిరి పీల్చుకుని, మళ్ళీ దక్షిణదిశగా బయల్దేరారు. హనుమంతుడు, తారుడు, అంగదుడు, పరివారంతో ఆ వింధ్య పర్వతం లోని గుహలన్నీ మళ్ళీ గాలించి వెతికారు. అలా అలా వెతుకుతుండగానే సుగ్రీవుడు వారికిచ్చిన నెల్లాళ్ళ గడువు పూర్తయిపోయింది. వారంతా దాహంతో తపించి పోతూనే పశ్చిమ తీర పర్వతాలన్నీ వెతకసాగారు. ఇంకా దాహం ఆపుకోవడం వారితరం కావడం లేదు. అలాంటి

పరిస్థితిలో ఒక చోట వారికొక విశాలమైన బిలం కనిపించింది. అది మానవ మాత్రులెవరూ ప్రవేశించలేనంత దుర్గమంగా వుంది. అది ఋక్షబిలం. అక్కడ పూర్వం మయుడు అనే ఒక రాక్షసుడుండేవాడు. ఆమహాబిలంలో లతలు, వృక్షాలు కూడా వున్నాయి. క్రౌంచపక్షులు, హంసలు, సారసములు మొదలైన నీటి పక్షులు ఆ బిలంలోంచి బయటకి రావడం వానరులు చూశారు. ఆ పక్షులు నీటితో తడిసివున్నాయి. పద్మములు తాలూకు పుప్పొడి ఎఱ్ఱగా వాటిమీద అంటుకుని వుంది. ఇదంతా చూసాక ఆ బిలంలో మంచినీరు వుండి వుండవచ్చనే అనుమానం వారికి కలిగింది. వారికి చెప్పరాని ఆనందం కలిగింది. దాహంతో నోరెండిపోతున్న వారికి, త్రాగటానికి నీరు దొరకవచ్చనే ఆశ కలిగింది.

కాని ఆ బిలంలోకి వెళ్ళటానికి సరైన మార్గం వారికి తెలియలేదు. అప్పుడు హనుమంతుడిలా అన్నాడు.

"మిత్రులారా, ఈ బిలం లోపలనుంచి పక్షులు బయటకి వస్తున్నాయి. ఈ ప్రాంతమంతా పచ్చపచ్చగా వుంది. కనుక లోపల జలాశయం వుండి వుంచవచ్చు. బహుశా దీని లోపలికి వెళ్ళగలిగితే లోపల సీతమ్మ జాడ తెలియవచ్చు. కనుక మనం ఏదో ఒక ఉపాయంతో దీని లోపలికి వెళ్ళాలి" అని హనుమ అన్న మాటలకి, వానరులంతా లోపల ప్రవేశించే మార్గం కోసం వెతికారు. అంతా గాడాంధకారంగా వుండి, కన్ను పొడుచుకున్నా ఏం కనిపించడం లేదు.

వాళ్ళంతా అలాగే తడుముకుంటూ, పాకుతూ లోపలికి వెళ్ళసాగారు. అలా చాలా దూరం వెళ్ళాక లోపల్నించి చక్కని వెలుగు కనిపించింది. వాళ్ళంతా ఆయాసంతో తెలివి తప్పే దశకి వచ్చేశారు. ఇంకా లోపల అంతాపాకుడు కట్టి జారుడు బండలతో నిండి వుంది. వాళ్ళంతా ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని, ఆ జారుడు బండల మీద నుంచి ఒక యోజనం దూరం వెళ్ళి తెలివి తప్పి పడిపోయారు. అలా ఎంతసేపు పడివున్నారో వాళ్ళకే తెలియదు. తెలివి వచ్చి చూసే సరికి అక్కడంతా పట్టపగలులా వెలుతురుతో నిండివుంది. మిలమిలా మెరిసిపోతున్న బంగారం వృక్షాలున్నాయక్కడ. ఎఱ్ఱని పూల గుత్తులతో నిండిన లతలువున్నాయి. వృక్షాలకి బంగారు ఆభరణాలు వ్రేలాడుతున్నాయి. వాటి మధ్యలో వైఢూర్యాలు పొదిగిన వేదికలున్నాయి. వైఢూర్యం రంగులో వున్న తామర కొలను వుంది. అందులో స్వర్ణ కమలాలున్నాయి. చుట్టు వెండి, బంగారు తాపడం చేసిన భవనాలున్నాయి. కిటికీలకి ముత్యాల జాలీలు వున్నాయి. వృక్షాలన్నీ ఎఱ్ఱని మిగల ముగ్గిన [illegible]ళ్లతో నిండివున్నాయి. బంగారం తుమ్మెదలు తామర పూలమీద రొద చేస్తున్నాయి. మణులు పొదిగి బంగారంతో నిర్మించబడ్డ విచిత్రములైన

శయ్యలువున్నాయి. విలువైన వాహనాలున్నాయి. అన్ని వేపులా సుగంధ పరిమళము నిండి వుంది.

బంగారు, వెండి, కంచు పాత్రలు అందంగా అమర్చబడి వున్నాయి. రత్నకంబళ్ళు పరచి వున్నాయి. బంగారు కాసులు అక్కడక్కడ కుప్పలు పోసి వున్నాయి. వాటన్నింటి నడుమ ఒక వృద్ధ తాపసి, నార వస్త్రాలు, అజినము ధరించి, కూర్చుని వుంది. ఆ వానరవీరులందరికీ వెలుగు, నీరు చూసేసరికి ప్రాణంలేచివచ్చింది. హనుమంతుడొక్కడూ ఆ వృద్ధ తాపసి దగ్గరకి వెళ్ళి వినయంగా నమస్కరించి,

"అమ్మా మీరెవరు? ఈ బిలం ఎవరిది? ఈ సంపదలన్నీ ఎవరివి? అని అడిగాడు. మళ్ళీ తమని గురించి కూడా ఆమెకి తెలియచెప్పాలి కదా అని" 'అమ్మా, నేను, మామిత్రులు ఆకలితో, దాహంతో, చాలా బాధపడ్తున్నాము. చీకటి నిండిన ఈ బిలంలో నీరు లభించే ఆనవాళ్ళు కనిపించాయి. దాహం తీర్చుకోవాలనే ఆశతో ఇందులో ప్రవేశించాము. అయితే మేమూహించిన నీరు మాత్రమే గాక ఇక్కడ అందమైన భవనాలు, అపురూపమైన సంపదలు కూడా వున్నాయి. మాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఇవన్నీ కేవలం తపోబలం చేత మాత్రమే సాధ్యమైనవి. కనుక వీటిని గురించి వివరంగా తెలియజేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాము" అని అడిగారు. ఆవిడ చిరునవ్వుతో ఇలా జవాబు చెప్పింది. " వానరోత్తమా, అద్భుతమైన మహిమలు గల మయుడనే రాక్షసుడొకడున్నాడు. ఆయన సృష్టించుకున్నవే, ఈ అద్భుత దృశ్యాలన్నీ. ఈ భవనాలు విశ్వకర్మ నిర్మించాడు.

వెయ్యేళ్ళు విశ్వకర్మ ఇక్కడ తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి, ప్రసన్నం చేసుకుని, శుక్రుని ధనమంతా తనకి లభించేలా వరం పొందాడు. అలా వరం పొందాక ఈ అద్భుతమైన వనం, భవనాలు అన్నీ బంగారంతో నిర్మించాడు. చాలా సంవత్సరాలు సుఖంగా ఇక్కడ నివసించాడు. కొన్నాళ్ళకి హేమ అనే అప్సరసని ప్రేమించాడు.

ఇంద్రుడికి కోపం వచ్చి, తనవజ్రాయుధంతో అతడ్ని చంపేశాడు. బ్రహ్మ అతడి యందలి దయతో అతడికి దివ్యమైన శరీరాన్నిచ్చి శాశ్వతంగా హేమని అతడికిచ్చేశాడు. నేను మేరు సావర్ణి కుమార్తెనైన స్వయంప్రభని. ఈ భవనాన్ని కాపాడే బాధ్యత నాకప్పగించారు. నాకు ఎవరి వల్లా ఏ హాని కలుగకుండా నా ప్రాణ సఖియైన హేమ నాకు వరం ఇచ్చింది. వాళ్ళిద్దరూ అప్పుడప్పుడూ ఇక్కడికి

వచ్చి విహరిస్తు వుంటారు. ఇదీ ఈ ప్రాంతానికి చెందిన కథ. ఇంతకీ మీరెవరు? ఈ కీకారణ్యంలోకి మీరెందుకు వచ్చారు? దుర్భేద్యమైన ఈ బిలంలోకి ఎందుకు వచ్చారు. ముందు మీరు దాహం తీర్చుకురండి. ఆ తర్వాత తృప్తిగా మీక్కావల్సిన న్ని పండ్లు తినండి. కొంత సేపు విశ్రమించి, ఆ తర్వాత మీ వృత్తాంతం చెప్పండి" అంది.

ఆ తాపసిమాటలకి వారంతా చాలా సంతోషించారు. వాళ్ళు తృప్తిగా చల్లని నీరు త్రాగి, కడుపునిండా తియ్యని ఫలములు తిని, ఆకలి దప్పులు తీర్చుకున్నారు. కొంతసేపు సేదదీరి, ఆ వృద్ధతాపసి దగ్గరకి వెళ్ళారు. వాయు కుమారుడైన హనుమంతుడు, చేతులు జోడించి,

"అమ్మా మా సంగతి వివరించి చెప్తాను. దేవేంద్రునితో సరిసమానమైన దశరథ మహారాజు అయోధ్యకి ప్రభువు. ఆయన పెద్ద కుమారుడు శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణుని తోనూ, భార్యయైన సీతతోనూ దండకారణ్యానికి వెళ్ళాడు. అక్కడ ఆ అన్నదమ్ములను వంచించి, రావణుడు సీతమ్మనపహరించుకు పోయాడు. మా వానర జాతి ప్రభువైన సుగ్రీవుడు, ఆ శ్రీరామునికి ప్రాణమిత్రుడు. ఆయన ఆజ్ఞపై సీతమ్మ కోసం వెతుకుతూ యువరాజైన అంగదునితో కలిసి మేము దక్షిణ దిశగా వచ్చాము. దక్షిణ దిశ అంతా కలియ దిరిగాము. వెతికి వెతికి అలసిపోయాము గాని సీతమ్మ జాడ తెలియలేదు. ఆకలి దప్పులతో అలమటించి పోతూ మేమంతా ఒక చెట్టు నీడలో కూర్చున్నాము. దిక్కుతోచక బాధ పడుతున్న మాకు ఈ బిలం కనిపించింది. ఇందులోంచి నీటి పక్షులు తడిసి బయటకి రావటం మేము చూశాము. ఈ కీకారణ్యంలో ఎక్కడా ఒక్క జలాశయం కూడా కానని మాకు ప్రాణం లేచి వచ్చింది. ఈ బిలంలో నీరు వుండవచ్చనే ఆశతో చాలా కష్టపడి లోపలికి వచ్చాము. ఇక్కడికి వచ్చాక, ఈ అద్భుతమైన ప్రదేశం చూసి చాలా ఆశ్చర్యపోయాము. నువ్వు మాకు ఆహారము. మంచి నీళ్ళు ఇచ్చి మా ప్రాణం నిలబెట్టావు. మేమేం చేసినా నీ ఋణం తీర్చుకోలేము" అన్నాడు.

అందుకా వృద్ధ తాపసి చిరునవ్వుతో "నాయనా నేను నా ధర్మం నిర్వర్తించానంతే. మీ మాటలు వింటుంటే నాకు చాలా సంతోషంగా వుంది" అంది సాదరంగా.

ఆమె తియ్యని మాటలకి పరవశుడై హనుమంతుడిలా అన్నాడు "ధర్మచారిణీ మాకందరికీ ఇంక నువ్వే శరణు. మా ప్రభువైన సుగ్రీవుడు ఒక నెలలోపున

సీతమ్మ జాడ తెలుసుకురమ్మనీ, నెలదాటాక వస్తే మరణదండన తప్పదనీ శాసించాడు. ఆగడువెప్పుడో పూర్తయి పోయింది. ఇపుడింక ఈ బిలంలోంచి బయటపడే మార్గం కూడా మాకు తెలియదు. కనుక మా ఆయువు మూడినట్లే.

అమ్మా మాకు బయటకి వెళ్ళే మార్గం చెప్పి మమ్మ రక్షించు. మేమెలాగైనా మా ప్రభువుచెప్పిన కార్యం చెయ్యాలనే పట్టుదలతో వున్నాము. ఈ బిలంలోనే వుండిపోతే మేమేమీ చెయ్యలేము". అంటూ అనేక విధాల ప్రాధేయపడ్డాడు.

అప్పుడావిడ వాళ్ళవంక జాలిగా చూసి "వెఱ్ఱివాళ్ళలా వున్నారు. ఈ బిలంలో ప్రవేశించిన వారెవరూ ప్రాణాలతో బయటపడలేరు. కాని, మీ సౌశీల్యాన్ని నేను మెచ్చాను. నా తపోబలంతో మిమ్మల్ని రక్షిస్తాను. మీరంతా మీ కళ్ళుగట్టిగా మూసుకోండి. ఏ ఒక్కరు కన్నులు తెరచివున్నా బయటపడలేరు" అని ఆమె చెప్పగానే వాళ్ళంతా తమ చేతుల్తో గట్టిగా కళ్ళు మూసుకున్నారు. క్షణకాలంలో వాళ్ళందర్నీ ఆమె బయటకి తీసికెళ్ళింది. బిలంలోంచి బయటపడగానే వారు తెప్పరిల్లి హాయిగా నిట్టూర్చారు.

అప్పుడు స్వయంప్రభ వారితో "ఇదిగో ఇది వింధ్య పర్వతం. ఎన్నోరకాల వృక్షాలు, లతలు, దీని మీదున్నాయి. అది ప్రస్రవణ గిరి. ఆ కనిపించేది సముద్రం కనుక మీ అన్వేషణ ఒక పద్ధతిలో మళ్ళీ ప్రారంభించండి. మీకు శుభము కలుగుతుంది. అని దీవించి వెళ్ళిపోయింది. వానరవీరులు భయంకరమైన ఆ సముద్రాన్ని చూశారు. అంతులేని కెరటాలతో భీకరంగా గర్జిస్తున్నట్లు ధ్వనిచేస్తోంది. వారంతా ఆ వింధ్య పర్వతం పైనే కూర్చుని కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తున్నారు. చెట్లన్నీ చిగిర్చి పూలతో నిండి వుండటం చూసి వసంతకాలం వచ్చిందని గ్రహించారు. గడువు తీరిపోయాక వెనక్కివెళ్తే జరిగే ఘోరమైన పరిణామాలు తెలుసుకుని వారంతా భిన్నులైపోయారు. అప్పుడు అంగదుడు వారితో "మిత్రులారా మనప్రభువు మనకిచ్చిన ఒక నెల గడువు పూర్తై పోయింది. మనం ఆశ్వీజమాసంలో బయల్దేరాం. మనకు తెలియకుండానే నెల రోజులు గడిచిపోయాయి. మీరంతా ప్రభు భక్తి పరాయణులు. కార్యదీక్షులు. పౌరుషం గలవారు. కాలాతీతమైనది. కనుక మనకి మరణదండన తప్పదు. మనం వెనక్కి తిరిగి వెళ్ళేకంటే ఇక్కడే ప్రాయోపవేశం చెయ్యడం మంచిది. నిజానికి సుగ్రీవుడికి నా మీద ఎంత మాత్రం ప్రేమలేదు. శ్రీరాముని ఆజ్ఞకి కట్టుబడి మాత్రమే నన్ను యువరాజుగా అభిషేకించాడు.

నా తండ్రిపై వుండే కక్ష ఇప్పుడు నా మీద తీర్చుకుంటున్నాడు. కనుక

నేనుమాత్రం వెనక్కిరాను. ఈ సముద్ర తీరాన్న ప్రాయోపవేశం చేస్తాను" అన్నాడు.

అపుడు వానరులంతా "యువరాజా, సుగ్రీవుడసలే చాలా కోపిష్టి. రాముడేమో సీతమ్మని ఎడబాసి దుఃఖంలో వున్నాడు. సీత జాడ తెలియలేదని మనం వెళ్ళి చెప్తే ఆయన దుఃఖం మరింత ఎక్కువ అవుతుంది. రామకార్యం నెరవేర్చగా కాలాతీతమైంది. కనుక మనకు ఇంకా ఇంకా సీతమ్మ జాడతెలిస్తే, వెనక్కి వెళ్ళినా సుగ్రీవుడు మనల్ని ఏమీ చెయ్యడు. ఒక వేళ జాడ తెలియకపోతే మనమే యమలోకానికి వెళ్ళవచ్చు" అంటూ తర్జన భర్జనలలో మునిగిపోయారు.

అప్పుడు తారుడు అనే వానరవీరుడిలా అన్నాడు "మీరంతా ఎందుకిలా దిగులుపడ్తున్నారు? పరిస్థితి అంత వరకు వస్తే హాయిగా మయుడి బిలంలోకి వెళ్ళి, అక్కడే సుఖంగా వుందాం. అక్కడికెవ్వరూ రాలేరు. ఆహారము, నీరు పుష్కలంగా వున్నాయి. నిర్భయంగా జీవించవచ్చు. అక్కడుంటే మనకి సుగ్రీవుని వల్ల ఏ భయము వుండదు" అన్నాడు. ఆ మాటలకి అంగదుడు సంతోషించాడు.

"ఈ ఆలోచన చాలా బాగుంది. మనమంతా సుగ్రీవుని బారి పడకుండా, మయుడి బిలంలో వుండి పోవడమా లేక ప్రాయోపవేశం చెయ్యటమా. బాగా ఆలోచించి, మీరే నిర్ణయించండి" అన్నాడు.

వానరవీరులంతా బాగా ఆలోచించారు. వారిమధ్య చాలాసేపు వాదోపవాదాలు జరిగాయి.

కాని హనుమంతుడు ఆరెండింటినీ సమర్ధించలేదు. అంగదుని ఉద్దేశించి ఇలా అన్నాడు.

"యువరాజా, నువ్వు చాలా సమర్ధుడివి. నీ తండ్రిరాజ్యాన్ని వహించగల వారసుడివి నువ్వే. కనుక కాస్త స్థిమితంగా ఆలోచించు. మన వానరులంతా చపల చిత్తులు. భార్యా బిడ్డల్ని విడిచి ఎంతకాలం నిన్నంటి పెట్టుకుని వుంటారు? వారెంతో కాలం నీవెంట వుండలేరు. నేనీ సంగతి కచ్చితంగా చెప్పగలను.

ఇంక- జాంబవంతుడు, నీలుడు, సుహోత్రుడు, నేనూ నిన్ను నమ్ముకుని సుగ్రీవుని దూరం చేసుకోలేము. నువ్వే విధంగా ప్రయత్నించినా, మమ్మల్ని సుగ్రీవుని నుంచి వేరు చెయ్యలేవు. పైగా మీరనుకుంటున్నట్లు ఈ బిలం దుర్భేద్యమైనది కాదు. లక్ష్మణుని బాణాలు పిడుగుల్లాంటివి. అతడికి కోపం వస్తే దీన్ని కూకటి వేళ్ళతో పెల్లగించి పడేస్తాడు. సుగ్రీవునికి తెలియకుండా మనం ఈ బిలంలో దాక్కోవాలనుకోవడం చాలా హాస్యాస్పదం. చివరికీ ఈ

వానరులంతా నిన్నేకాకిగా వదిలేసి పలాయనం చిత్తగించడం ఖాయం. లక్ష్మణుడి బాణాలు నువ్వెక్కడున్నా వెంటాడి చంపితీర్తాయి. కనుక బిలంలో తల దాచుకోవాలనే ఆలోచన మానుకో.

అంతే కాదు. నువ్వు ప్రాయోపవేశం చెయ్యవలసిన అవసరం కూడా లేదు. మనమందరం కలిసి కట్టుగా సుగ్రీవుని దగ్గరకి వెళ్ళి శరణందాము. అప్పుడు సుగ్రీవుడు తప్పక క్షమిస్తాడు. నువ్వనుకున్నంత కఠినాత్ముడు కాదతడు. ధర్మశీలి, స్నేహశీలి, ఆడి తప్పనివాడు. నిన్నెప్పటికీ చంపడు. మీ అమ్మ తార అంటే సుగ్రీవుడికి చాలా ప్రేమ, గౌరవం ఆమె మనస్సుకి కష్టం కలిగించేపని అతడెప్పుడూ చెయ్యడు. ఆమె కోసం తన సర్వస్వాన్ని సమర్పిస్తాడు.

అదీ గాక, సుగ్రీవునికి సంతానం లేదు. కనుక వారసుడవైన నిన్ను చంపడు. బాగా ఆలోచించు దాక్కోటం అవివేకం. సుగ్రీవుని దగ్గరకే వెళ్దాం" అని నచ్చచెప్పబోయాడు. కాని అంగదుడు ఆంజనేయుని మాటలు తోసిపుచ్చి "హనుమా సుగ్రీవుని గురించి నీకేం తెలుసు? నువ్వనుకున్నంత ధర్మపరుడు కాదు. తన అన్న బతికివుండగానే ఆయన పట్టపురాణిని భార్యగా స్వీకరించిన అల్పుడతడు. అన్న వెంట రక్షణగా వెళ్ళిన వాడు, అన్నని శత్రువు హతమార్చాడో లేదో తెలియకుండానే గృహద్వారాన్ని బండరాయితో మూసివచ్చాడే, అతడు ధర్మాత్ముడెలా అవుతాడు? రాముని వలన సహాయం పొందికూడా అగ్నిసాక్షిగా చేసుకున్న మైత్రిని మరచి, విలాసాలలో మునిగిపోయిన వాడు, సీతాన్వేషణకి మనల్ని పంపడం, ధర్మానికి కట్టుబడి అనుకున్నావా?

ఎంత మాత్రం కాదు. లక్ష్మణుడు తనని మట్టుబెడతాడనే భయంతో మాత్రమే తెలుసా? ఇవాళ కాక పోతే రేపైనా అతడికి సంతానం కలుగుతుంది. అప్పుడు తన వారసుడిగా వాడికే పట్టం కట్టాడు. ఇప్పుడు నేను కిష్కింధకి వెళ్ళినా బ్రతకనివ్వడు. రహస్యంగా అయినా సరే చంపితీర్తాడు. మానసికంగా కృంగిపోతూ బతకటం కంటే, ప్రాయోపవేశం చేసి చావటమే మేలు. కనుక మీరంతా నాకు ప్రాయోపవేశం చెయ్యటానికి అనుమతి నివ్వండి. మీరంతా మీ ఇళ్ళకి తిరిగి వెళ్ళిపోండి. నేను మాత్రం ప్రమాణ పూర్తిగా కిష్కింధకి రాను. మీరు మన రాజ్యానికి వెళ్ళి పూజ్యులైన రామ లక్ష్మణులకి నా నమస్కారాలు చెప్పండి. సుగ్రీవుని సెలవడిగానని చెప్పండి. నా తల్లిని ఓదార్చండి. నా తల్లితో సమానమైన రమని అడిగానని చెప్పండి" అంటూ అంగదుడు అందరికీ అప్పగింతలు చెప్పి తన పరివారంలో పెద్దవారందరికీ ప్రణామాలు తెలిపి, ఖిన్నవదనంతో నేలమీద దుర్భలు

పరచి ప్రాయోపవేశానికి సిద్ధపడ్డాడు. మిగిలిన వానరులు కూడా కన్నీరు కారుస్తూ ప్రాయోపవేశానికి సిద్ధపడ్డారు.

అందరూ ఆచమనం చేసి తూర్పు దిక్కుగా కూర్చుని, దర్భల మీద వరసగా పడుకున్నారు. వారిలో వారు దుఃఖం పట్టలేక ఇలా మాట్లాడుకున్నారు.

"రాముని వనవాసం, దశరథుని మరణం, జనస్థానంలో పద్నాలుగు వేల మంది రాక్షసుల్ని రాముడు చంపడం, రావణుడు జటాయువుని చంపి సీతని ఎత్తుకుపోవడం, రాముడు వాలిని చంపడం, రాముడికి సుగ్రీవుని మీద కోపం రావడం, ఈ విషయాలన్నీ కథలుగా చెప్పుకుంటూ, తమకీ దీనావస్థ కలగటానికి కారణమైన సంఘటనల్ని చర్చించి నెమరు వేసుకుంటూ, ప్రాణాలు వదలటానికి, ప్రాయోపవేశ దీక్షలోకి వెళ్ళటానికి సిద్ధమవుతున్నారు. వారంతా అలా మాట్లాడుకుంటు వుంటే ఆ మాటలన్నీ పెద్ద కోలాహలంగా పర్వత గుహలలో ప్రతిధ్వనించాయి. అంటే ప్రాణభయంతో వారంత గట్టిగా గర్జించినట్లు మాట్లాడుకున్నారన్నమాట.

కన్నీరు మున్నీరుగా వారంతా అలా రోధిస్తుండగా, సంపాతి అనే గృధ్రరాజు అక్కడికి వచ్చాడు. వింధ్య పర్వత గృహ లోపల్నించి, మహాబలవంతుడైన ఆపక్షీంద్రుడు బయటకు వచ్చి "ఆహా దైవం అనుకూలిస్తే అయాచితంగానే కోరినవన్నీ లభిస్తాయి కదా. నాకిప్పుడు పుష్కలంగా ఆహారం దొరికింది. ఈ వానరులందర్నీ తృప్తిగా ఆరగిస్తాను" అంటూ వానరులను చంపడానికి దగ్గరగా వెళ్ళింది. పర్వతాకారంలో వున్న ఆ సంపాతిని వానరులు చూశారు. అప్పుడు అంగదుడు ఆందోళనతో "హనుమా అటు చూడు మృత్యువు పక్షిరూపంలో మనల్ని కబళించడానికి వస్తోంది. ఆనాడు జటాయువు అనే పక్షీంద్రుడు సీతమ్మని రక్షించడానికి తన ప్రాణాలర్పించింది. సీత కోసం రావణునితో పోరాడి మరణించిన జటాయువెంత ధన్యుడో కదా. ఈనాడు మనం రామకార్యార్థమై బయల్దేరి వచ్చి ఈ పక్షంద్రునికి ఆహారమైపోతున్నాం" అంటూ మనోవేదన భరించలేక బిగ్గరగా అరిచాడు.

ఆ మాటలు విన్న సంపాతి, దుఃఖంతో "ఓరీ నా సోదరుడైన జటాయువు మరణించాడని చెప్పినదెవరు? అసలు ఆరావణునితో నా సోదరుడెందుకు పోరాడవలసి వచ్చింది? అయ్యో నా రెక్కలు సూర్యకిరణాల వల్ల మాడిపోయాయి. అందుకని ఎగిరి మీ దగ్గరకి రాలేను. దయవుంచి నన్నీ కొండమీద నుంచి దింపండి. నా సోదరుని వృత్తాంతం చెప్పి నా ఆందోళన తీర్చండి. అసలతడు నిజంగా

మరణించాడా నామీద దయతో నన్నిక్కడ్నించి మీ దగ్గరికి తీసికెళ్ళరా" అంటూ ప్రాథేయపడింది.

సంపాతి పలుకులు విన్న వానరులు, అదంతగా ప్రాథేయపడుతున్నా, తమనందర్నీ చంపితినేస్తుందేమో అని భయంతో మౌనంగా చూస్తు వుండి పోయారు. కొంత సేపటికి తమ తెలివి తక్కువ ఆలోచనకి తామే నవ్వుకున్నారు. ఎలాగు చావడానికి సిద్ధమైనప్పుడు, ఎలా చస్తే ఏమిటి అనుకున్నారు.

వెంటనే పర్వతంపై నుంచి సంపాతిని కిందికి దింపారు. యువరాజైన అంగదుడు సంపాతితో ఇలా అన్నాడు. " ఆర్యా ఋక్షరజస్సు అనే వానరరాజు కిష్కింధని పాలించే వాడు. ఆయనకు వాలి, సుగ్రీవుడు అనే ఇద్దరు కుమారులు కలిగారు. మహాబలవంతులైన ఆ ఇద్దరిలో పెద్దవాడైన వాలి నా తండ్రి. భూమండలాన్నంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన దశరథ మహారాజు పెద్ద కుమారుడు, శ్రీరాముడు, తండ్రి ఆజ్ఞపై తమ్ముడు లక్ష్మణుడు, భార్య సీత వెంటరాగా, దండకారణ్యానికి వెళ్ళాడు. వారు వనవాసదీక్షలో దండకారణ్యంలో పర్యటిస్తూ జనస్థానంలో ఆశ్రమం నిర్మించుకుని పంచవటి వద్ద వున్నారు. అప్పుడు రావణుడు ఆ అన్నదమ్ముల్ని వంచించి సీతమ్మని అపహరించుకుపోయాడు. దశరథ మహారాజు మిత్రుడైన జటాయువు అనే పక్షిరాజు రావణుణ్ణి అడ్డగించి యుద్ధం చేశాడు. సీతమ్మని ఎలాగైనా కాపాడాలని ఆ పక్షీంద్రుడు పోరుతుండగా రావణుడు జటాయువుని చంపేశాడు. శ్రీరాముడు జటాయువు కోసం దుఃఖించి అతనికి అగ్ని సంస్కారం చేశాడు. జటాయువు మోక్షం పొందాడు.

సీతకోసం వెతుకుతూ బయల్దేరిన రాముడు, మా ప్రభువైన సుగ్రీవునితో మైత్రి చేసుకున్నాడు. మా ప్రభువు ఆజ్ఞపై మేము సీతమ్మని వెతుకుతూ బయల్దేరాము. గడువు పూర్తైంది గాని సీతమ్మ జాడ తెలియలేదు. అందుకే ఆయన మాకిచ్చిన గడువులోగా మేము వెనక్కి వెళ్ళనందుకు మాకు సుగ్రీవుడు మరణ దండన విధిస్తాడనే భయంతో మేము ప్రాయోపవేశం చేస్తున్నాము" అంటూ తమ పరిస్థితి సంపాతికి వివరించాడు.

వారి వృత్తాంతం విన్న సంపాతి కళ్ళ నీరు పెట్టుకుని, " వానరోత్తములారా జటాయువు నా తమ్ముడు అతడు మరణించాడన్న వార్త నాకు చాలా దుఃఖం కలిగించింది. నేను చాలా వృద్ధుడ్ని. రెక్కలు లేవు. ఏమీ చెయ్యలేని పరిస్థితిలో వున్నాను. లేకపోతే నా తమ్ముని చంపిన ఆ రావణుడిమీద పగతీర్చుకుని

వుండేవాణ్ణి. మా చిన్నతనములో నేనూ, మా తమ్ముడు, సూర్యుని దగ్గరకి చేరుకోవాలని పందెం వేసుకుని ఆకాశంలోకి ఎగిరాము. సూర్యుడు నడి నెత్తిమీద తీవ్రమైన తేజస్సుతో వున్నాడు. ఆ వేడికి తాళలేక నా తమ్ముడైన జటాయువు కృంగిపోయాడు.

నేను అతడ్ని కాపాడాలని నా రెక్కలతో వాడ్ని కప్పి ఎండ తగలకుండా చేశాను. కాని సూర్యుని వేడి తీవ్రతకి నా రెక్కలు కాలిపోయాయి. నేను వింధ్య పర్వతం మీద పడిపోయాను. అప్పట్నుంచీ నా తమ్ముడెక్కడికెళ్ళిపోయాడో నాకు తెలియలేదు. నేనెక్కడ పడిపోయానో వాడికి తెలియలేదు." అని ఏడుస్తూ చెప్పాడు సంపాతి. అపుడు అంగదుడు అతనిపై జాలిపడి "పక్షిరాజా నీ తమ్ముడైన జటాయువు గురించి మేము చెప్పాము కదా. సీతమ్మనెత్తుకుపోయిన ఆరావణుడు ఎక్కడుంటాడో నీకు తెలిస్తే చెప్పు" అని అడిగాడు.

అపుడు సంపాతి " నాయనా నా రెక్కలు కాలిపోయాయి. నేను శారీరకంగా రామకార్యానికి సాయపడలేను. కాని సీతమ్మ జాడ వివరంగా చెప్పగలను. నాకు అతల, వితల పాతాళ లోకాల గురించి తెలుసు. త్రివిక్రముడు, మూడడుగులు దానంగా తీస్కోవడం తెలుసు. దేవాసుర సంగ్రామం గురించి కూడా నాకు తెలుసు. అమృతం గురించి దేవతలు, దానవులు సాగర మథనం చెయ్యడం కూడా నాకు తెలుసు. ఇవన్నీ నా కళ్ళముందే జరిగాయి. ఇప్పుడు రామునికి సాయపడడం నా ధర్మం.

కాని నాకేవిధంగానూ శక్తి లేదు. దుర్మార్గుడైన రావణుడు సర్వాలంకార భూషితయైన సీతని ఎత్తుకుపోవడం కళ్ళారా చూశాను.

అప్పుడామె "రామా లక్ష్మణా అని ఆక్రోశిస్తోంది. ఆభరణాలన్నీ అటు ఇటు చిమ్మేస్తోంది. చేతులు కాళ్ళు గుంజుకుంటోంది. "రామా" అని అరచింది కనుక ఆమె తప్పక సీత అయి వుంటుంది. రావణుడు కుబేరుని తమ్ముడు. లంకా నగరంలో వుంటాడు. లంక సముద్ర మధ్యలో వున్న ద్వీపము. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు. బంగారు ద్వారాలు, తలుపులు అరుగులు వున్న భవనాలాలంకా నగరంలో వుంటాయి. రావణుని నగరంలో రాక్షసులు చేత కాపలా కాయబడ్తు వైదేహి వుంది. నూరుయోజనముల దూరంలో సముద్రంలో లంకా నగరం వుంది. మీరు తొందరగా వెళ్ళండి. నేనిదంతా దివ్యదృష్టివల్ల తెలుసుకుని చెప్తున్నాను. వినత కుమారులైన గరుత్మంతుడు, అరుణుడు మాపూర్వీకులు నేనూ జటాయువు అరుణుని కుమారులము. అందుకే మాకు దివ్య దృష్టితో చూడగలిగే శక్తి వుంది.

ఆరావణుడు నరబక్షకుడు నా తమ్ముని చంపినందుకు వాడి మీద పగ తీర్చుకోవాలని వుంది. మీరెలాగైనా ఈ లవణ సముద్రాన్ని దాటి, సీతమ్మని చేరి కృతార్థులవండి. ఈలోగా నా మీద దయతో నన్ను ఆ సముద్రతీరం దాకా తీసికెళ్ళండి. నా సోదరునికి జలతర్పణాలు వదుల్తాను" అంటూ ఆ వానరుల్ని బ్రతిమాలింది సంపాతి.

కదలలేని స్థితిలో వున్న ఆ సంపాతిని వానరులంతా సముద్ర తీరం దాకా తీసికెళ్ళారు. సీతమ్మ జాడ చెప్పిన ఆ సంపాతి మీద వాళ్ళందరి మనస్సులూ కృతజ్ఞతలతో నిండిపోయాయి. సంపాతి పలుకులు వారికి అమృతోపమాలుగా వున్నాయి. సముద్రతీరంలో సంపాతి తన కార్యక్రమం పూర్తి చేసుకున్నాక, వృద్ధుడైన జాంబవంతుడిలా అన్నాడు.

"సంపాతీ లంకలో సీతమ్మ ఎక్కడుంది? ఎత్తుకుపోయిన రావణుడెవరు? ఆ వృత్తాంతం కాస్త వివరంగా చెప్పగలవా? మాకందరికీ ఇప్పుడు నువ్వే రక్షకుడివి. రామ బాణాలు వజ్రతుల్యాలనీ, లక్ష్మణుని కంట పడితే, ప్రాణాలుదక్కవనీ, తెలియని వాడెవడో ఈ పని చేసి వుంటాడు" అని సంపాతినడిగాడు.

అపుడు సంపాతి "వానరులారా సంగతులన్నీ నాకు తెలిసినంత వరకు చెప్తాను వినండి. నేనీ పర్వత పర్వత ప్రాంతంలో ఎన్నో ఏళ్ళుగా పడివున్నాను. ఇక్కడే ముసలాడినైపోయాను. నా శక్తి ఉడిగి పోయింది. కదలలేని స్థితికి వచ్చాను. నా కొడుకు సుపార్శ్వుడు చాలా సద్గుణ సంపన్నుడు. నేను కదలలేని స్థితికి వచ్చిన దగ్గరనుంచీ వాడే నాకు ఆహారం తెచ్చిపెడ్తున్నాడు. ఒకనాడు సూర్యాస్తమయ సమయానికి, నా కొడుకు నాకు ఆహారం ఏం తేకుండా వచ్చాడు. అప్పటికే నాకు చాలా ఆకలిగా వుంది. కోపంతో వాడిమీద కేకలు పెట్టాను.

అప్పుడు వాడు నన్ను అనునయిస్తూ "తండ్రీ నేను మామూలుగానే నీకు ఆహారం తేవాలని వెళ్ళాను. ఆకాశంలో ఎగురుతుండగా మహేంద్ర పర్వతం దగ్గరకొచ్చేసరికి, అటెవరైనా వస్తే చంపితెద్దామని ఆ పర్వత శిఖరాల మాటున పొంచి చూస్తున్నాను. అప్పుడు నల్లగా, కాటుక రంగులో భయంకరంగా వున్న వాడొకడు బంగారు తీగలాంటి ఒక స్త్రీని ఎత్తుకుపోతూ కనిపించాడు. వాణ్ణి చంపాలని ముందుకి కదిలాను. కాని వాడు దారికడ్డురావద్దని ప్రాధేయపడ్డాడు. ఆవిధంగా యాచించే వానిని చంపడం అనుచితం కదా. అందుకే వాణ్ణి వదిలేశాను. వాడు ఆకాశ మార్గంలో ముందుకి దూసుకుపోయాడు.

అంతలో ఆకాశంలో సంచరించే భూతాలూ, మహర్షులు వచ్చి నన్ను

బ్రతికిపోయావురా అని అభినందించారు. ఆ వెళ్ళేవాడు రావణాసురుడు. దశరథ మహారాజు కోడల్ని ఎత్తుకుపోతున్నాడని వాళ్ళు నాకు చెప్పారు. ఆమె ఆభరణాలు చెదిరి, జుట్టు ముడి వీడి "హారామా, హా లక్ష్మణా" అని రోదిస్తోంది. అప్పటికే చాలా పొద్దుపోవడం వల్ల ఆహారం తీసుకురాకుండా వచ్చేశాను" అని వాడు చెప్పాడు. రాముని భార్య అయిన సీతని రావణుడపహరించిన సంగతి ఆ విధంగా నాకు తెలిసింది. ఇప్పుడీ సంగతి మీకు చెప్పాక రామునికే విధంగానైనా సహాయం చెయ్యగలిగానన్న తృప్తి నాకు కలిగింది. మీరంతా పరాక్రమవంతులు. ఆ సుగ్రీవుడు అదృష్టవశాత్తు మిమ్మల్ని ఇటు పంపాడు. రామ లక్ష్మణుల బాణాలకి తిరుగులేదన్న సంగతి నిజమే అయినా, ఆ రావణుడు కూడా చాలా బలవంతుడు. బాగా ఆలోచించి కార్యసిద్ధి చెయ్యగల మార్గం నిర్ణయించండి" అని చెప్పింది సంపాతి. ఆ తర్వాత మళ్ళీ తన కింకో సంగతి గుర్తువచ్చిందని ఇలా చెప్పింది.

"వానరులారా, సీతమ్మ గురించి ఇంకో యదార్థమైన సంగతి చెప్తాను. సూర్యునివేడికి రెక్కలు కాలి ఈ వింధ్య పర్వతం మీద పడ్డానని చెప్పాను కదా. అలా ఆరు రోజులు, తెలివి తప్పి పడివున్నాను. ఇక్కడ ఒక పవిత్రమైన ఆశ్రమం వుంది. ఆ ఆశ్రమంలో నిశాకరుడనే ఒక మునీశ్వరుడున్నాడు. నేను తెలివి వచ్చాక మెల్లిగా పాకుతూ ఆయన దగ్గరకెళ్ళాను. అది వరలో జటాయువు, నేను ఆయన సన్నిధికి చాలా సార్లు వెళ్ళాము. రెక్కలు కాలిన నేను ఒక చెట్టు నీడలో ఆయన రాకకై ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఆయన తిరిగి వస్తూ నన్ను చూసి,

"నాయనా నీ శరీరమంతా ఇలా పుండు పడివుందేమిటి?" అని అడిగాడు. అప్పుడు జరిగిన సంగతంతా ఆయనకి నివేదించాను. "ఆర్యా నారెక్కలు కాలిపోయాయి. నా సోదరుడు దూరమయ్యాడు. కదలలేని స్థితిలో వున్నాను. అందుకని ఈ పర్వతం మీదనించి దొర్లి చచ్చిపోదామనుకుంటున్నాను" అని ఆ మునీంద్రుని పాదాలపై బడి భోరున ఏడ్చాను.

ఆ మహర్షి క్షణకాలం కన్నులు మూసుకుని, ఆ తర్వాత "సంపాతీ, నీ రెక్కలు కాలిపోయినా మళ్ళీ చిన్న రెక్కలు మొలుస్తాయి. దిగులు పడకు. నీవలన ఒక మహత్తర కార్యం జరగవలసి ఉంది. నా తపశ్శక్తి వల్ల జరగబోయే సంగతి ఒకటి తెలిసింది. ఇక్ష్వాకు వంశంలో దశరథుడనే మహారాజు పుడతాడు. ఆయనకు రాముడనే కుమారుడు కలుగుతాడు. సత్యపరాక్రముడైన రాముడు, భార్యతోటీ తమ్మునితోటి తండ్రి ఆజ్ఞపై వనవాసానాకి వెళ్తాడు. వాళ్ళు వనవాసంలో వుండగా రావణుడనే రాక్షసుడు రాముని భార్యనపహరిస్తాడు. రావణుడామెని లంకకి

తీసికెళ్ళి తన సంపదలు చూపించి, ప్రలోభపెట్టి అనేకరకాలైన బక్ష్యాలు, భోజ్యాలు తినమని పెడతాడు. భర్తని ఎడబాసి దుఃఖిస్తున్న ఆమె ఏమీ తినదు. అది తెలుసుకున్న ఇంద్రుడామెకి ఆమోఘశక్తి గల పరమాన్నం తినటానికిస్తాడు. అది అమృతంలాంటిది. రామదూతలైన వానరులు ఆమెని వెతుకుతూ ఇక్కడికి వస్తారు. నువ్వప్పటికి దాకా వేచి వుండి, సీతని రావణుడు లంకకి తీసికెళ్ళిన సంగతి వారికి తెలియపరచాలి. నీకిప్పుడు రెక్కలు లేవు కనక ఎక్కడికీ వెళ్ళలేవు. ఇక్కడే వుండు. నువ్వెప్పుడైతే ఈ సంగతి వానరులకి చెప్తావో అప్పుడే నీకు రెక్కలు వస్తాయి" అంటూ జరగబోయేదంతా వివరించి చెప్పాడాయన. ఇది జరిగి ఎనిమిదివేల సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడా మహర్షి లేరు. నేను మెల్లగా పాకుతూ, పాకుతూ వింధ్య పర్వతం ఎక్కి మీ కోసం నిరీక్షిస్తు వున్నాను. రామకార్యం నిమిత్తం మీరు వస్తారని, ముని చెప్పిన మాటలు స్మరిస్తు ప్రతి క్షణం మీ కోసం ఎదురు చూస్తున్నాను. నా మనస్సంతా దహించుకుపోతోంది. ప్రాణాలతో వుండడం కష్టమైపోతోంది. చనిపోదామన్నా, ముని మాటలు గుర్తువచ్చి, ప్రాణాలు నిల్పుకుని వున్నాను" అంటూ సంపాతి మాట్లాడుతూ వుండగానే సంపాతికి రెక్కలు మొలవడం వానరులు చూశారు. ఎఱ్ఱని ఈకలతో మొలచిన రెక్కలు చూసుకుని సంపాతి బ్రహ్మానందం పొందింది.

సంతోషంతో పరవశించిపోతూ సంపాతి "వానరోత్తములారా, నిశాకర మహర్షి ప్రభావం వల్ల సీతా వృత్తాంతం మీకు చెప్పగానే నాకు రెక్కలు వచ్చాయి. యౌవనంలో వుండే పౌరుషం, పరాక్రమం మళ్ళీ నాకు కల్గుతున్నాయి. కనుక ఆ మహర్షి వాక్కు అమోఘం. మీరు తప్పక సీతమ్మని చూడగలరు. అందుకిదే నిదర్శనం" అంటూ ఆనందంతో సంపాతి, తన రెక్కలు పరీక్షించుకోవటానికి, ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

వానరులకి కూడా అపరిమిత ఆనందం కలిగింది. వారంతా శక్తి పుంజుకుని, అభిజిత్ అనే ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు. మహానందంతో సింహాల్లా గర్జించారు. సీతమ్మ జాడ తప్పక తెలుస్తుందనే నమ్మకం వారికి కలిగింది. ఎలాగైనా సముద్రం దాటాలనే పట్టుదలతో వారు సముద్ర తీరానికి చేరారు. ఆ సముద్రంలో పెద్ద పెద్ద జలచరాలు ఎగిరెగిరి పడ్తున్నాయి. పెద్ద పెద్ద తిమింగలాలు నోరు తెరచుకుని, మీదికి వస్తున్నాయి. పర్వత మంత ఎత్తున అలలు ఎగిపి పడ్తున్నాయి. అటువంటి గంభీరమైన సముద్రాన్ని వారు చూశారు. భీకరమైన ఆ సముద్రాన్ని చూడగానే భయంతో వారి శరీరాలు గగుర్పొడిచాయి. అనంతమైన ఆ సముద్రాన్ని చూడగానే వారికి చెప్పలేనంత దిగులు కలిగింది. దాన్ని

ఎలాదాటాలో అంతుచిక్కలేదు. నిరాశతో వారికి నిర్వేదం కలిగింది. అప్పుడు మహాబలశాలి అయిన అంగదుడు ధైర్యం తెచ్చుకుని ఇలా అన్నాడు.

"మిత్రులారా దిగులు పడి ప్రయోజనం లేదు. దిగులు వలన విషాదం కలుగుతుంది. విషాదం ప్రాణుల జ్ఞానాన్ని కబళించి వేస్తుంది. శక్తి హీనుణ్ణి చేస్తుంది. అపుడింక ఏమీ సాధించలేము. ఇప్పుడు జరగవలసిన కార్యం గురించి ఆలోచించాలి" అనగానే అందరూ అంగదుని చుట్టు చేరారు. వానర సైన్యాన్ని ఒక్క త్రాటిమీద నడిపించే శక్తి ఒక్క అంగదునికీ, ఆంజనేయునికీ మాత్రమే వుంది. వారు వేరెవరికీ లొంగరు. అప్పుడు పెద్దల ఆజ్ఞ మీద అంగదుడిలా అన్నాడు. "ఇప్పుడు మనలో సముద్రాన్ని దాటి లంకకి చేరగల పరాక్రమశాలి ఎవరు? సుగ్రీవునితో, సీత జాడ తెలుసుకువస్తామన్న ప్రతిజ్ఞ నెరవేర్చగలవారెవరు? వానర మిత్రులారా, శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్నెవరు దాటగలరు? ఈ ప్రమాదం నించి, మనని ఎవరు గట్టెక్కించగలరు? మీలో ఎవరైనా నూరు యోజనములు ఎగిరి సముద్రాన్ని దాటగల వీరులున్నారా? ఉన్నట్లైతే వచ్చి "నేను మీకు అభయం ఇస్తున్నాను" అని ముందుకు రండి" అన్నాడు. ఆ మాటలు విన్న వానరులలో ఒక్కడు కూడా కదలలేదు.

వారి నిశ్శబ్దాన్ని చూసి అంగదుడు మళ్ళీ ఇలా అన్నాడు. "మీరంతా అమిత బలవంతులు, పరాక్రమవంతులు. ఉన్నతమైన వంశంలో పుట్టారు. మునుపెన్నెన్నో ఘనకార్యాలు చేశారు. ఇప్పుడు మీ ప్రతిభ నిరూపించుకోండి" అని అంగదుడన్న మాటలు విని వానరులలో చైతన్యం కలిగింది. ముందుగా గజుడు తాను పదియోజనాలకన్నా పైకి వెళ్ళలేనన్నాడు.

గవాక్షుడు ఇరవై యోజనాలు వెళ్ళగలనన్నాడు. గంగమాదనుడు ఏభై యోజనాలు మించి వెళ్ళలేనన్నాడు. మైందుడు అరవై యోజనాలు వెళ్ళగలనన్నాడు. అపుడు జాంబవంతుడు ముందుకి వచ్చి "యువరాజా నామాట విను. పూర్వం నాకు ఎంతదూరమైనా వెళ్ళగల శక్తి వుండేది. ఇపుడు వయసుపై బడింది. నా శక్తి మీద నాకే నమ్మకం లేదు.

అయినా అవసరం వచ్చినప్పుడు ఉపేక్షించి లాభం లేదు. మన ప్రభువు ఎలాగైనా సీతమ్మ జాడ తెలుసుకోవాలని పట్టుదలగా వున్నాడు. కనక వృద్ధుడనైనా సరే నేనే ప్రయత్నిస్తాను. కాని తొంభై యోజనాల కన్నా వెళ్ళలేనేమో అనిపిస్తోంది. అంత మాత్రం చేత కార్యం నెరవేరదు కదా" అన్నాడు. అతడి మాటలు విని అంగదుడిలా అన్నాడు.

"ఆర్యా నేను నూరుయోజనాలు దాటి వెళ్ళగలను. మళ్ళీ వెనక్కి రాలేను"అన్నాడు.

ఆ మాటలకి జాంబవంతుడు అంతడితో "వానర రాజా నీ శక్తి మాకు తెలియదా. నువ్వు వంద అనె ఏమిటి, వెయ్యి యోజనాలైనా వెళ్ళగలవు. మళ్ళీ తిరిగి రాగలవు కూడా. కాని నువ్వు మాకందరికీ ప్రభువువి. నువ్వు వేరొకర్ని ఆజ్ఞాపించి పంపాలి. కాని నువ్వు మమ్మి వదిలి వెళ్ళకూడదు. నీకేవిధమైన శ్రమా, ప్రమాదం, కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మా అందరిమీదా ఉంది. మిమ్మల్ని సముద్రం దాటి పంపడం మాకు శ్రేయస్సు కాదు. భార్య భర్త నెలా కాపాడుకోవాలో సైన్యం స్వామినలా కాపాడుకోవాలి. కనుక నిన్ను మేము పంపలేము" అని జాంబవంతుడభ్యంతరం చెప్పాడు. అపుడు అంగదుడు నిరాశగా "అయితే మనకి ప్రాయోపవేశం తప్పదా? అన్నాడు. మనం సీతమ్మ జాడ తెలియకుండా వెనక్కి వెళ్తే సుగ్రీవుడు ఊరుకోడు. కనుక మన కర్తవ్యమేమిటో నువ్వేచెప్పు" అన్నాడు దిగులుగా. అప్పుడు జాంబవంతుడు అంగదుడికి ధైర్యంచెప్తూ, "యువరాజా ఆలోచిస్తే ఉపాయం దొరక్కపోదు. ఇపుడు మన కార్యం నిర్వహించగల వీరునికి మనమే ప్రోత్సాహం ఇవ్వాలి" అంటూ, దూరంగా ఒక చోట ఏకాంతంగా కూర్చుని, మౌనంగా ఎటో చూస్తున్న హనుమంతుని దగ్గరకి వెళ్ళి, "వానర వీరా, సర్వశాస్త్ర విశారదా హనుమా! ఇక్కడ మేమంతా ఇలా కుంభితంభితమైపోతూ వుంటే అలా ఏమీ పట్టనట్టు నిశ్చింతగా, మౌనంగా కూర్చున్నావేమిటి? నీ శక్తి నీకు తెలియదా? వానర రాజైన సుగ్రీవునితో సమానమైన పరాక్రమం గలవాడివే, రామలక్ష్మణులకు దీటైన వీరుడివే, మహావీరా ఇక్కడికిరా పక్షీంద్రులలో అగ్రగణ్యుడైన గరుత్మంతుని రెక్కల కెంత బలం వుందో, నీ బుజాలకంతే బలం వుంది.

పరాక్రమంలోనీకు సాటి వీరులు లేరని మాకు తెలుసు నీ శక్తి నువ్వు మర్చిపోయావా?

నీ తల్లి అంజనా దేవి కుంజరుడనే వానరునికి పుట్టిన అప్సరకాంత, పుంజికస్థల. అప్సరసలందరిలో ఉన్నతురాలైన పుంజికస్థల శాపవశాత్తూ అంజనగా వానరుల ఇంట పుట్టింది. అయితే కామరూపిణి కనుక మానవరూపం పొంది అతిలోక సుందరిలా వుండేది. యౌవన దశలో ఆవిడ సర్వాలంకార శోభితురాలై ఒక పర్వత శిఖరం మీద విహరిస్తుండగా ఆమెని చూసి వాయుదేవుడు సమ్మోహితుడయ్యాడు. ఆయన స్పర్శ మాత్రం చేత, కేసరి భార్యయైన నీ తల్లికి,

వాయుదేమునంతటి శక్తి సంపన్నుడవైన నువ్వు పుట్టావు. పుట్టీపుట్టగానే నువ్వు ఉదయిస్తున్న బాల భానుని చూసి, అదేదో అపురూపమైన ఫలము అనుకుని, దాన్నందుకుందుకు ఆకాశంలోకి ఎగిరావు. సూర్యతేజస్సు చూసి కూడా భయపడకుండా సూర్యమండలం వరకు ఎగురుతూ వెళ్తున్న నిన్ను చూసి, ఇంద్రుడు కోపంతో వజ్రాయుధం నీ మీదికి విసిరేశాడు. అప్పుడికే మూడువందల యోజనాల పైకి ఎగిరిన నువ్వు, ఆ ఆయుధం తగిలి, పర్వత శిఖరం మీద పడ్డావు. ఆ పర్వతం తాకిడికి నీ ఎడమ దవడ సొట్టపోయింది. అందుకే నీ పేరు హనుమంతుడైంది. ఇంద్రుడలా ఆయుధంతో నిన్ను కొట్టే సరికి, నీ తండ్రియైన వాయుదేమునికి కోపం వచ్చింది. ముల్లోకాలలోనూ, గాలిని దిగ్బంధం చేసేశాడు. గాలి స్థంభించిపోయే సరికి ముల్లోకాలూ అతలాకుతలమై పోయాయి. అంతా ఏకమై వాయు దేముని పాదాల మీద పడ్డారు. వాయు దేముడు శాంతించాడు. అప్పుడు దేవతలంతా నీకెన్నెన్నో వరాలిచ్చారు.

బ్రహ్మదేముడు ఏ శస్త్రం వల్లా నీకు మరణం లేకుండా, బ్రహ్మాస్త్రం కూడా నీ మీద పనిచెయ్యదని వరమిచ్చాడు. ఇంద్రుడు నీకు ఇచ్చామరణం ప్రసాదించాడు. అష్టదిక్పాలకులూ, వారి వారి శక్తులు నీకిచ్చారు. కుమారా- ఇప్పుడు మేమంతా ప్రాణాపాయ పరిస్థితిలో వున్నాము. మమ్మల్నందర్నీ రక్షించగలవాడివి నువ్వే. గరుత్మంతుడి అంతటి పరాక్రమంతో మమ్మల్ని రక్షించాలి. మా కష్టాల్నించి గట్టెక్కించాలి. నీ శక్తి యుక్తులతో విజృంభించు.

ఈ శతయోజన విస్తీర్ణం కలిగిన సాగరాన్ని తరించే శక్తి నీకే వుంది. మేమంతా నీ పరాక్రమం చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాము" అన్నారు.

అపుడాంజనేయునికి తన శక్తి గుర్తు వచ్చింది. విశ్వరూపంతో వానరులకి దర్శనం ఇచ్చాడు. హనుమంతుడు తన శరీరాన్ని అంతకంతకి పెంచి, విరాట్స్వరూపంతో పెద్ద పర్వతంలా ఆ సముద్రం ఒడ్డున నుంచున్నాడు. ఆగంభీర మూర్తిని చూసి వానరులంతా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైపోయారు. ఆనందంతో మేఘమాలికలిలా గర్జించారు. విశ్వరూపంతో నిల్చిన ఆంజనేయుని వానరులంతా స్తుతించారు.

వారలాస్తుతిస్తున్న కొద్దీ ఆంజనేయుడంతకంతకీ పెరిగి తోకని నేలమీద వేసి కొట్టాడు. అతని ముఖం ఎఱ్ఱగా పొగలేని నిప్పు కణికల్లా ప్రకాశించింది. శరీరం మీద రోమాలన్నీ నిక్కబొడుచుకున్నాయి.

అందరిమధ్యలో లేచి నిలబడి, పెద్దలందరికీ నమస్కరించి ఇలా అన్నాడు.

"మా తండ్రి అయిన వాయుదేవుడు అగ్నిహోత్రుని పుత్రుడు- ఆయన సాటిలేని బలము గలవాడు. ఆకాశ వీధిలో వేగంగా ప్రయాణం చెయ్యగల ఆమహనీయుని కుమారుడిని నేను. ఆయన లాగే ఆకాశంలో ఎంతదూరమైన ప్రయాణం చెయ్యగలను. విశాలమైన ఆకాశాన్ని ఈ చివర్నించి ఆ చివరిదాకా చేతితో తాకాలని నా కోరిక. మేరు పర్వతం చుట్టు మూడు మార్లు ప్రయాణం చెయ్యాలని వుంది.

నా బాహుబలంతో ఈ సముద్రాన్ని అల్లకల్లోలం చేసి ఈ లోకాన్ని అందులో ముంచెయ్యాలనిపిస్తోంది. నా తొడల, పిక్కల బలానికి, సముద్రం అలలతో ఎగిసిపడి, పైకి పొంగిపోతోంది. ఆకాశంలో తిరిగే గరుత్మంతునికి వేలసార్లు ప్రదక్షిణం చేసేశక్తి నాకు వచ్చింది. ఉదయాద్రి మీద సూర్యుడుదయించగానే, ఆయన తోటే బయల్దేరి, ఆయనకంటే ముందే అస్తాద్రిని చేరగలను. ఆకాశంలో అలా ఎగురుకుంటూ ప్రయాణం చేసి, మళ్ళీ తిరిగి రాగలను. నేను తల్చుకుంటే ఈ సముద్రాన్ని శుష్కింపచెయ్యగలను. పర్వతాలన్నీ పిండిలా కొట్టగలను. భూమిని బ్రద్దలు చెయ్యగలను. నేను ఆకాశంలో ఎగురుతుంటే పైన వున్న వృక్షాలు, లతలు, పువ్వులు అన్నీ నావెంట వస్తాయి. వాయుదేమునికి, గరుత్మంతునికి తప్ప వేరెవ్వరికీ లేని శక్తి నాకు వుంది. నా శక్తినంతా ఉపయోగించి సీతమ్మని చూసి వస్తాను. మీరంతా నిశ్చింతగా వుండండి" అంటూ హనుమంతుడు తన వీర శౌర్య పరాక్రమాలు గుర్తు తెచ్చుకుంటూ, గర్జించాడు. ఆ భీకర మూర్తిని చూసి వానరులంతా పరమానంద భరితులయ్యారు.

అపుడు జాంబవంతుడు ఆంజనేయుని శ్లాఘిస్తు, " వీరా-కేసరీపుత్రా, మారుతాత్మజా హనుమా- నీ జ్ఞాతులమైన మా అందరి శోకాన్ని తొలగించావు. నీకు మంగళం కలగాలని మేమంతా ఆశీర్వదిస్తున్నాము. పెద్దలందరి ఆశీర్వచనం తీసుకుని, గురువుల ప్రసాదం తీసుకుని, సముద్రం దాటడానికి సిద్ధపడు. నువ్వు తిరిగి వచ్చేవరకు మేమంతా ఇక్కడే ఒంటి కాలిపై నిలబడి వుంటాం. మా జీవితాలన్నీ నీ ఆధీనంలో వున్నాయి. నువ్వు తప్ప మాకింకెవ్వరూ శరణు లేరు" అన్నాడు.

జాంబవంతుడి మాటలు విన్న హనుమంతుడు, వినయంగా " ఆర్యా- ఈనేల మీద నుంచి నేను ఎగిరితే ఈ నేల కృంగిపోతుంది. నా వేగాన్నీ శక్తినీ ఈనేల భరించలేదు. అదిగో మహేంద్ర గిరి. ఆ శిఖరాలు పటిష్టమైనవి. చలివంచవు. నా శక్తిని ఆపగల శక్తి ఆ శిఖరాలకి మాత్రమే వుంది. ఈ పర్వతం

మహావృక్షాలతో వ్యాపించి వుంది. గైరికాది ధాతువులతో నిండి వుంది. నూరు యోజనాల దూరం ఎగరడానికి నేను పాదం అదిమిపట్టినప్పుడు, ఆ భారాన్ని మొయ్యగల శక్తి మహేంద్రగిరికి తప్ప ఇంకొకదానికి దేనికీ లేదు" అని చెప్తూ వాయుపుత్రుడు, మహేంద్రగిరి మీదికి లంఘించాడు. ఆ పర్వతం మీద హనుమంతుడు పాదం మోపగానే రాళ్ళల్లోంచి నీటి ధారలు చివ్వున పైకి లేచాయి. అక్కడ సంచరించే మృగాలూ పక్షులు, గాబరాగా పరుగులు తీశాయి. మహా వృక్షాలన్నీ ఊగిపోయాయి. విలాసంగా విహరిస్తున్న గంధర్వులు, విద్యాధరులు, నాగములు దిగ్భ్రాంతి చెందాయి.

పాములు పుట్టల్లోంచి, తలలు పైకి లేపి, సంగంబైటకి వచ్చి జండాల్లా ఊగుతున్నాయి. ఈ విధంగా వానరోత్తముడైన హనుమంతుడు బలం పుంజుకోవాలనే దీక్షతో సీతాన్వేషణ గురించి మనస్సులో స్మరించి, మానసికంగా అప్పుడే లంకని చేరాడు.

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**కిష్కింధా కాండ సమాప్తం.**

# కిష్కింధకాండపై సమీక్ష

ఇక్కడితో కిష్కింధకాండ పూర్తయింది. వాల్మీకి రామాయణంలో చాలా కీలకమైన స్థానము. ఈ కిష్కింధకాండకి వుంది. అరణ్యకాండలో ఉదాసీనంగా మొదలై శూర్పణఖ ప్రవేశంతో ఊపందుకున్న కథ, కిష్కంధలోకి వచ్చే సరికి అనుకోని మలుపు తిరుగుతుంది. సీతకోసం పిచ్చివాడిలా ఏడుస్తూ చెట్టు చెట్టు పుట్ట, పుట్ట తిరుగుతున్న రాముడికి, కంబదుడు కిష్కింధ గురించి చెప్తాడు.

ఋష్యమూకాద్రతిపై వున్న సుగ్రీవుడనే వానరరాజు నీకు సీతని వెతకడంలో సహాయం చేస్తాడని చెప్తాడు. ఆ సుగ్రీవుడెక్కడ వుంటాడో తెలియదు. దారీ తెన్నూ తెలియని కీకరణ్యంలోంచి వెతుక్కుంటూ బయల్దేరతారు. అప్పుడు రామయాణానికి ప్రాణంలాంటి వాడైన హనుమంతునితో సమాగమం కల్గుతుంది.

అదీ చాలా విచిత్రంగా జరుగుతుంది. సుగ్రీవుడు తన మీదికి వాలి గూఢచారుల్ని పంపించాడనుకుంటాడు. దూరం నించి రామలక్ష్మణుల్ని చూసివారెవరో తెలుసుకురమ్మని హనుమంతుని పంపిస్తాడు. హనుమంతుడు బిక్షకుడిరూపంలో వెళ్తాడు. వారిదగ్గరకి ఇక్కడ ప్రథమ సమాగమంలోనే హనుమంతుడు రాముణ్ణి, చదువరులను కూడా ఆకట్టుకుంటాడు. ఈ సన్నివేశంలో ఒక వ్యక్తి ఎలా మాట్లాడాలో చాలా చక్కగా వర్ణించి చెప్పాడు వాల్మీకి. మాట్లాడడం కూడా ఒక కళే అనిపిస్తుంది అంటాడు.

రాముడు, లక్ష్మణునితో అంటాడు.

"సౌమిత్రీ ఇతడు చూడు ఎంత పొందికగా మాట్లాడుతున్నాడో, ఇతడు మాట్లాడుతున్నప్పుడు కళ్ళల్లో గాని, నుదుటి మీదగాని ఏ ఇతర అవయవంలో గాని ఎక్కడా ఏ రకమైన వికారమూ లేదు. మార్దవంగా ప్రసన్నంగా, స్పష్టంగా చెప్పదల్చుకున్నది చాలా సూటిగా చెప్పాడు" అంటూ అనేక విధాలుగా ప్రశంసిస్తాడు. చాలా మంది మాట్లాడేదప్పుడు చాలా రకాల విన్యాసాలు చెయ్యడం మనం రోజూ చూస్తుంటాం.

శ్రీ మద్రామాయణంలో కిష్కింధ కాండ చదివినప్పుడు, అసలు ఎలా మాట్లాడాలి అనే సంగతి మనకి చక్కగా తెలుస్తుంది. సుగ్రీవుడితో అగ్నిసాక్షిగా మైత్రి చేసుకుంటాడు రాముడు. ఆ సందర్భంలో మైత్రి అన్నదానికి అర్థమేమిటో

చక్కగా వివరిస్తాడు, వాల్మీకి. వానరులలో ఎంత పండితులున్నారో, తార ఎంతటి విదుషీమణో చదివినప్పుడు మనకి చాలా ఆశ్చర్యం కలుగుతుంది.

వాలిని రాముడు చాటు నించి చంపాడని చాలా మంది నాస్తికులు అనేక రకాల విమర్శిస్తుంటారు. కాని అలా చంపడానికి గల కారణాలు సహేతుకంగా వివరిస్తాడు రాముడు. ఆ తర్వాత ఇంకొక ముఖ్యమైన ఘట్టము సుగ్రీవుడు సీతాన్వేషణ కోసం వానరుల్ని సమీకరించటం, వారిని భూగోళం నాలుగు దిక్కులకీ పంపటం. ఏ ప్రదేశం నించి ఎన్ని లక్షల మంది వానరులు వచ్చారో, వారంతా ఎటువంటి ఆకారాలు కలిగి వున్నారో చాలా చక్కగా వివరించి వ్రాశాడు వాల్మీకి. వారందర్నీ మనం ఎంత మంది వచ్చారో కాగితం మీద వ్రాసి చూసుకుంటే వచ్చే సంఖ్య కోటాను కోట్లలో వస్తుంది. కోతి మూకతో కలిసి రాముడు రావణునితో యుద్ధం చేసి, అంతటి మహా వీరుణ్ణి సంహరించటమేమిటి? అని విమర్శించే వారికి వాల్మీకి రామాయణం మూలగ్రంథం చదివితే వారెంతసంఖ్యలో వున్నారో, ఎంతటి బలవంతులో బాగా అర్థమవుతుంది.

ఇంక వానరుల్ని తూర్పు - దక్షిణం, పడమట - ఉత్తర దిశలుగా పంపుతూ అక్కడ ఏయే ప్రదేశాలున్నాయో చెప్తాడు సుగ్రీవుడు. అలా చెప్పడంలో భూగోళం యొక్క సమగ్ర స్వరూపం ప్రపంచపటం యొక్క నైసర్గిక స్వరూపం, మన కళ్ళకి కట్టినట్టు మన ముందుంచాడు వాల్మీకి. వాల్మీకి అన్ని శాస్త్రాలుక్షుణ్ణంగా అభ్యసించిన వాడైనా అయివుండాలి, లేదా బ్రహ్మదేముడు జరిగిన రామచరిత్ర అంతా ఆయన కళ్ళకి కనిపించేలా మనోనేత్రం మీద టెలికాస్టు చెయ్యటం వల్ల చూసైనా వ్రాసి వుండాలి. కాని ఇతరులెవ్వరికీ సాధ్యం కాదు, అలా వ్రాయడం.

ఇంక తర్వాత కథలో సంపాతిని కలవడం నూరు యోజనాల విస్తీర్ణం కలిగిన మహాసముద్రాన్ని లంఘించి, లంకకి వెళ్ళి సీతమ్మని చూసి రాగల సామర్థ్యం వున్న వాళ్ళెవరు? అని వారంతా సమాలోచించుకున్నాక, జాంబవంతుడు, ఆంజనేయుని జన్మవృత్తాంతం చెప్పి ఆయనలో నిద్రాణమై వున్న అమోఘమైన శక్తి సంపదని జాగృతం చేసి ప్రోత్సాహించడం చదువుతుంటే నిజంగా చాలా ఆశ్చర్యం కలుగుతుంది.

తన శక్తి తెలుసుకున్న వాయు పుత్రుడు, విరాట్స్వరూపం పొంది, నేనేమైనా చెయ్యగలను అన్న ఆత్మస్థైర్యంతో మహేంద్రగిరి మీద కాలుమోపి ఆకాశంలోకి

ఎగరడం. ఆ వృత్తాంతం చదువుతూ వుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఆయనలో ఎంతటి ఆత్మవిశ్వాసం కలిగిందంటే, మానసికంగా హనుమంతుడు అపుడే లంకని చేరుకున్నాడు అని ఒక్క వాక్యం వ్రాశాడు వాల్మీకి. ఆంజనేయుని శక్తి సామర్థ్యాలు ఋజువుచెయ్యడానికి ఆ ఒక్క వాక్యం చాలు.

కిష్కింధలో అప్పటి దాకా మనం చదివిన హనుమంతుడు వేరు, ఆ క్షణం నించీ విశ్వరూపం ధరించి శక్తి సంపన్నుడైన హనుమంతుడు వేరు. సుందర కాండలోనూ, యుద్ధ కాండలోనూ ఎంతటి అద్భుతమైన కార్యాలు సాధించాడో ముందు ముందు చదువుతాము. కనుక రామాయణ మహాకావ్యానికి ఆయువు పట్టైన ఈ కిష్కింధకాండ కథా విభాగము భక్తి శ్రద్ధలతో, విశ్వాసముతో మూడు మార్లు పారాయణచేసినవారికి, ఎటువంటి చిక్కులైనా, తొలగిపోయి, పరిష్కారం కాకుండా వున్న ఎంత జటిల సమస్యలైనా ఇట్టే పరిష్కారమై మబ్బుల్లా విడిపోతాయనడములో సందేహం ఎంత మాత్రం లేదు.



# సుందరకాండ

కిష్కింధకాండలో జాంబవంతుడు ఆంజనేయుని శక్తి సామర్థ్యాలు గుర్తు చేసే వరకు హనుమంతుడు మనకి సామాన్య వానర వీరుడిలాగే కనిపిస్తాడు. కాని ప్రథమ వీక్షణం లోనే అసామాన్య ప్రతిభా సంపన్నునిగా హనుమంతుని శ్రీరాముడు గుర్తిస్తాడు.

తన శక్తి సామర్థ్యాలు జాగృతం చెయ్యబడ్డ తర్వాత సుందరాకాండలో హనుమంతుడు ఒక అపూర్వమైన తేజోమయమూర్తిగా, అద్భుత శక్తి సంపన్నునిగా గోచరిస్తాడు. విరాటస్వరూపంతో పర్వతాకారంతో మహేంద్రగిరిపై నిలబడ్డ హనుమంతుడు, ఆకాశమార్గంలో ప్రయాణం చెయ్యాలని సంకల్పించి, మెడపైకెత్తి కొండ మీద మదించిన వృషభంలా నుంచున్నాడు.

మహేంద్రగిరి మీద సమతలంగా వున్న ప్రదేశం చూసుకుని కొంతసేపు వెనక్కి ముందుకి నడిచాడు. అక్కడి పచ్చికబయళ్ళు, వైఢూర్యం రంగులో మెత్తగా పట్టు కంబళ్ళలా వున్నాయి.

తన బలమైన పాదాలతో ఆపచ్చిక మీద హనుమంతుడు అటు ఇటు నడుస్తుంటే, చెట్ల మీద వున్న పక్షులు భయంతో పారిపోసాగాయి. బెదిరిపోయి అటు ఇటు చెల్లా చెదురుగా ఎగిరిపోయాయి. క్రూరమృగాలూ, వన్యమృగాలూ భయంతో పరుగులు తీస్తూ ఒకదాన్నొకటి ఢీ కొట్టి చచ్చిపోయాయి. హనుమంతుడు పెద్ద సింహంలా వున్నాడు. మత్త గజంలా నిలబడి హనుమంతుడు, సూర్యునికి, ఇంద్రునికి, వాయువుకి, బ్రహ్మకి, భూతములకి తలవంచి నమస్కారం చేసి మనసారాధ్యానించాడు.

తూర్పుదిక్కుకితిరిగి తనకి జన్మకారకుడైన వాయుదేవునికి నమస్కరించాడు. దక్షిణ దిశగా ప్రయాణం చేసే నిమిత్తం తన శరీరాన్ని మరింతగా పెంచసాగాడు. అలా అలా పెంచి తన చేతులతోటీ, పాదాలతోటీ పర్వతాన్ని గట్టిగా అదిమి పట్టాడు. అలా నొక్కిపట్టినప్పుడు ఆ మహేంద్రగిరి అంతా కంపించిపోయింది. అక్కడ వృక్షాలపై వుండే పూవులన్నీ జలా జలా రాలాయి. కుప్పలు తెప్పలుగా రాలిన పూలతో, ఆపర్వతమంతా పువ్వులకొండలా వుంది. అక్కడుండే జలాశయాలన్నీ కంపించి పర్వతం అన్నివైపుల నుంచి నీరు ధారగా కారసాగింది. నల్లని మనఃశిలలు పెళ్ళలు పెళ్ళలుగా విరిగిపడ్డాయి. ఆకాశంలోకి ఎగిరేశక్తికి కావలసిన ఊపురావడంకోసం, తన పాదాలతో కొండను మరింతగా నొక్కిపట్టాడు.

ఆ ఊపుకి, కొండ గుహలలో వుండే జంతుజాలములు, గాబరాగా అరుస్తూ బయటకి పరుగులు తీసాయి. అవి చేసే శబ్దాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

ఇంకొక్కసారి పాదాలు నేలలో గ్రుచ్చి నొక్కాడు. అప్పుడు పుట్టలలోని విష సర్పాలు, భయంతో జర జరా పాకి బయటకి వచ్చి కొండశిలల్ని కాటు వేశాయి. ఆ కాటు వల్ల వెలువడిన విషంతో ఆ కొండ శిలల్లోంచి బ్రహ్మాండమైన మంటలు రేగాయి. ఫెళ ఫెళ శబ్దాలతో శిలలు విరగిపడ్డాయి.

అక్కడక్కడ కొండ చరియలో జంటలుగా విలాసవిహారం చేస్తూ మధుపానముతో ఒళ్ళు తెలియక వున్న విద్యాధరులు, ఈ అలజడి చూసి, కొండ బద్ధలై పోతుందేమో అనే భయంతో ఉలిక్కిపడ్డారు. బంగారు మద్య పాత్రలక్కడే పడేసి ఉన్న వాళ్ళున్నట్టే ఆకాశానికి ఎగిరిపోయారు. ఆకాశంలోకి వెళ్ళాక ఈ వింత ఏమిటా అని ఆశ్చర్యంగా తొంగి చూశారు.

ఆత్మజ్ఞాన సంపన్నులైన ఋషులు కొందరు, ఆకాశం లోంచి చూసి, వాయుపుత్రుడైన ఆంజనేయుడు, పర్వతాకారం పొంది, మహావేగంతో సముద్రాన్ని దాటబోతున్నాడని, చెప్పుకుంటూ ఇంతటి దుష్కరమైన పని, ఆ మహావీరుడు, రాముని కోసం చేస్తున్నాడు. వానరులందర్నీ రక్షించటం కోసమే ఈ సహసానికి పూనుకున్నాడని చెప్పుకుంటున్నారు. ఆ మాటలు విన్న విద్యాధరులు ధైర్యం పొంది, దిగ్భ్రమతో చూస్తువుండిపోయారు.

ఆకాశంలోకి ఎగరగల శక్తిని పుంజుకున్న ఆంజనేయుడు, ఒక్కసారి ఒళ్ళు దులుపుకుని, వెంట్రుకల్ని విదిలించి, ఒకసారి తోకని పైకెత్తి దింపాడు. తోకని చాపుకుని, ముడుచుకుని పదె పదె చూసుకున్నాడు. పరిఘల లాంటి చేతుల్ని బిగించాడు. నడుము సన్నం చేశాడు. పాదాలు వంచాడు. బాహువులు ముడిచాడు. మెడని కుచింపచేశాడు. బలము, వీర్యము పుంజుకున్నాడు. సముద్రంపై దృష్టి సారించి మార్గమును చూశాడు.

హృదయములో శ్వాసప్రాణాలు బిగపట్టి, ఆకాశంలోకి చూశాడు. పాదములతో నేలని నొక్కిపట్టి చెవులు ముడిచి, తన, చుట్టు వున్న వానరులతో ఇలా అన్నాడు.

"మిత్రులారా, రామబాణంలా నేను శరవేగంతో లంకకి చేరతాను. లంకలో సీత కనిపించకపోతే అదే వేగంతో, దేవలోకానికి వెళ్తాను. అక్కడ కూడా సీత కనిపించకపోతే రావణుడ్ని బంధించి తెస్తాను. ఏ విధంగా అయినా సరే, పని పూర్తిచేసుకుని మరీ వస్తాను" అంటూ వారి సమాధానం కోసం కూడా చూడకుండా, హనుమంతుడు రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు.

ఎప్పుడైతే, పర్వతాకారంతో హనుమంతుడు కొండపై నుంచి ఎగిరాడో, అతడి తొడల వేగానికి మహావృక్షాలు పెళ్ళగించబడి దూరదేశానికి వెళ్ళే బంధువులకి వీడ్కోలు చెప్పటానికి అనుసరించి వెళ్ళే బంధువర్గంలా హనుమంతుడి వెంటవెళ్ళాయి. పూలతోనిండిన ఆ వృక్షాలతో కూడిన హనుమంతుడు, ఆకాశంలో ప్రయాణం చేస్తున్న పెద్ద పూలపర్వతంలా కనిపించాడు. అలా హనుమంతుడు కొంతదూరం ప్రయాణం చేసేసరికి, బరువైన ఆ వృక్షాలు సముద్రంలో పడిపోయాయి. అలా చెండు చేతులూ చాపి ఆంజనేయుడు, ఆకాశంలో ప్రయాణం చేస్తూ వెళ్తూ కిందికి చూశాడు. కింద సముద్రం అల్లకల్లోలంగా వుంది. ఉవ్వెత్తున ఎగిసిపడ్తున్న ఆ అలల్ని వెనక్కి తోస్తూ మారుతి, ముందుకి దూసుకుపోతున్నాడు. సముద్రజలాల మీద పడ్తున్న ఆ భీకర మూర్తి నీడ ముప్పది యోజనాల పొడవు, పది యోజనాల వెడల్పువుంది.

అతి పెద్ద విహంగలా ఆ మహనీయుడు ఆకాశంలో తేలిపోతుంటే, ఆ వేగానికి మేఘాలన్నీ, చిందర వందర అయిపోతున్నాయి. ఆంజనేయుని వెంట అవి ముందుకి లాక్కుపోబడుతున్నాయి. అటువంటి అత్యద్భుతమైన దృశ్యాన్ని చూసి దేవతలు, ఆంజనేయునిపై పూలవాన కురిపించారు. సూర్యుడు తన తాపాన్ని తగ్గించి, హనుమంతునికి చల్లదనం కలిగించాడు. వాయుదేముడు తన కుమారునికి అనుకూలంగా వీచాడు. దేవతలు గంధర్వులు ఆ మహావీరుడ్ని ప్రస్తుతి చేస్తూ గానాలు చేశారు. అలా వాయుపుత్రుడు ఆకాశంలో సాగిపోవడం చూసి సాగరుడు తన మనస్సులో ఇలా అనుకున్నాడు.

"ఇక్ష్వాకు వంశీయుడైన సగరుని పుత్రుల వల్ల నేను పుట్టాను. ఆ వంశజుడైన శ్రీరాముని దూతగా ఈ హనుమంతుడు వస్తున్నాడు. కనుక ఇతడికి బాధ తెలియకుండా చేయ్యవలసిన బాధ్యత నాకుంది. కనుక ఇతడి మార్గాయాసం కలగకుండా విశ్రాంతి కలిగిస్తాను" అనుకుంటూ తన గర్భంలో దాగివున్న మైనాకుని పిల్చి, "మైనాకా, నువ్వు సాగర జలాలపైకి పెరిగి, రామకార్యార్థం, ఆకాశంలో ఎగురుతున్న హనుమంతునికి అడ్డంగా నిల్చి, నీపైన విశ్రమించి బడలిక తీరిన తర్వాత ప్రయాణం చెయ్యమని ప్రార్థించు. ఇక్ష్వాకు వంశజుడైన రాముని సేవిస్తున్న ఇతడు మనకి మిక్కిలి పూజ్యుడు. కనుక ఇతనికి సాయపడాలి. ఇపుడితడు మనకి అతిథి" అన్నాడు.

సాగరుని మాటలు మన్నించి మైనాకుడు సముద్రజలములపైకి లేచాడు. హనుమంతుని కడ్డుగా నిలబడ్డాడు. అలా నిలబడ్డ మైనాక పర్వతాన్ని చూసి హనుమంతుడు తన ప్రయాణానికేదో అంతరాయం కలిగిందనుకున్నాడు.

మారుతికి పట్టరాని కోపం వచ్చింది. మహాబలుడైన అతడు మరింత వేగం పెంచుతూ, ఆ పర్వతశిఖరాన్ని తన గుండెలతో నుగ్గు నుగ్గు చేశాడు. కామరూపధారణ శక్తి గల ఆ పర్వత రాజు మానవ రూపంతో ఆంజనేయుని కెదురుగా నిల్చి, ప్రాణాయామము చేశాడు. "వానరోత్తమా, నీ సాహసము దుష్కరమైనది. మార్గాయాసము వలన అలసిన నువ్వు, నా శిఖరాలపై కొంతసేపు విశ్రాంతి తీసుకుని, సాగిపోవాల్సిందిగా కోరుతున్నాను. రఘు వంశజులచే పోషించబడిన ఈ సాగరుడు, రామకార్యార్థమై వెళ్తున్న నిన్ను ఆరాధించాలనుకున్నాడు. నువ్వతడి ఆతిధ్యాన్ని స్వీకరిస్తే, సముద్రుడు ధన్యుడవుతాడు. దయతో నాపై విశ్రమించి, నా శిఖరముల మీదవున్న వృక్షాలకు కాచిన తియ్యని ఫలములు, కమ్మని కందమూలాలు ఆరగించు. నన్ను, సాగరుడిని ధన్యులను చెయ్యి" అని ప్రార్థించాడు.

మైనాకుని మాటలు విని హనుమంతుడిలా అన్నాడు. "పర్వతోత్తమా- నీ మాటలు నాకెంతో ఆనందాన్ని కలిగించాయి. నన్ను దిగమని పట్టుబట్టకు. నా కార్యానికి సమయం మించిపోతుంది. ప్రతిన బూని బయల్దేరిన వాడిని. మధ్యలో ఆగకూడదు" అని మందహాసముతో ఆ పర్వతాన్ని తాకి, ఆకాశంలో ముందుకి సాగాడు. ఆంజనేయులు బుద్ధి కుశలతకి, ఋషులు, సిద్ధులు ప్రశంసించారు.

మైనాకుని ఔదార్యానికి, ఇంద్రుడు కూడా చాలా ప్రశంసించాడు. "మైనాకా నీకభయమిస్తున్నానయ్యా. ఇక మీదట నువ్వు నిశ్చింతంగా వుండు. హనుమంతుడు సాగరాన్ని దాటుతూ వుంటే నువ్వు గౌరవించావు. కనుక ఇక మీదట నీకెలాంటి భయమువుండదని" మెచ్చుకున్నాడు.

ఇంద్రుడు మైనాకుని కలా అభయమివ్వటానికి కారణమేమిటంటే, పూర్వం కృతయుగంలో పర్వతాలకి ఎగిరి, ఎక్కడంటే అక్కడ భూమిమీద దిగుతు వుండేవి. అలా దిగినప్పుడు చాలాజీవులు ఆ పర్వతాల కిందపడి నలిగి ప్రాణాలు విడిచేవి. అప్పుడు దేవేంద్రుడు అందరికీ మేలు చెయ్యాలని తన వజ్రాయుధంతో పర్వతాలన్నింటికీ రెక్కలు ఖండించి పడేశాడు. అయితే మైనాకుడు మాత్రం ఇంద్రుని కంటపడకుండా సముద్ర గర్భంలో దాక్కుని ఇన్నాళ్ళు తన రెక్కలు కాపాడుకున్నాడు. ఇప్పుడు సముద్రుని ఆజ్ఞపై పైకి వచ్చాడు. అయినా రామకార్యం కోసం సముద్రాన్ని లంఘిస్తున్న హనుమంతుని మైనాకుడు గౌరవించాడు, కనక ఇంద్రుడతనికభయమిచ్చాడు. ఇంద్రుని అనుగ్రహం పొంది మైనాకుడలాగే సముద్రంపై నిల్చిపోయాడు. హనుమంతుడు నిరాటంకంగా ముందుకి సాగిపోయాడు.

ఆకాశంలోంచి వాయుపుత్రుని చూస్తున్న దేవతలు, గంధర్వులు, ఋషులు ఆంజనేయుని శక్తిని పరిశీలించాలనుకున్నారు. అతనికో పరీక్ష పెట్టదలచి, సముద్ర గర్భంలోంచి నాగమాత అయిన సురసను పిల్చి, "సురసా, వాయుపుత్రుడైన హనుమంతుడు సముద్రాన్ని దాటాలని ప్రయత్నిస్తున్నాడు. అయితే ఈ వానర వీరుడు వెళ్ళబోతున్నది రాక్షస రాజ్యంలోకి. కనుక నువ్వు రాక్షసాకృతితో భీకరమైన నోరుతో, నీ నోరు కొండ గుహలా ఆకాశమంత పెంచి, అతనికడ్డంగా నిలబడు. ఆరాకాసి మూకని ఎదిరించ గల శక్తి సామర్థ్యాలితడు కలిగి వున్నాడో లేదో చూద్దాం" అని ఆమెని ఉసికొలిపారు. వారి కోరికపై సురస రాక్షసిలా భీకరమైన ఆకారంతో ఆంజనేయునికి అడ్డంగా నిలబడింది. గట్టిగా అట్టహాసం చేస్తూ,

"ఓ వానరవీరా దేవతలు నిన్ను నాకు ఆహారంగా ఇచ్చారు. నిన్నిపుడే తినేస్తాను. నానోటిలో ప్రవేశించు" అని గర్జించింది.

అందుకు ఆంజనేయుడే మాత్రం జంకకుండా, నవ్వుముఖంతో, శ్రీమంతుడై దోసిలి ఒగ్గి ఆమెతో "అమ్మా దశరథకుమారుడైన శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణునితో, భార్య అయిన సీతతో దండకారణ్యంలో వుండగా రావణుడు మోసం చేసి సీతమ్మనెత్తుకుపోయాడు. రాముని ఆజ్ఞపై నేను ఆయన దూతగా సీతమ్మ దగ్గరకి వెళ్తున్నాను. నీకు చేతనైతే నువ్వు సాయం చెయ్యి. లేదంటావా తిరిగి వచ్చేటప్పుడు తప్పక నీ నోటిలోకి వస్తాను. సీతమ్మ వృత్తాంతం తెలుసుకుని, రాముని కెరిగించి, అప్పుడు నీ దగ్గర కొస్తాను. ఇది నిజము. ఒట్టు" అన్నాడు.

కాని సురస మొండితనంగా నన్ను దాటి వెళ్ళటానికి వీల్లేదు. ఇది నాకు దేవతలిచ్చిన వరం. నువ్వు ఇప్పుడే నా నోటిలో ప్రవేశించాలి" అంది. అప్పుడు హనుమంతుడు " సరే నన్ను మింగగల్గినంత నోరు తెరు" అన్నాడు. అంటూనే తన ఆకారం మరో పది యోజనాలు పెంచాడు. సురస ఇరవై యోజనాలు నోరు పెంచింది. హనుమంతుడు త్రుటిలో ముప్పై యోజనాలు పెరిగాడు. సురస తన నోరు నలభైయోజనాలు పెంచింది. అలా ఒకరి కంటే ఒకరు పెంచుతూ పోగా సురస నూరు యోజనాల నోరు తెరచింది. అపుడు కుశాగ్ర బుద్ధియైన ఆంజనేయుడు, చిటికెలో తన శరీరాన్ని కృశింపజేసి, బొటన వ్రేలి ప్రమాణం లోకి మారిపోయాడు. గబుక్కున ఆమె నోటిలో దూరి, మళ్ళీ వెంటనే బయటకి వచ్చేశాడు.

ఆకాశంలో నిలబడి ఆనందంగా హనుమంతుడు, "దాక్షాయణీ ఇక కళ్ళు తెరు. నీ నోటిలో ప్రవేశించాను. నీకిదే నానమస్కారం. వైదేహిని దర్శించడానికి వెళ్ళాలి. అనుమతినియ్యి. నీకు దేవతలిచ్చిన వరం సత్యమైనది" అన్నాడు.

ఆంజనేయుని మాటలు విన్న సురస మళ్ళీ తన యథా రూపం ధరించింది.

"ఓ వానరోత్తమా నీ ప్రయాణం హాయిగా సాగించి కార్యసిద్ధిని పొందు. మహాత్ముడైన శ్రీరామునితో సీతమ్మని చేర్చి నీ ప్రతిన నెరవేర్చుకో" అంది మెచ్చుకుంటూ. గగన వీధిలో దేవతలు, ఋషులూ, గంధర్వులూ సెహబాష్ అని, ఆంజనేయుని అభినందించారు. వారి ప్రశంసలనందుకున్న హనుమంతుడు నిరాటంకంగా గరుత్మంతునిలా ఆకాశవీధిలో దూసుకుపోతున్నాడు. ఆకాశవీధిలో ఎగిరి ప్రయాణంచేస్తున్న ఆంజనేయుని సింహిక అనే రాక్షసి చూసింది. ఛాయాగ్రహి అయిన ఆ రాక్షసి పైన పోతున్న హనుమంతుని చూస్తూ హనుమంతుని నీడపట్టి లాగసాగింది. అలా అది లాగుతుంటె పైన హనుమంతుడు ఒక్క అంగుళం మేర కూడా ముందుకి వెళ్ళలేకపోతున్నాడు. జరిగిందేమిటో అర్థం గాక, హనుమంతుడు అన్ని వైపులకి పరికించి చూశాడు. అపుడు సుగ్రీవుడు చెప్పిన మాటలు గుర్తుకి వచ్చాయి. దక్షిణ సముద్రంలో నీడని బట్టి లాగి భక్షించే రాక్షసులుంటారనీ, జాగ్రత్తగా వుండమనీ తమని పంపించినపుడు సుగ్రీవుడు హెచ్చరించడం గుర్తు వచ్చి, సముద్రంలో వున్న సింహికని గుర్తించాడు. ఒక్కసారిగా తన శరీరాన్ని విపరీతంగా పెంచాడు. ఆ శరీరానికి తగ్గట్టు తన నోరు పెంచుతూ సింహిక హనుమంతునిపై పడింది.

అరక్షణంలో హనుమంతుడు తన శరీరాన్ని కుచింపజేసి, దాని నోటి గుండా పొట్టలోకి వెళ్ళి తన గోళ్ళతో దాని మర్మస్థానాలన్ని ఛేదించి, మళ్ళీ బయటకి వచ్చి ఆకాశంలోకి ఎగిరిపోయాడు. యథాప్రకారం తన శరీరాన్ని పెంచి ప్రయాణం సాగించాడు. సింహిక ప్రాణాలు కోల్పోయి సముద్రంలో పడిపోయింది.

ఆకాశంలోని భూతాలు ఆంజనేయుని సాహస కృత్యం చూసి ముక్కున వేలుంచుకుని ఆశ్చర్యంతో "వానరేంద్రా నీలాంటి ధీమంతునికి, పరాజయమనేదే వుండదు" అని ప్రశంసించారు.

చివరికి ఎన్ని అవాంతరాలనైనా ధైర్యంగా ఎదుర్కొని ఎలాగైతేనేం శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి హనుమంతుడు అవతలిఒడ్డును చేరాడు. సాగరంలో కలుస్తున్న నదీ ముఖాన్ని చూశాడు. లంకలో ప్రవేశించే ముందు తన శరీరాన్ని మామూలు పరిణామంలోకి మార్చుకుని, ఒక పర్వత శిఖరం మీద దిగాడు.

అక్కడ నిలబడి ప్రకృతి అందాలు చూసి పరవశించాడు. అమరావతిలా వెలిగిపోతున్న లంకా నగరాన్ని చూశాడు. నూరు యోజనాల విస్తీర్ణము గల లవణ సముద్రాన్ని అవలీలగా లంఘించి, తీరంపై వున్న త్రికూట పర్వతంపై నిలబడి,

ఒక సామాన్య వానరుడిలా లంకా నగరాన్ని పరికించి చూశాడు అన్నది నిజంగా చరిత్రలోనే ఒక అపూర్వమైన ఘట్టము. ఇంతకి ముందు దాకా ఒక వానర వీరుడిగానే గుర్తింపు గలిగిన హనుమంతుడు, ఈనాటినించీ తన విరాట్స్వరూపాన్ని చూపించి, ఈ విజయం సాధించడమే గాక ఇంకా ఎన్నెన్నో పరమాద్భుతమైన కార్యాలు చెయ్యనున్నాడు.

త్రికూటగిరి మీద హనుమంతుడు కాలు మోపగానే, ఆ పర్వతం మొత్తం కంపించిపోయి, చెట్ల నించి పూలు జల జలారాలాయి. పూలతో నిండిన శరీరంతో హనుమంతుడు పూల కొండలా దర్శనమిచ్చాడు. అంతటి సాగరాన్ని లంఘించినా, ఆ మహావీరుడు రవ్వంత కూడా బడలిక చెందలేదు. ఆయాసపలేదు.

చాలా సునాయాసంగా సముద్రాన్ని దాటిన హనుమ, "ఈ విధంగా ఎన్నివందల యోజనాలైనా దాటగలను. ఇదెంత పని" అనుకున్నాడు. మనస్సులో, త్రికూటాద్రిపై నించె దృష్టి సారించి, అక్కడి వనములు, ఉపవనములు నిశితంగా పరిశీలిస్తు లంకపై చూపునిలిపాడు. పూవులతో, మొగ్గలతో నిండి, పక్షుల కిలకిలారవములు ప్రతిధ్వనించగా గాలికి కదులుతున్న సరళ-కర్ణికార, ఖర్జూర, నీప, సప్తచ్ఛద మొదలైన మహావృక్షాలెన్నో చూశాడు. వివిధ రకాలైన ఫలములతో నిండిన వివిధ వృక్షాలు గల ఉద్యానవనాన్ని చూశాడు. జల పక్షులతో తామర పువ్వులతో, కలువపువ్వులతో, నిండిన జలాశయాలు, దిగుడు బావులు చూశాడు. అటువంటి లంకని ధనుర్ధారులైన రాక్షసులు అటు ఇటు తిరుగుతూ కాపలా కాస్తున్నారు. పట్టణం చుట్టు బంగారు ప్రాకారం ఉంది. అక్కడి భవనాలు తెల్లగా శరత్కాలపు మేఘల్లా వున్నాయి. బంగారు తోరణాలతో భవనాల సింహద్వారాలు అలంకరింపబడి వున్నాయి.

త్రికూటాద్రిమీద ఆలంకా నగరాన్ని విశ్వకర్మ నిర్మించాడు. దాన్ని రాక్షసరాజైన రావణుడు పరిపాలిస్తున్నాడు. ఆకాశన్నంటే భవనాలు, పహారా కాస్తున్న రాక్షసులు, హనుమంతుని కళ్ళకి చక్కగా కనిపించారు. ఆ కాపలా సైనికులు గదలు, శూలాలు పట్టుకున్నారు. కాపలా చాలా కట్టుదిట్టంగా వుందనుకున్నాడు. లంక చుట్టూ పరవళ్ళు తొక్కుతున్న మహాసముద్రాన్ని చూశాడు. దీనిని బట్టి రావణుడెంత బలవంతుడో పర్వత శిఖరం మీదనించే అంచనా వేశాడు. మనస్సులో ఇలా అనుకున్నాడు.

"ఈలంకని దేవతలు కూడా జయించలేరు. ఇంక ఇక్కడికొచ్చి మా వానరులేం చెయ్యగలరు? విషముముగా వున్న ఈ నగరానికి రాముడు మాత్రం ఎలా రాగలడు? రాక్షసుల విషయంలో సామపద్ధతి పనికిరాదు. దాన, భేధ,

దండోపాయాల కిక్కడ తావేలేదు. వీరితో యుద్ధానికి కూడా అవకాశం లేదు.

వాలి కుమారుడైన అంగదుడు, అగ్ని పుత్రుడైన నీలుడు, వాయు పుత్రుడనైన నేను, సూర్యపుత్రుడైన మా ప్రభువు సుగ్రీవుడు, ఈ నలుగురం మాత్రం ఈలంకని చేరగలము. మిగిలిన వారందరికీ లంకని చేరటం అసాధ్యం. సరే ఏమైనా కానీ, సీతమ్మ జీవించి వుందో లేదో ముందు తెలుసుకోవాలి. తర్వాత మిగతా విషయాలు ఆలోచిస్తాను.

అయితే, దుర్భేద్యమైన ఈ మహానగరంలో నేను మాత్రం ఎలా ప్రవేశించగలను? బలవంతులు, శూరులు అయిన రాక్షసులక్కడ కాపలా వున్నారు. వారినెలాగైనా వంచించి లోపల ప్రవేశించి, సీతమ్మని వెతకాలి. ప్రస్తుతం నేనున్న రూపంలో లంకలో ప్రవేశించలేను. ఇప్పుడు బాగా ఆలోచించి నేర్పుగా లోపలకి వెళ్ళాలి. నేనొంటరిగా ఇంతటి మహత్తర కార్యం సాధించగలనా? దూత అనాలోచితంగా వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుంది. స్వామికి కూడా కీడు వాటిల్లవచ్చు. కనుక చేతకానితనంతో కార్యం భగ్నం చెయ్యకూడదు.

ఇంత కష్టపడి సముద్రం దాటిన శ్రమ వృథా కానివ్వకూడదు. తెలివిగా వ్యవహరించాలి. పొరపాటున రాక్షసులకంటబడ్డామా రామునికే కీడుకలగవచ్చును. ఒకవేళ రాక్షసుని వేషంలో వెళ్దామన్నా కామరూప శక్తిధారులైన వారు ఇట్టే పసిగట్టేస్తారు. లంకాపట్టణంలో గాలి కూడా వారికి తెలియకుండా కదలదు. పోనీ అసలు రూపంలో వెళ్దామంటే వారి కంట బడితే చంపేస్తారు. కనుక రాత్రి దాకా వేచివుండి, సూక్ష్మమైన శరీరంతో లంకలో ప్రవేశించాలి. అతి జాగర్తగా రావణుని పట్టణమంతా గాలించి సీతమ్మని వెతుకుతాను" అంటూ తనలోతానే హనుమంతుడు తర్జన భర్జనలు పడ్డాడు.

సూర్యాస్తమయం వరకు అక్కడే గడిపాడు. సూర్యాస్తమయం కాగానే తన శరీరాన్ని బాగా సంకోచింపచేసి పిల్లి అంత ఆకారం పొందాడు. అద్భుతమైన ఆ ఆకారంలో లంకలో ప్రవేశించడానికి బయల్దేరాడు. శిఖరాగ్రం నించే విశాలమైన రాజవీధులు, ప్రసాద పంక్తులు బంగారు స్థంభాలు, బంగారు కిటికీలు, మంచి ముత్యాలు, వైఢూర్యాలు, వజ్రాలు, మణులు మొదలైన వాటితో జాలీలు నిర్మించబడి అమర్చిన ప్రసాదాలు, ఏడెనిమిది అంతస్థుల భవనాలు కలిగిన లంకా నగరాన్ని అప్పటి దాకా పరిశీలనగా చూసిన మారుతి, అద్భుతమైన ఆ పట్టణ నిర్మానానికి ఆశ్చర్యపోతూ, పరవశించిపోయి, ఈ నగరంలో నేను ప్రవేశించగలనా? అని విషాదాన్ని పొందాడు. అంతలో ఆకాశంలో చంద్రుడుదయించి లంకపై అంతా వెన్నెల వెలుగులు ప్రసాదించాడు. మెల్లిగా

నడుస్తూ లంకలో ప్రవేశించే మార్గాన్ని వెతుకుతూ, ప్రాకారం మీదుగా, విశాలమైన ఎత్తైన ధృఢమైన ద్వారాలు, వైఢూర్యాలు పొదిగిన వేదికలు, మణులు పొదిగిన బంగారు ప్రాకారాలు, వైఢూర్యాలు పొదిగిన మెట్లు, నిరంతరం ప్రతిధ్వనిస్తున్న వాయిధ్యాల ఘోషలు నిండిన, ఆ నగరాన్ని చూస్తూ హనుమ చాలా ఆనందించాడు. అపూర్వమైన వైభవం కలిగిన ఆ నగరం అలకాపురికి ప్రతిరూపంలా వుంది.

భవనాలలోంచి వస్తున్న వెలుతురులో చీకటిలో సైతం ఆ పట్టణం అందంగా స్పష్టంగా కనిపిస్తోంది. ఎటు చూసినా లంకలో తన రూపమే గోచరించింది మారుతికి.

కింకిణీ స్వర ఘోషలతో, జండాలతో అలరారుతున్న ఆ ప్రాంగణాలు, క్రౌంచాలు, నెమళ్ళు, రాజహంసలు విహరిస్తున్న ఉద్యానవనాలు, వాటి కూజితాలతో ప్రతిధ్వనిస్తుండగా, ఆ రాక్షస రాజు యొక్క వైభవాన్ని ఒక్కసారి అంచనా వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు మారుతి.

మేఘ మాలికలు దాటి నక్షత్రాలను తాకుతున్నాయా అన్నట్లున్నాయి లంకలోని ఎత్తైన భవనాలు, వాటి ద్వారాల దగ్గర మదపుటేనుగులు బంగారు గొలుసులతో కట్టబడి వున్నాయి. వాటి వైభవాన్ని చూస్తూ, ఆశ్చర్యపోతూ నగర ప్రాకారాన్ని సమీపించాడు. లంకనంతా పరిశీలనగా చూశాడు. ఎటు చూసినా వజ్రవైఢూర్యాలు పొదగబడిన వేదికలు. నేలంతా స్ఫటిక మణులు, ముత్యాలు తాపడం చేసి తెల్లగా స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాయి. అందమైన మండువాలోగిళ్ళకి వైఢూర్యాలు పొదిగిన మెట్లు ఉన్నాయి. భవనాల ముందు స్ఫటికాలు కలబోసిన ఇసుకతిన్నెలు తళతళా మెరుస్తున్నాయి.

ఆ లంకాపుర వైభవానికి ముగ్ధుడై హనుమంతుడు " ఆహా ఈ రావణుని వైభవం ఎంత గొప్పది! అని ఆశ్చర్యపోయాడు. సైన్యంతో పటిష్టంగా రక్షించబడుతున్న ఈ లంకని, బలంతో ఎవ్వరూ జయించలేరు. ఈ లంకలో ప్రవేశించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కాని పరాక్రమవంతులైన రామలక్ష్మణులు మాత్రం సునాయాసంగా ఈ లంకని జయించగలరనుకుంటాను." అని మనస్సులో అనుకున్నాడు. ఆ లంకా నగర వైభవాన్ని పదే పదే చూస్తూ మైమరచి పోతున్న ఆ వానరవీరుణ్ణి (లంక అధిదేవతయైన) లంఖిణి చూసింది.

వికృతమైన నోరు, భయంకరమైన కన్నులు కలిగిన ఆ లంకాదేవత తనంతట తానే ఆంజనేయుని ముందు ప్రత్యక్షమైంది. వికటాట్టహాసం చేస్తూ వాయుపుత్రుని అడ్డగించి, "ఓరీ ఎవడవు నువ్వు? ఇక్కడికేం పనిమీద వచ్చావు? నీ ప్రాణాలు పోకముందే నిజం చెప్పు" అంటూ ఉరిమినట్టు నిలదీసి గర్జించింది.

దాని మాటలు వినగానే హనుమంతునికి పట్టరాని కోపం వచ్చింది. నిర్భయంగా ఇలా అన్నారు. " ఓసీ వికృతమైన నోరు, కన్నులు వున్న నువ్వెవరివే? ఈ నగరాన్నెందుకు కాపలా కాస్తున్నావు? నన్నెందుకిలా బెదిరిస్తున్నావు? ముందర నువ్వు చెప్పు" అన్నాడు.

ఆ మాటలకి లంఖిణి మండిపడి, కర్కశంగా ఇలా జవాబు చెప్పింది.

"ఓ వీరాధివీరా-రాక్షస ప్రభువైన రావణుని సేవకురాలను. నన్నెదిరించడం ఎవ్వరితరం కాదు. రావణుని ఆజ్ఞమేరకి ఈ లంకానగరాన్ని రక్షిస్తూ కాపలా కాస్తున్నాను నేను. నన్ను జయించి గానీ నువ్వీ లంకానగరంలో అడుగుపెట్టలేవు. ఇప్పుడు నా చేతిలో చావు దెబ్బలు తిని దీర్ఘనిద్ర పోదువిగాని. ఓ వానరుడా ఈ లంకకి ప్రతిరూపాన్ని నేను. నా పేరు లంఖిణి, ఇంక నీ సంగతి చెప్పు" అంది. అప్పుడు మారుతి ఇలా జవాబు చెప్పాడు. " మంగళ స్వరూపిణివైన లంఖిణీ నేను కేవలం ఈ నగరం యొక్క వైభవాన్ని ఒక్కసారి కళ్ళారా చూసి వెళ్ళిపోతాను. అంతేగాని ఇంకేం చెయ్యను" అని హనుమంతుడింకా మాటపూర్తి చెయ్యకుండానే, లంఖిణి భయంకరంగా గర్జించింది. "బుద్ధిలేనివాడా, లంక వైభవాన్ని చూడడానికి వచ్చావా? నన్ను గెలవకుండా రావణసామ్రాజ్యమైన లంకని చూడటం నీకు సాధ్యమేనా?" అంటూ తన అరచేతితో మారుతిని గట్టిగా చరిచింది. ఆదెబ్బకి వాయుపుత్రుడు గట్టిగా ఆర్తనాదం చేశాడు. ఇంక కోపాన్ని ఆపుకోలేక, తన ఎడమచేతివ్రేళ్ళు బిగించి, పిడికిలితో లంఖిణిని ఒక్కసారి కొట్టాడు.

స్త్రీ కదా అనే జాలితో కొద్దిపాటి బలం ప్రయోగించికొట్టాడు. ఆ పిడికిలి పోటుకి లంఖిణి అవయవాలన్నీ కదిలిపోయి బాధతో వికారంగా నోరు వెళ్ళబెట్టి, గుడ్లు తేలేసి నేల మీద కుప్ప కూలిపోయింది. అయినా సరే స్త్రీ కదా అనే జాలితోనే దాన్ని చంపకుండా వదిలి పెట్టాడు. అపుడు లంఖిణి భయంతో గడగడా ఒణికిపోతూ, గర్వం అహంకారం వదిలి, ఆంజనేయుని పాదాలపైబడి,

"కపివర్యా- నన్ను మన్నించు. నువ్వు మహాబలుడివే కాక, గొప్ప సౌమ్యుడివి. కూడా. నీ బలపరాక్రమాల ముందు నేనెంతటిదాన్ని, నువ్వు వానర శ్రేష్టుడివి. నేను అధమురాలైన రాక్షస స్త్రీని. దయయుంచి నన్ను ప్రాణాలతో వదిలిపెట్టు. ప్రాజ్ఞులైన నీ బోటి వీరులు, స్త్రీలను వధించకూడదన్న ధర్మాన్ని పాటిస్తారు. నన్ను నీ పరాక్రమంతో జయించారు.

పూర్వము బ్రహ్మదేముడు, ఎప్పుడైతే ఒక వానర వీరుడి చేతిలో నేను ఓడిపోతానో, అపుడే ఈ లంకకీ, రాక్షసులకీ వినాశము కలుగుతుందని చెప్పాడు.

నువ్వు నన్ను జయించావు. కనుక, బ్రహ్మ చెప్పిన సమయం ఆసన్నమైంది. సీతమ్మనపహరించి తేవడం వల్ల రావణునికీ, రాక్షసులకీ చేటు కాలం వచ్చింది. ఇది తప్పించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. నువ్వింక స్వేచ్ఛగా లంకలో ప్రవేశించి, నీకేం చెయ్యాలనిపిస్తే అది చేసుకో. నీ ఇష్టం వచ్చినచోటల్లా మహాపతివ్రత అయిన సీతమ్మని వెతుక్కో" అని చెప్పి ఆంజనేయునికి అంజలి ఘటించింది.

లంకాధిదేవత అయిన లంఖిణిని జయించాక ఆంజనేయుడు ప్రాకారం పైకెక్కి దూకి లంకలో ప్రవేశించాడు. రావణునికి, అమంగళం కలగాలని, ఎడమ పాదం ముందుగా లంకలోమోపి, ముత్యాలు చల్లిన రాజవీధుల గుండా, లోపలికి బయల్దేరాడు.

కొన్ని చోట్ల నించి పెద్దగా నవ్వులు వినబడుతున్నాయి. మరికొన్నిచోట్ల మంగళ వాద్య ధ్వనులు వినవస్తున్నాయి. అవన్నీ వింటూ ముందుకి సాగిపోయాడు. వజ్రాలు పొదిగిన గవాక్షములు గల తెల్లటి ప్రాసాదాలు కనిపించాయి. పద్మము ఆకారములో, స్వస్తిక ఆకారంలో గల భవనాలు కనిపించాయి. అవన్నీ చిత్ర విచిత్రములైన పూమాలలతో, ఆభరణాలతో అలంకరించి వుండడం చూసి ముచ్చట పడ్డాడు. కనిపించిన ప్రతి ఇల్లు, ప్రతి భవనం అణువణువు సీతమ్మ కోసం వెతకటం మొదలు పెట్టాడు. అలా వెతుకుతుంటే మధ్య మధ్య కొన్ని చోట్ల స్త్రీలు తారా స్థాయిలో పాడటం కనిపించింది. వారి గాజులు, మొలనూలు మువ్వలు, కాళ్ళ గజ్జలు చేస్తున్న చప్పుడు వినిపించింది. వాటితో పాటు పహరా కాస్తూ కాపలా వాళ్ళు వేస్తున్న కేకలు కూడా వినిపించాయి.

కొన్ని కొన్ని భవనాల్లోంచి, మంత్రజపాలు, వేదాధ్యయనము చేస్తున్న పాఠాలు వినిపిస్తున్నాయి. రావణుని స్తోత్రం చేస్తూ కొంతమంది పాడుతున్నారు. అప్సరస స్త్రీలని మించిన అందగత్తెలు కనిపించారు. రాజమార్గాని కటు ఇటు, కాపలా కాస్తున్న బలమైన భటులు కనిపించారు.

దీక్షాపరులు, మంత్రించిన దర్భలు ధరించిన వాళ్ళు, ఆయుధములు ధరించిన వారు అయిన అనేక విధాలైన రాక్షసులు కనిపించారు. ఒకే కన్ను కలవారు. ఒకే చెవి వున్న వారు, పెద్ద పెద్ద పొట్టలు వున్న వాళ్ళు, ధనుస్సు ధరించిన వాళ్ళు, ఖడ్గములు ధరించి తిరుగుతున్న వాళ్ళు, ఇలా ఎన్నో రకాల రాక్షసులు కనిపించారు. మరీ లావు కాని వాళ్ళూ, మరీ సన్నం కాని వాళ్ళు, స్థూలకాయులు, పీలగా వున్న వాళ్ళు, పొట్టి వాళ్ళు, మరుగుజ్జులు, పొడుగు వాళ్ళు, సమానంగా వున్న వాళ్ళు తెల్లని వారు, నల్లని వారు, మధ్యస్థంగా వున్న వాళ్ళు, ఇలా నానా రకాల రాక్షసుల్ని మారుతి చూశాడు.

ఆ నగరం మధ్యలో ఎంతో వైభవోపేతమైన రావణుని భవనం వుంది. ఆ భవనాన్ని వేల మంది రాక్షసులు, పరిఘలు, కవచములు ధరించి కాపలాకాస్తున్నారు. వారంతా చాలా బలవంతులు. ఎన్నో విధాలైన ఆభరణాలు ధరించి వున్నారు. ఆ భవనం దేవేంద్రుని భవనంలా మెరిసిపోతోంది. దాని చుట్టు కందకం, ప్రాకారం వున్నాయి. గుఱ్ఱములు, రథములు, ఏనుగులు, విమానాలు, అసంఖ్యాకంగా వున్నాయి. అంతటి పటిష్టమైన కావలాతో వున్న, రావణభవనంలోకి హనుమంతుడు లాఘవంగా ప్రవేశించాడు. ఆ భవనం అందంగా నగిషీలు చెక్కబడ్డ ద్వారాలతోటీ, బంగారపు కట్టడాలతోటీ సువర్ణమయమైన ప్రాకారాల తోటీ, మంచి ముత్యాల సరాల తోటీ అలంకరించబడి, మంచి గంధం కృష్ణాఅగరుజలం కలిపిన నీళ్ళు కళ్ళాపి చల్లబడి, అన్ని వైపులా పరిమళం వెదలజల్లుతూ, చల్లదనం కలిగి చాలా ఆహ్లాదకరంగా వుంది. అటువంటి రావణ భవనాన్ని మారుతి చాలా ప్రయాసపడి చేరుకున్నాడు. అప్పటికి ఆకాశంలో చంద్రుడు నడినెత్తిన వున్నాడు. అర్ధరాత్రి సమయం. ఆకాశమంతటా వెన్నెలలు పరచుకుని వున్నాయి. ఆ వెన్నెల వెలుగులలో, ఎవ్వరికీ కనిపించకుండా అతి జాగర్తగా తప్పించుకుంటున్న మారుతికి, ఒక చోట తంత్రీస్వనాలు వినిపించాయి. పతివ్రతలైన స్త్రీలు కొందరు భర్తల దగ్గర నిద్రపోయి కనిపించారు. ఎటు చూసినా రాక్షసులు వీరవిహారం చేస్తున్నారు. వారు ఒకరినొకరు పరిహాసం చేసుకుంటూ మాట్లాడుకుంటున్నారు. ఒకళ్ల భుజాలపై ఇంకొకళ్ళు చేతులు వేస్కుని జంటలుగా నడుస్తున్నారు. మీద కప్పుకున్న కండువాలు తీసి ఒకరి ఛాతీ ఒకరికి చూపించుకుంటున్నారు.

నిద్రలో ఒళ్ళు తెలియక కొందరు తమ ప్రియురాళ్ళపై కాళ్ళు చేతులు వేసి పడుకుని వున్నారు. ఇంకొంతమంది ఘడియ ఘడియకీ వేషాలు మారుస్తున్నారు. అంతఃపుర స్త్రీలలో కొందరు అంగరాగాలు అలదుకుంటున్నారు. అందమైన స్త్రీలు కొందరు చిరునవ్వులు చిందిస్తున్నారు. ఇంక కొంతమంది కోపంతో జేగురించిన ముఖాలతో వున్నారు. ఇంకొంతమంది నిట్టూర్పులు వదుల్తున్నారు.

ఇలా వివిధ భంగిమలతో వున్న స్త్రీలనందర్నీ పరిశీలనగా చూస్తూ వారిలో ఎక్కడైనా సీతమ్మ కనిపిస్తుందేమో అని వెతుకుతున్నాడు హనుమంతుడు.

రాక్షసులలో కూడా పవిత్రస్వభావం గల స్త్రీలు, అందమైన స్త్రీలు, సిగ్గు గలవారు వున్నారు. ప్రియుల కౌగిళ్ళలో పరవశిస్తున్న వారిని మేడల పైభాగన కూర్చున్న వారినీ, అనేక మంది స్త్రీలని చూశాడు. ప్రియుల ఒళ్ళల్లో కూర్చుని

వారిని మురిపిస్తున్న స్త్రీలని చూశాడు. వారిలో కొందరు బంగారు తీగల్లా మెరిసిపోతున్నారు. కొంతమంది మేలి ముసుగులేని వారున్నారు. ఈ విధంగా వున్న నవ యవనవతులైన స్త్రీలందర్ని పరిశీలనగా చూస్తు కూడా ఏ మాత్రం చిత్త చాంచల్యం లేకుండా, కేవలం కర్తవ్య పాలనగా భావించి సీతాన్వేషణ సాగిస్తున్నాడా హరి వీరుడు.

ఆ స్త్రీలు ధరించిన ఆభరణాలు చూస్తూ, రాముడు చెప్పిన ఆనవాలుని బట్టి వారిలో సీత కనిపిస్తుందేమో అని వెతుకుతున్నాడు. కాని ఎక్కడా అయోనిజ అయిన సీత కనిపించలేదు. మహాపతివ్రత, నిరంతరం రాముణ్ణి స్మరిస్తూ అతడి కోసం దుఃఖిస్తుండేది, ఉన్నతమైన వంశం నించి వచ్చినదీ, స్త్రీలలో ఉత్కృష్టమైనదీ, శ్రీమంతమైన భర్త మనస్సులో నిండిపోయినది, అయినా సీత మాత్రం ఆ స్త్రీలలో ఎక్కడా కనిపించలేదు. హనుమంతునికెంతో దుఃఖం కలిగింది.

అలాగే దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ, ప్రసాదాల మీదుగా సపాగుతూ మళ్ళీ అన్వేషణకొనసాగించాడు. రాక్షసేంద్రుడైన రావణుని భవనం లోకి ప్రవేశించాడు. ఆ భవనం ద్వారాలు వెండి బంగారంతో చెయ్యబడ్డ చిత్ర విచిత్రములైన తోరణాలతో, అలంకరించబడి వున్నాయి. ఆభవనంలో ఎన్నెన్నో కక్ష్యలు వున్నాయి. ఒక్కొక్క కక్ష్య ఒక్కొక్కరీతిగా తీర్చిదిద్దివుంది.

గజారోహకులు, రథికులు, అక్కడ వున్నారు. సింహ వ్యాఘ్రాది చర్మములతో చేసిన తొడుగులు కలిగిన, దంతము వెండి బంగారు నగిషీలు కూర్చిన రథాలక్కడ వున్నాయి. చూడదగిన మృగాలు, పక్షులు, వేల కొద్దీ అక్కడవున్నాయి. వాటిని సుశిక్షితులైన రక్షకులు రక్షిస్తున్నారు. అందమైన స్త్రీలెంతమందో అక్కడ వున్నారు. వారి ఆభరణాలనుంచి వస్తున్న ధ్వని, సముద్ర ఘోషలా వుంది. అగరుచందనం వంటి పరిమళ ద్రవ్యాల సువాసనలతో ఆ ప్రదేశమంతా గుబాళిస్తోంది. భేరీ మృదంగ శంఖాదుల ధ్వనులతో, ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తోంది. మణులు, రత్నాలు, పొదిగిన గోడలు, ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైన ఉత్తమ జాతి జంతుజాలములతో ఆవరింపబడిన ఆ భవనం, లంకా నగరానికి మకుటాయమానంగా వుంది. ఆ కక్ష్యలన్నీ పరిశీలిస్తూ చాక చక్యంగా దాటుకుంటూ రావణుడు నివశిస్తున్న కక్ష్యలోకి చేరుకున్నాడు హనుమంతుడు. అంతవరకు చూసిన కక్ష్యలన్నీ చాలా సందడిగా, కోలాహలంగా వున్నాయి. కాని రావణుడు నివశిస్తున్న కక్ష్య చాలా నిశ్శబ్దంగా వుండడం గమనించాడు మారుతి. "రావణుని శయనగృహంలో సీతమ్మ ఎందుకుంటుంది"? అనుకున్నాడు.

అందుకే ఆ కక్ష్యలోని ఇతర ప్రసాదాలు వెతకసాగాడు. ముఖ్యమంత్రియైన

ప్రహస్తుని భవనం, మహాపార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి, వజ్రదంష్ట్ర, శుక, సారణ, ఇంద్రజిత్తు భవనాలన్నీ వెతికాడు. ఆ భవనాలన్నీ అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నాయి. కాని అక్కడ ఎక్కడా సీతమ్మ జాడలేదు. ఇక చేసేది లేక తప్పనిసరిగా, మళ్ళీ రావణుని శయన మందిరం ప్రవేశించాడు. రావణుడు ఆదమరచి నిద్రపోతున్నాడు. వేలాది రాక్షస స్త్రీలు ముద్గరములు, శక్తి తోమరములు, మొదలైన ఆయుధాలు ధరించి, వికృతాకారాలతో, ఆ మందిరం చుట్టు కాపలా కాస్తున్నారు. ఆ భవనం చుట్టూ అనేక సేనానివేశాలున్నాయి. ఉత్తమ జాతి గుఱ్ఱాలు ఆ నివేశాల దగ్గర కట్టబడి వున్నాయి. ఉత్తమ జాతి గజాలున్నాయి. లతాగృహాలు, చిత్రశాలలు, క్రీడా గృహాలు, దివా గృహాలు, కామగృహాలు, అనే వేరే వేరే గదులు ఆ భవనంలో వున్నాయి. నెమళ్ళు నాట్యం చెయ్యడానికి వీలుగా కొన్ని స్థానాలు ఏర్పరచబడి వున్నాయి. అనేక రత్నాలతో నిధులతో నిండి, ఆ భవనం పరమేశ్వరీ భవనంలా ఉంది. అక్కడ చక్కని పాన్పులు, ఆసనములు, పాత్రలు, అన్నీ బంగారంతో చెయ్యబడి వున్నాయి. ఒలికిన మద్యంతో, తడిసిన మణి బాజనములతో, ఆ భవనం కుబేరుడి భవనంలా వుంది. స్త్రీల నూపురముల ధ్వని, మొలనూలు లోని మువ్వల సవ్వడి, మద్దెల ధ్వనులు, ఆ భవనం నించి వినిపిస్తున్నాయి.

వరుసగా నిర్మించిన మేడలు, ఆమేడలలో వేలకొలది, సుందరాంగులు, వున్న ఆ మహాగృహములోకి హనుమంతుడు, చప్పుడు చెయ్యకుండా పిల్లిలా ప్రవేశించాడు. ఆ భవనం అంతటా వైఢూర్యాలు పొదగబడిన జాలరీలు వ్రేలాడుతున్నాయి. అవి చూడ్డానికి తమాషాగా వర్షాకాలంలో మెరుపుతీగలతో కూడిన, మేఘమాలికల్లా వున్నాయి. మేడమీద చంద్రశాలలు వున్నాయి. ఆ భవన మంతా అనేక విధాలైన సంపదలతో నిండి వుంది.

అవన్నీ చూస్తూ హనుమంతుడు, మయుడు ఆ భవనాన్ని చాలా చాతుర్యంతో నిర్మించి వుండవచ్చు అనుకున్నాడు. నేల అంతటా రకరకాల రత్నాలు తాపడం చెయ్యబడి వున్నాయి. ఎక్కడంటే అక్కడ చెట్ల పూలు ఒత్తుగా రాలి వున్నాయి. ఆపూవుల పుప్పొడి బాటలపై పరచుకుని వుంది. ఎంతో అందమైన స్త్రీలు చాలా మంది అక్కడ వున్నారు. రావణ భవనము యొక్క పైభాగాన అతడు కుబేరుని జయించి తెచ్చుకున్న పుష్పక విమానం పదిలంగా వుంచుకున్నాడు. ఆ విమానం చాలా అద్భుతంగా వుంది. దాని పైభాగం అంతా చక్కని చిత్రలేఖనం లిఖించబడి వుంది. అది చూడ్డానికి అచ్చం భూమండలంలా వుంది. భూమండలంపై వుండే పర్వత పంక్తులు ఆ పర్వత పంక్తులపై మహా వృక్షాలు,

ఆ వృక్షాల మీద మహాలతలు, పువ్వులు, పువ్వుల్లోని కేసరాలు, పత్రాలు, తామర కొలనులు, చాలా చక్కగా ఎంతో సొంపుగా చిత్రించబడి వున్నాయి. రత్న కాంతులీనుతున్న ఆ పుష్పక విమానం శోభాయమానంగా ఉంది. అందులో వెండితో చేసిన పక్షులు, పగడములు పొదగబడి చెక్కబడి వున్నాయి. రత్నాలనే వరసగా కూర్చి సర్పాల్లా చిత్రించారు. అందులో మేలు జాతి గుఱ్ఱం చిత్రాలు మలచబడి వున్నాయి. చక్కని పక్షులు, అందమైన ముఖాలతో, తీరైన రెక్కలతో, చిత్రించబడివున్నాయి. వాటిరెక్కలు కొద్దిగా వంచబడి, వాటిపై పగడాలు పొదిగిన బంగారు నగిషీ పనిచెయ్యబడి వుంది. అవన్నీ కూడా తెల్లని మేలు రకం వెండితో చెయ్యబడి వున్నాయి. తెల్లని వెండిపై పచ్చని మేలిమి బంగారు పూలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. మన్మథునికే మత్తు కలిగించేదంత అద్భుతంగా చెక్కబడి వున్నాయి ఆ పూలు.

ఆ పుష్పక విమానం మీద ఒకతామర కొలను చిత్రీకరించబడి వుంది. ఆ కొలనులో ఒక బంగారు పద్మంలో పొందుగా కూర్చున్న లక్ష్మీదేవి బొమ్మ చెక్కబడి ఉంది. ఆ మూర్తికి అటు ఇటు రెండు ఏనుగులు, తొండంతో కలువరేకులు అభిషేకం చేస్తున్నట్లు అత్యద్భుతంగా చెక్కబడి వుంది. అంతటి అద్భుతమైన ఆ పుష్పక విమానంలో, అణువణువునా సీతమ్మ కోసం వెతికాడు హనుమంతుడు. కాని ఆ మహాతల్లి ఎక్కడా కనిపించలేదు. రాను రాను ఆంజనేయునికి చెప్పరాని దుఃఖం కలగసాగింది. అనేక విధాలుగా ఆలోచించాడు. అలా ఆలోచిస్తూ అటు ఇటు తిరుగుతూ వుంటే ఆభవనం వెనక కక్ష్యలో ఇంకో భవనం కనిపించింది.

అది రావణుడు తన భార్యలతో కలసి నిదురించే శయన గృహం అని గ్రహించాడు మారుతి.

ఆ భవనం మణిరత్నవజ్రవైఢూర్యాలతో మిలమిలా మెరిసిపోతోంది. అందులో కృత్రిమంగా లిఖించబడ్డ శిల్పరాసి, జీవకళ ఉట్టిపడుత్తూ సజీవంగా లిఖించబడి వుంది. అయితే ఆ భవనం కూడా పుష్పక విమానంలోని భాగమే అని తెలుసుకుని చాలా అబ్బురపడ్డాడు వాయుపుత్రుడు. విశ్వకర్మ అద్భుతమైన ఆ పుష్పకవిమానాన్ని స్వయంగా నిర్మించి, తన పనితనానికి తానే చాలా ముగ్ధుడయ్యాడు. అది ఆకాశంలో నిలబెట్టబడి వుంది. రావణుడు తన తపోనుష్టానంతో, పరాక్రమంతో కుబేరుణ్ణి ఓడించి దాన్ని సంపాదించుకున్నాడు. దానిలో కూర్చున్న వారు మనస్సులో సంకల్పించినంత మాత్రానే ఎక్కడికంటే అక్కడకి వెళ్ళవచ్చు. ఏకాగ్రచిత్తంతో, శీఘ్రంగా ఆకాశంలో ప్రయాణం చేసి గమ్యం చేరుస్తుంది. దాని గమనాన్నెవ్వరూ ఆపలేరు. దానిలో ప్రతిభాగం ఎంతో

విశిష్టంగా ఉంది. ఆ విమానాన్ని మహాకాయులైన నిశాచరులు మోస్తున్నట్లు చిత్రించబడి వుంది.

ఎంతో సుకుమారంగా, అంతకంటే అందంగా వున్న ఆ విమానం ఎన్నో యోజనాల పొడవు, వెడల్పులు కల్గి వుంది. ఆ పుష్పక విమానం మధ్య భాగాన విశాలంగా వున్న ఒక అందమైన భవనమింకొకటి వుంది. అది అర్థ యోజనం విస్తీర్ణం, ఒక యోజనం పొడవు వుంది. అందులో కూడా మళ్ళీ చాలా అంతస్థులున్నాయి. సీతమ్మని వెతుకుతూ అందులో ప్రవేశించాడు మారుతి.

ఆ భవనాన్ని నాల్గు దిక్కులా నాలుగుదంతాలూ, మూడు దంతాలు గల ఏనుగులు, ఆయుధములు ధరించిన భటులు రక్షిస్తూ నిలబడి వున్నారు. అందులో రావణుని భార్యలే గాక, అతడు అపహరించి తెచ్చిన స్త్రీలు కూడా వున్నారు. వారంతా అనేక వేల మంది రాచకన్యలు, వారంతా నివసించి వున్న ఆ భవనం ఎన్నెన్నో సంపదలతో నిండి వుంది.

పూర్వం కుబేరుడు తపస్సు చేసి బ్రహ్మని మెప్పించి, ఆ పుష్పక విమానాన్ని బహుమతిగా పొందాడు. రావణుడు కుబేరుణ్ణి యుద్ధంలో ఓడించి, దానిని సంపాదించాడు. ఆ విమానం బంగారు, వెండి కలబోసి నిర్మించబడినది. తోడేళ్ళ బొమ్మలున్న స్థంభాలు, బంగారు మెట్లు, సుందరమైన వేదికలు, పగడాలు, ముత్యాలు, మణులు పొదిగిన అడుగు భాగంతో, సూర్యమండలంలా ప్రకాశిస్తోందది. అటువంటి పుష్పక విమానంలోకి మారుతి అడుగుపెట్టాడు. లోన అడుగుపెట్టగానే అనేక పానీయాలు, బక్ష్యాలు, భోజ్యాలు, తాలూకు సువాసనలు నాసికా పుటాన్ని తాకాయి. ఘుమఘుమలాడుతూ ఆ సువాసనలు అన్ని వైపులకి వ్యాపించి వున్నాయి. అలాగే మెల్లిగా అడుగులు వేస్తూ లోపలకి ప్రవేశించాడు. ఎటు చూసినా మణులు తాపడం చేసిన మెట్లు, బంగారు జాలరీలు కలిగిన కిటికీలు, స్పటిక మణులు పొదిగిన గోడలు, స్థంభాలు మధ్యలో ముత్యాలూ పగడాలు, వెండి బంగారు నగిషీలతో నిర్మించిన చిత్రాలు అలంకరించబడి వున్నాయి. ప్రకృతి అందాలన్నీ చిత్రీకరించబడి పట్టు తివాసీలు, అన్ని చోట్లా పరచబడివున్నాయి. దివ్యమైన సుగంధపరిమళాలు అన్ని వైపులా వ్యాపించి వున్నాయి. ఆ భవనంలో అన్ని చోట్లా చిత్ర విచిత్రమైన రంగు రంగులు పూలు పరచబడివున్నాయి. విలువైన పాన్పులున్నాయి. అక్కడి వైభవాన్ని, ఆ సౌందర్యాన్ని చూసిన హనుమంతుడు, ఇది స్వర్గమా? దేవలోకమా! ఇంద్రలోకమా? సిద్ధి క్షేత్రమా!! అని అబ్బురపడిపోయాడు.

కాంచన దీపములు వెదజల్లుతున్న కాంతిపుంజాలు అన్నివైపులా వ్యాపించి వున్నాయి. ఆవెలుగులో కింద తివాసీల మీద, ఆదమరచి నిద్రపోతున్న వేల కొలది స్త్రీలు కనిపించారు. వారంతా మన్మధ క్రీడలో అలసి సొలసి గాఢనిద్రలో మునిగి వున్నారు. కొందరు స్త్రీలు బొట్లు చెరిగి, కొందరి కాలిఅందెలు జారిపోయి, కొందరి మెడలలో హారాలు పక్కకి జారి, ఇంకా కొంతమందికి ఒంటిమీద వస్త్రాలు కూడా జారిపోయి, మెడలలో పూలదండలు నలిగి, వివిధ భంగిమలలో పడివున్న ఆ స్త్రీలలో, సీతమ్మ కోసం వెతకసాగాడు హనుమంతుడు.

వాళ్ళు నిద్రలో ఒళ్ళు తెలియక, పక్కన వున్న స్త్రీల ముఖాల్ని రావణుని ముఖం అనుకుని, ముద్దులాడుతున్న భంగిమలో వున్నారు. ఒకరి గుండెలపై ఇంకొకరు చేతులుంచుకుని పడుకున్నారు. ఒకరి చేతులింకొకరు పైన వేసుకుని, ఒకరి తొడలు ఇంకొకరు అదుముకుని, ఒకరి నొకరు కౌగలించుకుంటు, శృంగార భంగిమలలో ఒళ్ళెరక్కుండా పడుకుని వున్నారు.

వారిలో కామపరవశులైన రాజర్షికాంతలు, పితృకాంతలు, దైత్యకాంతలు, గంధర్వకాంతలు, రాక్షసకాంతలు వున్నారు. వారిలో కొందర్ని రావణుడు అపహరించి తేగా మరికొందరు అతడి వైభవాన్ని చూసి తామంత తామే వలచి వచ్చిన వారున్నారు. అయితే వారిలో ఏ ఒక్క స్త్రీని రావణుడు బలవంతంగా అనుభవించలేదు. వారి అంగీకారంతోనే వారిననుభవించాడు. తన సంపదలు ఎరగా చూపి వారి నాకర్షించి వశపరచుకున్నాడు.

వారిలో అంతకుముందు వేరే పురుషుని అనుభవించిన వారు గాని, ప్రేమించిన వారు గాని, కులవతులు కాని వారు గాని, కామయింపదగని వారు గాని, ఒక్కరు కూడా లేరు. తొలగిన వస్త్రాల వెనక కుచాగ్రభాగాలతో, తొడలతో, బుజములతో, ఒకరినొకరు అల్లుకుపోయి, మన్మధ సామ్రాజ్యం తమదే అన్నట్లు భోగలాలసలై వున్న వారిని చూసి మారుతి " ఆహా రామపత్నియైన జానకి కూడా వీరివంటిదే అయితే, ఈ రావణుని జన్మధన్యమైపోయి వుండేది కదా, అనుకుంటూ మళ్ళీ తన తెలివితక్కువ ఆలోచనకి, తనలో తానే బాధపడ్తూ "ఛీ... ఛీ... నేనెంత బుద్ధి హీనుడ్ని, ఈనీచురాళ్ళకూ, మా సీతమ్మకూ, పోలికా!

ఆ మహాసాధ్వి, మహాపతివ్రత, ఆమె కాలిగోటికి కూడా వీరు పోలరు కదా. ఈ దుర్మార్గుడైన, లంకేశ్వరుడు బుద్ధిహీనుడై, యుక్తా యుక్త విచక్షణా జ్ఞానము లేక, అనార్యమైన, క్రూరమైన పని చేసి ఆ సాధ్విని పట్టి తెచ్చాడు కదా! అని ఎంతగానో పరితపించాడు.

ఇంక ఆ దృశ్యాన్ని చూడలేక ముందుకి సాగాడు. అక్కడ రత్నములతో స్ఫటికములతో నిర్మించిన దివ్యమైన ఒక శయనము కనిపించింది. దాని పర్యంకము, బంగారము, దంతములు కలబోసి చేసినదిగా కనిపించింది. దాని మీదికి ఎక్కటానికి, వైఢూర్యాలు పొదిగిన మెట్లు వున్నాయి. అమూల్యమైన మెత్తని పట్టుదుప్పటి దాని మీద పరచివుంది. దానికి తలవైపున చంద్రమండలం లాంటి తెల్లని గొడుగు అమర్చి వుంది. కొంతమంది స్త్రీలు చామరములు పట్టుకుని వీస్తున్నారు. ధూప పరిమళము, సుగంధ ద్రవ్యాల సువాసనలు అక్కడ వ్యాపించి వున్నాయి. సుగంధ పరిమళయుక్తమైన పూలమాలలు ఆ శయనానికి చుట్టు కట్టబడివున్నాయి. ఆ పాన్పు మీద, నల్లని మేఘంలా వున్న రావణుడు పడుకుని వున్నాడు. వాని నల్లని శరీరముపై చెవులకి బంగారు కుండలాలు, ధగధగా ప్రకాశిస్తున్నాయి. ఎఱ్ఱని కన్నులు, పొడవైన చేతులు వున్నాయి. బంగారు పట్టు వస్త్రాలు ధరించి వున్నాడు.

మద్యము త్రాగి, స్త్రీలతో క్రీడించి, అలసి నిదురించిన రావణుడు, ఒళ్ళంతా ఆభరణాలతో, చందనపు మెయిపూతతో, మెరుపుతీగలతో కూడిన మేఘంలా పడుకుని వున్నాడు. ఆ స్థితిలో వున్న రావణుని చూడగానే ఆంజనేయునికి ఉద్వేగం కలిగింది. భయపడ్డ వానిలా ఒక్కడుగు వెనక్కి వేసి, ఇంకొక వేదిక మీదికి ఎక్కి నిలబడి, ఆ రాక్షసరాజుని పరిశీలనగా చూశాడు. ధరధగా మెరుస్తున్న భుజకీర్తులు ధరించిన బుజములు పైకి చాపిపడుకున్నాడు.

ఆ బాహువుల మీద, ఐరావతము యొక్క దంతములచే ఏర్పడ్డగాట్లు, మచ్చలు, స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంద్రుని వజ్రం వల్ల, విష్ణువు చక్రము వల్ల గాడపడిన భుజాలు కాయలు కాసి వున్నాయి. ఏనుగు తొండాల్లా బలిసిన ఆ బాహువులు ఐదు తలల పాముల్లా వున్నాయి. అందగత్తెలైన స్త్రీలచే మర్దించబడి వున్నాయి.

విశాలమైన ఆ భవన మంతా అతడు భుజించిన ఆహారాలు, త్రాగిన పానీయాలు, తాలూకు వాసనలతో నిండి వుంది. మణిరత్న ఖచితమైన కిరీటము కొంచెం పక్కకి వాలి వుంది. కుండలముల కాంతిలో అతడి ముఖం విచిత్రంగా ప్రకాశిస్తోంది. అతడి విశాలమైన వక్షస్థలం మీద ఎఱ్ఱచందనం అలుముకున్న మణి హారాలు అటు ఇటు జారి మిలమిలా మెరుస్తున్నాయి. నల్లగా మినుముల రాశిలా పడివున్న రావణుడు బుసలు కొట్టున్న తాచుపాములా వున్నాడు.

ఆ పాన్పుకి నాలుగు వైపులా కాంచన దీపాలున్నాయి. రావణునితో భోగాలనుభవించిన కొందరు స్త్రీలు అక్కడే పడి నిద్రపోతున్నారు. వారిలో ఒకతె

వీణని కౌగలించుకుని నిద్రపోతోంది. ఇంకొకతె మద్దెల వంటి వాద్యముచంకలో ఇరికించుకుని పడుకుంది. ఇంకా మిగిలిన స్త్రీలు కూడా అనేక ఇతర వాద్యాలు గుండెల కదుముకుని పడుకుని వున్నారు.

వారంతా నిద్రలో తమ పక్కనున్న స్త్రీలను ప్రియుడనే భావనలో అనేకములైన కామచేష్టలు చేస్తూ నిద్రలోనే పక్కనున్న స్త్రీల వక్షోజాలు మర్దిస్తూ కుచాగ్రాలు నలిపివేస్తూ వింత చేష్టలతో తృప్తి పడ్తున్నారు.

అలా అనేక భంగిమలలో పడివున్న ఆ స్త్రీలకి దూరంగా ఒక హంసతూలికా తల్పంమీద ఒంటరిగా నిదురిస్తున్న మండోదరి హనుమంతునికి కనిపించింది. ఆమె అత్యంత సౌందర్యవతి. ముక్తా మణి భూషణాలతో అలంకరించుకుని వుంది. పచ్చని మేనిఛాయతో మెరిసిపోతున్న ఆమెని చూసి, ఆమె సీతమ్మ అయి వుండవచ్చని అనుకున్నాడతడు. వెంటనే మారుతికి చెప్పలేని ఆనందం కలిగింది. జబ్బలు చరుచుకున్నాడు. తొడలు కొట్టుకున్నాడు. గిర గిర తిరిగి తోక ముద్దు పెట్టుకున్నాడు. సంతోషంతో నాట్యం చేశాడు. పాటలు పాడాడు. స్థంభాలెక్కి దూకాడు. ఈ విధంగా వానర సహజమైన చేష్టలతో ఆనందంపట్టలేక ఉక్కిరి బిక్కిరయ్యాడు. వాయునందనుడు అలా కొంతసేపు ఆనందంతో తలమునకలయ్యాక అతడిలో వివేకం మేల్కొంది. తన తెలివి తక్కువ ఆలోచనకి పశ్చాత్తాపపడ్డాడు.

"అయ్యో! ఎంత తెలివి తక్కువ ఆలోచన చేశాను! నా అంత బుద్ధిహీనుడు ఎక్కడైనా వుంటాడా? రాముని ఎడబాసిన సీతమ్మ ఇంత సుఖంగా నిద్రపోతుందా? లేదు. ఆమె ఇలా హాయిగా నిద్రపోదు. భోజనం చెయ్యదు. అలంకారాలు ధరించదు. పానము చెయ్యదు. దేవేంద్రుడే కోరి వచ్చినా సరే, పరపురుషుని సేవించదు. రామునితో సమానమైన పురుషోత్తముడు, దేవతలలో కూడా వుండడు.

ఆమె సీత కాదు. వేరెవరో స్త్రీ అయి వుంటుంది. అనుకుంటూ ముందుకి సాగిపోయాడు. అక్కడ పానశాల వుంది. అందులో కొందరు మన్మథ కేళిలో అలసిన వారు, గానము చేసి అలసిన వారు మరికొందరు, బాగా మధుపానము చేసి మత్తెక్కి మద్దిళ్ళమీద, ఆసనముల మీద, పాన్పుల మీద ఒరిగి నిద్రలో మునిగి వున్నారు. సౌందర్యవంతులైన యువతులు చక్కగా అలంకరించుకుని మరీ నిదురించివున్నారు.

ఆ ప్రదేశంలో వున్న పానశాల సర్వకామములతో నిండి వుంది. అక్కడ మృగములు, దున్నపోతులు, పందులు మొదలైన జంతువుల మాంస ఖండములు కుప్పబోసి వున్నాయి. పెద్ద పెద్ద వెండి పాత్రలలో, సగం తిన్ననెమళ్ళు, కోళ్ళు,

పండులు, మొదలైనవి వున్నాయి. పెరుగు, సౌవర్చలమనే లవణము, సంజుకోవడానికి పెద్ద పెద్ద వెండి పాత్రలలో వున్నాయి. లేహ్యాములు, పేయములు, అనేక విధాలైన భోజన పదార్థాలు, వండబడి తినడానికి సిద్ధంగా అమర్చబడి వున్నాయి.

పులుపు, తీపి, ఉప్పు కలిపి వండబడిన, చారు లాంటి పలచని పదార్థాలు ఆవాలు పోపువేసి తయారు చేసి వుంచారు. ఇవన్నీగాక పెద్ద పెద్ద ఫలములు వెండి పళ్ళాలలో వున్నాయి. అవన్నీ అందంగా అమర్చబడి వున్నాయి. అలంకారానికి పనికివచ్చే అనేక పూలు వున్నాయి. పెద్ద పెద్ద పాత్రలలో రకరకాల మద్యములు వున్నాయి. వాటి పక్క త్రాగటానికి వీలైన వెండి, బంగారు స్ఫటిక పాత్రలు వున్నాయి. అవి చిన్న చిన్నవిగా వున్నాయి. కొన్ని పాత్రలు సగం త్రాగి వదిలేసి వున్నాయి. ఇంకొన్ని పూర్తిగా తాగేసి నేలపై విసిరెయ్యబడి వున్నాయి. తాగకుండా వదిలేసిన పాత్రలూ కొన్ని వున్నాయి.

ఎన్నో రకాల పిండి వంటలు, పాయసాలు, పానీయాలు, అన్నాలు, అన్నీ వెండి బంగారు పాత్రలలో సర్ది అందంగా అమర్చబడి వున్నాయి. ఎటు చూసినా చల్లని పిల్లగాలులు, చందనము అగరుధూపములు, పూవులు మద్యముల తాలూకు సువాసనలతో, ఆ పుష్పకమంతా నిండి మత్తెక్కిస్తూ వుంది. ఇంతటి శోభాయమానమైన రావణుని అంతఃపురాన్ని హనుమంతుడు అణువణువు వెతికాడు. కాని సీతమ్మ జాడ తెలియలేదు. కాని హనుమంతునిలో తీవ్రమైన ఆత్మ సంక్షోభం కలిగింది.

తాను చూడకూడని దృశ్యాలు చూసి ధర్మాన్ని అతి క్రమించాడేమో, అనే చింతతో అతడి మనసు వ్యాకులమైంది.

"అయ్యో అంతఃపురంలో స్వేచ్ఛగా నిదురిస్తున్న పరస్త్రీలని చూసి చాలా పాపం చేశాను. కాని వారిని నేను బుద్ధిపూర్వకంగా చూడలేదు కదా. నా కర్తవ్య నిర్వహణలో వారు నా కంటబడ్డారు. వారి నా పరిస్థితిలో చూసినా నాలో ఎలాంటి వికారం కలగలేదు. రావణుని కాంతలు మన్మథలీలలో పరవశించి ఆదమరచి అస్తవ్యస్థంగా నిదురించి వున్నారు. అటువంటి దృశ్యాలు చూశాక కూడా నా మనసు చలించలేదు. ఎందుకంటే, నా బుద్ధి కేవలం సీతమ్మని వెతకటంలో మాత్రమే లగ్నమై వుంది. సర్వేంద్రియముల ప్రవర్తనకీ మనస్సే కారణం కదా. నా మనసు నిలకడగా వుంది.

మరి సీతమ్మని వెతకాలంటే స్త్రీలలోనే కదా వెతకాలి? వేరొక చోట ఆమె

వుండటం అసాధ్యం కదా. కనుక నేను పరిశుద్ధమైన మనసుతో అన్వేషణ సాగించాను. నా పట్ల ధర్మలోపం కలగలేదు. కాని ఇంత చేసినా సీతమ్మ జాడ తెలియలేదే" అని తన మనస్సులో పరిపరి విధాల తర్కించుకుంటూ, అక్కడ్నించి ముందుకి కదిలాడు. అలా వెళ్ళి, వెళ్ళి పూపొదరిళ్ళు, లతా గృహాలు, చిత్ర గృహాలు, నిశాగృహాలు అన్నింటిలోనూ ప్రతి అంగుళం వెతికాడు. కాని సీతమ్మ కానరాలేదు. ఇంక నిరాశ ఆవరించింది. ఒక వేళ ఇంతవెదకినా కనిపించలేదంటే సీత ప్రాణాలతో లేదేమో. తన శీలాన్ని కాపాడుకోవాలనే పట్టుదలతో వున్న జానకిని ఈ దుష్టరావణుడు చంపెయ్యలేదు కదా. లేకపోతే భయంకరమైన ఈ రాక్షసుల్ని చూసి భయంతో సీత ప్రాణాలు వదిలేసిందేమో.

ఇప్పుడు నేను ఇన్నాళ్ళు గడిచాక, సీతమ్మ జాడ తెలుసుకోకుండా సుగ్రీవుడి దగ్గరకి తిరిగి వెళ్ళడం అసాధ్యం. సుగ్రీవుడసలే దండనవిషయంలో ముందు వెనుకలాలోచించడు. తీవ్రంగా దండిస్తాడు.

అంతఃపురమంతా వెతికాను. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఇప్పుడు సీతమ్మని చూడకుండా నేను వెనక్కి వెళ్తే నా, తోటి వానరులు, నువ్వు లంకకి వెళ్ళి ఏం చేశావని అడిగితే నేనేం బదులు చెప్పను? కాలా తీతమైంది కనుక వారంతా ప్రాయోపవేశం చేసి తీర్తారు. వృద్ధులైన జాంబవంతుడు నన్నెంతగా నిందిస్తాడో కదా" అని ఎన్నో విధాల ఆలోచించి దిగులు పడ్డాడు.

అంతలోనే మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నాడు ఛీఛీ ఇలా నిరాశపడ్తున్నానేమిటి? ఉత్సాహమే అన్ని సంపదలకి మూలకారణం. అదే సుఖప్రదము. ఉత్సాహంతో ప్రయత్నిస్తే తప్పక కార్యసిద్ధి కలుగుతుంది. కనుక నేను ఉత్సాహంతో మళ్ళీ ప్రయత్నిస్తాను." అని తనకి తానే ధైర్యం చెప్పుకున్నాడు. మళ్ళీ ఇంకోసారి పానశాలలు, పుష్పగృహాలు, విలాస మందిరాలు, ఊరికి దూరంగా వున్న విహార భవనాలు, అన్నింట్లోనూ ఎక్కుతూ దిగుతూ, తలుపులుతీసి వెళ్తూ, ప్రతి సందులోనూ ప్రవేసిస్తూ అణువణువు వెతికాడు. రావణాంతఃపురంలో నాలుగంగుళాల మేరకూడా వదలకుండా, వెతికాడు. కాని ఎక్కడా సీత కనపడలేదు. హనుమంతుడు విసిగి వేసారి దుఃఖ సముద్రంలో మునిగిపోయాడు.

"అయ్యో! మా ప్రయత్నాలన్నీ విఫలమైపోయాయి కదా. నేను శతయోజన విస్తీర్ణ సముద్రాన్ని దాటి వచ్చినా కూడా ఫలితం లేకపోయిందే". అంటూ ఎన్నో విధాల పరితపించాడు. అలా నడుస్తూ నడుస్తూ మనస్సులో ఇలా బాధపడ్డాడు. "అయ్యో రాముడికి మేలు చెయ్యాలని లంకంతా వెతికాను. కాని సౌభాగ్యవతియైన సీతమ్మ ఎక్కడా కనిపించలేదు. సీత రావణుని గృహంలోనే వుంటుందని సంపాతి

చెప్పాడే. మరి ఆ మహాసాధ్వి ఎక్కడా కనిపించలేదేమిటి?

అయినా మహాపతివ్రత అయిన ఆ సాధ్వి రావణ మందిరంలో వుంటుందా? అసంభవం. ఒక వేళ రావణుడు సముద్రం మీది నించి ఎగిరి సీతని తీసికెళ్తుండగా జారి సముద్రంలో గాని పడిపోలేదు కదా. కాని రావణుడలా పడనిస్తాడా? ఆ దుష్టుడైన రావణుడు తన బలిష్టమైన చేతులతో ఆమెని అదిమి పట్టుకుంటే ఆ సున్నితాంగి నలిగిపోయి చనిపోయిందేమో. లేదా కోపంతో ఆ రావణుడే ఆమెని చంపి తినేశాడో. కాని ఆమె మీద అంతగా మనసు పడ్డ ఈ నీచుడు ఆమె నెలా చంపగలడు? ఒక వేళ వాడు చంపకపోయినా, వాని భార్యలలో రాక్షస స్త్రీలైనా ఆమెని చంపే అవకాశం వుంది. కాని ఆ దుష్టుడు ఆమెనలా తన భార్యల పాలి పడనిస్తాడా? కాని వాడి దుష్కృతాలు సహించలేక హే రామా, హే లక్ష్మణా' అని విలపిస్తూ ఆమె ప్రాణాలు వదిలివుండవచ్చు. కాని ఆ ఊహ కూడా సరైంది కాదు. ఎందుకంటే జానకికి రాముడంటే పంచ ప్రాణాలూ. కనుక ఎన్నికష్టాలు పడ్తున్నా భర్త కోసం ప్రాణాలు నిలుపుకుని వుంటుంది. నీచుడైన రావణుడు చిలకని పంజరంలో బంధించినట్లు ఆ అమాయకురాలి నెక్కడో బంధించి వుంటాడు. రాముని ఎడబాటు సహింపలేక సీత మరణించి అయినా వుండవచ్చు. కాని అదే నిజమైతే సీతమ్మ ఇంక లేదన్న మాట రామునికి నేనెలా చెప్పగలను? చెప్పినా ముప్పే. చెప్పకపోతే తప్పే అవుతుంది. ఎందుకంటే ఆ వార్త తెలిశాక రాముడు ప్రాణాలతో వుండడు. చెప్పకుండా దాస్తే నేను రాముణ్ని వంచించిన వాడినవుతాను. అయ్యో ఎంతటి విషమ పరిస్థితిలో ఇరుక్కున్నాను! ఇప్పుడేం చెయ్యాలి?

సీతమ్మ లేదన్న వార్త వింటే రాముడు ప్రాణాలు విడుస్తాడు. రాముడు లేకపోతే లక్ష్మణుడు ప్రాణాలతో వుండడు. వారిద్దరూ మరణించారని తెలియగానే భరతుడు ప్రాణాలు వదిలేస్తాడు. భరతుని వెంట శత్రుఘ్నుడు, వారివెంట వారి తల్లులు, కూడా మరణిస్తారు.

రాముని ప్రాణమిత్రుడైన సుగ్రీవుడు కూడా రాముడు లేనిదే బ్రతకడు. సుగ్రీవుని వెంట తార, రుమ, అంగదుడు అంతా మరణిస్తారు. ప్రభువుని కోల్పోయిన వానరులంతా కూడా చనిపోతారు. ఈ విధంగా నా మూలంగా ఇక్ష్వాకుకులము, వానర కులము కూడా సర్వనాశనమవుతాయి. అందుకని సీత జాడ సరిగా తెలుసుకోకుండా నేను కిష్కింధకి వెళ్ళకూడదు. కనుక దొరికిందేదో తింటూ ఇక్కడే ఈ చెట్ల మధ్యలో వుండి గమనిస్తాను. అలా కాకపోతే సాగర తీరంలో అగ్నిరగిల్చి అందులో దూకుతాను. లేదా ప్రాయోపవేశం చేసి ఈ శరీరాన్ని

కాకులకీ, గద్దలకీ ఆహారం చేస్తాను. ప్రస్తుతానికి ఏ చెట్టుకిందో తపస్సు చేస్తూ కూర్చుంటాను. అంతే గాని సీతని చూడకుండా వెళ్ళను" అంటూ ఆంజనేయుడు తనలో తానే తర్కించుకుంటూ, శోకాక్రాంతుడై కూర్చున్నాడు. మహాబలుడైన ఆ రావణుణ్ణి చంపి ప్రతీకారం తీర్చుకుందామా అనిపించింది. అలా కాకపోతే వాణ్ణి ఎత్తుకెళ్ళి రాముని పాదాలపై పడేద్దామనుకున్నాడు. కాని అందువల్ల ప్రయోజనం ఏమిటి? అని ఆలోచిస్తూ నడుస్తుండగా ఎదురుకుండా అశోకవనం కనిపించింది. ఆ వనంచూడగానే ఆంజనేయునికింకో ఆలోచన వచ్చింది.

"ఒక వేళ ఆ వనంలో సీతమ్మ వుందేమో? అక్కడ నేను వెతకలేదు కదా" అనుకున్నాడు. వెంటనే రెట్టించిన ఉత్సాహంతో లేచాడు. తన ఈ ఆఖరి ప్రయత్నం ఫలించాలని, వసువులకి, రుద్రులకి, ఆదిత్యులకి, అశ్వనీదేవతలకీ మొక్కుకున్నాడు. ఒక్కసారి మనస్సులో రామలక్ష్మణులకి నమస్కరించాడు. రుద్ర, యమ, వాయుదేవతలకి, చంద్ర, సూర్యమరుద్గణములకి మనసారా మ్రొక్కుకుని నమస్కరించాడు.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ,
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై.
నమోస్తు రుద్రేంద్ర యమాని లేభ్యో,
నమోస్తు చంద్రర్క మరుద్గణేభ్యః

ఇది ఆంజనేయుడు మనసాధ్యానించిన శ్లోకం. ఇది చాలా విశిష్టమైన శ్లోకంగా పెద్దలు చెప్పారు. ఏదైనా చిక్కు సమస్య పరిష్కారం కాకుండా చికాకు పెట్టున్నప్పుడు నమ్మకంతో చేతులు జోడించి ఈ శ్లోకాన్ని పదకొండు సార్లు జపిస్తే తప్పకుండా ఆ సమస్య పరిష్కారమవుతుందని పండితులు నొక్కి వక్కాణించారు. అంతే కాదు వాల్మీకి రామాయణంలో ప్రతీ శ్లోకం ఎంతో మహిమాన్వితమైనది. జీవితంలో ఒక్కసారైనా వాల్మీకి రామాయణం పారాయణ చెయ్యగలిగితే, వారు ఎంతో ధన్యులవుతారు.

ఆ విధంగా ఆరాధ్యదేవతలనందర్ని ప్రార్థించి, మారుతి, ఆ అశోక వనంవైపు కదిలాడు. ఇప్పటి దాకా తన స్వశక్తి మీద నమ్మకంతో సీతాన్వేషణ సాగిస్తున్నాడు. చివరికి తన ప్రయత్నం ఫలించక పోవడం వల్ల, దైవశక్తి మీద ఆధారపడి ప్రార్థించడం మొదలుపెట్టాడు. దైవశక్తి ఎంతగొప్పదో ఇక మీదట ప్రతి సన్నివేశంలో నిరూపించి వ్రాశాడు వాల్మీకి మహాముని.

అశోక వనం సమీపిస్తున్న కొద్దీ ఆందోళన ఎక్కువైంది. ఈ వనానికి, కాపలా

వాళ్ళుంటారేమో అని సందేహించాడు. తన శరీరాన్ని మరింత చిన్నదిగా చేసుకున్నాడు. మనస్సులో ఇలా ధ్యానించాడు.

"సర్వ దేవతలు, ఋషులు, నాకు సిద్ధి నొసగెదరు గాక. బ్రహ్మ, అగ్ని, వాయువు, ఇంద్రుడు, వరుణుడు, సూర్య చంద్రులు, అశ్వనీ దేవతలు, మరుత్తు శివుడు, సర్వ భూతములు, సర్వభూతాధిపతియైన మహావిష్ణువు, నాకు సిద్ధి నిచ్చెదరు గాక" అంటూ సర్వదేవతల్ని ప్రార్థించాడు.

సుకుమారి, సౌందర్యరాశి, మహాసాధ్వి అయిన జానకీ మాత దర్శనం ఎప్పుడవుతుందో కదా అనుకున్నాడు. ఆదీనురాల్ని దర్శించి ధైర్యం చెప్పే అవకాశం తనకి కలుగుతుందా? అని చాలా బాధపడ్డాడు. రావణుని భవనం మీదనించి, ప్రాకారం మీదుగా, ఒక్కసారి ఆశోక వనంలోకి దూకాడు. అప్పటి వరకు ఆలోచిస్తూ ప్రాకారం మీదనే నడుస్తున్నాడు. ఊపుకోపం భవంతి మీదికి, మళ్ళీ ప్రాకారం మీదుగానే అశోకవనంలోకి దూకాడన్న మాట.

అప్పుడే వసంతమాసం ప్రారంభమైనట్లు గుర్తుగా, చెట్లన్నీ పూలతో నిండి శోభాయమానంగా వున్నాయి. ఆ సౌందర్యం తిలకించి, ముగ్ధుడవుతూ అశోకవనంలోకి దూసుకుపోయాడు. పక్షుల కిలకిలారావాలతో, అటు ఇటు పరుగులు తీస్తున్న మృగములతో, నెమళ్ళ కేకరింపులతో, ఆ అశోకవనం ఎంతో సందడిగా వుంది. ఆ వనంలో ప్రవేశించి ఒక చెట్టు మీదినించి, ఇంకో చెట్టు మీదకి దూకుతూ సీతమ్మ కోసం వెతుకుతూ వుంటే, ఆ ఊపులకి, చెట్లమీద హాయిగా నిద్రపోతున్న పక్షులు నిద్రలేచాయి. చెట్ల మీది నించి పూలూ జలజలా రాలాయి.

ఆ వనంలో మణులుతాపడం చేసిన మైదానాలున్నాయి. మణులు పొదిగిన మెట్లు వున్న దిగుడు బావులున్నాయి. తియ్యని నీరుతో ప్రవహించే నదులు, ఆ నదీ తీరం వెంబడే మహా వృక్షాలున్నాయి. ఎత్తైన పర్వతం ఒకటి వుంది. ఆ పర్వతం మీద ఎన్నో శిలాగృహాలూ, నానా విధాలైన వృక్షాలూ వున్నాయి. ఆ పర్వతం పైనించి ఒక ప్రవాహం జలజలా కిందికి ప్రవహిస్తోంది. ఆ ప్రక్కనే ఒక తామర కొలను, దాని నిండా జలపక్షులువున్నాయి. దాని పక్క ఒక దిగుడు బావి వుంది. దానికి మణులు కూర్చిన మెట్లున్నాయి. దాని సమీపంలో ఎన్నో ప్రసాదాలున్నాయి.

పూలు పండ్లునిండిన మహావృక్షాలు. ఆ వృక్షాల నీడలో గొడుగులు. ఆ గొడుగులకింద అందమైన అరుగులు. ఎంతో చక్కగా తీర్చిదిద్ది నియమించారు.

అవన్నీ బంగారు మయంగా వున్నాయి. అక్కడ దట్టంగా ఆకులతో అలుముకుని వున్న ఒక శింశుపా వృక్షం కనిపించింది. అది కూడా బంగారు రంగులోనే వుంది. ఆ బంగారు వృక్షం ఛాయలో మారుతి కూడా బంగారు వర్ణంలో మెరిసిపోయాడు. చిక్కగా వున్న ఆ శింశుపా వృక్షం ఎక్కి దాని కొమ్మల మాటున కూర్చున్నాడు హనుమ.

మనస్సులో ఇలా అనుకున్నాడు."రామునికి దూరమై తపించి పోతున్న జానకమ్మ ఎక్కడుందో ఈ చెట్టు కొమ్మలపై నుంచుని చూస్తాను.

ఈ అశోకవనం చంపకములు, చందన వృక్షాలు, వకుళములతో నిండి ఎంతో అందంగా వుంది. జానకమ్మకి పూవులన్నా, వృక్షాలన్నా చాలా ఇష్టమని రాముడు అంటుండగా విన్నాను. కనుక ఒక వేళ ఆమె ఈ లంకలోనే వుంటే తప్పకుండా ఈ సుందరమైన ప్రదేశానికి వస్తుంది. నాకెందుకో ఆ సాధ్వి ఇక్కడే కనిపిస్తుందని నమ్మకంగా వుంది. సంధ్యావందనం చెయ్యడానికైనా ఈ నదికి తప్పక వస్తుంది" అని మనస్సులో అనుకుంటు మారుతి ఆ వృక్షంఎక్కి గుబురుగా వున్న ఆకులతో కూడిన కొమ్మల మాటున దాగి కూర్చున్నాడు. అక్కడ కూర్చుని సీతమ్మ కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూడసాగాడు.

నందన వనాన్ని మరపింపచేస్తున్న ఆ వనంలో ఎన్నెన్నో మేడలు వున్నాయి. లతలు అల్లుకున్న వృక్షాలతో, పూలతో, వాటి పరిమళాలలో ఆ వనంలో ఎంతోశోభస్కరంగా వుంది. పక్షులకూతలతో, మృగాల అరుపులతో, చాలా కోలాహలంగా వుంది. అశోక పుష్పాలతో నిండిన అశోక వృక్షాలు ఆ వనంలో వందల కొద్దీ వున్నాయి.

చూడగా చూడగా అది కుబేరుని చైత్ర రథంలా వుంది. అక్కడికి దగ్గరలో గందమాదన పర్వతం లాంటి చైత్రప్రసాద మొకటి కనిపించింది. ఆ ప్రాసాదానికి వెయ్యి స్థంభాలున్నాయి. అది కైలాసగిరిలా వుంది. దాని మెట్లు పగడములు కూర్చి నిర్మించబడి వున్నాయి. ఆ ప్రసాదవైభవాన్ని పరిశీలనగా చూస్తూ కాస్త దృష్టితిప్పేసరికి కొంతదూరంలో హనుమంతునికి సీతమ్మ కనిపించింది.

ఆమె కట్టుకున్న బట్టలు చాలా మాసి, మురికి పట్టి వున్నాయి. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు గుమిగూడి వున్నారు. ఉపవాసాలతో కృశించి వుంది. మాటి మాటికీ నిట్టూరుస్తోంది. శుక్లపక్ష చంద్రునిలా కాంతిని కోల్పోయి వుంది. నివురు గప్పిన నిప్పులా వుంది. దుఃఖముతో సిగ్గుతో వాడిపోయిన ఆమె ముఖం కుజగ్రహంతో పీడింపబడుతున్న రోహిణిలా వుంది. కన్నీటితో అందమైన ఆమె ముఖం మలినమై

వుంది. దీనంగా వుంది. నల్లని త్రాచుపాములాంటి జడపిరుదుల వరకు వ్రేలాడుతు వుంది.

సుఖములను భవించవలసిన ఆ సుకుమారి, కష్టములనెరుగని జానకమ్మ, దుఃఖంతో తపించిపోతూ, అలా కనిపించగానే అసలు ఆమె సీత అవునా, కదా, అని హనుమంతుడు తనలో తానే తర్కించుకుంటున్నాడు. ఆనాడు రావణుడపహరించి తెచ్చినప్పుడెలా వుందని రాముడు చెప్పాడో అలాగే వుంది. పూర్ణ చంద్రముఖి, శోభనమైన కనుబొమ్మలు గలది, నీలకేశి, బింబోష్ఠి, అందమైన నడుము కలది, తామర రేకుల వంటి కన్నులు కలది, అయిన ఈ లావణ్యవతి, తన కాంతితో పరిసరాలన్నింటినీ ప్రకాశింపచేస్తోంది. తరిగిన ఐశ్వర్యంలా, సిద్ధించని కార్యంలా కాలుష్యము ఆవరించిన చంద్రప్రభలా, రాక్షస స్త్రీల మధ్య కృశించి, కన్నీటితో దీనురాలై వుంది. ఈమె సీత అవునా కాదా అని ఆలోచిస్తున్నాడు మారుతి.

కాని ఆమె తప్పక సీతే అని అనటానికి తగిన ఆధారాలు కనిపించాయి ఆంజనేయునికి. రాముడు, తనతో, సీత ఏయే ఆభరణాలు ధరించిందని చెప్పాడో, అవన్నీ ఇక్కడ చెట్ల కొమ్మలకి వ్రేలాడుతున్నాయి. బహుశా ఆమె ఆ భరణాలు తీసి ఇక్కడ పెట్టి వుంచవచ్చు అనుకున్నాడు.

చెవుల దుద్దులు, చెవిపూలు, మణులు పొదిగిన హస్తాభరణాలు, అన్నీ మాసిపోయి నల్లబడి వున్నాయి. కనుక ఇవి తప్పకుండా ఆమెవే అయి వుంటాయి. ఋష్యమూకంపై, నగలు మూట కట్టి జారవిడిచిన బట్ట, ఇప్పుడీమె ధరించిన వస్త్రము, ఒక్కలాగే వున్నాయి. పచ్చని బంగారు వర్ణము కలిగిన ఆ వస్త్రము, ఈమె కట్టుకున్న చీరలోంచి చింపిందే అయి వుంటుంది. కనుక బంగారు మేనిరంగు కల్గిన ఈ వనిత, తప్పక మా రాముని పట్టపురాణియే అయి వుంటుంది.

మా రాముడు ఈమె కోసం నాల్గు కారణాల వల్ల బాధపడ్తున్నాడు. మొదటిది, కారుణ్యమూర్తియైన పురుషుడు, తన ప్రియురాలు, కనపడకుండా పోయినపుడు, ఆమెని రక్షించకుండా ఉపేక్షించడం తగదు. కనుక అయ్యో ఆడది తప్పిపోయిందే అని బాధపడ్తున్నాడు. రెండవది- ఆమె తనని నమ్ముకుని వుండగా, ఎవడో ఆమెని అపహరించినప్పుడు సహించి, తను ఊరుకుంటే, అది తన క్రూరత్వమవుతుందని. మూడవది, అగ్నిసాక్షిగా పరిణయమాడిన ధర్మపత్ని దూరమైందని, నాలుగవది, ప్రియురాలైన సీతనెడబాసి సంతాపమనుభవించవలసి వస్తోంది కదా అని. ఆమె రూపము సౌష్టవము, రాముని కెంతగానో తగియున్నాయి. ఆమెకి దూరమై చెప్పలేనంత మనస్తాపమనుభవిస్తున్నాడు రాముడు. ఈ నాలుగు కారణాల వల్ల

రాముడు అంతులేని దుఃఖసాగరంలో మునిగివున్నాడు. అని తలపోస్తూ, హనుమంతుడు, సీతయొక్క సౌందర్యం చూసి,

"ఔరా ఇంతటి అందగత్తెకి దూరమై రాముడింతకాలము ఎలా జీవించి వున్నాడో కదా అని చాలా ఆశ్చర్యపోయాడు. వీరధివీరుడు, మహాపరాక్రమ వంతుడు, అయిన శ్రీరామచంద్రుని ఇల్లాలై వుండీ ఈమెకెంతటి దుస్థితి కలిగింది!అని కళ్ళనీరు కారుస్తూ చెట్టుకొమ్మల మధ్య కూర్చున్నాడు. అక్కడ్నించి సీతవంక పరిశీలనగా చూశాడు.

ఆమె దుఃఖసాగరంలో మునిగి వుంది. ఆమె చుట్టు భయంకరమైన ఆకారము గల రాక్షస స్త్రీలున్నారు. ఒకే కన్ను కల్గిన ఏకాక్షి, ఒకే చెవి కల్గిన ఏకకర్ణి, రెండు చెవులూ లేని ఆ కర్ణి, శంకువు లాంటి చెవులు కలిగిన శంకుకర్ణి. స్థూల శరీరము కల్గిన అతికాయ, దుబ్బులాంటి తలకట్టు వున్న ధ్వస్తకేశి, గుండుతో వున్న అకేశి, ఒంటినిండా రోమములు గల కేశకంబళి, పెద్ద పెద్ద చెవులున్న లంబకర్ణ, బాన లాంటి పొట్ట వున్న లంబోదర, పెద్ద పెదవి వున్న లంబోష్ఠి, చుబుకము దాటి పెదవి వేలాడుతున్న చుబుకోష్ఠి, లాంచాస్య, లంబజానుక, ఈ విధంగా వికారమైన ఆకారము కల్గిన అనేకమంది రాక్షస స్త్రీలక్కడవున్నారు. వారంతా చాలా క్రోధముతోవున్నారు. కలహప్రియులు, వికృతాననలు, అయిన వారికి మాంసము మధ్యము అంటే చాలా ఇష్టం. స్వేచ్ఛగా మాంసం తింటూ రక్తం త్రాగుతూ ఒళ్ళంతా పూసుకుని వున్నారు. వారిని చూడగానే జుగుప్స కలిగించేలా వున్నారు. ఎంతటి ధైర్యవంతునికైనా వాళ్ళని చూడగానే భయంతో ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అయితే ఇంకోవింత ఏమిటంటే హనుమంతుడు ఏ శింశుపావృక్షం మీద కూర్చున్నాడో దాని కిందే సీతమ్మ కూర్చుని వుంది. ఆ వృక్షం మాను చాలా లావుగా వుండి చిక్కగా కొమ్మలతో అల్లుకుని వుంది. ఆ చెట్టు చుట్టూ రాక్షస స్త్రీలు కూర్చుని వున్నారు. వారి మధ్య, చెట్టు మొదట్లో కూర్చుని వున్న సీతమ్మ హనుమకి చాలా చక్కగా కనిపిస్తోంది. ఆమె భయంతో, బాధతో, దుఃఖంతో కుమిలిపోతూ వుంది.

సీతమ్మని అట్టి స్థితిలో చూడటానికి బాధగా వున్నా అసలు ఆమెని చూడగలిగాను కదా అని హనుమంతుడు చాలా ఆనందించాడు. సంతోషంతో తలమునకలవుతు కొమ్మలమాటున దాగి కూర్చున్నాడు.

అప్పటికి రాత్రి మూడొంతులు గడిచిపోయింది. అలాగే కూర్చుని ఏం చెయ్యాలో అని ఆలోచనలో పడ్డాడు. తాను కిందికి దిగి సీతదగ్గర కెళ్తే ఆ రాక్షస స్త్రీల కంట పడకుండా వుండడం అసాధ్యం. వారి కంట పడ్డానా, ఇంతవరకు

పడినశ్రమ అంతా వ్యర్థమైపోతుంది. ఇలా తర్కించుకుంటుండగానే, తెల్లవారుఝాము అయింది. వేద వేదాంగాలను పారాయణ చేస్తూ యజ్ఞానుష్ఠానం చేస్తున్న బ్రహ్మరాక్షసుల వేద, ఘోషలు, మారుతికి వినిపించాయి. శ్రావ్యమైన మంగళ వాద్యధ్వనులతో, దశకంఠుడు నిద్రలేచాడు. లేవగానే వానికి సీతజ్ఞాపకం వచ్చింది. క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా, సగం జారిన పుష్పమాలతో, చెదిరిన వస్త్రాలతో, అలాగే బయట పడ్డాడు. అశోకవనంలో ప్రవేశించాడు. వందమంది దేవకాంతలు, గంధర్వ కాంతలు అతని వెంట అనుసరించి వచ్చారు. కొంతమంది బంగారు దీప స్థంభాలు పట్టుకుని నడుస్తున్నారు. ఇంకకొంతమంది వ్యజనాలు వీస్తున్నారు. వింజామరలు, తాళ వృంతాలు వీచేవారు కొందరు. మరికొందరు బంగారు కలశాలతో నీళ్ళు పట్టుకుని వస్తున్నారు. కొందరు స్త్రీలు విచ్చుకత్తులు పట్టుకుని నడుస్తున్నారు. రత్నమయమైన బంగారు పాత్రలలో మద్యం పట్టుకుని పక్కలమ్మట ఇంకొందరు సుకుమారులు వస్తున్నారు. రావణుని వెనుక తెల్లని ఛత్రము పట్టుకుని ఒక స్త్రీ నడుస్తోంది.

రావణుని భార్యలు నిద్రమత్తుతో బరువెక్కిన కనురెప్పలతో మేఘం వెంటమెరుపుతీగల్లా వస్తున్నారు. వారి కేయూర హారాలు అటు ఇటు చెదిరివున్నాయి. ఒంటికి పూసుకున్న చందనము కరిగి వుంది. అలసటతో వారి ముఖాలు చెమర్చి వున్నాయి. మద్యము సేవించిన మత్తు, నిద్రమత్తు కలబోసి, కన్నులు అటుఇటు చెరుదు తుండగా చెదిరిన పూలతో రేగిన జుత్తుతో, వారు భర్త వెంట నడుస్తున్నారు.

రావణుడు మాత్రం సీతమీది మనస్సుతో, మదించిన శరీరంతో మెల్లిగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు. చెట్టుపై కూర్చున్న హనుమంతునికి ముందుగా రావణుని స్త్రీల మొలనూలుకున్న మువ్వలు, వారి కాళ్ళ అందెల చప్పుళ్ళు వినిపించాయి. ఆ తర్వాత దీపాల కాంతి, ఆ కాంతిలో అప్రమేయ బలపౌరుషములు కల్గిన రావణుడు కనిపించారు. అతడు తెల్లని పాల నురుగులాంటి వస్త్రాలు ధరించాడు. పై నించి జారిన ఉత్తరీయము విలాసంగా బుజకీర్తులమీద వేసుకుంటూ, చాలా హుందాగా నడుస్తున్నాడు. కొమ్మల చాటునించి, అతడ్ని-అతడి స్త్రీలని చూశాడు మారుతి.

రావణుని తేజస్సుకి అబ్బురపడ్డాడు. "ఓహో ఈతడేనా ఆరావణుడు!?' అనుకున్నాడు పరిశీలనగా చూస్తూ చక్కని ఆకారము గలవాడు. వయస్సులో వున్న వాడు. శరీరమంతా రత్నమయమైన బంగారు ఆభరణములు ధరించిన వాడు. అయిన ఆ రాక్షసరాజు మెల్లిగా సీతమ్మని సమీపించాడు.

వాణ్ణిచూసి, పెనుగాలికి కంపించిపోతున్న అరటి చెట్టులా సీత నిలువెల్లా ఒణికిపోయింది. ఒక్కసారిగా తన తొడలతో పొత్తికడుపునీ, చేతులతో రొమ్ములనీ కప్పుకుని, పెద్ద పెట్టున ఏడ్వసాగింది. చుట్టు కాపలా వున్న రాక్షసస్త్రీలని దూరంగా జరగమని, రావణుడు సీతమ్మకెదురుగా వెళ్ళాడు. సముద్రంలో మునిగిన పడవలా ఆమె దుఃఖసాగరంలో మునిగివుంది. కటిక నేలమీద కూర్చుని వుంది. రాముణ్ణే ధ్యానిస్తూ శోకంలో మునిగి వుంది. అలా రాముణ్ణి ధ్యానిస్తున్న జానకిని రావణుడు చంపుతానని బెదిరించాడు.

వికారమైన మాటలతో, వికారమైన చేష్టలతో తన మనస్సులోని మాటలిలా చెప్పాడు.

"సుందరీ నన్ను చూసి భయంతో నీ ఉదరాన్ని, స్థనాల్ని దాస్తావెందుకు? విశాలాక్షీ నేను నిన్నెంతగానో కామిస్తున్నాను. నన్ను గౌరవించు. నా గురించి నువ్వెంత మాత్రం భయపడక్కర్లేదు. జానకీ పరస్త్రీలనపహరించి, వారి పొందుకోరడం పాపమనుకుంటున్నావా? మా విషయంలో అది తప్పు కాదు. అది మా ధర్మం, అయితే నిన్ను నేను తాకను. మైథిలీ నాలో కోరికలెంతగా చెలరేగినా నిన్ను స్పృశించను. కనుక నువ్వు భయపడకు. నా మాటలు నమ్ము. శోకము చాలించి నా మీద అనురక్తి తెచ్చుకో" అంటు రావణుడు దర్పంగా మాట్లాడేసరికి సీతమ్మకతని మీద అంతులేని అసహ్యం చెప్పలేనంత కోపం కలిగాయి. అది కనిపెట్టిన ఆ రాక్షస రాజు ఆమెని ప్రలోభపెట్టాలని "సుకుమారీ మాసిన వస్త్రం ధరించి, నేలమీద పడుకుని, ఇలా ఉపవాసాలతో శరీరాన్ని శుష్కింపచేసుకోటం నీకు తగునా? చక్కని నగలు, పరిమళ ద్రవ్యాలు చందన గంధాలు, నాజూకైన వస్త్రాలు, రత్నాభరణాలు ఎన్నెన్నో నీ కోసం తెప్పించాను. స్వీకరించు. నాతో కలసి మధుర పానీయాలు ఆరగించు. మెత్తని పట్టుపరుపుల మీద, గీత-వాద్య-నృత్యాలతో హాయిగా కాలంగడుపుదాం. రా- నా శిరోమణివైన నువ్వు, ఇలా అలంకారాలు లేకుండా వుండటం తగదు.

నీ యౌవనమంతా అడవిగాచిన వెన్నెల కానీయకు. ప్రవహించిన నీరు ఎలాగైతే వెనక్కి రాదో, అలాగే గడచిపోయిన యౌవనం మళ్ళీ తిరిగిరాదు. వేదేహీ-రూపయౌవన సౌందర్యమూర్తివైన నువ్వు, ఇలా ఎదురుగా వుంటే సాక్షాత్తు ఆ బ్రహ్మకైనా మనసు నిలవదే! నీ శరీరంలోని ప్రతీ అణువు, చూడాలని నా మనస్సు తహ తహలాడ్తోంది. ఇంక నీ మంకుతనం వదిలి నన్ను వరించు. నేనిప్పటి వరకు అన్ని దిక్కుల నించీ ఎందరినో సుందరీమణుల్ని పట్టి అపహకరించి తెచ్చాను. వారంతా నన్ను భర్తగా స్వీకరించారు. వారందరిలో

నువ్వు నా పెద్ద భార్యగా వుండు. నా సంపద, నా రాజ్యం, నా సర్వస్వం నీకర్పిస్తాను. నువ్వు నన్ను ప్రేమిస్తే ఈ భూమండలాన్నంతా జయించి నీ తండ్రియైన జనక మహారాజుకి కానుకగా ఇస్తాను.

నన్నెదిరించి పోరాడగల బలవంతులెక్కడా లేరు. కనుక ఆనందంగా ఈ అలంకారాలు స్వీకరించు. నీ అందం రెట్టింపవుతుంది. రా. రాజభోగాలనుభవించు. నావైభోగం, నా ఐశ్వర్యం చూడు. నారబట్టలు కట్టుకుని, రాజ్యభ్రష్టుడై అడవులలో తిరుగుతున్న సామాన్యమానవుడు ఆ రామునితో నీకేంపని? అసలింతకీ, ఆ రాముడు బతికివున్నాడో లేదో. ఒక వేళ బతికి వుంటే మాత్రం నన్ను జయించి నిన్ను తీసికెళ్ళగలడా? నీ అందమైన చిరునవ్వు, నీచక్కని పలువరుసా, మనోహరములైన నీ కన్నులు నన్ను పిచ్చివాడ్ని చేస్తున్నాయి. నిన్ను చూశాక, నా భార్యలపైన నాకు మక్కువ కలగటం లేదు. నా అంతఃపుర స్త్రీలందరి మీదా నీకు అధికారమిస్తున్నాను. వారంతా నీకు పరిచర్యలు చేస్తారు.

నీ రాముడు, తపస్సులో గాని, బలములో గాని, పరాక్రమములో గాని, సంపదలో గాని, యశస్సులో గాని, దేనిలోనూ నన్ను పోలలేడు" అంటూ రావణుడు సీతని తనవైపు తిప్పుకోవాలని ఎన్నెన్నో ప్రగల్భాలు చెప్పాడు. ఆ దుర్మార్గుని మాటలు విన్న సీత మరింత దుఃఖంతో, హీనస్వరంతో దీనంగా ఇలా బదులిచ్చింది. ఒక గడ్డిపోచను మధ్యలో పెట్టి దాని వంక చూస్తు తెచ్చిపెట్టుకున్న మందహాసంతో

"రావణా నానించి నీ మనస్సు మరల్చుకో. నీ స్త్రీల మీద నీ మనస్సు నిలుపుకో. పాపిష్టివాడు మోక్షాన్ని కోరుకోవడం ఎంత అనుచితమో. నువ్వు నన్ను కోరడం కూడా అంతే అనుచితం.

రాక్షస రాజా, ఉత్తమ వంశంలో పుట్టిన నేను మహాపతివ్రతని. ఉత్తమకులంలో పుట్టిన నేను, అ కార్యం చెయ్యకూడదు. నేను పరుని భార్యని. కనుక నన్ను నువ్వు కోరకూడదు. ధర్మమార్గంలో ఆలోచించడం నీకు మంచిది. నీ భార్యలని పరపురుషులు కోరకూడదని నువ్వెలా అనుకుంటావో, అలాగే ఇతరుల భార్యలని కూడా రక్షించాలి. ఈ జ్ఞానం తెలుసుకుని నీ భార్యలతో సుఖించు. ఇంద్రియ చాపల్యంతో ఇతరుల భార్యల్ని వాంఛిస్తే పతనమై పరాభవం పొందుతావు. అసలు నీ నగరంలో నీకు హితవు చెప్పే పెద్దలే లేరా? లేక వారి మాటలు నువ్వు వినవా? నీలాంటి చపల చిత్తుల పాలనలో రాజ్యం వినాశం పొందుతుంది. నీ ఒక్కడి చెడు ప్రవర్తన వల్ల లంకంతా సర్వనాశనమై పోతుంది. నీ చావు అందరికీ ఆనందం కలిగిస్తుంది. నీ సంపదలతో నీ రాజ్యంతో, నీ స్త్రీల మీద అధికారంతో నాకు

పనిలేదు. సూర్యుని వెంట కాంతి ఎలా వుంటుందో అలాగే నేనెప్పుడూ నా రాముణ్ణి అనుసరించి వుంటాను. సూర్యుని నించి కాంతిని వేరు చెయ్యడం ఎలా అసాధ్యమో అలాగే నన్ను రాముని నుంచి వేరు చెయ్యలేవు. సర్వలోక నియామకుడు రాముడంతే.

లోకులందరు ఆరాధించే, లోకనాధుని భుజంపై తలవుంచి ఆయన రక్షణలో నిదురించిన నేను, ఈనాడు వేరొకరి భుజం తలగడగా ఎలా అంగీకరించగలను? రావణా నా మాట విని నన్ను వెంటనే రాముని దగ్గరకి చేర్చు. నీకు ప్రాణాల మీద ఆశ వుంటే రామునితో స్నేహం చేసుకో. రాముడు ధర్మజ్ఞుడు. శరణాగత వత్సలుడు. తనని ఆశ్రయించే వారిని రక్షించెడివాడు. రావణా నన్ను రామునికిచ్చి ఆయనని ప్రసన్నం చేసుకో. లేకపోతే ఆయన చేతిలో నీ చావు తప్పదు.

రావణా ఇంద్రుని వజ్రాయుధం గురితప్పవచ్చు. యమధర్మరాజు బారి నుంచైనా ప్రాణాలు కాపాడుకోవచ్చు. కానిలోకనాధుడైన రాముని ఎదిరించి ప్రాణాలు రక్షించుకోలేవు. జనస్థానములో నీ రాక్షసబలమంతా నాశనమై పోయినప్పుడు. రాముణ్ణి ఎదురించి గెలవలేక, దొంగతనంగా నన్ను ఎత్తుకొచ్చావు. పెద్ద పులి వాసనకి కుక్క భయపడి పరిగెత్తినట్లు రామలక్ష్మణుల వాసనకి, కుక్కలా పారిపోయావు. అనతి కాలంలోనే రామలక్ష్మణులు తమ పదునైన బాణాలతో నీప్రాణాలు తీస్తారు. నువ్వే విధంగానూ తప్పించుకోలేవు" అంటూ బుజ్జగిస్తున్నట్లు ఎన్నో హితవాక్యాలు చెప్పింది సీత. రావణుడు క్రోధం పట్టలేక

"సీతా బ్రతిమాలినకొద్దీ నన్ను పిచ్చివానిలా జమకట్టి, నన్నిలా అవమానిస్తావా? నీమీది ప్రేమచేత, నువ్వెన్ని మాటలన్నా సహిస్తున్నాను. నువ్వింత పౌరుషంగా మాట్లాడినందుకు నిన్ను చిత్రవధ చెయ్యాలి. కాని సీతా, నీ మీది అనురాగంతో నీకొక్క సంవత్సరం గడువిచ్చాను. అందులో ఇంక రెండు నెలలు మాత్రం మిగిలివున్నాయి. ఈ రెండు నెలలూ గడిచేలోగా నువ్వు నా పాన్పుమీదకి వచ్చావా సరి. లేకపోతే గడువు తీరగానే, నిన్ను ముక్కలుగా నరికి నా ఉదయం భోజనంలోకి కూరగా వండించుకుతింటాను" అంటూ కోపంతో మండిపడ్తూ, సీతని బెదిరించాడు రావణుడు. రావణుని కోపానికి సీత భయపడినా, ధైర్యం కూడగట్టుకుని, తన పాతివ్రత్యం నిరూపిస్తూ ఇలా అంది.

"రావణా నీపట్టణంలో నీ మేలు కోరెవారెవ్వరూ లేరు. అందుకే ఈ పాపకృత్యం నించి నిన్నెవరూ వారించటం లేదు. ధర్మాత్ముడైన రాముడు నా భర్త. నన్నెవ్వరూ కన్నెత్తైనా చూడలేరు. నీలాంటి అవివేకి మాత్రమే తన గొయ్యి తను తవ్వుకుంటాడు. రాక్షసాధమా, నా భర్త అమిత పరాక్రమశాలి. రాముని గురించి

అనరాని మాటలని అవహేళన చేశావు. నీకు సిగ్గులేదు. ఆయన కంట బడకుండా నన్ను దొంగిలించి తెచ్చావే, దుర్బుద్ధితో నన్ను చూసిన నీ కళ్ళుఊడి నేలమీద ఎందుకు పడలేదో నాకు తెలియడం లేదు. ధర్మాత్ముడైన దశరథ మహారాజు కోడల్ని. ఇన్ని విధాలదూషించినా నీ నాలుక ఎందుకు తెగిపడలేదో తెలుసుకోలేక పోతున్నాను.

మహాపతివ్రతనైనా, నా భర్త ఆజ్ఞలేదు కనుక నిన్ను భస్మం చెయ్యలేక పోతున్నాను. రావణా నన్ను దొంగిలించి తెచ్చానని మిడిసిపడకు. అది నీ గొప్పతనం కాదు. నిన్ను చంపటానికి విధి చేసిన ఏర్పాటు అది" అంటూ సీత ఉగ్రంగా మాట్లాడుతుంటే, కోపంతో రావణుని కన్నులు ఎఱ్ఱబడ్డాయి. భయంకరంగా సీతవైపు చూశాడు. సింహంలా గర్జించాడు. పాములా బుసలు కొడుతూ "ఛీ ఛీ అధమురాలా నీతిలేని వానినీ, ధనము లేని వానినీ కోరి, ఇంత పట్టుదలగా వున్న నిన్ను ఇప్పుడే చంపుతాను అన్నాడు. తన చుట్టు వున్న వికృతాననలైన రాక్షస స్త్రీలని పిల్చి "మీరంతా కలిసి మీ తెలివి వుపయోగించి, ఈ జానకిని నావశమయ్యేటట్టు చూడండి. సామ, దాన, బేధ దండోపాయాలు, వుపయోగించి, ఈమెని లొంగదియ్యండి" అంటూ వారికి పురమాయించి, సీతని మళ్ళీ బెదిరించాడు. అప్పుడు రావణుని భార్యలలో ఒకతె అయిన ధాన్యమాలిని, వేగంగా వచ్చి రావణుని గట్టిగా కౌగలించుకుని, "మహారాజా శాంతించు నాతో క్రీడించి ఆనందించు. ఈ సీతతో నీకేమిటి? ఈమె ఒక సామాన్యమైన మానవస్త్రీ. దీనురాలు. నువ్విస్తానన్న భోగభాగ్యాలు అనుభవించే అదృష్టం ఈమెకి లేదు. పోతే పోనీ. మనస్సులేని దానిని వదిలిపెట్టి నిన్నుకోరుకుంటున్న వారితో సుఖించు రా" అంది. అతడ్ని శాంతపరుస్తూ రావణుడు ఆమెని అనుసరించి వెనుదిరిగి తన భవనానికి వెళ్ళిపోయాడు.

రావణుడలా వెళ్ళగానే, భయంకరమైన ఆకారం గల రాక్షస స్త్రీలు సీతని చుట్టుముట్టి పరుషమైన కంఠస్వరంతో " సీతా రావణుడు చాలా గొప్పవాడు. అటువంటి వానికి భార్యగా వుండటానికి నువ్వు ఇష్టపడటం లేదు. అది చాలా తప్పు సుమా" అని గర్జించినట్లు పలికారు.

అప్పుడు ఏకజట అనే రాక్షసి "సీతా ప్రజాపతులు ఆరుగురిలో నాల్గవవాడు పులస్త్యుడు . ఆపులస్త్యుని మానసపుత్రుడు విశ్వవసుడు గొప్ప మహర్షి. ఆ విశ్వవసుని కుమారుడీ రావణుడు. అటువంటి ఉత్తమ కులసంజాతుడైన రావణుని నువ్వు భర్తగా అంగీకరించకపోవడం తగదు. నా మాట విని రావణుని వరించు" అంది.

ఆ తర్వాత పిల్లి గుడ్లు లాంటి కళ్ళున్న హరిజట కళ్ళు భయంకరంగా తిప్పుతూ సీతా ముప్పై మూడు కోట్ల దేవతలతో సహా ఇంద్రుణ్ణి మా మహారాజు ఓడించాడు. అంతటి పరాక్రమవంతుడైన రావణున్ని భర్తగా వరించు" అంది. ప్రఘస అనే మరో రాక్షసి, సీతని బెదిరిస్తూ "సీతా రావణుడు సామాన్యుడను కున్నావా? మహాపరాక్రమ శాలి, శూరుడు, అజేయుడు, యుద్ధంలో తిరుగమన మెరుగని వాడు. అటువంటి మా రావణుడు, నిన్ను భార్యగా కోరుకుంటుంటే ఒప్పుకోక, ఏడుస్తు కూచుంటావెందుకు? అంది. వికట అనే మరో రక్కసి, "పిచ్చిదానా, దేవదానవ గంధర్వుల్ని జయించిన రావణుడు నిన్ను కోరుకోవడం నిజంగా నీ అదృష్టం. అయినా నువ్వు ఒప్పుకోకపోటం క్షమించరాని నేరం" అంది.

ఆ వెనక దుర్ముఖి అనే రాక్షసి, "సీతా రావణుని గొప్పతనం నీకు తెలియక అలా ప్రవర్తిస్తున్నావు. ఆయన దగ్గర భయంతో సూర్యుడు ఎండకాయడు. వాయుదేవుడు వీచడు. అంతటి వానిని ధిక్కరిస్తే నువ్వు ప్రాణాలతో వుండవు" అంది. మిగిలిన రక్కసులంతా సీతకి నచ్చజెప్పే ధోరణిలో "సీతా రావణుని అంతఃపురంలో ఎంతో విలువైన హంసతూలికా తల్పాలపై సుఖించమంటే నువ్వొప్పుకోవడం లేదు. మానవకాంతవి కనుక మానవునికే భార్యగా వుండాలనుకుంటున్నావేమో. కాని నీ మనస్సు రాముని పైనించి మళ్ళించి, ముల్లోకాధిపత్యం పొందగల వీరుడైన రావణుని భర్తగా పొంది, సుఖంగా వుండు" అంటూ సీతని ఒత్తిడి చెయ్యటం మొదలుపెట్టారు.

వారందరి మాటలు విన్న సీత కన్నీరు కారుస్తూ "మీరంతా లోక విరుద్ధమైన మాటలు చెప్తున్నారు. మానవ స్త్రీ రాక్షసునికి భార్య కాజాలదు. మీరంతా ఏకమై నన్ను విరుచుకు తిన్నా సరే మీ మాటలు నేను వినను. దీనుడైనా రాజ్యహీనుడైనా, స్త్రీలకి భర్త అయిన వాడే గౌరవించదగ్గవాడు. కనక నా భర్తని మాత్రమే నేను గౌరవిస్తాను" అంది ధృఢసంకల్పంతో. ఆ మాటలు విన్న రాక్షస కాంతలు కోపం పట్టలేక పరుషమైన మాటలతో సీతని బెదిరించసాగారు.

అలా రాక్షసులు చుట్టుముట్టి హింసిస్తూ వుంటే, సీత గట్టిగా ఏడుస్తూ శింశుపావృక్షం మొదట్లో దుఃఖించసాగింది. అప్పుడు వినీత అనే రాక్షసి "సీతా నీ భర్త మీద నీకున్న ప్రేమ ఇంక చాలించు. నీ మేలు కోరి నేనో మాట చెప్తాను విను. రావణుని గొప్పతనం గురించి విన్నావు కదా. అతణ్ణే భర్తగా పొందు. దీనుడై అల్పాయుష్కుడైన ఆ రాముణ్ణి ఇంక మర్చిపో. లేదంటావా చావు తప్పదు" అంటుంటే వికట అనే ఇంకో రాక్షసి పిడికిలి బిగించి గర్జిస్తూ "మైథిలీ నీ మీది జాలితో ఇన్నాళ్ళు ఓర్చుకున్నాము. సముద్రానికివతల ఒడ్డున వున్నావు. రావణుని

అంతఃపురంలో బందీగా వున్నావు. ఇక్కడికెవ్వరూ రాలేరు. సాక్షాత్తు ఇంద్రుడైనా వచ్చి రక్షించలేడు. మేమంతా నీ మేలు కోరి చెప్తున్నాము. మా మాట విను. రాక్షసరాజుని వరించు. వెఱ్ఱిదానా నీ యౌవనం ఎందుకు వ్యర్థం చేసుకుంటావు? రావణునితో కలసి హాయిగా ఉద్యానవనాల్లో విహరించు. ఏడువేల మంది స్త్రీలు నీకు దాస్యం చేస్తారు" అంది సీతని అనునయిస్తూ. ఇంకా చాలా మంది రక్కసిలు సీతమీద పడి

"ఈవిడ మన మాట ఎందుకు వింటుంది. రండి అందరం కలిస ఈమెని విరుచుకు తిందాం" అంటూ భయంకరమైన చేష్టలతో బెదిరించసాగారు. సీతకి ధైర్యం సన్నగిల్లి పెద్దగా ఏడవ సాగింది.

"అయ్యో కావాలనుకున్నప్పుడు చావు కూడా రాదే. వీళ్ళంతా ఇన్ని విధాల నన్ను బాధ పెట్టున్నా, నేనింకా బతికేవున్నాను. జన్మాంతరంలో చేసిన పాపం చేత ఈ జన్మలో ఇంతటి ఘోరమైన దుఃఖం అనుభవిస్తున్నాను' అంటూ అనేక విధాల ఆమె ఏడుస్తూంటే అక్కడే నిద్రపోతున్న విభీషణుని కుమార్తె అయిన త్రిజట అనే ఆమెకి మెలకువ వచ్చింది. ఆమె లేచి సీత దగ్గర కొచ్చి, ఆమె నూరడిస్తూ అక్కడ వున్న రాక్షస స్త్రీలని చూసి,

"అనార్యులారా, సీతనెందుకు తింటారు? మీక్కావలిస్తే నన్ను తినండి. సీత జనకమహారాజు కూతురు. దశరథ మహారాజు కోడలు. ఇప్పుడే నాకు నిద్రలో ఒక అద్భుతమైన కల వచ్చింది. ఆ కలలో రాక్షసుల వినాశం, రాముని విజయం చక్కగా కనిపించాయి" అంది.

అది విన్న రాక్షస స్త్రీలు త్రిజట చుట్టూ చేరి, ఆ స్వప్న వృత్తాంతం వివరంగా చెప్పమని అడిగారు. అప్పుడు త్రిజట ఇలా చెప్పింది. "వినండి ఏనుగు దంతాలతో చెయ్యబడ్డ దివ్యమైన పల్లకీని ఆకాశంలో వెయ్యిరాజహంసలు మోసుకొస్తున్నాయి. తెల్లని వస్త్రములు ధరించిన రామలక్ష్మణులు అందులో కూర్చుని వున్నారు. మన సీతేమో తెల్లని బట్టలు కట్టుకుని సముద్ర మధ్యంలో ఒక పర్వతంపై కూర్చుని వుంది. పల్లకీలో వస్తున్న రాముడు సీత దగ్గరకి వచ్చాడు. రామలక్ష్మణులు పల్లకి దిగి నాల్గు దంతాలు కలిగిన ఏనుగు మీదికెక్కారు. వారు "సీతమ్మని కూడా ఆ ఏనుగు పైకి లాగి కూర్చోపెట్టుకున్నారు. సీత, రాముని ఒడిలో కూర్చుంది. ఒకసారి లేచి నిలబడి సూర్యచంద్రులిద్దర్ని తాకి మళ్ళీ రాముని తొడపై కూర్చుంది. ఆ ఏనుగుతో వచ్చి వారు లంక మీద నిలిచారు. ఆ తర్వాత వారు ఎనిమిది ఎద్దులు పూన్చిన బండి మీద ఎక్కి పుష్పక విమానమెక్కి ఉత్తర దిశగా వెళ్ళిపోయారు. ఇది నేను కళ్ళారా చూశాను. రావణుడు నేలమీద పడ్డాడు. నల్లని బట్టలు కట్టుకుని,

నున్నగా గుండు గీయించుకుని, ఆడదాని ముఖం వున్న గాడిద మీద, ఎఱ్ఱని పూలదండలు, ఎఱ్ఱచందనం ధరించి, నూనె తాగుతూ, నాట్యం చేస్తూ దక్షిణదిశగా పోతున్నాడు. పోతూ పోతూ గాడిదమీది నించి కిందపడ్డాడు. పిచ్చివాడై దిగంబరుడిగా చెడ్డమాటలు మాట్లాడుతూ, చెడ్డకంపు కొడ్తున్న బురదలో మునిగిపోయాడు. ఒక్క నల్లని స్త్రీ ఒళ్ళంతా రక్త చందనం పూసుకుని, రావణుని మెడకి తాడు కట్టి దక్షిణ దిశగా లాక్కుపోయింది. కుంభకర్ణుడూ, రావణుని కుమారులు అంతానేల మీద పడ్డారు. ఒళ్ళంతా నూనె పూసుకుని రావణుడు వరాహముతో, ఇంద్రజిత్తు శింశుమారంతో, కుంభకర్ణుడు ఒంటెతో, దక్షిణ దిశగా వెళ్ళారు. ఒక్క విభీషణుడు మాత్రం తెల్లని గొడుగులో, తెల్లని బట్టలు కట్టుకుని అలంకారములు ధరించి తెల్ల చందనం పూసుకుని, శంఖ దుందుభి నాదాలతో, నాల్గుదంతాల ఏనుగుపై నలుగురు మంత్రులతో ఆకాశములో నిల్చివున్నాడు. ఈ లంకంతా తోరణాలూ, గోపురాలు, విరిగి, సముద్రంలో పడివుంది.

రాముని దూత అయిన ఒక వానరుడు ఈ లంకని కాల్చి వెయ్యడం చూశాను. నూనె త్రాగి, నాట్యం చేస్తూ నవ్వుతూ భస్మమైన లంకలో, రాక్షసస్త్రీలు ప్రవేశిస్తు కనిపించారు. కనుక ఇక మీదట మీరంతా సీతకి దూరంగా వుండండి. రాముడు తప్పక సీత దగ్గరకి వస్తాడు. రావణుడ్నీ రాక్షసుల్నీ సమూలంగా చంపి తీర్తాడు. సీతని బాధించటం మాని శరణువేడండి. ఎందుకంటే నాకిప్పుడొచ్చిన స్వప్నం తల్చుకుని ఆలోచిస్తే ఇక మీదట సీతకి మంచి రోజులొస్తాయనిపిస్తోంది. రామునివలన మన రాక్షసులకి, ఘోరమైన ప్రమాదం ముంచి రాబోతోంది. మీరిప్పుడు మన్నించమని కోరితే చాలు. సీత మీ తప్పులు మన్నించి దయార్ద్ర హృదయురాలు" అంటూ త్రిజట రాక్షస స్త్రీలకుపదేశించింది.

"చూడండి ఈ సీత, విశాలాక్షి. తన మనసులో ఏం కోరుకుంటుందో అది జరిగితీర్తుంది. రాముడు జయించడం, రావణుడు నశించటం ఖాయం. కనుక మీరంతా ఇంక మూర్ఖత్వంగా ప్రవర్తించటం మాని సీతని శరణువేడండి" అని మళ్ళీ, మళ్ళీ త్రిజట ప్రబోధించింది.

కాని సీత మాత్రం రావణుని మాటలు తల్చుకుని కుమిలిపోతోంది. వాడు తనకి ఇంక రెండు మాసాల గడువు ఇచ్చాడు. ఆ తర్వాత ఇంక బతకనివ్వడు. హా రామా, హా లక్ష్మణా, హా కౌసల్యా, హా సుమిత్రా, తుఫానులో చిక్కిన నావ సముద్రంలో మునిగినట్లు నేను మునిగిపోతున్నాను. మృత్యువే ఆనాడు మృగం రూపంలో నన్ను ప్రలోభపెట్టింది. మూర్ఖురాలనై లక్ష్మణుని కూడా వదులుకున్నాను. రాముణ్ణి బంగారు మృగం తెమ్మని బలవంతంగా పంపాను. ఇంక జీవితంలో

రాముణ్ణి చూడగలనా, రాముడు వనవాసదీక్ష పూర్తి చేసి, తిరిగి అయోధ్యకి వెళ్ళి వేరే స్త్రీలతో సుఖంగా వుంటాడు. కాని నేను మాత్రం రాముని మీది ప్రేమతో వినాశాన్ని కొని తెచ్చుకుని ప్రాణాలు పోగొట్టుకుంటున్నాను. నాకింక గత్యంతరం లేదు. విషం త్రాగో, దేనితోనైనా పొడుచుకునో ప్రాణాలు వదులుతాను. కాని ఇప్పుడు నాకు విషంకాని, పొడుచుకుందుకు ఖడ్గం కాని ఎవరిస్తారు?" అంటూ సీత అనేక విధాల విలపిస్తూ రాముణ్ణే స్మరిస్తూ ఆత్మహత్య చేసుకునే తలంపుతో, తన పొడవైన జడతో ఉరివేసుకోవాలని నిర్ణయించుకుంది. చెట్టు కొమ్మనొకదానిని వంచి, పట్టుకుని ఉరివేసుకోబోయేంతలో ఆమె ఎడమ కన్ను అదిరింది. ఎడమ భుజం, ఎడమ తొడ అదిరి, రాముడు తన ఎదురుగా వచ్చినుంచున్నట్లనిపించింది. ఈ వింత పరిణామానికి ఆశ్చర్యపోతూ సీత కొద్దిసేపు ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి, ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకుంది.

చెట్టుపై కూర్చున్న హనుమ, కింద జరుగుతున్నదంతా చూస్తున్నాడు. అందరి మాటలు విన్నాడు. ప్రాణత్యాగానికి సిద్ధమైన సీతని చూశాడు. అప్పుడు తనలో ఇలా అనుకున్నాడు.

"వేలకొద్దీ వానరులు నేల నాలుగు దిక్కులా ఏ తల్లికోసమై వెతుకుతున్నారో, ఆ దేవత నాకు సాక్షాత్కరించింది. నేను తెలివిగా వ్యవహరించి నా పనిలో కృతకృత్యుడనయ్యాను. ఈ లంక యొక్క వైభవాన్ని, రాక్షసుల గొప్పతనాన్ని చూశాను. రావణుని ప్రభావం చూశాను. ఇపుడింక దయామూర్తియైన రామచంద్రుని ఇల్లాల్ని ఓదార్చాలి. ఏనాడూ దుఃఖమంటే ఏమిటో ఎరుగని, ఆ సాధ్వి నేడు అనంతమైన దుఃఖంలో ఆర్తురాలై వుంది. శోకోపహతురాలైన ఈ దేవిని ఓదార్చకుండా వెళ్ళడం దోషం. నేనిప్పుడు ఈ రాక్షసులకు చిక్కుతానేమో అనే భయంతో ఆమెని కలవకుండా వెళ్ళిపోతే, రక్షించే వారెవ్వరూ లేక ఆమె ప్రాణత్యాగం చేస్తుంది. కనుక ఇప్పుడిక్కడ ఈమెకి ధైర్యం చెప్పి అక్కడ సీత కోసం పరితపిస్తున్న రాముణ్ణి ఓదార్చాలి. కాని ఈ తల్లిని కలవడం ఎలా? ఈ రాక్షస స్త్రీలు రెప్పవెయ్యకుండా కాపలా కాస్తున్నారే! తెల్లారకుండానే ఈమెతో మాట్లాడాలి. నేను వానరుడినే అయినా మానవ భాషలో మాట్లాడగలను. కాని వానరుడు, మానవునిలా మాట్లాడితే ఇది రాక్షస మాయ అని సీత భ్రాంతి పడవచ్చు. కనక ముందుగా నేను సీతకి మేలు చెయ్యటానికి వచ్చిన వాడిననే నమ్మకం ఆమెకి కలిగించాలి. అలా కలిగించాలంటే రామ కథాగానం చేస్తే ప్రయోజనం వుండవచ్చు. అనుకుంటూ మధురమైన కంఠంతో రామకథ చెప్పటం మొదలు పెట్టాడు అతిమెల్లగా.

"రథ గజతురగాది వాహనాలెన్నో కలిగి యుండి, పుణ్యశీలి యశస్వి అయిన దశరథ మహారాజు అనే ఆయన ఒకడుండేవాడు. రాజర్షులలో శ్రేష్ఠుడైన ఆ దశరథుని పెద్దకుమారుడు శ్రీరాముడు ధర్మజ్ఞుడు, సత్యవంతుడు. ఆ మహనీయుడు తండ్రి ఆజ్ఞపై తమ్మునితో, భార్యతో వనవాసానికి వెళ్ళాడు. వనవాస దీక్షలో వుండగానే అనేక మంది రాక్షసుల్ని వధించాడు. జనస్థానంలో పద్నాలుగువేల మంది రాక్షసుల్ని ఒక్కడే వధించి, ఖర దూషణాది మహావీరుల్ని కూడా సంహరించాడు రాముడు.

ఈ సంగతి తెల్సుకుని పగబట్టి రావణుడు మాయ మృగాన్ని వెంట తీసికెళ్ళి రామలక్ష్మణుల్ని వంచించి, జానకిని అపహరించాడు. రాముడు ఆశ్రమంలో సీత కనిపించక, ఆమె కోసం వెతుకుతు బయల్దేరి, దారిలో సుగ్రీవుడనే వానర రాజుతో మైత్రి చేసుకున్నాడు. సుగ్రీవుని కోసం వాలిని చంపి ఆ రాజ్యానికి సుగ్రీవుని రాజుగా చేశాడు. సుగ్రీవుని ఆజ్ఞపై కామరూపులైన వానరులు, అన్ని దిక్కులకీ సీతని వెతుకుతూ వెళ్లారు. సంపాతి ద్వారా సీత జాడ తెలుసుకున్న నేను, నూరు యోజనాల సముద్రాన్ని దాటి, సీత కోసం ఈ లంకకి వచ్చాను. రాముడు సీత ఎలా వుంటుందని చెప్పాడో అలాంటి సీతనే ఇక్కడ నేను చూశాను" అని చెప్పి ఆ పైన మౌనంగా వుండిపోయాడు.

ఆ మాటలు విన్న సీత ఆశ్చర్యంగా సంస్కార హీనమైన జుట్టు పక్కికి జరిపి పైకి శింశుపా వృక్షం మీదికి చూసింది. రామ కథ విన్న ఆనందంలో అన్ని వైపులా పరిశీలనగా చూడసాగింది. అప్పుడు కొమ్మల మధ్యలో బాల భానునిలా ప్రకాశిస్తున్న హనుమంతుడు కనిపించాడు.

తెల్లని వస్త్రము ధరించి మెరుస్తున్న కాంతిపుంజంలా వున్న ఆ వానరుని చూసి సీత ఆశ్చర్యపడింది. "ఆహా ఏమి ఈ వానరుని రూపము! ఇతడి కాంతి వల్ల సరిగ్గా చూడలేకపోతున్నాను కదా" అనుకుంది. కొంతసేపటికి భయంతో రామా రామా అని ఏడ్వసాగింది. అలా ఏడుస్తున్న సీతకి చెట్టుపై నుంచే దండం పెడుతూ ఆమెని చూశాడు. ఇదంతా కలకాదు కదా అనుకుంది సీత. మళ్ళీ పరిశీలనగా చూసింది. "అయ్యో కలలో కోతి కనిపిస్తే అరిష్టమంటారు కదా. దేముడి దయవల్ల నా తండ్రి, రామలక్ష్మణులు కులాసాగానే వున్నారు కదా అనుకుంది. కాని నేనసలు నిద్రేపోలేదు కదా కల ఎలా వస్తుంది? అనుకుంది మళ్ళీ. నేను నిరంతరం రాముణ్ణే స్మరించడం వల్ల రామకథ విన్న అనుభూతి కలిగిందేమో అనుకుంది. కాని ఎదురుగా వానరుడు కనిపిస్తుండగా భ్రమ ఎలా అవుతుంది? అనుకుంది. వాచస్పతికి, ఇంద్రుడికి అగ్నికి నమస్కారములు. ఈ

వానరుడు పలికిన మాటలన్నీ నిజమవ్వాలి అనుకుంటూ దండాలు పెట్టుకుంది.

ఆమె దీనస్థితికి జాలిపడుతూ హనుమ కొమ్మల మీది నుంచి దూకి ఆమె ముందుకి వెళ్ళాడు. చేతులు జోడించి వినయంగా ఇలా అన్నాడు. "అమ్మా పద్మపత్రాయతాక్షి నలిగిన బట్టలు ధరించి, చెట్టు కొమ్మపట్టుకుని, ఇలా దీనస్థితిలో వున్నావేం? ఎవరివమ్మా నువ్వు? నీ కన్నుల నించి ఆ దుఃఖాశ్రువులెందుకు కారుతున్నాయి? చూడగా దేవతా స్త్రీలా వున్నావు. నీ లక్షణాలు చూస్తే ఏ మహారాజుకో పట్టపురాణిలా వున్నావు. తల్లీ, జనస్థానం నించి రావణుడపహరించిన సీతమ్మవు నువ్వేనా? నా మనస్సైతే నువ్వు రాముని ధర్మపత్నివే అని చెప్తోంది" అని అడిగాడు.

రాముని మాట వినగానే సీతలో ఆనందం పెల్లుబికింది. "ఆర్యా, భూమండలంలోనే గొప్పవాడైన దశరథ మహారజు కోడల్ని, మహాత్ముడైన జనకుని కుమార్తెనీ, ధర్మాత్ముడైన రాముని అర్ధాంగిని, అయిన సీతని నేను. నేనే ఆ నష్టజాతకురాల్ని. మా మామగారింట పన్నెండు సంవత్సరాలు సకల భోగాలు అనుభవించాను. పదమూడో సంవత్సరం నా భర్తతో వనవాసానికి వచ్చాను. పదమూడేండ్లు వనవాసం చేశాక పధ్నాలుగో సంవత్సరం దండకారణ్యంలో వుండగా రావణుడు నా భర్తని వంచించి నన్ను అపహరించి తెచ్చి ఈ లంకలో వుంచాడు. ఆనీచుడు నాకు ఇంక రెండు నెలలు మాత్రం బతకటానికి అవకాశమిచ్చాడు. ఇంక రెండునెలల తర్వాత నా మరణం ఖాయం. అంటూ దీనాతిదీనంగా ఏడవ సాగింది.

ఆమెని ఓదారుస్తూ హనుమంతుడిలా అన్నాడు. "అమ్మా నేను రాముని సందేశం వలన నీ దగ్గరకొచ్చాను. వైదేహీ రాముడు కుశలంగా వున్నాడు. నిన్ను కుశలం అడిగాడు. నీ భర్త అనుజుడైన లక్ష్మణుడు శోక సంతప్తుడై శిరసువంచి నీకు నమస్కరించాడు" అని హనుమంతుడు చెప్తోంటే, ఆనందంతో సీత మేను పులకరించింది.

"వత్సా మానవుడు బతికి వుంటే నూరేళ్ళకైనా ఆనందం, సుఖం కలుగుతుంది. అన్న సామెత నా విషయంలో నిజమైంది" అంది. సీత మాటలు విన్న మారుతికి ఆనందం కలిగింది. సీతని ఓదార్చాలని ఇంకొంచెం దగ్గరగా జరిగాడు. అపుడు సీతకి ఆ వానరుడు రావణుడేమో అని అనుమానం కలిగింది.

"అయ్యో ఎంత తెలివి తక్కువ పని చేశాను. ఏ మాత్రం ఆలోచించకుండా ఇతనితో జరిగిన సంగతంతా చెప్పాను. ఆరావణుడే ఇలా రూపాంతరంలో

వచ్చాడని గ్రహించలేక పోయానే" అని భయంతో ఒణికిపోతూ, నేలమీద కుప్పకూలింది. సీత అలా కుమిలి పోతూవుంటే హనుమంతుడామె దగ్గరగా వెళ్ళి వినయంగా నమస్కరించి, ఏదో చెప్పబోగా సీత గట్టిగా నిట్టూర్చి, "మాయావీ, కపటవేషంలో వచ్చి, అసలే కుమిలిపోతున్న నన్ను మరింత బాధ పెట్టడం నీకు న్యాయం కాదు. రావణా ఆనాడు, జనస్థానంలో సన్యాసి రూపంలో వచ్చి నన్ను వంచించావు కదా. ఉపవాసాలతో కృశించి, దీనంగా పరితపిస్తున్న నన్ను మరింత తపింపచెయ్యటం నీకు మేలు కాదు" అని కొంతసేపు ఆగి, "నువ్వు రావణుడివే అయితే నిన్ను చూడగానే ద్వేషం కలగాలి కదా! కాని నీమీద నాకు ప్రీతి కలుగుతోంది ఎందుకో. నిజంగా నువ్వు రాముని దూతవే అయితే నీకు మంగళం కల్గుగాక.

వానరోత్తమా! నాకు రామకథ ఎంతోప్రియమైనది. అందుకే అడుగుతున్నాను. నా ప్రియమైన రాముని గుణగణాలు వర్ణించి చెప్పు అని అడిగింది. అప్పుడు హనుమంతుడిలా జవాబు చెప్పాడు.

"అమ్మా రాముడు సూర్యుని కన్నా తేజోమూర్తి. చంద్రుని కన్నా చల్లనైన వాడు. కుబేరుని అంత శ్రీమంతుడు. మహావిష్ణువు అంతటి పరాక్రమవంతుడు. బృహస్పతి అంతటి సత్యసంధుడు. చాలా అందమైన వాడు. మన్మథుని కన్నా చక్కనైన వాడు. ఎవరిపై కోపగించాలో, ఎవర్ని దండించాలో తెలిసినవాడు. మహారథుడు. ఆ మహాత్ముని నీడలో లోకాలన్నీ చల్లగా వుంటాయి. అట్టి మహనీయుని వంచించి ఈ దుష్ట రావణుడు నిన్నపహరించి తెచ్చాడు. దానికి ఫలితంగా వీడెలాంటి శిక్ష అనుభవిస్తాడో నువ్వే చూస్తావు. అచిరకాలంలోనే వీడు రామబాణానికి ఆహుతి అవుతాడు. అటువంటి రాముడు పంపగా నేను దూతగా నీ దగ్గరకొచ్చాను. నీ ఎడబాటు వల్ల రాముడు చాలా దుఃఖార్తుడైవున్నాడు. మా అదృష్టం వల్ల నువ్వు జీవించి వున్నావు. కొద్దిరోజులలోనే రామలక్ష్మణులు, సుగ్రీవుడు వానరసైన్యంతో లంకకి రావడం నువ్వు చూస్తావు. నేను సుగ్రీవుని మంత్రియైన వానరుడిని.

నాపేరు హనుమంతుడు. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి లంకకి వచ్చాను. అమ్మా నువ్వనుకుంటున్నట్లు నేను రావణుణ్ణి కాను. నా మాటలు నమ్ము" అన్నాడు.

ఆంజనేయుని మాటలు విన్న సీత మనస్థిమితముతో ఇలా అంది. "వత్సా-రాముణ్ణి నువ్వు ఎప్పుడు, ఎక్కడ కలుసుకున్నావు? చపలచిత్తులైన వానరులకు, మానవోత్తముడైన శ్రీరామునకు, సమాగమం ఎలా కలిగింది? రామలక్ష్మణుల

ఆకారం ఎలా వుంటుందో చెప్పగలవా? రాముని యొక్క అవయవ నిర్మాణము ఎలాంటిది? అసలు నరులకి, వానరులకి మధ్యమైత్రిసంభవమేనా? ఇదంతా వివరంగా చెప్తే గాని నా శోకం చల్లారదు" అంది.

అపుడు హనుమంతుడు రాముడి రూప విలాసాలు ఇలా చెప్పాడు.

"అమ్మా నువ్విలా అడగటం నామహద్భాగ్యంగా భావిస్తాను. రామలక్ష్మణుల రూపవిలాసాలు నేను చూసినవి చూసినట్లు చెప్తాను విను.

రాముడు మూర్తీభవించిన సౌందర్యరాశి. కమల పత్రాయతాక్షుడు. దాక్షిణ్యా స్వభావం కలవాడు. ఓరిమిలో భూదేవి అంతటివాడు. బుద్ధిలో బృహస్పతి. కీర్తిలో దేవేంద్రుడంతటివాడు. సర్వలోకాలకి రక్షకుడు. సాధుజనుల నుద్ధరించేవాడు. కర్మలయొక్క ప్రయోగము తెలిసినవాడు. రాజవిద్యలో సుశిక్షితుడు. బ్రాహ్మణుల యందు గౌరవము గలవాడు. శీలసంపన్నుడు. వినయశీలి. యజుర్వేదము బాగా అభ్యసించినవాడు. ఆజానుబాహువు. వేద వేత్తలచే పూజింపబడేవాడు. వేద వేదాంగాలెరిగిన వాడు. దుంధుభిధ్వని లాంటి గంభీరమైన కంఠస్వరం గలవాడు. శంఖము వంటి మెడగల వాడు. మెరుస్తున్న దేహచ్ఛాయ గలవాడు. పొందిక అయిన అవయవములుగలవాడు. నీలమేఘశ్యాముడు. వక్షము, మణికట్టు పిడికిలి, స్థిరముగా వున్నవి కలవాడు.

కనుబొమలు, బాహువులు, వృషణములు, పొడవుగా గలవాడు. కేశాగ్రములు, జానువులు, సమానముగా వున్నవాడు. ఉదరము, హృదయము ఉన్నతముగా అయివున్నవాడు. ఎఱ్ఱని కనుకొలుకులు, గోళ్ళు, అరచేతులు, కలిగిన వాడు. నున్నని పాదరేఖలు, శిరోరూహములు లింగమణీ, కల్గినవాడు. గంభీరమైన నడక, లోతైన నాభికలవాడు. పొత్తి కడుపుపై మూడు మడతలు గలవాడు. లోతైన స్థనములు, చూచుకములు, పాదరేఖలు గలవాడు.

మూడు సుడులు గల శిరస్సు గలవాడు. బొటన వ్రేలిపై నాలుగు రేఖలు గలవాడు. నుదుట నాల్గు గీతలు, పాదములందు, అరచేతులందు తలలోను నాలుగు రేఖలు గలవాడు. తొంభై ఆరు అంగుళముల ఎత్తు గలవాడు. మెరయుచున్న గట్టి దంతములు గలవాడు. సింహము, శార్దూలము, గజము, వృషభము అనే నాలుగు జంతువుల నడక వంటి నడక గలవాడు. పొడవైన అవయవములు కలవాడు. పద్మాకారమైన ముఖము, కండ్లు, పెదవులు, అంగుడు, స్తనములు, చెవులు, పాదములు గలవాడు. సాముద్రిక శాస్త్రములో చెప్పిన శుభ లక్షణములన్నీ కలవాడు. అమ్మా ఈ లక్షణాలే అచ్చు గుద్దినట్లు లక్ష్మణునిలో

కూడా వున్నాయి. అన్నదమ్ములిద్దరూ ఒకరికొకరు తీసిపోరు. ఇంక వానరులతో వారి సంగమమెలా కలిగిందని నీ సందేహం కదూ చెప్తాను విను.

రావణుడు నిన్ను ఎత్తుకునిపోయాక, అన్నదమ్ములిద్దరూ అరణ్యాలన్నీ నీ కోసం వెతుకుతూ వచ్చిమమ్మ కలిశారు. మా ప్రభువైన సుగ్రీవుని అతడి అన్నగారు రాజ్యంనించి వెళ్ళగొట్టాడు. సుగ్రీవుడు అన్నగారికి భయపడి ఋష్యమూక పర్వతంపై తలదాచుకున్నాడు. మేము నలుగురు మంత్రులం మాత్రం ఆయన వెంట వచ్చి సేవలు చేస్తున్నాము. ఒకనాడు నారబట్టలు ధరించి ధనుర్బాణములు చేతబూని రామలక్ష్మణులు ఋష్యమూకాద్రి దగ్గరకి వచ్చారు. వారిని చూసి సుగ్రీవుడు వాలి పంపగా వచ్చిన శత్రువులేమో అని భయపడ్డాడు. నన్ను వారి గురించి తెలుసుకురమ్మని పంపాడు. వారి గురించి తెల్సుకున్నాక నేను సుగ్రీవుని వృత్తాంతమంతా చెప్పాను వారికి. వారు జాలిపడి, సుగ్రీవునితో మైత్రి చేసుకుందుకంగీకరించి నాతో రావడానికి బయల్దేరారు. నేను వారిద్దర్నీ నా భుజ స్కందాలపై కూర్చోబెట్టుకుని సుగ్రీవుని దగ్గరకి వెళ్లాను. సుగ్రీవునితో వారు అన్యోన్యంగా మాట్లాడారు.

లక్ష్మణుడు సుగ్రీవునితో నిన్ను రావణుడపహరించుకెళ్ళిన సంగతి చెప్పాడు. ఆనాడు నువ్వు జారవిడిచిన ఆభరణాల మూట వారికి, చూపించాము మేము. అవి గుర్తుపట్టి రాముడు కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు.

సుగ్రీవుడు రాముడ్ని ఓదార్చి, తను సహాయం చేస్తానన్నాడు. అప్పుడు రాముడు సుగ్రీవునితో, అతడి అన్నగార్ని చంపి, వానర రాజ్యన్నీ, వాలి చెరబట్టిన సుగ్రీవుని భార్యనీ తిరిగి అతడికిప్పిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. సుగ్రీవుడు అందుకు ప్రతిఫలంగా నిన్ను వెతికించి ఇస్తానని వాగ్దానం చేశాడు. ఇచ్చిన మాట ప్రకారం రాముడు వాలిని చంపి సుగ్రీవుణ్ణి కిష్కింధకి రాజుని చేశాడు. సుగ్రీవుడు కూడా తన వాగ్దానం నిలపుకోవడం కోసం వానరుల్ని నిన్ను వెతకటానికి నాల్గు దిక్కులకీ పంపాడు. అలా పంపిన వారిలో నేను ఇలా నీ దగ్గరకి వచ్చాను.

అమ్మా వానరులతో రాముని సమాగమం ఇలా జరిగింది. హనుమంతుడని పేరు కల్గిన నన్ను వారు మీ వద్దకి దూతగా పంపారు. వైదేహీ రామకార్యార్థమై వచ్చిన సుగ్రీవుని మంత్రినమ్మా నేను. రాముడు త్వరలోనే వచ్చి, రావణుని చంపి నిన్ను తీసి కెళ్తాడు.

నా తండ్రి కేసరికి, నా తల్లి అంజనాదేవికి, వాయుదేవుని అనుగ్రహం వల్ల కలిగిన కుమారుణ్ణి నేను" అంటూ హనుమంతుడు చెప్పిన మాటల మీద సీతకి

నమ్మకం కలిగింది. సంతోషంతో ఆమె కళ్ళ వెంట ఆనందభాష్పాలు కారాయి. అప్పుడు మారుతి ఆమెతో ఇంకా ఇలా అన్నాడు.

"అమ్మా నీకు సంగతంగా విన్నవించాను. ఇంక నిశ్చింతగా వుండు. ఇదిగో రామనామాంకితమైన ఈ ఉంగరం చూడు. దీనిని గుర్తుగా నీకిమ్మని నీ రాముడే స్వయంగా ఇచ్చాడు. నీకు నాపై నమ్మకం కలగడానికి దీనిని తెచ్చాను. ఇకపై నీ కన్నీ శుభాలే కల్గుతాయి. దిగులు పడకు" అంటూ హనుమంతుడు ఆ ఉంగరాన్ని సీతకిచ్చాడు.

సీత ఆ ఉంగరాన్ని చేత్తో పట్టుకుని, తదేక దృష్టితో చూస్తూ, భర్తను చేరినట్లే సంతోషించింది. ఆనందంతో పరవశిస్తూ ఆంజనేయుని ప్రశంసిస్తూ,

"వానరోత్తమా, నిజంగా నువ్వు అమిత పరాక్రమశాలివి. సమర్ధుడివి. పండితుడివి. కనుకనే ఒంటరిగా అభేధ్యమైన ఈ లంకలో ప్రవేశించగలిగావు. నూరుయోజనాల సముద్రాన్ని గోష్పాదంలా దాటగలిగావు. నువ్వొక సామాన్య వానరుడివిగా నాకు తోచడంలేదు. కనుకనే సమర్ధుడవైన నిన్ను, రాముడు దూతగా పంపాడు. రాముడు కుశలమే కదా. రామలక్ష్మణులు దేవతలని కూడా ఎదిరించగల శక్తి గలవారు కదా. అయినా ఇలా ఉపేక్షించి ఎందుకూరుకున్నారు? పోనీలే వారిద్దరూ ఎలా వున్నారు? నన్ను చేరటానికి ప్రయత్నాలేమైనా చేస్తున్నారా?" అంటూ ఇంకా ఎన్నెన్నో ప్రశ్నలు పరంపరలుగా కురిపించింది. రాముడికి తానంటే పంచ ప్రాణాలు అనీ, తను జీవించిలేనని తెలిస్తే వెంటనే రాముడు ప్రాణత్యాగం చేస్తాడనీ అందుకే, రాముని కోసమే, ఇన్ని చిత్రహింసలు భరిస్తూ తాను ప్రాణాలతో వున్నానని చెప్పి కన్నీరు కార్చింది.

అపుడు హనుమంతుడు చేతులు జోడించి, "అమ్మా-రాముడికి నువ్విక్కడ వున్నట్లు తెలియదు. అందుకే ఆయన నీకోసం రాలేదు. ఇప్పుడు నేను వెళ్ళి, నువ్విక్కడ వున్నట్లు చెప్పగానే, వెంటనే వానర సైన్యంతో బయల్దేరి వస్తాడు. తన అమోఘమైన బాణాలతో కడలిని బంధించి, లంకలోని రాక్షసులందరినీ నిర్మూలం చేస్తాడు. అమ్మా నిన్నెడబాసిన మరుక్షణం నించీ రాముడు దుఃఖంతో కుమిలిపోతూ, సుఖం అంటే ఏమిటో మర్చిపోయి వున్నాడు. కేవలం నిన్ను చూడాలనే ఆశతోనే ప్రాణాలు నిల్పుకుని వున్నాడు. ప్రతిక్షణం నీ కోసం కలవరించి పోతున్నాడు" అని చెప్పాడు. ఆ మాటలు విన్న సీత చాలా సంతృప్తి పడింది. రాముడు జీవించి వున్నాడని తెలియగానే, ఆమె దుఃఖం ఉపశమించింది. తన కోసం రాముడు దుఃఖిస్తున్నాడని తెలియగానే ఆమె బాధ పడింది.

"హనుమా నీ మాటలు వింటుంటే నాకు విషం కలిపిన అమృతం త్రాగినట్లుంది. విధి అనుల్లంఘనీయం. కనుకనే మాకిలాంటి ఎడబాటు కలిగింది. నేనూ రాముడు, లక్ష్మణుడు అంతులేని బాధలనుభవిస్తున్నామంటే అదంతా విధి విలాసమే కదా. ఇంక రెండు నెలలు మాత్రమే గడువు వుంది. ఈ లోగా రాముణ్ణే వచ్చి రావణుని వధించి నాకు విముక్తి కల్గించమని చెప్పు. రావణుని తమ్ముడు విభీషణుడనే ధర్మవర్తనున్నాడట. అతడు చాలా సార్లు నన్ను రామునికి తిరిగి ఇచ్చేసి శరణు వేడుమని తన అన్నగారితో చెప్పాడట. ఈ సంగతి విభీషణుని కూతురైన అనల నాకు చెప్పింది. కాని రావణుడు ఆ మాటలు చెవిని పెట్టలేదు. అందుకే తాన చావు తానే కోరుకుంటున్నాడు. పద్నాలుగు వేల మంది రాక్షసుల్ని ఒంటరిగా సంహరించిన నా రామునికీ రావణుడొక లెక్కా?" అంటూ రాముడు గుర్తుకి రాగానే కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుంది.

హనుమంతుడు ఆమె నూరడిస్తూ "అమ్మా నీ సంగతి తెలిసిన మరుక్షణం రాముడిక్కడ వుంటాడు. కాని అంతవరకు నువ్వీదుఃఖం ఓర్చుకోలేవు. నువ్వు నా వీపుమీద కూర్చో. నేను అవలీలగా ఈ సముద్రం లంఘించి నిన్ను రాముని దగ్గరకి చేరుస్తాను. ఈ లంకతో సహా నిన్ను మొయ్యగల శక్తి నాకుంది. ఆలోచించకు. వైదేహీ నా వీపు మీద యెక్కు. సందేహించవలసినదేం లేదు" అన్నాడు.

ఆ మాటలకి సీత శరీరం పులకరించింది. మళ్ళీ ఆ మాటలకి నవ్వు కూడా వచ్చింది.

"హనుమా వానర సహజమైన చపలత్వంతో అలా మాట్లాడుతున్నావు కాని, ఇంత చిన్ని శరీరంతో నన్నెలా మోసుకెళ్ళగలవు? అంది. ఆ మాటలకి మారుతి ఖంగుతిన్నాడు. ఓహో ఈమెకి నా శక్తి సామర్ధ్యాలు తెలియవు కదా. నా అసలు రూపం చూపిస్తే అప్పుడు నా మాటలు నమ్ముతుంది" అని ఒక్క గెంతు గెంతి, తన శరీరాన్ని పెంచటం ప్రారంభించాడు. మేరు పర్వతంలా తన శరీరాన్ని పెంచి, అగ్నిలా ప్రకాశిస్తూ, ఎఱ్ఱని ముఖం, వజ్రాల్లాంటి గోళ్ళు, కోరలు కలిగి పర్వతాకారంలో ఆమె ముందు నిలిచాడు.

"అమ్మా నా నిజరూపం చూడు. ఇప్పటికైనా సంశయం మాని నా వెంటరా. ఈ సదవకాసాన్ని ఉపయోగించుకో" అన్నాడు. భీకరాకారుడైన వాయుపుత్రుని చూసి సీత దిగ్భ్రాంతి చెందింది. "మహాకపీశ్వరా, నీ బలము, శక్తి నాకు తెలుసు. నిన్ను అసామాన్య ప్రజ్ఞాసంపన్నునిగాముందే గ్రహించాను. సామాన్యవానరులెవ్వరూ దుస్తరమైన లంకని చేరలేరు. మహాసముద్రాన్ని లంఘించివచ్చావు. నన్ను తీసి

కెళ్ళగల శక్తి నీకుందని నాకు తెలుసు. కాని నీ అసలు రూపం చూడాలనే కోరికతో మాత్రమే అలా అన్నాను.

కపిశ్రేష్టా! వాయువేగంతో నువ్వు ఆకాశమార్గం గుండా సముద్రంపై నించి ప్రయాణం చేస్తూ వుంటే భయంతో నాకు తెలివి తప్పవచ్చు. ఆ వేగాన్నికి కళ్ళు తిరిగి నేను సముద్రంలో పడిపోవచ్చు. కనుక నీవెంట రావడం క్షేమం కాదు. అదీగాక నన్ను నువ్వు తీసుకుపోతుంటే రావణుని అనుచరులు నిన్ను వెంబడిస్తారు. వారు ఆయుధాలు ప్రయోగిస్తే నీకూ నాకూ కూడా ప్రాణాపాయం సంభవిస్తుంది. ఒక వేళ నువ్వు కృతకృత్యుడివై నన్ను తీసికెళ్ళగలిగినా, రామునికి అపఖ్యాతి కల్గుతుంది. రామునికది తీరని అవమానంకాదా. కనుక నేను నీతో రావడం కంటే రాముడిక్కడికి రావడమే మేలు. అంతే కాదు. కుమారా-నేను పతివ్రతని. రాముని తప్ప మరో పురుషుని తాకను. ఆనాడు రావణుడు బలవంతంగా తీసుకురావడం వల్ల ఆశక్తురాలను. కనుక సహించాను.

రాముడు బంధువులతో సహావచ్చి రావణుని చంపి స్వయంగా తీసి కెళ్ళడమో రామునికి తగునని నా మాటగా చెప్పు. రాముని గురించి కుమిలిపోతున్న నాకు ఊరట కల్గించమను" అని సీత అంటున్న మాటలు విని, ఆంజనేయుడు తృప్తి పడి "అమ్మా నీ మాటలు చాలా సబబుగా వున్నాయి. నీ అభీష్ట ప్రకారమే చేస్తాను. నువ్వు చెప్పమన్నమాటలన్నీ రామునికి చెప్పి నీ పరిస్థితి వున్నది వున్నట్లు ఆయనకి వివరిస్తాను. రామునికి ప్రియంచెయ్యాలనే ఉద్దేశ్యంతో నిన్ను నా వెంట రమ్మన్నాను కాని, రామునికి అపఖ్యాతి కల్గించాలని కాదు. పోనీలే. నీకిష్టం లేకపోతే రావద్దు. నిన్ను నేను చూశానని రామునికి నమ్మకం కల్గడానికి గుర్తుగా ఏదైనా ఇయ్యి. అని హనుమంతుడడుగుతూ వుంటే, కన్నీటితో నోట మాటరాక, గద్గద స్వరంతో, గొంతు పెకిలించుకుని, సీత ఇలా అంది.

"కుమారా నా మాటలకి బాధపడ్డావా? వద్దు. నా మాటలు అపార్థం చేసుకోకు. నాకు రామునికి మాత్రమే తెలిసిన ఒక వృత్తాంతం చెప్తాను. అది వింటే రాముడు నా ఉనికిని గుర్తిస్తాడు. "మునుపొక సారి చిత్రకూట పర్వతానికి ఈశాన్యదిక్కులో ఒక ఆశ్రమం నిర్మించుకుని మేమున్నప్పుడు, ఒకనాడు నేనూ రాముడూ మందాకినీ తీరవనాలలో విహరిస్తుండగా, బాగా అలసిపోయిన నేను రాముని తొడపై తలపుంచుకుని ఒక చెట్టు నీడలో పడుకున్నాను. కాస్త దూరంలో ఎండబెట్టిన మాంసం మీద కాకి వాలి తినసాగింది. నేను దానిని మట్టిబెడ్డతో కొట్టాను. అది అక్కడ్నించి ఎగిరి వచ్చి నా గుండెలపై వాలి గాయం చేసింది. నాకు దాని మీద కోపం వచ్చి దాన్ని కొట్టటానికి నా వడ్డాణం తియ్యబోయాను. అంతలో కూర్చునే

కునికిపాట్లు పడుతున్న రామునికి తెలివివచ్చింది. నా చేతిలో వడ్డాణం చూసి "ఆ పక్షి మీదా నీ కోపం" అని రాముడు పరిహసించాడు. నాకుసిగ్గేసింది. అంతలో ఆ కాకి మళ్ళీ నన్ను గీరింది. నేను రాముని ఒడిలో నక్కిచూస్తున్నాను. నా స్వామి ఆ కాకిని తోలేసి నన్ను ఓదార్చాడు. నాకు కళ్ళలో నీళ్ళు వచ్చాయి. చాటుగా కళ్ళుతుడుచుకున్నాను. నేను లేచి కూర్చున్నాను. రాముడు నా ఒడిలో తలవుంచి పడుకున్నాడు. కాకి మళ్ళీ వచ్చి నా ఎదగీరింది. రక్తపు బొట్లు కారి రాముని మీద పడ్డాయి. సుఖంగా నిద్రపోతున్న రాముడు లేచి, నాస్తనాల మీద అయిన గాయం చూసిన కోపంతో బుసలు కొడుతూ తను కూర్చున్న దర్భాసనం నించి ఒక దర్భ తీసి బ్రహ్మాస్త్రంగా మంత్రించి ఆకాకిపై ప్రయోగించాడు. ఆకాకి దేవేంద్రుని కుమారుడు. రాముడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వాడ్ని తరుముకుంటూ వెళ్ళింది. ఆ కాకి "రక్షించండి రక్షించండి" అంటూ అన్ని లోకాలు తిరిగింది. ఇంద్రుడు గాని దేవతలు గాని ఎవ్వరూ వాణ్ణి రక్షించలేకపోయారు. మూడు లోకాలు తిరిగి మళ్ళీ రాముని దగ్గరకే వచ్చి, రాముని కాళ్ళపై పడి క్షమించమని అడిగింది. దయామూర్తి అయిన రాముడు దాన్ని క్షమించాడు. కాని తాను ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వ్యర్థమవడానికి వీల్లేదు. కనుక ఆ బాణాన్ని కాకి కుడి కంటికి గురిచేశాడు. ఆ కాకి కృతజ్ఞతతో, దశరథ రామునికి నమస్కరించి, తన స్థానానికి వెళ్ళిపోయింది. ఆనాడు కేవలం ఒక కాకిమీదే బ్రహ్మాస్త్రం ప్రయోగించారు కదా, ఈనాడీ దుష్టరావణుడ్ని ఉపేక్షించి ఊరుకున్నారెందుకు? అని అడిగానని చెప్పు" అంది దుఃఖిస్తూ. అప్పుడు హనుమంతుడు ఆమెకూరట కలిగించాలని ఇలా చెప్పాడు.

"అమ్మా-రాముడు నీ విషయంలో ఎప్పుడూ ఉపేక్షించడు. కాని ఇంతకాలం నువ్వెక్కడున్నావో తెలియక, ఆ రావణుని నివాసమెక్కడో తెలియక ఏం చెయ్యాలో తెలియని పరిస్థితిలో వున్నాడు. ఇప్పుడు నేను నీ జాడ తెల్సుకున్నాను కనక అరివీరభయంకరులైన ఆ అన్నదమ్ములిద్దరూ వచ్చి లంకని భస్మీపటలం చేస్తారు. నేను ప్రమాణం చేసి చెప్తున్నాను తల్లీ. నిన్ను ఎడబాసినది మొదలు నేటివరకూ రాముడు నీ కోసమే విలపిస్తూ ఇతర విషయములందు అనాసక్తుడై వున్నాడు. లక్ష్మణుడు కూడా శోకసంతప్తుడై వున్నాడు. ఇంకా నువ్వేమైనా చెప్పాల్సింది వుంటే చెప్పు. నేను తొందరగా వెళ్ళాలి" అన్నాడు. అప్పుడు సీత

"హనుమా-రామలక్ష్మణుల్ని కుశలమడిగానని చెప్పు. నాకు లక్ష్మణుడంటే వాత్సల్యమని చెప్పు. ఇంక నెల రోజులు మాత్రమే నేను జీవించి వుంటావని, ఈ లోపలే రాముణ్ణి తగిన కట్టుదిట్టంతో రమ్మన్నాననీ చెప్పు" అంటూ సీత

తన కొంగులో చుట్టిన చూడామణిని తీసి తన గుర్తుగా రామునికిమ్మని చెప్పింది. ఆమణిని తీసుకుని, సీతకి ప్రదక్షిణం చేసి, నమస్కరించి, మహదానందంతో రాముని స్మరిస్తూ తేలిక అయిన మనస్సుతో, హనుమంతుడు వెళ్ళిపోవడానికి, ఉద్యుక్తుడయ్యాడు. వెళ్ళబోతున్న మారుతిని ఆపి, సీత మళ్ళీ ఇలా చెప్పింది.

"హనుమా-నేను నీకిచ్చిన చూడామణి చూడగానే, రామునికి నేనూ, మా తల్లి, దశరథుడు, ముగ్గురం గుర్తుకువస్తాము. ఎందుకంటే మా వివాహ మహోత్సవంలో, నా తల్లి, దశరథుని సమక్షంలో ఈమణిని నాకలంకరించింది. వానరోత్తమా, కార్యసిద్ధికి వీలైన ఉపాయం ఆలోచించు. అందుకు నువ్వే సమర్థుడివి" అని సీత అనగానే "సరే" అని సీతదగ్గర ప్రతిజ్ఞ చేసి, మళ్ళీ సీతకి నమస్కరించి, పావని బయల్దేరాడు. బయల్దేరబోతున్న మారుతిని చూసి సీతకి దుఃఖం ఆగలేదు. భాష్పపూరిత లోచనాలతో మళ్ళీ ఇలా అంది. "హనుమా రామలక్ష్మణుల్ని, సుగ్రీవుని, ఆయన మంత్రుల్ని, సర్వవానరుల్ని కుశలమడిగానని చెప్పు. రామచంద్రుడు సత్వరమే నన్నీ దుఃఖ సముద్రం నించి ఒడ్డు చేర్చేలా చెయ్యి" అని సీత పదే పదే దుఃఖిస్తూ చెప్పిందే చెప్పసాగింది.

సీత పరిస్థితి గమనించి హనుమంతుడు "అమ్మా దిగులు చెందకు తల్లీ. రాముడు శీఘ్రమే వానర సేనతో వస్తాడు" అని నమ్మకం కలిగేలా చెప్పాడు. ఆ మాటలకి సీత చాలా సంతృప్తి పడింది. ఆప్యాయంగా హనుమని చూస్తూ,

"కుమారా నా కోసం ఇంకొక్కరోజు వుండి వెళ్ళవచ్చు కదా. రహస్య స్థావరంలో ఎక్కడైనా ఒక్కరోజుండి వెళ్ళు. నువ్వుంటే నాకు కొండంత ధైర్యంగా వుంటుంది. నువ్విలా వెళ్ళిపోతే నా ప్రాణాలు నిలుస్తాయో లేదో, నాకొక్క సందేహం వుంది. తీర్చగలవా? మీ వానర వీరులందర్లో నువ్వు గొప్పవాడివి. కనుక సముద్రం దాటివచ్చావు. మరి మిగిలినవారు రామలక్ష్మణులు, ఈ దుస్తరమైన సముద్రాన్ని ఎలా దాటి రాగలరు? సముద్రాన్ని దాటగల శక్తి నీకు, వాయుదేవునికి, గరుత్మంతునికి మాత్రం వుంది. ఇలాంటి స్థితిలో మిగిలిన వారు సముద్రాన్ని ఎలా దాటి రాగలరు? సంపూర్ణమైన సైన్యంతో, రావణుని ఓడించి, నారాముడు నన్ను అయోధ్యకి తీసికెళ్ళగల్గినప్పుడే, ఆయనకి జగద్విఖ్యాతి కల్గుతుంది. అలా జరగటానికి వీలైన ఏర్పాటు నువ్వేచెయ్యాలి" అంది.

అపుడాంజనేయుడు "అమ్మా వానరసైన్యానికి ప్రభువైన సుగ్రీవుడు చాలా బలవంతుడు. నిన్నెలాగైనా రాముని సన్నిధికిచేర్చాలనే ధృఢ సంకల్పంతో వున్నాడు. ఆయన సేనలో మనో వేగము గల వానరులు కోట్ల కొద్దీ వున్నారు. వారంతా ఆకాశంలో గాని, పాతాళంలో గాని, ముందుకి గాని, వెనక్కి గాని, అడ్డంగా కాని,

ఎలా కావాలంటే అలా వెళ్ళ సమర్థులు. ఎంతటి క్లిష్టమైనకార్యాన్నైనా, వారది తేలికగా చెయ్యగలరు.

వారంతా ఎన్నోసార్లు ఆకాశమార్గాన భూ ప్రదక్షిణం చేసి వచ్చారు. జానకమ్మా నేనే గొప్పవాణ్ణని నువ్వనుకుంటున్నావు. కాని సుగ్రీవుని దగ్గర నా కన్నా చాలా బలవంతులు, నాతో సమానమైన వారు, చాలా మంది వున్నారు. నా కంటే తక్కువ వాడు మాత్రం ఒక్కడైనా లేడు. సామాన్యంగా దూతగా పంపేడప్పుడు అందరికన్నా తక్కువవాణ్ణే పంపుతారు. కాని ఎక్కువ సామర్థ్యం గల వారిని పంపరు. కనుక నువ్వు విచారించాల్సిన పని లేదు. ఇంక రామలక్ష్మణులంటావా, వారు నా వీపుపై కూర్చుని సూర్యచంద్రుల్లా వస్తారు. లంకని ఛేధించి, రావణుని చంపి నిన్ను తీసికెళ్తారు. ఇంక కొన్నిరోజులు మాత్రం ఓర్చుకో" అనిచెప్తూ ఆంజనేయుడు మళ్ళీ వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. మళ్ళీ సీతకి ధైర్యం చెప్తూ "అమ్మా ఇక మీదట శోకించి మనస్సు పాడుచేసుకోకు. నీకు అప్రియమైనదేదీ జరగదు. రామలక్ష్మణులిద్దరూ అగ్ని వాయువులే. ఇక్కడ నువ్వు ఎన్నాళ్ళో వుండక్కర్లేదు. నేను వెళ్ళి నీ జాడ చెప్పడం ఆలస్యం, ఆఘమేఘాల మీద వచ్చేస్తారు. అంత వరకు ఓపిక పట్టు" అన్నాడు. హనుమంతుడు వెళ్ళిపోతున్నాడంటే సీతకి చాలా దిగులుగా వుంది. రాక్షసుల మధ్య పడరాని పాట్లు పడ్తున్న ఆ మహాసాధ్వికి ఆంజనేయుని రాక అమృతం దొరికనట్లుంది. కొడిగట్టిపోతున్న ఆమె ఆశాజ్యోతికి మళ్ళీ వెలుగు సంతరించుకున్నట్లుంది. అందుకే తుడివీడ్కోలు చెప్తూ ఇలా అంది.

"వానరోత్తమా నీ రాక నాకు ఎండిపోయిన నేలతల్లి మీద చల్లని నీరు చిలకరించినట్లుంది. శోకంతో కృశించిన నా శరీరాన్ని పురుషోత్తముడైన రాముడు తన చల్లని చేతులతో నిమిరి, ఓదార్పు కలిగించేలా చెయ్యి. ఒకనాడు నా నుదుటి బొట్టు చెరిగినప్పుడు, రాముడు మనశ్శిల నూరి నా నుదుట తిలకం దిద్దాడు. ఈ విషయం చెప్తే కూడా రామునికి నువ్వు నన్ను చూశావన్న నమ్మకం కలుగుతుంది. నేనిలా రాక్షసుల మధ్య అష్టకష్టాలు పడ్తుంటే పరాక్రమవంతుడివైన నువ్వు ఎలా ఊరుకోగలిగావు?అని అడిగానని చెప్పు. ఇంతకాలం ఈ చూడామణి లోనే రాముణ్ని చూసుకుంటూ దీన్ని భద్రంగా దాచుకున్నాను. ఇపుడింక దీన్ని కూడా నీకు ఇచ్చి పంపించేస్తున్నాను. నేనింక ఒక నెల రోజులకన్న బ్రతకనని చెప్పు. రాముడు నా కోసం తపించిపోతున్నాడని తెలిసినదగ్గర్నించీ అతనిని చూడాలని నా హృదయం తపించిపోతోందని చెప్పు" అంటూ పరిపరివిధాల దుఃఖిస్తుంటే హనుమంతుడు ఆమెని దిగులు పడవద్దని మళ్ళీ ఓదార్చి చెప్పాడు.

"అమ్మా ఇంకేమైనా నీ గుర్తుగా రామునికిస్తావా?" అని మారుతి అడగ్గా "వత్సా చూడామణి ఇచ్చాను కదా. దాన్ని చూడగానే రామునికి నమ్మకం కల్గుతుంది" అంది. హనుమంతుడు సరే అని చెప్పి పైకెగరటానికి శరీరాన్ని పెంచసాగాడు. సీతకి కన్నీరు ఆగలేదు. "వానరోత్తమా మహాబాహుడైన రాముడు నన్ను ఈ దుఃఖసముద్రంలో నుంచి తరింపచేసేలా చెయ్యి. ఈ రాక్షస స్త్రీల మధ్య నేను పడుతున్న ఇక్కట్లు రామునికి వర్ణించి చెప్పు. నీ ప్రయాణం సుఖంగా జరగాలి" అని దీవించింది.

సీత మాటలు మననం చేసుకుంటూ హనుమంతుడు ఒక్కసారిగా ఎగిరి ఉత్తరదిక్కుకి చేరాడు. అప్పుడు తనలో తను ఇలా ఆలోచించుకున్నాడు. "నేను వచ్చినపని సఫలమైంది. సీతమ్మని చూడగలిగాను. ఇపుడింక ఈ రాక్షసుల బలమెంతటిదో, వీరి నివాసమైన రాజధాని, కోట వీనిలో లోతుపాతులు, తెలుసుకోవాలి. వీరిపట్ల దండోపాయం తప్ప వేరేది పని చెయ్యదు. ఎలాగైనా వీళ్ళతో తగువుపెట్టుకుని కొంతమందిని చంపగలిగితే అప్పుడు నా శక్తి ఏమిటో వీరికి తెలుస్తుంది. దూతగా వచ్చిన వాడు తనకి నిర్దేశించిన పని మాత్రమే గాక మరికొన్ని సాహసాలు చేసి తన సామర్థ్యం నిరూపించుకోవాలి. కార్యం చెడకుండా మరికొన్ని కార్యాలు చెయ్యడమే కార్యసాధకుని లక్షణం.

శత్రుబలము, మావానర బలము, రెండింటిలో తారతమ్యం తెలుసుకుని అపుడు కిష్కింధకి వెళ్తాను. అప్పుడే మా ప్రభువు నా కప్పగించినకార్యం సఫలం చేసిన వాడినవుతాను. ఇపుడేదో ఒక ఉపాయం ఆలోచించి ఈ రాక్షసులతో యుద్ధం చేసే పరిస్థితి కల్పించుకోవాలి. ఆ యుద్ధంలో విజయం సాధించి రావణుని కొలువుకూటమి చూడాలి. వాడి అభిప్రాయం తెలుసుకోవాలి. రావణుని దర్బారులోకి వెళ్ళాలంటే ఒక్కటే మార్గం. ఈ అశోకవనమంటే వాడికి చాలా మక్కువ. కనుక నందన వనంలాంటి ఈ అశోకవనాన్ని పాడుచెయ్యాలి. ఇది నాశనమైతే రావణునికి కోపం వస్తుంది. అప్పుడు తన సైన్యాన్ని నామీదికి యుద్ధానికి పంపిస్తాడు. ఆ విధంగా వారితో యుద్ధం చేసి వీలైనంత మందిని చంపి అప్పుడు కిష్కింధకి వెళ్తాను. రావణుడు తన సభామండపానికి పిలిపించినా పిలిపించవచ్చు" అని మనస్సులో ఆలోచించుకుని, పౌరుషంతో విజృంభించాడు.

పెనుగాలిలా తొడలతో వృక్షాల్ని కదిలించాడు. మహావృక్షాలన్నీ పెకిలించి వరసగా నేలమీద పడేయ్య సాగాడు. చెట్ల కొమ్మలన్నీ విరిచేశాడు. జలశయాలన్నీ మట్టితో రాళ్ళతో పూడ్చేయ్యసాగాడు. పర్వత శిఖరాలన్నీ నుగ్గు నుగ్గు చేసేశాడు. పక్షులన్నీ బెదిరి చెదిరి పోయాయి. జలాశయాల ఒడ్డులన్నీ కూలిపోయాయి. లతలు

వృక్షాలు తలలు వాల్చేశాయి. అశోక వనమంతా క్షనాల మీద సర్వనాశనమై పోయింది. మహాసర్పాలూ, క్రూరమృగాలు నేలకూలాయి. లతా గృహాలు, చిత్రగృహాలు ధ్వంసమై పోయాయి. ఆ వనంరూపే మారిపోయి స్మశాన వాటికలా అయిపోయింది.

ఈ విధంగా రావణుని క్రీడావనం ధ్వంసం చేసి, ఆ వనం యొక్క సింహా ద్వారం మీద కూర్చుని ఏం జరుగుతుందా అని చూస్తూ కూర్చున్నాడు. ఈ కోలాహలమంతా చూసి రాక్షసులు గాబరా పడిపోయారు. అంతవరకు వైష్ణవ మాయా అన్నట్లు సీత చుట్టూవున్న స్త్రీలు గాఢ నిద్రలో మునిగివున్నారు. ఈ సందడికి వారంతా తృళ్ళిపడిలేచారు. ఒక కోతి అశోక వనమంతా పాడుచెయ్యటం చూశారు. ఆ మహాకాయుడ్ని చూసి, మతులు పోయి "ఔరా-వీడెవడు? ఎవరు పంపారు? ఎక్కడ్నించి వచ్చాడు? అని అతలాకుతలమౌతూ సీతదగ్గరకి వెళ్ళి, వీడిగురించి నీకు తెలుసా? అని అడిగారు. వాడు నీతో ఏం మాట్లాడాడు? చెప్పు. నీకేం భయంలేదులే" అన్నారు.

అప్పుడు సీత యుక్తిగా, "ఏమో, నాకేం తెలుసు? మీరాక్షసమాయలు నేనేం తెలుసుగోగలను? పాముజాడ పాముకే తెలుస్తుంది. నేనుకూడా వాణ్ణిచూసి చాలా భయపడ్తున్నాను. మీరే తెలుసుకోండి. వెళ్ళి అడగండి" అంది బెదురుగా చూస్తూ.

అపుడా రాక్షసస్త్రీలు ఆంజనేయుని దగ్గరకి వెళ్ళి, అతడ్ని చూసి బెదిరిపోయి, రావణుని దగ్గరకి వెళ్ళి "రాజా భీకరాకారము కల్గిన ఒక వానరుడు అశోకవనంలో సీతతో మాట్లాడాడు. అతడ్ని గురించి ఎంత అడిగినా సీత చెప్పటం లేదు. వాడు మన ప్రమదావనమంతా సర్వనాశనం చేశాడు. సీత కూర్చున్న శంశుపావృక్షం ఒక్కటీ వదిలి, మిగిలిన వృక్షాలన్నీ విరిచి కుప్పలుపోశాడు. సీత జాడ తెలుసుకుందుకు రాముడు పంపగా వాడు వచ్చివుండవచ్చని మా అనుమానం.

నీతో వైరం పెట్టుకుని వాడి చావు వాడే కొని తెచ్చుకున్నాడు. ఎందుకంటే సీత మీద ఆదరంతోనే శింశుపావృక్షం మాత్రం పాడు చెయ్యకుండా వదిలాడు" అని ఒక్కపెట్టున చెప్పారు. ఆ మాటలు విన్న రావణుడు మండిపడ్డాడు. వెంటనే అతి బలవంతులైన ఎనభైవేల మంది సైనికుల్ని పిల్చి ఆ వానరాన్ని బంధించి తెమ్మని పంపాడు. వారు గదలు-పరిఘులు, బాణాలు మొదలైన ఆయుధాలు ధరించి, మిడతలదండులా వెళ్ళి, హనుమంతుని మీద విరుచుకుపడ్డారు. వారిని హనుమ చూశాడు. బెబ్బులిలా గర్జించాడు. పర్వతాకారంగా పెరిగాడు. తోకతో నేలమీద కొట్టాడు. జబ్బలు చరిచాడు. ఆ ధ్వనికి ఆ వనమంతా ప్రతిధ్వనించి, ఆకాశంలో ఎగురుతున్న పక్షులు చచ్చి నేలమీద పడ్డాయి. అప్పుడు హనుమంతుడు

బిగ్గరగా

అమిత బలసంపన్నుడైన రాముడు, మహా బలుడైన లక్ష్మణుడు, రామునిచే రక్షించబడుతున్న సుగ్రీవుడు, దిగ్విజయంతో వర్ధిల్లుతుండగా, నేను కోసలేంద్రుడైన శ్రీరామునిదాసుడనై. శతృసైన్యాన్ని సంహరించగల వాయు పుత్రుడనైన మారుతిని. వెయ్యి మంది రావణులు వచ్చినా యుద్ధంలో నన్నెదిరించి నిలువలేరు. నేను కేవలం రాళ్ళతోటీ వృక్షాలతోటీ మాత్రమే శత్రువులతో యుద్ధం చేస్తాను. లంకని మర్ధించి, మైథిలికి నమస్కరించి, నా స్వామి కార్యము సాధించి, రాక్షసులందరూ చూస్తుండగా, నేను దర్జాగా వెళ్ళిపోతాను" అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు.

**33 శ్లో॥ 1. జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలౌ,**
**రాజాజయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః**

**34 శ్లో॥ 2. దాసోహం కోసవేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః,**
**హనుమార్ శత్రుసైన్యానాం నిహరితా మారుతాత్మజః**

**35 శ్లో॥ 3. నరావణ సహస్రంమే యుద్దే ప్రతిబలం భవేత్,**
**శిలా భిస్తు ప్రహరతః పాదపైశ్చసహస్రశః**

**36 శ్లో॥ 4. అర్దయిత్వాపురీం లంకాం అభివాద్యచమైథిలీం.**
**సమృద్ధార్థోగ మిష్యామి మిషతాం సర్వరక్షసామ్**

వాల్మీకి రామాయణములోని సుందరకాండ నలుబది రెండవ సర్గలో వున్న ఈ నాల్గు శ్లోకములు 33, 34, 35, 36 చాలా అద్భుతమైనవి. ఈ నాల్గు శ్లోకాలకి కలిపి "జయమంత్రము" అని పేరు. ఎవరైనా మానసికంగా గాని, శారీరకంగా గాని వేరే వారి చేత బాధపెట్టబడుతున్నప్పుడు, ఇతరులు మనల్ని బలవంతంగా లొంగదియ్యాలని ప్రయత్నిస్తున్నప్పుడు, ఏదైనా వ్యవహారంలో విజయంచేకూరాలని కోరుకున్నప్పుడు, నమ్మకంతో మనస్సులో హనుమంతుని నిల్పి, ఏకాగ్ర చిత్తముతో, శుచిగా నలభై రోజులు ఈ నాల్గుశ్లోకాలు పఠిస్తే వారికి విజయము తథ్యమని పెద్దలు చెప్పారు. నాస్తికత్వం వేళ్ళూని పాతుకుపోయిన ఈ రోజుల్లో కూడా, తనని నమ్మి కొల్చిన వారికి కొండంత అండగా వుంటానని హనుమంతుడు నిరూపించుకున్నాడు. అయితే దేనికైనా నమ్మకం ముఖ్యం. ఆంజనేయుడు తొలిసారిగా తాను రాముని దాసుడనని చెప్పుకున్న సందర్భం ఇది. ఈ సందర్భంగా రాముడు ఆంజనేయునికి అమితమైన శక్తి, మహిమ

ప్రసాదించాడు. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. సామాన్యంగా దైవప్రార్థనకి శుచి శుభ్రత పాటించడం మన ఆచారం. కనుక హనుమంతుని స్మరించేవారు కూడా శుచి, శుభ్రత పాటించాలి)

తనని గురించి తాను చెప్పుకుంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్న హనుమంతుని ఆ ఎనభైవేల మంది రాక్షసులూ చూశారు. వెంటనే తమ తమ ఆయుధాలతో అతడి మీద పడ్డారు. ఆంజనేయుడే మాత్రం జంకకుండా ఆ సింహద్వారానికి వున్న ఇనుప స్థంభాన్నొక దానిని పీకి, దానిని పట్టుకుని వారందర్నీ అవలీలగా చంపేశాడు. ఎనభైవేల మందిరాక్షసుల్ని తుక్కు తుక్కుగా చితక్కొట్టి చంపి మళ్ళీ ఆద్వారం మీదికి ఎక్కి కూర్చున్నాడు. చూస్తూ నుంచున్న రాక్షసులు నిశ్చేష్టులై రావణునికి ఆ వార్త చెప్పారు, పరుగు పరుగున వెళ్ళి.

రావణుడు ఆశ్చర్యపోయాడు. ప్రహస్తుని కుమారుడైన మహావీరుడు అనే వీరాధివీరుణ్ణి మారుతిపైకి పంపాడు. ఈ లోగా హనుమంతుడు, అశోకవనంలోని చైత్య ప్రసాదం చేరి, మహాపర్వతంలా వున్న ఆ విలాసమందిరాన్ని కూలగొట్టి సర్వనాశనం చేశాడు. మళ్ళీ ఒకసారి గర్జించి జబ్బలు చరుచుకుని, మళ్ళీ జయమంత్రాన్ని పఠించి, దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. ఆ అరుపులకి విలాస భవనాన్ని కాపలా కాస్తున్న కాపలావాళ్ళు మూర్ఛపోయారు. వందమందిపైగా వున్న వాళ్ళంతా కొద్ది సేపటికి తెలివి తెచ్చుకుని, వివిధ రకాలైన ఆయుధాలతో మారుతి మీద విరుచుకుపడ్డారు.

ఆ ప్రసాద శిఖరం లోంచి ఒక బంగారు స్థంభం లాగి, దాన్ని గిరగిరతిప్పుతూ, తిరగసాగాడు. ఆ స్థంభం తగిలిన చోటల్లా అగ్నిపుట్టి ఆ నిప్పు కోరలలో ఆ భవనమంతా తగులబడి పోయింది. ఆ మంటల్లో పడి ఆ నూరుగురు మరణించారు.

వారందర్నీ చంపేసి, ఆంజనేయుడు ఆకాశంలో నిలబడి "సుగ్రీవుని కనుసన్నలలలో మెలుగుతూ, నాలాంటి వానరులు కొన్ని వేల మంది, ఈ భూమండలమంతటా చరిస్తున్నారు. అటువంటి వానరసేనతో సుగ్రీవుడు లంకాపైకి దండెత్తి వస్తున్నాడు. మహాత్ముడైన రామునితో వైరం పెట్టుకుంటే, మీలంకాపురీ వుండదు. మీరూ వుండరు. మీ రావణుడూ వుండడు" అంటూ ఎలుగెత్తి అరిచాడు.

అంతలో ప్రహస్తుని కుమారుడైన జంబుమాలి ధనుర్బాణాలు ధరించి అక్కడికి వచ్చాడు. ఎఱ్ఱని వస్త్రములు ఎఱ్ఱని పూల మాలలు ధరించి, భయంకరమైన కన్నులతో, ధనుష్టంకారం చేస్తూ గాడిదలు పూన్చిన రథం మీద

వచ్చాడు. జంబు మాలిని చూసే సరికి హనుమంతుడిలో ఉత్సాహం రెట్టింపైంది. ప్రవేశ ద్వారం మీద కూర్చున్నాడు కాస్తా లేచి నిల్చున్నాడు. వెంటనే జంబుమాలి, బాణ వర్షం కురిపించి, మారుతిని తీవ్రంగా గాయపరిచాడు. గాయాలనించి రక్తం ధారగా కారుతుంటే హనుమ ఓర్వలేని కోపంతో ఒక పెద్ద కొండని పెకిలించి వాని మీదికి విసిరాడు.

జంబుమాలి ఆ కొండరాయిని తన బాణాలతో ముక్కలు ముక్కలు చేశాడు. ఆవేశం పట్టలేక మారుతి ఒక పెద్ద వృక్షం పీకి జంబుమాలి మీదికి లంఘించాడు. జంబుమాలి లాఘవంగా తప్పుకుని, నాల్గు బాణాలతో ఈ వృక్షాన్ని ఖండించి మారుతి బుజాలమీద ఐదు బాణాలు, గుండెల మీద పది బాణాలు వేశాడు. ఇంక లాభం లేదని హనుమంతుడు ఆ సింహ ద్వారం పరిఘని ఊడబీకి, జంబుమాలి గుండెల మీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి జంబుమాలి శరీరం పచ్చడై పోయింది. ఏకమాంసం ముద్దలా అయ్యాడు. గాడిదలు, రథం, అన్నీ నుగ్గు, నుగ్గు అయిపోయాయి. ఈ వార్త విన్న రావణుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. మహా పరాక్రమవంతులైన ఏడుగురు మంత్రుల్ని పిల్చి హనుమంతుణ్ణి బంధించి తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు.

వారు ఏడుగురు ఎంతో బలశాలురైన సైన్యాన్ని సమీకరించుకుని వెళ్ళారు. బంగారు గొలుసులు అలంకరించిన జండాలు, ధ్వజములు కలిగిన రథాల నెక్కి, బంగారు నగిషీ చెయ్యబడ్డ ధనుస్సులు ధరించి, ఉత్సాహంగా వెళ్ళారు. ప్రవేశ ద్వారంపై కూర్చున్న హనుమని చూశారు. ఒక్క పెట్టున అతడిపై బాణ వర్షం కురిపించారు. ఈ శరవృష్టిలో ఆంజనేయుడు కప్పబడిపోయాడు. నేర్పుగా అటు ఇటు కదులుతూ ఆ బాణాల మొనలు తనకి గుచ్చుకోకుండా, తప్పించుకుంటూ, ఆ మంత్రి కుమారులతో చాలా సేపు ఆడుకున్నాడు. మధ్య మధ్య బెబ్బులిలా కేకలు వేస్తూ వాళ్ళతో ఆడుకున్నాడు. వాళ్ళని బెదిరించాడు. కొంతమంది గుండెల మీద దూకి, కాళ్ళతో గీరాడు. కొందర్ని తలతో కుమ్మాడు. కొంతమందిని అరచేతులలతో చరిచాడు. కొందర్ని పాదాలతో అణగదొక్కాడు.

భీకరంగా గర్జిస్తూ వారిని అదరగొట్టాడు. ఇలా వారి బాణపరం పరలకి దొరక్కుండా కుప్పి గంతులు వేస్తూ వారందర్నీ భయాభ్రాంతుల్ని చేసి, చితకబాది వదిలిపెట్టాడు. చచ్చిన వారు చావగా మిగిలిన వారు ప్రాణాలు అరచేత పెట్టుకుని రక్తాలు కారుతూ లంకలోకి పారిపోయారు. హనుమంతుడు విజయోత్సాహంతో మళ్ళీ ప్రవేశద్వారంపైకి ఎక్కి కూర్చుని చూస్తున్నాడు.

మంత్రి కుమారులు నల్గురూ, ముగ్గురూ మొత్తం ఏడు మందీ సైన్య సమేతంగా హతులైన వార్త రావణుని చేరింది. ఆ వార్త విన్న రావణునికి మతిపోయింది. బాగా ఆలోచించాడు. వీరూపాక్ష, దుర్ధర, ప్రఘున, భాసకర్ణులనే ఐదుగురు సేనా నాయకుల్ని పిల్చాడు. వారంతా మహా వీరులు, నీతికోవిదులు. వారితో రావణుడిలా అన్నాడు. "సేనా నాయకులారా మీరు సైన్య సమేతంగా వెళ్ళి ఆ విచిత్ర వానరుని బంధించి తెండి వాడి పట్ల మీరు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి సుమా. వాడు సామాన్య వానరుడిలా లేడు. చాలా బలము కల్గిన పెనుభూతం వాడు. బహుశా మనల్ని ఓడించడానికి, ఇంద్రుడు తన తపో బలంతో, వానిని సృష్టించి పంపివుంటాడని నా అనుమానం. ఇది వరకు నేను మీ అందరి సాయంతో దేవ, గంధర్వ, నాగ, యక్ష, మహర్షుల, నెందర్నో ఓడించాను. వారంతా కట్టకట్టుకుని మనపై ఇలా వ్యూహం పన్ని వుంటారు. కనుక ఉపాయంతో వాణ్ణి పట్టుకురండి ఒక్క సంగతి, ఆ వానరుని మీరు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ అవమానించవద్దు. ఇతడు సామాన్య వానరుడు కాడు. ఏదో మహత్తరమైన భూతం ఇలా వచ్చి వుంటుంది. జాగ్రత్త. మీరు నేర్పుతో వానిని పట్టాలి. మీ ముందు ఇంద్రుడు, దేవతలు కూడా ఎదిరించి పోరలేరు. నాకు తెలుసు. కాని యుద్ధంలో జయాపజాలు దైవాధీనం కదా" అని అనేక జాగ్రత్తలు చెప్పి పంపాడు.

రావణుని ఆజ్ఞానుసారం వాళ్ళు బయల్దేరారు. ప్రవేశద్వారం మీద, మహోత్సాహంతో కూర్చున్న ఆ తేజోమూర్తిని చూశారు. ఆయుధాలు పట్టుకుని మారుతిని చుట్టుముట్టారు. దుర్ధరుడు వెంట వెంటనే ఐదు బాణాలు హనుమంతుని శిరస్సుపై వదలాడు. ఆ దెబ్బలకి భీకరంగా గర్జిస్తూ పావని ప్రవేశద్వారం మీద నించి కిందికి ఒక్క దూకుదూకాడు. క్షణం ఆలస్యం చెయ్యకుండా ఆ నీచుడు బాణవర్షం కురిపించాడు. మారుతి లాఘవంగా తప్పించుకుంటూ, వాడ్ని ఎదుర్కొని, ఆకాశంలోకి ఒక్క ఎగురు ఎగిరి, పిడుగులా దుర్ధరుని రథం మీదికి దూకాడు. ఆ దెబ్బకి రథం తుత్తునియలై పోయింది. దుర్ధరుడు చచ్చి నేలమీద పడ్డాడు. అది చూసి విరూపాక్ష, యూపాక్షులు, రోషంతో హనుమ మీదికి లంఘించారు.

హనుమంతుడు చటుక్కున పక్కనే వున్న ఒక సాలవృక్షం పీకి, వాళ్ళిద్దర్ని దానితో పచ్చడి, పచ్చడి చేశాడు. వారు ముగ్గురూ అలా చావగా మిగిలిన వాడు ప్రఘునుడు, హనుమపై విరుచుకుపడ్డాడు. ఇంకో పక్కనించి, బాసకర్ణుడు విజృంభించాడు. వారి దెబ్బలకి ఆంజనేయుని శరీరమంతా రక్తసిక్తమైంది. బాల భానునిలా వెలిగిపోతూ మారుతి రౌద్రమూర్తి అయి, ఒక పెద్ద కొండ శిఖరాన్ని

పెల్లగించి, వాళ్ళమీదికి విసిరి, వాళ్ళద్దర్ని చంపేశాడు. ఈ విధంగా ఐదుగురు సేనాపతుల్ని చంపేశాక ఆంజనేయుడు మిగిలిన సైనికుల్ని గుఱ్ఱాల్ని, ఏనుగుల్ని అవలీలగా కొట్టి, నాశనం చేశాడు. అంతటితో తన పూర్తయిందని, మళ్ళీ ద్వారబంధం మీదికి ఎక్కి, వింత చూస్తు కూర్చున్నాడు.

అతి బలాఢ్యులైన ఐదుగురు సేనానాయకుల్ని హనుమ అవలీలగా చంపేశాడన్న వార్త తెలియగానే రావణునికి ముచ్చెమటలు పట్టాయి. ఏం చెయ్యాలా అని పరిపరి విధాల ఆలోచించాడు.

తన కుమారుడైన అక్షయకుమారుడి వంక చూస్తూ అతడ్ని వెళ్ళమన్నట్లు తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. తండ్రి ఆజ్ఞపై బంగారు జాలుతో అలంకరించిన రథాన్ని ఎక్కి బయల్దేరాడు. తపశ్శక్తితో సంపాదించిన రథమిది. దానిపై విజయపతాకం ఎగురుతోంది. రత్నాలు పొదిగిన ధ్వజం కలిగి చాలా అద్భుతంగా వుందది. ఎంతో శక్తి కల్గిన ఎనిమిది గుఱ్ఱాలు ఆ రథాన్ని లాగుతున్నాయి. అటువంటి రథంలో అక్షయకుమారుడు హనుమంతునితో యుద్ధానికి బయల్దేరాడు. అంతులేని సైన్యం వెంటరాగా సింహద్వారంపై భాగాన కూర్చున్న మారుతిని చూశాడు. అపారతేజో విరాజమయమూర్తి అయిన హనుమంతుని చూసి అక్షయ కుమారుడు ఆశ్చర్యపోయాడు. తొట్రుపాటుతో కూడిన గౌరవం కలిగింది మారుతిని చూడగానే అతగాడికి.

హనుమంతుడు మాత్రం ఇసుమంత కదల కుండా స్థిరంగా అలాగే కూర్చున్నాడు. అక్షయకుమారుడికి రోషం వచ్చింది. తీవ్రమైన మూడు బాణాలు తీసి హనుమపై ప్రయోగించాడు. హనుమ సర్వాలంకార భూషితుడైన అక్షయకుమారుడ్ని చూశాడు. అక్షకుమారుడు ముందుకి కదిలి హనుమ వైపు నడిచాడు. అప్పుడు భూదేవి చలించింది. కొండలు గజగజలాడాయి. అంతటి భీకరమైన పోరు వారిద్దరి మధ్యనా జరిగింది.

బాణప్రయోగంలో అక్షకుమారుడు చాలా నేర్పరి. విషసర్పాల్లాంటి మూడు బాణాలు హనుమంతుని తలలో నాటేలా వేశాడు. అవి సూటిగా హనుమంతుని శిరస్సులో దిగబడ్డాయి. అక్షకుమారుని నేర్పుకి హనుమ అబ్బురపడ్డాడు. తన శరీరాన్ని మరింతగా పెంచాడు. తీవ్రంగా హూంకరిస్తూ అక్షకుమారుణ్ణి సూటిగా చూశాడు. ఆ చూపులకి అక్షకుమారుడు కలవరబడ్డాడు. జాప్యం చేస్తే ప్రమాదమని ఆంజనేయునిపై బాణ వర్షం కురిపించాడు. అతడి పరాక్రమము చూసి ఆంజనేయుడు మెచ్చుకున్నాడు. ఇంతసేపటికి తనకి సమవుజ్జీ అయిన శత్రువు దొరికాడని సంతోషించాడు. అక్షకుమారుడు మాత్రం అహంకారం వల్ల

ఆంజనేయుని ప్రతిభ గుర్తించలేకపోయాడు.

ఆంజనేయుడు ఆకాశంలోకి ఎగిరాడు. అక్షకుమారుడు ఆకాశంలోకి బాణాలు వెయ్యసాగాడు. తనకి ఒక్క బాణం కూడా తగల కుండా హనుమంతుడు నేర్పుగా ఆకాశంలో పల్టీలు కొట్టూన్నాడు. అలా ఆకాశంలో వీరవిహారం చేస్తూ అక్షయకుమారుని చూసి "ఔరా ఈ బాలుడు బాల భానునిలా మహాబలుడై దుస్తరమైన సాహసం చూపిస్తున్నాడే. చిన్నవాడైనా ఈ బాల వీరుని చంపటానికి నాకు చేతులు రావటం లేదు కదా. వీడి పరాక్రమం చూస్తే దేవదానవులకి కూడా భయం కల్గుతుంది. కాని చిన్న వాడు కదా అని జాలి తలిస్తే వెనక్కి పోడు సరి కదా రెట్టించిన ఉత్సాహంతో యుద్ధం చేస్తున్నాడు. ఇతడ్ని ఉపేక్షించటం ఉచితం కాదు. వీడెప్పటికైనా ప్రమాదం కలిగిస్తాడు" అనుకుంటూ ఆంజనేయుడు అక్షకుమారుని ప్రతిభని మెచ్చుకున్నాడు. ఇప్పుడు తానేం చెయ్యాలో నిశ్చయించుకున్నాడు. బాగా ఆలోచించాక అక్షకుమారుని చంపడానికే నిర్ణయించుకున్నాడు. రథం లాగుతున్న ఎనిమిది గుఱ్ఱాల్ని అరచేతితో కొట్టి చంపేశాడు. ఆ తర్వాత రథాన్ని ముక్కలు ముక్కలు చేశాడు. అప్పుడు అక్షకుమారుడు రథంలోంచి దూకి ఆకాశంలోకి ఎగిరాడు. వెంటనే ఆకాశంలో వున్న మారుతి ఆ రాక్షసుని రెండు కాళ్ళు పట్టుకుని, నేల కేసి ఠపీ ఠపీ మని బాదాడు. ఆ దెబ్బకి అక్షకుమారుని కాళ్ళు చేతులు, తొడలు, మొల, మెడ, నడుము విరిగి ముక్కలై రక్తం కాలువలై పారింది. ఎముకలు, కీళ్ళు నుజ్జు, నుజ్జు అయిపోయాయి. అతి ఘోరంగా చచ్చి వాడు నేలమీద పడ్డాడు. ఆకాశంలో చరించే ఋషులు, యక్షులు, భూతాలు, పన్నగులు, దేవతలు దిగ్భ్రాంతిలో చూస్తు వుండిపోయారు. అక్షకుమారునీ, అతడి సేననీ చీల్చి చెండాడిన పావని, కసితో కన్నులు అగ్నిగోళాల్లా మెరుస్తుండగా మళ్ళీ ప్రవేశ ద్వారం పైకి ఎక్కి కూర్చున్నాడు.

అక్షకుమారుడు హతుడైన సంగతి తెలిసి రావణుడు దిగ్భ్రాంతిలో కొయ్యబారిపోయాడు. ఆ వార్త విని తట్టుకోలేక, మతిపోయినవాడిలా అయి, కొంత సేపటికి తెలివితెచ్చుకుని, పెద్ద కుమారుడైన ఇంద్రజిత్తుని పిల్చి,

"నాయనా నువ్వు బ్రహ్మాస్త్రము తెలిసిన వాడివి. ఎదురులేని శస్త్రజ్ఞానము గలవాడివి. ఆలోచించి కార్యం సాధించగల నేర్పు గలవాడివి. నీతమ్ముడైన అక్షకుమారుని చంపిన ఆ వానర వీరుణ్ణి బంధించి తీసుకురా. జరిగిన పరిణామాలన్నీ ఆకళింపు చేసుకుని తగిన సైన్యంతో వెళ్ళు. మన సైన్యం మాత్రం నశించకూడదు సుమా. ఆ హనుమంతుడు ఒకేసారి గుంపులు గుంపులు రాక్షసుల్ని మట్టుబెట్టున్నాడట. పరిస్థితి బాగా సమీక్షించి, ఏకాగ్రచిత్తుడవై మంత్రాలు స్మరిస్తూ

వెళ్ళు. నిన్ను యుద్ధానికి పంపడం అనుచితమని నాకు తెలుసు. కాని రాజధర్మంలో ఉచితానుచితాలు ఆలోచించడం అవివేకం. కనుక నీకు విజయం కలగాలని దీవిస్తున్నాను వెళ్ళు" అని ఆజ్ఞాపించాడు. తండ్రిమాటలు విన్న ఇంద్రజిత్తు తండ్రికి ప్రదక్షిణం చేసి నమస్కరించి బయల్దేరాడు. నాలుగు సింహాలు కట్టబడిన రథం ఎక్కాడు. అశోకవనం వైపు సాగాడు. ఇంద్రజిత్తు చేస్తున్న ధనుష్టం కారాన్ని అతడు వస్తున్న రథాన్ని చూసి హనుమంతుడు చాలా సంతోషించాడు. ఇంద్రజిత్తు ఆంజనేయుని సమీపించి, ధనుర్బాణాలతో అతడిపై కురికాడు. దూసుకువస్తున్న ఇంద్రజిత్తుని ఆంజనేయుడు చూశాడు. ఆకాశంలోంచి నాగ, యక్ష గంధర్వులు ఆసక్తిగా చూస్తున్నారు. పక్షులు రొదచేస్తూ గుంపులు గుంపులుగా ఎగరసాగాయి. ఇంద్రజిత్తు ప్రతాపానికి దిక్కులన్నీ మసకబారాయి. అంతటి సాహసవంతుణ్ణి చూసి ఆంజనేయుడు తన శరీరాన్ని విపరీతంగా పెంచాడు. సింహలా గర్జించాడు. ఇంద్రజిత్తు బాణపరంపరలు గుప్పిస్తు ఉంటే, ఆంజనేయుడు ఆకాశంలో అతడికి దొరకకుండా సంచరిస్తున్నాడు. ఎంతో యుక్తిగా బాణాల మధ్యలో ఎగురుతున్నాడు. రెండు చేతులూ ముందుకిసాచి బాణాలు తనకి తగలకుండా ఆపుకుంటూ పల్టీలు కొట్టున్నాడు.

ఇద్దరూ సమానమైన పరాక్రమం గలవారే. హనుమని కొట్టడానికి సరైన అవకాశం ఇంద్రజిత్తుకి దొరకటం లేదు. అలా అని ఆంజనేయునికి కూడా ఇంద్రజిత్తుని కొట్టడానికి అవకాశం దొరకటం లేదు. ఒకరినిమించి ఇంకొకరు పోరాడుతున్నారు. తన బాణాలకి దొరక్కుండా ఎగురుతున్న హనుమంతుని చూసి ఇంద్రజిత్తు ఆలోచనలో పడ్డాడు.

"ఈ హరివీరుని వధించడం అసాధ్యం. ఎలాగోలా బంధించి పడేయ్యాలి" అని ఆలోచించి, ఇంద్రజిత్తు ఆంజనేయునిపై బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. బ్రహ్మాస్త్ర ప్రభావం వల్ల ఆంజనేయుడు కదలకుండా బంధించబడ్డాడు. అపుడు అది బ్రహ్మాస్త్రమని మారుతికి అవగతమైంది. తనపై బ్రహ్మకి అనుగ్రహం వుందని మారుతికి తెలుసు.

ఇదివరలో బ్రహ్మ తనకి ఏ అస్త్రం వల్లా తనకి ఎటువంటి అపాయము కలగదని వరం ఇస్తూ బ్రహ్మాస్త్రాన్ని మాత్రం గౌరవించమని ఆదేశించాడు. కనుక ఇప్పుడు తను బ్రహ్మాస్త్రానికి లొంగక తప్పదు. ఆహా ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి తనని బంధించాడు కదా" అనుకున్నాడు. సరే కాని ఈ బ్రహ్మాస్త్రాన్ని విడుపించుకునే ఉపాయం ఆ బ్రహ్మదేవుడే తెలియపరుస్తాడు అనుకున్నాడు. "ఇదీ ఒకందుకు మంచిదే, ఈ విధంగా అయినా రావణునితో మాట్లాడే అవకాశం

దొరుకుతుంది” అనుకున్నాడు. మళ్ళీ ఈ ఆలోచన రాగానే ఇంక విడిపించుకునే ప్రయత్నం చెయ్యలేదు.

ఆంజనేయుడు కదలకుండా బంధింపబడేసరికి, రాక్షస మూకలు చుట్టు చేరి బెదిరించసాగారు. వాళ్ళందర్నీ చూసి భయంకరంగా గర్జించాడు మారుతి. అప్పుడా రాక్షసులు జనుపనార తెచ్చి ఆంజనేయుని గట్టిగా కట్టిపడేశారు. ఆ కట్లు తెంచుకోవటం ఆంజనేయునికి కష్టం కాదు. కాని కావాలనే లొంగినట్లు నటించాడు. ఆ సంగతి రాక్షసులకి తెలియదు.

ఇంకో విషయం ఏమిటంటే బ్రహ్మాస్త్రంచే బంధింపబడిన వారిని, మళ్ళీ తాళ్ళతో కట్టే ఆ బ్రహ్మాస్త్రం యొక్క ప్రభావం పోయి వాళ్ళు విముక్తులైపోతారు. ఆ సంగతీ వాళ్ళకి తెలియదు.

హనుమంతుడు బ్రహ్మాస్త్రం నించి విముక్తుడయి కూడా రావణుని కలుసుకోవాలనే కుతూహలంతో బంధించబడినట్లు పడుకున్నాడు. కాని జరిగిన పొరపాటు ఇంద్రజిత్తు గ్రహించాడు. అయ్యో మా వాళ్ళెంత తెలివితక్కువ పని చేశారు! బ్రహ్మాస్త్రం మహిమ వీళ్ళకు తెలియదు. ఇపుడీ వానరుడు కట్లు తెంపుకుంటే ఇంకే అస్త్రము ఇతడిపై పనిచెయ్యదు” అని విచారించాడు. కాని బ్రహ్మాస్త్రం పట్టు వదలినా హనుమంతుడు కదలకుండా అలాగే పడుకున్నాడు. రాక్షసులు పిడికిళ్ళతో గుద్దుతూ అతడ్ని బాధించసాగారు. అలాగే కొడుతూ రావణుని దగ్గరకి ఈడ్చుకుపోయారు.

ఇంద్రజిత్తు మహాబలుడైన ఆ వానరుని సపరివారంగా కొలువుతీరి వున్న రావణుని దగ్గరకి తీసికెళ్ళి చూపించాడు. తాళ్ళతో కట్టబడి, మదించిన ఏనుగులా వున్న ఆ వానరోత్తముని, రాక్షసులు రావణుని వైపు తోశారు. అపుడు ఆ సభలో వున్న వీరులు, సంభ్రమంలో “ఔరా వీడెక్కడి వాడు. ఎక్కడ్నించి వచ్చాడో, ఏం పనిమీద వచ్చాడో కదా” అని పలు విధాల గుసగుసలాడుకున్నాడు. కొందరు రాక్షసులు కోపంతో “వీడ్ని చంపండి, కాల్చండి, విరుచుకుతినండి” అని అరిచారు.

తాను వస్తున్న దారి అంతా పరిశీలిస్తూ వచ్చాడు మారుతి. రత్నాలు పొదిగి నిర్మించబడ్డ ఆ భవనాన్ని రావణుని పాదాల దగ్గర కూర్చున్న వృద్ధ మంత్రుల్ని చూశాడు. రావణుడు కూడా హనుమని పరిశీలనగా చూశాడు. రావణుని కళ్ళు ఎఱ్ఱగా అగ్నిగోళల్లా మెరుస్తున్నాయి. అమితమైన తేజస్సుతో, బలదర్పాలతో సూర్యునిలా ప్రకాశిస్తున్న రావణుని ఆంజనేయుడు చూశాడు.

ఆ వానరుని వివరాలు తెలుసుకోమని రావణుడు మంత్రుల్ని ఆదేశించాడు.

అపుడా మంత్రులు హనుమంతుడ్ని చూసి "ఓయీ నువ్వెవరు? ఇక్కడికి నిన్నెవరు పంపారు? ఎందుకొచ్చావు?" అని అడిగారు. అపుడు హనుమంతుడు

"నేను వానరరాజైన సుగ్రీవుని దూతగా వచ్చాను" అని మాత్రం చెప్పి రోషంతో రావణుని వంక చూశాడు. రావణుడు విలువైన మంచి ముత్యాలు వ్రేలాడుతున్న వజ్రకిరీటం ధరించి వున్నాడు. శరీరమంతా వజ్రాలు, రత్నాలు, మణులు పొదిగిన బంగారు ఆభరణాలు ధరించి వున్నాడు. తెల్లని చీనీ చీనాంబరాలు ధరించి వున్నాడు. ఒళ్ళంతా పైపూతగా ఎఱ్ఱని రక్తచందనం పూసుకున్నాడు. పదితలలతో భయంకరంగా మందరపర్వతంలా వున్నాడు. వాని శరీరం నల్లని కాటుక రాశిలా వుంది. వక్షస్థలంపై తెల్లని ముత్యాల హారాలు మెరుస్తున్నాయి. రత్నాలు పొదిగిన రత్న కంబళి పరచిన స్ఫటిక ఆసనంపై కూర్చున్నాడు. చక్కగా అలంకరించుకున్న స్త్రీలు అటు ఇటు అందమైన వ్యజనాలు మెరుపులు మెరిసినట్లు వీస్తున్నారు. దుర్ధరుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు, ప్రహస్తుడు, అనే నలుగురు మంత్రులు రావణుని చుట్టు కూర్చున్నారు. రత్నాలు వజ్రాలు పొదిగిన బంగారు దండకడియాలు జబ్బలకు కట్టుకుని, మేను నిండా చందన గంధము, రక్త చందనము పూసుకుని, మేరు శిఖరాగ్రాన మెరుస్తున్న నల్లని నీరు నిండిన మేఘంలా స్ఫటిక సింహాసనం మీద కూర్చుని, ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్న రావణుని చూసి హనుమంతుడిలా అనుకున్నాడు.

రావణుని యొక్క తేజస్సు వలన మారుతి మోహ పరవశుడయ్యాడుట. ఇక్కడ వాల్మీకి తన 'రామాయణంలో నలభై తొమ్మిదో సర్గలో పదిహేడవ శ్లోకం నించి నాలుగు శ్లోకాలలో రావణుని చూసి ఆంజనేయేమనుకున్నాడో అత్యద్భుతంగా వర్ణించి చెప్పాడు.

17 శ్లో॥ 1. అహో రూపమహోధైర్యమహోసత్త్వమహోద్యుతి:
అహో రాక్షస రాజస్య సర్వలక్షణయుక్తతా

18 శ్లో॥ 2. యద్యధర్మోన బలవాన్ స్యాదయం రాక్షసేశ్వర:
స్యాదయం సురలోకస్యసశక్రస్యాపి రక్షితా

18 శ్లో॥ 3. అస్యక్రూరైర్నృశంసైశ్చ కర్మభి:లోకకుత్సితై:
తేన బిభ్యతి ఖల్వస్మాద్ లోకాస్సామర దానవా:

20 4. అయం హ్యుత్సహతే, క్రుద్ధ: కర్తు మేకార్ణవంజగత్
ఇతి చింతాంబహు విధా, మకరోన్మతిమాన్ హరి:

దృష్ట్వారాక్షస రాజస్య ప్రభావమమీ తౌజ:

అమితమైన తేజస్సుతో ప్రకాశిస్తున్న రావణుని చూసి మారుతి అచ్చెరువొందాడు.

ఆహో ఏమి రూపము! ఎంత రాజసము! ఎంత ధైర్యము! ఎంత బలము! ఎంత కాంతి! ఈ రావణుడు సర్వ లక్షణ శోభితుడై చూడ్డానికి దర్పంగా, అందంగా వున్నాడు. ఇతడిలో అధర్మము అనే ఆ ఒక్క అవలక్షణం లేకపోతే, ఇంద్రునితో కలిసి ముల్లోకాధిపత్యము పొందగల అర్హత వున్నవాడు కదా! అని రావణుని చక్కదనాన్ని మనస్సులో మెచ్చుకున్నాడు.

క్రూరత్వంతో లోకాలన్నిటినీ భయపెట్టున్న ఈ రాక్షసరాజు తల్చుకుంటే సప్తసముద్రాల్ని, జగత్తునంతనీ కూడా ఏకం చెయ్యగల శూరుడు కదా" అని రావణుడి ప్రభావాన్ని చిటికెలో అంచనా వేశాడు మారుతాత్మజుడు.

రావణుని చూసి ఆంజనేయుడా విధంగా భావిస్తుంటే, రావణుడు హనుమంతుని చూసి, క్రోధముతో ఇలా అనుకున్నాడు. "పూర్వము నేను కైలాస శిఖరాన్ని కదిల్చినప్పుడు నందీశ్వరుడు నన్ను శపించినట్లు నా పైకి పోరుకి వచ్చిన వానరుడే ఇతడై యుండవచ్చును లేకపోతే బాణాసురుడైనా ఈ రూపంలో వచ్చి వుండవచ్చును" అనుకుంటూ రోషంగా తన మంత్రులవైపు చూసి, ప్రహస్తునితో ఇలా అన్నారు.

"ఈ దుర్మార్గుడెవరో ఎక్కడ్నించి వచ్చాడో, ఏమి పనిమీద వచ్చాడో, మన అశోక వనమంతా ఎందుకు నాశనం చేశాడో, మన మీదికి యుద్ధానికి రావడానికి కారణమేమిటో, అడిగి తెలుసుకోండి" అన్నాడు పళ్ళు పళ్ళు పట పట కోరుకుతూ.

రావణుని ఆజ్ఞపై ప్రహస్తుడు, హనుమంతుని సౌమ్యంగా "వానరవీరా భయపడకుండా నిజం చెప్పు. ధైర్యంగా జవాబుచెప్పు. అసలు నువ్వెవరివి? నిన్ను ఇంద్రుడు పంపాడా? కుబేరుని గూఢచారివా? యముడు గాని, వరుణుడు గాని నిన్ను పంపారా? లేకపోతే సాక్షాత్తు విష్ణువే పంపాడా? నీ పరాక్రమం చూస్తుంటే సామాన్య వానరుడివని అనిపించటం లేదు. రూపం మాత్రం వానరుడివే కాని నీ చేష్టలు అమోఘం. నిజం చెప్తే నిన్ను క్షమించి వదిలి పెట్తాము. అబద్ధం చెప్పావో ప్రాణాలు దక్కవు. రావణుని భవనంలో ప్రవేశించడానికి కారణమేమిటో చెప్పు" అన్నాడు.

అందుకు ఆంజనేయుడు నిర్లక్ష్యంగా ప్రహస్తుని వంక చూస్తు రావణునితో సూటిగా ఇలా అన్నాడు.

"రాక్షస గణాధిపా, మీరనుకుంటున్నట్లు నేను ఇంద్రుని దూతను కాదు.

వరుణ, యమ, కుబేరులెవ్వరూ నాకు తెలియదు. విష్ణువు కూడా నన్ను పంపలేదు. నేను నిజంగా వానరజాతి వాడినే, నిన్నెలాగైనా దర్శించాలనే వుద్దేశంతో అశోకవనం పాడుచేశాను. మీదో యుద్ధం చెయ్యడం నా అభిమతం కాదు. కాని నువ్వు అమితబలవంతులైన రాక్షసుల్ని నాపైకి యుద్ధానికి పంపావు. నా ప్రాణాలు రక్షించుకోవడం కోసం నేను వారితో యుద్ధం చేశాను. దేవతలు గాని, రాక్షసులు గాని, అస్త్రములతో, పాశములతో, నన్ను బంధించలేరు. ఇది నాకు బ్రహ్మఇచ్చిన వరము. రాక్షస రాజుని చూడాలనే తలంపుతోనే నేను బ్రహ్మాస్త్రానికి లొంగినట్లు నటించాను. ఒకానొక రాచకార్యం నిమిత్తం నీ దగ్గరికి వచ్చాను.

అమిత శౌర్యపరాక్రమములు కలిగిన శ్రీరాముని యొక్క దూతను నేను. నీ మేలు కోరి కొన్ని మాటలు చెప్తాను విను" అంటూ తొట్రుపాటు లేకుండా రావణుడ్ని ఉద్దేశించి ఇలా అన్నాడు "రావణా నేను వానర రాజైన సుగ్రీవుని సందేశం తీసుకుని నీ దగ్గరకువచ్చాను. సుగ్రీవుడు నీకు సోదరుని వంటివాడు. కనుక జాగ్రత్తగా విను. ఇది ధర్మహితమైనది. ఇహ పరసార్ధకమైనది.

చతురంగ బలములు సమృద్ధిగా కల్గిన దశరథ మహారాజు అనే మహారాజుండేవాడు. అతడు ధర్మపరుడు. సత్యవాది. ఆయన జ్యేష్టపుత్రుడు శ్రీరాముడు. సకల జనరంజకుడు. తండ్రి ఆజ్ఞపై ఆయన దండకారణ్యానికి వెళ్ళాడు. ఆయన సోదరుడు లక్ష్మణుడు, ఆయన ధర్మపత్ని సీత కూడా రాముని వెంట వెళ్ళారు. ధర్మాత్ముడైన రాముని భార్య సీత పతివ్రత, మహాసాధ్వి, విదేహ రాజు కుమార్తె. ఒకసారి ఆమె కనిపించక, రామలక్ష్మణులు ఆమె కోసం వెతుకుతూ ఋష్యమూకానికి వచ్చారు. అక్కడ సుగ్రీవునితో వారికి మైత్రికలిగింది. సుగ్రీవుడు సీతని వెతికించి ఇస్తానని రామునికి ప్రతిజ్ఞ చేశాడు. రాముడు వానర రాజ్యానికి సుగ్రీవుని రాజుని చేస్తానని మాట ఇచ్చాడు. వాలి సుగ్రీవులకి ఘోరంగా పోరు జరుగుతూ వుండగా, రాముడు వాలిని సంహరించి, సుగ్రీవుని వానర రాజ్యానికి రాజుగా అభిషేకించాడు. వాలిని గురించి నీకు పూర్తిగా తెలుసు కదా. అంతటి బలశాలిని రాముడు ఒక్కబాణంతో చంపేశాడు. సత్య ప్రతిజ్ఞుడైన సుగ్రీవుడు, సీతాన్వేషణ కోసం, వానరుల్ని అన్ని దిక్కులకి పంపాడు. కొన్ని కోట్ల వానరులు భూ మండలం అన్ని దిక్కులా సీతమ్మ కోసం వెతుకుతున్నారు.

నాపేరు హనుమంతుడు. వాయుదేవుని కుమారుడ్ని. సీతమ్మ కోసం వెతుకుతూ, నూరు యోజనాల సముద్రం దాటి వచ్చాను. ఇక్కడికి వచ్చి, ఆమె కోసం వెతుకుతూ, లంకంతా తిరిగి నీ భవనానికి వచ్చాను. ఇక్కడ లంకలో ఆమె నాకు కనిపించింది.

నువ్వు శాస్త్రజ్ఞుడివి. ధర్మార్థస్వరూపములు తెలిసిన వాడివి. గొప్ప తపస్సు చేసిన మహాప్రాజ్ఞుడివి. పరుని భార్యని చెరబట్టడం నీకు ఉచితం కాదు. ధర్మవిరుద్ధములైన పనులు హాని కలిగిస్తాయి. నీలాంటి బుద్ధిమంతులు అలా నీచమైన పనులు చెయ్యకూడదు. శరీరానికి చేటు కలిగితే నివారించవచ్చు. కాని పరదారాపహరణ అనేది, నువ్వే లేకుండా చేస్తుంది. సమూలంగా నాశనం చేస్తుంది. రామ లక్ష్మణుల బాణ ప్రయోగం ముందు దేవాసురు లెవ్వరూ నిలువలేరు. రాముని కప్రియం ఆచరించిన వారు బ్రతకడం కల్ల. కనక బాగా ఆలోచించుకో.

సీతమ్మని రాముని దగ్గరకి పంపెయ్యి. దుర్లభమైన సీతా దర్శనం నాకిక్కడ లభించింది. చూడడం వరకే నా వంతు. మిగిలిన పని అంతా మా రాముడు చూసుకుంటాడు. సీత శోక సముద్రంలో మునిగి వుంది. ఆమెని తెచ్చుకున్నానని సంబరపడుతున్నావేమో. కాని ఆమె ఐదు తలల తాచుపాము వంటిదని తెలుసుకోలేకపోతున్నావు. జాగ్రత్త, నీ ప్రాణాలు తీస్తుంది. ఆమెని అనుభవించ దగిన వారు రాముడుతప్ప ఎవ్వరూ లేరు. ఆకలిగొన్న వాడైనా విషాహారం తినకూడదు. ఎందుకంటే అది ప్రాణాంతకం కనుక. నువ్వెంతో కష్టపడి, తపస్సు చేసి, ఎవ్వరి వల్లా చావులేకుండా వరం పొందావు. అంత గొప్ప వరాన్ని చేజేతులారా పాడు చేసుకోవడం అవివేకం. నువ్వు సంపాదించిన వరంలో కూడా నువ్వు ఊహించని ప్రమాదం పొంచి వుంది.

మా ప్రభువైన సుగ్రీవుడు దేవ-అసుర గంధర్వ యక్ష నాగ జాతులలో ఏ జాతికీ చెందిన వాడు కాడు. నువ్వు బ్రహ్మనించి పొందిన వరంలో తిర్యక్కులు, మానవులు లేరు. కనుక సుగ్రీవుడు నిన్ను చంపకుండా ఎవ్వరూ రక్షించలేరు. చావులేకుండా వరంపొందాను కదా అని ధర్మమార్గాన్ని వదిలి, పరదారాపహరణమనే అధర్మాన్ని ఆచరించావు. ధర్మాధర్మ ఫలితాలు ఏకకాలంలోనే అనుభవానికి వస్తాయి. ఇంతకాలం ధర్మఫలంగా అత్యంతవైభవంగా బతికావు. ఇప్పుడు అధర్మఫలంగా నీకు నాశనం తప్పదు. ఇప్పటికైనా నువ్వు ప్రాయశ్చిత్తకర్మచేస్తే అధర్మంవలన కలిగిన పాపం పోతుంది. కనుక సీతమ్మని రామునికర్పించి ప్రాయశ్చిత్తం చేసుకో.

రాముడు ఏకాకిగా జనస్థానంలో పద్నాలుగు వేల మంది రాక్షసుల్ని సంహరించాడు. ఖర దూషణ త్రిశురుల్లాంటి మహా వీరుల్ని మట్టి కరిపించాడు. కొన్ని కోట్ల వానరులకి ప్రభువైన సుగ్రీవునితో రాముడు మైత్రి చేశాడు. ఇవన్నీ ఆలోచించి చూస్తే నువ్వు సీతమ్మనపహరించి తేవడం ఎంత తెలివి తక్కువ పనో నీకే అర్థం అవుతుంది. వానరులు, సుగ్రీవునిదాకా ఎందుకు? నేనొక్కడినే

నీలంకని సమూలంగా నాశనం చెయ్యగలను. కాని మా రాముని ఆజ్ఞ లేకుండా ఆపని చెయ్యను. ఓ రాక్షస రాజా విను. నేను రాముని దాసుడను. నాకు రాముని శక్తి తెలుసు కనుక చెప్తున్నాను. నీ రాజ్యానికి రామదూతగా వచ్చాను. కనుక నీకు హితవు చెప్పే అధికారం నాకుంది. నేనొక సామాన్య వానరుడిని. నాకు మానవులు, రాక్షసులు ఒక్కటే. నా మాట విను. దేవా, సుర, యక్ష, రాక్షస, మానవ, విద్యాధర, గంధర్వ, ఉరగ, సిద్ధ, కిన్నెర పక్షి జాతులలో, సర్వ భూతాలలో, విష్ణుతుల్యుడైన రాముని, ఎదిరించి జయించగలవారెవ్వరూ లేరు. ఇది ఆలోచించి, సర్వలోక ప్రియంకరుడైన రామచంద్రునికి అప్రియము చేసి, బతికి బట్టకట్టలేవని తెలుసుకో. రావణా బ్రహ్మరుద్ర, ఇంద్రులలో నిన్ను ఏ ఒక్కరూ రక్షించలేరు" అంటూ హనుమ ఆవేశ పూరితమైన మాటలతో తన సందేశాన్ని వినిపించాడు.

ఆ మాటలు విన్న రావణుడు భగ్గున మండిపడి కోపంతో కన్నులు గిర గిర తిప్పుతూ " వీణ్ణి చంపేయ్యండి" అన్నాడు ఆజ్ఞాపిస్తూ. రావణుడలా ఆజ్ఞాపించడం అతడి తమ్ముడైన విభీషణునికి నచ్చలేదు.

రావణుణ్ణి మంచి మాటలతో శాంతపరుస్తూ "రాక్షసేంద్రా క్షమించు. శాంతంగా ఆలోచించు. యుక్తాయుక్త విచక్షణ కల్గిన ప్రభువు దూతని చంపరాదు. ఇది రాజధర్మానికి విరుద్ధము. నీ వంటి ధర్మజ్ఞులు చెయ్యవలసిన పని కాదు. ఉచితానుచితాలు బాగా ఆలోచించి దూతకి దండన విధించు" అని విభీషణుడు రావణునికి నీతి బోధచేశాడు. కాని ఆ మాటలు రావణునికి అగ్నిలో ఆజ్యం పోసినట్లు మరింత కోపాన్ని కలిగించాయి.

"నీ సలహా నాకనవసరం. పాపాత్ముల్ని శిక్షించటంలో తప్పులేదు. కనుక నేను ఈ వానరుణ్ణి చంపితీర్తాను" అన్నాడు.

విభీషణుడు అన్నగారి మాటలకి ఆగ్రహించకుండా "లంకేశ్వరా-రాక్షసరాజా శాంతించు. ఒక ధర్మ యుక్తమైన మాట చెప్తాను విను. ఏ శాస్త్రంలోనైనా సరే దూతని చంపరాదన్నది రాజనీతి. అయితే దూతని మనిష్టమైన రీతిలో దండించవచ్చు. ఏదైనా అవయవం తీసెయ్యవచ్చు. లేదా కొరడాలతో కొట్టవచ్చు. గుండు చేయించవచ్చు. వాతలు పెట్టవచ్చు. ఎంత తీవ్రమైన శిక్ష అయినా సరే వెయ్యవచ్చు. కాని దూతను మాత్రం చంపకూడదు. మంచి చెడ్డలు తెలిసిన వాడివి. నీలాంటి మహాత్ముడు కోపానికి లొంగిపోయి అనుచితంగా ప్రవర్తించకూడదు. కోపాన్ని నిగ్రహించుకో. వీనిని చంపటంలో ధర్మవిరుద్ధమే కాదు. మనకి ప్రయోజనం కూడా లేదు. ఎందుకంటే ఇప్పుడితణ్ణి చంపేస్తే అసలు ఇతణ్ణి ఎవరు పంపారో కూడా తెలుసుకునే అవకాశం మనకి లేదు. మనం

అసలు చంపవలసినది ఇతడ్ని పంపిన వారిని. ఈ వానరుడెవరో పంపగా వచ్చాడు. వారు చెప్పమన్న మాటలు చెప్పాడు.

ఇతడు బతికి వుంటే సముద్రాన్ని దాటి వెళ్ళి అక్కడి సంగతులు చెప్తాడు. అపుడు మన అసలు శత్రువు యుద్ధానికి వస్తాడు. ఇప్పుడితడ్ని చంపిస్తే ఈ శతయోజన సముద్రాన్ని దాటి వేరెవ్వరూ రాలేరు. అప్రమేయపరాక్రమ శాలివైన నువ్వు, నీ శత్రువులెవరో తెలుసుకోవాలి. ధైర్యంగా ఎదుర్కోవాలి. యుద్ధం చెయ్యాలి. నీ దగ్గర వీరులు, శూరులు అయిన సేనలు బోలెడున్నాయి. వారిలో ఏ కొద్ది మందిని పంపినా చాలు. ఆ రాజకుమారుల్ని బంధించి తెస్తారు" అని అనునయించి చెప్పాడు.

ఈ మాటలు రావణునికి నచ్చాయి. "నువ్వు చెప్పింది చాలా బాగుంది. దూతని చంపటం అనుచితమైన పనే. కనుక వీడికి చావుతో సమానమైన శిక్ష వేస్తాను. వానరులకి తోకంటే చాలా ప్రీతి కనుక ఆ తోకని నిప్పుతో కాల్చేయండి. కాలిన తోకతోనే, వీడు వెనక్కి వెళ్తాడు. తోకలేని వీనిని చూసి వీడి బంధువులంతా హేళన చేస్తారు. వీనితోకకి నిప్పంటించి ఊరంతా తిప్పండి" అని ఆజ్ఞాపించాడు. రావణుని ఆజ్ఞ వినగానే, రాక్షసిమూకలు ఆనందంగా హనుమంతుని తోకకి, నూలుగుడ్డలు చుట్టారు. వారెప్పుడైతే తోకకి బట్టలు చుట్టటం మొదలు పెట్టారో చిలిపితనంతో హనుమ తోక పెంచటం మొదలు పెట్టాడు. పెరుగుతున్న తోకకి బాగా బట్టలు చుట్టి ఆ బట్టలచుట్టని తోకని నూనెలో బాగా తడిపారు. ఆ తర్వాత నూనెలో తడిసిన ఆ తోకకి నిప్పు అంటించారు. తోక చివర నిప్పు అంటించగానే ఆంజనేయుడు తన తోకతో ఆ రాక్షసుల్ని కింద పడగొట్టాడు.

ఆంజనేయునితోకకి నిప్పు పెట్టారని తెలియగానే, ఊళ్ళో వున్న స్త్రీలు, బాలురు, ముసలి వారు, సంతోషంతో, పరిగెత్తుకుని వచ్చారు. అందరూ కలిసి మారుతిని కదలకుండా గట్టిగా పట్టుకున్నారు. అపుడు హనుమంతుడిలా ఆలోచించాడు.

"నన్ను కట్టిపడెయ్యడం వీరితరం కాదు. ఈ తాళ్ళు తెంపుకుని ఒక్కసారి పైకెగరగలను. వీరందర్నీ చిటెకెలో చంపేయ్యగలను. కాని వీళ్ళు పాపం వీళ్ళ ప్రభువు ఆజ్ఞకి బద్ధులై నన్ను కట్టి గట్టిగా పట్టుకున్నారు. అంత మాత్రాన నాకొచ్చిన నష్టం ఏమీ లేదు. వీర్ని నేను చంపకూడదు. రాముని ఆజ్ఞ లేదు. రాముని కోసం వీళ్ళు చేస్తున్న అవమానాలన్నీ భరిస్తాను. అదీ గాక, ఆ రోజు రాత్రి సమయంలో, లంకంతా తిరిగాను, గాని ఊళ్ళోని వీధులు అవి సరిగ్గా చూడలేదు. వీరిప్పుడు లంకంతా తిప్పితే, బాగా పరిశీలించి, దుర్గాలన్నీ వివరంగా చూస్తాను. వీళ్ళు

నన్ను కట్టినా, నాతోకకి నిప్పుపెట్టినా, నాకేం శ్రమ కలగటం లేదు" అని మనస్సులో అనుకున్నాడు.

హనుమంతుడు తన శక్తినంతా తనలోనే మరుగుపరుచుకుని, పైకి మాత్రం మామూలుగా వున్నాడు. అతడలా వుండే సరికి, ఆ రాక్షసులు మామూలు కోతి అనుకుని, పట్టుకుని కొట్టసాగారు. శంఖాలు వూదుతూ, భేరీలు మోగిస్తూ అట్టహాసంగా ఊరంతా తిప్పసాగారు. వారాడించినట్టల్లా ఆడుతూ హాయిగా ఊరంతా తిరిగాడు మారుతి.

పెద్ద పెద్ద భవనాల్ని, సౌధాల్ని, భూమి భాగాల్ని, విశాలమైన వీధుల్ని, నాల్గు బాటల కూడలి ప్రదేశాల్ని, చతుష్ఠంభమంటపాలూ, అన్ని చోట్లా తిప్పి అక్కడక్కడ నుంచో బెట్టి వానరుడని పరిహసిస్తూ, పరాభవిస్తూ, చారుడని ఎగతాళి చేస్తూంటే ఇండ్లల్లోంచి స్త్రీలు, వృద్ధులు, బాలురు బయటకి వచ్చి విరగబడి చూస్తున్నారు.

జరుగుతున్నదంతా, రాక్షస స్త్రీలు సీతకి పూసగుచ్చినట్లు చెప్పారు.

"సీతా ఇంతకి ముందు నీతో మాట్లాడిన ఎఱ్ఱమూతి కోతికి తోకకి నిప్పంటించి, ఊరంతా తిప్పుతున్నారని" ఎకసెక్కం చేశారు. ఆ మాటలు విన్న సీత చాలా బాధపడింది. ఆంజనేయునికి శుభం కలగాలని, శుచిగా అగ్నిహోత్రుణ్ణి ప్రార్థించింది.

"నేనే మహాపతివ్రతనైతే, నా భర్తని సేవించిన తపఃఫలం నాకుంటే, అగ్ని దేవా.... హనుమంతుని తోకకి బాధకలగకుండా, చల్లబడేటట్లు చెయ్యి. నా మీద దేమునికి దయవుంటే, నా కేమైనా అదృష్టం మిగిలివుంటే, అగ్ని దేవా ఆంజనేయునికి చల్లదనం కలిగించు. అగ్నిదేవా ఆంజనేయునికి బాధ కలుగకుండా చల్లబడు. సత్యమూర్తి, పూజ్యుడు అయిన సుగ్రీవుడు నన్నీ దుఃఖ సముద్రం నించి తరింపజెయ్యాలని ధృడమైన సంకల్పంతో వుంటే, ఓ అగ్నిదేవా చల్లబడు" అంటూ, సీత అనేక విధాల అగ్నిదేవుని ప్రార్థిస్తు వుంటే, ఆమెకి శుభసూచకంగా అగ్నిజ్వాలలు ఆమెచుట్టూ ప్రదక్షిణం చెయ్యసాగాయి. వెంటనే అతడి తోక చల్లబడ సాగింది. హనుమంతుడీ పరిమాణం స్పష్టంగా తెలుసుకున్నాడు. తనకి మంటలు బాధ కలిగించకపోవటం చూసి ఆంజనేయుడు ఆశ్చర్యంతో ఇలా అనుకున్నాడు.

"నిప్పు బాగా ప్రజ్వరిల్లి మంటలు భగ భగమండుతున్నాయి. కాని ఆ మంటలు నన్ను కాల్చటం లేదు. నాకెంత మాత్రం బాధ కలిగించకపోగా తోక చివర చల్లని మంచిగంధం పూసినట్లుంది. కారణమేమిటా అని ఆలోచిస్తే నాకిలా తోస్తోంది. ఆనాడు సముద్రం దాటుతున్నప్పుడు, నన్ను సత్కరించటానికి

కొండపైకి లేచింది. సముద్రుడు, మైనాకుడు, రాముని కార్యంలో నాకు సాయం చెయ్యాలని సిద్ధపడ్డారు. అలాగే ఇప్పుడు అగ్ని హోత్రుడుకూడా రామకార్యంలో సహాయపడాలని అనుకుని వుండవచ్చు. సీతమ్మకి నాపై వున్న జాలి, రాముని తేజస్సు, మా మంత్రికి అగ్నిదేముని తోవున్న స్నేహం, ఇన్ని కారణాల వల్ల ఈ అగ్ని జ్వాలలు నన్ను దహింపటం లేదు" అని తలపోస్తూ ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాడు.

ఆ విధంగా పురప్రవేశ ద్వారం పైకి లంఘించి, సూక్ష్మరూపం ధరించి, తనకి కట్టిన కట్లన్నీ జార్చుకున్నాడు. కట్లన్నీ జారి పోగానే మళ్ళీ భీకర రూపం ధరించాడు. పెద్దగా గర్జించాడు. ఆ సింహాద్వారంపై వున్న పరిఘుని ఒకదానిని లాగి, తనని పట్టుకోబోయిన, రాక్షసుల్ని కొట్టి చంపాడు. ఒక్కసారి లంకనంతా పరికించి చూశాడు. ఏం చేస్తే బాగుంటుందా అని ఆలోచించాడు. ఈ రాక్షస మూక నింకా బాగా ఏడిపించాలి. అశోక వనం ధ్వంసం చేశాను. అతి బలవంతులైన రాక్షసుల్నెందర్నో చంపాను. రావణుని సైన్యంలో కొంతభాగం నష్టమైపోయింది. ఇంకిప్పుడు దుర్గమమైన కోట బురుజులు ధ్వసం చెయ్యాలి. నాతోకకి అంటించిన నిప్పుతో, వీలైనన్ని భవనాల్ని అగ్నికి ఆహుతి చేస్తాను. అదేన్యాయం" అనుకుంటూ, మండుతున్న తోకతో లంకలోని ఒక భవనం మీది నించి మరో భవనం మీదికి దూకటం ప్రారంభించాడు. ఓ ఇంటి మీది నించి, మరో ఇంటి మీదికి ఎగురుతూ, ఉద్యానవనాలు ప్రాసాదాలు చూస్తూ ఎగురుతున్నాడు.

ప్రహస్తుని భవనం, దాని మీదినించి ఎగిరి మహాపార్శ్వుడి భవనం, అక్కడ్నించి వజ్రదంష్ట్రుడి భవనం, తగులబెట్టూ వరసగా, శుకుడు, సారణుడు, ఇంద్రజిత్తు మొదలైన వారందరి భవనాలూ, ఒక్క విభీషణుని ఇల్లు తప్ప, ఇంచుమించు అందరి ఇళ్ళు, తగులబెట్టాక, ఒక్కసారి ప్రళయకాల మేఘంలా గర్జించాడు. గాలి రివ్వున వీస్తుంటే ఇళ్ళన్నీ పరశురామప్రీతి అవుతుండడం చూసి కసిగా నవ్వుకుంటూ, రాక్షస ప్రభువైన రావణుని భవనానికి కూడా నిప్పు పెట్టాడు. గాలి వాటుకి ఆభవనంలో అంతటా అగ్నికోలలు చెలరేగాయి. బంగారు తాపడము చేసి, వజ్రాలు పొదిగిన భవనాలన్నీ కూలి నేలమట్టమైపోతున్నాయి. అంతస్థులుగా వున్న సౌధాలన్నీ విరిగి నేలమీద పడ్తున్నాయి. ఎటు చూసినా హాహా కారాలు చేస్తూ రాక్షసులు పరుగులు పెట్టున్నారు. ఎవరిళ్ళు వారు కాపాడుకోలేక వీధిన పడ్డారు.

కాలిన గోడలనుంచి వజ్రాలు, వైఢూర్యాలు పగడాలు, ముత్యాలు, వెండి, అన్ని వైపులా కాలవలై పారుతున్నాయి. అగ్నిహోత్రుడు ఆబగా, కబళిస్తుండగా,

ఆంజనేయుడు నిర్వికారంగా, నిర్వికామంగా ఆనగరాన్ని తగలబెట్టుతూనే వున్నాడు. అలా ఎంతసేపు తగులబెట్టినా హనుమంతునికి తృప్తి కలగడం లేదు. అగ్ని దేమునికి ఎంత తిన్నా ఆకలి తీరటం లేదు. నేల కూలిన రాక్షసులెందరున్నా భూదేవికి తృప్తి కలగడం లేదు. అంతటా వ్యాపించిన అగ్ని జ్వాలలు ఒక చోట మోదుగ పువ్వులా ఇంకోచోట కుంకుమ పువ్వులా, వెలుగుతున్నాయి. నిప్పుకి ఫట ఫట మని పేలిపోతున్న భవంతుల శబ్దాలతో, దిక్కులన్నీ మారుమ్రోగుతున్నాయి.

ఇంద్రుడో, యముడో, అగ్నిదేముడో రుద్రుడో, సూర్యుడో, కుబేరుడో, ఎవరో ఈ రూపంలో వచ్చి వుంటారు. కాని ఇతడు మాత్రం సామాన్య వానరుడు కాడు. పితామహుడైన బ్రహ్మ, రాక్షసుల్ని నశింపచెయ్యటానికి, ఈ వానరుడి రూపంలో వచ్చాడేమో. లేకపోతే వైష్ణవ తేజస్సు ఇలా వచ్చిందేమో, అని కాలి బూడిద అయిపోతున్న లంకని చూసి, రాక్షసులు అనుకున్నారు.

కాలుతున్న ఇళ్ళల్లోంచి "తండ్రీ, కుమారా, నాయనా, తల్లీ, ప్రాణ సఖీ" అని ఏడ్పులు వినవస్తున్నాయి. ఆంజనేయుని క్రోధాగ్నికి శాపం పొందినట్లు లంకంతా భస్మమై పోయింది. అలా అంతా కాల్చాక, చివరికి హనుమ, త్రికూటగిరి చేరుకున్నాడు. మనస్సులో రాముడ్ని తల్చుకుంటూ నిలబడ్డాడు.

వాయుపుత్రుని పరాక్రమాన్ని దేవతలంతా కొనియాడారు. వేనోళ్ళ స్తుతించారు. లంకాదహనం అయ్యాక మారుతి శాంతించి సముద్ర తీరానికి వెళ్ళి, తోకని సముద్రంలో ముంచి చల్లార్చుకున్నాడు. అప్పుడు మనస్సులో హనుమంతుడు, చాలా చింతిస్తూ "అయ్యో ఎంత ఆలోచనా రహితమైన కార్యం చేశాను.! కోపంలో ఒళ్ళు మర్చిపోయి, చాలా తొందరపడ్డాను. కోపాన్ని నిగ్రహించి, మనస్సుని అదుపులో పెట్టగల్గిన వాళ్ళే పురుషోత్తములు కాదా. కోపానికి లొంగిన వాళ్ళు పాపాలు చెయ్యకుండా వుండలేరు. నేను దుష్టమతిని. సిగ్గులేని వాడిని. ఛీ. ఛీ. నేను చేసిన ఈ అనాలోచితమైన పని వల్ల, సీతమ్మకి కూడా హాని కలిగి వుంటుంది. ఆమెకేమైనా జరిగి వుంటే స్వామి పత్నీ ఘాతకుడ్ని అవుతాను.

లంకంతా కాలిపోయింది. సీతమ్మ కూడా కాలిపోయి వుంటుంది. స్వామి కార్యం నష్టం చేశాను. కనీసం సీతమ్మని రక్షించాలనే ఆలోచనైనా రాలేదు. ఎంతో శ్రమపడి, స్వామి కార్యం నెరవేర్చి, అది రామునికి తెలియజెయ్యాలని తలపోస్తూనే, నా శ్రమనంతా బూడిదలో పోసిన పన్నీరు చేశాను కదా. సీతమ్మ నశించి వుంటుందన్న మాట నిశ్చయం. కనుక నేను కూడా ఇక్కడే ప్రాణత్యాగం చెయ్యడం మేలు. అగ్నిలో దూకి అయినా, సముద్రంలో పడి అయినా ప్రాణం తీసుకుంటాను.

కష్టపడి సాధించిన పని అంతా పాడుచేసి, వెనక్కి వెళ్ళి మా సుగ్రీవ ప్రభువుకి, రామలక్ష్మణులకి నా ముఖమెలా చూపించను? రోషం వల్ల చాలా తొందరపడ్డాను. సీతమ్మని రక్షించాలనే ఆలోచన వదిలి. రజోగుణం వల్ల క్రోధానికి వశుడనై రక్షించలేక పోయాను.

నిజంగా సీతమ్మ మరణించి వుంటే, ఆ శోకంతో రామలక్ష్మణులు మరణిస్తారు. వారి వెంట సుగ్రీవుడు, భరతుడు, శత్రుఘ్నుడు కూడా ప్రాణాలు వదుల్తారు. ఇక్ష్వాకు వంశం నశించిపోతుంది. ప్రజలంతా శోక తప్తులౌతారు. ధర్మార్థాలు చెడగొట్టుకున్న దురదృష్టవంతుడ్ని. లోకానికి వినాశం కల్గించిన వాడిని" అనుకుంటూ అనేక విధాల హనుమంతుడు బాధపడ్డాడు. అంతలో మారుతికి శుభ శకునాలు కనిపించాయి. ఇది వరకు ఇలాంటి శకునాలు కన్పించినప్పుడు బతికి వున్న సీతమ్మని చూడగలిగాడు. ఇప్పుడు కూడా ఆమె తనపాతివ్రత్య మహిమతో దీవించి వుందేమో అనే అనుమానం కలిగింది. అతడిలో చిన్ని ఆశ చిగురించింది.

"ఔను. అంతే అయి వుంటుంది. లోకంలో ఎక్కడైనా అగ్నిని అగ్ని దహిస్తుందా? ధర్మాత్ముడైన శ్రీరాముని ఇల్లాలు. మహాపతివ్రత, ఆమెని అగ్ని దహించగలదా? సీతారాముల ప్రభావం వల్లనే కదా అగ్ని నన్ను కాల్చలేదు. కనుక రాముని ప్రాణపత్ని అయిన సీతకి నాశనం కల్గడం అసంభవం" అని మారుతి తనలో తానే తర్కించుకుంటుండగా ఆకాశంలోంచి చారణులు ఇలా అనుకుంటుడటం వినిపించింది.

"ఆహా ఏమి ఆశ్చర్యం! ఎవ్వరూ చెయ్యలేని పనిని హనుమంతుడు చేశాడు. లంకని కాల్చి భస్మం చేశాడు. రాక్షసులు బాటలపై పరుగులు తీసుకున్నారు. కాని సీతమ్మకి మాత్రం కించిత్తు కూడా హాని కలగలేదు. ఎంత అద్భుతం!" అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఒక వంక శుభశకునాలు, వేరొక వంక, ఋషుల పలుకులు. హనుమంతునికి మనశ్శాంతి ఇచ్చాయి. సీత సుఖంగా వుందని తెలిశాక మరొక సారి ఆమె దర్శనం చేసుకుని వెళ్ళాలనిపించింది. వెంటనే అశోకవనానికి వెళ్ళాడు. యథా ప్రకారం శింశుపావృక్షం కింద సీత కూర్చుని వుంది. ఆంజనేయుడు పరమానంద భరితుడై, "అమ్మా నా భాగ్యవశాన, సుఖంగా వున్న నిన్ను చూడగలిగాను మరి సెలవు" అన్నాడు.

వెళ్ళబోతున్న హనుమంతుని చూసి భర్త యందలి అనురాగంతో మళ్ళీ సీత ఇలా అంది.

"కుమారా కార్యసాధకుడివయ్యా. నీ బలం చాలా గొప్పది. రామచంద్రుని అతి శీఘ్రంగా వచ్చి లంకని జయించి నన్ను తీసికెళ్ళమనీ, ఇదే తక్షణ కర్తవ్యం అనీ చెప్పు. ఆయన శక్తి సామర్థ్యాలు, పరాక్రమం ఇంకోసారి గుర్తు చెయ్యి అని వాత్సల్యంగా అంది.

అపుడు హనుమ "అమ్మా ధైర్యంగా వుండు. యుద్ధంలో శత్రువుని వధించి నీ భర్త నీకు ప్రియం చేకూరుస్తాడు. నీ శోకం తొలగిపోతుంది. అని సీతనోదార్చి, ఆమెకి నమస్కారం చేసి బయల్దేరడానికి సిద్ధమయ్యాడు. అరిష్టము అనే పర్వతం ఎక్కి పరికించి చూశాడు. సూర్యకిరణాలు పడి ఆ సముద్రం మెరిసిపోతోంది. హనుమ తన కుడిపాదం మోపగానే ఆ పర్వతం కాస్త కృంగినట్లనిపించింది. ఆపర్వతం మీద నివశిస్తున్న యక్షులు, గంధర్వులు మొదలైన వాళ్ళు భూకంపం వచ్చిందా అని ఆశ్చర్యపోయారు. ఆ పర్వత శిలలు పిండి పిండి అయ్యాయి. ఉత్తరాభిముఖంగా నిలిచాడు. శరీరాన్ని అతి భీకరంగా పెంచాడు. కెరటాలతో ఎగిసి పడ్తున్న సముద్రాన్ని చూశాడు. రెండు చేతులు చాచి ఆకాశంలోకి ఎగిరాడు. ఆ ఊపుకి అరిష్టమనే ఆ పర్వతం భూమిలోకి దిగబడి నేలమట్టమైపోయింది. మేఘమాలికలను ముందుకి లాగుతూ వాయువేగంతో ఆకాశమార్గాన ప్రయాణం సాగించాడు మారుతి. మబ్బులలో దూరి బయటకి వస్తూ మబ్బుల మాటున దోబూచులాడుతున్న చందమామలా సాగిపోతున్నాడు. అలా గాలిలో గరుత్మంతునిలా తేలిపోతూ గంభీరంగా గర్జించాడు.

లంకలో రాక్షసుల్ని చంపి, తన పేరు లంకంతా చాటి చెప్పి, రావణుని సంకట స్థితిలో పడేసి, సైన్యాన్ని చితకకొట్టి, సీతమ్మకి నమస్కరించి, లంకంతా కాల్చి బూడిద చేసి ఎన్నెన్నో ఘన కార్యాలు సాధించిన మారుతి, వాయు నందనుడు. సముద్ర మధ్యంగా ఆకాశంలోసాగిపోతున్నాడు. వింటి నారినించి సంధించి వదిలిన బాణంలా దూసుకుపోతున్నాడు. అలా సాగిపోతూ దారిలో మైనాకుని స్పృశించాడు. కొంచెం ముందరకి వచ్చి మహేంద్ర పర్వతాన్ని చూశాడు. చూడగానే ఎక్కడ లేని ఉత్సాహంతో పది దిక్కులు మారు మ్రోగేలా గర్జించాడు. తోక ఝాడించాడు. మిత్రుల్ని చూడబోతున్నానని పరమానందం పొందాడు. ఆ గర్జన ధ్వనికి ఆకాశం పగిలిపోతుందేమో అనిపించింది.

ఆంజనేయుని కోసం సముద్ర తీరంలో నిరీక్షిస్తున్న వానరులు గంభీరమైన ఆ ధ్వనినీ, అతడు ఆకాశమార్గంలో ప్రయాణం చేస్తున్నప్పుడు అతడి తొడల కదలికల వల్ల వచ్చే ధ్వనినీ విన్నారు. దీన వదనాలతో ఖిన్నులై వున్న వారు ఆ గర్జన వినగానే ఒక్కసారి ప్రాణం లేచి వచ్చినట్లు ఉత్సాహంతో లేచి నిలబడ్డారు.

జాంబవంతుడు తన మిత్రుల్ని పిల్చి "మిత్రులారా మన హనుమంతుడు కార్యం సాధించుకు వస్తున్నాడు. అందులో సందేహం లేదు. కార్యసాధన కాకుండా మారుతి అలా గర్జించడు" అన్నాడు. అందులో సందేహం లేదు. ఆ మాటలకి వానరులంతా హర్షధ్వానాలు చేశారు. వాళ్ళు హనుమంతుని చూడాలనే ఆరాటంలో ఒక పర్వతం మీంచి ఇంకో శిఖరం మీదికీ, ఒక చెట్టు మీద నించి ఇంకో చెట్టు మీదికి ఎగురుతూ దూకుతూ ఆకాశంలోకి నిక్కి, నిక్కి చూస్తున్నారు. చెట్ల కొమ్మలు ఊపారు. వారి కోలాహలం విన్న ఆంజనేయుడు మరింత గంభీరంగా గర్జించాడు. ఆకాశంలో హనుమంతుడు కనిపించగానే, మరింత గంభీరంగా గర్జించాడు, కనుక కార్యసాధనచేసే వచ్చివుంటాడని భావించి అతడి మిత్రులంతా చేతులు జోడించి నమస్కరించారు. వరసగా బారులు తీరి నుంచున్నారు. అప్పుడు హనుమంతుడు మరింత పర్వతాకారంలో మహేంద్రగిరిపై వచ్చి వాలాడు. మిత్రుల్ని చూసిన ఆనందంతో అతడి శరీరం మనసు పొంగిపోయాయి. మహేంద్రగిరి మీద మారుతి పాదంమోపటమే ఆలస్యం. వానరులంతా వచ్చి చుట్టూ మూగారు. ఎంతో ఆనందంతో తియ్యని ఫలములు కందమూలాలు కానుకగా తెచ్చారు.

హనుమంతుడు జాంబవంతుడికి, అంగదుడికి, ఇతర పెద్దలకి నమస్కరించాడు. వారంతా మెచ్చుకుంటుంటే "నేను సీతమ్మని చూశాను" అన్నాడు. ఆ వాక్యం చెప్పాక, మహేంద్రగిరి మీద ఒక్క చక్కని ప్రదేశంలో అంగదుని చెయ్యి తన చేతితో పట్టుకుని కూర్చున్నాడు మారుతి. అతడేం చెప్తాడా అని వానరులంతా చెవులు రిక్కించి వినటానికి సిద్ధంగా కూర్చున్నారు. తన అనుభూతి వాళ్ళందరికీ చెప్పాలని ఉబలాటపడ్తూ పావని,

"మిత్రులారా, సీతమ్మ లంకలో భయంకరమైన రాక్షసులు కాపలా కాస్తూండగా అశోకవనంలో కనిపించింది. ఏకవేణి ధరించి, ఉపవాసాలతో కృశించి, జడలు కట్టిన జుత్తుతో, మాసిన వస్త్రములతో, శరీమంతా ధూళి నిండి, శోక సాగరంలో మునిగి వుంది" అని చెప్పాడు. హనుమంతుడు సీతమ్మని చూసిన వృత్తాంతం చెప్తుంటే, వానరులు పొంగిపోయారు. ఆ మాటలు వినగానే కొంతమంది సింహనాదం చేశారు. కొందరు ఆనందంతో అరిచారు. కొందరు రంకెలేశారు. ఇంకా కొంతమంది ఆనందంతో కిలకిల ధ్వనులు చేశారు. ఇంకొంతమంది తోకలు నేలకేసి కొట్టారు. ఇలా ఎవరికి తోచినట్లు వాళ్ళు ఆనందం వ్యక్తం చేశారు. అంగదుడు హనుమంతుని మెచ్చుకుంటూ, ఇలా అన్నారు. "వానరోత్తమా బలములో గాని, వీర్యంలో గాని, నీకు సరియైన

వాడింకొకకడు లేడు. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని అవలీలగా దాటి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చావు. ఆహా ఏమి నీ స్వామి భక్తి! నీధైర్యము, నీ పరాక్రమము అద్భుతమైనవి. అదృష్టవంతుడివి కనుక, యశోమూర్తియైన శ్రీరాముని ఇల్లాల్ని చూడగలిగావు. సీతమ్మ ఎడబాటు వల్ల కలిగిన దుఃఖం ఇంక రామునికి ఉపశమిస్తుంది" అన్నాడు.

హనుమ, అంగదుడు, జాంబవంతుడు, ఎత్తైన శిఖరాల మీద కూర్చున్నారు. అపుడు హనుమ తీరికగా, సముద్ర లంఘన వృత్తాంతం, లంకా దర్శనము, అన్నీ వివరంగా ఒకదాని తర్వాత ఒకటి, చెప్పడం మొదలుపెట్టాడు. వానరులంతా చేతులు జోడించి నుంచున్నారు. అపుడు జాంబవంతుడిలా అడిగాడు.

"హనుమా అసలు నువ్వు సీతమ్మనెలా చూశావు? అక్కడ ఆమె ఎలా వుంది? దుష్టుడైన రావణుడామె పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడు? ఈ విషయాలన్నీ వివరంగా చెప్పు" అన్నాడు.

అన్ని విషయాలు తెలుసుకున్నాక, తర్వాత ఏం చెయ్యాలి? రామునితో ఏ విషయాలు చెప్పవచ్చు. ఏవి చెప్పకూడదు. ఆలోచిద్దాం" అన్నాడు. మళ్ళీ జాంబవంతుని మాటలు విన్న ఆంజనేయస్వామికి ఒళ్ళు గగుర్పొడిచింది. ఆనందంతో ఇలా చెప్పటం మొదలుపెట్టాడు.

"ఆ రోజు మీ అందరి సమక్షంలో మహేంద్రగిరి శిఖరం మీద నించి, సముద్రం యొక్క దక్షిణ తీరానికి ప్రయాణమై వెళ్ళాను కదా. అలా ఆకాశంలో వెళ్తుంటే బంగారుశిఖరాలుకల్గిన పర్వతం ఒకటి నాదారి కడ్డుగా నిల్చింది. అది నా ప్రయాణానికి విఘ్నం కలిగిస్తుందేమో అని భయపడ్డాను. కాని అది నన్ను ప్రేమగా "కుమారా" అని పిల్చి, తన పేరు మైనాకుడనీ, రామకార్యంలో సహాయం చెయ్యాలనే సంకల్పంతో రాముని దూతగా వెళ్తున్న నన్ను కొద్దిసేపు తనపై విశ్రమించి తియ్యని ఫలములు, కందమూలాలు ఆరగించి సేదదీరి వెళ్ళమని అభ్యర్థించింది.

నేను కూడా నేను లంకకి వెళ్తున్న వృత్తాంతమంతా వివరించి చెప్పి, విశ్రాంతి తీసుకునే సమయం నాకు లేదనీ, నన్ను వెళ్ళనివ్వమనీ కోరాను. ఆయన అనుమతిపై ముందుకి సాగాను. కొంతదూరం వెళ్ళాక సురస అనే నాగదేవత కనిపించింది. నన్ను ఆహారంగా భోజనం చేస్తానంటూ పది యోజనాల వెడల్పున నోరు తెరచింది. నేను నా శరీరం పెంచాను. ఆమె తన నోరు కూడా ఇంకా పెద్దగా పెంచింది. ఇలా పెంచి పెంచి ఆమె తన నోరునూరు యోజనాలు చేశాక

నేను నాశరీరం అంగుష్ట మాత్రంగా కుదించి ఆమెనోటిలో ప్రవేశించి బయటకి వచ్చాను. ఆమెనా తెలివిని మెచ్చుకుని నా కార్యం సిద్ధించేటట్లు దీవించింది.

నేను మళ్ళీ గరుత్మంతునిలా ప్రయాణం సాగించాను. సముద్ర మధ్యంలోకి వెళ్ళేసరికి సింహిక అనేక ఛాయా గ్రహరాక్షసి నా నీడపట్టి లాగసాగింది. నేనుకూడా ఆమెని పట్టుకుని ఆమె ఉదరంలోదూరి హృదయం చించి బయటకి వచ్చాను. ఆమె చావగానే ఋషిగణాలు పంచభూతాలు నన్ను చాలా ప్రశంసించారు.

మళ్ళీ ప్రయాణం చేసి దక్షిణ సముద్రం ఒడ్డుకి చేరాను. రాత్రి అయిందాకా వేచి వుండి రాత్రి అయ్యాక లంకలో ప్రవేశించాను. అలా లంకలో అడెగుపెట్టానో లేదో "లంకిణి" అనే స్త్రీ వికటాట్టహాసం చేస్తూ నా ముందు నిల్చింది. అది నన్ను చంపాలని చూసింది. కాని నేను ఒక్క గుద్దు గుద్ది దాన్ని మట్టి కరిపించాను. అప్పుడది "ఓ వానర వీరా నేను లంకాధిష్టాన దేవతని నన్ను జయించావు కనుక ఇంక రాక్షసుల్ని కూడా జయించగలవు. లంకలో కెళ్ళి నీ ఇష్టం వచ్చినట్టు తిరుగు" అంది. నేను ప్రదోషసమయంలో లంకలో ప్రవేశించాను. రావణ అంతఃపురంతో సహా లంకంతా గాలించి వెతికాను. కాని సీతమ్మ జాడ తెలియలేదు. నాకు చెప్పలేని దుఃఖం కలిగింది. అలా దుఃఖిస్తూ వనాలన్నీ తిరుగుతూ అశోకవనంలోకి వెళ్ళి ఒక శింశుపా వృక్షం ఎక్కి అశోకవనమంతా కలయ చూశాను. అప్పుడు ఆ వృక్షం కింద సీత కనిపించింది.

కృశించి, కాంతి తగ్గి దీనురాలై మాసిన బట్టలు ధరించి, చాలా దయనీయమైన స్థితిలో వుంది. ఆమె చుట్టు నరబక్షకులైన రాక్షసులుకాపలా వున్నారు. అంతలో తెల్లవారబోతుండగా స్త్రీ పరివారంతో సహా రావణుడు అక్కడికి వచ్చాడు. చాలా వైభవోపేతంగా వున్నాడు. వాడ్ని చూడగానే సీతముడుచుకుని కూర్చుంది. రావణుడు సీతని తనకి లొంగిపొమ్మని అనేక విధాల బ్రతిమాలి, బెదిరించి, చాలా ప్రయత్నాలు చేశాడు. కాని సీతరాముణ్ణే ధ్యానిస్తూ వాణ్ణి అనేక విధాల దుర్భాషలాడింది. వాడు కళ్ళల్లో నిప్పులు కురిస్తూ ఇంక రెండు నెలలు వ్యవధి ఇస్తున్నాననీ ఆ రెండు నెలలోపూ ఆమె తనని వరించకపోతే ఆమె రక్తం తాగుతానని, చంపి ఆహారంగా వండించుకు తింటాననీ బెదిరించి వెళ్ళిపోయాడు. సీత చాలా సేపు దీనంగా విలపించి ఆత్మహత్యకి సిద్ధపడింది. రాక్షస స్త్రీలంతా పడి నిద్రపోసాగారు. నేను మెల్లిగా రామకథాగానం చేస్తూ చెట్టుపై నించి ఆమె ముందుకి వెళ్ళాను. నేను రాక్షసుడనేమో అని, కామరూపంలో వచ్చాననీ ఆమె చాలా భయపడింది. కాని నేను ఆమెకి విశ్వాసం కలిగించే మాటలు చెప్పి, రామసుగ్రీవులమైత్రి గురించి చెప్పి రామదూతగా వచ్చానని వివరించి శ్రీరాముడు

తన గుర్తుగా ఇచ్చినా అంగుళీయకం చూపించాను. ఆమె నన్ను నమ్మింది. నా వీపుపై కూర్చుంటే రాముని సన్నిధికి చేరుస్తానన్నాను. ఆమె ఒప్పుకోలేదు. ఆమెని నేను చూసినందుకు గుర్తుగా ఏమైనా ఇమ్మని అడిగాను. ఆమె తన చూడామణిని ఇచ్చింది. "నాయనా ఇంక రెండు నెలలోపుల రాముని వచ్చి నన్ను తీసికెళ్ళమని చెప్పు, లేకపోతే నేను దిక్కులేని చావు చస్తానని చెప్పు" అంది. ఆ మాటలు వినగానే నాకు రావణునిపై చెప్పలేని కోపం వచ్చింది. అప్పుడు నా శరీరం పర్వతంలా పెంచి అశోకవనమంతా ధ్వంసం చేశాను. రావణుడు నా మీదికి చాలా మంది రాక్షసుల్ని పంపగా వారందర్ని చిత్తు, చిత్తుగా చంపాను. రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు వచ్చి నా మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. నేను లొంగినట్టు నటించాను.

వాళ్ళంతా నన్ను తాళ్ళతోకట్టి రావణుని కొలువు కూటానికి తీసికెళ్ళారు. రావణుడు నన్ను ఎక్కడ్నించి వచ్చానో చెప్పమని అడిగాడు.

నేను సుగ్రీవుడు పంపగా, రామదూతగా సీతమ్మ కోసం వచ్చానని చెప్పాను. సీతమ్మని రాముని కప్పగించి క్షమాభిక్ష కోరమనీ, లేకపోతే నీతో బాటు లంకంతా సర్వనాశనమై పోతుందని, హితవుబోధించాను. వాడు నావంక కోపంగా చూస్తు నన్ను చంపెయ్యమని ఆజ్ఞాపించాడు. కాని రావణుని సోదరుడు విభీషణుడుఅనే ధర్మజ్ఞుడున్నాడు. అతడు దూతని చంపటం రాజనీతి కాదన్నాడు. ఎన్నో విధాల బోధించగా ఆఖరికి రావణుడు నా తోకని కాల్చమని ఆదేశించాడు. వెంటనే రాక్షసులు నారబట్టలు, నూలు చుట్టి నాతోకకి నూనెతో తడిపి దానికి నిప్పంటించారు.

నేను మండుతున్న నాతోకతో లంకలోని భవనాలు, మిద్దెలు, మేడలు తగులబెట్టాను. లంకంతా కాలి బూడిద అయ్యింది. అంతలో శింశుపావృక్షం కింద కూర్చున్న సీతమ్మ కూడా అగ్నికి ఆహుతి అయిపోయిందేమో అని చాలా ఆందోళన పడ్డాను. కాని మహాపతివ్రత అవటం వల్ల ఆమెకేమీ ప్రమాదం కలగలేదని తెలిసి నా మనస్సు కుదుటపడింది. మళ్ళీ ఆమెని దర్శించి, ఆమె వద్ద సెలవు తీసుకుని మిమ్మల్ని చూద్దామనే ఉత్సాహంతో అరిష్టమనే పర్వతం ఎక్కి ఆకాశంలోకి ఎగిరి బయల్దేరి వచ్చాను" అంటూ తను బయల్దేరినప్పట్నించీ జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్లుగా తన అనుభవాలు వర్ణించి చెప్పాడు మారుతి. కొంత తడవు ఆయాసం తీర్చుకుని

"మిత్రులారా దైవకృప చేత రాముని కార్యం సఫలమైంది. సుగ్రీవుని ఆందోళన తగ్గింది. సీతమ్మ పాతివ్రత్యం చూసి నా మనస్సు ఆమెకి దాసోహమైంది.

రావణుడు గొప్ప తపస్సంపన్నుడు. కనుకనే మహాపతివ్రత అయిన సీతని తాకినా అతడు దగ్ధమవలేదు. 'మీకందరికీ జరిగిన సంగతి వివరించి, సీతమ్మని వెంటపెట్టుకుని వచ్చి రామలక్ష్మణులను దర్శించడం ఉచితమని నా అభిప్రాయం. నేనొక్కడ్నే రాక్షస సమేతంగా లంకని దహించి, రావణుని చంపగలను. అలాగే జాంబవతాది మహావీరులెందరో వున్నారు. సీత శోకపరాయణురాలై వుంది. ఆమెని రక్షించటానికి ఏదో ఒకటి చెయ్యాలి" అన్నాడు.

అపుడు అంగదుడు "సీతమ్మ జాడ తెలిశాక కూడా మనం ఆమెని తీసికెళ్ళకుండా రాముని దగ్గరకెళ్ళటం ఏమీ బాగుండదు. వీరంతా మహావీరులై వుండి కూడా సీతని చూసి మాత్రం వచ్చారు. తీసుకురాలేదని రాముడు అపార్థం చేస్కోవచ్చు. మన మిత్రుడైన ఆంజనేయుడు కొంతమంది వానర వీరుల్ని చంపాడు కదా. సముద్ర లంఘనలో, పరాక్రమంలో మనం అతడి కేం తీసిపోము. కనక జానకికి తీసికెళ్ళతమే ఉచితము" అన్నాడు.

అంగదుని వలుకులు విని కుశలబుద్ధి అయిన జాంబవంతుడు "రాజకుమారా, మీరనుకుంటున్నట్లు సీతని తీసికెళ్ళటం ఉచితం కాదు. మనకి సామర్థ్యం ఉన్న మాట నిజమే. కాని తొందర పడకూడదు. రాముని ఆలోచన ఎలా వుందో తెలుసుకుని ఆయన ఆజ్ఞ ప్రకారం చెయ్యటం మన కర్తవ్యం" అన్నాడు. ఆయన మాటలందరికీ నచ్చాయి.

వెంటనే వారంతా మహేంద్రగిరి విడిచి కిష్కింధవైపు ప్రయాణమయ్యారు. ఏనుగుల గుంపుల్లా ఆకాశంలో కదిలారు. ఆనంద సాగరంలో మునిగి పొంగిపోతున్నారు. ఎవరి మట్టుకు వారే ఈ శుభవార్త రామునికి ముందుగా చెప్పాలని ఉవ్విళ్ళూరిపోతున్నారు. యుద్ధం వస్తే చెయ్యడానికి సిద్ధంగా వున్నారు. రాముడికి రావణుడు చేసిన అపకారానికి ప్రతీకారం చెయ్యాలనే పట్టుదలతో వున్నారు.

అలా ఆకాశంలో తేలి ప్రయాణం చేసి సుగ్రీవుని ప్రీతికరమైన మధు వనంలో దిగారు. అది చాలా కట్టుదిట్టంగా ఎవ్వరూ ప్రవేశించలేనంత పటిష్టంగా వుంది. సుగ్రీవుని మేనమామ అయిన దధిముఖుడు అనే వానర రాజు మహా పరాక్రమశాలి. ఆ వనాన్ని రక్షిస్తూ వుంటాడు.

అటువంటి మధు వనంలో ప్రవేశించి వారు చాలా ఆనందం పొందారు. మధువనంలోని తేనెని త్రాగటానికి అనుమతి ఇయ్యమని యువరాజైన అంగదుని అడిగారు. వెంటనే వారి కనుమతి ఇచ్చాడు అంగదుడు. వాళ్ల ఆనందానికింక

అంతులేదు. వారంతా సంతోషంతో నాట్యం చెయ్యసాగారు. కొందరుపాటలు పాడారు. కొందరు పక పకా నవ్వారు. కొంత మంది పల్టీలు కొట్టున్నారు. గిర గిర తిరుగుతూ పరుగులు తీస్తున్నారు. చెట్ల మీదుగా గంతులేస్తున్నారు. ఇలా ఇంకా ఎన్నెన్నో వింత వింత చేష్టలు చేశారు. వారంతా మధువు త్రాగి, కైపెక్కి మత్తులో చిందర వందర అయ్యారు. బాగా తాగి, ఆవనంలో చెట్లన్నీ పాడు చేసి పూలు మొగ్గలు తెంపేసి, కాయలు కోసేసి, కొమ్మలన్నీ విరిచి, నానా భీభత్సం చేశారు. అదిచూసి రధి వక్త్రుడు కోపంతో, వారి మీద గట్టిగా అరిచాడు. కొందరిని అరిచేతితో చరిచాడు. కాని వారే విధంగానూ లొంగలేదు. దాంతో కాళ్ళబేరానికి వచ్చి వనాన్ని ధ్వంసంచెయ్యవద్దని బ్రతిమాలాడు.

కాని వానరులంతా మధువు త్రాగిన కైపులో వున్నారు. అతణ్ణెంత మాత్రం లక్ష్యపెట్టకుండా గేలి చేశారు. చేతులు పట్టుకులాగుతూ, గోళ్ళతో గీరుతూ, పళ్ళతో కొరుకుతూ, కాళ్ళతో కుమ్ముతూ అనేక విధాల బాధపెట్టసాగారు. అంతటితో వదలకుండా, ఇంకా ఎక్కడైనా వనంతో పాడవని ప్రదేశాలు మిగిలి వుంటే అవన్నీ పాడుచేశారు. అప్పుడు హనుమంతుడు వానర వీరులందర్నీ ఒక చోటికి పిల్చి, "మీరు ఇష్టం వచ్చినంత మధువు త్రాగండి. ఎవరైనా అడ్డగిస్తే నేను చూసుకుంటాను" అని భరోసా ఇచ్చాడు. ఆ మాటలు విన్న యువరాజు అంగదుడు చిరునవ్వుతో "మారుతి చెప్పినట్లే చెయ్యండి" అన్నాడు. ఇంక వానరుల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

వనపాలకుల్ని పక్కకి తోసేసి, అందినంత మధువు తాగుతూ, తియ్య తియ్యని ఫలములన్నీ కోసుకుని కడుపారా తినసాగారు. వన పాలకులు అడ్డగిస్తే వాళ్ళని చావ చితకబాదారు. పెద్ద పెద్ద తేనె పట్లు దింపి, పీల్చి పిప్పి చేసి పడేస్తున్నారు. కడుపులు నిండినా కూడా మిగిలిన తేనెపట్లు లాగి పడేసి కాళ్ళతో చితక్కొట్టసాగారు. ఖాళీ అయిన మైనం పట్లు ఒకళ్ళమీదికి ఒకరు విసురుకుంటున్నారు. దధిముఖుడు సేవకుల్ని వారి మీదికి పంపిస్తే వెనక్కి తిరిగి తోక చూపించి వెక్కిరిస్తున్నారు. వారు చేసేది లేక దధిముఖుని దగ్గరకి వెళ్ళి సంగతంతా వివరించారు. దధిముఖుడు మండిపడ్తూ వనంలోకి వెళ్ళి చూస్తే వానరులు అల్లరి చేసి అలసిపోయి చెట్లకింద నిద్రపోతున్నారు. అప్పుడు దధిముఖుడు కోపం పట్టలేక వారిని చావగొట్టమన్నాడు. వెంటనే అతడి సేవకులు, పెద్ద పెద్ద బండరాళ్ళు తెచ్చి వారి మీద ఎత్తి పడేశారు. వానరులు భయంతో లేచి పారిపోయారు. అది చూసి అంగదుడు రోషంతో దధిముఖుని కొట్టాడు. నేలమీదికి తోసి కసిగా కుమ్మిపడేశాడు. దధిముఖుడు తెలివి తప్పి పడిపోయాడు.

కొంతసేపటికి తెలివి వచ్చాక, కొంతమంది అనుచరులతో కలిసి ఆకాశంలోకి ఎగిరి సుగ్రీవుని దగ్గరకి వెళ్ళాడు. దీనాతి దీనంగా రోదిస్తూ సుగ్రీవుని పాదాలపై పడి జరిగిన సంగతి అంతా వివరించి చెప్పాడు. ఆ సంగతి విన్న సుగ్రీవుడు ఆనందంతో పక్కనే వున్న రామలక్ష్మణుల వైపు తిరిగి,

"దక్షిణ దిశగా సీతమ్మని వెతుకుతూ వెళ్ళిన వానరులు తిరిగి వచ్చి మధువనాన్ని ధ్వంసం చేశారట. దీనిని బట్టి వారు సీతమ్మని చూసి వచ్చి వుంటారని అనుకుంటున్నాను. లక్ష్మణా సీతమ్మని సాక్షాత్తు మన హనుమంతుడే చూసి వచ్చాడని నేననుకుంటున్నాను. హనుమంతుడు తప్ప వేరెవరూ ఆకార్యాన్ని సాధించలేరు. సీతమ్మని చూసి వచ్చారు కనకనే వారు మధు వనంలో ప్రవేశించగలిగారు. లేకపోతే వారికంతటి ధైర్యం లేదు" అని చెప్పాడు.

ఆ మాటలు విన్న రామలక్ష్మణులు అమితానందం పొందారు. సుగ్రీవుడు దధిముఖునితో "ఆర్యా-కార్యం సాధించుకు వచ్చారు కనుకనే వారు మధువనం పాడుచేశారు. కనుక వారిని మనం క్షమించవచ్చు. నాకు చాలా సంతోషంగా వుంది. వారెక్కడ వున్నారు? నేను వెంటనే వాళ్ళని చూడాలి. సీతమ్మని వారెక్కడ చూశారో, ఎలా చూశారో తెలుసుకోవాలి" అని దధిముఖునితో సుగ్రీవుడు చెప్తుంటే ఆనందంతో రామలక్ష్మణుల కన్నులు మెరిశాయి.

దధిముఖుడు కూడా సుగ్రీవుని మాటలకి సంతోషించి తాను వెళ్ళి వెంటనే వారిని పంపిస్తానని వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని ప్రయాణమయ్యాడు. మధు వనానికి వెళ్ళి వానర సేనల్ని చూశాడు. అప్పటికి వారికి కాస్త మత్తు దిగింది. దధిముఖుడ్ని చూసి వాళ్ళు కాస్త కంగారు పడ్డారు. అంగదుడి దగ్గరకి వెళ్ళి చేతులు జోడించి దధిముఖుడిలా అన్నాడు.

"సౌమ్యా- మా సేవకులుకి తెలియక సుగ్రీవుడి దగ్గరకి వెళ్ళి మీ మీద పితూరీలు చెప్పారు. కాని ఆ మాటలు విని ఆయన కోపించక పోగా చాలా సంతోషించాడు. మీ అందర్ని వెంటనే తన దగ్గరకి పంపమని అన్నాడు. ఆ మాటలు విన్న అంగదుడు తోటి వారితో "మిత్రులారా ఈ సంగతి రాముని క్కూడా తెలిసే వుంటుంది. మనమింక ఆలస్యం చెయ్యటం మంచిది కాదు. మీరంతా తృప్తిగా మధువు సేవించి, విశ్రాంతి తీసుకున్నారు. నేను యువరాజుని కదా మిమ్ము ఆజ్ఞాపిస్తున్నానని అనుకోకండి. మనం వెంటనే సుగ్రీవుని దగ్గరకి వెళ్తే బాగుంటుంది" అన్నాడు.

వానరులంతా సరే అన్నారు. వెంటనే వాళ్ళు ఆకాశంలోకి ఎగిరి, పర్వత

శ్రేణుల్లా ఆకాశమంతా ఆక్రమించారు. గంభీరంగా గర్జించారు. ఎప్పుడైతే గగన వీధిలో వీరి గర్జనలు వినిపించాయో అప్పుడు సుగ్రీవుడు రామునితో,

"రామచంద్రా ఇంక కొంచెం ఓరిమి వహించు. నీకు శుభప్రదమైన సమయం వచ్చింది. మన వానరులు సీతమ్మని చూపి వచ్చారనడంలో సందేహం లేదు. ముఖ్యంగా అంగదుడు కార్యసిద్ధికాకుండా నా దగ్గరకి రాడు. అంతేగాక మధువనం పాడుచేశామన్న భయం కూడా వారికి లేదు. అంటే వారు చాలా ఉల్లాసంగా ఉన్నారన్న మాట. సీతమ్మని చూసిన ఆనందంలో వారా అకృత్యం చేశారు. అంతేగాని మామూలుగా వారంతటి సాహసం చెయ్యలేరు. ఆంజనేయునికి పట్టుదల, పరాక్రమం బుద్ధి-కార్యసాధన అన్నీ వున్నాయి. కనుక నువ్వింక నిశ్చింతగా వుండు" అని రాముణ్ణి సుగ్రీవుడు ఓదారుస్తుండగానే, కిల కిలా రావాలతో, సింహగర్జనలతో, వానర సేనలు ఆకాశంలో గుంపులు, గుంపులుగా కనిపించారు. ఆ ధ్వనులు వింటున్న సుగ్రీవుడు ఆనందంతో తోక నిక్కబొడుచుకుని చూశాడు.

అంగదుడు, హనుమంతుడు ముందుగా, ఆ వెనక వానర సేన నేలమీద దిగి నిలాచారు. హనుమంతుడు శిరస్సు వంచి రామునికి నమస్కరించి, "ప్రభూ సీతమ్మ సుఖంగా వుంది. చాలా నియమశీలియైన ఆమెని నేను చూశాను" అన్నాడు. ఆ మాటలకి సుగ్రీవుడు చాలా ప్రసన్నమయ్యాడు. రాముడు ఆనందంతో ఒళ్ళు మరచిపోయాడు. అయితే వానరసేనంతా ఎవరి మట్టుకు వారు రాముడితో సీతమ్మ వృత్తాంతం చెప్పాలని ఉబలాటపడ్తున్నారు. వారంతా ఒకేసారి ఏక కంఠంతో సీత రావణాంతఃపురంలో నిర్బంధించి వుండడం రాక్షస స్త్రీలు ఆమెని ప్రతి నిమిషం బెదిరించటం, సీత మాత్రం రాముని యందే మనసు నిలిపి, శోక సముద్రంలో మునిగి వుండడం, రావణుడామెకి ఒక్క నెల మాత్రం గడువు ఇవ్వడం, మొదలైన విషయాలన్నీ ఏకరువు పెట్టారు. వారలా గోల గోలగా చెప్తుంటే రామునికి సీత కుశలంగా వుంది అన్న విషయం ఒక్కటే అర్థమైంది. అప్పుడాతృతగా ఇలా అడిగాడు.

"సీత ఎక్కడుంది? ఎలా వుంది? నా విషయంలో ఏమనుకుంటోంది?" అని అడగ్గా వారంతా హనుమంతుని వైపు చూసి వివరంగా చెప్పమన్నారు. అపుడాంజనేయుడిలా చెప్పటం ప్రారంభించాడు.

"ప్రభూ నూరుయోజనాల లవణసముద్రాన్ని దాటి సీతని చూడాలని బయల్దేరాను. సముద్రానికి దక్షిణ తీరంలో వుంది రావణుని లంకా నగరం. అక్కడ రావణుని అంతఃపురంలో ప్రాణాలన్నీ నీ మీదే పెట్టుకుని, నిరంతరం

నిన్ను ధ్యానిస్తున్న సీతామాత బందీగా వుంది. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు కాపలా వుండి క్షణం క్షణం ఆమెని బెదిరిస్తున్నారు. జానకమ్మ చాలా దుఃఖంలో వుంది. ఏకవేణి ధరించి, దీనురాలై నిన్నే ధ్యానిస్తూ నేలమీద పడుకుంది. ప్రతీ క్షణం రావణుడుతనని మోహించమని వత్తిడి చేస్తుండగా, వాడ్ని నిరసిస్తూ చనిపోవాలని నిశ్చయించుకుంది. అట్టి పరిస్థితిలో ఆమెని నేను చూశాను. అప్పుడు ఇక్ష్వాకు వంశ గౌరవాన్ని కీర్తించి, గానం చేసి ఆమెకి నాపై నమ్మకం కలిగించాను. ఆమె చెంత చేరి నీ విషయమంతా వివరించి చెప్పాను. రామ సుగ్రీవుల మైత్రి గురించి చెప్పగానే ఆమె చాలా సంతోషించింది. సీతమ్మ నడవడి, ఆమెకి నీపై వున్న అనురాగం, భక్తి, నిశ్చలమైనవి. చిత్రకూట పర్వతం మీద జరిగిన కాకి విషయం, అప్పుడు జరిగిన వృత్తాంతమంతా మీకు తన గుర్తుగా చెప్పింది. "హనుమా ఇక్కడ నువ్వేంచూశావో, అదంతా నా రామునికి నివేదించ"మని కోరింది అని హనుమంతుడు చెప్తుంటే సుగ్రీవుడు కూడా ఆసక్తిగా విన్నాడు. అప్పుడు హనుమంతుడు తాను పదిలంగా తెచ్చిన చూడామణిని తీసి రామునికిస్తూ.

"రామా సీతమ్మ ఈ మణిని చాలా పదిలంగా దాచి వుంచుకుంది. తన గుర్తుగా దీనిని నీకివ్వమని చెప్పి నాకిచ్చింది. ఒక రోజు ఆమె బొట్టు చెరిగిపోగా నువ్వు మనశ్శిలతో ఆమె నుదుట తిలకం దిద్దిన సంగతి గుర్తుచెయ్యమంది. తానింక ఒక నెల కన్నా జీవించి వుండనని సీత నీతో చెప్పమంది. కృశించిన శరీరంతో, ధర్మనిరతితో, ఆడలేడిలా బెదురుచూపులు చూస్తూ సీత, రావణుని అంతఃపురంలో బంధింపబడి వుంది. రామచంద్రా చూసిన విషయం చూసినట్లు నీకు నివేదించాను. ఇంక ఇప్పుడు మనం సముద్రం దాటడానికి ప్రయత్నం ఆరంభించాలి" అంటూ సీత రామునితో చెప్పమన్న మాటలన్నీ చెప్పి ఆంజనేయుడు చూడామణిని రామునికిచ్చాడు. రాముడు ఆ మణిని లక్ష్మణునికి చూపించి గుండెలకి హత్తుకుని ఎంతో దుఃఖించాడు. లక్ష్మణునికి కూడా దుః ఖం ఆగలేదు. కన్నుల నిండుగా నీరు నిండగా రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు.

"సుగ్రీవా దూడ కోసం పరితపించే ఆవులా ఈ మణిని చూడగానే నా మనసు సీత కోసం పరితపిస్తోంది. ఈ మణి సముద్రంలో పుట్టింది. మా మామగారైన జనక మహారాజు యజ్ఞం చేసినప్పుడు, ఇంద్రుడు సంతృప్తుడై ఈ మణిని మామగారికిచ్చాడు. మా వివాహ సమయంలో జనక మహారాజు దీనిని సీతకిచ్చాడు. ఇప్పుడీ మణిని చూడగానే, మా తండ్రి గారు, మామగారు, సీత ముగ్గురు ఒక్కసారి గుర్తుకొచ్చారు. ఈ మణి నా ప్రియురాలైన సీత తలలో

అందంగా ప్రకాశించేది. ఇప్పుడు దీన్ని చూస్తుంటే మళ్ళీ సీతని చూసినట్లుంది నాకు" అని సుగ్రీవునితో చెప్పి, హనుమంతునితో,

"హనుమా, సీత ఏమైంది? ఆమెనాతో ఏం చెప్పమంది? ఒక నెల రోజులు జీవించి వుంటానందా? ఆమె అన్నాళ్ళుండగలదేమో కాని నేను మాత్రం ఇంకొక్కక్షణం కూడా జీవించవుండలేను. కుమారా సీతనెక్కడ చూశావు? నన్ను కూడా అక్కడికి తీసికెళ్ళు. ఆమె సంగతి తెలిశాక కూడా నేనామెకి దూరంగా వుండలేను. క్షణం, క్షణం రాక్షస స్త్రీలు బెదిరిస్తూ వుంటే ఆమె భయపడుతూ, భయంకరమైన ఆ రాక్షస స్త్రీల మధ్య, ఎలా వుందో ఏమిటో. హనుమా సీత నిజంగా ఏమందో మళ్ళీ చెప్పు. రోగికిచ్చే మందులా ఆ మాటలు నాకు జీవన ప్రదమైనవి. సీత మాటల లాగే ఆమె సందేశం వినిపిస్తున్న నీ మాటలూ మధురమైనవే" అంటూ రాముడు ఉద్వేగంగా ప్రశ్నించాడు.

అప్పుడు హనుమంతుడు వినయంగా చేతులు జోడించి, జానకి తనకి చెప్పిన చిత్రకూటాశ్రమంలోని వృత్తాంతం యథాతథంగా వివరించి చెప్పాడు. ఈ విధంగా నా కోసమై కాకిమీద బ్రహ్మాస్త్రం ప్రయోగించిన నా స్వామి, బలము, శౌర్యముగలవాడై యుండి కూడా ఈ రావణుని ఎందుకు ఉపేక్షించి ఊరుకున్నాడు? దేవాసుర గంధర్వులలో రామునెదురించి నిలవగలవారెవ్వరూ లేరు. నిజంగా రాముడు నా విషయంలో ఆందోళన పడ్తూవుంటే, తన పదునైన బాణాలతో రావణుని చంపకుండా ఊరుకుంటాడా? పోనీ ఆ మాత్రం పని లక్ష్మణుడైనా చేసి వుండవచ్చునే. అన్నదమ్ములిద్దరూ ఉపేక్షించి ఊరుకోడంలో ఆంతర్యం ఏమిటి? సమర్థులై యుండి కూడా వారలా ఊరుకున్నారంటే, నిజంగా నేనెంతో మహాపాపం చేసి వుంటాను" అంటూ కంట నీరు పెట్టుకుని సీతమ్మ ఎంతో దీనంగా విలపించింది. అప్పుడు నేను ఆమె నోదార్చి, "అమ్మా రాముడు కూడా నీలా శోక సంతప్తుడై వున్నాడు. ఏ మాత్రం సుఖం అనుభవించటం లేదు. లక్ష్మణుడు కూడా అన్నగారిలాగే దుఃఖిస్తున్నాడు. ఇన్నాళ్ళకి ఎలాగో నేను నీ జాడ తెలుసుకున్నాను. ఇంక నీ బాధలన్నీ తీరిపోతాయి. పురుషోత్తములైన రామలక్ష్మణులు వీలైనంత తొందరగా వచ్చి, లంకని భస్మం చేస్తారు. రాముడు సమూలంగా లంకని, రావణుని నాశనం చేసి నిన్ను తన పట్టణానికి తీసికెళ్తాడు. నిన్ను నేను చూసి వచ్చానన్న గుర్తుగా ఏదైనా ఇస్తే నేను ఆయనకి చూపించి, నిన్ను చూశానని నమ్మకం కల్గించి, నీ సంగతి వివరిస్తాను" అని నేను అడిగాను.

అపుడామె అన్నిదిక్కులు పరికించిచూసి, తన చూడామణిని తీసి, నాకిచ్చింది. నేను ఆ దివ్యమైన ఆ మణిని తీసుకుని, ఆమెకి నమస్కరించి,

వెనక్కి రావటానికి సిద్ధమవుతుంటే, ఆమె కన్నీరు నిండిన కళ్ళతో, దీనాతి దీనంగా నన్ను చూస్తూ గద్గద స్వరంతో ఇలా అంది. "హనుమా సింహసదృశులైన రామలక్ష్మణుల్ని, మీ ప్రభువైన సుగ్రీవుని, ఆయన మంత్రుల్ని కుశలం అడిగానని చెప్పు. మహాబాహువైన శ్రీరాముడు శీఘ్రమే వచ్చి నన్నీ దుఃఖసముద్రం నించి రక్షించేలా నువ్వు శ్రీరాముని ప్రోత్సాహించు.

ఈ రాక్షస స్త్రీలు నన్ను బెదిరించటం, నేను తీవ్రంగా భయపడి శోకించడం, ఇవన్నీ రామునికి వివరంగా చెప్పు. నీ ప్రయాణం సుఖంగా జరగాలి". అంటూ వ్యాకుల చిత్తంతో నన్నాశీర్వదించి పంపింది. రామా, రాజశేఖరా సీతమ్మ కుశలంగా వుంది. ఆమె విషాదంతో చెప్పిన పలుకులు యథాతథంగా నీకు చెప్పాను" అన్నాడు.

"రామా నీ యందలి అనురాగంతో నేను వెళ్ళిపోతున్నానన్న ఆవేదనతో, సీత ఇంకా చాలా చెప్పింది. "హనుమా రాముడు వెంటనే వచ్చి రావణుని చంపి నన్ను పొందేలా రామునితో నా విషయం అన్ని విధాలా చెప్పు. నువ్విప్పుడే వెళ్ళిపోతావా హనుమా? ఇంకొక్కరోజు ఇక్కడే ఎక్కడైనా రహస్య ప్రదేశంలో విశ్రాంతి తీసుకుని, రేపు వెళ్ళచ్చు కదా. భాగ్యహీనురాలినైన నాకు, నువ్వు వున్నట్లైతే, ధైర్యంగా వుండి, శోకం తగ్గి, నిశ్చింతగా వుంటుంది. ఇప్పుడు నువ్వెళ్ళిపోతే రేపటి దాకా నేను ప్రాణాలతో వుంటానో లేదో నువ్వెళ్ళగానే దుఃఖ పరంపరలు నన్ను మళ్ళీ ఆవహించాయి.

వీరాంజనేయా నాకిపుడొక్క అనుమానం కల్గుతోంది. మీ వానరులందరిలో నువ్వేగొప్పవాడివి. కనుకనే, సముద్రాన్ని దాటి వచ్చావు. కాని దుష్కరమైన ఈ మహాసాగరాన్ని రామలక్ష్మణులు, మీ వానరులు, ఎలా దాటగలరు? మీ తండ్రియైన వాయుదేముడు, గరుత్మంతుడు, నువ్వు మీ ముగ్గురు మాత్రమే ఈ సముద్రాన్ని దాటటానికి సమర్థులు. మరి అలాంటప్పుడు రావణ వధ ఎలా జరుగుతుంది? మారుతీ, ఈ కార్యసాధనకి, నువ్వు తప్ప వేరే సమర్థులు లేరు. కార్యసిద్ధి కలిగించే నీ బలము శాశ్వతమైన కీర్తి నొందగలదు. సైన్య సమేతంగా రాముడు వచ్చి, రావణుని చంపి నన్ను తీసికెళ్ళగలిగితే, అది రాముని పరాక్రమానికి తార్కాణం. ఆ విధమైన ఏర్పాటు నువ్వే చెయ్యాలి". అని సీతమ్మ బాలా దిగులు పడింది. అపుడు నేను.

"అమ్మా మా ప్రభువైన సుగ్రీవుడు అమిత బలవంతుడు. నిన్నెలాగైనా రాముని దగ్గరకి చేర్చాలని కృతనిశ్చయంతో వున్నాడు. సుగ్రీవుని ఆజ్ఞకి బద్ధులైన అమిత బలవంతులెందరో ఆయన సేనలో వున్నారు. వారికి ఆకాశంలో గాని, పాతాళంలోకి

గాని, భూలోకంలో అన్ని దిక్కులకు గాని వెళ్ళ గల సామర్థ్యం వుంది. ఎంతటి కష్టతరమైన కార్యాన్నైనా చిటికలో చెయ్యగల సమర్థులు వారు. ఇంక దుఃఖించకు తల్లీ. నీ దీనావస్థ తొలగిపోవు గాక. వానరులంతా ఒక్క గెంతు గెంతి లంకకి రాగలరు. బాల భానునిలా, బాల చంద్రునిలా, రామలక్ష్మణులిద్దరూ, నా బుజాలమీద కూర్చుని, లంకకి వస్తారు. ధనుర్ధారులైన రామలక్ష్మణులను తొందరలోనే నువ్వు లంకలో చూడగలవు. వానర వీరులకు గోళ్ళు దంతాలు ఇవే ఆయుధాలు. పర్వతాకారులైన వానర వీరుల్ని లంక దగ్గర పర్వత పంక్తులపై నిర్జిస్తూండగా నువ్వు చూడగలవు. అమ్మా శత్రువులను జయించి, వనవాసము పూర్తి చేసి, రాముడు నీతో కూడా అయోధ్యలో పట్టాభిషిక్తుడవటం శీఘ్రమే నువ్వు చూడగలవు" అని నేను మంగళ వాక్యాలతో, సీతమ్మకి ప్రియమైన మాటలు చెప్పి, ఆమె నోదార్చి, ఆమెకి ధైర్యం చెప్పి, ప్రసన్నురాలై ఆమె శాంతి పొందిన తర్వాత, నేను ఇలా బయల్దేరి వచ్చాను. నువ్వు సీతమ్మ కొరకు దుఃఖ సముద్రంలో మునిగి వున్నావని తెలిసి, ఆమె ఎంతగానో దుఃఖిస్తోంది. అని హనుమంతుడు సీత గురించి రామునితో చెప్పాడు.

హనుమంతుడు సీతమ్మని ఊరడించి, ధైర్యము చెప్పి ఆమెకి మంగళ ప్రదమైన సమయం ఆసన్నమైందని మంగళ వచనములు చెప్పి రాముని దగ్గరకి మరలి వచ్చాడు. ఆ మంగళ వచనముల వలన సీతకి మనశ్శాంతి కలిగింది. అదే విధంగా ఈ సుందరకాండని ఎల్లప్పుడూ పారాయణ చేసే వారికి హనుమంతుని అనుగ్రహము, సీతారాముల కటాక్షము తప్పక లభిస్తాయి. వారెప్పుడూ ప్రశాంతమైన జీవితం గడుపుతారు. ఇది నిత్య సత్యము. వాల్మీకి రామాయణములోని సుందరకాండని నియమ బద్ధంగా పారాయణ చేసే వారికి ముల్లోకాలంలోనూ గౌరవం కల్గుతుంది. అభీష్ట సిద్ధి కలుగుతుంది. సర్వారిష్టములు, దూరమైపోతాయి. ఇది పెద్దలు అనుభవము మీద చెప్పిన మాట. మనకి శిరోధార్యము.

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**సుందర కాండము సమాప్తము**

# సుందరకాండ మీద వ్యాఖ్య

రామాయణ మహాకావ్యంలో చాలా ముఖ్యమైనది, ఆయువుపట్టు అయినదీ ఈ సుందరకాండ. కిష్కింధ కాండలో అనుకోని మలుపు తిరిగి, ప్రతి ఘట్టము కూడా ఎంతో ఆసక్తి కరంగా నడచిన కథలో, మనకి అద్భుతమైన మానవాతీత శక్తులు ఎక్కడా కనిపించవు. నిజానికి వానరులంతా అమోఘమైన శక్తి సంపన్నులే వారంతా రావణవధలో శ్రీరామునికి సహాయం చెయ్యటానికి పుట్టిన వారే. అయినా వారు కేవలం బలపరాక్రమములు కల్గిన వానరులుగానే కనిపిస్తారు.

కాని సీతమ్మని లంకలో రావణుడు బంధించాడు అని తెలిశాక, శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి ఆవలవున్న లంకని చేరగల సామర్ధ్యం ఎవరికి వుంది? అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతుంది. ఆ సందర్భంలో జాంబవంతుడు హనుమంతునిలో నిద్రాణమైన అపూర్వమైన శక్తిని జాగృతం చేస్తాడు. ఈ సందర్భంగా హనుమంతుని కంతటి శక్తి ఎలా కలిగింది? అన్న విషయం మరోమారు తెలుసుకోవాలి.

ఆంజనాదేవికి వాయుపుత్రుని అనుగ్రహం వల్ల కలిగిన కుమారుడు మారుతి. వానరుడు.

పుట్టీ పుట్టగానే ఆకాశంలో అప్పుడే ఉదయిస్తున్న బాల భానుని చూసి అదేదో మధుర ఫలమని భావించి తినటానికి ఆకాశంలోకి ఎగురుతాడు. అలా అలా సూర్యబింబాన్ని సమీపిస్తున్న మారుతికి వేడివల్ల మూతి ఎఱ్ఱగా కమిలిపోతుంది. అయినా లక్ష్యపెట్టకుండా ఆ బాలుడు సూర్యుని అందుకోబోతాడు. అప్పుడు దేవతలకి ఆందోళన కలిగి దేవేంద్రునితో ఈ సంగతి చెప్తారు. దేవేంద్రుడు బాల మారుతిపై వజ్రాయుధం ప్రయోగిస్తాడు. ఆ ఆయుధం తాకిడికి ఆ బాలుని దవడ వంకర పోయి సూటిగా కింద పడిపోతాడు. వాయుదేవుడు తన కుమారుడు అలా పడిపోవటం చూసి కోపోద్రిక్తుడై ఆబాలుని ఎత్తుకుని ఒక కొండగుహలోకి వెళ్ళిపోతాడు. వాయువు స్థంభించిపోగానే ముల్లోకాలూ తల్లడిల్లి పోతాయి. దేవతలంతా బ్రహ్మతో సహా వచ్చి గుహలో వున్న వాయుదేవుని దగ్గరకి వెళ్ళి ఆ బాలుని పునర్జీవితుని చేసి తమ తమ అమోఘమైన శక్తులన్నీ ఆ

బాలునికి ఇచ్చి వాయుదేవుని శాంతింపచేస్తారు. బ్రహ్మ కూడా వాయుపుత్రునికి ఏ ఆయుధం వల్లా ఎటువంటి అపాయము కలుగకుండా వరం ఇస్తాడు. బ్రహ్మాస్త్రం కూడా కొద్దిసేపు బంధించి వుంచుతుంది తప్ప మారుతికి ఎటువంటి హాని చెయ్యదని వరమిస్తాడు. సంస్కృతభాషలో హనుమశబ్దానికి దవడ అని అర్థం వుంది. కనుక అప్పట్నించీ దవడకి దెబ్బ తగలటం వల్ల హనుమంతుడు అని ఆ బాలునికి పేరు వచ్చింది. బాలమారుతిని అంజనాదేవి దగ్గర దింపి వాయుదేవుడు వెళ్ళిపోతాడు. అయితే అప్రమేయ బలసంపన్నుడైన ఆ బాలుడు అడవులలో తపస్సు చేసుకునే తాపసులకి చాలా బాధలు కలిగిస్తూవుంటాడు. అపుడా మునులంతా బాల మారుతి ఆగడాలు భరించలేక, అతడు తన శక్తి సామర్థ్యాలు పూర్తిగా మర్చిపోవాలని, ఎవరైనా గుర్తు చేసినప్పుడు మాత్రమే ఆ శక్తి మళ్ళీ అతనికి కలగాలనీ శాపం ఇస్తారు.

అందుకే అప్పటి దాకా ఒక సామాన్య వీరునిలా మాత్రమే వున్న మారుతి ఎప్పుడైతే జాంబవంతుడు అతడి జన్మవృత్తాంతం అతడి శక్తిసంపద గుర్తుచేస్తాడో అప్పుడు తన విరాట్స్వరూపం చూపిస్తాడు. మహేంద్ర గిరి మీది నించి సముద్ర లంఘనానికి ఉద్యమించిన విరాట్స్వరూపుడైన మారుతి తర్వాత జరిగిన కథలో ఇంద్రజాల మహేంద్ర జాలాలు చూపిస్తాడు. విరాట్స్వరూపుడైన మారుతి సుందరుడు. లంకని చేరాలని ఆకాశంలో వెళ్తున్న అతడి గమనం సుందరమైనది. లంకానగరం సుందరమైనది. రావణుని అంతఃపురం సుందరమైనది. పరమ పావని జానకీ మాత సుందరమైనది. రావణునితో ఆంజనేయుడు చెప్పిన పలుకులు సుందరమైనవి. కావ్యరచనలో ఈ సుందరాకాండ ఘట్టాన్ని వాల్మీకి మహాముని మలచిన తీరు అత్యంత సుందరమైనది. ఇన్ని రకాల సౌందర్యాలు కలిశాయి. కనక ఇది సుందరకాండ అయింది.

రామాయణంలో సుందరకాండకి ఒక విశిష్టమైన స్థానం వుంది. దీనిలో 68 సర్గలున్నాయి. సప్తసర్గ పారాయణ క్రమంలో రోజూ ఏడు సర్గలు నియమంగా పారాయణ చేస్తే 68రోజులలో సుందరకాండ నిశ్శేషంగా పారాయణ చెయ్యటమవుతుంది. ఈ విధంగా 68 రోజులు పూర్తికాగానే, రామపట్టాభిషేకం చదివి కొబ్బరికాయ కొట్టి మళ్ళీ మొదలుపెట్టాలి. ఇలా

నిరంతరం పారాయణ చేసే వారికి ఎటువంటి గ్రహ బాధలువుండవు. వారికెటువంటి ఆపదలు కలగవు. ఎంతటి జటిలమైన సమస్య అయినా చిటికెలో పరిష్కరింపబడ్తుంది. వారి మనోభీష్టాలన్నీ నెరవేరుతాయి. ఈ విషయం ఎంతమందో వారి వారి అనుభవాల్లో ఋజువు చేశారు.

ఇంక ఇందులో కథా వస్తువు చూస్తే రామునికి దీటైన శత్రువు రావణుడే అని మనకి తెలుస్తుంది. లంకాపురి నిర్మాణ వైభవం. రావణుని సంపద, అశోక వన నిర్మాణంలో అతడిరసికత నిజంగా పరమాద్భుతంగా వుంటుంది. ఈనాటి నాగరిక ప్రపంచంలో మనం ఎన్నెన్నో, సాంప్రదాయాలు పాశ్చాత్య దేశాలనించి తెచ్చుకున్నామని భ్రాంతి పడ్తున్నాం. కాని అవన్నీ త్రేతాయుగంలోనే మన భారతీయ నాగరికతకి దర్పణాలని వాల్మీకి మహాముని నిరూపించాడు.

సుందరకాండలో ఏ ఘట్టం చదివినా పరమాద్భుతంగా వుంటుంది. హనుమంతుని శక్తి ప్రతిభ, అణువణువునా ప్రతిబింబిస్తుంది. సుందరాకాండ పారాయణ సర్వసంపత్ప్రదం మూలగ్రంథంలో పారాయణ చేసే శక్తి లేని వారు, అనువాద గ్రంథాల్లోని సుందరాకాండ ఘట్టమైనా రోజూ చదివి, మనోభీష్టం తీరాక ఆంజనేయుస్వామికి పూజ చేసి బంధుమిత్రులకి తీర్థ ప్రసాదాలు, విందుభోజనము పెట్టి ఆ స్వామిని శాంతింపచెయ్యాలి. ఎందుకంటే మనం ఎంత నియమంగా చదివితే ఆయన అంత ఉగ్రస్వరూపంతో మనకి కార్యసిద్ధి కలిగిస్తాడు. కలియుగంలో కూడా చిరంజీవి అయిన హనుమంతుని మహిమలు ఎన్నో రకాల కనిపిస్తాయి. సీతారాముల పునస్సంధాన కర్త మారుతి. మారుతిని పూజిస్తే సీతారాముల అనుగ్రహం మనకుంటుంది. ఇంక తర్వాతి కథలోకి యుద్ధకాండలోకి వెళ్దాం.



# యుద్ధకాండ

తను చూసినది చూసినట్టుగా హనుమంతుడు శ్రీరామునికి వివరించి చెప్పాడు. ఆ వృత్తాంతం విన్న రాముడిలా అన్నాడు. "హనుమా అనితరసాధ్యమైన కార్యాన్ని ఊహించడానికి కూడా వీలుకాని అతిదుర్లభమైన మహత్కార్యాన్ని చాలా నైపుణ్యంగా సాధించావు.

నీ వల్లనేను, లక్ష్మణుడు, రఘువంశము, మా ధర్మము కూడా రక్షించబడ్డాయి. కాని నా మనస్సు ఎందుకో చాలా వ్యాకులపడ్తోంది. తీరని బాధ కల్గుతోంది. ఇంతటి ప్రియమైన సమాచారం తెచ్చిన నీకు ఏ విధమైన బహుమానము ఇవ్వలేని పరిస్థితిలో వున్నాను. నాకు తీరని వేదన కలుగుతోంది. ప్రస్తుత పరిస్థితిలో నీకు నేనివ్వగల్గినది గాఢమైన కౌగిలింత మాత్రమే" అంటూ రాముడు హనుమంతుని మెచ్చుకుంటూ, గట్టిగా కౌగలించుకున్నాడు. ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్నాడు.

ఆ తర్వాత సుగ్రీవునితో ఇలా అన్నాడు. "సుగ్రీవా సీతన్వేషణ కోసం నువ్వు చేసిన ప్రయత్నం సఫలమైంది. కాని కెరటాలతో ఎగిసిపడే ఆ మహా సముద్రాన్ని దాటి, లంకకి ఎలా చేరాలి? సీత సముద్రం ఆవలి వడ్డున లంకలో వుందని మన హనుమంతుడు చెప్తున్నాడు. మన వానరవీరులు ఆ సముద్రాన్ని ఎలా దాటగలరు?" అంటూ రాముడు దిగులుతో ఆవేదన వ్యక్తం చేశారు.

రాముడలా శోకంలో తల్లడిల్లిపోతూ వుంటే, ప్రాణమిత్రుడి ఆవేదన చూడలేక, రాముడికి ధైర్యం చెప్తూ సుగ్రీవుడు, "మహావీరా నువ్విలా సామాన్య మానవుడిలా దిగులుపడటం ఉచితం కాదు. సీతమ్మ జాడ తెలిసింది కనుక మన ప్రయత్నం మనం చెయ్యాలి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలుసుకోగల కాలజ్ఞుడివి నువ్వు. సముద్రందాటడం దుష్కరమని, విచారించకు. ఆ మహా సముద్రాన్ని వానరులమైన మేము అవలీలగా దాటగలము. లంకని చుట్టు ముట్టి రావణుని చంపగలం. ఆ విషయంలో నువ్వు నిశ్చింతగా వుండు. నిరుత్సాహం మానవుని కృంగదీస్తుంది. నువ్వు ఉత్సాహం తెచ్చుకో. ఏ పనిసాధించాలన్నా ఉత్సాహం ముఖ్యం. ఇటు చూడు. ఈ వానర వీరులంతా మహాబలవంతులు. శూరులు. నీ కోసం నిప్పులో దూకమన్నా దూకడానికి సిద్ధంగా వున్నారు. వీరి ఉత్సాహం చూస్తుంటే మనకార్యం తప్పక సానుకూలమవుతుందనే నమ్మకం నాకు కలుగుతోంది. ఇప్పుడు చెయ్యవలసినదంతా వారికి తగిన సలహా ఇచ్చి

ముందుకి నడపడమే. మహాసముద్రం మీద ఏదో ఒక ఉపాయంతో సేతువు నిర్మిద్దాం. లంకలో మన మహాసైన్యంతో సహా ప్రవేశించి, ఆ రావణుని తుదముట్టిద్దాం. వీటన్నిటినీ బాగా ఆలోచించి, ఒక ప్రణాళిక తయారుచేసి ఆ పథకం ప్రకారం మమ్మ నడిపించు.

త్రికూటశిఖరంపై వున్న ఆ నగరాన్ని చూసి, రావణునితో యుద్ధం చేసి వాణ్ణి సంహరించటానికి తగిన ప్రోత్సాహం మాకు కలిగించాలి. సముద్రం మీద వారధి కట్టకుండా, లంకలోకి సైన్యసమేతంగా వెళ్ళటం కష్టం. మనకే గాదు. దేవేంద్రునిక్కూడా అసాధ్యం. వానరులు కామరూపులు. సముద్రాన్ని దాటగలిగామా, రావణుని ఓడించటం తథ్యం. మా వాళ్ళు రాక్షసులతో సహా లంకని పెకిలించి తేగలరు. కనుక నువ్విలా తల్లడిల్లిపోవడం ఉచితం కాదు.

నువ్వు విల్లు ధరించి యుద్ధభూమిలో నిలిస్తే, నీ ఎదురుగా నిలబడి పోరాడగల వారెవ్వరైనా వున్నారా? నీకు తోడుగా మహావీరులైన వానరులు వుండనే వున్నారు. ఇంకా దిగులెందుకు? ఎన్నెన్నో శుభశకునాలుకనిపిస్తున్నాయి. కనుక లే కర్తవ్యం ఆలోచించు" అంటూ సుగ్రీవుడు రామునికి ధైర్యం చెప్పాడు.

అప్పుడు రాముని మనస్సు కాస్త కుదుటబడింది. హనుమంతునితో ఇలా అన్నాడు.

"హనుమా, సుగ్రీవుడు చెప్పినట్లు ఏదో ఒక ఉపాయంతో లంకకి చేరామనుకో, ఆ లంక గురించి కొంచెమైనా తెలిసి వుండాలి కదా. కనుక రావణ రక్షితమైన ఆ లంక యొక్క సమగ్ర స్వరూపం మాకు వివరించి చెప్పు ఆ లంకలో ఎన్ని దుర్గాలున్నాయి? ఎన్ని ప్రాకారాలున్నాయి? నువ్వు చూసిన ప్రదేశాలన్నీ మా కళ్ళకి కట్టినట్లు వివరంగా చెప్పు. రావణుని సేన ఎంత పరిమాణము కలిగినది? మన సైన్యం లోపలికి ప్రవేశించాలంటే ఎలాంటి కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నాయి? పట్టణ రక్షణ కోసం ఎన్ని ప్రాకారాలున్నాయి? జలదుర్గాలెన్నునాయి? స్థలదుర్గాలెన్నివున్నాయి? గిరి దుర్గాలెన్నివున్నాయి? ఎన్ని పరిఘలున్నాయి? ఇవన్నీ చూసినవి చూసినట్టు చెప్పు" అని అడిగాడు.

హనుమంతుడు రామునికి అంజలి ఘటించి "ప్రభూ ఆ వివరాలన్నీ సేకరించే వచ్చాను. చెప్తాను ఆలకించండి. లంకలో రాక్షసులందరికీ రావణుడు ఆరాధ్యదైవం. వారంతా చాలా బలవంతులు. లంక పాడి పంటలతో సిరి సంపదలతో సమృద్ధిగా వుంది. అక్కడి సేనా విభాగం కూడా చాలా పటిష్టంగా వుంది. లంకలో వున్న వారంతా ఏ చీకూ చింతా లేకుండా సుఖంగా వున్నారు.

వారిలో ఎటువంటి అసంతృప్తి, మానసిక తాపాలు గాని లేవు. మదించిన ఏనుగులు అక్కడ చెప్పలేనంత సంఖ్యలో వున్నాయి. రథాలు, గుఱ్ఱాలు కూడా చాలా పెద్ద సంఖ్యలోనే వున్నాయి. శత్రువులు లోపలికి ప్రవేశించడానికి వీలు లేకుండా చాలా కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నాయి.

నగర ప్రాకార ద్వారములు, వాని గడియలు ఇనుముతో చాలా బలంగా చెయ్యబడి ఎప్పుడూ బంధించి వుంటాయి. నగరము చుట్టూ బలిష్టమైన ప్రాకారాలు, వాని వెంబడి అగాధమైన అగడ్తలు వున్నాయి. ఆ ప్రాకారాలకి నాలుగుదిక్కులా నాలుగు పెద్ద పెద్ద ద్వారాలున్నాయి. ఆ ద్వారాలలో బాణాలు, శిలలు, పుంఖానుపుంఖాలుగా విరజిమ్మే యంత్రాలున్నాయి. అవి చాలా పెద్దవి, బలమైనవి. ఎప్పుడైనా శత్రువులు ఆ కోట లోపలకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే ఆ యంత్రాలు వాటంతట అవే బాణాలు, శిలలు వర్షంలా విరజిమ్మి వారు లోపలికి రాకుండా అడ్డుకుంటాయి. ఆ ద్వారాలలో, భయంకరమైన శతఘ్నులు అమర్చబడి వున్నాయి. పట్టణ ప్రాకార మంతా బంగారు మయంగా వుంటుంది. అది చాలా ధృఢమైనది.

ఆ ప్రాకారం గోడలకి బంగారం రేకులు తాపడం చేసి, మంచి ముత్యాలు, మణులు, వైఢూర్యాలు, పగడాలు, అందంగా పొదగబడి వుంటాయి. పాకారాల చుట్టూ అగడ్తలు చాలా అగాధంగా వుండి, వాటినిండా పెద్ద పెద్ద మొసళ్ళు, తిమింగలాలు తిరుగుతూ వుంటాయి. ఆ అగడ్తల మీదుగా నగర ద్వారంలో ప్రవేశించడానికి వీలుగా విశాలమైన సంచార మార్గాలు యంత్రాల ద్వారా అమర్చబడి వున్నాయి.

ఆ సంచార మార్గాల ద్వారా శత్రుసైన్యం ప్రవేశిస్తోందని తెలియగానే, వాటంతట అవే వెనక్కి లేచిపోయి, శత్రుసైన్యాన్ని ప్రవేశించనియ్యకుండా చేస్తాయి. ఆ యంత్రాలతోనే రాళ్ళు, బాణాలు చిమ్మి శత్రువుల్ని చిందర వందర చేసే ఏర్పాటు కూడా ఉంది. లంకా పట్టణంలో భవనములు, పంక్తులు తీరి దీర్ఘంగా విశాలంగా వుంటాయి. నాలుగు ద్వారాల దగ్గర వున్న సక్రమ మార్గాలలో ఉత్తర ద్వారంలో వున్న పరిఘా మార్గం చాలా విశాలమైనది. చాలా ధృఢమైనది. శత్రువులు దానిని దాటి లోపల ప్రవేశించటం చాలా కష్టం.

అందులో బంగారు స్థంభాలు, వేదికలు అమర్చబడి వున్నాయి. అందులో రక్షక భటులు నిలబడేందుకు ఏర్పరచిన వేదికలు, చాలా ధృఢంగా, దుర్భేద్యంగా వుంటాయి. రావణాసురుడు, వాడి సైన్యం, అన్ని సమయాలలోనూ, అప్రమత్తంగా, యుద్ధానికి సిద్ధంగా వుంటారు. రావణుడికి జూదము మొదలైన వ్యసనాలు లేవు.

వాడు ప్రతి క్షణం తన సైన్యాన్ని అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ వుంటాడు.

లంక త్రికూట పర్వత శిఖరం మీద వుంది. ఆ పర్వత శిఖరం నునుపుదేరి, పట్టుచిక్కకుండా దేవతలకి కూడా ఎక్కటానికి వీల్లేకుండా వుంటుంది. ఆ పర్వతానికి, నదీ దుర్గము, పర్వత దుర్గము, వన దుర్గము, కృత్రిమ దుర్గము, అనబడే నాలుగు ప్రాకారాలున్నాయి. అవి కాకుండా శిల్పులు నిర్మించిన ప్రాకారాలు. పరిఘలు వేరేవున్నాయి. సముద్రానికి దూరంగా పర్వతం మీద వుండడం వలన ఆ నగరానికి నౌకాయానం లేదు. ఆ దేశంలోని వార్తలేవీ ఇతర దేశాల వారికి తెలియవు. శిఖరాగ్రం మీద వుండడం వల్ల ఆ పర్వతమే, ఆ నగరానికి రక్షణ కల్పిస్తోంది.

నగరప్రాకారానికి చుట్టు పరిఘలు, శత్రఘ్నులు, వివిధ యంత్రాలు, నగర రక్షణ కోసం ఏర్పాటు చేశారు. తూర్పుద్వారం దగ్గర, పదివేలమంది రాక్షసులు కాపలా వున్నారు. వారు శూలములు, ఖడ్గములుపట్టుకుని జాగరూకులై వుంటారు. దక్షిణద్వారం దగ్గర, ఏభైవేలమంది రథ, గజ, తురగ, పదాతి దళములు అప్రమత్తులై వుంటాయి. పశ్చిమద్వారం దగ్గర లక్షమంది సైన్యము, డాలు ఖడ్గములు ధరించి, సిద్ధంగా నిలబడి వుంటారు. ఉత్తర ద్వారం దగ్గర ఒక కోటిమంది, విశ్వాసపాత్రులైన వీరులు యుద్ధ సన్నద్ధులై వుంటారు. వారిలో ఆశ్వికులు, గజసైన్యము కూడా వున్నారు. ఇంకా నగర మధ్యలో నూరు మంది సైనికులు, జాగరూకులై నిలబడి వుంటారు. వారంతా చాలా బలమైన వారు. వీరు గాక కోట్ల కొద్దీ సైనికులు రావణుని సైన్యంలో వున్నారు. నేను నా శక్తి కొద్దీ చాలామంది రాక్షసవీరుల్ని సంహరించాను. సంక్రమమార్గాలు పాడుచేశాను. ప్రాకారాలు కూల్చాను. అగడ్తలు, రాళ్ళు వేసి పూడ్చాను. లంకా నగరాన్ని దహనం చేశాను. మనమంతా ఏదో ఒక ఉపాయంతో సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశిస్తే చాలు. మన వానర వీరులు లంకని అంతమొందించడం తథ్యం. అంగదుడు, ద్వివిదుడు, మైందుడు. జాంబవంతుడు, పనసుడు, నలుడు, నీలుడు ఎగిరి ఆకాశమార్గంలో లంకని చేరగలరు.

రామా నువ్వు వెంటనే ఆజ్ఞాపించు. సైన్యాన్ని సమకూర్చుకుని, ప్రయాణానికి తగిన ముహుర్తం నిర్ణయించుకుందాం. మేమంతా నీ ఆజ్ఞకోసమే వేచివున్నాము" అన్నాడు వినయంగా.

ఆ మాటలు విని రాముడు "హనుమా నువ్వు చెప్పినదంతా విన్నాక నాకు విచారం తగ్గింది. మనం ఆ లంకా నగరాన్ని మట్టుబెట్టగలమనేది నిస్సందేహమైన విషయం. సుగ్రీవా, మనం వెంటనే బయల్దేరుదాం. ఇప్పుడు విజయము అనే

సుముహూర్తం జరుగుతోంది. సూర్యుడు నడినెత్తిన వున్నాడు. కనుక ఇది విజయముహూర్తం. చాలా ప్రశస్తమైనది. మనం వెంటనే బయల్దేరగల్గితే ఆ రావణుడు ఎక్కడికీ వెళ్ళలేడు. ఇది అభిజన్మహూర్తం. ఇప్పుడు కనుక మనం దండెత్తి వెళ్తే వాడెక్కడికీ తప్పించుకెళ్ళలేడు.

మనం వచ్చామని తెలిస్తే సీత కూడా ప్రాణాలు నిలుపుకుంటుంది. ఈ రోజు ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. నాకు సాధన తార రేపు హస్త. ప్రయాణానికి మంచిది కాదు. మంచి ముహూర్తాలు కనిపిస్తున్నాయి. కనుక మనం తప్పక రావణుని చంపి సీత తీసుకురాగలము" అని రాముడు చెప్పగానే లక్ష్మణుడు చాలా సంబరపడ్డాడు. సుగ్రీవుడు, లక్ష్మణుడు రాముని నిర్ణయాన్ని మెచ్చుకున్నారు.

వారి అంగీకారం తెలుసుకున్నాక రాముడు మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"నీలుడు సేనా నాయకుడు, కనుక సైన్యానికి ముందు అతడు నడిచి వెళ్ళి మనం నడిచే సైన్యం సరియైనది అవునో కాదో చెప్పి, మన సేనల్ని నడిపిస్తాడు. అతడి వెనుక నూరుమంది బలమైన వానర వీరులుంటారు. మన సైన్యం నడిచి వెళ్ళే దారి అటు ఇటు వృక్షాలుండి, చల్లని నీడ కలిగినదై వుండాలి. దారి పొడుగునా త్రాగడానికి మంచినీళ్ళు దొరకాలి. ఆ ఏర్పాట్లన్నీ నీలుడు చూస్తాడు. నీలా, రాక్షసులు చాలా దుష్టులు, మనం ఇలా వస్తున్నామని తెలిస్తే మనం తినే పండ్లు కూడా విషపూరితం చెయ్యగలరు. నువ్వు ముందుగా సాగిపోతూ అలాంటివి జరగకుండా చూడాలి. దుర్గములలోనూ, అడవుల్లోని లోతైన గుంటల్లో శత్రువులు పైకి కనబడకుండా పొంచి వుంటారు. కనుక శ్రద్ధగా పరిశీలిస్తు వెళ్ళాలి. మనం చెయ్యబోయేది భయంకరమైన యుద్ధం. కనుక దుర్బలులైన వారిని కిష్కింధలోనే వుంచెయ్యండి. పరాక్రమము, బలము గలవారే లంకలో యుద్ధం చెయ్యగలరు.

సముద్ర ప్రవాహంలా సాగిపోయే మన సైన్యానికి, గజుడు, గవయుడు, గవాక్షుడు, రక్షకులుగా ముందుంటారు వారు మహాబలవంతులు కనుక. ఋషభుడు దక్షిణ దిశ నిచి ఉపద్రవాలు రాకుండా కనిపెట్టి వుండాలి. దుర్ధర్షుడు, గందమాదనుడు, సైన్యానికి ఎడమవైపు వుంటారు. నేను అందరికీ కనిపించేలా ఆంజనేయుని బుజాల మీద కూర్చుని, సైన్యం మధ్య భాగంలో వుండి అందరికీ ఆనందం కలిగిస్తాను. మా లక్ష్మణుడు అంగదుని బుజాలపై కూర్చుని, నాతో బాటు వస్తాడు.

జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి ఈ ముగ్గురు, సైన్యం మధ్య భాగాన్ని రక్షిస్తారు" అని ఏ క్రమంలో బయల్దేరాలో వారికి వివరించి చెప్పాడు.

రాముని ఆజ్ఞ శిరసా వహించి, సుగ్రీవుడు, మహాపరాక్రమశాలురైన వీరులందర్నీ యాత్రలకి ఆదేశించాడు. వానరులంతా అమితోత్సాహంతో గుహలలోంచి, శిఖరాల మీది నించి గెంతుతూ బయల్దేరారు. సుగ్రీవునిచే, లక్ష్మణునిచే పూజించబడి, రాముడు, దక్షిణ దిశగా జైత్రయాత్రకి బయల్దేరాడు. వందలు, వేలుగా వానరులు వారిని అనుసరించారు. వారంతా మహానందంతో గర్జిస్తూ పరిగెత్తుతూ దక్షిణ దిశగా సాగిపోయారు.

కమ్మని, తియ్యని, ఫలములారగిస్తూ తేనెత్రాగుతూ, పూలగుత్తులతో, ఫలాలతో నిండిన కొమ్మలు బుజాన వేసి మోసుకుంటూ, ఒకరిపై ఒకరు పడి తోసుకుంటూ, నడుస్తున్నారు. "రాక్షసుల్ని రావణుడ్ని చంపాలి పదండి" అని గర్జిస్తున్నారు. ఋషభుడు, నీలుడు ముందుగా నడుస్తూ మార్గశోధన చేస్తున్నారు. సేన మధ్య భాగంలో సుగ్రీవుడు లక్ష్మణుడు, రాముడు వెళ్తున్నారు.

శతవలి, కేసరి, తమసుడు, గజుడు, అర్కుడు, కొన్ని కోట్ల సైన్యంతో, ఒక పక్క సైన్యాన్ని రక్షిస్తున్నారు. సుషేణుడు, జాంబవంతుడు, అనేకమంది సుగ్రీవుని వెన్నంటి నడుస్తూ జాగ్రత్తగా సైన్యాన్ని రక్షిస్తున్నారు. దరీముఖుడు, ప్రజంఘుడు, రంభుడు, రభసుడు, అన్ని వైపులా ఎగురుతూ, సైన్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఆ విధంగా ఆ వానర సైన్యం, పల్లెల గుండా నగరాల గుండా ప్రయాణం చేస్తూ, కోతి చేష్టలతో ఉపద్రవాలు సృష్టించి, అల్లరి చేస్తారేమో అని రాముడు ముందే అలా చెయ్యొద్దని వారిని హెచ్చరించాడు. రాముడు ఆజ్ఞమన్నించి జాగ్రత్తగా ప్రయాణం చేస్తూ సహ్యాద్రి చేరుకున్నారు. సముద్ర ప్రవాహంలా సాగిపోతున్న రామదండు, అలసట లేకుండా అలా నడకసాగిస్తూనే వున్నారు. అంగదుని బుజాలపై లక్ష్మణుడు, హనుమంతుని బుజాలపై శ్రీరాముడు, వారి పక్కగా సుగ్రీవుడు ఈ ముగ్గురు సైన్యాన్ని పర్యవేక్షిస్తున్నారు.

రాముడు మాత్రం జరగబోయే కార్యం ఎలా సఫలమౌతుందా అని ఖిన్నమనస్కుడై వుండగా లక్ష్మణుడు ఎన్నో విధాల ఓదార్చి అన్న గారికి ధైర్యం చెప్తున్నాడు. వానర వీరులతో భూమి అంతా నిండిపోయింది. కేవలం గోళ్ళు, కోరలు మాత్రమే వారి ఆయుధాలు. వారి కాళ్ళు రేపుతున్న ధూళితో లోకమంతా కప్పేసినట్లుంది. వారంతా విలాసంగా అడవులలోని మధుర ఫలాలు తింటూ, నదీ ప్రవాహాల్లోని తియ్యని నీరు త్రాగుతూ, రెట్టించిన ఉత్సాహంతో ప్రయాణం చేస్తున్నారు. కిలకిలలాడుతూ, సందడి చేస్తూ తోకలు ముడిచి, మళ్ళీ చాచి ఝుళిపిస్తూ నేలని కాళ్ళతో పట్టిస్తూ మహానాదాలు చేస్తూ, గర్జిస్తూ, ఇలా ఎవరికి తోచిన పద్ధతిలో వారు సాగిపోతున్నారు. అందరూ రాక్షసులతో యుద్ధం

చెయ్యాలని ఉబలాట పడ్తున్నారు. అలా వెళ్ళి వెళ్ళి మలయ పర్వతం చేరుకున్నారు. అక్కడ అడవులన్నీ గంధం చెట్లతో నిండివున్నాయి. వాటిపై నించి వీచే చల్లని గాలి, శరీరానికి తగిలి, ఎంతో హాయిగా అనిపించింది వారికి. గైరికాది ధాతువులతో నిండిన, ఆ పర్వతంపై నించి వీస్తున్న సుగంధ పరిమళాలు, వెదజల్లే పిల్లగాలులు, వారి శరీరాలకి సోకి, వారికి మరింత శక్తినిచ్చాయి. నేల రాలిన పూలు ఏరుకుని ఒకరిపై ఒకరుచల్లుకుంటూ, ఆనందంతో ఒళ్ళు మరచి పరవశించి పోయారు వారు.

దొరికిన చోటల్లా పండ్లు తింటూ, తేనెలు త్రాగుతూ, చివరికి ఎలాగైతేనేం మహేంద్రగిరి ప్రాంతానికి చేరారు. కెరటాలతో ఎగిసిపడ్తున్న సముద్రాన్ని చూశారు. అగాధమైన ఆ సముద్రాన్ని చూస్తూ రాముడు సుగ్రీవునితో "సుగ్రీవా ఎలా అయితేనేం సముద్రతీరానికి చేరాము. మనం కిష్కింధలో ఆలోచించిన విషయాలన్నీ ఇప్పుడు పునరాలోచన చెయ్యాలి. మామూలుగా అయితే ఈ సముద్రాన్ని దాటడం అసాధ్యం. దీనికేదైనా గట్టి ఉపాయం ఆలోచించాలి. కనుక మన సేనకి ఇక్కడ విశ్రాంతి నిచ్చి, మన కర్తవ్యం గురించి ఆలోచిద్దాం" అని చెప్పి సేనల్ని అక్కడ ఆపవలసిందిగా ఆదేశించాడు. వెంటనే ఎవరి పరిధిలో వున్న సైన్యాన్ని వారు అదుపు చేస్తూ, వానర సైన్యాన్ని అక్కడ విడిది చెయ్యవలసిందిగా కోరాడు సుగ్రీవుడు.

అటు కెరటాలతో ఎగిసిపడ్తున్న సముద్రం ఇటు వానరులతో ఎగిరి పడ్తున్న వానర సేన అనే సముద్రం. ఆ వానరుల ఘోష సముద్ర ఘోషలా వుంది. సైన్యాన్ని వలయాకారంగా మూడు భాగాలు చేశారు. వానర సైన్యం, గోప్పుచ్ఛ సైన్యం, భల్లూక సైన్యం, విడి విడిగా నిలబెట్టారు.

ఎక్కడి వారక్కడే వుండాలనీ, దూరంగా పోకూడదని ఆజ్ఞాపించారు.

సంధ్యా సమయం అయింది సముద్రం ఉవ్వెత్తు కెరటాలతో ఎగిసిపడ్తోంది. మొసళ్ళు మొదలైన భయంకరమైన జలచరాలు దాన్నిండా వున్నాయి. తీవ్రమైన గాలి వీస్తోంది. ఆకాశం మేఘావృతమై వుంది. వానరులంతా ఉత్సాహంగా తుళ్ళిపడ్తున్న సముద్రం వైపు చూస్తున్నారు. అంతా నిశ్చలంగా విడిది చేసిన తర్వాత, రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు.

"లక్ష్మణా సామాన్యంగా రోజులు గడిచే కొద్దీ బాధ ఉపశమిస్తుందంటారు. కాని నాకు మాత్రం సీతావియోగం వల్ల కలిగిన బాధ రోజు రోజుకీ ఎక్కువవుతోంది. నేను ఆ రావణుని జయించి, సీతని ఎప్పటికి కల్సుకుంటానో

కదా" అంటూ భయంకరమైన సముద్రాన్ని చూస్తూ రాముడు చాలా దిగులు పడ్డాడు. అంతలో సంధ్యాకాలం కావడంతో రాముడు తేరుకుని, సంధ్యావందనం మాచరించాడు.

ఇక్కడి పరిస్థితి ఇలా వుండగా, అక్కడ లంకలో రావణుడు, ఒక సామాన్య వానరుడు, దేవేంద్రుడంతటి బలపరాక్రమాలతో, లంకని అల్లకల్లోల పరచిన సంఘటన తల్చుకుని సిగ్గుతో చితికిపోయాడు. రాక్షసులందర్ని సమావేశ పరచి ఇలా అన్నాడు.

"పౌరులారా మనలంక దుర్భేద్యమైనది. ఇప్పటి దాకా దీనిని కన్నెత్తి చూడ్డానిక్కూడా ఎవ్వరూ సాహసించలేదు. అటువంటి మన లంకని, ఒక సామాన్య వానరుడు పాడుచేశాడు. చైత్ర ప్రాసాదం ధ్వంసం చేశాడు. ఎందర్నో రాక్షసుల్ని చంపేశాడు. లంకనంతా అల్లకల్లోలం చేశాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఏం చేస్తే బాగుంటుంది? నేనెంత బలవంతుడనయినా, మీ అందరి సలహా మీదే నా విజయం ఆధారపడి వుంది. రాముడు వేలకొలది సైన్యంతో మన మీదికి దండెత్తి వస్తున్నాడు. తమ్ముడూ, అతడు వానరపరివారంతో ఎలాగోలా సముద్రందాటి వస్తాడు. మనకి వానరులతో కూడా విరోధం ఏర్పడింది. ఇపుడేం చేస్తే మన మీ ఆపదనించి గట్టెక్కుతామో చెప్పండి" అని తన మంత్రుల్ని సలహా అడిగాడు.

వారంతా చేతులు జోడించి "మహారాజా, రాజనీతి తెలియని, బుద్ధిహీనులు, శత్రుపక్షంలో, స్వపక్షంలో వుండే బలా బలాలు తెలియని వారు, రాజుని బెదిరిస్తు వుంటారు. కాని పరిఘలు, శూలాలు, పట్టిసాలు, మొదలైన బలమైన ఆయుధాలతో శత్రువుల్ని ఓడించగల శక్తి మనకి వుంది. రాముడు మానవ మాత్రుడు. అతడి వల్ల మనకొచ్చిన భయమేమీ లేదు. మీరంతగా చింతించక్కర్లేదు. ముల్లోకాలనూ గడగడలాడించిన మహావీరులు మీరు. ఈ రాముడొక లెఖ్ఖా మీకు. అసలు ఇంద్రజిత్తుడొక్కడే చాలు వీరందర్నీ జయించటానికి. కనుక మీరు మనస్సులో దిగులు పడవద్దు" అని రాక్షసులంతా రావణునికి ధైర్యం చెప్పారు. సభలో వున్న మంత్రులందరూ లేచి నోటికొచ్చిన ప్రగల్భాలు పలుకుతూ, ఎవరికి వారే తామొక్కరమే వెళ్ళి వానరుల్ని రామలక్ష్మణుల్ని తుదముట్టించి రాగలమన్నారు. కామరూపధారణతో, మాయోపాయాలతో వారిని చిత్తు, చిత్తుగా ఓడిస్తామని డంభాలు పలికారు. వారందరూ పల్కుతున్న బీరాలు విని రావణుని చిన్న తమ్ముడైన విభీషణుడు లేచి నిలబడి, వారందరికీ నమస్కరించి, కూర్చోమని చెప్పి, శాంతమైన స్వరంతో ఇలా అన్నాడు.

"రాక్షసరాజా నా సలహా వినండి. రాజనీతి ప్రకారం, సామ, దాన, బేధములు

ముందుగా విడివిడిగా ప్రయోగించాలి. ఈ మూడింటి వల్లా శత్రువు లొంగకపోతే అపుడు మాత్రమే దండోపాయం ప్రయోగించాలి. కాని ముందే దండోపాయం ప్రయోగించడం రాజనీతికి విరుద్ధము. అనాలోచితంగా యుద్ధం చేస్తే విజయం సిద్ధించదు. శత్రువు పరాకుగా వుంటే చెప్పలేం. కాని వారంతా ఇప్పుడు యుద్ధానికి సర్వసన్నద్ధులై వున్నారు. కనుక ఇప్పుడు మనం దండెత్తి వెళ్ళడం మేలు కాదు. రాముడిపుడు నిత్య జాగరూకుడై వున్నాడు.

కనుక అతడ్ని బెదరకొట్టడం అసాధ్యం. ఒక సామాన్య వానరుడు, భయంకరమైన మహా సముద్రాన్ని దాటివచ్చాడు. ఎవ్వరూ చెయ్యలేని మహాత్కార్యం చేశాడు. ఇది సాధ్యమైనదే అని ఎవరైనా చెప్పగలరా? మిత్రులారా శత్రువుల బలము, సైన్యము, పరాక్రమము, ఇంతటిది అని తెలుసుకోవడం చాలా కష్టం. తొందరపడి వారితో తలపడటం తగదు. అంతే కాదు. రాముని వల్ల మనకెలాటి అపకారము జరగలేదు. నిష్కారణంగా అతడితో వైరమెందుకు? పైగా మన ప్రభువే, అతడి భార్యనపహరించి తెచ్చి అతడికి తీరని ద్రోహం చేశాడు.

పరకాంతని చెరబట్టడం చాలా అనార్యం, అపకీర్తికరం, అనాయుష్యము, అర్ధవినాశకము, ఘోరమైన మహాపాపం, కనుక రావణుడు చేసినది, చాలా పెద్ద తప్పు. వైదేహివల్లనే మన రాక్షసులకింత ముప్పు సంభవించింది. ఇప్పటికైనా అపహరించి తెచ్చిన సీతని రామునికి మళ్ళీ తిరిగి అర్పించటం మనందరికీ మేలు. సకల వైభవములతో నిండిన మన లంకా పురిని, రాముడు నాశనం చెయ్యకముందే జానకిని రామునికి తిరిగిఅప్పగించడం మేలు. రాముడు పరాక్రమ శాలి, ధర్మవర్తనుడు. అతడితో వైరం తగదు. వానర సైన్యం అసంఖ్యాకమైనది. అది మన లంకని ఆక్రమించకముందే, మేలుకోవడం మేలు. సోదరా-రావణా, నీతమ్ముణిగా ప్రాధేయ పడ్తున్నాను. నీ మేలు కోరి చెప్తున్నాను. నా మాట పాటించు. సీతని రాముని కప్పగించడం నీకు శ్రేయస్కరం. క్రోధము, సుఖాన్ని, ధర్మాన్ని నశింపచేస్తుంది. నువ్వు నా మాటకంగీకరిస్తే అందరం సుఖంగా వుంటాము" అని రావణుడు మేలు కోరి చెప్తుంటే రావణుడు కోపంతో సభాసదనం వదలి, తన ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి గడచింది. తెల్లారింది.

ఉషఃకాలంలో విభీషణుడు, రావణుడి ఇంటికివెళ్ళాడు. రావణుని భవనం ఎంతో వైభవోపేతంగా వుంది. అన్ని వైపుల నించీ వేదమంత్రముల ఘోష వినిపిస్తోంది. ఎటు చూసినా యజ్ఞయాగాదులు జరుగుతున్నాయి. రావణ గృహంలో విభీషణునికి సాదరమైన ఆహ్వానం లభించింది. లోపల రాజోచితమైన

ఆసనం మీద కూర్చున్న అన్నగారికి వినయంగా నమస్కరించాడు విభీషణుడు. మెల్లిగా మంచి మాటలతో రావణునితో సంభాషణ ప్రారంభించాడు.

"మహారాజా సీతమ్మ లంకలో ప్రవేశించినప్పట్నించీ అన్నీ అపశకునాలే కనిపిస్తున్నాయి. అవన్నీచూస్తుంటే జానకిని రామునికిచ్చెయ్యటమే మంచిదనిపిస్తోంది" అంటూ అందరూ వింటూండగా రావణునికి హితబోధ చెయ్యబోయాడు. కాని ఆ మాటలువిన్న రావణుడు భగ్గున మండిపడ్డాడు. పరుషమైన స్వరంతో కఠినంగా ఇలా అన్నాడు.

"నాకెవ్వరి వల్లా భయం లేదు. సీతని రామునికివ్వడం ఎన్నటికీ జరుగదు. ఇంద్రుడితో సహా దేవతలందర్నీ సాయం తెచ్చుకున్నా అతడు నా ముందు నిలవలేడు. ఇంక నువ్వు వెళ్ళచ్చు" అన్నాడు. చాలా కఠినంగా పైకలా అన్నాడే గాని లో లోపల ఏదో జంకు కలిగింది. మళ్ళీ మంత్రులందర్నీ సమావేశ పరచి కొలువుతీరి కూర్చున్నాడు.

నిజానికి రావణుని మనస్సంతా సీతపట్ల మోహంతో నిండి వుంది. ఆపాపుటాలోచనల వల్లనే ఎవరేం చెప్పినా బుఱ్ఱకెక్కటం లేదు.

బంగారు జాలులతో నిండి, మణులు రత్నాలు, పగడాలు పొదిగిన రథంలో సభా భవనానికి వెళ్ళాడు. వెళ్ళి నవరత్న ఖచితమైన సింహాసనంపై కూర్చున్నాడు. సభాభవనమంతా వెండి, బంగారు స్థంభాలతో నిర్మింపబడి, స్ఫటిక మణులు కూర్చి వుంది. మెత్తని రత్న కంబళ్ళు పరచివున్నాయి. సభ అంతా మంత్రులతో, రాక్షసులతో కిటకిటలాడుతూ వుంది.

రావణుడు అందర్నీ పరికించి చూసి విభీషణుని కూడా రమ్మని కబురు చేశాడు. వెంటనే విభీషణుడు వచ్చాడు. అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. రావణుడు చాలా డాబుగా సభని కలయజూస్తూ సేనాపతియైన ప్రహస్తుని వైపు చూసి "సేనాపతీ, మన బలాన్ని అప్రమత్తం చెయ్యి. పట్టణాన్ని అన్ని వైపుల నించీ రక్షించమని చెప్పు" అన్నాడు. ప్రహస్తుడు వెంటనే ఆ ఏర్పాట్లన్నీ చేశాడు. అప్పుడు రావణుడు సభనుద్దేశించి

"ధర్మార్థకామములు సాధించాలంటే కొన్ని విషమ పరిస్థితుల్ని ఎదుర్కొనక తప్పదు. మీరంతా బాగా ఆలోచించి ఈ విషమ పరిస్థితిలో నాకు సరియైన సలహా ఇవ్వండి. ఇప్పుడు కుంభకర్ణుడు నిద్రలో వున్నాడు. ఆరునెలలైంది కనుక ఇప్పుడు లేస్తాడు. అతడికి కూడా పరిస్థితి వివరించి చెప్తే బాగుంటుంది. అంటుండగానే కుంభకర్ణుడు సభాస్థలికి వచ్చాడు. రావణుడు కుంభకర్ణుడికి సంతంతా వివరించి చెప్పాడు.

"తమ్ముడూ ఇంతకాలం నువ్వు నిద్రలో వుండడం వల్ల నీతో సంప్రదించే అవకాశం కలగలేదు. ఆరునెలల తర్వాత ఇప్పుడు నిద్ర లేచావు. కనుక పరిస్థితి నీకు కూడా తెలియవలసిన అవసరం వుంది. నేను దండకారణ్యం నించి రాముని భార్యయైన సీతని లంకకి తెచ్చాను. ఆమె అసమాన సౌందర్యరాశి. ఎంత ప్రయత్నించినా ఆమెపైనించి మనస్సు మరల్చలేకపోతున్నాను. అప్పట్లో ఆమె నన్ను ఒక సంవత్సరం గడువు అడిగింది. ఆమె మీది వ్యామోహంతో అలాగే అని మాట ఇచ్చాను. ఆ అమాయకురాలు రామలక్ష్మణులు వచ్చి తనని రక్షిస్తారని నమ్మకంతో వుంది. ఆమెని బ్రతిమాలి నేను చాలా అలసిపోయాను. ఆ మధ్య ఒక కోతి వచ్చి మన వాళ్ళతో భయంకరమైన యుద్ధం చేసి వెళ్ళింది. రామ లక్ష్మణులు వానరులతో సముద్రం దాటి వస్తారా అన్న సంగతి చెప్పలేం. నాకు మానవులంటే ఎంతమాత్రం బెదురులేదు. కాని ఇప్పుడు రామలక్ష్మణులు, సుగ్రీవులు, ఇంకా చాలా మంది వానరులతో మనపైకి యుద్ధానికి వచ్చి, సముద్రానికవతలి వైపున విడిది చేసి వున్నారు. తక్షణం వాళ్ళని వెనక్కి పంపేయ్యాలి ఇదీ నా ఆలోచన. నీకేం చేస్తే బాగుంటుందో మీరంతా ఆలోచించి నాకు సలహా చెప్పండి. సముద్రాన్ని దాటి లంకకి రావడం ఎవ్వరికీ సాధ్యం కాదు" అంటూ రావణుడు కామంతో కన్నులు పొరలు కమ్మిన వాడై తనని జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదనే భ్రాంతిలో పలికాడు.

అన్నగారి మాటలు విన్న కుంభకర్ణుడికి చెప్పలేనంత కోపం వచ్చింది. రావణుడ్ని తీవ్రంగా చూస్తూ "అన్నయ్యా రామలక్ష్మణుల్ని నిర్లక్ష్యం చేసి నువ్వే సీతని బలవంతంగా లంకకి తెచ్చావు కదా. ఆమెని తెచ్చినప్పుడు మా ఎవరితోనైనా ఆలోచించావా? మా సలహా అడిగావా? రాజైన వాడు తాను చేసే ప్రతీ పనీ, మంత్రులతోనూ, హితులతోనూ సమాలోచన జరిపి చెయ్యాలి. నీ అంతట నువ్వే ఈపాడుపని చేశాడు. చేసేముందు మా సలహా అక్కరలేదు కాని, ఇప్పుడు మాతో ఆలోచించటం ఏం సమంజసం? అనాలోచితంగాచేసిన పాడు పనులు ఇలాగే ముంచుకొస్తాయి. విషాహారం తిన్నవాడు చావక మానడు. రాముని దగ్గర్నించి సీతని దొంగిలించి తెచ్చి నీ వినాశము నువ్వు కొని తెచ్చుకున్నావు. కాని నా సహాయం అడిగావు కనుక చేస్తాను. ఇంద్రుడు, సూర్యుడు, వాయువు కలిసి వచ్చినా సరే నన్ను ఆపలేరు. నేనిప్పుడే వారందరి రక్తం త్రాగుతాను. నువ్వు నిశ్చింతగా వుండు. రామలక్ష్మణుల్ని వానరుల్ని చంపి నీకు విజయం చేకూరుస్తాను. నువ్వు హాయిగా సుఖభోగాలనుభవించు. మధువు సేవించు. బెంగవిడిచి నీ రాజ్యకార్యాలు చక్కబెట్టుకో. ఆ రాముడ్ని చంపేస్తే సీత నీకు చచ్చినట్టు

లొంగుతుంది" అన్నాడు. కాని రావణుడికి ఎందుకో మనస్సులో దిగులుగానే వుంది. ఖిన్నమనస్కుడై పాలిపోయిన ముఖంతో కూర్చున్న రావణుని చూసి మహాపార్శ్వుడనే మంత్రి అతడితో ఇలా అన్నాడు.

"ప్రభూ నువ్వు నియంతవి. నిన్ను శాసించే వాడు లేడు. సీతని నువ్వు మోజుపడి తెచ్చుకున్నావు. అయినా ఆమెతో సుఖించకుండా ఇలా సమయం వ్యర్థం చెయ్యడం మూర్ఖత్వం కదా నువ్వు బలాత్కారంగా అయినా సరే, ఆమెని వశపరచుకుని అనుభవించు. ఆమె ఎదురుతిరిగినా లెఖ్ఖచెయ్యకు. కోరిక తీరిన తర్వాత నిన్నెదిరించి మాత్రం ఆమె ఏం చెయ్యగలదు? నీకు సహాయంగా ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు వున్నారు. వారు మహాబలశాలురు. దేవేంద్రుడైనా వారిని జయించలేరు. నువ్వుదండోపాయంతోనే వారిని ఎదురించు. మేమంతా నీకు అండగా వుంటాము. నీకు జయం ఖాయం" అని చెప్తున్న వాని తెలివి తక్కువ మాటలకి రావణుడు ప్రసన్నుడైయ్యాడు. వాడ్ని మెచ్చుకుంటూ ఇలా అన్నాడు.

"మహాపార్శ్వా ఇప్పుడు నీకో రహస్యం చెప్పాలయ్యా. చాలా కాలం కిందట ఒకనాడు నేను బ్రహ్మలోకానికి వెళ్ళాను. అక్కడ పుంజిక స్థల అనే ఒక అప్సరస నన్ను చూసి నక్కుతూ నక్కుతూ వెళ్ళటం నేను చూశాను. అగ్ని శిఖలా మెరుస్తున్న ఆకాంతపై నాకు మనసు కలిగింది. ఆమెని బలాత్కారంగా వశం చేసుకుని అనుభవించాను. ఆమె బ్రహ్మలోకాని వెళ్ళి ఏడుస్తూ జరిగిన సంగతి అంతా బ్రహ్మకి చెప్పింది. అప్పుడు బ్రహ్మకి కోపం వచ్చి,

"రావణా ఈనాటి నించీ, నువ్వు ఏ స్త్రీనైనా బలవంతంగా అనుభవిస్తే నీతల వంద ముక్కలవుతుంది" అని శపించాడు. ఆ శాపానికి భయపడి ఆనాటి నించీ నేను ఏ స్త్రీని బలవంతంగా అనుభవించడం లేదు. లేకపోతే నేను ఇన్నాళ్ళు సీతని దూరంగా వుంచుతానా? నేను సముద్రమంతటి వేగము, వాయువంతటి బలము కలవాడను. నా సామర్థ్యం దశరథ రామునికి తెలియక లంకపై దండెత్తి వస్తున్నాడు. కుబేరుడంటటి వాడే నా చేతిలో ఓడిపోయాడు. ఇంక వీడెంత?" అంటూ గర్వంగా మీసం మెలేశాడు. ఆ ప్రగల్భాలు వింటూ విభీషణుడు ఊరుకోలేక పోయాడు.

"రాజా సీతమ్మ నీ పాలిట కాలసర్పం లాంటిది. ఎంతమంది ఎన్ని విధాల చెప్పినా నీకెందుకు బోధపడటం లేదో నాకు తెలియటం లేదు. పర్వతాకారులైన వానరులు లంకమీద పడి రాక్షసుల్ని గోళ్ళతోటి, పళ్ళతోటి పీకి చీల్చి చెండాడి, లంకని చిన్నా, భిన్నం చెయ్యకముందే, నువ్వు సగౌరవంగా మైథిలిని, దాశరథికి అప్పగించు. ప్రహస్తా రాముని బాణాలు వజ్రాల్లాంటివి. ప్రాణాంతకములైనవి.

వాటి గురించి తెలియదు కనక ఇలా ప్రగల్భాలు చెప్తున్నావు. మీరంతా అనుకుంటున్నట్లు నువ్వుకాని, ఇంద్రజిత్తుగాని, కుంభకర్ణుడు గాని, మన రాక్షస వీరులంతా ఏకమై గాని, రాముని ఎదుట యుద్ధంలో నిలువలేరు ఇదంతా మీ భ్రమ.

ప్రహస్తా రాముని ఎదటబడ్డావా నువ్వు బ్రతకటం కల్ల. ఇంద్రాదులు కూడా నిన్ను రక్షించలేరు. భూనభోంతరాళములలో ఎక్కడ దాగున్నా రామబాణాలు శోధించి, నీ ప్రాణాలు తీస్తాయి" అని విభీషణుడు హెచ్చరించే సరికి ప్రహస్తునికి చాలా పౌరుషం వచ్చింది.

"విభీషణా మాకు దేవదానవులంటేనే భయంలేదే, అలాంటిది ఒక సామాన్య మానవుడైన రామునికి భయపడటమా" అన్నాడు తీక్షణంగా. విభీషణుడు అతడి తెలివి తక్కువకి విచారిస్తూ

"ప్రహస్తా అదంతా నీభ్రమ మన రాక్షసజాతి అంతా ఏకమైనా రాముడ్నేం చెయ్యలేరు. రాముడు ధర్మపరుడు. మహారథుడు. ఇక్ష్వాకువంశంలో పుట్టిన వాడు. అంతటి మహనీయునితో తలబడడం అవివేకం. రామబాణాల రుచి నీకింకా తెలియలేదు. అందుకే అలా అనగలుగుతున్నావు.

రావణుడు గాని, ఇంద్రజిత్తు గాని, కుంభకర్ణుడు గాని, మహాపార్శ్వుడు గాని, మరెవ్వరూ, రాముని ఎదిరించి పోరాడలేరు. రావణుడు వ్యసనపరుడు కనక మిమ్మల్నింకా నమ్ముతున్నాడు. కాని నిజానికి మీరంతా మిత్రుల్లా నటిస్తున్న శత్రువులు. ప్రభువు తొందరపాటుతో అనాలోచితంగా ప్రవర్తిస్తే మనమంతా మంచి మాటలు చెప్పి, మంచి మార్గంలో నడిపించాలి. కాని మీరంతా అతడితప్పును సమర్ధించి, రాక్షస కుల వినాశానికి కారణమవుతున్నారు. నా మాట వినండి రాముని ధర్మపత్నిని అతడికి అప్పగించడమే న్యాయం. అదే మనలంకకి రక్ష. మీరంతా రావణునికి నచ్చజెప్పి, సీతమ్మని రామునికిచ్చేటట్లు చూడండి. కాని రామునితో పోరుకి ప్రోత్సహించకండి" అని ఎన్ని విధాలో నచ్చచెప్పాలని ప్రయత్నించాడు. విభీషణుడు.

కాని లంకలోని వారంతా మదాంధులు. వారికా నీతివాక్యాలు రుచించలేదు. ఇంద్రజిత్తుకి అతడి మాటలు వింటుంటే మరీ ఒళ్ళుమండిపోయింది. అసహనంతో ఇలా అరిచాడు.

"చిన్నాన్నా- ఇలా పిరికి మాటలెందుకు మాట్లాడుతున్నావు? ఇలా చెప్పటానికి నీకు సిగ్గు కలగటం లేదా? ఎంతో ఉన్నతమైన రాక్షసకులంలో పుట్టి నువ్విలా

నీచమైన మాటలు చెప్పటం చాలా ఆశ్చర్యంగా వుంది. మనం పౌలస్త్యవంశ సంభూతులం. ఇలా పలకటం మన వంశానికే అవమానం. నువ్వు తప్ప వేరెవ్వరూ లంకలో ఇలాంటి మాటలు పలకరు. ఎందుకంటే బలపరాక్రమములలో, ధైర్యంలో తేజస్సులో, గర్వంలో మన వంశం పెట్టింది పేరు. మనదాకా ఎందుకు? లంకలో ఎవరైనా సరే. ఆ రాజకుమారుల్ని తేలికగా చంపగలరు. పిరికిపవందలా మమ్మల్నెందుకు భయపెడ్తున్నావు? ముల్లోకాధిపతియైనా ఇంద్రుణ్ణి యుద్ధంలో ఓడించి, నేలమీద పడగొట్టిన వాడిని నేను. దేవగణాలందరికీ నేనంటే హడల్. అటువంటి నేను, ఒక సామాన్యమైన రాజకుమారులకి భయపడటమా? ఛీ. ఛీ. నీ ప్రసంగం ఇంక ఆపు చాలు" అన్నాడు నిరసనగా.

విభీషణుడు ఇంద్రజిత్తు ధిక్కారానికి చాలా బాధపడ్డాడు. అయినా తన బాధమనస్సులోనే ఆపుకుని, "నాయనా-నువ్వింకా చిన్నవాడివి. రాజ్యవ్యవహారాలలో నీకు అనుభవం తక్కువ. నీతండ్రికి పుత్రుడి రూపంలో వున్న శత్రువువి నువ్వు. నీతండ్రికి రాముని వల్ల గొప్ప వినాశనం కలగబోతుండగా అవివేకంతో నీ తండ్రిని సమర్థిస్తున్నావు. నిజంగా నువ్వు బుద్ధిహీనుడివి. నీలాంటి వాణ్ని వెంటనే వధించాలి. అలా కాదు. పెద్దవాళ్ళు చర్చించుకోవాల్సిన ఈ మంత్రి మండలిలో నిన్ను అనుమతించిన పెద్ద వారిని చంపాలి. మూర్ఖుడా చాలా పెద్ద మాటలు మాట్లాడావు. రాముని బాణాలు బ్రహ్మదండంతో సమానమైనవి. యమదండం లాంటివి. మహారాజా నామాట నమ్మండి. మనం సీతమ్మనీ, ఆమెతో బాటు ధనాన్ని, రత్నాలనీ, ఆభరణాలనీ, దివ్యమైన వస్త్రాల్ని, రామునికి సమర్పించి, ఈ శోకాన్ని పోగొట్టుకుని సుఖంగా వుందాం' అన్నాడు.

పరమమూర్ఖుడైన రావణుడు, విభీషణుని మాటలు విని అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమన్నాడు.

"విభీషణా శత్రువుల నీడలో బతకవచ్చు. పాము పడగకింద నిశ్చింతగా నిద్రపోవచ్చు. కాని నీలాంటి శత్రుపక్షపాతియైన సోదరుడే శత్రువైనప్పుడు, జీవించటం దుష్కరం. నువ్వు మాదగ్గరే వుంటూ, మామీద ప్రేమ నటిస్తూ, శత్రువుని బలపరుస్తున్నావు. జ్ఞాతులు విషసర్పముకన్నా ప్రమాదమైన వారు. నువ్వు కూడా జ్ఞాతివే కనక నాకు ఆపద కలగబోతున్నప్పుడు నా మీద పగసాధించాలని చూస్తున్నావు. సహాయం చెయ్యకపోగా శత్రువుని బలపరుస్తున్నావు. నన్ను ముల్లోకాలూ గౌరవిస్తున్నాయి. ఎంతో ఐశ్వర్యం సంపాదించాను. కాని నువ్వు నన్ను చూసి అసూయపడ్తున్నావు. చిన్నప్పట్నించీ కలిసి మెలిసి పెరిగాం. ఐనా దుష్టుడివి కనక నా మీద ప్రేమలేదు. ఏనుగు చక్కగా స్నానం చేసి ఒడ్డుమీదికి

రాగానే, తన తొండంతో తానే దుమ్ము, మట్టి తీసి తన తలమీద చల్లుకుంటుంది. అలాగే దుష్టులు తమ మైత్రిని తామే పాడుచేసుకుంటారు. ఇప్పుడు నువ్వు పలికిన మాటలు ఇంకెవరైనా పలికి వుంటే, ఆ క్షణంలోనే వాడ్ని నామ రూపాలు లేకుండా చేసే వాడిని. నువ్వు కులపాంశుడివి" అంటూ నోటికొచ్చినట్లల్లా దుర్భాషలాడాడు. విభీషణుడా మాటలు విని సహించలేక, ఒక గదచేత్తో పట్టుకుని, మరో నల్గురు మిత్రులతో కలిసి ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

ఆకాశంలో ఆగి సోదర వాత్సల్యంతో రావణుని ఉద్దేశించి ఇలా అన్నాడు.

"రాజా నువ్వు నాకు సోదరుడివి. అగ్రజుడివి. నీకెలాగైనా మాట్లాడే అధికారం వుంది. జ్యేష్టభ్రాత తండ్రితో సమానం. కనుక నువ్వెన్ని ఆగడాలు చేసినా ఇన్నాళ్ళూనీతో కలిసి వున్నాను. కాని ఇప్పుడు నువ్వు నన్ను అనార్యుడిననీ, కులపాంశుడిననీ నిందించావు. నీ మేలు కోరి నేను చెప్పిన మాటలు నీకు రుచించలేదు. నువ్వు ధర్మాన్ని అతిక్రమించి చరిస్తున్నావు. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. నీ సోదరుడిని కనక నీకింతగా చెప్తున్నాను. వీరెవరూ నీకింత విడమర్చి చెప్పరు. మృత్యుమార్గంలో వున్న నీకు నా మాటలు రుచించవు.

నువ్వు మహావీరుడివే కావచ్చు. కాని ఒక్కనిజం తెలుసుకో. ఇసుకతో కట్టిన ఆనకట్ట ప్రవాహ వేగానికి నిలువలేదు. మృత్యుముఖంలో వున్న నువ్వు రాముని ముందు నిలువలేవు. నా మాటల వల్ల నీకు కష్టం కలిగి వుంటే క్షమించు. ఇంక నిన్ను నువ్వే కాపాడుకోవాలి. లంక భవిష్యత్తు, రాక్షసుల శ్రేయస్సు నీ చేతిలో వుంది. నీకు మేలు కలగాలి. నేను వెళ్ళిపోతున్నాను. నువ్వింక ఆనందంగా వుండు. రావణా నీ రాక్షస సమాజంలో ఏ ఒక్కడూ నీ మేలుకోరే వాడు గానీ, నీకు హితవు చెప్పే వాడు కాని లేడు. నీ మేలు కోరే వాడిని, నీ తమ్ముణ్ణి కనుక నీకిష్టం లేకపోయినా, నీతప్పులన్నీ విప్పి చెప్పాను. కాని నా మాటలు నీకు నచ్చలేదు పోగా కాలము దాపురించిన వారు, మిత్రులు చెప్పే హితవు గ్రహింపలేరు. కనుక నీకు నా మాటలు నచ్చలేదు. పోనీలే నీకనుభవంలో కొచ్చినప్పుడే నా మాటలలో మంచి తెలుస్తుంది. మరి నాకు సెలవు వెళ్తున్నాను" అన్నాడు.

ఆ తర్వాత ఆకాశంలో ఎగురుతూ సముద్రం దాటి, రామలక్ష్మణులుండే ప్రదేశానికి వచ్చాడు. మేరు పర్వతాకారంలో, గగన వీధిలో నిల్చి వున్న విభీషణుని, వానర వీరులు చూశారు. దివ్యాభరణములు ధరించి, అతడు, అతడి వెంట మరి నలుగురు, వారికి కనిపించారు. ఆ ఐదుగుర్ని ఆకాశంలో చూడగానే, సుగ్రీవుని మనస్సులో ఏదో అనుమానం కలిగింది. వానరులందర్నీ ఒక చోట చేర్చి, "అదిగో అటు చూడండి అక్కడ ఒకడు గద పట్టుకుని, మరి నలుగుర్ని

వెంటపెట్టుకుని, మనల్ని చంపడానికి ఇటే వస్తున్నాడు బాగా చూడండి" అన్నాడు.

వానరులంతా పైకి చూసి "అవునవును. రాక్షసులు మనల్ని చంపటానికి వస్తున్నారు. వాళ్ళని ఇటు రానివ్వకుండా చంపెయ్యాలి" అంటూ చేతికందిన వృక్షాలు, కొండశిలలుపట్టుకుని, వారిని చంపటానికి కుద్యుక్తులయ్యారు. అప్పుడ ఆకాశంలోంచి విభీషణుడు, గట్టిగా అందరికీ వినబడేలా

"దుర్మార్గుడైన రాక్షసరాజు రావణుని తమ్ముడ్ని నేను. వాడు జనస్థానం నుంచి రాముని భార్య అయిన సీతమ్మని తెచ్చి లంకలో బంధించి వుంచగా, నేను అతడిని ఖండలించి, అది చాలా తప్పు అనీ, రాముని భార్యని మళ్ళీ ఆయనకే అప్పగించి క్షమాపణ కోరమనీ ఎన్ని విధాలో బోధించాను. కాని అతడు నా మాటలు లెక్కచెయ్యలేదు. కఠినమైన మాటలతో నన్ను నిందించాడు. ఎంత అవమానించినా ఓర్చుకుని, రావణుని మనసు మార్చాలని ప్రయత్నించాను. కాని అతడు వినకపోగా నన్ను తీవ్రంగా దూషించాడు. దాంతో నాకువిరక్తి కలిగి, భార్యాబిడ్డల్ని సైతం వదలి, శ్రీరాముని శరణుపొందాలని వచ్చాను. సర్వలోకాలకు, శరణాగత వత్సలుడైన శ్రీరామునితో ఈ సంగతి నివేదించండి" అని విభీషణుడు చెప్పిన మాటలు సుగ్రీవుడు విన్నాడు. ఆ సంగతి రామునికి నివేదించాడు.

"రామచంద్రా ఇతడు నిన్ను శరణుకోరి వచ్చినప్పటికీ, రాక్షసులకి అదృశ్యంగా సంచరించగల శక్తి వుంది. వారు కామరూపధారణ శక్తి కూడా కలిగి వుంటారు. కనుక వారిని నమ్మకూడదు. కపటోపాయాలతో ఎన్నో విధాలుగా బాధిస్తారు. శత్రుపక్షం నించి వచ్చాడు. రావణుడు తన గూఢచారిగా పంపాడేమో. మనలో మనకి అభిప్రాయబేధాలు కల్పించటానికి వచ్చి వుంచవచ్చు. రావణుడు మనకి శత్రువు. కనుక అతడి తమ్ముడైన ఈతడూ శత్రువే, ఇతడ్ని, ఇతడి అనుచరుల్ని వెంటనే చంపటం మంచిది" అన్నాడు.

రాముడు సుగ్రీవుని అభిప్రాయం విన్నాక మిగిలిన వానర ప్రముఖుల వైపు చూసి,

"వానర వీరులారా మీ ప్రభువైన సుగ్రీవుని అభిప్రాయం విన్నారు కదా. సుగ్రీవుడు నామేలు కోరి చెప్పాడు. మరి మీరుకూడా మీ మీ అభిప్రాయాలు చెప్పండి" అన్నాడు.

వానరులంతా ముక్త కంఠంతో "రామచంద్రా ప్రభూ ముల్లోకాలలోనూ నీకు తెలియనిదేదీ లేదు కదా. నువ్వు శరణాగత వత్సలుడివి. నీకు మేమేం చెప్పగలము? అడిగావు కనక ఒకరొకరుగా మా ఉద్దేశం చెప్తాము" అన్నారు.

రాముడు చిరునవ్వుతో "సరే చెప్పండి" అన్నాడు. అప్పుడు అంగదుడు లేచి నమస్కరించి,

"రామా విభీషణుడు శరణాగతుడైనా శత్రుపక్షంలోని వాడు. కనుక నమ్మదగ్గవాడు కాదు. మనం ఇతడ్ని కొంత పరీక్షించి చూడాలి" అన్నాడు. కాని సుగ్రీవుడందుకెంతమాత్రం సమ్మతించలేదు. "పోనీ కొంతకాలం మన దగ్గర వుంచుకుని పరీక్షించి చూస్తే నష్టమేమిటి? అని అంగదుడన్నాడు.

కాని శరభుడనే వాడు అలాచేస్తే అతడు మన రహస్యాలన్నీ రావణునికి చేరవెయ్యవచ్చు. కనక అతడిపై ఒక గూఢచారిని నియమిస్తే మంచిది అన్నాడు.

జాంబవంతుడు వారిద్దరి సలహాల్ని కొట్టేస్తూ "రామా, రావణుడు మన మీద పగబట్టి వున్నాడు. వాడు చాలా పాపాత్ముడు. అతడి తమ్ముడైనా సరిగ్గా యుద్ధం జరిగేవేళకి, మన దగ్గరకి శరణుకోరి వచ్చాడు. కనక వీళ్ళనెంత మాత్రం నమ్మకూడదు" అన్నాడు. అప్పుడు మైందుడనే వాడు లేచి

"ఇతడు రావణుని తమ్ముడు. మనకితడి గురించి ఏమీ తెలియదు. కనుక మనలో నీతికోవిధుడైన వాడ్ని ఇతడి దగ్గరకి గూఢచారిగా పంపాలి. అతడు మంచి మాటలతో వీళ్ళ గుట్టు తెలుసుకుంటాడు" అన్నాడు. వారందరి మాటలూ విన్నాక హనుమంతుడు లేచి, చేతులు జోడించి,

నేను మీ అందరి కంటే గొప్పవాణ్ణని కాని, మీతో పోటీ పడాలని కాని, చెప్పటం లేదు. శ్రీరాముని యందుండే గౌరవంతో చెప్తున్నాను. విభీషణుడు రావణునిలోని అవినీతిని చూశాడు. శ్రీరాముని లోని ధర్మనిరతిని, పరాక్రమాన్ని గురించి తెలుసుకున్నాడు. ఇతడు మనకి మంచి మిత్రుడన్న నమ్మకం నాకుంది. అతని మాటలలో ఎక్కడా దుష్టభావన కనిపించటం లేదు. రావణుని యొక్క దుష్ట ప్రవర్తనకి విసిగిపోయి, రాముడు వాలిని సంహరించి, సుగ్రీవ మహారాజుకి రాజ్యాభిషేకం చేయించాడని విని, రావణుని రాజ్యం తానే పొందాలనే ఆశతో వచ్చి వుండవచ్చు. అతడిలో అనుమానించవలసిన లక్షణాలేవీ నాకు కనిపించటం లేదు. నిర్భయంగా అతడ్ని మన సేనలో చేర్చుకోవచ్చని నా ఉద్దేశం. ఆపై మీ ఇష్టం" అన్నాడు. ఆంజనేయుని మాటలు విని రాముడు చాలా తృప్తి పడ్డాడు. తర్వాత వానరవీరులందర్నీ ఉద్దేశించి ఇలా అన్నాడు.

"మిత్రులారా, మీ అందరూ మీ అభిప్రాయాలు చాలా చక్కగా చెప్పారు. మరి నా ఉద్దేశం కూడా వినండి. ఆపైన మీ మీ సలహాలు చెప్పండి. మిత్రభావంతో

వచ్చిన వారినెపుడూ నిరాకరించకూడదు. వాడు నిజంగా కుత్సిత బుద్ధే అయితే, శిక్షించడం పెద్ద పని కాదు. కాని, శరణన్న వారిని రక్షించటం నా స్వభావం" అని రాముడు చెప్పగా విని, సుగ్రీవుడు బాగా ఆలోచించి ఇలా అన్నాడు.

"స్వామీ శరణాగతుడైనంత మాత్రాన రక్షిస్తాననటం రాజనీతికి విరుద్ధం. ఇతడు మంచివాడా, కాదా అన్న విషయం మనకనవసరం. ఆపదలో వున్న అన్నగారిని వదిలి వచ్చాడే, అది చూస్తేనే తెలుస్తోంది. ఇతడి ద్రోహబుద్ధి. అన్నగారినే వదిలిన వాడు. మనల్ని మాత్రం వదిలిపోడని నమ్మకమేమిటి?" అంటున్న సుగ్రీవుని మాటలకి రాముడు చిరునవ్వు నవ్వి.

"మన సుగ్రీవునికి రాజనీతి బాగా తెలుసు. చాలా సూక్ష్మంగా ఆలోచించి చెప్పాడు. కాని అంతకన్నా సూక్ష్మమైన ధర్మం మరొకటుంది. సామాన్యంగా రాజైన వాడికి, రాజ్యకాంక్షకల్గిన జ్ఞాతులు వుంటారు. రాజ్యర్హతని బట్టి వారే శత్రువులుగా మారుతుంటారు. వారంతా సమయం కోసం వేచి వుంటారు. ఇపుడీ విభీషణుడు కూడా రావణుని జ్ఞాతిసోదరుడు. అందుకే ఇప్పుడితడు నాదగ్గరకివచ్చి వుండవచ్చు. రావణుడు ఇతడ్ని శంకించి తన రాజ్యం నించి బహిష్కరించి వుండవచ్చు. శత్రుపక్షం వాడు కనక మనలో చేర్చుకోకూడదని మీరు చెప్పిన మాట నిజమే. అయినప్పటికీ రావణుడ్ని విడిచినట్లు ఇతడు మనల్ని విడువడు. కారణం మనకి వాళ్ళ రాజ్యం మీద ఆశలేదు. కనుక మన సహాయంతో రావణుని రాజ్యం పొందాలని మాత్రమే వచ్చి వుంటాడు. రాజ్యం కోరివచ్చిన వాడికి మన సహాయం అవసరం. కనక మనల్ని వదిలిపెట్టడు. మనకితడు కీడు చెయ్యడు. ఇతడిని మనం మిత్రుడిగా స్వీకరించవచ్చు. సుగ్రీవా ఒక సంగతి చెప్తాను విను. సోదరులంతా భరతునిలా వుండరు" అని రాముడు అనగానే, సుగ్రీవుడు లేచి నిలబడి "ప్రభూ మరో సారి సావధానంగా ఆలోచించండి. రావణుడు పంపగా ఇతడు వచ్చాడని నా అనుమానం. శరణాగతి పేరుతో మిమ్మల్ని అంతం చెయ్యడానికే వచ్చాడు. నివురుకప్పిన నిప్పులా వుండి మనలో చేరి, మన విశ్వాసం సంపాదించి, మన ముగ్గురిలో ఏ ఒక్కర్నైనా చంపుతాడు. నేను, లక్ష్మణుడు, మా ఇద్దరిలో ఏ ఒకరు చనిపోయినా మీరు సహించలేరు. అందుకే ముందు జాగ్రత్తగా వాళ్ళని అంతం చేద్దాం" అన్నాడు.

రాముడుమాత్రం తన మాటమీదే నిలబడి "సుగ్రీవా ఈ భూమండలంలోని భూత ప్రేత పిశాచ గణాలన్నింటినీ కొనగోటితో చంపి పారెయ్యగలను. మనల్ని వీళ్ళేం చెయ్యగలరు? ఓ వానర రాజా నాపై నమ్మకంతో శరణని వచ్చిన వాడిని రక్షించకుండా ఊరుకోవడం న్యాయమా? శరణన్న వారిని నిరాకరిస్తే అపకీర్తి, నరకము, బలపరాక్రమనష్టము కలుగుతాయి అని శాస్త్రాలు చెప్తున్నాయి. కనుక

నేనిప్పుడు విభీషణునికి శరణుఇవ్వాలనుకుంటున్నాను.

సుగ్రీవా అతడు విభీషణుడైనా సరే, రావణుడైనా సరే, మనకి శరణాగతుడు. వెంటనే అతడ్ని నాదగ్గరకి తీసుకురా" అన్నాడు ధృడంగా.

సుగ్రీవుడు రాముని ఔదార్యానికి ఆశ్చర్యపోతూ "రామా, ధర్మజ్ఞా, లోకనాధా ధర్మసూక్ష్మం తెలిసినంత మాత్రాన సరిపోదు. నీలా ఆచరించి చూపేవారే ధన్యులు. రామభద్రా, నీ మీద ప్రేమవల్ల ఇంతవరకు నీ సహజ స్వరూపము తెలుసుకోలేక పోయాను. ఇప్పుడు మాకు కనువిప్పు కలిగింది. విభీషణుడు కల్మషములేని మనస్సు గల వాడని తెలుసుకున్నాము. ఇంక ఆలస్యంచెయ్యడం తగదు. మాతో కూడా ఇతడు నీ ప్రేమని పంచుకుంటాడు" అన్నాడు. రాముడా మాటలు విని పరమానందం పొందాడు. సుగ్రీవుడు ఆకాశంవైపు చూస్తూ

"విభీషణా రాఘవుడు నీకు ఆశ్రయం ఇచ్చాడు. వెంటనే రామ సన్నిధికిరా" అన్నాడు. వెంటనే విభీషణుడురాముని పాదాల ముందు వ్రాలాడు. విభీషణుని ఆశీర్వదించి రాముడు పరమానందం పొందాడు. తన నల్గురి అనుచరులతో సహా విభీషణుడు రామునికి పాదాభివందనం చేశాడు. పులకరించి పోతున్న మనస్సుతో ఇలా అన్నాడు. "రామచంద్రప్రభూ, నేను రావణుని తమ్ముడ్ని. అతడి చేత అవమానించబడి, నిన్ను శరణుకోరి వచ్చాను. నేను, లంకనీ, నా భార్యాపిల్లల్ని, మిత్రుల్ని, ధనాన్ని అందర్నీ పరిత్యజించి, నిన్ను శరణుకోరి వచ్చాను. ఇకపై నా సర్వస్వమూ నువ్వే" అన్న అతడి మాటలు విని శ్రీరాముడు అతడ్ని ఓదార్చి, ఆప్యాయంగా చూస్తూ

"విభీషణా నీకు అభయం ఇస్తున్నాను. రాక్షసుల యొక్క బలాబలాలు గురించి నాకు వివరంగా చెప్పు" అని అడిగాడు. విభీషణుడు పరమానందం పొంది,

"ప్రభూ రావణుడు గొప్ప తపస్సు చేసి బ్రహ్మనుంచి, తనకి ఎవరి వల్లా మరణం లేకుండా వరం పొంది వున్నాడు. అయితే నరులు వానరులు తనకో లెక్క కాదు. కనుక వార్ని ఉపేక్షించాడు వరం కోరేటప్పుడు. రావణుని తర్వాత వాడు కుంభకర్ణుడు. నా రెండో అన్నగారు. అతడు కూడా దేవేంద్రుడంతటి బలం గలవాడు. రావణుని సేనానాయకుడు. ప్రహస్తుడు కూడా కుబేరుని సేనానాయకుడైన మణిభద్రుని ఓడించిన ఘనుడు. రావణుని కుమారుడు అహర్నిశాలూ, చేతి వేళ్ళకి కూడా కవచం ధరించి వింటిని సంధించి బాణాలు వదుల్తూనే వుంటాడు. అతడు ధరించే కవచం అబేధ్యమైనది. ఎదుటి వారికి

కనిపించకుండా అంతర్ధానమై అదృశ్యంగా వుండి యుద్ధం చెయ్యటం అతడి ప్రత్యేకత. ఇంకా రావణుని సైన్యంలో అతి బలవంతులు, మహోధరుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు మొదలైన హేమ హేమీలెంత మందో వున్నారు. కామరూపులైన రాక్షసులు ఎంత మందో పచ్చిమాంసం తిని, పచ్చినెత్తురు త్రాగేవారున్నారు. వారి సంఖ్య కోట్లలో వుంది. అంతటి సైన్యంలో రావణుడు దేవతల్ని లోకపాలకుల్ని కూడా జయించాడు" అని విభీషణుడు చెప్పాక రాముడికి రావణుని బలం ఎంతుందో అర్ధమైంది.

కొద్దిసేపు ఆలోచించి, "విభీషణా రావణుని బలగం నాకు బాగా తెలిసింది. ఒక్క పంగతి చెప్తాను విను. రావణుని బంధుసమేతంగా, ప్రహస్తునితో సహా చంపి నిన్ను లంకకి రాజుని చేస్తాను. కేవలం నిన్ను ఓదార్చాలని, నేనీమాటలు చెప్పటం లేదు. సత్యప్రమాణంగా చెప్తున్నాను. రాముడు చెప్పిన మాటకి తిరుగులేదు. రావణుడు ముల్లోకాల్లోనూ ఎక్కడున్నాసరే వాడ్ని ప్రాణాలతో వదలను. రావణుని పుత్రులతో, సైన్యంతో, బంధువులతో సర్వనాశనం చెయ్యకుండా నేను అయోధ్యకి వెళ్ళను. నా ముగ్గురు తమ్ముళ్ళ మీదా ఒట్టుపెట్టి చెప్తున్నాను" అన్నాడు. విభీషుని చేరదీసి వెన్నుదట్టి ధైర్యం చెప్పాడు.

రాముని వాత్సల్యానికి పులకరించి పోయాడు విభీషణుడు.

"రామా నేనూ నీ సైన్యంలో ఒకడిగా వుంటాను. యుద్ధంలో నీకు సాయం చేస్తాను. రాక్షసుల్ని చంపటంలో, లంకని శిథిలం చెయ్యటంలో నీకు సాయం చేస్తాను" అన్నాడు శిరస్సు వంచి నమస్కరిస్తూ. రాముడు ఆనందంతో అతడ్ని కౌగలించుకుని, లక్ష్మణుడ్ని పిల్చి, "లక్ష్మణా సముద్రజలాలు తీసుకురా. ఇప్పుడే ఇక్కడ్నించే విభీషణుని లంకా రాజ్యానికి రాజుగా అభిషేకిస్తాను. ఇక మీదట ఇతడు రాక్షసులందరికీ రాజు కాగలడు" అన్నాడు. లక్ష్మణుడు వెంటనే వెళ్ళి సముద్ర జలాలు తెచ్చాడు.

రాముడు వానరులందరి సమక్షంలో విభీషణుని లంకా రాజ్యానికి రాజుగా అభిషేకించాడు. విభీషణుని పట్ల రామునికి కలిగిన అనురాగానికి, వానరులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. ఆ తర్వాత హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు ఒక చోట కూర్చుని, ఆలోచిస్తూ కెరటాలతో ఎగిసిపడ్తున్న భయంకరమైన సముద్రాన్ని చూస్తూ ఈమహాసాగరాన్ని మన వానరసైన్యం ఎలా దాటగలదు? ఏ ఉపాయమై తోచటం లేదే అని బాధపడ్డారు. అప్పుడు విభీషణుడు ఆలోచించి "రామచంద్ర ప్రభువు సాగరాన్ని శరణుకోరితే అతడేదారి చూపించ గలడు. ఈ సముద్రము పూర్వం రాముని వంశం వారైన సగరపుత్రుల వల్ల

త్రవ్వబడినదే" అన్నాడు. సుగ్రీవుడు హనుమంతుడు ఈ ఆలోచన బాగుందని ఈ విషయం రామలక్ష్మణులతో చర్చించారు.

రామునిక్కూడా ఈ ఆలోచన నచ్చింది. దర్భలు తెప్పించి సముద్ర తీరంలో పరిపించి వాటిపైన పడుకుని రాముడు సాగరుణ్ణి శరణన్నాడు. ఈ సంగతిలా వుండగా, సముద్రతీరంలో విడిది చేసిన రామలక్ష్మణుల్ని వానర సేననీ పరిశీలించి రమ్మని శార్దూలుడు అనే ఒక మహాబలవంతుడైన రాక్షసుని గూఢచారిగా పంపాడు రావణుడు. కాని వాడికి వానరసేన మధ్యలో దూరటానికి సాధ్యం కాలేదు. వాడలాగే ఆకాశంలో ఎగురుతూ కొంత సమాచారాన్ని సేకరించాడు. రావణుని దగ్గరకి వెళ్ళి తాను తెలుసుకున్నది చెప్పాడు.

అపుడు రావణుడు శుకుడు అనే రాక్షసుని పిల్చి వాడి చేత ఇలా సందేశం పంపాడు.

"శుకా నువ్వు వెంటనే మా దూతగా వానరరాజైన సుగ్రీవుని దగ్గరకి వెళ్ళు వారితో మృదువుగా, స్నేహపూర్వకంగా నా సందేశం ఇలా చెప్పు

"సుగ్రీవా నువ్వు మహారాజ వంశంలో పుట్టావు. మహా బలశాలివి. బ్రహ్మపౌత్రులకీ నీకూ దగ్గర బంధుత్వముంది. నీ అంతటి మహనీయునికి మానవ మాత్రుడైన రామునితో చెలిమి చెయ్యటం వల్ల వచ్చే లాభమేమీ లేదు. వాలికి సోదరుడివి కనక నువ్వు నాకూ సోదరుని లాంటి వాడివే. నేను రాముని భార్యనపహరించిన మాట నిజమే కాని, అందువల్ల నీకొచ్చిన నష్టం ఏమీ లేదు కదా. నీ వానర సేన, నా లంకకి చేరటం అసాధ్యం. నా మాట విని నీ సేనతో నువ్వు కిష్కింధకి వెళ్ళిపో" అని చెప్పమని పంపాడు. అపుడా శుకుడుఒక చిలుకగా మారి సముద్రాన్ని దాటి వెళ్ళి ఆకాశంలో నిలబడి రావణుని సందేశాన్ని సుగ్రీవునికి వినిపించాడు.

వానరులంతా తలెత్తి ఒకసారి ఆకాశంలోకి చూశారు. వారంతా ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరి వాడ్ని పట్టుకుని భూమిమీద పడేశారు. వాడిమీద పడి కొట్టి పిడికిళ్ళతోగుద్దటం ప్రారంభించారు. వాడుహడిలిపోయి, రాముని పాదాలపై పడి " రామా దూతని చంపకూడదు కదా. ఈ వానరులు నన్ను చంపుతున్నారు. వీరిని ఆపు. దూతగా వచ్చినవాడు ప్రభువు సందేశాన్ని చెప్తాడు కాని, తనకిష్టమొచ్చినట్లు చెప్పడు కదా. నేను రావణుని దూతని రావణుడు చెప్పమని చెప్పిన మాటలు మీకు చెప్పాను అంతే" అని ప్రార్థించాడు.

వాడి ప్రార్థన విని, రాముడు వానరులన్ని వారించి, చంపవద్దని ఆజ్ఞాపించాడు.

అప్పటికే వానరులువాడి రెక్కలు పీకి పడేశారు. రాముడి ఆజ్ఞపై అంతటితో ఆపారు. వాడు బతుకుజీవుడా అని మళ్ళీ ఆకాశంలోకి ఎగిరి, సుగ్రీవునితో "సుగ్రీవా నీకు రావణుని సందేశాన్ని వినిపించాను. మరిదానికి జవాబుగా రావణునితో ఏం చెప్పమంటావో చెప్పు" అన్నాడు.

సుగ్రీవుడు వాని వంక చూస్తూ "నా సందేశం చెప్తాను విను. రావణా నేను నీకు సోదరునితో సమానమైన వాడినని వర్తమానం పంపావు కదా. కాని నీకూ నాకు మధ్య కనీసం స్నేహం కూడా లేదే. నీ మీద దయ చూపించవలసిన అవసరం నాకు లేదు. నా ప్రాణమిత్రుడైన శ్రీరామునికి శత్రువువి నువ్వు. కనుక నాకూ శత్రువువే. వాలి కూడా నాకు శత్రువే. కనుక ఎటు చూసినా నువ్వు నాకు శత్రువువే. అందుచేత వాలి నెలా చంపవలసి వచ్చిందో నిన్నూ అలాగే చంపటం న్యాయం. నా ప్రాణమిత్రుడైన రాముని ధర్మపత్నిని అపహరించావు. కనుక నాకూ నువ్వు అపకారం చేసినట్లే. వానరులులంకని చేరలేరని అన్నావు. నేనొక్కణ్ణే ఎగిరి వచ్చి నిన్ను చంపగలను. రావణా, రామునికి అపకారం చేసిన నిన్నెవ్వరూ రక్షించలేరు. దేవతలు, ఇంద్రుడు కూడా నిన్ను రక్షించలేరు. నువ్వు సూర్యలోకానికి వెళ్ళినా, పాతాళానికి వెళ్ళినా, నిన్ను రక్షించగల వారెవ్వరూ లేరు.

ముసలివాడైన జటాయువుని చంపినట్లు కాదు. రామలక్ష్మణులు చూడకుండా సీతమ్మని అపహరించిన పిరికిపందవి. రాముని శక్తి గాని, సీతమ్మ మహత్తు గాని నీకు తెలియదు. రాముడు నిన్ను అవలీలగా చంపగలడు" అని నా మాటగా రావణుని తో చెప్పు" అని సుగ్రీవుడన్నాడు.

ఆ తర్వాత అంగదుడిలా అన్నాడు "మహారాజా వీడు దూత కాదు. వీడ్ని గూఢచారిలా రావణుడు పంపాడు. కనుక వీడ్ని కట్టిపడెయ్యాలి. వీడు తిరిగి లంకకి వెళ్ళటం మనకి క్షేమం కాదు" అనగానే వానరులంతా వాడి మీద పడి బంధించారు. వాడు దీనంగా ఏడ్వసాగాడు.

"రామా వీళ్ళు బలవంతంగా నా కళ్ళు రెక్కలు పీకేస్తున్నారు. నేను చచ్చిపోతున్నాను" అని వాడు దీనాతిదీనంగా ఏడుస్తుంటే, రాముడు వాడ్ని కొట్టవద్దని వానరుల్ని ఆపాడు.

విభీషణుడి సలహా మేరకు సముద్రుణ్ణి శరణు పొందాలని రాముడు సముద్ర తీరంలో చిన్న చిన్న గుళక రాళ్ళు, ఇసుక నిండిన కఠినమైన ప్రదేశంలో నేల మీద దర్భలు పరచుకుని, సముద్రునికి నమస్కరించి పడుకున్నాడు. మూడు రోజులు గడిచిపోయాయి. కాని సముద్రుని దర్శనం కాలేదు. రాముడికి పట్టరాని

కోపం వచ్చింది. కళ్ళు ఎఱ్ఱగా అయ్యాయి.

"లక్ష్మణా చూడు, ఈ సముద్రుని గర్వము! ఇంతవరకు తను మన దగ్గరకి రాలేదు. సత్పురుషులు మంచి గుణము కలిగి వుంటారు. కాని నీచులు మంచి వారిలోని మంచిని చేతకాని తనంగా భావిస్తారు. చూడు ఈ సముద్రుని గర్వం. ఎదుటి వారి బాధని అర్థం చేసుకోలేని దుష్టుల్ని దూషించటం కన్నా తెలివితక్కువ తనం మరోటి లేదు. నా ప్రార్థని ఈ అల్పుడు చేతకాని తనంగా భావిస్తున్నాడు. ఇప్పుడు చూడు, ఈ సముద్రంలో వుండే జలచరాలన్నింటినీ అంతమొందిస్తాను. చనిపోయినవాటి శరీరాలు జలాలపై తులుతూ వుంటే ఈ సముద్రమంతా వాటితో నిండిపోతుంది. అప్పుడు వాటి మీదినించి నడచి మనం అవలీలగా ఈ సముద్రం దాటి లంకని చేరగలము. లేదా ఈ సముద్రాన్నే ఇంకింపచేస్తాను.

నేను ఓర్పు వహించి నిరీక్షిస్తున్న కొద్దీ ఈ సముద్రుడు నన్ను పిరికిపందని అనుకుంటున్నాడు. ఛీ, ఛీ, ఈ నీచుని దగ్గర ఓరిమి చూపటం అవివేకం. మంచితనంతో ఇతడ్ని రప్పించలేము" సౌమిత్రీ నా ధనుర్బాణాలు ఇలా ఇయ్యి. ఈ క్షణంలోనే ఈ సముద్రాన్ని ఇంకింపచేస్తాను. నా వానరులంతా సుఖంగా నడిచి ఆవలి తీరానికి వెళ్తారు. ఈ సముద్రంలో కూడా కొందరు రాక్షసులు వుండి వుండవచ్చు. వారందర్నీ కూడా ఇప్పుడే హతమారుస్తాను" అంటూ ధనుస్సు ధరించి, ప్రళయకాలరుద్రుడిలా, ఉరిమి చూస్తూ నిలబడ్డాడు. భయంకరంగా ధనుష్టంకారం చేస్తూ తీవ్రమైన బాణాల్ని తీసి సంధించి సముద్రంలోకి గురిపెట్టాడు.

ఎప్పుడైతే రాముని చేత విడువబడిన బాణము సముద్రంలోకి దూసుకు పోతోందో, ఘోరమైన ధ్వనితో సముద్రం అంతటా పొగలు అలుముకున్నాయి. పర్వతం అంతెత్తున అలలు ఎగిసిపడి, సముద్రమంతా అతలాకుతలమై పోయింది. అన్నగారి రౌద్రమూర్తిని చూసి లక్ష్మణుడు భయపడిపోతూ ఆ ధనస్సుని గట్టిగా పట్టుకున్నాడు. శాంతించవలసిందిగా అన్నగార్ని ప్రార్థించాడు. రాముడు కొంత తమాయించుకున్నాడు. సముద్రుని వైపు చూస్తూకోపంగా ఇలా అన్నాడు.

"సముద్రుడా నిన్ను పాతాళం వరకు శుష్కింపచేస్తాను. నా బాణాల తీవ్రతకి నీలోని నీరంతా ఇగిరి ఆవిరైపోతుంది. నా బాణాలే ఈ సముద్రం మీద సేతువుగా నిలుస్తాయి. నీకు బొత్తిగా విచక్షణా జ్ఞానం లేదు. నా పరాక్రమం గురించి, నా పౌరుషం గురించి నీకు తెలియదు. ఇదిగో ఇప్పుడే బ్రహ్మాస్త్రం వదులుతున్నాను. అంటూ రాముడు ఆవేశంతో ఊగిపోతూ, బ్రహ్మాస్త్రం అభిమంత్రించి, విల్లులో సంధించి నిలబడ్డాడు. భూమ్యాకాశాలు దద్దరిల్లేటంత శబ్దం వచ్చింది. నాలుగు

దిక్కులా చీకట్లు ఆవరించాయి. లోకంలో వుండే నదులు, సరస్సులు అన్నీ పొంగాయి. సూర్యచంద్రులుతారలు గతి తప్పారు. ఆకాశంలో పెద్ద పెద్ద తోకచుక్కలు, ఉల్కలు పుట్టాయి. పిడుగులు పడ్డాయి బ్రహ్మాండమైన శబ్దంతో. మేఘాలు పెద్ద పెద్ద ఉరుములతో, మెరుపులతోనిప్పులు కురిపించాయి. పెనుగాలులు వీచాయి. పెద్ద పెద్ద వృక్షాలు విరిగిపడ్డాయి. సముద్రం వెనక్కి వెనక్కి ఒక యోజనం లోపలికి పోయింది. అప్పుడు సముద్రమధ్యం నుంచి కోటి సూర్యప్రభలతో, భయంకరమైన సర్పాలతో, వైఢూర్య కాంతితో, బంగారు ఆభరణాలు ధరించి, సముద్రుడు ఒక్కసారిగా పైకి ఎగిసి వచ్చాడు. ఎర్రని పూలమాలలు, ఎఱ్ఱని వస్త్రములు ధరించి వున్నాడు. పద్మపత్రాయతాక్షుడు మెడలో రత్నాభరణం ధరించి గంగాసింధు మొదలైన నదులు మానవరూపంతో తోడురాగా రాముని ముందు సాక్షాత్కరించాడు.

శ్రీరామా అని దోసిలిపట్టి ఇలా ప్రార్థించాడు "భూమి, వాయువు, ఆకాశము, జలము, తేజస్సు ఈ ఐదూ పంచభూతాలని నీకు తెలుసు కదా ప్రభూ వీటికి సృష్టికర్త కొన్ని పరిధులు కల్పించాడు. వీటి సహజ స్వభావాలు కూడా పరమాత్మనిర్దేశించినవే. అందులో నేను జలముకి స్థానమైన సముద్రాన్ని. లోతుగా వుండి, కెరటాలతో ఎగిసిపడటం నా స్వభావం. లోతు తగ్గి మెరకగా మారటం గాని, కెరటాలు లేకుండా వుండడం గాని నా స్వభావానికి విరుద్ధం. నాలో వుండే పెద్ద పెద్ద జలచరాల్ని రక్షించటం నా కర్తవ్యం.

ఎవరు కోరినా, లోభపెట్టినా, భయపెట్టినా నేను మెరకగా మారలేను. అశక్తుణ్ణి మన్నించు. అయితే ప్రభూ మీకో వాగ్దానం చేస్తున్నాను. మీ సేన నాపై ప్రయాణం చేసినప్పుడు మొసళ్ళు మొదలైన క్రూర జంతువులు వారికి ఏమీ హానీ చెయ్యకుండా చూస్తాను. మీరు నాపై సేతువు నిర్మించి సముద్రాన్ని దాటండి. సేతు నిర్మాణానికి కెలాంటి అంతరాయం కలగకుండా నేను చూస్తాను. నన్ను శుష్కింపచేస్తాననీ, స్తంభింపచేస్తాననీ అనటం నీకు న్యాయం కాదు" అని మొరపెట్టుకున్నాడు. సముద్రుని ప్రార్ధనతో రాముడు శాంతించాడు. "సాగరా నువ్వు చెప్పించి నిజమే. కాని నేను ఇప్పుడు, వింట సంధించిన ఈ బ్రహ్మాస్త్రం నిష్ప్రయోజనం కావటానికి వీల్లేదు. కనుక దీనిని ఎక్కడ ప్రయోగించమంటావో చెప్పు" అని అడిగాడు.

"రాఘవా నాకు ఉత్తరం వైపున, ద్రుమకల్పమనే ప్రదేశం ఒకటి వుంది. అక్కడ ధూర్తులైన వారు కొంతమంది, దొంగల్లా నా నీరు త్రాగేస్తున్నారు. వాళ్ళ స్పర్శ నేను సహించలేకపోతున్నాను. నీ బ్రహ్మాస్త్రం వ్యర్థం కాకుండా వారి మీద ప్రయోగించు" అన్నాడు సముద్రుడు. సముద్రుడు కోరినట్లే రాముడు తన బాణాన్ని

ద్రుమకల్పంపై ప్రయోగించాడు. అక్కడి రాక్షసులంతా హతమయ్యారు. బాణం భూమిలో ప్రవేశించిన చోట పెద్ద రంధ్రమైంది. అందులోంచి నీరు ఊటలా పొంగింది. ఆ రంధ్రాన్ని వ్రణము అని పిల్చారు. దానిలో నీరు ఎప్పుడూ నిండుగా వుంటుంది. కాని రామబాణం భూమిని తాకగానే బ్రహ్మాండమైన ధ్వని వెలువడింది. ఆ సెగలకి ఆ ప్రాంతమంతా శుష్కించిపోయి ఎడారిలా మారిపోయింది. మరుభూమిలా వున్న ఆ ప్రాంతాన్ని చూసి, జాలిపడి, రాముడా ప్రాంతాన్ని సశ్యశ్యామలంగా మార్చి, అక్కడ పాడిపంటలు అభివృద్ధి చెందేటట్లు జీవగడ్డగా మార్చేశాడు. ఆ తర్వాత సముద్రుడు వినయంగా చేతులు జోడించి ఇలా అన్నాడు.

"కౌసల్యానందనా-నీ సేనలో వున్న నలుడు, అనే వానరుడు, విశ్వకర్మ కుమారుడు. తండ్రి లాగే అనన్య ప్రతిభా సంపన్నుడు. అతడు సముద్రం మీద తేలి వుండేలా సేతువు నిర్మించగలడు. నా అలల తాకిడికి అది చెదిరిపోకుండా నేను చూస్తాను" అని చెప్పి అంతర్ధానమై పోయాడు.

సాగరుడు అదృశ్యం కాగానే నలుడు లేచి రామునికి అంజలి ఘటించి,

"ప్రభూ విశాలమైన ఈ సముద్రం మీద నేను సేతువు నిర్మిస్తాను. సముద్రుడు చెప్పిన మాట నిజమే. నా తండ్రికున్నంత శక్తి నాకూ ఉంది. పూర్వము మా తల్లి మందర పర్వతం మీద వున్నప్పుడు నా తండ్రి ఆమెని ప్రేమించి స్వీకరించాడు. ఆయన అంశ వల్ల నా తల్లికి నేను పుట్టాను. తనంతటి శక్తి నాకుండేలా నా తండ్రి నన్ను దీవించాడు.

అయితే ఇప్పుడు సముద్రుడు చెప్పిన దాకా నాకా సంగతి గుర్తే లేదు. అయినా నా సంగతి నేను చెప్పుకోవటం బాగుండదు కదా. వానరులంతా సహాయం చేస్తే నేను నా బుద్ధిబలంతో వారధి నిర్మిస్తాను" అన్నాడు.

అప్పుడు రాముడు వానరులందర్నీ పిల్చినలునికి సహాయం చెయ్య వలసిందిగా ఆజ్ఞఇచ్చాడు. వానరులంతా తమ శరీరాల్ని పర్వతాకారాలలో పెంచారు. అడవిలో వుంటే మహావృక్షాల్ని కూకటి వేళ్ళతో సహా పెళ్ళగించి తెచ్చారు. వాటన్నిటినీ సముద్రంలో ఒక వరుసలో పడేశారు. పెద్ద పెద్ద పాషాణాల్ని పెళ్ళగించి తెచ్చారు. ఆ వృక్షాల మీద చక్కగా పేర్చారు. పర్వత శిఖరాలు పెళ్ళగించి సముద్రంలో లోతైన చోట పడేశారు. నీరు చివ్వుమని ఆకాశమంత ఎత్తున చిమ్మింది. కొందరు పొడవైన తాడు తీసుకుని, వారధి పొడుగు కొలుస్తూ వంకర టింకరలు లేకుండా సరిచేస్తున్నారు. నీరు అడ్డువస్తే పక్కలకి తోసేస్తున్నారు. వారందరి సాయంతో నలుడు వారధి నిర్మాణం ప్రారంభించాడు.

వందల కొద్దీ వానరులు, అతడు నిర్దేశించినట్లు, పర్వత శిఖరాలు సముద్రంలోకి తోస్తూ మధ్య మధ్య గడ్డి, కట్టెలు పరుస్తూ తాళ్ళతో గట్టిగా కట్టున్నారు. మొదటి రోజునే పద్నాలుగు యోజనాల పొడవు వారధి నిర్మించారు. రెండవ రోజు ఇరవై యోజనాలు, మూడవ రోజు ఇరవై యొక్క యోజనాలు, నాల్గవ రోజు ఇరవై రెండు యోజనాలు, ఐదవ రోజు ఇరవై మూడు యోజనాలు ఈ విధంగా మొత్తం ఐదు రోజుల్లో వంద యోజనాల పొడవు వారధి నిర్మించి, సువేల పర్వతం వరకు దారి నిర్మించారు. తన తండ్రి వర ప్రభావం వల్ల విశ్వకర్మ కుమారుడైన నలుడు, తన శక్తి సామర్థ్యాలతో నూరు యోజనాల పొడవు వున్న ధృఢమైన సేతువు నిర్మించాడు.

అత్యద్భుతమైన ఆ సేతువు దర్శించటానికి, ఆకాశ వీధిలో దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, ఋషులు, వచ్చి నిలబడి వింతగా చూశారు. అంతటి అసాధ్యమైన కార్యాన్ని ఎలా సాధించారా అని ఆశ్చర్యపోయారు. ఆ సేతువు పది యోజనాల వెడల్పు నూరు యోజనాల పొడవు వుండి, సముద్రం మధ్యలో పాపిటలా వుంది.

నిర్మించుకున్న ఆ సేతువుని చూడగానే, వానరులు ఆనందం పట్టలేక గెంతుతూ ఎగురుతూ సముద్రంలోకి దూకుతూ, ఈది వారధిపైకి వస్తూ ఆనందంతో పరవశించి పోయారు. కొన్ని వేల కోట్ల వానరులు, ఆ సేతువు మీదుగా నడచి ఆవలి తీరానికి వెళ్ళారు.

విభీషణుడు, చేతిలో గదని ధరించి, సముద్ర తీరంలో తన నల్గురు మంత్రులతో, శత్రువుల్ని ఎదిరించటానికి సిద్ధంగా నిలబడ్డాడు. అపుడు సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు.

"రామా నువ్వు ఆంజనేయుని భుజాలపైనా, లక్ష్మణుడు అంగదుని భుజాలమీదా కూర్చోండి వాళ్ళిద్దరూ ఆకాశంలో ఎగురుతూ మీ ఇద్దర్ని ఆవలి తీరం చేరుస్తారు"

ఆ మాటలకి రాముడు అంగీకరించాడు. రామలక్ష్మణులు ధనుర్బాణాలు ధరించి హనుమంతుని భుజాలమీదా, అంగదుని భుజాలమీదా ఎక్కి కూర్చున్నారు.

కొందరు వానరులు వారధి మధ్యలో, ఇంకొందరు పక్కలా నడిచారు. మరికొంతమంది సముద్రంలో దూకి ఈదుకుంటూ వెళ్ళారు. చాలా మంది ఆకాశంలో ఎగిరి వెళ్ళారు. ఈ విధంగా వెళ్తున్న ఆ వానర సేనల ఘోష సముద్ర ఘోషని మించి పోయింది. విశాలమైన ఆ వారధి మీదుగా అనంతమైన ఆ వానర

సేన ప్రవాహంలా సాగిపోతోంది. అదృశ్యాన్ని చూసి ఆకాశవీధిలో దేవగణాలు పులకించిపోతూ అసాధ్యమైన ఆ సేతువు నిర్మింపజేసిన శ్రీరాముని వేనోళ్ళ కొనియాడారు. పవిత్రజలాలతో ఆ పురుషోత్తముని అభిషేకించారు. మొత్తానికి సేనాసమేతంగా రాముడు సముద్రాన్ని దాటాడు. లంకకి నాలుగు వైపులా యుద్ధ సూచకాలైన మహోత్పాతాలు కనిపించాయి. రావణునితో యుద్ధం తథ్యమని రాముడు సంతోషించాడు. తన చిరకాల వాంఛ ఈనాటికి తీరిందని ఆనందంతో లక్ష్మణుడ్ని గట్టిగా కౌగలించుకున్నాడు ఆ తర్వాత ఇలా అన్నాడు.

"లక్ష్మణా మంచి చల్లని జలవసతి గల ప్రదేశంలో సైన్యాన్ని విడిదిచేసి, వ్యూహ రచనచెయ్యి. ఆ వ్యూహము గరుడాకారంలో వుండాలి. యుద్ధంలో ఋక్ష, వానర, రాక్షస వీరులందరికీ హాని కలగవచ్చు. చూశావా ఎంతటి దారుణమైన శకునాలు కనిపిస్తున్నాయో?

కలుషితమైన గాలి వీస్తోంది. భూమి కంపిస్తోంది. పర్వతాలు ఊగుతున్నాయి. మహావృక్షాలు నేల కూలుతున్నాయి. మేఘాలు భయంకరంగా వర్షిస్తూ, రక్తాన్ని కూడా వర్షిస్తూ భీకరంగా గర్జిస్తున్నాయి. ఆకాశం రక్త చందనంలా వుంది. సూర్యుని నుంచి అగ్నిశకలాలు రాలిపడుతున్నాయి. మృగములు, పక్షులు దీనంగా అరుస్తున్నాయి. చంద్రుని చుట్టు నలుపు తెలుపు వలయాలేర్పడి, రాబోయే ప్రళయాన్ని సూచిస్తున్నాయి. సూర్యునిలో కూడా నల్లమచ్చ లేర్పడ్డాయి. ఆకాశమంతా ధూళి వ్యాపించి వుంది. కాకులు, డేగలు గ్రద్దలు నేలమీద తిరుగుతున్నాయి. నక్కలు కూస్తున్నాయి. ఇవన్నీ రావణుని వినాశానికి సంకేతాలు కనుక ఇప్పుడే మనం రావణుని మీద దండెత్తి వెళ్దాం" అంటూ ధనస్సు ధరించి ముందుకి సాగాడు. విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, ఇంకా వానర వీరులు రాముణ్ణి అనుసరించారు. లంకలో భేరీ మృదంగ ధ్వనులు ఒక్క సారిగా మిన్నుముట్టాయి. వానరులు భీకంగా గర్జించారు.

లంకవైపు చూడగానే రామునికి, సీత గుర్తు వచ్చి చాలా దుఃఖం వచ్చింది. గద్గద స్వరంతో లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "తమ్ముడూ ఈ లంకని చూశావా? విశ్వకర్మ సంకల్ప మాత్రం చేతనే, సువేలాద్రిపై ఈ పట్టణాన్ని సృష్టించాడు. ఇది ఆకాశాన్ని తాకుతోందా అన్నట్లుంది. ఎన్నో అంతస్థులున్న భవనాలు, మేడలు తెల్లగా మెరుస్తున్నాయి. పూతోటలు కన్నుల పండుగగా వున్నాయి. రకరకాల పక్షులు, తుమ్మెదలు, కోకిలలు వింతవింత శబ్దాలు చేస్తున్నాయి. చల్లని మలయ మారుతం వీస్తోంది.

ఇంతటి మనోహరమైన లంకలో ఆదుష్టరావణుడు సీతని బంధించి, హింసిస్తున్నాడు" అని బాధగా తన ఆవేదన వ్యక్తం చేశాడు.

కొంతసేపటికి అంతా స్థిమితపడ్డాక రాముడు, సేనని శాస్త్రపద్ధతిలో విభజించి, ఎవరెక్కడ ఎలా వుండాలో తెలియజెప్పాడు. అంగదుడు, నీలుడు తమ పర్యవేక్షణలో వుండే సైన్యంతో, సైన్యం యొక్క మధ్య భాగంలో వుండాలి. ఋషభుడు తన సేనతో దక్షిణ దిశలో వుండాలి. రాముడు, లక్ష్మణుడు తమ సేనతో ముందరివైపున వుంటారు. సేన యొక్క జఘన భాగాన సుగ్రీవుడు రక్షించాలి అని రాముడు వివరంగా చెప్పాడు. వానరులంతా రాముని ఆజ్ఞ ప్రకారం ఉత్సాహంతో పెద్ద పెద్ద వృక్షాలు బండరాళ్ళు, కొండ శిలలు పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా నుంచున్నారు. అప్పటి దాకా రావణుడు పంపిన శుకుణ్ణి తమ దగ్గరే బంధీ వుంచుకున్నారు వారు. వ్యూహరచన పూర్తి అయ్యాక, శకుడ్ని వదిలెయ్యవలసిందిగా రాముడు సుగ్రీవునితో చెప్పాడు. సుగ్రీవుడు వెంటనే వాణ్ణి వదిలేశాడు. శుకుడు శరవేగంతో ఎగిరి రావణుని దగ్గర కెళ్ళాడు. రావణుడు వాణ్ణి చూసి నవ్వుతూ,

"నీ రెక్కలలా చెదిరి వున్నాయేమిటి? వానరులు గాని పీకేశారా?" అని పరిహసించాడు. వాడు భయంతో వణికిపోతూ, "ప్రభూ నేను మీ ఆజ్ఞ ప్రకారం, సముద్రం దాటి వెళ్ళి చాలా మృదువుగా నీ సందేశం రామునికీ, అతడి అనుచరులకీ వినిపించాను. కాని ఆ వానరులు నామాటలు వినిపించుకోకుండా నా రెక్కలు పీకి, నన్ను పిడికిళ్ళతో గుద్దుతూ, చిత్ర హింసలు పెట్టారు. ఆనాడు విరాదునీ, కంబదునీ, ఖరుని చంపిన రాముడు, సుగ్రీవునితో, వానర సేనతో సీతమ్మ జాడ తెలుసుకోవడానికి వచ్చాడు. వారంతా కలిసి సముద్రం మీద సేతువు నిర్మించారు. ఆ వారధి మీదుగా వారంతా సముద్రం దాటి వచ్చారు. రాక్షసుల్ని నిర్మూలిస్తాననీ, రాముడు ధనుర్ధారియై కంకణం కట్టుకుని నుంచున్నాడు. వానర సేనలు మహా వృక్షాలు, కొండశిలలు పట్టుకుని, మన భూభాగాన్ని ఆక్రమించారు. వారికీ మనకీ సంధి కుదరదు.

వారంతా చాలా బలమైన వారు. మన ప్రాకారం మీదికి వస్తున్నారు. నువ్వు వెంటనే సీతమ్మని రామునికి అర్పించడమో, యుద్ధం చెయ్యడమో ఏదో ఒకటి తేల్చుకో" అంటూ శకుడు సుగ్రీవుని సందేశం కూడా వినిపించాడు. రావణుడు కన్నులు కోపంతో ఎఱ్ఱబడ్డాయి.

శుకుని దహించేలా చూస్తూ "ఓరీ వానరులే కాదు. దేవ, దానవ,

గంధర్వులంతా ఏకమై వచ్చినా, నేను మాత్రం సీతని ఒదులుకోను. సూర్యోదయం కాగానే నేను నా బలంతో ఆ రాముని నిర్వీర్యుని చేస్తాను. దశరథ రాముడికి నా శక్తి ఇంకా తెలియదు. అందుకే నాతో యుద్ధానికి సిద్ధపడుతున్నాడు. ఇంద్రుడు, యముడు కూడా నా ముందు యుద్ధంలో నిలువలేరు. ఇంక ఆ రాముడెంత?" అన్నాడు అపహాస్యంగా. పైకి అలా అన్నాడే గాని, రాముడు సేనా సమేతంగా సముద్రాన్ని దాటి ఎలా వచ్చాడు. అన్న విషయం వాడికి మింగుడు పడలేదు. శుక, సారణులనే మంత్రుల్ని పిల్చి ఇలా అన్నాడు.

"మీరు నా మాటలు సావధానంగా వినండి. రాముడు దుర్లభమైన సముద్రాన్ని దాటి ఎలా వచ్చాడు? సముద్ర మధ్యంలో సేతువు కట్టటం అనేది, ఎన్నడూ వినని, అసాధ్యమైన కార్యం. నాకు నమ్మకం కలగడం లేదు. కనుక మీరిద్దరూ వెళ్ళి వాళ్ళకెలాటి అనుమానం రాకుండా ఆ వానర సేనలో ప్రవేశించండి. ఆ సైన్యం యొక్క బలాబలాలు తెలుసుకు రండి. వారిలో అతి బలవంతులెందరు? రామునికీ, సుగ్రీవునికీ అంతరంగ మంత్రులెందరు? ఆ సైన్యాన్ని నడిపిస్తున్న శూరులెవరు? ఈ మహాసముద్రం మీద సేతువు ఎలా నిర్మించారు? ఆ సేతువు నిర్మించిన వాడెక్కడ పుట్టాడు? వాడి బలం ఏమిటి? వివరాలన్నీ క్షుణ్ణంగా తెలుసుకుని రండి" అని చెప్పి పంపాడు.

వెంటనే వారు వానర ఆకారాలు ధరించి, వానర సైన్యంలో ప్రవేశించారు. ఎలాగోలా దూరగలిగారు గాని అనంతమైన ఆ వానర సేనని లెక్కించటం వారి తరం కాలేదు. కొంతమంది వానరులు కొండశిఖరాల మీద వున్నారు. కొందరు కొండచరియలలో వున్నారు. కొందరు గుహలలో, కొందరు సముద్రతీరంలో, మరికొందరు వనాలలో ఇలా ఎక్కడపడితే అక్కడ వేల వేల సంఖ్యల్లో గుంపులు గుంపులుగా వున్నారు. సముద్రానికి ఇవతల ఎంత మంది వున్నారో అవతల కూడా అంతమంది వున్నారు. శుక సారణులకి చూస్తున్న కొద్దీ అయోమయంగా వుంది. ఇంతలో, విభీషణుడు కూడా రాక్షసుడే కనక, వారిద్దర్నీ ఇట్టే గుర్తించాడు.

వెంటనే రామునితో వారిద్దరూ మారువేషంలో వున్న రాక్షసులనీ, రావణుని మంత్రులనీ, గూఢచారులుగా పంపాడనీ చెప్పాడు. ఆ సంగతి తెలిపి శుక సారణులు భయంతో ఒణికిపోయారు. బ్రతుకుపై ఆశ వదిలేసుకున్నారు. చేతులు జోడించి భయంతో ఇలా అన్నారు.

"రఘునందనా, రామచంద్రా మమ్మల్ని నిజంగా రావణుడే పంపాడు. మీ సైన్యాన్నంతా పరిశీలించి బలాబలాలు తెలుసుకురమ్మన్నాడు" అంటూ రాముని

పాదాలపై వాలిపోయారు.

రాముడు వారిపై ఆగ్రహించకుండా చిరునవ్వుతో "మా సైన్యం అంతా చూశారా? మా బలాబలాలు గుర్తించారా? మీరు వచ్చిన పని పూర్తయితే హాయిగా తిరిగి వెళ్ళవచ్చు. ఒక వేళ మాసైన్యాన్ని మీరు పూర్తిగా చూడకపోతే మా విభీషణుడు చూపిస్తాడు. చూసి మరీ వెళ్ళండి. మీ ప్రాణాలకొచ్చిన భయం ఏమీ లేదు. అంటూ విభీషణా వీరిని తీసికెళ్ళి మన సైన్యం పూర్తిగా చూపించు అని, మళ్ళీ వారితో ఓ మంత్రులారా మీరు నిర్భయంగా లంకకి వెళ్ళి మీ రాజైన రావణునితో నా మాటగా ఇలా చెప్పండి.

"నువ్వు ఏం బలం చూసుకుని, సీతని అపహరించుకెళ్ళావో, ఆ బలం ప్రదర్శించే సమయం వచ్చింది. రేపు తెల్లారగానే నీ లంకా నగరాన్ని నా వానరులు సర్వనాశనం చేస్తారు. కాసుకో" అని చెప్పి వారిని వెళ్ళమని ఆదేశించాడు. వారు బ్రతుకు జీవుగా అంటూ రామునికి జయ జయ ధ్వానాలు చేస్తూ వెళ్ళిపోయారు.

రావణుని దగ్గరకి వెళ్ళి శుకసారణులిద్దరూ "మహారాజా వానర సేనలో దూరిన మమ్మ విభీషణుడు పట్టుకున్నాడు. కాని రాముడు మమ్మ కరుణించి ప్రాణాలతో వదిలేశాడు. వారి సేనలో అస్త్రవిద్యావిశారములు, ధృడవిక్రములు, శూరులు అయిన నల్గురు మహాత్ములున్నారు. వారు రాముడు, లక్ష్మణుడు, విభీషణుడు, సుగ్రీవుడు. వీరు నలుగురూ ప్రాకారాలతోసహా మన లంకని పీకి ఇంకో చోటపెట్ట గల సమర్ధులు. ఇంక మిగిలిన వారి సంగతి చెప్పనక్కర్లేదు.

అంతే కాదు. రాముడొక్కడే చాలేమో లంకని అంతమొందించేందుకు కనిపిస్తోంది. ఆయన వయోరూప, పరాక్రమ, శక్తి సంపన్నత చూస్తే, సముద్రం మీద నిజంగానే పది యోజనాల వెడల్పు, నూరు యోజనాల పొడవు గల వారధి మీది నించే వచ్చారు. ఇంకా వస్తూనే వున్నారు. ఆ సేనకి అంతుదరీ లేదు. వానరులంతా చాలా ఉత్సాహంగా వున్నారు. వారిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఇప్పటికైనా మీరు వారి మీద పగ చాలించి సీతమ్మని దాశరథికి సమర్పించండి. ప్రస్తుతం అంతకన్నా చెయ్యగలిగిందేం లేదు" అని నొక్కి చెప్పారు. కాని రావణుడికి వారి మాటలు రుచించలేదు. ఎట్టి పరిస్థితిలోనూ సీతని వదలమన్న మాట అనవద్దని వారిని తీవ్రంగా మందలించి తన ప్రాసాదం అగ్రభాగానికి వెళ్ళి అక్కడ్నించి వానర సేనని పరిశీలించి చూశాడు. మహాసముద్రంలా అసంఖ్యాకంగా వున్న సేనని చూస్తూ సారణుని పిల్చి వారి గురించి చెప్పమన్నాడు.

అప్పుడు సారణుడు ముందుగా సుగ్రీవుని చూపించాడు. ఆ తర్వాత వరుసగా

నీలుణ్ణి, శరభుణ్ణి, పవనుణ్ణి, వినతుణ్ణి, అంగదుణ్ణి, హనుమంతుణ్ణి, నలుణ్ణి వరసగా వారి వారి బలాలు గురించి వర్ణించి చెప్తూ సేతువుని నిర్మించిన వీరుడునలుడే అని మళ్ళీ చూపిస్తూ ఇలా లెక్కకి రానంత మంది మహా వీరులు కోట్ల కొద్దీ ఉన్నారనీ చెప్పాడు.

చివరిగా ఇలా అన్నాడు "మహారాజా వీరంతా కామరూపులు పర్వతాకారులు. మన రాక్షసులకెందులోనూ తీసిపోరు. వీరంతా కిష్కింధలో నివసించే వానరులు. సుగ్రీవుని మంత్రులు. అనుచరులు. వీరంతా కూడా దేవతలకి గంధర్వులకి పుట్టినవారు. ఇది వరలో మనలంకకి వచ్చి, మనందర్ని కలవరపరచి వెళ్ళిన హనుమంతుడు వాయుదేవుని పుత్రుడు. ఇతడొక్కడేచాలు లంకని రూపు మాపటానికి. అతడి భుజంపై కూర్చున్న నీలమేఘ శ్యాముడు పద్మపత్రాయ కాక్షుడు. ఇక్ష్వాకు కులసంభూతుడు, ఖర దూషణాధి మహావీరులను మర్దించిన వాడు అయిన మహా పరాక్రమవంతుడు శ్రీరాముడు. నువ్వు అపహరించి తెచ్చిన సీత ఆ మహాత్ముని ఇల్లాలే. అందుకే నీ మీద పగ తీర్చుకుందుకు వచ్చాడు. అతడి కుడి వైపు బంగారు ఛాయలో మెరిసిపోతున్న వాడు రాముని ప్రియమైన తమ్ముడు లక్ష్మణుడు.

మన విభీషణుడు రాముని వెనక ఎడమవైపున వున్నాడు అడిగో. అతడ్ని రాముడు రాబోయే కాలంలో లంకకి మహారాజుగా అభిషేకించాడు.

సుగ్రీవుని మెడలో వరమాల వుంది. దానిని అతడి అన్నగారైనా వాలి అతడికిచ్చాడు. ఆ హారంలో వీరలక్ష్మి వుంది. ఆ మాల మెడలో వున్నంతవరకూ అతడి ఎదురుగా నిలబడి ఎవ్వరూ యుద్ధం చెయ్యలేరు. వానరులు చెప్పుకుంటున్న ఒక ముఖ్యమైన సంగతి చెప్తాను విను. అది విన్నాక వారితో యుద్ధం ఎలా చెయ్యాలో నిర్ణయించుకుందువు గాని

మామూలుగా వంద లక్షలు ఒక కోటి. అలాంటివి పదివేల కోట్లు కలిపితే ఒక శంఖము అవుతుంది. నూరు వేల శంఖములు కలిపితే ఒక మహా శంఖము అవుతుంది. నూరు వేల మహా శంఖములు కలిసి ఒక బృందము అవుతుంది. నూరు వేల బృందములు ఒక పద్మము. నూరువేల పద్మములు ఒక మహాపద్మము. నూరు వేల మహాపద్మములు ఒక ఖర్వము. నూరు వేల ఖర్వములు ఒక సముద్రము. నూరు వేల సముద్రములు ఒక ఓఘము. నూరు వేల ఓఘములు ఒక మహా ఓఘము. ఇది సైన్యాన్ని గణించే మానము.

ఈ మానము ప్రకారం వీరి సైన్యము వెయ్యి కోట్ల వందశంఖములు, వెయ్యి

మహా శంఖములు, వందబృందములు, వేయి మహాబృందాలు, నూరు పద్మాలు, నూరుఖర్వములు, నూరుసముద్రములు, నూరుమహా ఓఘములు, అని నేను లెక్కించగలిగాననుకుంటున్నాను. కాని ఇంకాఎక్కువే (సుమారుగా ఒకటి పక్కన 870 సున్నాలు) సుగ్రీవుడు ఇంతటి బలముతో, మహావీరులైన రామలక్ష్మణులతో, విభీషణునితో నిన్నెదిరించడానికి సిద్ధంగా వున్నాడు. "రాజా రావణా చూశావా మరి, వారి బలం. ఇపుడింక దీనిని బట్టి వారినెలా జయించాలో, నువ్వే నిర్ణయించుకో" అన్నాడు.

వారు చెప్పిన మాటలు విన్న రావణుడు ఒకసారి సేనవైపు పరిశీలనగా చూశాడు. వానర రాజైన సుగ్రీవుని చూసి ఖంగుతిన్నాడు. శత్రుసేనల్ని పొగిడారని శుకసారణులపై విరుచుకుపడ్డాడు. వాళ్ళని నోటి కొచ్చినట్టల్లా తిట్టాడు. వారు సిగ్గుతో తలలు దించుకున్నారు. వారిద్దర్నీ తన కంటిక్కనిపించకుండా పొమ్మని కసురుకున్నాడు రావణుడు. వారు నోరెత్తకుండా వెళ్ళిపోయారు.

ఆ తర్వాత రావణుడు మహోదరుడు అనే వాడ్ని పిలిచాడు. నీతి విశారదలైన, తెలివైన మరో ఇద్దరి గూఢచారుల్ని పంపి వానరసేనని పరిశీలించి రమ్మని చెప్పమని ఆదేశించాడు. ముఖ్యంగా రాముడు నిదురించేటప్పుడు ఒంటరిగా నిదురిస్తాడా? వెంట ఎవరైనా వుంటారా చూసి రమ్మన్నాడు. అక్కడ సంగతులన్నీ క్షుణ్ణంగా పర్యవేక్షించి రమ్మన్నాడు. అంతలో శార్దూలుడనే ఇంకో రాక్షసుడలా వచ్చాడు. వారు ముగ్గురు కలిసి రావణునికి ప్రదక్షిణం చేసి దండంపెట్టి సువేలాద్రివైపు బయల్దేరారు. అక్కడ రహస్యంగా పొంచివుండి అందర్నీ పరిశీలించసాగారు. అయినా విభీషణుడు వారి రాకని ఇట్టే పసిగట్టాడు. వానరులందరికీ ఈ విషయం చెప్పేశాడు. వానరులుకోపంతో వారిని చంపబోయారు. కాని రాముడు వారిని వారించి, వచ్చిన దారినే వెళ్ళమని ఆ రాక్షసుల్ని గట్టిగా కేకలేసి పంపించేశాడు. వారు ప్రాణాలు అరచేత పెట్టుకుని వెనక్కి పారిపోయి, రాముడు మహాబలుడు అని రావణునితో చెప్పారు. శార్దూలుడు కూడా ఆ సంగతే నొక్కి చెప్పాడు.

వారి మాటలు విన్న రావణుడు చాలా కలవరపడ్డాడు. అప్పుడు శార్దూలుడు "మహారాజా ఆ వానర సేనలో ప్రవేశించటం కాని, వారికి తెలియకుండా పరిశీలించటం కాని అసాధ్యం. వారు చాలా పౌరుషము గలవారు. ప్రతిక్షణం రాముడు వారిని సంరక్షిస్తూ వుంటాడు. వాళ్ళతో రహస్యంగా మాట్లాడటానికి కూడా వీలు పడదు. రాముడు దయామయుడు కనుకనే అక్కడికి వెళ్ళిన మన వాళ్ళు ప్రాణాలతో తిరిగి వస్తున్నారు. వారు తమ సేనల్ని గరుడ పక్షి ఆకారంలో

వ్యూహం పన్ని సర్వసన్నద్ధాలతో ప్రాకారం దాటటానికి సిద్ధంగా వున్నారు. ఇప్పుడింక ఏం చెయ్యాలో నువ్వే నిర్ణయించుకో" అన్నాడు.

రావణుడు తలపంకించి "సరే ఆ విషయం అలా వుంచి, ఆ వానరుల చరిత్ర గురించి ఏమైనా తెలిస్తే చెప్పు" అన్నాడు ఆలోచిస్తూ.

అప్పుడు శరభుడిలా జవాబు చెప్పాడు. రాజా నీకిది వరకే చాలా సంగతులు మాకు తెలిసినవి చెప్పాము. ఇప్పుడు శార్దూలుడు మరికొన్ని విషయాలు చెప్తాడు అనగానే శార్దూలుడు,

"రావణా ఋక్షరజస్సు కుమారుడు సుగ్రీవుడు. వానరులందరికీ రాజు. మహా పరాక్రమవంతుడు. బ్రహ్మదేవుడు ఆవలించగా పుట్టిన వాడు. జాంబవంతుడు. గర్గరుడనే వాడు అతడ్ని పెంచి పెద్ద చేశాడు. బృహస్పతి కుమారుడు కేసరి. అతడి కుమారుడు హనుమంతుడు ఇదివరలో లంకకి వచ్చి అక్షకుమారుడు మొదలైన వారినందర్నీ చంపినవాడు. వరుణదేవుని కుమారుడు సుషేణుడు. సోముని కుమారుడు దుధిముఖుడు. సముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి వీరు ముగ్గురు స్వయంభువులు. మృత్యుదేవతతో సమానమైన వారు. అగ్ని దేముని కుమారుడు నీలుడు. ఇంద్రుని మనుమడు అంగదుడు. అశ్వనీ దేవతల కుమారులు మైందుడు, ద్వివిదుడు. యముని కుమారులైదుగురు, గజుడు, గవాక్షుడు, గవయుడు, శంభుడు, గందమాదనుడు. ఇంకా చాలా మంది సమర్థులున్నారు. వారందరి గురించీ చెప్పటం కష్టం. దశరథ కుమారులు రామలక్ష్మణులు. వారు పరాక్రమంలో అజేయులు. మునుపెందర్నో రాక్షసుల్ని చంపిన వారు. వారిని మించిన వీరులు ముల్లోకాల్లోనూ లేరు.

ఇంకా భాస్కరుని కుమారుడు శ్వేతుడు. జ్యోతిర్ముఖుడు. వరుణుని కుమారుడు హేమకూటుడు. విశ్వకర్మ కుమారుడు నలుడు. అతడే వారధి నిర్మించిన వాడు. నాకు తెలిసినంత వరకు వానరసేన చరిత్ర ఇది. రామలక్ష్మణులు, సుగ్రీవుడు, విభీషణుడు వీళ్ళందరి పర్యవేక్షణలో ఉక్కుకోటలా నిలబడి వుంది వానరసేన" అన్నాడు.

ఈ చరిత్ర విన్నాక రావణుడిలో కొంచెం బెరుకుకలిగింది. వెంటనే మంత్రుల్ని సమావేశపరిచాడు. వారందరితో కలిసి చాలా రకాలుగా ఆలోచనలు చేశాడు. తర్వాత వాళ్ళందర్నీ పంపేశాడు.

మాయావి, విద్యుత్ జిహ్వుడు అనే ఇద్దరు రాక్షసుల్ని పిలిపించాడు. "మీ బుద్ధికుశలతనంతా ఉపయోగించి, రాముని శిరస్సు నొకటి తయారు చెయ్యండి.

రాముని విల్లుబాణాలు కూడా తయారు చేయ్యండి. వాటితో సీతని మభ్యపెట్టాలి" అన్నాడు. అసలు నిజానికి మాయావి, విద్యుజ్జిహ్యుడు ఇద్దరు కారు ఒక్కరే. వాడి మహేంద్రజాలంతో ఇలా ఇద్దరిలా కనిపిస్తాడు. వాడు రావణుని ఆజ్ఞ శిరసావహించి బయల్దేరాడు. తన పంపిన గూఢచారులందరూ చెప్తున్న మాటలు విన్నాక రావణునిలో ధైర్యం సన్నగిల్లసాగింది. ఏ నరుల్ని వానరుల్ని తను నిర్లక్ష్యం చేసి వరం కోరుకున్నాడో వారే ఇంత ప్రళయకాలాగ్నిలా ముందుకు వస్తారని తను కలలో కూడా ఊహించలేదు. అలా అని తను మోజుపడి తెచ్చుకున్న సీతని వదులుకుందుకు మనస్పొప్పటం లేదు. అందుకే ఎలాగైనా ముందు సీతని లొంగదీసుకుంటే ఆ తర్వాత జరగాల్సిందేదో జరుగుతుంది అనుకుని మాయావి రాకకోసం ఎదురుచూస్తు కూర్చున్నాడు.

అంతలో మాయావి రాముని శిరస్సు బాణాలూ చేసి తెచ్చాడు. అవి చాలా సహజంగా వుంటం చూసి రావణుడు చాలా సంతోషించాడు. వానికి వెలలేని కానుకలు ఇచ్చి పంపాడు. వెంటనే అశోకవనానికి వెళ్ళాడు. అక్కడ సీతచాలా దీనంగా వుంది. చుట్టు కాపలా కాస్తున్న స్త్రీల మధ్య ముఖం దించుకుని ఏడుస్తూ రాముణ్ణి ధ్యానిస్తూ నేల మీద కూర్చుని వుంది. రావణుడు అహంకారంతో సీత దగ్గరకెళ్ళి

సీతా, నేను బ్రతిమాలినకొద్దీ నిష్ఠూరంగా మాట్లాడుతున్నావు. నీ భర్త ప్రతాపం చెప్పి మహాగర్విస్తున్నావు. చూడు నీ రాముడిపుడు యుద్ధంలో చచ్చాడు. ఇంకిప్పుడే నీకు నేనే దిక్కు మూర్ఖురాలా. చనిపోయిన వాని వల్ల నీకేం లాభం? నాకెంతమంది భార్యలున్నారో నీకు తెలుసుగా, వారందరికీ నాయకురాలివై భర్తగా నన్ను పొందు. పాపం నీ భర్త వానరుల్ని వారి రాజైన సుగ్రీవుణ్ణి నమ్ముకుని, సముద్రం దాటి వచ్చాడు. నిన్న సాయంత్రం సూర్యాస్తమయ సమయానికి వాళ్ళు దక్షిణ తీరానికి వచ్చారో లేదో , అర్ధరాత్రి వేళ హాయిగా నిద్రపోతున్న రామలక్ష్మణుల్ని ప్రహస్తుడు చంపి వచ్చాడు. మా రాక్షసులు వానర సేనని చెల్లాచెదురు చేశారు. విభీషణుడు పారిపోయాడు. సుగ్రీవుడి మెడ విరిగింది. హనుమంతుడి దవడ చితికింది" అంటూ. వికటంగా నవ్వుతూ సీతని చాలా క్షోభ పెట్టాడు. ఒక రాక్షస స్త్రీని పిల్చి, సీతకి వినిపించేలా నువ్వెళ్ళి విద్యుజ్జిహ్వుణ్ణి తీసుకురా" అన్నాడు.

అప్పుడు విద్యుజ్జిహ్వుడు యుద్ధాన్నించి తెస్తున్నట్లభినయిస్తూ, రాముడి తలనీ, బాణాల్ని తెచ్చి రావణుని పాదాల దగ్గర పెట్టి నమస్కరించి నిలబడ్డాడు.

అప్పుడు రావణుడు సీతవైపు గర్వంగా చూస్తూ అపహాస్యం చేస్తూ

"విద్యుజ్జిహ్వా ఆ కానుకలు సీత ఎదుట పెట్టు. మరణించిన భర్త తలని కడసారిగా ఆమెని చూస్కోని" అన్నాడు.

వాడు వెంటనే అవి సీత ఎదుట పెట్టి వెళ్ళిపోయాడు. రావణుడు దర్పంలా వాటిని సీత వైపు తోశాడు. విల్లునీ బాణాల్ని కాలితో తన్నాడు. "సీతా ఇదిగో నీ రాముని విల్లు. రాత్రి రావణుడు పంపగా ప్రహస్తుడు చంపి తెచ్చిన మావన మాత్రుడైన రాముని తల ఇదిగో. ఇకనైనా నాకు లొంగిపో" అన్నాడు కఠినంగా.

సీత ఆవేదనతో, ఆశిరస్సునీ, ధనుర్బాణాల్ని చూసింది. అది మమ్మూర్తులా రాముని తలలాగేనే వుంది. తలపై చూడామణి కూడా వుంది. మునుపు హనుమంతుడు చెప్పిన రామ సుగ్రీవుల మైత్రి గుర్తుచేసుకుంది. ఇప్పుడు రావణుడు కూడా ఆ సంగతే చెప్పాడు. కనుక జరిగిన సంఘటన యదార్ధమని నమ్మక తప్పలేదు. సీతకి దుఃఖం ఉప్పెనలా పొంగుకొచ్చింది. ఎలుగెత్తి ఏడుస్తూ కైకమ్మా నీ కోరిక తీరింది కదా. పధ్నాలుగు సంవత్సరాలు వనవాసానికి పంపటంలో నీ దుర్బుద్ధి రాముని అంతం చెయ్యాలనేగా. రఘువంశాన్ని వట్టేట్లో ముంచావు కదామ్మా. అంటూ గట్టిగా ఏడుస్తూ నేల మీద పడిపోయింది తెలివి తప్పి. కొంతసేపటికి లేచింది.

రాముని శిరస్సు గట్టిగా కౌగలించుకుని "మమాబాహూ వీరవ్రతా ఇంక నేను బ్రతికి ఏం ప్రయోజనం? స్త్రీకి భర్త లేకపోవడం మరణంతో సమానం. నా మూలంగానే కదా నీ మరణం సంభవించింది? జ్యోతిష్కులు నువ్వు దీర్ఘాయుష్మంతుడివన్నారు కదా. మరి ఈ అకాల మృత్యువెలా దాపురించింది? పండితులు కూడా నీ విషయంలో పొరపాటుపడ్డారా? రామా ఇంక నిన్ను నేను చూడలేనా? నన్నిలా అనాథలా వదిలి వెళ్ళటం నీకు న్యాయమేనా? ఈ సంగతి తెలిస్తే నీ తల్లి కౌసల్యా దేవి గుండె బ్రద్దలవదా? రావణా నన్ను కూడా తీసికెళ్ళి నా భర్త శరీరంపై పడెయ్యి. ఆ మహానుభావునితో సహగమనం చేస్తాను. ఆయన లేని ఈ పాపిష్టి బ్రతుకు నాకెందుకు?" అంటూ ఆ తలనీ, ధనుర్బాణాన్ని మార్చి మార్చి చూస్తూస్తుండగా, ఒక రాక్షసుడు వచ్చి రావణునికి నమస్కరించి

"రాజా తమరి సేనాపతియైన ప్రహస్తుడు, మంత్రులందరితో కలిసి వచ్చి, మీదర్శనానికై నిరీక్షిస్తున్నాడు" అని విన్నవించాడు. వెంటనే రావణుడు వెళ్ళిపోయాడు. రావణుడలా వెనక్కి తిరగ్గానే ఆ శిరస్సు, ధనుర్బాణాలూ మాయమైపోయాయి.

రావణుడు సభా మంటపానికి వెళ్ళాడు. రాముణ్ణి ఎలా ఎదిరిస్తే

బాగుంటుందో మంత్రులతో చర్చించాడు. వెంటనే భారీ నినాదాలతో నాలుగు వైపుల నుంచీ సైన్యాన్ని యుద్ధానికి బయల్దేరవలసిందిగా ఆజ్ఞాపించాడు. యుద్ధానికి సర్వసన్నద్ధాలు జరిగాయి.

ఇక్కడ అశోకవనంలో సీత కుమిలి కుమిలి ఏడుస్తోంది. అప్పుడు సరమ అనే రాక్షసి ఆమెని ఓదార్చి, పైకి లేవదీసి, ఒంటికి అంటిన దుమ్ము, ధూళి దులిపి

"అమ్మా ఓర్పు తెచ్చుకో. రావణుడు చెప్పిన మాటలు యదార్థాలు కాదు. రాముడు పురుషోత్తముడు ఆయనని నిద్రలో కూడా ఎవ్వరూ చంపలేరు. అంతేకాదు రాక్షసులంతా అతడికి ఎదుటబడి నిలవలేక రావణునితో రాముని రక్షణలో వున్న వానర సేన గురించి చెప్పగా, మా రాక్షస రాజు మతిచెడి, నీచబుద్ధితో మాయా శిరస్సు మాయా ధనుర్బాణాలు చేయించి నీ దగ్గరకి తెచ్చాడు.

అంతేగాని మహావీరులైన రామలక్ష్మణుల్ని, వారి రక్షణలో వున్న వానరుల్ని గాని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. నీకెన్నటికీ శోకము కలగదు తల్లీ. ధైర్యంగా వుండు. రాముడు అంతులేని వానర సేనతో వచ్చి దక్షిణ తీరాన విడిది చేసి వున్నాడు. అందుకే మంత్రులతో సంప్రదించడానికి రావణుడు వెళ్ళాడు" అని సరమ సీతతో చెప్తుండగానే యుద్ధభేరీలు వినిపించాయి. అపుడు సరమ మళ్ళీ

"సీతా-విన్నావుగా భయంకరమైన యుద్ధ భేరీలు వినిపిస్తున్నాయి. నీ భర్త యుద్ధంలో రాక్షసుల్ని జయించి, నిన్ను తప్పక తనతో తీసికెళ్తాడు" అంటూ సీత కన్నీళ్ళు తుడిచి, ఊరడించి, మళ్ళీ రహస్యంగా, "సీతా నేను అదృశ్యరూపంలో వుండి, ఆకాశంలో ప్రయాణం చెయ్యగలను. నీసంగతి రామునికి చెప్పాలని వుంది. వెళ్ళమంటావా? చెప్పు" అని అడిగింది. ఆమె మాటలకి సంతోషించి కృతజ్ఞతగా ఆమె వంక చూస్తూ సీత ఇలా అంది.

"సరమా, నీ సామర్థ్యం నాకు తెలుసు. నామీద నీకు నిజంగా అభిమానముంటే ముందుర ఆ నీచరావణుడు ఏం చేస్తున్నాడో చూసిరా. మళ్ళీ ఎలాంటి మాయాజాలం పన్నుతున్నాడో అని భయంగా వుంది" అని సురమని పంపింది. సరమ వెళ్ళి రావణుడు మంత్రులతో చేస్తున్న మంత్రాంగం అంతా చూసి మళ్ళీ అశోకవనానికి వచ్చింది.

సీత కాంతిహీనమైన ముఖంతో ఆమె కోసమే ఎదురుచూస్తూ వుంది. ఆమె

రాగానే కౌగలించుకుని దగ్గర కూర్చోబెట్టుకుని సంగతి చెప్పమంది.

అప్పుడు సరమ "అమ్మా రావణుని తల్లి కైకసి, అనిరుద్ధుడు అనే మంత్రి రావణునికి అనేక విధాల బోధలు చేసి నిన్ను మళ్ళీ రామునికి ఇచ్చెయ్యమన్నారు. రావణా జనస్థానంలో పధ్నాలుగు వేల మంది రాక్షసుల్ని ఖరదూషణాది మహావీరుల్ని రాముడొక్కడే చంపాడని విన్నాము కదా. రాముని బలమేపాటిదో ఆ సంగతి వల్ల తెలియటం లేదా? ఆనాడు హనుమంతుడొక్కడే లంకలో ఎంత అలజడి లేపాడో కళ్ళారా చూశాం కదా. ఒక వానరుడు ఆకాశంలో అనుల్లంఘనీయమైన సముద్రాన్ని దాటి వచ్చాడే, మహాబలవంతులైన రాక్షసుల్నెందర్నో చంపాడే, అటువంటి వానరవీరులు కోట్ల కొద్దీ తోడు వుండగా రాముడు చెయ్యలేనిది ఏముంటుంది? కనుక ఇప్పటికైనా నువ్వు సీతమ్మని రాముని దగ్గరకి పంపటం మంచిది. నువ్వింకా ఇలాగే మూర్ఖంగా వుంటే, అతడు నిన్ను వదలడు. చంపి తీర్తాడు. యుద్ధమే జరిగితే నువ్వు బ్రతికి బయటపడడం జరగదు" అని వారు చాలా విధాల నచ్చచెప్పారమ్మా. కాని రావణుడుమాత్రం తన మంకుపట్టు వదలలేదు. సీతా ఇంక నీకు దిగులు అనవసరం. రావణుడు రాముని చేతిలో మరణించక తప్పదు" అని సరమ సీతకి ధైర్యం చెప్తుండగానే యుద్ధభేరీ నినాదంతో లంకంతా మారుమ్రోగింది. శంఖారావాలు, భేరీవాద్యాల ధ్వనులు మిన్నుముట్టాయి. వానరుల కిలకిలా రావాలు కూడా వినవచ్చాయి. రాముడు యుద్ధానికి తరలి వస్తున్నాడని, రాక్షసులు గ్రహించారు. ఆ శబ్దాలు విన్న రావణుని మనస్సులో కలవరం చెలరేగింది.

పరధ్యాన్నంగా ఆలోచిస్తూ మంత్రులతో ఇలా అన్నాడు.

"మీరంతా రాముని బలపరాక్రమాలు నా వద్ద పొగిడారు. నేను వినకూడని మాటలు చెప్పారు. మీరంతా కూడా యుద్ధంలో సాటిలేని వీరులే. అయినా ఇలాంటి మాటలు చెప్పటం సబబేనా? లేక రాముని పరాక్రమం తల్చుకుని పిరికి వారయ్యారా?" అని వారిని ఎన్నివిధాలో దూషించాడు. వారంతా ఏం మాట్లాడాలో తెలియక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

అప్పుడు రావణుని మేనమామ అయిన మాల్యవంతుడు, ఇలా అన్నాడు. అతడు పరమధార్మికుడు.

"రావణా, రాజు అయినవాడు, రాజనీతిలో పరిపూర్ణ విజ్ఞానం కలవాడై వుండాలి. అన్వీక్షకి అంటే తనంతట తాను ఆలోచించే జ్ఞానం కలవాడైనా అయి వుండాలి. త్రయి అంటే మూడు వేదాల సారము తెలిసిన వాడైనా అయి వుండాలి.

దండ అంటే నీతి ఏదో అవినీతి ఏదో తెలిసిన వాడై వుండాలి. ఈ మూడు విషయాల్లో పరిపూర్ణ జ్ఞానం కలవాడే సరియైన రాజు.

శత్రుబలము కన్నా తన బలము తక్కువ అని తెలిసినప్పుడు, తన వారి రక్షణ కోసం శత్రువుతో సంధి చేసుకోవాలి. కాని శత్రువుని అవమానించకూడదు. కనుక నీ ప్రజల శ్రేయస్సు కోసం నువ్వు రామునితో సంధి చేసుకోవటమే ఉచితం. దేవతలు, గంధర్వులు, ఋషులు, అందరూ రాముని విజయం కలగాలని కోరుకుంటున్నారు. కనక ఎప్పుడూ ధర్మమే జయిస్తుంది. నువ్వు అన్నీ ధర్మ విరుద్ధమైన పనులే చేశావు. కనక నీకు అపజయం తప్పదు. కనక ఇప్పటికైనా సీతమ్మని రామునికి సమర్పించి క్షమించమని కోరుకో.

ఒక్కసంగతి తెలుసుకో. రాముడు మానవ మాత్రుడు కాదు. మానవ రూపంలో వున్న మహావిష్ణువై వుంటాడు. ఎందుకంటేమానవ మాత్రులెవ్వరూ సముద్రంపై వారధి నిర్మించలేరు. అది చాలా అద్భుతమైన విషయం. కనుక పురుషోతమతముడైన రామునితో సంధి చేసుకో" అని ఎన్నోవిధాల రావణునికి హిత బోధ చేశాడు.

కాని రావణుడు మాత్రం తన పట్టు ఆవగింజంతైనా సడలించుకోలేదు. అసహనంగా మేనమామ వంక చూస్తూ క్రోధంతో కనుబొమ్మలు ముడివేశాడు.

"ఔరా నాకు మంచి మాటలు చెప్తున్నానంటూనే, అన్నీ నాకప్రియమైన మాటలు చెప్తున్నావే! నువ్వు కూడా శత్రుపక్షంలో చేరావన్న మాట. నీ మాటలు చాలా తెలివి తక్కువగా వున్నాయి. రాముడు, సమర్ధుడా? నీకెలా తెలిసింది.

ఒక సామాన్య మానవుడు, దీనుడు, కోతుల నాశ్రయించిన వాడు, ఒంటరి వాడు, తండ్రి పొమ్మనగానే పౌరుషం లేకుండా రాజ్యాన్ని వదిలేసి వచ్చినవాడు. అతడు! సమర్ధుడా? నేను, రాక్షసులకి ప్రభువుని. దేవతలు సైతం నా పేరు చెప్తే గడగడ వణుకుతారు. అంతటి పరాక్రమ వంతుణ్ణి నన్ను తక్కువ చేసి మాట్లాడుతున్నావా? నీకు నామీద కాని ద్వేషం లేదు కదా? ఎందుకు నన్ను పిరికి పందలా జమవేస్తున్నావు? శత్రువులు నీకేమైనా లంచం ఇచ్చారా? నువ్వు పండితుడివి. నీతి శాస్త్రం తెలిసిన వాడివి. ఎంతో కష్టపడి తెచ్చుకున్న సీతని, ఎలా వదులుకోగలననుకుంటున్నావు? రాజైన వాడు భుజబలంతో సంపాదించినది వదలకూడదు.

అతి స్వల్ప కాలంలోనే, ఆ వానర మూకని, రామలక్ష్మణుల్ని మట్టుబెడతాను. అంతే కాని, ఈ రావణుడు రాముని వద్ద భయపడడమా!

ఒక వేళ యుద్ధంలో ప్రాణాలు కోల్పోవలసి వస్తే, నిలబడి రెండుగా చీల్చబడతాను కాని శత్రువు ముందు వంగను. ఆ రాముడు తన మృత్యువు కోసమే సముద్రాన్ని దాటి వచ్చాడు" అని రావణుడు అహంకారంతో అంటున్న మాటలు విని అటువంటి అవివేకికి, ఉపదేశం చేసినందుకు, మాల్యవంతుడు చాలా సిగ్గుపడ్డాడు. చేసేది లేక "విజయోస్తు" అని దీవించి వెళ్ళిపోయాడు. రావణుడతడ్ని పట్టించుకోకుండా మంత్రులతో మళ్ళీ సమాలోచనలు జరిపాడు. ఒక పథకం తయారు చేసి,

తూర్పు ద్వారం దగ్గర పెద్ద సేనతో ప్రహస్తుణ్ణి, దక్షిణ ద్వారం దగ్గర మహా పార్శ్వుడు, మహోదరుడు అనే వీరుల్ని, పశ్చిమ ద్వారం దగ్గర తన కుమారుడైన ఇంద్రజిత్తుని తగిన సేనలతో వుంచి, ఉత్తర ద్వారం దగ్గర శుకసారణులనీ, వాళ్ళతో పాటు తను కూడా, పెద్ద సేనలతో వుండాలని నిర్ణయించాడు. పట్టణ మధ్య భాగంలో చాలా మంది రాక్షసులతో, విరూపాక్షుని వుండమని ఆదేశించాడు.

ఇలా చాలా పటిష్టంగా వ్యూహాన్ని ఏర్పాటు చేసి, ఇంక తనకేం భయంలేదని, ఊపిరి పీల్చాడు. తర్వాత మంత్రులందర్నీ తగిన ఏర్పాట్లు చెయ్యమని పంపేశాడు. రావణుడు తన అంతఃపురానికి వెళ్ళిపోయాడు. ఇక్కడ లంకలో వృత్తాంతం ఇలా వుండగా,

అక్కడ సువేలాద్రి మీద విడిది చేసిన రామదండులో, ప్రముఖులంతా కూర్చుని, జరగవలసిన కార్యక్రమం గురించి ఆలోచించారు. ముందుగా శ్రీరాముడు, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, విభీషణుడు, అంగదుడు, లక్ష్మణుడు, శరభుడు, సుషేణుడు, మైందుడు, ద్వివిధుడు, గజుడు, గవాక్షుడు, కుముదుడు, నలుడు, పవనుడు మొదలైన మహావీరులంతా, లంక దగ్గర చేరి ఏ విధంగా దాడిచెయ్యాలి? అని ఆలోచించారు. రావణపాలితమైన లంక ఈ శిఖరాగ్రంపై నించి చక్కగా కనిపిస్తోంది. దేవాసుర పన్నగ గంధర్వులలో ఎవ్వరూ దీనిని జయించలేరు. కాని ఇప్పుడు మనం దీన్ని జయించాలి.

అందుకు ఏం చేస్తే బాగుంటుందో, మీరంతా ఆలోచించాలి చెప్పండి" అని రాముడు వానర వీరులందర్ని ప్రశ్నించాడు. అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు.

"రామచంద్రా, నా అనుచరులు నలుగురు ఇప్పుడే లంకకి వెళ్ళి అక్కడి పరిస్థితి సమీక్షించి వచ్చారు. వాళ్ళు చెప్పిన సంగతి ఏమిటంటే, తూర్పు ద్వారం దగ్గర ప్రహస్తుడు, దక్షిణ ద్వారం దగ్గర మహాపార్శ్వ మహోదరులు, పశ్చిమ

ద్వారం దగ్గర ఇంద్రజిత్తు, ఉత్తర ద్వారం దగ్గర రావణుడు, పెద్ద సేనతో, పటిష్టమైన ఏర్పాట్లతో నిలబడి వున్నారు. వీరంతా మహా వీరులు.

పట్టణ మధ్యలో వున్న ఆయుధాగారాన్ని సేనానివేశాన్ని విరూపాక్షుడనే వాడు సంరక్షిస్తున్నాడు అని వారు చెప్పారు. రామచంద్రా, పూర్వము నా అన్నగారికీ, కుబేరునికీ యుద్ధం జరిగినప్పుడు, రావణుని వెంట అరవై లక్షల మంది సైనికులు వెళ్ళారు. వారంతా రావణునితో సమానమైన బలము కలవారే. అప్పటి కంటే ఇప్పుడు సైన్యం చాలా రెట్లు పెరిగింది. శత్రువు యొక్క బలాన్ని వర్ణిస్తున్నానని నా మీద కోపపడవద్దు. అక్కడి బలాలపై మనకో అవగాహన వుండాలని చెప్తున్నాను. కనక వారి వ్యూహరచనకి అనుగుణంగా మన చతురంగ సైన్యాన్ని తగిన పద్ధతిలో విభజించి నియమిస్తే శత్రువుని గెలవటం సులభమని నా అభిప్రాయం" అని విభీషణుడు చెప్పగా, రాముడు,

"విభీషణా నీ ఆలోచన చాలా బుగుంది. తూర్పుద్వారం దగ్గరవున్న ప్రహస్తుణ్ణి ఎదుర్కోవటానికి నీలుడు తన సైన్యంతో వెళ్తాడు. దక్షిణద్వారం దగ్గరవున్న మహాపార్శ్వ మహోదరుల్ని అంగదుడు తన బలంతో ఎదుర్కోటానికి హనుమంతుడొక్కడే సమర్థుడు. ఇంక ఉత్తరద్వారం దగ్గరవున్న రావణుని నేను, లక్ష్మణుడు ఎదుర్కొంటాము. దేవగంధర్వ ఋషుల్ని అష్టకష్టాలకు గురిచేసిన ఆ దుర్మార్గుణ్ణి నేనే స్వయంగా సంహరిస్తాను. ఇంక మన సైన్యం మధ్యభాగంలో వానర ప్రభువు సుగ్రీవుడు, జాంబవంతుడు, నువ్వు నిల్చి రక్షిస్తుండండి. అందరూ ఒక్క సంగతి మాత్రం గుర్తుంచుకోండి.

మీరందరూ కామరూపులే, అయినా యుద్ధం జరుగుతున్నంత సేపూ, ఏ ఒక్కరూ కూడా మానవరూపం ధరించకూడదు. వానరులంతా వానరరూపంలోనే వుండాలి. నేనూ, లక్ష్మణుడు, విభీషణుడు, అతడి అనుచరులు నలుగురు మొత్తం మేము ఏడుగురం మానవ రూపంలో వుంటాము" అంటూ అందరికీ కర్తవ్యం బోధించి రాముడు లంకనింకోసారి పరిశీలించాలని సువేలాద్రి శిఖరం ఎక్కాడు.

అప్పుడు విభీషణుడు తన పక్కనే వున్న సుగ్రీవునితో "సుగ్రీవా మనం కూడా రాముని వెంట సువేలాద్రి పైకి ఎక్కుదాం. రాత్రంతా అక్కడే వుండి రావణుని సేని బాగా పరిశీలిద్దాం" అన్నాడు. తన వెంట వస్తున్న వారిని చూసి రాముడు "ఈ నీచుడు నా భార్యనపహరించి, వాడి చావు వాడు కొని తెచ్చుకున్నాడు. కుల మర్యాదనీ, ధర్మాన్ని పక్కకి నెట్టాడు. వాడి పేరు వింటే చాలు నాలో రోషం పెల్లుబికి వస్తోంది. వాడి మూలంగా రాక్షసజాతి అంతా నశించబోతోంది" అని రావణుని గురించి చెప్తుండగా ముగ్గురూ సువేలాద్రి

శిఖరంపైకి చేరుకున్నారు. వారి వెంట హనుమంతుడు, అంగదుడు, మిగిలిన వానరవీరులలో ముఖ్యమైన వారు కూడా వెళ్ళారు. వారి వెంట వేల కొద్దీ వానరులు కొండపైకిఎక్కారు. వారంతా అక్కడ్నించి లంకని పరిశీలించి చూశారు.

ఆ పట్టణం ఆకాశాన్నంటుతోందా అన్నట్లుంది. దాని ద్వారాలు చాలా సుందరంగా వున్నాయి. ప్రాకారాలు, పరిఘలు చక్కగా ఏర్పాటు చెయ్యబడి వున్నాయి. ఆ ప్రాకారాల చుట్టూ రాక్షసులు నిలబడి వున్నారు. అందరూ యుద్ధానికి సన్నద్ధులై వున్నారు. ఆ విధంగా వారు లంకని పరిశీలించి చూస్తుండగానే సూర్యుడు అస్తమించాడు. కొద్దిసేపట్లోనే పున్నమి చంద్రుని కాంతితో ఆకాశం నిండిపోయింది.

అది పున్నమిరాత్రి కనక వారు ఆ రాత్రి పర్వతంపైనే వుండాలని నిర్ణయించుకున్నారు. ఆ రాత్రి వానరులంతా హాయిగా సువేల పర్వతంపై విహరించారు. త్రికూట పర్వతం మూడు శిఖరాలు కలిగి వుంది. అందులో ఒకటి సువేలము. అదంతా అందమైన తోటల తోటీ, మృగముల తోటి, పక్షుల తోటీ నిండి వుంది. దాని మీదే ఇప్పుడు వీరంతా వున్నారు.

రెండో శిఖరం చాలా ఎత్తైనది. అది ఆకాశాన్నంటుతోందా అన్నట్లుండి తెల్లగా వెండిలా మెరుస్తోంది. దాని విస్తీర్ణం నూరు యోజనాలు. దాని మీదే లంకా పట్టణం నిర్మించబడి వుంది. తెల్లని ఎత్తైన గోపురాలు, బంగారు వెండి తాపడం చేసిన ప్రాకారాలు, మధ్యలో ప్రాసాదాలు, విమానాలు నిర్మించబడి వున్నాయి. ఆ పట్టణంలో వెయ్యి స్థంభాల భవంతి ఒకటి వుంది. అది కైలాస గిరిలా వుంది. ఈ విధంగా అత్యంత వైభవోపేతమైన లంకా పట్టణాన్ని రాముడు చూశాడు. ఆశ్చర్యపోయాడు.

ఎదురుగా త్రికూటగిరి శిఖరంపై రావణుడు నిలబడి వుండటం అందరూ చూశారు. ఇద్దరు పరిచారకులు అటు ఇటు నిలబడి, వింజామరలు వీస్తున్నారు. తలపై తెల్లని విజయఛత్రము వుంది. సర్వాలంకార భూషితుడై మెరుపుతీగలతో కూడిన పెద్ద మేఘంలా వున్నాడు. సుగ్రీవుడు రావణుడ్ని చూసి ఆవేశం పట్టలేక, ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరి, రావణుడి ఎదుట దూకాడు. రావణుని వైపు ఈసడింపుగా చూస్తూ "రాక్షసా-లోకనాథుడైన శ్రీరాముని మిత్రుణ్ణి నేను. దాసుణ్ణి కూడా. రాముడు అసమాన పరాక్రమ తేజోవిరాజుడు. నువ్వు నా ప్రాణమిత్రుడికి ద్రోహం చేశాడు. ఇప్పుడు నా కంటబడ్డావు. ఇంక ప్రాణాలతో వుండవు" అంటూ ఛెంగున రావణుని మీదికి దూకాడు. రావణుడి తలపై కిరీటం తీసి కిందికి విసిరేశాడు. వెంటనే రావణుడు తన రెండు చేతేలతో సుగ్రీవుణ్ణి ఒడిసిపట్టి

"సుగ్రీవా...ఇంతకాలం నాకంట పడలేదు కనక సుగ్రీవుడిగా మిగిలిపోయావు. ఇప్పుడు నువ్వు నా కంటపడ్డావు. ఇంక హీనగ్రీవుడు కాక తప్పదు" అంటూ నేలమీదికి విసిరేశాడు. క్రిందపడ్డ సుగ్రీవుడు బంతిలా మళ్ళీ పైకి లేచి, తన రెండు చేతులలతో రావణుని గట్టిగా పట్టుకున్నాడు. ఇద్దరూ ఒకరి నొకరు పట్టుకుని పెనుగులాడసాగారు. వారి శరీరాలు చెమటతో రక్తంతో తడిసిపోయాయి. పిడికిళ్ళతో అరచేతులలతో ఒకళ్ళనొకళ్ళు మోదుకుంటున్నారు. అలా చాలా సేపు వాళ్ళు బాహు యుద్ధం చేశారు. ఒకరి నొకరు ఎత్తిపడేసుకుంటున్నారు. రెండు మత్త గజాల్లా భీకరంగా పోరాడసాగారు. సుగ్రీవుడి ధాటికి ఆగలేక రావణుడు తన మాయాజాలం ప్రయోగించాడు. ఎప్పుడైతే రావణుడు మాయాయుద్ధం ప్రదర్శించాడో, సుగ్రీవుడాసంగతి గ్రహించి, ఆకాశంలోకి ఎగిరిపోయాడు. తిరిగి వెళ్ళి రాముని ప్రక్కన వాలాడు.

అంతవరకు సుగ్రీవుడేమయ్యాడో అని ఆందోళన పడుతున్న రాముడు, అతడ్ని చూసి మహోదానందం పొందాడు. అందరూ సుగ్రీవుణ్ణి చాలా మెచ్చుకున్నారు. సుగ్రీవుని శరీరమంతా రక్తంతో చెమటతో తడిసి వుంది. అప్పుడు రాముడు సుగ్రీవుణ్ణి గట్టిగా కౌగలించుకుని,

"సుగ్రీవా ఎంత సాహసం చేశావు! నాతోమాట మాత్రమైనా చెప్పకుండా అలా వెళ్ళిపోయావే, మేమంతా ఎంత ఆందోళన పడ్డామో తెలుసా? ఎప్పుడూ ప్రభువు ఇంతటి సాహసం చెయ్యకూడదు. నీకేమైనా జరగకూడనిది జరిగితే, ఆ తర్వాత నాకు సీత దక్కితే ఏం ప్రయోజనం? నువ్వు లేని నాడు నాకు నా తమ్ముళ్లే కాదు, ఈ శరీరం కూడా అక్కరలేదు. అంటూ రాముడు సుగ్రీవుణ్ణి గట్టిగా కౌగలించుకుని, పరిపరివిధాల బాధ పడ్డాడు. అందుకు సుగ్రీవుడు రాముణ్ణి అనునయిస్తూ ఇలా అన్నాడు.

"రామా - నీ అర్ధాంగిని అపహరించిన ఆ నీచుడు, నా కంటపడగానే ఆవేశం పట్టలేకపోయాను. అందుకే అంత సాహసం చేశాను. మన్నించు. నా శరీరం నీ సేవకోసమే కదా" అంటున్న సుగ్రీవుని ప్రేమకి రాముడు అతణ్ణెంతో అభినందించాడు. ఆ తర్వాత లక్ష్మణునితో ఇలా అన్నాడు.

"ఓ లక్ష్మణా మన యూథపతులతో సైనికులందరికీ తియ్యని పండ్లు, చల్లని నీరు అందించమని చెప్పు. మనం ఇంక వ్యూహం సిద్ధపరచి, యుద్ధానికి సిద్ధంగా వుండాలి. లంకని, చుట్టుముట్టాలి" అన్నాడు. ఆ తర్వాత అందరూ సువేలాద్రి శిఖరం నించి దిగటం మొదలు పెట్టారు. సుగ్రీవుడు రాముడు చెప్పిన ప్రకారం

యుద్ధానికి ప్రేరణ ఇచ్చాడు. తెల్లారగానే రాముడు ధనస్సు ధరించి, లంకవైపు నడిచాడు. విభీషణుడు సుగ్రీవుడు, వానర పరివారము అంతా రాముడ్ని అనుసరించారు. వానరులంతా కొండశిలలు పట్టుకు నడిచారు. రామలక్ష్మణులు దుర్భేధ్యమైన లంకా పురం దగ్గరగా చేరారు. వానర సేనంతా ఆ నగరాన్ని చుట్టుముట్టారు. ఎవరికి నిర్దేశించిన ప్రదేశాల్లో వాళ్ళు నిలబడి, వ్యూహరచన చేశారు. రాముని ఆజ్ఞమేరకు ఒక్కొక్క ద్వారం దగ్గర ఒక కోటి సైనికులు నుంచున్నారు. వాయువు కూడా చొరబడ లేని లంకని వీరంతా ఇలా చుట్టుముట్టడం చూసి రాక్షసులు కూడా ఆశ్చర్యపోయారు.

లంకని ముట్టడించటం అయ్యాక, అందరూ ఆలోచించారు. ముందరే సరాసరి యుద్ధానికి వెళ్తే బాగుంటుందని, ముందుగా ఎవర్నైనా దూతని పంపితే బాగుండందనీ తీర్మానించారు. విభీషణుడు కూడా అదే బాగుంటుందన్నాడు. అంగదుడ్ని దూతగా పంపితే బాగుంటుందని సూచించాడు.

అప్పుడు రాముడు అంగదుడ్ని పిలిచి, "అంగద కుమారా... నువ్వు నిర్భయంగానీ ప్రాకారం దాటి లంక లోపలికి వెళ్ళు. నేను చెప్పమన్నట్లు రావణునితో ఇలా చెప్పు "రావణా రాజ్యలక్ష్మి నిన్ను విడిచి వెళ్ళిపోయింది. నీకు చావు దగ్గర పడింది. నవ్వు వరం పొందానన్న గర్వంతో, దేవతలకు, గంధర్వులకి, అప్సరసలకు యక్షకులకు, బాధ కలిగించి, ఎన్నెన్నో మహాపాపాలు చేశావు. ఇప్పుడింక ఆ వర ప్రభావం నశించింది. ఎవని భార్యనైతే దొంగతనంగా అపహరించి తెచ్చావో, అతడే ఇప్పుడు దండధరుడై నీ లంకా ద్వారం దగ్గర నిల్చి వున్నాడు. ఏ బలం చూసుకుని, నన్ను మోసం చేసి సీతని అపహరించావో, ఆ బలం ఇప్పుడు ప్రదర్శించు. వెంటనే సీతని తెచ్చి నాకిచ్చి శరణు కోరావా సరి. లేకపోతే, నా తీక్షణమైన బాణాలతో నీ రాక్షస జాతినంతా తుదిముట్టిస్తాను. నీకు సహాయంగా వున్న వారంతా మూర్ఖులు. నువ్వు పాపాత్ముడివి. నీ స్వరూపం నీకు తెలియదు. సీతనిచ్చే వుద్దేశ్యం లేకపోతే, ధైర్యంగా నా ముందు నిలబడి యుద్ధం చెయ్యి. ముల్లోకాలలోనూ ఎక్కడ దాగున్నా నన్ను తప్పించుకుని, బ్రతకలేవు. ఆ తర్వాత నీకు శ్రాద్ధకర్మ చేసేందుకు కూడా ఎవ్వరూ వుండరు. అందుకుని, నీ శ్రాద్ధం ఇప్పుడే నువ్వు పెట్టేసుకో. ఆఖరి సారిగా నీకీ అవకాశం ఇస్తున్నాను." అంటూ రాముడు, అంగదునికి తన సందేశం చెప్పాడు.

వెంటనే అంగదుడు మెరుపుతీగలా ఆకాశంలోకెగిరాడు. మరునిమిషం, రావణ మందిరంలో వాలాడు. అక్కడ రావణుడు మంత్రులతో కొలువు తీరి వున్నాడు. సరాసరి ఆ కొలువుకూటం మధ్యలో వెళ్ళి నిలబడ్డాడు నిర్భయంగా.

నిలబడి రాముని సందేశాన్ని వినిపించాడు. రాముడు చెప్పమన్న మాటలన్నీ తు.చ. తప్పకుండా వినిపించాడు. ఆ తర్వాత తన గురించి చెప్పుకున్నాడు.

"రావణా నేను వాలిపుత్రుడినైన అంగదుణ్ణి. నా పేరు ఇది వరకే విని వుంటావు. కౌసల్యా నందవర్ధనుడైన రాముడు నీతో ఇలా చెప్పమన్నాడు. నేను కోసలేంద్రుడైన రాముని దూతను. ఆయన తన మాటలుగా చెప్పమన్న మాటలు విను. నీకు పౌరుషం వుంటే, పట్టణం వదలి బయటకి వచ్చి యుద్ధం చెయ్యి. మగవాడివనిపించుకో. నిన్ను సమూలంగా సంహరించటానికే నేను వచ్చాను. నువ్వు చస్తే ముల్లోకాలూ శాంతిస్తాయి. సీతని తెచ్చినాకప్పగించావా సరే. లేకపోతే నీ చావు ఎంతో దూరం లేదు. నీ రాజ్యాన్ని విభీషణునికి పట్టం కట్టాను. దేవదానవ యక్ష ఋషి గణాలకి చెప్పరాని బాధలు కలిగించావు. నీ చావు కోసం వారంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు" అని రాముడు నీతో చెప్పమన్నాడు అని అంగదుడు పలుకగానే, ఆ మాటలు రావణునికి ములుకుల్లా తాకాయి. రోషంతో కన్నులెఱ్ఱబారగా, మంత్రులతో "వీడ్ని పట్టుకుని చంపండి" అని ఆజ్ఞాపించాడు.

వెంటనే నలుగురు బలవంతులైన రాక్షసులు అంగదుడ్ని పట్టుకున్నారు. అంగదుడు ఒక్కసారి విదిలించి, వారిని బలంగా చంకల్లో ఇరికించుకుని, ఒక్క ఎగురు ఎగిరి, ప్రాసాదం పైభాగానికి చేరాడు. అలా పై పైకి ఎగిరి, ఆకాశంలోంచి వారిని కిందపడేశాడు. తనకాళ్ళతో రావణుని ప్రాసాదం అగ్రభాగాన్ని కూలదోశాడు. మరొక్కసారి గట్టిగా తన పేరుచెప్పి, గంభీరంగా గర్జించి, రాక్షసులందరికీ గుండెలలో గుబులు కలిగించి, వెనక్కి తిరిగి వెళ్ళి రాముని దగ్గర వాలాడు. తిరిగివచ్చిన అంగదుని చూసి వానరులంతా చాలా ఆనందించారు.

అంగదుడలా తన మేడ కూల దోసేసరికి, రావణునికి చాలా కోపం వచ్చింది. మనస్సులో ఎక్కడో దిగులు కూడా కలిగింది. నిరాశతో గట్టిగా నిట్టూర్చాడు. వెంటనే యుద్ధం చెయ్యాలనే తలంపు కలిగింది. లేచి బయల్దేరాడు.

వానర సేనలన్నీ లంకని చుట్టు ముట్టి వుండగా మహావీరుడైన సుషేణుడు పర్వతాకారంతో అన్ని ద్వారాల దగ్గరా సంచరించి పర్యవేక్షించాడు.

వానరులు, కొన్ని అక్షౌహిణీల సైన్యం, సముద్రాన్ని దాటి వచ్చింది. లంకకి అన్ని వైపులా చీమలబారుల్లా చుట్టుముట్టిన వానరుల్ని చూసి రాక్షసులు చాలా భయపడిపోయారు. ఆశ్చర్యపోయారు కూడా. ప్రాకారానికీ అగడ్తకీ మధ్య భాగమంతా వానరసేనతో నిండిపోయింది. రాక్షసులు భయంతో హాహాకారాలు చేశారు. వారంతా అప్రమత్తులై ఆయుధాలు ధరించి సంచరిస్తున్నారు. ఇంక

యుద్ధం ఆరంభం కాబోతోంది.

రాక్షసులు రావణుని మందిరంలో ప్రవేశించి, వానరులు కోటని చుట్టుముట్టారని చెప్పారు. రావణునికి పట్టరాని కోపం వచ్చింది. రక్షణశాఖని మరింత కట్టుదిట్టం చేసి, ప్రాసాదంపైభాగానికి వెళ్ళాడు. లంక చుట్టూ అపారమైన వానర సేన వ్యాపించి వుండటం చూశాడు. ఎటు చూపినా వారే. భూమినంతా కబళించేస్తారేమో అన్నట్లున్నారు. రావణునికి మతి పోయింది. వీరినెలా అంతమొందించాలా అని చూశాడు. ఆలోచించాడు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని మళ్ళీ చూశాడు.

రాముడు ఆనందంగా ఉత్సాహవంతులైన వానరులతో లంకని సమీపిస్తున్నాడు. ఆ మహాత్ముని మనస్సులో ఒకసారి సీతమ్మ దీనవదనం మెదిలింది.

"అయ్యో నా కోసం సీత శోకసంతప్తయై నేలమీద పడుకుంటోంది కదా. ఎన్ని బాధలు పడ్తోందో అని ఒక్కసారి ఆమెని తల్చుకుని దుఃఖించాడు. సీతగుర్తుకి రాగానే రాక్షసులపై తీరని క్రోధం కలిగింది. వెంటనే "కనిపించిన రాక్షసులందర్నీ చంపండి" అని ఆజ్ఞాపించాడు. వానరులంతా ఒక్కసారి సింహనాదం చేశారు.

"రామాజ్ఞ అయింది. ఇంకకొండరాళ్ళు విసురుదాం. పిడికిళ్ళతో లంకా నగరాన్ని పెకిలించి వేద్దాం" అని మనస్సులో అనుకుంటూ. పెద్ద పెద్ద శిలలు పట్టుకుని నిలబడి వున్నారు. ప్రసాదం అగ్రభాగాన వున్న రావణుడు వారికి కనిపించాడు. అయినా వారేం లెఖ్ఖచెయ్యలేదు. అందరూ ప్రాకారం పైకి ఎగబాకారు. ఎఱ్ఱని ముఖాలతో బంగారు కాంతితో, మహా వృక్షాలు ఆయుధాలుగా ధరించి, రాముని కోసం ప్రాణాలైనా సరే ఇవ్వటానికి సిద్ధంగా నిలబడ్డారు. ప్రాకారం పైభాగాన్ని, ప్రవేశద్వారాన్ని పడగొట్టడం ప్రారంభించారు. వేలకొద్దీ, కోట్ల కొద్దీ వానరులు కోటగోడ నిండా ఎక్కేశారు. ఒక చోట నించి, మరో చోటికి గెంతుతూ రామలక్ష్మణులకి, సుగ్రీవులకి జయజయధ్వానాలు చేస్తున్నారు.

ప్రాకారాన్ని అన్నివైపులా ఆక్రమించి, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకుందుకు, సంధా వారాలు ఏర్పాటు చేసుకుని, వ్యూహాలు పన్ని సేనని నిలిపివుంచారు. అందరూ ముక్తకంఠంతో

జయత్యేతి బలోరామో, లక్ష్మణశ్చమహాబలః రాజాజయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః అని అరుస్తున్నారు. విభీషణుడు గదని పట్టుకుని, మంత్రుల మధ్య నిలబడి వున్నాడు.

మేడపై భాగం నించి ఇదంతా చూశాడు రావణుడు. క్రోధంతో వాడి కడుపు మండిపోయింది. వెంటనే తన సైన్యాన్ని వాళ్ళనెదుర్కోవాల్సిందిగా ఆజ్ఞలు జారీచేశాడు.

రాక్షసులు కోలాహలంగా రణభేరీలు మ్రోగించారు. శంఖాలు పూరించారు. సముద్రతరంగాల్లా సేనావాహిని కదిలింది.

వానరుల గర్జనలతో సువేలాద్రి మారుమ్రోగింది. దేవాసుర యుద్ధంలా ఇలా రాక్షసులకీ, వానరులకీ యుద్ధం మొదలైంది. రాక్షసులు పదునైన ఆయుధాలతో వానరుల్ని చంపటం మొదలెట్టారు. రావణ మహారాజుకి జై అంటూ జయ జయ ధ్వనాలు చేస్తున్నారు. వానరులు రామ, లక్ష్మణ, సుగ్రీవులకి జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. ఎవరి నాయకుల పేర్లు వారు చెప్పుకుని కొట్టుకుంటున్నారు.

రాక్షసులు ప్రాకారాల మీదికి ఎక్కి వానర సేనని ఖడ్గాలతో, శూలాలతో పొడిచి చంపుతున్నారు. వానరులు దంతాలతో, గోళ్ళతో, కొండ శిలలతో, వృక్షాలతో రాక్షసుల మీద విరుచుకుపడ్తున్నారు. నేలంతా రక్తంతో బురదగా అయిపోతోంది. తీవ్రమైన యుద్ధం జరుగుతోంది. ఇరు పక్షాల వారూ చాలా దారుణంగా యుద్ధం చేస్తున్నారు.

యువరాజైన అంగదుడితో ఇంద్రజిత్తు తలబడ్డాడు. ప్రజంఘునితో సంపాతి, జంబుమాలితో హనుమంతుడు యుద్ధం చేస్తున్నారు. విభీషణుడు కూడా రాక్షసులతో యుద్ధానికి తలబడ్డాడు. గజుడు ప్రతిపనునితో, నీలుడు కుంభునితో, సుగ్రీవుడు ప్రహస్తునితో, లక్ష్మణుడు విరూపాక్షునితో యుద్ధం చేస్తున్నారు.

అగ్నికేతువు, రశ్మికేతువు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, అనే రాక్షసులు రాముని ఎదురించి, యుద్ధానికి సిద్ధపడ్డారు. వజ్రముష్టి మైందునితో, ద్వివిదునితో యుద్ధం చేస్తున్నాడు. సుషేణుడు విద్యున్మాలితో యుద్ధం చేస్తున్నాడు. చాలా మంది ద్వంద్వ యుద్ధం చేస్తున్నారు. వారి శరీరాలు చిట్లి రక్తం కాలువలై పారుతోంది.

ఇంద్రజిత్తు అంగదుని తన గదతో తలపై గట్టిగా మోదాడు. అంగదుడు రౌద్రమూర్తియై ఇంద్రజిత్తు రథాన్ని గుఱ్ఱాలు, సారథితో సహా కూల్చేశాడు. జంబుమాలి తన గదతో హనుమంతుని గుండెలపై కొట్టాడు. అగ్ని కేతువు మొదలైన వారంతా రాముని శరీరం గాయపరిచారు. రాముడు తన పదునైన బాణాలతో వారిని తరిమి కొట్టాడు. ఈ విధంగా యుద్ధం తారాస్థాయిలో

జరుగుతోంది. గదలతో, శిలలతో ఒకరి నొకరు చంపుకుంటున్నారు. అలా చనిపోయిన వారి మొండెములు తలలు ఎగిరి పడ్తున్నాయి. రాత్రి పూట తమ బలము పెరుగుతుంది. కనుక రాక్షసులు రాత్రెప్పుడవుతుందా అని నిరీక్షిస్తున్నారు. అంతలో సూర్యుడస్తమించాడు. కాని వారు యుద్ధం ఆపలేదు. చీకటిలోనే చేస్తున్నారు. శత్రుపక్షం వారెక్కడున్నారో ఊహించి ఒకరినొకరు చంపు కుంటున్నారు. బంగారు ఆభరణాలు ధరించటం వల్ల రాక్షసులు మిల మిల మెరుస్తున్నట్లు అప్పుడుప్పుడు కనిపిస్తున్నారు. రాక్షసుల బలం చీకట్లో రెట్టింపవుతుంది కనక క్రోధంతో మదించినట్లు వారు పోరాడుతున్నారు. కోపంతో వానరుల్ని విరుచుకు తినేస్తున్నారు.

వానరులు కోపంతో వారి గుఱ్ఱాల్ని జెండాలనీ కోరలతో విరిచేస్తున్నారు. రామలక్ష్మణులు తాచుపాముల వంటి బాణాలతో చీకట్లో లీలగా మెదుల్తున్న రాక్షసుల్ని చంపుతున్నారు. రక్తం నదుల్లా పారుతోంది. రథ చక్రాల తోటీ, గుఱ్ఱాల గిట్టల తోటి ఎగురుతున్న ధూళి అందరి కళ్ళనీ కప్పేస్తోంది. భేరీ మృదంగ వాద్యాల ఘోషలు మిన్నంటుతున్నాయి. రాక్షసులు, వానరులు అరుస్తున్న చావుకేకలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తోంది. ఆ రాత్రి కాళరాత్రిలా వుంది.

రాముడు తన బాణాలతో ఒకేసారి ఆరుగురు రాక్షసుల్ని చంపాడు. అది చూసి కొంతమంది తప్పించుకు పారిపోయారు. గోలాంగూలా అనే వానరులు దొరకిన రాక్షసుల్ని దొరికినట్లు పట్టుకుతినేస్తున్నారు. అంగదుడు, ఇంద్రజిత్తు రథాన్ని కూల్చి, గుఱ్ఱాల్ని, సారథిని చంపేశాడు. ఇంద్రజిత్తు ఒంటరిగా నేలమీద నిలబడ్డాడు. అప్పుడింక ఇంద్రజిత్తు తన మాయల్ని ప్రదర్శించడం మొదలెట్టాడు. ఒక్కసారిగా ఆకాశంలోకి మాయమయ్యాడు. అప్పుడు రాముడు వానరులతో,

"ఇంద్రజిత్తు బ్రహ్మనుండి వరాలుపొందివున్నావాడు. కనుక వానిని మీరేం చెయ్యలేరు. బ్రహ్మయందలి గౌరవంతో నేనూ ఏం చెయ్యలేకపోతున్నాను. మీరు కొంతసేపు యుద్ధం ఆపండి" అంటుండగానే అదృశ్యరూపంలో వున్న ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై తీవ్రమైన బాణాలు ప్రయోగించాడు. నాగాకారంలో ఉండే నాగాస్త్రం ప్రయోగించాడు. ఇంద్రజిత్తు కంటికి కనబడకుండా బాణాలు వెయ్యటం వల్ల రామలక్ష్మణులు ఎదుర్కోలేకపోయారు. అందుకని ఆ నాగాస్త్రం వారినిద్దర్నీ బంధించి నేల మీద పడేసింది. రాముడు మహాప్రతాపశాలి కనక నాగాస్త్రం వల్ల బంధించబడ్డా తెలివితప్పలేదు. కాని అస్త్ర ప్రభావంవల్ల బంధించబడి కదలలే లేకుండా పడివున్నాడు. అప్పుడు రాముడు మహాబలశాలురైన పదిమంది వానరుల్ని దగ్గరగా పిల్చి ఇంద్రజిత్తు ఎటు వున్నాడో వెతకమన్నాడు. వారు చెట్లు పట్టుకుని

పైకెగబాకి ఆకాశంలో అన్ని వైపులా ఇంద్రజిత్తు కోసం వెతకటం మొదలెట్టారు. ఇంద్రజిత్తు వారికి కనిపించకుండా ఆకాశంలోనే వుండి చాలా వేగంగా వాళ్ళ మీద బాణాలు గుప్పించసాగాడు.

ఆ వానరులు శరీరాలన్నీ గాయాలతో రక్తం కారసాగాయి. ఎటు చూసినా గాఢాంధకారం. చీకటిలో ఏమీ కనబడటం లేదు. ఇంద్రజిత్తు నాగాస్త్రంతో బంధించబడి వున్న రామలక్ష్మణులపై మరిన్ని బాణాలు వెయ్యసాగాడు.

రామలక్ష్మణుల శరీరాలు బాణాలతో నిండిపోయి, ఆ బాణాలన్నీ పాములుగా మారి వారిని కదలకుండా బంధించి తీవ్రంగా గుచ్చసాగాయి. వారలా నిస్సహాయంగా పడిఉండగా, అదృశ్యరూపంలో వున్న ఇంద్రజిత్తు, వారికి వినిపించేలా,

"మానవులారా, నేను అదృశ్యరూపంలో వుండి యుద్ధం చెయ్యగల శక్తి గల వాడిని. మీకెవ్వరికీ కనిపించను. మీ శరీరాలు బాణాలతో నిండి వున్నాయి. సాక్షాత్తు ఇంద్రుడే నన్నేంచెయ్యలేకపోయాడు. ఇంక మీరొక లెఖ్ఖా! ఇప్పుడే మిమ్మల్ని యమపురికి సాగనంపుతాను" అంటూ మళ్ళీ బాణాలు వెయ్యసాగాడు. వారి మర్మస్థానాలన్నీ బాణాలు దూసుకుపోయి వున్నాయి. ఇంద్రజిత్తు గర్వంగా గర్జించాడు. రామలక్ష్మణులు కన్నులు కూడా తెరచి చూడలేని స్థితిలో వున్నారు. వారి శరీరాలు రక్తంతో తడిసి ముద్దైపోయాయి. రాముని ధనస్సు నారి వీడిపోయి, పిడికిలి పట్టు సడలి, నేలపై పడి వుంది.

హనుమంతుడు, మిగిలిన వానరులు, రామలక్ష్మణుల చుట్టు చేరి విషాదంలో మునిగి వున్నారు. వారంతా నిశ్శబ్దంగా మాటి మాటికీ ఆకాశం వంకా, భూమి వంకా, రామలక్ష్మణుల వంకా మార్చి, మార్చి, చూస్తున్నారు. ఇంద్రజిత్తు, వెయ్యగలిగినంత సేపు బాణాలు వేసి, వాన వెలిసినట్టు ఒక్కసారిగా వెయ్యటం ఆపేశాడు.

ఈ పరిస్థితిలో చీకట్లో తడుముకుంటూ సుగ్రీవుడు, విభీషనుడు అక్కడికి వచ్చారు. మహావీరులైన హనుమతాది వానరులు శోకంలో మునిగి వుండడం, రామలక్ష్మణులు అచేతనంగా పడి వుండడం చూశారు. ఏం చెయ్యాలో పాలుపోక వారు విచారంగా కూర్చున్నారు. ఇంద్రజిత్తు కోసం ఆకాశంలోకి చూశారు. కాని వాడు అదృశ్యరూపంలో వుండటం చేత వారికి కనిపించలేదు. కాని విభీషనుడు కూడా రాక్షసుడే కనక తనకున్న మాయాబలంతో అతడ్ని చూడగలిగాడు. అయితే వరములు పొంది మదించి వున్న ఆధూర్తుణ్ణి ఎవ్వరూ ఎదిరించలేరని అతడికి తెలుసు. ఏం చెయ్యాలా అని ఆలోచించాడు.

ఇంద్రజిత్తు తన విజయానికి పొంగిపోతూ "ఖరదూషణుల్ని చంపిన మహావీరులిప్పుడు నా చేతిలో నేల కూలారు. ఈ నాగాస్త్రం బంధనం నించి ఇప్పుడు వీణ్ణి ఎవ్వరూ విడిపించలేరు. దేవాసురయక్షగంధర్వులంతా ఏకమై వచ్చినా వీరిని విడిపించలేరు. వీరి గురించి నా తండ్రి ఆందోళన పడి కంటిపై కనుకు కూడా లేకుండా వున్నాడు. ఇప్పుడింక వానరుల ప్రతాపం, రామలక్ష్మణుల ప్రతాపం ఎందుకూ కొరగాకుండా పోయాయి" అనుకుంటూ ఉత్సాహంగా వానరులపై బాణాలు గుప్పించసాగాడు. నీలుని, మైందుని, ద్వివిదుని తొమ్మిదేసి బాణాలతో కొట్టాడు. జాంబవంతుని మూడు బాణాలతో కొట్టాడు. గవాక్షుని శరభుని రెండేసి బాణాలతో కొట్టాడు. వారందర్నీ ఇలా చిత్ర హింసలు పెట్టి అట్టహాసంగా ఇలా అన్నాడు.

"రాక్షసులారా ఆనందంగా వుండండి. ఆ సోదరులిద్దర్ని నాగాస్త్రాలతో బంధించాను" అంటున్న ఇంద్రజిత్తు మాటలు విని రాక్షసులంతా గుమిగూడి ఆశ్చర్యంతో భీకరంగా గర్జించారు. రాముడు చనిపోయాడనుకుని, ఇంద్రజిత్తుని చాలా మెచ్చుకున్నారు. అందరూ కలిసి ఆనందంగా లంకలోకి వెళ్ళిపోయారు. ఇదంతా చూస్తుంటే సుగ్రీవునికి, చెప్పలేని దుఃఖం కలిగింది.

భయంతో కన్నీరు పెట్టుకుని, శోకించసాగాడు. విభీషణుడు సుగ్రీవుని ఊరడిస్తూ

"సుగ్రీవా భయపడకు. కన్నీరు వద్దు. యుద్ధం అంటే ఇలాగే వుంటుంది. ఎప్పుడూ మనకే విజయం కలగదు. మనలో ఎవరైనా అదృష్టవంతులుంటే, ఈ మహాత్ములిద్దరూ మూర్ఛనించి తేరుకుంటారు" అని సుగ్రీవునికి ధైర్యం చెప్పి చల్లని నీటితో కన్నులు తుడిచాడు. ముఖం కడిగాడు. నిదానంగా ఇలా అన్నాడు.

"వానరరాజా పిరికితనం పొందటానికిది సమయం కాదు. మనమిప్పుడు చెయ్యవలసినదంతా, వీరిద్దరికీ తెలివి వచ్చే వరకు, వీరిని కాపాడాలి. వారికి తెలివివచ్చాక వారే మనల్ని కాపాడుతారు. రామునికి ఈ అస్త్రబంధనం ఏమంత లెఖ్ఖలోనిది కాదు. రాముడు చనిపోయే అవకాశం లేదు. ఆయన ముఖం చూడు. ముఖ కాంతి తగ్గలేదు. కనుక ధైర్యంగా వుండు. సైన్యాన్ని కూడా ధైర్యంగా వుండమను. నేను కూడా చెయ్యగలిగిన పనిచేస్తాను. మన వానరులంతా బెదిరి ఒణికిపోతున్నారు. నన్ను చూసి ఇంద్రజిత్తనుకుని పారిపోతున్నారు. వారికి ముందు ధైర్యం చెప్పు" అని సుగ్రీవునికి, వానరులకి ధైర్యం చెప్పాడు. ఇంద్రజిత్తు ఉత్సాహంగా లంకలోకి వెళ్ళి, తండ్రికి నమస్కరించి, రామలక్ష్మణులు

మరణించారని చెప్పాడు. రావణుడు ఆనందంతో కొడుకుని గట్టిగా కౌగలిగించుకుని, కుమారుని శిరస్సుగుండెల కదుముకుని, నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు. జరిగిన సంగతంతా వివరంగా చెప్పమన్నాడు.

ఇంద్రజిత్తు తాను నాగాస్త్రం ప్రయోగించగా వారు అచేతనంగా నేలమీద పడ్డారని చెప్పాడు. రావణుడు మనసులో ఆనందం పొంగిపొర్లింది. రాముని వల్ల తమకింక తాపం తీరిందని కొడుకుని అభినందించాడు. ఇంద్రజిత్తు తాను కృతార్థుడనయ్యానని, తండ్రికి నమస్కరించి నగరంలోకి వెళ్ళాడు.

అక్కడ యుద్ధభూమిలో వానరులంతా రామలక్ష్మణుల్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుతున్నారు. హనుమంతుడు, అంగదుడు, నీలుడు, సుషేణుడు, కుముదుడు, నలుడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, జాంబవంతుడు, ఋషస్కంధుడు, రంభుడు, శతవలి, పృథు, మొదలైన మహావీరులు తమ సైన్యాల్ని వ్యూహాలుగా ఏర్పరచుకుని, పెద్ద పెద్ద వృక్షాలు పట్టుకుని, అన్నివైపులా చూస్తూ నుంచున్నారు. ఎక్కడ గడ్డిపోచ కదలినా చప్పుడు వినిపిస్తున్నా రాక్షసుడు వస్తున్నాడేమో అని అప్రమత్తులై చూస్తున్నారు.

అక్కడ లంకలో రావణుడు ఇంద్రజిత్తు వల్ల రామలక్ష్మణులు నేలకూలారని, బ్రహ్మానంద భరితుడై ఇంద్రజిత్తు ఊళ్ళోకి వెళ్ళగానే సీత దగ్గర కాపలా కాస్తున్న స్త్రీలను పిలిపించి, "మన ఇంద్రజిత్తు రాముని చంపాడని సీతతో చెప్పండి. రామలక్ష్మణులు చనిపోయారని చెప్పి పుష్పక విమానం మీద ఆమెని యుద్ధ భూమికి తీసికెళ్ళి నేలమీద పడివున్న రామలక్ష్మణుల్ని ఆమెకి చూపండి. ఎవరి ధైర్యం చూసుకుని, నన్ను తిరస్కరించిందో, అతనిప్పుడు సోదరునితో కూడా నేలమీద పడివున్నాడు. సీత స్వయంగా చూస్తే కాని నమ్మదు. ఇకనైనా రాముడు వచ్చి తనని రక్షిస్తాడనే ఆశపోయి, ఇంక వేరే దారిలేక, తనంత తానే వచ్చి నన్ను చేరుతుంది. ఇంక ఆమెని రక్షించే వారెవ్వరూ లేరు" అని రావణుడు చెప్పగానే, రాక్షస స్త్రీలు ఆనందంతో సీత దగ్గరకి వెళ్ళి ఆమెని పుష్పకవిమానంలో కూర్చోబెట్టి, యుద్ధ భూమికి తీసికెళ్ళారు.

రావణుడు, మహదానందంతో లంకనంతా జండాలతోటీ, తోరణాలతోటి అలంకరింపచేశాడు. ఇంద్రజిత్తు యుద్ధంలో రామలక్ష్మణులను చంపేశాడని, నగరమంతా దండోరా వేయించాడు.

సీత పుష్పకవిమానం లోంచి, రామలక్ష్మణులు యుద్ధభూమిలో నేలమీద పడి వుండటం చూసింది. దుఃఖం పట్టలేక పోయింది. చాలా సేపు ఏడ్చింది

వారలా ధూళిలో నేలపై పడి వుండటం చూసి బాధ ఓర్చుకోలేక పక్కనే వున్న త్రిజటతో ఇలా అంది.

"అయ్యో విధి వైపరీత్యం ఇలా వుంది కదా. నా చిన్నప్పుడు జనక పురిలో సాముద్రిక శాస్త్రము తెలిసిన పండితులు, నేను సంతాన వతిని అవుతాననీ, నాకు వైధవ్యము లేదనీ చెప్పారు కాని అందుకు విరుద్ధంగా నా భర్త ఇలా చనిపోవటం చూస్తే వారి పాండిత్యం కొరగానిదనిపిస్తోంది. నా జాతకంలో ఒక్క దుర్లక్షణం కూడా లేదని చెప్పారే, నాకోసం రాముడు అనుల్లంఘనీయమైన సముద్రాన్ని కూడా దాటి వచ్చాడే, ఇంక నాకేం భయం లేదని గుండెదిటవు చేసుకుంటున్న సమయంలో, ఇంత ఘోరం జరిగిందే, నా తలరాత ఇంతేనా? అమోఘమైన అస్త్రాలన్నీ స్వాధీనం చేసుకున్న రామలక్ష్మణుని, ఈ మాయావి ఇంద్రజిత్తు అదృశ్యంగా వుండి, నా రామలక్ష్మణుల్ని, చంపి నన్ను అనాథనుచేశాడు కదా. వారి అస్త్రశాస్త్ర విజ్ఞాన మంతా బూడిదలో పోసిన పన్నీరైందా?" అని సీత పరిపరి విధాల సీత విలపిస్తుండగా, పక్కనే వున్న త్రిజట ఆమెనోదారుస్తూ

"అమ్మా అలా విషాదపడకు. నువ్వు కాస్త మనసు చిక్కబట్టుకుని, సరిగ్గా చూడు. నీ భర్త మరణించలేదు. ఆ సోదరులిద్దరూ జీవించేవున్నారు. సామాన్యంగా యుద్ధంలో తమ ప్రభువు, చనిపోతే, సైనికులంతా ఆందోళన పడ్తారు. కాని ఈ వానరులంతా తీవ్రమైన క్రోధంతో వున్నారు. ఇంకో సంగతి. నిజంగా నీ భర్త చనిపోయివుంటే ఈ పుష్పక విమానం కదలదు. ఎందుకంటే వితంవుతులెక్కితే దివ్యమైన ఈ పుష్పక విమానం కదలదు. కనుక నువ్వు సుమంగళివి. అటు చూడు. ఆ సైన్యమంతా రామలక్ష్మణుల్ని కాపాడుతున్నారు. నిజంగా వారు మరణించి వుంటే, ఎక్కడికైనా తీసుకుపోతారు గాని, అక్కడే వుంచి కాపలా కాయరు. నీ మీది ప్రేమతో యదార్థం చెప్తున్నాను. నువ్వు ధైర్యంగా వుండు. దేవాసుర గంధర్వ యక్షగణాలు, దేవేంద్రునితో కలసి వచ్చినా రాముని జయించలేరు. వారి ముఖాల్లో జీవకళ చక్కగా కనిపిస్తోంది. వారు కేవలం తెలివి తప్పి పడివున్నారంతే" అంటూ త్రిజట అనేక విధాల సీతకి ధైర్యం చెప్పింది. ఆమె మాటలు విన్న సీత ధైర్యం తెచ్చుకుని,

"అమ్మా నీ మాటలు నిజం కావాలి" అని గద్గద స్వరంతో అంటుండగా పుష్పకవిమానం కదిలింది. అశోకవనంలోకి వెళ్ళి ఆగింది.

యుద్ధ భూమిలో రామలక్ష్మణులు, నాగపాశానికి బద్ధులై, ఒళ్ళంతా రక్తసిక్తమై నేల మీద పడివున్నారు. సుగ్రీవాది మహావీరులంతా వారివైపు ఆతృతగా చూస్తున్నారు. కొంతసేపటికి అతి బలశాలి కనక రామునికి కొంచెం తెలివి వచ్చింది. తన పక్కనే తెలివి తప్పి పడి వున్న లక్ష్మణుని చూశాడు. "అయ్యో నా

తమ్ముడు ఇలా తెలివి తప్పి పడివున్నాడే. అతడు లేక పోతే ఇంక సీతతో ఏం పని నాకు? లక్ష్మణుని లాంటి సోదరుడు మళ్ళీ దొరుకుతాడా? విభీషణుని లంకకి రాజుని చేస్తానని మాట ఇచ్చాను కదా, ఇప్పుడా వాగ్దానం నిలుపుకోలేక అసత్యవాదినై నిందలపాలు కావాల్సిందేనా? అని దుఃఖిస్తూ,

"సుగ్రీవా ఇంక రావణుడు మనపై దండెత్తి వస్తాడు. కనక నువ్వు నీ సైన్యంతో వెనక్కి. మన హనుమంతుడు పాపం, ఎవ్వరికీ సాధ్యం కాని మహత్కార్యం చేశాడు. కాని ఫలితం దక్కలేదు. నా కోసం మీరంతా ప్రాణాలు సైతం లెఖ్కచెయ్యకుండా పోరాడారు. కాని మానవ యత్నానికి దైవబలం లేకపోతే నిష్ప్రయోజనం మంచి మిత్రుడిగా నువ్వు చెయ్యగలిగినదంతా చేశాడు. ఇప్పుడింక చెయ్యవలసినదేమీ లేదు. మీరంతా వెనక్కివెళ్ళిపోండి" అంటూ రాముడు, ఎంతో ఖిన్న మనస్కుడై చెప్పాడు.

వానరులంతా కన్నీరు కారుస్తూ నిలబడ్డారు. అంతలో విభీషణుడు చెదిరిపోతున్న సైన్యాన్నంతా కూడగట్టుకుని అక్కడికి వచ్చాడు. వానరులంతా విభీషణుని చూసి ఇంద్రజిత్తు అనుకుని పారిపోతున్నారు.

సుగ్రీవుడు ఆదుర్దాగా "ఏమైంది?" అని అడిగాడు. అప్పుడు అంగదుడు, "ప్రభూ మన రామలక్ష్మణులు బలశాలురై వుండి కూడా ఇలా బాణాలతో ఒళ్ళంతా నిండి నేలపై పడివున్నారే, ఇంక మనమెంత? అనుకుని వానరులంతా భయంతో పారిపోతున్నారు" అని అంగదుడంటుండగానే విభీషణుడక్కడికి వచ్చాడు. అప్పుడువారికి తెలిసింది, విభీషణుని చూసి పారిపోతున్నారని,

అప్పుడు జాంబవంతుడు, సుగ్రీవుని ఆజ్ఞపై వారందరికీ ధైర్యం చెప్పి, ఇతడు ఇంద్రజిత్తు కాదని, విభీషణుడనీ, భయపడక్కర్లేదనీ నచ్చజెప్పి వెనక్కి తీసుకొచ్చాడు.

విభీషణుడు కన్నీరు కారుస్తూ చల్లనీటితో రామలక్ష్మణుల కన్నులు తుడిచి

"ఆహా ఎంత ఆశ్చర్యం! మహాబలశాలురు, మహావిక్రమ సంపన్నులు, ఇంద్రజిత్తు మాయా యుద్ధం వల్ల ఈ స్థితిని పొందారు కదా. నేను వీరి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. లంకా రాజ్యానికి నన్ను రాజుని చేస్తారని ఆశపడ్డాను. కాని నా ఆశ నిరాశ అయింది" అని విభీషణుడు ఎన్నో విధాల విలపించాడు.

సుగ్రీవుడు విభీషణుని కౌగలించుకుని "ధర్మజ్ఞా నువ్వు తప్పకుండా లంకా రాజ్యానికి రాజువవుతావు. రామలక్ష్మణులకేం ఆపదలేదని నువ్వే కదా చెప్పావు" అని ఓదార్చి, తన మామగారైన సుషేణునితో

"ఆర్యా రామలక్ష్మణులకి తెలివి రాగానే, మీరు వీరిని వెంట పెట్టుకుని, కిష్కంధకి వెళ్ళండి. నేను బంధుమిత్ర పరివారంతో సహా ఆ రావణుని హతమార్చి, సీతని వెంటపెట్టుకుని వస్తాను" అన్నాడు. అప్పుడు సుషేణుడతనితో,

"సుగ్రీవా పూర్వము దేవాసుర సంగ్రామం జరిగినప్పుడు, అసురులు శస్త్ర ప్రయోగంతో దేవతల్ని ముంచెత్తారనీ, వారుప్రాణాపాయ స్థితిలో వుండగా, దేవతల గురువైన బృహస్పతి, మృత సంజీవినీ మంత్రము చేత, ఓషధుల చేతా వారికి చికిత్స చేశాడనీ, ఇప్పుడా ఓషధులు క్షీర సముద్రం మధ్య వున్న పర్వతంపై వున్నాయనీ విన్నాను.

మన వానరులలో సంపాతి మొదలైన వారికి ఆ ఔషధాల గురించి తెలుసు. "సంజీవికరణి, విశల్యకరణి" అనే ఔషధాలవి. క్షీర సాగర మధ్యలో చంద్రము, ద్రోణము అనే రెండు పర్వతాలున్నాయి. వాయుపుత్రుడైన ఆంజనేయుడు వానిని తీసుకురాగలడు" అని సుషేణుడు చెప్తుండగానే, పెద్ద పెనుగాలులు ఉవ్వెత్తున లేచాయి. ఎటు చూసినా మెరుపులు, మబ్బులు ఆవరించాయి. గొప్ప ప్రళయం వచ్చినట్లు సముద్రంలో అలలు ఎగిసిపడ్డాయి. మహా వృక్షాలు ఫెళ ఫెళా విరిగి సముద్రంలో పడ్డాయి. ఆ పెనుగాలల మధ్య నించి వైనతేయుడైన గరుత్మంతుడు, నేలమీదికి దిగాడు. అగ్నిలా దేదీప్యమానంగా వెలిగిపోతూ వానరులకి దర్శనమిచ్చాడు.

గరుత్మంతుని చూడగానే నాగపాశముతో రామలక్ష్మణుల్ని బంధించిన పాములన్నీ జరజరా పాకుతూ పారిపోయాయి. వాటంతటఅవే విడి వడి ఒక్కటి మిగలకుండా వెళ్ళిపోగానే రామలక్ష్మణులు నాగపాశం నించి విముక్తులయ్యారు. గరుత్మంతుడువారిని, ఎంతగానో ప్రశంసించి, వారి శరీరాలు చేతితో నిమిరాడు. వెంటనే వారి శరీరాలపై గాయాలన్నీ మాయమై వారికి పూర్వపుకాంతి వచ్చింది. వారి శరీరాలు దివ్యకాంతితో ప్రకాశించాయి. మునుపటికంటే రెట్టింపు తేజస్సు, ఉత్సాహము, వీర్యము, బలము, కాంతి పట్టుదల, వివేకము, జ్ఞాపకశక్తి కలిగాయి.

గరుడుడు ఆప్యాయంగా వారిని లేవనెత్తాడు. రామలక్ష్మణులతడ్ని గాఢంగా కౌగలించుకున్నారు.

"నీ అనుగ్రహం వల్ల, ఆపద తొలిగిపోయింది. మళ్ళీ మా శక్తి మాకు వచ్చింది. మిమ్మల్ని చూస్తుంటే, మా తండ్రియైన దశరథ మహా రాజుని, మా తాతగారైన అజమహారాజుని, చూసినట్లుంది. దివ్యమైన ప్రకాశముతో వెలిగిపోతున్న మీరెవరు?" అని అడిగారు.

అందుకు గరుడుడు ఆనందంతో "రామచంద్రా నేను మీ మిత్రుణ్ణి, మీ బహిర్ప్రాణాన్ని. మీకు సహాయం చెయ్యాలని వచ్చాను. ఈ నాగాస్త్రాన్ని విడిపించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. క్రూరుడైన ఇంద్రజిత్తు దీనిని నిర్మించాడు. ఈ అస్త్రప్రయోగం వల్ల బంధించిన సర్పాలు చాలా తీక్షణమైనవి. తీవ్రమైన విషము గలవి. రాక్షసమాయాప్రభావంతో అవి అస్త్రాల రూపంతో మిమ్మ్మ బంధించాయి. రామా నువ్వు ధర్మజ్ఞుడివి. సత్యవ్రతుడివి. కనకనే నీ తమ్మునితో కూడా తేరుకున్నావు. మీరు నాగపాశబద్ధులయ్యారని తెలిసి వెంటనే వచ్చాను. ఇక మీదట మీరు చాలా జాగ్రత్తగా వుండాలి. ఈ బంధం ఇప్పుడు విడిపోయింది కాని రాక్షసులు చాలా మోసంతో యుద్ధం చేస్తారు. వారు వక్రబుద్ధిగలవారు. మీరు మోసం తెలియని శూరులు. కనుక యుద్ధ భూమిలో రాక్షసుల్ని నమ్మవద్దు" అని వారికి జాగ్రత్తలు చెప్పి, మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. వెళ్తూ, వెళ్తూ వెనక్కి తిరికి

"మిత్రమా - శత్రువులపై కూడా వాత్సల్యం చూపే స్వభావం నీది. నేనెవర్నో, నాతో నీ మైత్రి ఎటువంటిదో, అన్న విషయం గురించి ఆలోచించకు. యుద్ధం పూర్తయ్యాక, నేనెవర్నో నీకే తెలుస్తుంది. జాగ్రత్తగా వుండు. ఈ యుద్ధంలో విజయం నీకే లభిస్తుంది" అని చెప్పి, రాముణ్ణి కౌగలించుకుని, ప్రదక్షిణము చేసి, ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

వానరులకి చెప్పలేనంత ఆనందం కలిగింది. వారినైరాశ్యం పటా పంచలై పోయింది. ఉత్సాహంతో గంతులు వెయ్య సాగారు. పెద్ద పెద్ద మహా వృక్షాలు పీకి తెచ్చి రాక్షసుల్ని ఎదిరించటానికి సిద్ధంగా నుంచున్నారు. వానరులు ఉత్సాహంతో గర్జించటం రావణుడు, రాక్షసులు విన్నారు. మహదానందంతో వారు చేస్తున్న కిల కిలా రావాలు విని, రావణుడు మంత్రులతో ఇలా అన్నాడు.

"ఆ వానరులు హర్షాతిరేకంతో మేఘంలా గర్జిస్తున్నారు. వారి కంతటి సంతోషం కలిగిందంటే, చాలా పెద్ద కారణమై వుంటుంది. అందులో సందేహం లేదు. నాకేదో అనుమానంగా వుంది. కనక మీరు వెంటనే వెళ్ళి ఆ విషయం తెలుసుకు రండి" అని ఆజ్ఞాపించాడు. వెంటనే వారు ప్రాసాదంపై భాగానికి వెళ్ళి, ప్రాకారం ఎక్కి చూశారు.

రామలక్ష్మణులు నాగ బంధం నించి విడి పడి హాయిగా వుండటం, వానరులు ఆనందంతో చిందులు వెయ్యడం కనిపించింది. రాక్షసుల గుండెల్లో రాయి పడింది. వారు దిగులుగా ముఖాలు దించుకుని రావణుని దగ్గరకి వెళ్ళారు.

"ప్రభూ, రామలక్ష్మణులు నాగపాశం విడిపించుకుని, లేచి వున్నారు" అని చెప్పారు. ఆ వార్త విన్న రావణునికి చేదు మింగినట్లైంది. ఏడుపు ముఖంతో ఇలా అన్నాడు.

"నాగాస్త్రం మనం వరంగా పొంది సంపాదించాం. నాగ పాశాలు విషతుల్యమైనవి. అయినా విడిపోయాయి. శత్రువు మళ్ళీ ఆరోగ్యం పుంజుకున్నాడు. నాకు చాలా దిగులుగా వుంది. ఎప్పుడేం జరుగుతుందో తెలియటం లేదు. వాసుకి అంతటి ప్రతిభ గల అస్త్రాలు నిష్ప్రయోజనమైపోయాయి. ఇంక మన సైన్యం ఎలా యుద్ధం చేస్తుందో నాకు అనుమానంగా వుంది" అంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు. ధూమ్రాక్షుడు అనే రాక్షసుణ్ణి పిల్చాడు.

"ధూమ్రాక్షా, పెద్ద సైన్యంతో వెళ్ళు. ఆ రాముణ్ణి వానరుల్ని చంపిరా" అని ఆజ్ఞాపించాడు.

ధూమ్రాక్షుడు సంతోషంగా రావణునికి వందనం చేసి బయల్దేరాడు. క్రూరాతిక్రూరులైన రాక్షసులు, గంటలు కట్టుకుని, వివిధ రకాలైన ఆయుధాలు ధరించి యుద్ధానికి కదిలారు. కవచాలు ధరించి, ధ్వజాలతో అలంకరించబడిన రథాలు ఎక్కి కొందరు, బంగారు జాలులు అలంకరించిన గాడిదలపై కొందరు, గుఱ్ఱాలపై కొందరు, ఏనుగులపై కొందరు, బయల్దేరారు.

తోడేలు, సింహము, ముఖములు కలిగిన బంగారు ఆభరణాలు అలంకరించబడి, కంచర గాడిదలు పూన్చిన రథం మీద ధూమ్రాక్షుడు ఎక్కాడు. ఈ విధంగా పెద్ద సంఖ్యలో సేనని తీసుకుని, హనుమంతుడు నిలిచిన పశ్చిమద్వారం దగ్గరకి వెళ్ళాడు. వాడికి ఎన్నెన్నో అపశకునాలు కనిపించాయి. అవి చూసి ధూమ్రాక్షుడు దిగులు పడ్డాడు. అయినా సరే గుండె చిక్కబట్టుకుని ముందుకు సాగాడు. పెద్ద ప్రవాహం లాంటి సేన కనిపించింది. ధూమ్రాక్షుని చూసి వారు భీకరంగా గర్జించారు. ఇరువైపుల సేనలు ఉత్సాహంగా తలబడ్డారు. వానరులు పెద్ద పెద్ద వృక్షాలతోటి, రాక్షసులు శూల ముద్గర త్రిశూల తోటీ ఘోరంగా యుద్ధం చెయ్యసాగారు. రాక్షసులెంత పరాక్రమం గలవారైనా వానరులచేతిలో చావుదెబ్బలు తినసాగారు. కొందరు రక్తం కక్కారు. కొందరికి పళ్ళూడి కిందపడ్డాయి. ఇంకా కొందరికి పక్కటెముకలు విరిగాయి. మరి కొందరు పచ్చడిపచ్చడి అయ్యారు. రథాల ధ్వజాలు విరిగి నేలపడ్డాయి. వానరులు రాక్షసుల మీదికి లంఘించి, వారి జుట్టు పీకి, కళ్ళు పొడిచి, నానా బీభత్సం చేశారు. వారి ధాటికి నిలవలేక రాక్షసులు పరుగు లంకించుకున్నారు.

తన సేన అంతా అలా పారిపోవటం చూసి, ధూమ్రాక్షుడు ఓర్చుకోలేక, నానా రకాల ఆయుధాలతోవానరుల్ని బాధపెట్టాడు. ఆ బాదుడికి వారు గాయపడి నేలమీదికొరిగారు. రక్తం కాలువలా పారింది. చాలా మంది వానరులు మరణించారు. కొందరు పారిపోయారు.

కొండశిలలతో, వృక్షాలతో, చనిపోయిన వానరులతో, రాక్షసులతో, ఆ ప్రాంతం చాలా బీభత్సంగా వుంది. హనుమంతుడు ధూమ్రాక్షుని ఘాతుకాన్ని సహించలేక, పెద్ద బండరాయి పట్టుకుని, కళ్ళెఱ్ఱజేస్తూ ధూమ్రాక్షుడి మీదికి లంఘించాడు. ఆ రాయితో ధూమ్రాక్షుడి రథాన్ని ముక్క ముక్కలు చేశాడు. ధూమ్రాక్షుడు గద పట్టుకుని నేల మీదికి దూకాడు. హనుమంతుడు పెద్ద పెద్ద వృక్షాలు పెకిలించి, వాటి కాండాలతో అడ్డొచ్చిన రాక్షసుడ్ని ప్రతి వాణ్ణి చంపి పారేశాడు. ఆ దెబ్బలకి రాక్షసుల తలలు పగిలి రక్తం కాల్వలు కట్టింది. హనుమంతుడి ధాటికి ఆగలేక వానర సేనలు వెనక్కి తిరిగి పారిపోయాయి. అప్పుడు హనుమంతుడు, ఇంకో పెద్ద పర్వత శిఖరం పెరిగి, ధూమ్రాక్షుని పైకి వెళ్ళాడు.

ధూమ్రాక్షుడు తన గదతో ఆంజనేయుని ఎదుర్కొన్నాడు. ఆంజనేయుని తలపై గదతో మోదాడు. హనుమంతుడు ఏమాత్రం చలించకుండా, తన చేతిలో వున్న కొండశిలతో, ధూమ్రాక్షుని తలపై కొట్టాడు. ఆ దెబ్బకి తలపగిలి వాడు నేల మీద పడ్డాడు. శరీరమంతా శిథిలమై మరణించాడు. ధూమ్రాక్షుడు చనిపోగానే, రాక్షసులంతా లంకలోకి పారిపోయారు. ఆంజనేయునికి ఆనందానికి అవధులు లేవు. వానరులంతా అతడ్ని చాలా మెచ్చుకున్నారు.

ధూమ్రాక్షుడు చనిపోయాడని తెలియగానే రావణునికి చాలా కోపం వచ్చింది. వజ్రదంష్ట్రుడు అనే రాక్షసుణ్ణి పిల్చి పెద్ద సైన్యంతో రామలక్ష్మణులపైకి పంపాడు. వజ్రదంష్ట్రుడు చాలా మాయావి. చతురంగ బలాలతో బయల్దేరి వెళ్ళాడు. అక్కడ అంగదుడు మహాసైన్యంతో సిద్ధంగా వున్నాడు. ఇరు వర్గాల వారికీ తీవ్రమైన పోరు జరిగింది. వానరులు రాక్షసుల్ని కొండశిలలతో గట్టిగా చితక్కొట్టారు. రాక్షసులు మెడలు తెగి, కాళ్ళు చేతులు విరిగి కింద పడ్డారు.

రాక్షసులు పరిఘలు, పట్టిసాలు, గదలు మొదలైన బలమైన ఆయుధాలతో, వానరుల్ని మోదుతున్నారు. శంఖభేరీ మృదంగ ధ్వనులతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. కొంత మంది బాహు యుద్ధం చేస్తున్నారు. వానరులు రాక్షసుల మీద పడి అర చేతులతో, కాళ్ళతో పిడికిళ్ళతో పాదాలతో, మోచేతులతో, పొడిచి, చెట్లతో కొట్టి, పెద్ద పెద్ద శిలలతో మోది, రాక్షసుల్ని పిండి పిండి చెయ్య సాగారు.

వజ్రదంష్ట్రుడు పదునైనా బాణాలతో వారిని చెదర గొట్టాడు. వజ్రదంష్ట్రుడల్లా రెచ్చిపోతుంటే అంగదుడు కోపంతో రాక్షసుల్ని దొరికిన వారిని దొరికినట్లు చంపసాగాడు. అంగదుని ధాటికి ఆగలేక వారు పెనుగాలికి మేఘాల్లా బెదిరి పోయారు. రాక్షస సైన్యం చాలా మట్టుకు నేల కూలింది. వజ్రదంష్ట్రుడు తీవ్రమైన కోపంతో, ధనుస్సు సారించి, బాణవర్షంతో సైన్యాన్ని ముంచెత్త సాగాడు. వానరులు కూడా రోషంతో పెద్ద పెద్ద బండరాళ్ళతో ఆ బాణాల్ని ఎదుర్కొన్నారు. ఆ ధాటికి ఆగలేక రాక్షసులు వజ్రదంష్ట్రుణ్ణి వదిలేసి పలాయనం చిత్తగించారు. వజ్రదంష్ట్రుడు పౌరుషంతో మరింత వేగంగా బాణాలు వెయ్యసాగాడు. ఒక్కొక్కసారి ఏడు, ఎనిమిది మందిని పడగొగ్తున్నాడు. వానరులు కుప్పలు, కుప్పలుగా నేల మీద పడ్తున్నారు. వానరులంతా భయంతో అంగదుని వెనక్కి పరిగెత్తారు. అంగదుడు కోపంతో వజ్రదంష్ట్రుకి ఎదురుగా వెళ్ళి కలియబడ్డారు. ఇద్దరూ సింహం, ఏనుగు ఢీకొన్నట్లు యుద్ధం చేస్తున్నారు. వజ్రదంష్ట్రుడు అంగదుడి మీద వెయ్యి బాణాలు వేశాడు. అంగదుడి శరీరమంతా రక్తసిక్తమైపోయింది. అయినా సరే లెఖ్క చెయ్యకుండా భీమపరాక్రమముడైన అంగదుడు పెద్ద కొండశిఖరం పీకి వజ్రదంష్ట్రుడి రథం మీద పడేసి గట్టిగా గర్జించాడు.

అది వెళ్ళి వజ్రదంష్ట్రుడి తలమీద పడింది. వెంటనే వాడు మూర్ఛపోయాడు. కొంతసేపటికి తెలివి వచ్చి అంగదుడ్ని గదతో గట్టిగా మోదాడు. అంగదుడు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. వాడు కోపంతో గదని పక్కకి విసిరేసి, ముష్టి యుద్ధానికి దిగాడు. ఇద్దరూ హోరాహోరీ పోరాడుతున్నారు. అంగదుడొక మహా వృక్షాన్ని పీకి పట్టుకున్నాడు. వజ్రదంష్ట్రుడు పెద్దకత్తిని పట్టుకున్నాడు. అంగదుని చేతిలో వృక్షాన్ని తన చేతిలోని కత్తితో నరకసాగాడు. అంగదుడు ఒడుపుగా ఆ కత్తిని చేజిక్కించుకుని, దానితో వజ్రదంష్ట్రుని తల నరికేశాడు. వాడు రెండుగా చీలి నేల కూలాడు. వానరులు సంతోషంతో అంగదుని చుట్టూ చేరారు. తమ నాయకుడు చనిపోగానే రాక్షసులు సిగ్గుతో తలలు వాల్చారు. ఆ వార్త రావణుని చేరింది. రావణుడు చకితుడై పోయాడు. అప్పుడు సర్వశాస్త్ర విశారదు అకంపనుణ్ణి పిల్చాడు. రామలక్ష్మణుల్ని, సుగ్రీవుని చంపమని పంపించాడు.

అకంపనుడు మహావీరుడు. చాలా రకాల ఆయుధాలతో, పెద్ద సేనతో బయల్దేరాడు. కొంత దూరం వెళ్ళేసరికి గుఱ్ఱం మోకాళ్ళ మీదికి జారి రథం ఒరిగింది. వాడి ఎడమకన్ను అదిరింది. ఈ అపశకునాలు చూసి వాడి ముఖం వివర్ణమైంది. ఆకాశంవంక చూశాడు. సూర్యుడు తేజస్సు తగ్గింది. ఆకాశం నిండా మేఘాలు కమ్ముకున్నాయి. గుడ్లగూబలు అరుస్తున్నాయి. అయినా లెఖ్కచేయకుండా సింహంలా గర్జిస్తూ యుద్ధానికి ముందుకి దూకాడు. వానరులు పెద్ద పెద్ద కొండశిలలతో, వృక్షాలతో సిద్ధంగా వున్నారు యుద్ధానికి. రెండు సేనల

మధ్యా భీకరమైన పోరుమొదలైంది. వారికదలికలో లేచిన ఎఱ్ఱనిధూళి ఆకాశమంతా కప్పేసింది. ఎక్కడా ఏమీ కనబడటం లేదు. ఇరువైపులా వారు చేస్తున్న గర్జనలు మాత్రం వినబడుతున్నాయి. ఆ చీకట్లో వానరుల్ని వానరులు, రాక్షసుల్ని, రాక్షసులు చంపుకుంటున్నారు. అలా చనిపోయిన వారి రక్తం మడుగులో ఆ ధూళి అంతా అణగారిపోయింది. అప్పటికీ కాస్త ఎవరెవరో గుర్తించే వీలు కలిగింది. వానరులు పిడికిళ్ళతో, బాహువులతో, రాక్షసులు, పరిఘలతో, తోమరాలతో, యుద్ధం చేస్తున్నారు. అకంపనుడు విజృంభించిపోయి వానరుల్ని తుక్కుతుక్కుగా కొట్టసాగాడు. వానరులు కూడా ధైర్యంగానే ఎదుర్కొంటున్నారు. ఈ యుద్ధ తీవ్రత చూసి, కుముదుడు, నలుడు, మైందుడు ద్వివిదుడు, ముందుకి వచ్చి రాక్షసులతో తీవ్రంగా పోరాడసాగారు. అది చూసి అకంపను కోపం రెట్టింపైంది. రోషంతో నిలువెల్ల ఒణికిపోతూ, తన రథసారధితో "సారధీ-రథాన్ని అటు పోనీ, ఆ వానరుల అంతు చూడాలి" అన్నాడు. సారధి వెంటనే రథాన్ని అక్కడికి చేర్చాడు. అకంపనుడు బాణపరంపరలతో వానరుల్ని ముంచెత్తాడు. అతడి ముందు వానరులు నిలవలేకపోయారు. వెనక్కి తిరిగి పారిపోసాగారు. అలా పారిపోతున్న వారిని చూసి, హనుమంతుడు, కంగారు పడి, వారిని పారిపోవద్దని వారించి, తను స్వయంగా అకంపనుడి మీదికి లంఘించాడు. అకంపనుడు ఆంజనేయ స్వామి మీద బాణ వర్షం కురిపించాడు. హనుమంతుడికి ఎలాగైనా వాణ్ణి చంపాలని పట్టుదల కలిగింది.

ఆ బాణపు దెబ్బలు ఓర్చుకుంటూ, గర్జిస్తూ, అకంపనుడి వైపు పరిగెత్తాడు. ఒక పెద్ద పర్వతాన్ని పెకిలించి పట్టుకున్నాడు. దాన్ని అటు ఇటు తిప్పుతూ అకంపనుడి బాణాలనించి రక్షించుకుంటున్నాడు. అకంపనుడు అర్థచంద్రాకారపు బాణాలతో ఆ పర్వతాన్ని ముక్కముక్కలు చేశాడు. హనుమంతుడి కోపం రెట్టింపైంది. అశ్వకర్ణము అనే మహావృక్షాన్ని పీకి పట్టుకున్నాడు. దాన్ని వేగంగా తిప్పుతూ ముందుకి పరిగెత్తాడు. వారి యుద్ధానికి భూమి దద్దరిల్లింది.

హనుమంతుడు రథాల్ని, ఏనుగుల్ని, గుఱ్ఱాన్ని కనిపించినవి కనిపించినట్లు పచ్చడిచేస్తూ ముందుకి పోతున్నాడు. అతడి వేగానికి, రాక్షసులంతా భయపడి పరిగెత్తసాగారు. అకంపనుడికి గాబరా కలిగింది. తీవ్రమైన పధ్నాలుగు బాణాలు ఆంజనేయుని మీద ప్రయోగించాడు. ఒళ్ళంతా రక్తాలు కారుతూ, ఆంజనేయుడు పూసిన అశోకవృక్షంలా వున్నాడు.

అలాగే పోరాడుతూ హనుమంతుడు, తన చేతిలో వృక్షం విసిరేసి, ఇంకో మహావృక్షం పీకి దానితో అకంపనుడి తలపగుల కొట్టాడు. ఆ దెబ్బకి అకంపనుడు

నేలమీద పడ్డాడు. భూకంపం వచ్చినట్లైంది. మిగిలిన రాక్షసులంతా లంకలోకి పారిపోయారు. వానరులంతా ఆంజనేయుని శ్లాఘించారు. దేవతలంతా ఆంజనేయునిపై పూలవాన కురిపించారు. రామలక్ష్మణులు ఆంజనేయుని ప్రశంసించారు. సుగ్రీవుడు, విభీషణుడు, అతడి పరాక్రమాన్ని అభివందించారు.

అకంపనుడు చనిపోయాడన్న వార్త రాక్షసరాజైన రావణుడ్ని మరింత కృంగదీసింది. ఆగ్రహం పట్టలేకపోయాడు. ఒక్క క్షణం ఆలోచించాడు. మంత్రుల్ని సమావేశపరచి, సమాలోచన చేశాడు.

అంతకుముందురోజే రావణుడు లంకా నగరమంతా తిరిగి, సేనా వ్యూహాన్ని, రక్షణ ఏర్పాట్లనీ పర్యవేక్షించి వచ్చాడు. పట్టణానికి నాలుగువైపులా శత్రుసైన్యాలు చుట్టుముట్టి రాకపోకలు, నిరోధించబడి వుండటం చూశాడు. అప్పటికే అతడి ఆగ్రహం అదుపుతప్పింది. యుద్ధకోవిదుడైన ప్రహస్తుని పిలిచాడు.

"ప్రహస్తా వానర సైన్యం, లంకని చుట్టుముట్టి రాకపోకలను అరికట్టింది. ఈ నిరోధాన్నించి లంకని విడిపించాలంటే, యుద్ధ విశారుదుడవైన నీకే సాధ్యము.

నేను, నువ్వు, ఇంద్రజిత్తు, నికుంభుడు, మనం నడుం కట్టుకు సాధించాలి. నిన్ను చూడగానే క్రమశిక్షణ లేని ఆ వానర మూక, భయంతో పరుగులు తీస్తాయి. నీ గర్జన వినగానే వాళ్ళు ప్రాణాలు వదులుతారు. వానరులు పారిపోగానే ఇంకేం చెయ్యలేక వానరుల్ని నమ్ముకున్న రామలక్ష్మణులు నీకు లొంగిపోతారు. ఇప్పుడు మనం యుద్ధం విరమిస్తే వారు, ఎదురుతిరిగి మనల్ని చంపుతారు. కనుక యుద్ధం ఆపకూడదు. కాని యుద్ధం చేసినా మనం గెలుస్తామో, ఓడిపోతామో చెప్పలేము. కాని యుద్ధం మానేస్తే మాత్రం, వాళ్ళు మనని చంపి తీరుతారు. కనుక శత్రువుల చేతిలో మరణించడం కన్నా యుద్ధంలో మరణించడమే మేలు. నీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు. అప్పుడు ప్రహస్తుడిలా జవాబు చెప్పాడు.

"ప్రభూ ఇంతకి ముందే మీరు సీతమ్మని రాముని దగ్గరకి పంపటమా, యుద్ధం చెయ్యటమా అన్న విషయం మీద సమాలోచనలు జరిపారు. అప్పుడు నేను మీతో సీతమ్మని రామునికిచ్చి సంధి చేసుకోమని చెప్పాను. కాని నా ఆలోచన మీకు నచ్చలేదు. సీతమ్మనివ్వకపోతే యుద్ధం తప్పదని మీకు తెలుసు. ఇంకా ఆలోచించేందుకేం వుంది? మీరిదివరకెన్నిసార్లో నాకు బహుమానాలిచ్చి సత్కరించారు. నన్నింతగా గౌరవించిన మీకు, నేను విధేయుడనై వుండటమే న్యాయం.

మీ కన్నా నాకు నా జీవితంగాని, భార్యా పిల్లలు గాని, చివరికి నా ప్రాణాలు కూడా నాకు ఎక్కువ కాదు. మీ కోసం నా జీవితం యుద్ధంలో త్యాగం చేస్తాను"

అంటూ వీలైనంత పెద్దసంఖ్యలో సైన్యం సమకూర్చుకుని వెళ్ళాడు. అలా కదలి వెళ్తున్న రాక్షససేనలతో లంకంతా నిండిపోయింది. ఎన్నెన్నో శాంతి హోమాలు చేయించి బయల్దేరాడు. అగ్నిహోత్రునికి నమస్కరించాడు. విజయమంత్రాలు పఠించి పూలమాలలు ధరించారు. ధనుస్సులు, కవచాలు ధరించి, రావణునికి నమస్కరించి, అతడి ఆశీర్వాదం తీసుకుని దివ్యమైన రథాల్లో బయల్దేరారు. వారి ధ్వజంమీద పాము గుర్తు వుంది. దుందుభులు, శంఖములు మ్రోగాయి. ప్రళయకాలపు యమునిలా ప్రహస్తుడు యుద్ధభూమిలో అడుగుపెట్టాడు. తూర్పు ద్వారంగుండా బయటకి వెళ్ళాడు. ఎటుచూసినా అపశకునాలు తోచాయి. అయినా లెక్కచెయ్యకుండా వానరుల మీద లంఘించాడు.

వానరులు కూడా చాలా ధైర్యంగా వారిని ఎదుర్కొన్నారు. పెద్దగా ఘీంకారాలు చేస్తూ పెద్ద పెద్ద బండరాళ్ళు, పెద్ద పెద్ద వృక్షాలు పట్టుకుని వారినెదుర్కొన్నారు. ఇరువర్గాలవాళ్ళూ ఉత్సాహంగా తలబడ్డారు. నిప్పుల్లో పడబోతున్న మిడతల్లా ప్రహస్తుడు వానరుల్ని గెలవగలనన్న ధీమాతో యుద్ధంలో ప్రవేశించాడు. భీమ పరాక్రముడైన ప్రహస్తుని రాముడు చూశాడు. చిరునవ్వు నవ్వుతూ

"విభీషణా ఆ వస్తున్న మహాకాయుడెవరు?" అని విభీషణుడ్ని అడిగాడు.

అప్పుడు విభీషణుడు, "రామచంద్రా అతడు ప్రహస్తుడు. రావణుని సర్వసైన్యాధిపతి. రావణుని సైన్యంలో మూడవవంతు అతడి ఆధీనంలో వుంటుంది. అస్త్రశాస్త్ర విశారదుడు. గొప్ప పరాక్రమవంతుడు" అన్నాడు.

వానరసైన్యం గర్జిస్తూ అతడిపై ఎగిసి పడ్తోంది. రాక్షసులు బాణాలు వేస్తున్నారు. వానరులు పెద్ద కొండశిలలు, బండరాళ్ళు వృక్షాలు విసురుతున్నారు. ఇలా ఒకరికొకరు తీసిపోకుండా ఇరు వర్గాల వారూ పోరు సల్పుతున్నారు. రాక్షసులు శూలాలతో, పరిఘలతో, గండ్రగొడ్డళ్ళతో, వానరుల్ని చంపసాగారు. వానరులు కొండశిలలతో, వాళ్ళని చితకబాదుతున్నారు. అరచేతి దెబ్బలతో, పిడికిళ్ళతో, కొట్టి రాక్షసుల పళ్ళు రాలగొడ్తు, గుడ్లు బయటకి వచ్చేలా చరుస్తున్నారు. రాక్షసులు రక్తం కారుతూ నేల కూల సాగారు.

ప్రహస్తుని మంత్రులైన నరాంతకుడు, కుంభహనువు, మహానాధుడు, సమున్నతుడు, ఈ నలుగురు అతి వేగంగా వానరుల మీద పడి చంపసాగారు. అది చూసి ఓర్వలేక ద్వివిదుడు, ఒక పర్వత శిఖరాన్ని తెచ్చి, మహానాదుని గుండెల మీద కొట్టాడు. తారుడు ఇంకో మహావృక్షంతో, కుంభహనువు తల పగులకొట్టాడు.

ప్రహస్తుడది చూసి పౌరుషముతో ధనుసు ఎక్కుపెట్టి రథంతో సహా వానర సేన లోపలికి చొచ్చుకుని వెళ్ళాడు. వానరుల్ని ఏక బిగిని చంపుతుంటే, రణభూమి అంతా రక్తం మడుగులు కట్టి నేల మీద వానరుల, రాక్షసుల మృత కళేబరాలు గుట్టగా పడుతున్నాయి. ప్రహస్తుడు వానరుల్ని నరికి పోగులు పెడుతున్నాడు. రాక్షసమూకలు ప్రహస్తుని వెనక వుండి తమని తాము రక్షించుకుంటున్నారు. ఈ పరిస్థితి నీలుడు చూశాడు. నీలుడు ప్రహస్తుని కంట పడ్డాడు. వెంటనే ప్రహస్తుడు, నీలునిమీద బాణ వర్షం కురిపించాడు. ఒక మహావృక్షాన్ని పీకి, నీలుడు దానితో ప్రహస్తుని కొట్టాడు. ప్రహస్తుడు మరిన్ని బాణాలు వేశాడు. నీలుడు వాటిని లక్ష్యపెట్టకుండా ప్రహస్తుని రథం తాలూకు గుర్రాల్ని కూల్చేశాడు. ప్రహస్తుని చేతిలో ధనుస్సు లాక్కుని విరిచిపడేశాడు. ప్రహస్తుడు ముసలాయుధం తీసుకుని నీలునిపై బడ్డాడు. ఇద్దరూ శరీరాలు రక్తాలతో తడిసి ముద్దలయ్యాయి. అయినా లెక్కచెయ్యకుండా ఇద్దరూ హోరా హోరీ పోరాడుతున్నారు.

ప్రహస్తుడు ముసలంతో నీలుని నుదుటిమీద కొట్టాడు. వెంటనే నీలుడు ఒక మహావృక్షంతో ప్రహస్తుని గుండెల మీద కొట్టాడు. నీలుడు కొట్టిన దెబ్బ లెఖ్ఖచెయ్యకుండా ప్రహస్తుడు ముసలంతో నీలుని మీదికి దూకాడు. నీలుడు పౌరుషంతో పెద్ద కొండ పీక్కొచ్చి ప్రహస్తుని తలపగుల కొట్టాడు. ప్రహస్తుని శిరస్సు ముక్కముక్కలై కిందపడి చచ్చాడు.

మొదలు నరికిన తరువులా కిందపడ్డ తమ నాయకుడ్ని చూసి, రాక్షసులు భయంతో లంకలోకి పారిపోయారు. వారు తిన్నగా రావణుని భవనాన్ని చేరి, మౌనంగా తలలు వంచి నిలబడ్డారు.

రామలక్ష్మణులు, వానరులు, నీలుణ్ణి ప్రశంసించారు. నీలుడి చేతిలో ప్రహస్తుడు చనిపోయాడని, రావణునితో రాక్షసులు నివేదించగానే, ఆ వార్త విని రావణుడు క్రోధపరవశుడయ్యాడు. "విధి బలీయమైనది. శత్రువు అల్పుడని చిన్న చూపుచూశాము. కాని దేవేంద్రుని సైన్యాన్ని సైతం మట్టి కరిపించిన ప్రతాపవంతుడు ప్రహస్తుడు. అతడ్ని వారు చంపగలిగారంటే, వారు చాలా సమర్ధులని తెలుస్తోంది. ఇంక ఉపేక్షించి లాభం లేదు. నేనే స్వయంగా వెళ్ళి ఆ రామలక్ష్మణుల్ని నా బాణానికి ఆహుతి చేస్తాను" అంటూ తన దివ్యమైన రథం ఎక్కాడు. శంఖనాదాలు మిన్నుముట్టాయి. భేరీలు మ్రోగించారు. సైన్యం అంతా జబ్బలు చరుస్తూ గర్జనలు చేస్తూ బయల్దేరారు. పట్టణం దాటి వచ్చారు.

వానరులు పెద్ద పెద్ద వృక్షాలు, కొండ శిలలు పట్టుకుని నిలబడి వున్నారు.

అతి ప్రచండంగా వస్తున్న సైన్యాన్ని చూసి, రాముడు విభీషణుని అడిగాడు. "విభీషణా మహాప్రవాహంలా వస్తున్న ఆ సేనలో ఎవరెవరున్నారు? వారి నాయకుడెవరు" అని రాముడడుగుతుంటే, విభీషణుడు

"రామచంద్రా అదిగో అటు చూడు ఏనుగు మీద ఎక్కి బాల భానునిలా ప్రకాశిస్తు వస్తున్నాడే అతడే అకంపనుడు. అతడి వెనక కోరమీసాలతో, ఇంద్రధనస్సు లాంటి ధనస్సుతో, సింహధ్వజంగల రథం మీద వస్తున్నవాడు ఇంద్రజిత్తు. ఆ వెనక పర్వతాకారంలో ధనుర్ధారియై రథం మీద వస్తున్నవాడు, అతికాయుడు.

అతడి వెనక ఏనుగుపై వస్తున్న వాడు. మహోదరుడు. ఆ వెనక బంగారు ఆభరణాలు ధరించి వస్తున్న వాడు పిశాచుడు. ఎద్దునెక్కి త్రిశూలం ధరించి వస్తున్న వాడు త్రిశిరుడు. నల్లమబ్బులా వున్న వాడు కుంభుడు. వాని వెనక ధనుష్టకారం చేస్తూ వస్తున్న వాడు నికుంభుడు. వాని పక్కవాడు కిరాతకుడు.

వారందరి వెనక ఠీవిగా, రత్నకిరీటము కుండలములు ధరించి రథం మీద వస్తున్నాడే, ఆయనే రాక్షస ప్రభువైన రావణుడు. చంద్రుని వంటి ఛత్రం ధరించిన వాడు. ఇంద్రుడు, యముడు కూడా అతని ముందు ఆగలేరు" అని చూపించి చెప్పాడు విభీషణుడు.

రాముడు దర్పం ఉట్టిపడ్తున్న రావణుని చూశాడు. అతడి రాజసానికి చకితుడైయ్యాడు. "ఆహా ఏమి ఈ రాక్షసరాజు యొక్క తేజస్సు! దేవతలలో గాని, దానవులలో గాని, ఇంతటి రూపసి ఎక్కడా లేడు కదా. ఇతడి పరివారం కూడా పర్వతాల్లా వున్నారు. మహాపరాక్రమశాలురులా వున్నారు. ఎంత భాగ్యము నాది. ఈనాటికి పాపాత్ముడు నాకంట బడ్డాడు. సీతాపహరణ చేసి నాకు తీరని ఖేదము కలిగించాడు. దాని ఫలితం ఇప్పుడు చూపిస్తాను" అంటూ రథం దగ్గరకి వెళ్ళి "రావణా ధైర్యంవుంటే నాతో యుద్ధం చెయ్యి అంటూ లక్ష్మణునితో కలసి విల్లు సంధించి నిలబడ్డాడు. అప్పుడు రావణుడు, రాక్షసులతో

"మీరంతా వెళ్ళి గోపురాల దగ్గర, ద్వారాల దగ్గరా, భటులకోసం కట్టించిన ఆయా స్థావరాలలో నిర్భయంగా నిలబడి వుండండి. పట్టణాన్ని జాగ్రత్తగా కాపాడండి. సైన్యసమేతంగా నేను బయటకి వచ్చానని తెలిస్తే, వానరులు లంకలో ప్రవేశించి ధ్వంసం చేస్తారు. అందుకని మీరు పట్టణాన్ని జాగ్రత్తగా కాపాడండి" అని ఆజ్ఞాపించి, రావణుడు వానరసేనలో చొరబడ్డాడు.

అలా సైన్యంలోకి వస్తున్న రావణుడ్ని చూసి సుగ్రీవుడు ఒక పెద్ద పర్వత

ఖండాన్ని పట్టుకుని, రావణుని మీదికి వెళ్ళాడు. ఆ పర్వత ఖండం నిండా ఎన్నో మహా వృక్షాలున్నాయి. దానిని రావణుని పైకి విసిరాడు. రావణుడా పర్వతఖండాన్ని బంగారుమొన కలిగిన బాణాలతో ముక్కముక్కలు చేశాడు. వెంటనే మహా సర్పంలాంటి ఒక బాణాన్ని సుగ్రీవుని మీద ప్రయోగించాడు. దానినుంచి నిప్పు రవ్వలు రాలుతుండగా అది వాయువేగంతో వెళ్ళి సుగ్రీవునికి తగిలింది. సుగ్రీవుడు గట్టిగా అరచి నేలమీద పడ్డాడు. రాక్షసులకి చెప్పలేని ఆనందం కలిగింది. అప్పుడు గవాక్షుడు, గవయుడు, సుందప్రుష్టుడు, ఋషభుడు, జ్యోతిర్ముఖుడు, పెద్ద పెద్ద శరీరాలతో, పర్వత ఖండాల్ని పట్టుకుని, రావణుని మీదికి వెళ్ళారు.

రావణుడా శిలాఖండాల్ని తన బాణాలతో తుత్తునియలు చేసి, వారందరి మీదా బంగారు మొనలు కల్గిన బానాలు ప్రయోగించాడు. వారంతా కూడా నేలమీద పడ్డారు. వానరులంతా భయంతో రాముని దగ్గరకి వెళ్ళి శరణన్నారు. రాముడు ధనస్సుతో బాణం సంధించి, రావణుని మీద యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. కాని లక్ష్మణుడు అన్నగార్ని వారించి

“అన్నయ్యా ఈ నీచుడికి మీతో యుద్ధం చేసే అర్హ లేదు. నాకు అనుమతి ఇయ్యి. నేను వెళ్ళి వాడ్ని వధిస్తాను” అన్నాడు.

సత్యపరాక్రముడైన రాముడు, “లక్ష్మణా అలాగే వెళ్ళు. కాని జాగ్రత్త. రావణుడు మహావీరుడు. అవకాశం చూసి, సమయం కనిపెట్టి బాణ ప్రయోగం చెయ్యి” అని తమ్ముణ్ణి హెచ్చరించి పంపాడు. రాముడి మాటలు అర్ధం చేసుకున్న సౌమిత్రి అన్నగార్ని కౌగలించుకుని, నమస్కరించి బయల్దేరాడు.

రావణుడు భయంకరమైన ధనస్సునెక్కుపెట్టి నుంచున్నాడు. వానరుల్ని తన బాణాలతో చీల్చి చెండాడుతున్నాడు. హనుమంతుడు ఆ బాణాల్ని అడ్డుకుంటూ పరిగెత్తి వెళ్ళి రథం దగ్గర నిలబడి, ధైర్యం ఇలా అన్నాడు.

“రావణా నువ్వు తపస్సు చేసి, దేవదానవ గంధర్వ వల్ల చావు లేకుండా వరం సంపాదించావు కాని వానరుల వల్ల చావు లేకుండా వరం కోరుకోలేదు. ఇదిగో నా కుడి చెయ్యి. ఇది నీ శరీరాన్ని బ్రద్దలు చేసి, నీ ప్రాణాలు తీస్తుంది” అన్నాడు.

రావణుని కళ్ళు రోషంతో ఎఱ్ఱబడ్డాయి

“ఆహా ఎంతధైర్యం నీకు! ఏదీ కొట్టి చూపించు? రావణుని కొట్టానన్న శాశ్వతమైన కీర్తి కలుగుతుంది. నీ పరాక్రమం చూపించు. ఆ తర్వాత నా శక్తి రుచి చూద్దు గానివి” అన్నాడు. అపహాస్యంగా మాటలకి హనుమంతుడు

భయపడకుండా

"ఇంతకిముందు నీ కుమారుడైన అక్షకుమారుని చంపిన మాట మర్చిపోయావా? అన్నాడు. ఆ మాటలకి పౌరుషం వచ్చి రావణుడు తన అరచేతితో సాచి హనుమంతుని ఒక్కటేశాడు. ఆదెబ్బకి హనుమంతుడు గడగడ లాడిపోయాడు. కొంతసేపటికి నిలదొక్కుకుని, తన అరచేత్తో రావణుని చరిచాడు. ఆ దెబ్బకి రావణుడు భూకంపం వచ్చినట్లు గిర గిర తిరిగాడు.

రావణుడు రవ్వంత ఊపిరిపీల్చుకుని, "వానరా-నీ పరాక్రమాన్ని మెచ్చుకున్నానురా. నిన్నిపుడే నా శత్రువని తెలుసుకున్నాను. ఇప్పటి దాకా సామాన్య వానరుడివనుకున్నాను" అన్నాడు.

హనుమంతుడు రోషంతో ఛీ... ఛీ నా దెబ్బ తిని కూడా నువ్వింకా బ్రతికి వున్నావంటే నా పరాక్రమం ఏ పాటిది? పొగడ్తలు మాని నన్నింకో దెబ్బ కొట్టు. ఇదిగో ఈ ముష్టిఘాతంతో యమలోకానికి పంపిస్తాను" అని పిడికిలి బిగించాడు. రావణుడు మండిపడ్డాడు.

కుడి చేతి పిడికిలితో ఆంజనేయుని గుండెలపై కొట్టాడు. ఆ దెబ్బకి హనుమ మూర్ఛబోయాడు. రావణుడు హనుమంతుని అలా వదిలేసి, నీలుని వైపు బయల్దేరాడు. తీవ్రమైన బాణాలతో నీలుని హింసించసాగాడు. నీలుడా బాణ ఘాతాలాలు సహిస్తూ ఒక పర్వత శిఖరాన్ని కదిలించి, రావణుని వైపు తోశాడు. ఇంతలో హనుమంతుడు తేరుకుని, నీలునితో బాటు తనూ రావణునిపైకి లంఘించాడు. రావణుడు నీలుడు దొర్లించిన పర్వత శిఖరాన్ని ఏడుబాణాలతో ముక్క ముక్కలు చేశాడు. నీలునికి చాలా కోపం వచ్చి, అశ్వకర్ణములు, సాలములు, మొదలైన మహావృక్షాలు పీకి రావణునిపై విసిరెయ్యసాగాడు. రావణుడు తన బాణాలతో ఆ వృక్షాల్ని ముక్క ముక్కలు చెయ్యసాగాడు. బాణ పరంపరలతో నీలుణ్ణి ఉక్కిరి బిక్కిరి చెయ్యసాగాడు. అప్పుడు నీలుడు తెలివిగా తన శరీరాన్ని సంకోచింపజేసి, చిన్నగా మారి పోయి, రావణుని రథం మీది జెండాపైకెక్కి కూర్చున్నాడు.

జెండా మీద కూర్చున్న నీలుణ్ణి చూసి రావణునికి ఒళ్ళు మండింది. రామలక్ష్మణులు, హనుమంతుడు కూడా నీలుడు చేసిన వింత చేష్టకి ఆశ్చర్యపోయారు. రావణుడు నీలుని వింతచర్యకి చకితుడై అతడిపై ఆగ్నేయాస్త్రాన్ని ఎక్కుపెట్టాడు. ఇంతలో వానరులంతా నీలుడి చర్యని మెచ్చుకుంటు గట్టిగా కేకలు వేశారు. ఆ కేకలకి రావణుడు గాబరాపడ్డాడు.

అగ్నేయాస్త్రాన్ని మంత్రించి ధ్వజంపై వున్న నీలుణ్ణి చూసి, "ఓ వానరా లాఘవంగా చాలా చిత్రమైన చేష్టచేశావు. చాలారూపాలు మార్చిమార్చి ప్రదర్శిస్తున్నావు. కాని, ఇక్కడ జరుగుతువ్నది తమాషా ప్రదర్శన కాదు. నీ ప్రాణాలు జాగ్రత్త. ఎలా రక్షించుకుంటావో రక్షించుకో" అంటూ నీలునిపై ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. మంటలు దహిస్తుండగా నీలుడు తెలివితప్పి నేలమీద బోర్లాపడ్డాడు. నీలుగు అగ్నిదేముని కుమారుడు కనుక ఆ మంటలు అతడి ప్రాణం తియ్యలేదు. రావణుడు నీలుడు చచ్చాడనుకుని వదిలేశాడు. లక్ష్మణుని వైపు రథాన్ని పోనిమ్మన్నాడు. లక్షణుని దగ్గరగా వెళ్ళి ధనుష్టంకారం చేశాడు.

లక్ష్మణుడు ధనుస్సు వంచి, నారి సారించి,

"రాక్షసరాజా రా, ఇలారా, వానరులతో యుద్ధం చెయ్యటం నీబోటి వీరులకు అవమానం" అంటూ ఇంకా తీవ్రంగా ధనుష్టంకారం చేశాడు. రావణుడు, ఆ శబ్దానికి ఓర్వలేక,

"ఔను నిజమే. నా భాగ్యంకొద్దీ ఇవాళ నా కంటబడ్డావు. నీకు వినాశకాలం దాపురించి నాతో యుద్ధానికి దిగావు. కాచుకో, ఇప్పుడే యమపురికి పంపుతాను" అంటూ వికటాట్టహాసం చేశాడు.

లక్ష్మణుడా మాటలు లెఖ్ఖచెయ్యకుండా "రాక్షసరాజా పాపాత్ములందరిలో గొప్పవాడివి. పౌరుషం గలవాళ్ళు మాటలు చెప్పరు. నీ దర్పము, బలము, ప్రతాపము, నాకు తెలుసులే, ఇదిగో ధనుర్బాణాలు ధరించి నీ ఎదుట నుంచున్నాను. వ్యర్థమైన మాటలు మాని చేతనైతే ఎదుర్కో" అన్నాడు.

ఆ మాటలు విన్న రావణుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. తీవ్రమైన ఏడు బాణాలు లక్ష్మణుని మీద వదిలాడు. లక్ష్మణుడు తన బాణాలతో వాటిని ఛేదించాడు. రావణుడు చాలా ఆశ్చర్యపోయాడు. లక్ష్మణుని నైపుణ్యానికి, ముగ్ధుడయ్యాడు. రావణుడెన్ని బాణాలు వేసినా వాటిని మధ్యలోనే ఛేదిస్తూ అగ్నితుల్యమైన బాణాలు రావణునిపై వెయ్యసాగాడు లక్ష్మణుడు. రావణుడు కూడా సునాయాసంగా ఆ బాణాలు ఛేదించి కాలాగ్నితో సమానమైన బ్రహ్మ తత్త్వమైన బాణంతో లక్ష్మణుని నుదుటి మీద కొట్టాడు. లక్ష్మణుడు కదిలిపోయాడు నిలువెల్లా. అతడి చేతిలోంచి బాణం జారిపోయింది. అంతలో మళ్ళీ తెలివి తెచ్చుకుని విల్లు చేతిలోకి తీసుకున్నాడు. తీవ్రమైన బాణం ప్రయోగించి రావణుని చేతిలోని విల్లు ముక్కలు ముక్కలు చేశాడు. వెంటనే మూడు శక్తివంతమైన బాణాలు రావణునిపై వేశాడు. ఆ బాణాల తాకిడికి, రావణుడు తూలాడు.

ఒళ్ళంతా చీరుకుపోయి, రక్తంకారుతూ, మాంసం బయటపడింది.

రావణుడు ఉగ్రుడై, బ్రహ్మ తనకిచ్చిన అప్రతిహతమైన శక్తిని లక్ష్మణునిపై ప్రయోగించాడు. ప్రజ్వలిస్తున్న అగ్నిలా ప్రకాశిస్తూ వానరులందర్నీ భయభ్రాంతుల్ని చేస్తూ ఆ శక్తి, లక్ష్మణుని భుజం మధ్య భాగంలో ప్రవేశించింది. అంతటి మహా వీరుడు, ఆ శక్తి ప్రభావంవల్ల తెలివితప్పి పడిపోయాడు. రావణుడు లక్ష్మణుని లంకలోకి తీసుకుపోవాలని తొందర తొందరగా అతడి దగ్గరకి వచ్చి లక్ష్మణుడ్ని రెండుచేతులతో ఎత్తుకోవాలని చూశాడు..

కాని విచిత్రం కైలాసగిరిని సైతం కదలించిన రావణుని భుజం రావణుని హస్తాలూ లక్ష్మణుని కదిలించలేకపోయాయి. తన ఇరవై చేతులూ వుపయోగించినా లక్ష్మణుడ్ని కదల్చలేకపోయాడు.

రావణుడెలాగైనా లక్ష్మణుడ్ని కదిలించి భుజంమీద వేసుకోవాలని చేస్తున్న ప్రయత్నం హనుమంతుడు చూశాడు.

కోపం పట్టలేక, వజ్రాయుధం లాంటి పిడికిలితో, రావణుని గుండెల మీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి రావణుడు జారి, మోకాళ్ళ మీద బోర్లాపడ్డాడు, రథంలోనే చెవుల నించి ముక్కుల నించీ రక్తం కారసాగింది. తెలివితప్పి పడిపోయాడు. మూర్ఛపోయిన రావణుడ్ని చూసి ఆకాశ వీధిలోని ఋషులు, దేవతలు, ఇంద్రుడు, గంధర్వులు, అంతా హర్షధ్వానాలు చేశారు. వానరులు సంతోషంతో గెంతులు వేశారు.

రావణుడలా పడి వుండగా హనుమంతుడు, లక్ష్మణుని రెండు చేతులతతో ఎత్తి రాముని దగ్గరకి తీసికెళ్ళాడు. రావణుడు సైతం కదల్చలేని లక్ష్మణుల్ని పసిపిల్లవానిలా పొదివి, గుండెలకి హత్తుకుని తీసికెళ్ళాడు.

ఎప్పుడైతే రావణుడు లక్ష్మణుని కదల్చాలని తన చేతులు అతడిమీద వేశాడో, వెంటనే రావణుడు ప్రయోగించిన శక్తి లక్ష్మణుని వదలి రావణుడ్ని పట్టుకుంది. అందుకే మూర్ఛబోయాడు. రాముడిదగ్గరకి రాగానే లక్ష్మణునికి తెలివివచ్చింది.

హనుమంతుడిదెబ్బకి పడిపోయిన రావణుడికీ కొంతసేపటికీ తెలివి వచ్చింది. మళ్ళీ ధనస్సు ధరించి యుద్ధానికి బయల్దేరాడు. ప్రచండ వేగంతో యుద్ధం చెయ్యసాగాడు. ఆ ధాటికి ఆగలేక, వానరులు పరుగులు తీశారు. పరిస్థితి సమీక్షించిన రాముడు తానే స్వయంగా యుద్ధానికి బయల్దేరాడు. అప్పుడు హనుమంతుడా మహనీయుని దగ్గరకెళ్ళి

"స్వామీ నా భుజాలపై కూర్చోండి" అని ప్రార్థించాడు. రాముడు సరే అని

హనుమంతుని భుజాలపైకి ఎక్కి కూర్చున్నాడు.

రాముడు రావణునితో యుద్ధానికి బయల్దేరాడు. ధనుష్టంకారం చేస్తూ

"రావణా-అక్కడే ఆగు. నా పట్ల తీరని అపచారం చేసిన నువ్వు ఇన్నాళ్ళకి, నా కంట బడ్డావు. ఇంక తప్పించుకుపోలేవు. ఇంద్రలోకానికి వెళ్ళినా, యమలోకానికెళ్ళినా, ఏదిక్కుకెళ్ళినా నన్ను తప్పించుకుపోలేవు.

ఇప్పుడు నువ్వు ఎవరిపై శక్తి ప్రయోగించావో, అతడే నీ మరణానికి కారణం కాగలడు. అతడు మూర్ఛపోయాడని భ్రమపడకు. మా అన్నదమ్ములిద్దరిదీ ఒక్కటే ప్రాణం. మూర్ఛపోయిన నా తమ్ముడే లేచి నీవంశాన్ని సమూలంగా నాశనం చెయ్యటానికి వచ్చాడు" అంటూ రావణుని వైపు వెళ్ళాడు. రావణుడు, రాముని మీదా, అతడ్ని మోసుకొస్తున్న హనుమంతుని మీదా బాణాలు ప్రయోగించాడు. కాని ఆ బాణాలు తగలగానే హనుమంతుడు మరింత విజృంభించాడు. గాయపడిన హనుమంతుని చూసేసరికి రాముడికి పట్టరాని ఆగ్రహం కలిగింది.

రాముడు బాణాలు ప్రయోగించి రావణుని, రథాన్ని, గుఱ్ఱాల్ని, సారథిని పడగొట్టాడు. రావణుని చేతిలోని విల్లుని, శూలాన్ని, ఖడ్గాన్ని తన చేతిలోని బాణంతో ఛేదించాడు. రావణుని భుజం మధ్య బాగాన్ని తన బాణంతో కొట్టాడు. మునుపు ఇంద్రుడి వజ్రాయుధం వల్ల కూడా కలగనంతటి బాధ ఇప్పుడు రామబాణం వల్ల కలిగింది. వాడికి శరీరమంతా కదిలి, ఓర్వలేని బాధతో చేతిలోని ధనస్సు జారవిడిచాడు.

అప్పుడు రాముడు అర్ధచంద్రాకారపు బాణం ప్రయోగించి, రావణుని కిరీటం పడగొట్టాడు. కిరీటం నేలమీద పడి, కోరలు పీకిన విషసర్పలంతా తేజోవిహీనుడైన రావణుని చూసి రాముడు "రావణా- చాలా గొప్ప యుద్ధం చేశావులే. నా వీరులందర్నీ చంపిన నిన్ను నిజానికి వదలకూడదు. కాని బాగా అలసిపోయి వున్నావు. ఇట్టి అవస్థలో వున్న నిన్ను చంపటం వీరోచితం కాదు. వెళ్ళు. నీ లంకలోకి వెళ్ళి బడలిక తీర్చుకుని, మళ్ళీ రథాన్ని ఆయుధాల్ని సమకూర్చుకుని రేపు రా" అని కర్కశంగా అన్నాడు. తీవ్రమైన పరాజయం కల్గినా రావణునికి పశ్చాత్తాపం కలగలేదు. కాని చాలా కృంగిపోయాడు. వెనక్కి తిరిగి లంకలోకి వెళ్ళిపోయాడు. రాముడు వానరులు శరీరంలోని బాణాలు తీసేసుకుని స్వస్థులైయ్యారు. లక్ష్మణుడు కూడా బాగా తేరుకున్నాడు. రావణుడు గర్వభంగంతో మరలిపోవటం చూసి, దేవతలు, ఋషులు మొదలైన వారంతా చాలా ఆనందించారు. రావణుని మనస్సు వికలమైపోయింది. రాముడ్ని తలచుకుంటే చాలు సింహాన్ని చూసిన ఏనుగులా

గడగడలాడిపోతున్నాడు. ప్రళయకాలాగ్ని లాంటి రాముని అస్త్రాలు తల్చుకుంటే గుండె దడపుట్టోంది.

మళ్ళీ సభని సమావేశపరిచాడు. దివ్యమైన బంగారుసింహాసనం మీద కూర్చున్నాడు. రాక్షసులందర్నీ కలయచూస్తూ ఇలా అన్నాడు.

"మిత్రులారా, నేనెంతో గొప్ప తపస్సు చేశాను. అదంతా ఇప్పుడు వ్యర్థమైపోయింది. కేవలం ఒక సామాన్య మానవుని చేతిలో ఓడిపోయాను. ఆనాడు నాకు బ్రహ్మ ఎవరివల్లా మరణం లేకుండా వరం ఇచ్చాడు. కాని నేనే, తెలివితక్కువ తనంగా మానవులు వల్ల చావులేకుండా కోరుకోలేదు. కోరుకుని వుంటే అదీ ఇచ్చేవాడు. అయినా కూడా "నీకు మానవుల వల్ల మరణం కలిగే ప్రమాదం లేకపోలేదని" హెచ్చరించాడు. నేను రాముడ్ని మానవునిగానే భావిస్తున్నాను. ఇక్ష్వాకు వంశానికి చెందిన దశరథుని కుమారుడీ రాముడు.

పూర్వము, ఇదే వంశానికి చెందిన అనరణ్యుడు అనే రాజు, తన వంశంలో జన్మించబోయే పురుషోత్తముని చేతిలో నాకు చావు తప్పదని శపించాడు. అది నిజం చెయ్యటానికే ఈ రాముడు నా మీద దండెత్తి వచ్చాడు. అదీగాక చాలా కాలం క్రితం నేను వేదవతి అనే స్త్రీని బలాత్కారించాను. ఆమె నన్ను సమూలంగా నాశనం చేస్తానని శపథం చేసింది. ఆమెయే ఈ సీతగా జన్మించి వుండవచ్చు.

ఒక నాడు నేను కైలాసాన్ని కదిలించినప్పుడు, నందీశ్వరుడు పార్వతి, నన్ను శపించారు. పార్వతీ దేవి నాకు ఒక స్త్రీ మూలంగా మరణం వస్తుందని శపించింది. నందీశ్వరుడు నాకు వానరుల వల్ల చావు వస్తుందని శపించాడు. ఇంకొక సమయంలో నేను రంభని బలాత్కారించినప్పుడు ఆమె భర్తయైన నలకూబరుడు కూడా శపించాడు. మరొకసారి వరుణుని కుమార్తె అయిన పుంజిక స్థలని నేను బలాత్కారించగా ఆమె బ్రహ్మతో మొరపెట్టుకుంది.

అపుడు బ్రహ్మ నాకు ఒక స్త్రీ మూలంగా చావు వస్తుందనీ, ఏ స్త్రీనైనా నేను బలవంతంగా అనుభవిస్తే తలపగిలి చస్తాననీ శపించాడు. ఈ శాపాలన్నింటి ఫలితంగా ఈ సీత కోసం మానవుడైన రాముడు, వానరుల సాయంతో వచ్చి, లంకని చుట్టుముట్టాడు. ఇప్పుడింక కర్తవ్యం ఏమిటంటే, మన రాక్షస వీరులంతా, గోపుర శిఖరాల దగ్గరా, ద్వారాల దగ్గరా కాపలా ఉండాలి. కుంభకర్ణుడు బ్రహ్మ శాపం వల్ల ఆరునెలలు నిద్రలో వుంటాడు. లేవలేడు. లేచినా ఒక్క రోజు మాత్రమే మెలకువగా వుంటాడు.

కాని కుంభకర్ణుడు అప్రతిహతుడు. దేవదానవుల్ని జయించగల పరాక్రమం

గలవాడు. మీరంతా కుంభకర్ణుడ్ని ఎలాగైనా మేలుకొల్పండి. ఇవాల్టికి ఎనిమిది రోజుల ముందే నేను సభలో అతడితో చర్చించాను. కనుక అతడు తొందరగా లేవలేడు. కాని వాడ్ని ఎలాగైనా నిద్రలేపాలి. ప్రస్తుతం ఈ వానరుల్ని, రామలక్ష్మణుల్ని జయించగల్గిన వాడతడొక్కడే" అని ఆజ్ఞాపించాడు.

రాక్షసులంతా కలవరపడుతూ కుంభకర్ణుణ్ణి లేపడానికి బయల్దేరారు. మాంసం, రక్తం మొదలైన ఆహార పదార్థాలు, సుగంధ ద్రవ్యాలు, పూలదండలు పిండి వంటలు తీసుకుని రావణుడి సైనికులు, కుంభకర్ణుడు నిద్రపోతున్న గుహని చేరారు.

ఆ గుహ చాలా విశాలమైనది. పెద్దది. చాలా అందమైనది. కుంభకర్ణుడు నిద్రపోతూ ముక్కులోంచి వదులుతున్న నిశ్వాస వాయువులకి, లోపలికి ప్రవేశిస్తున్న సైనికులు వెనక్కి ఎగిరిపడ్డారు. వాళ్ళు అతి ప్రయత్నమ్మీద ఆ గాలికి తట్టుకుని అతి కష్టమ్మీద ఎలాగోలా లోపల చేరారు.

ఆ రాక్షస సోదరుడు పెద్ద పర్వతంలా విశృతంగా పడి వుండి గురకలు తీసి నిద్రపోతున్నాడు. ఒంటినిండా బంగారు ఆ భరణాలు ధరించి వున్నాడు. అతడి నోరు, ముక్కు రంధ్రాలు కొండ గుహల్లా వున్నాయి. లేచీ లేవగానే ఆకలి ఆకలి అంటాడు. అందుకని కొండంత అన్నం రాశిగా పోసి వుంచారు. అద్భుతమైన అన్నం వండించారు. పెద్ద పెద్ద బానలతో రక్తం, మద్యము సిద్ధపరిచారు.

ఇవన్నీ సిద్ధమయ్యాయక చల్లని చందనగంధం ఒళ్ళంతా పట్టించారు. పూల దండలు సుగంధ పరిమళము గలవి తెచ్చి ఒళ్ళంతా పరిచారు. స్తోత్రపాఠాలు ప్రారంభించారు. పెద్ద పెద్ద కేకలు వేశారు. శంఖాలు పూరించారు. మేఘాల్లా గర్జించారు. శరీరమంతా గట్టిగా బాదారు. దొర్లించారు. భేరీలు మ్రోగించారు. సింహనాదాలు చేశారు.

ఆ శబ్దాలకి పక్షులు బెదిరిపోయి చెల్లాచెదరుగా పరుగులు తీశాయి. ఎంతకీ వాడు లేవకపోవడంతో, సుత్తులు తెచ్చి మొత్తారు. రోకళ్ళతో, గదలతో, కుళ్ళబొడిచారు. పర్వతశిఖరాలు తెచ్చి మీద పడేశారు. వేలకొద్దీ దుందుభులు మ్రోగించారు. అయినా వాడు నిద్రలేవలేదు.

ఇంకా తీవ్రమైన ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏనుగులు, ఒంటెలు, గాడిదలు, మొదలైన అడవి మృగాల్ని తెచ్చి వాటికి తీవ్రంగా భయం కల్గించి వాని మీదుగా పరుగులుపెట్టించారు. పెద్ద పెద్ద స్థంభాలతో కొట్టారు. అయినా కుంభకర్ణుడు నిద్ర లేవలేదు. ఇంకప్పుడు చిత్రహింసలు మొదలెట్టారు. కొందరు జుట్టు పీకారు. కొందరు చెవులు కొరికారు. కుండలకొద్దీ నీళ్ళు తెచ్చినెత్తిన పోశారు.

అలా ఎన్నెన్నో విశ్వ ప్రయత్నాలు చేయ్యగా వాడికి మెలకువ వచ్చింది. కొద్దిగా అటు ఇటు కదిలాడు. బండరాళ్ళతో కొట్టడం వల్ల మత్తు వదిలింది. పెద్దగా ఆవలిస్తూ లేచాడు. కొండశిఖరాల్లాంటి చేతులు చాపాడు. కొండ గుహలాంటి నోరు తెరిచాడు.

వెంటనే రాక్షసులు ఆహారపదార్థాలు ఎదురుగా తీసికెళ్ళారు. మొత్తం ఆహారమంతా తినేశాడు. రక్తమంతా త్రాగేశాడు. మధువు కూడా త్రాగి బ్రావుమని తేన్చాడు. అప్పుడు రాక్షసులంతా అతడి కెదురుగా వెళ్ళి తలవంచి నమస్కరించి నిలబడ్డారు. అప్పటికి వాడి మత్తు పూర్తిగా దిగింది. కళ్ళు తెరచి, అందర్నీ తేర బారి చూశాడు. రాక్షసులంతా భయంతో ఒణికిపోయారు.

కుంభకర్ణుడు వారిని భయపడవద్దని ధైర్యం చెప్పాడు. "ఇప్పుడు నన్ను ఎందుకు లేపారు? రావణుడు కుశలమేనా? వానికేం ఆపదరాలేదు కదా?" అని అడిగాడు. ఏదో ముఖ్యమైన కారణం లేనిదే తనని నిద్రలేపరని వాడికి తెలుసు. విరూపాక్షుడనే మంత్రి ముందుకి వచ్చి "ప్రభూ ఇప్పుడు ఒక మానవుని వలన మన లంకకి ముప్పు వాటిల్లబోతోంది. పర్వతాకారులైన వానరులు లంకని చుట్టుముట్టారు.

సీతమ్మని అపహరించి తెచ్చాడన్న కోపంతో రాముడు కక్షకట్టి మనపై దండెత్తి వచ్చాడు. అది వరలో హనుమంతుడనే ఒక వానరుడు, వచ్చి లంకని సర్వనాశనం చేశాడు కదా. అక్షకుమారుణ్ణి చంపాడు. కాని అతడ్ని ఎవ్వరం ఏమీ చెయ్యలేకపోయాము. ఇప్పుడు రాముడు యుద్ధంలో తమ అన్నగార్ని ఓడించి, మీ అన్నగారు ఆయుధం చెయ్యిజార్చి వుండగా, చేతిలో ఆయుధం లేనివాడ్ని చంపనని, దయతలచి వదిలేశాడు. రావణుని కింతకన్న పరాభవం ఏం వుంది?" అని విరూపాక్షుడు చెప్పిన మాటలు విని కుంభకర్ణుడు భగ్గున మండిపడ్డాడు. కోపంతో ఎఱ్ఱని కనుగుడ్లు తిప్పుతూ ఇలా అన్నాడు.

"విరూపాక్షా నేనిక్కడ్నుంచి ఇలాగే యుద్ధభూమికెళ్ళి, ఆ రామలక్ష్మణుల్ని చంపి వచ్చి అన్నగారి దర్శనం చేసుకుంటాను. వారి రక్తం త్రాగుతాను" అని బయల్దేరబోతున్న కుంభకర్ణునితో మహోదరుడనే వాడు, తొందరపడవద్దని వారిస్తూ ఇలా అన్నాడు.

"ప్రభూ తమరు ముందుగా రావణ ప్రభువుని కల్సి అప్పుడు యుద్ధానికి వెళ్ళండి. మంచి చెడులు నిర్ణయించుకున్నాకే కార్యం మొదలు పెట్టాలి" అని. సరే అని కుంభకర్ణుడు రాక్షసులతో కలసి రావణుని దగ్గరకి బయల్దేరాడు.

రావణుడు సభా మంటపంలో సింహాసనం మీద కూర్చున్నాడు. అతడి అనుమతితో సభా మండపంలో ప్రవేశించాడు కుంభకర్ణుడు.

రెండువేల కుండల మద్యం త్రాగి భూమి కంపిస్తుండగా, నడిచి వెళ్తున్న కుంభకర్ణుని చూసి, ప్రాకారాల మీద కూర్చున్న వానరులు పెద్ద పర్వతం కాని కదలి వెళ్తోందా అనుకున్నారు. భయంతో రాముని దగ్గరకి పరిగెత్తారు. కొంతమంది భయపడి బోర్లాపడిపోయారు. వానరులంతా చెల్లాచెదురైపోయారు.

పర్వతాకారంలో ధనస్సు ధరించి చిన్న పర్వతంలా కదిలి వస్తున్న కుంభకర్ణుని ప్రసవణ గిరి మీద వున్న రాముడు చూశాడు. బంగారు కిరీటము, భుజకీర్తులు ధరించి, నీటితో నిండిన నల్లని మేఘంలా కదిలి వస్తున్నా, చాలా ఎత్తైన వాడుకనక బయటికి కూడా కనిపిస్తున్నాడు. ఆ భీకరాకారం చూసి రాముడు ఆశ్చర్యపోయి, విభీషణుడితో ఇలా అన్నాడు.

"విభీషణా, ఆ వస్తున్న రాక్షసవీరుడెవరు? చూడ్డానికి మహాపర్వతంలా వున్నాడు. కిరీటం ధరించాడు. కనుక రాజవంశానికి చెందినవాడని తెలుస్తోంది. వాని కన్నులు పచ్చగా వున్నాయి. ఇప్పటిదాకా నేనింతటి రాక్షసుడ్ని చూడలేదు" అని రాముడు విభీషణుణ్ణి అడగగా, అతడిలా జవాబు చెప్పాడు.

"రామచంద్రా, అతడు కూడా విశ్రావసుని కుమారుడే. యుద్ధంలో దేవేంద్రుని జయించిన వాడు. మహాబలశాలి అతడు. రాక్షసులలో ఇంతటి పెద్ద శరీరం గల వాడింకొకడు లేడు. ముల్లోకాలను జయించగల సమర్థుడు. ఇతర రాక్షసులు తపస్సు చేసి, వరాలుపొంది అజేయులైయ్యారు. కాని ఇతడు జన్మసిద్ధముగా మహాపరాక్రమశాలి. వేలకొలది జంతువుల్ని అవలలగా ఒకేసారి తినగలడు.

ఇతడిలా ఏకకాలంలో వేలమందిని తింటుంటే, ఈ నేల మీద జీవ కోటి వుండదని భయపడి, ఒకసారి లోకంలో ప్రజలంతా ఏకమై ఇంద్రుని శరణువేడారు. ఇంద్రుడు కోపంతో అతడిపై వజ్రాయుధం ప్రయోగించాడు. ఆ వజ్రాయుధం దెబ్బకి అతడు హుంకరించి, కోపంతో గర్జించాడు. ఆ గర్జనకి లోకాలన్నీ గడగడలాడాయి.

కుంభకర్ణుడు కోపంతో ఇంద్రుని సమీపించి, అతడెక్కే ఐరావతముయొక్క దంతము పీకి ఇంద్రుని గుండెలపై కొట్టాడు. ఆ దెబ్బకి ఓర్వలేక ఇంద్రుడు బ్రహ్మలోకానికి వెళ్ళాడు. అతనికూడా దేవతలు, ఋషులు, పరివారం అందరూ కూడా దుఃఖిస్తూ వెళ్ళారు. ఇంద్రుడు బ్రహ్మతో జరిగిన దంతా నివేదించి, వీడు దేవతల్ని పీడిస్తున్నాడనీ, ఆశ్రమాల్ని ధ్వంసం చేసి, మునుల్ని బాధిస్తున్నాడనీ,

ఇతడ్ని ఉపేక్షిస్తే సృష్టిలోని జీవకోటినంతా తినేస్తాడనీ, కొద్ది కాలములోనే లోకాలన్నీ శూన్యమైపోతాయని చెప్పాడు. అప్పుడు బ్రహ్మ రాక్షసులందర్నీ పిలిపించి, కుంభకర్ణుని వైపు చూశాడు కుంభకర్ణుని రూపము బ్రహ్మకి కూడా భయం కలిగించింది. అతడ్ని బుజ్జగించి, మంచి మాటలాడుతూ "కుంభకర్ణా విశ్రావసుని కడుపున, నువ్వు ఈ లోకాన్ని నాశనం చెయ్యటానికి పుట్టావు. కాని నేటి నుంచి నువ్వు చచ్చినవాడిలా పడివుండు" అని శపించాడు. వెంటనే కుంభకర్ణుడు శవంలా నేలమీద పడ్డాడు.

అది చూసి, రావణుడు చేతులు జోడించి, "పితామహా ఇది చాలా అన్యాయం. వీడు మీ మునిమనుమడు కదా. ప్రేమగా ఆదరించకపోగా, ఇలా శపించటం మీకు తగునా? కనీసం ఒక్కరోజైనా లేచి తిరిగేలా ఆశీర్వదించు. ఒక్కరోజు మా అందరితో ఆనందంగా గడిపి మళ్ళీ నిద్రపోయేలా దీవించు" అని ప్రార్థించాడు.

అప్పుడు బ్రహ్మ సరే అని ఆరునెలలు ఇతడు ఒళ్ళు మరచి తెలియకుండా నిద్రపోయి, ఒక్కరోజు మాత్రమే మెలకువగా వుంటాడు. ఆ ఒక్కరోజూ స్వేచ్ఛగా సంచరించి, మర్నాడు మళ్ళీ నిద్రపోతాడు" అని తన శాపాన్ని సవరించుకున్నాడు. రామా రావణుడు నీ వల్ల పరాభవంపొంది, ఇప్పుడు మన మీదికి యుద్ధానికి పంపటానికి కుంభకర్ణుని మేలుకొలిపాడు. నీ పరాక్రమం చూసి అతడు చాలా భయపడిపోయాడు. ఇప్పుడు కుంభకర్ణుడు వచ్చి దొరికిన వాళ్ళని దొరికినట్లు తినేస్తాడు. వానరులు ఇతడి ముందు నిలవలేరు. కనుక మనం, ఇప్పుడు ఈ కుంభకర్ణుడు ఒక రాక్షసుడని గాక, ఒక యంత్రం అని చెప్పి అప్పుడు వానరుల భయం కొంత వరకు తగ్గుతుంది" అని విభీషణుడు చెప్పినమాటలువిని రాముడు, సేనాపతి అయిన నీలుని పిల్చి, నువ్వు వెళ్ళి మన సైన్యాన్ని విభజించి నిలబడు. లంకాద్వారాలన్నీ, సంధిప్రదేశాలను, కాపలా కాసేటట్లు ఏర్పాట్లు చెయ్యి. అందర్నీ కొండశిలలనీ, వృక్షాలనీ, చేతితో పట్టుకుని, నిలబడేలా చూడు. ఇది నా ఆజ్ఞ" అన్నాడు.

గవాక్షుడు, గవయుడు, శరభుడు, హనుమంతుడు, అంగదుడు, పెద్ద పర్వతాకారులై ద్వారాల దగ్గర నిలబడి వున్నారు. రామాజ్ఞపై వానరులు, కొండశిలలతో, వృక్షాలతో, రాక్షసుల్ని ఎదుర్కొన్నారు. కుంభకర్ణుడు నిద్రమత్తులో వుండి, ఎక్కువగా మద్యం త్రాగటం వల్ల ఒళ్ళు తెలియక, తూలుతూ నడుస్తూ వేల కొలది రాక్షసులు వెంటరాగా, రావణుని భవనంలో ప్రవేశించాడు. అతడుఅడుగులు వేస్తూ నడుస్తూ వస్తుంటే, భూమి కంపిస్తోంది. అలా

నడుచుకుంటూ వెళ్ళి కక్ష్యాంతరాలు దాటి, పుష్పకవిమానంలో దిగులుగా కూర్చుని వున్న రావణుని చూశాడు.

కుంభకర్ణుని చూడగానే రావణునికి చెప్పలేని ఆనందం కలిగింది. లేచి వెళ్ళి తమ్ముణ్ణి గాఢంగా కౌగలించుకున్నాడు. తమ్ముడికి ఆసనం చూపించి, తాను పర్యంకముపై కూర్చున్నాడు. కుంభకర్ణుడు అన్నగారి పాదాలకి నమస్కరించి, "నన్నెందుకు పిలిపించావు?" అని అడిగాడు. రావణుడు తమ్ముడి వెన్ను తట్టి "కూర్చో" అన్నాడు.

కుంభకర్ణుడికి కోపంతో కన్నులు ఎఱ్ఱబడ్డాయి. అయినా తమాయించుకుని, అన్నగారి మీది గౌరవంతో కూర్చుని, ఇలా అన్నాడు.

"రాజా ఇంత అర్ధాంతరంగా నన్ను ఎందుకు నిద్రలేపావు? నీకెవరు అపకారంతలబెట్టారు? వాడికి మరణం ఖాయం. ఎవరి ఆయువు మూడిందో చెప్పు" అని ఆగ్రహంతో పలుకుతున్న తమ్ముడి వైఖరి చూసి, అతడికి చాలా కోపం వచ్చిందని రావణుడు గ్రహించాడు. ఆసనం దిగి అటు ఇటు పచార్లు చేస్తూ

"సోదరా, నువ్వు చాలా కాలం నించీ హాయిగా నిద్రపోతున్నావు. రాముని వలన ముంచుకొచ్చిన ఆపద గురించి నీకు తెలియదు. రాముడు, సుగ్రీవునితో, వానర దండుతో సముద్రం దాటి వచ్చి మన సైన్యాన్ని సర్వనాశనం చేస్తున్నాడు. వానరులంతా సముద్రం మీద రాముడు నిర్మింపచేసిన వారధి మీదుగా నడిచి వచ్చారు. లంకని నాలుగు వైపుల నించీ ముట్టడించారు. వారి వల్ల మన సైన్యంలో ప్రధానమైన వారు చాలా మంది చనిపోయారు. కాని వారిలో ముఖ్యుడు ఒక్కడూ కూడా చావలేదు. అందుకే నిన్ను నిద్రలేపాల్సి వచ్చింది. నా ఖజానా ఖాళీ అయిపోతోంది. బలం తగ్గిపోతోంది. నువ్వే ఇప్పుడు నన్ను, లంకనీ కాపాడాలి. ఇంక లంకలో బాలురు, వృద్ధులు మాత్రమే వున్నారు. నీ ఈ సోదరుని కోసం నువ్వు యుద్ధం లోకి దిగక తప్పదు. ఇది వరకు దేవాసుర యుద్ధంలో చాలా మంది దేవతల్ని జయించావు. నువ్వంటే నాకు ఎంతో గౌరవం ఎక్కువ. నీతో సరియైన బలశాలి ముల్లోకాలలోనూ లేడు. ఇప్పుడు నీ బలం ప్రదర్శించు. పెనుతుఫానులా విజృంభించి, ఆవానర సేనని చిన్నా భిన్న చెయ్యి" అన్నాడు.

అన్నగారి మాటలకి నవ్వి, కుంభకర్ణుడిలా అన్నాడు.

"ప్రభూ యుద్ధం ప్రారంభం కాకముందు మనం ఈ సంగతి చర్చించు కున్నాము. మేమంతా నీకు, సీతమ్మని అపహరించటం వల్ల ముప్పు తప్పదనీ,

ఆపద ముంచుకువస్తోందనీ, నొక్కి నొక్కి మరీ చెప్పాము. నీ మేలుకోరి ఆనాడు మేము చెప్పినమాటలు నీకు నచ్చలేదు. అందరం ఊహించినట్లే ఆపద ముంచుకొచ్చింది. పాపకర్మకి ఫలం అనుభవించక తప్పదు.

అనాలోచితంగా నువ్వు చేసిన పనీ. నీ అహంకారం, మా సలహా నీ తల కెక్కనివ్వలేదు. అధికారం నీ చేతిలో వుంది కదా అని నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావు. సీతమ్మ నెత్తుకొచ్చేముందు మంత్రులతో ఆలోచించలేదు. ఇప్పుడు దుఃఖించి ప్రయోజనమేమిటి? ఇప్పటికైనా శత్రువుతో రాజీపడటం కన్నా వేరే మార్గం లేదు. వెంటనే సీతమ్మని రామునికిచ్చేసి, అతడ్ని శరణువేడడం అన్ని విధాలా మంచిది" అని తమ్ముడన్న మాటలకి రావణునికి పౌరుషం పొడుచుకొచ్చింది. కోపంతోమండిపడుతూ చివాలున లేచి

"చాల్లే ఆపు నీ నీతి ప్రవచనాలు. నేను నీ కన్నా పెద్దవాడిని. నీకుగురువు లాంటివాడిని. అటువంటి నన్ను శాసించకూడదు. చాలా శ్రమ పడి ఏవేవో నీతులు చెప్పావు. కాని ఇప్పుడు నేను చెప్పినది చెయ్యి. నేను తెలివి లేనివాడనే. నిజమే. నీతిమాలిన పనిచేశాను. బలం వుంది కదా అని అహంకారంలో ప్రవర్తించాను. కాని, ఇప్పుడవన్నీ తల్చుకుని ఏం ప్రయోజనం? జరిగినదేదో జరిగిపోయింది.

ఇప్పుడు ప్రభువుగా ఆజ్ఞాపిస్తున్నాను. నీ కర్తవ్యం నువ్వు నిర్వహించు" అన్నాడు కటువుగా. అన్నగారికి కోపం వచ్చిందని, కుంభకర్ణుడు గ్రహించాడు. అతడ్ని అనునయిస్తూ మృదువుగా

"రాక్షసరాజా దిగులు చెందకు. జరిగనదంతా మర్చిపో. నేను బ్రతికివుండగా నీకు ఎవరి వల్లా కీడు జరగదు. నీకు క్షోభ కలిగించినవాడ్ని నాశనంచేసి తీరుతాను. నీ తమ్ముడిగా నీకుమేలు చెయ్యాలని చెప్పానంతే. అంతమాత్రం చేతనన్ను చేతకాని వాడిగా అనుకోకు. ఇప్పుడే యుద్ధభూమికి వెళ్ళి ఆ రాముడ్ని చంపేసి వస్తాను. సోదరునితో సహా అతడు చనిపోవడం వానరులు చిన్నాభిన్నమై పరుగులు తీయడం నువ్వే చూస్తావు. దేవతలంతా ఇంద్రునితో గూడి వచ్చినా నన్నేం చెయ్యలేరు. అష్టదిక్పాలకుల్ని ఇంద్రుడ్ని సైతం ఎదురించగలను. సముద్ర జలాలన్ని త్రాగేస్తాను. పర్వతాలన్నీ పాదాలతో తొక్కిపిండిగుండచేస్తాను. నువ్వు దిగులు మాని హాయిగా మద్యం త్రాగి, క్రీడావిలాసాల్లో విహరించు. ఇంక సీత శాశ్వతంగా నీ వశమైపోతుంది" అన్నాడు.

కుంభకర్ణుడలా తనశక్తి సామర్థ్యాలు పొగుడుకుంటూ వుంటే, మహోదరుడనే వాడు జాలిపడ్డాడు. అతని డంబాలు సహించలేక, "కుంభకర్ణా కావటానికి నువ్వు

ఉత్తమ కులంలోనే పుట్టావు. కాని నీ బుద్ధి మాత్రం చాలా నీచమైంది. పరిస్థితులు అవగాహన చేసుకునే శక్తి నీకస్సలు లేదు. గర్వంతో ప్రగల్భాలు పల్కుతున్నావు. యుద్ధానికి వెళ్ళే వాడు ముందుర తన పరిస్థితి తెలుసుకోవాలి. ఆపైన శత్రువు యొక్క ఆధిక్యత తెలుసుకోవాలి. ఏమీ ఆలోచించకుండా రావణుని నీతి తెలియనివాడని నిందించావు. కాని రావణుడు అవివేకి కాదు. ధర్మార్ధకామాలలో రావణుడు కామాన్ని ఆశ్రయించాడు. అందుకే సీతనపహరించాడు. అది తెలివి తక్కువ పని అని నువ్వనుకున్నావు. కాని ఇప్పుడ నువ్వు నీ భుజబలం నమ్ముకుని, ముందు వెనకలు ఆలోచించకుండా యుద్ధానికి బయల్దేరుతున్నావు. చూడు. అది ఇంకా తెలివితక్కువ తనం. మునుపు జనస్థానంలో రాముడొక్కడే పధ్నాలుగు వేలమంది రాక్షససైనికులతో ఒంటరిగా పోరాడి, వారందర్నీ వధించాడు. అది మనకందరికీ తెలుసు. అంతటి మహావీరుని, నువ్వొక్కడివే ఎదుర్కోగల ననుకోవటం చాలా పొరపాటు.

రాముడు ప్రజ్వరిల్లుతున్న అగ్నిలాంటివాడు. మన సైన్యం యావత్తు, అతడితో యుద్ధం చెయ్యటానికి జంకుతోంది. అలాంటి వాడితో ఒంటరిగా పోరుకి తలబడుతున్నావు. రాముడు సామాన్య మానవుడు కాదు. కనుక పోరుకి వెళ్ళేముందు బాగా ఆలోచించి నిర్ణయించుకో" అన్నాడు.

ఆ విధంగా కుంభకర్ణుని మందలించాక వాడు రావణునితో "ప్రభూ సీతని మనసుపడి ఎలాగూ తెచ్చుకున్నావు. నువ్వు కోరుకుంటే సీతనీది కాకపోతుందా? ఒక ఉపాయం చెప్తాను విను. నేను, ద్విజిహ్వుడు, సంహ్రాది, కుంభకర్ణుడు, ప్రతర్దనుడు, మేమైదుగురం వెళ్ళి రామునితో యుద్ధం చేస్తాము. ఒకవేళ మేము ఓడిపోయినా, ఒళ్ళంతా రక్తం పూసుకుని, రామనామాంకితమైన బాణాలతో ఒళ్ళంతా చీరుకుని వచ్చి నీ పాదాలపై బడి "ప్రభూ రామలక్ష్మణులిద్దర్నీ మేము తినేశాము. మాకు సన్మానం చెయ్యి అంటూ సీతవినేటట్లు చెప్తాము. ఆ ఆనందంతో నువ్వు మద్యం త్రాగినటుల నటించి, సైనికులందరికీ అమూల్యమైన వస్త్రాలు బహుమానం ఇయ్యి. ఈ విజయోత్సాహం చూసి అందరూ రామలక్ష్మణులు చనిపోయారని చెప్పుకుంటారు. ఆ తర్వాత రామలక్ష్మణులు చనిపోయారని, ఏనుగు మీద పనివాణ్ణెక్కించి, చాటింపు వేయించు. అందరూ పూర్తిగా నమ్ముతారు. అప్పుడు నువ్వు సీత దగ్గరకి వెళ్ళి, ఆమెని మంచి మాటలతో ఓదార్చి లోబరుచుకో. అయితే ఇక్కడొకిటుకువుంది. మేము యుద్ధభూమికి వెళ్ళకుండానే మేమంతా ఇలా నటించి నీకోరిక తీరుస్తాము. సీత నిన్ను చేరగానే రాముడు, నిరాశతో మరణిస్తాడు" అని రావణునికి తనకి తోచిన ఉపాయం చెప్పాడు.

అతడి మాటలు విన్న కుంభకర్ణుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. మహోదరుణ్ణి తీవ్రంగా మందలించాడు. రావణునికి ధైర్యం చెప్తూ

"సోదరా- నీకురాముని వల్ల వచ్చిన భయంలేదు. నేనిప్పుడే యుద్ధంలో రాముని చంపితీర్తాను. మాటలతోకాలం వ్యర్థం చెయ్యడం అనవసరం. నేను కార్యశూరుణ్ణి. ఈ మహోదరుడిలాంటి పిరికివాళ్ళ మాటలునమ్మి నువ్వు ఈ స్థితికి వచ్చావు. వీరంతా నీకు మిత్రునిలా నటిస్తున్న శత్రువులు. నువ్వు అనాలోచితంగా చేసిన పనివల్ల పరిస్థితి యుద్ధంవరకూ వచ్చింది. మన సైన్యమంతా నశించింది. మన ఖజానా అంతా ఖాళీ అయ్యింది. ఇప్పటికైనా, నీకు హితులెవరో తెలుసుకో. నేనిప్పుడే యుద్ధానికి బయల్దేరుతున్నాను" అన్నాడు.

కుంభకర్ణుని మాటలు రావణునికి ధైర్యం కలిగించాయి.

"సెహబాష్ తమ్ముడూ. ఈ మహోదరుడికి రాముడంటే భయం. అందుకే యుద్ధానికి వెళ్ళనంటున్నాడు. కుంభకర్ణా నువ్వు యుద్ధ విశారదుడివి. నన్ను నీ అంతగా ప్రేమించే వారెవ్వరూ లేరు. వెంటనే శత్రు సంహారానికి బయల్దేరు. నీ బలం ముందు వారెవ్వరూ ఆగలేరు" అంటూ కుంభకర్ణుణ్ణి చాలా మెచ్చుకున్నాడు.

"అన్నయ్యా నేకొక్కడ్నే యుద్ధానికి వెళ్తాను. నాకు సైన్యం అనవసరం" అంటూ, బయల్దేరబోతున్న తమ్ముణ్ణి వారిస్తూ

"నువ్వు ఒంటరిగా వెళ్ళటం క్షేమం కాదు. తమ్ముడూ తగినన్నీ ఆయుధాలూ, తగినంత సైన్యం తీసుకుని మరీ వెళ్ళు. ఆ వానరులు చాలా ప్రమాదకరమైన వారు. పరాకుగా వుంటే పళ్ళతో కొరికి చంపేస్తారు" అన్నాడు రావణుడు. ఆ సనంపై నించి లేచి వెళ్ళి ఒక మణిహారాన్ని కుంభకర్ణుని మెడలో వేశాడు. బంగారు కవచం తొడిగాడు. కుంభకర్ణుడు రావణుని కౌగలించుకుని, ముమ్మారు ప్రదక్షిణం చేసి దండం పెట్టాడు.

కుంభకర్ణుని ఆశీర్వదించి పంపాడు, రావణుడు శంఖాలు పూరించారు. దుందుభులు మ్రోగించారు. కుంభకర్ణుని వెంట, ఒంటెలతో, గాడిదలతో, గుఱ్ఱాలతో, సింహాలతో, ఏనుగులతో, సైనికులు బారులు తీస్తూ నడుస్తున్నారు. పౌరులంతా వారిపై పూలవానలు కురిపించారు. మహాకాయుడైన కుంభకర్ణుడు ముందు నడుస్తుంటే, నల్లగా కాటుక కొండ కదిలి వెళ్తున్నట్లుంది. ఎఱ్ఱని భయంకరమైన కన్నులు కల్గిన రాక్షసులు, శూలములు, కత్తులు, పరిఘలు, గండ్రగొడ్డళ్ళు, గదలు, ముసలాలు, ఇంకా ఎన్నో ఆయుధాలు ధరించి నడుస్తున్నారు. దారి పొడుగునా వారికి అన్నీ అపశకునాలు గోచరించాయి. కాని

కుంభకర్ణుడు లక్ష్యపెట్టలేదు. ప్రాకారం దాటి బయట అడుగుపెట్టాడు. వానర సైన్యం కనిపించింది.

కుంభకర్ణుడ్ని చూడగానే వారు గాలికి చెదిరిన మబ్బుల్లా బెదిరి, చెల్లాచెదరాయ్యరు. వారిని చూసి కుంభకర్ణుడు భయంకరంగా గర్జించాడు. ఆ గర్జన వినగానే కొంతమంది వానరులు భయంతో గుండే ఆగి మరణించారు.

కుంభకర్ణుడు ప్రాకారం బయట, ఒక్కొక్క అడుగు వేస్తుంటే, ఆ భయంకరమైన ఆకారం చూసి చాలా మంది వానరులుభయపడి పరిగెత్తసాగారు. అలా వారుపారిపోతుంటే, అంగదుడు, నలుడ్ని, నీలుడ్ని, గవాక్షుని పిల్చి "ఎందుకలా భయపడ్తున్నారు? మీ శక్తి మీరు మర్చిపోయారా? సామాన్యుల్లా అలా ఒణికిపోతున్నారేమిటి? ఆగండి. వెనక్కిరండి. ప్రాణాలు కాపాడుకోవటం ప్రధానం కాదు. అనవసరంగా గాబరాపడకండి. మనల్ని భయపెట్టడానికే ఈ భీకరాకారుడ్ని పంపాడు రావణుడు. ఇప్పటికే మూడొంతులు సేన నశించింది. ఇంకేం యుద్ధం చేస్తారు వీరు? మన పరాక్రమం ముందు వీరెవ్వరూ నిలవలేరు" అంటూ వారికి ధైర్యం చెప్పారు. అంగదుని మాటలు విన్నాక వారికి కాస్త ధైర్యం కలిగింది. కొండశిలలు వృక్షాలు పట్టుకుని యుద్ధానికి వచ్చారు. మదించిన ఏనుగుల్లా వారు కుంభకర్ణుని చావమోదారు.

కాని మహాపర్వతంలా వున్న వాడు ఏ మాత్రం చలించలేదు. కొండరాళ్ళు, వృక్షాలు కుంభకర్ణుని శరీరానికి తగిలి, ముక్కలైకిందపడిపోసాగాయి. కుంభకర్ణుడు వానరుల్ని దొరికిన వాళ్ళని దొరికినట్లు చంపసాగాడు. రక్తాలుకారుతూ వానరులుపెద్ద సంఖ్యలో నేలకూల సాగారు. ఇలా జరుగుతుండగా వానరులు ప్రాణభయంతో పరుగులుపెట్టసాగారు. కొంతమంది ఆకాశంలోకి ఎగిరిపోయారు. కొంతమంది సముద్రంలో పడిపోయారు. మరికొంతమంది సేతువు మీదుగా వెనక్కి పారిపోయారు. కొంతమంది వృక్షాలెక్కిదాక్కున్నారు. కొందరు కొండగుహల్లో దూరారు. అప్పుడు అంగదుడు ఎలుగెత్తి,

"ఓ వానరులారా, వెనక్కిరండి. యుద్ధభూమిలో ప్రాణాలు కాపాడుకోవడం కోసం పరిగెత్తటం తగదు. పౌరుషం లేకుండా ఇంటికెళ్తే మీ భార్యలు మిమ్మల్ని పరిహసిస్తారు. ఆ విధంగా బ్రతకడం చావుతో సమానం. మీరంతా ఎంతో ఉన్నతమైన వంశంలో పుట్టారు. సామాన్య వానరుల్లా పారిపోకూడదు. ఆరోజు మన మహారాజు ముందు మీరు పలికిన పలుకులుమర్చిపోయారా? అవన్నీ ప్రగల్భాలేనా? ఛీ అనిపించుకోవటం పిరికివాళ్ళ లక్షణం. వీరోచితంగా బ్రతకటం

నేర్చుకోండి. మన జీవితాలు శాశ్వతమైనవి కావు. యుద్ధంలో వీరమరణం పొందితే బ్రహ్మలోకాన్ని పొందుతారు. మన చేతిలో శత్రువే మరణించాడనుకోండి మనకి ఎవలేని కీర్తి వస్తుంది. ఈ కుంభకర్ణుడు రాముని కంటబడ్డాడా, ప్రాణాలతో వుండడు. ఒక్కడికి భయపడి, ఇంతమంది పారిపోవటం మన కీర్తికి మాయని మచ్చ" అని గట్టిగా వారికి ధైర్యం చెప్పాడు.

కాని వానరులు మాత్రం అంగదుని మాటలెక్కచెయ్యకుండా "ఈ కుంభకర్ణునితో పోరు చాలా ఘోరంగా వుంది. ఇంక ఈ యుద్ధం చాలు. ఇక్కడ నిలబడి నీ మాటలు వినే సమయం కాదిది. మా ప్రాణాల తీపి మాకుంది. మమ్మల్ని పోనీ" అంటూ పరుగులు తీశారు. ఇంక లాభం లేదని అంగదుడు వారిని గట్టిగా బెదిరించి వెనక్కి తీసుకొచ్చాడు. చాలా మంది వెనక్కి వచ్చారు. మహావీరులైన వానరులంతా కుంభకర్ణుని ఎదిరించటానికి ఉత్సాహం చూపించారు. అంగదుడు వారందర్నీ ఉత్తేజపరుస్తూ, యుద్ధోన్ముఖుల్ని చేశాడు. ప్రాణం పోయినా సరే యుద్ధం చెయ్యాలని పట్టుదల కలిగింది వారికి.

వారందరూ పర్వత శిఖరాలు, మహావృక్షాలు పీకి కుంభకర్ణుని మీదికి విసిరెయ్యసాగారు. కుంభకర్ణుడు గదపట్టుకుని వానరులందర్నీ చితకబాద సాగాడు. ఒక్కొక్క దెబ్బకీ వంద మంది నేలకూలసాగారు. వాడు తన పొడవైన చేతులు చాపి, పది, ఇరవై, ముప్పై మంది వానరుల్ని ఒకేసారి నోట్లో కుక్కుకుని మింగెయ్యసాగాడు. అతి కష్టమ్మీద వానరులు నిలదొక్కుకుని యుద్ధం చెయ్యసాగారు. ద్వివిదుడు ఒక పెద్ద కొండని పీకి కుంభకర్ణుని మీద విసిరేశాడు. అది గురి తప్పి పక్కన పడింది. చాలా మంది రాక్షసులు, గుఱ్ఱాలు దాని కింద పడి నుగ్గు నుగ్గయిపోయారు. మిగిలిన వానరులు కూడా కొన్ని కొండలు విసరగా ఇంక కొంత మంది రాక్షసులు చచ్చారు. హనుమంతుడు, ఆకాశంలో నిలబడి, వృక్షాలు, కొండలు పీకి కుంభకర్ణుని కొట్టసాగాడు. కుంభకర్ణుడు తన చేతిలోని శూలముతో వాటిని ముక్కలు ముక్కలు చెయ్యసాగాడు. అలా కొండలు, వృక్షాలు ముక్కలు చేస్తూ అవి తనకి తగలకుండా లాఘవంగా తప్పించుకుంటూ, శూలం పట్టుకుని వానరుల పైకి లంఘించాడు.

హనుమంతుడు ఒక పెద్ద పర్వత శిఖరం పెల్లగించి, ఆ శూలాన్ని అడ్డుకున్నాడు. సూటిగా ఆ పర్వత శిఖరాన్ని కుంభకర్ణుని మీదికి విసిరాడు. ఆదెబ్బకి కుంభకర్ణుని శరీరం చితికి, మాంసం బయటకి వచ్చింది. కుంభకర్ణుడు రోషంతో శూలం పట్టుకుని హనుమంతుని గుండెలపైకి విసిరాడు. ఆ దెబ్బ సూటిగా హనుమంతుని గుండెలలో గుచ్చుకుని నోటినుంచి రక్త బయటకి వచ్చింది.

అది చూసి రాక్షసులు చాల ఆనందం పొందారు. వానరులంతా బాధతో విలవిలలాడారు. హనుమంతుడు బాధపడ్తుంటే చూడలేక నీలుడు ఒక పర్వత శిఖరం పెల్లగించి, కుంభకర్ణుని మీదకి విసిరాడు. ఆ పర్వత శిఖరాన్ని కుంభకర్ణుడు పిడికిలితో ముక్కముక్కలు చేశాడు.

అప్పుడు ఋషభుడు, శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు, అనే ఐదుగురు వానర వీరులు, కుంభకర్ణుని మీదకి లంఘించి, కొండరాళ్ళతో, వృక్షాలతో, పాదాలతో, చేతులతో, కుంభకర్ణుని కొట్టసాగారు. ఆ దెబ్బలు కుంభకర్ణుడికి ఈగలు, దోమలు వాలినట్లనిపించాయి. వాడు వికటంగా నవ్వుతూ ఋషభుణ్ణి చేతులతోనొక్కాడు. ఋషభుడు రక్తం కక్కుతూ నేలమీద పడ్డాడు. నీలుణ్ణి మోకాలుతో కొట్టాడు. గవాక్షుని అరచేతితో చరిచాడు. గంధమాదనుణ్ణి కాలితో తన్నాడు. వీరంతా రక్తాలు కారుతూ నేలమీద పడ్డారు.

వీరిలానేలమీద పడగానే వేలకొద్దీ వానరులు కుంభకర్ణుని మీదికి లంఘించారు. పర్వతం ఎక్కినట్లు కుంభకర్ణుని మీదికి ఎక్కి గోళ్ళతో గిరి పండ్లతో పీకసాగారు. పిడికిళ్ళతో, మోకాళ్ళతో, కుంభకర్ణుడ్ని కుళ్ళబొడిచారు. కుంభకర్ణుడు విలాసంగా ఒక్కొక్కడ్ని తీసుకుని నోటిలో వేసుకుని చప్పరించసాగాడు. వాడువానరుల్ని కొరికి, కొట్టి కింద పడేస్తుంటే, నేలంతా రక్తంతో బురద బురదలా అయిపోయింది. శూలం పట్టుకుని, కుంభకర్ణుడు వీరవిహారం చేస్తూ వుంటే, వానరులు భయంతో బెదిరిపోయి, వణికిపోతూ వుంటే చూసి, అంగదుడు పెద్దగా అరుస్తూ పెద్ద పర్వత శిఖరంతో కుంభకర్ణుడి మీద పడ్డాడు. కుంభకర్ణుడు రోషంతో అంగదుడిపై కలియబడ్డాడు. శూలం ఎత్తి సూటిగా అంగదునిపైకి విసిరాడు. కుంభకర్ణుడు విసిరిన శూలాన్ని అంగదుడు నేర్పుగా తప్పించుకుని అతడి గుండెలపై అరచేతితో గట్టిగా చరిచాడు.

ఆ దెబ్బకి, అంతటి కుంభకర్ణుడికీ కళ్ళు గిర్రున తిరిగాయి. తమాయించుకుని అంగదుని పిడికిలితో కొట్టాడు. అంగదుడు తెలివి తప్పి నేలమీద పడ్డాడు. అతడ్ని అలా వదిలేసి కుంభకర్ణుడు, శూలం పట్టుకుని సుగ్రీవునిపైకి లంఘించాడు. సుగ్రీవుడు లాఘవంగా తప్పించుకుని పైకి ఎగిరాడు. కుంభకర్ణుడు విలాసంగా వానరుల్ని భక్షిస్తూనుంచున్నాడు.

సుగ్రీవుడు రోషంగా, "కుంభకర్ణా వీరులెవ్వరూ చెయ్యలేనన్ని యుద్ధాలు చేశావు. ఇప్పుడు మా సైనికుల్ని భక్షిస్తున్నావు. చాలా గొప్ప కీర్తి గలవాడివి. చేతనైతే నాతో యుద్ధం చెయ్యి" అన్నాడు.

గర్జించాడు. తెగిన బాహువు క్రింద, గద కిందపడి అనేక మంది వానరులు చనిపోయారు. కుంభకర్ణుడు రెండో చేత్తో ఒక మహావృక్షాన్ని పీకి, రాముని పైకి లంఘించాడు. రాముడు ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించగా, ఆ చెయ్యి కూడా తెగి వృక్షంతో సహా కింద పడింది. పర్వత శిఖరంలా ఆ చెయ్యి నేల కూలగానే రెండు చేతులు లేకుండానే కుంభకర్ణుడు రాముని మీదికి లంఘించాడు. రాముడురెండు అర్ధచంద్రాకారపు బాణాలతో వాడి తొడలూ ఖండించాడు. కాళ్ళు చేతులు తెగిపడగానే కుంభకర్ణుడు నోరు తెరుచుకుని రాముని మీద పడ్డాడు. రాముడు ఆ నోటి నిండా పదునైన బాణాలు నింపేశాడు. కుంభకర్ణుడు పెద్దగా మూలుగుతూ క్రిందపడ్డాడు. రాముడు బంగారు మొనగల నిప్పుల్లాంటి బాణాలు కుంభకర్ణుని మీద ప్రయోగించాడు. ఆ బాణాలు నిప్పురవ్వలు చిందిస్తూ వెళ్ళి కుంభకర్ణుని తలని ఖండించాయి. చెవుల కుండలాలు ధగధగా మెరుస్తుండగా కుంభకర్ణుని శిరస్సు నేల మీద పడింది. అంత పెద్ద శిరస్సు నేలకూలి కుంభకర్ణుడి కళేబరం ఒరిగిపోగా, ఎన్నో గోపురాలు, గృహాలు, ప్రాకారాలు నేల కూలాయి. హిమవత్పర్వతంలా వాడి శరీరం సముద్రంలో పడిపోయింది. దాని క్రిందపడి ఎన్నో జలచరాలు నుగ్గునుగ్గు అయిపోయాయి. ఈ విధంగా దేవదానవ గంధర్వులకు సైతం భయంకరుడైన కుంభకర్ణుడు మృతిచెందాడు.

భూమి కంపించింది. పర్వతాలు చలించాయి. దేవతలంతా హర్షధ్వానాలు చేశారు. రాక్షసులంతా దుఃఖంలో మునిగిపోయారు. వానరులంతా చాలా సంతోషించారు. వారంతా ఆనందంతో రాముని పూజించారు. అతివీర భయంకరుడు అజేయుడు అయిన కుంభకర్ణుడు చావగానే, రాముడు చాలా సంతోషించాడు.

రాక్షసులు కుంభకర్ణుడు మరణించిన వార్త రావణునికి చేరవేశారు.

"ప్రభూ కర్మపరిపక్వమయినందువల్లనే కుంభకర్ణుడు మరణించాడు. రణభూమిలో వానరులందర్నీ సింహస్వప్నంలా చీల్చి చెండాడాడు. ఎంతో పరాక్రమంతో యుద్ధం చేశాడు.

కంఠం, భుజములు, కాళ్ళు తెగనరకబడటం వల్ల మొండెం మాత్రం సగం సముద్రంలో సగం లంకా నగర ద్వారానికి అడ్డంగా పడింది. లంకా ద్వారం మూసుకుపోయింది. శరీరమంతా రక్తసిక్తమై ఎఱ్ఱచందన వృక్షంలా వున్నాడు" అని సేవకులు చెప్పారు. ఆమాటలు విన్న రావణుడు భోరున ఏడుస్తూ నేల మీద పడ్డాడు.

దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరుడు, అతి కాయుడు, పినతండ్రి చనిపోయాడని తెలిసి, ఎంతగానో ఏడ్చారు. సోదరుడు చనిపోయాడని మహోదరుడు, మహాపార్శ్వుడు, శోకాక్రాంతులయ్యారు. కొంతసేపటికి రావణుడు తెలివి తెచ్చుకుని, మళ్ళీ ఏడ్వటం మొదలుపెట్టాడు.

"అయ్యో, శత్రువుల్ని అణచగల వీరుడు, మహాబలుడు, అయిన కుంభకర్ణుడు నన్ను వదిలి పెట్టి వెళ్ళిపోయాడు. మహాబలా నన్నొంటరి వాడ్ని చేసి వెళ్ళిపోయావా. నా కుడి భుజం విరిగిపోయింది. నేనింక జీవించివున్నా మరణించిన వానితోటే సమానం. నువ్వు నాకు సహాయంగా వున్నంతకాలం, నేను దేవదానవులకి కూడా భయపడలేదు. ప్రళయకాల రుద్రుడిలాంటి నువ్వు, ఆ రామునిచేతిలో ఎలా చనిపోయావురా? దేవేంద్రుని వజ్రాయుధం కూడా నిన్నేమీ చెయ్యలేదే, అటువంటి నువ్వు ఆ రామబాణంతో ఎలా మరణించావు నాయనా. ఆకాశంలో దేవతలు, ఋషులు నువ్వు చనిపోయావని పండుగ చేసుకుంటున్నారు. వానరులు సంతోషంతో కేరింతలు కొడుతున్నారు.

ఇప్పుడింక ఆ వానరులతా మన లంకని స్వాధీనం చేసుకుంటారు. నువ్వులేని ఈ రాజ్యం నాకెందుకు రా. సీతతో కూడా ఇంక నాకు పనిలేదు. నువ్వు లేని నా జీవితం వ్యర్థం. నా సోదరుని చంపిన ఆ రాముని, యుద్ధభూమిలో చంపినప్పుడే నాకు మనశ్శాంతి. ఆహా! విభీషణుని మాటలు నిజమయ్యాయి కదా. అజ్ఞానం వల్ల వాడి మాటలు పెడచెవిని పెట్టాను. అందుకు శాస్తిగా నిన్ను, ప్రహస్తుని, మరెందరో మహావీరుల్ని పోగొట్టుకున్నాను. ధార్మికుడైన విభీషణుని వెళ్ళగొట్టినందుకు ఫలితం అనుభవిస్తున్నాను" అంటూ దీనాతి దీనంగా విలపించసాగాడు.

అలా కంటికీ మింటికీ ఏకధారగా రావణుడు విలపిస్తువుంటే, అతడ్ని ఊరడిస్తూ త్రిశూలుడిలా అన్నాడు.

"ప్రభూ మహావీరుడైన కుంభకర్ణుడు మరణించిన సంగతి నిజమే. కాని ధీరుడవైన నువ్వు ఇలా విలపించటం ఉచితమేనా? నువ్వు ముల్లోకాల్ని జయించగల సమర్థుడివి. సామాన్యునిలా ఇలా ఏడవకూడదు. బ్రహ్మవరంగా ఇచ్చిన శక్తి నీకుంది. విల్లు అమ్ములు కవచం వున్నాయి. ఇది వరకు ఏ ఆయుధం లేకుండానే దేవదానవుల్ని గెల్చావు. ఇపుడింకా అధిక శక్తి సంపన్నుడివయ్యావు. అన్ని ఆయుధాలు ధరించి, వెళ్ళి ఆరాముడ్ని అంతమొందించిరా. నువ్వే స్వయంగా వెళ్ళక్కర్లేదు. నాకు ఆజ్ఞ ఇయ్యి. నేను వెళ్ళి యుద్ధం చేస్తాను" అన్నాడు.

త్రిశురుని మాటలు విన్నాక రావణునికి మళ్ళీ ఆశ చిగురించింది. కాల

ప్రభావం వల్ల కళ్ళకి పొరలు కమ్మి, రావణుడు స్వయంగా ఆలోచించే శక్తి లేక సరే అన్నాడు.

త్రిశిరునితో పాటు దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు, యుద్ధానికి సిద్ధపడ్డారు. అందరూ కలిసి ఆకాశంలోకి ఎగిరారు. వాళ్ళంతా మాయాయుద్ధంలో ఆరితేరిన వాళ్ళే. అజేయులే, వాళ్ళ ఉత్సాహం చూసి, రావణుడు చాలా సంతోషించాడు. వారిని కౌగలించుకుని, ఆభరణాలు అలంకరించి యుద్ధానికి పంపాడు. వారు నల్గురూ రావణపుత్రులు, చాలా ఉత్సాహంగా బయల్దేరారు. రావణుని సోదరులైన మహోదరుడు, మహాపార్శ్వుడు వారికి తోడుగా వెళ్ళారు. వారంతా రావణునికి ప్రదక్షిణం చేసి, నమస్కారం పెట్టి బయల్దేరారు. ఆయుధాలు తగిలినా నొప్పి పెట్టకుండా "వుంచె" అనే ఔషదం వెంట తీసికెళ్ళారు.

మహోదరుడు సుదర్శన మనే నల్లని ఏనుగునెక్కాడు. త్రిశిరుడు మూడు తలలకి మూడు కిరీటాలు పెట్టుకుని, ఉత్తమ జాతి గుఱ్ఱాలు పూన్చిన రథం మీద బయల్దేరాడు. అతికాయుడు కూడా అందంగా అలంకరించిన మరో రథం ఎక్కాడు. నరాంతకుడు ఉచ్చైశ్రవం లాంటి గుఱ్ఱం ఎక్కాడు. దేవాంతకుడు వజ్రాలు పొదిగిన గదని, పరిఘని, మహాపార్శ్వుడు గదని, ధరించి రథాలు ఎక్కి పెద్ద సేనతో మేఘాల్లా గర్జిస్తు బయల్దేరారు. వారంతా యుద్ధంలో శత్రువునైనా జయించాలి లేదా మరణాన్నైనా పొందాలి. అనే పట్టుదలతో వున్నారు. వారంతా అలా భయంకరంగా గర్జిస్తూ బాణాలు వదుల్తూ వస్తుంటే భూమి కంపించింది.

వీరి అట్టహాసం చూసి వానర వీరులు మహావృక్షాలు, శిలలు, పట్టుకుని, యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డారు. భయంకరంగా గర్జనలు చేశారు. అవి విన్న రాక్షసులు ఇంకా భయంకరంగా సింహనాదాలు చేశారు. వానరులు కొందరు ఆకాశంలో, కొందరు నేలపై వస్తున్న వానర సేనలతో తలబడ్డారు. రాక్షసులకి, వానరులకి ఘోరమైన యుద్ధం మొదలైంది. భూమి అంతా వారికళేబరాలతో నిండిపోతోంది.

ఒకరికంటే ఒకరు భీకరంగా గర్జిస్తూ, ఒకరినొకరు ఆయుధాలతో, కొండశిలలతో వృక్షాలతో, కొట్టుకుంటూ, ఒకరి సేనల నొకరు చంపుకుంటున్నారు. ఘోరమైన యుద్ధం జరుగుతోంది. నేలంతా బండరాళ్ళతో, వృక్షాలతో, చనిపోయిన వానరుల, రాక్షసుల కళేబరాలతో నిండిపోయి, కాలుకదపటానికి సందులేకుండా నానా భీబత్సంగా వుంది. నరాంతకుడు పదునైన ఆయుధంతో వానర సేనలో చొరబడి, ఏడు వందల మంది వానరుల్ని ఒక్కసారిగా

చంపేశాడు. అన్ని వైపులకీ తానే విజృంభిస్తూ ఝంఝామారుతంలా వానరుల్ని నేల కరిపించసాగాడు. దానితో వానరులు భయంతో వణికిపోయారు. నరాంతకుడు తన ప్రాసముతో ఎలా వున్న వానరుల్ని అలాగే నేలకూలుస్తున్నాడు.

వానరులంతా భయపడిపోయి సుగ్రీవుని దగ్గరకి వెళ్ళి చేరారు. అప్పుడు సుగ్రీవుడు అంగదుని పిల్చి, ఆ నరాంతకుని పని పట్టమని ఆదేశించాడు. వెంటనే ఆ నరాంతకుని మీదికి అంగదుడు లంఘించి గోళ్ళతో, దంతాలతో కోరలతో వాడ్ని చీల్చి చెండాడటం మొదలెట్టాడు. "ఆగరా పాపీ సామాన్య వానరుల్ని చంపటం కాదు. నీ పౌరుషం నాదగ్గర చూపించు. అని సవాలు చేశాడు. నరాంతకుడికి కోపం వచ్చింది. తన చేతిలోని ప్రాసాన్ని అంగదుని పైకి విసిరేశాడు. అది అంగదుడి గుండెలకి తగిలి క్రిందపడింది. అంగదుడు ఒక్క ఎగురు ఎగిరి, అతడు కూర్చున్న గుఱ్ఱం తలమీద గట్టిగా మొత్తాడు. అది గిర గిర తిరిగి నేల కూలింది. నరాంతకుడు కోపంతో పిడికిలి బిగించి అంగదుని తలమీద గట్టిగా కొట్టాడు. అంగదుని తలపగిలి రక్తం కారసాగింది. అంగదుడు మూర్ఛబోయాడు. కొంతసేపటికి తెలివి వచ్చింది. లేచి, పిడికిలి బిగించి వజ్రాఘాతాల్లాంటి దెబ్బలు నరాంతకుని గుండెలపై కొట్టాడు. ఆ దెబ్బలకి మొదలు నరికిన వృక్షంలా వాడు నేల ఊలాడు. ఆకాశ వీధిలోంచి ఆసక్తిగా చూస్తున్న దేవతలు గంధర్వులు హర్షధ్వానాలు చేశారు. రాముడు కూడా అంగదుని పరాక్రమానికి చాలా సంతోషించాడు.

వీరాధివీరుడైన అంగదుడు మళ్ళీ యుద్ధభూమిలో చొరబడ్డాడు. నరాకంతకుడు చనిపోయే సరికి రాక్షసులు ధైర్యం కోల్పోయి పెద్దగా ఏడవ సాగారు. అదిచూసి దేవాంతకుడు, త్రిశిరుడు, మహోదరుడు వారికి ధైర్యం చెప్తూ యుద్ధంలోకి బయల్దేరారు. ముగ్గురూ ఒక్కుమ్మడిగా అంగదుని మీద పడ్డారు. అంగదుడే మాత్రం జంకకుండా ఒక మహావృక్షం పెకిలించి, దేవాంతకుని మీదికి విసిరాడు. ప్రక్కనే వున్న త్రిశిరుడు పదునైనా బాణాలతో, ఆ వృక్షాన్ని ముక్క ముక్కలు చేశాడు. అంగదుడు విసుగు లేకుండా అదే పనిగా వృక్షాలు పెకిలించి వారిమీద విసరసాగాడు. పర్వత శిఖరాలు పెల్లగించి విసర సాగాడు. త్రిశిరుడు వాటన్నిటినీ ఛేదిస్తూ దేవాంతకుని కాపాడసాగాడు. మధ్య మధ్యలో త్రిశిరుడు దేవాంతకుడు కలిసి అంగదునిపై బాణాలు వెయ్యసాగారు. అంతలో మహోదరుడు, ఏనుగుతో సహా అంగదునిపై బడి, వజ్రాల్లాంటి తోమరాలతో అతని వక్షస్థలం కొట్టాడు. దేవాంతకుడు తన పరిఘతో అంగదుని కొట్టాడు.

వారు ముగ్గురూ ఏకమై బాణాలు వర్షం కురిపించసాగారు. అంగదుడు ఏ మాత్రం చలించకుండా పైకి ఎగిరి మహోదరుడు ఎక్కిన ఏనుగుని అరచేతితో చరిచాడు. ఆ దెబ్బకి అది తూలి కింద పడింది. అంగదుడు వెంటనే దాని దాంతాలు పీకి, ఆదంతాలతో దేవాంతకుని పొడిచాడు. దేవాంతకుడు కింద పడి రక్తం కక్కుకున్నాడు. కొంతసేపటికి తేరుకుని పరిఘతో అంగదుని గట్టిగా కొట్టాడు.

ఆ దెబ్బలకి అంగదుడు మోకాళ్ళపై కూలబడ్డాడు. మెల్లిగా లేచి, నిలబడ బోతూ వుండగా త్రిశిరుడు అంగదుని నుదుటి మీద బాణాలు వేశాడు. ఇలా ముగ్గురు ఏకమై అంగదుని బాధపెట్టసాగారు. అది చూసి హనుమంతుడు, నీలుడు అక్కడికి వచ్చారు. హనుమంతుడొక పర్వత శిఖరం పెళ్ళగించి త్రిశిరుని మీదికి విసిరేశాడు. త్రిశిరుడు తన బాణాలతో దాన్ని ముక్కలు చేశాడు. దేవాంతకుడు పరిఘతో హనుమంతునిమీదికి లంఘించాడు. హనుమంతుడు గట్టిగా గర్జిస్తూ వజ్రాఘాతాల్లాంటి దెబ్బలతో వాడి తలమీద కొట్టాడు. ఆ గర్జనకే రాక్షసులంతా వణికిపోయారు. హనుమంతుడి దెబ్బలకి తలపిండి గుండ అయి, పండ్లు, కళ్ళు ఊడి, నేలమీద పడి, నాలుక చాచి దేవాంతకుడు ప్రాణాలువదిలాడు.

అది చూసి త్రిశిరుడు, ఆగ్రహంతో నీలుని మీద బాణ పరంపరలు కురిపించాడు. మహోదరుడు కూడా ఏనుగు మీద కూర్చుని నీలుని మీద బాణాలు వెయ్యసాగాడు. నీలుని శరీరం బాగా గాయపడింది. కొద్దిసేపు అలసట కలిగినా, వెంటనే తేరుకుని, వృక్షాలతో నిండిన ఒక పర్వత శిఖరాన్ని పెళ్ళగించి, మహోదరుని తలపై కొట్టాడు. ఆ దెబ్బకి ఏనుగుతో సహా వాడు రక్తం కక్కుకుని చచ్చాడు. పినతండ్రి చావగానే త్రిశిరుని రోషం రెట్టింపైంది.

ధనస్సు తీసుకుని ఆంజనేయునిపై బాణ వర్షం కురిపించాడు. వాయుపుత్రుడు ఇంకో పర్వత శిఖరంపీకి వాడి మీద పడేశాడు. కాని త్రిశిరుడు దాన్ని బాణాలతో ఛేదించాడు. హనుమంతుడు విసుగు లేకుండా వానిపై బాణాలు వెయ్యసాగాడు. త్రిశిరుడు కూడా ఎడతెరిపి లేకుండా బాణాలు వెయ్యసాగాడు. చివరికి హనుమంతుడు కొదమసింహంలా ఉరికి, త్రిశిరుడు ఎక్కిన గుఱ్ఱాన్ని గోళ్ళతో చీల్చి చంపాడు. వెంటనే త్రిశిరుడు మహాశక్తినొక దానిని ఆంజనేయునిపై ప్రయోగించాడు. హనుమ దాన్ని చేత్తో అందుకుని విరిచిపారేశాడు. అది చూసి వానరులు వెఱ్ఱి ఆనందంతో కేకలు వేశారు. త్రిశిరుడు కోపంతో ఖడ్గం తీసుకుని, ఆంజనేయుని గుండెలపై కొట్టాడు. హనుమంతుడు ఉగ్రుడై త్రిశిరుని గుండెలపై అరచేత్తో గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి వాడి చేతిలో కత్తి క్రింద పడింది. వాడు

మూర్ఛబోయాడు. హనుమంతుడు వాడి చేతిలో కత్తి లాక్కుని గట్టిగా గర్జించాడు. ఆ గర్జనకి ఉలిక్కిపడి త్రిశిరుడు లేచి కూర్చున్నాడు.

ఒక్క ఉదుటన లేచి హనుమంతుని గుండెల మీద కొట్టాడు. హనుమంతుడు కోపంతో వాడి కిరీటం పట్టుకులాగాడు. వాడి మూడు తలల నుంచీ కిరీటాలు, కుండలాలు, పీకి, కత్తితో వాడి మూడు తలలూ నరికిపడేశాడు. పెద్ద పర్వతాల్లాంటి వాని కనుగుడ్లు ఊడి నేల మీద పడ్డాయి. త్రిశిరుడు కూడా చనిపోగానే, రాక్షసులంతా భయపడి పారిపోయారు. వానరులంతా హనుమంతుని పూజించారు.

అప్పుడింక మహాపార్శ్వుడు రంగంలోకి వచ్చాడు. ఉక్కు గద పట్టుకున్నాడు. ప్రళయ కాలాగ్నిలా వానరులపై పడ్డాడు. ఋషభుడు వాడ్ని ఎదుర్కొన్నాడు. వాడు తన గదతో ఋషభుణ్ణి కొట్టాడు. ఆ దెబ్బకి ఋషభుని గుండె పగిలి రక్తం కాలువలైంది. ఋషభుడు అలాగే వాడి మీద పడి, వాడి చేతిలోని గదని లాక్కుని, ఆ గదతోనే రాక్షసుల్ని బాద సాగాడు. మహాపార్శ్వుణ్ణి ఆ గదతో చితకబాది చంపి పడేశాడు. వాడి తమ్ముడు ఉన్మత్తుడు మిగిలాడు. వాడు గద పట్టుకుని వానరుల మీద పడి బాదసాగాడు. గవాక్షుడు, కొండ శిలలు పీకి వాడి మీదికి విసర సాగాడు. ఉన్మత్తుడు వాటిని తప్పించుకుని, తన గదతో గవాక్షుని గుండెలమీద కొట్టాడు. గవాక్షుడు తెలివి తప్పి కింద పడ్డాడు. కొంత సేపటికి లేచి, తన అరచేతితో వాని తలమీద కొట్టాడు. ఆ దెబ్బకి వాడు రక్తం కక్కుకుని చచ్చాడు.

నాయకులు ఐదుగురు చనిపోగానే మిగిలిన రాక్షస సేనలు లంకలోకి పరుగులు తీశారు. ఇదంతా వారి సోదరుడైన అతి కాయుడు చూశాడు. రోషంతో ముందుకి వచ్చాడు. వాడు కూడా తపస్సు చేసి బ్రహ్మని మెప్పించి వరాలుపొందిన మహావీరుడు. రథం మీద ఎక్కి వానరులతో యుద్ధానికి వచ్చాడు. సింహగర్జన చేశాడు. ఆ గర్జనకి బెదిరి వానరులంతా చెల్లాచెదురైపోయారు. మహాకాయుడు ఆకారంలో కుంభకర్ణునిలాగే వుంటాడు.

ప్రళయకాలరుద్రునిలా వాడు కదిలి వస్తుంటే, వానరులంతా రాముని దగ్గరకి వెళ్ళి రక్షించమని ప్రార్థించారు. రాముడు వచ్చి రథంపై నుంచుని వున్న ఆ భీకరాకారాన్ని చూసి ఆశ్చర్యపోయి, విభీషణుని అడిగాడు అతడెవరని.

అప్పుడు విభీషణుడు "ప్రభూ ఇతడు కూడా రావణుని కుమారుడే. రావణుడంతటి శక్తి సంపన్నుడు. వేద, వేదాంగాలు అభ్యసించిన వాడు. ఇతడి పేరు అతికాయుడు. రావణునికి ధాన్యమాలి అనే భార్య యందు పుట్టినవాడు.

తపస్సు చేసి బ్రహ్మని మెప్పించిన వాడు. తపస్సు చేసి సంపాదించినవే ఆ రథం. అతడు ధరించిన కవచము కూడా. ఇంకా ఎన్నెన్నో అస్త్రాలు సంపాదించాడు. దేవదానవులవల్ల చావు లేకుండా వరం పొందిన వాడు. వానరసేనలన్నింటినీ వాడు కబళించెయ్యక ముందే మనం జాగ్రత్త పడాలి" అన్నాడు. ఒక పక్క అతికాయుడు వానర సైన్యంలోకి దూసుకుని వస్తున్నాడు. కుముదుడు, ద్వివిధుడు, మైందుడు, నీలుడు, శరభుడు అనే ఐదుగురు వానర వీరులు, పెద్ద పెద్ద వృక్షాలు, పర్వత శిఖరాలు పట్టుకుని అతికాయుడ్ని ఎదుర్కొన్నారు.

అతికాయుడు అనాయాసంగా వాటన్నింటినీ ఛేదించి ముందుకి దూకాడు. వానర వీరులపై బాణ పరంపరలు కురిపించాడు. అతికాయుని ధాటికి వానర సేనలు నిలబడలేకపోతున్నాయి. అయితే అతికాయుడు మాత్రం తన మీదికి వచ్చిన వారితోటే యుద్ధం చేస్తున్నాడు తప్ప తన మీదికి రాని వారిని ఏమీ చెయ్యటం లేదు. అలా అలా వానర వీరుల్ని ఎదురిస్తూ రాముని మీదికి వెళ్ళాడు. అహంకారంతో ఇలా సవాలు చేశాడు.

"నేను రథం మీద వున్నాను. నా చేతిలో ధనుర్బాణాలున్నాయి. నేను సామాన్యులతో యుద్ధం చెయ్యను. నాతో యుద్ధం చెయ్యగల సామర్థ్యం వున్న వారేవరైనా వుంటే ముందుకి రండి. నాతో యుద్ధం చెయ్యండి" అని డంబాలు పలకసాగాడు. లక్ష్మణుడు ఆ మాటలు విన్నాడు.

అసహనంగా లేచాడు. ధునార్బాణాలు ధరించాడు. నారిని సారించి దిక్కులు పిక్కటిల్లెటట్లు ధనుష్టంకారం చేశాడు. ఆ శబ్దానికి రాక్షసులంతా భయపడి పోయారు. మహాకాయుడు కూడా ఆ ధనుష్టంకారానికి అదిరిపడ్డాడు. బాణము ఎక్కుపెట్టి నిలబడ్డ లక్ష్మణుని చూసి ఆశ్చర్యపోయాడు.

"లక్ష్మణా, నువ్వు చిన్నవాడివి. పరాక్రమమంటే ఏమిటో నీకు తెలియదు. వెనక్కి వెళ్ళు. నేను మృత్యువులాంటివాడిని. నాతో యుద్ధం చెయ్యాలని రాకు. కాదని ఎదిరించావా, ఇప్పుడే నిన్ను యమపురికి పంపుతాను" అంటూ బాణం సంధించాడు.

వాని అహంకారానికి లక్ష్మణునికి చాలా కోపం వచ్చింది. "రాక్షసాధమా, వట్టిమాటలతో గొప్ప వాడినని మురిసిపోకు. ఇదిగో బాణం ధరించి నీ ఎదురుగా వున్నాను. నీ బలం చూపించు. నీ సర్వాయుధాలు ప్రయోగించు. బాణం ఎక్కుపెట్టి వీరుడవని నిరూపించుకో. బాలుడనని నన్నవమానించకు. ఇప్పుడే నీ అంతుచూస్తాను" అన్నాడు.

అతికాయుడు క్రోధంతో లక్ష్మణునిపై బాణం ప్రయోగించాడు. లక్ష్మణుడు దానిని అర్ధచంద్రాకారపు బాణంతో ఛేదించాడు. అది చూసి మండిపడి అతికాయుడు ఐదు బాణాలు ఒకే సారి ప్రయోగించారు. వాటిని కూడా లక్ష్మణుడు తేలికగా ఖండించిపడేశాడు. మరుక్షణంలో ప్రజ్వరిల్లుతున్న బాణం తీసి అతికాయునిపై ప్రయోగించాడు. అది సూటిగా అతికాయుని నుదుటిమీద నాటుకుంది. రక్తంధారగా కారసాగింది. అతికాయుడు కంపించిపోయాడు. లక్ష్మణుని సామర్ధ్యం వాడికి తెలిసింది. తనకి సరియైన జోడి దొరికాదని మురిసిపోతూ అటు ఇటు తిరుగుతూ, ఒకటి, రెండు, మూడు, అని లెఖ్ఖపెట్టూ బాణాలు వెయ్యసాగాడు. ఆ బాణాలు నిప్పు కణికల్లా మండుతు ఆకాశంలో దూసుకొస్తున్నాయి. లక్ష్మణుడు వాటిని మధ్యలోనే ఖండించేశాడు. అతికాయుడు ఉగ్రుడయ్యాడు. తీవ్రమైన బాణం మంత్రించి లక్ష్మణుని పైకి వేశాడు.

అది లక్ష్మణుని గుండెలకి తగిలి గాయమై రక్తం చిమ్మింది. లక్ష్మణుడు మైకం వచ్చి పడిపోయాడు. వెంటనే తెలివి తెచ్చుకుని తన గుండెలమీది బాణం పీకి పారేసి, తీవ్రమైన బాణం తీసి అతికాయునిపై ప్రయోగించాడు. ఆగ్నేయాస్త్రాన్ని అనుసంధించి వేశాడు. అతికాయుడు సౌరాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ రెండు అస్త్రాలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. విష సర్పాల్లా ఆకాశంలో చాలా సేపు పోరాడాయి. చివరికి రెండూ క్రిందపడ్డాయి. అతికాయుడు కోపంతో ఐషీకాస్త్రం ప్రయోగించాడు. లక్ష్మణుడు దాన్ని ఇంద్రాస్త్రంతో అంతం చేశాడు. లక్ష్మణుడు వరుసగా ప్రయోగించిన బాణాలన్నీ అతికాయుని కవచానికి తగిలి క్రిందపడిపోయాయి. ఆ కవచం బ్రహ్మ ప్రసాదించినది. కనక అభేద్యమైనది. అతికాయుడు దర్పంలా లక్ష్మణుని మర్మస్థానం మీద బాణంప్రయోగించాడు. రెప్పపాటు సేపు లక్ష్మణునికి తెలివి తప్పింది. వెంటనే తెలివి తెచ్చుకుని, నాలుగు బాణాలతో అతికాయుని రథ గుఱ్ఱాన్ని, సారధిని పడగొట్టాడు. ఎన్ని బాణాలు వేసినా అతికాయుడు మాత్రం చలించడం లేదు. అప్పుడు వాయుదేవుడు రహస్యంగా లక్ష్మణుని చెవిలో "లక్ష్మణా ఇతడు బ్రహ్మ ప్రసాదించిన అబేధ్యమైన కవచం ధరించాడు. కనక నీ బాణాలతడ్ని ఏమీ చెయ్యలేదు. ముందుగా బ్రహ్మాస్త్రంతో ఆ కవచాన్ని ఛేదించు. అది తప్ప వేరొకటేమీ ఇతడిమీద పనిచెయ్యదు" అన్నాడు.

వెంటనే లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి ప్రయోగించాడు. అది ప్రయోగించినప్పుడు, దిక్కులు, నక్షత్రాలు, సూర్యచంద్రులు, గ్రహాలు, అన్నీ తల్లడిల్లిపోయాయి. భూమి చలించిపోయింది. అతికాయుడు బ్రహ్మాస్త్రం వస్తోందని

గ్రహించాడు. దాన్ని ఛేదించాలని విశ్వప్రయత్నం చేశాడు. ఎన్నో విధాల శక్తుల్ని, ముష్టి, గద, శూల, హళ, మొదలైన ఆయుధాలన్నీ ప్రయోగించి దాన్ని పడగొట్టాలని ప్రయత్నించాడు. కాని అతడి ప్రయత్నాలన్నీ విఫలమైపోయాయి. బ్రహ్మాస్త్రం అతికాయుని శిరస్సుని, కిరీటంతో పాటు ఖండించింది. తలక్రిందపడి అతడి శరీరం నేల కొరిగింది. మిగిలిన రాక్షసులు ఏడుస్తూ లంకలోకి పారిపోయారు. వానరులానందంతో కేరింతలు కొట్టూ లక్ష్మణుని మెచ్చుకున్నారు.

మహాబలవంతుడు అయిన అతికాయుడు, లక్ష్మణుని చేతిలో మరణించాడన్న వార్త రావణుని కృంగదీసింది. "అయ్యో అత్యంత పరాక్రమ వంతులు, వీరాధివీరులు, మహాబలసంపన్నులు అయిన నా అనుచరులంతా రామలక్ష్మణుల చేతిలో ఘోరాతిఘోరంగా చనిపోయారు.

అజేయుడైన నా కుమారుడు ఇంద్రజిత్తు వారిని నాగాస్త్రంతో బంధించాడు. దేవాసురులెవ్వరూ విడిపించుకోలేని, ఆ నాగాస్త్రం బంధం నుంచి, వారు బయటపడ్డారు. అసలు నాగాస్త్రం బంధంతో బంధించబడిన వారు బ్రతకటమే చాలా కష్టం. కాని వారి ప్రభావమెంతటిదో గాని విడిపించుకుని బ్రతికి బయటపడ్డారు. నేను పంపినవీరులందర్నీ ఒక్కడినైనా విడవకుండా చంపేస్తున్నారు. ఇంక ఆ రామలక్ష్మణుల్ని చంపగలిగే వారెవరో నాకు అంతచిక్కటం లేదు.

రాముడు మహాబలవంతుడు. గొప్ప అస్త్రశక్తి సంపన్నుడు. నరరూపంలో నన్ను చంపటానికి అవతరించిన సాక్షాత్తు ఆ నారాయణుడేనా ఇతడు! అతడి వల్ల భయంతో లంకానగరం ప్రవేశ ద్వారాలన్నీ మూసి వుంచాను. నగర మంతా రక్షణ కట్టుదిట్టం చేశాను" అని తన మనస్సులో తానే కుమిలిపోతూ "సైనికులారా కాపలాకి, పాదలువున్న చోటు కూడా కాపలా గట్టిగా ఏర్పాటు చెయ్యండి. సీత వున్న అశోకవనంలోకి వెళ్ళే వార్ని, అక్కడ్నించి వచ్చే వారినీ కూడా బాగా పరీక్షించి చూడండి" అని ఆజ్ఞాపించాడు. అందర్నీ ఆజ్ఞాపించాక, పగ మనస్సులో ముల్లులాగుచ్చుకుంటూ వుంటే, బాధపడ్తు దీనాతి దీనంగా తలదించుకుని తన భవనంలోకి వెళ్ళాడు. అతికాయుడు చనిపోవటంతో పగ మనస్సులో చింతనిప్పులా రగలసాగింది. దుఃఖంలో నిట్టూర్పులు విడిస్తూ, చింతాక్రాంతుడై కూర్చున్న తండ్రిని చూసి, ఇంద్రజిత్తు,

"తండ్రీ - విచారించకండి. ఈ ఇంద్రజిత్తు బతికి వుండగా మీకు విచారించవలసిన అవసరం లేదు. ఈ ఇంద్రజిత్తుని జయించిన వీరులెవ్వరూ లేరు. నేనిప్పుడే వెళ్ళి ఆ రామలక్ష్మణుల్ని సంహరించి వస్తాను. ప్రమాణం చేసి

చెప్తున్నాను. రామలక్ష్మణుల్ని నా బాణాలతో అంతం చేసి మీ పగ తీరేటట్లు చేస్తాను" అని తండ్రికి ధైర్యం చెప్పి అతడి దీవెనలు పొంది, గాడిదలు పూన్చిన రథం మీద ఎక్కి బయల్దేరాడు. యుద్ధ భూమికి వెళ్ళాడు. అతడి వెంట రథాల మీదా, ఏనుగుల మీదా, గుఱ్ఱాల మీదా ఎందరో యోధులు వెళ్ళారు. శంఖాలు పూరిస్తూ భేరీలు మ్రోగిస్తూ పోతున్నారు. వారలా ప్రయాణమై వెళ్ళే ముందు రావణుడు ఇంద్రజిత్తుతో

"కుమారా, నువ్వు ఇంద్రుడంతటి వాణ్ణి జయించావు. మానవమాత్రుడైన రాముడునీకో లెఖ్ఖ కాదు. నీకుజయం కలగాలి" అని ఆశీర్వదించాడు. ఇంద్రజిత్తు తండ్రికి నమస్కరించి, యథావిధిగా మంత్రపూర్వకంగా అగ్నిహోత్రంతో హోమం చేశాడు. పేలాలతో, హవిస్సుతో పుష్పమాలాలతో, గంధంతో అగ్నిహోత్రుని ఆరాధించాడు. నల్లని మేకపోతుని, నోటితో మెడకొరికి బలి ఇచ్చాడు. హోమద్రవ్యాన్ని బ్రహ్మాస్త్రాన్ని స్వీకరించాడు. తర్వాత సేనతో బయల్దేరాడు.

ఆ విధంగా బయల్దేరి వెళ్ళిన రాక్షస సైన్యం ఇంద్రజిత్తు అండ చూసుకుని మరింత విజృంభించి వానరుల్ని చీల్చి చెండాడసాగారు. వారు బాణాలతో, గదలతో, ఆయుధాలతో, ఒక్కొక్కసారి, ఐదు, ఏడు, తొమ్మిది మందిని, సంహరించసాగారు. చనిపోయిన వారు పోగా, మిగిలిన రాక్షస సైన్యం, వానరుల మీద అలాపగ తీర్చుకుంటున్నారు. వానరులు వృక్షాలతో, కొండ శిలలతో వారి నెదుర్కొంటున్నారు. యుద్ధ భూమి అంతా కొండరాళ్ళతో, వృక్షాలతో నిండి వుంది. ఇంద్రజిత్తు ఎక్కడికక్కడ వాటిని తొలగించుకుంటూ వెళ్ళసాగాడు. విషసర్పాల్లాంటి బాణాలతో వానరమూకని సంహరిస్తూ పోతున్నాడు. పద్దెనిమిది బాణాలతో గంధమాదనుడ్ని కొట్టాడు. ఏడు బాణాలతో మైందుని కొట్టాడు. అదృశ్యరూపంలో వుండి, ఇలా వానర వీరుల్ని పడకొట్టూ ఐదు బాణాలతో గజుని కొట్టాడు. పది బాణాలతో జాంబవంతుని, మరో పది బాణాలతో నీలుని, సుగ్రీవుణ్ణి, ఋషభుణ్ణి అంగదుడ్ని కొట్టాడు. వారంతా ఎక్కడి వారక్కడే అచేతనులై పడిపోయారు. కాలాగ్నిలా వానరుల్ని దహిస్తూ అలా ముందుకి సాగిపోతున్నాడు. మూర్ఛపోయి, అచేతనులై పడివున్న వానరుల్ని చూసి ఇంద్రజిత్తు మహదానందం పొందాడు. తానొక్కడే అదృశ్యరూపంలో సేనలో ప్రవేశించి, వారిపై బాణాలు వెయ్యసాగాడు. బాణాలు వానలా కురుస్తున్నాయి. కాని ఎవ్వరూ కనిపించటం లేదు. వానరులకిది చాలావింతగా వుంది. వానరులు చావు కేకలు వేస్తూ ఒకరిపై ఒకరుపడసాగారు.

బాణాలెక్కడ్నుంచి వస్తున్నాయా, అని ఆకాశంలోకి చూడబోతే వారి కళ్ళల్లో

బాణాలు వెయ్యసాగాడు ఇంద్రజిత్తు. అందర్నీ పడగొట్టడం అయ్యాక రామలక్ష్మణులపై బాణపరంపర గుప్పించటం మొదలు పెట్టాడు.

వానలా కురుస్తున్న ఆ బాణాల్ని చూసి రాముడు, లక్ష్మణునితో "తమ్ముడూ ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంతో వానరులందర్నీ పడగొట్టేశాడు. మహావీరులైన వానర ప్రముఖులుంతా నేల కూలారు. బ్రహ్మ ఇచ్చిన వరప్రభావం వల్ల, ఆకాశంలో అదృశ్యంగా వుండి, మనతో యుద్ధానికి తలబడుతున్నాడు. సాక్షాత్తు ఆ బ్రహ్మయే వచ్చినా ఇప్పుడితడెక్కడ వుండి బాణాలు వేస్తున్నాడో, గుర్తించలేడు. నువ్వు ధైర్యంగా మనోనిబ్బరంతో నా ప్రక్కన నిలబడి వీడ్ని ఎదుర్కో. ఇతడి బాణాలతో దిక్కులన్నీ నిండిపోతున్నాయి. ఇప్పుడు మనిద్దర్నీ కూడా ఓడించి, విజయం పొంది లంకకి వెళ్ళగలడు. జాగ్రత్త" అని హెచ్చరించాడు. అంతలోనే ఇంద్రజిత్తు తన వాడియైన బాణాలతో వారిని గాయపరిచాడు. వారు దెబ్బ తిని బాధపడటం చూసి వెర్రి ఆనందం పొందాడు. రామలక్ష్మణులతో సహా అందర్నీ గాయపరచి, ఆనాటికి యుద్ధం చాలించి, ఇంద్రజిత్తు లంకలో ప్రవేశించాడు.

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించటం వల్ల మిగిలిన వానరులతో పాటు రామలక్ష్మణులు కూడా మైకంలో పడిపోయారు. సైన్యం అంతా చాలా విషాద పరిస్థితిలో వుంది. మెలకువ వచ్చినా కదల్లేని స్థితిలో కొందరున్నారు. విభీషణుడు వారినోదార్చి, "భయపడకండి. రామలక్ష్మణులు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము నందు గౌరవంతో దానికి లొంగిపోయాడు. తొందరలోనే వారుమేలు కొంటారు" అని వారికి ధైర్యం చెప్తుండగా, హనుమంతుడు వచ్చి "విభీషణా మన సైన్యం యావత్తు మూర్ఛలో వుంది. ఎవరైనా తెలివిలో వున్నారేమో చూసి వస్తాను. వారికి కూడా ధైర్యం చెప్పి ఓదార్చాలి. అనగానే విభీషణుడు సరే, అని అతడి కూడా బయల్దేరాడు. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి.

ఆ చీకటిలో చేతిలో కాగడాలు పట్టుకుని, యుద్ధ భూమిలోకి బయల్దేరారు ఇద్దరూ. వానరులు తోకలు తెగినవారు కొందరు, తొడలు, పాదాలు, వేళ్ళు పోయిన వారు కొందరు. మెడలు తెగిన వారుకొందరు, పర్వతాకారాలతో పడివున్నారు. ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రాలు తళ తళా మెరుస్తూ నేలమీద పడి వున్నాయి. సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు, శరభుడు, గందమాదనుడు, గవాక్షుడు, సుషేణుడు, నలుడు మొదలైన మహావీరులంతా నేలపై పడి వున్నారు. సుమారు అరవై కోట్ల మంది వానరులు నేలపై పడి వున్నారు.

కేవలం బ్రహ్మ అనుగ్రహం వల్ల ఇంద్రజిత్తు సంపాదించిన అమోఘాస్త్రం

అది. విభీషణుడు, ఆంజనేయుడు, కాగడాలు పట్టుకుని, వారిమధ్యలో జాంబవంతుడెక్కడున్నాడా అని వెతుకున్నారు. జాంబవంతుడు బ్రహ్మ మానసపుత్రుడు. అతి వృద్ధుడు. ఒకచోట శరీరమంతా బాణాలు గుచ్చుకుని పడివున్నాడు.

విభీషణుడతడ్ని గుర్తించాడు. దగ్గరగా వెళ్ళి ఇలా అన్నాడు. "ఆర్యా తీవ్రమైన ఈ బాణాల వల్ల మీకు ప్రాణ భయం లేదు కదా" అంటున్న విభీషణుడి మాటలు జాంబవంతుడు విన్నాడు. కన్నులు తెరచి చూడలేకపోయాడు కాని, అతడి కంఠస్వరాన్ని గుర్తుపట్టి ఇలా అన్నాడు. చాలా కష్టంమ్మీద నోరు తెరచి "రాక్షసోత్తమా నీగొంతుని బట్టి నిన్ను గుర్తించాను. బాణాలు లోతుగా దిగటం వల్ల కన్నులు తెరచి చూడలేకపోతున్నాను. అంజనాదేవి వరపుత్రుడైన హనుమంతుడు జీవించి వున్నాడా? అని అడిగాడు.

విభీషణుడా మాటలకి విస్తుబోయి, "తండ్రీ మీరు పూజ్యులైన రామలక్ష్మణుల గురించి గాని, వానర ప్రభువైన సుగ్రీవుని గురించి గాని, యువరాజైన అంగదుని గురించి గానీ, కుశలమడగకుండా, కేవలం వాయుపుత్రుని గురించే అడుగుతున్నారే, కారణం ఏమిటి? అని అడిగాడు. అందుకు జాంబవంతుడు

"రాక్షసవీరా మారుతి ఒక్కడు బ్రతికివుంటే మిగిలిన సైన్యం యావత్తు చనిపోయినా బ్రతికినట్లే. అతడొక్కడు ప్రాణాలు కోల్పోతే, మనమంతా బ్రతికివున్నా చనిపోయినట్లే. సకల జీవకోటికి ప్రాణాధారం వాయువే కదా. అటువంటి వాయుదేవుని కుమారుడు మనందరికీ ప్రాణాధారమైన వాడు" అని జాంబవంతుడు చెప్తుండగానే, పక్కనే నిలబడి వున్న హనుమంతుడు చేతులు జోడించి

"తాతా హనుమంతుడిదే మీకు వందనం చేస్తున్నాడు" అన్నాడు.

ఆ మాటలు వినగానే జాంబవంతునికి చైతన్యం కలిగింది. హనుమంతుని దగ్గరగా రమ్మని "వానరోత్తమా ఆయుష్మాన్ భవ. ఇప్పుడు అందర్నీ కాపాడగల్గిన వాడివి నువ్వొక్కడవే. నీతో సరియైన పరాక్రమవంతుడింకొకడు లేడు. రామలక్ష్మణులు బాణపుతాకిడికి తెలివితప్పిపడివున్నారు. వారివిప్పుడు మనం రక్షించుకోవాలి. నువ్వువెంటనే సముద్రం మీదుగా ఎగిరి వెళ్ళి హిమవంతుని దగ్గరకి వెళ్ళు. అక్కడ ఋషభము అనే కాంచనపర్వతం కనిపిస్తుంది. అక్కడే కైలాసపర్వతం కూడా వుంది. ఆ రెండు శిఖరాల మధ్య స్వయం ప్రకాశంతో వెలుగుతున్న ఓషధి పర్వతం వుంది. ఆ పర్వతం శిఖరం చివర భాగంలో నాలుగు ఔషధాలు కనిపిస్తాయి. అవి రాత్రింబవళ్ళు కాంతులు విరజిమ్ముతూ

ప్రకాశవంతంగా వుంటాయి.

అందులో ఒకటి మృత సంజీవిని. రెండవది విశల్యకరణి. మూడవది సావర్ణ్యకరణి. నాల్గవది సంధాన కరణి. నువ్వు వాయువేగంతో వెళ్ళి ఆ నాల్గింటిని తీసుకుని, తొందరగా వచ్చి ఈ వానర వీరుల్ని కాపాడు" అన్నాడు.

జాంబవంతుడి మాటలు విన్న, హనుమంతుడు వెంటనే రివ్వుమని ఆకాశంలోకి ఎగిరాడు. పర్వతాగ్రం మీద దిగాడు. పర్వత శిఖరం మీదం పాదం మోపి నొక్కిపట్టి ఆకాశంలోకి ఎగిరినప్పుడు, అతడి బలానికి, ఆ పర్వతం కృంగిపోయింది. దాని మీది వృక్షాలు, శిఖరాలు, అన్నీ నేలకూలాయి. లంకా నగరమంతా కదిలిపోయి, ఇళ్ళు, ద్వారాలు గోపురాలు, తోరణాలు అన్నీ గడగడా వణికాయి. సముద్రంతో సహా భూమి కంపించిపోయింది. ఆ విధంగా పర్వతాకారుడైన హనుమంతుడు అరవై యోజనాల ఎత్తున్న మలయ పర్వతం శిఖరం మీద ఎక్కి నిలబడ్డాడు. ఆ పర్వతం మీద నివశిస్తున్న యక్షులు, గంధర్వులు, కిన్నెరులు ఆ పర్వతంపై వాయుపుత్రుడు అడుగుపెట్టిన అలజడికి భయపడి కొయ్యబారిపోయారు.

ఆ పర్వత శిఖరంపై నిలబడి, వాయుపుత్రుడు, మనసారా శ్రీరాముని ధ్యానించాడు. తోక ఎత్తిపెట్టి, వీపుముందుకి వంచి, చెవులు ముడిచి, చేతులు చాచి, ముందుకి దూకటానికి సిద్ధపడ్డాడు. ఆ వేగానికి పెద్ద పెద్ద వృక్షాలు, కొండ శిలలు దొర్లిపడ్డాయి. రెండు చేతులూ ముందుకి చాచి, వీపు తిన్నగా చాచుకుని, విష్ణువుచే వదలబడిన సుదర్శన చక్రంలా, సముద్రాన్ని చూస్తూ, రివ్వున గాలిలో ముందుకి, దూసుకుని పోయాడు. ఆదిత్యునిలా బడలిక లేనివాడూ వాయువు లాంటి వేగంతో, దిక్కులు ప్రతిధ్వనిస్తుండగా, ముందుకి సాగిపోయాడు. జాంబవంతుడు చెప్పిన ప్రకారం హిమవత్పర్వతం మీదికి చేరాడు. ఆ పర్వతం మీది నుంచి ఎన్నెన్నో నదులు ప్రవహిస్తున్నాయి. తెల్లని మేఘమాలికలతో ఆవరించుకున్నట్లు ఆ పర్వతం చాలా ప్రకాశవంతంగా వుంది. ఆ శిఖరాగ్రం నించి బ్రహ్మభవనం కూడా కనిపించింది. రజతమయమైన కైలాసము, ఇంద్రుని స్థానము, హయగ్రీవుని ఆరాధనా స్థలము, బ్రహ్మకపాలం, యమదూతలు వుండేచోటు అన్నీ చూశాడు.

సూర్యుని భార్యయైన ఛాయాదేవి కోసం విశ్వకర్మ సృష్టించిన చోటు, బ్రహ్మ కొలువు తీరే సింహాసనం చూసాడు. శివధనస్సు వుండే చోటు చూసాడు. పాతాళ లోకానికి వెళ్ళే సొరంగం చూసాడు. ఇలా అన్నీ పరిశీలనగా చూస్తూ ఆ మధ్యలో

వుండే ఓషధీ పర్వతం కోసం వెతికాడు. ఔషధాలన్నీ ధగద్ధగాయమానంగా వెలిగిపోతున్న ఔషధపర్వతం చివరికి కనిపించింది. వెంటనే ఆ పర్వతం మీద వ్రాలాడు. ఎప్పుడైతే హనుమంతుడు కాలుమోపాడు వెంటనే ఆ ఔషధాలకి తమ కోసం ఎవరో వచ్చారని తెలిసింది. ఒక్కసారిగా అవి మెరవటం మానేశాయి. ఆ పర్వతమంతా నిస్తేజంగా అయిపోయింది.

అది చూసి హనుమంతునికి చాలా కోపం వచ్చింది. కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ తీవ్రంగా గర్జిస్తూ, "ఔరా ఎంత పొగరు మీకు! రామచంద్రునిపైనే నిరసన చూపిస్తున్నారా? నా బాహుబలంతో ఇప్పుడే చిందర వందర చేస్తాను చూడు అంటూ ఆ పర్వత శిఖరాన్ని అలాగే పెల్లగించి, పైకెత్తి పట్టుకుని, ఆకాశంలోకి ఎగిరిపోయాడు. ఇంద్రుడు, దేవతలు, అసురులు, ఈ విడ్డూరం చూసి చాలా ఆశ్చర్యపోయారు. దేవగణాలు హనుమంతుని స్తుతించి చాలా మెచ్చుకున్నారు. గరుడునితో సమానమైన వేగంతో సూర్యమార్గంలో ప్రయాణం సాగాడు మారుతి. అతడి చేతిలోని పర్వతం సూర్యకాంతితో మెరవసాగింది. ఆకాశంలో సూర్యుని ప్రక్కనే ఇంకో సూర్యుడు ప్రకాశిస్తున్నాడా అని అందరూ విడ్డూరంగా చూశారు. హనుమంతుని కోసం నిరీక్షిస్తున్న వానరులూ ఆకాశంలో హనుమని చూసి ఆనందంతో గర్జించారు.

లంక చేరి, త్రికూటాద్రిమీద, వానర సేన మధ్యలో వాలాడు ఆంజనేయుడు. వానరశ్రేష్ఠులకి, విభీషణునికి నమస్కరించి నిలిచాడు. విభీషణుడు హనుమంతుని గట్టిగా కౌగలించుకున్నాడు. ఎప్పుడైతే సంజీవినీ పర్వతం పైనించి వీచిన గాలలు పీల్చారో, ఆ ఔషధాల ప్రభావం వల్ల రామలక్ష్మణులు లేచి కూర్చున్నారు. వానరులంతా కూడా ఆ గాలిపీల్చి వారంతా పునర్జీవితులై లేచి కూర్చున్నారు. వారి గాయాలన్నికూడా ఆ గాలి ప్రభావం వల్ల మానిపోయాయి. విరిగిన ఎముకలు అతక్కుని, గాయములు మాని నిద్రలోంచి లేచినట్లు లేచి కూర్చున్నారు. అంతా చాలా సంతోషంగా ఒకర్నొకరు చూసుకున్నారు.

అయితే ఇక్కడ ఒక వింత జరిగింది. వానరులతో పాటు యుద్ధ భూమిలో చాలామంది రాక్షసులు కూడా చనిపోయారు. కాని చనిపోయిన రాక్షసుల్ని ఎప్పటికప్పుడు సముద్రంలోకి తోసెయ్యమని రావణుడు ఆజ్ఞాపించటం వల్ల అక్కడ ఒక్క రాక్షసశరీరం కూడా లేదు. కనక ఔషధుల ప్రభావంతో రాక్షసులెవ్వరూ బ్రతకలేదు. వానరులు మాత్రమే బతికారు.

వానరులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. రామలక్ష్మణులు, వానరులు

అందరూ స్వస్థులయ్యాక హనుమంతుడు ఔషధీ పర్వతాన్ని మళ్ళీ హిమాలయాల మీదికి చేర్చాడు. తిరిగి వచ్చి రామునికి నమస్కరించి నిలబడ్డాడు.

అప్పుడు సుగ్రీవుడు హనుమంతుడుతో "హనుమా, కుంభకర్ణుడు చనిపోయాడు. రావణుని కుమారులు కూడా చాలా వరకు చనిపోయారు. ఇంక రావణునికి తన నగరాన్ని రక్షించుకునే అవకాశం లేదు. మన సైనికులు చాలా బలవంతులు. ఇప్పుడింకా చీకటిగా వుంది. మనవాళ్ళు కాగడాలు పట్టుకుని ఎగిరి, లంకలోకి వెళ్ళాలి. రావణుని భవనాన్ని దగ్ధం చేసిరావాలి" అని ఆజ్ఞాపించాడు.

రాత్రి మొదటి ఝాము సమయం అది. ఎటు చూసినా గాఢాంధకారం అలుముకుని వుంది. వానరులంతా కాగడాలు పట్టుకుని లంకమీదికి బయల్దేరారు. కీలక స్థానాల్లో వున్న విరూపాక్షుడు మొదలైన రాక్షసులు వీరిని చూసి పరుగులు తీసారు. వానరులు గోపురాల మీదా, మేడల మీద అన్ని వీధులలో అగ్ని ముట్టించారు. వేలకొలది భవనాలు భగ భగ మండి తగులబడసాగాయి. పర్వతాల్లాంటి మేడలన్నీ నేలకూలుతున్నాయి. ముత్యాలు, పగడాలు, మణులు, వజ్రాలు, అన్నీ టపటపా పేలుతున్నాయి. పట్టుబట్టలు, నారబట్టలు, కంబళ్ళు, బంగారు ఆయుధాలు, బంగారు ఆభరణాలు, అన్నీ కాలి బూడిదైపోతున్నాయి. ఎలా వున్న వారలాగే వేలసంఖ్యలో మాడిబొగ్గులై పోతున్నారు. అందరూ హాహాకారాలతో పరుగులు పెట్టున్నారు. వారి రోదన ధ్వని పది యోజనాల వరకు వ్యాపించింది.

ఈ లోగా రామలక్ష్మణులు సేద దీరి, మళ్ళీ ధనుస్సులు ధరించి, యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డారు. రాముడు తన బాణాలతో లంకా నగరపు గోపురాన్నినేలమట్టం చేశాడు. రామబాణాల సందడితో, రాక్షసులు భీతావహులైపోయారు. అది ప్రళయ రాత్రిలా వుంది. సుగ్రీవుని ఆజ్ఞపై వానరులంతా పట్టణ ద్వారాల దగ్గర పోరాడుతున్నారు. లంకా దహనం చేస్తున్న వానరుల్ని చూడగానే రావణునికి విపరీతమైన కోపమొచ్చింది. అప్పుడు రావణుడు కుంభకర్ణుని కుమారులైన కుంభుడు, నికుంభుడు, అనే వారిద్దర్నీ యుద్ధానికి పంపాడు. వారి వెంట విరూపాక్షుడు, శోణితాక్షుడు, ప్రజంఘుడు, కంపనుడు, అనే నలుగురూ బయల్దేరారు. వాళ్ళు గర్జిస్తూ బయల్దేరారు. చతురంగ బలాలతో రాక్షససైన్యం సాగింది. వారిని చూసి వానరులు భయంకరంగా గర్జించారు. ఎదురొచ్చిన వానరుల తలలు రాక్షసులు తెగనరికి పడవేస్తున్నారు, వానరులు రాక్షసుల్ని గోళ్ళతో, పళ్ళతో, కొరికి, పీకి, రక్కి పిడికిళ్ళతో గుద్ది, బండరాళ్ళతో వాళ్ళ అవయవాలు విరిచేస్తూ చంపుతున్నారు.

ఈ విధంగా వారంతా ఒకరినొకరు చంపుకుంటూ, కొట్టుకుంటూ యుద్ధం చేస్తున్నారు. అంతా రణగొణధ్వనిలా తయారైంది. భయంకరమైన యుద్ధం జరుగుతోంది. అప్పుడు అంగదుడు అతిసాహసంగా కంపనుని ఎదుర్కొన్నాడు. కంపనుడు బలంగా అంగదుని ఒక్కటి కొట్టాడు. ఆ దెబ్బకి అంగదుడు వణికిపోయాడు. ఎలాగో నిలదొక్కుకుని, ఒక పర్వతం పెకిలించి కంపనుని మీదికి విసిరాడు అంగదుడు. ఆ దెబ్బకి కంపనుడు నేలకూలాడు. వెంటనే శోణితాక్షుడు అంగదుని మీదికి వచ్చాడు. ఎన్నో రకాల ఆయుధాలతో అంగదుని గాయపరిచాడు. అంగదుడు ధైర్యంగా వాణ్ణి ఎదుర్కొన్నాడు.

వాడి ధనుస్సునీ, రథాన్ని, బాణాల్ని నాశనం చేశాడు. అప్పుడు శోణితాక్షుడు, కత్తి, డాలు పట్టుకుని ఎగిరిదూకాడు. అంగదుడు ఝంఝామారుతంలా వాడిమీదికి దూకి వాడి చేతిలోని ఖడ్గాన్ని లాక్కున్నాడు. గట్టిగా గర్జిస్తూ ఆ కత్తితోనే వాని వీపుమీద పొట్టమీదా యజ్ఞోపవీతంలా చీరాడు. ఆ కత్తితోనే రాక్షసుల్ని చంపసాగాడు. శోణితాక్షుడు చేతిలో కత్తి లేకపోయినా జంకు లేకుండా అంగదుడి మీదికి దూకాడు. వాడివెంట యూపాక్షుడు, ప్రజంఘుడు కూడా అంగదుని మీద పడ్డారు. అది చూసి మైందుడు, ద్వివిదుడు, అంగదునికి సాయంగా వచ్చారు. మహాకాయులైన రాక్షసులు రోషంతో, కత్తులు, గద, పట్టుకుని వారిపై పడ్డారు. వారందరి మధ్యా తీవ్రమైన యుద్ధం జరిగింది. ప్రజంఘుడు వెడల్పైన కత్తితో అంగదుని మీదికి దూసుకువచ్చాడు. అశ్వకర్ణమనే వృక్షం పీకి అంగదుడు వాడ్ని చచ్చేలా మోదాడు. కత్తిపట్టుకున్న చేతి మీద పిడికిలితో బలంగా కొట్టాడు. ఆ దెబ్బకి కత్తి నేలమీద పడింది.

ప్రజంఘుడు కోపంతో పిడికిలి బిగించి, అంగదుని నుదుటి మీద కొట్టాడు. అంగదుడు తూలిపడి, తన చేతిలోని కత్తితో వాడి తలనరికాడు. అది చూసి యూపాక్షుడు కంటతడిపెట్టాడు. ద్వివిదుడుఎదురుగా రావడం చూసి వాడు రథంలోంచి దూకి కత్తిపట్టుకుని, ద్వివిదుని మీదికి ఉరికాడు. ద్వివిదుడు వాణ్ణి బలంగా గుండెల మీద కొట్టాడు. శోణితాక్షుడు, గదతో ద్వివిదుడ్ని చావమోదాడు. ద్వివిదుడికి, ఆ దెబ్బలకి మైకం కమ్మినట్లైంది. మళ్ళీ శోణితాక్షుడు గద ఎత్తి పట్టుకున్నాడు. ద్వివిదుడు వాడి మీదికి దూకి గదలాక్కున్నాడు. అప్పుడు మైందుడు యూపాక్షుని గుండెల మీద అరచేతితో చరిచాడు. శోణితాక్షుడు, యూపాక్షుడు మైంద, ద్వివిదులతో తీవ్రంగా పోరాడారు.

ద్వివిదుడు తన వాడి అయిన గోళ్ళతో శోణితాక్షుని ముఖం చీల్చి, నొక్కి పట్టినేల మీద పడేశాడు. మైందుడు యూపాక్షునిపై బడి, చేతులతో నొక్కి పట్టి

నేలమీద పడవేసి చంపేశాడు. అది చూసి రాక్షసులు భయపడి, కుంభుని దగ్గరకి పరిగెత్తారు. కుంభుడు వారినోదార్చి ధైర్యం చెప్పి, తానే స్వయంగా బయల్దేరాడు. ద్వివిదుని మీద బాణవర్షం కురిపించాడు. ద్వివిదుడు పర్వతంలా నేల కూలాడు. మైందుడు కోపం పట్టలేక, పెద్ద బండశిలని విసిరేశాడు. కుంభుడు ఐదు బాణాలతో దాన్ని తుత్తునియలు చేశాడు. ఇంకో మూడుబాణాలతో మైందుణ్ణి గాయపరిచాడు. తీక్షణమైన బాణాలతో గుండెలపై కొట్టాడు. మైందుడు తెలివి తప్పి పడిపోయాడు.

మేనమామలిద్దరూ పడిపోగానే అంగదుడు రోషంతో, కుంభుని మీదికి వచ్చాడు. కుంభుడు అంగదునిపై వరసగా ఐదు బాణాలు వేశాడు. అంగదుడే మాత్రం చలించకుండా ఎదుర్కొన్నాడు. అదే పనిగా అంగదుని మీద బాణాలు గుప్పించాడు. కుంభుడు రెండు బాణాలతో కనుబొమ్మల మధ్య కొట్టాడు. అంగదుడి నుదురు చిట్లి రక్తం ధారలా కారింది. రెండు కళ్ళు మూసుకుపోయాయి. అలాగే అరచేత్తో కళ్ళు మూసుకుని, పెద్ద వృక్షం పెకిలించి కుంభుని మీదికి విసిరాడు. కుంభుడు ఏడుబాణాలతో ఆ వృక్షాన్ని ఖండించాడు. అంగదుడు బాధతో కృంగిపోసాగాడు. కొంతమంది వానరులు వెళ్ళి ఈ సంగతి రామునితో చెప్పారు. రాముడు జాంబవంతుడ్ని, మరికొందరు వీరుల్ని పంపాడు. వాళ్ళు మహావృక్షాలు పీకి కుంభునిపైకి వెళ్ళారు. కుంభుడు బాణ వర్షం కురిపించాడు. వానరులా బాణాల ధాటికి ఆగలేకపోయారు. అప్పుడు సుగ్రీవుడు రంగంలోకి దిగాడు. ఒక పెద్ద వృక్షంపీకి కుంభుని మీదికి విసిరేశాడు. కుంభుడు దాన్ని ముక్కముక్కలు చేశాడు.

అప్పుడు సుగ్రీవుడు అమాంతం వాడి మీద దూకి, బాణాలన్నీ ముక్కముక్కలు చేశాడు. ఇద్దరూ ఏనుగుల్లా కలియబడ్డారు. సుగ్రీవుడు వాణ్ణి రెండు చేతులతో ఎత్తి సముద్రంలోకి విసిరేశాడు. కుంభుడు పడగానే సముద్రంజలం జివ్వుమని పొంగింది. అయినా వాడు సముద్రంలోంచి లేచి వచ్చి సుగ్రీవుని గుండెలపై బలంగా కొట్టాడు. సుగ్రీవుని చర్మం పగిలి ఎముకలు బయటపడ్డాయి. అయినా సుగ్రీవుడు లెక్కచేయకుండా మళ్ళీ వాడిఎదురు రొమ్ముమీద గుద్దాడు. ఆ దెబ్బకి కుంభుడు నేలకూలాడు. వాడి శరీరం భయంకరంగా వుంది. వాడిచావుతో భూదేవి చలించింది. రాక్షసులు భయంతో పారిపోయారు.

అప్పుడు వాడి సోదరుడైన నికుంభుడు, ఆవేశం ఆపుకోలేక, పరిఘ అనే ఆయుధం పట్టుకుని పెద్ద గర్జించాడు. వాడి భీకరాకారానికి రాక్షసులే హడలిపోయారు. వానరులైతే గుండెలు జారిపోయి భయంతో నిలబడ్డారు. హనుమంతుడు మాత్రం గుండె ధైర్యంతో రొమ్ము ఒడ్డి ఎదురెళ్ళాడు. నికుంభుడు

తన చేతిలోని పరిఘుని హనుమంతుని గుండెల మీదికి విసిరేశాడు. ఆంజనేయుడు కదిలిపోయాడు. విశాలమైన అతడి వక్షస్థలానికి తగిలి ఆ పరిఘుమారు ముక్కలైంది. హనుమంతుడు పిడికిలి బిగించి నికుంభుని గుండెలపై కొట్టాడు. నికుంభుడి చర్మం చిట్లి రక్తం చివ్వున చిమ్మింది. మెరుపు మెరిసినట్లైంది. నికుంభుడు నిలదొక్కుకుని, హనుమంతుని గట్టిగా నొక్కి పట్టాడు. రాక్షసులు పరమానంద పడ్డారు. నికుంభుడు హనుమంతుని భుజాల మీద వేసుకుని పారిపోసాగాడు. హనుమంతుడు భుజాల మీది నించే పిడికిలి బిగించి వాడినెత్తి మీద మొత్తాడు.

నికుంభుడు తలతిరిగి హనుమంతుడ్ని జారవిడిచాడు. క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా హనుమంతుడు నికుంభుడ్ని నేలమీద పడేసి పిండిగుండ చేశాడు. పెద్దగా అరుస్తూ వాని గుండెల మీద కూర్చున్నాడు. రెండు చేతులతో వాని మెడ తిప్పి మెలిపెట్టి శరీరం నించి వేరు చేశాడు. నికుంభుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వానరులు హర్షధ్వానాలు చేశారు. రాక్షసుల గుండెల్లో రాయి పడింది. రావణునికీ వార్త చేరవేశారు. నికుంభుడు, కుంభుడు చనిపోయారన్న వార్త రావణుడిన్ని కలచివేసింది. దుఃఖం ముంచుకుని వచ్చింది. ఖరుని కుమారుడైన మక్షరాక్షుడ్ని పిలిచి యుద్ధానికి పంపాడు. మకరాక్షుడు గర్వంగా రావణునికి ప్రదర్శనం చేసి రథం ఎక్కి తగినంత సైన్యంతో బయల్దేరాడు. ఎన్నో విధాలైన ఆయుధాలతో వారంతా ఉత్సాహంగా బయల్దేరారు.

జుట్టు విరబోసుకుని, భయంకరమైన కోరలతో, ఏనుగుల్లా ఘీంకరిస్తూ, మకరాక్షునికి ముందు వెనకా రాక్షససైన్యం నడుస్తోంది. భేరీ నినాదాలు మిన్నుముట్టాయి. జబ్బలు చరుచుకుంటూ, బొబ్బలు పెడుతూ వారు వెళ్తున్నారు. అంతలో అపశకునంగా సారధి చేతిలోని కొరడా జారిపడింది. రథంపై వున్న జండా విరిగిపడింది. ధూళితో నిండిన ఎదురు గాలులు వీచాయి. అయినా వారేం లెక్కచేయలేదు. యుద్ధ భూమిలో ప్రవేశించి, ధైర్యంగా మకరాక్షుణ్ణి ఎదుర్కొనేందుకు సిద్ధంగా నిలచిన వానర సేనతో కలియబడ్డారు.

వానరులు పెద్ద పెద్ద వృక్షాలు విసురుతుంటే వాటిని రాక్షసులుబాణాలతో తత్తునియలు చేస్తున్నారు. మకరాక్షుడు బాణ పరంపరలతో వానరుల్ని గాయ పరుస్తున్నాడు. వానరులంతా భయంతో పరిగెత్తువుంటే రాక్షసులు సంతోషంగా కేరింతలు కొట్టున్నారు. రాముడు వానరుల్ని పారిపోవద్దని హెచ్చరిస్తున్నాడు. తన బాణాలతో రాముడు, రాక్షస సేనల్ని చిందర వందర చేస్తున్నాడు.

అదిచూసి మకరాక్షుడు కోపంతో "రామా ఆగు నాతో యుద్ధం చెయ్యి

నాతో ద్వంద్వ యుద్ధం చెయ్యడానికి నీకు పిలుపునిస్తున్నాను. రా. నీ ప్రాణాలు తీస్తాను. నా తండ్రియైన ఖరుణ్ణి చంపావు కదా. నిన్ను చూస్తుంటే నాకు కారం రాసుకున్నట్టుంది. ఆనాడు నా కంటబడలేదు. ఇప్పటికి కనిపించావు. నిన్నిప్పుడే నా తండ్రి దగ్గరకు పంపిస్తాను. రా. గదా యుద్ధం చేద్దామా? ద్వంద్వ యుద్ధం చేద్దామా?" అంటూ తొడలు చరుచుకుంటూ మీది మీదికి వస్తున్న ఆ మకరాక్షుణ్ణి రాముడు చూశాడు.

వాణ్ణి చూసి నవ్వుతూ "రాక్షసా, ఆత్మస్తుతి బాగానే వుంది. కాని యుద్ధంలో వాచాలత్వం కూడదు. ఆనాడు నీ తండ్రి మాత్రమే కాదు. పద్నాలుగు వేల మంది రాక్షసులు, త్రిశిరుడు, దూషణుడు కూడా నా చేత చంపబడ్డారు. ఇప్పుడు నిన్ను కూడా చంపి, కాకులకి, గ్రద్దలకి, విందుచేస్తాను. రా" అన్నాడు.

మకరాక్షుడికీ, రాముడికీ ఘోరమైన పోరు జరిగింది. వారు వదులుతున్న బాణాలతో భూమి అంతా నిండిపోయింది. రాముడు ఏడు బాణాలతో మకరాక్షుని విల్లు నాశనం చేశాడు. ఎనిమిది బాణాలతో సారథిని చంపాడు. రథము, సారథి, కూలిపోగానే, మకరాక్షుడు నేల మీద నిలబడ్డాడు. చేతిలో శూలం ధరించాడు. రాముడు మూడు బాణాలతో ఆ శూలాన్ని విరిచేశాడు. మకరాక్షుడు కోపంతో పిడికిలి బిగించి రాముని మీదికి లంఘించాడు. రాముడు నవ్వి వాడి మీద ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. మకరాక్షుడు ఆ అస్త్రప్రభావానికి, గుండె పగిలి నేల మీద పడ్డాడు. రాక్షసులంతా భయపడి లంకలోకి పారిపోయారు.

మకరాక్షుడు కూడా చనిపోయాడన్న వార్త తెలిసి రావణుడు అక్కసుతో పళ్ళు పటపట లాడించాడు. కోపంతో ఊగిపోతూ, ఏం చెయ్యాలో తోచక, ఇంద్రజిత్తుని రమ్మని కబురు చేశాడు. వెంటనే ఇంద్రజిత్తు వచ్చి తండ్రికి నమస్కరించి నిలబడ్డాడు.

"వీర కుమారా, మహావీరులైన రామలక్ష్మణుల్ని చంపటానికి నువ్వొక్కడివే సమర్థుడివి. వాళ్ళనెదిరించి యుద్ధం చేస్తావో, అదృశ్యంగా వుండి యుద్ధం చేస్తావో నీ ఇష్టం. ఇంద్రుడంతటి వాణ్ని జయించిన మహావీరుడివి నువ్వు. ఈ సామాన్యమానవులు నీకెంత?" అని ఇంద్రజిత్తుని పొగిడాడు.

తండ్రి మాటలకి ఇంద్రజిత్తు మురిసిపోయాడు. "సరే" అని ముందుగా హోమం చేశాడు. ఇంద్రజిత్తు తోమరాలతో అగ్ని చుట్టు సమాస్తరణ చేసి, నల్లని మేకని బ్రతికి వుండగానే పళ్ళతో కొరికి ఆ రక్తంతో తర్పణం చేశాడు. అన్నీ విజయసూచనలు కనిపించాయి. హోమం చేసి, దేవ, దానవ రాక్షసులకు తృప్తి

కలిగించి, అదృశ్య శక్తి కలిగిన రథం అధిరోహించాడు. బ్రహ్మాస్త్రము పొందిన ఆ వీరుడు తన సహజమైన తేజస్సుతో యుద్ధానికి బయల్దేరాడు. యుద్ధభూమిలో ప్రవేశించి, రాక్షసమంత్రాలు పఠించి అంతర్ధానమయ్యాడు. అందరికీ వినిపించేలా ఇలా అన్నాడు.

"కపట సన్యాసులైన రామలక్ష్మణుల్ని ఇప్పుడే చంపి నా తండ్రికి ప్రీతి కలిగిస్తాను" అంటూ మాయా వేషంలో వుండి వానరుల మధ్య రామలక్ష్మణు లెక్కడున్నారా అని అని వెతికాడు. రామలక్ష్మణులు అప్రమత్తులై ఆకాశమంతా తమ దివ్యాస్త్రాలతో నింపేశారు. దిక్కులన్నీ చీకట్లు కమ్మాయి. కాని వీరు ప్రయోగించిన బాణం ఒక్కటీ ఇంద్రజిత్తుకి తగల్లేదు. అదృశ్యరూపంలో ఆకాశంలో ఇటు అటు తిరుగుతూ, తనని తాను రక్షించుకుంటూ బాణాలు వేస్తున్నాడు ఇంద్రజిత్తు. ఇతడు ప్రయోగించే ప్రతిబాణం రామలక్ష్మణులకి తగుల్తోంది. అయినా లెఖ్ఖచేయ్యకుండా వారు యుద్ధం చేస్తున్నారు. ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న బాణాల్ని మధ్యలోనే ఖండిస్తూ, అవి ఏ దిక్కునించి వస్తున్నాయో అటే బాణాలు వేస్తున్నారు రామలక్ష్మణులు. కాని ఇంద్రజిత్తు అతిలాఘవంగా తప్పించుకుంటూ వారిని గాయపరిచసాగాడు.

లక్ష్మణునికి ఇంక, సహనం సన్నగిల్లింది. "అన్నయ్యా ఈ దుష్టుడి మీద బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాను" అన్నాడు. కాని రాముడు, ఒక్కడి కారణంగా పరివారాన్నంతా చంపడం అనుచితమని వారించాడు. ఎదుటబడి యుద్ధం చెయ్యనివానిని, దాగివున్నవానిని, దోసిలి ఒగ్గినవారిని, శరణన్న వారిని, పారిపోతున్న వారిని, మత్తులో వున్న వారిని చంపడం రాజనీతికి విరుద్ధం. కనుక వీడిని చంపటానికి ఇంకేదైనా ఉపాయం ఆలోచించాలి "అన్నాడు.

ఇంద్రజిత్తు రాముని మాటలు విన్నాడు. ఆలోచనలో పడ్డాడు. తాత్కాలికంగా యుద్ధం ఆపేసి వెళ్ళిపోయాడు. మాయోపాయంతో రాముడ్ని లొంగదీసుకోవాలని ఆలోచనలో పడ్డాడు. కొంతసేపు రాక్షససేనతో పశ్చిమద్వారం గుండా బయటకి వెళ్ళాడు. మాయా సీతని సృష్టించి తన రథం మీద కూర్చోబెట్టుకున్నాడు. వానరులందరి సమక్షంలో ఆమెని చంపటానికి సిద్ధపడ్డాడు. ఇంద్రజిత్తు రథంలో సీతమ్మని చూసిన వానరులు ఆవేశం ఆపుకోలేకపోయారు. పెద్ద పెద్ద కొండ శిలలతో ఇంద్రజిత్తుని కొట్టసాగారు. హనుమంతుడు వానరులందర్నీ తోసుకుంటూ ముందుకి వచ్చి రథంలో వున్న సీతమ్మని చూశాడు. తాను రెండు నెల క్రితం రావణుని అశోకవనంలో చూసిన సీతమ్మ ఎలా వుందో, అచ్చం ముమ్మారులా అలాగే వుంది ఈ సీత కూడా, ఏకవేణి ధరించి, మాసిన వస్త్రంతో

శరీరమంతా మురికిపట్టి, రామారామా అని ఆక్రోషిస్తోంది. ఆమెని చూసి హనుమంతుడుకళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు దుఃఖంతో

ఈ దుర్మార్గుడెంత ఘాతుకానికి తలబడ్డాడు. ఈనీచుణ్ణి ప్రాణాలతో వుండనివ్వకూడదు. అంటూ పెద్దపర్వత శిఖరం ఎత్తిపట్టి ఇంద్రజిత్తు రథంపైకి పరిగెత్తాడు. అదేఅదను అనుకుని ఇంద్రజిత్తు సర్రున తన ఒరలోంచి కత్తిని పైకి లాగి, మాయాసీత జుట్టుపట్టుకుని, కొట్టసాగాడు. ఆమె రామా రామా అని భోరున విలపించింది. వాడు ఆమెని నరకటానికి సిద్ధపడ్డాడు.

వాడి అమానుష చర్యకి గర్జిస్తూ హనుమ "ఓరీ రాక్షసాధమా, పాపిష్టివాడా, అనార్యుడా, దయమాలిన వాడా, రామునికి దూరమై అనాథలా వున్న ఈ మహాసాధ్వి నీకేం అపకారం చేసిందిరా? ఎందుకీమెని చంపాలనుకుంటున్నావు? ఆమెని చంపి నువ్వు ప్రాణాలతో వుంటావా? నా చేతిలో నువ్వు ఛస్తావా? రా. స్త్రీలను చంపిన వారు అధమలోకాలకి పోతారు" అంటూ ఇంద్రజిత్తు మీదపడ్డాడు.

ఇంద్రజిత్తు వేలకొద్దీ బాణాలు వానరసేనపై వేస్తూ హనుమంతుడితో ఇలా అన్నాడు.

"హనుమా! సుగ్రీవుడు, రామలక్ష్మణులు ఏ సీతకోసం అపారమైన సముద్రాన్ని దాటి వచ్చారో ఆమెని ఇప్పుడే నీ కళ్ళ ముందరే చంపుతాను. ఆ తర్వాత తీరికగా నిన్ను, సుగ్రీవుని, రామలక్ష్మణుల్ని చంపుతాను. నీచుడైన విభీషణుని కూడా చంపుతాను" అంటూ వికటాట్టహాసం చేసి ఆ మాయా సీతని చంపేశాడు. ఆమె రథంపై నించి, నేలమీద పడింది. అది చూసి వానరులంతా భయపడి పారిపోయారు. హనుమంతుడు వారికి ధైర్యం చెప్పాడు. వారంతా వెనక్కి వచ్చి పెద్ద వృక్షాలు, కొండ శిలలు పట్టుకుని రాక్షసులపై పడ్డారు. వానరులంతా అదే పనిగా ఇంద్రజిత్తు మీద రాళ్ళ వాన కురిపించారు. రాక్షసుల్ని వృక్షాలతో చితక తన్ని చంపసాగారు. ఇంద్రజిత్తు బాణ పరంపరతో వానరుల్ని చంపసాగాడు. వానరులు అధికసంఖ్యలో చనిపోసాగారు.

అప్పుడు హనుమంతుడు వానరుల్ని వెనక్కి వెళ్ళిపొమ్మన్నాడు. "మిత్రులారా ఏ సీతమ్మ కోసం మనం ఇన్ని పడరాని పాట్లు పడ్తున్నామో, ఆమె చనిపోయింది. ఇంక ఈ పోరు ఎవరికోసం? ముందు ఈ వార్త రామునికీ, సుగ్రీవునికి చెప్దాం. ఆ తర్వాత వారేం చెయ్యమంటే అది చేద్దాం" అంటూ వారిని వెనక్కి మళ్ళించాడు.

వెంటనే ఇంద్రజిత్తు నికుంభినిలా హోమం చెయ్యటానికి బయల్దేరాడు. ఆతడి ఆశయం నెరవేరింది. ఈ వార్త వానరులు రామునికి తెలియచెయ్యాలన్నదే

అతడి అభిలాష. తాత్కాలికంగా రాముడు దుఃఖావేశంతో యుద్ధం విరమిస్తాడు. ఈలోగా హోమం పూర్తిచేసి సంపూర్ణబలంతో తిరిగి రావచ్చన్నదే అతడి సంకల్పం.

హోమగృహంలో ప్రవేశించి, శాస్త్రోక్తంగా అగ్నిప్రజ్వలింపజేసి మాంసంతో రక్తంతో అగ్నిదేవుని సంతృప్తి పరచి, యాగదీక్ష బూనాడు.

రాముడు యుద్ధభూమిలో ఏదో అలజడి జరుగుతోందని గ్రహించి, అదేమిటో చూసిరమ్మని జాంబవంతుణ్ణి పంపించాడు. జాంబవంతుడు వెళ్తుండగా హనుమంతుడెదురు వచ్చాడు. హనుమంతుడు కన్నీటితో ఇలా అన్నాడు.

"రామచంద్రా మేము ఇంద్రజిత్తుతో యుద్ధం చేస్తుండగా, మా అందరి కళ్ళముందురా వాడు దుఃఖసాగరంలో మునిగి వున్న సీతమ్మని కత్తితో నరికి చంపేశాడు. మా మనస్సులు చెదిరిపోయి, ఇంక యుద్ధం చెయ్యలేక ఈ సంగతి నీకు చెప్తామని వచ్చాము" అన్నాడు

ఆ మాటలు విన్న రాముడు మొదలు నరికిన వృక్షంలా పడిపోయాడు. తెలివి తప్పి పడిపోయిన రాముని చుట్టు వానరులంతా ఏడుస్తూ చుట్టుముట్టారు. శైత్యోపచారములు చేస్తూ రాముణ్ణి సంరక్షిస్తు కూర్చున్నారు. లక్ష్మణుడు అన్నగారిని కౌగలించుకుని "అన్నయ్యా నువ్వు పితృవాక్యపాలన అనే ధర్మం తు.చ.తప్పకుండా పాటించావు. నువ్వు నమ్ముకున్న ధర్మం నిన్ను కాపాడిందా? ఎందుకిన్ని అనర్థాలు కలిగిస్తోంది? ఇంక ఆ ధర్మాన్ని నమ్ముకుని ప్రయోజనం ఏమిటి? అసలు ధర్మం అనేదే లేదు. లేని దాని కోసం ఇన్ని తిప్పలు పడ్తున్నావు. అధర్మవర్తనుడని అందరూ అంటున్న రావణుడు మాత్రం కులాసాగా చక్కగా వున్నాడు. వాడికేఅనర్థం కలగలేదు.

అసలు మంచి, తెడు అనే మాటలకి అర్థం ఏమిటి? మంచిని ఆచరించిన నీకు, ఏం మేలు కలిగింది? ఇప్పటికైనా కళ్ళు తెరు. పుష్కలంగా ధనం వున్నప్పుడే దైవమైనా న్యాయమైనా అనుకూలిస్తుంది. ధనం లేని వానికి కష్టాలు తప్పవు. ధనహీనునికి ఈ లోకంలో గౌరవం గాని, సుఖం కాని వుండవు.

లే. ఆ దుర్మార్గుడైన రావణుని మీద పగతీర్చుకోవాలి. నీ సామర్థ్యం నిరూపించుకో. నేనేమైనా పొరపాటుగా మాట్లాడి వుంటే క్షమించు. ఇంద్రజిత్తు సీతమ్మని చంపాడని ఓర్వలేక అన్నాను. నాకు అనుమతి ఇయ్యి. అప్పుడే వెళ్ళి లంకని సమూలంగా నాశనం చేసి వస్తాను" అన్నాడు ఆవేశంగా.

ఇంతలో విభీషణుడక్కడికి వచ్చాడు. అక్కడ అందరూ విషణ్ణ వదనాలతో వుండటం చూశాడు. ఆర్తిగా రాముడ్ని సమీపించి "ప్రభూ ఏం జరిగింది? అని

అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు "విభీషణా హనుమంతుడు వచ్చి ఇంద్రజిత్తు సీతమ్మని చంపేశాడని చెప్పాడు. అది వినగానే రాముడు మూర్ఛపోయాడని" చెప్పాడు. విభీషణుడు లక్ష్మణుని మాటలకడ్డు వచ్చి, చాలు చాలు ఇంక చెప్పకు" అంటూ రామునితో

"పురుషోత్తమా, హనుమంతుడు కూడా నమ్మాడా? చాలా ఆశ్చర్యంగా వుందే. సముద్ర జలాలు ఇంకిపోవచ్చు. కాని సీతని చంపాడన్న మాట మాత్రం వాస్తవం కాదు. రావణుని మనస్తత్వం నాకు బాగా తెలుసు. ఎన్నికష్టాలైనా భరిస్తాడు కాని, అతడు మాత్రం సీతని చంపటానికి ఎంతమాత్రం ఒప్పుకోడు. ఆమెమీద అంతటి మక్కువవుంది రావణునికి. నేనెన్నిసార్లో అతడి మేలుకోరి, సీతని మీ కప్పగించమని చెప్పాను. కాని ఎన్నికష్టాలైనా సహిస్తున్నాడు. కాని ఆమెని విడిచిపెట్టేందుకు మాత్రం ఒప్పుకోలేదు.

ఒక్క సంగతి చెప్తాను విను. రావణుని సంరక్షణలో వుండగా దేవతలు, ఇంద్రుడు కూడా ఆమెని కన్నెత్తి చూడలేరు. ఇంద్రజిత్తు మాయాజాలం సృష్టించి, సీతమ్మని చంపినట్లు వానరులు నమ్మేటట్లు భ్రాంతి కలిగించాడు. ఈ విధంగా మీ కందరికీ భ్రాంతి కలిగించి, మీరు క్లేశములో మునిగి వుండగా, తానునికుంభిలా హోమం చెయ్యడానికి వెళ్ళాడు. ఆయాగం కనక నిర్విఘ్నంగా పరిసమాప్తి చెయ్యగలిగాడంటే అతడినింక దేవతులు, ఇంద్రుడు కూడా ఏం చెయ్యలేదు. అజేయుడవుతాడు. అందుకే అతడీమాయాజాలాన్ని సృష్టించాడు.

ఇప్పుడు సీతకొచ్చిన భయం ఏమీ లేదు. మీరంతా శీఘ్రంగా లేవండి. ఇంద్రజిత్తు యాగము పూర్తి చెయ్యకముందే, సేనా సమేతంగా అక్కడికెళ్దాం. మీరింతగా కృంగిపోవడానికి మీరు చూసింది నిజం కాదు. సీత సురక్షితంగా వుంది. నువ్వు కూడా ఇలా దిగులు పడితే సైన్యమంతా కృంగిపోతుంది. రామా గుండె ధైర్యాన్ని తెచ్చుకుని, ఇక్కడే వుండు. వానర సైన్యంతో లక్ష్మణుని నాతో పంపించు. లక్ష్మణుడు తన సామర్థ్యంతో ఇంద్రజిత్తు యాగం భగ్నం చేస్తాడు. ఆ యాగం చేస్తున్న వాడు మధ్యలో ఆపి బయటకి వస్తే వాడిని చంపటం చాలా సులభం. ఆలస్యం చేస్తే ప్రమాదం. శత్రువుని సంహరించటానికిదే మంచి సమయం. ఆ యజ్ఞం కాని అతడు పూర్తి చేశాడా. అతడు దేవదానవులకి, కూడా కనిపించకుండా యుద్ధం చెయ్యగలడు. అప్పుడెంతటి శక్తివంతులైనా అతడ్ని జయించలేరు" అని తొందరపెట్టాడు విభీషణుడు.

కాని శోకార్తుడైన రామునికి విభీషణుడు చెప్పిన మాటల మీద నమ్మకం

కలగలేదు.

"రాక్షస రాజా నువ్వు చెప్పిది నాకు అర్థం కావడం లేదు. మరి కాస్త వివరంగా చెప్పు" అన్నాడు.

అప్పుడు విభీషణుడు "రామచంద్రా నా విన్నపం సావధానంగా వినండి. మీకు సంతాపం కలిగించడానికి శత్రువులు పన్నిన పన్నాగం తప్ప, సీతమ్మ మరణం నిజం కాదు. నువ్వు రాక్షసులందర్నీ సంహరించి సీతని పొందాలంటే, నేను చెప్పింది జాగ్రత్తగా విను. ఇప్పుడే లక్ష్మణుని పెద్ద సైన్యంతో కూడా పంపి, ఇంద్రజిత్తు చేస్తున్న యాగం భగ్నం చెయ్యమని చెప్పు. ఇంద్రజిత్తుని ఎలాగైనా నికుంభిలా యాగం నించి లేపి, వానితో యుద్ధం చేసి, వానిని సంహరించాలి. ఆశక్తి లక్ష్మణునికి వుంది.

ఇది వరలో ఇంద్రజిత్తు తపస్సు చేసి బ్రహ్మని మెప్పించి బ్రహ్మ శిరస్సు అనే అస్త్రాన్ని ఒక అద్భుతమైన గుఱ్ఱాన్ని సంపాదించాడు. ఆ గుఱ్ఱం ఇంద్రజిత్తు మనస్సులో ఎక్కడికెళ్ళాలని సంకల్పిస్తే అక్కడికి తీసికెళ్తుంది. ఇప్పుడేమో నికుంభినీ యాగం చేస్తున్నాడు. అది కనుక పూర్తి చేసి బయటకి వచ్చాడా, ఇంక అతడి ఎదురుగా నిలబడి ఎవ్వరూ యుద్ధం చెయ్యలేరు. ఇంక మనమెవ్వరం బ్రతికి వుండము. కనుక ఆలస్యం చెయ్యకుండా లక్ష్మణుని పంపు. ఇంద్రజిత్తు చనిపోతే చాలు. ఇంక రావణుని మనం గెలిచినట్లే" అన్నాడు.

విభీషణుని మాటలు విన్న రాముడు, "విభీషణా ఇంద్రజిత్తు మాయలు నాకు తెలుసు. బ్రహ్మాస్త్రము నెరిగిన ప్రాజ్ఞుడతడు. చాలా బలవంతుడు. కనక నీ సలహా ప్రకారమే చేస్తాను" అంటూ లక్ష్మణుని పిలిచాడు.

"లక్ష్మణా నువ్వు వెంటనే సుగ్రీవుని, వానర సేనని వెంటతీసుకుని, హనుమంతుడు మొదలైనవీరుల్ని కూడా వెంటబెట్టుకుని, ఇంద్రజిత్తుతో యుద్ధానికి వెళ్ళు. విభీషణుడ్ని కూడా వెంట తీసికెళ్ళు. ఎందుకంటే ఆయనకి ఇక్కడి ప్రదేశాలన్నీ బాగా తెలుసు" అని రాముడు ఆజ్ఞాపించాడు.

వెంటనే లక్ష్మణుడు సంతోషంతో కవచము, ధనుర్బాణాలూ ధరించి, ఖడ్గము తీసుకుని, వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. రామునికి పాదాభివందనం చేశాడు. రాముడు తమ్ముణ్ణి ఆశీర్వదించాడు. వేలకొలది వానర సేనల్ని, హనుమంతుని, విభీషణుని వెంటపెట్టుకుని బయల్దేరాడు. విభీషణుని నల్గురు అనుచరులు కూడా వారి వెంట వెళ్ళారు. జాంబవంతుడు కూడా తన సైన్యంతో బయల్దేరి వెళ్ళాడు. అలా కొంతదూరంవెళ్ళాక, వారికి వ్యూహంగా నిలిచిన ఇంద్రజిత్తు సేన

కనిపించింది. అంగదుడు, హనుమంతుడు ముందు నడవగా వారంతా అటు వైపు వెళ్ళారు.

వెళ్ళిన కొద్దీ శత్రుసైన్యం లెఖ్ఖపెట్టలేనంతగా వుండి. అన్ని వైపులా చీకటి ఆవరించినట్లుంది. లక్ష్మణుడు ధైర్యంగా ఆ వ్యూహంలో ప్రవేశించాడు. అలా ప్రవేశిస్తున్న లక్ష్మణునితో విభీషణుడు "లక్ష్మణా, దూరంగా కనిపిస్తున్న ఆ రాక్షస సైన్యాన్ని చూశావా? దాన్ని నువ్వు చెదరగొట్టాలి. మన వానరులు కూడా కొండశిలలతో, వృక్షాలతో యుద్ధం చేస్తారు. నువ్వు నీ బాణాలతో ఆ సైన్యాన్ని చెదరగొట్టు. ఆ సైన్యం తొలగిపోతే గాని ఇంద్రజిత్తు నీకు కనిపించడు. వాడి యాగము పూర్తి కాకముందే వాణ్ణి నువ్వు చంపాలి" అని చెప్పాడు.

లక్ష్మణుడు సరే అని ఆ రాక్షసుల మధ్యలో ప్రవేశించి బాణాలు వెయ్యసాగాడు. వానరులంతా రాక్షసుల మీద పడ్డారు. ఇరు వర్గాల వారికీ ఘోరమైన యుద్ధం మొదలైంది. వానరులు ప్రాణాలకి తెగించి రాక్షసుల్ని వృక్షాలతో బండశిలలతో బాదసాగారు. రాక్షస సేన చెల్లా చెదరైపోతోంది. పరిస్థితి విషమిస్తోందని, ఇంద్రజిత్తు గ్రహించాడు. హోమం పూర్తి కాకుండానే లేచి రథం ఎక్కాడు. కోపంతో ఎఱ్ఱబారిన కన్నులతో, భయంకరమైన రూపంతో బయల్దేరాడు. అతడ్ని చూడగానే రాక్షసులకి చెప్పలేని ధైర్యం వచ్చింది. వాళ్ళు లక్ష్మణునితో యుద్ధానికి తలబడ్డారు.

హనుమంతుడు పర్వతాకారుడై ఒక మహావృక్షం పెకిలించి విజృంభించాడు. వేలకొద్దీ రాక్షసులుహనుమంతునిపై పడ్డారు. కత్తులు, శూలాలు మొదలైన రకరకాల ఆయుధాలతో చుట్టుముట్టారు. హనుమంతుడు కూడా ధైర్యంతో వారిని ఎదుర్కొన్నాడు. ఎనలేని ధైర్యంతో విజృంభిస్తున్న మారుతిని చూసి, ఇంద్రజిత్తు తన రథాన్ని అటు పోనిమ్మన్నాడు. హనుమంతునిపై కత్తులు, పట్టిసాలు విసరసాగాడు.

హనుమంతుడు వాటిని లెక్కచేయ్యకుండా "దుర్మతీ చేవవుంటే నాతో ద్వంద్వ యుద్ధం చెయ్యి. నిన్ను ప్రాణాలతో వెళ్ళనివ్వను. నువ్వు కనుక నిజంగా ఉత్తముడవైన రాక్షసుడవైతే నాతో యుద్ధం చెయ్యి" అంటూండగా ఇంద్రజిత్తు హనుమంతునిపై విల్లు ఎక్కుపెట్టి చంపటానికి సిద్ధపడ్డాడు. అది చూసి విభీషణుడు లక్ష్మణునితో

"అదిగో లక్ష్మణా అటు చూడు ఇంద్రజిత్తు హనుమంతుని చంపబోతున్నాడు. నువ్వు వెంటనే వారిని సంహరించు" అన్నాడు. విభీషణుని వెంట వడివడిగా లక్ష్మణుడు, ఇంద్రజిత్తు యాగం చేస్తున్న వనంలోకి వెళ్ళాడు. అక్కడ హోమ గుండం, అగ్ని ప్రజ్వరిల్లుతూ వుంది. ఒక పెద్ద మఱ్ఱిచెట్టు, ఊడలు దిగి మహా వృక్షమై

కారుమేఘంలా భయంకరంగా వుంది. విభీషణుడు ఆ మఱ్ఱిచెట్టుని లక్ష్మణునికి చూపించి, లక్ష్మణా ఈ వృక్షం మొదట్లోనే ఇంద్రజిత్తు భూతబలి ఇస్తాడు. బలి ప్రదానం పూర్తయ్యాక, అధిక శక్తి సంపన్నుడై యుద్ధానికి బయల్దేరుతాడు. ఇంద్రజిత్తు ఆ మఱ్ఱి చెట్టుని చేరకముందే నువ్వు అతడ్ని హతమార్చాలి" అని విభీషణుడు లక్ష్మణుడికి కీలకమైన రహస్యం చెప్పాడు. అది విన్న లక్ష్మణుడు రెట్టించిన ఉత్సాహంతో చిత్ర విచిత్రంగా ధనుష్టంకారం చేశాడు. కవచం ధరించి అగ్నిలా వెలిగిపోతున్న ఇంద్రజిత్తుని చూశాడు. యుద్ధానికి రమ్మని ఆహ్వానించాడు.

అయితే లక్ష్మణుని పక్కన వున్న విభీషణుని ఇంద్రజిత్తు చూసి, పరిస్థితి అవగాహన చేసుకున్నాడు. కోపంపట్టలేక "చిన్నాయనా ఇదంతా నీ పన్నాగమన్న మాట. నువ్వు లంకలో పుట్టావు. అక్కడే పెరిగావు. సాక్షాత్తు నా తండ్రికి సోదరుడివి. అయినా ఇంతటి ద్రోహానికి పాల్పడ్డావు. జాతినైన నా మీద ప్రేమ లేదు సరికదా. జాతి గౌరవమైనా పాటించలేదు. అన్నదమ్ముల అనుబంధాన్ని విడిచిపెట్టావు. దుర్బుద్ధీ, ధర్మం లేదు. నీ బంధువులందర్నీ వదిలిపెట్టి పరాయి వారికి సేవకుడవయ్యావు. ఎప్పటికైనా శత్రువు శత్రువే. వారి అవసరం తీరాక నీగతి ఏమవుతుందో ఆలోచించావా? నిశ్చయంగా వారి చేతిలో నీ చావు ఖాయం.

నువ్వెంత దయమాలిన వాడివి! ఎంత క్రూరమైన పనికి పాల్పడ్డావు!" అంటూ ఇంద్రజిత్తు పినతండ్రిని నోటి కొచ్చినట్టల్లా దూషించటం మొదలుపెట్టాడు. అప్పుడు విభీషణుడు,

"చాలు చాలు ఇంక పెద్ద మాటలు కట్టిపెట్టు. దుష్టుడా. నేనురాక్షస కులంలో పుట్టినా మీలా క్రూరంగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. నీ తండ్రి, నన్ను సొంత తమ్ముణ్ణని కూడా ఆలోచించకుండా దేశం నించి బహిష్కరించాడు. ధర్మభ్రష్టుడై పాపపుటాలోచనలతో వుండేవాడు. విషసర్పం లాంటివాడు. పరదారాపహరణ చేసి, పరుల ధనము నాశించి, హింసాప్రవృత్తి కల్గిన ప్రభువునైనా బంధువునైనా వదిలిపెట్టమని శాస్త్రం చెప్తోంది. అన్నగారే కదా అని పట్టుకు పాకులాడిలే నాశనం తప్పదు. అందుకే నీ తండ్రిని వదిలి వచ్చేశాను. ఇంక నీ లంకానగరం గాని, నువ్వు గాని, నీ తండ్రిగాని ఎన్నాళ్ళో వుండరు. నువ్వు చాలా గొప్పవాడి ననుకుంటున్నావేమో. కాని నువ్వింకా వయస్సులో చాలా చిన్నవాడివి. నువ్వెంత ప్రయాసపడ్డా ఆ మఱ్ఱిచెట్టుని తాకలేవు. రామలక్ష్మణుల నెదిరించి జీవించి వుండలేవు. లక్ష్మణునితో యుద్ధం చేసి నీ ప్రతిభ చూపించు" అన్నాడు.

విభీషణుడి మాటలకి ఇంద్రజిత్తుకి ఒంటికి కారం రాసుకున్నట్లైంది. కత్తిపట్టుకుని ప్రళయకాలరుద్రుడిలా విజృంభించాడు. హనుమంతుని భుజాలపై

కూర్చున్న లక్ష్మణుడ్ని చూశాడు. పళ్ళు పట పట కొరుకుతూ, మీరంతా ఇప్పుడే నా పరాక్రమం చూద్దురు గాని, ఇది వరకు రాత్రి పూట నాతో యుద్ధం చేసినప్పుడు వజ్రాల్లాంటి నా బాణాలతో రామలక్ష్మనులతో సహా వానర సేనంతా తెలివితప్పి పడిపోయారే. అప్పుడే మర్చిపోయారా? పాముతో చెలగాటమాడినట్లు మళ్ళీ నాతో యుద్ధానికి వచ్చారా?" అంటూ ఉరుముఉరిమి నట్లు గర్జించాడు. లక్ష్మణుడా గర్జనలు విని ఏ మాత్రం లెక్కచెయ్యకుండా, కోపంతో

"రాక్షసాధమా చాలా గొప్పలు చెప్పుకుంటున్నావే. చెయ్యదల్చుకున్నది చేతలతో చేసి చూపించు. ఉట్టి మాటలెందుకు? ప్రగల్భాలు చాలు ఎదుటపడి వుంటే తెలిసేది నీ పరాక్రమమేపాటిదో దొంగచాటు యుద్ధం వీరుల లక్షణం కాదు. ఇదిగో నీ బాణాలకి రొమ్ము ఒడ్డినుంచున్నాను. రా, నీ పరాక్రమం చూపించు" అన్నాడు.

వెంటనే ఇంద్రజిత్తు వాడియైన బాణాలతో లక్ష్మణుని కొట్టాడు. లక్ష్మణునికి ఆ బాణం వల్ల పెద్ద గాయమై రక్తం కారసాగింది. అది చూసి ఇంద్రజిత్తు వికటంగా నవ్వాడు.

"లక్ష్మణా చూశావా నా బాణాల వాడి? ఇప్పుడే నిన్ను కడతేరుస్తాను. క్షత్రియులమని చెప్పుకునే మీ సోదరుల్లిద్దరూ అనార్యులు. నువ్వు విల్లువిరిగి, తల తెగి ఇప్పుడే నేల మీద కూలిపోతావు కాచుకో" అన్నాడు. ఆ విధంగా పరుషంగా మాట్లాడుతున్న ఇంద్రజిత్తుని చూసి లక్ష్మణుడు "దుర్బుద్ధీ నీవాచాలత్వ కట్టిపెట్టు. నాగురించి నీకు తెలియదు. ఇప్పుడే తెలుసుకుంటావు" అంటూ ఐదు బాణాలు వింటిలో సంధించి నారిని చెవి వరకు లాగి ఇంద్రజిత్తు గుండెలపై గురిచూసి వదిలాడు. ఇంద్రజిత్తు కూడా మూడు బాణాలు సంధించి లక్ష్మణుని మీదికి వేశాడు. ఇలా ఒకరికొకరు తీసిపోకుండా మదించిన ఏనుగుల్లా కొదమ సింహాల్లా తీవ్రంగా యుద్ధం చేస్తున్నారు. కాని ఇంద్రజిత్తుకి ధైర్యం సడలిపోతోంది. లక్ష్మణుని ధాటికి ఆగలేకపోతున్నాడు.

విభీషణుడు అది కనిపెట్టాడు. లక్ష్మణా చూడు. ఇంద్రజిత్తు ముఖం ఎలా వివర్ణమైపోతోందో. నువ్వు తొందర తొందరగా బాణాలు వెయ్యి. అతడు ఓడిపోవడం ఖాయం" అంటూ లక్ష్మణునికి ఉత్సాహం కలిగిస్తున్నాడు. లక్ష్మణుడు వెంటవెంటనే మహావిషపూరితమైన అగ్ని జ్వాలల లాంటి బాణాలు వేశాడు.

పిడుగుల్లాంటి ఆ బాణాలకి, లక్ష్మణుని ధాటికి తాళలేక ఒక్క క్షణం సేపు తెలివి తప్పాడు. కాని మరుక్షణంలోనే తెలివి తెచ్చుకుని ఎదురుగా నిలిచి వున్న

లక్ష్మణుని పరిశీలించి చూశాడు. పౌరుషంతో ఇలా అన్నాడు.

"లక్ష్మణా మొన్నటి పర్యాయం యుద్ధం చేసినప్పుడు మీ సోదరుల్దిరూ నా చేత బంధించబడిన సంగతి గుర్తు లేదా? ఇద్దరూ తెలివితప్పి నేల మీద పడ్డ సంగతి మరిచావా? మళ్ళీ అలాగే పడాలని ఉబలాటంగా వుందా?" అంటూ వికటాట్టహాసంతో ఏడు బాణాలు లక్ష్మణుని మీదా పది బాణాలు హనుమంతుని మీదా, ఇంకో పది బాణాలు విభీషణుని మీదా వేశాడు.

లక్ష్మణుడేమాత్రం జంకకుండా తన అమోఘమైన బాణాలతో ఇంద్రజిత్తుని ముంచెత్తాడు. ఆ బాణాలతో ఇంద్రజిత్తు కవచం ధ్వంసమైంది. ఒళ్ళంతా గాయాలై రక్తం ధారలుకట్టింది. ఇంద్రజిత్తు కోపంతో ఒకేసారి వెయ్యి బాణాలు లక్ష్మణుని మీద వేశాడు. లక్ష్మణుని కవచం కూడా ఊడిపడింది. ఇద్దరూ రక్తాలు కారుతూ భీకరంగా మారిపోయారు. అలాగే నిలబడి లాఘవంగా ఒకరిపై ఇంకొకరు బాణాలు వేసుకుంటున్నారు. విభీషణుడు లక్ష్మణుడి వెనకే వుండి ఉత్సాహం కలిగిస్తున్నాడు. కొంతసేపు వరకూ అలాగే వుండి ఆ తర్వాత తను కూడా యుద్ధం మొదలు పెట్టాడు. అతడి అనుచరులు నల్గురు కూడా రాక్షసులపై బాణాలు వెయ్యసాగారు.

విభీషణుడు వానరుల వంక చూస్తూ "వానర వీరులారా ఇప్పుడు రావణునికి ఉన్న ఆధారం ఇంద్రజిత్తు ఒక్కడే మిగిలిన బలగమంతా నశించింది. ఇప్పుడు మీరు ఊరుకుంటే లాభం లేదు. వీడ్ని హతమార్చారంటే, రావణుని గెల్చినట్టే. వీడు నా అన్నకొడుకు కనక వీడ్ని నేను చంపకూడదు. వీడి సంగతి లక్ష్మణుడు చూసుకుంటాడు. మీరు మిగిలిన రాక్షసుల పని పట్టండి" అని గట్టిగా అరిచాడు. ఆ అరుపులు విని వానరులంతా విజృంభించారు.

వానరులు కోరలతో, పళ్ళతో, రక్కి, పీకి గాయాలు చేస్తుంటే రాక్షసులు బాణములు, పరశువులు, పట్టిసాలు, తోమరాలు, మొదలైన ఆయుధాలతో కొట్టసాగారు. ఇంద్రజిత్తు పినతండ్రి యుద్ధంలోకి దిగటం చూశాడు. కోపం పట్టలేక లక్ష్మణుని మీదికి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ హోరా హోరీ యుద్ధం చెయ్యసాగారు. ఆకాశమంతా బాణాలతో నిండి, అన్ని దిక్కులా చీకటి ఆవరించింది. లక్ష్మణుడు ఇంద్రజిత్తు రథ సారధి శిరస్సు ఖండించేశాడు. అప్పుడు ఇంద్రజిత్తు తన రథం తానే నడుపుకుంటూ యుద్ధం చెయ్యసాగాడు. చూసిన వారంతా ఆశ్చర్యపోయారు.

నలుగురు వానర వీరులు ఇంద్రజిత్తు రథం గుఱ్ఱాల మీద పడి చంపేశారు. రథం విరిచి ముక్కలు చేశారు. ఇంద్రజిత్తు నేలపై దూకి యుద్ధం చెయ్యసాగాడు.

లక్ష్మణుడు, ఇంద్రజిత్తు ఎవరికి వారే గెలవాలని పట్టుదలగా యుద్ధం చేస్తున్నారు. కాని ఇంద్రజిత్తు భూమిపై వుండి యుద్ధం చెయ్యడం చాలా కష్టంగా వుంది. అందుకని తన సైన్యాన్ని అప్రమత్తంగా వుండమని హెచ్చరించి, అతడు వేరే రథం తెచ్చుకుందుకు లంక లోపలికి వెళ్ళాడు. కనురెప్పపాటులో ఇంకో బంగారు రథం ఎక్కి లెఖ్ఖలేనన్ని ఆయుధాలతో తిరిగి వచ్చాడు. విభీషణుడు ఇది చూశాడు.

లక్ష్మణుడు, విభీషణుడు, ఇద్దరూ ఇంద్రజిత్తు చాతుర్యానికి ఆశ్చర్యపోయారు. ఇంద్రజిత్తు రథంలో వుండి వేలకొద్దీ బాణాలతో వానరుల్ని చంపసాగాడు. ఆ దెబ్బలికి తాళలేక వానరులు లక్ష్మణుని దగ్గరకి పరిగెత్తారు. లక్ష్మణుడు ఆవేశంతో వచ్చి ఇంద్రజిత్తు చేతిలోని విల్లు పడగొట్టాడు. వెంటనే ఐదుబాణాలు తీసి సూటిగా ఇంద్రజిత్తు గుండెల్లో దిగేట్టు వేశాడు. కాని ఇంద్రజిత్తు చలించకుండా ఇంకో విల్లు పట్టుకునుంచున్నాడు. మళ్ళీ పరస్పరం బాణ వర్షం కురిపించుకున్నారు.

ఈరథ సారధిని కూడా లక్ష్మణుడు నేల కూల్చాడు. అయితే సారధి లేకుండానే గుఱ్ఱాలు ఎటు కావలిస్తే అటువెళ్ళటం చూసి లక్ష్మణుడు ఆశ్చర్యపోయాడు. ఈ సారి గుఱ్ఱాల్ని బాణాలతో కొట్టాడు. అయినా పట్టు విడవకుండా ఇంద్రజిత్తు లక్ష్మణునిపై బాణాలు వేస్తూనే వున్నాడు. అది చూసి విభీసణుడు తన చేతిలోని గదతో ఇంద్రజిత్తు రథం గుఱ్ఱాల్ని చావ మొదాడు. సారధీ, గుఱ్ఱాలు కూడా చనిపోయే సరికి, ఒక తీవ్రమైన శక్తిని తీసి పిన తండ్రిమీద ప్రయోగించాడు ఇంద్రజిత్తు. లక్ష్మణుడు తన బాణాలతో దానిని పది ముక్కలుగా చేశాడు. అప్పుడు విభీషణుడు ఐదుబాణాలతో ఇంద్రజిత్తుని కొట్టాడు. అవి ఇంద్రజిత్తు శరీరాన్ని తీవ్రంగా గాయపరిచాయి. ఇంద్రజిత్తు కోపం తారాస్థాయికి చేరింది. యముడ్ని మెప్పించి సంపాదించిన ఒక మహత్తరమైన అస్త్రం సంధించాడు. అది గ్రహించి, లక్ష్మణుడు, కుబేరుడు స్వయంగా ఇచ్చిన బాణం తీశాడు. ఇద్దరూ ఒకేసారి సంధించి వదిలారు. అవి రెండూ ఒకదానొక్కటి ఢీకొని, క్రౌంచపక్షుల్లా శబ్దం చేస్తూ నేలకూలాయి. అవి నేల మీద పడ్తున్నప్పుడు నిప్పు రవ్వలు చెలరేగాయి. తమ బాణాలు నిష్ప్రయోజనమైనందుకు ఇద్దరూ చింత పడ్డారు. వెంటనే లక్ష్మణుడు వారుణాస్త్రం సంధించాడు. ఇంద్రజిత్తు రౌద్రాస్త్రం సంధించాడు. అది వారుణాస్త్రాన్ని నిర్వీర్యం చేసింది.

అప్పుడు ఇంద్రజిత్తు ఆగ్నేయాస్త్రం సంధించారు. లక్ష్మణుడు మహేశ్వరాస్త్రంతో దానిని వారించాడు. ఇద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. ఆకాశంలో పితృదేవతలు, ఋషులు, దేవతలు, గంధర్వులు, గరుడులు, ఉరగములు, అందరూ ఇంద్రునితో సహా వచ్చి నిలబడి చాలా ఉత్కంఠతో చూస్తున్నారు. వారి

మహిమాన్వితమైన చూపులతో లక్ష్మణుని కాపాడుతున్నారు.

అప్పుడు లక్ష్మణుడు దేవాసుర యుద్ధంతో దానవులపై ఇంద్రుడు ప్రయోగించి విజయము సాధించిన దివ్యాస్త్రము తీసి మనసారా దేముని స్మరించి

ధర్మాత్మాసత్యసంధశ్చరామో దాశరథిర్యది,
పౌరుషేచప్రతి ద్వన్ద్వశ్శరైనం జహిరావణిమ్

అని ప్రార్థించాడు. పై శ్లోకం పుస్తకంలో చూపి మార్చాలి.

ధశరధాత్మజుడైన రాముడు, ధర్మాత్ముడు, సత్యసంధుడు, పౌరుషంలో ఎదురులేని వాడు. అయినట్లైతే ఓ బాణమా నువ్వు రావణపుత్రుని చంపు. అని ఆశ్లోకానికి అర్ధం. ఆ విధంగా అంటూ బాణము చెవివరకు లాగి ఇంద్రజిత్తుపై వదిలాడు.

ఆ బాణం తగలగానే శిరస్త్రాణముతో, కుండలములతో, ధగధగా మెరుస్తున్న ఇంద్రజిత్తు శిరస్సు శరీరము నుంచి వేరుపడి, నేలమీద పడి పోయింది. ఇంద్రజిత్తు నేలకూలే సరికి వానరుల ఆనందానికి అంతులేకుండా పోయింది వారంతా సంతోషంతో కేకలేస్తూ గంతులెయ్యసాగారు. రాక్షసుల్ని తరిమి కొట్టారు. రాక్షసులంతా భయంతో లంకలోకి పారిపోయారు. కళావిహీనంగా ఇంద్రజిత్తు నేలపై పడివున్నాడు. యుద్ధ భూమిలో ఒక్క రాక్షసుడు కూడా కనిపించడం లేదు. ఇంద్రజిత్తు చనిపోయినందుకు ఇంద్రుడు, దేవతలు, ఋషులు హర్షం ప్రకటించారు. దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలు గంధర్వులు ఆడిపాడారు. పూల వాన కురిసింది. అందరూ లక్ష్మణుని అభినందించారు. వానరులు ఆనందంలో కిలకిలా రావాలు చేశారు.

లక్ష్మణుని శరీరమంతా గాయాలతో రక్తసిక్తమై వుంది. అయినా ఇంద్రజిత్తుని చంపగలిగానన్న ఆనందంతో ఆ బాధనంతా మర్చిపోయాడు. అక్కడ ఆ పని అయిపోగానే, లక్ష్మణుడు, హనుమంతుడు, జాంబవంతుడు, విభీషణుడు వానర సేనతో, రాముడు సుగ్రీవుడు వున్న ప్రదేశానికి వెళ్ళారు. రాముడికి జరిగిన సంగతంతా పూసగుచ్చినట్లు వర్ణించి చెప్తూ లక్ష్మణుడు అన్నగారి పాదాలకి అభివందనం చేశాడు. విభీషణుడు గర్వంగా "మన లక్ష్మణుడు, ఇంద్రజిత్తుని సంహరించాడని" చెప్పాడు. ఆ మాటలు విని రాముడెంతో పొంగిపోయాడు.

"లక్ష్మణా, చాలా మంచి పనిచేశావయ్యా. నాకు చాలా సంతోషంగా వుంది. ఇంద్రజిత్తు చనిపోయాడు. కనుక, ఇంకా రావణుని జయించటం చాలా తేలిక"

అంటూ తమ్ముడ్ని కౌగలించుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని నుదురుమీద ముద్దు పెట్టుకున్నాడు. లక్ష్మణుడు అన్నగారి చర్యలకి సిగ్గుపడ్డాడు. లక్ష్మణుడి శరీరమంతా బాణపు ములుకులతో నిండివుంది. లక్ష్మణుడు బాధతో మూలుగుతూ వుంటే, రామునికి చెప్పరాని దుఃఖం కలిగింది. తమ్ముని ఒళ్ళంతా ప్రేమతో నిమురుతూ "సౌమిత్రీ ఎవ్వరూ చెయ్యలేని పనిచేశావు. ఇంతటి ఘనకార్యం నువ్వుకనుక చేశావు. ఇంక రావణుని శక్తి అంతా పోయింది. ఇంక మనకి విజయం తథ్యం. విభీషణుడు హనుమంతుడు కూడా మన కోసం చాలా కష్టపడ్డారు. మూడు రాత్రులు మూడు పగళ్ళు నీకు అండగా నిల్చి ఇంద్రజిత్తుని ఎలాగోలా పడగొట్టగలిగారు.

ఇప్పుడింక పుత్రశోకంతో కుమిలిపోతూ, ఆవేశంతో రగిలిపోతూ, వున్న సేననంతా కూడగట్టుకుని, మనపైకి యుద్ధానికి వస్తాడు రావణుడు. ఇంక అతడ్ని చంపాలి. లక్ష్మణా నాకు అండగా నిల్చి నా మార్గం సుగమం చేశావు" అంటూ, వానర ప్రముఖుల్లో వున్న సుషేణుడు అనే వైద్యున్ని పిల్చి, "ఆర్యా లక్ష్మణుని శరీరం నించి ములుకుల్ని తొలగించండి. ఇంకా చాలా మంది వానరులు గాయపడి వున్నారు. వారందరికీ కూడా ఉపశమించేలా వైద్యం చెయ్యండి" అని కోరాడు.

రాముడలా కోరగానే సుషేణుడు కొన్ని ఆకులు తెచ్చి వాటి పసరు బాధపడుతున్న వారి ముక్కులలో పిండాడు. వెంటనే శల్యాలన్నీ వాటంతట అవే వూడిపోయాయి. గాయాలు నయమై బాధ ఉపశమించింది. విభీషణాదులకి కూడా సుషేణుడు వైద్యం చేశాడు. లక్ష్మణుడు క్షణంలో గాయాలు మాని బాధ తగ్గి లేచి కూర్చున్నాడు. రాముడు తమ్ముడు స్వస్థుడవడం చూసి చాలా సంతోషించాడు. వారంతా జరిగిన మహత్కార్యం తల్చుకుని మళ్ళీ మళ్ళీ ఆనందించారు.

ఇంద్రజిత్తు చనిపోయిన విషయం దూతల ద్వారా రావణుడికి తెలిసింది.

"మహారాజా, లక్ష్మణుడు నీ సోదరుడైన విభీషణుని సహాయంతో ఇంద్రజిత్తుని యుద్ధంలో సంహరించాడు. అతడి మరణం మేమంతా కళ్ళారా చూశాము" అని వారు చెప్పగానే "హా కుమారా అంటూ రావణుడు పుత్రశోకంతో మూర్ఛపోయాడు. కొంతసేపటికి తెలివి తెచ్చుకుని, దీనాతి దీనంగా "కుమారా నువ్వు మహావీరుడివి. మహారథుడివి. ఇంద్రుని జయించిన వాడివి. ఇప్పుడిలా లక్ష్మణుని చేతిలో మరణించావా! ఎంత విచిత్రం!నువ్వు బాణ ప్రయోగం చేస్తే యముడైనా నిలబడలేడే, పర్వతాలను కూడా ఛేదించగల నీ బాణం లక్ష్మణుని

ఏమీ చెయ్యలేకపోయిందా? ఈవిషయంలో నిజంగా లక్ష్మణుణ్ణి మెచ్చుకోవాలి. పుట్టిన వారికి చావు తప్పదు. కాని యుద్ధంలో మరణించావు. కనక, నువ్వు వీర స్వర్గానికి వెళ్తావు.

ఇప్పుడింక దేవతలు, ఋషులు, గంధర్వులు, హాయిగా ఊపిరి పీల్చుకుంటారు. నువ్వులేని ఈ లోకంలో నాకు శూన్యంగా కనిపిస్తోంది. కుమారా నన్ను ఈ లంకా రాజ్యాన్ని సంరక్షించవలసిన నువ్వు, నీ తల్లినీ, నీ భార్యనీ, నన్నూ ఈ రాజ్యాన్ని వదిలి ఎక్కడికెళ్ళావు నాయనా! నాకు తలకొరివి పెట్టవలసిన నువ్వు, నా చేతే ఆ పని చేయించదలిచావా? రామలక్ష్మణులు, సుగ్రీవుడు, జీవించే వున్నారే, నువ్వు మాత్రమే ఎక్కడికెళ్ళావు తండ్రి?" అంటూ చాలా సేపు అతి ఘోరంగా దీనాతి దీనంగా ఏడ్చాడు. పెద్ద పెట్టున గుండెలు బాదుకుని ఏడ్చి ఏడ్చి చివరికి రామలక్ష్మణుల మీది క్రోధంతో అగ్గిలా భగ్గుమన్నాడు. వెంటనే వెళ్ళి సీతని చంపేయ్యాలనుకున్నాడు. ఎఱ్ఱని అగ్నిగోళాల్లాంటి కళ్ళలో ధారగా నీరు కారుతుండగా, పళ్ళు పట పట కొరుకుతూ, బయల్దేరాడు. దారిలో రాక్షసులంతా బిక్కుబిక్కుమంటూ నక్కి నక్కి చూస్తున్నారు. రావణుడువారికి ధైర్యం చెప్తూ

"నేను ఎన్నో వేల సంవత్సరాలు ఎవ్వరూ చెయ్యలేని విధంగా తపస్సు చేశాను. బ్రహ్మని మెప్పించి దేవదానవుల వల్ల మరణం లేకుండా వరం పొందాను. బ్రహ్మ నాకు అమోఘమైన కవచం ఇచ్చాడు. ఆ కవచం ధరించి నేను దేవాసుర యుద్ధంలో విజయం సాధించాను. ఇప్పుడు కూడా నేను బ్రహ్మ స్వయంగా ఇచ్చిన కవచం. ధనుర్బాణాలు ధరించి ఆ రామలక్ష్మణుల్ని సంహరిస్తాను. మీరు నిర్భయంగా వుండండి" అని వారందరికీ ధైర్యం చెప్పి పుత్రశోకంతో రగిలిపోతూ సీతని చంపెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

కోపంతో జేగురించిన కళ్ళతో "నా కుమారుడైన ఇంద్రజిత్తు వానరుల ముందుమాయా సీతని వధించాడు. కాని ఇప్పుడు నేను అదేనిజం చేస్తాను. నీచుడైన, క్షత్రియాధముడైన ఆ రాముణ్ణే స్మరిస్తూ, నన్ను తిరస్కరించిన ఆమె గతి ఇప్పుడేమవుతుందో చూద్దురు గాని" అనుకుని, కత్తిని చేతిలోకి తీసికుని, వేగంగా నడిచి వెళ్తుంటే, రావణుడి, భార్యలు, మంత్రులు కూడా వెళ్ళారు.

రావణుడు తిన్నగా సీత వుండే చోటుకి వెళ్ళాడు. అతడి మంత్రులంతా అతణ్ని వారిస్తూ, సీతని చంపవద్దని ప్రార్థించారు. సీత చుట్టు కాపలా కాస్తున్న రాక్షస స్త్రీలు, భీకరాకారంతో కదలి వస్తున్న రావణుని చూసి భయంతో పక్కకి తప్పుకున్నారు.

సీత దుఃఖం పట్టలేక, భయంతో రక్షించండి. రావణుడునన్ను చంపటానికి వస్తున్నాడు. అయ్యో భర్త వుండీ దిక్కులేనిదాన్నయ్యానే" అంటూ సీత గోలుగోలున ఏడ్వసాగింది. ఆవిధంగా హృదయవిదారకంగా ఏడుస్తున్న సీతని చూసి, సుపార్శ్వుడు అనేమంత్రి రావణుని వారిస్తూ,

"ప్రభూ సాక్షాత్తు కుబేరుడి తమ్ముడివైన నువ్వు కోపంలో ధర్మం మరచి సీతని చంపటానికి సిద్ధపడ్డావా! నీబోటి వారికిది తగదు. వేద విద్యని అపోశన పట్టిన వాడివి. ధర్మనిష్ఠగల వాడివి. స్త్రీని చంపాలని ఎలా అనుకున్నావు? ఇది చాలా అనుచితము. ఇవాల్టికి యుద్ధం ప్రారంభమై పదమూడు రోజులైంది. రేపు అమావాస్య. కనక రేపు విజయం నీదే. శూరుడివై రథంలో యుద్ధానికి వెళ్ళి రాముడ్ని చంపి, సీతని చేజిక్కించుకో" అంటూ రావణునికి, హితబోధ చేశాడు.

రావణుడికి సీతమీది వ్యామోహం చావలేదు. కనుక ఈ ఆలోచన నచ్చింది. సరే అంటూ తిరిగి తన భవనానికి వెళ్ళిపోయాడు. మంత్రులను, సేనానాయకుల్ని పిల్చి సభ తీర్చాడు. వారితో ఇలా అన్నాడు.

"మీరంతా మీమీ ఆయుధాలతో యుద్ధానికి సిద్ధం కండి. రాముడ్ని నలువైపులా చుట్టముట్టి చంపాలి. మీరంతా మీమీ పరాక్రమాలతో చంపగలిగితే సరే. లేకపోతే నేనే చంపుతాను" అని ఆజ్ఞాపించాడు.

వెంటనే వారంతా వారి వారి బలగాలతో బయల్దేరారు. నానా విధాలైన ఆయుధాలతో వారి మీద విరుచుకుపడ్డారు. వానరసేనని చుట్టుముట్టి ఆయుధాలతో వారి మీదికి లంఘించారు. వానరులు మహావృక్షాలతో పర్వత శిఖరాలతో వారినెదుర్కొన్నారు.

సూర్యోదయం కాగానే యుద్ధం మొదలైంది. పెద్ద ధూళి లేచి, రణరంగమంతా, నిండిపోయింది. వానరులు ఎగిరి ఎగిరి రాక్షసుల ధ్వజాల్ని, గుఱ్ఱాల్ని నాశనం చెయ్యసాగారు. రక్తం ఏరులై పారింది. వానరులు తమ వాడియైన గోళ్ళతో దంతాలతో రాక్షసుల చెవులు, ముక్కులు కొరికి జుట్టు ఊడబీక సాగారు. రాక్షసులు కోపంతో గదలు, ప్రాసలు, ఖడ్గాలు చేతబట్టి వానరుల్ని చంపసాగారు. వారినెదిరించేందుకు శక్తి చాలక వానరులు రాముడ్ని శరణన్నారు. వెంటనే రాముడు మహాపరాక్రమంతో రణరంగంలోకి వచ్చాడు. రాక్షస సైన్యం మీద బాణ వర్షం కురిపించాడు. ఆ బాణపరంపరకి రాక్షసులు తట్టుకోలేకపోయారు. వారంతా బొమ్మల్లా చూస్తూ వుండిపోయారు. అప్పుడు రాముడు వారిపై సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు. దాని ప్రభావం చేత వానరులంతా రాక్షసులకి

రామునిలాగే కనిపించారు. ప్రతి వానరుడ్ని రాక్షసులు రాముడని భావించి, వాని మీద పడసాగారు.

రాముడు మాత్రం ధనస్సు చక్రంలా వంచి ఎడతెరిపి లేకుండా బాణాలు రాక్షసుల మీద గుప్పించసాగాడు. కోటాను కోట్ల రాక్షసుల్ని చీల్చి చెండాడసాగాడు. సూర్యోదయంతో ప్రారంభమైన యుద్ధంలో ఎనిమిదో ఝామకి రాక్షస సైన్యమంతా నశించిపోయింది. గుర్రాలు పోగొట్టున్న వారు, రథాలు విరగిన వారు, ధ్వజములు కూలిన వారు, చావగా మిగిలిన సైనికులు లంకలోకి పరిగెట్టారు. యుద్ధ బూమి అంతా రాక్షసుల, జంతువుల, కళేబరాలతో నిండిపోయింది. ఆకాశంలోంచి చూస్తున్న దేవతలు ఋషులు బాగుబాగు అని రాముణ్ణి ప్రశంసించారు.

రాముడు తన వెంటవున్న సుగ్రీవ, హనుమ, విభీషణాదులతో ఇలా అన్నాడు. "ఈ బలము నాకు, రుద్రునికి మాత్రమే ఉంది. ఇంతటి శక్తి వేరొకరికి లేదు" అని. అంతటి యుద్ధం చేసినా రాముడెంత మాత్రం అలసిపోలేదు. రాక్షస సేనలుచాలా వరకు హతమై పోయిన సంగతి లంకలో అందరికీ తెలిసి వారంతా అట్టుడికినట్లు వుడికి పోయారు. రాముని యొక్క బాణ ప్రయోగం గురించి విని వారంతా సంభ్రమంలో మునిగిపోయారు. రాక్షస కాంతలు భోరుమంటూ ఏడ్చారు. కొడుకుల్ని, కోల్పోయిన తల్లులు, భర్తల్ని కోల్పోయిన, భార్యలు, దుఃఖంతో కంటికి మింటికీ ఏకధారగా ఏడుస్తు శూర్పణఖని తిట్టి పోశారు. "ఆ ముసల్ది బానంత పొట్ట వేసుకుని, రాముని వరించటమేమిటి? అతి సుకుమారుడు. అందగాడు, మన్మధుని తలదన్నే సుందరాకారుడు, అసలు దీని కంట ఎందుకుపడాలి? అంతా మనతలరాతే. దాని మూలంగానే కదా రావణుడు సీతని తెచ్చి తన చావు తాను కొని తెచ్చుకున్నాడు. విభీషణుడు రావణుని కెంతగా బోధించినాడే. విన్నాడా? అతడు చెప్పినట్లు విని, సీతమ్మని రామునికిచ్చేసి వుంటే ఇంత అనర్థం జరిగేది కాదుకదా.

రావణుడెంత మూర్ఖుడు! కుంభకర్ణుడు, అతికాయుడు లాంటి మహా వీరులు చనిపోయినా అతడికి జ్ఞానోదయం కాలేదు కదా. ఇంద్రజిత్తు లాంటి పరాక్రమవంతుడైన కొడుకుని పోగొట్టుకున్నా, ఇంకా ఏదో సాధించాలని తపన. వీని మూలంగా ఇప్పుడు మనమంతా అనాధలమై పోయాము కదా అని గుండెలు బాదుకుని ఏడ్వసాగారు వాళ్ళంతా. ఆ ఏడ్పులన్నీ రావణుని చెవిని పడ్డాయి. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చాడు. ఒక్కక్షణం ఆలోచించాడు. కాలాగ్నిలా లేచాడు. క్రోధంగా వారి వంక చూస్తూ మహోదర, మహాపార్శ్వ, విరూపాక్షులనే వార్ని పిలిచాడు. సేనని సమాయత్తం చెయ్యమన్నాడు. ఒక్కసారి వికటాట్టహాసం చేశాడు"

పదండి. ఇప్పుడే ఆ రామలక్ష్మణుల్ని యమపురికి పంపిస్తాను" అన్నాడు. నేను ముందు వెళ్తాను. మీరునా వెనక రండి" అని ఆజ్ఞాపించాడు.

వెంటనే ఒక్క ముహూర్తంలో రాక్షస సేనలు భయంకరంగా గర్జిస్తూ రకరకాల ఆయుధాలు ధరించి బయల్దేరారు. రావణుడు భూమి దద్దరిల్లేలా రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరాడు. రామలక్ష్మణులు ఏ ద్వారం దగ్గర వున్నారో ఆ ద్వారం గుండా బయటికి వెళ్ళాడు. రావణుడు మహాపార్శ్వమహోదర, విరూపాక్షులు తమ తమ రథాల్లో అతడి వెంట నడిచారు. అంతలో దిక్కులన్నీ చీకట్లు కమ్మాయి. భూమి కంపించింది. రక్తపు వర్షం కురిసింది. నక్కలు, కాకులు కూశాయి.

ఇలాంటి ఉత్పాతాలెన్నో కనిపించాయి. అయినా లెక్కచేయకుండా, మృత్యుప్రేరితుడైన రావణుడు, రామునితో యుద్ధానికి బయల్దేరాడు. వారిద్దరి మధ్యా భీకరమైన ప్రారంభమైంది.

బంగారు ఆభరణాలు ధరించిన బాణాలతో రావణుడు వానరులని కొట్టసాగాడు. వానరుల శిరస్సులు తెగి నేల మీద పడసాగాయి. కొంతమందికి కళ్ళు పోయాయి. రావణుని ధాటికి వారు ఆగలేకపోయారు. చనిపోయిన వానరుల కళేబరాలతో యుద్ధభూమి అంతా నిండిపోయింది. నిప్పుల్లో పడ్డ మిడతల్లా వానరులు రావణుని బాణాగ్నికి ఆహుతి అయిపోతున్నారు. మిగిలిన వానరులు అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోసాగారు. అలా వానరులందర్నీ చెదరగొట్టి రావణుడు రాముని దగ్గరకి వచ్చాడు. పారిపోతున్న వానరుల్ని సుగ్రీవుడు చూశాడు. సేనానివేశం దగ్గర సుషేణుణ్ణి కాపలా వుంచి, రక్షిస్తూ వుండమని చెప్పి, తాను రావణునితో యుద్ధానికి బయల్దేరాడు. పెద్ద వృక్షమొకటి పెకిలించి, చేతిలో పట్టుకుని నిలబడ్డాడు. యుద్ధార్థులైన వానరులు, పెద్ద పెద్ద కొండ శిఖరాలు, పెద్ద పెద్ద వృక్షాలు, పట్టుకుని, సుగ్రీవునికిటు, అటు నిలబడ్డారు. సుగ్రీవుడు గట్టిగా బొబ్బలు పెట్టి రాక్షసుల్ని చిత్తు చిత్తుగా కొట్టసాగాడు. వారి మీద రాళ్ళ వర్షం కురిపించసాగాడు. రాక్షసులు చితికి నేల కూలసాగారు. ఈ విధంగా వానరులు రాక్షసుల్ని కనిపించిన వార్ని కనిపించినట్లు చంపేస్తున్నారు.

ఇది చూసి విరూపాక్షుడు ఉగ్రుడై, తన పేరు గట్టిగా చెప్పుకుంటూ వారి మధ్యలో చొరబడ్డాడు. రథం మీది నించి ఒక్క దూకు దూకి ఏనుగు మీదికెక్కాడు. గట్టిగా హుంకరిస్తూ సుగ్రీవుని మీద బాణం వేశాడు. తన వాళ్ళందరికీ ధైర్యం చెప్పి యుద్ధానికి ఉసిగొల్పాడు. వాడ్ని చూసి సుగ్రీవుడు ఒక పెద్ద వృక్షం పీకి వాడెక్కి కూర్చున్న ఏనుగు మీద విసిరేశాడు. ఆ దెబ్బకి ఆ ఏనుగు ఘీంకరిస్తూ నేల కూలింది. విరూపాక్షుడు నేలమీద దూకి ఖడ్గం పట్టుకుని, సుగ్రీవుని మీదికి లంఘించాడు.

సుగ్రీవుడొక పెద్ద కొండ శిల వాడిమీదికి విసిరేశాడు. వాడు నేర్పుగా పక్కకి తప్పుకుని ఖడ్గంతో సుగ్రీవుని కొట్టాడు. సుగ్రీవుడికాదెబ్బకి మైకం కమ్మింది. మెల్లిగా తనని తాను సంభాళించుకుని, పిడికిలితో విరూపాక్షుని గుండెల మీద కొట్టాడు. ఆ దెబ్బకి విరూపాక్షుడు చలించిపోయాడు.

కోపంతో సుగ్రీవుని కవచం విరిచి పడేశాడు. సుగ్రీవుడు ఆవేశంతో విరూపాక్షుని మెడమీద గుద్దాడు. దాంతో విరూపాక్షుడు రక్తం కక్కుకుని, కనుగుడ్లు గిరగిర తిప్పుతూ నేల కూలాడు. విరూపాక్షుడు చనిపోవడంతో రాక్షస సేన అంతా చెల్లాచెదురైంది. అది తెలుసుకున్న రావణుడు ఉగ్రుడై, పక్కన వున్న మహోదరునితో ఇలా అన్నాడు.

"మహోదరా ఇంక నాకు నువ్వే ఆశాకిరణానివవి. నువ్వు మహావీరుడివవి. శత్రుసైన్యాన్ని సంహరించు ఇంతకాలంగా ఎంతో మక్కువగా పోషిస్తున్నందుకు, ఇప్పుడు రుణం తీసుకునేసమయం వచ్చింది" అని మహోదరుని యుద్ధానికి వెళ్ళడానికి ప్రేరేపించాడు.

వెంటనే మహోదరుడు వానరసేనలో ప్రవేశించాడు. దొరికిన వాణ్ణి దొరికినట్లు చంపసాగాడు. వానరుల చేతులూ కాళ్ళూ నరకసాగాడు. వానరులు భయాభ్రాంతులై పారిపోయారు. సుగ్రీవుడు మహోదరుడితో యుద్ధానికి తలబడ్డాడు. పెద్ద కొండ శిలలన్నీ సుగ్రీవుడు, మహోదరుని పైకి విసురుతుంటే వాడు తన ఖడ్గంతో వాటిని మధ్యలోనే ఖండించసాగాడు. సుగ్రీవుడీ సారి ఒక మహా వృక్షం పెకిలించి, వాని మీదికి విసిరాడు. కాని వాడు ఆ మహావృక్షాన్ని మధ్యలోనే ఖండించి, పెద్ద పరిఘనొకదాన్ని తీసుకుని సుగ్రీవుని కొట్టబోయాడు. కాని అది వాడి చేతిలోంచి జారి నేలమీద పడింది. సుగ్రీవుడు లాఘవంగా ఆ పరిఘని తన చేతిలోని తీసుకుని, దానితో రాక్షసుల గుఱ్ఱాల్ని చంపసాగాడు. ఎప్పుడైతే గుఱ్ఱాలు చనిపోయాయో, వెంటనే వాడెక్కి వున్న రథం నేల కూలింది.

మహోదరుడు రథంలోంచి కిందికి దూకి, గదను పట్టుకుని సుగ్రీవుని తాకలియబడ్డాడు. సుగ్రీవుడు తన చేతిలో వున్న పరిఘతో వాడ్ని ఎదుర్కొన్నాడు. ఇద్దరూ మదించిన ఆబోతుల్లా పోరాడుతున్నారు. వారి చేతుల్లోని ఆయుధాలు నేల జారాయి. ఇద్దరూ ముష్టియుద్ధం మొదలెట్టారు. ఒకరినొకరు పిడికిళ్ళతో, అరచేతులతో కొట్టుకుంటూ, తొడలు చరుచుకుంటూ, హోరా హోరి యుద్ధం చేశారు. మహోదరుడు చటుక్కున వెనక్కెళ్ళి గదని తెచ్చుకున్నాడు. అది కిందపడగానే ఖడ్గం తెచ్చుకున్నాడు.

సుగ్రీవుడు నేర్పుగా వాడిచేతిలోని ఖడ్గాన్ని, డాలుని చేజిక్కించుకుని, నిలబడ్డాడు, మహోదరుడు ఇంకో ఖడ్గం తెచ్చుకున్నాడు. ఇద్దరూ ఖడ్గాలతో చాలాసేపు యుద్ధం చేశారు. మహోదరుడు ఖడ్గంతో సుగ్రీవుని పొడవబోయాడు. కాని వాడి కత్తి సుగ్రీవుని దగ్గర వున్న డాలులో ఇరుక్కుపోయింది. ఆ కత్తిలాక్కోవటానికి మహోదరుడు ముందుకి వచ్చాడు. అదే అదనుగా సుగ్రీవుడు ఖడ్గంతో వాడి తలనరికి పడేశాడు. మహోదరుడు నేలకూలగానే మళ్ళీ రాక్షససైన్యం పారిపోయింది. అది చూసి మహాపార్శ్వుడు క్రోధంతో, సుగ్రీవుని మీదికి లంఘించి, సుగ్రీవుణ్ణి, అంగదుణ్ణి గడగడలాడించాడు. అప్పుడు అంగదుడు ఒకపరిఘని సంపాదించి, వాడిమీదికి విసిరాడు. ఆ దెబ్బకి మమాపార్శ్వుడు తెలివి తప్పి కిందపడ్డాడు. వెంటనే అంగదుడు జాంబవంతుడు కలిసి వాడి రథాన్ని ముక్కముక్కలు చేశారు. మహాపార్శ్వుడికంతలో తెలివి వచ్చింది. వెంటనే అంగదుడి మీద తలబడ్డాడు. అంగదుడు రోషంతో వాడి చేతిలో పరిఘ లాక్కుని వాడి మీదికే విసిరేశాడు. అది తగిలి వాడి చేతిలోని బాణము, విల్లు కిందపడ్డాయి. శిరస్త్రాణము కూడా జారిపోయింది. అంగదుడు త్రుటిలో వాడి దగ్గరకి వెళ్ళి, గూబమీద చాచి కొట్టాడు. మహాపార్శ్వుడు కోపంతో చాలా శక్తివంతమైన పరశ్వధము అనే ఆయుధం విసిరాడు. దానితో అంగదుని ఎడమ భుజం గూడుతో సహా పైకి వచ్చింది. అయినా అంగదుడు చలించకుండా పిడికిలితోఆరాక్షసుని రొమ్ముమీద గుద్దాడు. ఆదెబ్బకి గుండెబ్రద్దలై వాడు చచ్చి కిందపడ్డాడు. రాక్షస సైన్యం చెల్లా చెదరై పోయింది. రావణుడింక సహించలేక పోయాడు. రావణుడి ముఖం కోపంతో ఎఱ్ఱబడడం చూసి, వానరులంతా ఆనందంతో సింహనాదం చేశారు. రావణుడు కోపంతో పిచ్చివాడై సారథితో ఇలా అన్నాడు.

"మంత్రులందరూ చనిపోయారు. శత్రువులు లంకని దిగ్బంధం చేశారు. ఇపుడింక నేనే స్వయంగా ఆరామలక్ష్మణుల్ని చంపి కక్ష తీర్చుకుంటాను. రథాన్ని పూన్చి తీసుకురా" అని. వెంటనే సారథి రథాన్ని పూన్చి తెచ్చాడు. అది ఎక్కి రావణుడు బయల్దేరాడు.

ఒక శక్తివంతమైన ఆయుధం తీసి వానరుల మీద వేశాడు. అది చూసి భయపడి వానరులంతా వెనక్కి పరుగు లంకించుకున్నారు. రావణుడు వికటాట్టహాసం చేస్తూ రాముని వైపు వెళ్ళాడు. ఎదురుగా రామలక్ష్మణులు నిల్చి వుండడం చూశాడు. రాముడు ఆకాశాన్నంటుతోందా అన్నట్టున్న మహాధనస్సు ధరించి నిలబడి వున్నాడు. పద్మపత్ర విశాలాక్షుడు, ఆజానుబాహువు, శత్రువుల

గుండెల్లో గుబులు పుట్టించేవాడు. మహాతేజోమూర్తి, అయిన రాముడు లక్ష్మణునితో సహా నిలబడి వున్నాడు. వానరులంతా తన వైపు పరిగెత్తి రావటం రాముడు చూశాడు. ఎదురుగా రావణుడు రావడం చూసి ధనుష్టంకారం చేశారు. ఆ ధ్వనికి, రాక్షస సేనలు, గుండెలు పగిలి నేలకొరిగాయి. రావణుడు మాత్రం సూర్యచంద్రుల్ని కబళించడానికి వస్తున్న రాహువులా కదిలి వస్తున్నాడు. రావణుడలా రావటం చూసి లక్ష్మణుడు వాని మీద ఒక బాణం సంధించి వదిలాడు. రావణుడు విలాసంగా, ఆ బాణాన్ని దారిలోనే త్రుంచేశాడు. లక్ష్మణుడెన్ని బాణాలు వేస్తే అన్నింటినీ రావణుడు విరిచి ముక్కలు చేసి పడేస్తున్నాడు.

అలా లక్ష్మణుని బాణాలు తప్పించుకుంటూ రావణుడు రాముని దగ్గరకు వచ్చాడు. రాముని మీద బాణ వర్షం కురిపిస్తూ దగ్గర దగ్గరకి వస్తున్నాడు. రాముడు తన బాణాలతో ఆ బాణాల్ని ఛేదించసాగాడు. వారిద్దరూ అటుఇటు తిరుగుతూ ఒకరి బాణాల్నింకొకరు ఖండిస్తూ, ఒకరి మీద ఒకరు బాణాలు వేసుకుంటూ, భీకరమైన యుద్ధం చేస్తున్నారు.

ఆకాశమంతా బాణాలతో నిండిపోయింది. అంతలో సూర్యుడు అస్తమించాడు. అయినా వారు యుద్ధం ఆపలేదు. చీకటిలోనే పోరు కొనసాగిస్తున్నారు. రావణుడు రాముని నుదుటిపై వరసగా బాణాలు వెయ్యసాగాడు. రాముడు కోపం పట్టలేక, రౌద్రాస్త్రం ప్రయోగించాడు. ఆ బాణం రావణుని కవచానికి తగిలింది. కాని రావణుని కవచం అభేద్యమైనది. కనుక రావణునికేం కాలేదు. రావణుడురథం మీద కూర్చుని యుద్ధం చేస్తున్నాడు. రాముడు నేలమీద నిలుచుని యుద్ధం చేస్తున్నాడు. అక్కడినుంచే రావణుని నుదుటి మీద సూటిగా బాణం ప్రయోగించాడు. కాని రావణుడు దానిని తిప్పి కొట్టాడు.

రావణుడు రాముని మీద వరసగా అసురాస్త్రము, సింహము ముఖం గలవి, వ్యాఘ్రం ముఖం గలవి, గృధ్రం ముఖం కలవి, కాకి ముఖము గలవి, శ్వాన ముఖం గలవి, అనేకానేకములైన బాణాలెన్నింటినో ప్రయోగించాడు. దానికి జవాబుగా రాముడు ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రం నుండి, అగ్నిముఖములు, సూర్యముఖములు చంద్రముఖములు, అర్ధచంద్రముఖములు, ధూమకేతు ముఖములు, గ్రహముఖములు, నక్షత్రముఖములు, మహోల్కా ముఖిములు, విద్యున్ముఖిములు, అనే నానా రకాలైన బాణాలు వెలువడ్డాయి. రావణుని బాణాలన్నింటినీ అవి నాశనము చేశాయి. అది చూశాక వానరులందరికీ ధైర్యం వచ్చింది. రాముడికి పరమానందం కలిగింది. తన అస్త్రాలన్నింటినీ రాముడు తిప్పి కొట్టటం సహించలేక, రావణుడు యముడిచే సృష్టించబడ్డ, రౌద్రాస్త్రాన్ని రామునిపై

ప్రయోగించటానికి సిద్ధపడ్డాడు. ఆ అస్త్రప్రయోగం వల్ల గదలు, శూలాలు, ముసలాలు, రావణుడి వింటి నుంచి బయటకి రాసాగాయి. అంతటి ప్రభావం గలది అది.

అస్త్రశాస్త్ర విశారుదుడైన రాముడు గంధర్వాస్త్రముతో రౌద్రాస్త్రాన్ని తిప్పికొట్టాడు. వెంటనే రావణుడు సౌరాస్త్రము ప్రయోగించాడు. దాని ప్రభావం వల్ల రావణుడి వింటి నుండి, జ్వాలాయమానమైన చక్రాలు బయటకి రాసాగాయి. రాముడు అతి నేర్పుగా ఆ చక్రాల్ని తన బాణాలతో ఛేదించాడు. రావణుడికి రోషం వచ్చింది. ఒక్కసారిగా పది బాణాలు ప్రయోగించాడు. ఆ బాణాలు రాముని మర్మస్థానాల్లో గాయం చేశాయి. అయినా రాముడు చెక్కు చెదరకుండా బాణ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు.

రాముడికి అలా గాయాలు కలగటం సహించలేక లక్ష్మణుడు, ముందుకొచ్చి, ఒక్కసారిగా ఏడు బాణాలు సంధించి, రావణుని రథం యొక్క ధ్వజం పడగొట్టాడు. సారథి శిరస్సు ఖండించాడు. రావణుని చేతిలోని ధనస్సు కింద పడేశాడు. ఇంతలో విభీషణుడు తన గదతో రథానికి కట్టిన గుఱ్ఱాన్ని చితకబాది చంపేశాడు. ఆ విధంగా తన తమ్ముడే తన మీదికి యుద్ధం చేయ్యటానికి రావటం చూసి రావణుడు సహించలేకపోయాడు. రోషంతో ఒక మహాశక్తి తీసి విభీషణుని మీద ప్రయోగించాడు. ఆ శక్తిని లక్ష్మణుడు దారిలోనే ఖండించిపడేశాడు. రావణుడు మరో మహాశక్తిని విభీషణుని మీద ప్రయోగించాడు. ఆ శక్తి రావణుని చేతిలో వుండగానే లక్ష్మణుడు తీవ్రమైన బాణాలు రావణుని చేతిపై వేశాడు. రావణుడా శక్తి ప్రయోగించలేకపోయాడు. రావణుడు ఉగ్రుడైపోయాడు.

"ఏమి రా నీ పొగరు! గొప్ప బలవంతుడినన విఱ్ఱవీగుతున్నావా? విభీషణునికి మహాశక్తి తగలకుండా తప్పించావు కదూ, కాచుకో దీన్నిప్పుడు నీ గుండెల మీద ప్రయోగిస్తాను. నీ గుండెల్ని చీల్చి ప్రాణం తీస్తుంది ఇది" అంటూ ఆ శక్తిని లక్ష్మణునిపై ప్రయోగించి, వికటాట్టహాసం చేశాడు. రాముడు చూశాడు. లక్ష్మణునికి ఎటువంటి ప్రమాదం కలగకూడదని దైవాన్ని మనస్సులో స్మరించాడు. కాని అప్పటికే ఆ శక్తి విశాలమైన లక్ష్మణుని వక్షస్థలాన్ని దూసుకుని పోయింది. దాని ప్రభావం వల్ల లక్ష్మణుడి గుండెలు బ్రద్దలైనట్లయ్యాయి. అతడు నేల మీద పడి మూర్ఛబోయాడు.

రాముడికి చెప్పలేనంత దుఃఖం కలిగింది. రావణుని మీద చెప్పరాని కక్ష కలిగి, ఆ క్షణంలోనే రావణుని చంపేయ్యాలనుకున్నాడు. వానరులంతా ఖిన్నులై లక్ష్మణుని దగ్గర నిలబడ్డారు. ఆ అవకాశం ఉపయోగించుకుని రావణుడు వారిపై

బాణాలు గుప్పించసాగాడు. రావణుడు ప్రయోగించిన శక్తి లక్ష్మణుని గుండెల్లో దిగబడి, అతడు నేలమీద పడగానే లోతుగా భూమిలో పాతుకుపోయింది. లక్ష్మణుడు నేలకి అతుక్కుని పోయాడు. రాముడు చాలా ప్రయాసపడి అతి కష్టమ్మీద ఆ శక్తిని బయటకి లాగాడు. రాముడా ప్రయత్నంలో వుండగా, రావణుడు రాముని మీద ఎన్నెన్నో బాణాలు మర్మస్థానాల్లో తగిలేటట్లు కొట్టాడు. రాముడా బాణాల్ని లెఖ్ఖచెయ్యకుండా, లక్ష్మణుని గట్టిగా కౌగలించుకుని, హనుమంతుణ్ణి, సుగ్రీవుణ్ణి పిల్చి "మీరంతా లక్ష్మణుని చుట్టు కాపలా కాస్తూ వుండండి. ఇన్నాళ్ళకి పాపాత్ముడైన రావణుడు నా చేతికి చిక్కాడు. వీణ్ణెలాగైనా ఇప్పుడే చంపాలి. నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. అందరూ వినండి. ఈ యుద్ధంలో రావణుడో, రాముడో ఎవరో ఒక్కరే మిగిలి వుంటారు. ఇద్దరూ మాత్రం బ్రతికి వుండడం జరగదు. ఇన్నాళ్ళ నుంచీ ఎన్నెన్నో కష్టాలకోర్చుకున్నాను. రాజ్యం పోయింది. వనవాసం ప్రాప్తమైంది. దండకారణ్యంలో తిరిగి ఎన్నెన్నో బాధల కోర్చుకున్నాను. ఒక రాక్షసుడు నా సీతని స్పర్శించాడు. నరకంలో కలిగే బాధలన్నీ పడ్డాను. ఈరోజుతో ఆబాధలన్నీ తీరిపోవాలి. యుద్ధంలో రావణుని చంపి, ఆ బాధలన్నీ తీర్చుకుంటాను. వీడ్ని చంపడానికే కదా. సముద్రం మీద సేతువుకట్టి వానర సేన సాయంతో ఇక్కడికి వచ్చాను. ఏ రాక్షసుడ్ని చంపాలని, సముద్రం దాటి వచ్చానో, వాడిప్పుడు నా కళ్ళ ముందే ఉన్నాడు. వీడింక బ్రతక కూడదు. వానరులారా మీరంతా సుఖంగా ఈ పర్వత శిఖరంపై కూర్చుని, నేను రావణునితో చేసే యుద్ధం చూడండి.

ఇవాళ్ళ ఈ రాముని ప్రతాపమేమిటో మీరుచూద్దురు గాని. ముల్లోకాలలోనూ, దేవ గంధర్వ, దానవయక్ష ఋషిగణాలూ, స్థావర, జంగము, సర్వభూతాలూ, ఈ రాముని రామత్వం చూస్తారు" అంటూ తనతీవ్రమైన బాణాలతో రావణుని కొట్టాడు. రావణుడు కూడా రామునిపై బాణాలు వేశాడు. ఒకరి బాణాలు, ఇంకొకరికి తగిలి గొప్ప వెలుగు, బ్రహ్మాండమైన ధ్వని, కలిగిస్తు నేల కూలుతున్నాయి. ఆ ధ్వనికి సర్వ భూతాలు గడగడలాడాయి. ఇద్దరూ చాలా సేపు హోరా హోరి పోరు సలిపారు. కాని, రాముని ధాటికి ఆగలేక, రావణుడు పారిపోయాడు.

రాముడు యుద్ధం ఆపకుండానే, రక్తపు మడుగులో పడివున్న లక్ష్మణుని చూసి దుఃఖిస్తూ సుషేణునితో ఇలా అన్నాడు.

"ఆర్యా రావణాధముడి ప్రతాపంవల్ల లక్ష్మణుడు, నేలపై పడి కొట్టుకుంటున్నాడు.

నా మనస్సెంతో ఆక్రోసిస్తోంది. నాకు సౌమిత్రి నా ప్రాణం కన్నా ప్రియమైన వాడు. అతడలా పడివుంటే నేను యుద్ధం చేయలేను" అంటూ విలపించసాగాడు. అయ్యో నా తమ్ముడిలా బురదలో పడి కొట్టుకుంటున్నాడు. ఛీ ఇంక నేను బ్రతికి వుండి ఏం లాభం. ఎక్కడైనా భార్య లేకపోతే మరో భార్య లభిస్తుంది. బంధువులు దొరుకుతారు. కాని, నా తమ్ముడు లక్ష్మణుని వంటి సోదరుడెక్కడైనా దొరుకుతాడా, అంటూ రాముడు ఆవేదనతో ఊగిపోతుంటే, సుషేణుడు రాముడ్ని ఓదారుస్తూ,

"మహాబాహూ లక్ష్మణుడింకా జీవించేవున్నాడు. అతడి ముఖం వన్నె తగ్గలేదు నువ్వు కాస్త ధైర్యం చిక్కబట్టుకో. దగ్గర కొచ్చిచూడు, ఊపిరి ఆడుతోందింకా. గుండెలు కొట్టుకుంటున్నాయి దిగులుపడకు అని రామునికి ధైర్యం చెప్పి, హనుమంతుని పిల్చి "హనుమా నువ్వు వెంటనే బయల్దేరి మునుపు జాంబవంతుడు చెప్పిన ఔషదీ పర్వతం దగ్గరకి వెళ్ళి దాని దక్షిణశిఖరంపై వుండే విశల్యకరణి, సవర్ణ కరణి, సంధాన కరణి, సంజీవిని, అనే ఔషధాలు తొందరగా తీసుకురావాలి. అవి తెస్తే లక్ష్మణుడు బ్రతుకుతాడు" అని చెప్పగానే హనుమంతుడు, వాయువేగ మనోవేగాలతో వెళ్ళాడు. కాని అక్కడ ఆ ఔషధాల్ని గుర్తించలేకపోయాడు. ఏం చెయ్యాలా అని ఆలోచించాడు. ఆలస్యమైతే, లక్ష్మణుని ప్రాణాలు దక్కవు. అని ఆ పర్వత శిఖరాన్ని మూడు సార్లు ఊపి, దక్షిణ శిఖరం ఊడదీసి, మహావృక్షాలతో ఔషదాలతో సహా ఆ పర్వత శిఖరం చేత బట్టి ఆకాశ వీధిలో ఎగిరిపోయాడు.

యుద్ధభూమికి వచ్చి, ఆ పర్వత శిఖరం కింద పెట్టి, కాస్త ఊపిరి పీల్చుకున్నాడు.

"అయ్యా మీరు చెప్పిన శిఖరం దగ్గరకి వెళ్ళాను. కాని ఆ ఔషధాల్ని గుర్తించలేకపోయాను. అందుకే ఆ శిఖరం పెల్లగించి తెచ్చాను" అన్నాడు. ఆ మాటలు విన్న సుషేణుడు చాలా సంతోషించాడు. హనుమంతుని మెచ్చుకుంటూ, ఓషధులు పెకిలించాడు. ఆ ఔషదం నూరి, అరసం లక్ష్మణుని ముక్కుల్లో పిండాడు. ఆ రసం లక్ష్మణుని ముక్కుల్లోకి వెళ్ళగానే బాణపు ములుకులు శరీరం నించి ఊడి కింద పడిపోయాయి. అతడి బాధ ఉపశమించింది. వెంటనే లేచి కూర్చున్నాడు. లక్ష్మణుడలా లేచి కూర్చోగాననే అందరూ సుషేణుడ్ని మెచ్చుకున్నారు. రాముడు కన్నీటితో లక్ష్మణుని గట్టిగా కౌగలించుకున్నాడు.

"లక్ష్మణా నా అదృష్టం వల్ల నువ్వు పునర్జన్మ పొందావు. నువ్వే కనుక

చనిపోయి వుంటే నా ఈ జీవితం ఎందుకు? సీత ఎందుకు? విజయమెందుకు? అంటూ రాముడు పదే పదే దుఃఖిస్తుంటే లక్ష్మణుడు విచారగ్రస్తుడై

"అన్నయ్యా ఆ రోజు నువ్వు చేసిన ప్రతిజ్ఞ మర్చిపోయావా? నీ అంతటి ధీరుడు ఇలా కృంగిపోవచ్చునా? రావణుని చంపి, విభీషణునికి లంకా రాజ్యం పట్టం కడతానని ప్రతిజ్ఞ చేశావా లేదా? ఇప్పుడు ఆ ప్రతిజ్ఞనెరవేర్చే సమయం వచ్చింది. నీ బాణాల్నించి తప్పించుకుని రావణుడు బ్రతకటం అసంభవం. సూర్యాస్తమయం కాకముందే, ఆ రావణుని చంపు వెళ్ళు" అన్నాడు.

రావణుడు అప్పటికే ఇంకో రథం మీద ఠీవీగా నిలబడి రాముని ముందుకి వచ్చాడు. రథంలో నిలబడి రావణుడు తీవ్రమైన బాణాల్ని రాముని మీదికి వెయ్యసాగాడు. రాముడు కూడా విల్లెక్కుపెట్టి బాణాలు సంధించి రావణుని మీదికి వేస్తున్నాడు. ఆకాశంలోంచి దేవతలు, యక్షులు గంధర్వులు చూస్తున్నారు. రావణుడు రథం మీద నిలబడి యుద్ధం చేస్తున్నాడు. వారికి ఇది చాలా అన్యాయంగా తోచింది.

ఇంద్రుడు మాతలి ద్వారా బాల భానుని కాంతిలో ప్రకాశిస్తున్న ఒక రథం రాముని దగ్గరకి పంపాడు. ఆ రథం బంగారు కూబరంతో, బంగారు అలంకారాలతో, తెల్లని చామరముతో, కాంచనదండముతో, దేదీప్యమానంగా వుంది. ఆకుపచ్చని రంగు కల్గిన గుఱ్ఱాలు ఆ రథానికి కట్టబడి వున్నాయి. ఆ రథంతో బాటు మాతలి సరాసరి నేల మీదికి దిగి, రాముని ముందుకి వచ్చి, చేతులు జోడించి నిలబడ్డాడు.

"రామా ఇంద్రలోకం నుండి దేవేంద్రుడు మీకు విజయం కలగాలని, ఈ రథాన్ని మీ కోసం పంపాడు. ఈ ధనస్సు, కవచము, చాలా శక్తి సమన్వితాలైన ఈ బాణాలు, కూడా మీ కివ్వవలసిందిగా చెప్పి ఇచ్చాడు. ఈ కవచం అభేధ్యమైనది. ఈ ధనస్సు అమోఘమైనది. ఈ రథం అధిరోహించి, ఈ కవచం ధరించి, ఈ ధనుర్బాణాలతో దుష్టుడైన ఆ రావణుని వధించవలసిందిగా మీకు మనవి చెయ్యమన్నాడు. నేను సారధిగా వుండి రథం నడుపుతాను" అని సవినయంగా చెప్పాడు మాతలి.

అతడి మాటలు విని రాముడు చాలా సంతోషించాడు. ఆ రథానికి ప్రదక్షిణం చేసి దానిలోకి ఎక్కాడు.

అటు తర్వాత భీకరమైన రామరావణ సంగ్రామం మొదలైంది.

రావణుడు గాంధరార్వస్త్రం ప్రయోగించాడు. రాముడు దానిని దేవాస్త్రంతో

తిప్పికొట్టాడు. రావణుడు రాక్షసాస్త్రం ప్రయోగించాడు. దాని ప్రభావం వల్ల ఆ బాణాలు ఘోరమైన విష సర్పాలుగా మారి రాముణ్ణి బాధించసాగాయి. భయంకరంగా పడగలు ఎత్తినోరు విప్పి రాముని మీద పడ్డాయి. వెంటనే రాముడు గరుడాస్త్రం మంత్రించి వదిలాడు. ఆ మంత్ర ప్రభావం వల్ల ఆ వింటినుంచి బయల్వెడలిన బాణాలు గురుడ పక్షులుగా మారి, తమ వాడియైన ముక్కులతో ఆ విష సర్పాల్ని పొడిచి చంపసాగాయి.

రావణుడు రోషంతో వేల కొలది బాణాలతో రాముడ్ని మాతలినీ కూడా కొట్టసాగాడు. రథం మీదవున్న జండాపడగొట్టాడు. గుఱ్ఱాల్ని కూడా గాయపరిచాడు. ఆకాశంలోంచి చూస్తున్న దేవతలు, గంధర్వులు అది చూసి చాలా బాధపడ్డారు. విభీషణుడు అంగదుడు, సుగ్రీవుడు, వానరులు నిశ్చేష్టులయ్యారు. రావణుడు వికటాట్టహాసం చేస్తూ పదితలలతో, ఇరవై చేతులతో మైనాకపర్వతంలా నిలబడి వున్నాడు. రాముడు వేసిన ప్రతిబాణాన్ని తిప్పికొట్టున్నాడు. రాముడు నిస్సహాయుడై పోయాడు. కోపంతో రాముని ముఖం జేగురించి, కన్నులెఱ్ఱబడ్డాయి. ఆ స్థితిలో రాముణ్ణి చూసి భూమి వణికింది. సముద్రంలో అలలు ఎగిసెగిసి పడ్డాయి. పక్షులు వికృతంగా అరిచాయి. ఎటు చూసినా అనర్థ సూచనలే కనిపించాయి. ఈ ప్రకృతి వైపరీత్యాలు చూసి, రావణునికి కూడా భయం వేసింది.

అయినా సరే రావణుడు, రాముడు హోరా హోరీ పోరాడుతూనే వున్నాడు. రావణుడు వజ్రాసారమనే ఒక శూలం తీసి చేత్తో పట్టుకుని భయంకరంగా గర్జించాడు. ఆ గర్జనతో దిక్కులు పిక్కటిల్లాయి. ఆ శూలం పట్టుకుని రావణుడు రాముని వంక క్రూరంగా చూస్తూ,

"రామా కాచుకో అతి రౌద్రమైన శూలం నీ మీద ప్రయోగిస్తున్నాను. ఇది మృత్యువుకి కూడా లొంగనిది. ఇంతటితో నీ పని సరి" అంటూ ఆ శూలాన్ని రాముని మీదికి విసిరాడు.

ఆ శూలం మెరుపులు వెదజల్లుతూ, ఎనిమిది గంటలతో ధ్వని చేస్తూ, సూటిగా రాముని మీదికి రాసాగింది. రాముడొక తీవ్రమైన బాణాన్ని దాని మీదికి వదిలాడు. వరసగా బాణాలు ప్రయోగిస్తూ ఆ శూలాన్ని ఆపాలని ప్రయత్నించాడు. కాని ఆ శూలం రాముడు వేసిన బాణాలన్నీ మింగేస్తు ముందుకి దూసుకుని వస్తోంది. రాముడు ఇంద్రుడు పంపిన మహాశక్తిని చేతిలోకి తీసుకున్నాడు. ఒక్కసారి కన్నులు మూసుకుని ధ్యానించి, దాన్ని రావణుడు ప్రయోగించిన శూలంపైకి విసిరాడు. అది గంటలు మ్రోగిస్తూ మెరుపులు, వెలుగులు వెదజల్లుతూ మహా

ధ్వని చేస్తూ ఆ శూలం మీద పడింది. వెంటనే ఆ శూలం నిర్వీర్యమై కింద పడిపోయింది. రాముడు క్షణమైనా ఆలస్యం చేయ్యకుండా, రావణుని రథానికి పూన్చిన గుఱ్ఱాల మీద బాణాలు వేసి వాటిని కూల్చేశాడు. వాడియైన బాణాలతో రావణుని గుండెల మీద కొట్టాడు. మూడు బాణాలు రావణుని శిరస్సు మీద వేశాడు. రామ బాణాలతో రావణుని శరీరమంతా తూట్లు పడింది.

పరాభవం ఓర్వలేక రావణునికి రోషం వచ్చింది. మహాక్రోధంతో విల్లులాగి బాణం సంధించి రామునిపై వేశాడు. రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. నిర్విరామంగా బాణాలతో రాముడ్ని గాయపరుస్తూనే ఉన్నాడు రావణుడు. రాముని శరీరమంతా రక్తం ధారాపాతంగా కారసాగింది. అయినా రాముడు చలించలేదు. రావణుడి బాణాల్ని తన బాణంతో అడ్డుకుంటూ, తప్పించుకుందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇద్దరూ పట్టుదలతో పోరాడుతున్నారు. అలా అలసట లేకుండా ఇద్దరూ ఒకర్ని మించిన సాహసంతో మరొకరు పోరాడుతుండగానే నాల్గు దిక్కులా చీకట్లు ఆవరించాయి. అప్పుడు రాముడు రావణుని హేళన చేస్తూ

"రాక్షస రాజా, జనస్థానం నించి ఒంటరిగా వున్న నా అర్ధాంగిని దొంగతనంగా అపహరించి తెచ్చావు. నీకు నా చేతిలో చావు తప్పదు. నీ అహంకారం వల్ల మృత్యువుని కొని తెచ్చుకున్నావు. కుబేరుడి సోదరుడివైన నువ్వు నీ సైన్యంతో గొప్ప యుద్ధమే చేశాడు. దొంగలా సీతని ఎత్తుకొచ్చిన నీకు సిగ్గు లేదు. ఆనాడే నాకంటబడి వుంటే, తెలిసేది నా ప్రతాపం. దుష్టుడా నీకింకా ఆయుర్దాయం వుండడం వల్ల ఇప్పటి దాకా నా కంట బడలేదు. ఇప్పుడు నా కంట బడ్డాక, ఇంక బతికి బట్ట, కట్టలేవు. నీ తల నరికి భూమాతకి తర్పణం ఇస్తాను. అంటూ రాముడు తన అమోఘమైన బాణాన్ని వదిలాడు. ఆ సమయంలో రాముని బలం రెట్టింపైంది. ఎలాగైనా శత్రువుని తుదముట్టించాలని తీవ్రంగా యుద్ధం చెయ్యసాగాడు. రావణుడికి గుండెలలో దడ బయల్దేరింది. రావణుడికి బాణం సంధించటానికి కూడా అవకాశం ఇవ్వకుండా రాముడు బాణాలు వేస్తున్నాడు. రావణుడు నిస్సహాయంగా చూస్తూ నిలబడి పోయాడు. అప్పుడు అతడి సారథి, రావణుని అవస్థని గమనించి, మెల్లిగా రథాని యుద్ధభూమినించి పక్కకి నడిపించుకుపోయాడు. కాని రావణుడు మాత్రం అది తీరని అవమానంగా తలచి సారథిని నోటికొచ్చినట్టల్లా తిట్టసాగాడు.

"సూతా నేనేమైననా చేతకాని వాడినా? పౌరుషం లేని వాడినా? అశక్తుణ్ణా? నన్ను గురించి నువ్వేమనుకుంటున్నావు?

యుద్ధభూమిలో వెనుతిరిగిరావడం ఎంత అవమానం! నేనేమైనా అస్త్రజ్ఞానం లేనివాడిననుకున్నావా? మాయలు తెలియని వాడినా? నా శక్తి సామర్థ్యాలు నీకు తెలియవా? దుర్బుద్ధీ నాకు తీరని అవమానం కలిగించావు కదా. నీ మూలంగా నేనెంతో కష్టపడి ఆర్జించుకున్న కీర్తి, ప్రతిష్ట, ఆత్మస్థైర్యం అన్నీ మంటగలసిపోయాయి. నా భాగ్యవశాత్తు ఈనాడు నాకు సమవుజ్జీ అయిన శత్రువు దొరికాడు కదా అని నేను సంతోషిస్తూవుంటే వాడు చూస్తుండగానే, నా రథం వెనక్కి తిప్పి, నన్నొక వాజమ్మగా ఋజువు చేశాడు. ఇదంతా నువ్వు అవివేకంతో చేశావా? లేదా శత్రువుతో లలూచీ పడి ధనాశకి లొంగిపోయి చేశావా? ఏది ఏమైనా శత్రువు ఎదుట నాకు తీరని తలవంపు తెచ్చావు. లే తొందరగా రథాన్ని మరలించి, యుద్ధభూమికి తీసికెళ్ళు. నా మేలు కోరే వాడివైతే నీకిది వరకు నేను చేసిన సత్కారాలు నీకు గుర్తుంటే వెంటనే నేను చెప్పినట్లు విని రథాన్ని శత్రువు ముందుర వెంటనే నిల్పు" అంటూ ఎన్నో విధాల సారధిని దూషించాడు. సారధి రావణుని అవివేకానికి చాలా జాలిపడ్డాడు.

"ప్రభూ మన్నించండి. మీరన్నట్లు నేను మూర్ఖుడ్ని కాను. మీకు మోసం, చెయ్యాలనే దుర్బుద్ధీ నాకు లేదు. మీరుచేసిన సత్కారాలు కూడా నేను మర్చిపోలేదు. మీ మేలు కోరి, మీ కీర్తి కాపాడాలనే అలా చేశాను. మీరొక్కక్షణం తెప్పరిల్లితే మళ్ళీ మీకు ఉత్సాహం కలిగి శత్రువులపై విజృంభించగలరు అనే మంచి ఆలోచనతోనే ఈ పని చేశాను. కాని మీకింతటి మనస్తాపం కలుగుతుందని అనుకోలేదు. మీరూ రామబాణం వల్ల అలసివున్నారు. రథాన్ని లాగుతున్న గుఱ్ఱాలు అలసివున్నాయి. యుద్ధ తీవ్రతని గమనించి, మీకూ గుఱ్ఱాలకి విశ్రాంతి కలిగించాలని సారధిగా నా బాధ్యత తెలుసుకుని ఇలా చేశాను. మీ యందలి భక్తితో మాత్రమే, ఇలా చేశాను. మీకు నా అభిప్రాయం అనుచితంగా తోచింది. కనుక ఇప్పుడు మీరెలా ఆజ్ఞాపిస్తే అలా చేస్తాను. మీ ఋణం తీర్చుకుంటాను" అన్నాడు విధేయతతో. రావణుడికామాటలు చాలా సంతృప్తిని కలిగించాయి. సారధిని మెచ్చుకుని తన చేతి బంగారుకంకణం తీసి కానుకగా ఇచ్చాడు.

"సూతా వెంటనే రథాన్ని తీసికెళ్ళి రణభూమిలో నిల్పు, ఇవాళ రావణుడు రాముని చంపకుండా వెనక్కి రాడు" అన్నాడు. సారధి వెంటనే రథాన్ని తీసికెళ్ళి రామునికి ఎదురుగా నిలిపాడు.

ఈ నేపథ్యంలో, రావణుడెపుడైతే బడలిక తీరకముందే, మళ్ళీ వచ్చి రణభూమి లోనిలిచాడో, ఆకాశవీధిలో దేవతలు, గంధర్వులు, యక్షులు, ఋషులు

బారులు తీరి నిలబడి యుద్ధమేలా జరుగుతుందో అని, ఆసక్తిగా చూస్తూ నిలబడ్డారు. వారిలో నుంచి అగస్త్య మహర్షి మెల్లిగా నేలకి దిగి వచ్చి రాముని దగ్గరగా నిలబడి ఇలా అన్నాడు.

"నాయనా మహాబాహూ, రామచంద్రా, నువ్వెంత పరాక్రమంతో యుద్ధం చేస్తున్నా, రావణుడు లొంగిరావడం లేదని చింతిస్తున్నావా; నీకిప్పుడు నేను ఆదిత్యహృదయం అనబడే గొప్పస్తోత్రాన్ని ఉపదేశిస్తాను. ఇది సనాతనమైనది. దీనిని పారాయణ చేస్తే నీకు యుద్ధంలో తప్పక విజయం లభిస్తుంది.

ఆదిత్య హృదయం చాలా పుణ్యప్రదమైనది. సర్వశత్రువుల్ని నాశనము చేసేది. విజయము చేకూర్చేది. నిత్యం క్రమం తప్పకుండా జపించే వారికి అక్షయమైన సంపదలిచ్చేది. మంగళప్రదమైనది. శుభకరమైనది. పాపాల్ని హరించేది. చింత, దుఃఖంలాంటి వాటిని ఉపశమింపచేసేది. ఆయుష్షును వృద్ధి చేసేది. ఉత్తమమైనది. నాయనా భాస్కరుడు తేజోమయ మూర్తి. ఆయనని దేవాసురులు కూడా పూజిస్తారు. ఆయనే భువనేశ్వరుడు సర్వదేవాత్మకుడు, స్వయం ప్రకాశమూర్తి తన తీవ్రమైన కిరణాలతో, కాంతి పుంజాలతో సర్వలోకాల్ని సంరక్షిస్తూవుంటాడు. ఆయనే బ్రహ్మ, విష్ణువు, శివుడు, స్కంధుడు, ప్రజాపతి, ఇంద్రుడు, కుబేరుడు, యముడు, చంద్రుడు, వరుణుడు, పితృదేవతలకి అధిపతి, సమస్తము ఆయనే.

వసువులు, సాధ్యులు, అశ్వనీదేవతలు, మరుద్గణములు, మనువులు, వాయుదేముడు, అగ్నిదేముడు, ప్రజలు, వారి యొక్క ప్రాణములు, కాలగమనము నియమింపచేసే ఋతువులు, ఇవన్నీ కూడా, సాక్షాత్తు ఆదిత్యుని రూపాలే.

ఆదిత్యుడనీ, సవితుడనీ, సూర్యుడనీ, ఖగుడు అనీ, పూష అనీ, గభస్తిమంతుడనీ, సువర్ణసదృశుడనీ, భానుడనీ, బంగారు కాంతి గల కిరణాలు గల వాడని, దివాకరుడనీ, హరిదశ్వుడనీ, సహస్రార్చి అనీ, సప్త సప్తి అని, మరీచి మాన్ అనీ, తిమిరోన్మధునుడనీ, శంభుడనీ, త్వష్టా, మార్తాండుడనీ, అంశుమంతుడనీ, హిరణ్యగర్భుడనీ, శిశిరుడనీ, తపనుడనీ, భాస్కరుడనీ, రవి అనీ, అగ్ని గర్భుడనీ, అదితి పుత్రుడనీ, శంఖుడనీ, శిశిరనాశనుడనీ, వ్యోమనాధుడనీ, తమోభేధి అనీ, ఋగ్యజుస్సామవేదముల పారాయణ చేసిన వాడనీ, ఘనవృష్టి అనీ, అపాంమిత్రుడనీ, వింధ్య వీధీ ప్లవంగముడని, ఆతపి అనీ, మృత్యువనీ, పింగళుడనీ, సర్వతాపనుడనీ, విశ్వముల అనీ, మహాతేజుడనీ, రక్తుడనీ, సర్వభవుడనీ, నక్షత్రగ్రహ తారలకు అధిపతి అనీ, విశ్వభావనుడనీ, ఈయనకి ఎన్నో పేర్లున్నాయి.

. కనుక ఇన్ని నామాలతో పిలవబడుతూ, వెలుగులకు కూడా వెలుగునిచ్చే దైవమా, ద్వాదశాత్మా నీకు నా నమస్కారము. పూర్వాద్రికీ, పశ్చిమాద్రికీ కూడా ప్రభువైన స్వామీ నీకు వందనాలు.

జ్యోతిర్గణములకు, అధిపతీ, దినమునకు అధిపతీ, నీకివే నా వందనాలు. జయమును కలిగించే జయభద్రుడా నీకు నమస్కారములు. ఆకు పచ్చని గుఱ్ఱములు కలిగిన రథము నెక్కి సంచరించే దేవా నీకు నమస్కారము.

సహస్రాంశుడవైన నీకు వందనం. ఆదిత్యుడివైన నీకు నమస్కారము. ఉగ్రస్వరూపుడివి, వీరుడివి, సారంగుడివి అయిన నీకు వందనం. పద్మములకు ప్రాణదాతవైన స్వామీ నీకు నమస్కారం. మార్తాండా, త్రిమూర్తి స్వరూపా, సూర్యా, ఆదిత్యా, తేజోమూర్తి, సర్వభక్షకా రుద్రమూర్తీ అంధకారాన్ని పోగొట్టేదేవా, చలిని దూరం చేసే స్వామీ, శత్రువులను నశింపజేసే స్వామి, ప్రభూ పరమాత్మస్వరూపా, కృతఘ్నులను నాశనం చేసే వాడా, జ్యోతిశ్చక్రానికి ఆధారమూర్తి, మేలిమి బంగారు వర్ణం గలవాడా, వహ్నిస్వరూపా, విశ్వకర్మా, తమస్సుని పోగొట్టే వాడా, విజ్ఞానమూర్తీ లోకసాక్షి, నీకు నమస్కారములు" అని ఇప్పుడు నేను చెప్పిన దంతా పఠిస్తూ నువ్వు సూర్యనారాయణ మూర్తికి వందనం చెయ్యి.

ప్రాణి కోటినంతా ప్రళయం కాలంలో నశింపజేసి, మళ్ళీ సృష్టించే పరమాత్మ ఇతడే.

తన కిరణాలతో సర్వజగత్తునీ రక్షించే వాడు, తపింపచేసే వాడు, వర్షాన్ని ప్రసాదించే వాడు, సర్వమూ ఈయనే

నిద్రలో వున్నప్పుడూ, మెలకువగా వున్నప్పుడు, సర్వజీవరాశుల్లోనూ వుండి చైతన్యం కలిగించే స్వామి ఈయనే. అగ్నిహోత్రం చేసే వారికి ఆ అగ్నిహోత్రము, దాని ఫలము కూడా ఈయనే. వేదములు, క్రతువులు, యజ్ఞఫలము అన్నీ ఈ సూర్యనారాయణనుడే.

ఈ ప్రభువుని, ఆపదులందు, అడవులలో దారి తప్పి దిక్కుతెలియక తల్లడిల్లినపుడు, మనోవేదనతో చెప్పలేని క్లేశములనుభవిస్తున్నప్పుడు, భయము కల్గినప్పుడు, సూర్యనారాయణమూర్తిని స్మరించి, ఆదిత్య హృదయము పఠించినట్లైతే, ఆయా చిక్కు సమస్యలకి వెంటనే పరిష్కారం లభిస్తుంది.

రాఘవా ఈ స్వామిని ఏకాగ్రతతో ధ్యానించు, జగత్ప్రభువు, దేవదేవుడు, అయిన ఆదిత్యుని స్మరించి, ఈ ఆదిత్యహృదయము మూడు సార్లు పఠించిన వారికి యుద్ధంలో విజయం లభించటం తథ్యం. కనుక ఏకాగ్ర చిత్తముతో

నువ్వు కూడా, ముమ్మారు ఆదిత్య హృదయం పఠించి, శత్రువుని జయించి, విజయాన్ని పొందు.

మహాబాహూ నువ్వు ఈ క్షణంలోనే రావణుని సంహరించగలవు" అని రామునికి ఆదిత్య హృదయాన్ని బోధించి అగస్త్య మహాముని వెళ్ళిపోయాడు.

ఈస్తోత్రం వినగానే రామునిలో చైతన్యం వచ్చింది. గొప్ప తేజస్సు కలిగింది. శోకము తొలగిపోయింది. నియమముగా ఆదిత్యహృదయం పఠించి, పరమానందం పొందాడు.

మూడుసార్లు ఆచమనం చేసి, పవిత్రుడై ధనస్సు పట్టుకుని, యుద్ధానికి సన్నద్ధుడై రావణుని చూసి తేజస్సుతో ముందడుగు వేశాడు.

ఇంక రావణునికి చావు తప్పదని, ఆకాశవీధిలో వున్న సూర్యుడు భావించాడు. "రామా తొందరగా రావణుని చంపటానికి ఉపక్రమించవయ్యా" అన్నాడు.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. మానవజీవితంలో ఒడిదుడుకులు సహజం. కష్టం వెంటే సుఖం, సంతోషం వెంటే దుఃఖం ఇలా ఎన్నెన్నో అనుభూతులు పొందుతున్నప్పటికీ, మంచి కలిగినప్పుడు మన గొప్ప అని పొంగిపోతూ, చెడు కలిగినప్పుడు మాత్రం తప్పనిసరి పరిస్థితిలో మాత్రమే దైవాన్ని ఆశ్రయిస్తాం. ఇది మానవసహజమైన ప్రవృత్తి.

వాల్మీకి మహాముని, ఈ మానవ ప్రవృత్తిని దృష్టిలో పెట్టుకుని, భావితరాల వారికి ఉపయోగపడేలా తన రామాయణ మహాకావ్యంలో ఎన్నెన్నో స్తోత్రాలు, శ్లోకాలు, సంఘటనలు నిబిడీకృతం చేసి వ్రాశాడు. సుందరకాండలో జయమంత్రం (సుందరకాండ వ్యాఖ్యలో వుంది) అటువంటిదే. అసలు సుందర కాండ ఆద్యంతం చాలా మహిమాన్వితమైనది. అది ఎందరెందరో ఉపాసకులు ప్రత్యక్షంగా నిరూపించారు.

అలాగే ఈ ఆదిత్య హృదయస్తోత్రం, చాలా మహిమ గలది. ముఖ్యంగా అనారోగ్యంతో వున్న వారు నిష్ఠగా ఆదిత్య హృదయం పఠిస్తే వారికి పూర్తి ఆరోగ్యం కలుగుతుంది. పొద్దున్నే ఉదయిస్తున్న బాల భానుని ముందు నిలబడి ప్రతి రోజూ ఆదిత్యహృదయం పారాయణ చేసినట్లైతే ఎటువంటి చిక్కు సమస్యలైనా పరిష్కరించబడి, గట్టెక్కుతారు. అని ఎందరో మహానుభావులు అనుభవంతో నిరూపించారు. కనుక ఇక్కడ వాల్మీకి ప్రణీతమైన ఆదిత్యహృదయం వ్రాయడమైంది. ఈ ఆదిత్యహృదయ స్తోత్రం చాలా మహత్తరమైనది. దీనిని ప్రతినిత్యం

సూర్యనారాయణ మూర్తికి ఎదురుగా నిలబడి పారాయణ చేసే వారికి ఆయురారోగ్య, ఐశ్వర్యాలు కల్గుతాయని మహాముని నొక్కివక్కాణించారు. ఈ ఆదిత్య హృదయం వాల్మీకి రామాయణంలో, నూట ఏడవసర్గలో అగస్త్య మహాముని, రాముని కుపదేశించినట్లు వ్రాయబడింది. యుద్ధకాండలో.

## ఆదిత్య హృదయం

1. తతో యుద్ధ పరిశ్రాంతం - సమరే చింతయాస్థితమ్
రావణం చాగ్రతో దృష్ట్వా - యుద్ధాయ సముపస్థితమ్

2. దైవతైశ్చసమాగమ్య - ద్రష్టమభ్యాగతోరణం
ఉపాగమ్యా బ్రవీద్రామ - మగస్త్యోభగవాన్ ఋషిః

3. రామ రామ మహాబాహో - శృణుగుహ్యంసనాతనం
యేన సర్వానరీన్ వత్స - సమరే విజయష్యసి.

4. ఆదిత్య హృదయం పుణ్యం - సర్వశత్రువినాశనమ్
జయా వహం జపేన్నిత్యం అక్షయం పరమం శివం.

5. సర్వ మంగళ మాంగళ్యం - సర్వ పాప ప్రణాశనమ్.
చింతా శోక ప్రశమనం - ఆయుర్వర్ధన ముత్తమమ్

6. రశ్మిమంతం సముద్యంతం - దేవా సురనమస్కృతమ్
పూజాయస్వవివస్వంతం - భాస్కరంభువనేశ్వరమ్

7. సర్వదేవాత్మకోహ్యేష తేజస్వీరశ్మి భావనః
ఏషదేవాసురగణాన్ లోకాన్పాతిగభస్తిభిః

8. ఏషబ్రహ్మాచ, విష్ణుశ్చ, శివస్కంధః ప్రజాపతిః
మహేంద్రోధనదః కాలోయమస్సోమోహ్యాపాంపతిః

9. పితరోవసవ స్సాధ్యాహ్యశ్వినౌ మరుతోమనుః
వాయుర్వహ్నిః ప్రజాప్రాణ ఋతుకర్తా ప్రభాకరః

10. ఆదిత్య స్సవితా సూర్యఃఖగ పూషాగభస్తిమాన్
సువర్ణసదృశోభానుర్హిరణ్యరేతా దివాకరః

11. హరిదశ్వసహస్రార్చి, సప్తసప్తి ర్మరీచిమాన్

తిమిరోన్మథనశ్శంభుస్త్వష్టామార్తాండ అంశమాన్

12. హిరణ్యగర్భశ్శిశిరస్తపనో, భాస్కరో రవిః
అగ్నిగర్భోదితేః పుత్రంశంఖఃశ్శిశిరనాశనః

13. వ్యోమనాథస్తమోభేధీ, ఋగ్యజుస్సామపారగః
ఘనవృష్టి రపాంమిత్రో వింధ్యవీధీ ప్లవంగమః

14. ఆతపీమండలీ మృత్యుఃపింగళ స్సర్వతాపనః
కవిర్విశ్వోమహాతేజా రక్త స్సర్వభవోద్భవః

15. నక్షత్రగ్రహ తారాణా - మధిపో విశ్వభావనః
తేజ సామపి తేజస్వీ ద్వాదశాత్మన్నమోస్తుతే.

16. నమఃపూర్వాయగిరయే - పశ్చిమేగిరయేనమః
జ్యోతిర్గణానాంపతయే - ధినాధిపతయేనమః

17. జయాయ జయభద్రాయ, హర్యశ్వాయనమోనమః
నమోనమః సహస్రాంసో ఆదిత్యాయనమోనమః

18. నమోఉగ్రాయ వీరాయసారంగాయనమోనమః
నమఃపద్మప్రబోధాయ మార్తాండాయనమోనమః

19. బ్రహ్మేశానాచ్యుతేశాయసూర్యాయాదిత్యవర్చసే
భాస్వతే సర్వబక్షాయరౌద్రాయవపుషే నమః

20. తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయేనమః

21. తప్తచామీ కరాభాయ - వహ్నాయే విశ్వకర్మణే
నమస్తమోభినిఘ్నాయ, రుచయే లోకసాక్షిణే.

22. నాశయత్యేషవైభూతం - తదేవ సృజతి ప్రభుః
పాయత్యేష, తపత్యేష వర్షత్యేషగభస్తిభిః

23. ఏషసుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్టితః
ఏష ఏవాగ్ని హోత్రం చ, ఫలం చైవాగ్ని హోత్రిణాం.

24. వేదాశ్చ, క్రతవశ్చైవ క్రతూనాంఫలమేవచ.
యానికృత్యాని లోకేషు, సర్వఏషరవిప్రభుః

25. ఏనమాపత్సు కృచ్ఛేషు, కాంతారేషు భయేషుచ,
కీర్తియన్ పురుషః కశ్చిన్నావసీదతి రాఘవ

26. పూజయస్వేన మేకాగ్రో దేవదేవం జగత్పతిమ్
ఏత త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయష్యసి

27. అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వంవధిష్యసి
ఏవ ముక్త్వాతదా గస్త్యో జగామ చ యధాగతం.

28. ఏతచ్ఛ్రుత్వామహాతేజా, నష్టసోకో భవత్తదా
ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయాతాత్మవాన్

29. ఆదిత్యం ప్రేక్ష్యజప్త్వాతు, పరం హర్షమవాప్తవాన్,
త్రిరాచమ్య శుచిర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్.

30. రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయసముపాగమత్
సర్వయత్నేన మహతావధే తస్యధృతోభవేత్.

31. అధరవి రవదన్నిరీక్ష్య-రామం ముదితమనాః పరమం- ప్రహృష్యమాణః
నిశిచరపతి సంక్షయం విదిత్వాసురగణమధ్యగతో - వచస్త్వరేతి.

## ఇతి ఆదిత్యహృదయం సంపూర్ణం

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఎపుడైతే, రాముడు ఆదిత్య హృదయం, మూడు సార్లు పారాయణ చేసి, శక్తి సంపన్నుడై ధనస్సు చేత బట్టి నుంచున్నాడో, అంతలో రావణుడు మళ్ళీ యుద్ధానికి సన్నద్ధుడై వస్తూ కనిపించాడు. రావణుని రథం చాలా విశాలమైనది. అందులో అనేక రకాలైన కవచాలు, ధనస్సులు, బాణాలు, ఎన్నోరకాల ఆయుధాలు, అన్నీ సమృద్ధిగా వున్నాయి.

ఆ రథము చిత్ర వర్ణాలతో, గోపురాలతో, చాందినీలతో, ధ్వజాలతో, తోరణాలతో ఎంతో వైభవోపేతంగా ఉంది. అట్టహాసంగా రావణుడు యుద్ధానికి బయల్దేరి రావడం రాముడు చూశాడు.

రణభూమిలోకి వస్తూనే పుంఖాను పుంఖాలుగా బాణపరం పరలు గుప్పించటం

మొదలు పెట్టాడు రావణుడు. అప్పుడు రాముడు, మాతలితో "మాతలీ, రావణుడు చాలా పౌరుషంతో వస్తున్నాడు. చూడు. నువ్వు మనరథాన్ని అతనికెదురుగా పోనీ. రావణుని రథానికి కుడివైపు నుంచి మన రథం వెళ్ళాలి. చావు కాలం సమీపించటం వల్లే రావణుడు మళ్ళీ యుద్ధానికి వచ్చాడు. చూస్తుండు. ఇప్పుడే వాని రథాన్ని చీల్చి పారేస్తాను. వాడెంత విజృంభించినా నువ్వు అధైర్యపడకు. నీ మనస్సు ఏకాగ్రతతో వుంచుకో" అన్నాడు.

రాముని రథం కుడివైపు నుంచి వెళ్తుంటే, పెద్దపెట్టున ధూళి లేచి రావణుని కన్నులు కప్పేసింది. దాంతో రావణునికి పట్టరాని కోపం వచ్చింది. కళ్ళు క్రోధంతో జేగురించాయి. రాముని మీద తన బాణ పరం పరగుప్పించసాగాడు. రాముడు కూడా దేవేంద్రుడిచ్చిన విల్లు ఎక్కుపెట్టి రావణుని మీద బాణాలు గుప్పించాడు. ఇద్దరూ మదించిన ఏనుగుల్లా తలబడ్డారు. ఇద్దరూ భీకరమైన యుద్ధం చేస్తున్నారు. వానర సైన్యము, రాక్షస సైన్యము కూడా నిశ్చేష్టులై చూస్తున్నారు. రావణుడు ప్రాణాలకి తెగించి పోరాడుతున్నారు. రాముని రథం యొక్క జెండా పడగొట్టాలని రావణుడు ప్రయత్నించాడు. కాని రావణుడు ప్రయోగించిన బాణాలు తన రథాన్ని చేరకముందే రాముడు, వాటిని నిరోధించి తన బాణంతో రావణుని రథం యొక్క ధ్వజం పడగొట్టాడు. రావణుడు పౌరుషం ఎక్కువై గదలు, పరిఘలు, చక్రాలు, రోకళ్ళు, శూలాలు, చివరికి బండరాళ్ళు, కూడా తన మాయాజాలంతో సృష్టించి రాముని మీద ప్రయోగించసాగాడు. కాని అవన్నీ రాముడు వేసిన బాణాల ముందు విఫలమైపోయాయి. రాముడు విసుగు, అలసట లేకుండా వందల, వేల బాణాలు రావణునిపై వేస్తున్నాడు. వారిద్దరి ఆయుధాలతో ఆకాశమంతా నిండిపోయింది. ఆయుద్ధం చూస్తున్న వారికి ఒళ్ళుగగుర్పొడిచింది. రాముడు, రావణుడు తమ రథాల్లో ఒకరిచుట్టు ఒకరు తిరుగుతూ, బాణాల వర్షం కురిపిస్తున్నారు. అలా కొంతసేపయ్యాక, మళ్ళీ ఒకరెదురుగా ఒకరు నిలబడి బాణాలు వేసుకోసాగారు. రావణుడు ప్రయోగించి, ప్రతి బాణాన్ని రాముడు తిప్పికొట్టున్నాడు.

అప్పుడు రావణుడు మాతలి మీద కూడా బాణాలు వెయ్యసాగాడు. అది చూసిన రామునికి చాలా ఆగ్రహం కలిగింది. వెంటనే ఇరవై, ముప్పై బాణాలు ఒకేసారి విల్లులో సంధించి రావణుని పైకి వదలసాగాడు. రావణుడు కూడా గదలు, శూలాలు రామునిపైకి విసరసాగాడు. ఆ ఆయుధాల శబ్దాలకి సముద్రం అల్లకల్లోమైంది. దేవతలు, గంధర్వులు, ఆకాశంలోంచి ఆందోళనగా చూస్తు స్వస్తి వాక్యాలు పలుకసాగారు. రామునికే జయంకలగాలని జయజయనాదాలు చెయ్యసాగారు. ఒళ్ళు గగుర్పొడిచేలా సాగుతున్న ఆ యుద్ధంచూసి, వారిలో

వారు, ఇలా అనుకుంటున్నారు.

"ఆకాశానికి ఆకాశమే సాటి. దానిని పోలినది వేరొకటి లేదు. సముద్రానికి సాటి సముద్రమే. దానిలాంటిది ఇంకోటి లేదు. అలాగే రామ రావణుల యుద్ధానికి అదే సాటి. దీనితో పోల్చదగ్గ యుద్ధం ఎక్కడా జరగలేదు" అని ఆశ్చర్యంగా చెప్పుకుంటూ ఆసక్తిగా చూస్తున్నారు.

రాముడు ఎంతకీ రావణునికి అలసట కలగటం లేదనే రోషంతో మహాశక్తివంతమైన బాణం ఒకటి తీసి, రావణునిపై ప్రయోగించాడు. అది సూటిగా వెళ్ళి రావణుని శిరస్సుని ఛేదించింది. బంగారు కుండలాలతో ప్రకాశిస్తున్న రావణుని శిరస్సు నేలమీద పడిపోయింది. కాని చాలా ఆశ్చర్యం కలిగేటట్టుగా ఆ తలనేల మీద పడగానే మళ్ళీ అదేస్థానంలో ఇంకో తలమొల్చింది. అది అచ్చంగా మునపటి తలలాగే కుండలాలతో, కిరీటంతో, ప్రకాశంతంగా వుంది. ఈ విధంగా నూట ఒక్కసార్లు రాముడు రావణుని తల ఖండించటం, మళ్ళీ ఇంకొకటి మొలవటం జరిగింది. ఎన్ని రకాల అస్త్రాలు ప్రయోగించినా ఫలితం శూన్యమైంది. రావణుని తల ఎప్పటిలా సజీవంగా నిలిచి వుంది. ఈ విచిత్రమేమిటో రాముడికి ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. ఏ బాణాలతో మారీచుడు మరణించాడో, ఏ బాణంతో ఖరదూషణాదిమహావీరులు నేల కూలారో, విరాధుడు, కబంధుడు వేటి చేత చంపబడ్డారో, ఆ బాణాలే ఈనాడు నిష్ప్రయోజనాలైపోతున్నాయి. ఇంత శక్తివంతమైన బాణాలు కూడా రావణుని ఏమీ చెయ్యలేక పోతున్నాయి.

ఇందుకు కారణమమేమిటా? అని రాముడు, ఆలోచించసాగాడు. ఈసారి రావణుని గుండెల మీద బాణం ప్రయోగించి చూశాడు.

రావణుడు కోపంతో గదలు, ముసలాలు రాముని మీదికి విసరసాగాడు. ఇపుడింక దేవ, దానవ, యక్షపిశాచ, ఉరగ, రాక్షసులు, ఆకాశంలోంచి దిగి పర్వతాల మీద నేలమీదా అన్ని చోట్లా గుంపులు గుంపులుగా నిలబడి చూడసాగారు ఆసక్తిగా, రామ రావణులిద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు.

ఆ విధంగా నిర్విరామంగా ఒకరాత్రి, ఒక పగలు యుద్ధం జరిగింది. ఒకర్నిమించిన నైపుణ్యం ఇంకొకరు ప్రదర్శిస్తున్నారు. అందులో ఎవరు జయిస్తారు అన్న విషయం తేలటం లేదు. అపుడు మాతలి రామునితో రహస్యంగా,

"రామచంద్రా. నీ దగ్గర బ్రహ్మాస్త్రం వుందన్న సంగతి మర్చిపోయావా? ఇప్పుడు రావణునికి మరణకాలమాసన్నమైంది. కనుక నువ్వు బ్రహ్మాస్త్రం

ప్రయోగిస్తే అతడు తప్పక మరణిస్తాడు. ఈ విషయం దేవతలు చెప్పారు. ఇంక ఆలస్యం చెయ్యకుండా బ్రహ్మాస్త్రం ప్రయోగించు" అని చెప్పాడు.

అప్పుడు రాముడికి గుర్తొచ్చింది. మునుపు అగస్త్యుడు తనకీ బ్రహ్మాస్త్రము ఇచ్చిన సంగతి. చాలాకాలం క్రితం బ్రహ్మ ఈ అస్త్రాన్ని నిర్మించి, ఇంద్రుడి కిచ్చాడు. ఇంద్రుడు ఈ బాణంతోనే ముల్లోకాల్ని జయించాడు. ఆ బాణాన్నే ఇంద్రుడు అగస్త్యునికిచ్చి, రామునికిమ్మని చెప్పాడు. ఆ బాణానికి, రెక్కల్లా వుండే చోట వాయుదేవుడుంటాడు. మధ్యమొనమీద సూర్యచంద్రులుంటారు. దాని ఆకారం ఆకాశంలా వుంటుంది. దాని బరువు, మేరుపర్వతం, మందరగిరి అంత వుంటుంది. త్రాచుపాము విషం అంత శక్తి కలది. కళ్ళు మిరిమిట్లుగొలిపేటంత కాంతితో మెరుస్తు వుంటుంది. బంగారు మొన కలిగి వుంటుంది. మృత్యువు కన్నా భయంకరమైనది.

అటువంటి దివ్యాస్త్రాన్ని రాముడు మంత్రంతో బాణము మీద అభిమంత్రించి, వేదోక్తమైన విధానముతో, ధనస్సులో సంధించాడు. ఆక్షణంలో భూమి కంపించింది. సర్వభూతాలూ గడగడలాడాయి. రాముడు సూటిగా దానిని రావణుని హృదయం మీదికి ప్రయోగించాడు.

అమోఘమైన ఆ బాణము రావణుని గుండెలలో దూరి, రక్తం చివ్వున పొంగి రాగా, మళ్ళీ అతడి గుండెలో నించి బయటకి వచ్చి, రావణుని ప్రాణాలు బయటకి తోడి, భూమిలో ప్రవేశించింది. భూమిలోంచి మళ్ళీ బయటకి వచ్చి, రాముని అమ్ములపొదిలో దూరింది. ఇదంతా కనురెప్పపాటులో జరిగిపోయింది.

తక్షణం రావణుని చేతిలోని విల్లు జారి నేలమీద పడిపోయింది. రావణుని ప్రాణాలు అనంత వాయువులో లీనమై, చచ్చినేలమీద పడిపోయాడు. ఎప్పుడైతే రావణుడు నేలకూలిపోయాడో, మిగిలిన రాక్షసులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, లంకలోకి పారిపోయారు. వానరులు వారిని తరిమి తరిమి కొట్టారు. అంతరిక్షంలో దేవదుంధుబులు మ్రోగాయి. పరిమళము చిందించే గాలులు వీచాయి. పూలవాన కురిసింది.

దేవతలు ఆకాశంలో బారులు తీరి నిలబడి స్తోత్రపాఠాలతో రాముని కొనియాడారు. రాముడు విజయం సాధించినందుకు సుగ్రీవుడు, అంగదుడు అమితానందం పొందారు. దిక్కులు ప్రసన్నమయ్యాయి. ఆకాశం నిర్మలమైంది. భూమి ప్రకంపనాలు తగ్గి యథాస్థితికి వచ్చింది. విభీషణుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, రాముని చుట్టూ చేరి పూజించారు. జగతిలో ఎటు

చూసినా ఆనందం వెల్లివిరిసింది.

చనిపోయి నేలమీద పడి వున్న సోదరుని చూడగానే విభీషణునిలో దుఃఖం పెల్లుబికింది. దగ్గరగా వెళ్ళాడు. రెండు పాదాలు తాకి నమస్కారం పెట్టాడు.

"వీరాధివీరా పరాక్రమశాలీ, నువ్వుకూడా మృత్యువుని తప్పించుకోలేక పోయావే! ఎంతో కీర్తి ప్రతిష్ట సంపాదించావు. వేదాలు, శాస్త్రాలు అధ్యయనం చేశావు. నేను ఇది వరకే చెప్పాను. రామునితో వైరం వద్దని. అయినా విన్నావు కాదు కదా. నువ్వు కాదు. నీ పరివారం కూడా నా మాటలు పట్టించుకోలేదు. మీ మీ అహంకారానికి తగిన శిక్ష అనుభవించారు. ధర్మాన్ని అతిక్రమించడం వల్ల నీలో తేజస్సు క్షీణించిపోయింది. చల్లారిన అగ్నిశిఖలా పడివున్నావు" అంటూ ఘోరాతి ఘోరంగా విలపించసాగాడు.

రాముడు విభీషణుని లేవదీసి, వీపుతట్టి ఊరగిస్తూ, "విభీషణా ఎందుకలా దుఃఖిస్తున్నావు? నీ సోదరుడు చనిపోలేదు. అచేతనుడయ్యాడంతే. యుద్ధంలో అనన్యసామాన్యమైన శౌర్యాన్ని ప్రదర్శించాడు. వీరమరణం పొందాడు. యుద్ధంలో చనిపోయిన వారి గురించి దుఃఖించకూడదు. నీ సోదరుని పరాక్రమానికి ముల్లోకాలూ, ఆఖరికి ఇంద్రుడు కూడా గడగడలాడాడు. ఈ లోకంలో సూర్యచంద్రులున్నంత వరకు నీ సోదరుడు, కీర్తికాయుడై జీవించే వుంటాడు.

యుద్ధంలో జయాపజయాలు దైవాధీనాలు. కనక నువ్వింక శోకించడం మానేసి జరగవలసిన పనిచూడు" అన్నాడు.

అపుడు విభీషణుడు గద్గద స్వరంతో "రామా మా అన్నయ్య దేవతలంతా కలసికట్టుగా వచ్చి యుద్ధం చేసినప్పుడు కూడా ఓడిపోలేదు. విజయం సాధించాడు. అంతటివాడు ఈనాడు నీతో తలపడి భంగపడ్డాడు. ఎన్నో దానాలు చేశాడు. గురువుల్ని దేవతల్ని పూజించాడు. మహాతపస్సంపన్నుడు. ఇతడికి తలకొరివి పెట్టేందుకు ఒక్కకొడుకైనా బతికిలేడు. కనుక నువ్వు అనుమతిస్తే నేను ఇతడికి అంతిమ సంస్కారం చేస్తాను" అంటూ దీనాతిదీనంగా అడిగాడు.

ఆ మాటలు విన్న రాముడు విభీషణుని ఔదార్యానికి ఆశ్చర్యపోతూ " చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు రాక్షసరాజా. వైరము అన్నది వ్యక్తులు జీవించి వున్నంతవరకే పాటించాలి. ఇప్పుడు నీలాగే ఇతడు కూడా నాకు సన్నిహితుడే. కనక నిస్సంకోచంగా నీ అన్నగార్కి అంతిమ సంస్కారం చెయ్యి. సందేహం వద్దు" అన్నాడు.

రావణుని మరణవార్త అంతఃపురం వరకు పాకింది. అంతఃపురంలోని రాక్షస స్త్రీలంతా పెద్దగా ఏడుస్తు బయటకి వచ్చేశారు. పరుగు పరుగున వచ్చి జుట్లు విరబోసుకుని, దుమ్ములో పడిదొర్లుతూ పెద్ద పెట్టున ఏడవ సాగారు. రాజాధిరాజా, నాథా అంటూ జుట్టు విరబోసుకుని, గుండెలు బాదుకుని ఏడ్చారు. మహావీరుడు, మహాకాయుడు, గొప్ప తేజశ్శాలి. నల్లని కాటుక రాశిలా, అచేతనంగా నేలమీద యుద్ధభూమిలో పీనుగుల మధ్యబురదలో పడివున్నాడు. అందరూ వెళ్ళి మూకుమ్మడిగా రావణుడి శరీరంమీద పడ్డారు. ఒకామె రావణుని కౌగలించుకుంది. ఇంకొకామె అతడి పాదాలు కౌగలించుకుంది. ఒకతి కంఠం, ఇంకొకతి చేతులు, ఈ విధంగా ఎవరికి ఏ అవయవం దొరికితే, అది గుండెలకి హత్తుకుని, ప్రియురాళ్ళంతా అతడి కళేబరం పైబడి గోలుగోలున ఏడ్వసాగారు.

"స్వామీ నీ పేరు చెప్తే ఇంద్రుడు కూడా ఉలిక్కిపడతాడే, కుబేరుని జయించి పుష్పక విమానం సంపాదించావే, అంతటి వీరాధివీరుడివి. నీకీమరణమెలా సంప్రాప్తించింది? కేవలం ఒక మానవుని వల్ల నీకీ దురవస్థ కలగడం చాలా విచిత్రం ప్రభూ, ఎవరెన్ని విధాల చెప్పినా వినకుండా సీత కోసం నీ ప్రాణాల్నే పణంగా పెట్టావా? విభీషణుడు చెప్పిన మాటవిని ఆనాడే సీతని రాముని దగ్గర చేర్చి వుంటే నీకింతటి అనర్థం జరిగేది కాదు కదా. అంతాదైవ నిర్ణయం" అంటూ రావణుని కాంతలు దీనాతి దీనంగా రోదించసాగారు.

రావణుని పట్టమహిషి అయిన మండోదరి కూడా వచ్చింది. ఆమె కూడా దీనంగా ఏడుస్తూ " మహావీరా దేవదానవులకి సింహస్వప్నమైన నువ్వు, ఒక సామాన్య మానవుని చేతిలో మరణించావా! ఎంత వింత! మానవుల కంటబడకుండా అదృశ్యరూపంలో యుద్ధం చెయ్యగల శక్తి కలిగి వుండీ, ఆ రామునితో చేతిలో ఎలా ఓడిపోయావు? ఇది నమ్మదగ్గ విషయంగా లేదు. బహుశా ఆ రాముడు సామాన్య మానవునిలా లేడు. జనస్థానంలో పధ్నాలుగు వేలమంది రాక్షసుల్ని, ఖరదూషణుల్ని సంహరించిన రాముడు మానవుడెలా అవుతాడు? దేవతలు కూడా ప్రవేశించలేని లంకానగరంలో హనుమంతుడు, ఒక వానరుడు ప్రవేశించడం ఎంత వింత! అని మీకు మేము ఆనాడే బోధించాము కదా. దుస్తరమైన మహాసముద్రం మీద వారధి నిర్మించారని విన్నప్పుడే మాగుండెలు అదిరిపోయాయి. అప్పుడే రాముడు సామాన్యమానవుడు కాదని అర్థమై పోయింది. ఆర్యపుత్రా రాముని రూపంలో సాక్షాత్తు ఆ మృత్యువే నీ దగ్గరికి వచ్చింది. ఆ రాముడు సాక్షాత్తు శంఖ చక్రగదాధారుడైన శ్రీ మహావిష్ణువే అయి వుంటాడు. జగత్కర్త కౌస్తుభమణి ధరించిన వాడు. లక్ష్మీసహితుడైన మహావిష్ణువే, లోక రక్షణ

లక్ష్మణుడు విభీషణుని సింహాసనం మీద కూర్చోబెట్టి, ఆ సముద్ర జలాలతో అభిషేకించాడు. రాక్షసులందరి సమక్షంలో, మంత్ర విహితంగా విభీషణుని పట్టాభిషేకం జరిగింది.

రాజ్యాభిషేకం అయ్యాక విభీషణుడు మంత్రులతో కలిసి, బంధువులను కోల్పోయిన వారందరి దగ్గరకి వెళ్ళి, వారినోదార్చి, రాముని దగ్గరకి వెళ్ళాడు. రథంలో వెళ్తున్న విభీషణునికి, పౌరులందరు అనేక కానుకలు సమర్పించారు.

విభీషణుడు సాదరంగా వాటిని తీసుకుని, వాటిని రామునికి, లక్ష్మణునికి చూపించి, వాటిని వారికి సమర్పించాడు. హనుమంతుడు చేతులు కట్టుకుని రాముని పక్కన నుంచున్నాడు.

అపుడు రాముడు హనుమంతునితో హనుమా, నువ్వు కూడా విభీషణుని వెంట లంకకి వెళ్ళు. విభీషణుడు సభా మంటపంలో వుండగా అభినందించి, అక్కడ్నించి నువ్వు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, ముగ్గురు వైదేహి దగ్గరకి వెళ్ళి, మేముకుశలంగా వున్నామన్న సంగతి తెలియజెయ్యండి. రావణుని సంహరించిన సంగతి కూడా చెప్పు. ఆమె ఏమందో వచ్చి నాకు చెప్పు" అన్నాడు. వెంటనే హనుమంతుడు లంకా పట్టణంలోకి బయల్దేరాడు. రాముడు చెప్పిన విధంగానే అశోకవనానికి వెళ్ళాడు.

అక్కడ సీత అదివరకులాగే సంస్కారం లేని తలకట్టుతో, మాసిన బట్టలతో అదివరకు తను చూసినప్పుడెలా కూర్చుని వుందో అలాగే వుంది. ఆమె దగ్గరకి వెళ్ళి తన పేరు చెప్పి నమస్కరించాడు. సీత హనుమంతుని గుర్తించి, పరమానంద భరితురాలైంది. హనుమంతుడు కూడా సంతోషంతో రాముని సందేశం వినిపించాడు.

"అమ్మా రామచంద్రుడు, అతడి అనుచరులు సుగ్రీవుడు, లక్ష్మణుడు, విభీషణుడు, కుశలంగా వున్నారు. రాముడు విభీషణుని సహాయంతో రావణుని చంపికృతార్థుడయ్యాడు. ఇప్పుడు ఆయన నీకుశలం తెలుసుకురమ్మని పంపాడు. రాముడు తన మాటలుగా నీతో "దేవీ పాతివ్రత్యధర్మం బాగా తెలిసినదానివి. మాభాగ్యవశాన జీవించి వున్నావు. నా పరాక్రమం వల్ల యుద్ధంలో విజయం లభించింది. నీకింక దిగులు పడవలసిన అవసరం లేదు. సుఖంగా వుండు. రావణుని బారిన పడిన నిన్ను రక్షించాలని, ఇన్నాళ్ళూ నిద్రాహారాలు మాని ఏకాగ్ర చిత్తంతో వున్నాను. రావణుని చంపి నిన్ను రక్షిస్తానని ప్రతిన పూనాను. ఇపుడు విభీషణుడు లంకకి రాజు అయ్యాడు. అతడు నిన్ను చూడ్డానికి వస్తాడు" అని

హనుమంతుడు చెప్పిన మాటలు విని, సీత ముఖం, వికసించింది. ఆనంద పారవశ్యంతో మాటలు రాక అలా చూస్తూ వుండిపోయింది.

సీత అలా మౌనంగా వుండిపోవటం చూసి హనుమంతుడు ఆశ్చర్యంగా,

"దేవీ, ఏమిటి ఆలోచిస్తున్నావు? బదులు చెప్పవేమి?" అన్నాడు.

సీత గద్గద స్వరంతో "కుమారా నా స్వామి విజయ వార్త వినగానే, ఆనంద పారవశ్యంతో, మాటలురాక నేనేం బదులు చెప్పలేకపోతున్నాను. ఇంతటి ప్రియమైన మాటలు చెప్పిన నీకు బహుమతిగా ఇవ్వటానికి నా దగ్గర ఏం లేదే అని ఆలోచిస్తున్నాను. నీ ఋణం నేనెలా తీర్చుకోగలను?" అంటూ కన్నీరు పెట్టుకుంది.

ఆంజనేయుడు చేతులు జోడించి, "అమ్మా నువ్వెప్పుడూ నీ భర్తయందలి ప్రేమని, అతడి మేలుని మాత్రమే కోరుకుంటావు. నీ భర్త విజయమే నీ అభిమతం. అమ్మా నీ వాత్సల్యం వుంటే చాలదా? రత్నరాశులతోటీ, ధనరాశులతోటీ, కానుకలతోటీ నాకేం పని? మీ ఆప్యాయత ముందు దేవరాజ్యము కూడా సాటి రాదు. శ్రీరాముడు విజయం సాధించాడన్న విషయం నీకు తెలియజేశాను. ఆ సంతృప్తి చాలు నాకు" అన్నాడు.

ఆ మాటలు విన్న సీత చాలా ఆనందించింది. హనుమంతుని చాలా మెచ్చుకుంది. ఆ తర్వాత ఆంజనేయుడు "అమ్మా నిన్ను చిత్రహింసలకి గురి చేసిన ఈ రాక్షస స్త్రీలకి తగిన శాస్తి చెయ్యాలని వుంది. భర్తకి దూరమై నిస్సహాయురాలవై వున్న నిన్ను క్రూరాత్మురాళ్ళైన ఈ రాక్షసిలు ఘోరంగా హింసించి, చంపుతానని బెదిరించటం నేను కళ్ళారా చూశాను. ఇప్పుడు నువ్వు అనుమతిస్తే పిడికిళ్ళతో, పాదాలతో కుళ్ళబొడిచి, మోచేతులతో పొడిచి, పళ్ళురాలగొట్టి, ముక్కు చెవులు కొరికి, జుట్టు పీకి, గోళ్ళతో గీరి, పళ్ళతో కొరికి చంపాలని చాలా కోరికగా వుంది. అప్పటికి కాని నా కసి తీరదు. ఆ రోజు నీకు జరిగిన పరాభవం చూసిన దగ్గర్నించి, నా మనస్సు కుతకుత లాడిపోతుందమ్మా. కనక నీ అనుమతి అయితే, నా పగ తీర్చుకుంటాను" అన్నాడు.

ఆ మాటలకి సీత చిన్న నవ్వింది. "కపివర్యా, వీరంతా రావణుని దాసీలు. వీరి మీద కోపమెందుకయ్యా? వీరు తమ ప్రభువు ఆజ్ఞకి లోబడి అతడి ఆదేశాలన్ని పాలించారంతే. అలా చెయ్యకపోతే, తమని దండిస్తాడని భయం. కనుక వారినలా చెయ్యడానికి ఆదేశించిన ప్రభువుపై కోపం ఉండాలి గాని, దాసీజనంపై

వుండకూడదు. అయినా ఒకర్ని నిందించి లాభం ఏమిటి? నా తలవ్రాత అలా వుంది. కర్మఫలం అనుభవించి తీరాలి" అని మృదువుగా అతడి కోరిక తప్పు అని చెప్పింది. ఆమె మాటలలోని వాస్తవం గుర్తించాడు హనుమంతుడు. ఆమె ఔదార్యానికి అబ్బురపడ్డాడు.

"అమ్మా, నువ్వు శ్రీరామచంద్రుని ఇల్లాలివి. కనుకనే అలా చెప్పగలిగావు. మరింక నాకు అనుమతిస్తే వెళ్తాను" అన్నాడు. అపుడు సీత కన్నీరు తుడుచుకుంటూ,

"హనుమా నాకు నా భర్తని చూడాలని వుందయ్యా" అంది. ఆమెలోని ఆత్రుత గుర్తించాడు హనుమ. "అమ్మా నేను వెళ్ళగానే నీ భర్త, లక్ష్మణుడు నీ దగ్గరకి వస్తారు" అని ఆమెకి ధైర్యం చెప్పి వెంటనే ఆకాశంలోకి ఎగిరి వెళ్ళి రాముని దగ్గర వాలాడు. రామునికి నమస్కరించి

"ప్రభూ మనమందరం ఎంతో కష్టపడి, ఈ లంకకి వచ్చి, రావణునితో యుద్ధం చేసిందీ, విజయం సాధించిందీ, ఆ సీతమ్మ కోసమే కదా. అక్కడ అశోకవనంలో ఆమె శోకంతో తపించి పోతోంది. ఆమహాసాధ్విని వెంటనే చూడడం మీకు ఉచితం. నేను ఆమె దగ్గరకి వెళ్ళి మీరు చెప్పమన్న మాటలు చెప్పాను. ఆ మాటలు విని ఆమె ఎంతో సంతోసించింది. కన్నులారా మిమ్మల్ని, తన మరిదియైన లక్ష్మణుని చూడాలని ఆమె ఎంతో ఆత్రుతపడ్తోంది" అన్నాడు.

ఆ మాటలు విన్న రాముడికి కళ్ళనిండా నీళ్ళు నిండాయి. వేడిగా నిట్టూర్పులు విడిస్తూ, పక్కనే వున్న విభీషణునితో "విభీషణా వెంటనే వెళ్ళి సీతకి నీదాసీ జనము చేత అభ్యంగన స్నానము చేయించి, ఆభరణములు అలంకరింపజేసి, నీ వెంట పెట్టుకుని తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. .

విభీషణుడు వెంటనే అంతఃపురానికి వెళ్ళాడు. తన స్త్రీలను వెంట పెట్టుకుని అశోకవనానికి వెళ్ళి, సీతమ్మతో ఇలా విన్నవించాడు.

"అమ్మా మీరు తొందరగా అభ్యంగన స్నానం చేసి, అలంకరించుకుని, తన దగ్గరకి రావలసిందిగా శ్రీరామచంద్ర ప్రభువు ఆజ్ఞాపించారు. ఆయన వెంటనే మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు" అని తన రాణుల ద్వారా, ఆమెకి చెప్పించాడు.

కాని సీత చిన్నబోయిన ముఖంతో "విభీషణా నేను ఇప్పుడు ఎలా వున్నానో అలాగే ఆయనని చూడాలని అనుకుంటున్నాను" అంది రాముని తొందరగా చూడాలనే ఆత్రుతతో.

విభీషణుడు ఆమె మనస్సులోని భావం గ్రహించాడు. "అమ్మా, నీ భర్త శ్రీరాముడు మాకందరికీ ప్రభువు. మేమంతా ఆయన భృత్యులం. కనుక వారి ఆజ్ఞ మీరడం అనుచితం. ఆయన ఆజ్ఞాపించినట్లు చెయ్యటమే మనందరి కర్తవ్యం" అన్నాడు. సీత సరే అని బయల్దేరింది.

అంత:పుర స్త్రీలు స్నానం చేయించారు. విలువైన పట్టుబట్టలు, దివ్యాభరణాలు ధరింపచేశారు. చక్కగా అలంకరించి, పల్లకిలో ఆమెని కూర్చోబెట్టి, ఆపల్లకీకి పట్టు పరదాలు వేశారు. వెనక ముందు పక్కల ఆమె రక్షణ కోసం రాక్షసులు నడుస్తుండగా, సీతని రాముడుంటే ప్రదేశానికి తీసికెళ్ళాడు విభీషణుడు. కొంతదూరంలో పల్లకి ఆపి, విభీషణుడు ముందుగా వెళ్ళి, రామునికి నమస్కరించి నిలబడ్డాడు. రాముడు ఏదో ఆలోచిస్తూ పరాకుగా వున్నాడు. అన్యమనస్కంగా వున్న రామునికి ఆనందం కలిగించాలని, "రామా సీతమ్మ నీదర్శనానికి వచ్చింది" అని నివేదించాడు.

ఆమాట విన్న రామునికి సీతని చూడబోతున్నాను కదా అనే ఆనందము, రావణభవనంలో సంవత్సర కాలముంది కదా అని రోషము, ఎన్నెన్నో ఇక్కట్లు, పడరాని బాధలు పడింది కదా అనే బాధ, ముప్పిరిగొన్నట్లు వచ్చాయి. అయినా తన ముఖంలో ఏ భావమూ పైకి కనబడనియ్యకుండా, మెల్లిగా "విభీషణా నా ఈ విజయానికి కారణం నువ్వే. కనక నువ్వే ఆమెని ఇక్కడ ప్రవేశపెట్టు" అన్నాడు.

విభీషణుడు పల్లకి దగ్గరకి వెళ్ళి కూడా వచ్చిన పరివారాన్ని దూరంగా వెళ్ళిపొమ్మని, ఆజ్ఞాపించాడు. ఆమె అంత:పురకాంత, కనుక ఆమెని ఎవ్వరూ చూడకూడదు అన్నాడు. అప్పుడు తలపాగా ధరించి, దండధారులైన సేవకులు రాక్షస పరివారాన్నంతా, దూరంగా వెళ్ళి పొమ్మని వెనక్కి, వెనక్కి పంపెయ్య సాగారు. వానరులందరూ సీతమ్మని చూడాలని, తోసుతోసుకుని ముందుకి వస్తుంటే, వాళ్ళని కూడా దూరంగా వెళ్ళిపొమ్మని సేవకులు పంపించేస్తున్నారు. వారంతా గొడవ పడడం మొదలు పెట్టారు. ఆ కోలాహలం రాముడు విన్నాడు. రాముడిక్కోపం వచ్చింది. తనకింత సహాయం చేసిన వానరుల్ని వారలా నిర్దాక్షిణ్యంగా తోసెయ్యటం రాముడు సహించలేకపోయాడు. సేవకుల్ని వారిస్తూ కోపం ఇలా అన్నాడు.

"విభీషణా వారంతా మనవారే. వారిని వెనక్కి ఎందుకు నెట్టేస్తున్నారు? వారు సీతని చూడతగని వారు కాదు. అంత:పురం స్త్రీలకి మేలిముసుగు వుండడం సాంప్రదాయమే. అయినా అలాంటి సత్కారాలిపుడవసరం లేదు. ప్రాకారాలు కట్టటం, మేలి ముసుగులు, పరదాలు, ఇవన్నీ వారు ఇతరులకంట బడకుండా

వుండటం కోసం కాదు. వీరి దృష్టి ఎదుటి వారిపై బడి, వీరి మనస్సు చలించకుండా వుండటానికి నిజానికి స్త్రీలకి శీలమే మేలి ముసుగు. శీలము లేని వారికి, మేలి ముసుగు వల్ల ప్రయోజనం లేదు. ఇంకో సంగతి గుర్తుపెట్టుకో. రాజ్యంలో సంక్షోభం కలిగినప్పుడు, స్వయంవరం జరిగినప్పుడు, యజ్ఞయాగాదిక్రతువులలో, వివాహ సమయంలో, రాజకాంతలు మేలి ముసుగు ధరించకుండా, అందరిలోకి రావచ్చును. అది దోషం కాదు. ఇప్పుడు ఇక్కడ యుద్ధం జరిగింది. కనుక ఇది సంకట పరిస్థితి. ఇప్పుడు ఆమెని అందరూ చూడటం తప్పు కాదు. కనుక ఆమెని వెంటనే తీసుకురా. నామిత్రులతో కలిసి ఆమెని చూడాలి" అన్నాడు.

రాముని మాటలు విన్న విభీషణుడు బిత్తరపోయాడు. ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు. తర్వాత తలవంచుకుని వెళ్ళి అందరి సమక్షంలో ఆమెని తీసుకొచ్చి రాముని ముందు నుంచోబెట్టాడు. కాని ఆ సంఘటన చూసిన సుగ్రీవుడు, హనుమంతుడు, లక్ష్మణుడు, చాలా బాధపడ్డారు. రాముడు, భార్యపై ప్రేమలేనట్లు ఉపేక్షతో మాట్లాడిన నిష్ఠురోక్తులు విని, నిజంగానే రామునికి సీతంటే మనమనుకున్నంత ప్రేమ లేదా, అని వారికి అనుమానం వచ్చింది.

సీత కూడా ఒంగి, ఒంగి అవయవాలన్నీ ముడుచుకుని, మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటు, తలదించుకుని, సిగ్గుతో ముడుచుకుపోతున్నట్లు వచ్చి రాముని ఎదుట నిలుచుంది. పైటచెంగుతో ముఖం కప్పుకుని నిలబడింది. ఎలాగోలా గొంతు పెగుల్చుకుని "ఆర్యపుత్రా" అంది. అంతే ఆపైన కంఠం రుద్ధమైపోయింది. నోట మాట రాలేదు. ఏడుస్తు నిలబడింది. కన్నులు తుడుచుకుని రాముని కళ్ళారా చూసింది.

ఇప్పటి దాకా రాముడ్ని మళ్ళీ చూస్తానన్న ఆశ ఆమెకి లేదు. కనక ఆయన దివ్య సుందరవదనం చూసే సరికి ఆమెకి ఆశ్చర్యం, సంతోషం, ప్రేమ, ఒక్కసారిగా పొంగి, ఉక్కిరి బిక్కిరై ముఖంపైకెత్తి ఆప్యాయంగా భర్త కళ్ళల్లోకి చూసింది. ఆమెలోని మనఃక్లేశమంతా పోయింది. పూర్ణచంద్రునిలా ఆమె ముఖం వెలిగిపోయింది.

కాని వానరులు, రాక్షసులు, చుట్టు నిలబడి వున్న సభా మధ్యంలో రాముడు తన పక్కకి వచ్చి వినయంతో నిలబడి వున్న సీతని చూస్తూ కోపం నిండిన కంఠంతో నిష్ఠూరంగా

"మైథిలీ, శత్రువుని జయించి, రెండోసారి నిన్ను గెల్చుకున్నాను. పౌరుషం గల భర్తని అని నిరూపించుకున్నాను. రావణునిపై పగ తీర్చుకున్నాను. నాకు నా

శత్రువు వల్ల జరిగిన అవమానం తీరింది. నా శ్రమ ఫలించింది. నా ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాను.

ఇపుడు నేను స్వతంత్రుణ్ణి.

చపలచిత్తుడైన ఆ రాక్షసుడు విన్నెత్తుకుపోవటం అన్నది దైవీకంగా జరిగింది. అయినా మానవ ప్రయత్నం చేసి నేను దైవాన్ని కూడా జయించాను. నా కోసం హనుమంతుడు, దుస్తరమైన సముద్రాన్ని దాటి లంఘించి లంకని చేరి, లంకలోని వారినందర్నీ భయభ్రాంతుల్ని చేసి, అనితర సాధ్యమైన సాహసకృత్యం చేశాడు. అతడి శ్రమ కూడా సఫలమైంది. యుద్ధంలో కూడా తన సాహసంతో రాక్షసులతో పోరాడి, ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన సాహసాలు చేసి నా కండగా నిలబడ్డాడు హనుమ. ఇదిగో ఇతడు నీకు తెలుసుగా.

గుణహీనుడైన సోదరుని వదిలి పెట్టి, నా మీద భక్తితో, నన్ను శరణు కోరి వచ్చిన విభీషణుని శ్రమ కూడా ఫలించింది. అంటూ రాముడు తన ధోరణిలో చెప్పుకుపోతుంటే, తను ఎటువంటి అప్రియమైన మాటలు వినవలసి వస్తుందో అని గుండెలు చిక్కబట్టుకుని సీత లేడి పిల్లలా బెదురు చూపులు చూస్తూ కంట నీరు కారుస్తు నిలబడింది.

ఆమె అలా కన్నీరు కార్చడం, రామునికి అగ్నిలో ఆజ్యం పోసినట్లైంది. కనుబొమలు ముడిచి, తలపక్కకి తిప్పుకున్నాడు. సీతవంక చూడకుండా కఠినంగా అందరికీ వినపడేలా ఇలా అన్నాడు.

"సీతా అవమానం పొందినవాడు, ఆ అవమానం పోగొట్టుకుందుకేం చెయ్యాలో అన్నీ చేశాను. యుద్ధంలో మేమంతా ఎంతటి కఠినమైన బాధలు పడ్డామో నీకు తెలిసే వుంటుంది.

కాని, ఇంత శ్రమా నేను నీకోసం మాత్రం పడలేదు. రాజు అయినవానికి అపవాదు, అపకీర్తి కలగకూడదు. నేను సుక్షత్రియుడైన రాజకుమారుణ్ణి. అందుకే నాకొచ్చిన అపకీర్తి బాపుకుందుకు ఇంత కష్టపడ్డాను. చాలా శ్రమపడి నా వంశకీర్తి నిలుపుకున్నాను. మా వంశం చాలా పవిత్రమైనది. పరులు అపహరించిన భార్యని రక్షించలేని అసమర్థునిగా లోకం నిందిస్తుందని, నిన్ను రక్షించాను. కాని నువ్వు బలవంతుడు, ఐశ్వర్యవంతుడు, యౌవనవంతుడు, అయిన రావణుని వంశంలో ఇన్నాళ్ళుండి, అందగత్తెవు, యువతివి, అయిన నువ్వు, పవిత్రంగా వున్నావంటే ఈ లోకంనమ్మదు. రావణుడు తన ఒడిలో కూర్చోపెట్టుకుని నిన్నుతెచ్చాడు. ఆ విధంగా కూడా నీ శరీరం కళంకమైంది. ఇంక నువ్వు పవిత్రురాలువెలా

అవుతావు? అటువంటి నిన్ను నేనెలా పరిగ్రహించగలను? కనక ఇప్పుడింక నాకు నీతో పని లేదు. నీ ఇష్టమైన చోటుకి వెళ్ళవచ్చు.

ఉత్తమవంశంలో పుట్టిన పురుషుడు, పరాయిగృహంలో కొన్నాళ్ళున్న స్త్రీని స్వీకరించలేడు. అందువల్ల నీ ఇష్టం వచ్చిన చోట వుండేందుకు అనుమతిస్తున్నాను. లక్ష్మణుని దగ్గర కాని, భరతుని దగ్గర కాని, సుగ్రీవుని దగ్గరగాని, విభీషణుని దగ్గరగాని నీకెక్కడ సుఖంగా వుంటుందనుకుంటే, అక్కడే వుండు" అని రాముడనగానే రాముని నోట ప్రియమైన మాటలు తప్ప, అటువంటి కఠినమైన మాటలు ఎప్పుడూ విని ఎరుగని సీత ఒక్కసారి నిలువెల్లా ఒణికి పోయింది. నిలువెల్ల సిగ్గుతో కృంగిపోయింది. ఆమె మనస్సు తీవ్రంగా గాయపడింది. కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారసాగాయి. గద్గద స్వరంతో చేతులు జోడించి,

"ప్రభూ వినటానిక్కూడా పరుషంగా వున్న ఈ మాటలు అంటున్నది మీరేనా ఒక సామాన్యుడు తన భార్యని నిందించినట్లు ఇలా అనడం ఉచితమేనా? మహాబాహూ మీరునుకుంటున్నట్లు నేను కళంకితని కాను. నా జీవితం మీద ఒట్టు పెట్టి చెప్తున్నాను. నా మాట నమ్మండి. నా స్వభావం మీరెరుగరా? రావణుడు నన్ను తాకిన మాట నిజమే. కాని అప్పుడు నేను భయంతో ఒళ్ళు మరచి తెలివి తప్పి వున్నాను. విధి వైపరీత్యం వలన జరిగిన దుస్సంఘటన అది. అయినప్పటికీ నా మనస్సు మాత్రం మీయందే లగ్నమై వుంది. ఇంతకాలం మనం కలిసి వున్నాము. నా గురించి మీకు బాగా తెలుసు. అయినప్పటికీ మీరు ఇంతనిష్టూరంగా మాట్లాడుతున్నారంటే నేను బ్రతికి వుండీ చనిపోయిన దానితో సమానం. మీ మనసులో ఇటువంటి వుద్దేశ్యం వున్నప్పుడు ఆనాడు హనుమంతుడు లంకకి వచ్చినపుడే చెప్పి పంపవలసింది. అప్పుడే ప్రాణత్యాగం చేసుకుని వుండేదానిని.

సేతు బంధనం, సముద్ర లంఘనం, యుద్ధం, ఇటువంటి క్లేశాలుండేవి కాదు కదా. నేను జనక మహారాజు కుమార్తెని, భూమిలో నించి పుట్టిన దానిని. అతి చిన్న వయస్సులో మీ చెయ్యి పట్టి, నా వారందర్నీ వదిలిపెట్టి మీ వెంట నడిచి వచ్చాను. అప్పట్నించీ మిమ్మల్నే దైవంగా ఆరాధించాను. అవన్నీ పక్కకి పెట్టి ఎంతటి నిందనాపైన వేశారు!" అని ఏడుస్తూ ఇంక మాటలు రాక, లక్ష్మణుని వంక తిరిగి,

"లక్ష్మణా నా ఈ ఆపదకి, తగిన మందు చితి. చితిని పేర్పించు. అసత్యమైన అపవాదుకి తలవంచి బ్రతకలేను. ఇంతమంది ఎదుట, నా భర్త నన్ను నా ఇష్టం వచ్చిన చోటుకి పొమ్మని వదిలేశారు. ఇప్పుడింక నేను చేరవలసిన చోటు

అగ్నిహోత్రమే. అక్కడికే వెళ్తాను" అని సీత అంటుంటే, లక్ష్మణునికి చెప్పలేని దుఃఖం కలిగింది. రాముని ముఖం వైపు చూశాడు. అతడు మౌనంగా వేరొక దిక్కు చూస్తూ నిలబడి వున్నాడు. అంటేసీత నిర్ణయం అతడికంగీకారమే అని గ్రహించాడు. లక్ష్మణుడు వెంటనే మారు పలకకుండా చితిని పేర్పించాడు.

సీత తలదించుకుని, మెల్లిగా రామునికి ప్రదక్షిణం చేసి, మంటలు ఎగిసి పడ్తున్న అగ్ని హోత్రాన్ని సమీపించింది. దేవతలకు, బ్రహ్మణులకి నమస్కరించింది. రెండు చేతులు జోడించి అగ్నిహోత్రం దగ్గర నిలబడి,

"నా హృదయము రామునిపై తప్ప, మరి యొకరివైపు ఏనాడూ పోలేదన్నందుకు ఋజువుగా, నా శీలమునకు సాక్షీభూతుడైన ఆయనే నన్ను కాపాడుగాక. రాముడు దుష్టశీలినని నిందించిన నేను, పవిత్రమైన దానినని, అగ్నిహోత్రుడు సకల లోకములకి సాక్షిగా నిల్చి, నాపాతివ్రత్యమును ఋజువు చేయుగాక. త్రికరణశుద్ధిగా నేను రాముణ్ణే నమ్ముకున్నానని, మరొకరివైపు కన్నెత్తి కూడా చూడలేదని, ప్రకటించి, అగ్నిహోత్రుడు, నన్ను కాపాడు గాక.

సూర్యుడు, చంద్రుడు, వాయువు, దిక్పాలురు, పగలు, రాత్రి, సంధ్యలు, భూమి, దేవతలు, అగ్నిహోత్రుని సాక్ష్యము వలన నా పాతివ్రత్యం గుర్తించెదరు గాక" అని పలుకుతూ సీత అగ్ని హోత్రానికి ముమ్మారు ప్రదక్షిణం చేసి, ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో నిర్భయంగా దూకేసింది. చుట్టు పక్కల వున్న వారంతా హాహాకారాలు చేశారు. భయంతో ఎలుగెత్తి కేకలు వేశారు.

కాని రాముడు మాత్రం వ్యాకుల మనస్కుడై, కళ్ళ నిండగా నీరు నిండగా చూస్తూ ఊరుకున్నాడే తప్ప వారించలేదు.

అంతలో ఆకాశమార్గాన, కుబేరుడు, యమధర్మరాజు, ఇంద్రుడు, వరుణుడు బ్రహ్మ, పరమేశ్వరుడు, మొదలైనవారంతా తమ తమ వాహనాలతో లంకా నగరానికి వచ్చేశారు. రాముడు సామాన్యమానవునిలా వారి ముందుచేతులు జోడించి నిలబడ్డాడు.

వారంతా చేతులెత్తి రామునితో, "రామా ఏమిటిది? సర్వలోక కర్తవు నువ్వే కదా. సర్వజ్ఞుడవైననువ్వు సీతఅగ్నిహోత్రంలో ప్రవేశిస్తుంటే చూస్తూ ఊరుకుంటావా? నీ గురించి నువ్వు తెలుసుకోలేక పోయావా? వసువు, ప్రజాపతి, సృష్టికర్త బ్రహ్మ, వీరందర్నీ సృష్టించిన మొదటి సృష్టికర్తవి నువ్వే కదా. సర్వలోకాల్ని నియమించిన వాడివి నువ్వే. నువ్వే రుద్రుడివి. దేవతలంతా నీ శరీరంలోని భాగాలే కదా.

నీ చెవులు అశ్వనీ దేవతలు. నీ కన్నులు సూర్యచంద్రులు. సృష్టికి ఆది,

అనాది అయిన వాడివి నువ్వే. అంతటి వాడివైన నువ్వు, ఒక పామరుడిలా సీతనిలా ఉపేక్షించటం న్యాయమేనా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించారువారు.

అప్పుడు రాముడు నిశ్చలంగా వారివంక చూస్తూ "అయ్యలారా నేను దశరథ కుమారుడైన రాముడ్ని. ఇదే నాకు తెలిసిన నిజం. ఇంతకన్నా మీరు చెప్పినదేదీ నేనెరుగను. కనక మీరు నా గురించి ఇంక కొంచెం వివరంగా చెప్పవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు.

అప్పుడు బ్రహ్మదేముడు, "రామా నేను చెప్తాను విను. నువ్వు సత్యపరాక్రముడివి. నిజమే. కాని యదార్థం చెప్తాను విను. దేవదేవుడైన నారాయణుడివి నువ్వు. వరహావతారంలో లోకాలనుద్ధరించినవాడివి. మహావిష్ణువివి. విష్వక్సేనుడవు. చతుర్భుజుడివి నువ్వే. నువ్వే హృషీకేశుడివి. నరుడివి. పురుషోత్తముడివి. సేనానివి, గ్రామణివి, బుద్ధివి, క్షేమమువి, పౌరుషానివి, ఉపేంద్రుడివి, మధుసూధనుడివి, దేవేంద్రుడివి, పద్మనాభుడివి.

రణాంతకృత్తువి, మహర్షులందరికీ శరణ్యుడివి సహస్ర శృంగుడివి, వేదాత్మవి, శతజిహ్వుడివి, స్వయంప్రభువువి, సిద్ధులకి సాధ్యులకి ఆశ్రయ భూతుడివి, యజ్ఞము, యజ్ఞకర్త నువ్వే" ఓంకారము, పరంతపము నువ్వే.

ప్రభావము, తేజస్సు, స్వయం ప్రకాశము కలిగిన నువ్వు, నీ స్వరూపము, నువ్వే తెలుసుకోలేకపోతున్నావా!

సర్వభూతాలలో, బ్రాహ్మణులలో, ఆవులలో, సముద్రాలలో, ఆకాశంలో, పర్వతాలలో, అడవులలో, చరాచరాత్మకమైన యావత్ సృష్టిలో వున్నదీ నీ రూపమే గదా. వీటన్నింటికీ ఆధారభూతమైన ఈ భూమిని భరించేవాడివీ నువ్వే. ఈ పృధ్వి అంతా ప్రళయంలో లీనమైనప్పుడు, శేషశాయిపై శయనించి, ముల్లోకాల్ని నీకుక్షిలో ధరించినవాడివీ నువ్వే. యావజ్జగములకి, ఆత్మవినువ్వే. చతుర్ముఖములు కల్గిన బ్రహ్మని నేను నీ హృదయాన్ని. సర్వస్వతీదేవి నీ నాలుక.

నువ్వు రెప్పలు మూసినప్పుడు రాత్రి, తెరచినప్పుడు పగలు. ఈ జగత్తంతా నీ శరీరం, నీ వల్లనే అగ్నిలో వేడి, చంద్రునిలో చల్లదనం కలుగుతున్నాయి. త్రివిక్రముడైన వామనుని రూపంలో నీ మూడుపాదాలతో ఈ ముల్లోకాల్ని ఆక్రమించిన వాడివినువ్వే. సీత సాక్షాత్తు మహాలక్ష్మి. నువ్వు సాక్షాత్తు మహావిష్ణువువి.

ఇప్పుడు కేవలం రావణుణ్ణి సంహరించడానికి ఇలా మానవునిగా అవతరించావు. ధర్మశీలుడవై దేవకార్యం నెరవేర్చావు.

నీ అవతార పరమార్థం నెరవేరింది. ఇంక ఈ శరీరాన్ని విడిచి, మళ్ళీ నీ దివ్య శరీరాన్ని ధరించి, వైకుంఠానికి వేంచెయ్యి ప్రభూ.

ఇప్పుడు నేను ఏదైతే స్తోత్రం పఠించానో, ఇది చాలా ఫలప్రదమైనది. ఈ స్తోత్రం. నిత్యము పారాయణ చేసిన వారు, ఈ లోకంలో సర్వ ఈప్సితములు పొంది, అంత్యకాలములో పరమ పదానికి వెళ్తారు. అంతేకాదు. ఈ స్తోత్రం నిత్యంపఠించే వారికి, పరాభవమన్నదే వుండదు" అంటూ బ్రహ్మ రాముని యదార్థరూపాన్ని నిరూపిస్తూ కీర్తించాడు.

అంతలో అగ్నిహోత్రంలోంచి ఈ స్తోత్రము విన్న అగ్నిదేవుడు, సీతమ్మని రెండు చేతులతో పైకెత్తిపట్టుకుని పైకి వచ్చాడు. సీత ఉదయభానునిలా ప్రకాశిస్తోంది. ఆమె ధరించిన బంగారు ఆభరణాలు మరింత కాంతితో మెరుస్తున్నాయి.

ఆమె ధరించిన పూలమాలలు గాని, పట్టు వస్త్రాలు గాని, ఆభరణాలు గాని ఇసుమంతైనా వాడలేదు. పొత్తిళ్ళలో పసిపాపని పట్టుకున్నట్లు సీతని పట్టుకుని తెచ్చి అగ్నిదేవుడు రామునికి అర్పించాడు.

సకల లోకాలకీ సాక్షీభూతుడైన అగ్నిదేముడు సీతని రామునికిస్తు ఇలా అన్నాడు.

"రామా ఇదిగో సీత. ఈమెలో ఏ దోషం లేదు. ఈమె నీ సహధర్మ చారిణి. నిన్ను తప్ప వేరొకర్ని ఎరుగదు. ఉత్తమమైన నడవడిక గలది.

మదాంధుడైన రావణుడు ఈమెని అపహరించాడు. అసహాయురాలై, రావణుని భవనంలో బంధించపడినప్పటికీ, ఈమె ప్రతిక్షణం నిన్నే స్మరిస్తూ గడిపింది. వికృతాకారం కలిగిన రాక్షస స్త్రీలు ఈమెని చాలా జాగ్రత్తగా కాపాడారు. అహర్నిశాలు నిన్నుతప్ప వేరొకర్ని తలవలేదు.

రావణుడెన్నో విధాల ప్రలోభపెట్టాడు. భయపెట్టాడు. బెదిరించాడు. అయినా సరే ఈ మహాసాధ్వి వాణ్ణి లెఖ్ఖచెయ్యలేదు. నిన్నే స్మరించింది. రామా ఈమె పరిశుద్ధమైనది. పాపము ఎరుగనది. ఈమెని స్వీకరించు. ఈమెను ఏ విధంగానూ బాధించకు. ఇది నా ఆజ్ఞ" అన్నాడు.

ఆ మాటలకి రాముడు చాలా తృప్తి పడ్డాడు. క్షణకాలం కన్నీరు నిండగా, తమాయించుకుని అగ్నిదేవునితో ఇలా అన్నాడు.

"ఆర్యా, మీరు చెప్పినది యదార్థమే. ముల్లోకాలలోనూ సీతకన్నా పవిత్రురాలు

లేదు. ఆ సంగతి నాకూ తెలుసు. కాని రావణాంతఃపురంలో ఈమె చాలాకాలం వుంది. నేను ఆమె పవిత్రతని నిరూపించకుండా స్వీకరిస్తే లోకులు నన్ను మూర్ఖుడంటారు. సత్యవ్రతము గలవాడినికనక ఆమె అగ్నిలో ప్రవేశిస్తున్నా అభ్యంతరం చెప్పలేదు. ఆమె తన పాతివ్రత్య మహిమతో తననితానే రక్షించుకుంది. ఆమె మండుతున్న నిప్పులాంటిది. కనుక రావణుడు ఆమెని తాకలేదు. మీ మాట నాకు శిరోధార్యము. నేనింక ఈమెని వదలను. సూర్యుని చుట్టు వెలుగు ఎలా వుంటుందో, అలాగే ఆమెను నేను అంటిపెట్టుకుని వుంటాను" అన్నాడు పరవశంతో.

అప్పుడు పరమేశ్వరుడు, "మహాబాహూ, పరంతపా, శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడివి నువ్వే. మా భాగ్యవశాత్తు లోకకంటకుడైన రావణుడ్ని వధించావు. లోకాలన్నింటికీ పీడ తొలగిపోయింది. ఇపుడింక నువ్వు అయోధ్యకి వెళ్ళి దీనుడైవున్న భరతుని ఓదార్చు. నీ తల్లుల్ని ఆనందింపజేయ్యి. ఇక్ష్వాకు వంశాన్ని ఉద్ధరించు. అశ్వమేధాది యాగాలు, క్రతువులు చేసి కీర్తి ప్రతిష్టలు సంపాదించు. భూలోకంలో నీ కర్తవ్యం పూర్తయ్యాక వైకుంఠానికి తిరిగిరా.

అదిగో అటు చూడు. నీ తండ్రి దశరథ మహారాజు. విమానంలో కూర్చుని నిన్ను చూస్తున్నాను. ఈ మానవలోకంలో నీ కన్న తండ్రి అతడు. నీకు జన్మనిచ్చి తరించాడు. అయితే నువ్వు అరణ్యవాసం చేస్తున్నావన్న బాధతో అతడు పరమపదం పొందడానికి నిరాకరించి, ఇంతకాలం ఇంద్రలోకంలో వేచి వుండి, రావణవధ చేసిన నిన్నుచూడాలని వచ్చాడు. నువ్వూ లక్ష్మణుడు అతడికి నమస్కరించండి" అని చెప్పాడు. తెల్లనివస్త్రములతో కాంతిపుంజాలతో వెలిగిపోతున్న తండ్రిని రామలక్ష్మణులు చూశారు. శిరసా నమస్కరించారు. దశరథుడు కుమారుల్ని చూడగానే సంతోషంతో కౌగలించుకుని, ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు.

"రామా, నువ్వు లేని స్వర్గము, వైకుంఠము కూడా నాకక్కరలేదు. నన్ను దేవతలు, ఋషులు ఎంతో గౌరవించారు. అయినా అక్కడ వుండలేకపోయాను. ఈనాడు నువ్వు ఒక మహారాక్షసుణ్ణి సంహరించావని తెలిసి చాలా సంతృప్తి కలిగింది. ఆ రోజు నీకు పట్టాభిషేకం చెయ్యాలనుకున్నప్పుడు కైకేయి అన్న మాటలు ఇప్పటికీ నాకు బాధ కలిగిస్తున్నాయి. కాని ఇప్పుడు రావణ వధ చేసి లోక కళ్యాణము గావించి, సీతా లక్ష్మణులతో కుశలముగా వున్నావని తెలిసి, ఆ దుఃఖం పటాపంచలైపోయింది. నిన్ను కుమారునిగా పొంది నేను తరించాను. ఇదంతా రావణ వధ కోసం దేవతలు చేసిన పన్నాగం అని తెలిసింది. నీ తల్లి కౌసల్య ధన్యురాలు. మళ్ళీ నిన్ను చూసుకునే భాగ్యానికి నోచుకుంది.

నువ్వు నీ ప్రతిజ్ఞ నెరవేర్చి వనవాసం పూర్తి చేశావు. రావణుని వధించి శాశ్వతమైన కీర్తి సంపాదించావు. ఇంక తమ్ముళ్ళతో కలసి, సుఖంగా రాజ్యం పరిపాలించుకో" అని దీవించాడు.

అప్పుడు రాముడు చేతులు జోడించి, "ధర్మజ్ఞా కైకేయినీ, భరతునీ, నువ్వు అనుగ్రహించు. ఇది వరలో వారితో నీకెలాంటి సంబంధమూ లేదని నువ్వు పలికిన మాటలు ఉపసంహరించుకో"అన్నాడు.

దశరథుడు సరే అని అంగీకరించాడు. ఆ తర్వాత రామలక్ష్మణుల్ని గట్టిగా కౌగలించుకుని,

"లక్ష్మణా రామునికి సీతకి భక్తితో పరిచర్యలు చేసి నాకు సంతృప్తి కలిగించావు. నువ్వు ధర్మజ్ఞుడివి. ధర్మఫలము, రాముని అనుగ్రహం కూడా పొందావు. సౌమిత్రీ ఇలాగే జీవితాంతం రాముని సేవించు. నీకు శుభం కలుగుతుంది. రాముడు సర్వోత్తముడు. ముల్లోకాలూ, దేవతలూ, ఇంద్రుడు, ఋషులు అందరూ రాముని పురుషోత్తముడని అర్చిస్తున్నారు. రాముడే అంతర్యామి రాముని రూపంలో అవతరించిన పరబ్రహ్మ అతడు. కనుక నువ్వు నిరంతరం సీతారాముల్ని సేవించి, కైవల్యం పొందు" అని దీవించి సీతతో "అమ్మా రాముడు, నిన్ను పరిత్యజిస్తానన్నాడని బాధపడకు. నీ పవిత్రత లోకాలకి తెలియజెయ్యాలని అలా అన్నాడు. నీ భర్తయే నీ పరమదైవము. ఆ సంగతి నీకు నేను చెప్పక్కరలేదు" అని ఆమెని దీవించి, దశరథుడు విమానంలో వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఇంద్రుడు చేతులు జోడించి, రామునితో "పరంతపా, రామా. ఈ రోజు మాకు నీ దర్శనం లభించింది. మాకందరికీ చాలా ఆనందంగా వుంది. ఇప్పుడు నీకేం కావాలన్నా ఇస్తాను. ఏం కావాలో చెప్పు" అన్నాడు. సీతారాములు, లక్ష్మణుడు, ఇంద్రునికి చేతులు జోడించి నమస్కరించారు. అప్పుడు రాముడిలా అన్నాడు. "మహేంద్రా, నువ్వు సర్వలోకాలకి పాలకుడివి. నీకు నిజంగా నా మీద అభిమానముంటే, ఒక్క వరం ఇయ్యి. ఈ వానరులు ఎందరో నా కోసం, భార్యాపిల్లలతో సహా ప్రాణాలర్పించారు. అన్నెం పున్నెం ఎరుగని వారు. కేవలం నాకు ఉపకారం చెయ్యాలని ప్రాణత్యాగం చేశారు. వారందరూ మళ్ళీ జీవించే వరం ఇయ్యి. వాళ్ళందరూ మళ్ళీ తమ తమ బంధువర్గంతో కలిసి సుఖంగా వుండేలా అనుగ్రహించు. వారంతా శరీరాల మీద ఎలాంటి గాయాలు లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా పునర్జీవితులయ్యేలా చెయ్యి. అంతే కాదు. అన్ని కాలాలోనూ వారికి ఫలములు, కందమూలాలు, సమృద్ధిగా లభించేలా అనుగ్రహించు.

చల్లని మంచి నీరు అన్ని కాలాలాలలో దొరికేలా చెయ్యి" అన్నాడు రాముడు.

ఆ మాటలు విని ఇంద్రుడు చాలా సంతోషించాడు "రఘునందనా ఎంతటి మహత్తరమైన కోరిక కోరావయ్యా. నువ్వు కోరినట్లే యుద్ధములో మరణించిన వానరులు, ఋక్షములు, గోపుచ్ఛములు, మొదలైన వారంతా సంపూర్ణ ఆరోగ్యంతో మళ్ళీ జీవిస్తారు. వారి మిత్రుల్ని బంధువుల్ని కలిసి పరమానందం పొందుతారు. అన్ని కాలాలలోనూ వారికి ఫలములు, దుంపలు, మూలములు, పుష్కలంగా లభిస్తాయి. నదులు రుచికరమైన జలములతో జీవనదులుగా ప్రవహిస్తాయి" అని ఇంద్రుడు చెప్పగానే చనిపోయిన వానరులు మొదలైన వారంతా లేచి కూర్చున్నారు. అందరూ ఆశ్చర్యపోయారు. దేవతలంతా రాముని ప్రస్తుతించి, ఇంక అయోధ్యకి వెళ్ళి పట్టాభిషక్తుడవు కమ్మని ఆశీర్వదించారు. వారు వెళ్ళిపోగానే, రామలక్ష్మణులు వానరసైన్యాన్ని రక్షిస్తూ నిలబడ్డారు. వానరులంతా ఆనందాతిశయంతో కేరింతలు కొట్టారు.

ఆ రాత్రిగడచింది. మర్నాడు ఉదయమే విభీషణుడు వచ్చి రామునికి అభివందనం చేసి నిలబడ్డాడు.

"రామా, మీరు స్నానాలు చేసి అలంకరించుకుందుకు తగిన ఏర్పాట్లన్నీ చేశాను. మిమ్మల్ని సేవించటానికి, నేర్పరులైన వనితల్ని నియమించాను. మీరంతా నా యందు దయ వుంచి, అభ్యంగన స్నానాలు చేసి రత్నాభరణాలు చీనీ చీనాంబరాలు ధరించి, నన్ను ఆనందింపచెయ్యవలసిందిగా వేడుకుంటున్నాను. యుద్ధం చేసి అలసివున్న మీకు విశ్రాంతి అవసరం కదా" అన్నాడు వినయంగా.

రాముడు అతడి అనురాగానికి పులకించిపోయాడు. వాత్సల్యం నిండిన స్వరంతో

"విభీషణా సుగ్రీవుడు, ఆంజనేయుడు ఈ వానరులు, వీరందర్నీ స్నానాలంకారాలతో సన్మానించు. అక్కడ అయోధ్యలో ధర్మాత్ముడైన నా తమ్ముడు భరతుడు నా కోసం ఎదురుచూస్తు ఊరి బయట, చాలా నియమబద్ధమైన జీవితం గడుపుతున్నాడు. అతనినలా వదిలి, నేనిక్కడ అభ్యంగన స్నానం చెయ్యడము, అలంకారాలు ధరించటం ఉచితం కాదు. నేను వెంటనే అయోధ్యకి వెళ్ళాలి" అన్నాడు.

అందుకు విభీషణుడు "రాజకుమారా, రావణుడు కుబేరుని ఓడించి తెచ్చిన పుష్పకవిమానం ఇంకా మా దగ్గరే వుంది. మీరెక్కడికి వెళ్ళాలన్నా అది చిటికెలో చేరుస్తుంది. కనుక ఒక్కపూట నా ఆతిధ్యం స్వీకరించి బయల్దేరండి" అన్నాడు.

రాముడు విభీషణుని వెన్నుతట్టి "విభీషణా ఇన్నాళ్ళూ నువ్వు నాకు చేసిన సహాయం మర్చిపోగలనా? కాని ప్రస్తుత పరిస్థితిలో మాత్రం నీ కోరిక మన్నించలేను. నా మనస్సు భరతుణ్ణి ఎప్పుడెప్పుడు చూడాలా అని తహ తహలాడుతోంది. మహారాజ పదవిని తృణంగా వదిలేసి, నన్ను మళ్ళీ అయోధ్యకి తీసికెళ్ళాలని చిత్రకూటాశ్రమానికి వచ్చాడు. వినయంతో తలవంచి ప్రార్థించాడు. కాని నేనతని కోరిక తీర్చలేకపోయాను. నా వారందర్నీ చూడాలని నా మనసు ఆరాటపడ్తోంది. నేను వచ్చిన పని పూర్తయింది. ఇంక నేనిక్కడ వుండకూడదు. నేను వెళ్ళడానికి అనుమతించి తొందరగా పుష్పకవిమానం తెప్పించు" అన్నాడు.

విభీషణుడు రాముని ఆంతర్యం అర్థం చేసుకున్నాడు. సరే అని పుష్పక విమానం తెప్పించాడు. అది బంగారంతో తాపడం చెయ్యబడి వున్న ఒక అద్భుత కళాఖండము.

వైజ్రవైఢూర్యాలు పొదగబడి, తెల్లటి కాంతులు విరజిమ్ముతోంది. తెల్లటి పతాకాలు దానిపై వున్నాయి. మణిగవాక్షముల నుండి, ముత్యాల జాలులు వ్రేలాడుతున్నాయి. శ్రావ్యమైన నాదాలు చేస్తూ చిరుగంటలు మ్రోగుతున్నాయి. దానిని విశ్వకర్మ నిర్మించాడు. స్ఫటికములు, వైఢూర్యాలు పొదిగిన మెత్తని ఆసనాలున్నాయందులో.

రాముడు, సీత, లక్ష్మణుడు వచ్చి, విభీషణుని కోరికపై అందులోకి ఎక్కారు. అప్పుడు విభీషణుడు చేతులు జోడించి "ప్రభూ ఇప్పుడు నేనేం చెయ్యాను, ఆజ్ఞాపించండి" అన్నాడు. రాముడు విభీషణుని వినయానికి ప్రసన్నుడయ్యాడు.

"విభీషణా ఈ వానరులంతా నాకోసం ఎన్నో శ్రమలు పడ్డారు. వారందరికీ వారికిష్టమైన పదార్థాలతో భోజనం పెట్టి, రత్నాభరణాలు ఇచ్చి సత్కరించు. దుర్భేద్యమైన ఈ లంక, వీరందరి సాయంతోటే గెల్చుకున్నాము. కనుక వీరిని సత్కరించు. వీరంతా ప్రాణాలకి తెగించి పోరాడారు. వారిని గౌరవిస్తే నన్ను గౌరవించినట్లే" అని రాముడు చెప్పగా విభీషణుడు వాందరికీ అమూల్యమైన కానుకలిచ్చి సత్కరించాడు. రాముడు చాలా సంతోషించాడు. ఆ తర్వాత ఆ విమానంలో సుఖాసీనుడై, సిగ్గుతో ఒదిగినుంచున్న సీతని తన తొడమీద కూర్చోపెట్టుకున్నాడు. లక్ష్మణుడు ధనస్సు ధరించి వారి చెంత వచ్చినుంచున్నాడు. రాముడు విమానంలోంచి, సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన వారిని చూస్తూ

"మిత్రులారా, మీరంతా మీ కర్తవ్యం చక్కగా నెరవేర్చారు. మీరంతా ఇంక మీమీ ప్రదేశాలకి వెళ్ళిపొండి. సుగ్రీవా మంచి మిత్రుడా, నాకు మహోపకారం

చేశావు. నీ సైన్యంతో ఇంక కిష్కింధకి వెళ్ళిపో.

విభీసణా, ధర్మపథంలో నడుస్తూ నీ రాజ్యాన్ని చక్కగా పరిపాలించుకో. మేమింక మా అయోధ్యకి వెళ్తాము. మీరంతా మాకు అనుమతినివ్వండి" అన్నాడు.

కాని విభీషణుడు, వానరులు చిన్నబుచ్చుకున్న ముఖాలతో చేతులు జోడించి,

"స్వామీ మేమంతా కూడా మీ వెంట అయోధ్యకి రావాలనుకుంటున్నాము కాదనక తీసికెళ్ళు, పట్టణాలు చూడాలని మాకు కోరికగా వుంది. పట్టాభిషిక్తుడవైన నిన్ను కనులారా చూడాలని చాలా కోరికగా వుంది. మా తల్లి కౌసల్యాదేవికి నమస్కరించి మేము మా ఇళ్ళకి వెళ్ళిపోతాము" అని ప్రాధేయపూర్వకంగా అడిగారు.

వారి ప్రేమకి రాముడు ఆనందంతో పరవశించి పోయాడు "ఆహా ఏమి నా అదృష్టం. మా మిత్రులంతా నా నగరానికి రావాలనుకోవడం నిజంగా నా అదృష్టం. సుగ్రీవా, విభీషణా మీరు మీ సరివారంతో విమానం ఎక్కండి" అని రాముడనగానే, అందరూ సంబరంతో విమానం ఎక్కారు. విమానాన్ని ఎగరవలసిందిగా రాముడు ఆదేశించాడు. ఆ విమానానికి నాలుగు వైపులా నాలుగు హంసలులా వుండే ప్రతిమలున్నాయి. వాటి సహాయంతో అది ఆకాశంలోకి ఎగిరింది. వానరులు, రాక్షసులు, అన్నికోట్ల మందీ, ఆ విమానంలో ఇరుకులేకుండా హాయిగా కూర్చున్నారు. గాలిలోపైకి లేచిన విమానం, ఆకాశ వీధిలో మేఘంలా తేలుతూ వెళ్లోంది. విమానంలో కూర్చున్న రాముడు, కిందనున్న భూమిపైకి అన్ని వైపులా దృష్టి సారించి, చూస్తూ సీతతో ఇలా అన్నాడు. "సీతా కైలాస శిఖరంలా వున్న త్రికూటాద్రిశిఖరంపైన వున్న ఆ లంకానగరాన్నిచూడు. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు. లంకకి బయట వున్న ఆ యుద్ధభూమిని చూడు. అక్కడ ఎంత మంది రాక్షస వీరులు చనిపోయి పడివున్నారో చూశావా? వారి రక్తం మాంసాలతో ఆ ప్రాంతమంతా బురద బురదగా వుంది. ఇదిగో ఇక్కడే లోకంటకుడైన రావణుడ్ని నీకోసం వధించాను.

అటు చూడు. అక్కడ కుంభకర్ణుడు కూలిపోయాడు. హనుమంతుడు, ప్రహస్తుని, ధూమ్రాక్షుణ్ణి, ఇక్కడే చంపాడు. రావణుని కుమారుడైన ఇంద్రజిత్తుని లక్ష్మణుడు అదిగో అక్కడ చంపాడు. వికటుడు అనే రాక్షస వీరుని అంగదుడు చంపాడు. విరూపాక్షుడు, దుర్ధర్షుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు, అకంపనుడు వీరంతా ఇక్కడే ప్రాణాలు విడిచారు. సుషేణుడు విద్యున్మాలిని, ఇక్కడే చంపాడు.

చనిపోయిన రావణుని దగ్గర కూర్చుని, అతడి భార్యమండోదరి, వేలకొద్ది

సవతులతో ఇక్కడే విలపించింది" అంటూ రాముడు సీతకి యుద్ధభూమిని చూపించి, యుద్ధ విశేషాలన్నీ వర్ణించి చెప్పాడు. ఆ తర్వాత తాను యుద్ధానికి బయల్దేరినప్పుడు జరిగిన సంగతులన్ని ఒకటొకటిగా గుర్తు చేసుకుంటూ, అన్నీ వివరించి చెప్పాడు సీతతో. సీత ఆ విషయాలన్ని ఆసక్తిగా వింది.

"జానకీ ఆ రోజు రాత్రి మేము సముద్రం దాటి వచ్చి, ఇదిగో ఇక్కడే విడిది చేశాము. అదిగో అటు చూడు. సముద్రం దాటడానికి నీకోసమే, నలుని చేత, వానరుల చేత నేను సముద్రం మీద వారధి నిర్మింపచేశాను. అతి భయంకరమైన ఆ సముద్రం ఎలా విభజిస్తోందో చూశావా?

హనుమంతుడు, నీ జాడ తెలుసుకోటానికి, సుముద్రాన్ని దాటుతున్నప్పుడు, అతడికి విశ్రాంతి ఇవ్వాలని, సముద్రుని ప్రేరణవల్లపైకి వచ్చిన కాంచన శైలము, ఆమైనాక పర్వతం చూడు. అక్కడ సముద్ర మధ్యలో వుంది. ఈ సేతువు మీదుగా మేము వచ్చినప్పుడు, సైన్యం విశ్రాంతి చేసేందుకు ఈ పర్వతం మీదే విశ్రాంతి శిబిరం కట్టుకున్నాము.

ఆ తర్వాత అక్కడ వస్తున్నది సేతు బంధనమనే పవిత్ర తీర్థం. అక్కడ్నించే మేము వారధి కట్టటం మొదలు పెట్టాము. నేను సముద్రుని అనుగ్రహింప చేసుకుని, సేతువు నిర్మించేందుకు అనుమతి తీసుకుని, అప్పుడు వారధి నిర్మాణం మొదలుపెట్టాము. ఈ ప్రదేశంలో నేను దర్భల శయ్య ఏర్పాటు చేసుకుని సముద్రుడు అనుమతి ఇచ్చే వరరకు నిరాహార దీక్షతో ఆ దర్భశయ్య మీద పడుకున్నాను.

ఇది పరమపవిత్రమైన ప్రదేశమేగాక మహాపాతక నాశనం కూడా. ముల్లోకాలకీ పూజనీయమైన ప్రదేశమిది. ఇక్కడే పూర్వము లోకనాథుడైన మహాదేవుడు నన్ను అనుగ్రహించాడు. అటు చూడు, అక్కడే విభీషణుడు నన్ను శరణుకోరి వచ్చాడు" అంటూ సముద్రానికివతలి తీరాన వున్న ప్రాంతాన్ని చూపించి, ఆయా విశేషాలన్నీ వివరించి చెప్పాడు.

ఆ తర్వాత కిష్కింధని చూపిస్తూ "వైదేహీ, అదిగో అదే కిష్కింధ, సుగ్రీవుని రాజధాని, చిత్రమైన అడవులతో, నిండిన ఆ పట్టణం దగ్గరే నేను వాలిని చంపాను" అంటూ ఋష్యమూకాద్రిని, కిష్కంధనీ చూపెట్టాడు.

సీతకి కిష్కంధని చూడగానే చాలా ఆశ్చర్యం కలిగింది. రాముని ప్రార్థిస్తున్నట్లుగా

"ప్రభూ సుగ్రీవుడు మనకెంతోఉపకారం చేశాడు కదా. అతడి భార్యలైన

తార, రుమలనీ, అంతఃపుర స్త్రీలని మనతో అయోధ్య తీసికెళ్ళాలని కోరికగా వుంది" అని చనువుగా అడిగింది. రాముడు సరే అని సుగ్రీవుని పిల్చి, సుగ్రీవా, నువ్వు వెళ్ళి నీ భార్యలనందర్నీ అయోధ్యకి వెళ్ళటానికి తయారై రమ్మని చెప్పి తీసుకురా" అని చెప్పి పంపాడు.

సుగ్రీవుడు తన అంతఃపురంలో ప్రవేశించి, తారతో, "తారా మిమ్మల్నిందర్నీ అయోధ్యకి రావాల్సిందిగా మైథిలి కోరింది. అందుకు రాముడు అంగీకరించాడు. తొందరగా తయారై రండి. అయోధ్యని, దశరథ పుత్రుల్ని చూసివద్దాం" అన్నాడు.

అంతఃపుర స్త్రీలంతా చక్కగా అలంకరించుకుని, శాస్త్రోక్తంగా విమానానికి ప్రదక్షిణం చేసి దానిలోకి ఎక్కారు. రాముడు ఆజ్ఞాపించగానే విమానం బయల్దేరింది. విమానం ఋష్యమూక పర్వత ప్రాంతానికి వచ్చింది. రాముడు, సీతకి ఆ ఋష్యమూకాద్రిని చూపిస్తూ

"సీతా అటు చూడు మెరుపులతో కూడిన మేఘంలా వున్న ఆ ఋష్యమూక పర్వతాన్నిచూడు అక్కడే నేను సుగ్రీవునితో కలిశాను. వాలిని చంపుతానని ప్రతిజ్ఞ చేశాను. అటు పక్క కనిపిస్తున్నది పంపా సరస్సు. నిన్ను రావణుడెత్తుకుపోయాక, నీ ఎడబాటు చేత కల్గిన విరహ వేదనతో, నేను ఇక్కడే ఎంతగానో విలపించాను. ఈ పంపాతీరంలోనే ధర్మచారిణి అయిన శబరిని చూశాము మేము. ఇక్కడే కబంధుడు అనే రాక్షసుణ్ణి చంపాము మేము. అదిగో అదే ఆనాడు మనం వసించిన జనస్థానము.

అటు చూడు అక్కడే నీ కోసం మహాత్ముడైన జటాయువు, రావణుడితో యుద్ధం చేశాడు. ఇక్కడ ఆనాడు నేను యుద్ధంలో ఖరదూషణుల్ని, త్రిశుడ్ని, పద్నాలుగు వేల మంది రాక్షసుల్ని నేలకూల్చాను.

అదిగో అదే ఆనాడు మనం నివశించిన ఆశ్రమం. అక్కడ్నించే రావణుడు నిన్నపహరించుకుపోయాడు. అదే మనం నివశించిన పర్ణశాల.

ప్రసన్నమైన ప్రవాహంతో స్వచ్ఛమైన జలాలతో, మనోహరమైన గోదావరి అదిగో చూడు. ఆ పైన వెనకగా అదిగో అగస్త్యమహాముని ఆశ్రమంచూడు. ఇదిగో సుతీక్ష్ణుని ఆశ్రమం. ఆ పైన వచ్చినది శరభంగుని ఆశ్రమం. ఆ రోజు సహస్రాక్షుడైన ఇంద్రుణ్ణి నేను చూసినదిక్కడే. ఇక్కడే మహాకాయుడైన విరాదుడ్ని చంపాను. చూశావా, అవన్నీ తాపసులు నివశించే ఆశ్రమాలు. వారందరికీ కులపతి అయిన అత్రిమహామునిని అక్కడే దర్శించాము మనం. అదిగో చిత్రకూటాశ్రమము.

అక్కడే భరతుడు మా తల్లుల తోటీ పరివారంతోటీ వచ్చి, నన్ను వెనక్కి తీసికెళ్ళాలని, ప్రాధేయపడ్డాడు. అదిగో భారద్వాజముని ఆశ్రమం. ఆ పక్కనే ప్రవహిస్తున్న అమృత వాహిని గంగని చూశావా? ఆ గంగానది అవతలి తీరాన మనం గుహుణ్ణి కలుసుకున్న శృంగబేరపురం వుంది. మన వనవాసానికి తొలిరోజు అది. ఆ పైన సరయూ నది. దాని ఒడ్డున మన పూర్వీలు, యజ్ఞములు చెయ్యటానికి, నిర్మించిన యూపస్థంభాల పంక్తి వుంది. అనేక రకాలైన వృక్షాల తోటీ పూలతోటీ, ఫలముల తోటీ, నిండిన అరణ్యాలతో సరయూ తీరం ఎంత అందంగా వుందో చూడు.

అదిగో మా తండ్రి గారి రాజధాని, అయోధ్య విమానంలోంచి చక్కగా కనిపిస్తోంది. నమస్కారం చెయి. అంటూ దూరంగా కనిపిస్తున్న అయోధ్యని రాముడు సీతకి చూపిస్తుంటే, వానరులంతా ఆసక్తితో విమానంలోంచి తొంగి తొంగి చూడసాగారు. విభీషణుడు, రాక్షసులు కూడా ఒంగి చూశారు.

తెల్లని మేడలతో, విశాలమైన కక్ష్యలతో ఏనుగులు, గుఱ్ఱాలు, చేస్తున్న రొదలతో మహావైభవంగా రెండో అమరావతిలా వున్న అయోధ్యని వారంతా విమానంలోంచి చూసి వారంతా ఆశ్చర్యచకితులయ్యారు.

ఆ విధంగా పుష్పకవిమానంలో ప్రయాణం చేస్తూ, భూమి మీద కనిపిస్తున్న పరిచితమైన ప్రదేశాల్ని తిలకిస్తూ తమ పధ్నాలుగు సంవత్సరాల అరణ్యవాస జీవితం నెమరువేసుకుంటూ, వానర, రాక్షస సమేతంగా సీతారామలక్ష్మణులు, సరిగ్గా పధ్నాలుగు సంవత్సరాల తర్వాత, చైత్ర శుద్ధ పంచమినాడు, మళ్ళీ భారద్వాజాశ్రమం దగ్గర పుష్పక విమానం ఆపి ఆ ఆశ్రమంలో అడుగుపెట్టారు.

ఆశ్రమంలో అడుగుపెట్టి, భారద్వాజమహామునిని దర్శించి, రాముడు, ఆ మహామునికి నమస్కరించాడు.

"భగవన్, మా అయోధ్యని గురించిన వార్తలేమైనా మీకు తెలుస్తున్నాయా? అక్కడ అందరు క్షేమమే కదా. భరతుడు సుఖంగా వున్నాడా? మా తల్లులంతా జీవించి వున్నారా? అని రాముడు ఆయనని ప్రశ్నించాడు. భారద్వాజ మహాముని, చిరునవ్వుతో అయోధ్యలో అంతా కూలాసాగా వున్నారని చెప్పాడు. "రామా, భరతుడు మాత్రం జడలు కట్టిన జుట్టుతో, శరీరమంతా మురికి పట్టగా, నీపాదుకలు ముందుంచుకుని, నీరాక కోసం ఎదురుచూస్తున్నాడు. సరిగ్గా పధ్నాలుగు సంవత్సరాల క్రితం నువ్వు ఈ రోజుల్లోనే నా ఆశ్రమానికి వచ్చావు. ఆనాడు నిన్ను చూసి చాలా దుఃఖించాను.

ఈనాడు కృతార్థుడవై, మిత్రులతో, బంధువులతో, శత్రువుని జయించి, ఆనందంగా తిరిగి వచ్చావు. ఇప్పుడు నిన్ను చూస్తుంటే మహోదానందం కలుగుతోంది. నువ్వు అరణ్యావాసంలో అనుభవించిన క్లేశాలన్నీ నాకు తెలిశాయి. నీ వనవాసకాలంలో జరిగిన సంగతులన్నీ నాకు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి. రామచంద్రా లోకానికి నువ్వు మహోపకారం చేశావు. ఈ పూట మీరంతా నా ఆశ్రమంలో వుండి, నా ఆతిథ్యం స్వీకరించండి. రేపు అయోధ్యకి వెళ్లురు గాని" అన్నాడు. రాముడు సరే అన్నాడు.

రాముడు మహామునిని "ముని వర్యా ఏకాలంలో అయినా సరే అరణ్యాలలోని వృక్షాలన్నీ తియ్యని ఫలాలతో నిండి వుండాలి. నా వానర మిత్రులకి తియ్యని ఫలములు, తియ్యని తేనె ఎల్లవేళలా లభించాలి. ఈ వరం అనుగ్రహించండి" అన్నాడు. ముని తథాస్తు అన్నాడు. ఆయన అలా అనగానే, ఆ వనంలోని వృక్షాలన్నీ మధుర ఫలాలతో, అందమైన పుష్పాలతో, నిండిపోయాయి. ఆ ఆశ్రమం నించి, అయోధ్య మూడు యోజనాల దూరంలో వుంది. ఆ దారి పొడుగునా వున్న వృక్షాలన్నీ మధుర ఫలాలతో నిండిపోగానే, వానరులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. వారిష్టమొచ్చినట్లు పండ్లు, తేనె ఆరగించారు.

తర్వాత రాముడు అయోధ్య వైపు చూస్తూ కొంత సేపు ఆలోచించాడు. హనుమంతుని పిల్చి ఇలా అన్నాడు. "హనుమా నువ్వు ముందుగా అయోధ్యకి వెళ్ళి, అక్కడ అందరి యోగక్షేమాలు తెలుసుకో. గంగానది దాటగానే శృంగబేరపురంలో గుహుడు అని నిషాద రాజు, నా ప్రాణమిత్రుడున్నాడు. అతడితో మేము కుశలంగా తిరిగి వచ్చినవార్త చెప్పు. ఆ వార్త విని గుహుడు చాలా సంతృప్తి పడతాడు. తర్వాత భరతుడి దగ్గరకి వెళ్ళి సీతలక్ష్మణులతో మేము కుశలంగా తిరిగివచ్చిన వార్త చెప్పు. సీతాపహరణవృత్తాంతం సుగ్రీవునితో మా మైత్రి, వాలి వధ, సీతాన్వేషణ వృత్తాంతం, ఈ విషయాలన్నీ వివరంగా చెప్పు. మనం సేతువు నిర్మించడం, రావణ వధ, బ్రహ్మ, మహేంద్రుడు, వరుణుడు వచ్చి వరాలివ్వటం, ఆ సంగతులన్నీ కూడా చెప్పి, మనం సుగ్రీవునితో రాక్షస రాజైన విభీషణునితో, వారి పరివారాలతో, మేము క్షేమంగా తిరిగి వచ్చి, ఇక్కడ వున్న సంగతి చెప్పు. నువ్వు ఇదంతా చెప్తున్నప్పుడు, భరతుడు ముఖ కళవకలు, భావ ప్రకటన కనిపెట్టి నాకు చెప్పు.

నన్ను గురించి, నా విజయం గురించి, భరతుడు ఏమనుకుంటున్నాడో నేను తెలుసుకోవాలి. భరతుడికి నేనంటే చాలా ప్రేమ వున్నమాట యదార్థమే అయినా, కోరుకున్న సంపదలన్నీ పుష్కలంగా ఉండి, వంశపారంపర్యంగా వచ్చిన

రాజ్యలక్ష్మిని ఎవరు మాత్రం ఇష్టపడి వదులుకోగలుగుతారు? పధ్నాలుగు సంవత్సరాలు రాజ్యపాలన చెయ్యటం వల్ల ఆ రాజ్యం మీద మమకారం కలిగినట్లు నీకు భరతుని మాటల్లో గోచరిస్తే ఆ రాజ్యాన్ని అతణ్ణే ఏలుకోని, నాకెంత మాత్రం అభ్యంతరం లేదు.

కనక నేను అయోధ్య వెళ్ళకముందే అతడి అభిప్రాయం పూర్తిగా తెలుసుకోవాలి. తొందరగా వెళ్ళి తెలుసుకురా" అన్నాడు.

వాయుపుత్రుడైన హనుమ, అతడి ఆజ్ఞపై మనుష్యరూపం ధరించి బయల్దేరాడు. ఆకాశమార్గంలో బయల్దేరి ముందుర శృంగబేరపురం చేరాడు. గుహుని కలిసి రాముడు సీతాలక్ష్మణులతో క్షేమంగా తిరిగి వచ్చి భారద్వాజ ఆశ్రమంలో వున్న సంగతి చెప్పాడు. తర్వాత మళ్ళీ బయల్దేరి, అయోధ్యకి క్రోసు దూరంలో వున్న భరతుని ఆశ్రమానికి వెళ్ళాడు.

అక్కడ భరతుడు నార బట్టలు కట్టుకుని, కృష్ణాజినం ధరించి, దుఃఖంతో, చాలా దీనావస్థలో వున్నాడు. రాముని పాదుకలు ఎదురుగా పెట్టుకుని, రాజ్యపాలన చేస్తున్నాడు. మంత్రులు, పురోహితులు, అందరూ అతడి వద్ద వున్నారు. వారంతా కూడా కాషాయ వస్త్రాలు ధరించి వున్నారు. వారందర్నీ పరిశీలనగా చూస్తూ హనుమంతుడు మెల్లిగా నడచి భరతుని దగ్గరకి వెళ్ళాడు. ధర్మజ్ఞుడైన అతడికి నమస్కరించి, ఇలా చెప్పాడు.

"ధర్మశీలా, రాముడు నార బట్టలు ధరించి, దండకారణ్యంలో వున్నాడని దుఃఖిస్తున్నావా? ఇంక నువ్వు దుఃఖించే అవసరం లేదు. నీ సోదరుడైన రాముడే నన్ను నీ దగ్గరకి పంపాడు. నీ కుశల వార్త తెలుసుకురమ్మని. నీకెంతో ప్రీతి కల్గించే వార్త చెప్తాను విను.

రాముడు రావణుని చంపి, కృతార్థుడై సీతాలక్ష్మణుల తోటీ, మిత్రులతోటీ వచ్చి, భరద్వాజముని ఆశ్రమంలో వున్నాడు" అని చెప్పాడు. ఆ వార్త విన్న భరతుడు ఆనందం పట్టలేక మూర్ఛబోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి, ఆంజనేయునితో ఇలా అన్నాడు.

"అయ్యా నువ్వు దేముడివా? లేక మనుష్యుడివా? ఎంత మంచివార్త చెప్పావు!" అంటూ హనుమంతుడ్ని గట్టిగా కౌగలించుకుని, కన్నీరు కారుస్తూ,

"పండితోత్తమా, ఇంతమంచి వార్త చెప్పినందుకు నీకు సర్వ సులక్షణ శోభితురాళ్ళైన పదహారుమంది కన్యలనీ, నువ్వు కోరినంత సువర్ణము బహుమతిగా ఇస్తున్నాను. ఆ కన్యలు ఒళ్ళంతా బంగారు ఆభరణాలు ధరించుకుని, నిన్ను

వివాహం చేసుకుంటారు స్వీకరించు" అన్నాడు పులకించిపోతూ. మళ్ళీ హనుమంతునిలా అడిగాడు. "సౌమ్యా మా అన్నగారు వనవాసానికి వెళ్ళి పద్నాలుగు సంవత్సరాలు గడిచింది కదా. ఇన్నాళ్ళ తర్వాత ఆ మహానుభావుణ్ణి చూసే మహాద్భాగ్యం కలిగింది. అందుకే పెద్దలంటారు.

"మనిషి అసలు ప్రాణంతో వుంటే, నూరేళ్ళకైనా సుఖం కలుగుతుందని. కష్టాలు కలకాలం కాపురం వుండవని" ఆ మాట నాపట్ల నిజమైంది. అయితే ఒక సంగతి తెలుసుకోవాలని కుతూహలంగా వుంది.

అసలు వానరులకి, రామునికి, స్నేహమెలా కలిగింది? నిజం చెప్పు" అని అడిగాడు. అపుడు హనుమంతుడు, రాముడు చెప్పమన్న వృత్తాంతం అంతా భరతుడికి చెప్పాడు.

"భరతా చిత్రకూటాశ్రమం నుండి, శ్రీరాముని పాదుకలు తెచ్చుకునే వరకు జరిగిన వృత్తాంతం నీకు తెలును కదా. అని మొదలు పెట్టి, రాముడు సీతాలక్ష్మణులతో అక్కడ్నించి, దండకారణ్యానికి వెళ్ళటం, విరాధుడి వధ, శరభంగుని, ఆశ్రమం దర్శించి, సీతమ్మతో జనస్థానానికి వెళ్ళటం, అక్కడ శూర్పణఖ వృత్తాంతం, రాముడు ఒక్కడే పధ్నాలుగువేల మంది రాక్షసుల్ని, ఖరదూషణుల్ని వధించటం, మారీచుని వెంట బెట్టుకుని వచ్చి రావణుడు రామలక్ష్మణుల్ని వంచించి, సీతని ఎత్తుకుపోవటం, లంకలో ఆమెని వుంచి, ఆమెనెలాగైనా వశపరచుకోవాలని ప్రయత్నించటం, వశం కాకపోవటం వల్ల ఆమెని అశోకవనంలో వుంచడం, రాముడు సీతకోసం వెతుకుతుండగా, రావణునితో పోరాడి కొన వూపిరితో వున్న జటాయువు, రామునికి, సీతని అపహరించుకు పోయిన విషయం చెప్పటం, రామలక్ష్మణులు కబంధుని వధించటం, ఆ కబంధుని సలహా మీదే వారిద్దరూ ఋష్యమూకాద్రికి చేరి, అక్కడ వానర రాజైన సుగ్రీవునితో స్నేహం చెయ్యడం, వాలిని చంపి, సుగ్రీవునికి రాజ్యం ఇప్పించడం, అందుకు ప్రత్యుపకారంగా, సీతని వెతకడానికి సుగ్రీవుడు పది కోట్లమంది వానరుల్ని నేల నాలుగు దిక్కులకీ పంపడం, వారిలో దక్షిణ దిశగా వెళ్ళిన వారు సంపాతి ద్వారా సీత లంకలో వుందని తెలుసుకోవటం, అప్పుడు వారిలో వున్న తను మిత్రుల ప్రోత్సాహం మీద శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని లంఘించి లంకకి వెళ్ళడం అక్కడ అశోక వనంలో సీతని చూడడం, తను లంకలో చేసిన సాహసకృత్యాలూ అన్నీ వర్ణించి చెప్పాడు.

ఆ తర్వాత తను వెనక్కి తిరిగి వచ్చి, సీత జాడ రామునికి చెప్పడం,

తామంతా సముద్రం మీద సేతువు బంధించి లంకని చేరడం, అక్కడ జరిగిన ఘోరమైన సంగ్రామం, వానర వీరులు, రాక్షసవీరులు, ఒకరినొకరు ఎంత సాహసంతో చంపుకున్నారో చెప్పి, ఆఖరికి రాముడు రావణుని వధించడం, అప్పుడు ఇంద్రుడు, యముడు, వాయువు, మహేశ్వరుడు, బ్రహ్మయుద్ధ భూమికి వచ్చి రాముని ఆశీర్వదించి ఎన్నెన్నో వరాలు ఇవ్వడం, అన్నీ యదాతథంగా వర్ణించి చెప్పాడు. ఇంద్రుడిచ్చిన వర ప్రభావం వల్ల యుద్ధంలో మరణించిన వానరులంతా తిరిగి బ్రతకటం, ఈ విషయాలన్నీ సవిస్తారంగా చెప్పాక, ఇప్పుడు రాముడు, సీత, లక్ష్మణుడు వానర మిత్రుల తోటీ రాక్షసులతోటీ భారద్వాజముని ఆశ్రమంలో వున్న సంగతి వివరించాడు.

"భరతా, రామానుజా, రాముడిప్పుడు భరద్వాజ ముని ఆశ్రమంలో వున్నాడు. రేపు పుష్యమి నక్షత్రాన, ఇక్కడికి వస్తాడు" అని చెప్పి ముగించాడు హనుమంతుడు.

హనుమంతుడు చెప్తున్న మాటలు వింటున్న భరతుడు, ప్రతీ మాటకీ పులకించిపోయాడు. ఆనందంతో చేతులు జోడించి, "మహాత్మా ఎంతకాలానికి నా మనోరథం నెరవేరింది. నాకు చెప్పలేనంత ఆనందంగా వుంది" అన్నాడు. ఆ తర్వాత భరతుడు, శత్రుఘ్నుని పిల్చి "తమ్ముడూ మన నగరంలో వుండే అన్ని దేవాలయాలు, దేవతామూర్తుల్ని పూలమాలలతో అలంకరించండి. భారీ ఎత్తున అర్చనలు జరిపించండి. మంగళ వాద్యాలు మ్రోగించండి. వైతాళికులను స్తుతిపాఠములు, స్తోత్రములు చెయ్యటానికి సిద్ధంగా వుండమనండి.

రాముడు వస్తుంటే దారి పొడుగునా నాట్యాలు చెయ్యటానికి, దేవదాసీలు, సూతులు, వైతాళికులు, అందర్నీ తయారుగా వుండమనండి" అని ఆజ్ఞాపించాడు. తాపీ పనివారిని పిలిపించి దారిలో ఎత్తుపల్లాలు సరిచేసి, రాళ్ళు ముళ్ళలాంటివి లేకుండా మార్గము సమతలంగా చెయ్యవలసిందిగా ఆజ్ఞాపించాడు.

నంది గ్రామం నించి, అయోధ్య వరకు గల రాచబాటపై చల్లనినీరు చల్లి తడిపి, ఆపైన పన్నీరు చల్లి, లాజలు పూవులు పరిపించవలసిందిగా ఆజ్ఞాపించాడు. దారిపొడుగునా జెండాలు నిలపమని ఆదేశించాడు. రాజపత్నులు, మంత్రులు, సైన్యములు, బ్రాహ్మణులు, క్షత్రియ ప్రముఖులు, అందర్నీ రామదర్శనార్థం నంది గ్రామానికి రావాల్సిందిగా ఆజ్ఞాపించాడు.

భరతుడి ఆదేశం ప్రకారం అందరూ రామదర్శనార్థం నంది గ్రామానికి తండోపతండాలుగా తరలి వచ్చారు.

కౌసల్య, సుమిత్ర, కైకేయి నంది గ్రామానికి ముందే వచ్చి రాముని చూడాలని

ఒళ్ళంతా కన్నులు చేసుకుని ఎదురు చూస్తున్నారు. భేరీ నినాదాలు, శంఖారావాలు మిన్నుముట్టాయి. వేద పండితులు వేదాలు చదువుతూ ముందు నుంచున్నారు. ఆ వెనక పూలతో నిండిన పళ్ళాలతో కన్యలు, ఆ వెనక పిండి వంటలు నిండిన గంపలతో స్త్రీలు బయల్దేరారు. వందిమాగధులు స్తోత్రపాఠాలు చేస్తుండగా ధర్మకోవిధుడైన భరతుడు, బంగారు పళ్ళెములో, రాముని పాదుకలు తలపై ధరించి, తెల్లని ఛత్రము, తెల్లని పూవుల దండలు ఆ పాదుకల కలంకరించి, ఆ పాదుకలకి సర్వాలంకార శోభితురాళ్ళైన ఇద్దరు కన్యలు వింజామరలు వీస్తుండగా, బయల్దేరాడు. ఈ పధ్నాలుగు సంవత్సరాలు ఉపవాస వ్రతంలో వుండటం వల్ల చిక్కి శల్యమై వున్నాడు.

దీనుడై నార బట్టలు, కృష్ణాజినం ధరించి వున్నాడు. రామలక్ష్మణులు వస్తున్నారని తెలిసి అతడి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. రామునికెదురీగి వెళ్ళి అతడ్ని వెంటబెట్టుకురావాలని, మంత్రులతో కలసి బయల్దేరాడు. కాని, ఎంత దూరం వెళ్ళినా రాముడు వస్తున్న జాడ కనిపించలేదు. మనస్సులో ఏదో అనుమానం కలిగింది. అప్పుడు హనుమంతునితో ఇలా అన్నాడు.

"హనుమా, అన్నయ్య జాడ లేదు. వానర స్వభవం చేత నన్ను ఆట పట్టించాలని ప్రయత్నించలేదు కదా నువ్వు. కామరూపులైన వానరులు వస్తున్నారన్నావు. ఏరీ కనిపించరేం?" అని ఆదుర్దాగా అడుగుతున్న భరతునితో ఆంజనేయుడిలా అన్నాడు.

"రాజకుమారా, దారి పొడుగునా వృక్షాలు ఫలము తోటీ, పూలతోటీ నిండి వున్నాయి. చూశావా? తేనె పట్లు సమృద్ధిగా కనిపిస్తున్నాయా? ఇదంతా ఆ భారద్వాజుని అనుగ్రహం వలన కలిగినదే.

ఇంద్రుడు రాముడెక్కడ వుంటే, అక్కడంతా వానరులకి సమృద్ధిగా పూవులు, ఫలములు, తేనె దొరకాలని వరమిచ్చాడు. అందుకు తగినట్లు భారద్వాజ మహాముని సంకల్ప మాత్రం చేత రామునికి ఆతిధ్యమిచ్చాడు. అదిగో చెవులొగ్గివింటే వానరులు ఆనందంతో చేస్తున్న కోలాహలం వినిపిస్తుంది. అంటే వానర సైన్యం గోమతీ నదిని దాటుతోందన్న మాట. అదిగో అటు చూడు ధూళి పైకి లేస్తోంది. ఆకాశంలో అదిగో అందమైన పుష్పక విమానం చూడు. ఆ పుష్పక విమానం బ్రహ్మ సంకల్ప మాత్రం చేత తయారైంది. రామునిసేవలో అదిప్పుడు అయోధ్యవైపు వస్తోంది. రావణుని సపరివార సమేతంగా చంపేశాక ఆ పుష్పకవిమానాన్ని విభీషణుడు రామునికిచ్చాడు. ఇది అసలు కుబేరుని వాహనం.

మనోవేగం కలిగిన ఆ విమానంలో సీతారామాలక్ష్మణులు, పరివార సమేతంగా విభీషణ సుగ్రీవులు వస్తున్నారు" అని ఆంజనేయుడు చెప్తూ వుంటే అందరూ పైకి చూశారు. ఆకాశంవైపు. అందరికీ విమానం కనిపించింది. అయోధ్యా వాసులందరూ ఆనందంతో అదిగో రాముడు వస్తున్నాడు" అని కేకలు పెట్టారు. అందరూ ఆత్రంగా రాముని కోసం చూస్తున్నారు. పుష్పక విమానంలోంచి సాక్షాత్తు దేవేంద్రుడిలా, రాముడు వారికి దర్శనమిచ్చాడు.

భరతుడు కిందినించే అన్నగారికి నమస్కరించాడు. భరతుడు కనిపించగానే విమానాన్ని కిందికి దిగమని, రాముడు ఆదేశించాడు. వెంటనే పుష్పక విమానం భూమి మీద దిగింది. భరతుడు విమానంలోకి వెళ్ళాడు. రాముడ్ని చూడగానే ఆనందంతో సాష్టాంగ నమస్కారం చేశాడు. రాముడు భరతుడ్ని లేవదీసి హృదయానికి హత్తుకుని, ఒళ్ళోకూర్చోబెట్టుకున్నాడు.

ఆ తర్వాత భరతుడు లక్ష్మణుని దగ్గరకి వెళ్ళాడు. లక్ష్మణుడు భరతునికి పాదాభివందనం చేశాడు. భరతుడు లక్ష్మణుని ప్రేమతో కౌగలించుకున్నాడు. ఆ తర్వాత భరతుడు సీతమ్మకి నమస్కరించాడు.

ఆ అన్నదమ్ముల సౌభ్రాతృత్వం చూసి సుగ్రీవుడు, విభీషణుడు చాలా ఆశ్చర్యపోయారు. శత్రుఘ్నుడు కూడా అందరికీ నమస్కరించాడు. భరతుడు అందర్నీ కుశల ప్రశ్నలు వేసి సాదరంగా పలకరించాడు.

రాముడు కౌసల్యా దేవి దగ్గరకి వెళ్ళాడు. ఆమె బెంగతో కృశించి చిక్కి శల్యమై వుంది. ఆమె పాదాలకి భక్తితో నమస్కరించాడు రాముడు. తల్లిని కౌగలించుకుని, ఆమె మనోవేదన తగ్గించాడు. ఆ తర్వాత సుమిత్రకి, కైకకి కూడా నమస్కరించి, పురోహితుని దగ్గరకి వెళ్ళాడు. వారందరికీ సాష్టాంగ నమస్కారం చేసి దీవెనలు పొందాడు. భరతుడు, బంగారు పళ్ళెరంలోని పాదుకలు తీసి, స్వయంగా రామునికి తొడిగాడు. భక్తితో అంజలి ఘటించి, ఇలా అన్నాడు.

"ప్రభూ, నీ అయోధ్యకి నువ్వు తిరిగివచ్చావు. నీ కోశాగారాన్ని, ధనాగారాన్ని, పదిరెట్లు చేసి నీకు సమర్పిస్తున్నాను. స్వీకరించు" అని భరతుడు అంటుంటే రామునికి కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి.

భరతుడ్ని ఒడిలో కూర్చోబెట్టుకుని పరివారమంతా సుఖాశీనులయ్యాక, విమానాన్ని నంది గ్రామానికి వెళ్ళమని ఆదేశించాడు రాముడు.

అందరూ కలిసి భరతుడి, ఆశ్రమానికి వచ్చారు. అందరూ విమానం దిగాక రాముడు విమానాన్ని కుబేరుడి దగ్గరకి వెళ్ళి పొమ్మన్నాడు. విమానం ఉత్తర దిశగా

ప్రయాణం చేసి కుబేరుని దగ్గరకి వెళ్ళిపోయింది.

రాముడు వశిష్ఠాది గురువులకి నమస్కరించి, వారిని కూర్చోమని, తను కూడా ఒక దివ్యమైన ఆసనంపై కూర్చున్నాడు.

రాముడు సుఖాశీనుడయ్యాక చేతులు జోడించి భరతుడిలా అన్నాడు.

"రామా, నా తల్లియందలి గౌరవంతో నువ్వు రాజ్యాన్ని పరిత్యజించి, పధ్నాలుగేళ్ళు వనవాసానికి వెళ్ళావు. నీ సన్మానానికి ఆమె చాలా సంతోషించింది. చిత్ర కూటాశ్రమంలో నీ రాజ్యాన్ని నాకు న్యాసంగా ఇచ్చావు. ఇన్నేళ్ళూ మీ రాజ్యాన్ని పదిలంగా కాపాడాను. కాని రాజ్యపాలన చెయ్యగల శక్తి సామర్థ్యాలునాకు లేవు. అన్నివిధాలా అందుకు నువ్వే సమర్థుడివి. మన తండ్రికి నువ్వు జ్యేష్ఠపుత్రుడివి. కనక ఈ రాజ్యానికి నువ్వే వారసుడివి. అదీగాక నాన్నగారికి నువ్వంటేనే మక్కువ ఎక్కువ. ఆయన ఎన్నో యజ్ఞాలు చేసి జ్యేష్ఠపుత్రునిగా నిన్ను పొందారు. నువ్వే ప్రజాహితంగా పరిపాలన చేసి, తన ప్రజల్ని రంజింపచేస్తావని నమ్మారు. కాల చక్రమున్నంత వరకు అయోధ్యతో పాటు ఈ విశ్వాన్నంతా పరిపాలించగల్గిన సమర్థుడివి నువ్వు. కనుక నీ రాజ్యాన్ని నువ్వు స్వీకరించు" అని భరతుడు రాముడ్ని అనేకవిధాల ప్రాధేయపడ్డాడు. రాముడు సరే అని అంగీకరించాడు.

శత్రుఘ్నుడు వెంటనే క్షుర కర్మచేసే వారిని పిలిపించాడు. రాముని ఆజ్ఞ ప్రకారం వారు ముందుగా భరతుని జటాజూటాలు కత్తిరించి చక్కగా కేశ సంస్కారం చేశారు. భరతుడు నార వస్త్రాలు విడిచి, మంగళ స్నానాలు చేసి మెత్తని పట్టు వస్త్రాలు ధరించాడు. ఆ తర్వాత వానర రాజైన సుగ్రీవుడు, రాక్షస రాజైన విభీషణుడు మంగళ స్నానాలు చేశారు.

ఆ తర్వాత రామలక్ష్మణులు జటలు విప్పి కేశ సంస్కారం చేయించుకుని, మంగళ స్నానాలు చేసి, పట్టు వస్త్రాలు, అంగరాగాలు, ఆభరణాలు ధరించారు. భరతుడు దగ్గర వుండి వారికి అలంకారం చేయించాడు.

ఆపైన కౌసల్య, సుమిత్ర, కైకేయి సీతకి మంగళ స్నానాలు చేయించారు. చక్కగా అలంకరించారు. కౌసల్య వానరుల భార్యలందరికీ రత్నా భరణాలు సమర్పించింది.

శత్రుఘ్నుడు, సుమంత్రుని పిల్చి రథము పూన్చి తెమ్మని ఆజ్ఞాపించాడు. సూర్యమండలంలా దేదీప్యమానంగా వున్న రథం పూన్చి తెచ్చాడు సుమంత్రుడు.

రాముడు ఆ రథం ఎక్కాడు. వారివెంట సుగ్రీవుడు, ఆంజనేయుడు

బయల్దేరాడు.

సీత వెంట ఇంకో రథంలో సుగ్రీవుని భార్యలు బయల్దేరారు.

మంత్రులు అయోధ్యలో జరగవలసిన కార్యక్రమం గురించి వశిష్ఠునితో సంప్రదించారు. వశిష్టుడు శ్రీరాముని పట్టాభిషేకానికి కావాల్సిన ఏర్పాట్లు గురించి వివరించి చెప్పాడు. మంత్రులంతా ఆ ఏర్పాట్లు చెయ్యటంలో మునిగిపోయారు.

రాముడు రథంలో అయోధ్యకి బయల్దేరగా, ఆ రథానికి భరతుడు సారధి అయ్యాడు. శత్రుఘ్నుడు చామరంపట్టాడు. లక్ష్మణుడు ఛత్రం పట్టాడు. విభీషణుడు వ్యజనం వీచాడు. ఆకాశంలోంచి ఋషులు, దేవతలు, గుంపులు గుంపులుగా నిలబడి రాముని ప్రస్తుతించారు. సుగ్రీవుడు జయము అనే పెద్ద ఏనుగునెక్కి బయల్దేరాడు. వారి వెంట జన సముదాయం, పెద్ద ప్రవాహంలా నడిచింది. దేవ దుందుభులు మ్రోగాయి. శంఖారావాలు మిన్నుముట్టాయి. వానరులంతా కూడా మానవాకారంలోతొమ్మిదివేల ఏనుగుల మీద బయల్దేరారు. అందరూ తాళ వాద్యాలు మ్రోగిస్తూ, నడుస్తున్నారు. మంగళగీతాలాలపిస్తున్నారు.

పచ్చని అక్షింతలు, బంగారపు ఛత్రములు, భక్ష్యములు, పట్టుకుని అందమైన కన్యలు, బ్రాహ్మణులు ముందు నడిచారు. వారి వెనక రాముని రథం, మంత్రులు ఆ రథం పక్కల నడుస్తుంటే, రాముడు రథంలోంచే వారితో ఇష్టాగోష్టి సలుపుతూ, సుగ్రీవుడితో తనమైత్రి ఎలా కలిగిందో, శతయోజన విస్తీర్ణ మహార్ణవాన్ని, వాయునందునుడెలా ధైర్యసాహసాలతో వానరవీరులెంత ధైర్యంతో యుద్ధం చేశారో, రాక్షసుల బలం ఎంతటిదో, విభీషణునితో తన కలయిక ఎలా జరిగిందో, అంతా వివరించి చెప్తున్నాడు. అయోధ్యావాసులా విషయాలన్నీ ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని వింటున్నారు. రాముడు క్షేమంగా తిరిగి వచ్చినందుకు వారంతా చాలా ఆనందం పొందారు. మొత్తానికి అలా అలా సాగుతూ అందరూ అయోధ్యకి వచ్చారు.

ఎటు చూసినా ప్రతి ఇంటా విజయ పతాకాలెగురుతున్నాయి. రాముడు ముందుగా తన తండ్రి అంతఃపురానికి వెళ్ళాడు. తల్లులు ముగ్గురికీ పాదాభివందనం చేశాడు. ఆ తర్వాత భరతునితో మృదు మధురంగా ఇలా అన్నాడు. "భరతా ఇది వరలో నేను వుండే వాడిని చూడు, అశోక వృక్షాలు చుట్టు వున్నాయే, వజ్రాలు, వైఢూర్యాలు, ముత్యాలు రత్నాలు అలంకరించిన భవనం, దానిని సుగ్రీవుడికి విడిదిగా ఇయ్యి" అని. భరతుడు సరే అని ఆ ఏర్పాట్లు చెయ్యటానికి వెళ్ళాడు. శత్రుఘ్నుడు, రాజభవనాలలో దీపాలు, పక్కలు, చక్కని

దుప్పట్లు, అవన్నిటినీ చక్కగా ఏర్పాటు చేయించే పనిమీద వెళ్ళాడు. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక భరతుడు సుగ్రీవుని, రాముని మందిరంలోకి చెయ్యిపట్టుకుని తీసికెళ్ళి అక్కడ విశ్రాంతి తీసుకోవాల్సిందిగా చెప్పి తర్వాత ఇలా అన్నాడు.

"వానరోత్తమా శ్రీరామపట్టాభిషేకానికి కావాల్సి సముద్రజలాలను తెప్పించండి" అని భరతుడు కోరగానే సుగ్రీవుడు రత్నాలు పొదిగిన బంగారు బిందెలు నాలుగు, నలుగురు వానరులకిచ్చి, సముద్రజలాలు తేవలసిందిగా ఆజ్ఞాపించాడు.

జాంబవంతుడు, హనుమంతుడు, ఋషభుడు, వేగదర్శి అనబడే నలుగురు వానరులు, ఐదువందల నదులలోని పుణ్యజలాలు బంగారు కలశాలతో తెచ్చారు. పూర్వసముద్రము నుంచి సుషేణుడు, రత్నాలు పొదిగిన బంగారు కలశము నిండా సముద్ర జలములు నింపి, అక్కడ దొరికే ఎఱ్ఱచందనం వృక్షాల కొమ్మలు కప్పి తెచ్చాడు.

అలాగే గరుడుడు, గవయుడు, నలుడు మిగిలిన మూడు దిక్కుల నుంచీ సముద్ర జలాలు నింపి తెచ్చారు. నాలుగు సముద్రాల జలాలు, ఐదు వందల నదుల పవిత్ర జలాలు తెచ్చి శత్రుఘ్నుని ముందు వుంచారు వారు.

శత్రుఘ్నుడు మంత్రులతో, వశిష్ఠుల వారితో శ్రీరామపట్టాభిషేకానికి అంతా సిద్ధంగా వుందని విన్నవించాడు.

శతాధిక వృద్ధులైన వశిష్ఠుడు బ్రాహ్మణులతో, పురోహితులతో కలసి వేద ఘోష మధ్య రత్న సింహాసనం మీద సీతమ్మతో సహా శ్రీరామచంద్రుని కూర్చుండజేశాడు.

వశిష్ఠుడు వాయదేవుడు జాబాలి. కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు, అనే ఎనమండుగురు పురోహితులు, సహస్రాక్షుడైన ఇంద్రుని, అష్టవసువులు, అభిషేకించినట్లు పరిమళవంతములైన స్వాదు జలములతో అభిషేకించారు.

ఋత్విక్కులు బ్రాహ్మణులు ముందర అభిషేకించారు. ఆకాశంలోంచి లోకపాలకులు, దేవతలు, సకల ఔషధీరసాలతో అభిషేకించారు.

నవరత్న మణి ఖచితమైన కిరీటాన్ని వశిష్ఠుడు శ్రీరామునికి ధరింపచేశాడు. శత్రుఘ్నుడు తెల్లని చామరం పట్టాడు. విభీషణుడు చంద్రకాంతి వంటి చామరం పట్టాడు. వాయుదేవుడు స్వయంగా వచ్చి, దేవేంద్రుడు పంపిన నూరు పూసలు

కల్గిన, మాలను, ఒక మంచి ముత్యాల హారం తెచ్చి శ్రీరాముని కంఠ సీమని అలంకరించాడు. దేవతలు, గంధర్వులు గానం చేవారు. అప్సరసలు నాట్యం చేశారు.

శ్రీరామపట్టాభిషేక సమయంలో లోకాలన్నీ ఆనందంతో ఓలలాడాయి. భూమి సస్యశ్యామలమైంది. పట్టాభిషేక సందర్భంగా రాముడు లక్ష గుఱ్ఱాలని, ఆవుల్ని, ఎద్దుల్ని బ్రాహ్మణులకి దానం చేశాడు. బ్రాహ్మణులకి విలువైన బంగారు ఆభరణాలు, విలువైన వస్త్రాలు, దానం చేశాడు. ఎంతో సత్కరించి సన్మానం చేశాడు. ముప్పైకోట్ల బంగారు నాణాలు బ్రాహ్మణులకి దానం చేశాడు. పట్టాభిషేకం చూడటానికి వచ్చిన వారినందర్నీ అనేక కానుకలతో సత్కరించాడు రాముడు.

సుగ్రీవునికి విలువైన మణిహారాన్ని బహూకరించాడు. అంగదునికి వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు పొదిగిన అనేక హారాలు బహూకరించాడు. సీతమ్మకి మంచి ముత్యాలు, రత్నాలు, కూర్చి చేసిన బంగారుహారం కానుకగా ఇచ్చాడు. ఆంజనేయునికి సీత, తెల్లని పట్టు వస్త్రాలు, అనేక హారాలు బహుకరించింది.

ఆ తర్వాత తన మెడలోని హారం తీసి చేత్తో పట్టుకుని, ఒకసారి వానరులందరి వంకా చూసి, మళ్ళీ రాముని వైపు చూసింది.

సీత అభిప్రాయం గుర్తించాడు రాముడు "సౌభాగ్యవతీ, నీకెవరి మీద ఎక్కువ వాత్సల్యం వుందో వారికి ఆ హారాన్ని ఇయ్యి. వాయుపుత్రునికివ్వాలనే కదూ నీ ఉద్దేశం? పౌరుషంలో, పరాక్రమంలో, బుద్ధికుశలతతో అతడితో సాటి వేరెవ్వరూ లేదన్న నీ ఆలోచన సరి ఐనదే" అన్నాడు చిరునవ్వుతో. సీత ఆ హారాన్ని అప్యాయంగా చూస్తూ హనుమకిచ్చింది. అది ధరించిన వాయునందనుడు, మేరు పర్వతంపై తెల్లమబ్బులు వ్యాపించినట్లు ప్రకాశించాడు.

ఆ తర్వాత ద్వివిదునికి, మైందునికి, నీలునికి, కానుకలిచ్చి సత్కరించాడు రాముడు. విభీషణునికి, సుగ్రీవునికి, హనుమంతుడికి, జాంబవంతుడికి అనేక రత్నాలు కానుకలు ఇచ్చాడు. రాముని రాజ్యాభిషేకము చూసి సన్మానాలు పొందిన వారంతా తమ తమ ప్రదేశాలకి వెళ్ళిపోయారు.

రాముడు రాజై పరమ ఔదార్యంతో రాజ్యపాలన చేశాడు. లక్ష్మణునికి యువరాజుగా పట్టాభిషేకం చెయ్యాలని రాముడు అనుకున్నాడు. కాని అందుకు లక్ష్మణుడు ఒప్పుకోలేదు. తనకంటే పెద్దవాడైన భరతుడే అందుకు తగినవాడని అన్నాడు. రాముడుందుకంగీకరించి భరతుని యువరాజుగా అభిషేకించాడు.

రాజ్యపాలన ప్రారంభించిన అనతికాలంలోనే రాముడు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము అనే యజ్ఞాలు ఎన్నోచేశాడు. రాముడు తన తమ్ములతో కలసి పదివేల సంవత్సరాలు ఈ భూమిని పరిపాలించాడు. అశ్వమేధాది యాగాలెన్నో చేసి యజ్ఞం చేయించిన ఋత్విక్కులకి భూరి దక్షిణలిచ్చి సత్కరించాడు.

మిత్రులతో, జ్ఞాతులతో, బంధువులతో ఆనందంగా పరిపాలన చేశాడు.

రాముని రాజ్యంలో ఏ ఒక్కరికీ ఆపదలు కలగలేదు. వ్యాధులు, శోకాలు, అస్సలు లేవు. పెద్ద వారు బ్రతికి వుండగా చిన్న వారు చనిపోవటం, వారికి పెద్ద వారు ప్రేత కర్మలు చెయ్యడం అస్సలు జరగలేదు. లోకమంతా ఆనందంగా వుంది. ప్రజలంతా ధర్మవర్తనులై వుండేవారు.

రామరాజ్యంలో ప్రజలకి ఆయుర్దాయం, సంతానం పరిపూర్ణంగా వుండేవి. ఆయన ఏలుబడిలో ప్రజలంతా, రాముడు, రాముడు, రాముడు అని, ఆయననే తలపోస్తూ వుండేవారు. కాలమునకు తగ్గట్లు ఋతువులు, ప్రకృతి యధావిధిగా వుండేవి. కరువు, కాటకాలుగాని, ప్రకృతి వైపరీత్యాలుగాని, అతి వృష్టి, అనావృష్టిగాని అస్సలు ఉండేవి కావు.

పూలు, పండ్లు సమృద్ధిగా వుండేవి. ప్రజలంతా వర్ణాశ్రమ ధర్మాలు చక్కగా ఆచరించే వారు. ప్రజలంతా ధర్మపరులై సత్యమునే పల్కుతుండే వారు.

ఈ విధంగా రాముడు ప్రజానురంజకంగా పదకొండు వేల సంవత్సరాలు పరిపాలన చేశాడు. ఇది శ్రీమద్రామాయణము. ఆదికావ్యము. వాల్మీకి మహాముని దీనని రచించాడు.

దీనిని శ్రద్ధగా చదివిన వారికి సిరి సంపదలు దీర్ఘాయుష్షు, సత్కీర్తి కలుగుతాయి. రాజులకి విజయం కలుగుతుంది. దీనిని చదివినా, విన్నా, పాపం నశిస్తుంది.

పుత్రులు కావాలనుకుని దీన్ని పఠిస్తే పుత్ర సంతానం కలుగుతుంది. ధనము కోరుకున్నవారికి ధనము లభిస్తుంది. సకల మనోరధాలు తీర్తాయి. నిత్యానందం కలుగుతుంది. కష్టాలు తీర్తాయి. దూరమైన బంధువులు మళ్ళీ దగ్గరౌతారు. పీడలు, పిశాచాలు దూరమవుతాయి.

శ్రీరామచంద్రుని కటాక్షము కలిగి అన్ని కోరికలు సిద్ధిస్తాయి. శ్రీరాముడే మహావిష్ణువుకనుక సాక్షాత్తు మహావిష్ణువు ప్రసన్నుడౌతాడు.

జగత్కర్త అయిన శ్రీహరియే శ్రీరాముడిగా అవతరించాడు. ఆయనే శ్రీమన్నారాయణుడు.

## ఫలశృతి

శ్రీరామాయణ మహాకావ్యాన్ని చదివినా విన్నా కుటుంబ వృద్ధి కలుగుతంది. ధన, ధాన్య సమృద్ధి కలుగుతుంది. స్త్రీలు సత్ప్రవర్తన గలవారై వుంటారు. ఈ లోకంలో సకలార్థాలు సిద్ధిస్తాయి. ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయి. అన్నదమ్ములు సఖ్యతగా వుంటారు. ఇది త్రేతా యుగములో జరిగిన యథార్థ గాథ. ఎంతమాత్రము కల్పితం కాదు.

సర్వాంతర్యామియైన విష్ణువు, ఈ రామాయణం చదివిన వారికి బలం అనుగ్రహిస్తాడు. సకల జీవులు, సకల ప్రకృతి, సుసంపన్నమై వుంటుంది. "బలం విష్ణోః ప్రవర్ధ తాం" అని వాల్మీకి మహాముని నిస్సంకోచంగా ఉపదేశించాడు.

యజ్ఞ యాగాదులు చేసిన పుణ్యం కేవలం రామాయణ పఠనం వల్ల వస్తుంది.

ఎవరైతే భక్తి ప్రపత్తులతో ఈ రామాయణం చదువుతారో లేక వ్రాయిస్తారో, వారు తప్పక స్వర్గానికి వెళ్తారు.

భక్తితో రామాయణం ఒక్క పాదం గాని, ఒక్క పదం గాని, విన్న వారు బ్రహ్మలోకానికి వెళ్ళి, బ్రహ్మ చేత పూజింపబడ్తారు.

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**యుద్ధ కాండ సమాప్తం.**

## బ్రహ్మ శ్రీరాముని యొక్క పరతత్వము గురించి చెప్పిన స్థవము.

యుద్ధ కాండ నూట ఇరవైయ్యవ సర్గ 12వ శ్లోకము నుంచి 33వ శ్లోకము వరకు.

**12 శ్లో॥** ఆత్మానం మానుష్యం మన్యేం, రామం దశరథాత్మజం
యో హం యస్సయతశ్చాహం భగవాన్స్త్రద్బ్ర వీతుమే
(భగవాన్)

నేను, నన్ను దశరథునికుమారుడనైన మానవ మాత్రుడనని అనుకుంటున్నాను (నమ్ము) అసలు నేనెవర్ని? ఎక్కడ్నించి వచ్చాను? ఎందుకు వచ్చాను? ఆ విషయం తెలుపవలసిందిగా భగవన్ మిమ్ము కోరుతున్నాను అని రాముడు బ్రహ్మని అడిగాడు. పండితులు రాముడు ఇలాఅడగటానికి కారణం ఏమిటి? అన్న విషయం చక్కగా వివరించారు. ఆ విషయం విస్తారంగా కాక చాలా క్లుప్తంగా చెప్తాను.

రాముడు శ్రీమన్నారాయణుని పరమావతారము. ఆ సంగతి ఆయనకి తెలుసు. అయినా కూడా ఆయన సామాన్య మానవునిగానే వుండదల్చుకున్నాడు. మానవుని చేతిలో మాత్రమే రావణునికి చావుకలుగుతుందని బ్రహ్మసంకల్పం అందుకే నారాయణుడు రామునిగా అవతరించాడు. ఈ సంగతి రామాయణ మహాకావ్యం యొక్క ప్రారంభంలోనే వ్రాయబడింది. అయితే ఆ సంగతి బ్రహ్మకి, దేవతలకి తప్ప మానవలోకంలో ఎవ్వరికీ తెలియదు. చాలా కొద్ది మంది తాపసులు తమ తపః ప్రభావంతో తెలుసుకోగలిగారు. రావణవధానంతరం కూడా రాముడు అవతార సమాప్తి అయ్యేవరకు సామాన్యమానవుడుగానే వుండదల్చాడు, ఆయన సత్యవ్రతుడు కనుక. అయితే ఆ సమయంలో ఆ ప్రదేశంలో వున్న వానర వీరులు, రాక్షసులు, అందరూ కూడా రణరంగంలో రాముని పరాక్రమం చూసి, ఈయన నిజంగానే మానవుడా, లేక మానవరూపంలో ఉద్భవించిన దేవతా స్వరూపుడా? అని అనుమానపడ్డారు. వారి సందేహ నివృత్తి చెయ్యటంకోసమే రాముడు సాక్షాత్తు సృష్టికర్త అయిన బ్రహ్మచేత చెప్పించాడు. ఈ స్తోత్రం విశేష ఫలప్రదమైనది. దీనిని నియమం తప్పకుండా ప్రతీరోజూ పఠిస్తే వారి మనోరథాలన్నీ తీరడమే గాక, ఆపదలలో వున్న వారు పఠిస్తే వారు ఆపదలనించి గట్టెక్కుతారని వాల్మీకి మహాముని చాలా నమ్మకంగా చెప్పారు. కనుక ఇక్కడ వాల్మీకి రామాయణంలోని ఆ "స్థవం గురించి మనం తెలుసుకోవాలి.

యుద్ధకాండ 120వ సర్గ 13శ్లో నించి

13. ఇతి బ్రువంతం కాకుత్‌స్థం బ్రహ్మాం బ్రహ్మావిదాం వరః
అబ్రవీచ్ఛృణుమేరామ, సత్యం సత్యపరాక్రమ

14. భవాన్నారాయణో దేవః శ్రీమాన్ చక్రాయుధోవిభుః
ఏకశృంగో వరాహస్త్వం భూత భవ్యసపత్నజిత్.

15. అక్షరం బ్రహ్మాసత్యంచ, మధ్యే చాంతేచ రాఘవ,
లోకానాం త్వం పరో ధర్మో, విష్వక్సేన శ్చతుర్భుజః

16. శార్ఙ్గ ధన్వ హృషీకేశః పురుషః పురుషోత్తమః
అజితః ఖడ్గ ధృద్విష్ణుః కృష్ణశ్చైవ బృహద్బలః

17. సేనానీర్గ్రామణీశ్చత్వం, బుద్ధిస్సత్త్వం క్షమాదమః
ప్రభవ శ్చాప్యయశ్చత్వం ఉపేంద్రో మధుసూదనః

18. ఇంద్రకర్మామహేంద్ర స్త్వం పద్మనాభోరణాంతకృత్
శరణ్యం శరణం చ త్వామా హుర్దివ్యా మహర్షయః

19. సహస్రశృంగో, వేదాత్మాశతజిహ్వో మహర్షభః
త్వం త్రయాణాంహి, లోకానామాది కర్తాస్వయం ప్రభుః
సిద్ధానామపి, సాధ్యానామాశ్రయశ్చాసి పూర్వజః

20. త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వమోం కారఃపరంతపః
ప్రభవం, విధనం వా తే నవిదః కో భవానితి.

21. దృశ్యసే సర్వభూతేషు, బ్రాహ్మణేషుచ, గోషుచ
దిక్షు సర్వాసు గగనే పర్వతేషు వనేషుచ.

22. సహస్ర చరణ శ్రీమాన్ శతశీర్షసహస్రదృక్.
త్వం ధారయసి భూతాని, వసుధాంచ సపర్వతామ్,

23. అంతేపృధి వ్యాస్సలిలే, దృశ్యసేత్వం మహోరగః
త్రీన్ లోకాన్ ధారయన్, రామ దేవగంధర్వ దాన వాన్.

24. అహంతే హృదయం రామ, జిహ్వా దేవీ సర్వస్వతీ
దేవా గాత్రేషు రోమాణి, నిర్మితాబ్రహ్మణ :ప్రభో

25. నిమేషస్తే భవేద్రాత్రి, రున్మేస్తే భవేద్దివా.
సంస్కారాస్తే భవత్ వేన్. నతదస్తి త్వయావినా.

26. జగత్సర్వం శరీరంతే స్థైర్యంతే వసుదా తలమ్
అగ్ని: కోప: ప్రసాదస్తే సోమ శ్రీవత్సలకణ:

27. త్వయా లోకాస్త్రయ: క్రాంతా:పురాణే విక్రమైస్త్రిభి:
మహేంద్రశ్చ వృతోరాజా బలింభధ్వా మహాసురమ్.

28. సీతాలక్ష్మీర్భవాన్ విష్ణుర్దేవ:కృష్ణ: ప్రజాపతి:
వధార్థం, రావణ స్నేహ, ప్రవిష్టో మానుషీం తనుమ్.

29. తదిదంన: కృతం కార్యం, త్వయా ధర్మభృతాం వర:
నిహతో రావణోరామ ప్రహ్రాష్టో దివమాక్రమ

30. అమోఘం బలవీర్యంతే అమోఘస్తే పరాక్రమ:
అమోఘం దర్శనం రామం నచమోఘస్తవస్తవ.

31. అమోఘా స్తే భవిష్యంతి భక్తి మంతశ్చయేనరా:

32. యేత్వాం దేవం ధ్రువం భక్తా: పురాణం పురుషోత్తమమ్
ప్రాప్నువంతి సదా కామానిహలోకే పరత్రచ.

33. ఇమమార్షం స్తవం నిత్య మితిహాసమ్ పురాతనమ్
యేనరా:కీర్తయిష్యంతి, నాస్తి తేషాం పరాభవ:

ఇది బ్రహ్మ, శ్రీరాముని పరతత్వం గురించి చెప్పిన స్థవము. విశేష ఫల ప్రదమైన ఈ స్తోత్రం నమ్మకంతో ప్రతి రోజూ చదివితే, వారి మనస్సులోని కోరికలన్నీ సిద్ధిస్తాయి.

## యుద్ధకాండపై సమీక్ష

కిష్కింధకాండలో విచిత్రమైన మలుపులు తిరుగుతూ, సుందరకాండలో అద్భుతమైన సన్నివేశాలతో మైమరపు కలిగించిన రామాయణ కథ. యుద్ధకాండలో ప్రవేశించే సరికి ఆద్యంతం చాలా ఆసక్తి కరంగా సాగిపోతుంది. ఇక్కడ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలెన్నో వాల్మీకి మహాముని ప్రస్తావించారు. అందులో మొదటిది శ్రీరాముడు హనుమంతుని లంక యొక్క నైసర్గిక స్వరూపం గురించి, అక్కడి సైనికబలం గురించి, రక్షణ ఏర్పాట్లు గురించి చెప్పమని అడిగినప్పుడు హనుమంతుడు చెప్పిన విషయలు అందరికీ ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆ సందార్భంలో రావణుని యొక్క పరిపాలనాదక్షత స్పష్టంగా మనకి గోచరిస్తుంది. ఎటువంటి సమయంలో అయినాసరే అప్రమత్తంగా వుండే సైనిక సిబ్బంది, పటిష్టమైన కోట అగడ్తలు, కందకాలు, కేవలం యంత్రాల వల్ల (తమంత తామే) ఆటోమేటిగ్గా పనిచేసే ఫిరంగులు, కందకాల మీదినించి లంకలోకి ప్రవేశించే మార్గాలదగ్గర శత్రువులురాగానే తమంతట తామే జరిగిపోయే బాటలు, ఇలా ఎన్నెన్నో పరమాద్భుతమైన సంగతులు నేటి నాగరిక ప్రపంచాన్ని సవాలు చేస్తున్నట్లుంటాయి. ఎన్నెన్నో సందర్భాల్లో రాజనీతిచక్కగా తెలియపరుస్తూ, ప్రభుత్వం అంటే ఎలా వుండాలి అనే విషయం చక్కగా ప్రభోదించాడు వాల్మీకి.

విభీషణ శరణాగతి విషయంలో ఎవరిమట్టుకు వాళ్ళు విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చినప్పుడు, ఎటువంటి వాడు, శత్రుపక్షం వాడైనా నమ్మదగిన వాడు అనే సంగతి చక్కగా చర్చించబడింది. ఆ తర్వాత సముద్రం మీద వారధి నిర్మించటం పరమాద్భుతమైన విషయం. రామాయణ మహాకావ్యంలో ఒక్క అక్షరం కూడా అబద్ధం కాదని వాల్మీకి మహాముని, కావ్యారంభంలోనే గట్టిగా చెప్పాడు. కనుక ఈ విషయాలు నమ్మవచ్చా లేదా అనే ప్రసక్తే లేదు.

కోటాను కోట్ల మంది వానరవీరులు వారధి మీదనించి నడచి లంకలో ప్రవేశించడానికి త్రికూట పర్వతం పైకి వెళ్ళిన తీరు ఒక అద్భుతమైన విషయమైతే, వారిని యుద్ధానికి వీలైన పద్ధతిలో విభజించి వ్యూహరచన చేసిన విధానం ఇంకా పరమాద్భుతం. ఆ ఘట్టం చదివినప్పుడు వాల్మీకి మహాముని చాతుర్యం మనకి కళ్ళకి కట్టినట్లు కనిపిస్తుంది.

ఇంక యుద్ధం మొదలైనప్పట్నించి ఆయా సన్నివేశాలు కళ్ళముందు కదులుతున్నట్లు ఒళ్ళుగగొర్పడిచే విధంగా వర్ణించి రచించాడు వాల్మీకి.

కేవలం గోళ్ళు దంతములు మాత్రమే ఆయుధాలుగా యుద్ధం చేస్తున్న

మహావీరులైన వానరులు, ఎన్నెన్నో శక్తివంతమైన ఆయుధాలు ధరించి యుద్ధం చేసిన భయంకరమైన రాక్షసులు, ఎవరెవరికి, ఏ విధంగా యుద్ధం జరిగిందీ, ఎవరెవరు ఎలా మరణించిందీ ప్రత్యక్షంగా మనం చూస్తున్నంత గొప్పగా వర్ణించి వ్రాశాడు వాల్మీకి. అందుకే "రామరావణుల యుద్ధానికి అదే సాటి. దానితో పోల్చతగ్గది మరొకటి లేదు" అని ఆకాశవీధిలో దేవతలు చెప్పుకున్నారు.

హనుమంతుడు ఓషధీ పర్వతం తెచ్చినప్పుడు దానిమీది నించి వీచిన గాలి తగలగానే గాయపడ్డవారంతా గాయాలు మాని, సంపూర్ణ ఆరోగ్యవంతులై లేచి కూర్చుకున్నారని చెప్పి మన భారతదేశంలో ఎంతటి మహత్తరమైన ఔషధులున్నాయో ప్రభోధించి చెప్పాడు వాల్మీకి. ఇప్పటికీ తులసి, వేప, మొదలైన వృక్షాల మీది నించి వీచే గాలి పీలిస్తే సంపూర్ణ ఆరోగ్యంవంతులుగా వుంటారని మన వాళ్ళు చెప్తారు. ఈ విషయం సైన్సు కూడా అంగీకరించింది. ఇంక యుద్ధ సమయంలో ఉపయోగించిన ఆయుధాలు, వాటి ప్రభావాలు చదివినప్పుడు, నేటి నాగరికత ప్రపంచంలో తయారు చెయ్యబడుతున్న అణుబాంబులు, మరతుపాకులు, మిస్సైల్సు, ఇవన్నీ ఆనాడే మనవాళ్ళు కేవలం తపశ్శక్తితో సంపాదించారని నిరూపించి చెప్పాడు వాల్మీకి.

ఇంక పుష్పక విమానం నిర్మాణం చదివినప్పుడు ఈనాటి రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే అంతరిక్ష నౌకలు, విమానాలు ఆనాడే భారతదేశంలో వున్నాయని తెలుస్తుంది. మనస్సులో అనుకున్నంత మాత్రాన సాగిపోయే పుష్పక విమానంలో ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన ఏర్పాట్లు ఉన్నాయని వ్రాశాడు వాల్మీకి.

ఈ విధంగా నాగరికతలో గాని, విజ్ఞానశాస్త్రపరంగా గాని ఈనాడు పాశ్చాత్యులు సాధిస్తున్న అద్భుతమైన విషయాలెన్నో కొన్ని కోట్ల సంవత్సరాల పూర్వమే త్రేతా యుగంలోనే, కేవలం తపశ్శక్తితో భారతీయులు సాధించారని రామాయణం ఋజువు చేస్తుంది.

ఇంతటి మహత్తరమైన రామాయణ కథని సజీవశిల్పంగా రచించి, మనకందించిన వాల్మీకి మహాముని జన్మధన్యమైంది. అందుకే ఆ మహానీయుడు మనకందరికీ పూజనీయుడు. వాల్మీకి రామాయణం మనకి ఆదర్శం.

కాని, వాల్మీకి ఎందుకోమరి శ్రీరామపట్టాభిషేకంతోటే రామాయణం ముగిసిపోయినట్లు యుద్ధకాండపూర్తికాగానే స్వస్తి వచనాలు, ఫలశృతి కూడా చెప్పేశాడు.

కాని ఆ తర్వాత ఉత్తరాకాండము కూడా రచించి, శ్రీరాముని అవతార సమాప్తి అయ్యేవరకు వున్న కథ వ్రాశాడు.

అసలు ఉత్తరకాండము వాల్మీకి రచించినది కాదు అని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. చాలామంది ఉద్దండపండితులు సైతం రామపట్టాభిషేకం వరకే రామాయణం అనువదించి ఊరుకున్నారు.

అయితే, శ్రీమద్రామాయణ మహాకావ్యం లవకుశుల గానంతోనే మొదలైంది. వారిద్దరూ వాల్మీకి ఆశ్రమంలోనే పుట్టారు. పన్నెండేళ్ళ వయస్సు వచ్చేవరకు అక్కడే పెరిగారు.

కనక ఉత్తరాకాండము వాల్మీకి మహామునే రచించాడన్నది నిర్వివాదాంశం.

ఏది ఏమైనా మహావిష్ణువు శ్రీరామునిగా ఈ భూమి మీద అవతరించాడని మొదలు పెట్టినప్పుడు ఆయన అవతార సమాప్తి చెందే వరకు గల చరిత్ర తెలుసుకోవటం మన కర్తవ్యం. అందువల్ల నేను ఉత్తర రామచరిత్ర కూడా వ్రాయాలనే సంకల్పించాను.

వాల్మీకి మహాముని మనకి శ్రీరామ చరిత్రతో పాటు ఇంకా కొన్ని అమోఘమైన వరాలు కూడా అందించాడు.

వాటిలో ముఖ్యమైనవి, మొదటిది సుందరకాండ. సుందరకాండ పారాయణ వల్ల ఎటువంటి ఆపదలైనా గట్టెక్కవచ్చు, అని పండితులెందరో నిరూపించారు.

అలాగే ఆదిత్య హృదయము. ఇది ఒక అమోఘమైన స్తోత్రము. ఆదిత్య హృదయం గురించి తెలియని ఆంధ్రులుండరు.

ఇంకొకటి బ్రహ్మదేముడు శ్రీరాముని పరమాత్మతత్వము ప్రబోధిస్తూ చేసిన 'స్తవము'.

ఈ స్తోత్రం ఎందుకో ఆదిత్య హృదయమంత ప్రశస్త్య పొందలేకపోయింది కాని ఈ స్తోత్రం కూడా అద్భుతమైన మహిమగలది అని వాల్మీకి చెప్పాడు.

రామాయణ పఠనమే అత్యంత ఫలప్రదమైనది అయినప్పుడు ఇందులో ప్రతి అక్షరం మహిమాన్వితమైనదే కదా.

అందుకే "ఏకౌక మక్షరం ప్రోక్తం, మహాపాతక నాశనం" అన్నారు. ఇపుడింక ఉత్తరకాండలోకి వెళ్దాం.



# ఉత్తరకాండ

శ్రీరాముడు పద్నాలుగు సంవత్సరాలూ వనవాస దీక్ష పూర్తి చేసుకుని, సీతా సమేతుడై తిరిగి వచ్చి అయోధ్యలో పట్టాభిషిక్తుడై సుఖంగా రాజ్యపాలన చేస్తున్న తరుణంలో దేశంలోని నలుమూలల నుంచి, మునులు, ఋషులూ, రాముణ్ణి అభినందించి ఆశీర్వదించటానికి, గుంపులు గుంపులుగా తరలి వచ్చారు.

రాముడు సింహాసనం పైనుంచి దిగి ఎదురుగా వెళ్ళి సాదరంగా వారి నాహ్వానించి, చేతులు జోడించి వారికి నమస్కరించాడు.

ఉచితమైన ఆసనాలపై వారిని కూర్చుండజేసి, వారిందరికీ ఒక్కొక్కరికి ఒక్కొక్క ఉత్తమ జాతి గోవుని, దానం చేసి, అర్ఘ్యపాద్యాదులిచ్చి వారిని పూజించాడు.

వారంతా సంతుష్టులై, రాముడ్ని ఆశీర్వదించి "మహాబాహూ నీ దయవల్ల మాకు దేనికీ లోటులేదు. మా భాగ్యవశాత్తు నువ్వు దుర్మార్గులైన రాక్షసులందర్నీ వధించి, కుశలంగా తిరిగి వచ్చావు. లోకకంటకుడైన రావణుడ్ని వధించావు. సీతాలక్ష్మణ సమేతుడవై కుశలంగా తిరిగి వచ్చి మళ్ళీ మాకు పాలకుడవయ్యావు. అదే మాకు పదివేలు.

అయితే, వీరాధి వీరులైన రాక్షసులనందర్నీ సంహరించటం ఒక ఎత్తు, ఇంద్రజిత్తుని, లక్ష్మణుడు సంహరించటం ఒక ఎత్తు. ఆ ద్రోహి ప్రయోగించిన నాగపాశం నుంచి విముక్తి పొంది, మీ అన్నదమ్ములిద్దరూ విజయం సాధించారు. ఇంద్రజిత్తు చనిపోయాడని వినగానే మాకు చెప్పరాని ఆనందం కలిగింది. ఆశ్చర్యమూ కలిగింది. వాడు మహామాయావి. ఎవరి వల్లా తనకి చావులేదని వాడి నమ్మకం. అటువంటి ఇంద్రజిత్తునే మట్టుబెట్టిన వీరాధి వీరులు మీరు. క్రూరాత్ములైన రాక్షసుల్నెందర్నో సంహరించి ప్రపంచానికి రాక్షసబెడద లేకుండా చేశారు మీరు. మీ కీర్తిచంద్రికలు కలకాలం ఇలాగే వర్ధిల్లాలి" అని వారంతా శ్రీరాముని అనేక విధాల ఆశీర్వదించారు.

వారి మాటలు విన్న రామునికి ఆశ్చర్యం కలిగింది.

"ఆర్యులారా మహాబలపరాక్రమ సంపన్నులైన, రావణ కుంభకర్ణుల్ని వదిలి, మీరు ఇంద్రజిత్తుని, ఇంతగా ప్రశంసిస్తున్నారెందుకు? మేటి వీరులైన రాక్షస వీరులింకెందరో వున్నారు కదా? వారందరికన్నా ఇంద్రజిత్తు వీరుడెలా అయ్యాడు? దేవేంద్రుని ఎలా ఓడించాడు? తండ్రిని మించిన బలవంతుడా ఇతడు? ఈ

విషయాలన్నీ మీకభ్యంతరం లేకపోతే తెలుపవలసిందిగా కోరుతున్నాను" అని రెండు చేతులు నమస్కరించి అడిగాడు.

అపుడు అగస్త్యమహాముని ఇలా అన్నాడు "రామభద్రా, ఇంద్రజిత్తు గురించిన వివరాలు నీకు చెప్పే ముందు, రావణుని జన్మవృత్తాంతం గురించి నువ్వు తెలుసుకోవటం మంచిది. చెప్తాను విను.

"కృతయుగంలో బ్రహ్మకి పులస్త్యుడు అనే మానసపుత్రుడు కలిగాడు. పులస్త్యుడు గొప్ప ధర్మనిష్ఠాపరుడు. ఒక సారి అతడు మేరు పర్వత ప్రాంతంలో వున్న "తృణబిందు" అనే రాజర్షి యొక్క ఆశ్రమానికి, తపస్సు చేసుకునేందుకు వెళ్ళాడు. అక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని, ప్రతినిత్యం వేదాధ్యయనం చేస్తూ నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతున్నాడు. తపోనియమంలోవున్న ఆ మహాత్ముని, కొంతమంది అప్సరకాంతలు, నాగకన్యలు, ఋషికన్యలు, క్రీడా విలాసాల కోసం ఆ ప్రాంతాలకి వచ్చి ఆయన తపస్సుకి అంతరాయం కలిగించసాగారు. దాంతో ఆయన విసిగిపోయి, కోపంతో "రేపట్నుంచి ఈ ప్రాంతాలలో ఎవరైనా కన్య నా దృష్టిలో పడిందంటే, ఆమెకి వెంటనే గర్భం వస్తుంది" అని శపించాడు. ఆ శాపం విన్న స్త్రీలు అప్పట్నించీ ఆ ప్రాంతాలకు రావటం మానేశారు. అయితే రాజర్షి అయిన తృణబిందు కుమార్తెకీ సంగతి తెలియదు.

ఆమె మామూలుగానే, ఆ మర్నాడు చెలికత్తెలతో, ఆడుకునేందుకు ఆ ప్రాంతానికి వచ్చింది. కాని అక్కడ ఆమె చెలికత్తెలెవరూ కనిపించలేదు. ఆమె అలా తన సఖురాండ్రకోసం వెతుక్కుంటూ వుండగా పులస్త్యుడు ఆమెని చూశాడు. ఆయన దృష్టి ఆమెమీద ఎప్పుడు పడిందో, వెంటనే శాప ప్రభావం వల్ల ఆమెలో గర్భవతి అయిన లక్షణాలు మొదలయ్యాయి. తన శరీరంలో ఏవో విచిత్రమైన మార్పులు కలగటం చూసి ఆమె గాబరా పడిపోయింది. భయంతో తండ్రి దగ్గరకిపరిగెత్తింది. ఆమె అలా భయంతో తన దగ్గరకి రావటం చూసి ఆమె తండ్రి కారణమేమిటని అడిగాడు.

ఆ అమాయకురాలు చేతులు జోడించి "తండ్రీ కారణం నాకూ తెలియదు. నేనే పాపం ఎరుగను. పులస్త్యమహర్షి ఆశ్రమ ప్రాంతంలో నా చెలికత్తెలున్నారేమో అని వెళ్ళాను. అప్పుడే నాలో ఈ వింత అలజడి కలిగింది" అని కన్నీటితో పలికింది. తృణబిందు తన దివ్యదృష్టితో జరిగినదంతా తెలుసుకున్నాడు. వెంటనే తన కుమార్తెని ఆ మునీశ్వరుని దగ్గరకి తీసికెళ్ళి

"మునీంద్రా ఈమె నాకూతురు. సద్గుణ సంపన్నురాలు. తమరు ఈమెని భార్యగా స్వీకరించండి. మీ సేవలో ఈమె తన జీవితం ధన్యం చేసుకుంటుంది" అన్నాడు. అందుకాయన అంగీకరించాడు. ఆ కన్యని భార్యగా స్వీకరించాడు.

అప్పట్నుంచీ ఆ కన్య పులస్త్య మహర్షిని అన్ని విధాలాసేవిస్తూ ఆయన అనుగ్రహం సంపాదించింది. ఆమె సదాచార సంపత్తికి ఆయన ముగ్ధుడై, తనంతటి ప్రతిభాశాలి ఆమెకి కుమారుడిగా జన్మిస్తాడని ఆశీర్వదించాడు.

కొన్నాళ్ళకి ఆమెకి విశ్రావసుడు అనే కుమారుడు కలిగాడు. అతడు కూడా సదాచార సంపన్నుడై గొప్ప తాపసిగా పేరుపొందాడు. అతని పేరు ప్రఖ్యాతులు విన్న భారద్వాజమహాముని తన కుమార్తె అయిన దేవాంగనని అతడికిచ్చి వివాహం చేశాడు.

కొంతకాలానికి ఆ దంపతులకి సకల సద్గుణసంపన్నుడైన కుమారుడు కలిగాడు. ఆ బాలుని జాతకం ప్రకారం భవిష్యత్తులో అతడు ధనాద్యక్షుడై గొప్ప ప్రతిభా సంపన్నునిగా పేరుప్రఖ్యాతులు పొందగలడని తెలుసుకున్న విశ్రావసుడు పొంగిపోయి అతడికి వైశ్రవణుడు అని నామకరణం చేశాడు. అతడు పెరిగి పెద్దవాడై తండ్రి తాతల లాగే ధర్మపథంలో నడుస్తూ ఎన్నో వేల సంవత్సరములు నియమంగా తపస్సు చేశాడు.

కొన్నాళ్ళు కేవలం నీరు మాత్రమే ఆహారంగా, మరి కొన్నాళ్ళు ఆ నీళ్ళు కూడా తాగకుండా కేవలం గాలి మాత్రమే ఆహారంగా కఠోరమైన తపస్సు చేశాడు.

ఆ తర్వాత గాలి కూడా పీల్చకుండా కొన్ని వేల సంవత్సరాలు ఉగ్రమైన తపస్సు చేశాడు. అతడి తపస్సుకి మెచ్చి బ్రహ్మదేవుడు అతడి ముందు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమన్నాడు.

వైశ్రవణుడు కన్నులు తెరచి బ్రహ్మకి నమస్కరించి

"దేవా నేనీ తపస్సు కేవలం లోకకళ్యాణార్థం చేశాను. కనుక మీరు అనుగ్రహించి, నన్ను లోకపాలకునిగా చెయ్యండి" అన్నాడు. ఆ మాటలు విన్న బ్రహ్మసంతుష్టుడై తథాస్తు అన్నాడు. "కుమారా నీ వాంఛితం నెరవేరుతుంది. నేను నలుగురు లోకపాలకుల్ని నియమించాలని, సంకల్పించాను. ఇప్పటికి యమ, వరుణ, ఇంద్రులు ముగ్గుర్ని నియమించాను. వీరితో పాటు నువ్వూ నాలుగవ లోకపాలకుడిగా వుండు" అంటూ దివ్యమైన పుష్పక విమానాన్ని బహూకరించాడు.

వైశ్రవణుడు ఆనందంగా తండ్రి దగ్గరకి వెళ్ళి నమస్కరించి జరిగిన విషయం చెప్పాడు.

"తండ్రీ బ్రహ్మ నేను కోరిన వరాలు అనుగ్రహించాడు. కాని నేనెక్కడ వుండాలో చెప్పలేదు. కనుక ఆ విషయంలో మీసలహా నాకు కావాలి" అన్నాడు.

కుమారుని మాటలు విన్న విశ్రావసుడు పొంగిపోయి " నాయనా దక్షిణ సముద్రం మధ్యలో త్రికూటగిరి అనే పర్వతం వుంది. దాని శిఖరం మీద లంకానగరం అనే విశాలమైన నగరం వుంది. అది అచ్చంగా దేవేంద్రుని నగరమైన అమరావతిలా వుంటుంది.

పూర్వం విశ్వకర్మ దేవతలకోసం అమరావతి నిర్మించినట్లే, రాక్షసుల కోసం లంకానగరం నిర్మించాడు. నువ్విప్పుడు అక్కడికి వెళ్ళి, అక్కడ నీ నివాసం ఏర్పాటు చేసుకో. ఆ నగరం బంగారుగోడలతోటి, నాలుగువైపులా లోతైన కందకాలతోటీ, ఎన్నో రకాల యంత్రాలతోటీ, శస్త్రాలతోటీ చాలా పటిష్టంగా వుంది.

విష్ణుమూర్తికి భయపడి, రాక్షసులు ఆనగరం వదిలి పారిపోయారు. పాతాళలోకంలోకి వెళ్ళిపోయారు. ఇపుడాలంక శూన్యంగా వుంది. కనుక నువ్వక్కడికి వెళ్ళి సుఖంగా వుండు" అన్నాడు.

తండ్రి సలహా ప్రకారం వైశ్రవణుడు లంకకి వెళ్ళి అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. వైశ్రవణుడు లంకలో నివసించటం మొదలు పెట్టాక, వేల కొద్దీ రాక్షసులు నిర్భయంగా అక్కడకి వెళ్ళి అతడి పాలనలో సుఖంగా వుండసాగారు.

వైశ్రవణుడు సుభిక్షంగా రాజ్యపాలన చేస్తూ అప్పుడప్పుడు పుష్పక విమానంలో వెళ్ళి తల్లిదండ్రుల్ని చూసి వస్తూండేవాడు. అతడి అంతఃపురం నిత్యమూ అప్సరాంగనల నాట్యకేళీవిలాసాలతో చాలా సందడిగా వుండేది" అని అగస్త్యుడు చెప్తుంటే రాముడికి చాలా ఆశ్చర్యం కలిగింది.

"మునీశ్వరా లంకలో వైశ్రవుణుని కన్నా ముందు రాక్షసులు నివశించేవారని చెప్పారు కదా, మరి పులస్త్యమహర్షి వల్లనే రాక్షసవంశం పుట్టిందన్న మాట సత్యం కాదా? అసలు రావణాదుల కన్నా ముందు ఆలంకలో రాక్షసులెలా వచ్చారు? వారు కూడా బలవంతులేనా? అసలు వారికి విష్ణువుతో వైరం ఎలా వచ్చింది?" అని విస్మయంగా అడిగాడు. అప్పుడు అగస్త్యుడిలా జవాబు చెప్పాడు.

"రాఘవా సృష్టి మొదట్లో బ్రహ్మదేముడు సముద్రాన్ని సృష్టించి, అందులోని జలనిధుల్ని రక్షించటానికి జలజంతువుల్ని సృష్టించాడు. ఆ జలజంతువులు ఆకలి దప్పులతో అలమటించి పోతూ, సృష్టికర్త అయిన బ్రహ్మ దగ్గరకి వెళ్ళాయి. బ్రహ్మ వాటి మాటలేవీ వినిపించుకోకుండా అసలు వారెందుకు వచ్చారో

తెలుసుకోకుండా "పొండి వెళ్ళి సముద్ర జలాల్ని రక్షించండి" అన్నాడు. (ఇక్కడ జలజంతువులంటే మానవాకారాలని గుర్తించాలి)

కొంతమంది బ్రహ్మయందుండే భయభక్తుల వల్ల అలాగే అంటూ వెళ్ళి పోయారు. సముద్ర జలాల్ని రక్షిస్తామని చెప్పి వెళ్ళారు. కనుక వాళ్ళని రాక్షసులు అని పిల్చేవారు. మిగిలిన వారంతా యక్షణ చేస్తామని, వెనక్కి వెళ్ళకుండా వుండిపోయారు. కనక వాళ్ళు యక్షులయ్యారు. యక్షణ అంటే పూజ. మా ఆకలి దప్పులు తీర్చే వరకు మేము నిన్ను పూజిస్తామే తప్ప సముద్ర జలాలు రక్షించలేమని వారు తేల్చి చెప్పారు. వారు యక్షులయ్యారు.

అలా రాక్షసులైన వారిలో, హేతి, ప్రహేతి అనే ఇద్దరు సోదరులున్నారు. వారిద్దరూ రాక్షసులకి అధిపతులయ్యారు. వారిద్దరూ చాలా బలవంతులయ్యారు. వారే రాక్షసులందరికీ రక్షకులుగా లంకని పాలించసాగారు. వారిలో ప్రహేతి చాలా ధర్మాత్ముడు. రాజ్యం హేతికి వదిలేసి తన దారిన తాను తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు.

అప్పుడు హేతికి వివాహం చేసుకోవాలనే సంకల్పం కలిగింది. కాలుడి సోదరి అయిన "భయ" అనే ఆమెని వివాహం చేసుకున్నాడు.

ఆదంపతులకి విద్యుత్కేసుడు అనేకుమారుడు కలిగాడు. అతడికి సంధ్యకుమార్తె అయిన, సాలంకటతో వివాహం జరిగింది. కొంతకాలానికి సాలంకటకి గర్భం వచ్చింది. అప్పుడామె మందరాద్రికి వెళ్ళి అక్కడ ఒక శిశువుని కని, అక్కడే వదిలేసి భర్త దగ్గరకి వెళ్ళిపోయింది. ఆ భార్యాభర్తలు సుఖంగా భోగాలు అనుభవించసాగారు.

అక్కడ మందరాద్రి దగ్గర ఆబాలుడు గట్టిగా ఏడ్వసాగాడు. ఆకాశమార్గంలో సంచరిస్తున్న పార్వతీ పరమేశ్వరులు ఆ బాలుని ఏడుపు విన్నారు. అతడి మీద జాలిపడి, ఆపిల్లవానిని చేరదీసి వెంటనే నవయౌవన వంతుడిగా అయ్యేలా దీవించారు. నవయౌవనవంతుడై ఆ బాలుడికి ఒక అద్భుతమైన విమానాన్ని బహూకరించారు.

అంతేకాక, అప్పట్నించీ రాక్షసజాతిలో ఎవరు పుట్టినా, వారు పుట్టగానే నవయౌవన వంతులుగా అయ్యేటట్లు పార్వతీదేవి వారికి వరం ఇచ్చింది. దానికి సాయం రాక్షస స్త్రీలకి, గర్భధారణ జరిగిన కొద్ది క్షణాలలోనే వారికి ప్రసవం కలిగేలా కూడా వరం ఇచ్చింది. విద్యుత్కేసుని కుమారునికి సుకేశుడు అనే పేరు కూడా ఆవిడే పెట్టింది.

పార్వతీ పరమేశ్వరులిచ్చిన వర ప్రభావంతో సుకేశుడు చాలా గర్వపడ్డాడు. వారిచ్చిన విమానంతో స్వేచ్ఛగా విహరించసాగాడు. కొంతకాలానికి దేవవతి అనే గంధర్వ కన్యని వివాహం చేసుకున్నాడు.

కాలక్రమేణ వారికి మాల్యవంతుడు, సుమాలి, మాలి అనే ముగ్గురు కుమారులు కలిగారు. కాని వారు అంత్యంత భయంకరులుగా తయారయ్యారు. తమ తండ్రి తపోబలంతో ఐశ్వర్యవంతుడయ్యాడని తెలుసుకుని వారు ముగ్గురూ మేరు పర్వత ప్రాంతానికి వెళ్ళి ఘోరమైన తపస్సు ప్రారంభించారు. వారి తపోశక్తికి ముల్లోకాలూ గడగడలాడాయి.

అపుడు వారికి చతుర్ముఖ బ్రహ్మప్రత్యక్షమై, ఏదైనా వరం కోరుకోమన్నాడు.

వారు ముగ్గురూ ముక్తకంఠంతో తమకి ఎవరివల్లా అపజయం కలగకుండా, చిరంజీవులై, శత్రువులందర్నీ జయిస్తూ ప్రభావశాలురుగా, వర్ధిల్లేలా వరం అనుగ్రహించమని" ప్రార్థించారు.

బ్రహ్మ తథాస్తు అని దీవించాడు. అప్పట్నించీ వారు ముగ్గురూ అమిత బలవంతులై వరాలు పొందామన్న గర్వంతో, నిర్భయంగా ముల్లోకాలలోనూ భీభత్సాలు సృష్టిస్తూ వీర విహారం చెయ్యసాగారు. వారి ఆగడాలకి తట్టుకోలేక ముల్లోకాలలో నివసించే వారూ తమని ఎవరు రక్షిస్తారా అని వెతక సాగారు.

మాల్యవంతుడు, సుమాలి, మాలి ఒకసారి దేవశిల్పి అయిన విశ్వకర్మ దగ్గరకి వెళ్ళి, తమ కోసం పరమేశ్వరుని కైలాసంలాంటి నగరాన్ని సృష్టించి ఇవ్వమని కోరారు. అపుడు విశ్వకర్మ తాను నిర్మించిన లంకానగరాన్ని వారికి కానుకగా ఇచ్చాడు.

వెంటనే వారు వేలకొలది వున్న తమ పరివారంతో అక్కడ స్థిర నివాస మేర్పాటు చేసుకుని సుఖంగా వున్నారు. వారు క్రమంగా మాల్యవంతుడు సుందరి అనే గంధర్వ కన్యని, సుమాలికేతుమతినీ, మాలి వసుధ అనే గంధర్వ కన్యనీ వివాహం చేసుకున్నారు. ఆగంధర్వ కన్యలు ముగ్గురూ అక్కచెల్లెళ్ళే.

మాల్యవంతుడికి, వజ్రముష్టి, విరూపాక్షుడు, దుర్ముఖుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మత్తుడు, ఉన్మత్తుడూ అనే ఏడుగురు కుమారులుపుట్టారు. అనల అనే ఒక పుత్రిక కూడా పుట్టింది.

సుమాలికి ప్రహస్తుడు, అకంపనుడు, వికటుడు, కాలికా ముఖుడు, ధూమ్రాక్షుడు, దండుడు, మహాబలి, సుపార్శ్వుడు, సంహ్రాది, ప్రఘనుడు, భాసకర్ణుడు, అనే కుమారులు, రాకా, పుష్పోత్కట, కైకసి కుంభీనస, అనే కుమార్తెలు

పుట్టారు.

మాలికి, అనలుడు, అనిలుడు, హరుడు, సంపాతి, అనే నలుగురు కుమారులు కలిగారు. వారు నల్గురూ పరమధార్మికులు. విభీషణుని కొలువులో మంత్రులు నల్గురూ వారే.

ఆ సోదరులు ముగ్గురూ తమ బాహుబలంతో, ముల్లోకాల్ని పీడించసాగారు. యజ్ఞయాగాదులు ధ్వంసం చేస్తూ తాపసుల్ని నానా బాధలు పెట్టూ వారికి విఘాతాలు కల్గించసాగారు. అప్పుడు దేవతలు, ఋషులు అంతా వెళ్ళి పరమేశ్వరుని శరణన్నారు.

అప్పుడు పరమేశ్వరుడు, దేవగణాల్లారా నేను స్వయంగా ఆ సుకేసునికి రక్షణ కల్పించాను. కనక అతడి కుమారులైన ఈ ముగ్గుర్ని దండించే శక్తి నాకు లేదు. మీరంతా వెళ్ళి మహావిష్ణువుని శరణువేడండి. అతడొక్కడే మీ కష్టాలు తీర్చగల సమర్థుడు" అని చెప్పాడు.

వెంటనే వారంతా శంఖచక్ర గదాధారియైన శ్రీమన్నారాయణుడి దగ్గరకి వెళ్ళి తమ గోడు వెళ్ళబోసుకుని తమని కాపాడవలసిందిగా ప్రార్థించారు. శరణాగత వత్సలుడైన జనార్దనుడు, వారికభయమిచ్చి తను ఆ ముగ్గురు సోదరుల బారినించి వారిని రక్షిస్తానని వాగ్దానం చేశాడు.

ఈ సంగతంతా తన గూఢచారుల వలన మాల్యవంతుడు తెలుసుకున్నాడు. తమ్ముళ్ళనీ, మంత్రుల్ని సమావేశపరచి ఏం చేస్తే బాగుంటుందని సమాలోచనలు చేశాడు.

"మునుపు హిరణ్యకశిపుడు, నముచి, కాలనేమి, శంభు నిశంభులు, మొదలైన మహావీరులంతా విష్ణువు చేతిలోనే మరణించారు. ఇప్పుడు విష్ణుమూర్తి మనపై దండెత్తి వస్తే అతడితో యుద్ధం చెయ్యటం మన వల్లకాదు" అని మాల్యవంతుడు అన్నాడు.

ఆ మాటలువిన్న మాలి నవ్వి, "ప్రభూ మనం ముగ్గురు సోదరులం అజేయులుగా వరం పొందివున్నాము కదా. కనక మనం ఎవ్వరికీ భయపడే పనేలేదు. అదీగాక మనం ఇప్పటి దాకా విష్ణువు జోలికి వెళ్ళలేదు. కనక అతడికి మనపై ద్వేషం కలిగే అవకాశమే లేదు. ఇప్పుడు మనం ఇంద్రుని మీదికి దండెత్తి వెళ్దాం" అని అన్నాడు. సుమాలిదాన్ని బలపరిచాడు.

వెంటనే వారు బలోన్మత్తులు, ధృడకాయులు అయినా రాక్షస సేనలతో ఇంద్రలోకంపైకి దండెత్తి వెళ్ళారు. ఆ సంగతి తెలిసిన విష్ణుమూర్తి శంఖచక్ర

గదాధనుర్ఖడ్గములు ధరించి, దేవతలకి ముందు నిలబడి వారితో యుద్ధానికి బయల్దేరాడు.

రాక్షస వీరులంతా దేవసైన్యాన్ని చుట్టుముట్టారు. కాని మహావిష్ణువు ధాటికి ఆగలేక వారంతా చెల్లాచెదురై పోయారు. చావగా మిలిగిన వాళ్ళు లంకలోకి పారిపోయారు. ఆ పరిస్థితి చూసి, సుమాలి విష్ణువుతో తలబడ్డాడు. వారిద్దరి మధ్యా భీకరమైన పోరు జరిగింది. విష్ణుమూర్తి తన చక్రాయుధంతో ఆ సుమాలి తల నరికిపారేశాడు. అప్పుడు మాల్యవంతుడు విష్ణుమూర్తి మీదికి తలబడ్డాడు. కానీ మహాపరాక్రమశాలియైన విష్ణుమూర్తి ముందు నిలబడలేకపోయాడు. క్షణం ఆలస్యం చెయ్యకుండా మిగిలిన రాక్షసులతో లంకలోకి పారిపోయాడు. ఆ తర్వాత చాలాసార్లు విష్ణువు మీదికి యుద్ధానికి వెళ్ళాడు.

దండెత్తిన ప్రతీసారీ ముఖ్యులైన రాక్షసవీరులు చనిపోవటం, మిగిలిన రాక్షసులంతా ప్రాణభయంతో లంకలోకి పారిపోవటం జరిగింది. ఇంక విష్ణువుని జయించటం అసాధ్యం అని మాల్యవంతుడికి తెలిసిపోయింది. చేసేదిలేక సమస్త రాక్షసపరివారంతో పాతాళలోకానికి పారిపోయాడు. రామభద్రా నువ్వు పులస్త్య వంశపు రాక్షస వీరుల్నెందర్నో సంహరించావు కదా. ప్రాచీనకాలం నాటి ఈ రాక్షసులు అంతకన్నా వెయ్యి రెట్లు బలవంతులు. దేవద్రోహులైన ఆ రాక్షసుల్ని సంహరించటానికి మహావిష్ణువు కన్నా సమర్థులు లేరు.

శంఖ, చక్ర, గదా, ఖడ్గ ధారియైన ఆ శ్రీమన్నారాయణుడివి నువ్వే. అవినాశి అయిన నువ్వు రాక్షస సంహారం కోసమే ఈ భూమి మీద అవతరించావు. రాఘవా పూర్వకాలం నాటి రాక్షసుల గురించి వివరంగా చెప్పాను. ఇప్పుడు రావణాసురుడు, వాడి వంశ ప్రవృత్తి గురించి వివరంగా చెప్తాను.

పాతాళలోకంలోకి పారిపోయిన మాలి, మాల్యవంతుడు, వారి పరివారం చాలా సంవత్సరాలు అలాగే పాతాళలోకంలో వుండిపోయారు. కొంతకాలం గడిచిపోయాక వారికింక దేవతలు తమ గురించి మర్చిపోయారన్న నమ్మకం కలిగింది.

ఈలోపల లంకా పట్టణం శూన్యంగా వుండటం వల్ల విశ్రావసుని కుమారుడైన వైశ్రవణుడు బ్రహ్మవల్ల లోకపాలకుని స్థానం సంపాదించి ఆలంకలో నివాసం ఏర్పరచుకున్నాడు. కాల క్రమంలో అతడు కుబేరుడిగా ప్రసిద్ధుడయ్యాడు. అక్కడతడలా సుఖంగా రాజ్యపాలన చేసుకుంటుండగా ఇక్కడ పాతాళలోకంలో వున్న మాల్యవంతుడు విష్ణువు తమపైకిరాడన్న నమ్మకం కలిగాక, యౌవనవంతురాలైన

తన కుమార్తె కైకసితో కలిసి భూలోకంలోకి వచ్చి, స్వేచ్ఛగా విహరించసాగాడు. కైకసి చాలా అందమైనది.

ఒక రోజు తండ్రి కూతురు భూలోకంలో విహరిస్తుండగా వారికి విమానంలో వెళ్తున్న కుబేరుడు కనిపించాడు. అతడ్ని చూశాక మాల్యవంతుడికి తమ రాక్షస జాతినెలాగైనా ఉద్ధరించాలనే తలపు కలిగింది. అప్పుడు ఒక ఆలోచన స్ఫురించింది. వెంటనే అందాల రాశి అయిన తన కుమార్తె వంక చూసి "అమ్మా నువ్వు యౌవన వంతురాలయ్యావు. కనక అన్ని విధాలా యోగ్యుడైన పులస్త్య నందనుడైన విశ్రావసువనే మహర్షిని భర్తగా పొంది సేవించు. ఆయన వల్ల నీకు ఈ కుబేరుడంతటి కుమారుడు పుడతాడు. ఈ కుబేరుని వైభవం, తేజస్సు చూశావు కదా. నీలాంటి సద్గుణ సంపన్నురాలికి ఆ విశ్రావసువే తగిన భర్త అన్నాడు.

తండ్రి మాటల్ని గౌరవించి కైకసి విశ్రవుని ఆశ్రమం చేరింది. ఒక మూల నిలబడి ఆ మహాముని వంక తదేక ధ్యానంతో చూడసాగింది. ఆ సమయంలో ఆ మహాత్ముడు సాయం సమయ అగ్నిహోత్ర కార్యక్రమంలో వున్నాడు.

తండ్రి కోరిక తొందరగా తీర్చాలనే ఆరాటంలో ఆమె సమయాసమయ విచక్షణ లేకుండా, తిన్నగా ఆ మునీంద్రుని దగ్గరకి వెళ్ళి ఆయన పాదాల వంక చూస్తూ, తన కాలిబొటున వ్రేలితో నేల మీద వలయాలు గీస్తూ నిలబడింది. విశ్రవసుడు కన్నులు తెరచి ఆమెని చూశాడు. ఆమె వంక ఔదార్యంగా చూస్తూ

"అమ్మా నువ్వెవరు? ఎందుకు వచ్చావని"అడిగాడు.

వెంటనే అమె చేతులు జోడించి "ఆర్యా తమరు మీతపోశక్తితో నేనెవర్నో తెలుసుకోలేరా? అయినా అడిగారు. కనుక చెప్తున్నాను. నేను నా తండ్రి ఆజ్ఞమీద మిమ్మల్ని సేవించటానికి వచ్చాను. నా పేరు కైకసి, మిగిలిన విషయాలు మీ తపశ్శక్తితో తెల్సుకోండి" అంది.

ఆమునీంద్రుడు కొంతసేపు కన్నులు మూసుకుని, తన దివ్యదృష్టితో సంగతంతా గ్రహించాడు.

"సౌభాగ్యవతి, నీ మనోగతం తెలిసింది. నీకు నా వల్ల కుమారులు కావాలి. కాని, కుమారీ అతిదారుణమైన సంధ్యాకాలంలో నా దగ్గరకి వచ్చావు. కనుక నీకు భయంకరమైన ఆకారం కలవారు, క్రూరస్వభావులు, రాక్షసవంశం మీద మాత్రమే అభిమానం గలవారు, అయిన రాక్షసులు నీకు కుమారులుగా పుట్టారు" అన్నాడు.

ఆ మాటలు విన్న కైకసి దుఃఖంతో ఆయన పాదాల మీద వాలిపోయింది.

"అయ్యా మీరు బ్రాహ్మణోత్తములు. మీ నుండి అటువంటి పిల్లల్ని పొందటం నాకిష్టం లేదు. నన్ను కనికరించండి" అని ప్రాధేయపడింది.

అపుడాయన మళ్ళీ ఆలోచించాడు.

ఆలోచించి ఇలా అన్నాడు. "కళ్యాణీ, నీకు కలిగే ఆఖరి కుమారుడు నా వంశానికి తగ్గట్టు పరమధార్మికుడు, ఉత్తముడు అయిన కుమారుడు పుట్టాడు" అని ఆమెనోదార్చాడు.

కొంతకాలానికి ఆమెకి అతి భయంకరమైన ఆకారం కల్గిన పుత్రుడు జన్మించాడు. విశ్రవనుడు ఆ బాలునికి దశగ్రీవుడని నామకరణం చేశాడు. ఆ పిల్లవానికి పదితలలు, ఇరవై చేతులు వున్నాయి. అందుకే ఆ పేరు పెట్టాడు.

రెండోసారి కైకసికి కుంభకర్ణుడు పుట్టాడు. ఆ పిల్లవాడు చాలా పెద్ద శరీరంతో అతికాయుడిగా పుట్టాడు. ఆ తర్వాత వికృతాకారం కల్గిన శూర్పణఖ పుట్టింది. ఆఖరి సారి సుందరాకారం కల్గిన విభీషణుడు పుట్టాడు. ఆ బాలుడు పుట్టగానే ఆకాశంలోంచి పూలవాన కురిసింది. దేవదుంధుబులు మ్రోగాయి. దశ గ్రీవుడు, కుంభకర్ణుడు అడవుల్లో తిరుగుతూ పెరిగి లోకకంటకులుగా తయారయ్యారు. కుంభకర్ణుడు తిండిపోతుగా మారి అడవుల్లో తపస్సు చేసుకుంటున్న మునులందర్నీ చంపి తినసాగాడు.

కాని విభీషణుడు మాత్రం, ధర్మనిరతిగలవాడై, నియమితమైన ఆహారం తింటూ, నిష్టాగరిష్టుడై పెరగసాగాడు. ఇదిలా వుండగా

ఒకనాడు కుబేరుడు పుష్పకవిమానంలో తండ్రిని చూడటానికి వచ్చాడు. కైకసి బ్రహ్మతేజో విరాజితుడైన కుబేరుణ్ణి తన కుమారుడైన దశగ్రీవుడికి చూపించి "నాయనా నీ అన్నగారైన కుబేరుణ్ణి చూశావా, ఎంత తేజస్సుతో వెలిగిపోతున్నాడో. అతడి తమ్ముడివైన నువ్వు కూడా అలాగే వుండవలసింది. కాని నీ అవస్థ చూసుకో. అర్థం చేసుకో. నువ్వు కూడా నీ అన్నగారంతటి ప్రతిభాశాలివీ, పరాక్రమవంతుడివి అవ్వాలి. అందుకు ప్రయత్నం చెయ్యి" అంటూ అనేక విధాల ప్రభోదించింది.

తల్లి మాటలు విన్న దశగ్రీవునికి పౌరుషం వచ్చింది. ఇలా ప్రతిజ్ఞ చేశాడు.

"అమ్మా దిగులు పడకు. నీకు నేను మాట ఇస్తున్నాను. నా పరాక్రమంతో కుబేరుని కన్నా ఎక్కువ ప్రతిభావంతుణ్ణి అవుతాను" అని అంటూనే అడవులకి తపస్సు చేసుకుందుకు బయల్దేరాడు. తన తమ్ములతో కలిసి, గోకర్ణ క్షేత్రానికి

వెళ్ళాడు.

ఆ అన్నదమ్ములు ముగ్గురూ ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మని మెప్పించారు. బ్రహ్మసంతుష్టుడై వారి ముగ్గురికీ వారు కోరిన వరాలిచ్చాడు" అని అగస్త్యుడు చెప్తుంటే రాముడు కుతూహలంగా వింటూ, "బ్రహ్మర్షీ వారు చేసిన తపస్సు గురించి వివరంగా చెప్పండి" అని అడిగాడు.

అగస్త్యుడు చిరునవ్వుతో

"చిరంజీవి, వారు ముగ్గురు వేరు వేరు పద్ధతుల్లో తపస్సు చేశారు. కుంభకర్ణుడు గ్రీష్మ ఋతువులో పంచాగ్నుల మధ్యలో నిలబడి తపస్సు చేశాడు. వర్షాకాలంలో వానలో తడుస్తూ తపస్సు చేశాడు. చలికాలంలో చల్లని నీటి మడుగులో నిలబడి తపస్సు చేశాడు. ఈ విధంగా అతడు పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు.

విభీషణుడు పుట్టుకతోనే ధర్మ నిరతి గలవాడు కనక ఐదువేల సంవత్సరాలు ఒంటికాలిపై నిలబడి తపస్సు చేశాడు. ఇంకో ఐదేళ్ళు రెండు చేతులు, తలపైకెత్తి సూర్యదేవునారాధిస్తూ తపస్సు చేశాడు. ఇలా అతడూ పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు.

దశకంఠుడు పదివేల సంవత్సరాలు నిరవధిక ఉపవాసదీక్షతో, తపస్సు చేసి ఆ తర్వాత ప్రతి ఐదువేల సంవత్సరాలకీ తన తలలో ఒకదాన్ని నరికి ఆహుతి చేస్తు తొమ్మిదితలలు నరికి ఆహుతి చేసి పదవతలకుడా ఆహుతి ఇవ్వబోతుండగా బ్రహ్మదేముడు ప్రత్యక్షమై అతణ్ణి వారించాడు.

"నాయనా దశగ్రీవా నీతపస్సుకి మెచ్చాను. నువ్వేం వరం కోరినా ఇస్తాను. అడుగు" అన్నాడు.

అ మాటలు విన్న దశగ్రీవుడు ఆనందంతో పులకరించి పోతూ "పితామహా నీ సృష్టిలో ప్రతిప్రాణికీ మృత్యువు కన్నా భయంకరమైనది మరొకటి లేదు. కనుక నాకు మరణం లేకుండా వరంఇవ్వండి" అన్నాడు. కాని బ్రహ్మ అది అసాధ్యమైనదనీ, వేరే ఏదైనా వరం కోరుకోమని" అన్నాడు.

దశగ్రీవుడు మళ్ళీ చేతులు జోడించి "దేవా గరుడ, నాగ, యక్ష, దైత్య, దానవ, రాక్షస దేవగణాలెవ్వరి వల్లా నాకు చావులేకుండా వరం ఇవ్వండి. చాలు. మానవులు మొదలైన అల్పప్రాణుల వల్ల నాకెప్పుడూ భయంలేదు. నరులు, వానరులు, నాకు గడ్డిపరకలతో సమానం" అన్నాడు. అప్పుడు బ్రహ్మ రావణుని

కోరిక సమ్మతించి,

"రాక్షసవీరా, నీ అభీష్టం నెరవేరుతుంది. అంతేకాదు. నువ్వు ఆహుతి చేసి నీ తొమ్మిది తలలు మళ్ళీ యథాప్రకారం మొలుస్తాయి. నీకింకో అద్భుతమైన వరం కూడా ఇస్తున్నాను. నువ్వెప్పుడు ఎలాంటి రూపం కావాలని కోరుకుంటావో, అపుడు అలాంటి రూపం పొందవచ్చు" అని బ్రహ్మ అతడికి వరం అనుగ్రహించి, తర్వాత విభీషణునికి, కుంభకర్ణుడికి కూడా వరాలిచ్చాడు.

విభీషణుడు తనకి ఎంతటి కష్టకాలంలో కూడా ధర్మాన్ని అతిక్రమించకుండా వుండే బుద్ధి ప్రసాదించమనీ, బ్రహ్మాస్త్రజ్ఞానాన్ని ఇవ్వమనీ ప్రార్థించాడు. అల్పబుద్ధి అయిన కుంభకర్ణుడు, నిర్దయ కలిగివుండేలా వరం కోరుకోవాలనుకున్నాడు. కాని దేవతల కోరికపై సరస్వతి అతడి నాలుకపై వుండి, అనేక వేల సంవత్సరాలు నిద్రపోయే వరం ప్రసాదించమని అడిగేలా చేసింది.

బ్రహ్మ తథాస్తు అని వారిద్దరికీ ఆ వరాలు అనుగ్రహించి, అంతర్ధానమయ్యాడు. కుంభకర్ణుడు తిండిపోతు కనుక ఏ వర ప్రభావం లేకుండానే మునుల్ని చంపుకుతింటున్నాడు. నిర్దయ కనుక వరంగా పొందాడంటే మానవుల్నే గాక దేవతల్ని కూడా సమూలంగా బక్షిస్తాడనే భయంతో దేవతలంతా సరస్వతిని ప్రార్థించి, వారు నిద్రవరంగా కోరుకునేలా చేశారు.

తమ తమ తపస్సుకి తగిన వరాలు సంపాదించాక, ఆ సోదరులు ముగ్గురూ తమ తమ నివాసానికి వెళ్ళి పోయారు. సుఖంగా వున్నారు.

కైకసి తండ్రియైన మాల్యవంతుడు తన మనుమలు అమోఘమైన వరాలు సంపాదించారని తెలిసి చాలా సంతోషించాడు. తనకింక పాతాళలోకంలో వుండే అవసరం లేదనుకున్నాడు. వెంటనే తన మంత్రులతో కలసి మర్త్యలోకంలోకి వచ్చేసి మనుమల దగ్గర కెళ్ళాడు. దశగ్రీవుణ్ణి కౌగలించుకుని,

"నాయనా, నువ్వు బ్రహ్మవల్ల ఉత్తమమైన వరాలు పొందావని తెలిసి చాలా సంతోషించాను. ఇంక మనరాక్షస జాతికి, ఆ మహావిష్ణువు వల్ల భయం లేదు. ఇప్పుడు కుబేరుడు నివశిస్తున్న లంకానగరం మనదే. నువ్వెలాగైనా ప్రయత్నించి, సామ, దాన, భేధ, దండోపాయాలతో మళ్ళీ ఆ లంకని స్వాధీనం చేసుకుంటే మనమందరం నిర్భయంగా అక్కడ వుండవచ్చు" అని మనుమడితో మంతనాలు జరపబోతూ వుండగా, దశగ్రీవుడు,

"మాతామహా, కుబేరుడు, సాక్షాత్తు నాకు అన్నగారు కదా. అతడి విషయంలో మీరిలా చెప్పటం సబబు కాదు" అని తాతగార్ని వారించాడు.

చేసేది లేక వారు వెనక్కి వెళ్ళిపోయారు. మరి కొంతకాలం గడిచాక ప్రహస్తుడు అనే మంత్రి దశగ్రీవుడి దగ్గరకి వెళ్ళి,

"నాయనా దశగ్రీవా నువ్వు నీతాతగార్ని తిరస్కరిస్తూ అన్నమాటలకి ఆయన చాలా బాధపడుతున్నారు. పెద్ద వారినలా కించపరచటం భావ్యం కాదు. అసలు వీరులైనవారికి అన్న, తమ్ముడు అనే ఆలోచనే రాకూడదు. అసలు దేవతలు, దానవులు కశ్యప ప్రజాపతి కుమారులే అయినా విష్ణుయుద్ధంలో దానవులందర్నీ వధించి త్రిలోకాధిపత్యాన్ని దేవతలకిచ్చాడు. అంటే ఆనాడే సోదరుల మధ్య బేధాభిప్రాయాలు మొదలయ్యాయి. అంటూ మొదలెట్టి బాగా ద్వేషం నూరిపోసి రావణుడి మనస్సుని కళంకం చేసి పడేశాడు.

దశగ్రీవుడు వెంటనే లంకమీదికి యుద్ధానికి వెళ్ళాడు. ముందుగా ప్రహస్తుణ్ణి, కుబేరుడి వద్దకి శాంతిదూతగా పంపాడు.

కుబేరుడు లంకా రాజ్యాన్ని, ఐశ్వర్యాన్ని అంతా సంతోషంగా తమ్ముడైన దశగ్రీవునికిచ్చేసి వెళ్ళిపోయాడు. తిన్నగా తండ్రి దగ్గరకి వెళ్ళి జరిగిన సంగతంతా చెప్పి తాను ఎక్కడుండాలో చెప్పమని అడిగాడు.

విశ్రావసుడు అంతా విని చాలా బాధపడ్డాడు. వాడి ఆ ప్రవర్తనకి కారణం వాడి పుట్టుక వల్ల వచ్చిన దోషమే అనీ, వాడి పతనానికి అది నాంది అనీ చెప్పాడు. కుబేరుణ్ణి కైలాసానికి వెళ్ళి అక్కడే ఇంకో నగరం నిర్మించుకోమని చెప్పాడు. కుబేరుడు తన భార్యా పిల్లలతో కైలాసానికి వెళ్ళి, అలకాపురి అనే నగరం నిర్మించుకుని సుఖంగా వున్నాడు. రావణుడు కూడా తన పరివారంతో లంకలో స్థిరమైన నివాసం ఏర్పాటు చేసుకుని లంకకి రాజయ్యాడు.

లంకలో స్థిరపడ్డాక రావణుడు విద్యుద్జిహ్వుడు అనే వానికి తన చెల్లెలైన శూర్పణఖనిచ్చి వివాహం చేశాడు. చెల్లెలి పెళ్ళి బాధ్యత తీరాక కొంతకాలం నిశ్చింతగా వున్నాడు.

ఒకనాడు వేటకని అడవులకెళ్ళాడు. అక్కడ దితికుమారుడైన మయుడు తన కుమార్తెతో కలసి అడవిలో తిరుగుతుండటం చూశాడు.

ఆ అమ్మాయి పేరు మండోదరి అనీ ఆమెకి తగిన వరుణ్ణి వెతికి వివాహం చెయ్యాలనే సంకల్పంతో మయుడు వున్నాడనీ తెల్సుకున్నాడు.

తాను పులస్త్యబ్రహ్మ మనుమడననీ, తన పేరు దశగ్రీవుడనీ, లంకకి రాజుననీ వారికి చెప్పాడు. అతడు విశ్రవుని కుమారుడనీ, సాక్షాత్తు కుబేరుడి తమ్ముడనీ

తెలిసి మయుడు చాలా సంతోషించాడు. అక్కడే అడవిలోనే అగ్నిసాక్షిగా తన కుమార్తె అయిన మండోదర్ని దశగ్రీవునికిచ్చి వివాహం చేశాడు. ఆమెతో పాటు ఒక అద్భుతమైన శక్తిని దశగ్రీవునికిచ్చాడు.

రామచంద్రా ఆశక్తి తోటే రావణుడు నీ తమ్ముడైన లక్ష్మణుని పడగొట్టాడు. కాలక్రమంలో రావణుడు తన తమ్ముడైన కుంభకర్ణుడికి వజ్రజ్వాల అనే కన్యనీ, విభీషణునికి సరమా అనే కన్యనీ ఇచ్చి పెళ్ళి చేశాడు. ఆ అన్నదమ్ములు ముగ్గురు తమ తమ భార్యలతో సుఖంగా వున్నారు.

కొంతకాలానికి మండోదరికి మేఘనాధుడనే కుమారుడు పుట్టాడు. వాడు పుట్టగానే మేఘాలు గర్జించినట్లు ఏడవటం వల్ల అతడికి ఆ పేరు పెట్టారు. బ్రహ్మ వరప్రభావం వల్ల కుంభకర్ణుడు చాలాసమయం నిద్రలో వుండేవాడు.

కాని దశగ్రీవుడు మాత్రం ఉన్మత్తుడిలా తన బలమదంతో దేవతల్ని, ఋషుల్ని హింసిస్తూవుండేవాడు. దేవతల మీది కక్షతో నందనవనం మొదలైన వాటిని నాశనం చెయ్యసాగాడు. ఆ సంగతి కుబేరుడికి తెలిసింది. తన కుల ఔచిత్యం తెలిపి తమ్ముణ్ణి మందలించాలని, అతడి దగ్గరకి ఒక దూతని పంపాడు. దూత చెప్పిన మాటలు విన్న దశగ్రీవుడు మండిపడ్డాడు. ఆ దూతని తన కత్తితో రెండు ముక్కలుగా నరికి చంపేశాడు. ఆ శవాన్ని తనివి తీరా తినమని తన అనుచరులకిచ్చేసి, వెంటనే ముల్లోకాల్ని జయించటానికి జైత్రయాత్రకి బయల్దేరాడు.

ముందుగా కుబేరుని మీదికి వెళ్ళి అలకాపురిని చుట్టుముట్టాడు. రాక్షసులకి, యక్షులకి మధ్య తీవ్రమైన పోరు జరిగింది. రావణుని చేతిలో యక్షులు చిత్తు, చిత్తుగా ఓడిపోయారు.

కుబేరుడు కోపంతో, రావణుని మందలిస్తూ "పాపీ తమ్ముడివనే అభిమానంతో నీకు మేలుచెయ్యాలని దూతద్వారా హితవుబోధిస్తే అతడ్ని చంపేశావు. పైగా నా మీదికే యుద్ధానికి వచ్చావు. ఈ పాపానికి తగిన ఫలం తొందరలోనే అనుభవిస్తావు. ఇప్పటికైనా చేసిన తప్పు తెలుసుకో" అని హితబోధ చెయ్యబోయాడు. అయినా దశకంఠుడెంత మాత్రం లక్ష్యపెట్టలేదు. వారిద్దరి మధ్యా అనన్య సామాన్యమైన యుద్ధం జరిగింది. దశకంఠుడు మాయాయుద్ధంలో కుబేరుణ్ణి ఓడించాడు. రావణుడు అహంకారంతో హుంకరిస్తూ కుబేరుని పుష్పకవిమానం తీసుకుని లంకకెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పుష్పక విమానంలో హాయిగా విహరిస్తూ ఒకనాడు కైలాస పర్వతంపై దిగాడు. కార్తికేయుడు జన్మించిన పర్వతంపై దిగి, పుష్పక విమానాన్ని

వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు. కాని అదికదల్లేదు. దశకంఠుడు ఆశ్చర్యపోయాడు. ఆ పర్వతంపై ఏదో శక్తి దాన్ని అడ్డగిస్తోందని గ్రహించాడు. అంతలో ఈశ్వరుని వాహనమైన నందీశ్వరుడు కనిపించాడు.

దశగ్రీవుణ్ణి చూసి అతడు "ఆర్యా మీరెవరో కాని తక్షణం వెనక్కి వెళ్ళిపోండి. ఈ పర్వతం మీద పార్వతీపరమేశ్వరులు విహరిస్తారు. ఇది వారి క్రీడా పర్వతం. ఇక్కడికి దేవదానవ గంధర్వయక్ష కిన్నెర కింపురుషులు కూడా రాకుండా నిషేధించటమైంది" అని చెప్పాడు.

ఆ మాటలు విన్న దశకంఠుడికి రోషం వచ్చింది. "ఎవరా శంకరుడు? అని హుంకరించిస్తూ ఆ పర్వత మూలభాగంలో చొరబడ్డాడు. అక్కడ శంకరుడు, అతడికి కాస్త దూరంలో తళతళా మెరుస్తున్న శూలం ధరించిన నందీశ్వరుని ముఖం అతడికి వానరునిలా అనింది. దశగ్రీవుని నవ్వొచ్చి అతడ్ని చూసి ఎగతాళిగా నవ్వాడు.

ఆ నవ్వు విన్న నందీశ్వరుడు ఆగ్రహంతో "దశగ్రీవా వానర ముఖంతో వున్నానమకుని అహంకారంతో నన్నెగతాళి చేస్తూ నవ్వావు కనుక అమిత బలసంపన్నులైన వానరుల వెల్లనే నీకు వినాశం సంభవిస్తుందని" శపించాడు.

కాని దశగ్రీవుడు నిర్లక్ష్యంగా ఆ పర్వతం మూల భాగంలోన్నినిలబడి "పశుపతీ నీ క్రీడాస్థలమైన పర్వతం కారణంగా నాపుష్పక విమానం ఆగిపోయింది. కనుక ఇపుడీ పర్వతాన్ని సమూలంగా పీకి పడేస్తాను. ఏం చేస్తావో చేసుకో"అంటూ ఆ పర్వతంకింద తన భుజాలు ఉంచి, దాన్ని కదపటానికి ప్రయత్నించాడు. ఒక్కసారిగా ఆ పర్వతం కదిలింది. శివుడు, ప్రమధగణాలు కదిలిపోయి ఊగసాగారు. పార్వతిని నిలువునా వణికిపోతూ పరమేశ్వరుణ్ణి కౌగలించుకుంది. పరిస్థితి గ్రహించి, పరమేశ్వరుడు ఆ పర్వతాన్ని తన కాలిబోటన వ్రేలితో అదిమిపట్టాడు. దశగ్రీవుని బుజాలు ఆ పర్వతం కిందపడి నలిగిపోయాయి. దశకంఠుడు ఆ బాధకి ఓర్వలేక గట్టిగా ఆర్తనాదాలు చెయ్యసాగాడు. ఆ ఆర్తనాదాలు విన్న ముల్లోకాలూ భయంతో కంపించిపోయాయి.

ఇదంతా చూస్తున్న అతడి మంత్రులు, దశగ్రీవునికి పరమేశ్వరుణ్ణి స్తోత్రం చేసి తాను ఆయనపట్ల చేసిన తిరస్కారాన్ని మన్నించమని వేడుకోమన్నారు.

దశగ్రీవుడు కూడా తన తప్పు తెలుసుకుని, శివుణ్ణి స్తుతిస్తూ ఎన్నో స్తోత్రాలు చదివి, సామవేదం పఠించి, శివుణ్ణి ఆరాధించాడు. ఈ విధంగా వెయ్యి సంవత్సరాలు శివుణ్ణి స్తుతిస్తూ దీనంగా ఏడుస్తూ పడివున్నావు.

అపుడు శివుడు దశగ్రీవుడికి ప్రత్యక్షమయ్యాడు. ఆ పర్వతం కిందినించి అతణ్ణి బయటపడేలా చేసి,

"దశగ్రీవా నువ్వు మహావీరుడివి. నీ స్తోత్రాలు విని నేను సంతృప్తి చెందాను. ఈ వెయ్యి సంవత్సరాలూ ఈ పర్వతం కింద చిక్కుకుని దీనారావాలు చేశావు కనుక ఇప్పట్నించీ నీ పేరు రావణుడుగా ప్రసిద్ధమవుతుంది. ఇపుడింక నీ ఇష్టమొచ్చినచోటుకి వెళ్ళి. నీ పుష్పక విమానం ఎక్కడా ఆగదు" అంటూ అతడు వెళ్ళటానికి అనుమతించాడు. కాని రావణుడక్కడే నిలబడి,

"దేవా మీకు నిజంగా నా మీద అనుగ్రహం కలిగితే ఇక్కడ వ్యర్థమైన వెయ్యి సంవత్సరాలు వ్యర్థంగా గడిచిపోయాయి. కనుక ఆ వెయ్యి సంవత్సరాలూ మళ్ళీ నా ఆయుర్దాయంలో కలిసేలా వరం ఇవ్వండి. అంతేకాదు. మీనుంచి వాకొక దివ్యమైన అస్త్రాన్ని ప్రసాదించండి" అని ప్రార్థించాడు.

అపుడు శివుడు రావణునికి అత్యంతశక్తివంతమైన చంద్రహాసమనే ఖడ్గాన్నిచ్చి, అతడు కోరినట్లు గడచిపోయిన వెయ్యిసంవత్సరాల ఆయుర్దాయాన్ని మళ్ళీ ప్రసాదించాడు.

"రావణా నువ్వు ఈ ఖడ్గాన్ని ఎపుడూ తిరస్కారభావంతో చూడకూడదు. పొరపాటున అలా చూడటం జరిగితే, ఇది మళ్ళీ నా దగ్గరకి వచ్చేస్తుంది" అని హెచ్చరించి ఆశీర్వదించాడు.

శంకరుడు తనకి కొత్తపేరు పెట్టినందుకు, దశగ్రీవుడు చాలా ఆనందించాడు. పుష్పకవిమానం ఎక్కి మళ్ళీ దిగ్విజయ యాత్రకి బయల్దేరాడు. ఎంతమందినో క్షత్రియుల్ని ఓడించాడు. అలా అలా ఎన్నెన్నో రాజ్యాలు గెల్చుకుంటూ, హిమాలయ ప్రాంతంలో వుండే అటవీప్రాంతంలో ప్రవేశించాడు.

అక్కడ తాపసీ వేషంలో వున్న ఒక మునికన్య కనిపించింది. ఆమె అసమాన సౌందర్యవతి. ఆమెని చూడగానే రావణుడు మోహపరవశుడయ్యాడు. ఆమె దగ్గరకి వెళ్ళి "నిర్జనారణ్యంలో ఇలా తపస్సు చేస్తున్న కారణమేమిటి, నీలాంటి సుందరికి ఇది తగునా" అని అడిగాడు.

ఆ అమాయకురాలు రావణుని అతిథిగా భావించి అతిథి సత్కారాలు చేసి తన వృత్తాంతం చెప్పింది.

"అయ్యా! బృహస్పతి కుమారుడైన కుశధ్వజ మహాముని నాతండ్రి. నా తండ్రి నిరంతర వేదాధ్యయన పండితుడు. కనుక నా పేరు వేదవతి అని పెట్టాడు.

నేను యౌవనవతినైన దగ్గర్నించీ ఎందరో దేవ, గంధర్వ, యక్షులు నన్ను వివాహమాడాలని వచ్చి నా తండ్రిని అడిగారు. కాని ముల్లోకాలకు స్వామి అయిన విష్ణుమూర్తికిచ్చి కళ్యాణం చెయ్యాలని నా తండ్రి సంకల్పం. అందువల్ల వారినందర్నీ తిరస్కరించి పంపేశాడాయన.

ఆ పగ మనసులో వుంచుకుని దానవరాజైన శంభు అనే వీరుడు నా తండ్రి నిద్రించి వుండగా వచ్చి ఆయన్ని హతమార్చాడు. చనిపోయిన నా తండ్రితో పాటు నా తల్లి కూడా సహగమనం చేసింది.

అప్పట్నించీ నేను నా తండ్రి సంకల్పం నెరవేర్చాలనే ఆశయంతో ఆ శ్రీమన్నారాయణుడి గురించి తపస్సు చేస్తూ ఇలా ఒంటరి జీవితం గడుపుతున్నాను" అని తన గురించి వివరంగా చెప్పింది.

అంతేగాక, పౌలస్త్యనందనా నా తపోబలంతో నీ గురించి నేనంతా గ్రహించాను. నేను విష్ణుమూర్తిని తప్ప మరెవరినీ భర్తగా పొందలేను. కనక నువ్వు తక్షణం ఇక్కడ్నించి వెళ్ళిపో" అని హెచ్చరించింది.

కాని, కామపీడితుడైన ఆ దుష్టుడు మదాంధుడై ఆమెని చెరబట్టాలని ప్రయత్నించాడు. వేదవతి ఆ నీచుడికి దొరకకుండా తప్పించుకుని అగ్నిలో దూకి ఆత్మాహుతి చేసుకుంది.

చనిపోయే ముందు "నీచ రాక్షసుడా, నువ్వు నా పట్ల అమార్యదగా ప్రవర్తించటమే గాక, ముల్లోకాధిపతియైన ఆ మహావిష్ణువుని అవహేళన చేశాడు. నేనెప్పటికైనా ఆ విష్ణువునే వివాహం చేసుకుంటాను. వచ్చే జన్మలో అయోనిజగా పుట్టి, ధర్మాత్ముడైన నా తండ్రి దగ్గరే పెరిగి, నిన్ను నాశనం చేసి తీర్తాను. నిన్ను మాత్రం చంపకుండా వదలను. ఇదే నా ప్రతిజ్ఞ అని ప్రతిజ్ఞ చేసి మరీ నిప్పుల్లో దూకింది.

ఆమె ప్రతిజ్ఞ చేసినట్లే మరుజన్మలో ఒక కమలంలో అయోనిజగా పుట్టింది. తేజోవంతురాలైన ఆ బాలికని రావణుడు చూశాడు. ముచ్చట గొలుపుతున్న ఆ చిన్నారిని రావణుడు తన అంతఃపురానికి తీసికెళ్ళాడు. తనమంత్రులకి చూపెట్టాడు. వారు జ్యోతిష్కులని సంప్రదించారు. జ్యోతిష్కులు ఆమె జాతకం పరిశీలంచి, ఆమెని రావణుడు పెంచుకుంటే లంకకి ముప్పు అని తేల్చి చెప్పారు. వారి సలహాపై రావణుడు ఒక మందసం చేయించి, అందులో ఆ బాలికని వుంచి సముద్రంలో పడేశాడు.

కాలక్రమాన ఆ బాలిక నుంచిన మందసం జనక మహారాజు యజ్ఞవాటిక

ప్రాంతంలో నిక్షిప్తమై నాగలిదున్నుతున్న జనకుని నాగటి చాలుకి చిక్కి ఆయనకి దొరికింది. ఆ బాలికే అయోనిజమైన నీ ధర్మపత్ని సీత. తన తపోబలంతో సాక్షాత్తు విష్ణువైన నిన్ను వివాహమాడింది. రావణుని చావుకి కారణమై తన ప్రతిన నెరవేర్చుకుంది.

ఆ కథ అలా వుంచు. వేదవతి అగ్నిలో ప్రవేశించి, తన తనువు చాలించాక, రావణుడు పుష్పకవిమానం ఎక్కి మళ్ళీ బయల్దేరాడు. భూమండలం నలుమూలలా జైత్రయాత్ర సాగించాడు.

ఉశీరబీజము అనే దేశానికి రాజైన మరుత్తుని ఓడించాడు. ప్రతి క్షత్రియుని దగ్గరకీ, రాజుల దగ్గరకి వెళ్ళి నాతో యుద్ధం చేస్తారా ఓటమి నంగీకరిస్తారా అని సవాలు చేసేవాడు. ఎవరైనా యుద్ధానికి తలబడితే వారిని సర్వనాశనం చేసేవాడు. అలా అలా సాగి కొంతకాలానికి అనరణ్యుడు పరిపాలిస్తున్న అయోధ్యకి వెళ్ళాడు. అనరణ్యుడు ఇక్ష్వాకువంశం వాడు గొప్ప బలవంతుడు. కాని బ్రహ్మవర ప్రభావం వల్ల రావణుడు అనరణ్యుడ్ని తీవ్రంగా గాయపరచి నేలపైకి తోసి వికటాట్టహాసం చేశాడు.

అపుడు అనరణ్యుడు అవమానంతో కుమిలిపోతూ "మూర్ఖుడా ఎల్లకాలము ఇలాగే నీకనుకూలంగా వుంటుందని మురిసిపోకు. నా తలరాత బాగుండక నీ చేతిలో ఓడిపోయాను. కాని నేను నిజంగా ధర్మపథంలో చరించిన వాడినైతే మా ఇక్ష్వాకు వంశంలోనే దశరథ నందనుడుగా పుట్టిన శ్రీరాముని చేతిలో నువ్వు సర్వనాశనమై తీర్తావు" అని శపించాడు.

అనరణ్యుడ్ని వధించి రావణుడు విలాసంగా మళ్ళీ పుష్పక విమానంలో బయల్దేరాడు. ఇష్టమొచ్చినట్లు భూభ్రమణం చేస్తూ కనిపించిన వారినల్లా సతాయిస్తూ వెళ్ళి ఆనందం పొందుతూ తిరగసాగాడు. అలా ఆకాశమార్గాన తిరుగుతున్న రావణునికి ఒకనాడు నారద మహర్షి కనిపించాడు. రావణుడు ఆయనకి నమస్కరించి కుశల ప్రశ్నలు వేశాడు.

అపుడు నారదుడు రావణుని శౌర్యపరాక్రమాల్ని మెచ్చుకుని "రావణా బ్రహ్మదేముడు నీకు దేవతల వల్ల కూడా మరణం లేకుండా అమోఘమైన వరం ఇచ్చాడు కదా, నువ్విలా అల్పప్రాణులపైనా ఈ భూలోకవాసులపైనా పడుతున్నావెందుకు? ఈ మానవులంతా మృత్యువుకి ఆధీనమైన వారు. వీరంతా ఎప్పటికైనా మరణించి యమలోకానికి చేరుకుంటారు. కనక నువ్వు ఆ యమధర్మరాజునే జయించి వశం చేసుకో. అపుడీ మర్త్యలోకమంతా నీకు

దాసోహంఅంటుంది" అని అనేక విధాల రావణుడ్ని ప్రలోభపెట్టాడు.

రావణుడు ఉబ్బితబ్బిబై నారద మహర్షికి ప్రణామము చేశాడు. వెంటనే ఆయన సలహా ప్రకారం దక్షిణ దిశగా యమధర్మరాజు మీదికి దండయాత్రకి బయల్దేరాడు. నారదుడు కూడా అతడి కంటే ముందు యమపురికి చేరి, రావణుడు యుద్ధానికి వస్తున్నవిషయం యమధర్మరాజుకి తెలియజేసి హెచ్చరించాడు.

అంతలో రావణుడు యమలోకానికి రానే వచ్చాడు. యమ భటులకి, రాక్షసులకి మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. యమభటుల ముందు రాక్షసుల గణాలు నిలవలేక పరుగులు తియ్యసాగారు. అపుడు యమభటులు పుష్పకవిమానంలో వున్న రావణునిపైకి లంఘించారు. వారు రావణుని తీవ్రంగా గాయపరిచారు. రావణుడు రోషంతో పుష్పక విమానం దిగి ధనుర్బాణాలతో తిన్నగా యమధర్మరాజుపైకి లంఘించి పరమేశ్వరుడు ప్రసాదించిన పాశు పతాస్త్రాన్ని యమధర్మరాజుపై ప్రయోగించాడు. యమధర్మరాజు ఎన్నో శక్తులు, ఈటెలు రావణునిపైకి ప్రయోగించాడు. ఆ విధంగా ఒకరి కొకరు తీసిపోకుండా, ఒకరు ప్రయోగించిన ఆయుధాలనింకొకరు నిర్వీర్యం చేస్తు ఏడురాత్రులు నిర్విరామంగా యుద్ధం చేశారు.

ఆ భీకర యుద్ధానికి లోకాలన్నీ తల్లడిల్లసాగాయి. అప్పుడు పితామహుడైన బ్రహ్మ అక్కడ ప్రత్యక్షమై, వారిద్దరికీ నచ్చజెప్పి, రావణునిదే విజయమని చెప్పి అంతర్ధానమైపోయాడు.

యమధర్మరాజు కాలదండం ప్రయోగిస్తే రావణునికి మరణం తప్పదు. కాని తాను అతనికి దేవదానవ యక్ష గంధర్వ కిన్నెర కింపురుష నాగగరుడాదుల వల్ల చావులేకుండా వరమిచ్చాడు. రావణుడు మరణిస్తే తన వరం అసత్యమవు తుంది కనుక యమధర్మరాజుని అనునయించి పంపేశాడు.

యమధర్మరాజు వెనుతిరిగివెళ్ళిపోగానే రావణుడు విజయ గర్వంతో పొంగిపోయాడు.

అక్కడ్నించి తన పుష్పక విమానంలో రసాతలంలోకి ప్రవేశించాడు. వాసుకి పాలనలో వున్న భోగవతిని జయించాడు. అక్కడ్నించి మణిమయపురానికి వెళ్ళి నివాతకవచుడు అనే దైత్యరాజుపై యుద్ధం ప్రకటించాడు. వారిద్దరికి అసామన్యమైన పోరు జరిగింది. ఏ ఒక్కరూ విజయులు కాలేకపోతున్నారు. అప్పుడు బ్రహ్మప్రత్యక్షమై వారిద్దన్ని మైత్రి చేసుకోమని సలహా ఇచ్చాడు. వారిద్దరూ సంధి

చేసుకున్నాక రావణుడు వారిరాజ్యంలో ఒక సంవత్సరం అతిధిగా వున్నాడు. వారి వద్ద వందరకాలమాయలు నేర్చుకున్నాడు. అక్కడ్నించి మళ్ళీ బయల్దేరాడు.

కాలకేయుడనే దానవుని, శూర్పణఖ భర్తనీ వధించాడు. ఎదురు తిరిగిన వారినల్లా విస్సంకోచంగా వధిస్తూ జైత్రయాత్ర పూర్తిచేసుకుని, లంకానగరానికి వెళ్ళిపోతూ, దారిలో కనిపించిన ప్రతి అందమైన స్త్రీని బలత్కారంగా పుష్పక విమానంలోకి లాక్కుని, వారి బంధువులు అడ్డు వస్తే నిర్దాక్షిణ్యంగా చంపేస్తూ వికటాట్టహాసం చేస్తూ వెళ్ళసాగాడు. ఆ స్త్రీలంతా బోరున ఏడుస్తూ, కన్నీరు కారుస్తూ భయంతో గడగడలాడుతూ, ఆ రాక్షసుణ్ణి తిట్టుకోసాగారు. వారంతా ఏకమై పరాయిస్త్రీలని చెరబడ్తున్నాడు కనక వీడు ఒక స్త్రీ మూలంగానే చస్తాడని శపించారు.

రావణుడు వారి శాపాన్ని లెఖ్కచెయ్యకుండా వారందరితో లంకలో ప్రవేశించాడు. వెంటనే శూర్పణఖ భోరున ఏడుస్తు రావణుని పాదాల మీద పడింది. రావణుడు ఆశ్చర్యపోయాడు. తాను చంపిన వాళ్ళలో శూర్పణఖ భర్త వున్నాడని అతడికి తెలియదు.

కాని శూర్పణఖ చెల్లెలి భర్తని చంపి విధవని చేసిన నీచుడవని నిందించింది. యుద్ధోన్మత్తుడై తానుచేసిన పొరపాటు గుర్తించి బాధపడ్డాడు. చెల్లెల్ని ఓదార్చి, తమ పినతల్లి కుమారుడైన ఖరుడ్ని పద్నాలుగు వేలమంది రాక్షసవీరుల్ని వారి సైన్యాధ్యక్షునిగా దూషణుడ్ని ఆమెకి తోడిచ్చి దండకారణ్యానికి పంపి అక్కడ సుఖంగా వుండమన్నాడు. వారంతా దండకారణ్యంలో స్థిరనివాసమేర్పరచుకుని అక్కడి మునుల్ని, మానవుల్ని, మృగాల్ని తింటూ యధేచ్ఛగా విహరించసాగారు.

వాళ్ళనలా పంపాక రావణుడు స్వస్థచిత్తుడయ్యాడు. లంకలో వున్న నికుంభిలా వనానికి వెళ్ళాడు. అక్కడ యజ్ఞదీక్షలో వున్న తన పెద్దకుమారుడైన మేఘనాధుని చూశాడు. అతడు మౌనవ్రతంలో వున్నాడు.

వారి గురువైన శుక్రాచార్యుడు అజేయుడుగా వరం పొందటం కోసమే అతడీ యజ్ఞం చేస్తున్నాడనీ, అతడి దీక్షకి మెచ్చుకుని ఈశ్వరుడు ప్రత్యక్షమై ఇష్టాను సారం నడిచే రధాన్ని, గొప్ప మాయని, అక్షయ తూణీరాల్ని ఇచ్చాడనీ, ఇంకా అనేక వరాలిచ్చాడనీ చెప్పాడు. ఆ మాయ ప్రభావం వల్ల అతడు యుద్ధం చేసే సమయంలో జగత్తంతా అంధకారమై అతడు అదృశ్యరూపంలో వుండి యుద్ధం చెయ్యగలడని చెప్పాడు. కాని రావణుడా సంగతులు విని ఎంతమాత్రం ప్రసన్నత కనపరచలేదు. మేఘనాదుడ్ని, విభీషణుడ్ని వెంటబెట్టుకుని పుష్పక విమానం దగ్గరకి వెళ్ళాడు. గోలు గోలున ఏడుస్తున్న స్త్రీలనందర్నీ విమానంలోంచి

బయటకి రమ్మన్నాడు.

ఉత్తమ జాతికి చెందిన ఆ స్త్రీలని చూసి విభీషణుడు చాలా బాధపడ్తు "రాజా పరస్త్రీలని చెరబట్టటం పాపం కాదా. మన వంశానికి తలవంపుతెచ్చే ఈ పని ఎందుకు చేశావు? ఇందుకు ప్రతిఫలంగా ఏం జరిగిందో తెలుసా? మన చెల్లెలైన కుంభీనసని, మధు అనే దానవుడు అపహరించుకుపోతూ, అడ్డమొచ్చిన వారినందర్నీ చావగొట్టాడు. ఇదంతా నీ పాపకర్మవల్లనే జరిగింది" అన్నాడు.

ఆ మాటలు విన్న రావణునికి రోషంతో కన్నులెఱ్ఱబడ్డాయి. వెంటనే మధు మీదికి యుద్ధానికి బయల్దేరాడు. కాని కుంభీనస అన్నగారి పాదాలపై పడి, అతడు తనని వివాహం చేసుకున్నాడనీ అతడ్ని చంపి నన్ను విధవని చెయ్యవద్దని ప్రాధేయపడింది. సరే అని సమ్మతించి రావణుడు మధుని, మేఘనాధుడ్ని, కుంభకర్ణుడ్ని వెంటబెట్టుకుని దేవతల మీదికి యుద్ధానికి వెళ్ళాడు. సాయం సమయానికి కైలాసగిరి చేరి, ఆ రాత్రికి అక్కడ మజిలీ చేశాడు. రాక్షస సేనలన్నీ గాఢమైన నిద్రలోకి జారుకున్నాయి.

కాని రావణుడికి నిద్ర రాలేదు. తన శిబిరం నించి బయటకి వచ్చాడు. ఆ కైలాగిరి శిఖరం ప్రకృతి శోభలతో రమణీయంగా వుంది. రావణుడు కామపరవశుడై నిట్టూర్పులు విడుస్తు నుంచున్నాడు.

అంతలో సర్వాలంకార శోభితురాలైన అపురూప సౌందర్యవతి రంభ అటువైపు వెళ్తు కనిపించింది.

కామమోహితుడైన ఆదానవ రాజు రంభని అడ్డగించి, ఆమెని బలాత్కరించబోయాడు. వాని మాటలు విన్న రంభ భయంతో వణికిపోతూ "ఆర్యా మన్నించండి. మీ పుత్రిక లాంటిదాన్ని. మీ ఇంటికోడల్ని. మీరిలా చెయ్యటం భావ్యం కాదు" అని వారించింది.

రావణుడు ఆశ్చర్యంగా "రంభా నాకు నువ్వు కోడలివెలా అవుతావు?"అని అడిగాడు.

అందుకు రంభ వినయంగా "రాక్షసరాజా మీ సోదరుడైన కుబేరుని కుమారుడు నలకూబరుడు నేను ప్రేమించుకున్నాం. ఆయనే నా భర్త, నేనిపుడాయన దగ్గరకే వెళ్తున్నాను. మీ అన్నగారి కోడలు, మీ కోడలు కాదా?" అంది.

అందుకు రావణుడు ఎగతాళిగా నవ్వుతూ "రంభా ఈ వావివరసలన్నీ మానవలోకంలో మాత్రమే చెల్లుతాయి. మీ లోకంలో వావివరసలతో పనిలేదు"

అంటూ రావణుడు బలవంతంగా ఆమెని పట్టుకుని కామం తీర్చుకున్నాడు. ఆ తర్వాత వదిలేసి పొమ్మన్నాడు.

సిగ్గుతో కుచించుకుపోతూ ఆమె నలకూబరుడి దగ్గరకెళ్ళింది. అది విన్న నలకూబరుడు కోపంతో రావణుని నిందిస్తూ "ఇప్పట్నించీ ఏ స్త్రీనైనా ఆమె ఇష్టపడకుండా ఆ నీచుడు అనుభవిస్తే వాడితల ఏడుముక్కలై పోవాలని" శపించాడు.

ఆ శాపం తెలుసుకున్న రావణుడు ఆనాటి నించీ తనని ఇష్టపడని స్త్రీల జోలికి వెళ్ళటం మానేశాడు. రావణుని అంతఃపురంలో బందీలుగా వున్న స్త్రీలు ఈ శాపం సంగతి తెలిసి తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

కైలాస పర్వతం మీద సైనిక స్థావరం ఏర్పరచుకున్న రావణుడు, సేనతో కూడా ఇంద్రుడిపై దండెత్తి వెళ్ళాడు.

దేవతలకి, రాక్షసులకి మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. దేవతల ధాటికి ఆగలేక దానవులు పారిపోసాగారు. రావణుడి తాతగారు సైన్యాన్ని నడిపిస్తూ ఆయుద్ధంలో ప్రాణాలు వదిలాడు. అదిచూసి ఆగ్రహంతో మేఘనాథుడు పారిపోతున్న సేనల్ని సమీకరించి యుద్ధానికి బయల్దేరాడు. ఇంద్రుడి కుమారుడైన జయవంతుడు అతడ్ని ఎదుర్కొన్నాడు. ఇద్దరికీ ఘోరమైన యుద్ధం జరిగింది. మేఘనాథుడు మాయా యుద్ధంలో జయంతుడ్ని చిత్తు చేస్తుండగా, ఇంద్రుడి మామగారైన పులోముడు, మనుమడ్ని తన భుజంపై వేసుకుని పారిపోయాడు. దేవతలంతా ఏకమై వెళ్ళి జయంతుడు అదృశ్యమయ్యాడని చెప్పారు.

అది విన్న ఇంద్రుడు ఆగ్రహంతో యుద్ధానికి బయల్దేరాడు. రావణుడు కూడా తన కొడుకుని వెనక్కి వెళ్ళమని తాను స్వయంగా ఇంద్రుణ్ణి ఎదుర్కొన్నాడు.

రావణ కుంభకర్ణులకీ, ఇంద్రునికీ భయంకరమైన యుద్ధం జరిగింది. దేవతలు రాక్షససైన్యంలో తొమ్మిదివంతుల మందిని చంపేశారు. కేవలం పదోవంతు రాక్షససైన్యం మిగిలింది.

అది తెలిసి రావణుడు కోపంతో గర్జించాడు. ఇంద్రుడు ఒక పథకం ప్రకారం తన సైన్యంతో రావణుని చుట్టుముట్టి అతడ్ని బంధించాలని ప్రయత్నించాడు. ఇది కనిపెట్టి మేఘనాథుడు స్వయంగా ఆ సేనలో చొరబడ్డాడు. పరమేశ్వరుడు ప్రసాదించిన మాయాశక్తితో అదృశ్యరూపంలో ఉండి దేవతల్ని చీల్చి చెండాడ సాగాడు. క్రమంగా దేవతల్ని తప్పించుకుంటూ ఇంద్రుని పైకి లంఘించాడు. ఇంద్రుడికి మేఘనాథుడెక్కడు వున్నాడో తెలియటం లేదు. అయినా నాల్గుదిక్కులా

బాణవర్షం కురిపించసాగాడు.

మేఘనాధుడు అదనుకనిపెట్టి ఇంద్రుణ్ణి తన సైన్యంలోకి లాక్కుని బంధించేశాడు. దేవతలంతా అది చూసి నిశ్చేష్టులయ్యారు. వారంతా రావణుడి మీద పడి తీవ్రంగా గాయపరిచారు. వారి ధాటికి రావణుడు నిలవలేకపోతున్నాడు. అదృశ్యరూపంలో వున్న మేఘనాధుడది చూశాడు. రావణుడ్ని ఉద్దేశించి "తండ్రీ నేను ఇంద్రుణ్ణి బంధించాను. ఇంక మనం లంకకి తిరిగి వెళ్ళిపోదాం రండి" అన్నాడు.

ఆ మాటలు విన్న రావణుడు చాలా ఆనందించాడు. కుమారుణ్ణి చాలా మెచ్చుకున్నాడు.

తండ్రి ఆజ్ఞమీద మేఘనాధుడు ఇంద్రుడితో కూడా తన రథంలో లంకవైపు వెళ్ళిపోయాడు. రావణుడు ఆకాశమార్గంలో పుష్పకవిమానంపై సాగిపోయాడు.

'మేఘనాధుడు ఇంద్రుణ్ణి బంధించి లంకకి తీసుకుపోగానే, దేవతలంతా భయభ్రాంతులై వెళ్ళి బ్రహ్మతో మొరపెట్టుకున్నారు. వారితో కలసి బ్రహ్మ లంకకి వెళ్ళాడు.

రావణుడ్ని బుజ్జగించి, ఇంద్రుడ్ని వదిలెయ్యమని అడిగాడు. ఆ మాటకి ఇంద్రుడ్ని బంధించిన మేఘనాదుడు ముందుకొచ్చి తనకి అమరత్వాన్ని ప్రసాదిస్తేనే ఇంద్రుడ్ని ఇదిలేస్తానన్నాడు. కాని బ్రహ్మ అది అసాధ్యమని వేరేదైనా వరం అడగమని అన్నాడు.

అప్పుడు మేఘనాధుడు, "పితామహా ఎప్పుడైనా ఎవరి మీదికైనా యుద్ధానికి వెళ్ళే ముందు నేను మంత్రయుక్తంగా యాగం చేసి అగ్నిదేముణ్ణి పూజిస్తాను. ఆపూజని గ్రహించి, అగ్నిదేముడు తక్షణం నాకొక దివ్యమైన రథాన్ని ప్రసాదించేలా, ఆ రథంలో వున్నంత వరకు నాకు ఎవరి వల్లా మరణం కలగకుండా వరం ఇయ్యి. ఏ కారణం చేతనైనా నేను యాగం పూర్తి చెయ్యలేకపోతే మాత్రం నాకు వినాశం కలగాలి.

సామాన్యంగా ఎవరైనా అసాధ్యమైన తపస్సు చేసి అమరత్వం పొందుతారు. కాని నేనుమాత్రం నా పరాక్రమం చేత అమరత్వం సాధిస్తాను" అన్నాడు.

అదివిన్న బ్రహ్మ తథాస్తు" అని దీవించాడు. తర్వాత మేఘనాధుడు ఇంద్రుని బంధనాల్ని విడిపించాడు. ఆనాటి నుంచి మేఘనాధుడు ఇంద్రజిత్తుగా ప్రఖ్యాతి పొందుతాడని బ్రహ్మ దీవించాడు. దేవతలంతా ఇంద్రునితో దేవలోకానికి వెళ్ళిపోయారు. కాని రాక్షసులకి బంధీగా చిక్కటం వల్ల ఇంద్రుడు తన తేజస్సు

కోల్పోయాడు. అతడు చాలా చింతాక్రాంతుడై పోయాడు. అప్పుడు బ్రహ్మ ఇంద్రుణ్ణి ఓదార్చి,

"దేవేంద్రా మునుపు నువ్వు చేసిన అకృత్యానికి ఫలితం ఇపుడనుభవిస్తున్నావు. నేను మొదటి సారిగా సృష్టించిన స్త్రీ అహల్య. అపురూప లావణ్య సౌందర్యరాశి. ఆమెని భార్యగా పొందాలని మొదట్లో నువ్వు మనసుపడ్డావు. కాని ఆమెని కొంతకాలం కాపాడమని, నేను ఆమెని గౌతమ మహర్షి దగ్గర వుంచాను.

అతడు చాలా మనోనిగ్రహంతో ఆమెని కాపాడి సురక్షితంగా నాకు అప్పగించాడు. నేనందుకు సంతోషించి, ఆమెని గౌతమునికే భార్యగా సమర్పించాను. కామాతురుడివైన నువ్వు ఆమెనెలాగైనా పొందాలని గౌతముడి వేషంతో వెళ్ళి ఆమెని అనుభవించావు. గౌతముడది తెలుసుకున్నాడు.

అపుడతడు ఉత్తరోత్తరా యుద్ధంలో నీకు అపజయం కలగాలనీ, జారులైన పురుషుల పాపంలో సగం భాగం నీకు రావాలనీ, నిన్ను శపించి తన భార్యని అదృశ్యరూపంలో ధూళిలో నేల మీద వేల సంవత్సరాలు పడి వుండమనీ ఇక్ష్వాకు వంశీయుడైన శ్రీరాముని పాదధూళి సోకగానే పునీతురాలవై యథాస్థితి పొందగలవనీ శపించాడు. కనుక వాసనా ఆ శాప ప్రభావం వల్లనే నువ్వు రాక్షసుల చేత ఓడించబడ్డావు.

ఇపుడు దాని పరిహారం కోసం వైష్ణవ యజ్ఞం చెయ్యి. మళ్ళీ తేజస్సు, స్వర్గ ప్రాప్తి పొందగలవు" అన్నాడు.

ఇంద్రుడు ఆయన సలహా ప్రకారం వైష్ణవ యజ్ఞం చేసి స్వర్గ ప్రాప్తి పొందాడు. రామచంద్రా విన్నావుగా ఇంద్రజిత్తు ప్రజ్ఞాపాటవాలు. అతడు తన పరాక్రమంతో సాక్షాత్తు ఇంద్రుణ్ణి జయించాడు" అని అగస్త్యుడు చెప్తుంటే, రాముడు, లక్ష్మణుడు వానరులు ఆశ్చర్యంగా విన్నారు. అప్పుడు రాముడు ఆశ్చర్యంగా "మునివర్యా మీరు చెప్తున్న సంగతులు చాలా విచిత్రంగా వున్నాయి. రావణుడు జైత్రయాత్ర సాగిస్తున్న సమయంలో అతడ్ని ఎదిరించే వీరులే లేకపోయారా, ఈ భూమ్మీద? అని అగస్త్యుడ్ని అడిగాడు వినయంగా.

అగస్త్యుడు చిరునవ్వుతో ఇలా జవాబు చెప్పాడు. "రాఘవా ఆ సంగతీ చెప్తాను విను. రావణుడు జైత్రయాత్ర సాగిస్తూ మహిష్మతీ నగరానికి వెళ్ళాడు. ఆ కాలంలో కార్తవ్యుని కుమారుడైన అర్జునుడు అనే మహారాజు ఆదేశాన్ని పరిపాలిస్తున్నాడు. అతడు మహాపరాక్రమశాలి. రావణుడాదేశానికి దండయాత్రకి వెళ్ళినప్పుడు ఆ రాజు తన స్త్రీ జనంతో నర్మదా నదీ తీరానికి విలాసయాత్రకి

వెళ్ళాడు. ఆ సంగతి తెలుసుకున్న రావణుడు తన సైన్యంతో తిన్నగా వింధ్యపర్వత ప్రాంతానికి వెళ్ళాడు. ఆ ప్రాంతంలో విహరిస్తూ అలా అలా నర్మదా నదీ తీరానికి వెళ్ళాడు.

ఆనదీ జలాల్ని చూడగానే రావణునికి ఆ నీటిలో జలకాలాడాలనిపించింది. తనివి తీరా నిర్మలమైన ఆ నదీ జలాలతో మునకలు వేసి, ఒడ్డుకి వచ్చి, తన మంత్రుల్ని స్నానం చెయ్యమని పంపాడు. స్నానాల కార్యక్రమం పూర్తయ్యాక శివార్చన చెయ్యాలనే సంకల్పంతో పూలు, ఫలములు తెమ్మని వారినాదేశించాడు.

అతడి సేవకులు పూలు, మధుర ఫలాలు తెచ్చి గుట్టలుగా పోశారు. రావణుడు గొప్ప శివభక్తుడు. ఎక్కడికి వెళ్ళినా తన వెంట బంగారు శివలింగం తీసికెళ్ళి ముప్పొద్దులా శ్రద్ధగా ఈశ్వరారాధన చేసేవాడు.

అలాగే ఆ రోజు కూడా శుచియై, పట్టువస్త్రాలు ధరించి, నదీ తీరంలో ఇసుకలో ఒక వేదికనమర్చి, అక్కడ శివలింగం ప్రతిష్ఠించి, పూజా కార్యక్రమం మొదలుపెట్టాడు. పూజ పూర్తి చేసి రావణుడు, తన్మయత్వంతో శివలింగం ముందు పాటలు పాడుతూ నృత్యం చెయ్యసాగాడు.

అక్కడికి కొద్ది దూరంలోనే అర్జునుడు నర్మదానదిలో తన భార్యలతో జలక్రీడలు సల్పుతున్నాడు. అతడికి వెయ్యి చేతులున్నాయి. అతడు విలాసంగా జలక్రీడ లాడుతూ, తన వెయ్యి చేతులతో నదీ ప్రవాహాన్ని అడ్డుకున్నాడు. ఆ ప్రవాహం అలా అడ్డుకోగానే వడిగా వెనక్కి వెళ్ళి నీరు పొంగి రావణుడు శివార్చన చేస్తున్న ప్రాంతాన్నంతా నీటితో ముంచెత్తింది.

హఠాత్తుగా నీరలా పొంగటానికి కారణమేమిటా అని రావణుడు ఆశ్చర్యపోయి, చెల్లాచెదురైన తన పూజా సామాగ్రిని చూసి విచారపడ్తూ, నీరలా పొంగటానికి కారణం ఏమిటో చూసిరమ్మని తన సేవకుల్ని పంపాడు. వారు ఆ ప్రాంతాలన్నీ పరిశీలించి చూసి ఎవరో పర్వతాకారుడైన వ్యక్తి స్త్రీలతో జలకాలాడుతూ తన వెయ్యిచేతులతో నీటి ప్రవాహాన్ని ఆపుతున్న దృశ్యం చూసివచ్చి ఆ సంగతి రావణునికి నివేదించారు.

వెంటనే రావణుడు ఆ వ్యక్తి తాను యుద్ధం చెయ్యబోయిన కార్యవీర్యార్జునుడే అని గ్రహించి, ఆనందం పట్టలేక "పదండి వాడితో యుద్ధం చేద్దాం" అన్నాడు.

తన బలాలతో కలిసి చిటికెలో అక్కడికి వెళ్ళి యుద్ధం ప్రకటించాడు. కాని జలక్రీడలాడుతు మైమరచి వున్న తమ రాజుని యుద్ధానికి పిలవటం ఉచితం

కాదని అతడి మంత్రులు రావణునికి విన్నవించారు.

కాని యుద్ధోన్మత్తుడైన రావణుడు ఆ మంత్రుల్ని విరుచుకుని తినసాగాడు. రాక్షస సేనలు కార్తవీర్యార్జునుని పరివారాన్ని చీల్చి చెండాడసాగాయి. చేసేదిలేక వారంతా నదిలోకి వెళ్ళి తమ రాజుతో మొరపెట్టుకున్నారు. వెంటనే ఆ మహారాజు తన రాణుల్ని భయపడవద్దని చెప్పి రేవుకి వచ్చి తన గద తీసుకుని యుద్ధానికి బయల్దేరాడు.

ఐదువందల చేతులతో గదని గిరగిర తిప్పుతూ రాక్షససేనల్ని నుగ్గు నుగ్గుచేశాడు. ఆ తర్వాత రావణునిపైకి లంఘించాడు. ఇద్దరికీ మధ్య తీవ్రమైన యుద్ధం జరిగింది. అర్జునుడు ఒడుపుగా తన గదతో రావణుని ఛాతి మీద గట్టిగా కొట్టాడు. రావణుడా దెబ్బకి తూలిపడ్డాడు. క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా అర్జునుడు రావణుడ్ని గట్టిగా పట్టుకుని కదలకుండా కట్టిపడేశాడు. ఆ తర్వాత రావణుడ్ని తన రథం మీద పడేసి అతడు తన పరివారంతో మహిష్మతీ నగరానికి వెళ్ళిపోయాడు.

రావణుని మంత్రులు, పరివారం వ్యాకులంతో వారి వెంట వెళ్ళారు. ఈ సంగతి చిటికెలో ముల్లోకాలకు వ్యాపించి, పులస్త్యుడికి తెలిసింది. తన మనుమడైన రావణుడు అలా పరాజయం పొందటం ఆయన సహించలేకపోయాడు.

వెంటనే మహిష్మతీ నగరానికి వెళ్ళి తన మనుమడమైన రావణుని వదిలిపెట్టవలసిందిగా కార్తవీర్యార్జునుని కోరారు. అర్జునుడు మారుపలుకండా రావణుని బంధ విముక్తుడ్ని చేశాడు. తర్వాత దివ్యమైన వస్త్రాలు ఇచ్చి అతడ్ని సత్కరించాడు.

కార్తవీర్యార్జునుడు, రావణుడు అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నారు. పులస్త్యుడు మనముని కౌగలించుకుని వారిద్దర్నీ ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

రామా ఈ భూప్రపంచంలో వీరాధివీరులెందరో వున్నారు. కాని రావణుడు బలవంతుడు మాత్రమేగాక బ్రహ్మ వరప్రసాదం వల్ల అజేయుడు. అయినా తమ శ్రేయస్సుకోరుకునే వారెప్పుడు ఇతరుల్ని అవహేళన చెయ్యకూడదు" అని అగస్త్యుడు చెప్పి మిగిలిన కథ కొనసాగించాడు.

"రామచంద్రా కార్తవీర్యార్జునుడంతటి వీరుడు మిత్రుడుగా దొరికాడు కదా అనే ధీమాతో రావణుడు అక్కడ్నించి విచ్చలవిడిగా సంచరిస్తూ కిష్కింధానగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో వాలి నాల్గు మహాసముద్రాలలోనూ సంధ్యోపాసన చెయ్యటానికి వెళ్ళాడు. వెంటనే రావణుడు దక్షిణ సముద్రతీరాన వున్న వాలి

దగ్గరకి వెళ్ళాడు. సముద్ర తీరంలో మేరునగ సమధీరుడైన వాలి సంధ్యావందనం చేస్తూ కనిపించాడు. రావణుడు దుర్బుద్ధితో పిల్లిలాచప్పుడు చెయ్యకుండా నడుస్తూ వాలిని పట్టుకోబోయాడు.

కాని వాలి యోగ సమాధిలోవుండి కూడా రావణుని రాకని పసిగట్టి అలాగే అతడ్ని గట్టిగా పట్టుకుని చంకలో ఇరికించుకుని ఆకాశంలో ఎగురుతూ మిగిలిన మూడు సముద్రతీరాల్లో కూడా సంధ్యావందనం ముగించుకున్నాడు. చంకలో వున్న రావణుడు గిల గిల తన్నుకుంటూ తన వాడియైన దంతాలతో, గోళ్ళతో వాలిని పీకి గీరి హింసించసాగాడు. అయినా ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా వాలి తన కార్యక్రమాలన్నీ పూర్తిచేసుకుని కిష్కింధకి వెళ్ళిపోయాడు.

తన నగరానికి చేరాక ఉపవనంలో దిగి కాస్త సేదదీరి, చంకలోని రావణుని నేలపై విడిచిపెట్టి ముసి ముసి నవ్వులతో "ఇంతకీ నువ్వెవడివి?" అని అడిగాడు.

అప్పటికే రావణునికి కళ్ళు తిరుగుతున్నాయి. వాలి బలపరాక్రమాలకి ఆశ్చర్యపోతూ సిగ్గుతో చితికిపోయాడు. తలదించుకుని, తనని పరిచయం చేసుకుని మహావీరుడైన అతడితో మైత్రి చేసుకుంటానని కోరాడు. వాలి అంగీకరించాడు. ఇద్దరూ ఒకర్నొకరు కౌగలించుకుని, అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నారు. ఒకనెల రోజులు కిష్కింధలో వుండి రావణుడు వాలి ఆతిథ్యం స్వీకరించాడు. రావణుని చరిత్ర పూర్తిగా అగస్త్యుని వలన తెలుసుకున్న రాముడికి ఇంకో సందేహం కలిగింది. అప్పుడు చేతులు జోడించి, వినయంగా "మహామునీ మీరుచెప్పినదంతా విన్నాక, రావణుడు వాలి ఇద్దరికిద్దరూ అసమాన శక్తి సంపన్నులని తెలిసింది. కాని నా దృష్టిలో వీరిద్దరి కన్నా ఆంజనేయుడు ఇంకా అధికశక్తి సంపన్నుడు. అపారమైన సముద్రాన్ని చూడగానే వానరసేన అంతా గాబరా పడిపోయింది. కాని హనుమంతుడు ఒక్క గెంతులో శతయోజన విస్తీర్ణ సముద్రాన్ని లంఘించాడు. ఒక్క గుద్దుతో లంకిణిని నేలకూల్చాడు. అశోకవనంలో ఒంటరిగా రాక్షస సేనల్ని ఎదుర్కొని అక్షకుమారుణ్ణి సంహరించాడు. లంకలోనూ, రావణునితో చేసిన యుద్ధంలోనూ హనుమంతుడు ప్రదర్శించిన పరాక్రమం తల్చుకుంటే యమ, ఇంద్ర, వరుణలకే గాక, చివరికి విష్ణువుకి కూడా అంతటి వీరత్వం లేదేమో అనిపిస్తుంది.

మునిసత్తమా అంతటి మహావీరుడైన హనుమంతుడు, వాలి సుగ్రీవుల మధ్య వైరం ఏర్పడినపుడు తానే వాలిని మట్టుబెట్టి సుగ్రీవునికి రాజ్యం ఎందుకిప్పించలేదా అనే విషయం నాకు అంతుబట్టటం లేదు. నిజానికి నేను రావణుని వధించి సీతతోనూ, లక్ష్మణునితోనూ సురక్షితంగా అయోధ్యకి తిరిగి వచ్చానంటే అందుకు

కారణం హనుమంతుడే కదా. అతడి గురించి వివరంగా తెలుసుకోవాలని వుంది" అన్నాడు.

రాముడలా అడగ్గానే అగస్త్యుడు "రామా, నువ్వు చెప్పినట్లు బలము, శక్తి, శౌర్యము, పరాక్రమము, అన్నీ కలిగిన హనుమంతుడు, కేవలం మునుల శాప ప్రభావంవల్ల తన శక్తినంతా మర్చిపోయి, ఒక సామాన్యవానరుడిగా వుండి పోయాడు. ఆ సంగతి వివరంగా చెప్తాను విను.

పూర్వం సుమేరు పర్వత ప్రాంతాన్ని కేసరి అనే ఒక వానర రాజు పాలించే వాడు. అతడి భార్యపేరు అంజనా దేవి. ఒక సారి ఆమె అడవిలో విహరిస్తుండగా వాయుదేవుడామెని చూసి మోహించాడు. ఆయన అనుగ్రహం వల్ల ఈ అంజనా దేవికి కల్గిన వాడే ఆంజనేయుడు. పింగళవర్ణంలో పుట్టాడు.

అతడి బాల్యంలో ఒకసారి అంజనాదేవి, అతడ్ని ఒంటరిగా ఆశ్రమంలో వదిలి, పూలు, ఫలములు తేవటానికి అడవికి వెళ్ళింది. చిన్నారి ఆంజనేయునికి ఆకలేసింది. ఎంతకీ తల్లి రావటం లేదు. ఆకలితో ఆబాలుడేడుస్తుండగా ఆకాశంలో అప్పుడే వుదయిస్తున్న బాల భానుడు ఎఱ్ఱగా ఒకతియ్యని పండులా కనిపించాడు.

ఆ ఫలాన్ని అందుకోవాలని ఆ బాల ఆంజనేయుడు వేగంగా ఆకాశంలోకి ఎగిరాడు. అలా ఎగురుతూ సూర్యునివైపు వెళ్తున్న ఆ బాలుని, దేవతలు, దానవులు, యక్షులు మొదలైన వారు ఆశ్చర్యంగా చూశారు.

అలా అలా ఎగురుతూ వెళ్ళి ఆంజనేయుడు సూర్యుడ్ని సమీపించాడు. ఆ రోజు సూర్యగ్రహణం కనుక రాహువు వేగంగా సూర్యుణ్ణి కబళించటానికి వస్తున్నాడు. తనకంటే ముందు సూర్యుణ్ణి సమీపిస్తున్న బాల ఆంజనేయుడ్ని చూసి, రాహువు భయంతో పారిపోయాడు. తిన్నగా ఇంద్రుడి దగ్గరకి వెళ్ళి ఆ సంగతి చెప్పాడు.

ఇంద్రుడు ఐరావతం మీద వెళ్ళి సూర్యుణ్ణి సమీపిస్తున్న ఆంజనేయుణ్ణి చూసి, లోకపాలకుడిగా సూర్యుణ్ణి కాపాడటం తన కర్తవ్యం కనక హనుమంతుని మీదికి తన వజ్రాయుధాన్ని విసిరాడు.

ఆ వజ్రాయుధం తగలగానే ఆంజనేయుడు తెలివి తప్పి కిందికి పడిపోగాడు. ఆ ఆయుధం గట్టిగా హనుమంతుడి దవడకి తగిలి, అతడి దవడ ఎముక విరిగి పోయింది. అలా ఆకాశంలోంచి జారిపడ్తున్న తన కుమారుడ్ని వాయు దేవుడు రెండు చేతులతో పట్టుకున్నాడు. ఆంజనేయునికి దవడకి దెబ్బతగలడం చూసి

వాయుదేమునికి చెప్పలేని కోపం వచ్చింది. ఆ బాలుణ్ణి అలాగే ఎత్తుకుని ఒక గుహలో దూరాడు.

ఆ విధంగా వాయువు అంతర్హితుడు కాగానే, జగాలన్నీ స్థంభించిపోయాయి. సంగతి తెలియక దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, మానవులు అంతా బ్రహ్మదగ్గరకి పరిగెత్తారు. "వాయువు లేకుండా మేమెలా బ్రతికేది? రక్షించండి" అని ప్రార్థించారు.

అపుడు బ్రహ్మ వారికభయమిచ్చి వారితో పాటు వాయుదేముని దగ్గరకి బయల్దేరాడు. వాయుదేవుని ఒడిలో నిర్జీవంగా పడివున్న అమిత తేజోవంతుడైన బాలుణ్ణి చూశాడు. చనిపోయిన కుమారుణ్ణి చూసుకుని వాయుదేవుడు చాలా దుఃఖిస్తున్నాడు. బ్రహ్మని, దేవతల్ని చూడగానే లేచి నిలబడ్డాడు. బ్రహ్మ వాయుదేవుని ఓదార్చి ఆ బాలున్ని పునర్జీవితుణ్ణి చేశాడు.

వాయు దేవుడు ఆనందపవరశుడై మళ్ళీ సర్వజీవ కోటికి చైతన్యం ఇచ్చాడు. అపుడు బ్రహ్మ దేవతల వైపు చూసి,

"ఇంద్రాది దేవతలారా మీకు తెలిసిన విషయమే అయినా మళ్ళీ గుర్తు చేస్తున్నాను. ఈ బాలుని వల్ల భవిష్యత్తులో చాలా మేలు కల్గుతుంది. కనక మీరంతా వరాలిచ్చి ఈ బాలుణ్ణి వాయుదేవుని ప్రసన్నం చేస్కోండి" అన్నాడు.

దేవతలానందంగా అంగీకరించారు. ముందుగా ఇంద్రుడు బాలుని మెడలో కువలయహారం వేసి, ఆ బాలునికి ఎప్పటికీ వజ్రాయుధం వల్ల హాని కలగకుండా వరం ఇచ్చాడు. వజ్రకాయుడై ఆ బాలుడు హనుమంతుడనే పేరుతో ప్రసిద్ధి చెందుతాడని దీవించాడు.

తర్వాత సూర్యుడు ఆ బాలుని దీవించి, తన తేజస్సులో వందో భాగం ఆ బాలునికిచ్చాడు. తానే స్వయంగా ఆ బాలుడు పెద్దవాడయ్యాక సర్వశాస్త్రాలు నేర్పి శాస్త్రపరిజ్ఞానంలో ఇతనిని మించినవారు భూత, వర్తమాన, భవిష్యత్కాలాలలో ఎవ్వరూ లేనంత ఉద్దండ పండితుడ్ని చేస్తానని మాట ఇచ్చాడు.

వరుణుడు పదిలక్షల సంవత్సరాలు చిరంజీవిగా వర్ధిల్లేలా ఆ బాలుణ్ణి దీవించాడు. జలగండం ఎట్టిపరిస్థితిలో ఆ బాలునికి వుండదన్నాడు.

యమధర్మరాజు ఆ బాలునికి అస్సలు చావులేకుండా చిరంజీవిగా వుండేలా దీవించాడు.

కుబేరుడు తాను ఎప్పటికీ ఆ బాలునిపై ఆయుధం ప్రయోగించనన్నాడు.

శివుడు, విశ్వకర్మ కూడా అలాగే దీవించి, ఇతరులెవరైనాసరే ఈ బాలుడు పెద్దవాడయ్యాక కూడా ఇతనిపై ఆయుధాలు ప్రయోగిస్తే అవి ఎంత మాత్రం పనిచెయ్యకుండా వుంటాయని వరమిచ్చారు. చిరంజీవిగా దీవించారు.

చివరిగా బ్రహ్మ ఆ బాలుని దీవించి, దీర్ఘాయుష్మంతుడవుతాడని, బ్రహ్మాస్త్రం వల్ల అతడికెటువంటి హానీ కలగదని ఆశీర్వదించి వరాలెన్నో ఇచ్చాడు.

ఆ తర్వాత వాయుదేవునితో ఇలా అన్నాడు. "వాయుదేవా, నీ కుమారుడు శత్రువుల పట్ల భయంకరుడై మిత్రులపట్ల అభయంకరుడై వుంటాడు. అంతేకాదు ఎప్పుడు ఏ రూపం కావాలనుకుంటే ఆ రూపం ధరించగల శక్తి ఈ బాలుడికి వుంటుంది. అజేయుడవుతాడు. ఎక్కడికి వెళ్ళాలన్నా ఆకాశమార్గాన వెళ్ళగల శక్తి ఇతడికి వుంటుంది. శీఘ్రంగా కావాలనుకుంటే శీఘ్రంగా, మందంగా కావాలనుకుంటే మెల్లిగా వెళ్ళగలడు. ఎవ్వరూ అతణ్ణి అడ్డగించలేరు.

భవిష్యత్తులో రామరావణయుద్ధం జరిగినప్పుడు ఇతడు ఎన్నో అద్భుతమైన కార్యాలు చెయ్యగలడు" అని అనేకవిధాల దీవించి ఆ బాలుని అధికశక్తి సంపన్నునిగా ఆశీర్వదించి, తీర్చిదిద్ది వాయుదేవుని దగ్గర సెలవు తీసుకుని, దేవతలతో కలిసి వెళ్ళిపోయాడు.

వాయుదేవుడు ఆ బాలుని ఎత్తుకుని ఎంతో సంతృప్తి పొంది అంజనాదేవి దగ్గరకి వెళ్ళి జరిగిన వృత్తాంతమంతా చెప్పి ఆమెకి ఆమె పుత్రుని అప్పగించి తన నివాసానికి వెళ్ళిపోయాడు.

దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతున్న హనుమంతుడు తను పొందిన వరాల ప్రభావంతో విచ్చలవిడిగా సంచరిస్తూ అడవిలో తపస్సు చేసుకుంటున్న మునుల్ని తన బాల్య చేష్టలతో అనేక విధాల బాధించసాగాడు.

వారంతా మూకుమ్మడిగా ఆలోచించి, ఆంజనేయుని పిల్చి మందలించి "వానరవీరా దేవతల వల్ల వరాలు పొంది నీ శక్తి సంపదలతో మమ్మల్ని చాలా విసిగిస్తున్నావు. కనుక ఏ శక్తి సంపదతో నువ్వు ఇలా చెలరేగి పోతున్నావో, ఆ శక్తినంతా నువ్వు ఇప్పుడే మర్చిపోతావు. నీ బలం గురించి, నీకేమాత్రం తెలియకుండుగాక. ఎప్పుడైతే నీ శక్తి సామర్థ్యాలు తెలిసిన వారెవరైనా నిన్ను ప్రస్తుతిస్తూ మళ్ళీ నీకు గుర్తు వచ్చేలా చేస్తారో అపుడే నీ శక్తి మళ్ళీ నీకు గుర్తు వచ్చి పరిపూర్ణ శక్తివంతుడివి అవుతావు" అని ఏకకంఠంతో శపించారు.

రామభద్రా ఆ విధంగా దేవతల వల్ల లభించిన శక్తి సామర్థ్యాలు మరుగున

పడిపోగా సామాన్యవానరుడిలాగే అంజనాదేవి పెంపకంలో పెరిగిపెద్దవాడై కిష్కింధలో వానర సేనలో చేరి వానర రాజుకి మంత్రి అయ్యాడు. వాలి, సుగ్రీవుల కథ నీకు తెలిసినదే కదా. అందుకే ఆఅన్నదమ్ముల మధ్య వైరము కలిగినప్పుడు హనుమంతుడు సుగ్రీవునికి సహాయం చెయ్యలేకపోయాడు. కాని నిజానికీలోకంలో పరాక్రమంలోగాని, ఉత్సాహంలోగాని, బుద్ధి బలంలో గాని, ప్రతాపంలో గాని, సౌశీల్యంలో గాని, బలంలో గాని, ఆంజనేయుని మించిన వారు ఏకాలంలోనూ లేరు. ఈ అమిత శక్తివంతుడైన వానరోత్తముడు, ప్రతిరోజు ఉదయం సూర్యునితో బాటు ఉదయాద్రిపై బయల్దేరి ఆయనతో బాటు వడివడిగా అడుగులేస్తూ పెద్ద వ్యాకరణ గ్రంథం చేతిలో ధరించి, అస్తాద్రి దాకా సూర్యునితో ప్రయాణం చేసి వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించాడు. సమస్తశాస్త్రాలు, ఛందస్సు క్షుణ్ణంగా అభ్యసించిన మహా పండితుడు ఈ మారుతి. నవ వ్యాకరణ పండితుడు. శాస్త్ర కోవిదుడు. బృహస్పతి అంతటి వాడు.

రాఘవా నిజానికి ఇతడ్ని, ఇతడితో బాటు సుగ్రీవుడు, మైంధుడు, ద్వివిధుడు, నలుడు, నీలుడు, తారుడు, అంగదుడు, రంభుడు మొదలైన మహావీరులైన వానరులందర్నీ దేవతలు నీకు సహాయం చెయ్యటానికే సృష్టించారు. రఘునందనా నీ సందేహాలన్నీ తీరాయి కదా" అని అగస్త్యుడు శ్రీరామున్ని ప్రశ్నించాడు.

ఆంజనేయుని చరిత్ర విన్న రాముడు, లక్ష్మణుడు కూడా ఆశ్చర్యపోయారు. అగస్త్యమహాముని, మిగిలిన మునులు, తమకింక సెలవు ఇప్పించవలసిందిగా రాముని అడిగారు.

భవిష్యత్తులో తాను చెయ్యబోయే యజ్ఞయాగాది కృతువులకి తప్పకుండా రావాల్సిందిగా రాముడు వారిదగ్గర మాట తీసుకున్నాడు. ఆ తర్వాత రామ లక్ష్మణుల్ని ఆశీర్వదించి వారంతా నిష్క్రమించారు.

అంతలో సూర్యాస్తమయం అయింది. రాజులకి, వానరులకి వీడ్కోలు చెప్పి రాముడు సంధ్యోపాసన ముగించి అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు. ఈ విధంగా పట్టాభిషిక్తుడైన తర్వాత మొదటిరాత్రి సీతారాములకి ఆనందమయంగా గడచిపోయింది. ప్రాతఃకాలమయ్యే సరికి, వంది మాగధుల మృదు మధుర స్వనాలతో ఆలపిస్తున్న సుప్రభాత గీతములతో ప్రశాంతచిత్తుడై నిద్రలేచాడు శ్రీరాముడు.

పాలనురుగులాంటి హంసతూలికా తల్పము మీద నించి దిగాడు. వెంటనే వేలాది మంది సేవకులు శ్రీరాముని సేవలో బంగారు కలశాలతో నీరు తీసికెళ్ళి

వారి వారి కార్యక్రమాలకుపక్రమించారు.

రాముడు స్నానాదికాలు పూర్తిచేసి శుచియై అగ్నిహోత్రాది కార్యక్రమాలు పూర్తిచేసుకుని, పూజామందిరంలో ప్రవేశించాడు.

దేవతార్చన ముగించి, పితృకార్యక్రమాలు నెరవేర్చి, బ్రాహ్మణులను పూజించి, పరివారంవెంట రాగా, ప్రాకారం బయటకి వెళ్ళాడు.

వశిష్ఠాది పురోహితులు, మంత్రులు, జానపదాల్ని పాలించే అధికారులు, పండితులు, సామంతరాజులు, అంతా వచ్చి, రామునికి ఎదురేగి అక్కడ చేరారు. రాముని తమ్ముళ్లైన భరత, లక్ష్మణ, శతృఘ్నులు కూడా అన్నగార్ని సేవించటానికి వచ్చారు. ఇంకా అనేక మంది సేవకులు మందహాసంతో రాముని చెంత నిలిచారు.

సుగ్రీవుడు, అతడి అనుచరులు, వచ్చి రాముని సన్నిధిలో నిలబడ్డారు. విభీషణుడు, అతడి అనుచరులు కూడా వచ్చారు.

శ్రీరాముడు సభా మంటపంలో ప్రవేశించి సింహాసనాన్ని అధిష్ఠంచగా వచ్చిన వారంతా వారి వారి అర్హతల్ని బట్టి సభలో కొలువుతీరి కూర్చున్నారు. దేవేంద్ర సభలో దేవేంద్రునిలా శ్రీరాముడు సింహాసనంపై అధిష్టించి సభాసదులతో ఇష్టాగోష్టి సల్పి పండితులు నీతి కథలు వినిపించగా వారిని సత్కరించి ప్రజలకష్టసుఖాలు తెల్సుకుని అవసరమైన ఏర్పాట్లు చేస్తు దశరథ మహారాజు అడుగుజాడలలో నడుస్తు పాలన ప్రారంభించాడు. ఈ విధంగా కొన్ని రోజులు గడిచిపోయాయి. శ్రీరాముడు ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ ప్రజానురంజకంగా పరిపాలన చేస్తున్నాడు. రాముడు తన అభిషేకానికి వచ్చిన రాజుల్ని, సామంతుల్ని, రాక్షస వీరుల్ని, వారి ప్రభువైన విభీషణుని, సుగ్రీవుణ్ణి అతని వానర పరివారాన్ని యధోచితంగా సత్కరించి, ఒక్కొక్కర్నే క్రమంగా తమ తమ దేశాలకి పంపేశాడు.

కొంతకాలం సుఖంగా గడిచిపోయింది. ఒకనాడు సీతారాములు నందనవనంలాంటి తమ ఉద్యానవనంలో విహరిస్తున్నారు. వారు ఏకాంతంలో ఎన్నెన్నో విషయాలు చర్చించుకుంటున్నారు. అంతలో వందిమాగధుల మధుర గానాలు వినిపించారు. అదివిన్నాక వారికి రాత్రి నిద్రపోయే సమయమైందని తెలిసింది. వెంటనే వారు తమ అంతఃపురంలోకి వెళ్ళిపోయారు.

ఇంచుమించు ప్రతీరోజు ఇదే దినచర్యగా మారింది. పగలు సభామండపంలో ప్రజల కష్టసుఖాలు తెల్సుకోవటం తమ్ముళ్ళతో, మంత్రులతో సంప్రదించి చెయ్యవలసిన కార్యక్రమం నిర్ణయించుకోవడం, రాత్రి వందిమాగధులు గానాలాలపించేదాకా సాయం సమయాలు సీతతో ఉద్యానవనంలో విహరించటం,

ఇది రాముని దినచర్యగా మారింది.

రోజులు, నెలలు, క్షణాల్లా గడచిపోతున్నాయి. అంతలో వసంతకాలం వచ్చింది. అపుడు సీత గర్భవతి అని రామునికి తెలిసింది. రాముడికి చెప్పలేనంత ఆనందం కలిగింది. సీతని అక్కున చేర్చుకుని, శ్రీరాముడు

"వైదేహీ నాకు పుత్రసంతానాన్ని అనుగ్రహించబోతున్నావు. ఈ ఆనంద సమయంలో గర్భిణి స్త్రీలకి సహజంగా వుండే కోరికలేమైనా వుంటే చెప్పు. సందేహించకు. నీ మనోరథం తీర్చవలసిన ధర్మం నాది" అన్నాడు.

అపుడు సీత మందహాసంతో "స్వామీ, మళ్ళీ ఒకసారి పవిత్రమైన ఆ ముని ఆశ్రమాలు చూసి రావాలని ఉంది. గంగాతీరంలో కందమూలాలు, ఫలములు తింటు, నియమమైన జీవితాన్ని గడుపుతున్న తాపసఆశ్రమాలకి వెళ్ళి, వాళ్ళని సందర్శించి వారితో కొంతకాలం గడిపిరావాలని వుంది. ఇదొక్కటే నా మనస్సులోని కోరిక" అంది.

ఆమె కోరిక విన్న రాముడు తప్పకుండా తీరుస్తానని అన్నాడు. సీతవంక ఆప్యాయంగా చూస్తూ" జానకీ, ఆ విషయంలో నిశ్చింతగా వుండు. మనిమిద్దరం కలసి, రేపేవెళ్ళి ముని ఆశ్రమాలు చూసి వద్దాం. తప్పకుండా వెళ్దాం" అని ప్రేమతో మరోమాట చెప్పి ఆమెని అంతఃపురంలోకి పంపేశాడు. అంతలో తనని చూడటానికి మిత్రులు రాగా అంతఃపురానికీ, ఉద్యానవనానికీ, మధ్యవున్న ఆలోచనా మందిరానికి వెళ్ళాడు వారితో సహా.

రాముడు ఆసనంపై కూర్చోగానే విజయుడు, మధుమత్తుడు, కాశ్యపుడు, మంగళుడు, కులుడు, సురాజి, కాళియుడు, భద్రుడు, దంతవక్త్రుడు, సుమాగధుడు, మొదలైన అతడి మిత్రులంతా చుట్టూ కూర్చున్నారు. వారంతా రామునితో ఎన్నెన్నో విషయాలు చర్చించారు. ఆ తర్వాత రాముడు వారిని రాజ్యంలోని ప్రజలు తనని గురించి ఏమనుకుంటున్నారో చెప్పమన్నాడు. కాని వారేం మాట్లాడలేదు.

రామునికేదో అనుమానం కలిగింది. అప్పుడు భద్రుడు అనే ప్రాణమిత్రుని ఇలాఅడిగాడు. "మిత్రమా నిజం చెప్పు. ప్రస్తుతం మన రాజ్యంలో ప్రజలు ఏ విషయంపై చర్చించుకుంటున్నారు? మన నాగరికులు, నా గురించి గాని, సీత గురించి గాని, భరత శత్రుఘ్నుల గురించి గాని మా పినతల్లి కైకమ్మ గురించి గాని, ఏమనుంటున్నారు? ఆ విషయాలన్నీ నాకు వివరంగా చెప్పు. ఎందుకంటే ప్రభువు ఆచార వ్యవహారాలలో దారితప్పి నడిస్తే ప్రజలదృష్టిలో నిందార్హుడవుతాడు.

కనక ఏ సంగతీ దాచకుండా నిస్సంకోచంగా చెప్పు" అని రాముని మాటలు విన్న భద్రుడు క్షణం తటపటాయించాడు. తర్వాత చేతులు జోడించి

"ప్రభూ మన నాగరికులు మీ గురించి మంచిగానే చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా మీరు దశకంఠుడ్ని సంహరించటం గురించి చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. వారంతా మీ పరాక్రమానికి ఆశ్చర్యపోతున్నారు" అని ఊరుకున్నాడు.

రాముడు భద్రుని మాటలలోని వాస్తవాన్ని నమ్మలేక ఆ విషయం వివరంగా చెప్పవలసిందిగా ఒత్తిడి చేశాడు.

భద్రుడు వినయంగా మళ్ళీ చేతులు జోడించి రాజా మన పౌరులు నాలుగు వీధుల కూడలిలోనూ, అంగడి వీధులలోనూ, రాచబాటల మీద, ఉద్యానవనాల లోనూ, మీ గురించి చెప్పుకునే మాటలివే. తమరు వానరులచేత అగాధమైన వారధి నిర్మింపచెయ్యటం చాలా అద్భుతమైన విషయమని వారు చెప్పుకుంటున్నారు.

వానరుల్ని భల్లూకాల్ని కొంతమంది రాక్షసుల్ని మిత్రులుగా చేసుకుని మీరు అజేయుడైన రావణుని బంధువులతో సహా సంహరించటం పరమాద్భుతమైన విషయమని వారు భావిస్తున్నారు. కాని, ప్రభూ ఒక్క విషయం మాత్రం చాలా బాధాకరంగా వుంది.

అది చెప్పటానికి నా మనస్సు ఒప్పటం లేదు. "రావణుడు సీతమ్మని ఒడిలో కూర్చోబెట్టుకుని లంకకి తీసికెళ్ళాడు. ఆమెని తన విలాస మందిరంలో బంధీగా వుంచాడు. అతడి ఆధీనంలో ఆమె ఒక్క సంవత్సరం వుంది. అయినప్పటికీ రాముడు ఆమెపై ఏ ద్వేషం ఏర్పరచుకోకుండా ఆమె కోసం రావణుని సంహరించి, సీతని వెంటబెట్టుకుని అయోధ్యకివచ్చాడు. సీతపై అనుమానంగాని, క్రోధంగాని రామునికెందుకు కలగలేదు? అతడు రోషము లేనివాడా? అసలు ఆమెతో కాపురం ఎలా చెయ్యగలుగుతున్నాడు?

ఇంకిప్పుడు మన ఇల్లాళ్ళు కూడా దారితప్పి వ్యవహరిస్తే మనం నోరు మూసుకుని పడివుండవలసిందేనా? ఎందుకంటే మన రాజుగారికే లేని నీతి మీకెందుకని వారడగరా?" అని మన నగర వాసులందరూ మాత్రమే గాక, జానపదాల్లోని ప్రజలు సైతం అనేక విధాల చెప్పుకుంటున్నారు ప్రభూ" అని అయిష్టంగానే భద్రుడు తాను విన్న సంగతి రామునికెరిగించాడు.

రాముడు మిగిలిన మిత్రుల వంక చూసి "భద్రుడు చెప్పిన సంగతి నిజమేనా? అని అడిగాడు.

వారంతా దీనంగా తలలు దించుకుని భద్రుడు చెప్పిన విషయం నిజమే అని నిర్ధారించి చెప్పారు. ఆ సంగతి విన్న రాముడు వ్యాకుల చిత్తుడై భారమైన మనస్సుతో వారందర్నీ పంపించేశాడు.

ద్వారపాలకుల్ని పిల్చి భరత, లక్ష్మణ, శతృఘ్నులి వెంటనే పిల్చుకురమ్మని పంపాడు.

వారువెళ్ళి చెప్పిన మరుక్షణం రాముని సోదరులు ముగ్గురు అక్కడికి వచ్చారు. రాముడు తమ్ముళ్ళవంక విషాదభరితమైన నేత్రాలతో చూస్తు,

"రాకుమారులారా, నేనిప్పుడు చెప్పే సంగతి జాగ్రత్తగా విని, బాగా ఆలోచించి నా నిర్ణయం సరియైనది అవునా కాదా అని నిర్ధారించి చెప్పండి" అని వారిని తన దగ్గర కూర్చోబెట్టుకుని పరిస్థితి అంతా వివరించి చెప్పాడు.

"తమ్ములారా మన పౌరులు అన్యాయంగా జానకిపై నింద వేస్తున్నారు. అంతేకాదు. నామీదకూడా వారికసహ్యం కలిగినట్లు తోస్తోంది. వారి తిరస్కారయుతమైన మాటలు విన్నప్పుడు నా మనస్సు ముక్కలైపోయింది.

మనది పేరు పొందిన ఇక్ష్వాకువంశం సీత మహాత్ముడైన జనకుని ఇంట పుట్టింది.

నాయనా సౌమిత్రీ దుష్టుడైన ఆ రావణుడు, నిర్జనారణ్యంలో ఒంటరిగా వున్న సీతనెలా అపహరించుకుపోయాడో నేను ఆ రావణుని ఎలా విధ్వంసం చేశానో నువ్వెరుగుదువు కదా. రాక్షసుల చెరలో వున్న సీతని అయోధ్యకి తీసికెళ్ళటం ఉచితమేనా అనే ఆలోచన నాకప్పుడే కలిగింది.

ఆ సమయంలో సీత తన పవిత్రతని నిరూపించుకుందుకు అగ్నిలో దూకిన సంగతీ సాక్షాత్తు అగ్నిదేవుడే వచ్చి సీత నిర్దోషిత్వాన్ని వెల్లడించి, ఆమెని నా చేతిలో వుంచిన సంగతి నీకు తెలుసు కదా. పంచ భూతాలూ సమస్త దేవతలు, ఇంద్రుడు, బ్రహ్మారుద్రలూ, తరలి వచ్చి సీత శీలవతి అని ధృవీకరించి, ఆమె చెయ్యి నా చేతిలో వుంచి పరిగ్రహించమన్న సంగతి నువ్వు నీ కళ్ళతో చూశావు కదా. నా అంతరాత్మ కూడా సీత పవిత్రమూర్తి అని ఘోసిస్తోంది. కనుకనే నేను మనస్ఫూర్తిగా విశ్వసించి ఆమెని అయోధ్యకి తెచ్చాను.

అయినప్పటికీ ఆమెకి అపవాదురానే వచ్చింది. ఇదంతా చూస్తుంటే నాకు చెప్పలేని దుఃఖం కలుగుతోంది. ఏ ప్రాణి గురించి ఈ లోకంలో అపకీర్తి కలిగి అది అందరిలో చర్చనీయాంశం అవుతుందో ఆ ప్రాణి నరకానికి వెళ్తుందని, ఆ

చర్చ ఈ లోకంలో జరిగినన్నాళ్ళు ఆమె నరకంలో వుంటుందనీ మన శాస్త్రాలు చెప్తున్నాయి. నేను లోకనింద కలిగినప్పుడు మీ ముగ్గుర్ని, ఆఖరికి నా ప్రాణాలైనా సరే వదిలేందుకు సిద్ధంగావున్నాను. అటువంటిది, సీతని పరిత్యజించటం, నాకో లెఖ్కకాదు. మీరంతా ఒకసారి నావంక చూడండి. నేనిప్పుడు శోకసముద్రంలో మునిగివున్నాను. ఇప్పటిదాకా ఇంతటి కష్టం నాకు కలగలేదు. కనక లక్ష్మణా, రేపు తెల్లారకముందే సుమంత్రుని రథం తెమ్మని, సీతని ఆరథంలో తీసికెళ్ళి, మన రాజ్యం అవతల వదిలిరా. గంగానది ఆవలితీరాన, తమసానది ఒడ్డున వాల్మీకి మహాముని ఆశ్రమంవుంది. ఆ ఆశ్రమ సమీపంలో, నిర్జనారణ్యంలో సీతని వదిలి, వెంటనే వెనక్కి వచ్చెయ్యి. ఇది నా ఆజ్ఞ. అతిక్రమించటానికి వీల్లేదు. మీ అందరికీ నా మీద నిజంగా ప్రేమ వుంటే నా మాటకెదురు చెప్పకండి. అలాచెప్తే నా మీద ఆన.

ఇంతకిముందే సీత, గంగాతీరాన వున్న మునిఆశ్రమాలు చూడాలని వుంది అని నాతో చెప్పింది" అని చెప్తుండగానే రాముని కళ్ళవెంట నీళ్ళు నిండి, ఆపై మాటలు రాలేదు. భారంగా నిట్టూరుస్తు వ్యాకులమైన మనస్సుతో, తన మందిరంలోకి వెళ్ళిపోయాడు. అతడి సోదరులు ముగ్గురూ తెల్లబోయి నిలబడ్డారు.

తెల్లారింది. లక్ష్మణునికి అన్నగారి ఆదేశం గుర్తు వచ్చింది. చెప్పలేనంత దుఃఖం కలిగింది. ఎలాగో మనస్సు చిక్కబట్టుకుని సుమంత్రుని రథం పూన్చి తెమ్మని, సీతాదేవి మందిరానికి వెళ్ళాడు. దుఃఖాన్ని లోలోపల దిగమింగి, సీతకి నమస్కారం చేశాడు. "అమ్మా మీరు ముని ఆశ్రమాలు చూడాలని కోరికగా వుందని రామచంద్ర ప్రభువుని అడిగారట. అందుకని మిమ్మల్ని ఆశ్రమానికి తీసికెళ్ళమని, వారు నన్ను పంపారు. మీరు తొందరగా బయల్దేరండి" అన్నాడు. ఆ మాటలకి సీత చాలా ఆనందించింది. వెంటనే గబగబా ప్రయాణానికి సిద్ధపడింది. ఆశ్రమ ప్రాంతంలోని స్త్రీలకి కానుక లివ్వటానికి సీత విలువైన రత్నాలు, ఆభరణాలు, పట్టుబట్టలు అన్నీ సర్దుకుంది. కొంతధనం కూడా తీసుకుంది.

"లక్ష్మణా ఇవన్నీ నేను మునిపత్నులకి, కానుకగా ఇస్తానయ్యా" అంది సంబరంగా.

ఆమె అమాయకత్వానికి లక్ష్మణునికి చాలా దుఃఖం వచ్చింది. కాని వ్యాకులతపైకి కనబడనివ్వకుండా "మంచిదమ్మా అలాగే ఇవ్వండి" అన్నాడు. సీతని రథం ఎక్కమని, తను కూడా ఎక్కి సుమంత్రుని గంగా తీరానికి పోనివ్వమన్నాడు.

సీతకి కుడికన్ను అదిరింది. ఆమె మనస్సంతా చెప్పలేని అశాంతితో నిండింది. కారణం తెలియక ఆమె చాలా బాధపడింది. రథం గోమతీతీరానికి వెళ్ళేసరికి రాత్రి అయింది. ఆ రాత్రికి వారక్కడి ఆశ్రమంలో గడిపారు. తెల్లారగానే మళ్ళీ ప్రయాణమయ్యారు. సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి, వారు గంగాతీరానికి చేరుకున్నారు. రథం దిగారు.

లక్ష్మణుడు ఇంక దుఃఖం ఆపుకోలేకపోయాడు పెద్దగా ఏడ్చేశాడు. అదిచూసి సీత చాలా ఆశ్చర్యపడింది. "లక్ష్మణా నా చిరకాల వాంఛ తీరబోతున్న ఈ శుభ సమయంలో ఎందుకయ్యా అలా రోదిస్తున్నావు? రెండురోజులు మీ అన్నగార్ని వదిలి వుండలేకేనా అంతబాధ? నాకు మాత్రం మీ అన్నగారి మీద ప్రేమలేదా? పసితనం చాలులే. ఇంక గంగని దాటుదాం పద. వాళ్ళకి కానుకలు సమర్పించి వెంటనే వెళ్ళిపోదాంలే. బెంగపడకు. ఈ ఒక్కరాత్రి అక్కడుందాం. ధైర్యంగా వుండు" అంటూ మందలిస్తూ, బుజ్జగిస్తూ లేచింది. లక్ష్మణుడు కళ్ళు తుడుచుకుని దుఃఖం దిగమించి నావికున్ని పిల్చి గంగానదిని దాటటానికి అందమైన నావని తెమ్మన్నాడు. ఆ నావలో ప్రయాణం చేసి, సుమంత్రుని రథంతో బాటు అక్కడే వుండమని చెప్పి, లక్ష్మణుడు సీత గంగానది ఆవలి తీరం చేరారు.

నావ దిగి తీరం చేరగానే లక్ష్మణుడుని దుఃఖం కట్టలు తెంచుకుంది. నీళ్ళు కారుతున్న కళ్ళుకి చేతులు అడ్డంపెట్టుకుని దీనమైన స్వరంతో "విదేహ రాజకుమారీ, రఘునాథుడు లోకులు నిందించే ఈ పనినాకే ఎందుకు చెప్పాడా అని నామనస్సు సూదులు గుచ్చినట్లు బాధపడ్తోందమ్మా. నా అన్నగారి నిర్ణయం నీకు చెప్పకముందే నాకు మృత్యువు వస్తే ఎంతో అదృష్టవంతుణ్ణవుతాను. కాని ఆ భాగ్యం నాకెక్కడిది తల్లీ. నేను బ్రతికినంతకాలం ఈ నింద మొయ్యవలసిందే. అమ్మా ఈ దోషం నాది కాదు మన్నించు" అంటూ నేలమీదపడి పొర్లి పొర్లి ఏడవసాగాడు.

సీతకి అంతా అయోమయంగా వుంది. ఆరాటంతో ఆమె మనస్సు తల్లడిల్లిపోయింది. "నాయనా లక్ష్మణా, ఏం జరిగిందయ్యా? నీ అన్నగారు కుశలమే కదా. నా మనస్సు నిలవటం లేదు. వారి మీద ప్రమాణం చేసి ఉన్నది ఉన్నట్లు చెప్పు. నా సంతాపం చల్లార్చు తండ్రీ" అంటూ లక్ష్మణుని పరి పరి విధాల అడిగింది.

లక్ష్మణుడు దుఃఖంతో నేల చూపులు చూస్తూ గద్గద స్వరంతో ఇలా అన్నాడు.

"జానకీ దేవీ, మన రాజ్యంలో అంతటా జానపదులు, అయోధ్యలోని పౌరులు,

మీ విషయంలో అత్యంత భయంకరమైన అపవాదు వేశారు. మిత్రుల ద్వారా ఆ సంగతి రామ చంద్రప్రభువుకి తెలిసింది. ఆయన చాలా వ్యాకులం చెందారు. ఆ సంగతి నాకు చెప్పి ఈ పనికి నన్ను ఆదేశించారు. అమ్మా ఆ అపవాదు నా నోటితో చెప్పలేను. దయవుంచి ఆ విషయం చెప్పమని నన్ను ఒత్తిడి చెయ్యవద్దు" అన్నాడు.

అమ్మా మీరు పవిత్రమూర్తి అనీ మీలో ఏ దోషం లేదు అనీ నాకు తెలుసు. ప్రభువుకి కూడా తెలుసు. అయినప్పటికీ లోకనిందకి భయపడి ఆయన నిన్ను పరిత్యజిస్తున్నాడు. కాని ఆయన మానసికంగా ఖేదం పొంది కుమిలిపోతున్నాడు. మీరు ఆశ్రమవాసాలు సందర్శించాలని వుందని మీ కోరిక తెలిపారట. మహారాజు కూడా నన్నలాగే ఆదేశించారు. వారి ఆదేశం ప్రకారం నేను మిమ్మల్ని ఇక్కడ వదిలేసి వెళ్ళిపోతున్నాను. ఇందులో నా ప్రమేయం ఎంతమాత్రం లేదు" అని గద్గద స్వరంతో లక్ష్మణుడు చెప్తుంటే జానకి నెత్తిమీద పిడుగుపడ్డట్టు అయింది. మొదలు నరికిన తరువులా నేలమీద పడిపోయింది. కన్నీటితో దీనంగా,

"లక్ష్మణా ఆ విధి నన్ను కేవలం కష్టాలు పడటానికె పుట్టించాడయ్యా. నేను క్రిందటి జన్మలో ఏం పాపం చేశానో? ఏ భార్యా భర్తల్ని విడదీశానో. అందుకే ధర్మవర్తనుడై వుండి కూడా రాముడు నన్నిలా పరిత్యజించాడు. సౌమిత్రీ, ఇది వరకు పధ్నాలుగు సంవత్సరాలు వనవాస కష్టాలు అనుభవించినప్పటికీ రాముడు తోడుగా వుండటం వల్ల నాకు బాధ అనుభవించినట్లేలేదు. కాని ఇప్పుడు ఒంటరిదాన్నై బంధువులందరికీ దూరమై ఈ ఆశ్రమాల్లో ఎలా జీవించనయ్యా? నీ భర్త ఎందుకు నిన్ను పరిత్యజించాడని వీరంతా అడిగితే ఏం చెప్పను? అయ్యో ఈ గంగానదిలో దూకి ప్రాణత్యాగం చేద్దామన్నా వీలుకాకుండా నా ప్రభువు యొక్క వంశాంకురం నా గర్భంలో మోస్తున్నానే. వారివంశాన్ని నాశనం చేసే హక్కు నాకెక్కడిది? కాని నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చితీరాలి కదా. నన్నిలా వదిలేసి నువ్వు వెంటనే వెళ్ళిపో నాయనా.

అయితే నా సందేశం మాత్రం మన వాళ్ళకి తెలియజెయ్యి. లక్ష్మణా ముందుగా అత్తలకి నా ప్రణామాలు చెప్పు. నీ ప్రభువుల పాదాలకి తలవంచి నమస్కరించానని చెప్పు. వారిని కుశలమడిగానని చెప్పు. అంతఃపుర స్త్రీలకి నా వందనాలు చెప్పు. రఘునందనా సీత ఎంత పునీతురాలో నీకు తెలుసు. ఆమె సదా నీ మేలు కోరుతుందనీ, నీ మీదే భక్తి, ప్రేమ కూడా కలిగి వుంటుందనీ కూడా నీకు తెలుసు. కేవలం అపఖ్యాతికి భయపడి మీరు ఆమెని పరిత్యజించారు. కాని ఆ విషయం మీరే స్వయంగా నాకుచెప్తే నేను మిమ్మల్ని తిరస్కరిస్తాననుకున్నారా?

మీ అభిప్రాయం గౌరవించటమే నా కర్తవ్యం. మీరెప్పుడూ ఇలాగే ధర్మమార్గాన నడుస్తూ మీ ప్రజలతో సత్సంబంధాలు కలిగి వుండాలని నా కోరిక. అదే మీకు గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టుంది.

పురుషోత్తమా నా ఈ శరీరం కోసం నేను ఎప్పుడూ బాధపడలేదు. మీకు నిష్కళంకమైన యశస్సు కలగాలని మాత్రమే వాంఛిస్తున్నాను. మీకీర్తి ఇలాగే కాపాడుకోండి. మీ భార్యగా నేను కోరుకునేది ఇదే" అని నా మాటగా శ్రీరామునికి చెప్పు లక్ష్మణా, గర్భవతియైన నీ వదినని కన్నులారా చూసి మరీ వెళ్ళు" అని సీత చెప్తుంటే లక్ష్మణునికి చెప్పరాని దుఃఖం కలిగింది. గట్టిగా ఏడుస్తు ఆమెకి ప్రదక్షిణం చేసి

"అమ్మా అలా అనటం ఉచితం కాదు. నేను మీ పాద పద్మాలు తప్పమిమ్మెన్నడూ చూడలేదు. ఇది పరమ పవిత్రమైన తపోవనం. ఇక్కడ మనకి అత్యంత ఆప్తుడైన వాల్మీకి మహాముని నివశిస్తున్నాడు. మీరు ఆయన ఆశ్రమంలో సుఖంగా వుండండి. ఇక్కడ నిశ్చింతగా ఏకాగ్రచిత్తంతో వుండి, సదా శ్రీరాముని ధ్యానిస్తూ పతివ్రతాధర్మంతో వుండటం వల్ల మీకు మేలు కల్గుతుంది. మరి నాకు సెలవు" అంటూ దుఃఖంతో నిట్టూర్పులు వదుల్తూ గంగానది దాటి తీరం చేరి రథం ఎక్కాడు. సీత ఏడుస్తూ కుప్పకూలిపోయింది. ఆమెకి లోకమంతా అంధకారమయమైంది. దిక్కుతోచక, అనాధ అయి ఆమె భోరున ఏడవ సాగింది. ఆమె అలా ఏడవటం ఆ సమీపంలో ఆడుకుంటున్న ముని బాలురు కొందరు చూశారు.

వెంటనే పరుగు పరుగున ఆశ్రమానికి వెళ్ళి వాల్మీకి మహామునితో ఆ సంగతి చెప్పారు. వాల్మీకి మహాముని తన దివ్యదృష్టితో జరిగిన సంగతి అంతా తెలుసుకున్నాడు. వెంటనే బయల్దేరి సీతమ్మ దగ్గరకి వెళ్ళాడు. ఆయన వెంట శిష్యులు కూడా వెళ్ళారు. శోకార్తురాలై వున్న సీతని ఊరడిస్తూ ఆ మహాముని "అమ్మా దశరథ మహారాజు కోడలివి. శ్రీరామచంద్రుని ఇల్లాలివి. జనక మహారాజు కుమార్తెవి. మహాపతివ్రతా శిరోమణివి. జానకీ దేవీ నీకు స్వాగతం తల్లీ. నీ వృత్తాంతమంతా నేను దివ్యదృష్టితో తెలుసుకున్నాను. నీ గురించి కూడా నాకు బాగా తెలుసు. నువ్వు నిష్కళంకితవి. నీకేం భయం లేదమ్మా. నువ్వు నిశ్చింతగా నా ఆశ్రమంలో వుండవచ్చు. చింతించకు" అన్నాడు.

మహర్షి మాటలు విన్న సీత ఆశ్చర్యపోయింది. ఆయన పాదాలపై శిరస్సు నుంచి నమస్కరించి, ఆయన వెంట బయల్దేరింది. ఆశ్రమంలో అడుగు పెట్టిన సీతని ముని పత్నులు చూశారు. వాల్మీకి మహామునికి, సీతకి స్వాగతం పలికారు.

వాల్మీకి మహాముని వారితో "సౌభాగ్యవతులారా ఆమె సీత. ధర్మవర్తనుడైన శ్రీరామచంద్రుని ఇల్లాలు. దశరథ మహారాజు కోడలు. పరమపవిత్రురాలు. విధి వశాత్తు భర్తచేత పరిత్యజించబడింది. ఇకపై ఈమె సంరక్షణాభారం మనది. మీరంతా సౌహార్ద్ర భావంతో ఆమెకి పరిచర్యలు చెయ్యండి. ఈమెని చాలా ఆదరంగా చూడాలి సుమా. మీరంతా నన్నెంతగా గౌరవిస్తున్నారో ఈమెని కూడా అంతగౌరవంగా చూడాలి' అని పదేపదే జాగ్రత్తలు చెప్పి మునిపత్నులకి సీతని అప్పగించి వాల్మీకి తన ఆశ్రమంలోకి వెళ్ళిపోయాడు.

ఇక్కడ సీతని గంగని ఈవలి ఒడ్డున వదిలి ఆవలి ఒడ్డు చేరిన లక్ష్మణుడు దుఃఖం ఆపుకోలేక సుమంత్రునితో "సూతా చూశావు కదా. శ్రీరామునికి, సీతమ్మకి మళ్ళీ వియోగం దాపురించింది. విధి అనుల్లంఘనీయమైనది కదా. ఇంక వారిద్దరికీ శాశ్వతమైన వియోగం కలిగింది. కేవలం పౌరుల మాటలు పట్టించుకుని రామచంద్ర ప్రభువిలా చెయ్యటం నాకుదారుణం అనిపిస్తోంది. ఇది ధర్మమార్గమే అంటావా. మా వంశానికి అపఖ్యాతి కలిగించే ఈ నిర్ణయం రాముడెందుకు తీసుకోవాల్సి వచ్చిందో నాకవగతం కావటం లేదు" అంటూ భోరున ఏడ్చాడు.

లక్ష్మణుని మాటలు విన్న సుమంత్రుడు బాగా ఆలోచించి ఇలా అన్నాడు.

"రా కుమారా జానకీ దేవి విషయంలో మీరు బాధపడి &రపయోజనం లేదు. మీ తండ్రిగారు జీవించినప్పుడు జరిగిన ఒక విషయం చెప్తాను వినండి. ఒకనాడు దుర్వాస మహాముని మీ తండ్రితో రాముని జాతకం ప్రకారం అతడు చాలాకష్టాలు పడవలసి వుందనీ, ఆయన కత్యంత ఆప్తులైన వారితో వియోగం సంభవిస్తుందనీ కాలక్రమంలో జానకీతోటీ, మీ అన్నదమ్ములతోటీ కూడా వియోగం కలగవచ్చనీ చెప్పారు. ఈ సంగతి మేము కూడా విన్నాము. కాని ఎవ్వరికీ చెప్పద్దని మీ తండ్రి ఆదేశించినందువల్ల మేము ముందుగా మీకు చెప్పలేకపోయాము.

పురుషోత్తమా ఇప్పుడు నీ మనస్సులోని ఆవేదన చూసి తట్టుకోలేక మహారాజుగారి ఆజ్ఞని ఉల్లంఘించి చెప్తున్నాను. నువ్వు మాత్రం ఈ సంగతి రామునికి గాని, భరత, శత్రుఘ్నులకి గాని చెప్పొద్దు. విధి బలీయమైందని తెలియజెయ్యటానికే చెప్పాను. ఇంకో సంగతి కూడా చెప్తాను. విను. దుర్వాస మహాముని చెప్పిన సంగతే ఇది. పూర్వం దేవాసుర సంగ్రామం జరిగినప్పుడు దైత్యులు దేవతల చేత ఓడింపబడి భృగుమహర్షి యొక్క ధర్మపత్నిని శరణు

కోరారు. వారి కభయమిచ్చి ఆమెవారికి తన ఆశ్రమంలో ఆశ్రయం ఇచ్చింది. అది చూసి విష్ణుమూర్తికి కోపం వచ్చింది. ఆగ్రహంతో చక్రం ప్రయోగించి ఆమె శిరస్సు ఖండించాడు. తన భార్యనలా సంహారించేసరికి భృగుమహర్షి ఆగ్రహం పట్టలేక విష్ణువుని కూడా మానవునిగా భూమిపై అవతరించి భార్యావియోగం పొందమని శపించాడు.

ఆ తర్వాతకాలంలో ఆ మహావిష్ణువే శ్రీరాముడిగా అవతరించాడు. ఇలా భార్యా వియోగం పొందాడు. ఇది దుర్వాసుడు చెప్పిన సంగతి. భార్యా వియోగం పొందినప్పటికీ రాముడు చాలా వేల సంవత్సరాలు ఈ భూమిని పాలిస్తాడనీ, ఎన్నెన్నో యాగాలు చేస్తాడనీ, అశ్వమేధం కూడా చేస్తాడనీ, జానకి వల్ల రామునికి ఇద్దరుకుమారులు కలుగుతారనీ కూడా చెప్పాడు. ఈ సంగతులన్నీ చాలా రహస్యమైనవి. ఎవ్వరకీ చెప్పకు. విధి సంకల్పం అలా వుంది. కనుక సీతమ్మ గురించి వగచి ప్రయోజనం లేదు" అని రాముని గురించి తనకి తెలిసిన సంగతి సుమంత్రుడు లక్ష్మణునికి చెప్పాడు. ఆ మాటలు విన్న లక్ష్మణుడు కొంత ఊరట పొందాడు.

ఆ తర్వాత వారు మర్నాడు మధ్యాహ్న సమయానికి అయోధ్యకి చేరారు. దుఃఖసాగరంలో మునిగివున్న శ్రీరామునికి పాదాభివందనం చేసి నిలబడ్డాడు లక్ష్మణుడు. ఇద్దరూ కన్నీరు కార్చుతుండగా ఒకరినొకరు ఓదార్చుకున్నారు. ఎలాగో గొంతుపెకిలించుకుని తాను సీతని వాల్మీకి మహాముని ఆశ్రమం దగ్గర వదిలి వచ్చిన సంగతి చెప్పాడు లక్ష్మణుడు. ఆ సంగతి విన్న రాముడు భోరున ఏడ్చాడు.

కాలక్రమంలోగుండె రాయి చేసుకుని యధాప్రకారం రాజ్యపాలన సాగించాడు రాఘవుడు. కొంతకాలం గడిచింది.

లవణాసురుడు అనే రాక్షసుడు పరమేశ్వరునిచే ప్రసాదంచబడ్డ అమోఘమైన శూలం తండ్రి నుంచిపొంది చాలా అకృత్యాలు చేస్తూ మునుల్ని తాపసుల్నీ హింసిస్తున్నాడన్న సంగతి చ్యవన మహర్షి వల్ల తెలుసుకుని ఆ రాక్షసుని సంహారించి రావాల్సిందిగా శ్రీరాముడు శత్రుఘ్నుని పంపాడు. లవణాసురుని రాజ్యమైన మధురానగరానకి ఒక అమోఘమైన బాణం ఇచ్చి, శత్రుఘ్నుని పంపుతూ అతడ్ని ముందే ఆ రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

ఒక నెలరోజులపాటు ఆ లవణాసూరుడ్ని చంపటానికి తగిన బలాలు సంరంభాలు సమకూర్చుకుని తల్లులకి శ్రీరామునికీ అన్నలకీ పండితులకీ పురోహితులకి నమస్కరించి వారి ఆశీర్వచనాలు స్వీకరించి బయల్దేరాడు

శత్రుఘ్నుడు సైన్యంతో సహా రెండ్రోజులు ప్రయాణం చేసి మూడో రోజు వాల్మీకి ఆశ్రమం చేరుకున్నాడు. ఆయన ఆతిథ్యం పొంది ఆ రాత్రిసేనతో సహా ఆ ఆశ్రయంలో విశ్రమించాడు.

ఆ రాత్రే సీతకి వాల్మీకిఆశ్రమంలో కవల పిల్లలు మగ శిశువులు జన్మించారు. అర్ధరాత్రి సమయంలో మునిబాలురు వచ్చి వాల్మీకిని నిద్రలేపి ఆ సంగతి చెప్పారు.

వాల్మీకి బ్రహ్మానందం పొంది వారిని చూడటానికి వెళ్ళాడు. చంద్రకాంతితో మెరిసిపోతున్న ఆ మగపిల్లలిద్దర్నీ సీతమ్మ పక్కలో చూశాడు. రెండుదర్భలు మంత్రించి వారిద్దరికీ రక్షరేకులుగా చేతికి కట్టాడు. శాంతికర్మలు చేయించి వారిద్దరికీ కుశలవులు అని నామకరణం చేశాడు.

శత్రుఘ్నునికి కూడా సీతమ్మ కవలపిల్లల్ని కన్న విషయం తెలిసింది. శత్రుఘ్నుడు చాలా ఆనందించి సీత దగ్గరకి వెళ్ళి చిన్నారుల్ని చూసి "అమ్మా చాలా శుభవార్త తెలిసింది" అన్నాడు. చేతులు జోడించి ఆ తర్వాత బయల్దేరి ఏడురోజులు ప్రయాణం చేసి చ్యవన మహర్షి ఆశ్రమం చేరుకున్నాడు. ఆ మహర్షి వలన లవణాసురుని దినచర్య అలవాట్లు తెలుసుకున్నాడు. శూలం ధరించకుండా అడవులలో తిరుగుతున్న సమయం కనిపెట్టి లవణాసూరుడ్ని ఎదుర్కొని అతడితో హోరా హోరీ యుద్ధం చేశాడు. రాముడు ఇచ్చిన అమోఘమైన బాణంతో ఆ లవణాసూరుడ్ని వధించాడు శత్రుఘ్నుడు.

వాడలా చావగానే మునులు, తాపసులు సంతోషించి శత్రుఘ్నుని కొనియాడారు. దేవతలు అతడ్ని మెచ్చుకుని ఆ మధురానగరాన్ని అందమైన పట్టణంగా తీర్చిదిద్ది అతడికి కానుకగా ఇచ్చారు. ఇదంతా అయ్యేసరికి పన్నెండు సంవత్సరాలు పట్టింది.

ఆ తర్వాత శత్రుఘ్నుడు రాముడ్ని తన పరివారాన్ని చూడటానికి అయోధ్యకి బయల్దేరాడు. తిరుగుప్రయాణంలోమళ్ళీ వాల్మీకి ముని ఆశ్రమానికి వచ్చాడు. వాల్మీకి లవణాసుడ్ని వధించినందుకు అతడ్ని చాలా ప్రశంసించి అతిధి మర్యాదలు చేశాడు. సరిగ్గా భోజనం చెయ్యబోతూ వుండగా మృదుమధురమైన స్వరంతో రామకథా గానం వినవచ్చిందతడికి.

ఆ గానం లయబద్ధంగా ఛందోబద్ధమై సుస్వరాలతో రాగతాళయుక్తంగా సంస్కృత భాషలో రచింపబడి వుంది. ఆ గానం యధాతధంగా శ్రీరాముని చరిత్రని తెలియజేస్తోంది. ఆ అద్భుత గానం వినగానే శత్రుఘ్నునికి కళ్ళనిండా

నీళ్ళు వచ్చాయి. శత్రుఘ్నుని పరివారం కూడా ఆ గానానికి పరవశులై "ప్రభూ ఈ గానం చేస్తున్నదెవరో మహామునిని అడిగి తెలుసుకుందామా" అని అడిగారు.

కాని శత్రుఘ్నుడు వారిని వారిస్తూ "మున్యాశ్రమాలలో ఇలాంటి వింతలెన్నో జరుగుతుంటాయి. మనబోటి వాళ్ళం వారిని ప్రశ్నించటం అనుచితం" అన్నాడు. ఆ తర్వాత వారంతా అయోధ్యకి సాగిపోయారు. శత్రుఘ్నుడు అయోధ్య చేరి తన విజయం వృత్తాంతమంతా రామునికి చెప్పి తల్లులతోటీ, అన్నలతోటీ పరివారం తోటీ ఒక వారంరోజులు ఆనందంగా గడిపి మళ్ళీ మధురానగరానికి వెళ్ళిపోయాడు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఒక వంక సీతా వియోగ దుఃఖంతో బాధపడ్తూనే కర్తవ్య నిర్వహణలోఎటువంటి ఉపేక్షాలేకుండానే ఎప్పటికప్పుడు ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ వారి సమస్యలు తీరుస్తూ ప్రజాను రంజకంగా పరిపాలన సాగిస్తున్నాడు.

శత్రుఘ్నుడు మధురాపురికి వెళ్ళిన కొంతకాలానికి రాముడు తన సోదరులైన భరతుడ్నీ, లక్ష్మణుడ్నీ పిలిచి తనకి రాజసూయ యాగం చెయ్యాలని కోరికగా వుందని వారి అభిప్రాయం తెలుపమనీ అడిగాడు.

భరతుడు అందుకు అభ్యంతరం చెప్తూ "మహారాజా రాజవంశీయులందరికీ వినాశము కలిగించే రాజసూయయాగం చెయ్యటం వల్ల మీకు అపఖ్యాతి కలుగుతుంది. మీ బోటి మహాత్ములకి అది అంత సబబు కాదేమో ఆలోచించుకోండి" అన్నాడు. "రాజసూయయాగం కన్నా అశ్వమేధయాగం చేస్తే బాగుంటుందేమో" అని లక్ష్మణుడన్నాడు.

రాముడికి ఆ ఆలోచన బాగానచ్చింది వెంటనే అశ్వమేధయాగానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చెయ్యవలసిందిగా వారినాదేశించాడు. లక్ష్మణుడు వెంటనే పురోహితులందర్నీ రప్పించాడు. రాముడు అశ్వమేధ యాగం చెయ్యటానికి సంకల్పించిన విషయం వారికి చెప్పాడు. వారంతా చాలా సంతోషించారు. వారు ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాముని ఆజ్ఞమీద సుగ్రీవునికీ, విభీషణునికీ, సామంత్రులకీ, పండితులకీ, అందరికీ ఆహ్వానాలు పంపారు. నైమిశారణ్యంలో యజ్ఞవేదికల్నీ ఏర్పాటు చేశారు. ఆహూతులందరికీ సుఖంగా కూర్చుని యజ్ఞం చూడటానికి తగిన వసతి కల్పించారు. వచ్చిన కోట్లాది మందికి షడ్రసోపేతమైన భోజనాలు పెట్టడానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశారు. బస్తాలకొద్దీ బంగారు, వెండి నాణాలు తెప్పించారు. విశ్రాంతి గృహాలు కట్టించారు. అమూల్యమైన వస్త్రాలు

తెప్పించారు.

రాముని ప్రక్కన కూర్చునేందుకు వీలుగా సీత యొక్క బంగారు విగ్రహం తయారు చెయ్యబడింది. ఏర్పాట్లన్నీ చాలా పటిష్టంగా చెయ్యబడ్డాయి. అరణ్యాలలోతపోవనాలలో నివసిస్తున్న మునులకి ఋషులకి ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.

ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక శ్రీరాముడు అన్ని ఉత్తమ లక్షణాలు కలిగిన నల్లని జాతి అశ్వాన్ని వదిలిపెట్టి దాని వెంట ఋత్విక్కులనూ లక్ష్మణుడ్ని పంపించాడు. ఆ తర్వాత నైమిశారణ్యంలో ప్రవేసించి అక్కడ అద్భుతంగా నిర్మించబడిన యజ్ఞ వాటికని చూసి బ్రహ్మానందపడ్డాడు.

దేశ విదేశాల నించీ వచ్చి మహారాజులందరూ శ్రీరామునికి అనేక విధాలైన కానుకలు తెచ్చారు. వారినందర్నీ యధోచితంగా సత్కరించేభారం భరతుడికి శతృఘ్నుడికీ అప్పగించాడు. తాపసులు ఋషులు, మునులు మొదలైన వార్ని సత్కరించే భారం విభీషణునికి అతడి అనుచరులకి అప్పగించాడు.

అతిధి అభ్యాగతులకి సంతృప్తిగా విందు భోజనాలు పెట్టారు. యాజకులకి అమూల్యమైన వజ్రాలు, రత్నాలు, బంగారు ఆభరణాలు, వస్త్రాలు, దానం చేశారు. వచ్చిన వారందరికీ వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేవారు. ఎవరి నోట విన్నా ఇంతటి అపూర్వమైన యజ్ఞం ఎక్కడా చూడలేదన్నమాటలే వినిపించాయి. ఈ విధంగా ఒక సంవత్సరంపైగా ఆ యజ్ఞం జరిగింది.

ఆహుతులందరితో పాటు వాల్మీకి మహాముని కూడా తన శిష్యులతో ఆయజ్ఞాన్ని చూడటానికి వచ్చాడు. తాపసుల కోసం ఏర్పాటు చెయ్యబడ్డ విశ్రాంతి గృహంలో దిగితమ కోసం ప్రత్యేకంగా నిర్ణయించబడ్డ విడిది గృహంలో ఆయన బసచేశాడు.

కొంతసేపదరీరాక ఆయన తనప్రియశిష్యులైన సీతాదేవి కుమారులిద్దర్నీ పిల్చి

"నాయనలారా మీరు మీ తంబూరాలు మీటుతూ చక్కని స్వరాలుపలికించి మీకు నేను ఉపదేశించిన రామాయణ మహాకావ్యాన్ని సుస్వరమైన రాగంతో ఆలపించి గానం చెయ్యండి. అన్ని వీధులు తిరుగుతూ యజ్ఞస్థలంలోని అన్ని ప్రాంతాల్లో కూడా తిరిగి గానం చేస్తూ శ్రీరామ చంద్రప్రభువుకి వినపడేలా గానం చెయ్యండి.

ఎవరైనా కానుకలు, ధనం ఇస్తే తీసుకోకండి. మహారాజు మనకి ప్రభువు. తండ్రివంటివాడు. ఆయన మనసుకి కష్టం కలిగించేలా ప్రవర్తించకండి. ప్రతీ రోజూ ఇరవై సర్గల వంతున గానం చెయ్యండి" అని వారికనేక జాగ్రత్తలు చెప్పి పంపాడు. మునీంద్రుని మాటలు శ్రద్ధగా విని, మర్నాడుదయమే వారు వాల్మీకి మహర్షికి పాదాభివందనం చేసి బయల్దేరారు. వెళ్ళబోతున్న వారితో వాల్మీకి "కుమారులారా ఎవరైనా మీ తల్లి తండ్రుల గురించి ప్రశ్నిస్తే వాల్మీకి మహాముని శిష్యులమని మాత్రం చెప్పండి" అన్నాడు.

ఆ బాలురిద్దరూ అయోధ్యలోని అనేక ప్రాంతాలలో తిరుగుతూ మృదు మధురంగా కథాగానం చేశారు. తంత్రీలయ సమన్వితమైన ఆగానాన్ని శ్రీరాముడు విన్నాడు. ఆగాన మాధుర్యానికి అబ్బురపడ్డాడు. ఆ బాలుర్నిద్దర్నీ సభా మంటపానికి పిలిపించాడు.

సభాసదులందరూ ఆనందంగా చూస్తుండగా, సభ మధ్యలో నిలబడి వారు శ్రావ్యంగా రామాయణాన్ని గానం చేశారు. అలౌకికమైన ఆ గానానికి సభాసదులంతా ముగ్ధులైపోయారు. ఆ బాలురిద్దరిలో సీతారాముల పోలికలు కనిపించటం చూసి సభికులంతా ఆశ్చర్యపోయారు. వారలా అనుకుంటుండగా ఆనాడు గానం చెయ్యవలసిన ఇరవై సర్గలూ పూర్తయ్యాయి.

మైమరచివింటున్న రాముడు కథాగానం ఆగిపోవటంతో ఈ లోకంలోకి వచ్చాడు. భరతుడ్ని పిల్చి ఆ బాలురిద్దరికీ పద్దెనిమిది వేల బంగారు నాణాలు బహుమతిగా ఇవ్వమన్నాడు. భరతుడు అలాగే అనివారికి బంగారు నాణాలు ఇవ్వబోగా వారు స్వీకరించలేదు.

మృదువైన స్వరాలతో "ఆర్యా అడవులలో నివశిస్తూ కందమూలాలు, ఫలాలు మాత్రం ఆహారంగా తినే మాకు ఈ వెండి బంగారాలెందుకు?" అని తిరస్కరించారు.

వారి మాటలు విన్న సభికులు, రాముడు ఆశ్చర్యపోయారు. రాముడు ఆ బాలుర దగ్గరకి వచ్చి "చిరంజీవులారా ఈ రామాయణ కథాగానం ఎక్కడ నేర్చుకున్నారు? ఇందులో ఎన్ని శ్లోకాలున్నాయి? దీనినెవరురచించారు? ఆ మహా పురుషుడెక్కడున్నాడు? అని అడిగాడు.

దానికా బాలురిద్దరూ చేతులు జోడించి "ప్రభూ ఈ మహాకావ్యాన్ని వాల్మీకి ముని రచించి, స్వయంగా వారే మాకు నేర్పారు. ఆ మహనీయుడిపుడు యజ్ఞం

దర్శించటానికి వచ్చి ఇక్కడే వున్నారు" అని చెప్పారు.

ఈ కావ్యంలో ఇరువది నాల్గువేల శ్లోకాలున్నాయి. ఒక వంద ఉపాఖ్యానాలున్నాయి. ఇవన్నీ వాల్మీకి రచించినవే. మొత్తం కావ్యం ఐదువందలసర్గలుగా ఆరు కాండలుగా విభజించి వ్రాశారు. మహారాజా తమరి చరిత్ర ఆధారంగానే మాగురువుగారీ కావ్యం రచించారు. ఇందులో మీ జీవిత చరిత్రకి సంబంధించిన ప్రతి అంశం చాలా సుందరంగా వివరంగా వ్రాయబడింది. ప్రభూ మొత్తం కావ్యం వినాలని మీకు కోరికగా వుంటే ఈ యజ్ఞం పరిసమాప్తి అయ్యాక ప్రతీ రోజూ కొంత సమయం ఈ కావ్యశ్రవణానికి వినియోగించండి. మేము మా భాగ్యంగా భావించి గానం చేస్తాము" అన్నారు.

శ్రీరాముడు పరమానందంతో "మంచిది నాయనా. అలాగే వింటాను" అన్నాడు. వారిద్దరూ రాముని దగ్గర సెలవు తీసుకుని వాల్మీకి మహాముని దగ్గరకి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత చాలా రోజులు ఆ బాలురిద్దరూ రాముని సమక్షంలో రామాయణ కావ్యగానం చేశారు. కొన్ని రోజులయ్యేసరికి లవకుశులిద్దరూ సీతాదేవి కుమారులని రామునికి తెలిసిపోయింది.

వెంటనే రాముడు దూతల్ని పిల్చి వాల్మీకి మహామునిని పిల్చుకురమ్మని పంపాడు. వారితో ఆ మహామునికిలా కబురు చేశాడు.

మహామునీ సీత చరిత్ర పరిశుద్ధమైనదైతే ఆమెలో ఏ కళంకమూ లేకపోయినట్లైతే ఆమెనిక్కడికి వచ్చి నిండుసభలో తన పవిత్రతని నిరూపించుకోవలసిందిగా నేనాదిశించానని ఆమెకి చెప్పండి" అని మునికి చెప్పి ఆ మునీంద్రుని, సీతవి అభిప్రాయాలు విడివిడిగా తెలుసుకురమ్మని వచ్చి తనకి చెప్పమని దూతలనాదేశించాడు.

ఆ దూతలిద్దరూ వాల్మీకి ముని దగ్గరకి వెళ్ళారు. రాముడు చెప్పిన విషయాలు నివేదించారు.

వారి మాటలన్నీ విని వాల్మీకి మహాముని ఇలాగన్నాడు.

"మేము తప్పకుండా రేపు వస్తామని మహారాజుతో చెప్పండి. స్త్రీలకి భర్తకి మించిన దైవం లేదు కదా" అన్నాడు.

దూతలు రాముని దగ్గరకి వెళ్లి ఆ సంగతి చెప్పారు. రాముడా మాటలు విని చాలా సంతోషించాడు.

తెల్లారింది ప్రాంతఃకాల కార్యక్రమాలు పూర్తిచేసుకుని శ్రీరాముడు యజ్ఞస్థలంలో ప్రవేశించాడు. ఋషులందరన్నీ రావాల్సిందిగా కబురుచేశాడు. మహాఋషులందరూ వచ్చారు. రాక్షసులు, వానరులుకూడా వచ్చారు. వేల కొద్ది పండితులు, సామంతులు, బ్రాహ్మణులు, మహారాజులు, జానపదులు, పౌరులు మొదలైన వారంతా ఎందరో వచ్చారు. సభాసదులతో సభంతా కిటకిటలాడుతోంది. సీతాదేవి చెయ్యబోయే ప్రమాణాన్ని చూడాలని అందరూ ఊపిరి బిగపట్టి శిలా ప్రతిమల్లా కూర్చుని చూస్తున్నారు.

అంతలో సీతమ్మని వెంటబెట్టుకుని వాల్మీకి మహాముని వచ్చాడు. వాల్మీకి మహాముని శ్రీరామునికి ప్రణమిల్లి

"రామా ఇదిగో ఆనాడు జనాపవాదానికి భయపడి నువ్వు పరిత్యజించిన నీ ఇల్లాలు సీత. పరమ సాధ్వి. ధర్మపరాయణురాలు. నువ్వనుజ్ఞ ఇస్తే ఈ మహాపతివ్రత లోకాపవాదాన్ని నివారించుకుందుకు ఇక్కడ ప్రమాణం చేస్తుంది. అత్యంత ప్రభావశాలురైన మహావీరులైన ఈ కుశలవులిద్దరూ కవలపిల్లలు జానకీదేవి గర్భాన జన్మించారు. వీరిద్దరూ నీ కుమారులే అని నేను నిశ్చయంగా చెప్తున్నాను.

రాఘవా నేనుప్రాచేతసుణ్ణి. ఎప్పుడూ అసత్యం పలకను. నిజం చెప్తున్నాను. వీరు నీ కుమారులే. నేను వేలకొద్దీ సంవత్సరాలు తపస్సుచేశాను. నిజంగా సీతలో ఏదైనా దోషం వున్నట్లయితే ఈ నా తపస్సంతా వ్యర్థమై పోతుంది. నేను త్రికరణ శుద్ధిగా ఏ పాపం, చెయ్యలేదు. సీతమ్మ మహాపతివ్రత అయిన పక్షంలో నా పుణ్యం ఫలిస్తుంది. రాఘవా నేను నా దివ్యదృష్టితో ఆమె పరమపావని అని గ్రహించాకనే ఆమెకి ఆశ్రయం ఇచ్చాను. అడవిలో గంగా తీరాన అసహాయురాలుగా రోదిస్తున్న ఈమెని నేను నా ఆశ్రమానికి తీసికెళ్ళి ఆశ్రయం ఇచ్చాను. కన్న కూతురులా సంరక్షించాను. ఈమె పరిశుద్ధురాలు.

నిరంతరం నిన్నే దైవంగా పూజిస్తోంది. లోకాపవాదానికి భయపడి ఈమెని పరిత్యజించావు. కనుక ఇప్పుడే, ఇక్కడే, ఈమెని తన పవిత్రత నిరూపించుకుంటుంది. ఈమె పరమపావని అని నీకూ తెలుసు. నీకూ ఆమె పట్ల అపరిమితమైన ప్రేమ వుంది. కాని ప్రజాపవాదానికి వెరచి ఆమెని దూరం చేసుకున్నావు. ఇప్పుడామెకి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశం ఇయ్యి" అన్నాడు.

రాముడు వినయంగా చేతులు జోడించి "మునివర్యా మీరు సర్వజ్ఞులు.

మీరు చెప్పినదంతా యదార్థమే. మీరు నొక్కినొక్కి వక్కాణిస్తున్నారు. కనుక ఈమెకా అవకాశం ఇస్తున్నాను. ఇంతకి పూర్వమే లంకలో దేవతల సమక్షంలో ఈమె తన పరిశుద్ధత నిరూపించుకుంది. కనకనే నిస్సందేహంగా ఈమెని అయోధ్యకి తెచ్చాను.

కాని తదనంతర కాలంలో ప్రజలలో ఆమె గురించిన అపవాదులెన్నో తలెత్తాయి. అపుడింక ప్రజాక్షేమం కోరి గత్యంతరం లేక ఆమెని పరిత్యజించవలసి వచ్చింది. ఆమె నిష్కళంకిత అని నా మనస్సుకి తెలుసు. అయినా సమాజం కోసం ఆమెని విడిచిపెట్టవలసి వచ్చింది. నా ఈ బలహీనతను మీరు మన్నించాలి.

ఈ చిరంజీవులిద్దరూ నాకుమారులే అని నాకు తెలుసు. ఆ విషయాలన్నీ నా ప్రజలంతా అంగీకరించినప్పుడు మాత్రమే నేను జానకిని నాకుమారుల్ని స్వీకరించ కల్గుతాను" అంటూ ఒక్క క్షణం సీతవైపు చూశాడు.

ఆ విధంగా రాముడు చెప్తుండగా ఇంద్రాది దిక్పాలురు, దేవతలు, బ్రహ్మ దేముడు, ఆయజ్ఞ స్థలానికి వచ్చారు. రాముడు వారికి ప్రణమిల్లి

"దేవతలారా వాల్మీకి మహాముని మాటల్లో నమ్మకం లేక కాదు. నా ప్రజల మధ్యలో ఆమె చేసే ప్రమాణమే ఆమెని నేను స్వీకరించేలా చేస్తుంది. నా ప్రజలంతా నన్ను నమ్మాలి. నా సీత పరమపావని అని వారు గుర్తించాలి" అన్నాడు.

అంతా ఊపిరిబిగపట్టి చూస్తున్నారు. కాషాయవస్త్రములు ధరించిన సీత తలదించుకుని అలాగే సభకి నమస్కరించి మెల్లని స్వరంతో ఇలా అంది.

"నేను సర్వకాల సర్వావస్థలయందు, శ్రీరామచంద్రుని తప్ప వేరొక పురుషుని నా మనస్సులో స్మరింపదానినైతే నేను శీలవతినైతే నా మాటలు అందరూ విశ్వసించినట్లైతే నా తల్లి భూదేవి. నన్ను తన ఒడిలోకి చేర్చుకొనుగాక. నా జీవితాన్ని నాభర్తకి మాత్రమే అంకితం చేసిన ఇల్లాలినైతే శ్రీరాముని తప్ప పరపురుషుని కన్నెత్తి అయినా చూడని దాననైతే మహాపతివ్రతనైతే నా తల్లి భూమి నన్ను తన ఒడిలోకి చేర్చుకొను గాక" అని సీత శపథం చేస్తున్నంతలో ఒక మహాఅద్భుతం జరిగింది.

ఆమెనుంచున్న ప్రదేశంలో భూమి రెండుగా చీలి, అందులోంచి దివ్యమైన సింహాసనం ఒకటి కాంతులు వెదజల్లుతూ పైకి వచ్చింది. రత్నాభరణాలుధరించిన దివ్యపురుషులైన నాగదేవతలు ఆ సింహాసనాన్ని తలపై మోసుకొచ్చారు. ఆ సింహాసనంలో పరమ తేజోమూర్తి అయిన భూదేవి కూర్చుని వుంది. ఆమె తన రెండు చేతులుచాపి సీతని కౌగలించుకుని ఆ సింహాసనంలో తన పక్కన

కూర్చోపెట్టుకుంది. ఆ తర్వాత ఆ సింహాసనం భూమిలోకి వెళ్ళిపోయింది.

అదిచూసి దేవతంలా పూలవాన కురిపించారు. వారంతా ముక్తం కంఠంతో "పరమ సాధ్వీ, సీతా నువ్వు ధన్యురాలవమ్మా" అని శ్లాఘించారు. ఆ అద్భుతం చూసి అక్కడ వున్న కోటాను కోట్ల జనం ఆశ్చర్యచకితులయ్యారు. రెండు ఘడియల కాలం ఆ ప్రాంతమంతా విషాదంతో నిండిపోయింది.

ఎప్పుడైతే సీతాదేవి భూమిలోకి వెళ్ళిపోయిందో అక్కడున్న వానరులు, ఋషులు అందరూ చేతులు జోడించి ఒక్కసారిగా "సీతమ్మా నువ్వెంత ధన్యురాలవమ్మా" అని నినాదాలు చేశారు.

కాని రాముడు మాత్రం దుఃఖావేశంతోస్థాణువులా నిలబడిపోయాడు. ఆయన మనస్సంతా ఉదాసీనంగా అయిపోయింది. చేతిలోవున్న యజ్ఞదండం సహాయంతో లేచి నిలబడి కన్నీరు కారుస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. రుద్ధ కంఠంతో ఇలా అన్నాడు.

"నాకెంతటి కష్టం వచ్చింది! సాక్షాత్తు మహాలక్ష్మి లాంటి సీత ఇంక ఎప్పటికి కనిపించకుండా అదృశ్యమైపోయింది.

ఇదివరలో రావణుడెత్తుకుపోయి లంకలో దాచినప్పుడు అపారమైన సముద్రాన్ని దాటి వెళ్ళి సీతని తెచ్చుకున్నాను. కాని ఇప్పుడు మాత్రం పాతాళలోకానికి వెళ్ళి జానకికి తెచ్చుకోవటం సాధ్యం కాదు" అంటూ నేలవంక దీనంగా చూస్తూ చేతులు జోడించి "అమ్మా నా సీతని నాకుతిరిగి ఇచ్చెయ్యి. ఇవ్వకపోతేకోపంతో నేనేదైనా చేస్తాను. నా ప్రతాపం నీకు తెలుసు కదా. నా సీతని నాకిచ్చినా సరే. లేదా నన్ను నీ గర్భంలోకి తీసుకున్నా సరే సీత ఎక్కడుంటే అక్కడే నా స్వర్గము" అంటూ రాముడు ఆవేశంతో అన్నాళ్ళు దాచుకున్న దుఃఖం అంతా వెలిగక్కి పరిపరి విధాల ఆవేదన పడసాగాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు, దేవతలు రాముడ్ని ఓదారుస్తూ "రామా మనస్సు నిగ్రహించుకో ఆవేదన చెంది లాభం లేదు. ఒక్కసారి కన్నులు మూసి ధ్యానించి నీ మునుపటి వైష్ణవ తత్వాన్ని గుర్తు చేసుకో. సీత తన పాతివ్రత్యమహిమ చేత నాగలోకం చేరి అక్కడ పరంధామం పొందింది. మళ్ళీ స్వర్గలోకంలో ఆమెని నువ్వు కలుసుకుంటావు. నా మాట సావధానంగా విను. నువ్వు లవకుశుల నోట విన్న రామాయణ మహాకావ్యం మహత్తరమైనది. నీ జీవితచరిత్ర యధాతథంగా దర్పణం పట్టిన మహాకావ్యం అది. ఇంతవరకు జరిగినదే గాక భవిష్యత్తులో ఏం జరగబోతోందో కూడా వివరంగా ఆ మహాముని రచించాడు. ఇది ఆదికావ్యము.

ఇది దివ్యమైనది. అద్భుతమైనది. ఇందులో అసత్యమెంత మాత్రం లేదు. నా అనుగ్రహంతో వాల్మీకి సర్వం తెలుసుకుని వ్రాశాడు.

నువ్వు ఏకాగ్రచిత్తంతో శ్రద్ధగా విని నీ భవిష్యత్తులో జరగబోయే సంగతులు కూడా తెలుసుకో. ఇప్పుడు నువ్వు వింటున్న భాగం ఉత్తరకాండ. నువ్వు రాజర్షివి. లవకుశల నోట రామాయణం విని సర్వం గ్రహించు" అనిచెప్పి బ్రహ్మ తన లోకానికి వెళ్ళిపోయాడు.

బ్రహ్మ మాటలుశిరసావహించి రాముడు వెనక్కి వచ్చి ఉత్తరకాండ వినిపించవలసిందిగా లవకుశుల్ని కోరాడు. ఆ తర్వాత లవకుశుల్ని వెంటబెట్టుకుని తన నివాసానికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రంతా సీత గురించి ఆలోచించాడు. తెల్లారగానే శ్రీరాముడు యజ్ఞవాటికలో సభని సమావేశపరచి లవకుశలని ఉత్తరకాండ గానం చెయ్యమని చెప్పాడు. లవకుశులు శ్రీరామునికి గురువుగారికి నమస్కరించి గానం చెయ్యటం మొదలెట్టారు. సీతాదేవి పాతాళలోకంలోకి వెళ్ళిపోయాక, దుఃఖ మనస్కుడైన రాముడు ఏదో విధంగా యజ్ఞం పూర్తి చేసి యజ్ఞము చూడటానికి వచ్చిన వారిని, పండితుల్ని యధోచితంగా సత్కరించి, యజ్ఞచూడటానికి వచ్చిన రాజుల్ని, సామంతుల్ని సన్మానించి, యజ్ఞము చేయించినవారిని కూడా సత్కరించి వానరుల్ని, రాక్షసుల్ని వారికి ఉచితమైన రీతిగా గౌరవించి కానుకలు సమర్పించాడు. అందర్నీ వారి వారి ప్రదేశాలకి పంపించేసి తన కుమారులైన లవకుశులతో అయోధ్యలో ప్రవేశించి సీత గురించిన ఆలోచనలు గడుపుతూ రాజ్యపాలన చెయ్యసాగాడు. పదివేల సంవత్సరాలు ఎన్నో యజ్ఞయాగాదులుచేశాడు. ఎంతో ధనం ఖర్చుపెట్టాడు. రాముని రాజ్యము సర్వవేళలా సుభిక్షంగా వుండేది.

సకాలంలో వానలు కురిశాయి. కరవు కాటకాలులేవు. ప్రజలంతా సంతుష్టులై వున్నారు. అకాల మరణాలు లేవు. రోగాలు, వ్యాధులు లేవు. ధర్మం నాలుగు పాదాలా నడిచింది. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడిచాక కౌసల్యాదేవి స్వర్గస్థురాలైంది. మరికొంత కాలానికి సుమిత్ర, కైకేయి కూడా పరమపదించారు.

రాముడు తల్లులు ముగ్గురికీ యధావిధిగా పితృకార్యాలు నిర్వర్తించాడు. కొంతకాలంతర్వాత భరతుని కుమారులైన తక్షుని, పుష్కలుని గాంధారదేశానికి పట్టాభిషిక్తుల్ని చేశాడు. గాంధార రాజ్యాన్ని రెండుగా విభజించి వారికిచ్చాడు. తక్షశిల రాజధానిగా తక్షుడు, పుష్కలావతం రాజధానిగా పుష్కరుడు సుభిక్షంగా రాజ్యపాలన చేసుకుంటుండగా కొన్నాళ్లు కనిపెట్టి వుండి తర్వాత అయోధ్యకి

వెళ్ళిపోయాడు భరతుడు.

కారుపథ మనే రాజ్యానికి లక్ష్మణుని కుమారులైై అంగదుని, చంద్రకేతునీ రాజులుగా అభిషేకించాడు. అంగదీయమనే నగరం రాజధానిగా అంగదుడు, చంద్రకాంతమనే రాజనగరం రాజధానిగా చంద్రకేతువు వారి రాజ్యాలు పరిపాలించసాగారు. అంగదుని రాజ్యం కారుపథం. చంద్రకేతు రాజ్యం మల్ల దేశం. లక్ష్మణుడు, భరతుడువారికి రాజ్యపాలనలో శిక్షణ ఇచ్చారు. ఎవరి రాజ్యం వారు పరిపాలించుకునే స్థితికి చేరుకున్నాక లక్ష్మణుడు, భరతుడు తిరిగి అయోధ్యకివచ్చేసి రాజ్యపాలనలో అన్నగారికి తోడునీడగా నిల్చారు. అన్నదమ్ములు ముగ్గురూఅయోధ్యని ప్రజానురంజకంగా పదివేల సంవత్సరాలు పరిపాలించారు.

మరికొంతకాలం సుఖంగా గడిచిపోయింది. ఒకనాడు యమధర్మరాజు తపస్వివేషంతో శ్రీరాముని భవనం దగ్గరకి వచ్చాడు. భవనద్వారం దగ్గర లక్ష్మణుడు నిలబడి వున్నాడు. లోపలికి వెళ్ళి శ్రీరాముని సందర్శనార్థం ఎవరో తపస్వి వచ్చాడని చెప్పాడు. అన్నగారి అనుమతిపై ఆయనని లోపలికాహ్వానించాడు. రాముడు ఆ తాపసికి అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించాడు.

అపుడా తాపసి చాలా రహస్యమైన విషయం రామునితో తాను చర్చించడానికి వచ్చాననీ తామిద్దరూ మాట్లాడుకుంటుండగా మూడవ వ్యక్తి ఆ గదిలో ప్రవేశిస్తే అతడికి శిరచ్ఛేదం చెయ్యవలసి వుంటుందనీ ఆ షరతుకి అంగీకరిస్తేనే తాను రామునితో చర్చిస్తానని అన్నాడు.

రాముడందుకు అంగీకరించి తమ్ముతో "లక్ష్మణా నువ్వు సింహద్వారం దగ్గరవుండి ద్వారపాలకుల్ని పంపెయ్యి. నువ్వుగాని మరెవ్వరూగాని లోపలికి రాకూడదు. జాగ్రత్త" అని పంపాడు. అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేశాక రాముడు కాలుణ్ణి అతడి సందేశం వినిపించమన్నాడు.

కాలుడు శ్రీరామునికి నమస్కరించి "రామచంద్రా పితామహుడు నీకు చెప్పమన్న సంగతి చెప్తాను విను. లోకరక్షనార్థం నువ్వు భూమి మీద అవతరించి ఇక్కడ వుండటానికి నువ్వు నిర్ణయించుకున్న గడువు పూర్తయింది. పదకొండు వేల సంవత్సరాలు ఈ పృథివిని పాలించాలనుకున్నావు. ఆగడువు అయిపోయింది. కనక ఇంక నువ్వు వైకుంఠానికి తిరిగి రావలసిందిగా బ్రహ్మ నీకు గుర్తు చెయ్యమన్నాడు. కాని ఇంకా కొంతకాలం ఈ భూలోకంలోనే వుండదల్చుకుంటే మాత్రం నీ ఇష్టం అని కూడా చెప్పమన్నాడు" అన్నాడు.

రాముడా మాటలు విని మందహాసంతో "యమధర్మరాజా, బ్రహ్మ వాక్కు నాకు వేద వాక్కు నేను తప్పక తొందరలోనే పరంధామానికి వస్తానని చెప్పు" అని అంటుండగానే

బయట కాపలావున్న లక్ష్మణుడి దగ్గరకి ఆదరా బాదరా దుర్వాసమహాముని వచ్చాడు. "సౌమిత్రీ నేను వెంటనే రాముడ్ని చూడాలి" అన్నాడు.

లక్ష్మణుడు ఆయనకి నమస్కారం చేసి "ఆర్యా మన్నించండి శ్రీరాముడు ఎవరితోనో అత్యవసర సమావేశంలో వున్నాడు. - మీకు అత్యవసరమైన కార్యక్రమమేమిటో నాకు సెలవియ్యండి. అలా కాదంటారా రెండు ఘడియలు ఆగండి" అన్నాడు.

ఆ మాటలు విన్న దుర్వాసుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. కళ్ళలో నిప్పులు కురిసిస్తూ "లక్ష్మణా నువ్వు వెంటనే వెళ్ళి నారాక రామునికెరించావా సరి. లేకపోతే ఇపుడే మీ వంశం, మీ రాజ్యం సర్వనాశనమైపోయేలా శాపం ఇస్తాను" అన్నాడు.

ఆ మాటలు విని లక్ష్మణుడు భయంతో వణికిపోయాడు. "అయ్యో ఎంతటి సంకట పరిస్థితి వచ్చింది! ఇప్పుడు నేను లోపలికి వెళ్ళి రామునితో మాట్లాడితే నాకు శిరచ్ఛేదం తప్పదు. పోనీ వెళ్ళకపోదామా అంటే నా రాజ్యం యావత్తు శాపానికి గురి అవుతుంది. నా ఒక్కడి కోసం నా వంశాన్ని, రాజ్యాన్ని బలిఇవ్వటం అన్యాయం. పోనీలే పోతే నేనొక్కణ్ణే పోతాను" అనుకుంటు లక్ష్మణుడు రాముని మందిరంలోకి వెళ్ళి దుర్వాస మహాముని రాక నెరిగించాడు వెంటనే శ్రీరాముడు, కాలుణ్ణి పంపేసి ఆ దుర్వాసమహాముని దగ్గరకెళ్ళాడు. ఆయనకి నమస్కరించి "ఆర్యా మీ ఆనతి సెలవియ్యండి" అన్నాడు. వినయంగా

దుర్వాసుడు రాముని చూసి శాంతించాడు. "ధర్మవత్సలా, నేనిప్పటికి, వెయ్యి సంవత్సరాలనించి ఉపవాస దీక్షలో వున్నాను. ఇవాల్టితో అది పూర్తయింది. కనక ఇపుడు నేను నీ ఇంటికి అతిథిగా వచ్చాను. వెంటనే నాకు భోజనం పెట్టించు" అన్నాడు.

రాముడు పరమానందభరితుడైదుర్వాసుని ఉచితరీతిని సత్కరించి భోజనం పెట్టించాడు. దుర్వాసుడు సంతృప్తిగా భోజనం చేసి చాలా బాగుందని మెచ్చుకుని రాముని ఆశీర్వదించి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఆయనలా వెళ్ళిపోగానే రాముడికి తాను యముడికిచ్చిన వాగ్దానం గుర్తొచ్చింది. చెప్పరాని దుఃఖం కలిగింది. విషాదంతో తలదించుకున్నాడు.

రాముడు అలా విషాదం పొందటం లక్ష్మణుడు చూశాడు. తన గురించి బాధపడ్తున్నాడని తెలిసి అన్నగారిపట్ల అతడి మనసు కృతజ్ఞతాభావంతో నిండిపోయింది.

"అన్నయ్యా నా గురించి విచారించకు. పూర్వజన్మ కర్మబద్ధులమైన మనం కాలానికి తలవంచక తప్పదు" అన్నాడు.

రాముడికామాటలు మరింత బాధ కలిగించాయి. లక్ష్మణుడు రాముని రెండు చేతులు పట్టుకుని "ప్రభూ మీరు వెంటనే నాశిరచ్ఛేదానికి ఆజ్ఞాపించండి. కర్తవ్యాన్ని విస్మరించి, ప్రతిజ్ఞా భంగం కలిగేలా ప్రవర్తించే వారు నరకానికి పోతారు" అన్నాడు.

లక్షణుని మాటలు విన్న రాముడు ఎంతగానో చలించిపోయాడు. వెంటనే మంత్రి పురోహితుల్ని పిల్చి జరిగిన సంగతంతా వివరించి చెప్పాడు.

ఆ సంగతి విన్న వారంతా నిశ్చబ్దంగా వుండిపోయారు. కాని వశిష్టుడు మాత్రం లేచి నిలబడి "కుమారా, జరగబోయే సంగతులన్నీ నేను దివ్యదృష్టితో తెలుసు కున్నాను. ఇపుడు నువ్వు లక్ష్మణుని పరిత్యజించక తప్పదు. ఆత్మబంధువుని పరిత్యజించట మంటే వధించటం తోటే సమానం" అన్నాడు. రాముడు ఆవేదనతో "సౌమిత్రీ ధర్మనిర్వహణ కోసం నిన్ను పరిత్యజించవలసి వస్తోంది" అన్నాడు. లక్ష్మణుడు తలదించుకుని తన ఇంటివైపు వెళ్ళిపోయాడు. కాని ఎందుకో ఇంటిలోకి మాత్రం వెళ్ళలేదు. తిన్నగా సరయూనది వైపు వెళ్ళాడు. నదిలోదిగి ఆ నీళ్ళలో ఆచమనంచేసి రెండుచేతులు జోడించి నిలబడి ప్రాణవాయు స్థంభింపచేసి తుదిశ్వాస విడిచాడు.

ఎపుడైతే లక్ష్మణుని శ్వాస నిల్చిపోయిందో ఆకాశంలోంచి దేవతలు, ఋషులు, అప్సరలు అతడిపై పూలవాన కురిపించారు. దేవేంద్రుడు స్వయంగా అతడ్ని స్వర్గలోకానికి తీసుకుపోయాడు. దేవతలంతా ఆనందించి అతడ్ని పూజించారు.

లక్ష్మణుని ఎడబాటు శ్రీరాముని హృదయంలో గొడ్డలిపెట్టులా అయింది. విషాదంలో మునిగిపోయిన రాముడు ఒకనాడు మంత్రుల్ని పురోహితుల్ని పిల్చి సభతీర్చి సభికుల్ని ఉద్దేశించి

"సౌమ్యులారా నేనింక ఈ రాజ్యభారాన్ని మొయ్యలేను. వెంటనే సంభరాలు తెప్పించండి. ఈ కోసల రాజ్యానికి భరతుణ్ణి రాజుగా అభిషేకించి నేనూ లక్ష్మణుని చేరుకుంటాను" అన్నాడు.

రామునిమాటలు విని వారంతా అవాక్కయిపోయారు. భరతుడు తెలివి తప్పి పడిపోయాడు మెల్లిగా తేరుకుని

"ప్రభూ నువ్వు లేనిదే ఏ రాజ్య సంపదలూ నాకక్కరలేదు. నిజం చెప్తున్నాను. మీరు లవకుశులకి రాజ్యాభిషేకం చెయ్యండి. మహాప్రస్థానానికి మీ వెంట నేనూ వస్తాను. వెంటనే దూతల్ని పంపి శత్రుఘ్నునికి ఈ సంగతి తెలియజెయ్యండి" అన్నాడు. ప్రజలంతా హాహాకారాలు చేస్తూ నేలమీద పడిపోయారు.

అపుడు వశిష్టుడు "రామా ఈ పౌరుల్ని చూడు. వీరి అభిప్రాయం కూడా తెలుసుకో" అన్నాడు. రాముడు ప్రజలనుద్దేశించి "పౌరులారా మీ కోసం నేనింకా ఏం చెయ్యాలో చెప్పండి" అన్నాడు. అపుడు ప్రజలంతా ముక్త కంఠంతో "రామచంద్ర ప్రభూ, మేమూ మీ వెంటే వస్తాము. మీకు నిజంగా మా మీద వాత్సల్యం వుంటే మమ్మల్ని భార్యాపిల్లలతో సహా మీ వెంట వచ్చేందుకు అనుమతించండి" అన్నారు.

తన ప్రజలకి తన పట్ల వుండే ప్రేమకి పులకించిపోయాడు రాముడు. తర్వాత లవకుశులిద్దర్నీ ఉత్తర దక్షిణ కోసల రాజ్యాలకి రాజులుగా అభిషేకించించాడు. వారిద్దర్నీ గాఢంగా కౌగలించుకుని, ఒడిలో కూర్చోబెట్టుకుని మాటి మాటికి వారి శిరస్సులు ముద్దుపెట్టుకుంటూ గుండెలకి హత్తుకుని వదల్లేక వదల్లేక వారి వారి రాజ్యాలకి పంపేశాడు. తన రాజ్యాన్ని సంపదల్ని చతురంగ బలాల్ని ఇద్దరికీ సమానంగా పంచేసి, వారి వారి రాజ్యాలలో వారు సుప్రతిష్టులైయ్యాక శత్రుఘ్నుని దగ్గరకి దూతని పంపాడు. వారు శత్రుఘున్ని దగ్గరకి వెళ్ళి అయోధ్యలో జరిగిన విషయాలన్నీ యధాతథంగా శత్రుఘ్నునికి చెప్పారు. కుశావతి నగరం రాజధానిగా ఉత్తరకోస దేశానికి కుశుని, శావస్తి నగరం రాజధానిగా దక్షిణ కోసలదేశానికి లవుని, రాజ్యాభిషేకం చేసి శ్రీరామచంద్ర ప్రభువు, భరతునితో కలసి సాకేతధామానికి వెళ్ళటానికి నిశ్చయించుకున్న సంగతి చెప్పి శత్రుఘ్నుని వెంటనే బయల్దేరి అయోధ్యకి రావాల్సిందిగా తొందర పెట్టారు.

శత్రుఘ్నుడు తన కుమారులతో పెద్దవాడికి మధురా రాజ్యాన్ని, చిన్నవాడైన శత్రుఘాతికి విదిశా రాజ్యాన్ని అప్పగించి, తన సంపదలు, చతురంగ బలాలు ఇద్దరికీ సమానంగా పంచి ఇచ్చి తానొక్కడూ బయల్దేరి అయోధ్యకి వెళ్ళాడు. తను కూడా రాముని వెంట పరంధామానికి వస్తానని అన్నగారికి ప్రణమిల్లి చెప్పాడు. అందుకు రాముడు ఆమోదించాడు.

అంతలో కిష్కింధ నించి పెద్ద సంఖ్యలో వానరులు, భల్లూకాలు వచ్చారు. స్వర్గానికి ప్రయాణమవబోతున్న రాకుమారుల్ని చూడాలని వారు సుగ్రీవునితో

సహోవచ్చారు. వారంతా రామునికి మోకరిల్లి "ప్రభూ మేమూ మీ వెంట వస్తాము అన్నారు. అప్పుడు రాముడు విభీషణుడ్ని చిరంజీవిగా ఆశీర్వదించి లంకకి తిరిగి వెళ్ళిపొమ్మన్నాడు. ఆ తర్వాత ఆంజనేయుని కూడా చిరంజీవిగా ఈ భూమి మీదే వుండి రామాయణ కథ భూమి మీద వున్నంత వరకు అమరుడవై రామకథ స్మరిస్తూ వుండమని ఆశీర్వదించాడు. జాంబవంతుడుణ్ణి, మైంధుణ్ణి, ద్వివిదుణ్ణి కలి ప్రవేశించే వరకు ఈ భూమిపై వుండమన్నాడు. మిగిలిన వానరుల్ని భల్లూకాల్ని తన వెంట వచ్చేటందుకు అనుమతించాడు.

ఆ రాత్రి అంతా సుఖంగా నిద్రపోయారు. తెల్లారాక శ్రీరాముడు మంత్రులతో పురోహితుల్ని పిలిపించమని చెప్పాడు. వారు వచ్చారు.

"పూజ్యులారా సద్బ్రాహ్మణుల్ని ప్రజ్వలిస్తున్న అగ్నిముందు నిలబడమని చెప్పండి. వాజపేయము చేసేటప్పుడు ధరించే ఛత్రము ధరించి, నేను మహాప్రస్థానానికి బయల్దేరతాను" అని వారితో చెప్పి ఆ తర్వాత చెయ్యవలసిన కార్యక్రమం వివరించాడు. వశిష్ట మహాముని, మహాప్రస్థానానికి వెళ్ళే ముందు చెయ్యవలసిన ధార్మిక క్రియలన్నీ యధావిదిగా చేయించాడు. ఆ తర్వాత రాముడు తేలికైన వస్త్రాలు ధరించాడు. రెండుచేతులుతో దర్భలు పట్టుకున్నాడు. బ్రాహ్మణులు ముందు వేదాలు చదువుతు నడుస్తున్నారు. వెనక తన పరివారంతో రాముడు పరమపదయాత్రకి బయల్దేరాడు.

రాముని కుడివైపు కమలము ధరించి శ్రీదేవి నడిచింది. ఎడమవైపు భూదేవి నడిచింది. ఆయనశక్తి ఆయన ముందు నడిచింది. శ్రీరాముని కోదండము, బాణాలు, మిగిలిన శస్త్రాలు అన్నీ పురుషాకారాలుధరించి వెంట నడిచాయి. గాయత్రి ఓంకారము, వషట్కారము అంతా భక్తి భావంతో రాముని వెంట నడిచారు. బ్రాహ్మణులు, ఋషులు వెంట నడిచారు. అంతఃపుర స్త్రీలు, బాలురు, బాలికలు, వృద్ధులు అంతా శ్రీరాముని వెంట సరయు తీరానికి వచ్చారు. మంత్రులు, భృత్యులు ఆయన వెంట కదలిసాగారు. వారంతా చాలా ఉల్లాసంగా వెళ్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే అయోధ్య యావత్తు పరమానందంగా శ్రీరాముని వెంట సాకేతధామానికి పెద్ద వాహినిలా కదిలిపోయింది. అందరి లక్ష్యం పరంధామమే.

అయోధ్య దాటి ఒకటిన్నర యోజనాలు దాటాక సరయూ నది కనిపించింది వారికి. ఆ నదీ తీరాన ఒక పవిత్రమైన స్థలం దగ్గర ఆగారు వారు.

ఆకాశవీధిలో బ్రహ్మదేవతలు తమ తమ విమానాలలో నిలబడి శ్రీరాముని మహాప్రస్థానాన్ని చూస్తున్నారు. పరిమళ భరితములైన పుష్పములు వానగా కురిపించారు. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా వుంది.

దేవదుందుభులు మ్రోగుతుండగా శ్రీరాముడు సరయూ జలాల వైపు నడిచాడు.

ఆకాశవాణి నుండి బ్రహ్మ"విష్ణు స్వరూపుడివైన శ్రీరామా, రఘునందనా స్వాగతము. నీకు శుభం కలగాలి. మా భాగ్యవశాన నువ్వు మళ్ళీ పరంధామానికి వస్తున్నావు. నీకు సమ్మతమైన అవ్యక్తమైన రూపంలో ప్రవేశించి మళ్ళీ లోకాలన్నీ పాలించు" అన్నాడు. ఆ మాటలు వింటు శ్రీరాముడు శరీరసహితంగా తమ్ములతో గూడ విష్ణుతేజములో ప్రవేశించాడు.

ఇంద్రాది దేవతలు, దిక్పాలురు అందరూ విష్ణుమూర్తిని వేనోళ్ళ స్తుతించారు. విష్ణు స్వరూపం పొందిన రాముడు బ్రహ్మని చూసి

"పితా మహా ఈ కనిపిస్తున్న ప్రజలంతా నన్నారాధిస్తూ తమ జీవిత సర్వస్వాన్ని పరిత్యజించి నా వెంట వచ్చారు. వీరందరికీ సద్గతులు కల్గించు అన్నాడు. సరే అని బ్రహ్మ వారందరికీ సంతానలోకం కలిగేలా ఆశీర్వదించాడు.

వానరులు, భల్లూకాలూ ఎవరెవరి వల్ల జన్మించారో ఆయాదేవతల్లో కలిసిపోయారు. సుగ్రీవుడు సూర్యమండలంలో ప్రవేశించాడు. బ్రహ్మ ఆశీర్వచనం విన్న ప్రజలంతా సరయూనది జలాలలో మునిగిపోయి దేహత్యాగం చేసి సంతానలోకం ప్రవేశించారు.

వారందర్నీ తమ తమ నెలవులకి చేర్చి బ్రహ్మ తనలోకానికి వెళ్ళిపోయాడు.

ముందుగానే చిరంజీవిగావుండేలా వరం కోరుకున్నాడు కనుక హనుమంతుడు చిరంజీవిగా భూలోకంలో వుండిపోయాడు.

అని సంపూర్ణ రామాయణ కథాకావ్యాన్ని కుశలవులు మధురంగా గానం చేసి ముగిస్తూ వాల్మీకిచే రచించబడ్డ రామాయణ మహాకావ్యం ఉత్తరాకాండతో సహా పూర్తిగా వినిపించారు. బ్రహ్మదేముడు కూడా ఈ కావ్యాన్ని ఆమోదించాడు.

ఈ ప్రకారంగా మహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు యధాప్రకారం తన విష్ణు స్వరూపంతో పరంధామములో పునఃప్రతిష్టితుడై ఈ చరా చర

విశ్వమంతటా నిండి వున్నాడు. ఆ భగవానుని యొక్క పావన చరిత్రతో నిండి వుడటం వల్ల గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, ప్రసన్నతా పూర్వకంగా దేవలోకంలో ఈ కావ్యగానం వింటారు.

ఈ ప్రబంధ కావ్యశ్రవణము ఆయుర్వర్ధకము. సౌభాగ్యప్రదము, పాప హరణము. రామాయణము వేదములతో సమానమైనది. పండితులైన వారుశ్రద్ధగా ఈ కావ్యాన్ని చదివి అందరికీ వినిపించాలి. ఈ కావ్యగానం వల్ల గాని, శ్రవణం వల్ల గాని, సంతానం లేని వారికి సంతతి కల్గుతుంది. దరిద్రులకి ధనం లభిస్తుంది. సమస్త పాపాలు తొలగిపోతాయి.

వాల్మీకి రామాయణం లోని ఒక్కశ్లోకం చదివినా, వారి పాపాలన్నీ పటాపంచలైపోతాయి.

ఈ కావ్యాన్ని చదివి వినిపించిన పండితునికి, వస్త్రములుగాని, ఆవుని గాని, బంగారం గాని దక్షిణగా సమర్పించాలి.

దీనిని చదవడంవల్ల, వినటం వల్లా పుత్రపౌత్రాభివృద్ధి కల్గుతుంది. మరణానంతరం సద్గతులు కలుగుతాయి.

శ్రద్ధా భక్తులతో మూడుపూటలా రామాయణం చదివితే వారికెటువంటి దుఃఖం కలుగదు.

రాముడు పరంధామానికి వెళ్ళాక చాలా కాలం అయోధ్యశూన్యంగా వుంది. ఆ తర్వాత ఋషభుడు అనేరాజు ఆ నగరాన్ని పునర్నిర్మాణం చేశాడు.

రామాయణ కథా శ్రవణం చేత ప్రయాగాది తీర్థములు దర్శించిన పుణ్యము, నైమిశాది అరణ్యాలు తిరిగిన పుణ్యము, కురుక్షేత్రాది పుణ్యక్షేత్రాలు చూసిన పుణ్యము కలుగుతాయి.

ప్రతిదినము రామాయణము చదివినా విన్నా, సూర్యగ్రహణ కాలంలో, కురుక్షేత్రంలో ఒక బారువు సువర్ణము దానము చేసిన పుణ్యం కలుగుతుంది.

కళ్యాణ ప్రాప్తి కోసం ఈ కావ్యాన్ని నిరంతరం ధ్యానించాలి. రామాయణం చదివిన వారి పితృదేవతలు కూడా తరిస్తారు. రామాయణంలోని ఒక శ్లోకం గాని, శ్లోకం లోని ఒక్క పాదం గాని, పాదంలోని ఒక్క పదం గాని వింటే చాలు. వారు బ్రహ్మలోకం పొందుతారు. బ్రహ్మచేత ఆదరింపబడ్తారు.

ఈ రామకథాసుధ వాల్మీకి రామాయణానికి దర్పణం పట్టింది. ఈ ఆదికావ్యాన్ని భక్తివిశ్వాసాలతో చదవండి. వినండి. మీకు సుఖసంతోషాలు శుభములు కలుగుతాయి. విష్ణుమూర్తి శక్తికి బలం కల్గుతుంది.

ఇట్లు ఆదికవి వాల్మీకి ప్రణీతమైన శ్రీమద్రామాయణము సమాప్తము.

## రామకథాసుధ సమాప్తము.

**ఓం తత్ సత్**

**మంగళం మహత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# ఉత్తరకాండపై వ్యాఖ్యానం

ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన యుద్ధకాండ రామపట్టాభిషేకంతో సుఖవంతంగా పూర్తయింది. ఎందుకో మరి వాల్మీకి మహాముని యుద్ధకాండతో రామాయణ కావ్యానికి ముగింపు చెప్దామనుకున్నాడో ఏమో గాని, రామపట్టాభిషేకం కాగానే మహాకావ్యానికి ఫలశృతి, స్వస్తి వాక్యాలు కూడా చెప్పాడు. అంటే రామాయణ కావ్యరచన శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యాక మొదలుపెట్టాడని మొదట్లోనే చెప్పబడింది కనుక రామాయణ రచన పూర్తయ్యే సరికి గర్భవతియైన సీత వాల్మీకి ఆశ్రమానికింకా చేరి వుండదా అనే అనుమానం మనకి రాకపోదు. బహుశా సీతమ్మ వాల్మీకి ఆశ్రమానికి చేరిన తర్వాత ఉత్తరకాండ రచన జరిగిందా అన్న విషయం కూడా ఆలోచించవలసిన విషయమే. ఏది ఏమైనా ఉత్తర కాండ కూడా వాల్మీకి మహామునే రచించాడన్నది నిర్వివాదాంశం.

ఉత్తరకాండలో మొదట సగం భాగం రావణుడు, ఇంద్రజిత్తు, వారి వంశం, మొదలైన విషయాలు ప్రస్తావించబడ్డాయి. బాలకాండలో శ్రీరామజననం, ఇక్ష్వాకు వంశ ప్రశస్తి, రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నుల పుట్టుక మొదలైన విషయాలు ప్రస్తావించబడినట్లే ఉత్తరకాండలో పౌలస్త్యవంశ ఉత్పత్తి రావణ కుంభ కర్ణ విభీషణులు జననం, వారుతపస్సులు చేసి అమోఘమైన వరాలు పొంది లంకా రాజ్యాన్ని పొందటం, వారి కళ్యాణాలు, ఇంద్రజిత్తు జననం అతడు అమోఘ శక్తి సంపన్నుడెలా అయిందీ వివరించటం, మొదలైన విషయాలన్నీ ప్రస్తావించ బడ్డాయి. ఆ తర్వాత ఆంజనేయుని పుట్టుక, అతడు అమిత బలశక్తి సంపన్నుడు అవటం శాపవశాన అవన్నీ మర్చిపోవటం -ఈ విషయాలన్నీ వివరంగా వ్రాయబడ్డాయి.

అసలు రామాయణ మొదటి ఆరు కాండలు చదివినప్పుడు మనకి రావణుడు కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, అంతటి శక్తి సంపన్నులెలా అయ్యారు?! అరణ్య కాండలో సామాన్య రాక్షసులెందర్నో వధించిన రామలక్ష్మణులు వారిని చంపటానికి అంత ప్రయాస ఎందుకుపడ్డారు. అంత వరకు ఒక సామాన్య వానరుడిగా దర్శనమిచ్చిన హనుమంతుడికి సముద్ర తీరంలో అంతటి శక్తి సామర్ధ్యాలెలా కలిగాయి? సుందరకాండలో

ఆ మహాత్ముడు అన్ని అద్భుతమైన కార్యాలెలా చేశాడు. అన్న సందేహాలు మనకి తప్పకుండా కల్గుతాయి.

ఆ ప్రశ్నలన్నింటికీ ఉత్తరాకాండలో జవాబులు లభిస్తాయి. ఒక విధంగా ఆలోచిస్తే ఈ విషయాలన్నీ మనకి వివరంగా చెప్పటానికి మాత్రమే ఆయన ఉత్తరకాండ రచన సాగించాడా అనిపిస్తుంది. కాని అనుకోని విధంగా రామాయణ మహాకావ్యం విషాదభరితంగా పరిసమాప్తమవుతుంది. మానవ కల్యాణం కోసం, లోక కల్యాణార్థం అవతారం ధరించిన మహావిష్ణువు ఎప్పటికైనా ఆ అవతారం ముగించుకుని పరమపదానికి చేరవలసిందే అయినా పట్టాభిషేకం అయ్యాక అయినా సీతారాములు సుఖంగా వుండకుండా మళ్ళీ వారికి ఎడబాట కలగటం ఎంతో అల్లారుముద్దుగా రాజవైభోగంతో పెరగవలసిన కుశలవులు అరణ్యాలలో ఆశ్రమపదాల్లో పెరిగి పెద్దవారవటం చదివినవారి మనస్సుకి తీరని ఆవేదన కలిగిస్తాయి.

అయితే రాముడు విచక్షణారహితంగా కేవలం ఒక చాకలి వాని మాటలు విని సీతని పరిత్యజించాడని నేడు లోకంలో వాడుకలో వున్న మాట పచ్చి అబద్ధం.

రాముడి అంతరంగ మిత్రుడైన భద్రుడు అయోధ్యలో ప్రతివీధిలో ప్రతి సందుల్లో మాత్రమేగాక జానపదాల్లో నివశించే పౌరులతో సహా ప్రతివారి నోటా ఇదే చర్చనీయాంశమైందని చెప్తాడు.

రాముడు ఏ ఒక్కరో అలా పలికితే వారి నోరు మూయించగలడు ఒక ప్రభువుగా. కాని ప్రజలందరిదీ అదే అభిప్రాయమైనపుడు, ప్రజాపాలకుడిగా తన కర్తవ్యం తన భార్యని పరిత్యజించటమే అని భావించాడు.

అంతేగాక ఆమె గర్భవతిగా వుంది. ఆమె సంతానం తనకి పుట్టినవారే అని ప్రజలు గుర్తించాలి. అందుకు తగిన వాతావరనం, వాల్మీకి మహాముని ఆశ్రమంలో మాత్రమే లభ్యమవుతుంది. కనక సీతని వాల్మీకి మహాముని ఆశ్రమం దగ్గర విడిచిరమ్మని చెప్పాడు రాముడు. అది ఆయన విశ్వాసం.

ఇంకొక ఆశ్చర్యకరమైన సంగతి మనకి ఉత్తరకాండలో కనిపిస్తుంది.

శతృఘ్నుడు లవణాసురుడ్ని సంహరించటానికి వెళ్ళినప్పుడు వాల్మీకి మహాముని ఆశ్రమం సందర్శిస్తాడు. ఆ రోజు రాత్రే సీతకి లవకుశులు జన్మిస్తారు. శతృఘ్నుడు ఆ సంగతి తెలుసుకుని వెళ్ళి సీతని అభినందిస్తాడు. ఆ తర్వాత మళ్ళీ పన్నెండు సంవత్సరాలుకి, మధురానగరి నుంచి అయోధ్యకి వెళ్తు దారిలో వాల్మీకి మహాముని ఆశ్రమంలో విశ్రమించినప్పుడు లవకుశుల రామాయణ గానం వింటాడు. కాని ఆ సంగతులేవీ రాముడితో చెప్పినట్లు ఎక్కడా కనిపించదు.

బహుశా సీతని రాముడు పరిత్యజించాడు కనక ఆమెని గురించిన ప్రస్తావన వారి రాజ్యంలో ఎక్కడా జరగకూడదని కూడా ప్రభువు ఆజ్ఞ అయి వుండవచ్చు. అంటే వారికి సంబంధించినంతవరకు ఇంక సీత లేదు.

దీనినిబట్టి ఆనాటి పరిపాలనా వ్యవస్థ ఎంత కష్టతరంగా వుండేదో ఆ వ్యవస్థకి కట్టుబడి పాలకులు ఎంత నమ్మకంగా పాలించేవారో తెలుసుకోవచ్చు. ప్రభువు తమ అభిప్రాయాల్ని ప్రజల అభిప్రాయానికి తగ్గట్టు మార్చుకునే వాడన్నమాట. ప్రజలంతా ఏది న్యాయమని ఏకగ్రీవంగా నిర్ణయిస్తే దానికే పాలకులు కట్టుబడి వుండాలి. ఈనాటి మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల అభిప్రాయాలకి అంతటి గౌరవం వుందా లేదా అన్న విషయం మనమే పరిశీలించి గ్రహించాలి.

ఈ విధంగా రాముడి రాజ్యం రామరాజ్యం ఎలా అయిందో వివరిస్తూ అన్నదమ్ముల సఖ్యత ఎంత గొప్పగావుందో తెలియజేస్తూ సాగిపోయిన రామాయణ మహాకావ్యం ఉన్నట్టుండి ఒక గొప్ప మలుపు తిరుగుతుంది.

సీతని రాముడు మళ్ళీ నిండుసభలో ఆమె పాతివ్రత్యాన్ని నిరూపించు కోమనటం ఆమె అందరి సమక్షంలోతన పాతివ్రత్యం నిరూపించుకోవటమే గాక భూమాతని ప్రార్థించి ఆమెలో ఐక్యమైపోవటం (సభామధ్యంలో భూమి రెండుగా చీలి సీత భూమిలోకి వెళ్ళిపోవటం) చదివినప్పుడు పాఠకుల మనస్సులు బాధతో బరువెక్కిపోతాయి.

సీత అయోనిజ భూదేవి ఆమె తల్లిగా వర్ణించబడింది. కాని శ్రీదేవి, భూదేవి ఇద్దరూ విష్ణుమూర్తి యొక్క భార్యలుగా చెప్పబడ్డారు. మరి సీత

భూదేవి కూతురైతే సాక్షాత్తు మహావిష్ణువు అవతారమైన రాముడు సీతకి తండ్రి కావాలి కదా.

కాని అలా కాదు. రాముడెలాగైతే విష్ణువు అంశతో జన్మించాడో, సీత కూడా అలాగే భూదేవి అంశతో జన్మించింది.

ముందు జన్మలో వేదవతి అయిన సీత భూదేవి అంశతో అయోనిజగా పుట్టింది. వేదవతి పసిపాపగా రావణుడికి దొరికందని వాల్మీకి వ్రాశాడు. ఆమెని ఒక మందసంలో వుంచి సముద్రంలో పారవేయగా కాలక్రమాన ఆ పెట్టి భూమిలో పాతుకుపోయి కేవలం భూమాత సంరక్షణలో ప్రాణం నిలబెట్టుకుని జనకుడు భూమి దున్నినప్పుడు భూదేవి అంశతో నాగటి చాలుకి బయటపడింది.

అందుకే రాముడు విష్ణువులో ప్రవేశించాడని వ్రాశాడు కాని సీత లక్ష్మిలో ప్రవేశించిందని వ్రాయలేదు. వాల్మీకి బ్రహ్మ కూడా భూమిలోప్రవేశించిన సీత తొందరలోనే పరంధామం చేరుకుంటుందన్నాడే కాని మహాలక్ష్మిగా వైకుంఠం చేరుతుందన లేదు.

వేదవతి విష్ణుమూర్తిని భర్తగా పొందాలనుకుంది. ఆయన రామునిగా అవతరించాక ఆమె భూదేవి అంశతో సీతగా పుట్టి ఆయనకి భార్య అయింది. ఆమెకోరిక అలా తీరింది కనక రామునికన్నా ముందే ఆమె భూదేవిలో లీనమైంది.

కనుకనే రాముడు అవతారంచాలించబోతున్న తరుణంలో భూదేవి, శ్రీదేవి ఆయన వెనక నడిచారని వ్రాశాడు కాని సీత రాముని వెనక నడిచిందని వ్రాయలేదు.

రాముడు పరంధామానికి చేరబోతున్న తరుణంలో ఏ ఒక్క వ్యక్తినీ విస్మరించకుండా రాముడు, సుగ్రీవుని, హనుమంతుని, వానరుల్ని, విభీషణుడ్ని, రాక్షసుల్ని, తన ప్రజల్ని అందర్నీ ఎవరెవరికి ఏయే స్థానాలు కల్పించాడో ఆ విషయాలన్నీ పరమాద్భుతంగా వివరించి వ్రాశాడు వాల్మీకి. ఈ విధంగా రామాయణ మహాకావ్యం ఆద్యంతం ఎంతోఉత్కంఠ భరితంగా రచించబడి తరువాతి తరాల వారికి కైవల్య ప్రాప్తి కలిగించే విధంగా తరతరాలకీ ఆదర్శప్రాయంగా నిలిచింది.

ఇంతటి మహోత్తర కావ్యాన్ని మనకందించి వాల్మీకి మహామునికి మనందరం ఎంతో ఋణపడివున్నాము.

కనుక రామాయణ కావ్యం చదవటం మొదలు పెట్టేటప్పుడు, ముగించేటప్పుడు ఆ మహానీయుని సంస్మరించటం మన కర్తవ్యం.

కూజంతం రామ రామేతి, మధురం, మధురాక్షరం.
ఆరుహ్య కవితా శాఖాం, వందే వాల్మీకి కోకిలం.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**రామకథాసుధ సంపూర్ణం.**

# రామకథాసుధ వ్రాయటంలో నా ఆశయం

శ్రీరామునిచరిత్ర తెలియనివారు గాని, వాల్మీకి రామాయణం గురించి తెలియనివారుగాని మనదేశంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఎవ్వరూ లేరు.

రామకథ ప్రతి నోటా, ఇంటింటా ఏదో ఒక సందర్భంలో వింటూనే ఉంటాం.

హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడు. ముఖ్యంగా ఆంధ్రుల ఆరాధ్యదైవం దేశవ్యాప్తంగా రామమందిరాలు లెక్కకి మించి వున్నాయి. అలాగే రామభక్తుడైన హనుమంతునికి కూడా దేశవ్యాప్తంగా లెక్కలేనన్ని ఆలయాలున్నాయి.

ఇటీవలకాలంలో కూడా భక్త రామదాసు, త్యాగయ్య, కబీరుదాసు, తులసీదాసు మొదలైన మహాభక్తులు రాముని సేవించి తరించినవారు మనకి చాలా దగ్గరకాలంలోని వారే. ఇంక ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఆంజనేయస్వామి అపారమైన మహిమలు అడుగడుగునా మనకి దర్శనమిస్తూనే వున్నాయి. ఇందులో అసత్యమే లేదు.

అయితే రామచంద్రుని యొక్క చరిత్ర యధాతథంగా వ్రాయబడ్డ తొలి కావ్యము శ్రీమద్రామాయణము. వాల్మీకి విరచితము.

సీతారాముల చరిత్ర తన దృష్టితో చూసి ఉన్నది ఉన్నట్లుగా వ్రాసిన వాడు వాల్మీకి మహాకవి.

వాల్మీకి రామాయణంలో లేని ప్రతి సంఘటనా కల్పితమే అవుతుంది. అలాంటి కల్పిత గాథలు రామాయణంలో కోకొల్లలుగా చోటు చేసుకున్నాయి. మరి కొందరైతే ఇంకా విపరీతంగా కల్పించి వ్రాయటం వల్ల తర్వాతి కాలంలో రామాయణం మీదా, అందులోని పాత్రల మీదా విపరీతమైన వ్యాఖ్యానాలు మయాస్పాస్పదంగా ప్రచారంలోకి వచ్చాయి.

నేడు అసందర్భంగా రామాయణం మీద లేని పోని వ్యాఖ్యలు చేస్తున్న వారందరికీ వాల్మీకి రామాయణం చదివితే యదార్థం బోధపడ్తుంది.

ఎందరెందరో ఉద్దండ పండితులు శ్రీమద్రామాయణాన్ని తెలుగులోకి

అనువదించారు. వాల్మీకి రామాయణంలో కథ ఎంతవుందో అంతకి రెట్టింపు ప్రకృతివర్ణనలున్నాయి. అంతేగాక ప్రతి చిన్నవిషయం పూస గుచ్చినట్లు ఎంతో వివరంగా వ్రాశాడాయన. ఆయన కావ్యం సంస్కృత భాషలో వుండటం వల్ల చాలామందికి చదివే అవకాశం లేదు. అనువాద కావ్యాలైనా అంతటి సుదీర్ఘగ్రంథం చదివేతీరిక నేటి యాంత్రిక ప్రపంచంలో చాలామందికి లేదు.

కనుక నాకున్న కొద్దిపాటి సంస్కృత పరిజ్ఞానంతో మూలగ్రంథం టీకా తాత్పర్య సహితంగా వున్నది కొని, నాలుగుసార్లు బాగా చదివి అర్థం చేసుకుని తర్వాత కొన్ని అనువాద గ్రంథాలు చదివి అవి కూడా పరిశీలించి, సరళమైన వాడుకభాషలో వాల్మీకి రామాయణాన్ని వర్ణనలు కొన్ని మాత్రం కథతో సంబంధం లేని సన్నివేశాలు వదిలేసి అసలు కథకే మాత్రం భంగం కలగకుండా సాధ్యమైనంత సంక్షిప్తంగా ఈ "రామకథాసుధ" వ్రాశాను.

వాల్మీకి రామాయణంలో అత్యంత అద్భుతమైన విషయాలెన్నో వున్నాయి. అసలుకథతో పాటు అవన్నీ కూడా అందరికీ అర్థమయ్యేలా వ్రాయాలనే సంకల్పంతో ప్రతి కాండ చివరా ఆయా సంధర్భాన్ని బట్టి ఆయా విషయాలన్నీ వ్యాఖ్యల పేర వ్రాశాను. రామాయణ పఠనం అత్యంత ఫలప్రదమైనదని వాల్మీకి నొక్కి వక్కాణించాడు. ఆ తర్వాతి కాలంలో చాలా మంది నిరూపించారు. ఒక్క సుందర కాండ పారాయణమే ఎంతటి ఫలప్రదమైనదోమనలో అందరికీ తెలుసు. ఆ శ్రీరామ చంద్ర ప్రభువు దయవల్ల నా ఈ 'రామకథాసుధ" రచన ప్రచురితమై పదిమందీ చదివి అర్థం చేసుకోగలిగితే నా కృషి ఫలించి, నా జన్మ చరితార్థమయిందని భావిస్తాను. పెద్దలు, పండితులు, నా ఈ రచనలో తప్పులుంటే మన్నించి, నాకు తెలియజేస్తే సహృదయంతో స్వీకరించి నా తప్పులు సరిదిద్దుకుంటానని మనవి చేసుకుంటున్నాను.

**సీతారామ కటాక్ష ప్రాప్తిరస్తు**

ఇట్లు

భవదీయురాలు

**భావరాజు వరలక్ష్మి**

# నా గురించి.....



భర్త శ్రీ భావరాజు శ్రీనివాసరావుగారితో
రచయిత్రి **భావరాజు వరలక్ష్మి**

| | | |
|---|---|---|
| నాపేరు | : | భావరాజు వరలక్ష్మి |
| జన్మస్థలం | : | ఆదికవి నన్నయ్య అవతరించిన నేల. పావన గోదావరీ తీరాన వున్న రాజమహేంద్రవరం |
| పుట్టిన తేదీ | : | పంతొమ్మిది వందల నలభై రెండవ సంవత్సరం అక్టోబరు నెల పధ్నాలుగో తారీఖు చిత్రభాను సంవత్సర ఆశ్వయుజ శుక్ల పంచమి |
| తల్లిదండ్రులు | : | తల్లి : కీ॥శే॥ కేసాప్రగడ సీతామహాలక్ష్మి<br>తండ్రి కీ॥శే॥ కేసాప్రగడ శ్రీరామమూర్తి |
| చదువుసంధ్యలు | : | ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యాను<br>సంస్కృత హిందీ భాషలలో ప్రవేశం ఉంది. |
| భర్తపేరు | : | నా విజయమే తన విజయంగా భావించి, అన్ని విషయాలలో నాకండదండలుగా నిల్చి నన్ను ప్రాణప్రదంగా ప్రేమించే శ్రీ భావరాజు శ్రీనివాసరావుగారు. |
| ఆస్తిపాస్తులు | : | వంశపారంపర్యంగా వస్తున్న రామభక్తి సామ్రాజ్యం |
| సంతానం | : | మమ్మల్ని దైవ సమానంగా ఆరాధించే ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు చి॥ పద్మ, చి॥ లలిత, చి॥ మురళి, చి॥ సూర్యనారాయణ |
| జీవితంలో మరపురాని మధుర సంఘటన | : | తిరుమల తిరుపతివారి అనుగ్రహం కలగడం |
| చాలా ఆనందం కల్గించిన సంఘటన | : | పంతొమ్మిది వందల తొంభై మూడవ సంవత్సరంలో భారత ప్రభుత్వము వారు నిర్వహించిన పర్యావరణ సంరక్షణ నిమిత్తం నిర్వహించిన రచనల పోటీలో జాతీయ స్థాయిలో బహుమతి రావడం (నేను రచించిన బుఱ్ఱకథకి) |
| నిజమైన నా బంగారు కల | : | "రామకథాసుధ" కావ్యం ప్రచురితము కావడం |
| జీవితాశయం | : | ఎప్పటికైనా ఒక చిన్న రామమందిరం కట్టించాలన్నది |

## మీకు తెలుసా....



- శ్రీరాముడు, రావణుడు, సీతాస్వయంవరమునకు వెళ్ళలేదు.
- మహాసాధ్వి అహల్య రాయిగా మారలేదు.
- మహాభక్తురాలు శబరి రామునికి ఎంగిలిపండ్లు పెట్టలేదు.
- సీతని రావణుడు భూమితో సహా పెకలించి తీసుకుని వెళ్ళలేదు.
- లక్ష్మణుడు సీతని దాటవద్దని గీత గియ్యలేదు.
- రావణుని ఉదరములో అమృత కలశం లేదు.
- కేవలం చాకలివాని మాటతో రాముడు సీతని పరిత్యజించలేదు.
- శ్రీరాముని యాగాశ్వాన్ని లవకుశులు బంధించలేదు.
- ఇవన్నీ సత్యములు. శ్రీ వాల్మీకి మహర్షి సంస్కృతము నందు రచించిన శ్రీ మద్రామాయణంలో ఏమేమి ఉన్నాయి, ఏమేమి లేవు అన్న విషయాలు విశదీ కరించబడ్డాయి. సంస్కృత మూల రామాయణానికి యథాతథ తెలుగు సేత ఈ "రామకథాసుధ" సరళమైను ఈ రామకథాసుధను ఆస్వాదించండి. అసలు రామకథ తెలుసుకోండి.

- రచయిత్రి